THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_206054
UNIVERSAL
LIBRARY

OUP—730—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 P85A Accession No. G.T.923

Author పోతనామాత్య, బమ్మెర.

Title (శ్రీ)మదాంధ్ర మహాభాగవతము. 1928

This book should be returned on or before the date last marked below

ఆనందాశ్రమ గ్రంథరత్నమాల.

శ్రీ

పరమేశ్వరకరుణాకలితానవద్యకవిత్వవిద్యావినుతానుపమసాహిత్య

సహజపాండిత్య

బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీమదాంధ్రమహాభాగవతము

కీ. శే. తంజనగరము - తేవప్పెరుమాళ్లయ్యగారిచే

[illegible]

[illegible]

శ్రీమాన్ మచిలీపట్టణము - రామానుజయ్యగారిచే

పరిశోధితము.

మద్రాసు

వేమూరు - వేంకటకృష్ణమ శ్రేష్ఠి అండ్ సన్సువారిచే

ప్రకటింపఁబడుచున్నది.

ఈ [illegible]

ఎ. కన్నన్ సెట్టి అండ్ కంపెనీవారిచే

ప్రకటితము.

286, చైనాబజారు రోడ్డు

1928

(Copyright Registered.)

ఆనందముద్రాలయము.

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః.

శోధకవిజ్ఞప్తి.

శ్లో. పురాణ మిత్యేవ న సాధు సర్వం । న చాపి కావ్యం నవ మిత్యవద్యమ్
సన్తః పరీక్ష్యాన్యతర ద్భజన్తే। మూఢః పర ప్రత్యయనేయబుద్ధిః.

అభిరూపశేఖరులారా !

ఇక్కాలమునఁ దెనుఁగుగ్రంథములను సంస్కృతమూలములతోను వ్రాఁత ప్రతులతోను బోల్చి యథాశక్తి నిర్దుష్టముగా సవరించి మేము ముద్రించుటం గొందఱు చూచి 'కూర్చిరి మార్చిరి చెఱిపిరి చెడినది' యని చేయునాక్షేపణములు నాక్రోశములును గర్ణతాడితము లగుచున్నవి. వీనిం గొంత పరామర్శించుట కిపుడు మిక్కిలి యవసర మై యున్నది.

మన దేశమునఁ జదువరులపాలిటిభాగ్యదేవత యై ముద్రణపద్ధతి యేర్పడిన పిదప నాంధ్రభాషయందు గొప్పగ్రంథము లగుభారతమును భాగవతమును ముద్రితము లయినవి. ఒక గ్రంథమునకుఁ గల వ్రాఁతప్రతు లొక్కొక్కటికిని బ్రాయికముగా వ్రాయసకాఁ డొక్కొక్కఁడగును గాన వానియం దక్షరము లొక్క తీరు గాకయుఁ బాఠము లొక్కతెఱఁగు గాకయు నుండుటతోఁగూడ నందంద సొంత కూర్పులును వింతమార్పులును గొత్తక్రొత్త కానిపించుటయుం గలదు. కాన వానిలోఁ బెక్కులు ప్రౌఢు లగుపాఠకులకు సైతము ప్రాణగొడ్డములుగా నుండును. ఆ గ్రంథమునచ్చుప్రతులం దాయా[illegible]ని కన్నిటికిని శోధనమును ముద్రణమును సమానము లగుటచే నాయన్నింటను బాఠ మొక్కటిగాను, నక్షరములు మఱింత విడిగా ముత్తైపుసగులవలె ముద్దులు గులుకుచును, నుండును ; కాన యవి యభిజ్ఞులకే కాక యర్థము దెలియనిబాలురకును స్త్రీలకును సైతము సొంపై సుఖముగాఁ బఠింపఁదగి యుండును. అచ్చుపునేతికి ముందఱఁ బచ్చివెన్నయు మెచ్చా? అట్టులు గట్టఁబడి చేప్పునకు దిట్టముగా నుండునచ్చుఁబొత్తములపస యెక్కడ! కట్టెలవలెఁ గట్టువై దారములు నులిగొనునాకుప్రతులనస యెక్కడ! వ్రాఁతజిలుగులసిలుగులకంటె నచ్చుతేటలనీటులు మీఁటు గాకున్నే ! ఇవి సరస్వతి నోఁచిననోములపంటలు. వీనికి ముందవి పెంటలు గావో!!

ఇట్లచ్చుప్రతులు చదువరులకనువిందులుగా నెచ్చుచు రాఁగా వ్రాఁతప్రతులు పురువులపెనువిందు లై ప్రుచ్చుచుఁ బంచత నొందసాగినవి. ఔను ! మంట మగ్గి మన్నై, నీటను దోఁగి నజ్జై, నిప్పునఁ గ్రాఁగి నీఱై, గాలిం గలసి దుమ్మై, బయలం బడి

వమ్మెన్న, యిట్లు పంచభూతములం గలసియుఁ గలయుచును నున్నవి. ఇంతవఱ కవి యంతరింపఁ దొడఁగి దాదాపు రెండుతరము లగుచున్నవి. మనముత్తాతలకాలమువఱకే వానిముసువులును బరువులును. మనతాతలషష్టిపూర్తి కచ్చుప్రతులు పాత్తము ముత్తైదువపేరంటమునకై యెత్తినబిత్తరపురూపులవలె మనోనయనోత్సవములై మొలకెత్తసాగినవి. అందలిపాఠములే మనతండ్రులకు వెన్నతోఁ గూర్చి పెట్టినవి. మనకు నవియే నుగ్గుఁబాలతో నూఱి పోసినవి. వేయేల ? అచ్చుప్రతులపాఠములే యెల్లయెడల నల్లుకొని యిప్పు డన్నిపట్టుల నిల్లు గట్టుకొని యున్నవి.

ముద్రాక్షరములు సరులు గూర్చినయాణిముత్తెములే. అచ్చుప్రతులు చూచుటకును బట్టుటకును జదువుటకును మెచ్చులు గులుకునే. అందలిపాఠములు మనతాతలతండ్రులవాక్కులం బడి పవిత్రములై మనహృదయసీమలం బ్రతిష్ఠింపఁబడి యున్నవే! అయిన నేమి? వానియందుఁ దప్పు లుండవా? కూర్పులును మార్పులును గలుగనేరవా? ఇది కొంత విచారింతము.

భారతాదులను రచించినకవులు గడచి యిప్పటి కయిదాఱువందలసంవత్సరముల కెక్కువయే యైనది. ఇంతదీర్ఘకాలములో దేశమునఁ బెక్కు రాజ్యవిభ్రమణములును నూతనరాజ్యజననములును నపూర్వమతభాషాసంపర్కములును గలుగుటంజేసి జనవ్యవహారములలో మునుపటివి గొన్ని నశించుటయు మఱికొన్ని క్రొత్తగాఁ దలసూపుటయు సహజము. ఈవ్యవహారములమాఱుపాటు ననుసరించియే భాషయందును దద్వాచకము లయినపదములును వానిప్రయోగవిశేషములును గొన్ని మాసిపోయి యిప్పటివాడుకలోఁ గానిపింపకున్నవి. ఆపదాదులచొప్పు నక్కాలపుగ్రంథములను బెక్కింటిని గొనియే నిరూపింపఁదగి యున్నది. ఈవిశేషము పెక్కుభాషలయందుఁ గానిపించుచున్నదని భాషాచరిత్రములే యుద్ఘోషించుచున్నవి. ఇట్లాపదాదులు జనవ్యవహారములం గానిపింపనియిక్కాలమున నచ్చుప్రతుల శోధించి ముద్రింపఁ బూనినపండితులు వానిలో నప్పటికాలపుగ్రంథప్రయోగములనుబట్టి తమకు నిర్ణయింపఁగూడినవి తప్పఁ దక్కినవానిని నట్లే సందిగ్ధములుగా నుంచుసడికిఁ బాలుపడ నోపకయుఁ, దాము ప్రకటించుప్రతు లొకటి రెండు గాక కూర్పునకు వందలకొలఁది నుంటంజేసి యాపెక్కింటను నట్టిదుస్సాధములు వ్యాపించి యుండుటకు మనసు రాకయుఁ, గూర్పను మార్పను జాలినపాండిత్యమును గవిత్వమును గలవారు గాన యారెంటిని గొని యాపదాదులు పాఠకసామాన్యమునకు సుబోధములుగా నుండునట్లు సవరించుటకు బలవంతముగాఁ దమంతఁ బేరితు లగుచున్నారు. వ్రాఁతప్రతులలో నొకటిని జూచి మఱొకటిగాఁ బూర్వమునుండి వ్రాయంబడుచు వచ్చిన వగుటచేతను, మిక్కిలిపురాతనములై నవియుఁ బెక్కు మిగిలియుండుటచేతను నట్టివానిలోఁ బెక్కింట నాపదాదులు తప్పక వచ్చియుండవచ్చును. వాని వ్రాయసకాండ్రలోఁ బెక్కండ్రు గూర్పను మార్పను జాలినంతవ్యుత్పన్నులు గాకుండుటచే నట్టివారిప్రతులం దేనియు నవి మాఱుపడక యుండవచ్చును. ఒక్కొకవ్రాయసకాని

ప్రతు లొకకొన్నియో కాని వందలకొలఁదిఁ గావు గావున నా తెలియనిపదాదుల సవరించియో తీఱవలయు ననుస్వాత్మప్రేరణము వాని కంతబలవంతముగా నుండదు. ఈ కారణములంబట్టి యచ్చుప్రతులకన్న నాకుప్రతులే పాఠసౌష్ఠవమునకై మఱింత యాశ్రయణీయములుగా నుండును. పెక్కురిత్తవాదములకన్న రెండొక్కయుదాహరణములే మిన్న.

భారతమున యతిభిక్షాసమయవివరణమున 'విధూమేన్యస్తముసలే వ్యఙ్గారే భుక్తవజ్జనే' శాంతి. అని యున్నది. ఇందులకు 'డంపకములకు వంటకములకును, భోజనములకుఁ దఱియైనప్రొద్దుఁ గడపి' 5 ఆ. 393 అని వ్రాఁతప్రతులం దున్నది. ముసలశబ్దమునకుఁ బర్యాయముగాఁ దెనుఁగున 'డంపక'మున్నది. అయినను 'దంపకము దంచు' అనియేకాని 'డంపకము' అని వాడుకలో లేదు. మఱిప్రయోగమందో 'డంపుదుమే కుభృత్పరివృఢంబుల' నని కాశీఖండమునఁ గలదుగాని యది ముద్రణసమయమున శోధకులకుఁ దెలియకగాని మఱవఁబడికాని యుండవచ్చును. సర్వజ్ఞత్వమెవరిసొమ్ము? అర్థము పొసఁగియుఁ బ్రకరణమునకుఁ బొందుపడియు నుండుటకన్నఁ దేటగానుండుటే మఱింత యావశ్యకము కాఁబోలు. కాన తెలియకున్న 'డంపకములు' తేటగా నున్న 'డాంబికము'లయ్యె. కనుక 'డాంబికములకు వంటలకుఁ జొరక' అని పాఠము పుట్టినది. ఇవి తేటగా నుండుట యటుండ మన లాఁతగాఁడ్నోటఁ బడియు వచ్చినదిగాన తప్పయిన నొప్పే! దీనిని మరల దిద్దుటయె తప్పు!! అచ్చుప్రతులయాగడమా యిది !!!

ఆరణ్యపర్వమున 'ఉల్ల కాంచనరథముపై నున్నవాఁడు' షష్ఠ. ౧౬౩, అని వ్రాఁతప్రతుల నున్నది. 'ఉల్ల' యని యిపుడు వ్యవహారమున లేదు. ప్రయోగము 'మూఁడు,యోజనము లిచ్చుటికి దాని కుల్ల తెరువు, పట్టి వే చని యాదైత్యభర్తఁ గనుము' అని శాంతిపర్వమునఁ గలదు. ముద్రణసమయమున నిది శోధకులకు గోచరము గాదయ్యె. కాన 'అల్ల కాంచనరథముపై నలరువాఁడు' అని 'ఉల్ల' తేట తెల్లయగు 'అల్ల' యైనది. దీనిని మరల దిద్దవచ్చునా? పండితులు దిద్దరఁట. పండితులకైనను జిరోత్పన్నపదము లెట్లు తెలియును? దిద్ది తరములును రెండైనవఁట! అప్పుడు దిద్దినది దండితనమే యైనది; ఇప్పుడు దిద్దుటయో దుండగమే చుఁడీ!

'మఱి' యనియుఁ గలదు. 'మఱి' యనఁగా మాఱుపు. ఇది వెఱవంటిది. 'మది మఱిగొన్నయట్టియెడ మానినికిం దనుఁ దాన కాచికో, లాదవిన' భార. ఉద్యోగ. ఈ 'మఱి' తెలియక 'మదిమది నున్నయట్టియెడ' నని మార్పఁబడినది. మఱియు, భాగవతమున వామనఘట్టమున 'తెఱవా విప్రులు పూర్ణులే.....నీరంబునుం బోయుదే, మఱి లే కర్థుల దాసులఁ సుజనులఁ మన్నింపు దేపైదలీ' అష్ట. 466, ఇట 'మఱి' నెఱుంగక 'పోయు దే,మఱకే యర్థుల' నని 'ఏమఱక' గా మార్చి శోధకు లేమఱిరి.

'మందట' యనఁగా దగవు. జగన్మోహిన్యవతారఘట్టమున 'మనకు వేల్పులకును మందట లేకుండఁ, బంచిపెట్టెద నని పడఁతి పూనె' భాగ. అష్ట. 321. అని

యున్నది. ఈ'మందట' తెలియక యారాటముపెట్టినందున 'మాఱాటము'గా మాఱినది. 'మనముల సమ్మతించితమఱిమందటనాసభవారుతీర్చి' నారాయణకృతపంచతంత్రము ౧ ఆ. ఇట 'మందట' కు 'సమీప' మని శబ్దరత్నాకరమం దర్థమున్నది. విను కుంభాండ యనేకకాలము...నాదగు భుజంబుల్ మందటం బొందినన్' హరివంశము. ఉత్త. ౭ ఆ. ఇట 'మందట' యచ్చుప్రతుల 'ముచ్చట' యైనది. తెలియని మందటకన్నఁ దేట యగుముచ్చట మేలు గదా!

'దుడుకడుచు' అనఁగా మగ్న మగుట. కృష్ణబలరామబాలక్రీడావర్ణనమున 'అప్పంకముల దుడుఱకడువఁజొత్తురు' దశ.పూ. 289 అనియు, బ్రహ్మ గోగోపుల నంతర్హితులం జేసినఘట్టమున 'దుడుకనిమహిమాబ్ధి నజుఁడు ఱ దుడుకడిచె నృపా' దశ. పూర్వ. 547 యనియు నున్నది. ఇది తెలియక 'దుడుకడరఁ జొత్తు' రని మార్పఁబడినది. మరల 'దుడుకడువ' నని దిద్దుట దుడు కగునా?

భాగవతమున 'తీర్థీకుర్వన్తితీర్థాని' ౧. స్క. ౧౩. అధ్యా. అని యున్నందులకు వ్రాఁతప్రతులఁ 'దీర్థసంఘంబులఁ దీర్థమింతురు' ప్రథ. 301 అనియున్నది. 'తీర్థ మింతురు' అనియిప్పుడు వాడుట లేదు. 'ఉత్తరమింతురు' ఇత్యాదినన్నయప్రయోగములుశోధకుల కుపస్థితములు గావు. కనుక 'తీర్థసంఘంబుల ధిక్కరింతురు' అనిసవరింపఁబడినది. మఱి తాతగారిబొక్కినోటఁ జొచ్చియు నచ్చివచ్చినది గాన యది విడువరాదు. అట్టిదానిని దిద్దితిమా యంతకన్నఁ బాతకము లేదు. ముద్రణమహిమ'ముద్రణదేవతాకటాక్షము నకుఁ బాత్రము లైనతప్పులుగూడ దిద్దరానంతపవిత్రము లై యొప్పులు గులుకునా?

ఇట్టివి పెక్కులు చూపవచ్చును. వ్రాఁతప్రతులందు గ్రుడ్డిదెబ్బకును దప్పులు గలుగునే యందు రేమో. ఔను! వానియందు శకటరేఫ మనియు లఘురేఫ మనియు భేద ముండదు. 'వాండు కాండు' అని యన్నియుఁ బూర్ణబిందుపులే కాని యర్థబిందువు చూపట్టదు. 'మంచ్చము రంగ్గము' అని యనవసరము లగుద్విత్వములును, 'శాయు' 'యెవ్వండు' అని యక్షరవ్యత్యయములును, 'కోరికె' 'నాలికె' అని యసమంజసరూపములును, బట్టినచోటఁ బెక్కులు గనుపట్టును. అయినను 'డాంబికములు' 'ధిక్కరింతురు' అనుపచ్చుప్రతులసవరణాలం బట్టి 'డంబకములు' 'తీర్థమింతురు' అని నిర్ణయించుకష్టమునకంటెను 'వాండు' 'శాయు' అను నాకుప్రతులవ్రాఁతలను బట్టి 'వాఁడు' 'చేయు' అని దిద్దుకొనుసౌకర్య మేపాటియతిశయమో యభిజ్ఞులకుఁ దేట గాకపోవదు.

మఱియు శోధనమునకు నైపుణ్యమును గావలయు. పాండిత్యమున్నచోట నెల్ల నైపుణియు నియతముగా నుండదు. మఱియుఁ బండితులు తమతమదర్శనములఁ జొప్పునఁ బాఠముల దిద్దుటయుఁ గలదు. స్వదర్శనాభినివేశపారవశ్య మనివార్య మగుట సహజమే కదా. ఈరెండుకారణములనుబట్టియు నచ్చుప్రతులఁ దప్పులు గలుగుట గలదు. ఈనిర్ణయము లెంతవఱకు సాధువులో ప్రకృతగ్రంథమునఁ బరామర్శింతము.

శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ ౧ స్కం. ౧. ప.

ఇట క్రిందిగీఁతలు గలవానిం జూడుఁడు. ఆరంభముననే హంసపాదము! మొట్టమొదటిపద్యముననే యతి తప్పినది. ఈతప్పు గ్రంథమున మఱెచ్చటనే నుండునేని వ్రాయసము గుఱునాథునిపయినో లేక కంపాసిటరు రామస్వామిమీఁద నో మోపవచ్చును. ఇట్లును గాదే! శోధకులకు దోషము వచ్చు నని మహాకవికి యతి తెలియ దందుమా! మొన్నటి తాతగారి కాగ్రహము వచ్చినను, నంత కంటె మునుపటిపోతనగారినిగ్రహము దగదు. కాన 'రక్షాకారంభకు భక్తపాలన కళాసంరంభకున్' అని దిద్ద కుండరాదు.

'ఏతద్రూపం భగవతో హ్యరూపస్య చిదాత్మనః
మాయాగుణైర్విరచితం మహదాదిభిరాత్మని
యథానభసి మేఘౌఘో రేణుర్వా పార్థివోఽనిలే
ఏవం ద్రష్టరి దృశ్యత్వ మారోపిత మబుద్ధిభిః. ౧-స్కం. 3-అధ్యా.

శ్రీధరవ్యాఖ్యా. అరూపస్య- నిరాకారస్య, ఆత్మనో-జీవస్య, ఏతత్-స్థూలం, రూపం-శరీరం, భగవతో మాయాగుణైః, తస్యాః, సత్త్వాదిభిః - మహదాదిభిః, విరచితం - కృతం, ఆత్మని - ఆత్మస్థానే, శరీరం కృత మిత్యర్థః॥ కథ మిత్యపేక్షాయాం స్వరూపావరణేన తదధ్యాస ఇతిసదృష్టాంత మాహ॥ యథావాయ్వాశ్రితో మేఘౌఘో, నభసి-ఆకాశే, అబుద్ధిభిః-అజ్ఞైః, ఆరోపితః, యథావా పార్థివో రేణుః - ధూసరత్వాదిః, అనిలే, ఏవం, ద్రష్టరి - ఆత్మని, దృశ్యత్వం - దృశ్యత్వాది ధర్మకం శరీర మారోపిత మిత్యర్థః.

ఇంగల కచ్చుప్రతిపాఠము:-వినుం డరూపుం డయినజీవుండు చిదాత్మకుండై పరఁగు-జీవునికిఁ బరమేశ్వరుని మాయాగుణంబు లైన మహదాదులచేత నాత్మాధారస్థానముగా విరచితం బైన స్థూలశరీరంబు గగనంబునందుఁ బవనాశ్రితమేఘసమూహంబును గాలియందుఁ బార్థివధూళిధూసరత్వంబును నేరీతి నట్లు ద్రష్ట యను నాత్మయందు దృశ్యత్వము బుద్ధిమంతులు గానివారిచేత నారోపింపంబడు.

'ఆత్మని' అనుటకు 'ఆత్మస్థానే' యని యర్థము. ఇట 'ఆత్మాధారస్థానముగా' ననుట యెట్లు? స్థూలశరీరంబు' అనుటకుఁ గ్రియ యెద్ది? ఆరోపింపఁబడినది స్థూల శరీరమా? దృశ్యత్వమా? అన్వయ మేదియుఁ గానరాదు. అంతగా మూలాను గుణ్యమును లేదు.

ప్రాఁతప్రతులపాఠము—వినుం డరూపుం డై యేకరసుండై యాత్మ యనం బరఁగుజీవునికిఁ బరమే... రూపంబులచేత నాత్మస్థానంబునందు విరచితం బైనస్థూలశరీరంబు...దృశ్యత్వమై... నారోపింపంబడు. ౧ స్కం. 67.

ఇట 'స్థూలశరీరము దృశ్యత్వమై యారోపింపంబడు' నని యన్వయము. ఇది చాల మూలానుగుణముగాఁ దెనిఁగింపఁబడినది. ఇట్లు మూలానుగుణ్యమును నన్వ యమును గలయీపోతనపాఠమును గయికొనవచ్చునా? లేక యన్వయము చెడి నను మూలానుగుణ్యము కొఱవడినను మనతాతగారియచ్చుప్రతిపాఠమే వలయునా?

'యత్రేమే సదసద్రూపే ప్రతిషిద్ధే స్వసంవిదా
అవిద్యఽఽత్మని కృతే ఇతి తద్బ్రహ్మదర్శనమ్॥
యద్యేషోపరతా దేవీ మాయా వైశారదీ మతిః
సంపన్న ఏవేతివిదుః మహిమ్ని స్వే మహీయతే॥' ౧-స్కం, 3-అ.

శ్రీధరవ్యాఖ్యా॥ యత్ర-యదా, సదసతీ - కార్యకారణరూపే- స్థూలసూక్ష్మరూపే, స్వసంవిదా-స్వరూపసమ్యగ్జ్ఞానేన; ప్రతిషిద్ధే, భవతః. జ్ఞానేన ప్రతిషేధాగ్రహత్వే తమేవహేతు మాహ-అవిద్యయా, ఆత్మని, కృతే-కల్పితే ఇతిహేతోః, తద్బ్రహ్మ-తదాజీవో బ్రహ్మైవభవతీత్యర్థః, కథంభూతం? దర్శనం - జ్ఞానైకస్వరూపమ్॥ వైశారదీ - విశారదః సర్వజ్ఞః ఈశః - తదీయా, దేవీ-సంసారచక్రేణ క్రీడన్తీ, ఏషా మాయా, మతిః-విద్యా... అయంభావః —యావదవిద్యాత్మనా ఆవరణ విక్షేపౌకరోతి తావన్నోపరమతే - యదాతు సైవవిద్యారూపేణపరిణతా... స్వయమేవోపరమేదితి.

అ-ప్ర—అప్పుడీస్థూలసూక్ష్మరూపంబులు రెండును స్వరూప సమ్యగ్జ్ఞానంబున నిషేధింపంబడునని తెలియు-నవిద్యంజేసి యాత్మకుఁ గల్పింపంబడె ననియెడిహేతువువలన నప్పుడు జీవుండు బ్రహ్మదర్శనమను జ్ఞానంబున కధికారియగు - నట్టిబ్రహ్మజ్ఞానమతి - విశారదయై యీశ్వరునికై క్రీడించు-నట్టి మతిప్రకాశంబున నవిద్య యనంబడుచున్నమాయ యుపరతయై. ౧ స్కం. 67.

ఇట 'యదా-తదా' యనునన్వయము లేదు. 'ఎప్పుడు స్థూలసూక్ష్మరూపములు స్వరూపసమ్యగ్జ్ఞానమున నిషేధింపఁబడునో యప్పుడు జీవుఁడు బ్రహ్మమగు' నని యర్థము. నిషేధింపఁబడు నని తెలియు టేమి? ఆరూపములు 'ఆత్మని కృతే' ఆత్మయందుఁ గల్పితము లని యుండఁగా 'ఆత్మకుఁ గల్పితము' లెట్లు? తద్బ్రహ్మ-తదాజీవః బ్రహ్మైవభవతి' అని యుండఁగా 'బ్రహ్మదర్శనం బనుజ్ఞానమున కధికారి యగు' నఁట! బ్రహ్మదర్శనజ్ఞాన మేమి? ఇటదానికిఁ బ్రసక్తి యెట్లు? 'అట్టిబ్రహ్మజ్ఞానమతి-విశారదయై యీశ్వరునికై క్రీడించు' దీని కర్థ మేమి? బ్రహ్మజ్ఞానమతి క్రీడించుచున్న దని యన్వయమా? మతి యనఁగా విద్య యని వ్యాఖ్య; విద్యారూపమున మాయ పరిణతి యగుట చెప్పఁబడినది. ఆమతి యిట బ్రహ్మజ్ఞానమతి యయ్యెనా? లేక అతివిశారదయై యని పదచ్ఛేదమా? 'అట్టిమతిప్రకాశంబున నవిద్య యనంబడుచున్నమాయ' ఇటఁ గూడ 'మతి' వచ్చిన దేల? మూలమునందలి 'మతి' కర్థము తెలియనందున నది యిన్ని గతులు పడినది. పోనిండు. ఈమతిప్రకాశ మేమి? మూలమున నిందులకు గమకము గానరాదు. 'వైశారదీ' అనుటకు 'విశారదః సర్వజ్ఞః ఈశః తదీయా వైశారదీ' అని వ్యాఖ్య. దీనికా 'విశారదయై యీశ్వరునికై' యని తెనుఁగు?

ఇటీవలియచ్చుప్రతిపాఠము—ఎప్పుడు స్థూల... నిషేధింపఁబడు ననియును నవిద్యంజేసి యాత్మకుఁ గల్పింపఁబడు ననియును దెలియు నప్పుడు జీవుండు బ్రహ్మదర్శనంబుల కధికారి యగు దర్శనం బన జ్ఞానైకస్వరూపంబటివిశారదయైయీశ్వరునికై క్రీడించు చునవిద్యయనంబడుచున్నమాయయుపరతయై.

ఇందు 'ఎప్పుడు-అప్పుడు' అనునన్వయము గలిగెను. 'మతి' కిందు గతులు లేవు. బ్రహ్మదర్శనజ్ఞానమును గానరాదు. 'అవిద్యంజేసి యాత్మకుఁ గల్పింపంబడెన నెడి హేతువు' అనుహేతువుమాత్రము పోయినది. మఱికొన్ని సవరణలును గలిగినవి. కాని తక్కినదోషము లన్నియుఁ గలవు. వ్రాతప్రతులపాఠము చూడుఁడు—

ఎప్పుడీస్థూలసూక్ష్మరూపములు రెండును స్వరూపసమ్యగ్జ్ఞానంబునంజేసి ప్రతిషిద్ధంబు లగు నవిద్యంజేసి యాత్మను గల్పింపంబడ్డ వనెడిహేతువువలన నప్పుడాజీవుండు బ్రహ్మదర్శనం బగు దర్శనం బనజ్ఞానంబునంజేసి యేకస్వరూపంబు విశారదుఁడై నయీశ్వరునిదై క్రీడించుచు నవిద్య యనఁబడుచున్నమాయ యుపరత యై. ౧ స్కం. 67

మూలమున కిట్లు మిక్కిలియనుగుణ మైనయీపాఠ మచ్చుప్రతులం బడి తాఱుమాఱైనది; తప్పులకుప్ప యైనది. మరల దిద్దవచ్చునా? ముద్రణదేవతాకటాక్షపాత్రమై యది పవిత్రీకృతమై యున్నదే! ఆదేవతకును మతేతాతకును గోపము వచ్చినను వచ్చుఁగాక. మహాకవి కపశయము దగదు. కాన దిద్దఁబడినది.

ఒకవచనమున నిన్ని దోషములు! మీఁదఁ బెక్కువచనములం దిట్లెన్నిదోషములు దిద్దంబడి యున్నవో మఱి పద్యములం దెన్నిసవరణలు సేయంబడినవో యభిజ్ఞులై మూలమును వ్రాఁతప్రతులను నారయుప్రయాసమునకు వెనుదీయనిభాషాభిమానులకుఁ దెలియకపోవదు. ఇంతే కాక వచనములం దెన్నికూర్పులు చేర్పంబడినవియు నెన్నిమార్పులు సేయంబడినవియు నెన్నిమతములు త్రిప్పంబడినవియు నానాయాపుటలం గలకుండలీకరణాపలచేతను గ్రందిపాఠాంతరములచేతను దేటతెల్లము గాఁగలవు గావున నిట విస్తరించి తెలుప నవసరము లేదు. అన్నియు నిట సంకలితముగా రూపింపఁ బూనినచో నీవిజ్ఞప్తి వేయుమడుంగు లెచ్చును. వేయిమాట లేల? ఒకభాగవతమునంత గ్రంథమే కావచ్చును. వానిని మూలముతోను వ్రాఁతప్రతులతోను బోల్చిచూచుట కవకాశము మిక్కిలియు వలయును గావునఁ జదువరులు చూడక యే పోవుదురని తలఁచి యొక్కొక్కస్కంధమునందు నొకటి రెండు దోషములను విస్తరభీతిచేఁ జిన్నవైనవానినిగా స్థాలీపులాకన్యాయమున నెత్తిచూపుట సరసము.

'లోకమంగళపదుశ్లోకరూపంబున' ద్వితీ-261

ఇందులకు 'భగవతాచతుశ్శ్లోక్యాం సంక్షేపేణ ప్రోక్తమ్' అని మూలము. కావున 'లోకమంగళచతుశ్శ్లోకిమూలంబున' అని వ్రాఁతప్రతులపాఠము.

విదురమైత్రేయసంవాదమున

క. ఆగుణున కవికారునకుఁ, జగదవనోద్భవవినాశసత్కర్మములం
దగులీల లయిన నాతఁడు, సగుణుం డై యుండు టెట్లు సౌజన్యనిధీ.
సీ. అనిన నర్భకుగతి ననఘుఁడు మైత్రేయముని జూచి విదురుఁ డిట్లనియె. తృతీ-232-233

ఇట విదురుఁ డర్భకునిగతి మైత్రేయు నడుగలేదు. నిర్గుణుఁడును నిర్వికారుఁడు నగు నీశ్వరునికి లీల లెట్లు? అని ప్రశ్నము. 'అర్భకవల్లీలాపియుజ్యతే' అనువ్యాఖ్యాపంక్తిచొప్పున 'అర్భకునివలె' ననియుత్తరము కాన 'అన నర్భకునిగతి ననవుడు మైత్రేయ యని యుండవలయును.

చ. మఱి యపుడమ్మహాత్ముఁ డసమానబలుండు మహోగ్రబాణముల్
గఱికరిఁ దాఁక నేసి భుజగర్వ మెలర్ప విరోధిమర్మముల్. చతు-336

ఇట 'గఱికరి' తప్పు; 'గఱి గఱి' యని యొప్పు.

'యస్యామేవకవయ ఆత్మానమవిరతంవివిధవృజినసంసారపరితాపోపతప్యమాన మనుసవనం స్నాపయన్తస్తయైవనిర్వృత్యా పరయాహ్యపవర్గమార్గ మాత్యంతికం పరమపురుషార్థమపి స్వయ మాసాదితం నో ఏవాద్రియన్తే' పంచ-సప్తమాధ్యాయః.

ఇందుల కచ్చుప్రతి—పెద్దలు భాగవతు లగుటంజేసి సంప్రాప్తసర్వపురుషార్థు లగుచు వివిధవృజినహేతుకం బగుసంసారతాపంబును బాసి యవిరతంబుఁ దద్భక్తియోగామృతస్నానంబునంజేసి పరమపురుషార్థం బైనమోక్షంబును జెందుదురు. పంచ-౧ అ. 88.

మూలమున భక్తిభోగ్యతాతిశయమున మోక్షము తనంత లభించినను బెద్దలాదరింప రని యుండఁగా మోక్షంబు నొందుదురఁట! వ్రాఁతప్రతులందు.

'హరికథామృతపానంబున నిర్వృతు లై పరమపురుషార్థం బైనమోక్షంబు నపేక్షింపరు'

అని యున్నది. దీని నేల మార్చిరో తెలియరాదు. మోక్షసాధనములలో భక్త్యుత్కర్షము శోధకులమతము గాదో!

కాశ్యపపత్నీవర్ణనమున.

సీ. కామితప్రదుఁ డైనకశ్యపుకౌఁగిట, ముచ్చటఁ దీర్తు రేముద్దరాండ్రు
రఖిలలోకములకు నవల నై జగ మెల్లఁ, బూజింప నుందు రేపువ్వుఁబోండ్లు షష్ఠ. 255

ఇట కాశ్యపపత్నులు లోకముల కవలనై యుండు టేమి? 'యత స్సూత మిదం జగత్' అను మూలముచొప్పున 'లోకమున కవ్వ లై' అని యుండవలయును. అందే గీతమున

'వారికలగంపకడుపుల నేరుపరుల, నరిదిబిడ్డలఁ బడసినబిరుదుసతుల
నామములు నన్వయంబులు' షష్ఠ. 255

అని యున్నది. ఇట మీఁదఁ గాశ్యపపత్నులనామాదులు చెప్పంబడుచున్నవి గానయాపత్నులనే 'బిరుదసతుల' యని యిట కవి పేర్కొన్నాఁడు. అనఁగా 'కలగంపకడుపుల నేరుపరులను – అరిదిబిడ్డలను – బడసిన బిరుదుసతుల నామములు' అని యన్వయము. 'వారి' యనునది పూర్వసీసపాదములందు 'ఏవింత రాండ్రు' ఇత్యాదులచేఁ బ్రతిపాదిత లయినయాపత్నులనే పరామర్శించుచున్నది. కాన దీని కన్వయ మెట్లు? ఏకవాక్యముననే 'వారి' 'బిరుదుసతులు' అనురెంటిలో నేదే నొకటి యుండవలయును గాని రెండు నుండిన నన్వయము గలుగదు. రెండును భిన్నవాక్యములలోని వేని 'వారి' అనువాక్యమునకు సమాపక మేది? కనుక నిది తప్పు. 'వారి కలగంపకడుపుల నేలుపగుప, నరిది; బిడ్డలఁ బడసినబిరుదసతుల' అని దిద్దుకొనవలయును. యతిభంగ మన్నచో నీకవి (సింగన) యుభయ రేఫమైత్రిని బాటించినవాఁ డని తెలియునది.

దేవేంద్రునిసభాస్థితివర్ణనమున.

'నిండుపున్నమనాఁడు గండరించినచంద్ర, మండలశ్రీలతో మాఱుమలయ
భద్రవిద్యోతాతపత్రంబు గ్రాలుచు, మిన్నేటితరఁగల మేలుకొలుపఁ
గలితదివ్యాంగనాకరతలచాతుర్య, చామీకరశ్రేణి జాడపఱుప' షష్ఠ. 260

ఇట 'ఆతపత్రము గ్రాలుచు మిన్నేటితరఁగల మేలుకొలుపు' టేమి? దివ్యాం

గనాకరతలచాతుర్యచామీకరశ్రేణి జాడపఱచుట' యన నర్థము గలదా? 'మండలశ్రీతోడ మాఱుమలయ భద్రవిఖ్యాతాతపత్రంబు గ్రాలంగ' ననియును 'మిన్నేటితరఁగల మెలుపుగొలుపఁ గలితదివ్యాంగనాకరతలచ్చాతుర్యచామరశ్రేణులజాడపడఁగ' ననియు దిద్దునది. 'చామరవ్యజనాదిభిః' అని మూలము. పూర్ణచంద్రమండలశ్రీతోడ నాతపత్రమునకును, మిన్నేటితరఁగలతోడఁ జామరశ్రేణులకును సామ్యము; కాని యాతపత్రము మిన్నేటితరఁగల మేలుకొలుపలేదు. మిన్నేటితరఁగల మేలుకొలుపుటకుఁ జామీకరశ్రేణులు జాడపఱుపలేదు. చామరములు చామీకరము లై యనర్థము పుట్టించినవి!

శ్లో॥ భూతాని తై స్తై ర్నిజయోనికర్మభి ర్భవన్తి కాలే న భవన్తి సర్వశః
న తత్ర హాత్మా ప్రకృతావపి స్థిత స్తస్యా గుణై రన్యతమో నిబధ్యతే॥ సప్తమ. ౨. అ.

ఆ-ప్ర. క. కలుగును మఱి లేకుండును, గలభూతము లెల్లఁ గాలకర్మవశము లై
నిలువఁడు ప్రకృతిం దద్గుణ, కలితుఁడు గాఁ డాత్మమయుఁ డగమ్యుఁడు దలఁపన్.

మూలమున 'ప్రకృతావపిస్థితః' అన్నందులకు 'నిలువఁడు ప్రకృతి'నని తెనుఁగున్నది. 'నిలువఁబడుఁ బ్రకృతిఁ దద్గుణ' అని దిద్దునది, 'క్రోడసద్గ్రంథంబుల్' క్రోడమునకు సద్గ్రంథము లేమి? సద్గంధము లని యుండవలయును. సప్తమ. 168

మత్స్యావతారవర్ణనమున.

'గఱులు సారించు మీసలు గడలుకొలుపు
నొడలు జళిపించుఁ గన్నులబొమల నార్చు. అష్టమ. 724.

అని యున్నది. మత్స్యము మీసలు గడలుకొలుపుటయు కనుబొమల నార్చుటయు వింతలోనివింత. మత్స్య మప్రాకృత మన్నను, దాని కీయపూర్వవ్యాపారము లనవసరములు గావున వర్ణింప నావశ్యకములు గావు, 'మీసలఁ గడలు నిగురు' ననియుఁ 'గన్నులపొలప మార్చు' ననియు దిద్దునది.

'నయత్ప్రసాదాయుతభాగలేశమ్' అష్టమ. ౨౪ అ.
ఇందులకు 'నీప్రసన్నతఁ, బదివేలవపాలిలేశభావము' అష్టమ. 731.

అని యచ్చుప్రతి. ఇట ప్రసన్నతలోనిపదివేలవపాలు 'ఇలేశభావము' గాదు. 'ప్రసన్నతపదివేలవపాలి 'లేశ' భాగము' అని దిద్దునది.

కుమారవనమును జొచ్చినసుద్యుమ్నుఁడు శివునిశాపమున స్త్రీకాఁగా వసిష్ఠప్రార్థనమున నద్దేవుఁడు

'స్వాంచ వాచ మృతాంకుర్వ న్నిదమాహ విశాంపతే
మాసం పుమాన్ సభవితా మాసం స్త్రీ తపసా తవ' నవ. ౧ అ.

అని యొకమాసము పురుషుఁడుగాను నొకమాసము స్త్రీగాను నుండ నను గ్రహించినాఁడు. ఇందుల కచ్చుప్రతిని

'తనమున్నాడినమాటయుఁ నిజముగాఁ దన్మానికిం బ్రీతిగా
మనుజేంద్రుండు నెలఁ నెలం బురుషుఁడై మాసాంతరం బైనఁ గా
మిని యై' నవ. 30.

అని యున్నది. ఇట నెలఁ నెలం బురుషుఁడగు నేనిఁ గామిని యగుటకు మాసాంతర మెక్కడిది? ఇది మూలానుగుణమును గాదే! 'మనుజుండుఁ నెల వో నెలం బురుషుఁడై' అని యుండవలయును. ఇట మనుజుఁడనఁగా మనుష్యుఁడని యర్థము కాదు. మనుపుత్రుఁడైన సుద్యుమ్నుఁడని యర్థము. మనుష్యుఁడని యర్థముసేసి యిట్లనర్థముసేసిరి కాఁబోలు. మంమకంటె రోగమే మంచి దయ్యె.

'భువి దూఱఁ భువిఁ దూఱు నబ్ధి సార నబ్ధిం జొచ్చు' నవ. 107

ఇట యతి తప్పు. 'అబ్ధుల్ సొచ్చు' నని యుండవలయును.

'ప, ర్యాప్తస్వేదజలాంగి వారిసముదాయాలంకృతఁ భార్గవిన్' నవ. 558

నూతినుండి 'పర్యాప్తస్వేదజలాంగి' యై లేచిన దేవయాని' 'వారిసముదాయాలంకృత' యైనదా? ఇం దేమి సారస్యము గులికెడినో? 'ఆళి సముదాయస్వర్గవిఁ భార్గవిఁ అని యుండవలయును, ఇందలియర్థము ననుప్రాసవిభవమును జూడుఁడు. తాతగా రున్నచోఁ జెప్పను.

శకటాసురభంజనమున

'కదాచి దౌత్థానికకౌతుకాప్లవే జన్మర్క్షయోగే సమవేతయోషితామ్' దశ. 7 అ.
వ్యాఖ్యా॥ ఉత్థానం—'శిశోరంగపరివర్తనం, తత్రకరణీయే, కౌతుకాప్లవే-ఉత్సవాభిషేకే'

అని యున్నది. ఇందులకు

'బాలకుఁ డొదికిలఁబడ నేర్చె నని జన్మ,నక్షత్రమున దొకనాఁడు నంగు
పొలఁతి వేడుకతోడఁ బొరుగు వేతలఁ జీర' దశ. పూ. 248

అని యున్నది. మూలమందలి 'కౌతుకాప్లవము'నకు నిట దెనుఁగు లేదు. కాన 'పొలఁతి వేడుకబోర్కుఁ బోయ వ్రేతలఁ జేరి' యని యుండవలయును.'బోర్కు' అని ప్రత్యేకపదముగా నిఘంటువులందు లేదు. కాన 'బోర్కు' 'పొరుగు' అయినది.

'పట్టి యలరుఁబోఁడి పట్టి యీతం డని
గట్టితలఁపుతోడఁ గట్టెఁ గాక
పట్టి కడుపు పెక్కుబ్రహ్మాండములు పట్టు
టెఱిఁగ నేనిఁ దల్లి యేల కట్టు. దశ. పూ. 383

ఇట 'యలరుఁబోఁడి' యని యుండఁగా మరల 'తల్లి' యని చెప్పవలసినయావశ్యకత లేదు. అది యందమును గాదు. 'పట్టి యెల్లబోఁటిపట్టి యీతం డని' యని పాఠము. 'ఎల్లబోఁటి గోపాలురమంద గాదు.' దశ. పూ. 1142 అని యీస్కంధమునవే ప్రయోగాంతరము గలదు గాన యిది యబ్బురము గాదు.

'వ్రేలం ద్రొక్కనిపాదరేణువులు పై వేష్టించినం జాలదే' దశ. పూ. 574.

పాదరేణువులు వ్రేలం ద్రొక్కని యెట్లు? మూలమున 'యద్గోకులేఽపి కతమాఙ్ఘ్రిరజోభిషేకమ్' దశ. ౧౪౮. అనియున్నది. 'వ్రేలం దొక్కనిపాదరేణువు'లని యర్థము. గోపపర్యాయమగు 'వ్రేలు' అంగుళిపర్యాయమైన 'వ్రేలు' అయ్యె. వ్రేలు మాఱఁగా 'ఒక్కని'యు 'త్రొక్కని' యయ్యె.

'కూడి గ్రహంబులు దిరుగఁగ, మేడలతుదినెలవులందు' దశ. పూ. 1600.

'తుదినిలువులందు' అని యుండవలయు. నిలు వనఁగా నంతస్తు. 'పొలుచు చతుర్దశభువనముల్ దనకీర్తి, యాడెడినిలువులగు మేడగాఁగ' నిర్వచనోత్తరరామాయణము. 'నాటకసాలమేడపైనిలువున' మనుచరిత్రము.

ఇట్లు పెక్కులు చూపవచ్చును. మూలమును జూచి, పోతనకవితావైలక్ష్యమును బరిశీలించి, తక్కినకవులరచనావిశేషముల విమర్శించి, పెక్కువ్రాఁతప్రతుల శోధించి, నాకావించినసవరణలును, బూరించినగ్రంథపాతములును, విడఁదీసినకూర్పులును, దేటపఱిచిన మార్పులును సమంజసములో కావో యనువిషయమున గుణదోషగ్రహణపారీణు లగుసహృదయశిరోమణులే ప్రమాణము. తప్పో యొప్పో తమమనస్సుల నాటియున్నతాతలనాఁటిపాఠములను దీయలేకయుఁ, గావుననే తమంతటఁ దెలిసికొనఁ బూనకయుఁ 'బండితులశోధనములు' 'తాతగారిపాఠము'లని యీపూరిపుడకలనే పాశుపతాస్త్రములుగాఁ గొని తమపక్షము నిలుపుకొనఁజూచువారి కీవిజ్ఞప్తియం దవగాహించుట గజస్నానమువంటిదే యగును. వీరి కాపండితులే వ్యాసులు; ఆతాతగారే పోతయ. గ్రంథమునుగూర్చి యీవిజ్ఞప్తియందుఁ గల విషయములను దక్కుం గలవిషయములను దమంతటఁ దెలిసికొనఁ జాలుకోవిదులయ్యు నసూయవలన నంగీకరింపనిచలపాదులను దెలుప బ్రహ్మదేవునివశమును గాదనుట విదితమే కదా! అట్టివారి కావ్యాసులే వచ్చి యిందలికూర్పులు మార్పులు తనమతము గా దని వాదించినను బోతనగారే తనకవనము కా దని యొట్టుపెట్టినను మెచ్చు గలుగ దన్న నిఁక నీవిజ్ఞప్తి వారిమది కెక్కునా? మొట్టమొదట దిద్దినవారు మనీషులే. 'ప్రమాదో ధీమతా మపి' యన్నట్లు మనీషులకును బ్రమాదములు గలుగక పోవవు. మఱియుఁ బుస్తకములఁ దొలుతొలుతవ్రాఁతనుండి యచ్చునకుఁ దెచ్చునపుడు చిక్కులు పెక్కులుగలుగును; చిరోత్పన్నము లైనపదాదులును జిక్కులఁబెట్టును. కాన దప్పులుగలుగుటఁ ద్రోసిపుచ్చ నలవిగాదు. పిదప భాషావిషయమునఁ బరిశ్రమ మెక్కుడగుచు రాఁగా, దానంజేసి నూతనవిషయములు దేలుచునుండఁగా మునుపటిపండితులశోధనమునకుఁ జిక్కనివియు వారిమదికిఁ దెలియనివియు నగు దోషములు పెక్కులు చూపట్టి భాషావృద్ధికోలఁదిని బైపయి సవరింపఁబడుచుండును. ఇది సత్యమగుట పెక్కుభాషాచరిత్రముల సిద్ధము. ఇది తెలియక నాగరికత వర్ధిల్లి భాషాభివృద్ధి గావించుచున్నయిక్కాలమున 'శాస్త్ర మపౌరుష మాద్య' మ్మనుము

క్కను గొని పూర్వికము లెల్లఁ బ్రమాణములే యని సాధించుగ్రుడ్డిఛాందస మంద ము గాదు. పక్షపాతదూరు లగుసత్యాన్వేషణపరులసందేహనివృత్తికి సాధనములు కలవుగావు. ప్రాచ్యలిఖితగ్రంథభండారమున వ్రాఁతప్రతులు వలయునన్ని యున్నవి. వలయునేని, ప్రతులు నాయొద్దను గలవు; చూచుకొనవచ్చును. అట్లుగాక యసూయాళువులై దురభిమానమున 'చెడినది మాఱినది' యని కట్టుఁగతలు ఘంటాపథముగాఁ జాటినను, వాడవాడల ఢంకాకొట్టినను, దిక్కుదిక్కుల శాసనములు చెక్కించినను సత్యము సత్యమై నిలుచునుగాని యసత్యముగాదు. 'సత్యమేవ జయతి'యనునానుడి తప్పదుగదా. సత్యవ్యాపనకాంక్షు లగుపండితులు నరుదుగారుగదా! భాషాభిమాన మాననీయులకును సత్యము ప్రియము గాకపోదే. కాన విచారము లేదు. భాగవత విషయమున వ్యాసులను మించినపండితుఁడు మాకు లేఁడు, పోతనను మించిన తాతగారును గలుగరు. మాకే కాదు; మీకును గలుగరు; మఱెవ్వరికిని గలుగరు. కాన యాయిద్దఱిని మున్నిడుకొని యేతన్ముద్రణశోధనము గావించితిని. తప్పులను దప్పులుగాఁ జూపుదురేని బాలురయినను వంద్యులే. ఒప్పులను దప్పులుగాఁ బ్రాజ్ఞులు చూపిరేనియు బాలుఁడుగూడ నభినందింపఁడుగదా. కాన గుణదోషము లారసి దోషముల నెల్లరును దెలుపఁ బ్రార్థితులు.

ఇట్లు

త. తేవప్పెరుమాళ్లయ్య.

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

పోతనాదికవికవిత్వాదివిమర్శనము.

శ్రీమదాశ్రితజనరక్షాపరాయణుం డగునారాయణునియంశంబున నవతరించినవ్యాసుండు, వివిధతత్త్వార్థప్రతిపాదకంబు లగుసంవాదంబులును, బహుధర్మావబోధకంబు లగుపుణ్యరాజచరిత్రంబులును, భక్తిరసోద్దీపకంబు లగుభగవజ్జన్మకర్మాద్యభివర్ణనంబులుం గలిగి సకలకలికల్మషాపహంబుగా నుండునట్లు మహాభాగవతపురాణంబును రచియించుటం జేసి పఠనశ్రవణాదిపరాయణు లైన యాస్తికశిరోమణుల కెల్ల నది యైహికాముష్మికశ్రేయఃప్రదంబు నత్యంతోపాదేయంబు నై యొప్పుచుండు. అయిన నది గీర్వాణభాషం బ్రణీతం బై, యందును దద్భాషాప్రవీణులకు మాత్రంబె సుగమం బై యుండుటం జూచి యందలిమహార్థంబులు ముముక్షువుల కెల్ల సుబోధములుగాను రమణీయములుగాను గావింప దొరంకొని శ్రీరామానుగ్రహసమాసాదితసరసకవితాసామ్రాజ్యధురంధరుం డగుబమ్మెరపోతనామాత్యుండు మృదుమధురాతిసుందరపదసందర్భసౌభాగ్యంబు దీపింప నవరసభావబంధురంబుగా నమ్మహాగ్రంథంబు నాంధ్రీకరించి యనపాయం బగుయశఃకాయంబు నొంది కృతార్థుం డయ్యె.

భాషాంతరీకరణము.

మధురసఝరీమాధురీధురీణనిరుపమాననిరర్గళకవిత్వధారావిరాజితుం డగు పోతనామాత్యుం డిమ్మహాపురాణంబునందలిపండ్రెండుస్కంధముల సహృదయహృదయంగమం బగురచనాసరణి పురణింపఁ బూర్ణముగాఁ దెనిఁగించి కీర్తిశేషుం డై నపిమ్మటఁ గొన్నికారణంబులచే నందలిభాగంబులు కొన్ని యుత్సన్నంబులు కాఁగా వానిని నారయాదులు పూరించి రని పండితపరంపరాముఖంబున నెల్లరకుం దెల్లంబై యున్నదికదా. ఇది యిట్లుండఁ గవులకు నొకగ్రంథమును సరిగా భాషాంతరీకరించుటకన్న నొకదానిని సొంతముగా రచించుట మఱింత సుకరము. ఏలనఁగా సొంతకృతియందుఁ దమకవితాపటిమకును బాండిత్యపరిమితికిని ననురూపము లగువర్ణనంబులును విషయములు నలవరించుకొని దానిని రచింపవచ్చును. భాషాంతరీకరణమందో యట్లు సేయ నయితికాదు. ఇఁక బహువిధవర్ణనాసందర్భసమలంకృతంబై, నానాతత్త్వవిషయభూయిష్ఠంబై, విపులప్రబంధబంధురంబై కవితాపాధి నొప్పారునిమ్మహాపురాణంబు నన్యూనంబుగా భాషాంతరీకరించుట సుక

రంబని చెప్ప నొప్పునే? అది రసోచితచిత్రవిచిత్రరచనాచమత్కృతియు, నమేయవర్ణనాచాతురియుఁ, దత్త్వార్థపరిజ్ఞానంబును, నిరుపమప్రతిభావిస్ఫురదుర్వారకవిత్వధారాప్రవాహంబును గలమహాకవికిం గాక యందఱ కలవి గాదు. అట్టికవియే పోతన యని యాతనికవిత్వమే చాటుచున్నది. తక్కినగంగనాదులకవనంబులు పోతనదానిం బోలె నంతరసవంతములును రచనావైచిత్రి గలవియుఁ గావు. వేదాంతవిషయవైదుష్యంబునఁ గాని, తత్త్వార్థనిరూపణానైపుణ్యంబునఁ గాని వారు పోతనకంటెఁ దద్దయుఁ దక్కువ యని చెప్ప నొప్పును. మొత్తమునకు సింగనకవనంబు మాధుర్యమునను, గంగనది మృదుత్వమునను, బోతనకవితారీతిం గొంత పోలియుండును.

పోతనకవితావిలాసవైచిత్ర్యంబులు పీఠికాంతరమున విపులముగాఁ దెలుపఁ బడి యుండుటవలన, వానిని సాకల్యంబున నిట వివరింపఁ బని లేదుగాని, యిప్పురాణంబును దెనిఁగించినవారింగూర్చి వేఱువేఱ మఱికొన్నివిశేషంబులుమాత్ర మిందుఁ బొందుపఱుచు చున్నాఁడను.

పోతన.

పోతన రచించినభాగము లెల్ల నద్వైతపరములుగానే యున్నవి. ఇతం డిప్పురాణము నంతయు, ముఖ్యముగాఁ దత్త్వఘట్టములను, శ్రీధరాచార్యవ్యాఖ్యానము ననుసరించియే తెనిఁగించి యున్నాఁడు. మూలార్థము కొంచెము గూఢముగా నుండునేని దానిని వివరించువ్యాఖ్యానపదములను గొన్నింటిని గూడ గద్యపద్యములందు నీటుగా దీటుకొల్పి దానిని డీకవలెఁ దేటపఱుచుచున్నాఁడు. ఎట్లన,

దశమస్కంధము - షోడశాధ్యాయము.

కాళియపత్నీస్తుతిఘట్టము.

నమోఽనంతాయ సూక్ష్మాయ కూటస్థాయ విపశ్చితే
నానావాదానురోధాయ వాచ్యవాచకశక్తయే॥
నమః ప్రమాణమూలాయ కవయే శాస్త్రయోనయే।

శ్రీధరవ్యాఖ్యానము.

౪౩॥నమఇతి॥అనంతాయ, అహంకారాపరిచ్ఛేదాత్;అతః, సూక్ష్మాయ,అదృశ్యత్వాత్; అతఏవ, కూటస్థాయ, ఉపాధికృతవికారాభావాత్: అతఏవ విపశ్చితే-సర్వజ్ఞాయ; ॥నానేతి॥ నానావాదానురోధాయ-అస్తి,నాస్తి, సర్వజ్ఞః, కించిజ్జ్ఞః, బద్ధః, ముక్తః, ఏకః అనేకః, ఇత్యాదీన్ నానావాదాన్, అనురుణద్ధి-మాయయానువర్తతే, యస్తస్మై; వాచ్యవాచకశక్తయే-అభిధానాభిధేయశక్తిభేదాదపి, నానాత్వే ప్రతీయమానాయ ॥౪౪॥ నమఇతి॥ ప్రమాణమూలాయ - చక్షురాదీనాం చక్షురాదిరూపాయ, అతఏవ, కవయే - స్వయం తన్నిరపేక్షజ్ఞానాయ; కుతః, శాస్త్రయోనయే-వేదాత్మకనిశ్వాసాయ.

ఆంధ్రీకరణము.

మూఁడహంకృతులచేఁ ముసుఁగువడక.

తే. నెఱి ననంతుఁడవై దర్శనీయుఁడవు, గాక సూక్ష్ముఁడ వై నిర్వికారమహిమఁ
దనరి కూటస్థుఁ డన సమస్తంబు నెఱుఁగు, నీకు మ్రొక్కెద మాలింపుఁ డనిరి లాత్మ.

వ. మఱియుఁ గలండు, లేఁడు, సర్వంబు నెఱుంగు, నించుక యెఱుంగు, బద్ధుండు, ముక్తుం, డొకం, డనేకుండు నను నివి మొదలుగాఁ గలవాదంబులు మాయవలన ననురోధింపుదువు కావున నానావాదానురోధకుండ వయ్యు, నభిధానాభిధేయ శక్తిభేదంబువలన బహుభావప్రతీతుండ వయ్యును, జక్షురాదిరూపంబులవలనఁ బ్రమాణమూలకుండ వయ్యు, నిరపేక్షజ్ఞానంబు కలిమిఁ గవి వయ్యు, వేదమయ నిశ్వాసత్వంబువలన శాస్త్రయోని వయ్యు.

*ఇటఁ గ్రిందిగీఁతలు గలవి యెల్లఁ గవి కేవలవ్యాఖ్యానమునుండి మాత్రము గైకొని తెనిఁగించిన వగుటచే నతం డావ్యాఖ్యానమునే యనుసరించి రచించినాఁ డనుట తేటతెల్లగఁ దెలియ నగును. మఱియుఁ గేవలకావ్యసరణికి సరసములుగాఁ దోఁపనితత్త్వవిషయములను గూడ నతిపేశలకవనంబున హావణించి మనోహరములనుగాఁ దోఁపించుటయం దీకవిశిఖామణి మిక్కిలి నిపుణుఁడు.

సప్తమస్కంధము – పంచమాధ్యాయము.

శ్లో. మతి ర్న కృష్ణే పరత స్స్వతో వా మిథోభిపద్యేత గృహవ్రతానాం
అదాంతగోభి ర్విశతాం తమిస్రం పునఃపున శ్చర్వితచర్వణానామ్॥

తెనుఁగు.

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మఱలఁ జర్వితచర్వణులైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే
మిచ్చిననైనఁ గానలకు నేఁగిననైన హరిప్రబోధముల్.

మూలము.

శ్లో. న తే విదుః స్వార్థగతిం హి విష్ణుం దురాశయా యే బహిరర్థమానినః
అంధా యథాంధై రుపనీయమానా వాచీశతంత్ర్యా మురుదామ్ని బద్ధాః.

శ్లో. నైషాం మతి స్తావదురుక్రమాంఘ్రిం స్పృశ త్యనర్థాపగమో యదర్థః
మహీయసాం పాదరజోభిషేకం నిష్కించనానాం న వృణీత యావత్.

క్రిందిగీఁతలు మూలమునుండికాని వ్యాఖ్యానమునుండికాని కైకొని తెనిఁగించినవానిని జూపుచున్నవి. ఇట్లే తక్కినయెడల నెఱుంగునది.

తెనుఁగు.

ఉ. కానని వాని నూఁతగొని కానని వాఁడు విశిష్టవస్తువుల్
గానని భంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించనవైష్ణవాంఘ్రిసం
స్థానరజోభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా.

ఇట్లింతగా హృదయరంజకములుగా నిరూపింపఁబడిన తత్త్వార్థముల నతిశ్రావ్య మగు మృదుమధురశైలిం గూర్చి మనోహరము లగునట్లు చెప్పినాఁడు. మఱియు మీఁదిపద్యంబులనడక సొబగును గడుంగడు ముద్దులు గులుకు నందలిపదములపొందికయు, వానిభావంబుఁ జక్కఁగా నెఱుంగ లేనిపామరునిమనంబుఁగూడ నాఁచికొని యానందరసమగ్నంబుఁ గావింపక మానదు.

ఈయొకటిరెండుదృష్టాంతములవలనఁ బోతనభాషాంతరీకరణరీతి చక్కఁగాఁ దెలియవచ్చును. తాను జేయు తెనుంగు మూలావిరుద్ధముగా నుండుటయ కాక కావ్యఫణితి కనురూపముగాను నలవడుటకై కొన్నియెడల నంతగా నర్థపోషకములు కాని కతిపయవిశేషణంబుల మానియు, మూలాతిక్రమణ మయ్యు రసోత్పత్తికిని దాత్పర్యోత్కర్షమునకును నుపకారము లగు సరసపదములఁ గొన్నింటిని సొంతముగాఁ గూర్చియు, నేదేనొకదానికి మాఱుగాఁ దత్సమానార్థపర్యవసాయి యగు వేఱొకదాని నుంచియుఁ దెనిఁగించియున్నాఁడు. ఒకానొకచో నావశ్యకము లగు వానియందు సైతమేదైన నొకటి నన్వయాదిసౌలభ్యంబుపొంటె విడిచిపెట్టుటయుం గలదు. అయినను మొత్తమునకు మూలార్థము సుంతైనఁ గొఱవడక కడురమణీయముగానే ప్రతిపాదితమైయుండును. వీనికెల్ల నుదాహరణంబు లింతవఱకు నే వ్రాసియుండు గద్యపద్యములఁ దెలియఁగూడును గాన విస్తరభీతి నిట వేఱువేఱ వ్రాయలేదు. అర్థరచన కొంతకటువుగా నుండునేని తద్వాచకము లగుపదముల నట్లే తెనింగింపక దానితాత్పర్యమును మాత్రము తేటగాఁ గూర్చుటను బెక్కుచోట్లఁ గానవచ్చును. మీఁద 'వాచీశతంత్ర్యా ముఱుదామ్ని బద్ధాః' అనుటకు శ్రీధరులు 'ఈశస్య' వాచితంత్ర్యాం వేదలక్షణాయాం రజ్జ్వాం, ఉరుదామ్ని-ఉరూణి దామాని బ్రాహ్మణాదీని యస్యాం తస్యాం బద్ధాః' అని టీక వ్రాసి 'కామ్యైః కర్మభి ర్బద్ధా ఇత్యర్థః' అని యాశయమును దెలిపియున్నారు. పోతనయు నిట నీషత్పరుషార్థక మగు మూలపదపరికరమును బాని తదాశయమునే 'కర్మబద్ధులై' యని కోమలముగాఁ గూర్చియున్నాఁడు. మఱియు రసోద్దీపకములు కాని రిత్తకథాంశములనుగూడ రచనాచమత్కృతి నతిరమణీయములుగాఁ జేయుటయందుఁ బోతన యసమానుఁడు. ఎట్లన:

సప్తమస్కంధము - పంచమాధ్యాయము.

శ్లో. ఏకదా సురరాట్పుత్ర మంక మారోప్య పాండవ!
పప్రచ్ఛ కథ్యతాం వత్స! మన్యతే సాధు య ద్భవాన్.

తెనుఁగు.

శా. అంతం గొన్నిదినంబు లేఁగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుం డై నిజనందనుఁ గురువు లేజాడం బఠింపించిరో
భ్రాంతుం డేమి పఠించెనో పిలిచి సంభాషించి విద్యాపరి
శ్రాంతిం జూచెదఁ గాక నేఁ డని మహాసౌధాంతరాసీనుఁ డై.

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మని చీరఁ బంచెఁ బ్ర
హ్లాదకుమారకుఁ భవమహార్ణవతారకుఁ గామరోషలో
భాదివిరోధివర్గపరిహారకుఁ గేశవచింతనామృతా
స్వాదకఠోరకుం గలుషజాలమహోగ్రవనీకుఠారకున్.

వ. ఇట్లు చారులచేత నాహూయమానుం డై ప్రహ్లాదుండు సనుదెంచిన.

శా. ఉత్సాహప్రభుమంత్రశక్తియుతమే యుద్యోగ మారూఢసం
విత్సంపన్నుఁడ వైతివే చదివితే వేదంబులుఁ శాస్త్రముల్
వత్సా ర మ్మని చేరఁ జీరి కొడుకుఁ వాత్సల్యసంపూర్ణుఁ డై
యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్.

క. అనుదినసంతోషణములు, జనితశ్రమతాపదుఃఖసంశోషణముల్
తనయులసంభాషణములు, జనకులకుం గర్ణయుగళసద్భూషణముల్.

వ. అని మఱియుఁ బుత్త్రా నీ కెయ్యది భద్రం బై యున్నది చెప్పు మనినఁ గన్నతం
డ్రికిఁ బ్రియనందనుం డిట్లనియె.

అష్టమస్కంధము – తృతీయాధ్యాయము.

గజేంద్రమోక్షణఘట్టము.

శ్లో. తం తద్వదార్త ముపలభ్య జగన్నివాసః స్తోత్రం నిశమ్య దివిజైస్సహ సంస్తువద్భిః
ఛందోమయేన గరుడేన సమూహ్యమానశ్చక్రాయుధోభ్యగమదాశుయతో గజేంద్రః
32. సోంతస్సరస్యురుబలేన గృహీత ఆర్తో దృష్ట్వా గరుత్మతి హరిం ఖ ఉపాత్తచక్రం
ఉత్క్షిప్య సాంబుజకరం గిర మాహకృచ్ఛ్రాన్నారాయణాఖిలగురో భగవన్నమస్తే
33. తం వీక్ష్య పీడిత మజ స్సహసావతీర్య సగ్రాహ మాశు సరసః కృపయోజ్జహార
గ్రాహాద్విపాటితముఖాదరిణా గజేంద్రం సంపశ్యతాం హరి రమూముచ దుస్త్రియా
ఈమూఁడుశ్లోకములకు, [ణామ్.

మ. అలవైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనుకుయ్యాలించి సంరంభి యై.

అనునీపద్యము మొదలుకొని

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశి సౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృతమహాభూతప్రచైతన్యమున్
సారోదారశితప్రభాచకితపర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్నదైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్.

అనుపద్యమువఱకుఁగలయిరువదిపద్యగద్యములను రచించినాఁడు. ఇట్లు మూలంబునందలియొకటిరెండుశ్లోకంబులకు మాఱుగా నసదృశానర్గళకవిత్వధారాప్రవాహంబు పొంగి పొరలఁ బెక్కుపద్యంబు లతిహృద్యంబులుగాను నత్యంతరసోల్లాసభాసురంబులుగాను రచించుటం బెక్కుచోట్లఁ గానవచ్చును.

నవమస్కంధము – నవమాధ్యాయము.

26. శ్లో. వ్యవాయకాలే దదృశే వనౌకోదంపతీ ద్విజౌ
క్షుధార్తో జగృహే విప్రం తత్పత్న్యాహాకృతార్థవత్
27. న భవాన్ రాక్షస స్సాక్షా దిక్ష్వాకూణాం మహారథః
మదయంత్యాః పతి ర్వీర నాధర్మం కర్తుమర్హసి
ఏష హి బ్రాహ్మణో విద్వాన్ తపశ్శీలగుణాన్వితః.
31. సోయం బ్రహ్మర్షివర్య స్తే రాజర్షిప్రవరా ద్విభోః
కథ మర్హతి ధర్మజ్ఞ ! వధం పితు రి వాత్మజః
32. తస్య సాధో రపాపస్య భ్రూణస్య బ్రహ్మవాదినః.
కథం వధం యథా బభ్రో ర్మన్యతే సన్మతో భవాన్.
33. యద్యయం క్రియతే భక్ష స్తర్హి మాం ఖాద పూర్వతః
న జీవిష్యే వినా యేన క్షణంచ మృతకం యథా,
34. ఏవం కరుణభాషిణ్యా విలపంత్యా అనాథవత్
వ్యాఘ్రః పశు మి వాఖాద త్సౌదాస శ్శాపమోహితః.

తెనుఁగు.

క. ఆఁకట మలమల మాఁడుచు, వీఁక నతం డడవి నున్న విప్రమిథునముం
దాఁకి తలాలున విప్రునిఁ, గూఁకటిచేఁ బట్టి మ్రింగఁ గొనిపోవుతఱిన్.
వ. అంత నాబ్రాహ్మణునిభార్య పతికి నడ్డంబు వచ్చి యేడ్చుచు నారాచరక్కసున కిట్లనియె.

మ. రవివంశాగ్రణి వై సమస్తధరణీరాజ్యానుసంధాయి వై
భువనస్తుత్యుఁడ వై పరార్థరతి వై పుణ్యానుకూలుండ వై
వివరం బేమియు లేక నాపెనిమిటిన్ విప్రుం దపశ్శీలు స
త్ప్రవరున్ బ్రహ్మవిదున్ జగన్నుతగుణున్ భక్షింపఁగాఁ బాడియే.
శా. తండ్రీ మీకు దినేశవంశజులకున్ దైవం బగున్ బ్రాహ్మణుం
డం డ్రామాటలు లేవె భూమిసురగోహత్యాభిలాషంబుఁ గై

కొండ్రే మీయటువంటిసాధువులు ర।క్షోభావ మిట్లేల మీ
తండ్రిం దాతలఁ బూర్వులం దలఁపవే । ధర్మంబునం బోఁగదే.

శా. అన్నా చెల్లెల నయ్యెదన్ విడువు నీ । కన్నంబు వెట్టింతు నా
హృన్నాథున్ ద్విజు గంగిగుత్తి నకటా । హింసింప నేలయ్య నీ
వెన్నం డింతులతోడఁ బుట్టవె నిజం । బిట్లైన మున్నట్ట నా
పన్నన్ నన్ను శిరంబుఁ ద్రుంచి మఱి మ।త్ప్రాణేశు భక్షింపవే.

క. అని కరుణ పుట్ట నాడుచు, వనితామణి పలవరింప । వసుధాదేవుం
దినియె నతఁడు పులి పశువుం, దినుక్రియ శాపంబుకతన । ధీరహితుండై.

ఇట నిరుపమకవిత్వాతిశయప్రయుక్తనిరంకుశస్వాతంత్ర్యమున మూలము నందలిపదపద్ధతి సరిగా ననుసరింపక సందర్భసముదితరసావేశపారవశ్యమున నీపద్యంబుల మూలంబుకంటె నత్యంతరసోద్దీపకములనుగా రచించినాఁడు.

పదలాలిత్యమును, బ్రసాదవైభవమును, సులలితసరళధారయుఁ, బోతనకవితాకమనీయతకు ముఖ్యహేతువులు. అతనికవిత్వధార యన్నిట నతిశయించినది. అది యొదును గుంటులేక కటుపదంబుల గఱుసు గాక యతిప్రాసములందు మెలిగొనక యొకమహానదినిర్మలప్రవాహంబువలె నిగనిగలాడుచు నిరర్గళముగాఁ బ్రవహించు చుండును. మఱియు శృంగారరసంబు నితరరసంబులతోఁ బరస్పరనిరపేక్షముగాఁ గూర్చి కాని లేక వాని కంగముగాఁ జేసి కాని యభివర్ణించుట యీకవికి నిష్టముగాఁ గొన్నిచోటులఁ గానిపించుచున్నది. ఇతనివర్ణనావిషయములలో నితరరసపరిప్లుతములుగా నుండునవి గూడ నితనికవితామతల్లిం దనంతటఁ జిప్పిలుచుండుశృంగారరసపూరంబున నిసుమంతయైనఁ దోఁగియుండక మానవు. సమవిభక్తావయవములు శరీరసౌందర్యమున కెట్లొకహేతువో యట్లే పోతనపద్యంబులందలిపదసమాసాదులు తులఁ దూఁచి తీరిచినట్లు రసవైభవానురూపంబుగ సువిభక్తము లై వాని రామణీయకంబునకు మూలముగా నుండును. ఎట్లన:—

దశమస్కంధము – పూర్వభాగము.

మ. జవసత్త్వంబులు మేలె సాము గలదే । సత్రాణమే మేను భూ
ప్రవరుం బోనన మిష్ఠనంగ వలెనే । పాళీ లభీష్టంబు లే
పవివో కాక కృతాంతదండకమువో । ఫాలాక్షునేత్రాగ్నివో
నవనీతంబులముద్ద గాదు మొసఁగన్ । నాముష్టి గోపార్భకా.

మ. ఘనుఁ డాభూసురుఁ డేఁగెనో నడుమ మా।ర్గశ్రాంతుఁ డై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో । విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో । యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో । నాభాగ్య మెట్లున్నదో.

ఇతనికవనంబునఁ బద్యాంతము లతిరమణీయములు. పద్యాది నంకురించినరసం

బును బయింబయి నతిచతురముగాఁ బుష్టి నొందించుచుఁ దుదిని వ్యస్తపదములవిన్యాసవైఖరిచేఁగాని సుధాఝరివలె నురవడించునొకనిడుదసమాసంపుధాటిచేఁగాని దానిని బెల్లుగా వెల్లిగొలుపును.

క. కలఁ డందురు దీనులయెడఁ, గలఁ డందురు పరమయోగిగణములపాలం
గలఁ డందు రన్నిదిశలను, గలఁడు గలం డనెడివాఁడు గలఁడో లేఁడో. అష్ట.

మ. మలఁగుల్ మెల్లనిగాలికిం బటురటన్మత్తద్విరేఫాలికిం
దలఁగుం గోయిలమ్రోఁతకై యలఁగు నుద్యద్వ్యక్తకీరసంభాషలం
గలఁగుల్ వెన్నెలవేఁడిమిన్ నలఁగు మాకందాంకురచ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానలశిఖాదోదూయమానాంగియై. దశ. పూ.

ఈకవిసంస్కృతపదరచన లించుమించుగా నన్నయకవనంబునందుంబోలె లలితములుగా నుండును. అయిన నర్థసారస్యమునను బదవాక్యసౌష్ఠవమునను నితని కవనంబు తిక్కనదానియంతప్రౌఢము గాదుగాని, రసోచితరచనావైచిత్ర్యం బిదియతనికవితకు వెనుదీసినదికాదు. ఎక్కుడయని చెప్పుటయు సాహసముకాదు. తిక్కన కర్థసారస్యమునందుఁ గన్ను. పోతనకు రససౌభాగ్యమునందు దృష్టి. ఈహేతువుం బట్టియే పోతన కొన్నియెడలఁ బదాడంబర మని కాని వ్యర్థపూరణ మని కాని పాటింపక రసైకానురూపముగాఁ బద్యముల రచించి యున్నాఁడు.

మ. వరగోవిందకథాసుధారసమహావర్షోరుధారాపరం
పరలం గాక బుధేంద్ర చంద్ర! యితరోపాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజనుస్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకనద్దావానలం బాఱునే. ప్రథ.

ఈకవి నాచనసోమునియుత్తరహరివంశమును జూచియే దీనిని రచించియుండవచ్చును. దీనికి నిదర్శనముగా మూలమునలేక యాయుత్తరహరివంశమునందు మాత్రము గలకథాంశములును నందలిపద్యాదులవంటివి కొన్నియు నిందుఁ గానఁబడుచున్నవి. ఉదాహరణము నొక్కటిఁ బ్రదర్శించెద.

ఉత్తరహరివంశము.

మ. అరిఁ జూచున్ హరిఁ జూచు సూచకములై యందంద మందారకే
సరమాలామకరందబిందుసలిలస్యందంబు లందంబులై
దొరఁగం బయ్యెదకొం గొకింత దొలఁగం దోడ్తో శరాసారమున్
దరహాసామృతసారముం గురియుచుం దన్వంగి కేళీగతిన్.

దశమస్కంధము.

మ. పరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్ రోషరాగోదయా
విరతభ్రూకుటిమందహాసములతో వీరంబు శృంగారమున్
జరగం గన్నులఁ గెంపు సొంపుఁ బరఁగం జండాస్త్రసందోహమున్

సరసాలోకసమూహముల్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్.

పోతనకవితావిషయ మింతటితో నిలిపి యీపురాణంబును దెనిఁగించిన తక్కినకవులంగూర్చి కొంత వ్రాయుట యావశ్యకము. పోతనకంటె వా రేవిధమునను దక్కువవారే యగుదు రని ముందే చెప్పియున్నాఁడను. పోతనకవనంబునం గానిపించుపదలాలిత్యమును, భావప్రసన్నతయు, శబ్దాలంకారవైచిత్రియు, వివిధవర్ణనానల్పకల్పనాచమత్కృతియు, నత్యంతరసస్ఫూర్తియు, సందర్భోచితసుకుమారసరసపదపద్యాభినివేశచాతురీగరిమయు, విలాసోల్లసితవిశృంఖలధారావిహారంబును దక్కినవారికి రావు. వారిలో

సింగన

కవనంబున మృదుమధురగుంభితములును మానసోద్దీపకము లగువర్ణనములును గొన్ని యక్కడక్కడఁ గానంబడుచున్నవి. ఈతనిశైలిం జూడఁగాఁ బోతనకవితారీతిం గూడినంతవఱకు ననుకరించి యీ తనభాగమును రచింపఁ జూచినాఁ డని తోఁచుచున్నది. పోతనశైలిని సూచించుకొన్నిపద్యముల నుదాహరించుట మంచిది.

క. మోదం బై పరిభూషిత, ఖేదం బై శబరీధరకిలికించితదృ
గ్భేదం బై బహుశాఖా,పాదం బై యొప్పువింధ్యపాదంబునకున్. షష్ఠ.

క. పుణ్యం బై మునివల్లభ, గణ్యం బై కుసుమఫలనికాయోత్థితసా
ద్గుణ్య మయి నైమిశాఖ్యా,రణ్యంబు నుతింపఁ దగు నరణ్యంబులలోన్. ప్రథమ.

క. పుట్టితి వజుతనువునఁ జే, పట్టితివి పురాణపురుషభజనము పదముల్
ముట్టితివి దిక్కులం దుది, ముట్టితివి మహాప్రబోధమున మునినాథా. షష్ఠ.

క. విడిచితి భవబంధంబుల, నడఁచితి మాయావిమోహ మైనతమంబుల్
నొడిచితి నరివర్గంబులఁ, గడచితి నాజన్మదుఃఖకర్ణార్ణవమున్. ప్రథ.

వ. కుంతంబుల గ్రుచ్చుచుఁ, గుఠారంబుల వ్రచ్చుచు, ముసలంబుల మోఁదుచు, ముద్గరంబుల బాఁదుచుఁ, జక్రంబులం ద్రుంచుచు, శబళంబుల నొంచుచు. షష్ఠ.

వ. గదల వ్రేయుచుఁ గాండంబు లేయుచు; ముద్గరంబుల నొత్తుచు, ముసలంబుల మొత్తుచుఁ, గరవాలంబులఁ ద్రుంచుచుఁ, జక్రంబులఁ ద్రుంచుచు. దశ.పూ.

ఇట్టియుద్ధకవనంబుల నందందఁ గొన్నిపోలికలు గానంబడుచున్నవి గాని పోతనధార యత్యంతనిసర్గోల్లసితం బగునిరుపమప్రతిభాతిశయంబువలన నశ్రమంబునఁ దొరంగి రసావేశతరంగిత మై తుఱంగలించుటం జేసి యతనిరచనలు సింగనవానికంటె నతిమధురము లై, ప్రకృతిమనోహరము లై, నిబిడరసపరిప్లుతము లై కానిపించుచున్నవి. ఇది యిట్లుండ నితఁడు షష్ఠస్కంధము నద్వైతపరముగానే తెనిఁగించినాఁడు. దీనికి నిదర్శనముల నాస్కంధమునుండి కొన్నింటి వ్రాసెద.

షష్ఠస్కంధము.

సీ. అఖిలభూతముల దేహాంతస్థ మగునాత్మ, యీశుఁ డచ్యుతుఁ డని యెఱుఁగవలయు.

వ. దేవా! రజ్జువునందు సర్పభ్రాంతి గలుగునట్లు ద్రవ్యాంతరంబుచేత బ్రహ్మంబయిన నీయందుఁ బ్రపంచభ్రాంతి గలిగెడిని.

వ. కావున గుణంబులును గుణియును, భోక్తయును భోగ్యంబును...హర్తయు హార్యంబును, నుత్పత్తిస్థితిలయైకకర్తయై సర్వోత్కృష్టుండైనయప్పరమేశ్వరుండె కాని యన్యంబు లేదు.

ఇట్లు జీవపరతాదాత్మ్యంబును జగన్మిథ్యాత్వంబును బ్రతిపాదితంబు లగుటంజేసి యీస్కంధ మద్వైతపరముగాఁ దెనిఁగింపఁబడె ననుట తెల్ల మగుచున్నది. మఱియు నిందు శ్రీధరవ్యాఖ్యానమునందలిపదార్థాదు లాయాతత్త్వఘట్టములందుఁ గానఁబడుచున్నవి.

షష్ఠస్కంధము – చతుర్థాధ్యాయము.

29.శ్లో. యదోపరామో మనసో నామరూపరూపస్య దృష్టస్మృతిసంప్రమోషాత్
య ఈయతే కేవలయా స్వసంస్థయా హంసాయ తస్మై శుచిషద్మనే నమః.

వ్యాఖ్యానము.

యదేతి॥ యదా, మనస ఉపరామః-సమాధిః...తదా, నామరూపే రూప్యేతే యేన తత్తథా, తస్య ఉపరమే హేతుః; దృష్టం-దర్శనం, స్మృతిశ్చ, తయోః సంప్రమోషాత్-నాశాత్, తదా, యః కేవలేన-స్వరూపజ్ఞానేన ప్రతీయతే, తస్మై హంసాయ, శుద్ధాయ; శుచి-శుద్ధం మనః, సద్మ-ప్రతీతిస్థానం, యస్య తస్మై నమః.

తెనుఁగు.

మఱియు ననేకవిధనామరూపనిరూప్యం బగుమనంబునకు దృష్టస్మృతుల నాశంబువలనం గలిగెడునుపరామం బగుసమాధియందుఁ గేవలస్వరూపజ్ఞానంబునఁ దోఁచు నిర్మలప్రతీతిస్థానం బైనహంసస్వరూపకి నమస్కరింతు.

ఇట్లువ్యాఖ్యానమునందలిపదార్థాదులు గలిగియు నద్వైతపర మయ్యునుంటంజేసి యీస్కంధమును బహుతరముగా నావ్యాఖ్యానము ననుసరించియు సింగన తెనిఁగించి యుండు నని తోఁచెడిని. అయినను బోతనవలె వ్యాఖ్యానమును గొని మూలము నన్యూనముగాను ననతివిపులముగాను విశదీకరించుటయైనను స్పష్టముగాని ప్రావీణ్యముగాని యీకవియందుఁ గానము. మఱియు నావ్యాఖ్యానముఁ జక్కఁగాఁ బాటించి మూలమును దానికి మిక్కిలి సరిగాఁ దెనిఁగించినవాఁడును గాఁ డని మీఁదియుదాహరణముచేతనే తెలియవచ్చును. కొన్నియెడలఁ దెనిఁగింపు మూలమునకుఁ జాల భిన్నముగాను నుండును. మూలమునఁ దత్త్వఘట్టములలోని సమాసములఁ బోతనవలెఁ దేటపఱుప లేక యట్లే యుంచి రచించుట యటుండఁగా వానిలోఁ గొన్నింటియర్థములు నిందు సరిగాఁ గానిపించుటయు లేదు. కొన్ని యెడల నద్వైతప్రక్రియనుమాత్రము దప్పక తనకుఁ దోఁచినరీతిని మూలమునకుఁ జాల విరుద్ధముగాను దెనిఁగించి యున్నాఁడు. కేవలకవిత్వమునుబట్టి చూడ

నీతఁడు సింగననారయలకంటె నెక్కుడై పోతనవలె స్వకపోలకల్పితము లగువర్ణనములను గూడఁ జేర్చి మధురముగాను మనోహరముగాను దనస్కంధమును దెనిఁగించినాఁ డని చెప్ప నొప్పను. ఇతనికవనమున లక్షణదోషములు కొన్ని గానిపించుచున్నవి.

కొనికి కాదేశము.	దుష్టసంధులు.
పెట్టుక. పట్టుక.	ఓ రేడ్వాకుఁ డని.
ఉకారాంతశబ్దమునకు కుషష్ఠి పరమగు	గ్రక్కిఁటి సీజగంబునను.
నపుడు నగామము రామి.	మహీ మెట్టిదియో.
పాటుకు.	అడఁకు వేమియు.
దుష్టరూపములు.	ధాతంతవాఽని.
చేతును.	నేర్పరింతింతవాఁ డన రానివాఁడు.

మఱియు సమాసదోషములు మొదలగునవి కొన్ని గానిపించుచున్నవి కాని వి స్తరిభీతి నిట వ్రాయక పంచమస్కంధమును దెనిఁగించిన

గంగన్న

ను గూర్చి కొంతవ్రాయుట యుక్తము. ఈతనికవన మంతరసవంతముకాదు. దానిని సింగనకవనముకంటెఁ దక్కువ యని చెప్పవచ్చును. రసోత్పత్తికొఱకుఁ జేసినరచన లంతగా శ్రమంపడక కుదిరినవిగాఁ దోఁపమిచేఁ బోతనవానివలె నవి స్వభావసుభగములుగాఁ గానిపింపవు. అయినను మొత్తమునకు నితనికవిత్వము కొంత లలితముగాను సింగనదానికంటె సుకుమారముగాను నుండును. ఇతని తెనిఁగింపును సింగనదానివలె మూలమునకు మిక్కిలిసరిగా నుండదు. వర్ణనాసందర్భములయందు నిది మూలముకంటెఁ జాలన్యూనముగాను గొన్నియెడల భిన్నముగాను నుండును.

పంచమస్కంధము–ద్వితీయాధ్యాయము.

కటాక్షవర్ణనము.

శ్లో. బాణా విమా భగవత శ్శతపత్త్రపత్త్రే కాంతా వపుంఖరుచిరా వతితిగ్మ దంతౌ
కస్మైన్మయుయుంక్షసివ నేవిహరన్నవిస్మాక్షేనూంయనోజడధియాంతవవిక్రమోస్తు.

తెనుఁగు.

క. పొలు పగుచున్నవిలాసం,బు లనంగజబాణములను కై బోలెడునీచం
చలసత్కటాక్షవీక్షణ,ముల నెవ్వని నింతి చిత్తమునఁ గలఁచెదవే.

అంగపరిమళలోభానుగతభ్రమరవర్ణనము.

శ్లో. శిష్యా ఇమేభగవతః పరితః పఠంతి గాయంతి సామ సరహస్య మజస్ర మీశ!
యుష్మచ్ఛిఖా విలులితాస్సుమనోభివృష్టీః సర్వేభజంత్యృషిగణాఇవ వేదశాఖాః.

తెనుఁగు.

చ. చెదరఁగ వేదముల్ చదువుశిష్యులపైఁ దగఁ బుష్పవృష్టి స
మ్మదమున నంతలోఁ గురియుమాడ్కిని మన్మథసామగానముల్
చదివెడుశిష్యులో యనఁగ షట్పదపంక్తులు మ్రోయఁగా వడిం
బడపడి మీఁద రాలుఁ గచభారమునందులజాజుక్రొవ్విరుల్.

వీనిలో మొదటిపద్యమున మూలమునందలివిశేషణాదులు పెక్కు లేవు. రెండవదానియందు మూలార్థరీతి గానిపింపదు. ఇట్లీతనికవిత్వ మంతగా సరసమును మధురమును గాకపోయినను, మార్దవమూలమునఁ గొంత లాలిత్యమును గాంచుచున్నది. మఱియుఁ బోతనాదులకవనంబులందుంబోలె నిందు స్వకపోలకల్పితములగువర్ణనము లెందును గానరావుగాని సరసవస్తుత్యాగములు పెక్కు గానఁబడుచున్నవి.

౧౬. ఇతి తేషాం వృషలానాం రజస్తమః ప్రకృతీనాం ధనమదరజఉత్సిక్తమనసాం... కర్త్రాతిదారుణం యద్బ్రహ్మభూతస్య సాక్షాద్బ్రహ్మర్షిసుతస్య నిర్వైరస్య సర్వభూతసుహృద స్సూనాయా మప్యనుజ్ఞాతాయా మనభిమత మాలంభనం తదుపలభ్య బ్రహ్మతేజసాతిదుర్విషహేణ దందహ్యమానేన వపుషా సహసోచ్చచాలసైవ దేవీ భద్రకాళీ. ౧౭. భృశమమర్షరోషావేశరభసవిలసితభ్రుకుటివిటపకుటిలదంష్ట్రారుణేక్షణాటోపాతిభయానకవదనా హంతుకామేవేదం మహాట్టహాస మతిసంరంభేణ విముంచంతీ, తత ఉత్పత్య పాపీయసా మతిదృప్తానాం తేనైవాసినా వృక్ణశీర్ష్ణాం గళాత్ ప్రస్రవంత మసృగాసవ మత్యుష్ణం సహగణేన నిపీయాతిపానమదవిహ్వలోచ్చైస్తరాం స్వపార్షదైస్సహ జగౌ ననర్త విజహార చ శిరఃకందుకలీలయా.

పంచ. నవమాధ్యాయము.

తెనుఁగు.

సీ. సర్వభూతములకు సఖుఁడును బ్రహ్మభూతాత్ముఁడు నిర్వైరుఁ డయిన బ్రహ్మ
సుతుని తేజం బంతఁ జూడ దుస్సహమైన, భయ మంది వడఁకుచు భద్రకాళి
క్రోధంబు ముమ్మడిగొనఁగ హుంకారంబు, సలుపుచు నట్టహాసంబు సేసి
పాపాత్ములును దుష్టపరులును రాజస, తామసకర్మసంధాను లగుచు
తే. విప్రవరునట్లు హింసించువృషలపతిని, భృత్యవర్గంబుతోఁ దలఁ బృథ్విఁ గూల్చి
యపుడు వృషలాధిపునిశిర మంది లీలఁ, బాడి యాడుచు నందంద క్రీడసలిపె.

ఇది యితని తెనిఁగింపునకు మంచినిదర్శనము. ఇందు రసపూర్తి మూలంబుకంటె మిక్కిలి తక్కువ. మూలార్థమెల్ల ననతిన్యూనముగా సంగ్రహించి నిపుణముగా నొక్కసీసంబున నిమిడ్చి యతిమృదువుగా రచించినరీతి నిచటఁ గానవచ్చును. పోతనయేని నిట్టివర్ణనాప్రసంగము పొసంగెనా రసపారవశ్యంబునఁ జిత్రవిచిత్రరచనానల్పకల్పనాచమత్కారం బేపర స్వానవద్యహృద్యకవిత్వవిద్యావిలాస

విశేషంబులెల్లఁ జూపి రసంబులు చిప్పిలం జేయకుండునే ! ఇట్లే తత్త్వఘట్టములందు మూలమునకును దెనుఁగునకును బెక్కుచోట్ల భేద మగపడినను జాలవఱకు మూలము ననుసరించియే తాత్పర్యరూపముగాఁ దెనుఁగు సేసియున్నాఁడు. కొన్నిచోట్ల శ్రీధరాచార్యవ్యాఖ్యానమందలియర్థాదులు గానిపించుటచే దానిని బూర్ణముగా ననుసరింపకపోయినను సహాయముగా నుంచుకొని సంగ్రహముగాఁ దెనిఁగించియుండు నని తోఁచెడిని.

పంచమస్కంధము – ఏకాదశాధ్యాయము.

శ్లో. యావన్మనో రజసా పూరుషస్య సత్త్వేన వా తమసా వానురుద్ధం
చేతోభి రాకూతిభి రాతనోతి నిరంకుశం కుశలం చేతరం వా॥
సవాసనాత్మా విషయోపరక్తో గుణప్రవాహో వికృత షోడశాత్మా

వ్యా. పురుషస్య, కుశలం-ధర్మ మితర-మధర్మంవా, ఆతనోతి, కైః, చేతోభిః-జ్ఞానేంద్రియైః, ఆకూతిభిః-కర్మేంద్రియైశ్చ॥ ర ॥ తతశ్చధర్మాధర్మవాసనాయుక్తం తదేవానేకదేహాదిద్వైచిత్ర్యంకరోతీత్యాహ॥ సవాసనేతి-తన్మనఇత్యర్థః, వాసనాయుక్తం ఆత్మోపాధిత్వా దాత్మా.

తెనుఁగు.

పురుషుని,చిత్తంబుగుణములఁ బొంది యెంత
తే. కాల ముండును మఱియంతకాలమందు, నరయవిజ్ఞానకర్మేంద్రియములచేత
నురగి ధర్మంబుమఱియధర్మంబునట్లు, తగిలి పుట్టించుచుండు నత్యంతమహిమ.

వ. మఱియు ధర్మాధర్మవాసనాయుక్తంబు...చిత్తంబు

ఈకవియుఁ దనస్కంధము నద్వైతపరముగాఁ దెనిఁగించె ననుటకు దానియందలినిదర్శనములం గొన్నింటిఁ దెలిపెద :

ఆ. పరఁగఁ బెద్ద లీప్రపంచ మంతయుఁ దథ్య, మనరు ౧–ఆ. 151

వ. మనోవృత్తుల నతిక్రమించినజీవుండు పరంజ్యోతి యైననారాయణస్వరూపంబుగా నెఱుంగుము... ఈశ్వరుండు సర్వభూతాంతర్యామి యగుచు జీవాత్మస్వరూపంబున నుండు. ౧–ఆ. 153

వ. బ్రహ్మం బొక్కటియ సత్యంబు జగత్తసత్యంబు. ౧–ఆ. 159

ఇట్లద్వైతపరముగాఁ దెనిఁగించుటయు నితండు శ్రీధరవ్యాఖ్యానమును గొంతవఱ కనుసరించి యుండు ననుటకుఁ గొంతయాధారముగా నున్నది. ఇతని కవనంబునను గొన్నిలక్షణదోషంబులు చూపట్టుచున్నవి.

కొన్నికి కాదేశము.

ప్రథమాశ్వాసము.

తఱుముక. 128

ఆశ్రయించుక. 147

ద్వితీయాశ్వాసము

జుట్టుక. 12[illegible]

నాటుక. 145

ఉకారాంతశబ్దమునకు కుషష్ఠిని నగాగమము రామి.

ఆశ్రమముకు. 21

సుతుకు. 56

మఱియు దుష్టము లగునఖండయతులును మఱికొన్నిదోషములును గానిపించుచున్నవి. మొత్తమునకు నితనికవిత్వము మిక్కిలి మృదువుగా నుండు ననుటకు రెండుదాహరణము లిచ్చి యితనివిషయ మింతటితో విరమించెద.

ఉ. అక్కట! తల్లిఁ బాసి హరిణార్భక మాప్తులు లేమిఁజేసి యే
దిక్కును లేక యున్న నిటఁ దెచ్చితి నాయెడ నీమృగార్భకం
బెక్కుడుప్రేమఁజేసి చరియించుచు నున్నది నాదుసన్నిధిన్
మక్కువఁజేసి దీనిఁ గడుమన్ననలం దగఁ బ్రోతు నెంతయున్.

ఉ. రాజులు మే లనంగ సురరాజసమానుఁడనై తనూజులన్
రాజులఁ జేసి తాపసులు రాజఋషీంద్రుఁ డటంచుఁ బల్కఁగాఁ
దేజము నొంది యీహరిణదేహమునందలి ప్రీతిఁ జేసి నా
యోజ సెడంగ నేఁ జెడితి యోగిజనంబులలోన బేలనై.

ఇఁక వ్రాఁతప్రతులందును నచ్చుప్రతులగద్యలందును నేకాదశద్వాదశస్కంధములను రచించినవాఁడుగాఁ దెలియుచున్న వెలిగందల

నారయ

ను గూర్చి కొంత వ్రాయవలసియున్నది. ఈరెండుస్కంధముల తెనిఁగింపు మొత్తమునకు మూలమునకుఁ జాలవఱకు సరిగా నుండదు. తత్త్వఘట్టములందుఁగాని కథాంశములందుఁగాని యిది మూలమునకంటెను బెక్కుచోట్లఁ జాల న్యూనముగాను గొన్నియెడల మిగులవిశుద్ధముగాను నుండు నని తొలుతనే చెప్పియున్నాఁడను. స్థాలీపులాకన్యాయంబున రెండుదాహరణంబు లిచ్చెద.

శ్లో. ఇంద్రియార్థభ్రమో జాగ్రత్స్వప్నోంతఃకరణభ్రమః
సుప్తం తద్వాసనాబీజం తుర్యా మూర్తి స్తదన్వితః॥ ఏకాదశ.

వ. ఇంద్రియార్థభ్రమణంబు సేసెడుదుర్మతులకు సుషుప్త్యాద్యవస్థలు వాసన కలుగుటంజేసి పరమేశ్వరునిం బొందరామి యనునాలుగవయవస్థయుఁ గలుగు.

శ్లో. తంచోపనీయ సదసి పరిమ్లానముఖశ్రియః
రాజ్ఞ ఆవేదయాంచక్రు స్సర్వయాదవసన్నిధౌ॥
తం చూర్ణయిత్వా ముసలం యదురాజ స్స ఆహుకః

సముద్రసలిలే ప్రాస్య లోహం చాస్యావశేషితం
కశ్చిన్మత్స్యోఽగ్రసీ ల్లోహమ్॥ ఏకాదశ.

వ. ...దానిం గొనిచని దేవకీనందనుసన్నిధానంబునం బెట్టి యెఱింగించిన నతం(డాత్మ కల్పితమాయారూపం బగుట యెఱింగియు నెఱుంగని తెఱంగున) వారలం జూచి యిట్లనియె...(సముద్రతీరంబున నొక్కమహాపర్వతం బున్నది. అందు నుండు నత్యుచ్ఛ్రియవిశాలవిభీషణం బగుపాషాణంబున మీభుజాబలంబుచేత నీముసలం బుఁ దివిచి) దీనిచూర్ణంబు సింధుకబంధంబులం గలిపి రండు పొం డని జగద్విభుం డైనకృష్ణుం డానతిచ్చిన వారు నట్ల చేసి తత్కలితం బైనలోహఖండంబును సరకు గొనక సాగరంబునం బడవైచిన నొక్కఝషంబు గ్రసించిన.

ఇట మూలమున 'రాజ్ఞే' 'యమురాజస్సఆహుకః' ఇత్యాదు లుగ్రసేనుని నిర్దేశించుచుండఁగా నతనికి మాఱుగా 'దేవకీనందనుండు' 'జగద్విభుం డైనకృష్ణుండు' అని తెనుఁగున నున్నది. మఱియుఁ దెనుఁగునఁ గుండలీకరణములలోని ముసలమాయారూపత్వపర్వతపాషాణాదు లెవ్వియు మూలమునఁ గానరావు. ఇంతే కాక యందలికుండలితవాక్యము కొండవదానికి వ్రాఁతప్రతులందు 'సముద్రతీరంబున నొక్కమహోపలం బున్నది. ఇమ్ముసలంబు మీభుజాబలంబున దానిమీఁదం దివిసి' అని పాఠాంతరము చూపట్టుచున్నది. మూలమునకును, వ్రాఁతప్రతులకును, నచ్చుప్రతులకును గానిపించుపరస్పరభేదముల కిది యొకనిదర్శనము. ఇట్టిభేదములు కథాంశములను దత్త్వసూత్రములను గానఁబడుటకుఁ జెఱి యొకయుదాహరణముఁ జూపెద.

మూలము.

శ్లో॥ తక్షకః ప్రహితో విప్రాః! క్రుద్ధేన ద్విజసూనునా।
హంతుకామో నృపం గచ్ఛ న్నదర్శ పథి కాశ్యపమ్।
తం తర్పయిత్వా ప్రవిష్టో న్నివర్త్య విషహారిణమ్।
ద్విజరూపప్రతిచ్ఛన్నః కామరూ వ్యదశ న్నృపమ్।
బ్రహ్మభూతస్య రాజర్షే ర్దేహోఽపి గరళాగ్నినా।
బభూవ భస్మసా ల్లిసద్యః పశ్యతాం సర్వదేహినామ్॥
హాహాకారో మహా నాసీ ద్భువి ఖే దిక్షు సర్వతః।
విస్మితా హ్యభవ న్సర్వే దేవాసురనరాదయః॥
జనమేజయః స్వపితరం శ్రుత్వా తక్షకభక్షితమ్।

వ్రాఁతప్రతుల తెనుఁగు.

వ. తక్షకప్రేరితుం డైనయుగ్వీసుపహ్వాండు సనుదెంచి రాజసన్నిధి నున్నవారిచేతికి నొక్కఫలం బిచ్చిన వారు రాజున కిచ్చిన నతం డది యాస్వాదింప నందుఁ గ్రిమిరూపంబున వెడలి మహాభయంకరరూపంబునఁ గాకోదరం బై కఱచినఁ బరీక్షిత్తు పంచత్వంబు నొందుట విని తనయుం డైనజనమేజయుండు.

అచ్చుప్రతుల తెనుఁగు.

వ. ఇటఁ గ్రుద్ధుం డైన బ్రాహ్మణోత్తమునిచేఁ బ్రేరితుం డైన తక్షకుండు ద్విజరూపంబుఁ దాల్చి పరీక్షిద్వధార్థంబుగా నేతెంచుచుండి మార్గమధ్యంబునఁ గాశ్యపుం డను సర్పవిషహరణసమర్థుం డగు నొక్క విప్రునిం గని యతని నపరిమిత ధనప్రదానంబునఁ దృప్తుం గావించి పరీక్షిన్నికటంబునకు రా కుండునట్లొనర్చి యంతటఁ బరీక్షిన్మహారాజు చెంత నున్నవారిచేతి కొక్క ఫలం బిచ్చి చనిన వా రాఫలంబు రాజున కిచ్చిన నతం డాఫలంబు నాస్వాదించినం గ్రిమిరూపంబున నందుండి వెడలి మహాభయంకరరూపంబునఁ గాకోదరం బై రాజుం గఱచిన నతండు నాక్షణంబ విషాగ్నిచే భస్మీభూతుం డయ్యె. అట్టియవసరంబున భూమ్యంతరిక్షంబుల నుండు నిఖిలప్రాణు లాశ్చర్యకరం బగు తన్మరణంబుఁ గని హాహారవంబులు సేసిరి అంత నీయర్థంబు నతనితనయుం డైన జనమేజయుండు విని.

ఇట వ్రాంతప్రతులపాఠము మూలముకంటె మిక్కిలి న్యూనముగాను విరుద్ధముగాను నుండుటం జూచి యచ్చుప్రతులందలిపాఠము మూలానుసారముగా రచింపఁబడెను గాఁబోలు. వ్రాంతప్రతులవిశుద్ధపాఠమునుబట్టి పర్యాలోచింపఁగా మూలమునఁ గల 'తక్షకః ప్రహితో విప్రాః!' అనుపాఠమునకు మాఱుగా 'తక్షక ప్రహితో విప్రః' అనుతప్పుపాఠము నెట్లో కొని కవి తెనిఁగించియుండు నని తోఁచెడిని. తెనుఁగుపాఠముల రెంటను గల 'ఒక్క ఫలం బిచ్చుటయు' తక్షకుండు 'క్రిమిరూపంబున నందుండి వెడలి' వచ్చుటయు మూలమునఁ గానరావు.

ద్వాదశస్కంధము -- చతుర్థాధ్యాయము.

శ్లో. బుద్ధే ర్జాగరణం స్వప్నం సుషుప్తి రితిచోచ్యతే
మాయామాత్ర మిదం రాజ న్నానాత్వం ప్రత్యగాత్మని
యథా జలధరా వ్యోమ్ని భవంతి న భవంతి చ
బ్రహ్మణీదం తథా విశ్వ మవయ వ్యుదయాప్యయాత్
అన్యోన్యాపాశ్రయాత్సర్వ మాద్యంతవ దవస్తు చ
నానాత్వం ఛిద్రయోర్యద్వ జ్జ్యోతిషో ర్వాతయో రపి
యథా హిరణ్యం బహుధా సమీయతే నృభిః క్రియాభి ర్వ్యవహార వర్త్మసు
ఏవం వచోభి ర్భగవా నధోక్షజో వ్యాఖ్యాయతే లౌకికవైదికై ర్జనైః.

వ్రాంతప్రతుల తెనుఁగు.

వ. స్వప్నజాగరణసుషుప్త్యవస్థా(భేదం బాత్మమయం బై బుద్ధియుక్తం బై నమాయ యై యోగంబునం బరిణమించు. ప్రాణిజాతంబున కీశ్వరునందు లయోదయంబులగు. ఈజగం బన్యోన్యాపాశ్రయం బై యాద్యంతవస్తువై వర్తించు) ఒక్క తేజంబు బహురంధ్రంబులఁ గానంబడు తెఱంగున నొక్క (పరమాత్మను) బెక్కువిధం

బులుగా భావింతురు. హాటకంబు పెక్కురూపంబు లయ్యు నేకం బైన తెఱంగునఁ బరమాత్ము నొక్కటిగా భావించి.

అచ్చుప్రతుల తెనుఁగు.

వ. జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలు (బుద్ధిధర్మంబు లగు. ప్రత్యగాత్మయందు నానా ప్రకారంబులం దోఁచు నీదృశ్యప్రపంచం బంతయు మిథ్య యని తెలియుము). ఒక్క తేజంబు బహురంధ్రంబులం గానంబడువడువున నొక్కయాత్మయె పెక్కు విధంబులఁ దోఁచుచుండు. హాటకంబు పెక్కురూపంబులు గల దైన నేకం బైన తెఱంగునఁ బరమాత్మ (వివిధచేతనాచేతనశరీరంబులయందుఁ) బెక్కువిధంబులం గనంబడిన నేకంబుగా భావింపవలయును.

ఇట మూలమునం దెడనెడ నుండుశ్లోకములు కొన్ని తెనిఁగింపఁబడినవి కావు. ఆశ్లోకము లుండుచోటులనే చుక్కలతోఁ జూపి తెనిఁగింపబడినవానిని మాత్రము వ్రాసినాఁడను. తెనిఁగింపఁబడినవో యీ దర్శనమునుబట్టి చూచినను మూలమునకు వలయునంతసరిగా లేవు. ఈలోపము లటుండఁగాఁ దెనుఁగుపాఠములు రెంటను గుండలితము లగుబంతు లొండొంటియందు లేవు. మఱియు నచ్చుప్రతులందలి తెనిఁగింపు సువ్యక్తముగా నద్వైతపరముగా నున్నది. వ్రాఁతప్రతుల తెనిఁగింపట్లు గానిపింపదు.

ఇట్లు మీఁదిరెండుదాహరణములవలన మూలాదులు మూఁటికిని గలభేదములు విశదముగాఁ దెలియవచ్చును. మఱియు నద్వైయెడల నధ్యాయము లొకటి రెండుగాఁ దెనిఁగింపఁబడకున్నవి. ఏకాదశస్కంధమునఁ ద్రయోదశాధ్యాయమున శ్రీవిష్ణుండు హంసరూపి యై చేసినతత్త్వోపదేశము.

'వస్తునో య దనానాత్వ మాత్మనః ప్రశ్న ఈశ్వరః'

అనుశ్లోకము మొదలుగాఁ బదిగేడుశ్లోకములఁ జెప్పఁబడియున్నది. వానికెల్లఁ* దెనుఁగయిదాఱుబంతులే యున్నవి. అవియును మూలమునకు సరిగావు. అందు

మనసా వచసా దృష్ట్యా గృహ్యతేన్యై రపీంద్రియైః ।
అహమేవ న మత్తోऽన్య దితి బుధ్యధ్వ మంజసా ॥ 24

అనునీశ్లోకము 'పంచేంద్రియంబులకు దృష్టం బైనపదార్థం బనిత్యంబు. అది నిత్యదృష్టిని బ్రహ్మం బని తెలియవలయు' అని తెనిఁగింపఁబడియున్నది. కవి పదునాలుగవయధ్యాయమునఁ జెప్పఁబడినభక్తిపారమ్యధ్యానయోగములను బదిబంతులలో నఱగొఱగాఁ దెనిఁగించి, షోడశమునందలివిభూతులను జెప్పి యవ్వలిమూఁడధ్యాయములవిషయములను మూఁడుబంతులతో సూచించి పండ్రెండవయధ్యాయమునకు మఱలి, యందుఁ గల

* చూడు-భాగ-ఏకా-వచన. 104

శ్లో॥ తస్మాత్త్వ ముద్ధవోత్సృజ్య చోదనాం ప్రతిచోదనామ్ ।
ప్రవృత్తించ నివృత్తించ శ్రోతవ్యం శ్రుత మేవ చ॥ 14
మా మేక మేవ శరణ మాత్మానం సర్వదేహినామ్।
యాహి సర్వాత్మభావేన మయా స్యా హ్యకుతోభయః॥ 15

ఈశ్లోకములకే *'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' ఇత్యాదులు నాలుగుబంతులు చెప్పి పిదపఁ బందొమ్మిదవయధ్యాయమునందలిశిష్టాంశమును గొంతయు నిరువదినాలుగవదానియందలిసాంఖ్యవిధియు సప్తవింశమునందలియర్చనాప్రకారంబు గొంతను దెనిఁగించి యిరువదితొమ్మిదవదానియందుఁ గల

'గచ్ఛోద్ధవ ! మయాదిష్టో బదర్యాఖ్యం మయాశ్రమమ్' !

ఇత్యాదులను, నవ్వలిరెండధ్యాయంబులఁ గలయాదవక్షయబలరామకృష్ణనిర్యాణంబులను దెనిఁగించి యున్నాఁడు. ఈస్కంధమునఁ గలభిక్షుగీతాదులు తెనుఁగున లేవు. మఱియు †'నారాయణవిగ్రహంబు జలధిప్రాంతంబున జగన్నాథస్వరూపం బై యుండె' ననుట మూలమునం గానరాదు. మొత్తమునకు నీస్కంధమునకుఁ దెనుఁగు మూలమున నాలుగింట నొకపా లుండును. ద్వాదశస్కంధమును దెనిఁగించుటయందిట్లధ్యాయములుగా వదలిపెట్టుట లేదు గాని యది పెక్కుచోట్ల మూలముకంటె మిక్కిలి న్యూనముగాను గొన్నియెడలఁ గడుభిన్నముగాను గానిపించుచున్నది.

వ్రాఁతప్రతులందు లేనివియు మూలానుసారము లైనవియు నగు నధికపాఠాదు లచ్చుప్రతులందుఁ గానంబడుటకుఁ బండితులు మూలముగా నుండఁబోలు నని చెప్పినాఁడనుగదా. ఆవిషయ మట్లుండ మఱియొకవిచిత్రమును జూపట్టుచున్నది. ఈ రెండుస్కంధముల తెనిఁగింపు వ్రాఁతప్రతులం దద్వైతపరముగాఁ దోఁపదు. అచ్చుప్రతులందో యది స్పష్టముగా నద్వైతపరముగాఁ గానిపించుచున్నది. వ్రాఁతప్రతులపాఠమునుబట్టి చూడ నది యద్వైతపర మనుటకంటె విశిష్టాద్వైతపర మనుటకుఁ గొన్నియాధారము లందే కానఁబడుచున్నవి.

†'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ యనునుపనిషత్తుల్యం బగు గీతావచనప్రకారంబున' అని యీశ్లోకమునకు విశిష్టాద్వైతులవలెఁ గవి మిక్కిలి ప్రాధాన్యముకలిమిని జూపియున్నాఁడు.

మఱియు 'జీవాత్మభేదంబు § మొదలైనవి యెఱిఁగించి విజ్ఞానవంతుంగాఁ జేసి మన్నించితి' అని యిట జీవాత్మభేదంబుఁ బ్రతిపాదించియున్నాఁడు.

¶ 'దేవతాంతరమంత్రాంతరసాధనాంతరంబులు వర్జించి యుండెనేని వైకుంఠంబున వసియించు' ఇది వీరవైష్ణవత్వసూచకము.

ఈవాక్యములు వ్రాఁతప్రతులందును నచ్చుప్రతులందును గానిపించుచున్న

*చూడు-ఏకాదశ-వచన. 106. †ఏకా.వచన. 121. ‡ఏకా.వ.106. §ద్వా. వ.2¶ద్వా. వ.39.

వి. ఇవి నిస్సందేహముగా విశిష్టాద్వైతపరములు. అచ్చుప్రతులందుఁ గంఠోక్తిగా నద్వైతమును బ్రతిపాదించువాక్యములు మూఁటిని వ్రాసెద.

'ప్రత్యగాత్మయందు నానాప్రకారంబులం దోఁచు నీదృశ్యప్రపంచం బంతయు మిథ్య యని తెలియుము.'

'ఇట్లాత్మస్వరూపునిగా హరిని నిరంతరంబు భావించుచుండుట విశేషంబు.

'బ్రహ్మాత్మైక్యానుసంధానంబు.'

ఇందు మొదటిదియు మూఁడవదియు వ్రాఁతప్రతులందు లేవు. రెండవదానికి మూలము 'ఏవమాత్మాన మాత్మస్థ మాత్మనైవామృశప్రభో.' దీనికి వ్రాఁతప్రతులం దెల్ల *'ఇట్లాత్మ నాత్మ సునిఁగాఁజేసి హరినిజాకారంబు మనంబునం దలంచుచుండుము' అని తెనుఁగు కానఁబడుచున్నది కాని యచ్చుప్రతులపాఠము కానఁబడదు. కాఁబట్టి యీవాక్యము లంతగా నవలంబనీయములు కావు. ఉభయవిధప్రతులందుఁ గానిపించుపాఠములంబట్టి కడపటిరెండుస్కంధముల తెనిఁగింపు విశిష్టాద్వైతపర మనుటయే సమంజసముగాఁ దోఁచుచున్నది. ఈ విషయము నిట్లుండ నిచ్చి మఱియొకదానిం గూర్చి కొంత చర్చించుట యావశ్యకము.

ద్వితీయతృతీయచతుర్థస్కంధములందును, బంచమషష్ఠములందును, దశమోత్తరభాగంబునందు, నేకాదశద్వాదశములను బోతనకవితారీతి కానిపింపమిచే నవి యుత్పన్నములై నారయాదులచేఁ బూరింపఁబడిన వని పండితులు వ్రాసియున్నారు గదా. అందుఁ బంచమషష్ఠములు కేవలరామాంకితములు గాక యచ్యుతనందగోపకుమారాంకితము లగునాద్యంతపద్యగద్యాదులంబట్టి యవి పూర్ణముగా గంగనసింగనలచే రచింపఁబడిన వని నిస్సందేహముగాఁ దెలియుచున్నది. ఏకాదశద్వాదశములు రామాంకితము లయ్యుఁ గవిత్వశైలినిబట్టియు భాషాంతరీకరణవైఖరినిబట్టియుఁ బోతనగంగనసింగనల కితరుఁ డైనయొకనిచే ననఁగాఁ బండితలిఖితపీఠికానుసారముగా నారయచేఁ బూర్ణముగా రచింపఁబడిన వని తెలియుచున్నది. తక్కినద్వితీయాదులు మూఁటను, దశమోత్తరభాగమునను గలగద్యములనుబట్టియు, రామాంకితము లగునాద్యంతపద్యములనుబట్టియు, వానియందు నయ్యెయెడలఁ బోతనపదశయ్యాదులు గానిపించుటంబట్టియు, నవి యొకింతఁ బోతనచే రచితము లని తెల్లమగుచున్నది. మఱియు శ్రీధరవ్యాఖ్యానమందలియవతారికలను విశేషాంశములనుగూడఁ జేర్చి తత్త్వఘట్టములను దెనిఁగించుట పోతనదప్పఁ దక్కినవారెవరియందును గానఁబడదు. అట్టితెనిఁగింపును ద్వితీయాదులు మూఁట వరుసగాఁ జూపెద.

ద్వితీయస్కంధము – పంచమాధ్యాయము.

శ్లో. ద్రవ్యం కర్మ చ కాల శ్చ స్వభావో జీవ ఏవ చ।
వాసుదేవా త్పరో బ్రహ్మ న్నచాన్యోఽర్థోఽస్తి తత్త్వతః॥

* ద్వా. వ. 26.

వ్యా॥ ద్రవ్యం-మహాభూతాని, ఉపాదానరూపాణి ; కర్మ-జన్మనిమిత్తం ; కాలః-తత్క్షోభకః ; స్వభావః - తత్పరిణామహేతుః ; జీవో- భోక్తా-వాసుదేవాత్పర అన్యోర్థోనాస్తి.

తెనుఁగు॥ మఱియు దేహంబునకు ద్రవ్యంబులైనమహాభూతంబులును, జన్మనిమిత్తంబులైన కర్మంబులును, గర్మక్షోభకంబైనకాలంబును, గాలపరిణామహేతువైనస్వభావంబును భోక్తయైన జీవుండును వాసుదేవుండకా నెఱుంగుము. వాసుదేవవ్యతిరిక్తంబు లేదు.

తృతీయస్కంధము-నవమాధ్యాయము.

శ్లో. శశ్వత్స్వరూపమహసైవ నిషిద్ధభేదమోహాయ బోధధిషణాయ నమః పరస్మై।
విశ్వోద్భవస్థితిలయేషు నిమిత్తలీలారాసాయ తే నమ ఇదం చకృమేశ్వరాయ।

వ్యా॥ స్వరూపమహసైవ-స్వరూపచైతన్యేనైవ, బోధః (విజ్ఞానమ్) ఏవ ధిషణం-ఆశ్రయం-యస్య...విశ్వస్య ఉద్భవాదిషు నిమిత్తం-మాయా;తస్యాః లీలా-విలాసః, తయాసహ, రాసః-క్రీడా.

తే. తవిలి శశ్వత్స్వరూపచైతన్యభూరి, మహిమచేత నపాస్తసమస్తభేద
మోహుఁడవు నఖిలవిజ్ఞానమునకునాశ్ర,యుండవగునీకు మ్రొక్కెదనోరమేశ.

క. జననస్థితివిలయంబుల, కనయంబును హేతుభూతమగుమాయాలీ
లను జెంది నటనసలిపెడు, ననఘాత్మక నీకొనర్తు నభివందనముల్.

చతుర్థస్కంధము-ఏకోనత్రింశాధ్యాయము.

శ్లో. అర్థే హ్యవిద్యమానేపి సంసృతి ర్న నివర్తతే
మనసా లింగరూపేణ స్వప్నే విచరతో యథా.

ననుతర్హి అజ్ఞానవిలసితత్వేన సంసృతిహేతోర్దేహాదే రప్యసత్యత్వాత్కథంతర్హి తన్నివర్తనప్రయాసేన తత్రాహ॥ అర్థేహీతి॥ లింగరూపేణ-ఉపాధిభూతేన.

తెనుఁగు.

సీ. నరనాథ ! వినుము స్వప్నంబుచందంబున, నజ్ఞానవిలసితంబగుటఁజేసి
తివిరి మిథ్యాభూతదేహాదికమునకు, నరయ వివర్తనాయాస మేటి
కని యంటివేనియు నర్థంబు లేకున్న, నర్థి సోపాధికంబైన మనము

ఇట్టి తెనిఁగింపునుబట్టియు నీమూఁడును బోతన మొదట రచించినవే యగు నని యేర్పడుచున్నది. దశమోత్తరభాగమునఁ దత్త్వఘట్టముల నిట్టి తెనిఁగింపు కానరాకున్నను, గథాసందర్భములు పెక్కింట నాతనిశైలి నిర్వివాదముగాఁ దెలియుచున్నదిగాన నదియు మొదటఁ బోతన రచించినదే యగునని చెప్పవచ్చును. అయిన నీనాలుగింటఁ బెక్కుచోట్లఁ బోతనపదశయ్యాదులు నతని తెనిఁగింపురీతియును గానరాకున్నవి. రెం డుదాహరణముల మాత్రముఁ జూపెద.

సీ. మందారమకరంద మాధుర్యమునఁ దేలు, మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు, రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాది యై చొక్కు, కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం, బరుగునే సాంద్రనీహారములకు
గీ. నంబుజోదరదివ్యపాదారవింద, చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు, వినుతగుణశీల మాటలు వేయునేల. సప్త.
సీ. నీరదాగమమేఘనిర్యత్పయఃపాన, చాతకం బేఁగునే చౌటిపడెకుఁ
బరిపక్వమాకందఫలరసంబులు గ్రోలు, కీరంబు చనునె దుత్తూరములకు
ఘనరవాకర్ణనోత్కలికమయూరంబు, కోరునే కఠినఝిల్లీరవంబుఁ
గరికుంభపిశితసద్గ్రాసమోదితసింహ, మరుగునే శునకమాంసాభిలాషఁ
తే. బ్రవిమలాకార భవదీయపాదపద్మ, యుగసమాశ్రయనైపుణోద్యోగచిత్త
మన్యుఁ జేరునె తన కుపాస్యంబు గాఁగ, భక్తమందార దుర్భవభయవిదూర.

మ. హరినామాంకితసత్కథామృతరసవ్యాలోలుఁ డై నట్టిస
త్పురుషశ్రేష్ఠుఁ డసత్కథాలవణవాఃపూరంబుఁ దాఁ గ్రోలునే
వరమందారమరందపానకుతుకస్వాంతద్విరేఫంబు స
త్వర మై పోవునె చేఁతివేములకుఁ దద్గంధానుమోదాత్మ మై. తృతీ.
శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ వే యేటికిన్
గాథల్ మాధవశేముషీతరణిసాంగత్యంబునం గాక దు
ర్మేధన్ దాఁటఁగఁ గూడునే సుతవధూమీనోగ్రవాంఛామద
క్రోధోల్లోలవిశాలసంసృతిమహాఘోరామితాంభోనిధిన్. సప్త.
మ. ధరణీశోత్తమ నీవు కేవలసముద్యద్భక్తి ధీయుక్తి మై
వరగోవిందపదారవిందయుగభాస్వన్నావ సంధించి దు
స్తరభూరివ్యసనాకరోల్లసితదుర్దాంతోగ్రగంభీరసం
సరణాంభోధిఁ దరింపవయ్య పరమోత్సాహంబు దీపింపఁగన్. చతు.

ఇట నిర్వివాదముగాఁ బోతన్నకవిరచితము లనఁదగుసప్తమస్కంధపద్యములందుఁ గానిపించుకవనప్రౌఢిమయు, భావసుభగత్వమును, రసోత్కట్యమును, శయ్యాచాతుర్యమును దక్కినపద్యములందుఁ గానరావు. మఱియును బూర్ణముగాఁ బోతనచే రచితము లనఁబడుస్కంధములందు మఱి, నెఱి, పఱలు, మఱచు, ఎఱుఁగు, పఱచు మొదలగు శబ్దములలోనిఱకార మాఱకారముతో మాత్ర మె యతిప్రాసమైత్రి సెందియుండఁగా నీద్వితీయాదులు నాలుగింట నవి లఘురేఫముతోఁగూడ నట్టిమైత్రి సెందియున్నవి. అయినను

ఉ. పాఱఁడు లేచి దిక్కులకు బాహువు లొడ్డఁడు బంధురాజిలో...
జీరఁడు. సప్త.

క. పోరుదురు గికురు వొడుచుచుం, దూఱుదురు. దశ. పూ.

చ. విరవిర లేనియట్టిబలుశ్రీవీరుఁడు కృష్ణకుమారుఁ డొక్కచేఁ
జఱచి. దశ. పూ.

చ. మఱియొకనాఁటిరాత్రి బలకమాధవు లుజ్జ్వలవస్త్రమాలికా
ధరులును. దశ. పూ.

ఇప్పద్యంబుల నుభయరేఫమైత్రి కానిపించుచున్నది. చీఱుశబ్ద ముభయరేఫ ముగా నున్న దని కూచిమంచి-తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమునం జెప్పినాఁడు గాని యది శకటరేఫమగుట కీపోతనపద్యమునే యుదాహరించినాఁడు. పోతన దీని నుభయరేఫముగాఁ దలఁచెనేమో. పోరుశబ్దప్రయోగము ప్రమాదజనితమై యుండ వచ్చును. 'విరవిర' లఘురేఫముగానే.

చ. ఖురముల నేలఁ ద్రవ్వుచు నశ్రుకుంఠితవాలసమీరణంబులన్
విరవిరఁబోయి. దశ. పూ.

అనుసీపద్యమునఁ గానిపించుచున్నది కాని మీఁద నిందలి రేఫమును ఱకార మునకు మిత్రముగాఁ బ్రయోగించుటకు హేతువు గానరాకున్నది. పోరుశబ్దమువలెనే యిదియుఁ బ్రమాదవశముననో లేక యుభయరేఫమని తలంచియో కవి ప్రయోగించి యుండును. ఎట్టిధీమంతులకును బ్రమాదము కలుగక పోవదుగదా. 'మఱి' శబ్దము దశమపూర్వభాగాంతమున నుంటంజేసి యుత్తరభాగపూరకుం డగునితరకవిచే నుం పఁబడి యుండు నని తోఁచెడిని. ఈరెండుమూఁడుచోట్లం దప్పఁ బోతనచే పూర్ణ ముగా రచించినతక్కినస్కంధములం దెల్ల నియతముగా రేఫద్వయమునకు మైత్రి లేమిచే నీరెండుమూఁడువిరుద్ధప్రయోగములు ప్రమాదవశమునఁ గాని మతభేద మునఁ గాని వేఱుకారణముచేఁ గాని కలిగియుండు నని తలఁపవలయునే కాని వీనిని గొని పోతన యుభయరేఫమైత్రి పాటించినవాఁ డనుట యెంతమాత్రము యుక్తము కాదు.

ఇట్లు ద్వితీయాదులు నాలుగింట పెక్కుచోట్లఁ బోతనపదశయ్యాదులు లే మిచేతను, బోతన పాటింపనియుభయరేఫమైత్రి వీనియందుఁ గానిపించుటచేతను, నివి యితరకవిపూరితము లయ్యునుండవలయు నని తోఁచెడిని. అయినను బోతనపద శయ్యాదులు నతని తెనిఁగించురీతియు నందందఁ గానిపించుటంబట్టియు నాద్యంతపద్య గద్యములంబట్టియు నీనాలుగును మొదటఁ బోతనచే రచితములై నవే యగు నని యూహింపవలసియున్న దని నిరూపించియున్నాఁడను. కాఁబట్టి యివి మొదటఁ బోత నచే రచితములై, యెడనెడ నుత్సన్నములు కాఁగా నితరకవులచేఁబూరితములయ్యె నని యేర్పడుచున్నది. ఇతరకవులు వీనిని బూర్ణముగా రచించిరేని నట్లు రచించిన యితరస్కంధంబులందుంబోలె నిందును దమపేరే యుంచుకొని యుందురుగదా. ఇది యిట్లుండ వీనిని బోతనకు వెనుకఁ బూరించినవా రెవరు? నారయాదులు ముగ్గు

రా? లేక యం దొక్కరా ? మఱి వేఱొక్కరా? పండితులు నారయాదు లని మొత్తముగాఁ జెప్పియున్నారు. వ్రాఁతప్రతులందుఁ జూడఁగాఁ గొన్నిట దశమోత్తరభాగమునఁ గృష్ణవిరహోక్తిఘట్టమున 'కాటుక నెఱయంగ' అనుసీసపద్యమునాలవపాదము మొదలుకొని శిష్టభాగమును, ద్వితీయస్కంధమున బ్రహ్మ నారదునకుఁ దత్త్వోపదేశము సేయుఘట్టమున 'బహుయజ్ఞవాట' అనుపద్యము మొదలుకొని శిష్టభాగమును అనఁగాఁ జతుర్థస్కంధాంతమువఱకును, నారయకవిత్వ మని వ్రాయఁబడి యున్నది. ఈవ్రాఁతవలన నవియెల్ల నారయచేఁ బూర్ణముగా రచింపఁబడిన వని తలంపక పూర్వోక్తహేతువులంబట్టి యవ్వియెడలఁ బూరితము లని మాత్రము తెలియవలయును. ఈస్వల్పాధారముతప్ప వేఱొక్కటి కానరాదు. ఇదియును సరియైనదో కాదో నిశ్చయింపరాకున్నది. అయినను గొంతయేని నిజము లేక యిట్లు వ్రాఁతప్రతులందు వ్రాయఁబడుటకు వీ లుండదు. మఱియు నీవిషయమున ఛందోవ్యాకరణసంబంధులగుగ్రంథస్థనిదర్శనము లేవైనఁ గలవా యని శోధింపఁగా నాకుం గానఁబడినవానిని గొన్నింటి నిట వ్రాసెద.

దశమస్కంధోత్తరభాగంబునం దత్త్వఘట్టముల తెనిఁగింపు చాలవఱకు విశిష్టాద్వైతపరముగా నున్నది.

'దేవా భవదీయసంకల్పాధీనంబు లైనశరీరంబులం బ్రవేశించి యున్నజీవసమూహంబు నీకు శేషభూతం బని తెలిసి కృతార్థు లగుదురు'

'వెండియుఁ గొందఱు సచరాచరవస్తుజాతంబులకు నంతర్యామి వై సర్వంబు నీవ యగుటం దెలియలేక యనిత్యం బని విపరీతబుద్ధిం దెలియుదురు కాని కొందఱు జగద్భరితుండవు గాన జగద్వ్యాపకుండ వైననిన్నుఁ గటకమకుటకర్ణికాదివివిధభూషణభేదంబులం గనకంబు నిజస్వరూపంబు విడువక వర్తించుచందంబున జగద్వికారానుగతుండ వయ్యును నిఖిలహేయప్రత్యనీకకల్యాణగుణాత్మకుండ వై యుందు వని యాత్మవిదు లైనవారు తెలియుదురు.' 1220

'అట్టిజీవులు దేవతిర్యఙ్మనుష్యస్థావరాదిశరీరంబులు సొచ్చి యణురూపు లై యుందురు. అందును నీ వుండుదు తదంతరాత్మ వగుచు.' 1223

'సకలచేతనాచేతనాంతర్యామియైనసర్వేశ్వరుండు సర్వశబ్దవాచ్యుండు' 1203

'సకలబ్రహ్మాండనాయకుండ వైననీయందు శ్రుతులు ముఖ్యవృత్తిం బ్రవర్తించు' 1230

'మాయాత్మవిశిష్టుండ వగుచుఁ గార్యకారణాత్మకుండ వై.' 1204

ఇట జీవబహుత్వాణురూపత్వశేషత్వములు, ఈశ్వరునిజగద్వ్యాపత్వము, చిదచిద్విశిష్టత్వము, శేషిత్వము, శరీరభూతచిదచిదాత్మకత్వము, సర్వశబ్దవాచ్యత్వము, ఈశ్వరునియందు శ్రుతులముఖ్యవృత్తిత్వము మొదలగు విశిష్టాద్వైతసిద్ధాంతములు కానిపించుచున్నవి.

ఇఁక నీయుత్తరభాగంబునం గలలక్షణదోషంబులను బ్రయోగ
విశేషంబులను గొన్నింటి వ్రాసెద.

(1) సంధిదోషములు. పద్యగద్యసంఖ్య

కోసిచ్చె 724
నిఖిలావనీశ్వ రైన 1017
నిర్వాణమూ ర్తైన 1049
పిశాచప తోట 1255
ఒదిఁ గుండి 1237
ఎఱిఁగెఱిఁగి 931

(2) విశేషదోషములు.

పుత్త్రుండు జాత మైన 1282

(3) ఉకారాంతమునకు నగాగమము లేకయే కుషష్ఠి.

ఎఱుకకు. 723

(4) అవధిశబ్దము ఆద్యర్థకము.

జారుఁడు జన్మావధియును. 791
జన్మత్రయావధి 799

(5) పూఞ్ ధాతూక్త ప్రత్యయాంతము పునీతము

పునీతములు 1121
పునీతములు 1221

(6) ఋకారమునకు ఉకారతన్మిత్రములతో యతిమైత్రి.

చెలు। వాలయఁగఁ బాటించి యుద్ధకృపునకు. 665
కా। ఋనఁ దగ నర్జునుండు పవనోద్భవుఁడు. 715
మ, హోగ్రుఁ డై పట్టి తెచ్చె సాకృల్యుండు. 900
ఒనరింప మీఱి నకృవ్వటయు. 1154

మఱియు నీభాగంబునందలియాంధ్రీకరణము పెక్కుచోట్ల న్యూనముగాను భిన్నముగాను నున్నది. ఇఁకఁ ద్వితీయాదులు మూఁటను విశిష్టాద్వైతప్రతిపాదకపద్య గద్యములును మీఁదఁ జూపఁబడినదోషాదులును వ్రాసెద.

విశిష్టాద్వైతపరపద్యగద్యములు.

ద్వితీయస్కంధము.

సీ. జీవుండు భగవత్కృపావశంబునఁ జేసి
....................భగవచ్ఛరీర
తే. భూతుఁడై పారతంత్ర్యబుద్ధినొప్పి
దివ్యమాల్యానులేపన భవ్యగంధ
కలితమంగళదివ్య విగ్రహవిశిష్టుఁ
డగుచు హరిరూపమొందుటే యనఘ
ముక్తి. 269

తృతీయస్కంధము.

హేయగుణరహితుఁ డనఁగల,నాయందుల
భక్తి. 957
గురుతరానేకకల్యాణగుణవిశిష్టుఁడు. 963
మత్స్యమానాకారతం బొందు. 958

సీ॥...సకలకర్మత్యాగసరణి నొప్పి ఆత్మ
తత్త్వజ్ఞానమున మించి ....
తే॥ మహిత ఫలసంగరహితధర్మమునఁ ద
నరు, నట్టిపురుషుండు దలపోయ నఖిల
హేయ, గుణములను బాసి కల్యాణ
గుణవిశిష్టుఁ, డైనహరి నొందుఁ బర
మాత్ము ననఘుఁ డగుచు. 1026

మఱియు లీలావిభూతినిత్యవిభూతులును, లక్ష్మినిత్యానపాయినీత్వమును భగ

వత్సమాకారప్రాప్తిరూపముక్తియు, ఈశ్వరునియఖిలహేయప్రత్యనీకకల్యాణగుణవిశిష్టత్వమును, జీవునిపారతంత్ర్యభగవచ్ఛరీరభూతత్వములును ఆత్మయాథాత్మ్యజ్ఞానపూర్వకఫలాభిసంధిరహితకర్మానుష్ఠానమును నీమూఁట నందంద ప్రతిపాదితములై యున్నవి.

లక్షణదోషాదులు.

(1) సంధిదోషములు.

తృతీయస్కంధము.

కూఁ డాఁడుచుండె 106
కదిసిట్లనియెఁ 648
తలఁ చిటు 649
ఎఱిఁ గేము 785

(2) విశేషదోషములు.

తృ.

అంతర్థానుఁ డయ్యె 89

చ.

అంతర్థానుఁ డయ్యె 735

(3) నగామమురామి

ద్వి.

వ్రాతముకు 85, 203

మనువుకు 144

చ.

వనముకు 359
రాజుకు 442

(4) అవధిశబ్దము అద్యర్థకము.

క. తనజన్మావధి నిజనం|
దనులను... తృతీయ 16

(5) పూః క్త్వప్రత్యయాంతము పునీతము

తృ.

కోరి పునీతులఁ జేయు 557
సద్యఃపునీతాత్ములై 562
పునీతాకృతిన్ 575

చతుర్థ.

ఒప్పఁ బునీతముసేయ 931

(6) ఋకారమునకు ఉకారతన్మిత్రములతో యతిమైత్రి.

ద్వితీయ

ఒప్పఁగఁదగు సప్తతంతువులు. 98

తృతీయ

కావున నీవేళన త్రుంపు సజ్జన
హితోద్యోగానురక్తుండవై 672

ఒదవఁగఁ గానవచ్చుగురువుల్ 257

చతుర్థ.

ఒదవఁగ నిట్లనిరి మానవులు 99
పొడవును బంచసప్తతియోజనము 136
కావున నిలఁ బుణ్యతీర్థముల నొప్ప 931

మఱియుఁ దత్త్వఘట్టములందు నీమూఁటను మూలమునందలిశ్లోకములు పెక్కు తెనిఁగింపఁబడకున్నవి. ఇట్లు దశమోత్తరభాగమునఁ గలఛందోవ్యాకరణదోషములును, విశిష్టాద్వైతపరము లగుగద్యపద్యములును, నసమగ్రమును గొన్నియెడల భిన్నము నగునాంధ్రీకరణమును, ద్వితీయాదులు మూఁటను గానిపించుటయ కాక కవిత్వశైలియు నించుమించుగా నొక్కతీరున నుండుటంజేసియు ద్వితీయాదులు మూఁడును దశమోత్తరభాగమును బూరించినవారిచేతనే పూరితము

లై యుండు నని తోఁచెడిని. వ్రాతప్రతులందు దశమోత్తరమును బూరించినవాఁడే ద్వితీయాదులను సైతము పూరించినట్లు వ్రాయఁబడియుండుటయు నీనిర్ణయమునకుఁ గొంత దార్ఢ్యము నిచ్చుచున్నది. మఱియు గంగనసింగనలు వేఱుస్కంధములను బూర్ణముగా రచించుటకు నెత్తుకొనియుండుటవలనను వారికవనంబుల నీద్వితీయాదులు మూఁటను దశమోత్తరభాగమునను గలదోషములలోఁ బెక్కు గానిపింపమింజేసియు వారినాలుగింటిపూరణంబున సంబంధపడియుండరనుట నిజమునకు మిక్కిలి దూరము కానేరదు. కాఁబట్టి ద్వితీయాదులు నాలుగింటిని బూరించినవాఁ డొక్కండై యుండవచ్చు నని చెప్పంబోలును.

ఇది యిటుండఁ గడపటిరెండుస్కంధములకడకు మఱలి వత్తము. వీని తెనిఁగింపద్వైతపర మనుటకు నంతగా నుపపత్తిలేమియు విశిష్టాద్వైతపర మనుటకుఁ గలనిదర్శనములును ముందు తెలిపియున్నాఁడను. వీనియందును నాంధ్రీకరణ మతిన్యూనముగాను బెక్కుచోట్ల మూలమునకు భిన్నముగాను నుండుటను దెలిపితిని. నగాగమమురామి, కొనికి కాదేశము మొదలగుకొన్నిలక్షణదోషంబులును వీనియందుఁ గానిపించుచున్నవి. ఈహేతువులంబట్టి యీరెంటికిని ద్వితీయాదులు నాలుగింటికిని సామ్య మేర్పడుచున్నది. దుష్టము లగునఖండయతు లీయాఱింట నందంద యతివిరళముగాఁ బొడసూపుటయుఁ గలదు. కడపటిరెండును దఱుచుగాఁ బద్యాత్మకములు కామింజేసి వానికిని దక్కిననాలుగింటికిని ఛందోవ్యాకరణకవిత్వాదివిషయిక మగుసామ్యమును స్థిరీకరించుటకు నయితి కాదు గాని తక్కిన పోలికలంబట్టియు వ్రాతప్రతులసాక్ష్యముంబట్టియు, నేకాదశద్వాదశములను బూర్ణముగా రచించినవాఁడే, అనఁగా నారయనో, ద్వితీయాదుల మూఁటిని దశమోత్తరభాగమును నందంద పూరించియుండు ననుట యుపపన్నముగాఁ గానిపించుచున్నది.

ద్వితీయాదులు మూఁటను బోతనపదశయ్యాదులు లేనిచోట్ల సైతము తత్త్వఘట్టముల తెనిఁగింపునం దద్వైతపర మగుశ్రీధరవ్యాఖ్యానంబునందలిపదార్థాదులు కొన్ని యందంద కానిపించుచున్నవి. అయిన నది పోతనతెనిఁగింపువలె మూలమునకు మిక్కిలి సరిగాను బూర్ణముగాను లేకయు, గంగనసింగనలకవనంబుల లేనిదోషంబులు కలిగియు, నుంటంజేసి దానిని రచించినవా రాముగ్గురిలో నెవ్వరును గారు కాని, నారయనో యాస్కంధంబులలో నుత్పన్నంబులు గాక చిక్కినపోతనభాగంబు లద్వైతపరములుగా నుండుటం జూచి నడుమనడుమ విశిష్టాద్వైతపరముగాఁ దెనిఁగించుట పూర్వోత్తరవ్యాఘాతమునకుఁ బ్రసక్తి కలిగించు నని తలంచి, శ్రీధరవ్యాఖ్యానానుసారముగా శక్తికొలఁదిని దెనిఁగించియుండు ననియు, నైనను విశిష్టాద్వైతమువలనిపక్షపాతమున నందంద తద్దర్శనానుసారముగాఁ గొంత దెనిఁగించియుండు ననియుఁ దోఁచెడిని. దశమోత్తర

భాగమునఁ దత్త్వఘట్టముల నెల్ల నాతం డొక్కరుండె తెనిఁగించినట్లు తోఁచుచున్నది గాన నందుఁ బూర్వోత్తరవ్యాఘాతము ప్రసక్తింప దని తలఁచి దాని నెల్లఁ దఱుచుగా విశిష్టాద్వైతపరముగాఁ దెనిఁగించి యుండు నని యూహింపవచ్చును. అయిన నిది యూహాపోహమే కాక సిద్ధాంతము గాదు గాని శైలి మొదలైనవానిం బట్టి యాస్కంధములకుఁ గలసామ్యమే యిట్టియూహల కెడ మిచ్చియైన నవి యేకకవిపూరితములే యని సాధింపఁ జేయుచున్నది.

నారయ యెంతలాక్షణికుఁడో 'మదిలోఁ గృష్ణుఁ డెశోద' ద్వితీ. 180 'తన యాయొక్కనిశందు గోపకులు' ద్వితీ. 182 'వాక్ప్రవ్వఁగ' తృతీ. 324 నను వీనిం జూచినఁ దెలియును. ఇట్టివి పెక్కులాయాపుటలక్రిందఁ జూడవచ్చును. వీని నెల్లఁ బండితులు సొంతకవనమున సవరించి కప్పిపుచ్చిరి. 'బంగారుకొండ మూఁపర మనునొరగంట' తృతీ. 415. ఇట 'మూఁపురము'నకు 'మూఁపర' మని ప్రయోగించినాఁడు. 'రజత'మునకు 'రజిత' మని యున్నది. ఇట్లె పెక్కింటికి గ్రామ్యరూపములును గానంబడుచున్నవి. నారయశైలి కొంత పదసమాసపారుష్యమును బాదపూరణములును గలదై నిరాఘాట మగుధాటితోఁ గూడియుండును. ఒక్కయుదాహరణము:

మ. ఘనసాహస్రకిరీటరత్నవిలసత్కాంతిప్రశుద్ధచ్ఛటా
జనితోదగ్రరుచిప్రకాశితఫణాసాహస్రుఁ డౌ దేవతా
వనరక్షాచణుఁడూపకృత్యము లొగిన్ వాంఛం బ్రశంసించి వా
రనురాగస్ఖలితోక్తు లొప్ప నడుగన్ హర్షించి యా దేవుఁడున్. తృతీయ.

మూలమునందలికటుపదరచనల నట్లె తెనుఁగున నుంచుటయు నీకవియందుఁ గానఁబడుచున్నది. 'పురుకృచ్ఛ్రోత్థవేపథుః' అనుదానిని 'పురుకృచ్ఛ్రోత్థవేపథుండై' యని తెనిఁగించి యున్నాఁడు. 'వాచీశతంత్ర్యా ముగుదామ్ని బద్ధాః' అనుదానిని 'కర్తృబద్ధులై' అని తెనిఁగించినపోతనరచనాసౌకుమార్యముం గనుఁడు.

ఇట్లు నేను బరిశోధింపఁగా నాకుఁ గానంబడినవిషయముల నెత్తి వ్రాసినాఁడను. నాయభిప్రాయములకుఁ గలహేతువుల నెల్లఁ దెలిపి యున్నాఁడను. అయినను సిద్ధాంతముసేయుటకు నాధారము లింకను గావలసియున్నవి. చరిత్రాద్యాధారములు లేక కేవలగ్రంథస్థనిదర్శనములంబట్టి చేసిననిర్ణయములందుఁ బొరపాటు లుండక పోవు. ఆంధ్రభాషాభిమానమాననీయు లగుపండితులు సత్యకాంక్షతో నట్టియాధారముల నాకుఁ దెలిపి యేతచ్చర్చావిషయమును మఱింతనిర్వివాదముగా నిర్ణయించుటకు సాయపడుదురు గాక యని కోరుచున్నాఁడను.

తం. తేవప్పెరుమాళ్లయ్య.

ఉపోద్ఘాతము.

శ్రీమత్పరమయోగలబ్ధసిద్ధు లగుయోగీంద్రుల కేనియు దురూహ మైనయీ ప్రపంచమున నిత్యంబు జననమరణాది క్లేశసాగరంబునఁ దొప్పఁదోఁగుచు దరిఁ జేర వెరవు గానక దురపిల్లుచుఁ బెల్లలయుజనులదెసం గరుణార్ద్రచిత్తుఁడై నారాయణాంశసంజనితుం డయి చతుర్వేదవిభాగ మొనరించి వేదవ్యాసుండు నాఁ బేరెన్నిక గన్నకృష్ణద్వైపాయనమునీంద్రుండు గీర్వాణభాషం దొల్లి యెల్లధర్మముల నొప్పారిన పురాణజాతమును మహాభారతేతిహాసంబును సర్వభూతహితంబు గోరి రచియించి యుండె. అవి రచియించియుఁ "దనహృదయంబు సంతసింపకున్న సరస్వతీతటంబున నొంటి నుండి హేతువు వితర్కించుచుఁ దనలో"

"ఆత్మ సంతస మంద దాత్మలో నీశుండు సంతసింపక యున్నజాడ దోఁచె
హరికి యోగివరుల కభిలషితం బైన
భాగవతవిధంబుఁ బలుకనైతి
మోస మయ్యెఁ దెలివి యొనయదు మఱచితి
ననుచు వగచు చున్నయవసరమున"

నారదుఁ డరుదెంచి విష్ణుకథలఁ బొలుపారెడుభాగవతపురాణమును రచియింపు మని బోధించిన నమ్మెయి నమ్మహామునీంద్రుం డతిప్రౌఢం బగుకవితారీతి మెఱయ శ్రీవిష్ణుదేవునిలీలల విలసిల్లునీభాగవతంబును రచియించి కృతార్థుం డయ్యె. అప్పురాణజాతంబులలోఁ బ్రకల్పితంబు లగుగుణనామరూపాదుల ననుసరించి కేవలైకుం డగుసర్వేశ్వరుండు కొన్నిచోటుల శివుం డనియుఁ గొన్నియిక్కల విష్ణుం డనియుఁ గొన్నితావుల బ్రహ్మ యనియు నింకం బలుచందంబుల నభివర్ణితుండై యున్నవాఁడు. ఇక్కరణిం బెక్కుతెఱంగులఁ బరమేశ్వరు నభివర్ణించుట యద్దేవదేవునిలీలామహిమంబు లెల్లజనులకుఁ దేటపఱుపఁగాని మానవు లొండొరులతో నితండు మాదైవ మతండు మీదైవము మాదైవం బెక్కువ మీదైవంబు తక్కువ యని వాదులాడుకొనుచు నొకళ్లొకళ్లయెడ బద్ధమత్సరులై పరస్పరనిందలు మాత్రమ కాక స్వత్వపరత్వభ్రాంతిని దైవదూషణంబుఁ జేయుచుండఁ గోరి కాదు. ఆయామూర్తులవిశేషంబులు వర్ణింపఁబడుచో నిర్వచనసౌలభ్యంబు నవలంబించి యాయామూర్తులు పృథగ్దేవతలుగఁ జెప్పఁబడియున్నవారుగాని యప్పగిదిని నిక్కముగఁ బరస్పరభిన్నులుగఁ బరిగణితులు గారు. వేదములయందును నీరీతినె సర్వకారణం బగుపరబ్రహ్మ మనేకభంగుల నెన్నఁబడియున్నది. ఇందులకుఁ బ్రమాణములు:—

"ఏకోవశీసర్వభూతాంతరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి
త మాత్మస్థం యేనుపశ్యంతి ధీరా స్తేషాం సుఖం శాశ్వత న్నేతరేషాం"
"ఏకోదేవ స్సర్వభూతేషు గూఢ స్సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా
కర్మాధ్యక్ష స్సర్వభూతాధివాస స్సాక్షీ చేతా కేవలో నిర్గుణ శ్చ
"ఏకో నారాయణో నద్వితీయోస్తి కశ్చిత్"
"ఏకఏవ శివో నిత్య స్తతోన్యత్సకలం మృషా"
"బహునాత్ర కిముక్తేన సర్వం బ్రహ్మమయం జగత్
అనేకభేదభిన్న స్తు క్రీడతే పరమేశ్వరః"

ఇత్యాద్యనేక ప్రమాణంబు లనంతంబు లామ్నాయంబులను బురాణేతిహాస స్మృతులనుం గానంబడియెడి. పురాణంబులలోఁ గొన్నింట శివోత్కర్షంబును గొన్నింట విష్ణుప్రాశస్త్యంబును మఱికొన్నింట నితరదేవతాప్రాముఖ్యంబును నుగ్గడింపఁబడి యున్నవి. ఆయామూర్తివిశేషంబు లుగ్గడించుచో జనులకు భక్త్యతిశయంబు పనుపడుటకును జిత్తైకాగ్ర్యం బలవడుటకును దత్తద్దేవతాప్రాశస్త్యంబును నితరదేవతలం గ్రిందుపఱుచుటయుం జెప్పఁబడియున్నవి కాని యంతలోనన యవ్వానియందు భేదబుద్ధి పాటించుట పోలదు. అట్లు విష్ణూత్కర్షంబు ప్రతిపాదింపఁబడినపురాణములలో నగ్రగణ్యము శ్రీమహాభాగవతము. ఇందుఁ గేవలహరిలీలలు మాత్రము కాక విగళితవేద్యాంతర మగుపరతత్త్వస్వరూపము నిరూపింపఁబడి యున్నది. అయినను నిది గీర్వాణభాషయం దతిప్రౌఢశైలిని వ్రాయఁబడియున్నందునఁ బ్రాకృతజనుల కెంతయు దురవగాహం బై యుండును.

బమ్మెరపోతనామాత్యుఁడు.

ఇప్పురాణరత్నంబు నాంధ్రదేశీయులకుఁ దేటతెల్లగఁ దెలుపఁ గోరి బమ్మెరపోతనామాత్యుండు దీనిని గద్యపద్యాత్మకంబుగ నాంధ్రీకరించి శాశ్వతం బగుయశస్సంపద లనుభవించుచున్నవాఁడు. ఇక్కవిశిఖామణివృత్తాంతంబును గవితాశైలి తెఱంగును గొండొక వివరించెదము.

బమ్మెరపోతనామాత్యుండు కడపమండలములో నున్న*యేకశిలానగర మను నామాంతరము గలయొంటిమిట్టయం దుండినవాఁడు. అమాత్యశబ్దమువలన నీతఁడు నియోగిబ్రాహ్మణుఁ డని యూహింపవలయు. ఇతఁడు కౌండిన్యసగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. కేసనమంత్రికిని లక్కమాంబకును బుత్త్రుఁడు. మల్లనకవివరునిజనకుఁడు. ఇతఁడు జీవించియుండినకాలమును నిర్ణయించుటకుఁ గొన్నియాధారములు గానంబడియెడి. "బమ్మెరపోతనామాత్యుని జన్మకర్మప్రభావాదులఁ దెలిపెడువచన

*ప్రతాపరుద్రదేవునిరాజ్యమునఁ బ్రధానపట్టణ మగునోరుగల్లునకును నేకశిలానగర మని నామాంతరమున్నట్లు ప్రతాపరుద్రీయమువలనను నతనిశాసనములవలనను గెలియవచ్చుచున్నది. కావున బమ్మెరపోతన యం దుండినవాఁడా యని యొకసందియము వొడమెడి. అది నిక్కమయేని నితఁ డొంటిమిట్టయం దుండె ననుసర్వజనులవ్యవహారమునకు హేతువుండదు గావున నిట్లే యిక్కడ వ్రాయఁబడియె.

రూపం బగుప్రాచీనపండితజనలిఖితగ్రంథంబు''వలన శాలివాహనశకము ౧౩౦౦-వ సంవత్సరమున నిక్కవికుంజరుండు జనన మొందిన ట్లాంధ్ర భాగవతము నింతకుమునుపు ముద్రించినవారు తత్పీఠికయందు వ్రాసియున్నారు. బమ్మెరపోతన భోగినీదండకమును రచియించి వేంకటగిరిసంస్థానాధీశ్వరుండును బండితజనాగ్రగణ్యుండు నగుసర్వజ్ఞ సింగమహీపాలునకుఁ గృతియిచ్చిన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది:—

"పండితకీర్తనీయుఁ డగుబమ్మెరపోతన యీసుధాంశుమా
ర్తండకులాచలాంబునిధితారక మై విలసిల్ల భోగినీ
దండకముం రచించె బహుదానవిహర్తకు రావుసింగభూ
మండలభర్తకు న్విమతమానవనాథమదాపహర్తకున్."

ఇట్లు కృతియిచ్చుటవలన వీరిరువురు సమకాలికు లనుట స్పష్టము. సర్వజ్ఞసింగభూపతి హూణశకము "౧౪౨౨-వ సంవత్సరము మొదలుకొని ౧౪౪౬-వ సంవత్సరమువఱకును విజయనగరాధీశ్వరుఁడుగానున్న ప్రౌఢదేవరాయనితో సమకాలికుఁ"* డని తెలియుచున్నది. కావున బమ్మెరపోతరా జిప్పటి కించుమించుగ నన్నూటయేఁబది సంవత్సరములకుఁ బూర్వ ముండినట్లు నిశ్చయింపవలసియున్నది.

ఇతఁడు పుట్టిననాఁటంగోలె నాంధ్రకవులలో నెవ్వరు ననుభవింపనిమహాదారిద్ర్యము ననుభవించుచుండెను. నన్నయభట్టు తనకవిత్వసంపదను రాజమహేంద్రవరాధీశుం డగురాజనరేంద్రుని కొసఁగి యతనియాస్థానపండితుఁడై లేమిడి నెఱుంగక కాలము గడపెను. తిక్కనసోమయాజి నెల్లూరుప్రభు వగుమనుమసిద్ధిరాజు నాశ్రయించి యతనిచే నపరిమితధనంబులు ననేకాగ్రహారంబులుం గొని యజ్ఞముసేసి ధనవంతుఁడై యుండెను. ఎఱ్ఱాప్రెగ్గడ యనవేమారెడ్డియాస్థానకవీశ్వరుఁడై యుండి లెస్సగా బ్రదికెను. భాస్కరుఁడు సాహిణిమారనవలన ధనము గ్రహించి జీవించెను. పోతనబావమఱఁది యగు శ్రీనాథుఁడు రెడ్లకుఁ గృతుల నొసంగి యష్టైశ్వర్య సంపద లనుభవించె ననుట తెల్లము. ఈవలఁ గృష్ణదేవరాయనియాస్థానంబున నష్టదిగ్గజము లని పేర్కొనంబడినయల్లసానిపెద్దనాదు లెట్టిమహోన్నతదశయం దుండి రనుట లోకవిదితము. తక్కుంగలయాంధ్రకవు లందఱు నెవరినే నొక్కభూపతి నాశ్రయించి ధనికులైనవా రయిరి కాని బమ్మెరపోతనమాత్రము నిష్పచ్చరంబునఁ దొప్పఁదోఁగుచుండినను నరపతులను వినుతింప నిచ్చగింపక కేవలకృషిమాత్రజీవనోపాయుం డై తనకాలము నంతయుఁ గడఁద్రోసెను. తననరస్తుతివైముఖ్యంబునుగూర్చి బమ్మెరపోతనయే భాగవతప్రథమస్కంధమున నిట్లని చెప్పికొనియున్నాఁడు:—

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులుం
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరముఁ బాసి కాలుచే
సమ్మెటవాటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్"

* బ్ర. శ్రీ. వీరేశలింగముపంతులవారి ఆంధ్రకవులచరిత్రము రెండవకూర్పు పుట ౨౫

ఇతఁడు చిన్నటినాఁటఁ బసుల మేపుటకయి తనయూ రగు నొంటిమిట్టచేరువ నున్నయొకనగరంబున సంచరించుచుండ నతనిపురాకృతసుకృతపరిపాకంబునఁ జిదానందయోగీంద్రుం డనుఋషిచంద్రుండు దయాసాంద్రుం డై యతనికట్టెదుటఁ బొడసూపి యతనిభక్తికి మెచ్చి యతనికి నిఖిలసంసృతిదురితతారకం బగుతారకమంత్రం బుపదేశించి చనియె. అంతఁ బోతనకుఁ గ్రమంబుగ నమ్మంత్రరాజమననంబున శ్రీరామానుగ్రహంబు పెంపున ననర్గళం బగుసహృదయహృదయంగమకవితాశక్తిపొడమఁ దనగురువృద్ధబుధబంధుజనులయభ్యర్థనంబున శ్రీభాగవతంబు నాంధ్రీకరింప సమకట్టె. అట్లు తలంపుగొని యరవిందనయనచరణారవిందంబులు డెందంబునం దిరంబుగ నెలకొలిపి యొకసోమోపరాగపుణ్యకాలంబున గంగానదికిం జని క్రుంకు లిడి ప్రాఁగన్నువెట్టి హరిచరణంబులు ధ్యానించుచున్నెడ శ్రీరామమూర్తి యతనికిఁ బ్రత్యక్షంబై నీవు "మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెలుంగు సేయుము నీకు భవబంధంబులు దెగు"నని యానతిచ్చి తిరోహితుం డయ్యె. అంతఁ బోతన పరమానందభరితుండై మగిడి తనయూరికిఁ జనుదెంచి శ్రీభాగవతమును సరసవచనరచనావైదగ్ధ్యము మెఱయ నాంధ్రీకరించి కరంబుఁ దిరంబగుయశంబు సంపాదించె.

ఇతండు భాగవతమును శ్రీరామభద్రునానతిమెయిఁ దదంకితముగ నాశ్వాసాద్యంతపద్యంబులలో శ్రీరామచంద్రుని వినుతించి యున్నవాఁడుగాని కథాప్రారంభసమయమున "నాచిత్తమునశ్రీరామచంద్రునిసన్నిధానంబు గల్పించుకొని" యని నుడివి "హరికి నందగోకుల........" మొదలగు నాలుగుషష్ఠ్యంతపద్యములచేఁ గృష్ణునిమూర్తిం గీర్తించి యతనికి సమర్పితముగా భాగవతంబు నాంధ్రంబున రచియించెద నని వ్రాసియున్నాఁడు. కేవలమూర్తిభేదమునూత్ర మగుటం జేసి యిట్లు ధ్యానించియుండనోపు. ఇతఁడు "పరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర" యని గద్యము వ్రాసినయునికి చూడ నితఁడు శివభక్తుఁ డనియుం దెలియుచున్నది. ఇతఁడు కేవలశైవగ్రంథ మగు "వీరభద్రవిజయము"ను రచియించి యున్నట్లు దెలియవచ్చెడి. సర్వోపనిషదర్థవిదుం డగునిమ్మహాత్మునికి శివవిష్ణుభేదబుద్ధి సుంతేని యుండనోపునా?

ఇమ్మహాకవిభక్తిగౌరవమును బ్రభావవిశేషమును దెలుపుకొన్నికథలు పురాతనవిద్వజ్జనపారంపర్యమున మనము వినుచున్నాము. ఇక్కాలపువారు కొందఱవి కేవలకల్పితకథ లనియు నిక్కములు గానోప వనియుఁ బరిహసింతురు. మఱియుఁ గొందఱు వానిని బ్రవృత్తములుగానేభావించి వీనిం గొనియాడుదురు. అవి విశ్వాసార్హము లైనను గాకున్నను సకలపండితపామరజనరంజకములుగా నుండుటకు సందియము లేదు గావున వానిలోఁ గొన్నింటి నిట వివరించుచున్నాము:—

(౧) పోతన తృతీయస్కంధమున వరాహావతారఘట్టమును రచియించుచుండఁగ నొకనాఁడు భాగవతమునకుఁ దన్నుఁ గృతిపతిఁగాఁ జేయకొల్లనికతమున నతనిఁ బట్టి కట్టి తెమ్మని కర్ణాటాధీశ్వరుఁ డంపినభటులు వచ్చి యతనిని బాధింపఁదొడఁగి రనియు

నపు డమ్మహాభాగవతుఁడు హరిచరణధ్యానముచేయుచుఁ జలింపకున్న విష్ణువు శ్వేతవరాహరూపంబున నచ్చోటఁ దోఁతెంచి వారిం దఱిమిపాఱఁదోలెననియువినవయ్యెడి.

(౨) పోతన యష్టమస్కంధమున గజేంద్రమోక్షణకథను వ్రాయుచు "నల వైకుంఠపురంబులో నగరిలో" నని వ్రాసి యావలఁదోఁపక లేచియెటకేనియుం బోయె ననియు నతఁడింట లేనప్పుడు శ్రీకృష్ణస్వామి పోతనరూపమునఁదనయగారముసొత్తెంచి తనయ గారవమొప్పఁ బిలిచి పొత్తము దెమ్మని యం దాపద్యములో "నామూల సౌధంబుదాపల" నని వ్రాసి మగిడి యరుదెంతునని చెప్పి చనియె ననియుఁ బదంపడి పోతరాజు సనుదెంచి యనుఁగుఁగూఁతుచే గ్రంథముఁ దెప్పించి యందు వ్రాసియున్న పైభాగంబుఁ గని యిదియెవ్వరు వ్రాసిరని కూఁతునడుగుటయు నాచిన్నది నీవింతకు మున్నె వచ్చి వ్రాసి చని యిప్పు డిమ్మెయి నడుగుట యేలొకో యని చెప్పఁగా విని యోహో భగవంతుఁడగుశ్రీహరి యవ్యాజకటాక్షంబున నిట్లు చేసియుండవలయు నని నిశ్చయించి విష్ణుమూర్తిని సందర్శింపఁ గలిగినతనయభాగ్యంబుఁ బొగడి తన యభాగ్యంబుఁ దెగడి సంతాపముఁ బొంది యావలిభాగము వ్రాయ దొరఁకొనె ననియుఁ జెప్పుదురు.

(3) పోతన దశమస్కంధమున రుక్మిణీకల్యాణము వ్రాయునెడ "దేవకీసుతు కోర్కితీవెలు వీడంగ" ననుపద్యమున రుక్మిణీయౌవనావిర్భావవర్ణనము సేయుచు "హరికిఁ బ్రేమబంధ మధికంబుగాఁ గేశబంధ మధిక మగుచు జాల కమరె" నని వ్రాయఁగా నంతలోన నతనికూఁతురు కుంపటిలోఁ బడి కమరె ననియుఁ "బద్మనయనువలనఁ బ్రమదంబు నిండార" నని వెంబడినె వ్రాయ నామె యయ్యాపద దొలఁగి సుఖించె ననియు మఱియొకకథఁ జెప్పుదురు.

(౪) ఈకవీశ్వరునికి సకలవిద్యాసనాథుఁడగుశ్రీనాథుఁడు బావమఱఁది యని యందురు. వీరిరువురు సమకాలికు లగుటకెంతమాత్రము సందియములేదు. ఎట్లనఁగా భోగినీదండకమువలన బమ్మెరపోతరాజు వేంకటగిరిరాజయినసర్వసింగమహీపాలునికాలమువాఁ డనుట తెల్లము. శ్రీనాథుఁడు నాభూనాథునికాలమున నుండె ననుటకు నొకనిదర్శనము గలదు. శ్రీనాథుఁ డాంధ్రదేశమునం గలసకలధరణీపతుల సభలకునుబోయి తనకవిత్వాతిశయమును బ్రకటించి యందఱిచే మన్ననలును బిరుదులును ధనములును బడసి వేంకటగిరికిఁ జనుదెంచి సమస్తవిద్యలయందును నిరుపమవైదుష్యంబు గలిగి సర్వజ్ఞుం డని పేర్కొనఁబడినరావుసింగభూపతిని సందర్శింపఁ గడఁగి యతనిసభ కేఁగుటకుము న్నతఁడు త న్నేమేమి యడుగునో యెక్కడఁ దప్పులు పట్టునో యని తలఁకి

సీ. "దీనారటంకాలఁ దీర్థ మాడించితి దక్షిణాధీశుముత్యాలశాలఁ
బలుకుఁదోడై తాంధ్రభాషామహాకావ్యనైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టుకంచుఢక్కఁ
జంద్రశేఖరక్రియాశక్తిరాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుద

మెటులు మెప్పించెదో నన్ను నింకమీఁద
రావు సింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొని యుండి నీవు
సరససద్గుణనికురుంబ శారదాంబ"

యని చెప్పి చింతామణిమంత్రరాజమునఁ దనకుఁ బ్రసన్నురాలైనసరస్వతీదేవిని సంస్తుతించి యమ్మేదినీనాయకుపేరోలగమునకుఁ జనియెనఁట.

శ్రీనాథుఁడు తనబావ సుతసతీయుతుఁడై మహాదారిద్ర్యము ననుభవించుటం గని యుత్తలంపడుచిత్తంబుతో నతని నెట్టులైన నొప్పించి భాగవతమును గర్ణాటాధీశ్వరున కంకితము సేయించి ధనవంతుఁ గావింప నెంచి దారిద్ర్యదుఃఖ మతనికిఁ బెక్కు మడుంగు లెక్కుడుగాఁ దోఁపఁగోరి యొక్కనాఁడు చతురంతయానాధిరూఢుఁడై పెక్కండ్రు పరిజనులు పరివేష్టించి రాఁ బయనమై యొంటిమిట్టచేరువఁ జనుదెంచుచుండి పోతన తనపొలములోఁ గూర్చుండి తనయుండగుమల్లనచే దున్నించుచుండఁ గని తనమహత్త్వమును దెలుపఁగోరి శ్రీనాథుఁడు పల్లకి మోయువాండ్రలో ముందటిదండెను మోయువారిని బల్లకిని విడిచిపెట్టుఁడని యానతిచ్చె ననియుఁ బల్లకి యెప్పటియట్ల నడచుచుండెననియు మల్లన యీచిత్రమును దండ్రికిఁ జూప నతఁడు నాఁగటికాఁడికిఁ గట్టినయొకయెద్దును విడువు మని యాజ్ఞాపింపఁగా మడక యథాప్రకారము సాగుచుండె ననియు శ్రీనాథుఁడు పల్లకి యావలిప్రక్క మోయువారినింగూడ వదలుండనఁగాఁ బల్లకి మోఁతగాండ్రు లేకయే నడచుచుండఁ గని పోతనయుఁ గాఁడియందలి రెండవయెద్దును విడిపించి దుక్కి సాగించె ననియు నంతట శ్రీనాథుఁడు పల్లకి డిగి బావచెంత కేతెంచి హాలికు లగుమీకుఁ గుశలమా యని యుల్లస మాడె ననియు దానక్

* ఉ. "బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకం
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై"

యని కినిసి పోతన పొడిచి చెప్పె ననియు నంత శ్రీనాథుఁ డతనిం గవుంగిట గ్రుచ్చి బావా వేడుకకై మేల మాడిన నలుగనగునా యని యతని ననునయించి

క. "కమ్మనిగ్రంథం బొక్కటి
యిమ్మగ నేన్నృపతి కైనఁ గృతి యిచ్చినచోఁ
గొమ్మని యియ్యరె వెయ్యా
రిమ్మహి దున్నంగ నేల యిట్టిమహాత్మల్"

అని సరస్తవనం బగుకవనంబు సేయ నియ్యకొలుపుచు నందఱుం గలసి యింటి కేఁగె ననియు నింట వంటపదార్థము లేమియు లేమిని మల్లన నెటకేనియు నప్పుగొని తేరఁ

---

* ఉ. "బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకం
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకన్న మేలుగా
హాలికులైన నేమి మఱి యంతకును న్వగలేక యున్నఁ గొ
ద్దాలికులైన నేమి నిజదారసుతాదికపోషణార్థమై" అని పాఠాంతరము.

బంచి యతండు విఫలమనోరథుండై మగిడి చనుదెంచుచుఁ బోతన యింటికిని నేఁ డెప్పగిది నోగిరం బిడువాఁడ నని కొండొకవడి యలందురి యెట్టకేలకు దిట్టతనంబు దెచ్చికొని మఱందిని దక్కుంగలవారిని జలకమాడి రాఁ బనిచి సరస్వతీదేవిని బరమ భక్తియుక్తుండై ధ్యానింప నద్దేవి యతనికిఁ బొడసూపి బానసము శుద్ధిచేయించి యచట నొక తెర కట్టింప నాజ్ఞాపించి యతం డట్లు కావింప నేఁ జూచికొనియెద నీ వింక వగవ వలదని యూఱడించె ననియు నంత శ్రీనాథుఁడు కృతావగాహుండై తనవారినెల్లఁదోడ్కొని గీమునకు మఱలి వచ్చి యచ్చట సువారపుంబను లేవియు జరుగకుండుట కబ్బురపడి భుజియింప నందఱు వరుసలుదీరి కూర్చుండ భగినిం బిలిచి యక్కా యింకఁ దడయ నేల వడ్డింపు మనవుడు నాసాధ్వి తెరమాటుననుండి భారతీదేవి పంచభక్ష్య పరమాన్నములతోఁ జతుర్విధాహారములు నించినపాత్రంబు లందియ్యఁ దెచ్చి తెచ్చి యందఱికిని వలయునంత వడ్డించి శ్రీనాథాదుల నాశ్చర్యరససాగరతరంగపరంపరాప్లావితచిత్తులఁ గావించెననియు భోజనోత్తరంబునఁ దాంబూలచర్వణములు సలుపుతఱి శ్రీనాథుఁడు తనబావ దెస నుపలక్షించి కవిశ్రేష్ఠుండవగు నీ కిట్టిమహాదారిద్ర్యమనుభవింప నేల? నీవు రచించుభాగవతమును నేరాజునకయిన నంకితముసేసి వలయునంతధనము సంపాదించి సుఖవృత్తి నుండుమా. పారలౌకికసుఖంబుమీఁదియాశచే నైహలౌకిక సౌఖ్యంబును నిరాకరించి యిడుములఁ బడి బడల నేల యని బోధించి యతనిడెందముఁ గరఁగింప నంతలో వాణి యతనియెదుట నిలిచి వలవల నేడువఁగాఁ బోతన

ఉ. కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చె దో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్మ భారతీ"

యనుపద్యముఁ జెప్పి సరస్వతి ననునయించె ననియు నంతట శ్రీనాథుఁడు పోతనభాగవతముం దెప్పించి దాని నక్కడక్కడఁ బరిశీలించుచు నష్టమస్కంధంబున గజేంద్రమోక్షణకథాప్రసంగంబున నేనుంగును మొసలివాతివలన విడిపింపఁ గరుణ వొడమి విష్ణువు వైకుంఠము నిర్గమించుచో

మ. "సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తఁడు వివాదప్రోద్ధతశ్రీకుచో
పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహి యై"

యని యేసన్నాహమును లేక దిగ్గన లేచి పఱతెంచె నని యుండఁ గని బావా భక్తుని శత్రువును జంపఁబోయినవిష్ణువు పరికరములు లేక వేడుకచూడఁ బోయెనా? కాకున్న నేమి సేయఁ బోయె నిట్లు చెప్పుట పోల దని యాక్షేపించె ననియు దానికిఁ బోతన యపు డేమియు నుత్తరం బియ్యక యిన్నకుండి మఱునాఁడు శ్రీనాథుఁడు మస్తకమున మానియ నిడి రాచుకొనుచుండుసమయమున నతనికుమారు నెక్కడనో దాఁచి

వచ్చి పోతన పెరటినూతిలో నొకపెనుఱాతిం బడవైచి యల్లన వచ్చి మఱందిం గని నీకొడుకు బావిలోఁ బడియె ననుటయు శ్రీనాథుండు గుండె జల్లుమన దిగ్గన లేచి విరియఁబోసికొనినవెండ్రుకలతోఁ గాఱుచున్ననూనియతో వికళితం బగునల్పపరిధానంబుతో నవ్వాపిచెంతకుఁ బరుగెత్తి తొంగితొంగి యందుఁ జూచుచు నాక్రందనము సేయుచుండఁ బోతన వెనువెంటం బఱతెంచి శ్రీనాథా యిదియేమియవసరము? నిచ్చెనయెక్కడ? త్రాళ్లెక్కడ? బావిలోదిగుటకు భటులెక్కడ? ఈయొడలినూనియఁ గడిగికొని జలకమాడి కేశజాలము ముడిచి యూరికి బైటఁబోయి యున్నపరివారము నెల్లఁ బిలుచుకొని వలసినయుపకరణావళి యెల్ల సంతరించుకొనికదా రావలయు. అట్లు గాక యిక్కరణి వేడుకఁ జూడవచ్చితివా కాకున్న నీవు నంపఁ బడ వచ్చితివా యని పరిహాసముచేసి నీవు పుత్త్రవాత్సల్యమున నేరీతి నాతురముతోఁ బరికరములు లేకయే పరువిడివచ్చితివో యాచాడ్పుననే పరమేశ్వరుఁడును దనభక్తులదెసం గలవాత్సల్యాతిరేకంబున భక్తునిమొఱ చెవి సోఁకగానే తటాలున లేచి యుపకరణావళిం దడవక పరువిడి యరుదెంచె నని సమాధానము చెప్పె ననియు నీకథ లూరూరను బహుపండితపామరజనపరంపరాముఖముగ వినుచున్నాము.

పై వివరించినకథలు నిజములో కేవలకల్పితములో మిశ్రములో నిశ్చయింపఁ జాలము. వీనిం జదువువారు తమతమయుక్తికొలఁదిని భక్తికొలఁదిని నూహించుకొనవచ్చును.

పోతరాజు భాగవతము సమగ్రముగాఁ దెనిఁగించి నిరంతరహరిహరపదధ్యానైకతానమానసుం డై విశాలయశోలతల కాలవాలం బై నెగడి శాశ్వతం బగుతన పేరుం దనగ్రంథముతో నీలోకమున నిలిపి నశ్వరం బగుకాయంబు దొఱఁగి పరమపదమున కరిగె.

గ్రంథపాతవివేచనము.

ఇమ్మహాకవి భాగవతమును దెలిఁగించి దానిని లోకమునఁ బ్రకటింపక తాళపత్త్రసంపుటమున లిఖించి పదిలముగా దేవతార్చనపేటికయం దుంచి పూజించుచు వచ్చి నిర్యాణకాలంబునఁ దనకుమారుఁ డగుమల్లనం బిలిచి మందసము నతనికిఁ జూపి యందున్నధనమును జతనమునఁ గాపాడు మని యాజ్ఞాపించి పంచత్వముఁ బొందె ననియుఁ దదనంతరము మల్లన దానిని విప్పి పరిశోధింపఁగా నం దనేకభాగములు శాణానామకక్రిమికులదష్టంబై నష్టంబై యుండినందునఁ బోతరాజశిష్యుం డగువెలిగందలనారయకవి కొంతభాగమును నేర్చూరిసింగన కొంతభాగమును గంగరాజు మఱి కొంతభాగమును మఱలఁ దెనిఁగించిరనియుఁ గొందఱు చెప్పుచున్నారు. మఱికొందఱు సర్వజ్ఞభూపతి బమ్మెరపోతనం బిలిపించి భాగవతమునకుఁ దన్నుఁగృతిపతిగా నొనర్పు మని వేఁడి యతఁ డియ్యకొనమికిఁ గోపించి యన్నరపాలుఁడు భూమిలో నొకపెనుఁబల్లము ద్రవ్వించియం దాగ్రంథమును బూడ్పించెననియు నంతఁగొంతకాలమునకాతేని

పత్రికలలో శ్రీరామమూర్తి సాక్షాత్కరించి యాసద్గ్రంథమును బైటఁ దీయించి జగంబునఁ బ్రకటింప మగనిఁ బ్రోత్సాహపఱుపు మని యానతిచ్చి యంతర్ధానము నొందె ననియు నాయమ వేఁడికోలు నంగీకరించి సింగనృపాలుఁడు పుస్తకమును బైటఁ దీయింప నం దక్కడక్కడఁ దాటాకులఁ బలుదెఱఁగులపురుగులు తిని పెక్కుచోట్లు శిథిలములై యుండెననియు నంతటఁ బోతనశిష్యవర్గములోనివా రగు వెలిగందలనారాయణాదులు నష్టభాగములను బూరించి రనియుఁ జెప్పుచున్నారు. ఈహేతువునే కూచిమంచితిమ్మకవి "సర్వలక్షణసారసంగ్రహము"నందు

సీ. "ఘనుఁడు పోతనమంత్రియును భాగవతము రచించి చక్రికి సమర్పించు నెడల
సర్వజ్ఞసింగమక్ష్మావరుం డది తన కిమ్మని వేఁడఁగా నీయకున్న
నలిగి యాపుస్తకం బవనిఁ బాఁతించినఁ జివికి యం దొకకొంత శిథిల మయ్యెఁ
గ్రమ్మఱ నది వెలిగందల నారప్పరాజును మఱి బొప్పరాజు గంగ
రాజు మొదలగు కవివరుల్ తేజ మెసఁగఁ
జెప్పి రాగ్రంథములయందె తప్పు లొదవెఁ
గాని పోతకవీంద్రుని కవితయందు
లక్షణం బెందుఁ దప్పునా దక్షహరణ!'

యని చెప్పియున్నాఁడు.

వీనిలో నేకారణము నిజ మయినను బోతరాజకృతభాగవతమున నక్కడక్కడఁ గొన్నిభాగము లుత్సన్నము లగుటయు వానిని నారయాదులు పూరించుటయు స్పష్టము. కాని యేయేభాగములు పోతనవిరచితములో యేయేభాగము లితరకవులు చెప్పిరో వాని నిర్దేశించుటకుఁ దగిన యాధారము లంతగాఁ గానము. ద్వితీయస్కంధములో బ్రహ్మనారదునకుఁ దత్త్వోపదేశంబు సేయుఘట్టమునఁ "బశుయజ్ఞవాటయూపస్తంభపాత్రమృద్ఘటశరావవసంతకాలములను" ననుసీసపద్యము మొదలుకొని "వెలిగందలనారయ చెప్పినకవిత్వ" మని పూర్వముద్రితభాగవతమునందు ముద్రింపఁబడియున్నది. ద్వితీయస్కంధమున గద్యముం జూడఁగాఁ బోతనామాత్యరచితంబని యే యున్నది. తృతీయచతుర్థస్కంధములును "బోతనామాత్యప్రణీతం" బని యే యున్నది. పంచమస్కంధాంతగద్యమున గంగనార్యప్రణీతంబనియు, షష్ఠంబున నేర్చూరిసింగనార్యవిరచిత మనియు నున్నవి. ఈసింగన, "ఏర్చూరిశాసనుం" డగు నెఱ్ఱాప్రెగ్గడకు మనుమఁ డని యాస్కంధంబునఁ దొలుతఁ జెప్పికొనియున్నాఁడు. సప్తమాష్టమనవమస్కంధములును దశమస్కంధపూర్వభాగమును బోతనామాత్యప్రణీతము లని యున్నది. దశమస్కంధోత్తరభాగమున శ్రీకృష్ణుఁడు కేళీగృహమునందు రుక్మిణీదేవితో విరసోక్తు లాడుట యనుఘట్టమునఁ "గాటుక నెఱయంగఁ గన్నీరు వఱదలై" యనుసీసపద్యము మొదలు వెలిగందల నారాయణకవివిరచిత మని ప్రాచీనపండితజనలిఖితపుస్తకములందుఁ జెప్పఁబడియున్నదని పూర్వముద్రితగ్రంథపీఠికయందు వ్రాయఁబడియున్నది. ఏకాదశద్వాదశస్కంధములగద్యములలో నారాయణాఖ్యప్రణీత మని యున్నది.

ఇవి మాత్రమే కాక పోతనామాత్యవిరచితము లని గద్యము లున్నస్కంధములలో నేయేచోటుల నేయేపద్యముల నేయేకవు లెంతెంతభాగము వ్రాసిరో యెఱుంగరాదు. శైలిభేదములవలనఁ గొంతకొంత యూహింపవచ్చుఁ గాని యిదమిత్థ మని నిర్ణయము సేయ సాధ్యము గాదు.

శైలి లోనగువానింగూర్చి యిఁకఁ బ్రశంసింతము.

ఈమహాకవీశ్వరునికవిత్వ మతిసుకుమారసరసవచనరచనాధారేయ మై నాతికఠిన మై శబ్దార్థాలంకారశోభమాన మై కోవిదపామరజనహృదయంగమ మై వీనులవిం దై చదువువారి కమందానందంబు గలిగించును. చదువుచుండఁగానే యర్థమును గోచరం బగుటచేఁ బోతనరచన కేవలద్రాక్షాపాకము. తెలుఁగుఁ గోమలసురుచిరపదసముదయసంకలిత మగుట నీగ్రంథమునఁ గైశికీవృత్తియె ప్రధానము. ఓజఃప్రసాదమాధుర్యాదికావ్యగుణంబులు పోతనకవనంబున మెండుగాఁ గానఁబడుచుండును. రసానుగుణంబుగ శైలి నుచితరీతుల మార్చి రసపోషణంబు సేయుటయందుఁ బోతన యెంతయుసమర్థుఁడు. శృంగారరసపోషితభక్తిరసము పోతనకవనమున విలసిల్లుకైవడి నితరాంధ్రగ్రంథములయం దెక్కడను గానము. కేవలశృంగారరసమును భక్తిరసమును నెందఱోఁ గవులు వర్ణించియున్నారుగాని భక్తిరసమునకు సకలజనరంజనంబుపొంటె శృంగారరసంబు నంగంబుగ నంగీకరించి యెల్లరయుల్లంబుల హరిభక్తి నివ్వటిల్లి పల్లవింప నిట్లు చిత్రముగా వర్ణించినకవు లెవ్వరును లేరు. సగుణవర్ణనావైదగ్ధ్యంబునఁ బోతనతోఁ దులఁదూఁగువారు లేరు. ఇతనికిఁ గలహరిభక్తి యంతయు నచ్చుపడ శ్రీవిష్ణుదేవునిలీలామాహాత్మ్యంబులు పరిపరివిధములఁ దనయావచ్ఛక్తిని వినియోగించి మనోహరలీలల వర్ణించియున్నవాఁడు గావున నెట్టివారికేని భాగవతమును జదువ దేహము పులకాంకిత మగును. సప్తమస్కంధమునఁ బ్రహ్లాదచరిత్ర ప్రస్తావమున హరిభక్తి వర్ణింపఁబడియున్నరీతి యెంతయు నవాఙ్మానసగోచరము. అది చదువఁజదువ మనంబు భగవంతునిపాదారవిందయుగళంబున లయించుటయ కాక పోతనామాత్యునివర్ణనాచాతుర్యంబును నీశ్వరభక్తియు నింత యొప్పునే యని డెందమున నిబ్బరంపుటబ్బురంబును గదిరెడి.

కేవలశృంగారరసమున కష్టమస్కంధంబున మోహిన్యవతారవర్ణనంబును దశమస్కంధమున గోపికాకృష్ణవిలాసములును వీరరౌద్రరసములకు సప్తమస్కంధమున శ్రీనృసింహావతారఘట్టంబును నుదాహరణంబులు. ఇట్లక్కడక్కడ నాయారసముల కుదాహరణము లూహించుకొనునది. మహాకావ్యలక్షణము లగు

క. "పురసింధునగర్త్వినశశి
సరసీవనమధురతిప్రసంగవిరహముల్
పరిణయతనయోదయనయ
విరచనయాత్రాజిదూత్యవిభువర్ణనముల్"

అనువీనిలోఁ బెక్కులక్షణములు భాగవతమున నక్కడక్కడ మనోజ్ఞముగా వర్ణింపఁబడి యున్నవి.

అనేకవిధము లగుశబ్దాలంకారములలో నంత్యప్రాసనియమంబును నీకవి విచ్చలవిడి ప్రయోగించియున్నాఁడు. ఈశబ్దాలంకారము పోతనకవిత్వమునందు వెలయుమనోజ్ఞభంగి నితరకవులరచనల నెక్కడనుం గానరాదు. ఇందుల కుదాహరణములు సూచించెదము.

క. "కనియె న్నారదుఁ డంతన్
వినయైకవిలాసు, నిగమవిభజనవిద్యా
జనితోల్లాసున్, భవదుః
ఖనిరాసున్, గురుమనోవికాసున్ వ్యాసున్."

ప్రథమస్కంధము.

మ. "కనియెం గృష్ణుఁడు సాధునీరము, మహాగంభీరముం, బద్మకో
కనదాస్వాదవినోదమోదమదభృంగద్వంద్వఘుంకారమున్,
ఘనకల్లోలలతావితానవిహరత్కాదంబకోలాహల
స్వనవిస్ఫారము, మందవాయుజకణాసారంబుఁ గాసారమున్."

దశమస్కంధము.

ఇక్కడ సమాసాంత్యవర్ణము లెల్ల నొక్కటియగుట నంత్యప్రాసనియమంబు నాఁబడు. ఇట్టియంత్యనియమచిత్రములు గలపద్యంబులు పోతనకవిత్వములో లెక్కకు మిగిలినవై యున్నవి. ఇవి ప్రయోగించునపుడు తఱుచుగాఁ గ్రియాపదమును బద్యముతొలుత నుంచి వెంబడి నాక్రియతో నన్వయించువిశేష్యపదమున కనేకవిశేషణములు చెప్పి యావిశేష్యముతోఁ బద్యమును ముగించుచున్నాఁడు గావున నివి యెంతయు హృద్యములుగా నుండును. "కనియె" ననిపద్యారంభమునఁ గ్రియయుండెనేని నంత్యనియమ మవశ్య మందున్నదని గో యూహింపవచ్చు. ఈయలంకారవిశేషము పోతనకవిత్వములోఁ బ్రతిఘట్టమునఁ గానఁబడుచున్నను శ్రీరామభక్తాగ్రేసరుఁ డగుటంజేసి నవమస్కంధమున రామావతారకథాప్రసంగంబున ననేకపద్యముల నీశబ్దచిత్రములతో నతిమనోహరంబుగ విరచించియున్నవాఁడు. శ్రీరామదేవునికిఁ బరమభక్తుండుగావున రామాయణమునే తెనింగింపఁ దనకుఁ గోరికి యగ్గలంబనియు నైనను దద్గ్రంథ మంతకుఁబూర్వమే భాస్కరాదులచేఁ దెనిఁగింపబడియుండుటచే దానినే మగుడఁ దా రచియించుట చర్వితచర్వణం బనియుఁ "బదిరెను భాస్కరుఁడు లేదా రామాయణమును బండ్ల కెక్కింపనా" యనియుఁ జెప్పి పోతన విషాదపడి యది మాను కొని భాగవతముఁ దెనిఁగింపఁ బూనె ననియుఁ బెద్దలు వ్యవహరింతురు. ఈశబ్దాలంకారఫక్కి నితఁడు భాస్కరరామాయణంబున సంగ్రహించియుండనోపుననితోఁచెడి.

ఉ. "పాటితదుష్టసత్త్వవసవాటక, నిర్ధబలావరుద్ధశ్శృం
గాటక, గ్రంథిలభ్రుకుటిగాఢలలాటకఁ, గ్రూరతారకా
నాటక, నాంత్రకాంచిపరిణద్ధశవప్రపతత్కిరీచ్ఛటా

కీటక, రక్తసిక్తపటుఘోటకఁ దాటకఁ గాంచి రయ్యెడన్"

భాస్కరరామాయణము-బాలకాండము.

మ. "సవరక్షార్థము తండ్రి వంపఁ జని విశ్వామిత్రుఁడుం దోడ రా
నవలీలం దునుమాడె రాముఁ డదయుం డై బాలుఁ డై కుంతల
చ్ఛవిసంపజ్జితహాటకం, గపటభాషావిస్ఫురన్నాటక
జవభిన్నార్యమఘోటకం, గరవిరాజత్ఖేటకం దాటకన్."

భాగవతము-నవమస్కంధము.

ఉ. "పుణ్యచరిత్రుఁ డత్రిమునిపుంగవు వీడ్కొని రాముఁ డంచితా
గణ్యగుణాభిరాముఁ డుపకంఠమునం జని కాంచె దండకా
రణ్యము సిద్ధసంయమివిరాజితచారుతపోనుజాతస
త్పుణ్యము, నిర్మలాంబువరపుష్కరపూర్ణసరోవరేణ్యమున్."

భాస్కరరామాయణము - అరణ్యకాండము.

ఉ. "పుణ్యుఁడు రామచంద్రుఁ డటఁ బోయి ముదమ్మునఁ గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమశరణ్యము, నుద్ధతబర్హిబర్హలా
వణ్యము, గౌతమీవిమలవాఃకణపర్యటనప్రభూతసా
ద్గుణ్యము, నుల్లసత్తరునికుంజవరేణ్యము సత్యగణ్యమున్."

భాగవతము - నవమస్కంధము.

ఎఱ్ఱాప్రగడయు నీయలంకారమును బ్రయోగించియున్నాఁడు.

క. "ధీమంతు లంతఁ గాంచిరి
గోమంతము విపినకుసుమకుంచితశబరీ
సీమంతము నిర్ఝరకణ
హేమంతముఁ గనకమయమహీమంతంబున్."

హరివంశము,ఉత్తరభాగము. ఆ. ౧

క. "చారుశరీరద్యుతిజిత
శారదనీరదుఁడు ధీవిశారదుఁడు భవో
త్తారకుఁ డాశ్రితవితతికి
నారదుఁడు తదీయగృహమునకు నేతెంచెన్."

ఆ. ౬.

ఇయ్యలంకారవిశేషమును బోతన నానావిధచిత్రగతుల వీనులవిందుగా రచియించియున్నవాఁడు.

క. "భూషణములు సెవులకు నఘ
పేషణములు మృత్యుచిత్తభీషణములు హృ
త్తోషణములు కల్యాణవి
శేషణములు హరిగుణోపచితభాషణముల్."

క. "పావనములు దురితలతా
లావనములు నిత్యమంగళప్రాభవసం
జీవనములు లక్ష్మీసం
భావనములు వాసుదేవపదసేవనముల్."

ప్రథమస్కంధము.

క. "మంతనములు సద్గతులకుఁ
బొంతనములు ఘనము లైనపుణ్యముల కిదా
సీంతనపూర్వమహోఘని
కృంతనములు రామనామకృతచింతనముల్."

నవమస్కంధము.

క. "ధృతి చెడి లోఁబడె మల్లం
డతులితభవజలధితరికి హతరిపుపురికిన్
హితకరికిన్ ధృతగిరికిం
దతహరిరవభరితశిఖరిదరికిన్ హరికిన్."

దశమస్కంధము.

క. "స్ఫురితవిబుధజనముఖములు
పరివిదళితదనుజనివహపతితనుముఖముల్
గురురుచిజితశిఖిశిఖములు
నరహరికరనఖము లమరు నతజనసఖముల్."

గీర్వాణపదలఘుభూయిష్ఠము - సప్తమస్కంధము.

క. "అడిగెద నని కడువడిఁ జను
నడిగినఁ దను మగుడ నుడువఁ డని నడ యుడుగున్
వెడవెడ సిడిముడిఁ దడఁబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడు గిడునెడలన్."

ఆంధ్రపదలఘుభూయిష్ఠము, అష్టమస్కంధము.

ఇట్లు కర్ణామృతము లగుపద్యములు పెక్కుచోట్లఁ గానఁబడుచున్నవి. వెనుకటిమధ్యకాలపుఁగవు లందఱుఁ బోతరాజుమార్గము నూఁతగాఁ గొని తమ "పరిణయముల"తో శబ్దచిత్రంబులఁ బెల్లుగాఁ బ్రయోగించియున్నారు.

పోతన యీరీతిని శబ్దచిత్రములకు విశేషముగాఁ జొచ్చినను నర్థాలంకారముల నొప్పరికింపక ప్రసంగము పొసంగినపుడెల్ల ననేకవిధము లగునర్థాలంకారము లుదాహరించియున్నవాఁడు. వానిలో శ్లేషానుప్రాణితాభేదాధ్యవసాయంబు నితఁడు భట్టబాణుఁడు కాదంబరియందుఁబోలెఁ గడుదీర్ఘము లగువచనములయందుఁ బ్రయోగించియున్నాఁడు. కథారంభముననే నైమిశారణ్యవర్ణనావచనము నవమస్కంధమున గంగానదీవర్ణనావచనము లోనగువానిఁ జూడ నియ్యలంకారమునందుఁ గవికిఁ గలప్రేమ తెల్ల మగు.

క. "కొందఱకిఁ దెనుఁగు గుణ మగుఁ
గొందఱకిని సంస్కృతంబు గుణ మగు రెండుం
గొందఱకి గుణము లగు నే
నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్."

అని పోతనయుపోద్ఘాతమునఁ జెప్పి తత్ప్రతిజ్ఞానుసారంబుగఁ గొన్నిచోటులఁ గేవలాంధ్రపదరచనలును గొన్నియెడల శుద్ధగీర్వాణరచనలుం గావించెఁ గాని లెస్సగాఁ బరిశీలించిన గ్రంథమునఁ దెనుఁగుకంటె సంస్కృతమే యెక్కుడయి గోచరించును. అష్టమస్కంధమున స్వర్గవర్ణనావచనపూర్వభాగంబును దశమస్కంధపూర్వభాగ

మునఁ గృష్ణావతారబాల్యక్రీడాదివర్ణనంబులునునాస్కంధంబుననే ఋతువర్ణనాదుల నొప్పారు పెక్కువచనములును నాంధ్రపదభూయిష్ఠము లై యుండును గాని గీర్వాణరచనలే యీగ్రంథంబున బహుళము లై కన్పట్టుచున్నవి.

పోతన యాశ్వాసాంతగద్యమునందలి "సహజపాండిత్య" యను బిరుదుం జూడ నితండు గురువులనాశ్రయించి విద్య నభ్యసింపక స్వయముగాఁ గష్టించి గ్రంథములు చదివి పాండిత్యము సంపాదించె నని యెన్నవలసియున్నది. సహజపాండిత్యుఁ డైనను బోతనకుఁ గలసహజం బగునుభయభాషాప్రావీణ్యంబును బదప్రయోగనైపుణ్యంబును నసాధారణము లై యెసఁగు. భాగవతమునఁ గానవచ్చునొకకొన్ని వ్యాకరణాదిస్ఖాలిత్యముల కిమ్మహాకవీశ్వరుఁడు గురుముఖమున విద్యాభ్యాసము సేయమియే కారణ మని కొందఱందురుగాని యది యట్లనియే నిర్ణయింపనవకాశము కానరాదు. పోతరాజుకవనంబున నిన్నిసులక్షణప్రయోగములును నిట్టిపాండితీమహిమయుఁ జూపట్టుచుండఁగా నొకటిరెండువ్యాకరణభ్రంశములును బొడసూపినయెడల వానికిఁ జిరకాలలేఖనపరంపరాజనితవ్యత్యాసములో, గ్రంథపాతంబున నితరకవిజనపూరణములో, మఱియేవో కారణము లై యుండనోపు నని యూహింపవచ్చును. పోతనకుఁ గేవలగ్రంథవిలోడనజనితవైదుష్యముమాత్రమే కాక సర్వతోముఖం బగు లోకానుభవజ్ఞానంబును గలిమికిఁ దద్రచనయం దనేకభాగములు నిదర్శనము లై యున్నవి. దశమస్కంధపూర్వభాగమునందలి రాసక్రీడాభివర్ణనావచనముం జూడ నిక్కవిశ్రేష్ఠునకుఁ గలభరతశాస్త్రప్రౌఢిమయు, హావభావాద్యభినయవర్ణనాపాటవంబును, వెల్లడియగు. దశమస్కంధముననే శ్రీకృష్ణునిశైశవక్రీడాప్రసంగంబున జలక్రీడాభివర్ణనంబునుఁ జలిది గుడుచుకథయు, నాలమేపులీలయుఁ, గ్రేపుమొదవులవిలాసములును గోదోహనప్రకారములును మఱియు ననేకవిషయములును హృదయానురంజకము లగుస్వభావోక్తులఁ బొలుపార వర్ణింపఁబడి యునికిఁ జూడఁ జూడ నితనిప్రపంచజ్ఞానము తెఱం గెఱుంగనగు.

పోతనశైలికిని నన్నయ తిక్కనయెఱ్ఱన లోనగువారిశైలికిని భేదములు గానవచ్చుచున్నవి. వారికవిత్వమున వ్యాకరణప్రయోగప్రౌఢిమయు, నన్వయకాఠిన్యంబును, నాంధ్రపదబాహుళ్యంబును మెండు. పోతనకవనంబున నన్వయసౌలభ్యంబును, బదసౌకుమార్యంబును, శబ్దార్థాలంకారాదిచిత్రంబులును మెండు. కవిత్రయము వారిపద్యములలోఁ దఱుచుగా యతిప్రాసములపట్టులఁ బృథక్పదములు లేక సంధిగతాక్షరములఁగాని పదమధ్యాక్షరములఁగాని ప్రాసవిశ్రమములు ఘటిల్లఁ బాదపాదమునకు నిలిపి చదువ నెంతయు ననువుగాక యతిప్రౌఢముగా నుండును. పోతనపద్యములలోఁ దఱుచుగాఁ బ్రతిపాదాంతముననువిశ్రమస్థానంబులను బదములు ముగింపఁబడి శయ్యావైచిత్ర్యముల నొప్పి పామరులకును జదువ సులభము లై సరళము లై శ్రావ్యము లై యుండును. ఈభేదములఁ దెలుపుటకై సమానవిషయవర్ణనలు గల

కొన్నిపద్యములు రెండుగ్రంథములనుండి యెత్తి క్రింద వ్రాయుచున్నాము.

మాలిని. "ఏచి తలిర్చి తనర్చినక్రోవుల నిమ్మగుతావులజొంపములం
బూచినమంచియశోకములన్ సురపొన్నలఁ బొన్నలఁ గేదఁగులం
గాచి బెడంగుగఁ బండినయాసహకారములం గదళీతతులం
జూచుచు వీనుల కింపెసఁగన్ వినుచున్ శుకకోకిలసుస్వరముల్."

కవిరాజవిరాజితము. "చనిచని ముందట నాజ్యహవిర్హుతసౌరభధూమలతాతతులం
బెనఁగినమ్రాఁకులకొమ్మలమీఁద నపేతలతాంతము లై నను బా
యనిమధుపప్రకరంబులఁ జూచి జనాధిపుఁ డంత నెఱింగెఁ దపో
వన మిది యల్లదె దివ్యమునీంద్రనివాసము దా నగు నంచు నెదన్."

సీ. "శ్రవణసుఖంబుగా సామగానంబులు చదివెడుశుకములచదువు దగిలి
కదలక వినుచుండు కరులయుఁ గరికరశీతలచ్ఛాయఁ దచ్చీకరాంబు
కణములచల్లనిగాడ్పాసపడి వానిఁ జెంది సుఖంబున్నసింహములయు
భూసురప్రవరులు భూతబలుల్ దెచ్చి పెట్టు నీవారాన్నపిండతతులు
గడఁగి భక్షింప నొక్కటఁ గలసియాడు
చున్నయెలుకల పిల్లల యొండు సహజ
వైరసత్త్వంబులయు సహవాస మపుడు
చూచి మునిశక్తి కెంతయుఁ జోద్య మంది."

భారతము ఆదిపర్వము ఆ-౪-కణ్వమహామున్యాశ్రమవర్ణనము.

భాగవతమున

ఉ. "అందుఁ దమాలసాలవకుళార్జుననింబకదంబపాటలీ
చందననారికేళఘనసారశిరీషలవంగలుంగమా
కందకుచందనక్రముకకాంచనబిల్వకపిత్థమల్లికా
కుందమధూకమంజుళనికుంజములం దనరారి వెండియున్."

క. "పరిపక్వఫలభరానత
తరుశాఖానికరనివసితస్ఫుటవిహగో
త్కరబహుకోలాహలరవ
భరితదిగంతములు గలిగి భవ్యం బగుచున్."

క. "అతినిశితచంచుదళన
క్షతనిర్గతపక్వఫలరసప్రాశనమో
దితరాజశుకవచోర్థ
శ్రుతిఘోషము చెలఁగు శ్రవణసుఖదం బగుచున్."

క. "లలితసహకారపల్లవ
కలితాస్వాదనకషాయకంఠవిరాజ
త్కలకంఠపంచమస్వర
కలనాదము లుల్లసిల్లఁ గడురమ్యము లై."

క. "అతులతమాలమహీజ
ప్రతతీక్షణజాతజలదపరిశంకాంగీ
కృతతాండవఖేలనవిల
సితపింఛవిభాసిబాలశిఖిసేవ్యం బై."

తృతీయస్కంధము - కర్దమాశ్రమవర్ణనము.

క. “సుకుమారుఁ డతఁడు గోపా
లకవృత్తి వహించి యడవులం గ్రుమ్మరుచు
న్నిక్కి నాక కాదు పగవా
రికి నైనఁ దలంప మన మెరియదే వగలన్.”

భారతము - విరాటపర్వము.

క. “వికచముఖుఁ డగుచు శాత్రవు
లకు హితు లగునట్టివారలం గని భూపా
లకుఁ డెద కత్తెరయును నా
లుక బెల్లము నై కలయఁ బలుకఁ గావలయున్.”

శాంతిపర్వము.

ఈపద్యములతోఁ బై వ్రాసినభాగవతపద్యములను బోల్చిచూడ ఛందోవిషయిక మగుభేదము గోచరించును.

భాగవతమునఁ గొన్నిచోటుల రేఫఱకారములు ప్రాసవిశ్రమములయందు మైత్రిఁ జెందుచుంటం గని కాకునూరియప్పకవి తన యప్పకవీయములో

ఉ. “బమ్మెరపోతరాజకృతభాగవతంబు సలక్షణంబు గా
కిమ్మహి నేమిటం గొదవ యెంతయు నారసిచూడఁగాను రే
ఫమ్ములు ఱాలునుం గలిసి ప్రాసము లైనకతంబునం గదా
యిమ్ముల నాదిలాక్షణికు లెల్లరు మాని రుదాహరింపఁగన్.”

అని వ్రాసి పోతనకవిత్వములో నుభయరేఫసాంకర్యదోషము గన్పట్టుచున్న దని చెప్పియున్నాఁడు. చక్కఁగ విచారింపఁగా నీసాంకర్యము భాగవతమునఁ గొన్నిచోటులఁ గానఁబడుచున్నను నాదోషము పోతనదియా యితరకవులదియా యనివిచారింప వలసి యున్నది. ఆంధ్రకవులలో నొకపక్షమువా రీభేదమును బాటించినవారును నింకొకపక్షమువారు దీనిని బాటింపనివారును నై యున్నవారు. ఈమతద్వితయములో నేది ప్రశస్తమో యేది యవలంబనీయమో యేయేకవు లేయేపక్షమువారో వీని నెల్ల నుపోద్ఘాతవిస్తరభీతిచే నిటఁ జర్చింపఁబూనుకొనము. పోతనరచనయం దీమైత్రి యున్నదా యనునంశముమాత్ర మిచ్చట విచార్యము.

కూచిమంచితిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమునం దీవిషయమై కొండొక విచారించి పోతనరచనయం దీమైత్రి గానరామి కుదాహరణములు వ్రాసి

ఆ-వె. “కాకునూరియప్పకవి యహోబలపతి
ముద్దరాజురామముఖ్యు లెల్లఁ
బోతరాజుకబ్బమున ఱాలు రేఫలు
గదిసె నంచుఁ జెప్పి రది హుళిక్కి.”

యని సిద్ధాంతీకరించియున్నాఁడు. దీనిని స్థాపింపఁ బోతన వ్రాసినభాగములు “ప్రథమస్కంధము, ద్వితీయస్కంధమునఁ గొంతయు, షష్ఠసప్తమాష్టమనవమంబులును దశమపూర్వభాగములోనికొంతయును నై” యున్న వని చెప్పి వానిలో నీదోషము లేకుంట

ఋదాహరణములు వ్రాసియున్నాఁడు. అయినను షష్ఠస్కంధము సింగనార్యప్రణీత మని యాస్కంధమునం దాద్యంతపద్యములవలనఁ దెలియవచ్చెడి. పయివాక్యము నందలి "షష్ఠ" యనుపదము ప్రక్షిప్తముగాఁ బడియున్నదేమో, ఉభయ రేఫమైత్రి లేమికిఁ దిమ్మకవి వ్రాసినయుదాహరణములలోఁ గొన్నిటిని వెండియుం గొన్నింటిని నిందు వ్రాయుచున్నాము.

ఉ. "మాఱువడంగ లేనియసమర్థుల సుప్తుల నస్త్రవిద్యలం
దేఱనిపిన్నపాపల వధించె నిషిద్ధపుఁ గ్రూరకర్ముఁ డై
పాఱుఁడె వీఁడు పాతకుఁడు ప్రాణభయంబున వెచ్చనూర్చుచుం
బాఱెడి వీనిఁ గావుము కృపామతి నర్జున పాపవర్జనా."

చ. "వెఱచినవాని దైన్యమున వేఁదుఱు నొందినవాని నిద్రమై
మఱచినవాని సౌఖ్యముగ మద్యముఁ ద్రావినవాని భగ్నుఁ డై
పఱచినవాని సాధుజడభావమువానిని గావు మంచు వా
చఱచినవానిఁ గామినులఁ జంపుట ధర్మము గాదు ఫల్గునా."

ప్రథమస్కంధము.

ఉ. ఱెక్కలు రావు పిల్లలకు ఱేపటినుండియు మేఁత గానమిం......"

సప్తమస్కంధము.

మ. "ఊఱుకుం గుంభయుగంబుపై హరిక్రియన్ హుమ్మంచుఁ బాదమ్ములం
దిఱుకుం గంఠము వెన్ను దన్ను నెగయున్ హేలాగతి న్వాలముం
జఱచు న్నుగ్గుగఁ దాఁకు ముంచు మునుఁగున్ శల్యంబులున్ దంతముల్
విఱుఁగన్ వ్రేయుచుఁ బొంచి పొంచి కదియున్ వేదండయూథోత్తమున్."

క. "ఎఱుఁగుదుఁ దెఱవా యిప్పుడు
మఱవను సకలంబు నన్ను మఱచినయెడలన్
మఱతు నని యెఱిఁగి మొఱఁగక
మఱవక మొఱయిడిరయేని మఱి యన్యములన్."

క. "ఒఱ పగునురమును బిఱుఁదును
నెఱిదోఁకయు ముఖము సిరియు నిర్మలఖురముల్
కుఱుచచెవులుఁ దెలిగన్నులుఁ
దఱు చగుకంఠంబుఁ జూడఁ దగు నాహరికిన్."

ఆ-వె. "చావు లేనిమందు చక్కన మన కబ్బె
ననుచుఁ గడవ యసురు లడఁచికొనిన
వెఱచి సురలు హరికి మొఱలు వెట్టిరి సుధా
పూర్ణఘటము పోయెఁ బోయె ననుచు."

ఆ-వె. "వాలుఁగంటివాఁడివాలారుఁజూపుల
శూలి ధైర్య మెల్లఁ గోలుపోయి
తఱలి యెఱుక లేక మఱచె గుణంబుల
నాలి మఱచె నిజగణాలి మఱచె."

క. "వెఱచుచు వంగుచు వ్రాలుచు
వఱిముఱి గుబురులకుఁ జనుచు హరి హరి యనుచున్

మఱుఁగుచు నులుకుచు దిఱదిఱఁ
గుఱుమట్టపుఁ బొట్టివడుగు కొంత నటించెన్."

మ. "నెఱి నెల్లప్పుడు నిల్చి ప్రాణిచయము న్నిర్మించి నిర్మించి వీఁ
పిఱియ న్నీల్గుచు నావులించుచు నజుం డీసృష్టియు న్మాని మే
నొఱగన్ జెప్పలు మూసి కేల్దలగడై యుండంగ నిద్రించుచుం
గుఱువెట్టం దొడఁగెం గలల్ గనుచు నుద్ఘోషించుచున్ భూవరా."

క. "కుఱుగఱులు వలుఁదమీసలుఁ
జిఱుదోఁకయుఁ బసిఁడియొడలు సిరి గలపొడలున్
నెఱిమొగము నొక్కకొమ్మును
మిఱుచూపులు గలిగి విభుఁడు మీనం బయ్యెన్."

క. "పెఱవాఁడు గురుఁ డటంచును
గొఱ గానిపదంబు నూపఁ గుజనుండును నీ
నెఱత్రోవ నడవ నేర్చిన
నఱమఱ లేనట్టిపదము నందు దయాబ్ధీ."

మ. "ఉఱు కంభోనిధి రోసి వేదములకుయ్యెం దైన్యముం జూచి వే
గఱు లల్లార్చి ముఖంబు సాఁచి బలువీఁకం దోఁక సారించి మే
న్మెఱయం దౌడలు దీటి మీస లదరన్ మీనాకృతి న్విష్ణుఁ డ
క్కఱటిం దాఁకి వధించె ముష్టిదళితగ్రావున్ హయగ్రీవునిన్."

అష్టమస్కంధము.

మ. "తెఱవా నీపలుకట్ల యౌ వినుము లే దేవోత్తమాహ్వానముల్
మొఱఁగం బోలునె వేల్పులం బడయుటల్ మోఘంబులే నీకు నీ
తఱిగర్భం బగుఁ బుత్త్రుఁడుం గలుగు నీతారుణ్యముం బూజ్య మా
వెఱవం గార్యము లేదు సిగ్గు దగునే వ్రీడావినమ్రాననా."

నవమస్కంధము.

క. "మఱియును దనుజుఁడు రామునిఁ
గఱవన్ గమకించి తెఱపి గానక యతనిం
జుఱచుఱఁ జూచుచు శౌర్యముఁ
బఱివోవఁగ నంత నింతఁ బదములఁ దన్నెన్."

క. "కఱచి పిఱుతివక మఱియును
వెఱవక నిజవదనజనితవిషదహనశిఖల్
మెఱయఁ దననిడుదయొడలిని
నెఱి హరిఁ బెనఁగొనియె భుజగనివహపతి వడిన్."

చ. "వెఱమఱ లేనిమేటి బలువీరుఁడు కృష్ణకుమారుఁ డొక్కచేఁ
జఱచి ఖగేంద్రుచందమునఁ జక్కనిదౌడలఁ బట్టి కన్నులం
జొఱచొఱ దుర్విషానలము జొబ్బిలుచుండఁగ నొత్తి లీలతో
జిఱజిఱఁ ద్రిప్పివైచెఁ బరిశేషితదర్పముఁ గ్రూరసర్పమున్."

క. "అఱువదినాలుగువిద్యలు
నఱువదినాలుగుదినంబులంతన వారల్
నెఱవాదులై నకతమున
నెఱి నొక్కొకనాఁటివినికి నేర్చిరి లేశా.

చ. "ఎఱుఁగుదు మేము నిన్ను వనజేక్షణుమిత్రుఁడ వీవు కూరిమి
న్మెఱయుచుఁ దల్లిదండ్రులకు మే లెఱిఁగింపఁ బ్రియుండు వంపఁగా
వఱలెడుభక్తి వచ్చితివి వారల నైన మనంబులోపలన్
మఱవఁడు శౌరి మేలు మఱి మాన్యులు రాజున కెవ్వ రిచ్చటన్."

మ. "కఱపించెన్ ఫణికోటిచే లతికలం గట్టించి గంగానది
న్నెఱిఁ ద్రోపించె విషాన్వితాన్న మొసఁగెన్ నిద్రారతిం జెంది యే
మఱియుండం బొడిపించె నాయుధములన్ మత్పుత్త్రిలం దేమియున్
గొఱగాఁ డీధృతరాష్ట్రసూనుఁడు మహాక్రూరుండు కార్యంబునన్."

దశమస్కంధము.

ఇట్లు పై పద్యములు నింక ననేకములును బోతనరచితభాగములలోఁ గేవల శకటరేఫప్రాసముల కుదాహరణములుగాఁ గానఁబడుచుండుటఁ జేసి రేఫఱకారభేద మును బోతన లెస్సగా నెఱిఁగినవాఁ డనియు నుభయరేఫములమైత్రి కూడ దనుట యే పోతనామాత్యునిమత మనియు నూహింపవలయు ననుట స్పష్టము.
వెలిగందలనారయాములు రేఫఱకారములఁ గలిపినందుల కుదాహరణములు:—

చ. "హరిఁ బరమాత్ము నచ్యుతు ననంతునిఁ జిత్తములోఁ దలంచి సు
స్థిరత విశోకసౌఖ్యములఁ జెందినధీనిధు లన్యకృత్యముల్
మఱచియుఁ జేయ నొల్లరు తలంచిన నట్టిద యౌ సురేంద్రుఁడుం
బరువడి నూయి ద్రవ్వెడునిపానఖనిత్రము మానుకైవడిన్."

ద్వితీయస్కంధము.

క. *"మఱియును ఋష్యాశ్రమ వన
సరిదుపవననదపుళిందజనపదగిరిగ
హ్వర గోష్ఠ యజ్ఞశాలా
పుర దేవాయతన పుణ్యభూములయందున్."

మ. "తెఱఁ గొప్పన్ జననీవియోగమునఁ గుంతీస్తన్యపానంబు సో
దరసంరక్షయుఁ గల్గ దేవవిభువక్త్రస్థామృతంబున్ ఖగే
శ్వరుఁ డర్థిం గయికొన్నమాడ్కిఁ గురువంశశ్రేణి నిర్జించి త
ద్ధరణీరాజ్యముఁ గొన్నమాద్రికొడుకుల్ ధన్యాత్ములే యుద్ధవా."

క. "ధర శునకభోగ్యమును నిహ
పరదూరము నైన తను వుపాదేయముగా
నెఱి నమ్మి వస్త్రమాల్యా
భరణంబు లలంకరించుపామరజనులన్."

క. "పరఁగఁగ దర్పోద్ధతు లి
ద్దఱు కొడుకులు నీకుఁ బుట్టి ధరణికి వ్రేఁగై
నిరతము బుధజనపీడా
పరులై వర్తింతు రాత్మబలగర్వమునన్."

---

* "మఱి" యనుశబ్దములోని ఱకారము ప్రాసస్థానమందుండి రేఫముతోఁ బ్రాసమైత్రి నొందునట్టిపద్యములు తృతీయచతుర్థస్కంధముల ననేకము లున్నవి.

క. "వరుణునిబలములు దనుజే
శ్వరుతేజముఁ దేఱిచూడఁ జాలక శౌర్య
స్ఫురణము చెడి యెందేనియుఁ
బఱచెం దజ్జలధిమధ్యభాగమునందున్."

తృతీయస్కంధము.

క. "పరిపూర్ణం బగుభక్తిని
గర మనిశము సంశయాత్మకం బై చాలన్
వఱలినహృదయగ్రంథిని
నిరసించువిరక్తియుతమనీష జనించెన్."

చ. "హరిభజనీయమార్గనియతాత్మకు లై భవదీయమూర్తిపై
వఱలినభక్తియుక్తు లగువారలసంగతి గల్గఁ జేయు స
త్పురుషసుసంగతిన్ వ్యసనదుర్భరసాగర మప్రయత్నతన్
సరసభవత్కథామృతరసంబున మత్తుఁడ నై తరించెదన్."

చ. "నిరతముఁ దావకీనభజనీయపదాబ్జసుగంధలబ్ధి నె
వ్వరిమది పొందఁగాఁ గలుగు వారలు తత్ప్రియమర్త్యదేహమున్
గరము తదీయదారసుతకామసుహృద్గృహబంధువర్గమున్
మఱతురు విశ్వతోముఖ రమాహృదయేశ ముకుంద మాధవా."

చతుర్థస్కంధము.

చ. "కరువలిఁ బాయు వస్త్రమును గట్ట నెఱుంగవు చూడ్కి దిక్కులం
బఱచుచుఁ జంచరీకములభాతిఁ జెలంగెడుఁ గంధరంబునం
బొరలెడుముక్తకేశభరముం దుఱుమంగఁ దలంప విప్పడి
బ్బిరుదుగ రత్నకందుకవిహారము సల్పెదు సంభ్రమంబునన్."

క. "ధరణీసుగోత్తముఁడు తా
నరుదుగఁ దమవారు సెప్పినవి యెల్లను నే
మఱ కండుఁ బ్రీతిసేయక
నిరతము గృహకర్మ మట్లు నెఱపుచునుండెన్."

క. "ధరణీవల్లభ నిన్నును
నిరతంబును బుద్ధదేవునిం గొలిచినయా
తెఱఁగునఁ గొలిచెద మని భా
సురమతి బోధించి రపుడు సుమతిం బ్రీతిన్."

పంచమస్కంధము.

క. "అరుదుగ నరహరిభక్తిం
బొరయనియాపురుషుసుకృతపుంజంబులు వే
మఱు పుణ్యుఁ జేయనేరవు
నరవరమధుఘటము పెక్కునదులంబోలెన్."

చ. "ఎఱుఁగమిఁ జేసినట్టిగురుహేళన మంత నెఱింగి యింద్రుఁ డ
చ్చెరువడి భీతి నొంది యతిచింతితుఁ డై తలపోసి పల్కె న
ప్పరమపవిత్రు లోకనుతభవ్యచరిత్రు విశేషపాదపం
కరుహముఁ బూజసేయక యకర్మముఁ జేసితి నల్పబుద్ధి నై."

షష్ఠస్కంధము.

క. “ఎఱుఁగమి నైనను భూసుర
వరులధనం బపహరింప వలవదు పతికిన్
మఱపున ననలము ముట్టిన
దరికొని వేసఁ గాల్పకున్నె తను వెరియంగన్.”

క. “ఎఱిఁగెఱిఁగి బ్రహ్మహత్యా
దురితంబున నీమనంబు దూకొనెఁ బాపో
త్తరణప్రాయశ్చిత్తము
దొరఁకొని కావింపుమయ్య దుర్జనహరణా.”

దశమస్కంధము-ఉత్తరభాగము.

ఇట్లు పెక్కుచోటుల నితరకవిరచితభాగములలో నుభయరేఫమైత్రి గలపద్యములు గానవచ్చు చున్నవి. ఇదియునుం గాక యితరదోషములు గొన్ని వారికవిత్వములఁ గన్పట్టు చున్నవి.

క. “వినుము ఫలారంభుఁడు కృప
ణుని నడిగినఁ దనయశంబునుం దనమానం
బును జెడుఁ గావునఁ దగ నీ
వనయ వివాహేచ్ఛఁ దగులు టెఱిఁగే నిటకున్.”

తృతీయస్కంధము.

క. అని యిట్టులు ప్రతికూలవ
చనములు దక్షుండు పలికి శపియింతును శ
ర్వుని నని జలములు గొని కర
మున నిలిపి ట్లనియె రోషమున ననఘాత్మా.

చతుర్థస్కంధము.

పై రెండుపద్యములలోఁ గ్త్వార్థేత్తునకు సంధి. గ్రంథవిస్తరభీతిచే మఱియుఁ బ్రయోగంబులు వ్రాయక విరమించెదము. శైలింబట్టి చూడఁ దృతీయచతుర్థస్కంధములలోఁ జాలభాగములు పోతనార్యవిరచితములు గానోప వని యెన్నవలసియున్నది. ఆస్కంధములంతయు నుత్సన్నములై యుండెనేని వెలిగందలనారయాదులు వానిని బూరించి వానియంతిమగద్యములలోఁ బంచమషష్ఠైకాదశద్వాదశస్కంధాంతము లందుఁబోలెఁ దమపేరులను జెప్పికొనియేయుందురు. అట్లు చెప్పికొనకునికిం జూడఁ దృతీయచతుర్థస్కంధములు పూర్ణముగా నశింపక చాలభాగము రూపుసెడఁగా నారయాదు లున్నవాని నిలిపి లేనిచోటుల నూత్నరచనలు గావించి పూరించిరని తోఁచుచున్నది. దీనిని నిర్ణయముసేయుటకుఁ దగినయాధారము లేవియు మాకుఁ జిక్కనందున నీయంశము విచార్య మని యంతర్వాణిజనంబులతో విన్నవించుచు నీవిచికిత్స నింతటితో విరమించెదము.

పోతనభాషాంతరీకరణము ప్రాయికముగ మూలగ్రంథము ననుసరించియే యుండు. కొన్నిచోటుల మూలగ్రంథములోనిశ్లోకములయర్థము లెస్సగాఁ దెలియునట్లు వ్యాఖ్యానమురీతిని విపులముగా వ్రాసియుఁ గొన్నియెడలఁ దనహరిభక్తి తేటపడునట్లు వర్ణనలు మూలగ్రంథముననున్నవానికంటె నెక్కుడుగ రచియించియుఁ గొన్ని

తావుల శ్రీవిష్ణుపురాణము లోనగుగ్రంథములనుండి క్రొత్తకథల నెత్తి కూర్చియు నిమ్మాడ్కిని బోతన తనపొత్తమును సంస్కృతమునకంటె నెక్కుడగునట్లు పెంచి వ్రాసెను. దశమస్కంధపూర్వభాగమునందలినరకాసురునితోడిసత్యభామాయుద్ధము విష్ణుపురాణమునుండి చేకొనఁబడినది. ఇటులున్నను మొత్తముమీఁద నాంధ్రభాగవతము సంస్కృతభాగవతము ననుసరించియే యుండును. ఈకవీశ్వరునిభాషాంతరీకరణముం జూపుటకై కొన్నియుదాహరణములు వ్రాయుచున్నాము.

సంస్కృతభాగవతము-ప్రథమస్కంధము.

“ ఆత్మారామా శ్చ మునయో నిర్గ్రంథా అప్యురుక్రమే
కుర్వం త్యహైతుకీం భక్తి మిత్థంభూతగుణో హరిః ”

దీనికిఁ దెనుఁగు.

క. “ ధీరులు నిరపేక్షులు నా
త్మారాములునై సమునులు హరిభజనము ని
ష్కారణము చేయు చుందురు
నారాయణుఁ డట్టివాఁడు నవ్యచరిత్రా.”

ఈపద్యము మూలశ్లోకమునకు సరిగా నున్నయది.

శ్లో. “ నమః పరస్మై పురుషాయ భూయసే
సదుద్భవస్థాననిరోధలీలయా
గృహీతశక్తిత్రితయాయ దేహి
నా మంతర్భవా యానుపలభ్యవర్త్మనే”

మ. “పరుఁడై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థానసం
హరణక్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గతజ్యోతియై
పరమేష్ఠిప్రముఖామరాధిపులకుం బ్రాపింప రాకుండుదు
స్తరమార్గంబునఁ దేజరిల్లుహరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్.”

ఇందు శ్లోకార్థము విపులముగాఁ దెనిఁగింపఁబడినది.

శ్లో. “యత్కీర్తనం యత్స్మరణం యదీక్షణం
యద్వందనం యచ్ఛ్రవణం యదర్హణం
లోకస్య సద్యో విధునోతి కల్మషం
తస్మై సుభద్రశ్రవసే నమో నమః”

ఉ. “ఏవిభువందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము లెవ్వనిసంశ్రవణంబు సేయు దో
షావళిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగు నండ్రు నే
నావిభు నాశ్రయించెద నఘౌఘనివృత్తిదు భద్రకీర్తిదున్.

ఇం దొకటిరెండువిశేషము లెక్కుడుగాఁ జేర్పఁబడినవి.

భాగ. ద్వితీయస్కంధము.

శ్లో. "ఏక స్త్వయా యో జగతస్సిసృక్షయా
ద్వితీయ యాత్మ న్యధి యోగమాయయా
సృజ స్యదః పాసి పున ర్గ్రసిష్యసే
యథోర్ణ నాభి ర్భగవ న్స్వశక్తిభిః."

మ. "అనఘా, యొక్కఁడ వయ్యు నాత్మకృతమాయాజాతసత్త్వాదిశ
క్తినికాయస్థితి నీజగజ్జననవృద్ధిక్షోభహేతుప్రభా
వనిరూఢిం దగు దూర్ణ నాభిగతి విశ్వస్తుత్య సర్వేశ నీ
ఘనలీలామహిమాగ్రవంబు గడవం గా వచ్చునే యేరికిన్."

తృతీయస్కంధము.

ఇందుఁ దుదియపాద మధికముగా నున్నను శ్లోకార్థము సుంతేనియుఁ గొఱంతవడనీక తెనిఁగింపఁబడియె.

శ్లో. "బిభర్షి కాయం పీవానం సోద్యమో భోగవా న్యథా
విత్తం చే హోద్యమవతాం భోగో విత్తవతాంను హ
భోగినాం ఖలు దేహోయం పీవా భవతి నాన్యథా.
న తే శయానస్య నిరుద్యమస్య
బ్రహ్మన్నుహార్థో యతఏవ భోగాః
అభోగినోయం తవ విప్రదేహః
పీవాయత స్తద్వద నః క్షమంచేత్
కవిః కల్యోనిపుణదృ క్చిత్రప్రియకథ స్సమః
లోకస్య కుర్వతః కర్మ శేషే తద్వీక్షితాపివా."

సీ. భూమి నుద్యోగి యై భోగి యై యుండెడి నరునికై వడి మునినాథ నీవు
ఘనశరీరముఁ దాల్చి కదలవు చిత్ర ముద్యమయుక్తునికిఁ గాని ధనము లేదు
ధనవంతునకుఁ గాని తగుభోగములు లేవు భోగికిఁ గాని సంపూర్ణ మైన
తనువు లే దుద్యోగధనభోగములు లేక నేల నూరక పడి నిద్రవోవు
నీకు నెట్లు గలిగె నిరుపమదేహంబు
సముఁడ వార్యుఁడవు విశారదుఁడవు
బుద్ధి నిధివి జనులఁ బొగడవు తెగడవు
నిద్ర ప్రతిదినంబు నిలుప నేల."

సప్తమస్కంధము.

పైశ్లోకములయర్థము సంగ్రహముగ నొకసీసపద్యమునందె వ్రాయఁబడియున్నది.

శ్లో. "యస్మిన్వాత్మనిదం నిజమాయ యార్పితం
క్వచి ద్విభాతం క్వచ త త్తిరోహితం
అవిద్ధదృ క్సాక్ష్యుభయం త దీక్షతే
స ఆత్మమూల·లోవతు మాం పరాత్పరః"

క. "ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయము గనుచుం

సకలార్థ సాక్షి యగున
య్యకలంకుని నాత్మమూలు నర్థింతు మదిన్.

శ్లో. "దిదృక్షవో యస్య పదం హి మంగళం
విముక్తసంగా మునయ స్సుసాధవః
చరం త్యలోకవ్రత మవ్రణం వనే
భూతాత్మభూతా స్సుహృద స్స మే గతిః."

తే. గీ. ముక్తసంగు లయినమునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు."

అష్టమస్కంధము.

శ్లో. "కస్యాశ్చిత్పూతనాయంత్యాః కృష్ణాయం త్యపిబత్స్తనం
తోకయిత్వా రుదం త్యన్యా పదాహం చ్ఛకటాయతీం
దైత్యాయిత్వా జహా రాన్యా మేకా కృష్ణార్భభావనాం
కృష్ణరామాయితే ద్వేతు గోపవత్సాయితాః పరాః
వత్సాయితాః గృహీత్వాన్యా భ్రామయిత్వా న్యపాతయత్
కృష్ణాయితా జఘానాన్యా తత్రైకాంతు బకాయితాం
ఆహూయా దూరగాయద్వత్కృష్ణ స్త మనుకుర్వతీమ్."

సీ. "పూతన నై యొక్కపొలఁతి చరింపంగ శౌరి నై యొకకొంత చన్నుగుడుచు
బాలుఁడై యొకభామ పాలకు నేడ్చుచో బండి నే నను లేమఁ బాఱఁ దన్ను
సుడిగాలి నని యొకసుందరి గొనిపోవ హరి నని పత్తించు నబ్జముఖియు
బకుఁడ నే నని యొక్కపడఁతి సంరంభింపఁ బద్మాక్షుఁ డనుకొమ్మ పరభవించు

ఆ. వె. సెలమి రామకృష్ణు లింతు లిద్దఱు గాఁగ
గోపవత్సగణము గొంద ఱగుచు
రసురవైరి ననుచు నబల యొక్కతె చీరఁ
బసుల మనెడుసతుల భరతముఖ్య."

శ్లో. "జయతి తేధికం జన్మనా వ్రజః
శ్రయత ఇందిరా శశ్వ దత్ర హి
దయిత దృశ్యతాం దిక్షు తావకా
స్త్వయి ధృతాసవ స్త్వాం విచిన్వతే."

క. "నీవు జనించినకతమున
నోవల్లభ లక్ష్మి మంద నొప్పె నధికమై
నీవెంటనె ప్రాణము లిడి
నీవా రరసెదరు మాపు నిరూపంబున్."

శ్లో. "శరదుదాశయే సాధుజాతస
త్సరసిజోదర శ్రీముషాదృశా
సురతనాథ తేఽశుల్కదాసికా
వరద నిఘ్నతో నేహ కిం వధః".

క. "శారదకమలోదరరుచి
చోరక మగుచూపువలన సుందర మమ్ముం
గోరి వెల యీనిదాసుల
ధీరత నొప్పించు టిది వధించుట గాదే."

శ్లో "ప్రణతదేహినాం పాపకర్శనం
తృణచరానుగం శ్రీనికేతనం
ఫణిఫణార్పితం తేపదాంబుజం
కృణు కుచేషు నః కృంధి హృచ్ఛయమ్."

ఉ. "గోవులవెంటఁ ద్రిమ్మరుచుఁ గొల్చినవారలపాపసంఘముల్
ద్రోవఁగఁ జాలి శ్రీఁ దనరి దుష్టభుజంగఫణాలతాగ్రసం
భావిత మైననీచరణపద్మము చన్నులమీఁద మోపి త
ద్భావజపుష్పభల్లభవబాధ హరింపు వరింపు మాధవా."

దశమస్కంధము.

పైశ్లోకము లన్నియు నర్థలోపము లేకుండునటులు లెస్సగాఁ దెనిఁగింపఁబడిన యునికిఁ జూడఁ గవికిఁ గలభాషాంతరీకరణచాతుర్యము తేటపడు. కేవలవర్ణనాప్రసంగములు పొసంగినచోటులఁ బోతన మూలమునకంటె నెక్కుడుగ వ్రాసినను దత్త్వవిషయనిరూపణము సేయునపు డెల్లఁ బ్రాయికముగా మూలగ్రంథశ్లోకార్థములం బట్టియే తెనిఁగించియున్నాఁడు.

ఇదానీంతనవిద్వజ్జనులు కొందఱు సంస్కృతగ్రంథములను దెనిఁగించునెడల మూలగ్రంథములో నున్న విశేషణములనుగూడ విడువక తెనుఁగుసేయవలయు నని యు మూలగ్రంథములో లేనియెట్టివిశేషణము నేని నభిప్రాయము నేనిఁ దెనుఁగునఁ బొందింపఁదగదనియు భావించుచున్నారు. అట్లన్యూనానధికంబుగ గీర్వాణభాషలోని నాటకములను గావ్యములను దెనుఁగుసేసినచో లెస్సగా నుండును గాని పురాణేతిహాసంబుల నాచందంబున నాంధ్రీకరించినచో నాయాంధ్రగ్రంథములు పసచెడి చదువుట కెంతయు నేవగలిగించు. 'హనుమాన్ మారుతాత్మజః' 'యుధిష్ఠిరో ధర్మపుత్రః' ఇట్టివిశేషణములు తఱుచుగాఁ బ్రయోగింపఁబడియుండుటఁ జేసి వాని నెల్ల మాటిమాటికిఁ దెనుఁగునకుఁ దెచ్చినచో భాషాశైలియందమునకు లోపము వాటిలు ననితోఁచెడి. వెండియు నాంధ్రశైలి కనుగుణంబుగ నుచితభంగుల నక్కడక్కడఁ గొన్నివిశేషణములు నభిప్రాయములును రసవంతంబుగఁ బ్రయోగించుచుఁ గథాసందర్భమునుమాత్రము మానక తెనిఁగించుటయే శ్లాఘనీయభాషాంతరీకరణ మని తలంచెదము. భారతము నాంధ్రీకరించినకవిత్రయమువారును భాగవతమును దెనుఁగుసేసిన బమ్మెరపోతరాజును నీమతమునే యవలంబించినవారు.

వెలిగందలనారయాదులకవనంబునుగుఱించి విశేషముగా నిటఁ జర్చింప నవసరము లేదు. వారును బోతనామాత్యునిశైలినే యవలంబించి దానితెఱంగుననే తమరచనలనుం జేసియున్నారు. పోతనకవనమునందుంబోలె వారికవనమునందును నంత్యనియమప్రాసాదిశబ్దాలంకారములును ఛేకయమకాదిచిత్రరచనలును నభేదాధ్యవసాయములును గానవచ్చుచున్నవి. అయినను వారికవన మెల్లవిధములఁ బోతనకవనమునకంటెఁ దద్దయులోఁకున యనుట కెంతమాత్రమును సందియము లేదు. వీరికవనంబులలో సింగనార్యునికవనము తక్కుంగలయిరువురికవనములకంటెఁ బ్రౌఢ మనియు, నారయకవనము గంగరాజుదానికంటె సరస మనియుఁ దోఁచుచున్నయది. పోతన వ్రాసినసంపూర్ణభాగవత ముండినయెడల నెంతమనోహరముగా నుండును!

ఇందలి రుక్మిణీకల్యాణము, గజేంద్రమోక్షణము, ప్రహ్లాదచరిత్రము లోనగుకథలను బాలురకును బాలికలకును విశేషముగాఁ జెప్పింతురు. భారతముంబోలె భాగవతమును సకలపండితపామరజనంబులమనంబుల కెక్కిన గ్రంథము. పల్లియలలోనిజానపదులును జదువులయ్యుం గొని దీనిని వీథిపురాణముగాఁ జదివింతురు.

పోతనామాత్యునిశైలినిగూర్చి యెంతేని వ్రాయఁదగియున్నను బీఠికావిస్తరభయమున నింతకంటె నిట విపులముగాఁ జర్చింప నయితి కాదాయె. ఇమ్మహాకవిపదలాలిత్యమును, రచనాసౌకుమార్యమును, సరసపదప్రయోగవైచిత్ర్యంబును, నుభయభాషాప్రావీణ్యంబును, హరిలీలావర్ణనాపాటవంబును, వేదాంతార్థనిరూపణావైదగ్ధ్యంబును నితనిరచనలఁ జదువఁ జదువ గోచరించును.

ఇతనిపదము లతికోమలములు. అలంకారములు మనోజ్ఞములు. రచనలు సరసములు. పాకము మధురము. ఇతనియెడం జూపట్టుహరిభక్తి యగ్గలము. పాండిత్యము మిక్కుటము. లోకానుభవం బహీనము. వేదాంతార్థచింతనంబు మెండు. పురాణరత్నం బగునిమ్మహాభాగవతము నాంధ్రీకరించి యితండు సాపాయంబగు కాయంబు దొఱంగియు జీవించియేయున్నవాఁడు. ఇతనిభాగవతము నాంధ్రదేశీయు లెల్లరుఁ బెల్లుగాఁ జదివి భవరుగార్తులు నిర్లేపత్వమును భాషాజ్ఞానార్థులు భాషాజ్ఞానమును సుకవిపుంగవు లానందమును భాగవతులు దృఢభక్తిని ముముక్షువులు మోక్షమును బొందుదురుగాక యని యనుగ్రహింప సర్వేశ్వరుం బ్రార్థించుచు నీయుపోద్ఘాతము నుపసంహరించెదము.

నాగపూడి కుప్పుస్వామయ్య, బి. ఎ.

ఆంధ్రభాగవతరచనాక్రమము.

పైఁ దెలిపిన పోతనామాత్యవిరచితం బగునీయాంధ్రభాగవతంబునం గలగ్రంథసంఖ్య సాకల్యంబుగా గణింప సరాసరి ముప్పదివే లగుచున్నది. ఈగ్రంథంబునకు మూలభూతం బగుసంస్కృతభాగవతంబునం గలగ్రంథసంఖ్య రమారమి యిరువదిరెండువేలు. ఈమీఁదఁ జెప్పినక్రమమున మూలగ్రంథము నతిక్రమించెడిగ్రంథసంఖ్యగలదిగా నీగ్రంథము రచియింపఁబడుటకుఁ గారణం బెయ్యది యనిన, బ్రాహ్మాద్యష్టాదశపురాణంబులలో నుత్తమం బగునీపురాణం బత్యంతరహస్యార్థప్రతిపాదకంబును, బరమవేదాంతప్రతిపాద్యభగవద్గుణగణాపాదకంబును నైన యుత్తమగ్రంథం బగుటఁబట్టి యిట్టిగూఢం బైనగ్రంథార్థంబు దేటపఱుప వ్యాఖ్యానరూపముగా నభివర్ణించుట, భగవద్గుణవర్ణనాదిఘట్టంబులందు సంస్కృతభాగవతప్రతిపాదితక్రమమున నభివర్ణించి స్వకీయభగవద్భక్త్యతిశయమున స్వానవద్యకవిత్వవిద్యాచాతురీసంప్రాప్తనిరంకుశస్వాతంత్ర్యము సకలవిద్వజ్జనంబులకుం దెలుప భగవద్గుణాదులను విశేషముగావర్ణించుట, *భాగవతగ్రంథప్రతిపాదితం బై కాక విశిష్టశిష్టజనాంగీకార్యంబు లగువిష్ణుపురాణహరివంశాదిగ్రంథప్రతిపాదితంబు లగుకథావిశేషంబులం గొన్నిటిం దెలుపుట, యనునీహేతుత్రయంబువలనను ఆంధ్రభాగవతంబునందు సరాసరి యష్టసహస్రగ్రంథసంఖ్య యధికంబై యున్నది. కాన సంరక్షితసకలార్థంబులు గలధనికునకు నధికారంబు చేకూడుటచే నతనిసంపద యతిశ్లాఘ్యంబుగా నుండురీతి సంస్కృతభాగవతగ్రంథప్రతిపాదితార్థావిరుద్ధభగవద్గుణవర్ణనాదులు గలయీగ్రంథం బతిపూజ్యంబుగా సకలవిద్వజ్జనంబులచే నంగీకరింపంబడఁదగినదిగా నున్నయది. ఇదియునుం గాక భారతరామాయణవిష్ణుపురాణస్కాందాద్యుత్తమగ్రంథంబులఁ దెనుంగున గద్యపద్యాత్మకంబులుగాఁ జేసిననన్నయభట్టారకాదులయినమహాకవు లాయాగ్రంథస్థితకథాంశానుక్రమణికమాత్రము వదలక తమకుఁ దోఁచినట్లు గ్రంథరచన గావించినందున సపాదలక్షగ్రంథపరిమితం బగుమహాభారతం బాంధ్రంబున సరాసరిపంచాశత్సహస్రసంఖ్యాకగ్రంథవిస్తృతం బై యున్నది. ఇదేతీరునఁ జతుర్వింశత్సహస్రగ్రంథపరిమితం బై షట్కాండములం గలశ్రీమద్రామాయణము తెనుంగునందు ముందు చెప్పినచొప్పున భాస్కరకవి పంచదశసహస్రగ్రంథవిస్తృతంబుగా నొనర్చె. ఇట్లు మూలగ్రంథార్థం బతిసంగ్రహంబు సేసి స్వేచ్ఛననుసరించి గ్రంథంబుల రచియించుటవలన వ్యాసవాల్మీక్యాదిమహర్షులయథోక్తార్థంబు సమగ్రంబుగాఁ దెలుపఁబడక కేవలకథాంశానువర్ణనపరంబులుగా నుండుటవలన ఋషిప్రోక్తసంస్కృతగ్రంథంబులవలె నత్యాదరణీయములు గానేరవు గావునఁ బూర్వోక్తక్రమంబున నీభాగవతము వ్యాసప్రోక్తభాగవతగ్రంథార్థమునకు నీషన్మాత్రంబయినం బొరపాటు లేకయుండుటయ కాక యాయాసందర్భములకుఁ దగి

* ఇందు సత్యభామయుద్ధాదికథాభాగములు మూలగ్రంథం బగుభాగవతమందుఁ దెలుపఁబడనివి.

నట్టు హరిగుణవర్ణనాధిక్యాదులుం గలిగి యుండుటవలన సమగ్రభగవద్గుణప్రతిపాదక గ్రంథ మగుచున్నది. కాఁబట్టి భగవద్వ్యాసప్రణీతభాగవతమువలెఁ బోతనామాత్యవిరచితం బగునీయాంధ్రభాగవతమును బఠియించునట్టినిఖిలజనులకు నైహికాముష్మికఫలప్రదం బగు నని నిశ్చయింప నించుకయు సందియంబు పనిలేదు.

శ్రీకృష్ణావతారకాలనిర్ణయవిచారఘట్టము.

శ్రీమదాశ్రితజనాపన్నివారణైకపరాయణుం డగునాదినారాయణుండు భూభారావతరణార్థంబు బ్రహ్మరుద్రేంద్రాదినిఖిలదేవగణంబులచే సంప్రార్థితుం డై శ్రీకృష్ణావతారంబు నొంది యఖిలదుష్టజననిబర్హణశిష్టజనపరిరక్షణాదికృత్యంబులు సలిపి యమానుషంబు లగువిచిత్రచరిత్రంబులచే నపరిమేయమహిమ నశేషభక్తజనాళికిం దెలిపి మరల బ్రహ్మాదిదేవగణప్రార్థితుం డై స్వధామం బగువైకుంఠధామంబున కరిగె. అట్టియపరిమేయానన్యాదృశానవద్యగుణగణప్రభావవినుతుం డగుభగవంతుని యవతారకాలనిర్ణయంబు నన్యూనానతిరిక్తం బగునట్లు సాకల్యంబుగాఁ దెలిపెడు భాగవతవిష్ణుపురాణహరివంశాదిగ్రంథంబులలోఁ గొన్నిటియందు శ్రీకృష్ణావతారఘట్టంబునఁ దజ్జననక్షత్రమును దదావిర్భావప్రతిపాదకనిశీథకాలవిశేషమును మాత్రము దెలియుచున్నవి. మఱికొన్నిగ్రంథంబులయందు మాస-ఋతు-పక్ష-నక్షత్ర-ముహూర్తములుమాత్రము దెలుపఁబడియున్నవి గాని యట్టియభ్యుదయకాలంబు నిఖిలభక్తజను లత్యంతానందంబున నిదానించి తెలిసికొనుటకు నుపయుక్తం బగు నట్లు యుగవర్షాదినిర్ణయం బాయవతారఘట్టంబునఁ గంఠోక్తిగా నెందుం దెలుపఁబడలేదు. అయినను దదితరఘట్టంబులయందు నాయుగవర్షాదినిర్ణయంబు విద్వజ్జనైకవేద్యం బగునట్లు వివిధవచనంబులచే సూచితంబై యున్నది. అట్టిసూచితార్థం బఖిలభక్తజనగ్రాహ్యంబు గానియెడల నాకృష్ణపరబ్రహ్మమూర్తి యేయుగంబున నేవర్షంబున నవతరించె ననియు, నట్టికాలంబు గణింప నిప్పటికి గతసంవత్సరము లెన్ని యయ్యె ననియు, నమ్మహాత్ముండు భూలోకంబున లీలామానుషవిగ్రహంబు దాల్చి యుండినవర్షంబు లెన్ని యనియుఁ, దెలియక భగవద్భక్తు లెల్లవారును సందిగ్ధమానసు లగుచున్నారు. కాఁబట్టి యట్టిసందేహనివృత్తి చేయుటచే నఖిలాస్మదీయజనుల నుల్లసింపఁ జేయందలంచి శ్రీకృష్ణావతారకాలనిర్ణయప్రతిపాదకగ్రంథంబులఁ దెలుపఁబడి యుండెడుప్రమాణవచనాభిప్రాయములఁబట్టి సర్వగ్రంథసామరస్యంబు గలుగు నట్లు విశదముగా నీదిగువఁ దెలుపుచున్నాము.

శ్రీకృష్ణావతారకాలనిర్ణాయకప్రమాణవచనార్థవిచారము.

శ్రీమద్భాగవతమునందు దశమంబునం గలతృతీయాధ్యాయమునందుఁ దెలుపఁబడి యుండెడు శ్రీకృష్ణమూర్త్యావిర్భావకాలప్రతిపాదకప్రమాణవచనములు.

శ్లో. అథసర్వగుణోపేతః కాలః పరమశోభనః
యర్హ్యేవాజనజన్మర్క్షం శాంతర్క్షగ్రహతారకమ్.

శ్లో. మందం మందం జలధరా జగర్జు రనుసాగరమ్
నిశీథే తమ ఉద్భూతే జాయమానే జనార్దనే.

ఈశ్లోకద్వయమునందు ప్రథమశ్లోకంబున "అజనజన్మర్క్షమ్" అనుటచేత రోహిణీనక్షత్ర మనియు, రెండవశ్లోకమున "నిశీథే తమఉద్భూతే" అనుటచేతఁ జీఁకటితోఁ జేరియుండెడు నిశీథకాల మనియుఁ దెలియఁబడుచున్నది. ఈమీఁదఁ జెప్పిన రోహిణీనక్షత్రనిశీథకాలములు గాక తక్కిన యుగ వర్ష ఋతు మాస పక్ష తిథులు మొదలయినవి యేమియు నీభాగవతమున నందునారాయణావతారఘట్టంబునఁ దెలుపఁబడియుండలేదు.

హరివంశమునందు పూర్వభాగములోఁ గల ౫౨-వ యధ్యాయమునందలి ప్రమాణవచనములు.

యోగమాయాం ప్రతి విష్ణూక్తిః.

శ్లో. తతోఽహం సంభవిష్యామి దేవకీజఠరే శుభే
గర్భే త్వయా యశోదాయా గంతవ్య మవిలంబితమ్.

శ్లో. ప్రావృట్కాలే చ నభసి కృష్ణాష్టమ్యా మహం నిశి
ఉత్పత్స్యామి నవమ్యాంచ ప్రసూతిం త్వ మవాప్స్యసి.

ఈశ్లోకద్వయంబునందు "ప్రావృట్కాలే" అనుదానివలన వర్షర్తు వనియు "నభసి" అనుదానివలన శ్రావణమాస మనియు "కృష్ణాష్టమ్యాం నిశి" అనుటవలనఁ గృష్ణపక్షాష్టమినాఁటిరాత్రిపూఁట యనియుఁ దెలియఁబడుచున్నది. మఱియు "నవమ్యాంచ ప్రసూతిం త్వమవాప్స్యసి" అనువాక్యార్థమును వక్ష్యమాణహరివంశగ్రంథోదాహృతప్రమాణవచనస్థమగు "యామేవరజనీంకృష్ణో జజ్ఞే వృష్ణికులేప్రభుః। తామేవ రజనీం కన్యాం యశోదా దే వ్యజాయత" అనువచనార్థంబును సమరసపెట్టి యాలోచింపఁగా నవమీవిద్ధగలయష్టమి శ్రీకృష్ణజననతిథియని తెలియఁబడుచున్నది.

తస్మిన్నే వాధ్యాయే—యోగనిద్రాంప్రతి శ్రీమన్నారాయణోక్తిః.

శ్లో. అర్ధరాత్రే కరిష్యామి గర్భమోక్షం యథాసుఖమ్
అష్టమస్యతు మాసస్య జాతా వావాం తత స్సమమ్.

శ్లో. అహం యశోదాం యాస్యామి త్వం దేవీం యాహి దేవకీమ్
ఆవయో ర్గర్భవ్యత్యాసే కంసో గచ్ఛతి మూఢతామ్.

—అధ్యాయే-౫౩.

శ్లో. యస్మి న్నహని దేవేశం గర్భే చాధత్త దేవకీ
యశోదాపి సమాధత్త గర్భం త దహ రేవహి.

శ్లో. విష్ణో శ్శరీరజాం నిద్రాం విష్ణోర్నిర్దేశకారిణీమ్
గర్భకాలే త్వసంపూర్ణే హ్యష్టమే మాసి తే స్త్రియా.

శ్లో. దేవకీచ యశోదాచ సుషువాతే సమం తదా
యా మేవ రజనీం కృష్ణో జజ్ఞే వృష్ణికులే ప్రభుః.

శ్లో. తా మేవరజనీం కన్యాం యశోదాదే వ్యజాయత
అష్టమ్యాం శ్రావణే మాసి కృష్ణపక్షే మహాతిథౌ.

శ్లో. రోహిణ్యా మర్ధరాత్రేచ సుధాంశా వుదయోన్ముఖే
దేవక్యజనయ ద్విష్ణుం యశోదా తాంతు కన్యకామ్.

శ్లో. ముహూర్తేభిజితి ప్రాప్తే హ్యర్ధరాత్రే సుఖావహే,
తస్మిన్నేవాధ్యాయే.—

శ్లో. వసుదేవ స్తతో గత్వా దేవకీగర్భవేశ్మ తత్
దదర్శ దేవదేవేశం రాత్రౌ జాత మధోక్షజమ్.

శ్లో. శయాన మాంబుజేపత్రే వటపత్రే యథాపురా
ప్రాచీనశిరసం దేవం పశ్చిమన్య స్తపాదకమ్.

ఈవచనార్థపర్యాలోచన సాకల్యముగాఁ జేయుటవలన భాగవత విష్ణుపురాణ ప్రతిపాదితమాస ఋతు పక్ష నక్షత్ర తిథి రాత్ర్యాదులు మాత్రమే కాక జననముహూర్తము అభిజిత్తనియు, దేవకీయశోదలగర్భంబులం దేకరాత్రియందే, శ్రీకృష్ణయోగ మాయ లుద్భవించి రనియు, అట్టియుద్భవకాల మసంపూర్ణమగునష్టమమాసముగా నుండె ననియు, అట్లసంపూర్ణకాలంబున జనియించినందున నే శ్రీకృష్ణమూర్తి యు తనిజననోత్తరకాలంబున గోకులవాడుకప్రకారము పద్మపత్రముల నుంపఁబడియుండె ననియు, అత్తటి సూతికాగృహంబునఁ దేజరిల్లెడునా శ్రీకృష్ణుండు ప్రాగ్దిశ్నియమితశిరస్కుండును, పశ్చిమదిగ్విన్య స్తపాదయుగళుండు నై యుండె ననియు నిట్టివిశేషార్థంబులు దెలియఁబడుచున్నవి.

శ్రీమద్భాగవతైకాదశస్కంధంబునం గలషష్ఠాధ్యాయమున నుండు
శ్రీకృష్ణమూర్తిజీవితకాలనిర్ణాయకప్రమాణవచనము.

శ్రీకృష్ణంప్రతి బ్రహ్మాదిదేవోక్తిః.

శ్లో. యదువంశేఽవతీర్ణస్య భవతః పురుషోత్తమ
శరచ్ఛతం వ్యతీయాయ పంచవింశాధికం విభో.

ఈవచనమునందుండు "భవతః,పంచవింశాధికం, శరచ్ఛతం, వ్యతీయాయ" అనుపదములచే బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమునకు రమ్మని పిలువవచ్చిన కాలమునందు నమ్మహాపురుషునికి జననప్రభృతిగతసంవత్సరములు ౧౨౫ – అని తెలియఁబడుచున్నది. విష్ణుపురాణమునందు నిదేక్రమంబునఁ జెప్పఁబడియున్నది. అదెట్లనిన—విష్ణుపురాణము, అంశము ౫- అధ్యాయము-౩౭–శ్రీకృష్ణంప్రతి ఇంద్రప్రేషితదేవదూతోక్తిః.

శ్లో. వస్వశ్విమరుదాదిత్యరుద్రసాధ్యాదిభి స్సహ
విజ్ఞాపయతి శక్ర స్త్వాం త దిదం శ్రూయతాం ప్రభో.
శ్లో. దుర్వృత్తా నిహతా దైత్యా భువో భారోవతారితః
త్వయా సనాథా స్త్రిదశా భవంతు త్రిదివే పునః.
శ్లో. పంచవింశత్యుత్తరకం శతంతు శరదాం గతమ్
ఇదానీం గమ్యతాం స్వర్గో భవతే యదిరోచతే.

ఈవచనములయందుఁ దెలుపఁబడిన "పంచవింశత్యుత్తరకం శతంతు శరదాం గతమ్" అనువాక్యముచేత ౧౨౫ సంవత్సరములు జరిగినవి యని తెలియఁబడుచున్నది. హరివంశాదిగ్రంథములయందు నిదే క్రమంబునఁ దెలుపఁబడియున్నది. గ్రంథవిస్తరభీతిచేత నాగ్రంథస్థప్రమాణవచనంబుల నిచ్చటఁ బ్రకాశపఱుపలేదు.

శ్రీమద్భాగవతైకాదశస్కంధమునం గల సప్తమాధ్యాయములో నుండు
శ్రీకృష్ణమూర్తినిర్యాణకాలప్రతిపాదకప్రమాణవచనములు.

శ్లో. ఉత్తరార్ధమారభ్య॥ సముద్ర స్సప్తమేహ్న్యేతాం పురీ మాప్లావయిష్యతి.
శ్లో. యర్హ్యేవాయం మయా త్యక్తో లోకోయం నష్టమంగళః.
భవిష్యత్యచిరా త్సాధో కలినాపి నిరాకృతః.

ఈప్రమాణవచనార్థపర్యాలోచనవలనం దెలియఁబడిన దేమనిన, బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణమూర్తిని వైకుంఠమునకు రమ్మని విన్నవించి వారివారిలోకములకుఁ బోయినతోడనే శ్రీకృష్ణుం డుద్ధవునితో నీద్వారకాపట్టణము నేటి కేడవదివసమునందు సముద్రునిచే నావరింపఁబడును. నేను భూలోకమును వదలఁగానే కలి ప్రవేశించును. అట్టికాల మతిత్వరితముగానే సంభవించును- అని చెప్పినందున శ్రీకృష్ణనిర్యాణకాలము కలియుగప్రవేశదిన మనియు, అట్టికలియుగాదిదివసమునకు నవ్యవహితపూర్వమాసంబుననే బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణాహ్వానము సేయ వచ్చి రనియు సూచనగాఁ దెలియఁబడుచున్నది. ఈయర్థము విష్ణుపురాణమునందు స్పష్టముగాఁ దెలుపఁబడియున్నది. అ దెట్టు లనిన:—

విష్ణుపురాణము, అంశము- ౪, అధ్యాయ ౨౪.

శ్లో. యస్మిన్ కృష్ణోదివం యాత స్తస్మిన్నేవ తదాహని
ప్రతిపన్నం కలియుగం తస్య సంఖ్యాం నిబోధత.

ఈవచనార్థపర్యాలోచనమువలన శ్రీకృష్ణనిర్యాణదివసమునందే యీభూలోకమునందుఁ గలి ప్రవేశమాయెను, అని దృఢముగాఁ దెలియఁబడుచున్నది. కాన మీఁదఁ దెలుపఁబడినభాగవతవచనసూచితార్థమునకు సామరస్యము లెస్సగాఁ గలుగుచున్న దని తెలియఁదగ్గది. బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణాహ్వానమునందుఁ దెలియఁజేసిన-౧౨౫-సంవత్సరములు దైవసంవత్సరము లని చెప్పెడుదురాక్షేపపరిహారవిచారము.

విష్ణుపురాణము, అంశము-౫, అధ్యాయము-౨౩.

శ్రీకృష్ణంప్రతి ముచికుందోక్తిః.

శ్లో. ముచికుంద శ్చ తత్రాదౌ వృద్ధగార్గ్యవచః స్మరన్
సంస్మృత్య ప్రణిప త్యైనం పరం సర్వేశ్వరం హరిమ్.

శ్లో. ప్రాహ జాతో భవా న్విష్ణో రంశ స్త్వం పరమేశ్వర
పురా గర్గేణ కథిత మష్టావింశ త్తమే యుగే.

శ్లో. ద్వాపరాంతే హరే ర్జన్మ యదువంశే భవిష్యతి.

ఈవచనార్థపర్యాలోచనవలన శ్రీకృష్ణావతారము జగత్సృష్టి మొదలుకొని జరగెడి యిరువదెనిమిదవమహాయుగమునందుఁ దటస్థించునట్టిద్వాపరయుగంబున నంతిమభాగములో యదువంశమునందు శ్రీకృష్ణమూర్తి యవతరింపఁబోవుచున్నాఁడని తొల్లి వృద్ధగార్గ్యులు చెప్పినట్లు ముచికుందమహారాజు శ్రీకృష్ణునితో విన్నపము చేసెనని తెలుపఁబడినందున ముందు నుదాహరించిన ప్రమాణవచనములలో శ్రీకృష్ణునితో బ్రహ్మాదిదేవతలు తెలిపినసంవత్సరపరిగణనము, ఐహికవ్యవహారోపయుక్తాన్స్మత్ప్రభవాదిసంవత్సరములే కాని యాముష్మికలోకవ్యవహార్యమాణదైవసంవత్సరంబులు కావు. కావున మీఁదఁ జెప్పినముచికుందోక్తిచొప్పున నిరువదెనిమిదవ మహాయుగంబునఁ దటస్థించిన ద్వాపరయుగం బీకలియుగంబునకు నవ్యవహితపూర్వంబయినద్వాపరయుగమే కాని వేఱొకద్వాపరయుగము కానేరదు. అదెట్లనిన:—

సూర్యసిద్ధాంతము-అధ్యాయము-౧

శ్లో. ఆయుషోర్ధం గతం తస్య శేషా త్కల్పోయ మాదిమః
కల్పా దస్మాచ్చ మనవ షడ్వ్యతీతా స్ససంధయః

శ్లో. అష్టావింశయుగా దస్మా ద్యాత మేతత్కృతం యుగమ్
అతఃకాలం ప్రసంఖ్యాయ సంఖ్యా మేకత్ర పిండయేత్''

ఈవచనములందుఁ దెలిపిన ''అష్టావింశయుగా దస్మాత్'' అనుదానివలన నిది యిరువదెనిమిదవమహాయుగ* మని తెలియనాయెను. ఇచ్చట యుగశబ్దము వ్యాఖ్యాత్రభిప్రాయానుసారముగా మహాయుగపర మని తెలియఁదగినది, అట్లు కానిపక్షమం దీవచనములోనే ''యాతమేతత్కృతంయుగం'' అనువచనమువలనఁగృతయుగంబునకు నష్టావింశమహాయుగాంతఃపాతిత్వము ఘటింపకపోవును. కాఁగా నదే క్రమంబునఁ గ్రిందట జరిగినకృతయుగము మొదలుకొని యిప్పుడు జరిగెడికలియుగపర్యంతము గలయుగచతుష్టయము నిరువదెనిమిదవమహాయుగంబునఁ జేరినవిగాన ముందు విష్ణుపురాణోదాహృత మగు''ద్వాపరాంతే హరేర్జన్మ యదువంశేభవిష్యతి

---

*కృతాదియుగచతుష్టయము ఒకమహాయుగ మనఁబడుచున్నది గావున నొకమహాయుగమున కృతాదినాల్గుయుగములు తటస్థము లగుచున్నవి.

అనువచనమువలనఁ దెలిపినయుగమీఁకలియుగావ్యవహితపూర్వయుగం బగు ద్వాపరయుగంబే యనుట సూర్యసిద్ధాంతాదినిఖిలసిద్ధాంతగ్రంథప్రతిపాదితసిద్ధాంతముతో నత్యంతసామరస్యము నొందియున్నది గాన మీఁదఁ దెలిపినసంవత్సరనిర్ణయము దైవసంవత్సరపర మని కుశంకలు సేయుపురుషులపలుకుల కెంతమాత్రము నవకాశము గలుగనేరదు. అదియునుం గాక మీఁద నుదాహరించిన గర్గవాక్యానుస్మృతశ్రీకృష్ణజననకాలనిర్ణయవిషయము శ్రీమద్భాగవతమునందును సూచనగాఁ దెలుపఁబడియున్నది. అ దెట్టు లనిన:—

భాగవతము-దశమస్కంధము-అధ్యాయము-౫౧.

శ్లో. ఇత్యుక్త స్తం ప్రణమ్యాహ ముచికుందో ముదాన్వితః
 జ్ఞాత్వా నారాయణం దేవం గర్గవాక్య మనుస్మరన్.

ఇచ్చట "గర్గవాక్యమనుస్మరన్" అనుటకుభాగవతవ్యాఖ్యానకర్తలును సర్వజ్ఞులు నగు శ్రీధరాచార్యులవారు "అష్టావింశతితమే మహాయుగే యదువంశే భగవానవతరిష్యతీతిగార్గ్యవాక్య మనుస్మర న్నిత్యర్థః" అని చెప్పియున్నారు. మఱియు నాంధ్రభాగవతకర్తయగు బమ్మెరపోతనయును దశమస్కంధపూర్వభాగములో ముచికుందపూర్వకథాభివర్ణనఘట్టమునందు నంతిమవచనాంతములో "హరికి ముచికుందుండు నమస్కరించి నారాయణదేవుం డగుట యెఱింగి యిరువదెనిమిదవమహాయుగంబునందు నారాయణుం డవతరించునని మున్ను గర్గుండు సెప్పుట తలంచి" అని వ్యాఖ్యాత్రభిప్రాయానుసారముగానే తెలిపియున్నాఁడు గాన నష్టావింశమహాయుగాంతఃపతితం బగుద్వాపరయుగం బీకలియుగావ్యవహితపూర్వవృత్తయుగమే యని దృఢముగా నఖిలజనులకుఁ దెలుపుటయం దత్యంతానందంబు నొందుచున్నాము. కాఁగా శ్రీమద్భాగవత, విష్ణుపురాణ, హరివంశాదశిష్టజనాంగీకారంబు లగువిషయముల సాకల్యముగా సంప్రదాయార్థమునకుఁ బొరపాటు రానటులు పరిశీలించినయెడ నఖిలసందేహంబులకుసామరస్యం బతిశ్లాఘ్యతమంబుగాఁ గలుగుననుటయం దేమియు సందేహము లేదు గాన నిఖిలచరాచరపోషణైకాయత్తచిత్తుండగుభగవంతునియవతారాదికృత్యములనుగుఱించి కుమతప్రవిష్టు లగుకుజనులు సేయుకుత్సితాక్షేపణము లన్నియు నసంప్రదాయార్థితాపరిపూర్ణగ్రంథార్థపరిజ్ఞానప్రయుక్తావివేకమూలకము లని దృఢముగా నమ్ముచున్నారము.

నిష్కృష్టాభిప్రాయవివేచనము:—మీఁదఁ దెలిపినక్రమంబున భాగవత, విష్ణుపురాణ, హరివంశాదిగ్రంథప్రతిపాదిత ప్రమాణ వచనార్థపర్యాలోచనచేఁ గలిగెడు నిష్కృష్టాభిప్రాయం బఖిలజనులకుఁ గరతలామలకముగాఁ దెలియఁబడున ట్లీ దిగువ వివరించుచున్నాము.

ద్వాపరయుగపరిమితసంవత్సరములు ౮౬౪౦౦౦ లలో ౮౬౩౮౭౪ సంవత్సరములు, ౪ నెలలు, ౨౧ దినములు, గత మయినకాలమునందలి శ్రీముఖసంవత్సర శ్రావణబహుళనవమీవిద్ధాష్టమియందు రాత్రినిశీథకాలంబున వృషభలగ్నమునందు సంభవించినసర్వోత్తమం బగునభిజిన్ముహూర్తంబున శ్రీమదాదినారాయణపరబ్రహ్మమూర్తి లీలాగృహీతశరీరుం డయి దేవకీదేవిగర్భంబున నర్భకుం డయి యుదయించెను. అట్టియుదయకాలంబునఁ బ్రాగ్దిక్ప్రమితశిరస్కుండును, బశ్చిమదిగ్విన్యస్తపాదయుగళుండును, జతుర్బాహుండును, శంఖచక్రాద్యాయుధధరుండును, అధికతేజఃపుంజదీపితసూతికాగృహుండును నై పద్మపత్త్రంబుల శయనించి తేజరిల్లుచుండెను. అమ్మహాత్ముం డావిర్భావంబు నొందినమీఁదఁ దెలిపిన శ్రీముఖసంవత్సర శ్రావణబహుళాష్టమి మొదలుకొని లీలామానుషవిగ్రహంబుఁ దాల్చి భూలోకంబున నుండినసంవత్సరంబులు ౧౨౫ ను, నెలలు ౭ ను, దినములు ౮ యునుగా నున్నవి. అప్పురుషోత్తముండు లీలామానుషవిగ్రహంబు వదలి మరల వైకుంఠంబు ప్రవేశించినకాలంబు కలియుగాదిమసంవత్సరం బగుప్రమాదిసంవత్సర చైత్రశుద్ధప్రతిపద్భృగువాసర మగుచున్నది. బార్హస్పత్యమానరీతిని శ్రీకృష్ణావతారసంవత్సరముపార్థివ. నిర్యాణసంవత్సరము ఖర. అట్టిజగదీశ్వరునినిర్యాణానంతరము గతసంవత్సరంబుల పరిమితి ౫౦౧౨గానున్నవి. శ్రీకృష్ణమూర్త్యావిర్భావదినంబునందే నవమీఘటికలలో యశోదాదేవిగర్భంబున యోగమాయ జనించెను గాన యోగమాయ శ్రీకృష్ణానుజన్మ యని తెలియందగినది.

ఇదియునుం గాక నిఖిలాస్మదీయజనులకు నిత్యక్షేమము గలుగఁ జేసెడుసద్విద్యాభివృద్ధి నొందుటకు ముఖ్యసాధనంబులుగా నుండుసద్గ్రంథపరిష్కరణతత్ప్రకాశనాదిసత్క్రియలయందుఁ బ్రవర్తించి యుండెడునస్మత్సజాతీయు లగుజనులచే నత్యంతపరిశ్రమంబునం బరిష్కరింపంబడెడునస్మద్గ్రంథంబులఁ బఠించుటవలనఁ గలిగెడునానందంబు ననుభవించుసత్పురుషులు కృతజ్ఞులయి యుదేక్రమంబున నస్మదీయసద్గ్రంథంబు లభివృద్ధి నొందుట కత్యంతసహాయంబు చేయుటయం దపరిమితాసక్తి నొందియుండవలయు నని నిఖిలసజ్జనసద్విద్యావైదుష్యాభివర్ధనైకపరాయణుం డగునారాయణుని నిరంతరంబు ప్రార్థించుచున్నారము.

పురాణం - హయగ్రీవశాస్త్రులు.

విషయసూచిక.

ప్రథమస్కంధము.

విషయము.		పుట.
ఇష్టదేవతాదిప్రార్థనము.	... ...	1
కృతిపతిత్వనిర్ణయము.	... ...	3
గ్రంథకర్తృవంశావతారము	... ...	4
శ్రీమహాభాగవతకథాప్రారంభము	... ...	5
సూతుండు నారాయణకథాప్రశంస సేయుట	... ...	8
భగవంతునియేకవింశత్యవతారములు	... ...	11
శ్రీమహాభాగవతరచనాదివృత్తాంతము	... ...	13
వ్యాసుండు వ్యాకులచిత్తుండై చింతించుట	... ...	15
వ్యాసునికడకు నారదుండు వచ్చుట	... ...	16
నారదునిపూర్వజన్మవృత్తాంతము	... ...	18
అర్జునుండు పుత్రఘాతి యగునశ్వత్థామ నవమానించుట	... ...	23
ద్రౌపది యశ్వత్థామను జూచి సంభాషించుట	... ...	25
శ్రీకృష్ణుండుత్తరాగర్భస్థుండగునర్భకుని రక్షించుట	... ...	27
కుంతీదేవి శ్రీకృష్ణుని నుతించుట	... ...	28
ధర్మజుండు శ్రీకృష్ణసహితుండై శరతల్పగతుండైనభీష్మునికడ కేఁగుట	...	31
భీష్ముఁడు శ్రీకృష్ణుని స్తుతించుట	... ...	33
శ్రీకృష్ణుండు ద్వారకానగరంబున కరుగుట	... ...	35
శ్రీకృష్ణుండు ద్వారకానగరంబు ప్రవేశించుట	... ...	37
శ్రీకృష్ణుండంతఃపురకాంతలం జూడఁబోవుట	... ...	39
ఉత్తరకుఁ బరీక్షిత్తు జనించుట	... ...	41
గాంధారీధృతరాష్ట్రులు దేహత్యాగము చేసికొనుట	... ...	45
ధర్మరాజు దుర్నిమిత్తంబులం గని చింతించుట	... ...	49
అర్జునుండు ద్వారకనుండి వచ్చి కృష్ణనిర్యాణము దెలుపుట	... ...	50
ధర్మరాజు పరీక్షిన్మహారాజునకుఁ బట్టము గట్టి మహాప్రస్థానంబున కేఁగుట	...	54
పరీక్షిన్మహారాజు భూధర్మదేవతలసంవాదం బాలించుట	... ...	56
కలిపురుషుఁడు ధర్మదేవతను దన్నుట	... ...	58

విషయము.			పుట.
పరీక్షిన్మహారాజు కలిని నిగ్రహించి ధర్మపరిపాలనము సేయుట		...	60
పరీక్షిన్మహారాజు వేఁటాడి శమీకమహామునిపై మృతసర్పము నెత్తివైచుట		...	63
శమీకమహామునిపుత్రుం డగుశృంగిముని పరీక్షిత్తుని శపించుట	...	...	64
పరీక్షిన్మహారాజు విప్రశాపంబు దెలిసికొని ప్రాయోపవిష్టుం డగుట		...	67
శుకమహర్షి పరీక్షిన్మహారాజునొద్ద కేతెంచుట	...	...	69

ద్వితీయస్కంధము.

శుకుండు పరీక్షిత్తునకు విరాట్స్వరూపంబు దెలుపుట	...	...	74
శుకమహర్షి పరీక్షిన్మహారాజునకు భక్తిమార్గంబు ముఖ్యం బని తెలుపుట		...	79
నారదుండు బ్రహ్మను బ్రపంచప్రకారముఁ దెలుపు మని యడుగుట		...	83
శ్రీమన్నారాయణునిలీలావతారంబులయభివర్ణనము	...	...	92
పరీక్షిన్మహారాజు శుకయోగిని బ్రపంచోద్భవాదికంబు నడుగుట	...	...	104
శ్రీమన్నారాయణుండు బ్రహ్మతపంబునకు మెచ్చి వరంబు లిచ్చుట		...	107

తృతీయస్కంధము.

విదురుం డుద్ధవుం గని కృష్ణాదులవృత్తాంతం బడుగుట	...	...	122
విదురమైత్రేయసంవాదము	...	...	137
స్వాయంభువమనువు ప్రజావృద్ధి చేయుట	...	...	169
శ్రీయజ్ఞవరాహావతారవర్ణనము	...	...	170
శ్రీయజ్ఞవరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతియించుట	...	...	172
మైత్రేయమహాముని విదురునకు హిరణ్యాక్షహిరణ్యకశిపులజననం బెఱింగించుట		...	176
సనకసనందనాదులు వైకుంఠమున కరుగుట	...	...	181
సనకసనందనాదులు నారాయణదేవుని స్తుతించుట	...	...	187
జయవిజయులు దితిగర్భంబున హిరణ్యాక్షహిరణ్యకశిపులై పుట్టుట		...	192
హిరణ్యాక్షుఁడు యజ్ఞవరాహం బగుహరి నెదిరించి పోరుట	...	...	195
చతుర్ముఖుం డొనర్చుయక్షాదిదేవతాగణసృష్టిఁ దెలుపుట	...	...	203
కర్దమప్రజాపతి భగవదనుజ్ఞ వడసి దేవహూతిని బెండ్లియాడుట		...	207
కర్దమప్రజాపతి యోగప్రభావంబుచే విమానంబు గల్పించి భార్యతోఁగూడ విహరించుట			214
దేవహూతిగర్భంబున విష్ణుండు కపిలాచార్యుఁడుగాఁ బుట్టుట ...		...	218
దేవహూతి తనపుత్రుం డైనకపిలునివలనఁ దత్త్వజ్ఞానంబు వడయుట		...	221
కపిలుండు దేవహూతికి భక్తియోగమును దెలియఁజేయుట	...	...	237
కపిలుండు దేవహూతికిఁ బిండోత్పత్తిక్రమంబుఁ దెలుపుట	...	...	242
గర్భస్థుం డగుజీవుండు భగవంతుని స్తుతియించుట	...	...	243

చతుర్థస్కంధము.

కర్దమప్రజాపతిసంతతిని దెలుపుట	...	...	255

విషయము.	పుట.
దక్షప్రజాపతిసంతతిని దెలియఁజేయుట	258
ఈశ్వరునకు దక్షప్రజాపతికిని విరోధము సంభవించినకథ	259
దక్షప్రజాపతియజ్ఞమునకు దాక్షాయణి పోఁగోరుట	262
శివుఁడు వీరభద్రునిచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు సేయించుట	268
దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితు లయి బ్రహ్మతో విన్నవించుట ...	270
బ్రహ్మాదులు దక్షకామార్తిరూపుం డగునీశ్వరుని స్తుతియించుట ...	272
శివుఁడు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుం డై దక్షాదుల ననుగ్రహించుట ...	274
దక్షాధ్వరంబునకు వచ్చిననారాయణుని దక్షాదులు నుతించుట	276
ధ్రువోపాఖ్యానము	282
ధ్రువుండు నారదోపదేశంబు వడసి తపంబుఁ జేయుట	283
సాక్షాత్కరించినభగవంతుని ధ్రువుండు స్తుతియించుట	288
ధ్రువుండు మరలి తనపురంబునకు వచ్చుట	292
ధ్రువుండు కుబేరానుచరు లైనగుహ్యకులతో యుద్ధముచేయుట... ...	295
అంగపుత్రుం డగువేనునిచరిత్రము	305
పృథుచక్రవర్తి గోరూపధారిణి యగుభూమివలన నోషధులఁ బిదుకుట ...	314
పృథుచక్రవర్తి యశ్వమేధంబు సేయునెడ నింద్రుం డశ్వము నపహరించుట ...	319
నారాయణుండు ప్రసన్నుం డయి పృథుచక్రవర్తి ననుగ్రహించుట ...	322
పృథుచక్రవర్తి సభాసదులకు సద్ధర్మముల నుపదేశించి బ్రాహ్మణప్రశంస చేయుట ...	327
పృథుచక్రవర్తియొద్దకు సనకాదు లరుగుదెంచుట	332
పృథుచక్రవర్తి జ్ఞానవైరాగ్యవంతుం డయి ముక్తి నొందుట	337
రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశ మనుస్తోత్రమును దెల్పుట	343
నారదుండు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలియఁజేయుట	349
పురంజనోపాఖ్యానము	,,
ప్రచేతసులతపంబునకు భగవంతుండు మెచ్చి వరంబు లిచ్చుట	371
పంచమస్కంధము – ప్రథమాశ్వాసము.	
భగవంతుఁ డగునారాయణుండు ఋషభావతార మెత్తుట	387
ఋషభుండు పుత్రులకు నీతి యుపదేశించుట	391
భరతోపాఖ్యానము	397
భరతుండు హరిణజన్మంబు విడిచి బ్రాహ్మణుం డయి జనియించుట ...	401
వృషభరాజభృత్యులు కాళికి బలియిచ్చుటకై భరతునిఁ గొనిపోవుట ...	403
భరతుండు రహూగణునిమాటలకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట	405
పంచమస్కంధము – ద్వితీయాశ్వాసము.	
శుకయోగి పరీక్షిత్తున కుపదేశరూపమునఁ దెలుపుభూగోళస్వరూపాదికము ...	416

విషయము.			పుట.
భగణవిషయము	...	...	429
శుకయోగి పరీక్షిత్తున కుపదేశరూపమునఁ దెలిపెడినరకలోకవర్ణనము		...	439
షష్ఠస్కంధము.			
అజామిళోపాఖ్యానము	...	...	450
విష్ణుదూతయమదూతలసంవాదము	...	...	451
దక్షుఁడు స్తుతియించినహంసగుహ్యం బను స్తవరాజము	...	...	466
నారదుండు శబళాశ్వులకు నివృత్తిమార్గంబు నుపదేశించుట	...	...	472
దక్షుండు, నారదుని శపియించి ప్రజాసర్గం బొనరించుట	...	...	473
దానవులు దేవతలతో యుద్ధము చేసి యోడించుట	...	...	478
శ్రీమన్నారాయణకవచప్రారంభము	...	...	481
చిత్రకేతూపాఖ్యానము	...	...	505
చిత్రకేతుండు తపం బాచరించి భగవత్ప్రసాదంబు నొందుట	...	...	510
చిత్రకేతుం డీశ్వరధిక్కారంబువలన గౌరిచే శాపంబు నొందుట		...	513
సవితృవంశప్రవచనాదికత	...	...	516
సప్తమస్కంధము.			
శ్రీహరిద్వారపాలకులైనజయవిజయులకు సనకాదులవలన శాపంబు గలుగుట		...	525
బాలవేషము దాల్చినయముండు దెలిపెడుసుయజ్ఞోపాఖ్యానము...		...	528
బ్రహ్మదేవుండు హిరణ్యకశిపునకు వరంబు లిచ్చుట	...	...	532
ప్రహ్లాదచరిత్రప్రారంభము	...	...	537
హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని వివిధోపాయంబుల హింసించుట	...	...	544
శ్రీహరి నరసింహరూపంబున స్తంభంబునం దావిర్భవించుట	...	...	557
శ్రీనృసింహమూర్తి హిరణ్యకశిపునితోఁ బోరి వధించుట	...	...	559
బ్రహ్మాదిదేవతలు శ్రీనృసింహదేవుని వేఱువేఱుగా స్తుతించుట	...	...	561
ప్రహ్లాదుండు నరసింహమూర్తిని స్తుతించుట	...	...	565
త్రిపురాసురసంహారము	...	...	572
నారదుఁడు ధర్మరాజునకు వర్ణాశ్రమధర్మంబు దెలుపుట	...	...	574
ప్రహ్లాదాజగరమునులసంవాదము	...	...	579
నారదునిపూర్వజన్మవృత్తాంతము	...	...	587

శ్రీహయగ్రీవాయ నమః.

శ్రీ సరస్వతీ ప్రార్థన.

ఉ. క్షోణితలంబు నెన్నుదురు ♦ సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయ♦సుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవ♦చిత్తవశీకరణైకవాణికిన్
వాణికి నక్షదామశుక♦వారిజపుస్తకరమ్యపాణికిన్.

శా. తల్లీ నిన్నుఁ దలంచి పుస్తకము చే♦తం బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా ♦ నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదువాక్కునను సం♦ప్రీతిన్ జగన్మోహినీ
ఫుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ ♦ పూర్ణేందుబింబాననా.

శ్రీమద్భాగవతగ్రంథప్రణేత యగువ్యాసమహర్షి ప్రార్థన.

ఉ. ప్రాంశుపయోదనీలతను♦భాసితు నుజ్జ్వలదండధారుఁ బిం
గాంశుజటాచ్ఛటాధరుని ♦ నాగమపుంజపదార్థతత్త్వని
స్సంశయకారుఁ గృష్ణమృగ♦చర్మకృతాంబరకృత్యు భారతీ
వంశవివర్ధనుం ద్రిదశ♦వందితు సాత్యవతేయుఁ గొల్చెదన్.

శ్రీమద్భాగవతార్థోపదేష్ట యగుశుకమహర్షి ప్రార్థన.

మ. సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై ♦ సన్న్యాసియై యొంటిఁ బో
వ మహాభీతి నోహో కుమార యనుచున్ ♦ వ్యాసుండు చీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు చ♦క్కం జేసె మున్నట్టిభూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణిఁ దపో♦ధన్యాగ్రణిన్ ధీమణిన్.

శ్రీమద్భాగవత ప్రార్థన.

ఆ. వేదకల్పవృక్ష♦విగళిత మయి శుక
ముఖసుధాద్రవమున ♦ మొనసి యున్న
భాగవతపురాణ♦ఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు రసిక♦భావవిదులు.

మ. లలితస్కంధము కృష్ణమూలము శుకా♦లాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమన♦స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమల♦వ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వు♦ర్విన్ సద్విజశ్రేయ మై.

క. నిగమములు వేయి చదివిన
సుగమంబులు గావు ముక్తి♦సుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను
నిగమంబుఁ బఠింప ముక్తి♦నివసనము బుధా.

ఆ. అతిరహస్య మైన♦హరిజన్మకథనంబు
మనుజుఁ డెవ్వఁ డేని ♦ మాపు రేపు
చాల భక్తితోడఁ ♦ జదువుఁ దా సంసార
దుఃఖరాశిఁ బాసి ♦ తొలఁగిపోవు.

శ్రీభాగవతగ్రంథప్రతిపాద్యశ్రీకృష్ణమూర్తిప్రార్థన.

మ. తరుణాబ్జారుణలోచనద్వయి కృపా♦ధారేయ మై యొప్పసా
గరకన్యాకుచకుంభపాళిఁ బులకల్ ♦ గన్పట్ట మౌనీంద్రహృ
త్సరసీజంబులు సంచలింప మురళీ♦సంజాతగీతామృత
స్ఫురణన్ రా ల్గరఁగం జరించుహరికై♦శోరంబు భావించెదన్.

చ. జలనిధికన్యకాఘనకు♦చస్థలిపచ్ఛలతాళి గోపికా
విలసితహారమధ్యమణి♦విశ్వజగద్వలయప్రకాశకో
జ్జ్వలమహనీయరత్న మని♦వారిత కాళియభోగిభోగమం
డలగిరివజ్ర మై వెలయు♦నందతనూజు భజింతు నామదిన్.

గ్రంథనాయకుం డగుశ్రీరామమూర్తిప్రార్థన.

క. శ్రీకంఠచాపఖండన
పాకారిప్రముఖవినుత♦భండన విలస
త్కాకుత్స్థవంశమండన
రాకేందుయశోవిశాల ♦ రామనృపాలా.

శుద్ధపత్రము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
13	26	వన్యూనంబుగా	నన్యూనంబుగా
17	29	ప్రాతేందు	ప్రాంతేందు
45	22	యప్పడుఫు	యప్పడుపు
,,	34	యప్పడుఫు	యప్పడుపు
56	14	యక్పకవి	యప్పకవి
72	18	తెలిపియన్నాఁడు	తెలిపియున్నాఁడు
17	31	ఎఱిఁగెడువాడు	ఎఱిఁగెడువాఁడు
346	9	పరిస్పదంబునం	పరిస్పందంబునం
364	22	అనఘా త్త	అనఘాత్మ
365	19	ప్రకాశభూయిపలోకముల	ప్రకాశభూయిష్ఠలోకముల
367	10	నన్నయము	న్ననయము
,,	33	లఘుచుఁ జ్రకాశమాన	లగుచుఁ ప్రకాశమాన
369	13	దృష్టంబుము	దృష్టంబును
373	8	క్లేశనాశనుఁడువు	క్లేశనాశనుఁడవు
390	15	జన్మమునంగు	జన్మమునందును
405	1	గంటంకంబుగా	గం.కంబుగా
415	3	నతకిని	నతనికి
597	22	జగములంగలిగిఁచు	జగములఁగలిగించు
612	5	గడలెడలసురులు	గడలెడల సురలు
,,	18	హై నెఱమంటలును	హైన నెఱమంటలును
642	19	పలుపంచలును	పలుపంచలను
655	30	నభంబున	నభంబును
678	11	మూఁధులయ్యెదరు	మూఢులయ్యెదరు
721	12	దండ్రిఁ పనిచినఁ	దండ్రి పనిచినఁ
722	26	♦వడి నర్జునజాతుల	వడ ♦ న...జాతుల
846	5	నిఖిలవక్షములు	నిఖిలవృక్షములు
892	7	నిట్టిట్టు	నిట్టట్టు
909	1	విద్వజ్జనని కేతనంబును	విద్వజ్జననికేతనంబును
920	11	వాతాశితోఁ	వాతాశితోఁ
984	14	సురచిరగోరస్థ స్వలిఁ	సురుచిరగోరస్థ స్వలిఁ
971	2	పాతివ్రత్యంబునా యందలి	పాతివ్రత్యంబు నాయందలి
1057	18	చరితము విను	చరితము వినుస



1. బమ్మెరపోతన - సీతా, రామ, లక్ష్మణులు.

శ్రీరస్తు

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

ప్రథమస్కంధము.

మంగళము

శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁ [1]కేళిలోలవిలసద్దృగ్జాలసంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్. 1

ఇష్టదేవతాదిప్రార్థనము.

ఉ. వాలినభక్తి మ్రొక్కెద నవారితతాండవకేళికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మమయూఖమాలికిన్
బాలశశాంకమౌళికిఁ గపాలికి మన్మథగర్వపర్వతో
న్మూలికి నారదాదిమునిముఖ్యమనస్సరసీరుహాలికిన్. 2

ఉ. ఆతతసేవఁ జేసెద సమస్తచరాచరభూతసృష్టివి
జ్ఞాతకు భారతీహృదయసౌఖ్యవిధాతకు వేదరాశిని
ర్ణేతకు దేవతానికరనేతకుఁ గల్మషజేతకున్ నత
త్రాతకు ధాతకున్ నిఖిలతాపసలోకశుభప్రదాతకున్. 3

వ. అని నిఖిలభువనప్రధానదేవతావందనంబుఁ జేసి. 4

---

1 కేళీ[illegible]

ఉ. ఆదర మొప్ప మ్రొక్కిడుదు నద్రిసుతాహృదయానురాగసం
పాదికి దోషభేదికిఁ బ్రపన్నవినోదికి విఘ్నవల్లికా
చ్ఛేదికి మంజువాదికి నశేషజగజ్జననందవేదికిన్
మోదకఖాదికిన్ సమదమూషకసాదికి సుప్రసాదికిన్.

ఉ. క్షోణితలంబు[1]నన్ నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవచిత్తవశీకరణైకవాణికిన్
వాణికి నక్షదామశుకవారిజపుస్తకరమ్యపాణికిన్. 6

శా. పుట్టం బుట్ట శరంబునన్ మొలవ నంభోయానపాత్రంబునన్
నెట్టం గల్గను గాళిఁ గొల్వను బురాణింపన్ దొరంకొంటి మీఁ
దెట్టే వెంట [2]రచింతుఁ దత్సరణి [3]నీ వీవమ్మ యోయమ్మ మేల్
పట్టున్ [4]మానకువమ్మ నమ్మితిఁ జుమీ బ్రాహ్మీ దయాంభోనిధీ. 7

ఉ. *శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధాపయోధి సితతామర సామరవాహినీ శుభా
కారత నొప్పునిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు భారతీ! 8

ఉ. *అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి ప్రకటస్ఫుటభూషణరత్నదీపికా
చుంబితదిగ్విభాగ శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ భా
వాంబరవీథివిశ్రుతవిహారిణి నన్ గృపఁ జూడు భారతీ! 9

ఉ. అమ్మలఁ గన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాలఁ బె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడిఁ బుచ్చినయమ్మ దన్ను లోఁ
నమ్మిన వేల్పు[5]టమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వపటుత్వసంపదన్. 10

మ. హరికిం బట్టపుదేవి పున్నెములప్రో వర్థంపుఁబెన్నిక్క చం
దురుతోఁబుట్టువు భారతీగిరిసుతల్ దో నాడుపూఁబోఁడి దా
మరలం దుండెడిముద్దరాలు జగముల్ మన్నించునిల్లాలు భా
సురతన్ లేములు వాపుతల్లి సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్. 11

---

1 నెన్నుదురు. 2 'జరింతుఁ' అని యచ్చుప్రతి. 3 'నా ♦ కీవమ్మ' అని యచ్చుప్రతి.
4 'నా కగుదమ్మ' అని యచ్చుప్రతి.

*ఈరెండుపద్యములు వ్రాఁతప్రతులందుఁ గానంబడవు; ప్రక్షిప్తములుగాఁ దోఁచెడిని. రెండవది మహాభారతమునందలియారణ్యపర్వములోనిచతుర్థాశ్వాసంబున నత్రిగౌతమసంవాదఘట్టమున నున్నది.

5 టన్నులమ♦నమ్ముల.

వ. అని యిష్టదేవతలం జింతించి దినకరకుమారప్రముఖులం దలంచి ప్రథమకవితావిరచనవిద్యావిలాసాతిరేకి వాల్మీకి నుతియించి హయగ్రీవవదనుజకరపరిమిళితనిగమనివహవిభాగనిర్ణయనిపుణతాసముల్లాసునకు వ్యాసునకు మ్రొక్కి శ్రీమహాభాగవతకథాసుధారసప్రయోగికి శుకయోగికి నమస్కరించి మృదుమధురవచనవర్గపల్లవితస్థాణునకుఁ బాణునకుం బ్రణమిల్లి కతిపయశ్లోకసమ్మోదితసూరు మయూరు నభినందించి మహాకావ్యకరణకళావిలాసుం గాళిదాసుం గొనియాడి కవికమలరవిఁ భారవిం బొగడి విదళితాఘు మాఘు వినుతించి యాంధ్రకవితాగౌరవజనమనోహారి నన్నయసూరిం గైవారంబు సేసి హరిహరచరణారవిందవందనాభిలాషిం దిక్కమనీషిఁ భూషించి మఱియు నితరపూర్వకవిజనసంభావనంబు గావించి వర్తమానకవులకుం బ్రియంబు వలికి భావికవుల బహూకరించి యుభయకావ్యకరణదక్షుండ నై. 12

కృతిపతిత్వనిర్ణయము.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట[1]వాటులం బడక సమ్మతితో హరి [2]కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్. 13

తే. [3]చేతు లారంగ శివునిఁ బూజింపఁ డేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁ డేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేనిఁ, గలుగ నేటికిఁ దల్లుల కడుపుఁ జేటు. 14

వ. అని మఱియు మదీయపూర్వజన్మసహస్రసంచితతపఃఫలంబున శ్రీమన్నారాయణకథాప్రపంచవిరచనాకుతూహలుండ నై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకం గని సజ్జనానుమతంబున సభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగు గంగకుం జని క్రుంకు లిడి వెడలి మహనీయమంజులపులినతలమంటపమధ్యంబున మహేశ్వరధ్యానంబు సేసి కించిదున్మీలితలోచనుండ నై యున్న యెడ. 15

సీ. మెఱుఁగు చెంగట నున్న మేఘంబు కైవడి, నువిద చెంగట నుండ నొప్పువాఁడు
చంద్రమండలసుధాసారంబు పోలిక, ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుతతమాలవసుమతీజము భంగి, బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీలనగాగ్రసన్నిహితభానునిభంగి, ఘనకిరీటము దలఁ గలుగువాఁడు

ఆ. పుండరీకయుగముఁ బోలు కన్నులవాఁడు, వెడఁదయురమువాఁడు విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁ డొక్కరుఁడు నా, కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె.

వ. ఏను నా రాజశేఖరుం దేఱి చూచి భాషింప యత్నంబు సేయు నెడ నతండు దా రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుఁగు సేయు

1 ప్రేటులం. 2. కిచ్చుఁ జెప్పె. 3 చేతు లలయంగ.

ము నీకు భవబంధంబులు దెగు నని యానతిచ్చి తిరోహితుం డయిన సమున్మీలితనయనుండ నై వెఱఁగుపడి చిత్తంబున. 17

క. పలికెడిది భాగవత మఁట, పలికించువిభుండు రామభద్రుం డఁట నేఁ
బలికిన భవహర మగు నఁట, పలికెద వేఱొండుగాథ వలుకఁగ నేలా. 18

ఆ. భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు, శూలి కైనఁ దమ్మిచూలి కైన
విబుధజనులవలన విన్నంత గన్నంత, దెలియ వచ్చినంత తేటపఱుతు. 19

క. కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ, గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణము లగు నే, నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్. 20

మ. ఒనరన్ నన్నయతిక్కనాదికవు లీయుర్విం బురాణావళుల్
తెనుఁగుం జేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్. 21

మ. లలితస్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమలవ్యాసాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయ మై. 22

వ. ఇట్లు భాసిల్లెడు శ్రీమహాభాగవతపురాణపారిజాతపాదపసమాశ్రయంబునను హరికరుణావిశేషంబునను గృతార్థత్వంబు సిద్ధించె నని బుద్ధి నెఱింగి లేచి మరలి కొన్నిదినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుండ నై. 23

గ్రంథకర్తృవంశావతారము

సీ. కౌండిన్యగోత్రసంకలితుఁ డాపస్తంబ, సూత్రుండు పుణ్యుండు సుభగుఁ డైన
భీమనమంత్రికిఁ బ్రియపుత్రుఁ డన్నయ, కలకంఠి తద్భార్య గౌరమాంబ
కమలాప్తువరమునఁ గనియె సోమనమంత్రి, వల్లభ మల్లమ వారితనయుఁ
డెల్లన యతనికి నిల్లాలు మాచమ, వారిపుత్రుఁడు వంశవర్ధనుండు

ఆ. లలితమూర్తి బహుకళానిధి కేసన, దానమాననీతిధనుఁడు ఘనుఁడు
దనకు లక్కమాంబధర్మగేహిని గాఁగ, మనియె శైవశాస్త్రమతముఁ గనియె.

క. నడవదు నిలయము వెలువడి, తడవదు పరపురుషగుణముఁ దనపతినుడువుం
గడవదు వితరణకరుణలు, విడువదు లక్కాంబ విబుధవిసరము వొగడన్. 25

ఉ. మానిను లీడు గారు బహుమాననివారితదీనమానస
గ్లానికి దానధర్మమతిగౌరవమంజులతాగభీరతా

స్థానికి [1]ముద్దుసానికి సదాశివపాదయుగార్చనానుకం
పానయవాగ్భవానికిని బమ్మెర కేసయలక్కసానికిన్. 26

క. ఆమానినికిం బుట్టితి, మే మిరువుర మగ్రజాతుఁ డీశ్వరసేవా
కాముఁడు తిప్పన పోతన, నామవ్యక్తుండ సాధునయయుక్తుండన్. 27

వ. అయిననేను నాచిత్తంబున శ్రీరామచంద్రునిసన్నిధానంబు గల్పించుకొని. 28

—షష్ఠ్యంతములు.—

ఉ. హారికి నందగోకులవిహారికిఁ జక్రసమీరదైత్యసం
హారికి భక్తదుఃఖపరిహారికి గోపనితంబినీమనో
హారికి దుష్టసంపదపహారికి ఘోషకుటీపయోఘృతా
హారికి బాలకగ్రహమహాసురదుర్వనితాప్రహారికిన్. 29

ఉ. శీలికి నీతిశాలికి వశీకృతశూలికి బాణహస్తని
ర్మూలికి ఘోరనీరదవిముక్తశిలాహతగోపగోపికా
పాలికి వర్ణధర్మపరిపాలికి నర్జునభూజయుగ్మసం
చాలికి మాలికిన్ విపులచక్రనిరుద్ధమరీచిమాలికిన్. 30

ఉ. క్షుంతకుఁ గాలియోరగవిశాలఫణావళినర్తనక్రియా
రంతకు నుల్లసన్మగధరాజచతుర్విధఘోరవాహినీ
హంతకు నింద్రనందననియంతకు సర్వచరాచరావళీ
మంతకు నిర్జితేంద్రియసమంచితభక్తజనానుగంతకున్. 31

ఉ. న్యాయికి భూసురేంద్రమృతనందనదాయికి రుక్మిణీమన
స్స్థాయికి భూతసమ్మదవిధాయికి సాధుజనానురాగసం
ధాయికిఁ బీతవస్త్రపరిధాయికిఁ బద్మభవాండభాండని
ర్మాయికి గోపికానివహమందిరయాయికి శేషశాయికిన్. 32

వ. సమర్పితంబుగా నే నాంధ్రంబున రచియింపం బూనిన శ్రీమహాభాగవతపురాణం
బునకుం గథాప్రారంభం బెట్టి దనిన. 33

—శ్రీమహాభాగవతకథాప్రారంభము.—

సీ. విశ్వజన్మస్థితివిలయంబు లెవ్వని, వలన నేర్పడు ననువర్తనమున
వ్యావర్తనమునఁ గార్యములం దభిజ్ఞుఁడై, తాన రాజగుచుఁ జిత్తమునఁ జేసి
వేదంబు లజునకు విదితముల్ గావించె, నెవ్వఁడు బుధులు మోహింతు రెవ్వ
నికి నెండమావుల నీళ్లఁ గాచాదుల, నన్యోన్యబుద్ధి దా నడరునట్లు
ఆ. త్రిగుణసృష్టి యెందు దీపించి సత్యము, భంగిఁ దోఁచు స్వప్రభానిరస్త
కుహకుఁ డెవ్వఁ డతనిఁ గోరి చింతించెద, [2]ననఘు సత్యుఁ బరుని ననుదినంబు.

---

1 ముద్దసానికి. 2 వాద్యుఁ బరుని సత్యు.

వ. ఇట్లు సత్యం పరం ధీమహి యనుగాయత్రీప్రారంభంబున గాయత్రీనామబ్రహ్మ
రూపం బై మత్స్యపురాణంబులోన గాయత్రి నధికరించి ధర్మవిస్తరంబును
వృత్రాసురవధంబు నెందుఁ జెప్పంబడు నదియ భాగవతం బని పలుకుటం జేసి
యీపురాణంబు శ్రీమహాభాగవతం బన నొప్పుచుండు. 35

సీ. శ్రీమంత మై మునిశ్రేష్ఠకృతం బైన, భాగవతంబు సద్భక్తితోడ
వినఁ గోరువారలవిమలచిత్తంబులఁ, జెచ్చెర నీశుండు సిక్కుఁ గాక
యితరశాస్త్రంబుల నీశుండు సిక్కునే, మంచివారలకు నిర్మత్సరులకుఁ
గపటనిర్ముక్తు లై కాంక్ష సేయకయుండుఁ, దగిలి యుండుట మహాతత్త్వబుద్ధి
తే. పరఁగ నాధ్యాత్మికాదితాపత్రయంబు, నడఁచి పరమార్థభూత మై యధికసుఖద
మైసమస్తంబుఁ గాకయు నయ్యునుండు, వస్తు వెలుఁగంగఁ దగు భాగవతమునందు.

ఆ. వేదకల్పవృక్షవిగళిత మై శుక, ముఖసుధాద్రవమున మొనసి యున్న
భాగవతపురాణఫలరసాస్వాదన, పదవిఁ గనుఁడు రసికభావవిదులు. 37

క. పుణ్యం బై మునివల్లభ, గణ్యం బై కుసుమఫలనికాయోత్థితసా
ద్గుణ్యంబు నైమిశాఖ్యా, రణ్యంబు నుతింపఁ దగు నరణ్యంబులలోన్. 38

వ. మఱియును మధువైరిమందిరంబునుం బోలె మాధవమన్థమహితం బై బ్రహ్మ
గేహంబునుం బోలె శారదాన్వితం బై నీలగళసభానికేతనంబునుం బోలె వహ్ని
వరుణ సమీరణచంద్ర రుద్ర హైమవతీ కుబేర వృషభ గాలవ శాండిల్య పాశుపత
జటిపటలమండితం బై బలభేదిభవనంబునుం బోలె నైరావ తామృత రంభా
గణికాభిరామం బై మురాసురనిలయంబునుం బోలె నున్మత్తరాక్షసవంశ సంకు
లం బై ధనదాగారంబునుం బోలె శంఖపద్మకుందముకుందసుందరం బై రఘు
రామయుద్ధంబునుం బోలె నిరంతరశరానలశిఖాబహుళం బై పరశురాము
భండనంబునుం బోలె నర్జునోద్భేదం బై దానవసంగ్రామంబునుం బోలె నరిష్ట
జంభనికుంభశక్తియుక్తం బై కౌరవసంగరంబునుం బోలె ద్రోణార్జునకాంచన
స్యందనకదంబసమేతం బై కర్ణకలహంబునుం బోలె మహోన్నతశల్యసహా
కారం బై సేతుబంధనంబునుం బోలె నలనీలపనసాదిప్రదీపితం బై భర్గుభజ
నంబునుం బోలె నానాశోకలేఖాఫలితం బై మరునికోదండంబునుం బోలెఁ
బున్నాగశిలీముఖభూషితం బై నరసింహరూపంబునుం బోలెఁ గేసరకరజకాం
తం బై నాట్యరంగంబునుం బోలె నటనటీసుషిరాన్వితం బై శైలజానిటలంబునుం
బోలెఁ జందనకర్పూరతిలకాలంకృతం బై వర్షాగమంబునుం బోలె నింద్రబా
ణాసనమేఘకరకకమనీయం బై నిగమంబునుం బోలె గాయత్రీవిరాజితం బై
మహాకావ్యంబునుం బోలె సరసమృదులతాకలితం బై వినతాలయంబునుం బోలె
సుపర్ణరుచిరం బై యమరావతీపురంబునుం బోలె సుమనోలలితం బై కైటభో
ద్యోగంబునుం బోలె మధుమానితం బై పురుషోత్తమసేవనంబునుం బోలె

నమృత ఫలదం బై ధనంజయసమీకంబునుంబోలె నభ్రంకషరాగం బై వైకుం
ఠపురంబునుంబోలె ఖడ్గపుండరీకవిలసితం బై నందఘోషంబునుంబోలెఁ గృష్ణ
సారసుందరం బై లంకానగరంబునుంబోలె రామమహిషీవంచకసమేతం బై
సుగ్రీవసైన్యంబునుంబోలె గజగవయశరభశోభితం బై నారాయణస్థానంబును
బోలె నీలకంఠ హంస కౌశిక శుక భరద్వాజ తిత్తిరిభాసురం బై మహాభారతంబు
నుంబోలె నేకచక్ర బక కంక ధార్తరాష్ట్ర శకుని నకులసంచారసమ్మిళితం బై
సూర్యరథంబునుంబోలె నురుతరప్రవాహం బై జలదకాలసంధ్యాముహూర్తం
బునుంబోలె బహువితతజాతిసౌమనస్యం బై యొప్పు నైమిశారణ్యం బను శ్రీవిష్ణు
క్షేత్రంబునందు శౌనకాదిమహామునులు స్వర్లోకగీయమానుం డగుహరిం జేరు
కొఱకు సహస్రవర్షంబు లనుష్ఠానకాలంబుగాఁ గలసత్త్రసంజ్ఞికం బైనయాగం
బు సేయుచుండి రం దొక్కనాఁడు వారలు రేపకడ నిత్యనైమిత్తికహోమంబు
లాచరించి సత్కృతుం డై సుఖాసీనుం డై యున్నసూతుం జూచి. 39

క. ఆతాపసు లి ట్లనిరి వి, నీతున్ విజ్ఞాన[1]ఫలిత।నిగమపురాణ
వ్రాతున్ నుతహరిగణసం, ఘాతున్ సూతున్ నితాంత।కరుణోపేతున్. 40

మ. సమతం దొల్లి పురాణపంక్తు లితిహా।సశ్రేణులున్ ధర్మశా
స్త్రములున్ నీవు పఠించి చెప్పితివి వే।దవ్యాసముఖ్యుల్ మునుల్
సుమతుల్ సూచిన వెన్ని యన్నియును దోఁ।చున్ నీమదిం దత్ప్రసా
దమునం జేసి యెఱుంగ నేర్తువు సమ।స్తంబున్ బుధేంద్రోత్తమా. 41

క. గురువులు ప్రియశిష్యులకుం, బరమరహస్యములు దెలియఁ।బలుకుదు రచల
స్థిరకల్యాణం బెయ్యది, పురుషులకును నిశ్చయించి। బోధింపు తగన్. 42

క. మన్నాఁడవు చిరకాలము, గన్నాఁడవు పెక్కు లైన।గ్రంథార్థంబుల్
విన్నాఁడవు వినఁ దగినవి, యున్నాఁడవు పెద్దలొద్ద।నుత్తమగోష్ఠిన్. 43

చ. అలసులు మందబుద్ధిబలు।లల్పతరాయువు లుగ్రరోగసం
కలితులు మందభాగ్యులు సు।కర్మము లెవ్వియుఁ జేయఁ జాల రీ
కలియుగమందు మానవులు।గావున నెయ్యది సర్వసౌఖ్య మై
యలవడు నేమిటం బొడము।నాత్మకు శాంతి మునీంద్ర చెప్పవే. 44

సీ. ఎవ్వనియవతార।మెల్లభూతములకు, సుఖమును వృద్ధియు।సొరిదిఁ జేయు
నెవ్వనిశుభనామ।మేప్రొద్దు నుడువంగ, సంసారబంధంబు।సమసి పోవు
నెవ్వనిచరితంబు।హృదయంబుఁ జేర్పంగ, భయ మంది మృత్యువు।పరువుఁ బెట్టు
నెవ్వనిపదనది।నేపారుజలముల, సేవింప నైర్మల్య।సిద్ధి గలుగుఁ
తే. దపసు లెవ్వనిపాదంబు।దగిలి శాంతి, తెరువుఁ గాంచిరి వసుదేవ।దేవకులకు
నెవ్వఁ డుదయించెఁ దత్కథ।లెల్ల వినఁగ, నిచ్చపుట్టెడు నెఱిఁగింపు।మిద్ధచరిత.

1 ఫణిత।నిఖిల - నిగమ - పురాణ. 2 వీధి.

క. భూషణములు వాణికి నఘ, పేషణములు మృత్యుచిత్త । భీషణములు హృ
త్తోషణములు కల్యాణవి, శేషణములు హరిగుణోపచిత భాషణముల్. 46

క. కలిదోషనివారణ మై, యలఘుయశుల్ వొగడునట్టి । హరికథనము ని
ర్మలగతిఁ గోరెడుపురుషుఁడు, వెలయఁగ నెవ్వాఁడు దగిలి । వినఁడు మహాత్మా.

ఆ. అనఘ విను రసజ్ఞు । లై వినువారికి, మాటమాట కధిక । మధుర మైన
యట్టికృష్ణుకథన । మాకర్ణనము సేయఁ, దలఁపు గలదు మాకుఁ । దనివి లేదు.

మ. వరగోవిందకథాసుధారసమహా[1]వర్షోక్తిధారాపరం
పరలం గాక బుధేంద్రచంద్ర యితరోపాయానురక్తిం బ్రవి
స్తరదుర్దాంతదురంతదుస్సహజనుస్సంభావితానేకదు
స్తరగంభీరకఠోరకల్మషకనద్దావానలం బాఱునే. 49

సీ. హరినామకథనదావానలజ్వాలచేఁ, గాలవే ఘోరాఘ । కాననములు
వైకుంఠదర్శనవాయుసంఘంబుచేఁ, దొలఁగవే బహుదుఃఖ । తోయదములు
కమలనాథధ్యాన । కంఠీరవంబుచేఁ, గూలవే సంతాప । కుంజరములు
నారాయణస్మరణ । ప్రభాకరదీప్తిఁ, దీఱవే షడ్వర్గ । తిమిరతతులు

ఆ. నలిననయనభక్తి । నావచేఁ గాక సం,సారజలధి దాఁటి । చనఁగ రాదు
వేయు నేల మాకు । విష్ణుప్రభావంబు, దెలుపవయ్య సూత । ధీసమేత. 50

వ. మఱియుఁ గపటమానవుండును గూఢుండు నైనమాధవుండు రామసహితుం డై యతిమానుషంబు లైన పరాక్రమంబులు సేసె నట వాని వివరింపుము కలియుగంబు రాఁగల దని వైష్ణవక్షేత్రంబున దీర్ఘసత్త్రనిమిత్తంబున హరికథలు విననెడ గలిగి నిలిచితిమి దైవయోగంబున. 51

క. జలరాశి దాఁటఁ గోరెడి, కలముజనుల్ గర్ణధారుఁ । గాంచినభంగిం
గలిదోషహరణవాంఛా, కలితుల మగుమేము నిన్నుఁ । గంటిమి సూతా. 52

క. చారుతరధర్మరాశికి, భారకుఁ డగుకృష్ణుఁ డాత్మ । పదమున కేఁగన్
భారకుఁడు లేక యెవ్వనిఁ, జేరెను ధర్మంబు బలుపు । సెడి మునినాథా. 53

—సూతుండు నారాయణకథాప్రశంస సేయుట.—

వ. అని యిట్లు మహనీయగుణగరిష్ఠు లయినశౌనకాదిమునిశ్రేష్ఠు లడిగిన రోమహర్షణపుత్త్రుం డయి యుగ్రశ్రవసుం డనుపేర నొప్పి నిఖిలపురాణవ్యాఖ్యాన వైఖరీసమేతుం డైనసూతుండు. 54

మ. సముఁ డై యెవ్వఁడు ముక్తకర్మచయుఁ డై । సన్న్యాసి యై యొంటి వో
వ మహాభీతి నోహో కుమార యనుచున్ । వ్యాసుండు సీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు సక్కం జేసె మున్నట్టిభూ
తమయున్ మ్రొక్కెద బాదరాయణిఁ దపోధన్యాగ్రణిన్ ధీమణిన్. 55

1 వర్షోద్ధారా.

సీ. కార్యవర్గంబును గారణసంఘంబు, నధికరించి చరించు నాత్మతత్త్వ
మధ్యాత్మ మనఁబడు నట్టియధ్యాత్మముఁ, దెలియఁ జేయఁగఁ జాలు దీపమగుచు
సకలవేదములకు సారాంశమై యేక, మై యసాధారణ మగు ప్రభావ
రాజకంబైన పురాణమర్త్యంబును, గాఢసంసారాంధకారపటలి
తే. దాఁటఁ గోరెడివారికి దయ దలిర్ప, నేతపోనిధి వివరించె నేర్పడంగ
నట్టిశుకనామధేయు మహాత్మగేయు, విమలవిజ్ఞానరమణీయు వేడ్కఁ గొలుతు.
క. నారాయణునకు నరునకు, భారతికిని మ్రొక్కి వ్యాసుపదములకు నమ
స్కారము సేసి వచింతు ను, దారగ్రంథంబు దళితతనుబంధంబున్. 57
వ. అని యిట్లు దేవతాగురునమస్కారంబు సేసి యిట్లనియె మునీంద్రులారా
నన్ను మీరలు నిఖిలలోకమంగళం బయినప్రయోజనం బడిగితి రేమిటం
గృష్ణసంప్రశ్నంబు సేయంబడు నెవ్విధంబున నాత్మప్రసన్నం బగు నిర్విఘ్నయు
నిర్హేతుకయు నైనహరిభక్తి యేరూపంబునం గలుగు నది పురుషులకుఁ బర
మార్థంబగు వాసుదేవునియందుఁ బ్రయోగింపంబడినభక్తియోగంబు వైరాగ్య
విజ్ఞానంబులం బుట్టించు నారాయణకథలవలన నెయ్యేధర్మంబులు దగులువడ వవి
నిరర్థకంబు లపవర్గపర్యంతం బయినయీపరమధర్మంబునకు దృష్టశ్రుతప్రపం
చార్థంబు ఫలంబు గాదు ధర్మంబునం దవ్యభిచారియైనయర్థంబునకుఁ గామంబు
ఫలంబు గాదు విషయభోగం బైనకామంబున కింద్రియప్రీతి ఫలంబు గా
దెంతదడవు జీవించు నంతియ కామంబునకు ఫలంబు తత్త్వజిజ్ఞాస గలజీవునకుఁ
గర్మంబులచేత నెయ్యది సుప్రసిద్ధం బగయు నర్థంబు గాదు తత్త్వజిజ్ఞాస యనునది
ధర్మజిజ్ఞాస యగుటఁ గొందఱు ధర్మంబే తత్త్వం బని పలుకుదురు తత్త్వవిదులు
జ్ఞానం బనుపేర నద్వయం బైనయది తత్త్వం బని యెఱుంగుదు రాతత్త్వంబు
నౌపనిషదులచేత బ్రహ్మమనియు హైరణ్యగర్భులచేతం బరమాత్మయనియు సాత్త్వ
తులచేత భగవంతుం డనియును బలుకంబడు వేదాంతశ్రవణంబున గ్రహింపం
బడి జ్ఞానవైరాగ్యంబులతోడం గూడినభక్తిచేతం దత్పరు లైనపెద్దలు క్షేత్రజ్ఞుం
డైనయాత్మయందుఁ బరమాత్మం బొడగందురు ధర్మంబునకు భక్తిఫలంబు పురుషులు
వర్ణాశ్రమధర్మభేదంబులం జేయుధర్మంబునకు మాధవుండు సంతోషించుటయె
సిద్ధి యేకచిత్తంబున నిత్యంబును గోవిందు నాకర్ణింపను వర్ణింపనుం దగుఁ జక్రా
యుధధ్యానం బనుఖడ్గంబున వివేకవంతు లహంకారనిబద్ధం బైనకర్మంబుఁ ద్రుంచి
వైతురు*(భగవంతునియందలి శ్రద్ధయు నపవర్గదం బగుతత్కథాశ్రవణాదులయం
దత్యంతాసక్తియుఁ బుణ్యతీర్థావగాహనమహత్సేవాదులచే సిద్ధించుఁ) గర్మనిర్మూలన
హేతువు లైనకమలలోచనుకథలం దెవ్వండు రతిసేయు విన నిచ్ఛగించు వాని కిత

---

1 'మధ్యాత్మ యనఁబడు నట్టియధ్యాత్మకుఁ, దెలివి సేయఁగఁ జాలు' అనియే ప్రతులు.

* ఈకుండలీకరణములోనిది వ్రాఁతప్రతులందుఁ గనుపట్టదు.

రంబు లెవ్వియు రుచి పుట్టింపనేరవు పుణ్యశ్రవణకీర్తనుం డైన కృష్ణుండు దనకథలు వినువారిహృదయంబులందు నిలిచి శుభంబు లాచరించు నశుభంబులు పరిహరించు నశుభంబులు నష్టంబు లయిన భాగవతసేవావిశేషంబున నిశ్చలభక్తి యుదయించు భక్తి గలుగ రజస్తమోగుణప్రభూతంబు లైన కామలోభాదులకు వశంబు గాక చిత్తంబు సత్త్వగుణంబునం బ్రసన్నం బగుఁ బ్రసన్నమనస్కుం డైన ముక్తసంగుం డగు ముక్తసంగుం డైన నీశ్వరతత్త్వజ్ఞానంబు దీపించు నీశ్వరుండు గానంబడినం జిజ్జడగ్రథనరూపం బైన యహంకారంబు భిన్నంబగు నహంకారంబు భిన్నం బైన నసంభావనాదిరూపంబు లగుసంశయంబులు విచ్ఛిన్నంబు లగు సంశయవిచ్ఛేదం బైన నారబ్ధఫలంబు లైన కర్మంబులు నిశ్శేషంబు లగుఁ గావున.

క. గురుమతులు తపసు లంతః,కరణంబుల శుద్ధి సేయ ఘనతరభక్తిన్
హరియందు సమర్పింతురు, పరమానందమున భిన్నభవబంధను లై. 59

తరలము. పరమపూరుషుఁ డొక్కఁ డాఢ్యుఁడు పాలనోద్భవనాశముల్
సొరిదిఁ జేయ ముకుందపద్మజశూలిసంజ్ఞలఁ బ్రాకృత
స్ఫురితసత్త్వరజస్తమంబులఁ బొందు నందు శుభస్థితుల్
హరి చరాచరకోటి కిచ్చు ననంతసత్త్వనిరూఢుఁ డై. 60

వ. మఱియు నొక్కవిశేషంబు గలదు కాష్ఠంబుకంటె ధూమంబు ధూమంబుకంటెఁ ద్రయీమయం బయినవహ్ని యెట్లు విశేషం బగు నట్లు తమోగుణంబుకంటె రజోగుణంబు రజోగుణంబుకంటె బ్రహ్మప్రకాశకం బగుసత్త్వగుణంబు విశిష్టం బగుఁ దొల్లి మునులు సత్త్వమయుం డని భగవంతు హరి నధోక్షజుం గొలిచిరి కొందఱు సంసారమందలిమేలుకొఱకు నన్యుల సేవింతురు మోక్షార్థు లయిన వారలు ఘోరరూపు లయినభూతపతుల విడిచి దేవతాంతరనింద సేయక శాంతు లయి నారాయణకథ లనుభవింతురు కొందఱు రాజసతామసు లయి సిరియు నైశ్వర్యంబును బ్రజలనుం గోరి పితృభూతప్రజేశాదుల నారాధింతురు మోక్ష మిచ్చుటం జేసి నారాయణుండు సేవ్యుండు వేద యాగ యోగ క్రియా జ్ఞాన తపోగతి ధర్మంబులు వాసుదేవపరంబులు నిర్గుణుం డయినపరమేశ్వరుండు గలుగుచు లే కుండుచుఁ ద్రిగుణంబులతోడం గూడినతనమాయచేత నింతయు సృజియించి గుణవంతునిచందంబున నిజమాయావిలసితంబు లయినగుణంబు లలోఁ బ్రవేశించి విజ్ఞానవిజృంభితుం డై వెలుంగు నగ్ని యొక్కరుం డయ్యుఁ బెక్కుమ్రాఁకులందుఁ దేజరిల్లుచుఁ బెక్కం డై తోఁచుతెఱంగున విశ్వాత్మకుం డైనపురుషుం డొక్కండ తనవలనం గలిగిననిఖిలభూతంబులందు నంతర్యామిరూపంబున దీపించు నతండు మనోభూతసూక్ష్మేంద్రియంబులతోడం గూడి గుణమయంబు లయినభావంబులం దనచేత నిర్మితంబు లైనభూతంబులందుఁ దగులు వడక తద్గుణంబు లనుభవంబు సేయు లోకకర్త యైనయతండు దేవతిర్యఙ్మను

ష్యాదిజాతులందు లీల నవతరించి లోకంబుల రక్షించు నని మఱియు సూతుం
డి ట్లనియె.

సీ. మహదహంకారతన్మాత్రసంయుక్తుఁ డై, చారుషోడశకళాసహితుఁ డగుచుఁ
బంచమహాభూతభాసితుం డై శుద్ధ, సత్త్వుఁ డై సర్వాతిశాయి యగుచుఁ
జరణోరు భుజ ముఖశ్రవణాక్షి నాసాశిరములు నానాసహస్రములు వెలుఁగ
నంబర కేయూర హార కుండల కిరీ, టాదులు పెక్కువే లమరుచుండఁ

తే. [1]పురుషరూపంబు ధరియించి పరుఁ డనంతుఁ, డఖిలభువనైకవర్తనయత్నమమర
మానితాపారజలరాశిమధ్యమునను, యోగనిద్రావిలాసి యై యొప్పుచుండు.

భగవంతునియేకవింశత్యవతారములు.

వ. అది సకలావతారంబులకు మొదలిగని యైనశ్రీమన్నారాయణదేవునివిరాజమానం బయినదివ్యరూపంబు దానిం బరమయోగీంద్రులు దర్శింతు రప్పరమేశ్వరునాభికమలంబువలన సృష్టికర్తలలోన శ్రేష్ఠుండైనబ్రహ్మ యుదయించె నతనియవయవస్థానంబులయందు లోకవిస్తారంబులు గల్పింపంబడియె మొదల నద్దేవుండు కౌమారాఖ్యసర్గంబు నాశ్రయించి బ్రహ్మణ్యుం డై దుశ్చరం బైన బ్రహ్మచర్యంబు చరియించె రెండవమాఱు జగజ్జననంబుకొఱకు రసాతలగతయయినభూమి నెత్తుచు యజ్ఞేశుం డయి వరాహదేహంబు దాల్చె మూఁడవతోయంబున నారదుం డనుదేవర్షి యై కర్మనిర్మోచకం బైనవైష్ణవతంత్రంబు సెప్పె నాలవపరికరభార్యాసర్గంబునందు నరనారాయణాభిధానుండై దుశ్చరం బైనతపంబు సేసెఁ బంచమావతారంబునం గపిలుం డనుసిద్ధేశుం డయి యాసురి యనుబ్రాహ్మణునకుఁ దత్త్వగ్రామనిర్ణయంబు గలసాంఖ్యంబు నుపదేశించె నాఱవశరీరంబున ననసూయాదేవియందు నత్రిమహామునికిఁ గుమారుం డై యలర్కునికిఁ బ్రహ్లాదముఖ్యులకు నాత్మవిద్యఁ దెలిపె నేడవవిగ్రహంబున నాకూతియందు రుచికి జన్మించి యజ్ఞుం డనం బ్రకాశమానుండై యామాదిదేవతలతోడంగూడ స్వాయంభువమన్వంతరంబు రక్షించె నష్టమమూర్తిని మేరుదేవియందు నాభికి జన్మించి యురుక్రముం డనం బ్రసిద్ధుం డై విద్వజ్జనులకుఁ బరమహంసమార్గంబుం బ్రకటించె ఋషులచేతఁ గోరంబడి తొమ్మిదవజన్మంబునఁబృథుచక్రవర్తి యై భూమిని ధేనువుం జేసి సమస్తవస్తువులం బిదికెఁ జాక్షుషమన్వంతరసంప్లవంబున దశమం బయినమీనావతారంబు నొంది మహీరూపం బగు నావ నెక్కించి వైవస్వతమనువు నుద్ధరించె సముద్రమథనకాలంబునం బదునొకండవమాఱు కమఠాకృతిని మందరాచలంబుఁదనపృష్ఠకర్పరంబున నేర్పరియై నిలిపె ధన్వంతరి యనఁ బండ్రెండవతనువున సురాసురమథ్యమానక్షీరపాథోధిమధ్యభాగంబున నమృతకలశహస్తుండై వెడలెఁ బదుమూఁడవది యయినమోహినీ

1. పరమపురుషాకృతి ధరించి.

వేషంబున సురాసురుల మోహితులం జేసి సురల నమృతాహారులం గావించెఁ బదునాలుగవది యైననరసింహరూపంబునం గనకకశిపుని సంహరించెఁ బదునేనవది యైనకపటవామనావతారంబున బలిని బదత్రయంబు యాచించి మూఁడు లోకంబుల నాక్రమించెఁ బదునాఱవది యైనభార్గవరామాకృతిని గుపితభావంబుఁ దాల్చి బ్రాహ్మణద్రోహు లయినరాజుల నిరువదియొక్కమాఱు వధియించి భూమి నిఃక్షత్రంబు గావించెఁ బదునేడవది యైనవ్యాసగాత్రంబున నల్పమతు లయినపురుషులం గరుణించి వేదవృక్షంబునకు శాఖ లేర్పఱిచెఁ బదునెనిమిదవ దైనరామాభిధానంబున దేవకార్యార్థంబు రాజత్వంబు నొంది సముద్రనిగ్రహాదిపరాక్రమంబు లాచరించె నేకోనవింశతివింశతితమంబు లైన రామకృష్ణరూపంబులచే యదువంశంబునందు సంభవించి విశ్వంభరాభారంబు నివారించెఁ గలియుగాద్యవసరంబున రాక్షససమ్మోహనంబుకొఱకు నేకవింశతితమం బైనబుద్ధనామధేయంబునం గీకటదేశంబుల జినసుతుం డయి ప్రవర్తించు యుగసంధియందు వసుంధరాధీశులు చోరప్రాయు లై సంచరింప విష్ణుయశుం డనువిప్రునికిఁ గల్కి యనుపేర నుద్భవింపం గలం డని యిట్లనియె. 63

మ. సరసిం బాసిన [1]వేయికాలువలయోజన్ విష్ణునం దైన శ్రీ
కరనానా[2]ప్రకటావతారము లసంఖ్యాతంబు లుర్వీశులున్
సురలున్ బ్రాహ్మణసంయమీంద్రులు మహాసర్గుల్ విష్ణునంశాంశజుల్
హరి కృష్ణుండు బలానుజన్ముఁ డెడ లేరా విష్ణుఁ డౌ నేర్పడన్. 64

క. భగవంతుం డగువిష్ణుఁడు, జగముల కెవ్వేళ రాక్షసవ్యథ గలుగుం
దగ నవ్వేళలఁ [3]దడయక, యుగయుగమునఁ బుట్టి కాచు నుద్యల్లీలన్. 65

ఆ. అతిరహస్య మైనయీహరిజన్మకథనంబు, మనుజుఁ డెవ్వఁ డేని మాపు రేపుఁ
జాల భక్తితోడఁ జదివిన సంసార, దుఃఖరాశిఁ బాసి తొలఁగి పోవు. 66

వ. వినుం డరూపుం డయి యనేకరూపుండయి యాత్మ యనం బరఁగుజీవునికిఁ బరమేశ్వరుమాయాగుణంబు లైనమహదాదిరూపంబులచేత నాత్మస్థానంబులందు విరచితం బైనస్థూలశరీరంబు గగనంబునందుఁ బవనాశ్రితమేఘసమూహంబును గాలియందుఁ బార్థివధూళిధూసరత్వంబును నేరీతి నారీతి ద్రష్ట యగునాత్మయందు [4]దృశ్యమై బుద్ధిమంతులు గానివారిచేత నారోపింపంబడు నీస్థూలరూపంబుకంటె నదృష్టగుణం బయి యశ్రుతం బైనవస్తు వగుటం జేసి వ్యక్తంబుగాక సూక్ష్మం బైకరచరణాదులు లేక జీవునికి నొండొకరూపంబు విరచితం బయి యుండు సూక్ష్మం డైనజీవునివలన నుత్క్రాంతిగమనాగమనంబులఁ బునర్జన్మంబు నొందుచు నెప్పుడీస్థూలసూక్ష్మరూపంబులు రెండు స్వరూపసమ్యగ్జ్ఞానంబునం జేసి ప్రతిషిద్ధంబు లగు

1 వాయు-వాఱు-కాలువల. 2 ఘటనావతారము. 3. దయతో. 4. దృశ్యాత్మ మై; దృశ్యత్వమై.

నవిద్యం జేసి యాత్మను గల్పింపంబడ్డ వనెడిహేతువువలన నప్పు డాజీవునకు బ్రహ్మదర్శనం బగు దర్శనం బన జ్ఞానంబునం జేసి యేకస్వరూపంబు విశారదుం డైనయీశ్వరుని దై క్రీడించుచు నవిద్య యనంబడుచున్నమాయ యుపరత యై యెప్పుడు దాన విద్యారూపంబునం బరిణత యగు నప్పుడు జీవోపాధి యయినస్థూలసూక్ష్మరూపంబు దహించి జీవుండు గాష్ఠంబు లేక తేజరిల్లువహ్ని చందంబునం దాన యుపరతుం డయి బ్రహ్మస్వరూపంబునం బొంది పరమానందంబున విరాజమానుం డగు నని తత్త్వజ్ఞులు సెప్పుదు రని సూతుం డిట్లనియె.

చ. జననము లేక కర్మములజాడలఁ బోక సమస్తచిత్తవ
ర్తనుఁ డగుచక్రికిం గవు లుదారపదంబుల జన్మకర్మముల్
వినుతులు సేయు చుందురు వేదరహస్యములందు నెందుఁ జూ
చిన మఱి లేవు జీవునికిఁ జెప్పినక్రైవడి జన్మకర్మముల్. 68

మ. భువనశ్రేణి నమోఘలీలుఁ డగుచుం బుట్టించు రక్షించు నం
తవిధిం జేయు మునుంగఁ డందు బహుభూతవ్రాతమం దాత్మతం
త్రవిహారస్థితుఁ డై షడింద్రియసమస్తప్రీతియుక్ దవ్వులన్
దవిభంగిం గొనుఁ జిక్కఁ డింద్రియములం ద్రిప్పన్ నిబంధించుచున్. 69

చ. జగదధినాథుఁ డైనహరి సంతతలీలల నామరూపముల్
దగిలి మనోవచోగతులఁ దార్కికచాతురి నెంత గల్గినన్
మిగిలి కుతర్కవాది దగ మేరలు సేసి యెఱుంగ నేర్చునే
యగణితనర్తనక్రమము నజ్ఞుఁ డెఱింగి నుతింప నోపునే. 70

ఉ. ఇంచుక మాయ లేక మది నెప్పుడుఁ బాయనిభక్తితోడ వ
ర్తించుచు నెవ్వఁడేని హరిదివ్యపదాంబుజగంధరాశి సే
వించు నతం డెఱుంగు నరవిందభవాదుల కైన దుర్లభో
దంచిత మైనయాహరియుదారమహాద్భుతకర్మమార్గముల్. 71

మ. హరిపాదద్వయభక్తి మీవలన నిట్లారూఢ మై యుండునే
తిరుగం బాఱదు చిత్తవృత్తి హరిపై దీపించి మీలోపలన్
ధరణీదేవతలార మీరలు మహాధన్యుల్ సమస్తజ్ఞులున్
హరిచింతన్ మిముఁ జెంద వెన్నఁడును జన్మాంతవ్యథాయోగముల్. 72

శ్రీమహాభాగవతరచనాదివృత్తాంతము.

సీ. పుణ్యకీర్తనుఁ డైనభువనేశుచరిత మై, బ్రహ్మతుల్యం బైనభాగవతము
సకలపురాణరాజము దొల్లి లోకభ, ద్రముగ ధన్యముగ మోదముగఁ బ్రీతి
భగవంతుఁ డగువ్యాసభట్టారకుఁ డొనర్చి, శుకుఁ డనియెడుతనసుతునిచేతఁ
జదివించె నింతయు సకలవేదేతిహా,సములలోపల నెల్ల సార మైన

ఆ. ఈపురాణ మెల్ల నెలమి నాశుకయోగి, గంగనడుమ వచ్చి ఘనవిరక్తి
యొదవి మునులతోడ నుపవిష్టుఁ డగుపరీ,క్షిన్నరేంద్రుఁ డడుగఁ జెప్పె వినుఁడు.

వ. కృష్ణుండు ధర్మజ్ఞానాదులతోడం దనలోకంబునకుం జనినపిమ్మటం గలికాలదోషాంధకారంబున నష్టదర్శను లయినజనులకు నిప్పు డిప్పురాణంబు గమలబంధుని భంగి నున్నది నాఁ డందు భూరితేజుం డయి కీర్తించుచున్నవిప్రర్షివలన నేఁ బఠించినక్రమంబున నామదికి గోచరించినంతయు వినిపించెద ననిన సూతునకు మునివరుం డైనశౌనకుం డి ట్లనియె. 74

శా. సూతా యేయుగవేళ నేమిటికి నెచ్చోటన్ [1]మునిశ్రేష్ఠు లే
శ్రోతల్ గోరిన నేమిహేతువునకై శోధించి లోకైకవి
ఖ్యాతిన్ వ్యాసుఁడు మున్ను భాగవతముం గల్పించెఁ దత్పుత్త్రుఁ డే
ప్రీతిన్ రాజున కీపురాణకథఁ జెప్పెం జెప్పవే యంతయున్. 75

వ. బుధేంద్రా వ్యాసపుత్త్రుం డైనశుకుం డనుమహాయోగి సమదర్శనుం డేకాంతమతి మాయా[2]శయనంబువలనం దెలిసినవాఁడు గూఢుండు మూఢునిక్రియ నుండు నిరస్తభేదుం డదియునుం గాక. 76

తరలము. శుకుఁడు గోఁచియు లేక పైఁ జనఁ జూచి తోయములందు ల
జ్జకుఁ జలింపక చీర లొల్లక చల్లు లాడెడి దేవక
న్యకలు హా శుక యంచు వెన్కఁ జనంగ వ్యాసునిఁ జూచి యం
శుకముల్ ధరియించి సిగ్గున స్రుక్కి రందఱు ధీనిధీ. 77

వ. మఱియు నగ్నుండు తరుణుండు నై చనుతనకొడుకుం గని వస్త్రపరిధానం బొనరింపక వస్త్రధారియు వృద్ధుండును నైనతనుం జూచి చేలంబులు ధరియించుదేవరమణులం గని వ్యాసుండు కారణం బడిగిన వారలు నీపుత్త్రుండు స్త్రీపురుషు లనెడుభేదదృష్టి లేక యుండు మఱియు నతండు నిర్వికల్పుండు గాన నీకు నతనికి మహాంతరంబు గల దనిరి శుకుండు కురుజాంగలదేశంబులు సొచ్చి హస్తినాపురంబునఁ బౌరజనంబులచే నెట్లు జ్ఞాతుం డయ్యె మఱియు నున్మత్తుని క్రియ మూఁగతెఱంగున జడునిభంగి నుండునమ్మహాయోగికి రాజర్షి యైన పరీక్షిన్మహారాజుతోడ సంవాదం బెట్లు సిద్ధించె బహుకాలకథనీయం బయిన శ్రీభాగవతనిగమవ్యాఖ్యానం బేరీతి సాగె నయ్యోగిముఖ్యుండు గృహస్థుల గృహంబుల గోవును బిదికినయంతదడవు గాని నిలువంబడం డతండు గోదోహనమాత్రకాలంబు సంచరించినస్థలంబులు తీర్థంబు లగు నండ్రు పెద్దకాలం బేకప్రదేశంబున నెట్లుండె భాగవతోత్తముం డైనజనపాలునిజన్మకర్మంబు లేప్రకారంబులు వివరింపుము. 78

---

1 మునిశ్రేష్ఠు నే... గో౨౨. 2 వశంబువలనం.

సీ. పాండవవంశంబు బలము మానంబును, వర్ధిల్లఁ గడిమి నెవ్వాఁడు మనిచెఁ
బరిపంథిరాజులు భర్త్రాదిధనముల, నర్పించి రెవ్వని యంఘ్రియుగముఁ
గుంభజకర్ణాదికురుభటవ్యూహంబు, సొచ్చి చెండాడె నే శూరుతండ్రి
గాంగేయసైనికాక్రాంతగోవర్గంబు, విడిపించి తెచ్చె నే వీరుతాత

ఆ. యట్టిగాథకీర్తి యగుపరీక్షిన్మహా, రాజు విడువ రాని రాజ్యలక్ష్మిఁ
బరిహరించి గంగఁ బ్రాయోపవిష్టుఁడై, యసువు లుండ నేల యడఁగియుండె.

ఉ. ఉత్తమకీర్తులైనమనుజోత్తము లాత్మహితంబు లెన్నఁడుం
జిత్తములందుఁ గోరరు హసించియు లోకుల కెల్ల నర్థసం
పత్తియు భూతియున్ సుఖము భద్రముఁ గోరుదు రన్యరక్షణా
త్యుత్తమమైన మేను విభుఁ డూరక యేల విరక్తిఁ బాసెనో. 80

క. సారముల నెల్ల నెఱుఁగుదు, పారగుఁడవు భాషలందు బహువిధకథనో
దారుఁడవు మాకు సర్వముఁ, బారము ముట్టంగఁ దెలియఁ బలుకు మహాత్మా.

—వ్యాసుండు వ్యాకులచిత్తుండై చింతించుట.—

వ. అని యడిగిన శౌనకాదిమునిశ్రేష్ఠులకు సూతుం డిట్లనియెఁ దృతీయం బైన ద్వాపరయుగంబు దీఱుసమయంబున నుపరిచరవసువీర్యంబున జన్మించి వాసవి నాఁ దగుసత్యవతియందుఁ బరాశరునికి హరికళంజేసి విజ్ఞాని యయిన వేదవ్యాసుండు జన్మించి యొక్కనాఁడు బదరికాశ్రమంబున సరస్వతీజలంబుల స్నానాదికర్మంబులం దీర్చి శుచియై పరులు లేనిచోట నొంటి గూర్చుండి సూర్యోదయవేళ నతీతానాగతవర్తమానజ్ఞుం డయిన యా ఋషి వ్యక్తంబు గాని వేగంబు గల కాలంబునం జేసి యుగధర్మంబులకు భువి సాంకర్యంబు వొందు యుగయుగంబుల భౌతికశరీరంబులకు శక్తిసంపన్నం బగుఁ బురుషులు నిస్సత్త్వులు ధైర్యశూన్యులు మందప్రజ్ఞు లల్పాయువులు దుర్బలులు నయ్యెద రని తన దివ్యదృష్టిం జూచి సర్వవర్ణాశ్రమంబులకు హితంబు సేయం దలంచి నలువురు హోతల చేత ననుష్ఠింపం దగి ప్రజలకు శుద్ధికరంబు లయిన వైదికకర్మంబు లగుయజ్ఞంబు లెడతెగకుండుకొఱకు నేకం బైన వేదంబు ఋగ్యజుస్సామాథర్వణంబు లను నాలుగునామంబుల విభాగించి యితిహాసపురాణంబు లన్నియుఁ బంచమవేదం బని పల్కె నందు. 82

సీ. పైలుండు ఋగ్వేదపఠనంబు దొరకొనె, సామంబు జైమిని చదువుచుండె
యజువు వైశంపాయనాఖ్యుండు గైకొనెఁ, దుది నథర్వము సుమంతుఁడు పఠించె
నఖిలపురాణేతిహాసముల్ మాతండ్రి, రోమహర్షణుఁడు నిరూఢిఁ దాల్చెఁ
దమతమవేదమార్గతపసులు భాగించి, శిష్యసంఘములకుఁ జెప్పి రంత

తే. శిష్యులెల్లను నాత్మీయశిష్యజనుల, కంతబహుమార్గములఁ[1] ద్రుంచి యనుమతింపఁ

1 బంచి.

బెక్కుశాఖలు గలిగి యీపృథివిలోన, నిగమ మొప్పారె భూసురనివహమందు.

వ. ఇట్లు మేధావిహీను లయినపురుషులచేత నట్టివేదంబులు ధరియింపంబడు చు
న్నవి మఱియు దీనవత్సలుం డయినవ్యాసుండు స్త్రీశూద్రులకుం ద్రైవర్ణికాధ
ములకు వేదంబులు విన నర్హంబులు గావు గావున మూఢుల కెల్ల మే లగు నని
భారతాఖ్యానంబు సేసియు నమ్ముని భూతహితంబునందుఁ దనహృదయంబు
సంతసింప కున్న సరస్వతీతటంబున నొంటి యుండి హేతువు వితర్కించుచుఁ
దనలో ని ట్లనియె. 84

సీ. వ్రతధారి నై వేదవహ్నిగురుశ్రేణి, మన్నింతు విహితకర్మములఁ గొఱఁత
వడ కుండ నడపుదు భారతమిషమునఁ, బలికితి వేదార్థభావ మెల్ల
మునుకొని స్త్రీశూద్రముఖ్యధర్మములందుఁ, దెలిపితి నేఁ జెల్ల దీనఁ జేసి
యాత్మ సంతస మంద దాత్మలో నీశుండు, సంతసింపక యున్నజాడ దోఁచె

ఆ. హరికి యోగివరుల కభిలషితం బైన, భాగవతవిధంబుఁ బలుక నైతి
మోసమయ్యెఁ దెలివి మొనయదు మఱచితి, ననుచు వగచుచున్న యవసరమున.

-వ్యాసునికడకు నారదుండు వచ్చుట.-

సీ. తనచేతివల్లకీతంత్రీ[1]చయంబున, సతతనారాయణశబ్ద మొప్ప
నాననసంభూతహరిగీతరవసుధా, ధారల యోగీంద్రతతులు సొక్కఁ
గపిలజటాభారకాంతిపుంజంబుల, దిశలు ప్రభాతదీధితి వహింపఁ
దనులగ్నతులసికాదామగంధంబులు, గగనాంతరాళంబుఁ గప్పికొనఁగ

ఆ. వచ్చె మింటినుండి వాసవీనందను, కడకు మాటలాడఁ గడఁకతోడ
భద్రవిమలకీర్తిపారగుఁ డారూఢ, నయవిశారదుండు నారదుండు. 86

క. కనియెన్ నారదుఁ డంతన్, వినయైకవిలాసు నిగమవిభజనవిద్యా
జనితోల్లాసున్ భవదుః, ఖనిరాసున్ గురుమనోవికాసున్ వ్యాసున్. 87

వ. ఇట్లు నిజాశ్రమంబునకు వచ్చిననారదు నెఱింగి లేచి వ్యాసుండు వివిధక్రమం
బులం బూజించిన నతండు లేనగవు నెగడెడిమొగంబుతోడ విపంచికాతంత్రి
వ్రేల మీటుచు ని ట్లనియె.

ఉ. ధాతవు భారతశ్రుతివిధాతవు వేదపదార్థజాలవి
జ్ఞాతవు కామముఖ్యరిపుషట్కవిజేతవు బ్రహ్మతత్త్వని
ర్ణేతవు యోగినేతవు [2]వినీతుఁడ వీవు చలించి చెల్లరే
కాతరుకైవడిన్ వగవఁ గారణ మేమి పరాశరాత్మజా. 89

వ. అనినఁ బారాశర్యుం డి ట్లనియె. 90

క. పుట్టితి వజుతనువునఁ జే, పట్టితివి పురాణపురుషభజనము పదముల్
మెట్టితివి దిక్కులం దుది, ముట్టితివి మహాప్రబోధమున మునినాథా. 91

---

1 స్వనంబున. 2 వి నేతవు నీవు.

వ. అదియునుం గాక నీవు సూర్యునిభంగి మూఁడులోకంబులం జరింతువు వాయువు పగిది నఖిలజనులలోనను మెలంగుదువు సర్వజ్ఞుండ వగుటం జేసి. 92

క. నీ కెఱుఁగరానిధర్మము, లోకములను లేదు బహువిలోకివి నీ వీ
నాకొఱఁత యెట్టి దంతయు, నాకును వివరింపవయ్య నారద కరుణన్. 93

వ. అనిన నారదుం డిట్లనియె. 94

ఉ. అంచితమైనధర్మచయ మంతయుఁ జెప్పితి వందులోన [1]నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడఁ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁ గాక నీకు నీ
కొంచెము వచ్చు టెల్ల హరిఁ గోరి నుతింపమి నార్యపూజితా. 95

మ. హరినామస్తుతి సేయుకావ్యము సువర్ణాంభోజహంసావళీ
సురుచిభ్రాజితమైనమానససరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామస్తుతి లేనికావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమై యుండ దయోగ్యదుర్మలినవత్కాకోలగర్తాకృతిన్. 96

మ. అపశబ్దంబులఁ గూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపా
పపరిత్యాగము సేయుఁ గావున హరిన్ భావించుచుం బాడుచున్
జపముల్ సేయుచు వీనులన్ వినుచు నశ్రాంతంబుఁ గీర్తించుచుం
దపసుల్ సాధులు ధన్యు లౌదురు గదా తత్త్వజ్ఞ చింతింపుమా. 97

వ. మునీంద్రా నిర్గతకర్మంబై నిరుపాధికంబైన జ్ఞానంబు హరిభక్తి లేకున్న శోభితంబు గాదు ఫలంబు గోరక కర్మం బీశ్వరునకు సమర్పణంబు సేయకున్న నది ప్రశస్తంబై యుండదు భక్తిహీనంబు లయినజ్ఞానవాచాకర్మకౌశలంబులు నిరర్థకంబులు గావున మహానుభావుండవు యథార్థదర్శనుండవు సకలదిగంతధవళకీర్తివి సత్యరతుండవు ధృతవ్రతుండవు నగునీవు నిఖిలబంధమోచనంబుకొఱకు వాసుదేవునిలీలావిశేషంబులు భక్తితోడ వర్ణింపుము హరివర్ణనంబు సేయక ప్రకారాంతరంబున నర్థాంతరంబులు వివక్షించి తద్వివక్షాకృతరూపనామంబులం జేసి పృథగ్దర్శనుండైనవానిమతి పెనుగాలిచేతఁ ద్రిప్పంబడి తప్పం జనునావచందంబున నెలవు సేర నేరదు కామ్యకర్మంబులందు రాగంబు గలప్రాకృతజనులకు నియమించినధర్మంబులు సెప్పి [2]శాసకుండ వగునీ నడవడి దగ దది యెట్టులనిన వార లదియె ధర్మం బని జుగుప్సితంబు లగుకామ్యకర్మంబులు సేయుచుఁ దత్త్వజ్ఞానంబు మఱతురు గావున బుద్ధిమోహంబు జనియింపక తత్త్వప్రదుండవై వ్యథావియోగంబు సేయు మని మఱియు నిట్లనియె.

చ. ఎఱిఁగెడువాడు కర్మచయ మెల్లను మాని హరిస్వరూపమున్
నెఱయ [3]నెఱుంగునవ్వలను నేరుపుఁ జూపు గుణానురక్తుఁడై

1. నీ. ఇంచుక. 2. శాంతుండ. 3. నెఱింగెడిన్ వలను నేరుపుఁ; నెఱుంగుఁ దాను మది నేరుపుఁ.

తెలుకువ లేక క్రుమ్మరుచు దేహధనాద్యభిమానయుక్తుఁడై
యెఱుఁగనివానికిం దెలియ నీశ్వరలీల మునీంద్ర చెప్పవా. 99

చ. తనకులధర్మముం విడిచి దానవవైరిపదారవిందముల్
పనివడి సేవసేసి పరిపాకము పొందక యెవ్వఁడేనిఁ జ
చ్చిన మఱుమేన నైన నది సిద్ధి వహించుఁ దదీయసేవఁ బా
సినఁ గులధర్మగౌరవము సిద్ధి వహించునె యెన్నిమేనులన్. 100

వ. అది గావున నెఱుక గలవాఁడు హరిసేవకుం బ్రయత్నంబు సేయం దగుఁ గాలక్రమంబున సుఖదుఃఖంబులు ప్రాప్తంబు లయినను హరిసేవ విడువం దగదు దానం జేసి బ్రహ్మస్థావరపర్యంతంబు దిరుగుచున్న [1]జనులకు నెయ్యది పొందరా దట్టిమేలు సిద్ధించు హరిసేవకుం డగువాఁడు నీచజన్మంబు నొందియు నన్యునిక్రియ సంసారంబునం జిక్కఁడు క్రమ్మఱ హరిచరణస్మరణంబుఁ జేయు భక్తిరసవశీకృతుం డయి విడువ నిచ్ఛగింపండు మఱియును. 101

సీ. విష్ణుండు విశ్వంబు విష్ణునికంటెను, వే ఱేమియును లేదు విశ్వమునకు
భవవృద్ధిలయము లాపరమేశుచే నగు, నీ వెఱుంగుదు గాదె నీముఖమున
నెఱిఁగింపఁబడ్డది యేకదేశమున నీ, భువనభద్రమున కై పుట్టినట్టి
హరికళాజాతుండ వని విచారింపుము, రమణతో హరిపరాక్రమము లెల్ల

ఆ. వినుతిసేయు మీవు వినికియుఁ జదువును, దానమతులనయముఁ దపముధృతియుఁ
గలిమి కెల్ల ఫలము గాదె పుణ్యశ్లోకుఁ, గమలనాభుఁ బొగడఁ గలిగెనేని.

—నారదునిపూర్వజన్మవృత్తాంతము.—

వ. మహాత్మా నేను పూర్వకల్పంబునం దొల్లిటిజన్మంబున వేదవాదులయింటిదాసికిం బుట్టి పిన్ననాఁడు వారలచేఁ బనుపంబడి యొక్కవానకాలంబునఁ జాతుర్మాస్యంబున నేకస్థలనివాసంబు సేయ నిశ్చయించినయోగిజనులకుం బరిచర్యసేయుచోట.

క. ఓటమితో నెల్లప్పుడుఁ, బాటవమునఁ బనులు సేసి బాలురకడ కే
యాటలకుఁ బోక యొకజం, జాటంబును లేక భక్తి సలుపుదు ననఘా. 104

క. మంగళ మనుచును వారల, యెంగిలి భక్షింతు వాన కెండకు నోడక్
ముంగల నిలుతును నియతిని, వెంగలిక్రియఁ జనుదు నురువివేకముతోడన్.

వ. ఇట్లేను వర్షాకాలశరత్కాలంబులు సేవించితి వారును నాయందుఁ గృపసేసి రంత.

శా. వారల్ కృష్ణుచరిత్రముల్ సదువఁగా వర్ణింపఁగాఁ బాడఁగా
నారావంబు సుధారసప్రతిమమై యశ్రాంతముం వీనులం
దోరంబై పరిపూర్ణమైన మది సంతోషించి నే నంతటం
బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభదూరుండనై. 107

1. 'జనులకు దుఃఖంబులట్లు సుఖంబులు ప్రాకృతకర్మాధీనంబులై సిద్ధించు నెయ్యది' అని అచ్చుప్రతి.

వ. ఇట్లు హరిసేవారతిం జేసి ప్రపంచాతీతుండ నైన బ్రహ్మరూపకుండ నయిననాయందు స్థూలసూక్ష్మం బయినయీశరీరంబు నిజమాయాకల్పితం బని యమ్మహాత్ము లగు యోగిజనులమూలంబున రజస్తమోగుణపరిహారిణి యయినభక్తి సంభవించె నంతఁ జాతుర్మాస్యంబునిండిన నయ్యోగిజనులు యాత్ర సేయువార లై రివ్విధంబున.

చ. అపచారంబులు లేక నిత్యపరిచర్యాభక్తియుక్తుండ నై
చపలత్వంబును మాని నేఁ గొలువఁగా సంప్రీతు లై వారు ని
ష్కపటత్వంబున దీనవత్సలతతోఁ గారుణ్యసంయుక్తు లై
యుపదేశించిరి నాకు నీశ్వరరహస్యోదారవిజ్ఞానమున్. 109

వ. ఏనును వారియుపదేశంబున వాసుదేవునిమాయానుభావంబు దెలిసితి నీశ్వరుని యందు సమర్పితం బయినకర్మంబు తాపత్రయంబు మాన్పనౌషధం బగు నేద్రవ్యంబువలన నేరోగంబు జనియించె నాద్రవ్యం బారోగంబు మాన్పనేరదు ద్రవ్యాంతరంబులచేత నైనచికిత్స మాన్పనోపు నవ్విధంబునఁ గర్మంబులు సంసారహేతుకంబు లయ్యు నీశ్వరార్పితంబు లై తామ తమ్ముఁ జెఱుచుకొన నోపియుండు నీశ్వరునియందుఁ జేయంబడుకర్మంబు విజ్ఞానహేతుకం బై యీశ్వరసంతోషణంబును భక్తియోగంబునుం బుట్టించు నీశ్వరశిక్షం జేసి కర్మంబులు సేయువారలు కృష్ణగుణనామవర్ణనస్మరణంబులు సేయుదురు ప్రణవపూర్వకంబులుగా వాసుదేవ ప్రద్యుమ్న సంకర్షణానిరుద్ధమూర్తినామంబులు నాలుగు భక్తిం బలికి నమస్కారంబు సేసి మంత్రమూర్తియు మూర్తిశూన్యుండు నయినయజ్ఞపురుషుం బూజించుపురుషుండు సమ్యగ్దర్శనుం డగు. 110

క. ఏ నివ్విధమునఁ జేయఁగ, దానవకులవైరి నాకుఁ దనయందులవి
జ్ఞానము నిచ్చెను మదను, ష్ఠానము నతఁ డెఱుఁగు నీవు సలుపుము దీనిన్.

క. మునికులములోన మిక్కిలి, వినుకులు గలవాఁడ వీవు విభుకీర్తులు నీ
వనుకూలతఁ బొగడుము విను, [1]జనకులములదుఃఖ మెల్ల శాంతిం బొందన్.

వ. ఇట్లు నారదుజన్మకర్మంబులు విని క్రమ్మఱ వ్యాసుం డి ట్లనియె. 113

మ. విను మా భిక్షులు నీకు ని ట్లు కరుణన్ విజ్ఞానముం జెప్పి పో
యిన బాల్యంబున వృద్ధభావమున నీ కేరీతి సంచారముల్
సనె నీ కిప్పుడు పూర్వకల్పమతి యే జాడం బ్రదీపించెఁ ద
త్తనువుం బాసినచంద మెట్లు చెపుమా దాసీసుతత్వంబుతోన్. 114

వ. అని యిట్లు వ్యాసుం డడిగిన నారదుం డి ట్లనియె దాసీపుత్రుండ నయిన యేను భిక్షులవలన హరివిజ్ఞానంబు గలిగి యున్నంత. 115

సీ. మమ్ము నేలినవారిమందిరంబునఁ గల, పను లెల్లఁ గ్రమమున భక్తిఁ జేసి
తనపరాధీనతఁ దలఁపదు సొలసితి, నలసితి నాఁకొంటి ననుచు వచ్చి

---

1. జనములకుఁ దుఃఖ.

మాపును రేపును మాతల్లి మోహంబు, సంసార ముద్దాడుఁ జుంచుదుప్వ
దేహంబు నివురు మోదించుఁ గౌఁగిటఁ జేర్చు, నర్మిలి నన్నిట్టు లరసి మనుప.
ఆ. నేను విడిచి పోక యింట నుండితి నయ్య, మోహిఁ గాక యెఱుక మోసపోక
మాఱుచింత లేక మాని నైయేనేండ్లు, వాఁడ నగుచుఁ గొన్నివాసరములు.
క. సదనము వెలువడి తెరువునఁ, జెదరక మాతల్లి రాత్రిఁ జీఁకటివేళన్
మొదవుం బిదుకఁగ నొకఫణి, పదభాగముఁ గఱచెఁ ద్రొక్కఁబడి మునినాథా.
క. నీలాయతభోగఫణా, వ్యాళానలవిషమహోగ్రవహ్నిజ్వాలా
మాలావినిపాతిత యై, వ్రాలెన్ ననుఁ గన్నతల్లి వసుమతిమీఁదన్. 118
ఉ. తల్లి ధరిత్రిపై నొఱిగి తల్లడపాటునఁ జెంది చిత్తముం
బల్లటిలంగఁ బ్రాణములు వాసినఁ జూచి కలంగ కేను నా
యుల్లములోన [1]మోహరుచి నొందక సంగము వాసె మేలు రా
జిల్లె నటంచు విష్ణుపదచింత [2]యొనర్పఁగ బుద్ధిఁ జేర్చుచున్. 119
వ. ఉత్తరాభిముఖుండ నై యేను వెడలి జనపదంబులుఁ బురంబులుఁ బట్టణంబులు గ్రామంబులుఁ బల్లెలు మందలు గిరాతపుళిందనివాసంబులు వనంబులు నుపవనంబులుఁ జిత్రధాతువిచిత్రంబు లయినపర్వతంబులు సమదకరికరవిదళితశాఖులుగలశాఖులు నవారితనివారితపథికజనశ్రమాతిరేకంబు లైనతటాకంబులు బహువిధవిహంగనినదమనోహరంబులై వికచారవిందమధుపానపరవశపరిభ్రమద్భ్రమరసుందరంబు లైనసరోవరంబులు దాఁటి చనుచు క్షుత్పిపాసాసమేతుండ నై యొక్కనదీహ్రదంబునఁ గ్రుంకు లిడి శుచి నై నీరు ద్రావి గతశ్రముండ నై.
క. సాలావృక కపి భల్లుక, కోలేభ లులాయ శల్య ఘూక శరభ శా
ర్దూల శశ గవయ ఖడ్గ, వ్యాళాజగ రాదిభయదవనమధ్యమునన్. 121
వ. దుస్తరంబు లైనవవేణుకీచకగుల్మలతాగహ్వరంబులపొంత నొక్కరావిమ్రాని డగ్గఱఁ గూర్చుండి యే విన్నచందంబున నాహృదయగతుం బరమాత్మస్వరూపు హరిం జింతించితి. 122
శా. ఆనందాశ్రులు గన్నులన్ వెడల రోమాంచంబుతోఁ దత్పద
ధ్యానారూఢుఁడ నై నన్వాతలఁపులో నద్దేవుఁడుం దోఁచె నే
నానందాబ్ధిగతుండ నై యెఱుఁగ లేనైతిన్ నను న్నీశ్వరున్
నానాశోకహ మైనయత్తనువు గానన్ లేక యట్లంతటన్. 123
వ. లేచి నిలుచుండి క్రమ్మఱ నద్దేవునిదివ్యాకారంబుఁ జూడ నిచ్ఛించుచు హృదయంబున నిలుపుకొని యాతురుండునుంబోలెఁ జూచియుం గానలేక నిర్మనుష్యం బైనవనంబునం జరియించుచున్ననన్ను నుద్దేశించి వాగగోచరుం డైనహరి గంభీరమధురంబు లైనవచనంబుల శోకం బుపశమింపం జేయుచందంబున ని ట్లనియె.

---

1. మోహరతి. 2. యొనర్చుచు.

ఉ. ఏల కుమార శోకిలఁగ నీజననంబున నన్నుఁ గానఁగాఁ
జాలవు నీవు కామముఖషట్కము నిర్దళితంబు సేసి ని
ర్మూలితకర్ముఁ డైనమునిముఖ్యుఁడు గాని [1]కుయోగి గానఁగాఁ
జాలఁడు నీదుకోర్కి కొనసాగుటకై నిజమూర్తిఁ జూపితిన్. 125

క. నావలనికోర్కి యూరక, పోవదు విడిపించు దోషపుంజములను మ
త్సేవం బుట్టును వైళమ, భావింపఁగ నాదుభక్తి బాలక వింటే. 126

క. [2]నాయందులమతి గలిగిన, వాయదు జన్మాంతరమున బాలక నీ వీ
కాయంబు విడిచి మీఁదట, మాయనుమతిఁ బుట్టఁ గలవు మద్భక్తుఁడవై. 127

మ. విను మీసృష్టి లయంబు నొంది యుగముల్ వేయైనకాలంబు యా
మిని యై పోయెడిఁ బోవఁగాఁ గలుగుఁ జూ మీఁదం బునస్సృష్టి యం
దు నిరూఢస్మృతితోడఁ బుట్టెదవు నిర్దోషుండ వై నాకృపన్
ఘనతం జెందెదు శుద్ధసాత్త్వికులలో గణ్యుండ వై యర్భకా. 128

వ. అని యిట్లాకాశంబు మూర్తియు ఋగ్వేదాదికంబు నిశ్వాసంబును గా నొప్పి సర్వనియామకం బైనమహాభూతంబు నలికి యూరకున్న నేను మస్తకంబు వంచి మ్రొక్కి తత్కరుణకు సంతసించుచు మదంబు దిగనాడి మచ్చరంబు విడిచి కామంబు నిర్జించి క్రోధంబు వర్జించి లోభమోహంబుల వెడలనడిచి సిగ్గు విడిచి యనంతనామంబులు పఠించుచుఁ బరమభద్రంబు లయినతచ్చరిత్రంబులం జింతించుచు నిరంతరసంతోషుండ నై కృష్ణుని బుద్ధి నిలిపి నిర్మలాంతఃకరణంబులతోడ విషయవిరక్తుండ నై కాలంబున కెదురు సూచుచు భూమిం దిరుగుచు నుండు నంతం గొంతకాలంబునకు మెఱుంగు మెఱసిన తెఱంగున మృత్యువు దోఁచినం బంచభూతమయం బయి కర్మస్వరూపం బయినపూర్వదేహంబు విడిచి హరికృపావశంబున శుద్ధసత్త్వమయం బైనభాగవతదేహంబు సొచ్చితి నంతం ద్రైలోక్యంబు సంహరించి ప్రళయకాలపయోరాశిమధ్యంబున శయనించి నిదురవోవ నిచ్చగించు నారాయణమూర్తి యయినబ్రహ్మనిశ్వాసంబు వెంట నతనిలోపలం బ్రవేశించితి నంత సహస్రయుగపరిమితం బైనకాలంబు సనిన లేచి లోకంబులు సృజియింప నుద్యోగించు బ్రహ్మప్రాణంబువలన మరీచిముఖ్యు లగుమునులును నేనును జన్మించితి మందు నఖండితబ్రహ్మచర్యుండ నై యేను మూఁడులోకంబుల బహిరంతరంబులందు మహావిష్ణునియనుగ్రహంబున నడ్డంబు లేక యీశ్వరదత్తయై బ్రహ్మాభివ్యంజకంబు లైనసప్తస్వరంబులు దమయంతన మ్రోయుచున్నయీ వీణాలాపనరతిం జేసి నారాయణకథాగానంబు సేయుచుఁ జరియించు చుండుదు.

ఆ. తీర్థపాదుఁ డయినదేవుండు విష్ణుండు, తనచరిత్ర మేను దవిలి పాడఁ
జీరఁబడ్డవానిచెలువున నేతెంచి, ఘనుఁడు నామనమునఁ గాన వచ్చు. 130

1. యొరుండు. 2. నాయందుఁ గలుగునీమది, వాయదు.

క. వినుమీ సంసారం బను, వననిధిలో [1]మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁ బొందెడువానికి వి, ష్ణునిగుణవర్ణనము దెప్ప సుమ్ము మునీంద్రా. 131

చ. యమనియమాదియోగముల నాత్మ నియంత్రిత మయ్యుఁ గామరో
షములఁ బ్రచోదితంబ యగు శాంతి వహింపదు విష్ణుసేవచేఁ
గ్రమమున శాంతి గైకొనినకైవడి నాదుశరీరజన్మక
ర్మములరహస్య మెల్ల మునిమండన చెప్పితి నీవు గోరినన్. 132

వ. అని యిట్లు భగవంతుం డగునారదుండు వ్యాసమునీంద్రుని వీడ్కొని వీణ వాయించుచు యదృచ్ఛామార్గంబునం జనియె నని సూతుం డి ట్లనియె. 133

క. వాయించు వీణ నెప్పుడు, మ్రోయించు ముకుందగీతములు జగములకున్
జేయించుఁ జెవులపండువు, మాయించు నఘాళి నిట్టిమతి మఱి గలఁడే. 134

వ. అని నారదుం గొనియాడిన సూతునిం జూచి నారదుమాటలు విన్న వెనుక భగవంతుం డైన బాదరాయణుం డేమి సేసె నని శౌనకుం డడిగిన సూతుం డి ట్లనియె బ్రహ్మదేవత్య యైనసరస్వతీపడమటితీరంబున ఋషులకు సత్త్రకర్మవర్ధనం బయి బదరీతరుషండమండితం బయి శమ్యాప్రాసం బనం బ్రసిద్ధంబగునాశ్రమంబు గల దందు జలంబుల వార్చి కూర్చుండి వ్యాసుండు దనమది దిరంబు సేసికొని భక్తియుక్తం బయినచిత్తంబునం బరిపూర్ణుం డయినయీశ్వరుం గాంచి యీశ్వరాధీనమాయాకృతం బైనజీవునిసంసారంబుఁ గని జీవుండు మాయచేత మోహితుం డై గుణవ్యతిరిక్తుం డయ్యు మాయాసంగతిం దన్నుఁ ద్రిగుణాత్మకుం డని యభిమానించుచుఁ ద్రిగుణాత్మాభిమానంబునం గర్తయు భోక్తయు నను ననర్థంబు నొందు ననియు నయ్యనర్థంబునకు నారాయణభక్తియోగంబు గాని యుపశమనంబు వేఱొకటి లే దనియు నిశ్చయించి. 135

మ. అవనీచక్రములోన నేపురుషుఁ డేయామ్నాయముల్ విన్న మా
ధవుపై లోకశరణ్యుపై భవములం దప్పింపఁగాఁ జాలుభ
క్తివిశేషంబు జనించు నట్టిభువనక్షేమంకరం బైనభా
గవతామ్నాయము బాదరాయణుఁడు దాఁ గల్పించె నేర్పొప్పఁగన్. 136

వ. ఇట్లు భాగవతంబు నిర్మించి మోక్షార్థి యైనశుకునిచేఁ జదివించె నని చెప్పిన విని శౌనకుండు నిర్వాణతత్పరుండును సర్వోపేక్షకుండు నైనశుకయోగి యేమిటికి భాగవతం బభ్యసించె ననవుడు సూతుం డి ట్లనియె. 137

క. ధీరులు నిరపేక్షులు నా, త్మారాములు నైనమునులు హరిభజనము ని
ష్కారణము చేయుచుందురు, నారాయణుఁ డట్టివాఁడు నవ్యచరిత్రా. 138

క. హరిగుణవర్ణనరతుఁ డై, హరితత్పరుఁ డైనబాదరాయణి శుభత
త్పరతం బఠించెఁ ద్రిజగ, ద్వరమంగళ మైనభాగవతనిగమంబున్. 139

---

1. విషయభోగవాంఛలచే.

క. నిగమములు వేయుఁ జదివిన, సుగమంబులు గావు ముక్తిసుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను, నిగమంబుఁ బఠింప ముక్తినివసనము బుధా. 140

అర్జునుండు పుత్రఘాతి యగు నశ్వత్థామను నవమానించుట.

వ. అని పలికి రాజర్షి యైనపరీక్షిన్మహారాజు జన్మకర్మముక్తులును బాండవులమహాప్రస్థానంబును గృష్ణకథోదయంబును జెప్పెదం గౌరవధృష్టద్యుమ్నాదులయుద్ధంబున వీరులైనవారలు స్వర్గంబునకుం జనినవెనుక భీముగదాఘాతంబున దుర్యోధనుండు దొడలు విఱిగి కూలిన నశ్వత్థామ దుర్యోధనునకుం బ్రియంబు సేయువాఁ డై నిదురవోవు ద్రౌపదీపుత్రులశిరంబులు ఖండించి తెచ్చి సమర్పించె నది క్రూరకర్మం బని లోకులు నిందింతురు. 141

ఉ. బాలురచావు కర్ణములఁ బడ్డఁ గలంగి యలంగి యేడువం
జాలక బాష్పతోయకణజాలము చెక్కుల రాల నేడ్చి పాం
చాలతనూజ నేలఁ బడి జాలిఁ బడం గని యెత్తి మంజువా
చాలతఁ జూపుచుం జికురజాలము దువ్వుచుఁ గ్రీడి యిట్లనున్. 142

మ. ధరణీశాత్మజ [1]నీవు నీకు వగవన్ ధర్మంబె యాద్రౌణి ని
ష్కరుణుం డై విదళించె బాలకుల మద్గాండీవనిర్ముక్తభీ
కరబాణంబుల నేఁడు వానిశిరమున్ ఖండించి నేఁ దెత్తుఁ ద
చ్ఛిరముం ద్రొక్కి జలంబు లాడు మిచటన్ శీతాంశుబింబాననా. 143

వ. అని యిట్లోడంబఱిచి తనకు మిత్త్రుండును సారథియు నైనహరి మే లనుచుండం గవచంబు దొడిగి గాండీవంబు ధరియించి కపిధ్వజుం డై గురుసుతునివెంట రథంబు దోలించిన. 144

శా. తన్నుం జంపెద నంచు వచ్చువిజయున్ దర్శించి తద్ద్రౌణి యా
పన్నుం డై శిశుహంత గావున నిజప్రాణేచ్ఛఁ బాఱెన్ వడిన్
మున్నా బ్రహ్మ మృగాకృతిం దనయకున్ మోహించి క్రీడింప నా
సన్నుం డై హరుఁ జూచి పాఱుపగిదిన్ సర్వేంద్రియభ్రాంతితోన్. 145

వ. ఇట్లోపినంతదూరంబుం బఱవిడి వెనుకఁ జూచి రథతురంగంబు లలయుటఁ దెలిసి నిలిచి ప్రాణరక్షణంబునకు నొండుపాయంబు లేమి నిశ్చయించి జలంబుల వార్చి ద్రోణనందనుండు సమాహితచిత్తుం డై ప్రయోగంబ కాని యుపసంహారంబు నేరకయుఁ బ్రాణసంరక్షణార్థంబు పార్థునిమీఁద బ్రహ్మశిరోనామకాస్త్రంబుం బ్రయోగించిన నది ప్రచండతేజంబున దిగంతరాళంబు నిండి ప్రాణిభయంకరం బై తోఁచిన హరికి నర్జునుం డిట్లనియె. 146

సీ. పద్మలోచన కృష్ణ భక్తాభయప్రద, వినుము సంసారాగ్ని వేఁచుచున్న
జనులసంసారంబు సంహరింపఁగ నీవు, దక్క నన్యులు లేరు దలఁచి చూడ

1. నీకు నేల వగవన్.

సాక్షాత్కరించిన। సర్వేశ్వరుండవు, ప్రకృతికి నవ్వలి। ప్రభుఁడ వాద్య
పురుషుండ [1]వీవు ప్ర।బోధంబుచే మాయ, నడఁతువు నిశ్శ్రేయ।సాత్మయందు

ఆ. మాయచేత మునిఁగి । మనువారలకుఁ గృప, సేసి ధర్మముఖ్య।చిహ్న మయిన
శుభము సేయు దీవు । సుజనుల నవనిలోఁ, గావఁ బుట్టుదువు జ।గన్నివాస. 147

క. ఇది యొక తేజము భూమియుఁ, జదలును దిక్కులును నిండి । సర్వంకష మై
యెదు రై వచ్చుచు నున్నది, విదితముగా నెఱుఁగఁ జెప్పు।వే దేవేశా. 148

వ. అనిన హరి యి ట్లనియె. 149

శా. జిహ్మత్వంబునఁ బాఱి ద్రోణజుఁడు దు।శ్శీలుండు ప్రాణేచ్ఛ మై
బ్రహ్మాస్త్రం బదె యేసె వచ్చె నిదె త।ద్బాణాగ్ని బీభత్స నీ
బ్రహ్మాస్త్రంబునఁ గాని దీని మరలిం।పన్ రాదు సంహార మీ
బ్రహ్మాపత్య మెఱుంగఁ జేయుము వడిన్ । బ్రహ్మాస్త్రమున్ దీనిపై. 150

వ. అనిన నర్జునుండు జలంబుల వార్చి హరికిం బ్రదక్షిణంబు వచ్చి ద్రోణనందనుం
డేసిన బ్రహ్మాస్త్రంబుమీఁదఁ దన బ్రహ్మాస్త్రంబుం బ్రయోగించిన. 151

మ. అవనివ్యోమములందు నిండి తమలో । నా రెండు బ్రహ్మాస్త్రముల్
రవివహ్నిద్యుతిఁ బోరుచుం ద్రిభువన।త్రాసంబు గావింపఁగా
వివశభ్రాంతి యుగాంతమో యని ప్రజల్ । వీక్షింప నా వేళ మా
ధవునాజ్ఞన్ విజయుండు సేసె విశిఖ।ద్వంద్వోపసంహారమున్. 152

వ. ఇట్లస్త్రద్వయంబు నుపసంహరించి ధనంజయుండు ద్రోణనందనుం గూడ నెగచి
పట్టుకొని రోషారుణితలోచనుం డై యాజ్ఞికుండు రజ్జువునం బశువుఁ గట్టినచందం
బున బంధించి శిబిరంబుకడకుం గొని చని హింసింతు నని తిగిచినం జూచి హరి
యి ట్లనియె. 153

ఉ. మాఱుపడంగ లేనియస।మర్థుల సుప్తుల నస్త్రవిద్యలం
దేఱనిపిన్నపాపల వ।ధించె నిశీథమునందుఁ గ్రూరుఁ డై
పాఱుఁడు గాని పాతకుఁడు । ప్రాణభయంబున వెచ్చ నూర్చుచుం
బాఱెడివీనిఁ [2]గావుము కృ।పామతి నర్జున పాపవర్జనా. 154

చ. వెఱచినవాని దైన్యమున । వేఁదుఱు నొందినవాని నిద్ర మై
మఱచినవాని సౌఖ్యమున । మద్యము ద్రావినవాని [3]భగ్నుఁ డై

1. వగునీవు ♦ బోధంబుచే. 2. మూలమున 'మైనం పార్థార్హసి త్రాతుం బ్రహ్మబన్ధు మిమం జహి' అని కృష్ణుఁడు అశ్వత్థామను గావక చంపుమని చెప్పినట్లున్నది. వ్రాఁతప్రతులందెల్లఁ 'గావు' మనియే యున్నది. మూలమునుబట్టి దీనిని 'గావకుము' అని పండితులు దిద్దియున్నను వ్రాఁతప్రతుల చొప్పునఁ 'గావు' మనియే దిద్దఁబడియె. 3. వగ్నుఁ డై.

పఱచినవాని సాధుజడభావమువానిని గావు మంచు వా
చఱచినవానిఁ గామినులఁ జంపుట ధర్మము గాదు ఫల్గునా. 155

శా. స్వప్రాణంబుల నెవ్వఁ డేనిఁ గరుణాసంగంబు సాలించి య
న్యప్రాణంబులచేత రక్షణము సేయం జూచు వాఁ డంత్యలో
కప్రాప్తుం డగు రాజదండమున సత్కల్యాణుఁ డౌ నైన నీ
విప్రుం [1]దండితుఁ జేయ నేటికి మహావిభ్రాంతిచే నుండఁగన్. 156

వ. అని యివ్విధంబునఁ గృష్ణుం డానతిచ్చిన బ్రాహ్మణుండు కృతాపరాధుం డయ్యు వధ్యుండు గాఁ డనుధర్మంబుఁ దలంచి చంపక ద్రుపదరాజపుత్రికిం దనచేసిన ప్రతిజ్ఞం దలంచి బద్ధుం డైనగురునందనుం దోడ్కొని కృష్ణుండు సారథ్యంబు సేయ శిబిరంబుకడకు వచ్చి. 157

క. సురరాజసుతుఁడు సూపెను, దురవధిసుతశోకయుతకు ద్రుపదునిసుతకుం
బరిచలితాంగశ్రేణిం, బరుషమహాపాశబద్ధపాణిన్ ద్రౌణిన్. 158

ద్రౌపది యశ్వత్థామను జూచి సంభాషించుట.

వ. ఇట్లర్జునుండు దెచ్చి చూపిన బాలవధజనితలజ్జాపరాఙ్ముఖుం డైనకృపికొడుకుం జూచి మ్రొక్కి సుస్వభావ యగుద్రౌపది యిట్లనియె. 159

మ. పరఁగన్ మామకవార లందఱును మున్ బాణప్రయోగోపసం
హరణాద్యాయుధవిద్య లన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్రాకృతి నున్నద్రోణుఁడవు నీచిత్తంబులో లేశముం
గరుణాసంగము లేక శిష్యసుతులన్ ఖండింపఁగాఁ బాడియే. 160

క. భూసురుఁడవు బుద్ధిదయా, భాసురుఁడవు శుద్ధవీరభటసందోహా
గ్రేసరుఁడవు శిశుమారణ, మాసురకృత్యంబు ధర్మ మగునే తండ్రీ. 161

శా. ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకుఁ జేయరు బలోద్రేకంబుతోఁ జీఁకటిన్
భద్రాకారులఁ బిన్నపాపల రణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతు లె ట్లాడెనో. 162

ఉ. అక్కట పుత్రశోకజనితాకులభారవిషణ్ణచిత్త నై
పొక్కుచు నున్నభంగి నినుఁ బోరఁ గిరీటి నిబద్ధుఁ జేసి నేఁ
డిక్కడ కీడ్చి తెచ్చుట సహింపని దై భవదీయమాత నేఁ
డెక్కడ నెట్టిశోకమున నెక్కియ యేడ్చుచుఁ బొక్కుచున్నదో. 163

వ. అని కృష్ణార్జునులం జూచి యిట్లనియె. 164

---

1. ఇచటను 'తదసౌవధ్యతాం' అను మూలమునకు సరిగా 'దండితుఁ జేయు మేటికి' అని పాఠము దిద్దఁబడియున్నది. వ్రాఁతప్రతులం దెల్ల 'దండితుఁ జేయ నేటికి' అనియే యున్నది.

ఉ. ద్రోణునితో శిక్షం బడక ద్రోణకుటుంబిని యున్న దింట న
క్షీణతనూజశోకవివశీకృత నై విలపించుభంగి నీ
ద్రౌణిఁ దెరల్చి తెచ్చుటకు దైన్యము నొందుచు నెంత పొక్కునో
ప్రాణవియుక్తుఁ డైన నతిపాపము బ్రాహ్మణహింస మానరే. 165

క. భూపాలకులకు విప్రులఁ, గోపింపం జేయఁ దగదు కోపించినఁ ద
త్కోపానలంబు మొదలికి, భూపాలాటవులఁ గాల్చు భూకంపముగాన్. 166

వ. అని [1]యిట్లు ధర్మ్యంబును సకరుణంబును నిర్వ్యళీకంబును సమంజసంబును శ్లాఘ్యంబునుం గాఁ బలుకుద్రౌపదిపలుకులకు ధర్మనందనుండు సంతసిల్లె నకుల సహదేవ సాత్యకి ధనంజయ కృష్ణులు సమ్మతించిరి సమ్మతింపక భీముం డిట్లనియె.

చ. కొడుకులఁ బట్టి చంపె నని కోపము నొందదు బాలఘాతుకున్
విడువు మటంచుఁ జెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది వీఁడు విప్రుఁడే
విడువఁగ నేల చంపుఁ డిటు వీనిని మీరలు చంప రేని నా
పిడికిటిపోటునన్ శిరము భిన్నము సేసెదఁ జూడుఁ డిందఱున్. 168

వ. అని పలికిన నశ్వత్థామకు ద్రౌపది యడ్డంబు వచ్చె భీమునిసంరంభంబు సూచి హరి చతుర్భుజుం డయి రెండుచేతుల భీముని వారించి కడమరెంటను ద్రుపద పుత్త్రికను దలంగించి నగుచు భీమున కిట్లనియె. 169

ఉ. అవ్యఁడు గాఁడు వీఁడు శిశుహంత దురాత్మకుఁ డాతతాయి హం
తవ్యుఁడు బ్రహ్మబంధుఁ డగుఁ దప్పదు నిక్కము "బ్రాహ్మణో న హ
న్తవ్య" యటంచు వేదము శ్రుతం బగుఁ గావున ధర్మదృష్టిఁ గ
ర్తవ్యము వీనిఁ గాచుట యథాస్థితిఁ జూడుము పాండవోత్తమా. 170

వ. అని సరసాలాపంబు లాడి పవననందను నొడంబఱిచి యర్జునుం జూచి ద్రౌపదికి నాకు భీమసేనునకు సమ్మతంబుగ మున్ను నీచేసిన ప్రతిజ్ఞ సిద్ధించునట్లు నాపంపు సేయు మని నారాయణుం డానతిచ్చిన నర్జునుండును దదనుమతంబున. 171

శా. విశ్వస్తుత్యుఁడు శక్రసూనుఁడు మహావీరుండు ఘోరాసిచే
నశ్వత్థామశిరోజముల్ దఱిఁగి చూడాంతర్మహారత్నమున్
శశ్వత్కీర్తి వెలుంగఁ బుచ్చుకొని పాశవ్రాతబంధంబులన్
విశ్వాసంబున నూడ్చి త్రోచె శిబిరోర్వీభాగముం బాసి పోన్. 172

క. నిబ్బరపుబాలహంతయు, గొబ్బునఁ దేజంబు మణియుఁ గోల్పడి నతుఁ డై
ప్రబ్బినవగచే విప్రుఁడు, సిబ్బితితో నొడలి[2]గబ్బు సెడి వడిఁ జనియెన్. 173

ఆ. ధనముఁ గొనుట యొండెఁ దల గొఱుగుట యొండె
నాలయంబు వెడల నడుచు టొండెఁ

---

1. 'యిట్లు ద్రౌపది పలికినకరుణాన్యాయధర్మసహితంబు లైనపలుకులకు' అనియే వ్రాఁత ప్రతులు. 2. కల్మి ♦ చెడి.

గాని చంపఁ దగినకర్మంబు సేసినఁ
జంపఁ దగదు విప్రజాతిఁ బతికి. 174

వ. ఇట్లశ్వత్థామం బ్రాణావశిష్టుం జేసి వెడల నడిచి పాండవులు పాంచాలీసహితులై పుత్రులకు శోకించి మృతులైనబంధువుల కెల్ల దహనాదికృత్యంబులు సేసి యుదకప్రదానంబు సేయుకొఱకు స్త్రీల ముందట నిడికొని గోవిందుండును దారును గంగకుం జని తిలోదకంబులు వోసి క్రమ్మఱ విలపించి హరిపాదపద్మపరాగపటలపవిత్రంబు లయిన భాగీరథీజలంబుల స్నాతు లయి యున్నయెడం బుత్రశోకాతుర లయినగాంధారీధృతరాష్ట్రులను గుంతీద్రౌపదులను జూచి మాధవుండు మునీంద్రులుం దానును బంధుమరణశోకాతుర లయినవారలవగపు మానిచి మన్నించె నివ్విధంబున. 175

శా. పాంచాలీకబరీవికర్షణమహాపాపక్షతాయుష్కులం
జంచద్గర్వుల ధార్తరాష్ట్రుల ననిం జంపించి గోవిందుఁ డి
ప్పించెన్ రాజ్యము ధర్మపుత్రునకుఁ గల్పించెన్ మహాఖ్యాతిఁ జే
యించెన్ మూఁడుతురంగమేధములు దేవేంద్రప్రభావంబునన్. 176

శ్రీకృష్ణుఁ డుత్తరాగర్భస్థుం డగునర్భకుని రక్షించుట.

వ. అంత వాసుదేవుండు వ్యాసప్రముఖభూసురపూజితుం డయి యుద్ధవసాత్యకులు గొలువ ద్వారకాగమనప్రయత్నంబునం బాండవుల వీడ్కొని రథారోహణంబు సేయుసమయంబున భయంబునం దత్తఱపడుచు నుత్తర సనుదెంచి కల్యాణగుణోత్తరుం డైనహరి కిట్లనియె. 177

మ. ఇదె కాలానలతుల్య మైనవిశిఖం బేతెంచె దేవేశ నేఁ
డుదరాంతర్గతగర్భదాహమునకై యుగ్రప్రభన్ వచ్చుచు
న్నది దుర్లోక్యము మానుపన్ శరణ మన్యం బేమియున్ లేదు నీ
పదపద్మంబులె కాని యొం డెఱుఁగ నీబాణాగ్ని వారింపవే. 178

క. దుర్భరబాణానలమున, గర్భములో నున్నశిశువు ఘనసంతాపా
విర్భావంబునఁ బొరలెడి, నిర్భరకృపఁ గావ వయ్య నిఖిలస్తుత్యా. 179

క. చెల్లెలికోడల నీమే, నల్లుఁడు శత్రువులచేత హతుఁ డయ్యెను సం
ఫుల్లారవిందలోచన, భల్లాగ్ని నడంచి శిశువు బ్రదికింపఁ గదే. 180

ఆ. గర్భమందుఁ గమలగర్భాండశతములు, నిముడుకొన వహించు నీశ్వరేశ
నీకు నొక్కమానిసీగర్భరక్షణ, మెంతబరువు నిర్వహింతు గాక. 181

వ. అనిన నాశ్రితవత్సలుం డగునప్పరమేశ్వరుండు సుభద్రకోడలిదీనాలాపంబు లాలించి యిది ద్రోణనందనుండు లోక మంతయు నపాండవం బయ్యెడు మని యేసిన దివ్యాస్త్రం బని యెఱింగె నంతఁ బాండవుల కభిముఖం బయి ద్రోణనందన

దివ్యాస్త్రనిర్గతనిశితమార్గణంబులు డగ్గఱిన బెగ్గడిలక వారును బ్రత్యస్త్రంబు లందికొని పెనంగుసమయంబున. 182

మ. తనసేవారతి చింత గాని పరచింతాలేశముం లేనిస
జ్జనులం బాండుతనూజులన్ మనుచువాత్సల్యంబుతో ద్రోణినం
దనుబ్రహ్మాస్త్రము నడ్డపెట్టఁ బనిచెన్ దైత్యారి సర్వారిసా
ధననిర్వక్రము రక్షితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్. 183

మ. సకలప్రాణిహృదంతరాళముల భాస్వజ్జ్యోతి యై యుండుసూ
క్ష్మకళుం డచ్యుతుఁ డయ్యెడన్ *విరటుచూల్ గర్భంబుఁ దాఁ జక్రహ
స్తకుఁ డై వైష్ణవమాయఁ గప్పి కురుసంతానార్థి యై యడ్డ మై
ప్రకటస్ఫూర్తి నడంచె ద్రోణతనయబ్రహ్మాస్త్రమున్ లీలతోన్. 184

వ. ఇట్లు ద్రోణతనయుం జేసిన ప్రతిక్రియారహితం బయినబ్రహ్మశిరం బనియెడి దివ్యాస్త్రంబు వైష్ణవతేజంబున నిరర్థకం బయ్యె నిజమాయచేఁ సకలలోకసర్గస్థితి సంహారంబు లాచరించునట్టిహరికి ధరణీసురబాణనివారణంబు విచిత్రంబు గాదు తత్సమయంబున సంతసించి పాండవపాంచాలీసహిత యై కొంతి గమనోన్ముఖుం డయినహరిం జేర వచ్చి యి ట్లనియె. 185

కుంతీదేవి శ్రీకృష్ణుని నుతించుట.

క. పురుషుం డాద్యుఁడు ప్రకృతికిఁ, బరుఁ డవ్యయుఁ డఖిలభూతబహిరంతర్భా
సురుఁ డనవలోకనీయుఁడుఁ, బరమేశ్వరుఁ డై ననీకుఁ బ్రణవములు హరీ. 186

వ. మఱియు జవనికమఱుపున నాట్యంబు సలుపునటునిచందంబున మాయాయవని కాంతరాళంబున నిలువంబడి నీమహిమచేఁ బరమహంసలు నివృత్తరాగద్వేషులు నిర్మలాత్ములు నయినమునులకు నదృశ్యమానుండ వయి పరిచ్ఛిన్నుండవు గాని నీవు మూఢదర్శనంబులు దర్శించుకుటుంబవతు లగుమాకు నెట్లు దర్శనీయుండ వయ్యెదు శ్రీకృష్ణ వాసుదేవ దేవకీనందన నందగోపకుమార గోవింద పంకజనాభ పద్మమాలికాలంకృత పద్మలోచన పద్మసంకాశచరణ హృషీకేశ భక్తియోగంబునం జేసి నమస్కరించెద నవధరింపుము. 187

సీ. తనయులతోడనే దహ్యమానం బగు, జతుగృహంబునయందుఁ జావకుండఁ
గురురాజు పెట్టించుఘోరవిషంబున, మారుతపుత్త్రుండు మడియ కుండ
ధార్తరాష్ట్రుఁడు సముద్ధతిఁ జీర లొలువంగ, ద్రౌపదిమానంబు దలఁగకుండ
గాంగేయకుంభజకర్ణాదిఘనులచే, నాబిడ్డ లనిలోన నలఁగ కుండఁ

తే. విరటుపుత్త్రికకడుపులో వెలయుచూలు, ద్రోణినందనుశరవహ్నిఁ దూలకుండ
మఱియు రక్షించితివి పెక్కుమార్గములను, నిన్ను నేమని వర్ణింతు నీరజాక్ష.

మత్త. బల్లిదుం డగుకంసుచేతను బాధ నొందుచు నున్నమా

* 'విరటజాగర్భంబు' వనియే వ్రాఁతప్రతులు. అయ్యది చింత్యము.

తల్లిఁ గాచినభంగిఁ గాచితి ధార్తరాష్ట్రులచేత నేఁ
దల్లడంబునఁ జిక్కకుండఁగఁ దావకీయగుణవ్రజం
బెల్ల సంస్తుతి సేసి చెప్పఁగ నెంతదాన జగత్పతీ. 189

క. జననము నైశ్వర్యంబును, ధనమును విద్యయును గలమదచ్ఛన్నుల కిం
చనగోచరుఁ డగునిన్నున్, వినుతింపఁగ లేరు నిఖిలవిబుధస్తుత్యా. 190

వ. మఱియు భక్తధనుండును నివృత్తధర్మార్థకామవిషయుండును నాత్మారాముండును రాగాదిరహితుండును గైవల్యదానసమర్థుండును గాలరూపకుండును నియామకుండును నాద్యంతశూన్యుండును విభుండును సర్వసముండును సకలభూతనిగ్రహానుగ్రహకరుండును నైననిన్నుఁ దలంచి నమస్కరించెద నవధరింపుము మనుష్యుల విడంబించుభవదీయవిలసనంబు నిర్ణయింప నెవ్వఁడు సమర్థుండు నీకుం బ్రియాప్రియులు లేరు జన్మకర్మశూన్యుండ వయిననీవు తిర్యగాదిజీవులయందు వరాహాదిరూపంబులను మనుష్యులందు రామాదిరూపంబులను ఋషులయందు వామనాదిరూపంబులను జలచరంబులయందు మత్స్యాదిరూపంబులను నవతరించుట లోకవిడంబనార్థంబు గాని జన్మకర్మసహితుండ వగుటం గాదు. 191

ఉ. కోపముతోడ నీవు దధికుంభము భిన్నము సేయుచున్నచో
గోపిక త్రాటఁ గట్టిన వికుంచితసాంజనబాష్పతోయధా
రాపరిపూర్ణవక్త్రముఁ గరంబులఁ బ్రాముచు వెచ్చ నూర్చుచుం
బాపఁడ వై నటించుట కృపాపర నామదిఁ జోద్య మయ్యెడిన్. 192

క. మలయమునఁ జందనము క్రియ. వెలయఁగ ధర్మజునికీర్తి వెలయించుట కై
యిలపై నభవుఁడు హరి యదు,కులమున నుదయించె నండ్రు గొంద ఱనంతా.

క. వసుదేవదేవకులు తా, పసగతి గతభవమునందుఁ బ్రార్థించిన సం
తసమునఁ బుత్త్రత నొందితి, వసురలమృతి కంచుఁ గొంద ఱండ్రు మహాత్మా.

క. జలరాశినడుమ మునిఁగెడు, కలము క్రియన్ భూరిభారకర్శిత యగునీ
యిలఁ గావ నజుఁడు కోరినఁ, గలిగితి వని కొంద ఱండ్రు గణనాతీతా. 195

తే. మఱచి యజ్ఞానకామ్యకర్మములఁ దిరుగు
వేదనాతురులకుఁ దన్నివృత్తిఁ జేయ
శ్రవణచింతనవందనార్చనము లిచ్చు
కొఱకు నుదయించి తండ్రు నిన్ గొంద ఱభవ. 196

మ. నినుఁ జింతించుచుఁ బాడుచుం బొగడుచున్ నీదివ్యచారిత్రముల్
వినుచుం జూతురు గాక లోకు లితరాన్వేషంబులం జూతురే
ఘనదుర్జన్మపరంపరాదళనదక్షుం బై మహాయోగివా
గ్వనుతం బైనభవత్పదాబ్జయుగమున్ విశ్వేశ విశ్వంభరా. 197

వ. దేవా నిరాశ్రయుల మై భవదీయచరణారవిందంబు లాశ్రయించి నీవారల మైన

మమ్ము విడిచి విచ్చేయ నేల నీసకరుణావలోకనంబుల నిత్యంబును జూడవే నీ
యాదవసహితులైనపాండవులు జీవునిం బాసినయింద్రియంబులచందంబునఁ
గీర్తిసంపదలు లేక తుచ్ఛత్వంబు నొందుదురు కల్యాణలక్షణలక్షితంబులైన నీ
యడుగులచేత నంకితం బయినమదీయధరణీమండలంబు నీవు వాసిన శోభితంబు
గాదు నీకృపావీక్షణామృతంబున నిక్కడిజనపదంబులు కుసుమఫలభరితంబు
లై యోషధితరులతాగుల్మనదనదీసమేతంబులై యుండు. 198

ఉ. యాదవులందుఁ బాండవులయందు నధీశ్వర నాకు మోహవి
చ్ఛేదము సేయు మయ్య ఘనసింధువుఁ జేరెడిగంగభంగి నీ
పాదసరోజచింతనముపై ననిశంబు మదీయబుద్ధి న
త్యాదరవృత్తితోఁ గదియునట్లుగఁ జేయఁ గదయ్య యీశ్వరా. 199

శా. శ్రీకృష్ణా యదుభూషణా నరసఖా శృంగారరత్నాకరా
లోకద్రోహినరేంద్రవంశదహనా లోకేశ్వరా దేవతా
నీకబ్రాహ్మణగోగణార్తిహరణా నిర్వాణసంధాయకా
నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ. 200

వ. అని యిట్లు సకలభాషణంబుల నుతియించుగొంతిమాటకు నియ్యకొని గోవిం
దుండు మాయానిరూఢమందహాసవిశేషంబున మోహంబు నొందించి రథా
రూఢుండై కరినగరంబునకు వచ్చి కుంతీసుభద్రాదుల వీడ్కొని తనపురంబునకు
విచ్చేయ గమకించి ధర్మరాజుచేఁ గించిత్కాలంబు నిలువు మని ప్రార్థితుండై
నిలిచె నంత బంధువధశోకాతురుం డయినధర్మజుండు నారాయణవ్యాసధౌ
మ్యాదులచేతఁ దెలుపంబడియుఁ దెలియక మోహితుండై నిర్వేదం బగుచిత్తం
బున ని ట్లనియె. 201

మ. తనదేహంబునకై యనేకమృగసంతానంబుఁ జంపించుదు
ర్జనుభంగిన్ గురుబాలకద్విజతనూజభ్రాతృసంఘంబు ని
ట్లనిఁ జంపించినపాపకర్మునకు రాజ్యాకాంక్షికిన్ నాకు హా
యనలక్షావధి నైన ఘోరనరకవ్యాసంగముల్ మానునే. 202

వ. మఱియుఁ బ్రజాపరిపాలనపరుం డయినరాజు ధర్మయుద్ధంబున శత్రువుల వధియిం
చినం బాపంబు లే దని శాస్త్రవచనంబు గల దయిన నది విజ్ఞానంబుకొఱకు స
మర్థంబు గాదు చతురంగంబుల ననేకాక్షౌహిణీసంఖ్యాతంబులం జంపించితి హత
బంధు లయినసతుల కేను జేసినద్రోహంబు దప్పించుకొన నేర్పు లేదు గృహస్థా
శ్రమధర్మంబులైనతురంగమేధాదియాగంబులచేతఁ బురుషుండు బ్రహ్మహత్యా
దిపాపంబులవలన విడివడి నిర్మలుం డగు నని నిగమంబులు నిగమించుఁ బంకం
బునఁ బంకిలస్థలంబునకు మద్యంబున మద్యభాండంబునకు శుద్ధి సంభవింపనిచం

దంబున బుద్ధిపూర్వకజీవహింసనంబు లయినయాగంబులచేతం బురుషులకుఁ
బాపబాహుళ్యంబ కాని పాపనిర్ముక్తి గాదని శంకించెద. 203

క. అని యిట్లు ధర్మసూనుఁడు, మొనసి నిరాహారిభావǂమున దేవనదీ
తనయుఁడు గూలినచోటికిఁ, జనియెఁ బ్రజాద్రోహపాపǂచలితాత్ముండై. 204

—ధర్మజుఁడు శ్రీకృష్ణసహితుండై శరతల్పగతుండైనభీష్మునికడ కేఁగుట.—

వ. అయ్యవసరంబునం దక్కినపాండవులును ఫల్గునసహితుండైనపద్మలోచనుండును గాంచనసమంచితంబు లయినరథంబు లెక్కి ధర్మజుం గూడి చనిన నతండు గుహ్యకసహితుం డయినకుబేరునిభంగి నొప్పె నిట్లు పాండవులు పరిజనులు గొలువఁ బద్మనాభసహితులై కురుక్షేత్రంబున కేఁగి దివంబుననుండి నేలం గూలినదేవత తెఱంగున సంగ్రామరంగపతితుండైనగంగానందనునకు నమస్కరించిరంత బృహదశ్వ భరద్వాజ పరశురామ పర్వత నారద బాదరాయణ కశ్యపాంగిరస కౌశిక ధౌమ్య సుదర్శన శుక వసిష్ఠాద్యనేక రాజర్షి బ్రహ్మర్షులు శిష్యసమేతులై చనుదెంచినం జూచి సంతసించి దేశకాలవిభాగవేది యైనభీష్ముండు వారలకుం బూజనంబు గావించి. 205

క. మాయాంగీకృతదేహుం, డై యఖిలేశ్వరుఁడు మనుజుఁ ǂ డైనాఁ డని ప్ర
జ్ఞాయత్తచిత్తమున గాం, గేయుఁడు పూజనము సేసెఁ ǂ గృష్ణున్ జిష్ణున్. 206

వ. మఱియు గంగానందనుండు వినయప్రేమసుందరు లయినపాండునందనులం గూర్చుండ నియోగించి మహానురాగజనితబాష్పసలిలసందోహసమ్మిళితలోచనుండై యిట్లనియె. 207

ఆ. ధరణిసురులు హరియు ǂ ధర్మంబు దిక్కుగా, బ్రదుకఁదలఁచి మీరుǂబహువిధముల
నన్నలార పడితి ǂ రాపత్పరంపర, లిట్టిచిత్రకర్మ ǂ మెందుఁ గలదు. 208

ఉ. సంతస మింత లేదు మృగǂశాపవశంబునఁ బాండుభూవిభుం
డంతయు నొంది యుండ మిము ǂ నర్భకులం గొని వచ్చి కాంతతో
నింతలవారిఁ గాఁ బెనిచె ǂ నెన్నఁడు సౌఖ్యముపట్టు గాన దీ
గొంతి యనేకదుఃఖములఁ ǂ గుందుచు నుండును భాగ్య మెట్టిదో. 209

ఉ. వాయువశంబులై యెగసి ǂ వారిధరంబులు మింటఁ గూడుచుం
బాయుచు నుండుకై వడిఁ బ్రǂపంచము సర్వముఁ గాలతంత్రమై
పాయుచుఁ గూడు చుండు నొకǂభంగిఁ జరింపదు కాల మన్నియుం
జేయుచు నుండుఁ గాలము విǂచిత్రము దుస్తర మెట్టివారికిన్. 210

ఉ. రా జఁట ధర్మజుండు సురǂరాజసుతుం డఁట ధన్వి శాత్రవో
ద్వేజక మైనగాండివము ǂ వి ల్లఁట సారథి సర్వభద్రసం
యోజకుఁ డైనచక్రి యఁట ǂ యుగ్రగదాధరుఁ డైనభీముఁ డ
య్యాజికిఁ దోడువచ్చు నఁట ǂ యాపద గల్గుటి దేమిచోద్యమో. 211

ఆ. ఈశ్వరుండు విష్ణుఁ డెవ్వేళ నెవ్వని, కేమి సేయుఁ బురుషుఁ డేమి యెఱుఁగు
నతనిమాయలకు మహాత్ములు విద్వాంసు, లడఁగి మెలఁగుచుందు రంధు లగుచు.

వ. కావున దైవతంత్రం బైన పనికి వగవం బని లేదు రక్షకులు లేని ప్రజల రక్షింపఁ బుండరీకాక్షుండు సాక్షాత్కరించిననారాయణుండు తేజోనిరూఢుండు గాక యాదవులందు నిగూఢుం డై తనమాయచేత లోకంబుల మోహాతిరేకంబు లొందించు నతనిరహస్యప్రకారంబుల భగవంతుం డైనపరమేశ్వరుం డెఱుంగు మఱియు దేవర్షి యగునారదుండును భగవంతుం డగుకపిలమునియు నెఱుంగుదురు మీరు కృష్ణుండు దేవకీపుత్త్రుం డగుమాతులేయుం డని తలంచి దూతసచివసారథిబంధుమిత్త్రప్రయోజనంబుల నియమింతు రిన్నిటం గొఱంత లేదు రాగాదిశూన్యుండు నిరహంకారుండు నద్వయుండు సమదర్శనుండు సర్వాత్మకుండు నయినయీశ్వరునకు నతోన్నతభావంబు లెక్కడివి లే వైన భక్తవత్సలుండు గావున నేకాంతభక్తులకు సులభుం డై యుండు. 213

సీ. అతిభక్తి నెవ్వనియందుఁ జిత్తముఁ జేర్చి, యెవ్వనినామ మూహించి పొగడి
కాయంబు విడుచుచుఁ గామకర్మాదిని, ర్మూలనుం డై యోగి ముక్తి నొందు
నట్టిసర్వేశ్వరుం డఖిలదేవోత్తముఁ, డెవ్వేళఁ బ్రాణంబు లేను విడుతు
నందాఁక నిదె [1]మహాప్రహర్షుఁ డై వికసిత, వదనారవిందుఁ డై వచ్చె నేఁడు

తే. నాల్గుభుజములుఁ గమలాభనయనయుగము, నొప్పఁ గన్నులముందటనున్నవాఁడు
మానవేశ్వర నాభాగ్యమహిమఁ జూడు, మేమి సేసితినో, పుణ్య మితనిఁ గూర్చి.

వ. అని యిట్లు ధనంజయసంప్రాపితశరపంజరుం డయినకురుకుంజరునివచనంబు లాకర్ణించి మును లందఱు విను చుండ ధర్మనందనుండు మందాకినీనందనువలన నరజాతిసాధారణంబు లగుధర్మంబులును వర్ణాశ్రమధర్మంబులును రాగవైరాగ్యోపాధులతోఁ గూడినప్రవృత్తినివృత్తిధర్మంబులును దానధర్మంబులును రాజధర్మంబులును స్త్రీధర్మంబులును శమదమాదికంబులును హరితోషణంబు లగుధర్మంబులును ధర్మార్థకామమోక్షంబులును నానావిధోపాఖ్యానేతిహాసంబులును సంక్షేపవిస్తారరూపంబుల నెఱింగె నంత రథకసహస్రంబులకు గమికాఁ డైనభీష్ముండు స్వచ్ఛందమరణు లైనయోగీశ్వరులచేత వాంఛితం బగునుత్తరాయణంబు సనుదెంచిన నది దనకు మరణోచితకాలం బని నిశ్చయించి. 215

శా. ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముం జేసి దృ
గ్జాలంబుల్ హరిమోముపైఁ బఱపి తత్కారుణ్యదృష్టిన్ విని
ర్మూలీభూతశరవ్యథానిచయుఁ డై మోదించి భీష్ముండు సం
శీలం బొప్ప నుతించెఁ గల్మషగజశ్రేణీహరిన్ శ్రీహరిన్. 216

---

1. మందహాసుఁ డై.

వ. ఇట్లు పీతాంబరధారియుఁ జతుర్భుజుండు నాదిపూరుషుండుఁ బరమేశ్వరుండు నగు హరియందు నిష్కాముండై విశుద్ధం బగుధ్యానవిశేషంబుచే నిరస్తదోషుం డగుచు ధారణావతియైనబుద్ధిని సమర్పించి పరమానందంబుననొంది ప్రకృతివలన నైనసృష్టిపరంపరలఁ బరిహరించుతలంపున మందాకినీనందనుం డిట్లనియె. 217

భీష్ముఁడు శ్రీకృష్ణుని స్తుతించుట.

మ. త్రిజగన్మోహననీలకాంతితను వుద్దీపింపఁ బ్రాభాతనీ
రజబంధుప్రభ మైనచేలము పయిన్ । రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్తముఖారవింద మతిసేవ్యం బై విజృంభింప మా
విజయుం జేరెడువన్నెలాఁడు మది నా । వేశించు నెల్లప్పుడున్. 218

మ. హయరింఖాముఖధూళిధూసరపరి । న్యస్తాలకోపేత మై
రయజాతశ్రమతోయబిందుయుత మై । రాజిల్లు నెమ్మోముతో
జయముం బార్థున కిచ్చువేడ్కఁ దని నా । శస్త్రాహతిం జాల నొ
చ్చియుఁ బోరించుమహానుభావు మదిలోఁ । జింతింతు నశ్రాంతమున్. 219

మ. నరుమాటల్ విని నవ్వుచో నుభయసే । నామధ్యమక్షోణిలోఁ
బరు లీక్షింప రథంబు నిల్పి పరభూ । పాలావళిం జూపుచుం
బరభూపాయువు లెల్లఁ జూపులన శుం । భత్కేళి వంచించుచుం
బరమేశుండు వెలుంగుచుండెడును హృ । త్పద్మాసనాసీనుఁ డై. 220

క. తనవారిఁ జంప జాలక, వెనుకకుఁ బో నిచ్చగించు । విజయునిశంకన్
ఘనయోగవిద్యఁ బాపిన, మునివంద్యునిపాదభక్తి । మొనయున్ నాకున్. 221

సీ. కుప్పించి యెగసినఁ । గుండలంబులకాంతి, గగనభాగం బెల్లఁ । గప్పికొనఁగ
నుఱికిన నోర్వక । యుదరంబులో నున్న, జగములవ్రేఁగున । జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి । చనుదెంచురయమునఁ, బైనున్నపచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు । నగుఁబాటు సేయకు, మన్నింపు మని క్రీడి । మరలఁ దిగువఁ

తే. గరికి లంఘించుసింహంబు । కరణి మెఱసి, నేఁడు భీష్మునిఁ జంపుదు । నిన్నుఁ గాతు
విడువు మర్జున యనుచు మ । ద్విశిఖవృష్టిఁ, దెరలి చనుదెంచుదేవుండు । దిక్కు నాకు.

మ. తనకున్ భృత్యుఁడు వీనిఁ గాచుట మహా । ధర్మంబు వో మ్మంచు న
ర్జునసారథ్యము పూని పగ్గములు చేఁ । జోద్యంబుగాఁ బట్టుచున్
మునికోలన్ వడిఁ బూన్చి ఘోటకములన్ । మోదించి తాడించుచున్
జనులన్ మోహము నొందఁ జేయుపరమో । త్సాహుం బ్రశంసించెదన్. 223

క. పలుకుల నగవుల నడపుల, నలుకల నవలోకనముల । నాభీరవధూ
కులములమనములతాలిమి, కొలుకులు వదలించుఘనుని । గొలిచెద మదిలోన్.

ఆ. మునులు నృపులుఁ జూడ । మునుధర్మజునిసభా, మందిరమున యాగ । మండపమునఁ
జిత్రమహిమతోడఁ । జెలు వొందుజగదాది, దేవుఁ డమరు నాదు । దృష్టియందు.

మ. ఒకసూర్యుండు సమస్తజీవులకుఁ దా నొక్కొక్కఁడై తోఁచుపో
లిక నేదేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబులహృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండు నట్టిహరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై. 226

వ. అని యిట్లు మనోవాగ్దర్శనంబులం బరమాత్ముం డగుకృష్ణుని హృదయంబున నిలిపికొని నిశ్వాసంబు మాని నిరుపాధికం బయినవాసుదేవబ్రహ్మంబునందుఁ గలిసినభీష్ముం జూచి సర్వజనులు దివసావసానంబున విహంగంబు లూరక యుండు తెఱంగున నుండిరి దేవమానవవాదితంబులై దుందుభినినదంబులు మొరసె సాధుజనకీర్తనంబులు మెఱసెఁ గుసుమవర్షంబులు గురిసె మృతుం డయినభీష్మునికి ధర్మజుండు పరలోకక్రియలు సేయించి [1](ముహూర్తమాత్రంబు దుఃఖితుం డయ్యె నంత నచ్చటిమునులు కృష్ణునిఁ దమహృదయంబుల నిలిపి కొని సంతుష్టాంతరంగు లగుచుం దదీయదివ్యావతారనామంబులచే స్తుతియించి స్వాశ్రమంబులకుం జనిరి పిదప నయ్యుధిష్ఠిరుండు) కృష్ణసహితుండై గజపురంబునకుం జని గాంధారీసమేతుం డయినధృతరాష్ట్రు నొడంబఱిచి వారిసమ్మతంబున వాసుదేవానుమోదితుండై పితృపైతామహం బైనరాజ్యంబు గైకొని ధర్మమార్గంబునం జేయు చుండె నని చెప్పిన విని సూతునకు శౌనకుం డిట్లనియె.

ఆ. ధనము లపహరించి తనతోడఁ [2]జెనకెడు, నాతతాయిజనుల నని వధించి
బంధుమరణదుఃఖభరమున ధర్మజుం, డెట్లు రాజ్యలక్ష్మి నిచ్చగించె. 228

వ. అనిన సూతుం డిట్లనియె. 229

క. కురుసంతతికిఁ బరీక్షి, న్నరవరు నంకురముఁ జేసి నారాయణుఁ డీ
ధరణీరాజ్యమునకు నీ, శ్వరుఁగా ధర్మజుని నిలిపి సంతోషించెన్. 230

వ. ఇట్లు ధర్మనందనుండు భీష్మునివచనంబులం గృష్ణునిసంభాషణంబులం బ్రవర్ధమాన విజ్ఞానుండును నివర్తితశంకాకలంకుండును నై నారాయణాశ్రయుండైన యింద్రుండునుంబోలెఁ జతుస్సాగరవేలాలంకృతం బగువసుంధరామండలంబు సహోదరసహాయుండై యేలుచుండె. 231

సీ. సంపూర్ణవృష్టిఁ బర్జన్యుండు గురియించు, నిల యెల్లకోర్కుల నీనుచుండు
గోవులు వర్షించు ఘోషభూములఁ బాలు, ఫలవంతములు లతాపాదపములు
పండు సస్యములు దప్పక ఋతువుల నెల్ల, ధర్మ మెల్లెడలను దనరి యుండు
దైవభూతాత్మతంత్రము లగురోగాది, భయములు పొందవు ప్రజల కెందుఁ

ఆ. గురుకులోత్తముండు గుంతీతనూజుండు, దానమానఘనుఁడు ధర్మజుండు

1. ( ) ఈకుండలీకరణములోనిపాఠము వ్రాఁతప్రతులందు లేదు. మాతృకనుబట్టి యిందుఁ జేర్పఁబడిన దని తోఁచెడిని. 2. జెనఁగెడు.

సత్యవాక్య[1]ధనుఁడు సకలమహీరాజ్య, [2]విభవభాజి యయిన వేళయందు.

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబున కరుగుట.

వ. అంతఁ గృష్ణుండు చుట్టాలకు శోకంబు లేకుండం జేయుకొఱకు సుభద్రకుఁ బ్రియంబు సేయుకొఱకును గజపురంబునం గొన్నినెల లుండి ద్వారకానగరంబునకుం బ్రయాణంబు సేయం దలంచి కొందఱికి నమస్కరించి కొందఱిం గౌఁగిలించికొని [3]కొందఱు దనకు నమస్కరించినం గౌఁగిలించుకొని రథారోహణంబు సేయునవసరంబున సుభద్రయు ద్రౌపదియుఁ గుంతియు నుత్తరయు గాంధారియు ధృతరాష్ట్రుండును విదురుండును యుయుత్సుండును గృపాచార్యుండును ధౌమ్యుండును [4](సత్సంగంబువలన ముక్తదుస్సంగుం డగుబుధుండు సకృత్కాల సంకీర్త్యమానం బై రుచికరం బగునెవ్వనియశంబు నాకర్ణించి విడువ నోపం డట్టి) హరితోడివియోగంబు సహింపక దర్శనస్పర్శనాలాపశయనాసనభోజనంబులవలన నిమిషమాత్రంబును హరికి నెడ లేనివార లయినపాండవులం గూడికొని హరి మరలవలయు నని కోరుచు హరి చనినమార్గంబు సూచుచు హరివిన్యస్తచిత్తు లయి లోచనంబుల బాష్పంబు లొలుక నంత నంత నిలువంబడి రయ్యవసరంబున. 233

సీ. కనకసౌధములపైఁ గౌరవకాంతలు, గుసుమవర్షంబులు గోరి కురియ
మౌక్తికదామసమంచితధవళాత, పత్రంబు విజయుండు పట్టుచుండ
నుద్ధవసాత్యకు లుత్సాహవంతు లై, రత్నభూషితచామరములు వీవ
గగనాంతరాళంబుఁ గప్పి కాహళభేరి, పటహశంఖాదిశబ్దములు మొరయ

ఆ. సకలవిప్రజనులు సగుణనిర్గుణరూప, భద్రభాషణములు వలుకుచుండ
భువనమోహనుండు పుండరీకాక్షుండు, పుణ్యరాశి హస్తిపురము వెడలె. 234

వ. తత్సమయంబునం బౌరసుందరులు ప్రాసాదశిఖరభాగంబుల నిలిచి గోపాలసుందరుని సందర్శించి వర్గంబు లై మార్గంబు రెండుదెసలఁ గరారవిందంబులు సాఁచి యొండొరులకుం జూపుచుం దమలోనం దొల్లి గుణంబులం గూడక జీవులు లీనరూపంబు లై యుండం బ్రపంచంబు ప్రవర్తింపనిసమయంబున నొంటి దీపించుపురాణపురుషుం డితం డనువారును జీవులకు బ్రహ్మత్వంబు గలుగ లయంబు సిద్ధించుట యెట్లనువారును జీవోపాధిభూతంబు లయిన సత్త్వాదులశక్తిలయంబు జీవలయం బనువారును గ్రమ్మఱ నప్పరమేశ్వరుండు నిజవీర్యప్రేరిత యైన నిజాంశభూతంబు లైనజీవులకు మోహిని యైనసృష్టి సేయ

---

1. రతుఁడు. 2. విభవరాజి. 3. 'ధర్మనందనునకుఁ గృతాభినందనుం డగుచు నతనిచే నాలింగితుఁ డై యామంత్రణంబు వడసి...రథా' అని యిట అచ్చుప్రతులపాఠము. ఇది వ్రాఁతప్రతులందు లేదు; ఇది మూలానుసారముగా నిట మార్పఁబడియె. 4. ఈపాఠము మూలానుసారముగాఁ జేర్పఁబడినది.

నిచ్ఛించుమాయ ననుసరణంబు సేయు ననువారును నామరూపంబులు లేని
జీవులందు నామరూపంబులు గల్పించుకొఱకు నీశ్వరుండు వేదంబుల నిర్మించి
మాయ ననుసరణంబు సేయుననువారును నిర్మలభక్తిసముత్కంఠావిశేషంబుల
నకుంఠితులై జితేంద్రియు లగువిద్వాంసు లిమ్మహానుభావునిజరూపంబు ద
ర్శింతు రనువారును యోగమార్గంబునం గాని దర్శింపరా దనువారును నై
మఱియును. 235

మ. రమణీ దూరము వోయెఁ గృష్ణురథమున్ । రా దింక వీక్షింప నీ
కమలాక్షుం బొడగాన లేనిదినముల్ । గల్పంబులై తోఁచు గే
హములం దుండఁగ నేల పోయి పరిచర్యల్ సేయుచున్ నెమ్మి నుం
డము రమ్మా యనె నొక్కచంద్రముఖి కందర్పాశుగభ్రాంతయై. 236

మ. తరుణీ యాదవరాజు గాఁ డితఁడు వేదవ్యక్తుఁడై యొక్కఁడై
వరుసన్ లోకభవస్థితిప్రళయముల్ । వర్తిల్లఁగాఁ జేయుదు
స్తరలీలారతుఁడై నయాశుఁ డితనిన్ । దర్శించితిం బుణ్యభా
సుర నే నంచు నటించె నొక్కత మహాశుద్ధాంతరంగంబునన్. 237

క. తామసగుణు లగురాజులు, భూమిం బ్రభవించి ప్రజలఁ । బొలియింపఁగ స
త్త్వామలతనుఁడై యీతఁడు, భామిని వారల వధించుఁ । [1]బ్రతికల్పమునన్..

వ. ఇదియునుం గాక. 239

సీ. ఈయుత్తమశ్లోకుఁ । డెలమి జన్మింపంగ, యాదవకుల మెల్ల । ననఘ మయ్యె
నీపుణ్యవర్తనుఁ । డేప్రొద్దు నుండంగ, మధురాపురము దొడ్డమహిమఁ గనియె
నీపూరుషశ్రేష్ఠు । నీక్షించి భక్తితో, ద్వారకావాసులు । ధన్యులైరి
యీమహాబలశాలి । యెఱఁగి [2]శిక్షింపంగ, నిష్కంటకం బయ్యె । నిఖిలభువన

తే. మీఁజగన్మోహనాకృతి । [3]నిచ్ఛగించి, పంచశరభల్లజాలవిభజ్యమాన
[4]వివశమానస మై వల్లవీసమూహ,మితనియధరామృతముఁ గ్రోలు । నెల్లప్రొద్దు.

ఉ. ఈకమలాక్షు నీసుభగు । నీకరుణాంబుధిఁ బ్రాణనాథుఁ గాఁ
జేకొని వేడ్కఁ గాఁపురము । సేయుచు నుండెడిరుక్మిణీముఖా
నేకపతివ్రతల్ నియతి । నిర్మలమానసలై జగన్నుతా
స్తోకవిశేషతీర్థములఁ । దొల్లిటిబాముల నేమి నోఁచిరో. 241

వ. అని యిట్లు నానావిధంబు లగుపురసుందరీవచనంబు లాకర్ణించి కటాక్షించి
నగుచు నగరంబు వెడలె ధర్మజుండును హరికి రక్షణంబులై కొలిచి నడవం
జతురంగబలంబులం బంచినఁ దత్సేనాసమేతులై తనతోడివియోగంబునకోర్వక
దూరంబు వెనుఁదగిలినకౌరవుల మరలించికురుజాంగలపాంచాలదేశంబులు దాఁ
టి శూరసేనయామునభూములం గడచి బ్రహ్మావర్తకురుక్షేత్రమత్స్యసారస్వతమ

1. బ్రతికల్పంబుగన్. 2. శాసింపంగ. 3. 'నిచ్ఛయించి' అనియే ప్రతులు. 4. విమలమానస.

రుధన్వసౌవీరాభీరసైంధవవిషయంబు లతిక్రమించి తత్తద్దేశవాసు లిచ్చినకానుకలు గైకొనుచు నానర్తమండలంబు సొచ్చి పద్మబంధుండు పశ్చిమసింధునిమగ్నుం డయినసమయంబునఁ బరిశ్రాంతవాహుం డై చని చని. 242

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబు ప్రవేశించుట.

మ. జలజాతాక్షుఁడు శౌరి డగ్గఱె మహాసౌధాగ్ర[1]భృంగారకం
గలహంసావృతహేమపద్మపరిఖాకాసారకం దోరణా
వళిసంఛాదితతారకం దరులతావర్గానువేలోదయ
త్ఫలపుష్పాంకురకోరకన్ మణిమయప్రాకారకన్ ద్వారకన్. 243

వ. ఇట్లు దనప్రియపురంబు డగ్గఱి. 244

మత్తకోకిలము. అన్యసన్నుతసాహసుండు మురారి యొత్తె యదూత్తముల్
[2]ధన్యులై వినఁ బాంచజన్యము దారితాఖిలజంతుచై
తన్యమున్ భువనైకమాన్యము దారుణధ్వని[3]భీతరా
జన్యముం బరిమూర్ఛితాఖిలశత్రుదానవసైన్యమున్. 245

శా. శంఖారావము వీనులన్ విని జనుల్ స్వర్ణాంబరద్రవ్యముల్
[4]శంఖాద్యంబులుఁ గొంచు వచ్చిరి దిదృక్షాదర్పితోత్కంఠన
ప్రేంఖద్భక్తులు వంశకాహళమహాభేరీగజాశ్వావళీ
రింఖారావము లుల్లసిల్ల దనుజారిం జూడ నాసక్తులై. 246

క. బంధులుఁ బౌరులుఁ దెచ్చిన, గంధేభహయాదు లైనకానుకలు దయా
సింధుఁడు గైకొనె నంబుజ, బంధుఁడు గొనుదత్తదీపపంక్తులభంగిన్. 247

వ. ఇట్లాత్మారాముండును బూర్ణకాముండును నైనయప్పరమేశ్వరునికి నుపాయనంబు లిచ్చి నాగరులు వికసితముఖు లయి గద్గదభాషణంబులతోడ డయ్యాకుండ నడపునయ్యకు నెయ్యంబు సూప నడ్డంబు లేనిబిడ్డలచందంబున మ్రొక్కి యిట్లనిరి. 248

శా. నీపాదాబ్జము బ్రహ్మపూజ్యము గదా నీసేవ సంసారసం
తాపధ్వంసిని యౌఁ గదా సకలభద్రశ్రేణులం బ్రీతితో
నాపాదింతు గదా ప్రపన్నులకుఁ గాలాధీశ కాలంబు ని
ర్వ్యాపారంబు గదయ్య చాలరు నినున్ వర్ణింప బ్రహ్మాదులున్. 249

క. ఉన్నారము సౌఖ్యంబున, విన్నారము నీప్రతాపవిక్రమకథలన్
మన్నారము ధనికుల మై, కన్నారము తావకాంఘ్రికమలములు హరీ. 250

క. ఆరాటము మది నెఱుఁగము, పోరాటము లిండ్లకడలఁ బుట్టవు పురిలోఁ
[5]జోరాటన మెనయదు నీ, దూరాటన మోర్వలేము తోయజనేత్రా. 251

---

1. బృందారకం; శృగారకం. 2 ధన్యమున్ వినఁ. 3. భీకగో, దన్యమున్ బరిమూర్ఛితాఖిలదైత్యదానవ. 4 శంఖాలీతముఁ. 5 మాటాట మెఱుఁగ మెద నీ.

ఉ. తండ్రుల కెల్లఁ దండ్రి యగు ధాతకుఁ దండ్రివి దేవ నీవు మా
తండ్రివిఁ దల్లివిం బతివి దైవమవుఁ సఖివిఁ గురుండవుం
దండ్రులు నీక్రియం బ్రజల ధన్యులఁ జేసిరె వేల్పులైన నో
తండ్రి భవన్ముఖాంబుజము ధన్యతఁ గానరు మావిధంబునన్. 252

క. చెచ్చెరఁ గరినగరికి నీ, విచ్చేసిననిమిష మైన వేయేండ్లగు మా
కెచ్చోటికి విచ్చేయక, మచ్చికతో నుండ వయ్య మానగరమునన్. 253

ఆ. అంధకారవైరి యపరాద్రి యవ్వలఁ, జనిన నంధ మయిన జగము భంగి
నిన్నుఁ గానకున్న నీరజలోచన, యంధతమసయుతుల మగుదు మయ్య. 254

వ. అని యిట్లు ప్రజ లాడెడిభక్తియుక్తమధురమంజులాలాపంబులు గర్ణకలాపంబులుగా నవధరించి కరుణావలోకనంబులు వర్షించుచు హర్షించుచుఁ దనరాక విని మహానురాగంబున సంరంభవేగంబుల మజ్జనభోజనశయనాదికృత్యంబు లొల్లక యుగ్రసేనాక్రూరవసుదేవబలభద్రప్రద్యుమ్నసాంబచారుదేష్ణగదప్రముఖ యదుకుంజరులు కుంజరతురగరథారూఢులై దిక్కుంజరసన్నిభం బయిన యొక్కకుంజరంబు ముందట నిడుకొని సూతమాగధనటనర్తకవందిసందోహం బులమంగళభాషణంబులును భూసురాశీర్వాదవేదఘోషణంబులును వీణావేణు భేరీపటహశంఖకాహళధ్వానంబులును రథారూఢవిభూషణభూషితవారయువతీ గానంబులును నసమానంబులై చెలంగ నెదురుకొని యథోచితప్రణామనమ స్కారపరిరంభబాహుస్పర్శసంభాషణమందహాససందర్శనాదివిధానంబుల బహు మానంబులు సేసి వారలుం దానును భుజగేంద్రపాలితం బయినభోగవతీనగరంబు చందంబున స్వసమానబలయదుభోజదశార్హకుకురాంధకవృష్ణివీరపాలితంబును సకలకాలసంపద్యమానాంకురపల్లవకోరకకుట్మలకుసుమఫలమంజరీపుంజభారవిన మితలతాపాదపరాజీవిరాజితోద్యానమహావనోపవనారామలాలితంబును వనాం తరాళరసాలసాలశాఖాంకురఖాదనతుష్ణకషాయకంఠకలకంఠమిథునకోలాహలఫ లరసాస్వాదపరిపూర్ణశారికాకీరకులకలకలకహ్లారపుష్పమకరందపానపరవశభృంగ భృంగీకదంబఝుంకారసరోవరకనకకమలమృదులకాండఖండస్వీకారమత్తవరటా యత్తకలహంసనివహక్రేంకారసహితంబును మహోన్నతసౌధజాలరంధ్రనిర్గత కర్పూరధూపధూమపటలసందర్శనసంజాతజలధరభ్రాంతివిభ్రాంతసముద్ధత పింఛనర్తనప్రవర్తమానమత్తమయూరకేకారవమహితంబును నానారూప తోరణధ్వజవైజయంతికానికాయనిరుద్ధతారకాగ్రహప్రకాశంబును ముక్తాఫల విరచితరంగవల్లికాలంకృతమందిరద్వారదేహళీవేదికాప్రదేశంబును ఘనసార గంధసారకస్తూరికాసంవాసితవణిగ్గృహగేహళీనికరకనకగళంతికావికీర్యమాణసలిల ధారాసంసిక్తవిపణిమార్గంబును బ్రతినివాసబహిరంగణసమర్పితరసాలదండఫల కుసుమగంధాక్షతధూపదీపరత్నాంబరాదివివిధోపహారవర్గంబును బ్రవాళనీలమర

కతవజ్రవైడూర్యనిర్మిత గోపురాట్టాలకంబును విభవనిర్జితమహేంద్రనగరకుచే
రాలకంబునునైనపురవరంబుఁ బ్రవేశించి రాజమార్గంబున వచ్చుసమయంబున.

మత్తకోకిలము. కన్నులారఁగ నిత్యమున్ హరిఁ । గాంచుచున్ మనువార ల
య్యున్నవీనకుతూహలోత్సవ । యుక్తి నాగరకాంత ల
త్యున్నతోన్నతహర్మ్య[1]రేఖల । నుండి చూచిరి నిక్కి చే
సన్నలం దమలోనఁ దద్విభు । సౌకుమార్యము సూపుచున్. 256

సీ. కలుముల నీనెడు । కలకంఠి యెలనాఁగ, వర్తించు నెవ్వాని । వక్షమందు
జనదృక్చకోరక । సంఘంబునకు సుధా, పానీయపాత్ర మే । భవ్యముఖము
సకలదిక్పాలక । సంహతి కెవ్వాని, బాహుదండంబులు । పట్టుఁగొమ్మ
లాశ్రితశ్రేణి కే । యధిపునిపాదరా, జీవయుగ్మంబులు । చేరుగడలు

ఆ. భువనమోహనుండు । పురుషభూషణుఁ డెవ్వఁ, డట్టికృష్ణుఁ డరిగె । హర్మ్యశిఖర
రాజమాన లగుచు । రాజమార్గంబున, రాజముఖులు గుసుమ । రాజిఁ గురియ.

మ. జలజాతాక్షుఁడు సూడ నొప్పె ధవళ । చ్ఛత్త్రంబుతోఁ జామరం
బులతోఁ బుష్పపిశంగచేలములతో । భూషామణిస్ఫీతుఁడై
నలినీబాంధవుతో శశిధ్వజముతో । నక్షత్రసంఘంబుతో
బలభిచ్చాపముతోఁ దటిల్లతికతో । భాసిల్లుమేఘాకృతిన్. 258

వ. ఇట్లరిగి తల్లిదండ్రులనివాసంబు సొచ్చి దేవకీప్రముఖు లయినతల్లుల కేడ్వురకు
మ్రొక్కిన. 259

క. బిడ్డఁడు మ్రొక్కినఁ దల్లులు, జడ్డన నంకముల నునిచి । చన్నులతుదిఁ బా
లొడ్డగిలఁ బ్రేమభరమున, జడ్డువడం దడిపి రక్షి । జలముల ననఘా. 260

—శ్రీకృష్ణుం డంతఃపురకాంతలం జూడఁ బోవుట.—

వ. తదనంతరంబ యష్టోత్తరశతషోడశసహస్రసౌవర్ణసౌధకాంతం బయినశుద్ధాంత
భవనంబు సొచ్చి హరి తనమనంబున. 261

మ. ఒకదేవీభవనంబు మున్ను సొర వే । ఱొక్కర్తు లోఁ గుందునో
సుకరాలాపము లాడదో సొలయునో । సుప్రీతి నీక్షింపదో
వికలత్వంబున నుండునో యనుచు న । వ్వేళన్ వధూగేహముల్
ప్రకటాశ్చర్యవిభూతిఁ జొచ్చె బహురూ । పవ్యక్తుఁడై భార్గవా. 262

వ. ఆసమయంబున. 263

క. శిశువులఁ జంకల నిడి తను, కృశతలు విరహాగ్నిఁ దెలుప । గృహగేహళులన్
రశనలు జాఱఁగ సిగ్గున, శశిముఖు లెదురేఁగి రపుడు । జలజాక్షునకున్. 264

మ. పతి నాయింటికి మున్ను వచ్చె నిదె నా । ప్రాణేశుఁ డస్మద్గృహా
గతుఁ డయ్యెన్ మును సేరెఁ బో తొలుత మ । త్కాంతుండు నాశాలకే

1. సీమల । నుండి. 2. నాపాలికే.

నితరాలభ్యసుఖంబు గంటి నని తా | రింటింట నర్చించి ర
య్యతివల్ నూఱుఁ బదాఱువేలు నెనమం | డ్రవ్వేళ [1]నాత్మేశ్వరున్. 265

వ. వారలం జూచి హరి యి ట్లనియె. 266

మ. కొడుకుల్ భక్తివిధేయు లౌదురు గదా | కోడండ్రు మీవాక్యముల్
గడవం జాలక యుందురా విబుధసత్కారంబు గావింతురా
తొడవుల్ వస్త్రములుం బదార్థరససంతర్పణంబులుం జాలునా
కడమల్ గావు గదా భవన్నిలయముల్ | కల్యాణయుక్తంబులే. 267

సీ. తిలక మేటికి లేదు | తిలకనీతిలకమ, పువ్వులు దుఱుమవా | పువ్వుఁబోఁడి
కస్తూరి యలఁదవా | కస్తూరికాగంధి, తొడవులు దొడువవా | తొడవుతొడవ
కలహంసఁ బెంపుదే | కలహంసగామిని, కీరముఁ జదివింతె | కీరవాణి
లతలఁ బోషింతువా | లతికాలలితదేహ, సరసి నోలాడుదే | సరసిజాక్షి

ఆ. మృగికి మేఁత లిడుదె | మృగశాబలోచన, గురుల నాదరింతె | గురువివేక
బంధుజనులఁ బ్రోతె | బంధుచింతామణి, యనుచు సతుల నడిగె | నచ్యుతుండు.

వ. అని యడిగిన వారలు హరిం బాసిన దినంబులందు శరీరసంస్కారకేళీవిహారహాస
వనమందిరగమనమహోత్సవదర్శనంబు లొల్లనియిల్లాండ్రు గావున. 269

మ. సిరి చాంచల్యముతోడి దయ్యుఁ దనకున్ | జీవేశ్వరుం డంచు నే
పురుషశ్రేష్ఠు వరించు నట్టివరమున్ | బుద్ధిన్ విలోకంబులం
గరయుగ్మంబులఁ గౌఁగిలించిరి సతుల్ | కల్యాణబాష్పంబు లా
భరణశ్రేణులుగాఁ బ్రతిక్షణనవప్రస్తానురాగంబులన్. 270

మత్తకోకిలము. పంచబాణుని నీఱు సేసినభర్గునిం దనవిల్లు వ
ర్జించి మూర్ఛలఁ జేయఁ జాలువిశేషహాసవిలోకనో
దంచితాకృతు లయ్యుఁ గాంతలు | దంభచేష్టల మాధవుం
జంచలింపఁగఁ జేయ నేమియుఁ | జాల రైరి బుధోత్తమా. 271

వ. ఇవ్విధంబున సంగవిరహితుం డైనకంసారి సంసారి యై వడి విహరింప నజ్ఞాన
విలోకు లయినలోకులు లోకసామాన్యమనుష్యుం డని తలంతు రాత్మాశ్రయ
యైనబుద్ధి యాత్మయం దున్నయానందాదులతోడం గూడని తెఱంగున నీశ్వ
రుండు ప్రకృతితోడం గూడియు నాప్రకృతిగుణంబు లైనసుఖదుఃఖంబులఁ
జెందక యుండుఁ బరస్పరసంఘర్షణంబులచే వేణువులవలన వహ్నిఁ బుట్టించి
వనంబుల దహించుమహావాయువుచందంబున భూమికి భారహేతువు లై యనే
కాక్షౌహిణులతోడం బ్రవృద్ధతేజు లగురాజుల కన్యోన్యవైరంబులు గల్పించి
నిరాయుధుం డై సంహారంబు సేసి శాంతుం డై పిదపం గాంతామధ్యంబునఁ
బ్రాకృతమనుష్యుండునుంబోలె సంచరించు చుండె నాసమయంబున. 272

1. జీ త్మేశ్వరుం.

క. యతు లీశ్వరునిమహత్త్వము, మిత మెఱుఁగనిభంగి నప్రమేయుఁ డగుహరి
స్థితి నెఱుఁగక కాముకుఁ డని, రతములు సలుపుదురు తిగిచి । రమణులు సుమతీ.

క. ఎల్లప్పుడు మాయిండ్లను, వల్లభుఁడు వసించు నేమ । వల్లభలము శ్రీ
వల్లభున కనుచు గోపీ, వల్లభుచే సతులు మమత । వలఁ బడి రనఘా. 274

వ. అని చెప్పిన విని శౌనకుండు సూతున కి ట్లనియె. 275

ఉత్తరకుఁ బరీక్షిత్తు జనించుట.

సీ. గురునందనుండు సక్రోధుఁ డై యేసిన, బ్రహ్మశిరోనామ । బాణవహ్నిఁ
గంపించు నుత్తర । గర్భంబు గ్రమ్మఱఁ, బద్మలోచనుచేత । బ్రదికె నందు
గర్భస్థుఁ డగుబాలుఁ । గంసారి యేరీతి, బ్రదికించె మృత్యువు । భయము వాపి
జనియించి యతఁ డెన్ని । సంవత్సరము లుండె, నెబ్భంగి వర్తించె । నేమి సేసె

ఆ. వినుము శుకుఁడు వచ్చి । విజ్ఞానపద్ధతి, నతని కెట్లు సూపె । నతఁడు పిదపఁ
దనశరీర మేవి । ధంబున వర్జించె, విప్రముఖ్య నాకు । విస్తరింపు. 276

వ. అనిన సూతుం డి ట్లనియె ధర్మనందనుండు చతుస్సముద్రముద్రితాఖిలజంబూద్వీపరాజ్యంబు నార్జించియు మిన్నుముట్టినకీర్తి నుపార్జించియు నంగనాతురంగమాతంగసుభటకాంచనాదిదివ్యసంపదలు సంపాదించియు వీరసోదరవిప్రవిద్వజ్జనవినోదంబులఁ బ్రమోదించియు వైభవంబు లలవరించియుఁ గ్రతువు లాచరించియు దుష్టశిక్షణశిష్టరక్షణంబు లొనరించియు ముకుందచరణారవిందసేవారతుండై సమస్తసంగంబులందు నభిలాషంబు వర్జించి యరిషడ్వర్గంబు జయించి రాజ్యంబు సేయుచు. 277

తే. చందనాదుల నాఁకట । స్రగ్గువాఁడు, దనివి నొందనికైవడి । ధర్మసుతుఁడు
సంపదలు పెక్కు గలిగియుఁ । జక్రిపాద, సేవనంబులఁ బరిపూర్తి । సెందకుండె.

వ. అంతం గొన్నిదినంబులకు నభిమన్యుకాంతాగర్భంబునం దున్నడింభకుండు [1]దశమమాసపరిచ్ఛేద్యుం డై గర్భాంతరాళంబున మరంతం బై నయశ్వత్థామబాణానలంబున దందహ్యమానుం డై తల్లడిల్లుచు. 279

ఉ. కుయ్యిడ శక్తి లే దుదర । గోళములోపల నున్నవాఁడ ది
క్కెయ్యది దా ననాథ నని । యెప్పుడుఁ దల్లి గణింప విందు నేఁ
డియ్యిషువహ్ని వాయుటకు । నెయ్యది మార్గము నన్నుఁ గావ నే
యయ్య గలండు గర్భజని । తాపద నెవ్వఁ డెఱుంగు దైవమా. 280

క. చిచ్చుఱకోలవశంబునఁ, జచ్చి బహిర్గతుఁడఁ గాని । సమయమునను దా
నుచ్చలితగర్భవేదనఁ, జచ్చును మాతల్లి గర్భ । సంతాపమునన్. 281

క. చెచ్చెర బాణజ్వాలలు, వచ్చిన విష్ణుండు గాన । వచ్చు ననుచుఁ దా
ముచ్చటలు సెప్ప సతులకు, నిచ్చలు మాయవ్వ నేఁడు । నిజ మయ్యెడినో.

---

1. 'పది యగునెల గర్భాంత' అనియే వ్రాఁతప్రతులు.

శా. రాఁడా చూడ సమస్తభూతములలో రాజిల్లువాఁ డిచ్చటన్
లేఁడా పాఱునిచిచ్చుటమ్ముఁ దొలఁగన్ లీలాగతిం ద్రోచి నా
కీఁడా నేఁ డభయప్రదానమతిఁ దూహింపన్ నతత్రాత మున్
కాఁడా యెందఱఁ గావఁ డీయెడల మత్కర్మంబు దా నెట్టిదో. 283

వ. అని గతాగతప్రాణుండై భ్రూణగతుండైనశిశువు చింతించుసమయంబున. 284

సీ. మేఘంబుమీఁదిక్రొమ్మెఱుఁగుకై వడి మేని, పై నున్నపచ్చనిపటమువాఁడు
గండభాగంబులఁ గాంచనమణిమయ, మకరకుండలకాంతి మలయువాఁడు
శరవహ్ని నడఁగించుసంరంభమునఁ జేసి, కన్నుల నునుగెంపు గలుగువాఁడు
బాలార్కమండలప్రతిమానరత్నహా, టకవిరాజితకిరీటంబువాఁడు

తే. కంకణాంగదవనమాలికావిరాజ, మానుఁ డసమానుఁ డంగుష్ఠమాత్రదేహుఁ
డొక్కగదఁ జేతఁ దాల్చి నేత్రోత్సవముగ, విష్ణుఁ డావిర్భవించె నవ్వేళయందు.

వ. ఇట్లు భక్తపరాధీనుం డయినపరమేశ్వరుం డావిర్భవించి మంచు విరియించుమా
ర్తాండుచందంబున శిశువునకు దశదిశలం దనచేతియఖండితమహోల్కాజాల
సన్నిభం బైనగదాదండంబు మండలాకారంబుగ జిఱజిఱం ద్రిప్పి విప్రునిచి
చ్చఱమ్ము వేఁడిమిపోఁడిమిఁ జెఱిచి డింభకునిపరితాపంబువిజృంభణంబు నివారించి
గర్భంబు కంద కుండ నర్భకునికి నానందంబుఁ గల్పించిన. 286

మ. గదఁ జేఁ బట్టి పరిభ్రమించుచు గదాఘాతంబులం [1]గ్రూరశు
క్ప్రద మై వచ్చుశరాగ్నిఁ దుత్తుమురుగా భంజించి రక్షించె నీ
సదయుం డెవ్వఁ డొకో యటంచు మదిలోఁ జర్చించుచున్ శాబకుం
డెదు రై చూడ నదృశ్యుఁ డయ్యె హరి సర్వేశుండు విప్రోత్తమా. 287

వ. అంత ననుకూలశుభగ్రహోదయంబును మహోత్తరఫలసూచకంబును నైన
శుభలగ్నంబునం బాండవవంశోద్ధారకుం డయినకుమారుండు జన్మించిన ధర్మ
నందనుండు ధౌమ్యాదిభూసురవర్గంబు రప్పించి పుణ్యాహంబు సదివించి జాత
కర్మంబులు సేయించి కుమారుజన్మమహోత్సవకాలంబున భూసురులకు విభవాభి
రామంబు లయినగోభూహిరణ్యహయగ్రామంబులును స్వాదురుచిసంపన్నంబు
లయినయన్నంబు లిడిన వారలు తృప్తు లై ధర్మపుత్రున కిట్లనిరి. 288

చ. ప్రకటితదైవయోగమునఁ బౌరవసంతతి యంతరింపఁగా
వికలత నొంద నీక ప్రభవిష్ణుఁడు విష్ణుఁ డనుగ్రహించి శా
బకు బ్రదికించెఁ గావున నృపాలక శాబకుఁ డింక శాత్రవాం
తకుఁ డగు విష్ణురాతుఁ డన ధాత్రిఁ బ్రసిద్ధికి నెక్కుఁ బూజ్యుఁ డై. 289

వ. అనిన విని భూదేవోత్తములకు నరదేవోత్తముం డిట్లనియె. 290

---

1. దుర్భర, ప్రద మై.

శా. ఓపుణ్యాత్మకులార నాపలుకు మీ । రూహింపుఁడా మ్రొక్కెదన్
మా పెద్దల్ శ్రుతకీర్తులై సదయులై । మన్నారు [1]రాజర్షులై
యాపిన్నాతఁడు వారిఁ బోలెడిఁ గదా । యెల్లప్పుడున్ మాధవ
శ్రీపాదాంబుజభక్తియుక్తుఁ డగుచున్ । జీవించునే చూడరే. 291

వ. అనిన విని నరేంద్రా భవదీయపౌత్రుండు మనుపుత్రుం డయినయిక్ష్వాకునిచందం
బునం బ్రజల రక్షించు [2](* శ్రీరామచంద్రునిభంగి బ్రహ్మణ్యుండు సత్యప్రతిజ్ఞుం
డు నగు) డేగ వెంట నంటినఁ బంట్రిల్లుభీతిమెయి వెనుకకు సమాగతం బైన
కపోతంబుఁ గాచినశిబిచక్రవర్తిరీతి శరణ్యుండును వితరణఖనియు నగు దుష్యంత
సూనుం డయినభరతుపగిది [3]సోమాన్వయజ్ఞాతివర్గంబులకు యజ్వలకు ననర్గళకీర్తి
విస్తరించు ధనంజయకార్తవీర్యులకరణి ధనుర్ధరాగ్రేసరుం డగుఁ గిలిపోలిక దుర్ధ
ర్షుం డగు సముద్రునిచెలంగున దుస్తరుం డగు మృగేంద్రునికైవడి విక్రమశాలి
యగు [4](*వసుమతివోలె నక్షయక్షాంతియుక్తుం డగు భానునిలాగునఁ బ్రతాప
వంతుం డగు) వాసుదేవువడువున [5]సర్వభూతహితుం డగుఁ దల్లిదండ్రులమాడ్కి
సహిష్ణుం డగు మఱియును. 292

సీ. సమదర్శనంబున । జలజాతభవుఁ డనఁ, బరమప్రసన్నత । భర్గుఁ డనఁగ
నెల్లగుణంబుల । నిందిరావిభుఁ డన, నధికధర్మమున య।యాతి యనఁగ
ధైర్యసంపద బలి । దైత్యవల్లభుఁ డన, నచ్యుతభక్తిఁ బ్ర । హ్లాదుఁ డనఁగ
రాజితోదారత । రంతిదేవుం డనఁ, నాశ్రయమహిమ హి । మాద్రి యనఁగ

తే. యశము వర్ధించుఁ బెద్దల । నాదరించు
నశ్వమేధంబు లొనరించు । నాత్మసుతుల
ఘనులఁ బుట్టించు దండించు । ఖలులఁ బట్టి
మానధనుఁడు నీమనుమఁడు । మానవేంద్ర. 293

భుజంగప్రయాతము. హరించుం గలిప్రేరి।తాఘంబు లెల్లన్
భరించున్ ధరన్ రామ।భద్రుండపోలెం
జరించున్ సదా వేద।శాస్త్రానువృత్తిన్
వరించున్ విశేషించి । వైకుంఠభక్తిన్. 294

వ. ఇట్లు పెక్కేండ్లు జీవించి భూసురకుమారప్రేరితం బయినతక్షకసర్పవిషానలం
బునం దనకు మరణం బని యెఱింగి సంగవర్జితుం డయి ముకుందపదారవింద
భజనంబు సేయుచు శుకయోగీంద్రునివలన నాత్మవిజ్ఞానసంపన్నుం డై గంగా
తటంబున శరీరంబు విడిచి నిర్గతభయశోకం బయినలోకంబుఁ బ్రవేశించు నని
జాతకఫలంబు సెప్పి లబ్ధకాము లయి భూసురులు సని రంత. 295

---

1 రారాజులై. 2 (*) ఇది మూలానుసారముగా నిటఁ జేర్పంబడియె. 3 సోమయాజి
జ్ఞాతి. 4 (*) ఇది మూలానుసారముగా నిటఁ జేర్పఁబడినది. 5 నక్షయకాంతియుక్తుం.

క. తనతల్లికడుపులోపల, మును సూచినవిభుఁడు విశ్వమున నెల్లఁ గలం
డనుచుఁ బరీక్షింపఁగ జను, లనఘుఁ బరీక్షిన్నరేంద్రుఁ డండ్రు మునీంద్రా. 296

ఆ. కళలచేత రాజు గ్రమమునఁ బరిపూర్ణుఁ, డయినభంగిఁ దాత లనుదినంబుఁ
బోషణంబు సేయఁ బూర్ణుఁ డయ్యెను ధర్మ,పటలపాలకుండు బాలకుండు. 297

వ. మఱియు ధర్మనందనుండు బంధుసంహారదోషంబు వాయుకొఱకు నశ్వమేధయాగంబు సేయుచుఁ బ్రజలవలనం గరదండంబుల సముపార్జితం బయినవిత్తంబు చాలక చిత్తంబునఁ జింతించు నెడ నచ్యుతప్రేరితులై భీమార్జునాదులు దొల్లి మరుత్తుం డనురాజు మఖంబు సేసి పరిత్యజించి నిక్షేపించినసువర్ణపాత్రాదికం బైన విత్తం బుత్తరదిగ్భాగంబువలన బలవంతులై తెచ్చిన నారాజసత్తముండు సమాయత్తయజ్ఞోపకరణుం డై [1](*సకలబంధుసమేతంబుగఁ గృష్ణుని నాహ్వానంబు సేసి) [2]పురుషోత్తము నుద్దేశించి మూఁడుజన్నంబు[3]లు గావించెఁ [4](*దదనంతరంబ కృష్ణుండు బంధుప్రియంబుకొఱకుఁ గరినగరంబునఁ గొన్నినెల లుండి ధర్మపుత్త్రాదులచే నామంత్రణంబు వడసి యాదవసమేతుం డయి ధనంజయుండు దోడ రా నిజనగరంబునకుం జనియె) నంత విదురుండు తీర్థయాత్ర సని మైత్త్రేయుముందటఁ గర్మయోగవ్రతాదివిషయంబు లయినప్రశ్నంబులఁ గొన్నిటిం జేసి యతనివలన నాత్మగతిజ్ఞానంబు దెలిసి కృతార్థుం డై హస్తిపురంబునకు వచ్చిన. 298

క. బంధుఁడు వచ్చె నటంచును, గాంధారీవిభుఁడు మొదలుగా నందఱు సం
బంధములు నెఱపి ప్రీతి న, మంధరగతిఁ జేసి రపుడు మన్నన లనఘా. 299

వ. అంత ధర్మనందనుండు విదురునికి మజ్జనభోజనాదిసత్కారంబులు సేయించి సుఖాసీనుం డై తనవార లందఱు విన ని ట్లనియె. 300

సీ. ఏవర్తనంబున నింతకాలము మీరు. సంచరించితి రయ్య జగతిలోన
నేతీర్థములు గంటి రెక్కడ నుంటిరి, భావింప మీవంటిభాగవతులు
తీర్థసంఘంబుల దిక్కరింతురు గదా, మీయందు విష్ణుండు మెఱయుకతన
మీర తీర్థంబులు మీకంటె మిక్కిలి, తీర్థంబు లున్నవె తెలిసి చూడ

తే. వేఱ తీర్థంబు లవనిపై వెదక నేల, మిమ్ముఁ బొడగని భాషించుమేలు చాలు
వార్త లేమండ్రు లోకులు వసుధలోన, మీకు సర్వంబు నెఱిఁగెడు[5]మేధ గలదు.

మత్తకోకిలము. తండ్రి సచ్చినమీఁద మాపెదతండ్రిబిడ్డలు దొల్లి పె
క్కండ్రు సర్పవిషాగ్నిబాధల గాసిఁ బెట్టఁగ మమ్ము ని

1 (*) ఇది మూలానుసారముగా నిట చేర్పఁబడియె. 2 'యజ్ఞేశ్వరుం డగుపురుషోత్తము' అని వ్రాఁతప్రతులు. 3 లవిచ్ఛిన్నసంపన్నంబులు గావించె. 4 (*) ఇది మూలానుసారముగా నిట చేర్పఁబడినది. 5 మేర గలదు.

ల్లాండ్ర నంతముఁ బొందకుండఁగ । లాలనంబున మీరు మా
తండ్రిభంగి సముద్ధరింతురు । తద్విధంబు దలంతురే. 302
క. పక్షులు తమపెక్కులంగోఁ, బక్షంబులు రాసిపిల్ల । పదువుల మమతన్
రక్షించిన క్రియ మీరలు, పక్షీకరణంబు సేయ । బ్రదికితిమి గదే. 303
క. మన్నారా ద్వారకలో, నున్నారా యదువు లంబు । జోదరుకరుణం
గన్నారా లోకులచే, విన్నారా మీరు వారి । విధ మెట్టిదియో. 304
చ. అన విని ధర్మరాజునకు । నావిదురుండు సమస్తలోకవ
ర్తనముఁ గ్రమంబుతోడ విశ । దంబుగఁ జెప్పి యదుక్షయంబు సె
ప్పిన నతఁ డుగ్రశోకమున । బెగ్గలి కుందెడి నంచు నేమియున్
వినుమని చెప్పఁ డయ్యె యదు । వీరులనాశము భార్గవోత్తమా. 305
ఆ. మేలు సెప్పె నేని । మే లందు లోకులు, చెట్ట యందు కీడు । సెప్పె నేని
యంతమీఁద శూద్రుఁ । డైనకతంబున, శిష్టమరణ మతఁడు । సెప్పఁ డయ్యె.
వ. అది యెట్లనిన మాండవ్యమహామునిశాపంబునం దొల్లి యముండు శూద్ర
యోనియందు విదురుండై జన్మించియున్ననూఱువత్సరంబు లర్యముండు యథా
క్రమంబునం బాపకర్ముల దండించె నిట్లు యుధిష్ఠిరుండు రాజ్యంబుఁ గైకొని
లోకపాలసంకాశు లయినతమ్ములుం దానును కులదీపకుం డైనమనుమని ముద్దు
సేయుచుఁ బెద్దకాలంబు మహావైభవంబున సుఖు లై యుండె నంత. 307
క. బాలాజనశాలాధన, లీలావనముఖ్యవిభవ । లీనమనీషా
[1]లాలసు లగుమానవులను, గాలము వంచించు దురవ । గాహము సుమతీ. 308

గాంధారీధృతరాష్ట్రులు దేహత్యాగము సేసికొనుట.

వ. అది నిమిత్తంబుగాఁ గాలగతి యెఱింగి విదురుండు ధృతరాష్ట్రున కిట్లనియె. 309
మ. కనకాగారకళత్రమిత్రసుతసం । ఘాతంబులన్ ముందటం
గని ప్రాణేచ్ఛల నుండుజంతువుల నే । కాలంబు దుర్లంఘ్య మై
యనివార్యస్థితిఁ జంపు నట్టినిరుపా । యం బైనకాలంబు వ
చ్చె నుపాంతంబున మాఱు దీనికి మదిం । జింతింపు ధాత్రీశ్వరా. 310
శా. పుట్టంధుండవు పెద్దవాఁడవు మహా । భోగంబులా లేవు నీ
వ ట్లెల్లం జెడి పోయె దుస్సహజరా । భారంబు పైఁ గప్పె నీ
చుట్టా లెల్లను బోయి రాలు మగఁడున్ । శోకంబునన్ మగ్న లై
కట్టా దాయలపంచ నుండఁ దగవే । కౌరవ్యవంశాగ్రణీ. 311
క. పెట్టితిరి చిచ్చు గృహమునఁ, బట్టితిరి తదీయభార్యఁ । బాండవులకుం
గొట్టితిరి వారు మనుపఁగ, నెట్టయిన భరింప వలెనె । యీప్రాణములన్. 312
క. బిడ్డలకు బుద్ధి సెప్పని, గుడ్డికిఁ బిండంబు వండి । కొని పోం డిదె పైఁ

1 లోలాకులమానసులను.

బడ్డాఁ డని భీముం డొర,గొడ్డెము లాడంగఁ గూడుఁ । గుడిచెద వధిపా. 313

క. కనియెదవో బిడ్డల నిఁక, మనియెదవో తొంటికంటె । మనుమలమాటల్
వినియెదవో యిచ్చెద ర, మ్మనియెదవో దానములకు । నవనీసురులన్. 314

క. దేహము నిత్యము గా దని, మోహముఁ దెగఁ గోసి సిద్ధ।మునివర్తనుఁ డై
గేహము వెలువడునరుఁ డు,త్సాహముతోఁ జెందు ముక్తి।సంపద ననఘా. 315

వ. అని విదురుండు ధృతరాష్ట్రునకు విరక్తిమార్గం బుపదేశించిన నతండు ప్రజ్ఞాచక్షుం డై సంసారంబు దిగనాడి మోహపాశంబువలన నూడి విజ్ఞానమార్గంబునం గూడి దుర్గమం బగుహిమవన్నగంబునకు నిర్గమించిన. 316

శా. అంధుం డైనపతిన్ వరించి పతిభా।వాసక్తి నేత్రద్వయీ
బంధాచ్ఛాదనమున్ ధరించి నియమ।ప్రఖ్యాత యై యున్నత
ద్గాంధారక్షితినాథుకూఁతురును యో।గప్రీతి చిత్తంబులో
సంధిల్లం బతివెంట నేఁగె నుదయ।త్సాధ్వీగుణారూఢ యై. 317

చ. వెనుకకు రాక చొచ్చురణ।వీరునికై వడి రాజదండసం
బునకు భయంబు లేక వడిఁ । బోయెడుధీరునిభంగి నప్పుడా
వనిత దురంత మైనహిమ।వంతముపొంతవనాంతభూమికిం
జెనిమిటితోడ నించుకయు । భీతి వహింపక యేఁగెఁ బ్రీతితోన్. 318

వ. ఇట్లు విదురసహితు లై గాంధారీధృతరాష్ట్రులు వనంబునకుం జనిన మఱునాఁడు ధర్మనందనుండు ప్రభాతంబున సంధ్యావందనంబు సేసి నిత్యహోమంబు గావించి బ్రాహ్మణోత్తములకు గోహిరణ్యతిలవస్త్రాదిదానంబులు సేసి నమస్కరించి గురువందనంబుకొఱకుఁ బూర్వప్రకారంబునం దండ్రిమందిరంబునకుఁ జని యందు విదురసహితు లయినతల్లిదండ్రులం గానక మంజుపీఠంబునఁ గూర్చున్న సంజయున కిట్లనియె. 319

సీ. మాతల్లిదండ్రు లీ।మందిరంబున లేరు, సంజయ వా రెందుఁ । జనిరి నేఁడు
ముందర గానఁడు । ముసలి మాపెదతండ్రి, పుత్రశోకంబునఁ । బొగులుఁ దల్లి
సౌజన్యనిధి ప్రాణ।సఖుఁడు మాపినతండ్రి, మందబుద్ధుల మైన।మమ్ము విడిచి
యెటవోయిరో మువ్వుర। రెఱిఁగింపు గంగలోఁ, దనయపరాధంబుఁ।దడవికొనుచు

ఆ. భార్యతోడఁ దండ్రి । పరితాపమునఁ బడుఁ, గపట మింత లేదు । కరుణ గలఁడు
పాండుభూవిభుండు । పరలోకగతుఁ డైన, మమ్ముఁ బిన్ననాఁడు । మనిచె నతఁడు.

వ. అనిన సంజయుండు [1](*దయాస్నేహంబుల నతికర్శితుం డగుచుఁ దనప్రభువు వోయినతెఱం గెఱుంగక కొంతదడ వూరకుండి) తద్వియోగదుఃఖంబునఁ గన్నీరు కరతలంబునం దుడిచికొనుచు బుద్ధిబలంబునం జిత్తంబు ధైర్యాయత్తంబు సేసి [2](*తనభర్తృపాదంబుల మనంబున నెన్నుచు) ధర్మజున కిట్లనియె. 321

1, 2 (*) ఇవి మూలానుసారముగాఁ జేర్పఁబడినవి.

తే. అఖిలవార్తలు మున్న నన్నడుగుచుండు, నడుగఁ డీరేయి మీతండ్రి యవనినాథ
మందిరములోన విదురుతో మంతనంబు, నిన్న యాడుచు నుండెను నేఁడు లేఁడు.

వ. విదురగాంధారీధృతరాష్ట్రులు నన్ను వంచించి యెందుఁ బోయిరో [1](*వారలనిశ్చయంబు లెట్టివో) యెఱుంగ నని సంజయుండు దుఃఖించుసమయంబునం దుంబురుసహితుండై నారదుండు వచ్చిన లేచి నమస్కరించి తమ్ములుం దానును నారదుం బూజించి కౌంతేయాగ్రజుం డిట్లనియె. 323

ఉ. అక్కట తల్లిదండ్రులు గృహంబున లేరు మహాత్మ వారు నేఁ
డెక్కడ వోయిరో యెఱుఁగ నెప్పుడు బిడ్డలపేరు గుచ్చి తాఁ
బొక్కుచు నుండుఁ దల్లి యెఱుఁగవో యనఘా విపదంబురాశికి
నిక్కము కర్ణధారుఁడవు నీవు జగజ్జనపారదర్శనా. 324

వ. అనిన విని సర్వజ్ఞుండైన నారదుండు ధర్మజున కిట్లనియె నీశ్వరవశంబై (*నదివిశ్వం బీశ్వరుండ భూతంబుల నొకటితో నొకటిం జేర్చు నెడం బాపు సూచీభిన్ననాసికలందు రజ్జుప్రోతంబు లగుచుం గంఠరజ్జువులం గట్టంబడినబలీవర్దంబులుం బోలెం గర్తవ్యాకర్తవ్యవేదలక్షణ యగువాక్తంత్రియందు వర్ణాశ్రమలక్షణంబులు గల నామంబులచే బద్ధులై) లోకపాలసహితం బైనలోకంబు లీశ్వరాదేశంబు వహించుచుం [3]గ్రీడాసాధనంబు లగునక్షకందుకాదుల కెట్లు సంయోగవియోగంబు లట్లు క్రీడించునీశ్వరునికిం గ్రీడాసాధనంబు లైనజంతువులకు సంయోగవియోగంబు లగుచుండు సమస్తజనంబును జీవరూపంబున ధ్రువంబును దేహరూపంబున నధ్రువంబు నై యుండు మఱియొక్కపక్షంబున ధ్రువంబు నధ్రువంబునుం గాక యుండు శుద్ధబ్రహ్మస్వరూపంబు నిర్వచింప రాక రెండు నై యుండు నజగరంబుచేత మ్రింగం బడినపురుషుం డన్యుల రక్షింప లేనితెఱంగునం బంచభూతమయం బై కాలకర్మగుణాధీనం బైనదేహంబు పరుల రక్షింప సమర్థంబు గాదు కరంబులు గలజంతువులకుఁ గరంబులు లేనిచతుష్పదంబు లాహారంబు లగుఁ జరణంబులు గలప్రాణులకుం జరణంబులు లేనితృణాదులు భక్షణీయంబు లగు నధికజన్మంబులకు నల్పజన్మంబులు భోజ్యంబు లగు సకలదేహిదేహంబులందు జీవుండు గలుగుటం జేసి జీవునికి జీవుండ జీవిక యగు సహస్తాసహస్తాదిరూపం బైనవిశ్వమంతయు నీశ్వరుండు గాఁ దెలియు మతనికి వేఱు లేదు నిజమాయావిశేషంబున మాయావి యై జాతిభేదరహితుం డైనయీశ్వరుండు బహుప్రకారంబుల భోగిభోగ్యరూపంబుల నంతరంగబహిరంగంబుల దీపించుం [4](*గాన యనాథులు దీనులు నగునాదుతల్లిదండ్రులు నన్నుం బాసి యే మయ్యెదరో యెట్లు వర్తింతురో యని వగవం బనిలే దజ్ఞానమూలం బగుస్నేహంబున నైనమనోవ్యాకులత్వంబు పరిహరింపు మని మఱియు నిట్లనియె). 325

1, 2, 4 (*) ఇవి మూలానుసారముగాఁ జేర్పఁబడినవి. 3 నిచ్ఛాప్రకారంబునఁ గ్రీడించునీశ్వ.

ఆ. అట్టికాలరూపుఁ డఖిలాత్ముఁ డగువిష్ణుఁ, డసురనాశమునకు నవతరించి
దేవకృత్య మెల్లఁ దీర్చి చిక్కినపని, కెదురుచూచుచుండు నిప్పు డధిప. 326

మత్తకోకిలము. ఎంతకాలము కృష్ణుఁ డీశ్వరుఁ డిద్ధరిత్రిఁ జరించు మీ
రంతకాలము నుండుఁ డందఱు నవ్వలం బనిలేదు వి
భ్రాంతి మానుము కాలముం గడవంగ నెవ్వరు నోప రీ
చింత యేల [1]నరేంద్రసత్తమ చెప్పెదన్ విను మంతయున్. 327

వ. ధృతరాష్ట్రుండు గాంధారీవిదురసహితుం డై హిమవత్పర్వతదక్షిణభాగంబున నొక్కమునివనంబునకుం జని తొల్లి సప్తఋషులకు సంతోషంబు సేయుకొఱకు నాకాశగంగ యేడుప్రవాహంబు లయి పాఱినపుణ్యతీర్థంబునం గృతస్నానుం డై యథావిధి హోమం బొనరించి జలభక్షణంబు గావించి సకలకర్మంబులు విసర్జించి విఘ్నంబులం జెందక నిరాహారుం డయి శాంతి నంగీకరించి పుత్త్రార్థదారైషణంబులు వర్జించి విన్యస్తాసనుం డై ప్రాణంబుల నియమించి మనస్సహితంబు లైనయింద్రియంబుల నాఱింటిని విషయంబులం బ్రవర్తింపనీక నివర్తించి హరిభావనచే ధారణయోగంబు వహించి రజస్సత్త్వతమోరూపంబు లగుమలంబుల మూఁటిని హరించి మనంబు నహంకారాస్పదం బైనస్థూలదేహంబువలనం బాపి బుద్ధియందు నేకీకరణంబు సేసి [2]యట్టివిజ్ఞానాత్మను దృశ్యాంశంబువలన వియోగించి క్షేత్రజ్ఞునియందుఁ బొందించి దృష్టం బైనయీశ్వరునివలన క్షేత్రజ్ఞునిం బాపి మహాకాశంబుతోడ ఘటాకాశముం గలుపుకైవడి నాధారభూతం బైనబ్రహ్మమందుఁ గలిపి లోపలిగుణక్షోభంబును వెలుపలియింద్రియవిక్షేపంబును [3]లేక నిర్మూలితమాయాగుణవాసనుం డగుచు నిరుద్ధంబు లగుమనశ్చక్షురాదీంద్రియంబులు గలిగి యఖిలాహారంబుల వర్జించి కొఱడుచందంబున. 328

మ. ఉటజాంతస్స్థలవేదికన్ నియతుఁ డై యున్నాఁడు నేఁ డాదిగా
నిటపై నేనవనాఁడు మేన్ విడువఁగా [4]నిజ్యాగ్ని యోగాగ్ని త
త్పటుదేహంబు దహింపఁ జూచి నియమప్రఖ్యాత గాంధారి యు
ట్టటు వో నొల్లక ప్రాణవల్లభునితో నగ్నిం బడున్ భూవరా. 329

క. [5]అంతట వారలమరణము, వింత యగుచుఁ జూడఁబడిన విదురుఁడు చింతా
సంతాప మొదవఁ బ్రీత, స్వాంతుం డై తీర్థములకుఁ జనియెడు నధిపా. 330

---

1 నరేంద్రచంద్ర విశేషముల్ విను చెప్పెదన్.

2 'బుద్ధిసహితుం డైనతన్ను దృశ్యాంశంబువలన' అని వ్రాఁతప్రతులు.

3 'లేనికొఱకుచందంబున' అని వ్రాఁతప్రతులు.

4 నేలెంచుదావాగ్ని.

5 'అంతట నత్యాశ్చర్యము, వింత యగుచుఁ జెవులఁ బడిన' వనియే వ్రాఁతప్రతులు.

-ధర్మజుండు దుర్నిమిత్తంబులం గని చింతించుట.-

వ. అని విదురాదులవృత్తాంతం బంతయు ధర్మనందనున కెఱింగించి తుంబురుసహితుం డయిననారదుండు స్వర్గంబునకు నిర్గమించినవెనుక ధర్మజుండు భీమునిం జూచి యి ట్లనియె. 331

సీ. ఒకకాలమునఁ బండు నోషధిచయము వే, ఱొకకాలమునఁ బండ దుండు నండ్రు
క్రోధంబు లోభంబు క్రూరత బొంకును, దీపింప నరులు వర్తింతు రండ్రు
వ్యవహారములుమహావ్యాజయుక్తములండ్రు, సఖ్యంబు వంచనాసహిత మండ్రు
మగలతోనిల్లాండ్రు మచ్చరించెదరండ్రు, సుతులు దండ్రులఁ దెగఁ జూతు రండ్రు
తే. గురుల శిష్యులు దూషించి కూడ రండ్రు, శాస్త్రమార్గము లెవ్వియుఁ జాగ వండ్రు
న్యాయపద్ధతి బుధులై నడవ రండ్రు, కాలగతి వింత యై వచ్చెఁ గంటె నేఁడు.

మ. హరిఁ జూడన్ నరుఁ డేఁగి నాఁడు నెల లే డయ్యెం గదా రారు గా
లరు లెవ్వారును యాదవుల్ సమదలోలస్వాంతు లీవేళ సు
స్థిరు లై యుండుదురా మురారి సుఖ మై సేమంబుతో నుండునా
యెర వై యున్నది చిత్త మీశ్వరకృతం బెట్లో కదే మారుతీ. 333

క. మానసము గలఁగుచున్నది, మానవు బహుదుర్నిమిత్తమర్యాదలు స
న్మానవదేహక్రీడలు, మాన విచారింప నోపు మాధవుఁ డకటా. 334

క. మనవులు సెప్పక ముందఱ, మనదారప్రాణరాజ్యమానశ్రీలన్
[1]మనుపుదు నని మాధవుఁ డిట, మనమునఁ దలపోసి మనిచె [2]మనలం గరుణన్.

క. నారదుఁ డాడినక్రైవడిఁ, గ్రూరపుఁగాలంబు వచ్చెఁ గుంభినిమీఁదన్
ఘోరము లగునుత్పాతము, లారభటిం జూడఁబడియె ననిలజ కంటే. 336

సీ. ఓడక ముందట నొకసారమేయంబు, మొఱుఁగుచు నున్నది మోర యెత్తి
యాదిత్యుఁ డుదయింపనభిముఖంబై నక్క, వాపోయె మంటలు [3]వాతఁగలుగ
మిక్కిలు చున్నవి మెఱసి గృధ్రాదులు, గర్దభాదులు దీర్చి క్రందుకొనియె
నుత్తమాశ్వంబుల కుద్యయించెఁ గన్నీరు, మత్తగజంబులమదము లుడిగెఁ
ఆ. గాలుదూతభంగిఁ గదిసెఁ గపోతము, మండ దగ్ని హోమమందిరములఁ
జుట్టుఁ బొగలు దిశల నారిది నాచ్ఛాదించెఁ, దరణి మాసెఁ జూడు ధరణి గదలె.

క. వాతములు విసరి రేఁగు, వ్రాతము లాకసముఁ గప్పె వడి సుడిగొని ని
ర్ఘాతములు వడియె ఘనసం, ఘాతంబులు రక్తవర్షకలితము లయ్యెన్. 338

క. గ్రహములు పోరాడెడి నా, గ్రహముల వినఁబడియె భూతకలకలములు దు
స్సహము లగుచు శిఖికీలా, వహములు క్రియఁ దోఁచె గగనవసుధాంతరముల్.

క. దూడలు గుడువవు చన్నులు, దూడలకున్ గోవు లీవు దుగ్ధము లోడలం
బీడలు మానవు పశువులఁ, గూడవు వృషభములు దఱిపి కుఱ్ఱల నెక్కన్. 340

---

1. మను పుదు నని. 2. 'మనముల' అనియే వ్రాఁతప్రతులు. 3. వాంతి సేసి.

క. కదలెడు వేల్పులరూపులు, వదలెడుఁ గన్నీరు వాని వలనం జెమటల్
వొదలెడిఁ బ్రతిమలు [1]వెలిఁ జని, మెదలెడి నొక్కొక్కగుడిని మేదినియందున్.
క. కాకంబులు వాపోయెడి, ఘూకంబులు నగరఁ బగలు గుండ్రలు గొలిపెన్
లోకంబులు విభ్రష్ట, శ్రీకంబులగతి నశించి శిథిలము లయ్యెన్. 342
మ. యవపద్మాంకుశచాపచక్రఝషరేఖాలంకృతం బైనమా
ధవుపాదద్వయ మింక [2]మెట్టెడుపవిత్రత్వంబు నేఁ డాదిగా
నవనీకాంతకు లేదు పో మఱి మదీయాంగంబు వామాక్షిబా
హువు లాకంపము నొందు చుండు నిల కేయుగ్రస్థితుల్ వచ్చునో. 343
వ. మఱియు మహోత్పాతంబులు పెక్కులు పుట్టుచున్నయవి మురాంతకుని వృత్తాంతంబు వినరాదని కుంతీసుతాగ్రజుండు భీమునితో విచారించు సమయంబున. 344

అర్జునుఁడు ద్వారకనుండి వచ్చి కృష్ణనిర్యాణంబుఁ దెల్పుట.

క. ఖేదమున నింద్రసూనుఁడు, యాదవపురినుండి వచ్చి యగ్రజుఁ గని త
త్పాదముల నయనసలిలో, త్పాదకుఁ డై పడియె దీనుభంగి నరేంద్రా. 345
క. పల్లటిలినయుల్లముతోఁ, దల్లడపడు చున్నపిన్నతమ్మునిఁ గని వె
ల్వెల్ల నగు మొగముతో జను, లెల్లను విన ధర్మపుత్త్రుఁ డి ట్లని పలికెన్. 346
సీ. మాతామహుం డైనమనశూరుఁ డున్నాఁడె, మంగళమే మనమాతులునకు
మోదమే నలుగురుముగురుమేనత్తల, కానందమే వారియాత్మజులకు
నక్రూరకృతవర్మలాయుస్సమేతులే, జీవితుఁడే యుగ్రసేనవిభుఁడు
కల్యాణయుక్తులే గదసారణాదులు, మాధవుతమ్ములు మానధనులు
తే. నందమే మనసత్యకనందనునకు, భద్రమే శంబరాసురభంజనునకుఁ
గుశలమే బాణదనుజేంద్రుకూఁతుపతికి, హర్షమే పార్థ ముసలికి హాలికి బలికి.
వ. మఱియు నంధకయదుభోజదశార్హవృష్ణిసాత్వతులు మొద లయినయదువంశవీరులును హరికుమారు లైనసాంబసుషేణప్రముఖులును నారాయణానుచరు లైనయుద్ధవాదులును గృష్ణసహచరు లైనసునందనందాదులును [3](*సుఖానందు లే యని) యందఱ నడిగి ధర్మజుండు గ్రమ్మఱ ని ట్లనియె. 348
సీ. వైకుంఠవాసులవడువున నెవ్వని, బలమున నానందభరితు లగుచు
వెఱవక యాదవవీరులు వర్తింతు, రమరులు గొలు వుండునట్టికొలువుఁ
జవికె నాకర్షించి చరణసేవకు లైన, బంధుమిత్త్రాదులపదయుగముల
నెవ్వాఁడు ద్రొక్కించె నింద్రపీఠముమీఁద, వజ్రంబు జళిపించి వ్రాలువాని
తే. ప్రాణవల్లభ కెంగేలఁ బాదుసేసి, యమృతజలములఁ బోషింప నలరుపారి
జాత మెవ్వాఁడు గొని వచ్చి సత్యభామ, కిచ్చె నట్టిమహాత్మున కిపుడు శుభమె.

1. కాలు చని. 2. ముట్టెడు. 3. (*) ఇది మూలానుసారముగాఁ జేర్పఁబడినది.

శా. అన్నా ఫల్గున భక్తవత్సలుఁడు బ్రహ్మణ్యుండు గోవిందుఁ డా
పన్నానీకశరణ్యుఁ డీశుఁడు జగద్భద్రానుసంధాయి శ్రీ
మన్నవ్యాంబుజపత్రనేత్రుఁడు సుధర్మామధ్యపీఠంబునం
దున్నాఁడా బలభద్రుఁ గూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్. 350

క. ఆరామకేశవులకును, సారామలభక్తి నీవు సలుపుదువు గదా
గారాములు సేయుదురా, పౌరాముల బంధు లెల్లఁ బ్రొద్దు జితారీ. 351

శా. మున్నుగ్రాటవిలో వరాహమునకై ముక్కంటితోఁ బోరుచోఁ
సన్నాహంబునఁ గాలకేయుల ననిం జక్కాడుచోఁ బ్రాభవ
స్కన్నుండై చనుకౌరవేంద్రుపనికై గంధర్వులం దోలుచోఁ
గన్నీ రెన్నఁడుఁ దేవు తండ్రి చెపుమా కల్యాణమే చక్రికిన్. 352

వ. అదియునుం గాక. 353

క. ఓడితివో శత్రువులకు, నాడితివో సాధుదూషణాలాపములం
గూడితివో పరసతులను, వీడితివో మానధనము వీరులనడుమన్. 354

క. తప్పితివో యిచ్చెద నని, చెప్పితివో కపటసాక్షి చేసినమేలుం
దప్పితివో శరణార్థుల, రొప్పితివో ద్విజులఁ బసుల రోగుల సతులన్. 355

క. అడిచితివో భూసురులను, గుడిచితివో బాలవృద్ధగురువులు వెలిగా
విడిచితివో యాశ్రితులను, ముడిచితివో పరులవిత్తములు లోభమునన్. 356

వ. అని పలికినం గన్నీరు కరతలంబునం దుడిచికొనుచు గద్గదస్వరంబునఁ బెన్నిధిం
గోలుపోయినపేదచందంబున నిట్టూర్పుల నిగిడించుచు నర్జునుం డన్న కిట్లనియె.

క. మనసారథి మనసచివుఁడు, మనవియ్యము మనసఖుండు మనబాంధవుఁడున్
మనవిభుఁడు గురుఁడు దేవర, [1]మనలను దిగనాడి చనియె మనుజాధీశా. 358

క. కంటకపున్నృపులు సూడఁగ, మింటం గన్పించుయంత్రమీనముఁ గోలన్
గెంటించి మనము వాలుం, గంటిం జేకొంటి మతనికరుణను గాదే. 359

క. దండి సనేకులతో నా, ఖండలుఁ డెదురయ్యు గెలిచి ఖాండవవనముం
జండార్చికి నర్పించిన, గాండీవము నిచ్చెఁ జక్రి గలుగుట నధిపా. 360

క. దిక్కులరాజుల నెల్లను, మ్రొక్కించి ధనంబు గొనుట మయకృతసభ ము
న్నెక్కుట జన్నము సేయుట, నిక్కము హరి మనకు దండ నిలిచినఁ గాదే. 361

మ. ఇభజిద్వీర్యముఖాభిషిక్త మగుసీయుల్లాలిధమ్మిల్లమున్
సభలో శాత్రవు లీడ్చినన్ ముడువ కాశ్చంద్రాస్య దుఃఖింపఁ గా
సభయుం బిచ్చి ప్రతిజ్ఞ సేసి భవదీయారాతికాంతాశిరో
జభరశ్రీల హరింపఁడే విధవలై సౌభాగ్యముల్ వీడఁగన్. 362

శా. వైరుల్ గట్టినపుట్టముల్ విడువఁగా వారింప నావల్లభుల్

---

1. మనముల.

రా రీవేళ నుపేక్ష సేయఁ దగవే రావే నివారింపవే.
లేరే త్రాతలుఁ గృష్ణ యంచు సభలో దీనాంగి యై కుయ్యిడం
గారుణ్యంబున భూరివస్త్రకలితం గాఁ జేయఁడే ద్రౌపదిన్. 363

సీ. దుర్వాసుఁ డొకనాఁడు దుర్యోధనుఁడు వంపఁ, బదివేలశిష్యులు భక్తిఁ గొలువఁ
జనుదెంచి మనముఁ బాంచాలియుఁ గుడిచిన, వెనుక నాహారంబు వేఁడికొనినఁ
బెట్టెద ననవుడుఁ బెట్ట కున్న శపింతు, ననుచుఁ దోయావగాహమున కేఁగఁ
గడవల నన్నశాకములు దీఱుటఁ జూచి, పాంచాలపుత్త్రిక పర్ణశాల
తే. లోనఁ దలఁచిన విచ్చేసి లోవిలోని, శిష్టశాకాన్నలవముఁ బ్రాశించి తపసి
కోప ముడిగించి పరిపూర్ణకుక్షిఁ జేసె, నిట్టి త్రైలోక్యసంతర్పి యెందుఁ గలఁడు.

సీ. పందికై పోరాడ ఫాలాక్షుఁ డెవ్వని, బలమున నా కిచ్చెఁ బాశుపతము
నెవ్వనిలావున నిమ్మైన దేవేంద్రు, పీఠార్ధమున నుండఁ బెంపుఁ గంటిఁ
గాలకేయనివాతకవచాదిదైత్యులఁ, జంపితి నెవ్వని సంస్మరించి
గోగ్రహణమునాఁడు కురుకులాంభోనిధిఁ, గడచితి నెవ్వనికరుణఁ జేసి
ఆ. కర్ణసింధురాజకౌరవేంద్రాదుల, తలలపాగ లెల్లఁ దడవి తెచ్చి
యేమహాత్ముబలిమి నిచ్చితి విరటుని, పుత్త్రి యడుగ బొమ్మపొత్తికలకు. 365

మ. గురుభీష్మాదులు గూడి పన్నినకురుక్షోణీశచక్రంబులో
గురుశక్తిన్ రథయంత యై నొగలపైఁ గూర్చుండి యామేటి నా
శరముల్ వాఱక మున్న వారలబలోత్సాహాయురుద్యోగత
త్పరతల్ చూడ్కుల సంహరించు నమితోత్సాహంబు నా కిచ్చుచున్. 366

మ. అసురేంద్రుం డొనరించుకృత్యములు ప్రహ్లాదుం బ్రవేశించి గ
ల్వ సమర్థంబులు గానికైవడిఁ గృపాశ్వత్థామ గాంగేయ సూ
ర్యసుత ద్రోణ ధనుర్విముక్తబహుదివ్యాస్త్రప్రపంచంబు నా
దెసకున్ రాక తొలంగు మాధవుదయాదృష్టిన్ నరేంద్రోత్తమా. 367

చ. వసుమతి దివ్యబాణముల వ్రక్కలు వాపి కొలంకు సేసి నా
రసములు మాటుగాఁ బఱపి రథ్యములన్ రిపు లెల్లఁ జూడ సా
హసమున నీటఁ బెట్టితి రణావని సైంధవుఁ జంపునాఁడు నా
కసురవిరోధి భద్రగతి నండయి వచ్చినఁ గాదె భూవరా. 368

సీ. చెలికాఁడ రమ్మని చీరు నొక్కొకవేళ, మన్నించు నొకవేళ మఱఁది యనుచు
బంధుభావంబునఁ బాటించు నొకవేళ, దాత యై యొకవేళ ధనము లిచ్చు
మంత్రి యై యొకవేళ మంత్ర మాదేశించు, బోధి యై యొకవేళ బుద్ధి సెప్పు
సారథ్య మొనరించుఁ జనవిచ్చి యొకవేళఁ, గ్రీడించు నొకవేళఁ గేలిసేయు
తే. నొక్కశయ్యాసనంబున నుండుఁ గన్న, తండ్రికైవడిఁ జేసినతప్పుఁ గాచు
హస్తములు వట్టి పొత్తున నారగించు, మనుజవల్లభ మాధవు మఱవ రాదు.

క. విజయ ధనంజయ హనుమ, ద్ధ్వజ ఫల్గున పార్థ పాండుతనయ నర మహేం
ద్రజ మిత్రార్జున యంచును, భుజములు తలకడవ రాకపోకలఁ జీరున్. 370

క. వారిజగంధులు దమలోఁ. వారింపఁగ రానిప్రేమవాదము సేయన్
వారిజనేత్రుఁడు ననుఁ దగ, వారిండ్లకుఁ బనుపు నలుక వారింప నృపా. 371

క. నిచ్చలు లోపలికాంతలు, మచ్చికఁ దనతోడ నాడుమాటలు నాకున్
ముచ్చటలు సెప్పు మెల్లన, విచ్చలవిడిఁ దొడలమీఁద విచ్చేసి నృపా. 372

చ. అటమట మయ్యె నాథజన మంతయు భూవర నేఁడు సూడుమా
యిటువలె గారవించుజగదీశుఁడు కృష్ణుఁడు లేనిపిమ్మటం
బటుతరదేహలోభమునఁ బ్రాణము లున్నవి వెంటఁ బోక నేఁ
గటకట పూర్వజన్మమునఁ గర్మము లెట్టివి చేసినాఁడనో. 373

శా. కాంతారంబున నొంటి దోడుకొని రాఁగాఁ జూచి గోవిందుశు
ద్ధాంతస్త్రీలఁ బదాఱువేల మదరాగాయత్తులై తాఁకి నా
చెంతన్ బోయలు మూఁగి పట్టికొన నాసీమంతినీసంఘమున్
భ్రాంతిన్ భామినిభంగి నుంటి విడిపింపన్ లేక ధాత్రీశ్వరా. 374

శా. ఆ తేరా రథికుండు నాహయము లాయస్త్రాసనం బాశర
వ్రాతం బన్యులఁ ద్రొల్లి చంపుఁ దుదినిన్ వ్యర్థంబులై పోయె మ
చ్చేతోధీశుఁడు చక్రి లేమి భసితక్షిప్తాజ్యమాయావిమా
యాతంత్రోషరభూమిబీజములమర్యాదన్ నిమేషంబునన్. 375

మ. యదువీరుల్ మునినాథుశాపమునఁ గాలాధీనులై యందఱున్
మదిరాపానవివర్ధమానమదసమ్మర్దోగ్రరోషాంధులై
కదనంబుల్ దమలోన ముష్టిహతులం గావించి సిత్తైరి న
ష్టదశం జిక్కిరి నల్గు రేగు రచటన్ సర్వంసహావల్లభా. 376

క. భూతములవలన నెప్పుడు, భూతములకు జన్మమరణపోషణములు ని
ర్ణీతములు సేయుచుండును, భూతమయుం డీశ్వరుండు భూతశరణ్యా. 377

క. బలములు గలమీనంబులు, బలవిరహితమీనములను భక్షించు క్రియన్
బలవంతు లయినయదువులు, బలరహితులఁ జంపి రహితభావముల నృపా.

మ. బలహీనాంగులకున్ బలాధికులకుం బ్రత్యర్థిభావోద్యమం
బులు గల్పించి వినాశమున్ నెఱపి యీభూభారముం బాపి ని
శ్చలబుద్ధిన్ గృతకార్యుఁడై చనియె నాసర్వేశ్వరుం డచ్యుతుం
డలఘుం డే మని చెప్పుదున్ భగవదీయాయత్త ముర్వీశ్వరా. 379

వ. మఱియు దేశకాలార్థయుక్తంబులు నంతఃకరణసంతాపశమనంబులు నయినహరివచనంబులం దలంచి చిత్తంబు పరాయత్తం బయియున్న దని యన్నకుం జెప్పి నిరుత్తరుం డై నిరంతరహరిచరణారవిందచింతామలబుద్ధ యై శోకంబు వర్జించి

సదాధ్యానభక్తివిశేషంబులం గామక్రోధాదుల జయించి తొల్లి తన కుభయ
సేనామధ్యంబున నచ్యుతుం డానతిచ్చినగీతలు దలంచి కాలధర్మభోగాభినివేశం
బులచేత నావృతం బయినవిజ్ఞానంబుఁ గ్రమ్మఱ నధిగమించి హేతుమద్భావం
బున శోకహేతు[1](*వహంకారమమకారాత్మకంబయిన)ద్వైతభ్రమం బనియును
ద్వైతభ్రమంబునకుఁ గారణంబు దేహం బనియును దేహంబునకు బీజంబు లింగం
బనియును లింగంబునకు మూలంబు గుణంబు లనియును గుణంబులకు నిదా
నంబు ప్రకృతి యనియును బ్రహ్మ మనియెడుజ్ఞానంబున లీన యై ప్రకృతి లే
కుండుననియుఁ [2](*బ్రకృతియడంగుటయ నైర్గుణ్యంబనియును నైర్గుణ్యంబువలనఁ
గార్యలింగనాశం బనియును గార్యలింగనాశంబున నసంభవం బగు) ప్రకృతిం
బాసి క్రమ్మఱ స్థూలశరీరప్రాప్తుండు గాక పురుషుండు [3]సమ్యగ్భోగంబున
నుండు ననియును నిశ్చయించి యర్జునుండు విరక్తుండై యూరకుండె ధర్మజుండు
భగవదీయమార్గంబు దెలిసి యాదవులనాశంబు విని నారదువచనంబులఁ దలంచి
నిశ్చలచిత్తుం డై స్వర్గమార్గగమనంబునకు యత్నంబు సేయు చుండె నాసమ
యంబున. 380

క. యదువులనాశము మాధవు, పదవియు విని కుంతి విమలభక్తిఁ భగవ
త్పదచింతాతత్పర యై, ముదమున సంసారమార్గమునకుం బాసెన్. 381

వ. ఇట్లు కంటకంబునం గంటకోన్మూలనంబు సేసి కంటకంబులు రెంటిని బరిహరించు
విన్నాణి తెఱంగున యాదవరూపశరీరంబునం జేసి యీశ్వరుండు లోకకంటక
శరీరంబులు సంహరించి నిజశరీరంబు విడిచె సంహారంబునకు నిజశరీరపరశరీరం
బులు ధరియించి క్రమ్మఱ నంతర్ధానంబు నొందునటునిక్కె వడి లీలాపరాయణుం
డై నారాయణుండు మీనకూర్మాదిరూపంబులు ధరియించుఁ బరిహరించు నని
చెప్పి మఱియు ని ట్లనియె. 382

క. ఏదినమున వైకుంఠుఁడు, మేదినిపైఁ దాల్చినట్టిమేను విడిచినాఁ
డాదినమున నశుభప్రతి, పాదక మగుకలియుగంబు ప్రాప్తం బయ్యెన్. 383

ధర్మరాజు పరీక్షితునకుఁ బట్టము గట్టి మహాప్రస్థానంబున కేఁగుట.

సీ. కలివర్తనంబునఁ గార్శ్యహింసాసత్య, దంభకౌటిల్యాద్యధర్మచయము
పురముల గృహముల భూములఁ దమలోనఁ, గలుగుట దలపోసి కరిపురమున
మనుమని రాజ వై మను మని దీవించి, సింధుతోయకణాభిషిక్తుఁ జేసి
యనిరుద్ధనందనుం డైనవజ్రునిఁ దెచ్చి, మధురఁ బట్టము గట్టి మమతఁ బాసి

ఆ. కరుల హరుల భటులఁ గంకణాదికముల, మంత్రిజనుల బుధుల మానవతుల
నఖిల మయినధనము నభిమన్యుసుతునకు, నప్పగించి బుద్ధి నాశ్రయించి. 384

1, 2 (*) ఇవి మూలానుసారముగాఁ జేర్పఁబడినవి. 3 సమ్యగ్భావంబున.

వ. విరక్తుం డై ధర్మనందనుండు ప్రాజాపత్యం బనియెడియిష్టిఁ గావించి యగ్నుల నాత్మారోపణంబు సేసి నిరహంకారుండును నిర్దళితాశేషబంధనుండును నై సకలేంద్రియంబుల మానసంబున నడంచి ప్రాణాధీనవృత్తి యగుమానసంబును బ్రాణమందును బ్రాణము నపానమందును నుత్సర్గసహితం బయినయపానము మృత్యువునందును మృత్యువును బంచభూతంబులకు నైక్యం బైనదేహంబునందును దేహమును గుణత్రయంబునందును గుణత్రయంబు నవిద్యయందును సర్వారోపహేతు వగునవిద్యను జీవునియందును జీవుం డయినతన్ను నవ్యయం బయినబ్రహ్మమందును లయింపఁజేసి బహిరంగవ్యాపారంబులు విడిచి నారచీరలు ధరియించి మౌనియు నిరాహారుండును ముక్తకేశుండును నై యున్మత్తపిశాచబధిరజడులచందంబున నిరపేక్షత్వంబున. 385

క. చిత్తంబున బ్రహ్మము నా, వృత్తముఁ గావించికొనుచు । విజ్ఞానధనా
యత్తులు దొల్లి వెలింగెడి, యుత్తరదిశ కేఁగె నిర్మ । లోద్యోగమునన్. 386

సీ. అంత నాతనితమ్ము । లనిలపుత్త్రాదులు, గలిరాకచేఁ బాప । కర్ము లగుచుఁ
జరియించుప్రజలసం । చారంబు లీక్షించి, యఖిలధర్మంబుల । నాచరించి
వైకుంఠచరణాబ్జ । వర్తితహృదయు లై, తద్భక్తి నిర్మల । త్వమును జెంది
విషయయుక్తులకుఁ బ్ర । వేశింపఁగా రాక, నిర్ధూతకల్మష । నిపుణమతులు

తే. బహుళవిజ్ఞానదావాగ్ని । భసితకర్ము, లైనయేకాంతులకు [1]లక్ష్య । మై వెలుంగు
ముఖ్యనారాయణస్థాన । మునకుఁ జనిరి, విగతరజ మైనయాత్మల । విప్రముఖ్య.

వ. అంత విదురుండు ప్రభాసతీర్థంబున హరియందుఁ జిత్తంబు సేర్చి శరీరంబు విడిచి పితృవర్గంబుతోడ దండధరుం డగుటం జేసి నిజాధికారస్థానంబునకుం జనియె ద్రుపదరాజపుత్త్రియుఁ బతులవలన నుపేక్షిత యై జగత్పతి యైనవాసుదేవునందు జిత్తంబు సేర్చి తత్పదంబు సేరె నిట్లు. 388

క. పాండవులసంప్రయాణము, పాండురమతి నెవ్వఁ డైనఁ । బలికిన విన్నన్
ఖండితభవుఁ డై హరిదా, సుం డై కైవల్యపదము । సొచ్చు నరేంద్రా. 389

వ. అంత నట పరీక్షిత్కుమారుండు జాతకర్మవిదు లైనకోవిదులు సెప్పినచందంబున భూసురోత్తమశిక్షావశంబున మహాభాగవతశేఖరుం డై ధరణీపాలనంబు సేయుచు నుత్తరునిపుత్త్రిక నిరావతి యనుమత్తకాశినిం బెండ్లి యయి జనమేజయప్రముఖు లైననలువురుగొడుకుల నుత్పాదించి గంగాపులినతలంబునఁ గృపాచార్యుండు గురుత్వంబు సేయ యాభాగంబులకు వచ్చినదేవతల నీక్షించుచు సదక్షిణంబుగా మూఁడశ్వమేధంబు లాచరించి దిగ్విజయకాలంబున గోమిథునంబుఁ దన్ను చున్నశూద్రరాజచిహ్నముద్రితుం డగుకలిం బట్టి నిగ్రహించె నని చెప్పిన శౌనకుండు పౌరాణికున కిట్లనియె. 390

1. లభ్య । మై. 2. పాండవకృష్ణులయానము.

తంత్రపవిత్రమానసుండై యుండె నయ్యెడ వృషభరూపంబున నేకపాదంబున సంచరించుధర్మదేవుండు దనసమీపంబున లేఁగ లేని లేఁగటికుఱ్ఱిచందంబున హతప్రభ యై నేత్రసలిలంబులు గురియుచు గోరూప యై యున్నధాత్రి కి ట్లనియె. 395

మ. నయనాంభఃకణజాల మేల విడువన్ । నాతల్లి నీమేను సా
మయ మై యుండదు మోము వాడినది నీ।మన్నించుచుట్టాలకున్
భయదుఃఖంబులు నేఁడు వొందవు గదా । బంధించి శూద్రుల్ పద
త్రయహీనున్ ననుఁ బట్ట వత్తు రనియో । తాపంబు నీ కేటికిన్. 396

సీ. మఖములు లేమి న।మర్త్యుల కిటమీఁద, మఖభాగములు లేక । మాను ననియొ
రమణులు రమణుల । రక్షింప రనియొ త,త్పుత్రులఁ దండ్రులు । ప్రోవ రనియొ
భారతి కుజనులఁ । బ్రాపించు ననియొ స,ద్విప్రులు నృపుల సే।వింతు రనియొ
కులిశహస్తుఁడు వాన।గురియింపకుండఁగఁ, బ్రజలు దుఃఖంబులఁ।బడుదు రనియొ

ఆ. [1]హీనవంశజాతు । లేలెద రనియొ రా,జ్యములు పాడి గలిగి । జరగ వనియొ
మనుజు లన్నపాన।మైథునశయనాస, నాదికర్మసక్తు । లగుదు రనియొ. 397

మ. జననీ నీభర మెల్ల డించుటకు నై । చక్రాయుధుం డిన్నిహా
యనముల్ దాను నరాకృతిన్ మెలఁగి ని।త్యానందముం జేసి పో
యిన నే నింక ననాథ నైతిఁ గుజనుం । డెవ్వాఁడు శాసించునో
పెనుదుఃఖంబులఁ బొందఁగంటి ననియో । భీతిల్లి చింతించుటల్. 398

క. దెప్పర మగుకాలముచే, నెప్పుడు దేవతల కైన । నిష్టం బగునీ
యొప్పిదము కృష్ణుఁ డరిగినఁ, దప్పెఁ గదా తల్లి నీవు । తల్లడపడఁగన్. 399

వ. అనిన భూదేవి యి ట్లనియె. 400

క. ఈలోకంబునఁ బూర్వము, నాలుగుపాదముల నీవు । [2]నడతువు నేఁ డా
శ్రీలలనేశుఁడు లేమిని, గాలముచే నీకు నొంటి।కా లయ్యెఁ గదే. 401

వ. మఱియు సత్యశౌచదయాక్షమంబులును సంతోషత్యాగశమదమార్జవంబులును దపంబును సమత్వంబును బరాపరాధసహనంబును లాభంబు గలయెడ నుదాసీనుండై యుండుటయును శాస్త్రవిచారవిజ్ఞానవిరక్తులును నైశ్వర్యశౌర్యప్రభాదక్షత్వంబులును స్మృతియును స్వాతంత్ర్యంబును గౌశలకాంతిధైర్యమార్దవప్రతిభాతిశయప్రశ్రయశీలంబులును జ్ఞానేంద్రియకర్మేంద్రియమనోబలంబులును సౌభాగ్యగాంభీర్యస్థైర్యంబులును శ్రద్ధాకీర్తిమానగర్వాభావంబులును ననియెడి ముప్పదితొమ్మిదిగుణంబులు నవియునుం గాక బ్రహ్మణ్యతాశరణ్యతాది మహాగుణసమూహంబును శ్రీకృష్ణదేవునియందు వర్తిల్లుం గావున. 402

---

1 హీనవశ్యు లింక. 2 నడవఁగ నకటా.

క. గణనాతీతము లగుసద్గుణములు గలచక్రి సనిన ఘోరకలిప్రే
రణమునఁ బాపసమూహప్రణయుతు లగుజనులఁ జూచి వగచెదఁ దండ్రీ.

క. దేవతలకు ఋషులకుఁ బితృదేవతలకు నాకు నీకు ధీరులకును నా
నావర్ణాశ్రమములకును, గోవులకును బాధ యనుచుఁ గుందెద ననఘా. 404

సీ. బ్రహ్మాదు లెవ్వనిభద్రకటాక్షవీక్షణము వాంఛింతురు సత్తపములఁ
గమలాలయము మాని కమల యెవ్వనిపాదకమలంబు సేవించుఁ గౌతుకమున
బరమయోగీంద్రులు భవ్యచిత్తములందు, నిలుపుదు రెవ్వని నియతితోడ
వేదంబు లెవ్వనివిమలచారిత్రముల్, వినుతింపఁగా లేక వెగడువడియె

ఆ. నట్టివాసుదేవు నబ్జవజ్రాంకుశ, చక్రమీనశంఖచాపకేతు
చిహ్నితంబు లైనశ్రీచరణము లింకఁ, జోఁక వనుచు వగపు సోఁకె నయ్య.

క. హరిపాదంబులు సోఁకెడి, సిరికతమున నిఖలభువనసేవ్యత్వముతో
స్థిర నైతి నిన్నిదినములు, హరి నాగర్వంబు మాన్చి యరిగె మహాత్మా. 406

క. లీలాకారము దాల్చెను, శ్రీలలనేశుండు ఖలుల శిక్షించి భవో
న్మూలనము సేయుకొఱకును, నాలుగుపాదముల నన్ను నడపించుటకున్. 407

ఉ. ఆమధురోక్తు లానయము లాదరహాసము లాదయారసం
బామురిపెంబు లాతగవు లాగమనక్రియ లామనోహర
ప్రేమకరావలోకనముఁ బ్రీతిఁ గనుంగొన లేమి మాధవుం
గామిను లేల నిర్దళితకర్ములు యోగులుఁ బాయ నేర్తురే. 408

క. మెల్లన నాపై యాదవ, వల్లభుఁ డడుగిడఁగ మోహపరవశ నై నే రం
జిల్లఁగ రోమాంచముక్రియ, మొల్లము లై మొలచు సస్యములు మార్గములన్.

వ. అని యిట్లు పూర్వవాహిని యైనసరస్వతీతీరంబున ధర్మదేవుండును భూమియు వృషభధేనురూపంబుల భాషింప రాజర్షి యైనపరీక్షిద్భూవరుండు డగ్గఱియె నాసమయంబున. 410

కలిపురుషుఁడు ధర్మదేవతను దన్నుట.

శా. కైలాసాచలసన్నిభం బగుమహాగంభీరగోరాజముం
గాలక్రోధుఁడు దండహస్తుఁడు నృపాకారుండు క్రూరుండు జం
ఘాలుం డొక్కఁడు శూద్రుఁ డాసురగతిం గారుణ్యనిర్ముక్తుఁ డై
నేలం గూలఁగఁ దన్నెఁ బంచితిలఁగా నిర్ఘాతపాదాహతిన్. 411

వ. మఱియును. 412

శా. ఆలోలాంగక నశ్రుతోయకణలీనాక్షిన్ మహాంభారవన్
బాలారూఢతృణావళీకబళలోభవ్యాప్తజిహ్వాగ్ర నాం
దోళస్వాంత నజీవవత్స నుదయద్దుఃఖాన్వితన్ ఘర్మకీ
లాలాపూర్ణశరీర నామొదవు నుల్లంఘించి తన్నెన్ వడిన్. 413

వ. ఇట్లా ధేనువృషభంబుల రెంటినిం గంటకుండై తన్నుచున్న రాజలక్షణముద్రితుం
డయినశూద్రునిం జూచి సువర్ణపరికరస్యందనారూఢుం డగునభిమన్యునంద
నుండు గోదండంబు సగుణంబు సేసి మేఘగంభీరరవంబు లగువచనంబుల
ని ట్లనియె. 414

శా. నిన్నుం గొమ్ములఁ జిమ్మెనో కదిసెనో । నిర్భీతి వై గోవులం
దన్నం గారణ మేమి మద్భుజసనాథక్షోణి నే వేళలం
దు న్నేరంబులు సేయ రా దెఱుఁగవా । ధూర్తత్వమున్ భూమిభృ
త్సన్నాహంబు నొనర్చె దెవ్వఁడవు నిన్ । శాసించెదన్ దుర్మతీ. 415

క. గాండీవియుఁ జక్రియు భూ, మండలిఁ బెడఁబాసి చనిన । మదమత్తుఁడ వై
దండింపఁ దగనివారల, దండించెదు నీవ తగుదు । దండనమునకున్. 416

వ. అని వృషభంబు నుద్దేశించి యి ట్లనియె. 417

మ. కుకుధాత్రీశ్వరబాహువప్రయుగళీ।గుప్తక్షమామండలిం
బరికింపన్ భవదీయనేత్రజనితాం।భశ్శ్రేణి దక్కన్ జనుల్
దొరఁగం [1]జేయ రధర్మసంజనితజం।తుశ్రేణిబాష్పంబులన్
గురుశక్తిన్ విదళింతుఁ జూడు మితనిన్ । గోమూర్తిదేవోత్తమా. 418

క. జాలిఁ బడ నేల నాశర, జాలంబులపాలు సేసి । చంపెద వీనిన్
భూలోకంబున నిపు డే, నాలుగుపాదముల నిన్ను । నడపింతుఁ జుమీ. 419

ఉ. వాచవి యైనగడ్డిఁ దిని । వాహినులందు జలంబు ద్రావఁ గా
నీచరణంబు లెవ్వఁ డిటు । నిర్దళితంబుగఁ జేసె వాఁడు దా
ఖేచరుఁ డైన వాని మణి।కీలితభూషణయుక్తబాహులన్
వే చని త్రుంచి వైతు విను।వీదికి నేఁగిన నేల డాఁగినన్. 420

వ. అని మఱియు గోమూర్తి యయినభూదేవితో ని ట్లనియె. 421

చ. అగణితవైభవుం డగుము।రాంతకుఁ డక్కట పోయె నంచు నె
వ్వగలఁ [2]కృశించి నేత్రముల । వారికణంబులు దేకు మమ్మ లో
బెగడకుమమ్మ మద్విశిఖ।బృందములన్ వృషలున్ వధింతు నా
మగఁటిమిఁ జూడవమ్మ వెఱ। మానఁ గదమ్మ శుభప్రదాయినీ. 422

క. సాధువు లగుజంతువులకు, బాధలు గావించుఖలుల । భంజింపనిరా
జాధమునాయుస్స్వర్గ, శ్రీధనములు వీటిఁ బోవు । సిద్ధము తల్లీ. 423

క. దుష్టజననిగ్రహంబును, శిష్టజనానుగ్రహంబుఁ । జేయఁగ నృపులన్
స్రష్ట విధించెఁ బురాణ, ద్రష్టలు సెప్పుదురు పరమ।ధర్మము సాధ్వీ. 424

వ. అనిన ధర్మనందనపౌత్రునకు వృషభమూర్తి నున్నధర్మదేవుం డి ట్లనియె. 425

---

1 జూడ ర. 2 వశించి.

ఉ. క్రూరులఁ జంపి సాధువులకున్ విజయం బొనరించునట్టి యా
పౌరవవంశజాతుఁడవు భాగ్యసమేతుఁడ వౌదు తొల్లి మీ
వా రిటువంటివా రగుట వారిజనేత్రుఁడు మెచ్చి దౌత్యసం
చారము సేసెఁ గాదె నృపసత్తమ భక్తిలతానిబద్ధుఁడై. 426

వ. నరేంద్రా! యేము ప్రాణులకు దుఃఖహేతువులము గాము మావలన దుఃఖంబు నొందెడుపురుషుండు లేఁడు వాదివాక్యభేదంబులఁ [1]గొందఱు మోహితులై భేదంబు నాచ్ఛాదించి తమకు నాత్మ సుఖదుఃఖంబుల నిచ్చు ప్రభువని చెప్పుదురు [2]గొందఱు గ్రహదేవతాదులకుఁ బ్రభుత్వంబు సంపాదింతురు [3]గొందఱు గర్మంబునకుం బ్రాభవంబుం బ్రకటింతురు [4]గొందఱు స్వభావంబు ప్రభువని పలుకుదు రిం దెవ్వరికిని సుఖదుఃఖప్రదానంబు సేయఁ బ్రభుత్వంబు లేదు పరులవలన దుఃఖంబు వచ్చిన నధర్మంబు పరులు సేసి రని విచారింప వలదు తర్కింపను నిర్దేశింపను రానిపరమేశ్వరునివలన సర్వంబు నగుచుండు ననిన ధర్మదేవునికి ధర్మనందనపౌత్రుం డి ట్లనియె. 427

ఆ. ధర్మమూర్తి వయ్యు ధర్మజ్ఞ వృషరూప, పరమధర్మ మీవు పలుకుత్రోవ
పాపకర్ము చేయు పాపం[5]బు సూచింపఁ, బాపకర్ముఁ డేఁగుపథము వచ్చు. 428

వ. మఱియు దేవమాయవలన భూతంబులవాఙ్మనసంబులకు వధ్యఘాతుకలక్షణావృత్తి సులభంబుగం దెలియ రాదు నీవు ధర్మదేవతవు కృతయుగంబునం దపశ్శౌచదయాసత్యంబు లనునాలుగు నీకుం బాదంబు లని చెప్పుదురు [6](*త్రేతాయుగంబునం బూర్వోక్తపాదచతుష్కంబునం దొక్కపాదంబు క్షీణం బయ్యె ద్వాపరంబునఁ బాదద్వయంబు నశించెఁ గలియుగంబందు నివ్వడువున) నిప్పుడు నీకుఁ బాదత్రయంబు భగ్నం బయ్యె నవశిష్టం బగుభవదీయచతుర్థపాదంబు నధర్మంబు గల్యంతంబునని గ్రహింపగమకించుచున్నయది విను మదియునుంగాక.

మ. భరముం బాపి రమావిభుండు కరుణం బాదంబులం ద్రొక్కఁగా
స్థిర యై వేడుక నింతకాలము సుఖశ్రీ నొందె భూదేవి త
చ్చరణస్పర్శము లేమి శూద్రకులజుల్ శాసింతు రంచున్ నిరం
తరశోకంబున నీరు గన్నుల నిడెన్ ధర్మజ్ఞ వీక్షించితే. 430

—పరీక్షిన్మహారాజు కలిని నిగ్రహించి ధర్మపరిపాలనము సేయుట.—

వ. అని యిట్లు ధరణీధర్మదేవతల బుజ్జగించి మహారథుం డయినవిజయపౌత్రుండు క్రొక్కారుమెఱుంగు తెఱంగు ధిక్కరించుచు దిక్కులకు వెక్కసం బయినయడిదంబు బెడిదంబుగ జడిపించి పాపహేతు వయినకలిరూపు మాప నుద్యోగించిన వాఁడు రాజరూపంబు విడనాడి వాడినమొగంబుతోడ భయవిహ్వలుం

1 'యోగీశ్వరులు' అచ్చుప్రతి. 2 'దైవజ్ఞులు' అ. ప్ర. 3 'మీమాంసకులు' అ. ప్ర. 4 'లోకాయతికులు' అ. ప్ర. 5 బుపేక్షింప. 6 (*) ఇది పండితులు గూర్చినది.

డై హస్తంబులు సాఁచి తత్పాదమూలవిన్యస్తమస్తకుం డై ప్రణామంబు సేసి.

క. కంపించె దేహ మెల్లం, జంపకు మోరాజతిలక ! శరణాగతు ర
క్షింపు మని తనకు మ్రొక్కినఁ, జంపక కలిరాజుఁ జూచి జనపతి వలుకున్.

క. అర్జునకీర్తిసమేతుం, డర్జునపౌత్త్రుండు భయరసావృతజనులన్
నిర్జించి చంపఁ దలఁపఁడు, దుర్జనభావంబు విడిచి తొలఁగు దురాత్మా. 433

వ. నీవు పాపబంధుండవు మదీయబాహుపాలితం బయినమహీమండలంబున నిలువ వలవదు రాజదేహంబునందు వర్తించునిన్ను నసత్యలోభచౌర్యదౌర్జన్యదురాచారమాయాకలహకపటకలుషాలక్ష్మ్యాదిధర్మేతరసమూహంబు లాశ్రయించు సత్యధర్మంబులకు నివాసం బగుబ్రహ్మావర్తదేశంబున యజ్ఞవిస్తారనిపుణు లయిన వారు యజ్ఞేశ్వరుం డయినహరింగూర్చి యాగంబు సేయుచున్నవారు యజించు వారలకు సుఖప్రదానంబు సేయుచు సకలభూతాంతర్యామి యై భగవంతుం డయినహరి జంగమస్థావరంబులకు నంతరంగబహిరంగంబుల సంచరించువాయువుచందంబున నాత్మరూపంబున మనోరథంబుల నిచ్చుం గావున నీ విం దుండ వలవదనుచు దండహస్తుం డయినజమునికై వడి మండలాగ్రంబు సాఁచిన రాజవర్యునకుం గలి యి ట్లనియె. 434

క. జగతీశ్వర నీయడిదము, ధగధగితప్రభలతోడఁ దఱచుగ మెఱవన్
బెగడెం జిత్తము గుండెలు, వగిలెడి నిఁక నెందుఁ జొత్తు భావింపఁ గదే.

వ. నరేంద్రా నిన్ను నారోపితశరశరాసను సర్వప్రదేశంబులందును విలోకించుచున్నవాఁడ నే నెక్కడ నుండుదు నానతి మ్మనిన రాజన్యశేఖరుండు ప్రాణివధస్త్రీద్యూతపానంబు లనియెడునాలుగుస్థానంబుల నిచ్చి మఱియు నడిగిన సువర్ణమూలం బగునసత్యమదకామహింసావైరంబు లనియెడు పంచప్రదేశంబుల నొసఁగి యితరస్థలంబుల స్పృశియింప కుండ నియమించె నిట్లు కలినిగ్రహంబు సేసి హీనంబు లయినతపశ్శౌచదయ లనియెడిమూఁడుపాదంబులు వృషభమూర్తి యయినధర్మదేవత కిచ్చి విశ్వంభరకు నిర్భరం బయినసంతోషంబు సంపాదించి. 436

క. గజనామధేయపురమున, గజరిపుపీఠమున ఘనుఁడు గలిదముఁడు మహా
గజవైరిపరాక్రముఁ డే, గజిబిజి లేకుండఁ దాల్చెఁ గౌరవలక్ష్మిన్. 437

వ. ఇట్లు కృష్ణునియనుగ్రహంబున నశ్వత్థామబాణపావకంబువలన బ్రదికి వృషభమూర్తి యయినధర్మదేవతకు నభయం బిచ్చినపరీక్షిన్నరేంద్రుండు బ్రాహ్మణశాపప్రాప్తతక్షకాహిభయంబువలనఁ బ్రాణంబులు వోవు నని యెఱింగి సర్వసంగంబులు వర్జించి శుకునకు శిష్యుం డై విజ్ఞానంబు గలిగి గంగాతరంగిణీతీరంబునం గళేబరంబు విడిచె వినుఁడు. 438

1. భాషింపఁ గదే.

క. హరివార్త లెఱుఁగువారికి, హరిపదములు దలఁచువారి కనవరతంబున్
హరికథలు వినెడివారికి, మరణాగతమోహసంభ్రమము లే దనఘా. 439

క. శుభచరితుఁడు హరి యరిగినఁ, బ్రభవించి ధరిత్రి నెల్లఁ బ్రబ్బియుఁ గలి దా
నభిమన్యుసుతునిచేతను, బ్రభవింపక యడఁగి యుండె భార్గవముఖ్యా. 440

వ. ఇవ్విధంబునఁ జతుస్సముద్రముద్రితాఖిలమహీమండలప్రాజ్యసామ్రాజ్యంబు పూజ్యంబుగాఁ జేయుచు నాయభిమన్యుసంభవుండు. 441

ఉ. చేసినఁ గాని పాపములు సెందవు చేయఁ దలంచినంతటం
జేసెద నన్నమాత్రమునఁ జెందుఁ గదా కలివేళఁ బుణ్యముల్
మోసము లే దటంచు నృపముఖ్యుఁడు గాచెఁ గలిన్ మరందము
ల్లాసముతోడఁ గ్రోలి విరులం దెగఁజూడని తేఁటికైవడిన్. 442

వ. మఱియుం బ్రమత్తులై యధీరు లగునరులయందు వృకంబుచందంబున నొదిఁగి లాఁచుకొని యుండి చేష్టించుంగాని ధీరులైనవారికిం గలివలనిభయంబు లేదని కలి నంతంబు నొందింపఁ డయ్యె ననిన విని ఋషులు సూతున కిట్లనిరి. 443

సీ. పౌరాణికోత్తమ బ్రదుకుము పెక్కేండ్లు, తామరసాక్షునిధవళయశము
మరణశీలురమైన మా కెఱింగించితి, కల్పితం బగుక్రతుకర్మమందుఁ
బొగలచేఁ బొగిలి యబుద్ధచిత్తుల మైన, మము హరిపదపద్మమధురరసముఁ
ద్రావించితివి నీవు ధన్యుల మైతిమి, జన్మాంతరము లేనిస్వర్గ మైన
తే. విష్ణుభక్తులసంగంబు వెలకు రాదు, ప్రకృతిగుణహీనుఁ డగుచక్రిభద్రగుణము
లీశకమలాసనాదులు నెఱుఁగ లేరు, వినికి వినఁ జాల మనియెడివెఱ్ఱి గలఁడె.

క. శ్రీపంబులు ఖండితసం, తాపంబులు గల్మషాంధతమసమహోద్య
ద్దీపంబులు పాషండదు, రాపంబులు విష్ణువందనాలాపంబుల్. 445

క. పావనములు దురితలతా, లావనములు నిత్యమంగళప్రాభవసం
జీవనములు లక్ష్మీసం, భావనములు వాసుదేవపదసేవనముల్. 446

ఆ. పరమభాగవతుఁడు పాండవపౌత్రుండు, శుకునిభాషణముల శుద్ధబుద్ధి
యై విరాజమానుఁ డై ముక్తి యగువిష్ణు, పాదమూల మెట్లు వడసె ననఘ.

వ. మహాత్మా విచిత్రయోగనిష్ఠాకలితంబును విష్ణుచరితలలితంబును బరమపుణ్యంబును సకలకల్యాణగుణగణ్యంబును భాగవతజనాపేక్షితంబును నైనపారీక్షిత భాగవతాఖ్యానంబు వినిపింపు మనిన సూతుం డిట్లనియె. 448

క. మిముబోఁటిపెద్దవారలు, కమలాక్షునిచరిత మడుగఁగాఁ జెప్పెడిభా
గ్యము గలిగె నేఁడు నాజన్మము సఫలం బయ్యె వృద్ధమాన్యుఁడ నగుటన్. 449

క. కులహీనుఁడు నారాయణ, విలసత్కథనములు గడఁక వినిపించినఁ ద
త్కులహీనతఁ బాసి మహో, జ్జ్వలకులజత్వమును బొందు సన్మునులారా. 450

సీ. ఎవ్వనిగుణజాల । మెన్న జిహ్వలు లేక, నలినగర్భాదు లనంతుఁ డంద్రు
కోరెడువిబుధేంద్ర । కోటి నొల్లక లక్ష్మి, ప్రార్థించె నెవ్వని । పాదరజము
బ్రహ్మ యెవ్వనిపాద । పద్మంబు గడిగిన, జలము ధన్యత నిచ్చె । జనుల కెల్ల
భగవంతుఁ డనియెడి । భద్రశబ్దమునకు, నెవ్వఁ డర్థాకృతి । నేపు మిగులు
ఆ. నేమహాత్ము నాశ్ర । యించి శరీరాది, సంగకోటి నెల్ల । సంహరించి
ప్రాభవమున[1]మునులు । పారమహంస్యంబు, నొంది తిరిగి రాక । యుందు రెలమి.
చ. క్రమమున మింటికై యెగయుఁ । గాక విహంగము మింటి దైనపా
రము గన నేర్చునే హరిప । రాక్రమ మోపినయంతఁ గాక స
ర్వము వివరింప నెవ్వఁడు ప్రవర్తకుఁ డో మునులార [2]నాదుచి
త్తమునకు నెంత గానఁబడెఁ । దప్పక చెప్పెద మీకు నంతయున్. 452
క. వేదండపురాధీశుఁడు, గోదండము సేతఁ బట్టి । కొని గహనములో
వేదండాదుల నొకనాఁ, డేదండలఁ బోవ నీక । యెగచెన్ బలిమిన్. 453
క. ఒగ్గములు ద్రవ్వి పడు మని, యొగ్గడు పెనుఁదెరల వలల । నురలుమృగములన్
డగ్గఱి చంపెడువేడుక, వెగ్గల మై చిత్తమందు । వెంటాడింపన్. 454
క. కోలముల గవయవృకశా, ర్దూలములఁ దరక్షుఖడ్గ । రోహితహరిశుం
డాలముల శరభచమర, వ్యాలముల వధించె విభుఁడు । వడి నోలములన్. 455

పరీక్షితుఁడు వేఁటాడి శమీకునిపై మృతసర్పము నెత్తి వైచుట.

క. మృగయులు మెచ్చ నరేంద్రుఁడు, మృగరాజపరాక్రమమున । మెఱసి హరించెన్
మృగధరమండలమునఁ గల, మృగ మొక్కటి దక్క సర్వ । మృగముల నెల్లన్.
వ. ఇట్లు వాటం బయిన వేఁటతమకంబున మృగంబుల వెంబడిం బడి యెగచుచుం జరించుటం జేసి బుభుక్షాపిపాసలవలన మిగులఁ బరిశ్రాంతుం డయి ధరణీకాంతుండు చల్లనినీటికొలంకుం గానక కలంకితచిత్తుం డై చని చని యొక్కతపోవనంబు గని యందు. 457
సీ. మెలఁగుట చాలించి । మీలితనేత్రుఁ డై, శాంతుఁ డై కూర్చుండి । జడత లేక
ప్రాణమనోబుద్ధి । పంచేంద్రియంబుల, బహిరంగవీథులఁ । బాఱ నీక
జాగరణాదిక । స్థానత్రయము దాఁటి, పరమ మై యుండెడి । పదముఁ దెలిసి
బ్రహ్మభూతత్వసం । ప్రాప్త్యవిక్రియుఁ డయి, యతిదీర్ఘజటలు ద । న్నావరింప
తే. నలఘురురుచర్మధారి యై । యలరుచున్న, తపసిఁ బొడగని శోషిత । తాలుఁ డగుచు
నెండి తడి లేక కుత్తుక । నెలుఁగు డింద, మందభాషల నిట్లను । మనుజవిభుఁడు.
క. తోయములు దెమ్ము మా కీ, [3]తోయము వేఁటాడ వెరవు । దొరకదు ఘనచే
తోయుత దప్పి జనించెను, తోయమువారలును లేరు । దుస్సహ మనఘా. 459

1. ఘనులు. 2. బుద్ధిచి, త్తములకు. 3. తోయము వేఁటాడువేళఁ ♦ దొల్లి పొడము దీ, తోయముక్రియ జలదాహము.

వ. అని భూవరుండు శమీకమహాముని [1]సమాధినిష్ఠానిమీలితనేత్రుండును విస్మృతబాహ్యాంతరింద్రియకృతసంచారుండును హరిచింతాపరుండును నై యుండుట విచారింపలేక. 460

ఉ. కన్నులు మూసి బ్రాహ్మణుఁడు గర్వముతోడుత నున్నవాఁడు చే
సన్నల నైన రమ్మనఁడు సారజలంబులు దెచ్చి పోయఁడే
మన్నన లైనఁ జేయఁడు సమగ్రఫలంబులు పెట్టఁ డింతసం
పన్నత నొందెనే తనతపశ్చరణాప్రతిమప్రభావముల్. 461

ఆ. వారిఁ గోరు చున్నవారికి శీతల,వారి యిడుట యెట్టివారి కయిన
వారితంబు గాని వలసినధర్మంబు. వారి యిడఁడు [2]దాహవారి గాఁడు. 462

చ. అని మనుజేశ్వరుండు మృగయావసరాగతతోయదాహసం
జనితదురంతరోషమున సంయమి దన్నుఁ దిరస్కరించి పూ
జనములు సేయఁ డంచు మృతసర్పము నొక్కటి వింటికొప్పునం
బనివడి తెచ్చి వైచె నటు బ్రహ్మమునీంద్రునియంసవేదికన్. 463

వ. ఇట్లతండు [3](*ప్రత్యాహృతబాహ్యాంతరింద్రియుం డగుట నిమీలితలోచనుండు గా నోపునో యట్లు గాక గతాగతు లగుక్షత్రబంధులచే నేమి యని మృపాసమాధినిష్ఠుండు గా నోపునో యని వితర్కించుచు) వృథారోషదర్పంబున ముని మూఁపున గతాసువయినసర్పంబు నిడి నరేశ్వరుండు దనపురంబునకుం జనియె నంత సమీపవర్తు లైనమునికుమారు లంతయుం దెలియం జూచి శమీకనందనుం డైనశృంగికడకుం జని. 464

—శమీకపుత్రుం డగుశృంగి పరీక్షితుని శపించుట.—

క. నరగంధగజస్యందన, తురగంబుల నేలురాజు తోయాతురుఁ డై
పరఁగ నీజనకునిమెడ, నురగముఁ దగిలించి పోయె నోడక తండ్రీ. 465

వ. అని పలికిన సమానవయోరూపమునికుమారలీలాసంగి యయినశృంగి శృంగంబులతోడిమూర్తి [4]ధరియించినట్లు విజృంభించి రోషసంరంభంబున నదరిపడి [5]*బల్యన్నంబుల భుజించి పుష్టంబు లగుపరపుష్టంబులుం బోలె బలిసియు ద్వారంబులం గాచికొని యుండుసారమేయంబులపగిది దాసభూత లగుక్షత్రియాభాసు లెట్లు బ్రాహ్మణోత్తములచే స్వరక్షకులుగ నిరూపితు లయి రట్టివార లెట్లు తద్గృహంబుల భాండసంగతం బగునన్నంబు భుజింప నర్హు లగుదురు తత్కృతంబు లయినద్రోహంబు లెట్లు నిజస్వామిం జెందు నని మఱియు) ని ట్లనియె. 466

1. 'సమాధి నుండి హరిచింతాపరుం డై' అని వ్రాఁతప్రతులు.

2. ధర్మ♦వారి గాఁడు.

3. 5 (*) ఇవి మూలానుసారముగాఁ జేర్పఁబడినవి.

4. ధరియించి విజృంభించురోషరసంబుధంగి నదరి.

ఉ. ఆడఁడు తన్ను దూషణము । లాశ్రమవాసులఁ గాని వైరులం
గూడఁడు కందమూలములు । గూడు గఁ దించు సమాధినిష్ఠుఁ డై
వీడఁడు లోనిచూడ్కులను । విష్ణునిఁ దక్కఁ బరప్రపంచముం
జూడఁడు మద్గురుండు ఫణిఁ । జుట్టఁగ నేటికి రాచవానికిన్. 467

ఉ. హోము హిరణ్యదానములఁ । బుచ్చుకొనంగ ధనంబు లేమియుం
దేము సవంచనంబులుగ । దీవన లిచ్చుచు వేసరింపఁ గా
రాము వనంబులన్ గృహవి।రాములమై నివసింపఁ జెల్ల రే
పామును వైవఁగాఁ దగునె । బ్రహ్మమునీంద్రభుజార్గళంబునన్. 468

క. పుడమిఁ గలజనులు వోగడఁగఁ, గుడుతురు గట్టుదురు గాక । కువలయపతులై
యడవుల నిడుమలఁ బడియెడి, బడుగులమెడ నిడఁగఁ దగునె । పన్నగశవమున్

క. భగవంతుఁడు గోవిందుఁడు, జగతిం బెడఁబాసి చనిన । శాసింపంగాఁ
దగువారు లేమి దుర్జను, లెగసి మహాసాధుజనుల । నేఁచెద రకటా. 470

క. బాలకులార ధరిత్రీ, పాలకు శపియింతు ననుచు । బలువడిని విలో
లాలకుఁ డగుమునికుంజర, బాలకుఁ డరిగెం ద్రిలోక।పాలకు లదరన్. 471

వ. ఇట్లు రోషించి కౌశికీనదికిం జని జలోపస్పర్శనంబు సేసి. 472

ఉ. ఓడక వింటికోపున మృ।తోరగముం గొని వచ్చి మాఱుమా
టాడక యున్నమజ్జనకు।నంసతలంబునఁ బెట్టి దుర్మద
క్రీడఁ జరించురాజు హర।కేశవు [1]లొడ్డిననైనఁ జచ్చుఁ బో
యేడవనాఁడు తక్షకఫ।ణీంద్రవిషానలహేతిసంహతిన్. 473

వ. అని శమీకమహామునికుమారుం డయినశృంగి పరీక్షిన్నరేంద్రుని శపియించి నిజాశ్రమంబునకుం జనుదెంచి కంఠలగ్నకాకోదరకళేబరుం డైనతండ్రిం జూచి. 474

క. ఇయ్యెడ నీకంఠమునకు, నియ్యురగశవంబుఁ దెచ్చి । [2]యీ నేర్చినయా
దయ్య మిఁక నేమి సేయదు, నెయ్యంబులు లేవు సుమ్ము । నృపులకుఁ దండ్రీ. 475

శా. ప్రారంభంబున వేఁట వచ్చి ధరణీ।పాలుండు మాతండ్రిపై
నేరం బేమియు లేక సర్పశవమున్ । నేఁ డుగ్రుఁ డై వైచినాఁ
డీరీతిన్ ఫణి గ్రమ్మఱన్ బ్రదుకునో । హింసించునో కోఱలన్
రా రే తాపసులార దీనిఁ దివరే । రక్షింపరే మ్రొక్కెదన్. 476

వ. అని వెఱపున సర్పంబుఁ దిగుచనేర్పులేక యెలుంగెత్తి యేడ్చుచున్నకుమారకు రోదనధ్వని విని యాంగిరసుం డయినశమీకుండు సమాధి సాలించి మెల్లన కన్నులు దెఱచి మూఁపున వ్రేలు చున్నమృతోరగంబు నీక్షించి తీసి పాఱవైచి కుమారకుం జూచి. 477

1. లాఁగినఁ జచ్చు నేఁటితో, నేడవ. 2. యీ నేర్చిన యా, దయ్య మిఁక నేమి సేయుదు.

క. ఏకీడు నాచరింపము, లోకులకున్ మనము సర్వ । లోకసములమున్
శోకింప నేల పుత్రక, కాకోదర మేల వచ్చెఁ । గంఠంబునకున్. 478

వ. అని యడిగినఁ దండ్రికిం గొడుకు రాజు వచ్చి సర్పంబు వైచుటయుం దాను శపించుటయును వినిపించిన నమ్ముని దనదివ్యజ్ఞానంబున నమ్మానవేంద్రుండు పరీక్షిన్నరేంద్రుం డని యెఱింగి కొడుకువలన సంతసింపక యి ట్లనియె. 479

క. బెట్టిద మగుశాపమునకు, దట్టపుద్రోహంబు గాదు । ధరణీకాంతుం
గట్టా యేల శపించితి, పట్టీ తక్షకవిషాగ్ని । పా లగు మనుచున్. 480

ఆ. తల్లికడుపులోన । దగ్ధుఁడై క్రమ్మఱఁ, గమలనాభుకరుణఁ । గలిగినాఁడు
బలిమి గలిగి ప్రజలఁ । బాలించుచున్నాఁడు, దిట్టపడుచ రాజుఁ । దిట్టఁ దగునె.

ఉ. కాపరి లేనిగొఱ్ఱియల । కై వడిఁ గంటకచోరకోటిచే
నే పఱియున్న దీభువన । మీశుఁడు కృష్ణుఁడు లేమి నిట్టిచో
భూపరిపాలనంబు సమ । బుద్ధి నితం డొనరింపఁ జెల్లరే
యీపరిపాటిద్రోహమున । కిట్లు శపింపఁగ నేల బాలకా. 482

సీ. పాపంబు నీచేతఁ । బ్రాపించె మన కింక, రాజు నశించిన । రాజ్యమందు
బలవంతుఁ డగువాఁడు । బలహీనుపశుదార, హయసువర్ణాదుల । నపహరించు
జారచోరాదులు । సంచరింతురు ప్రజ, కన్యోన్యకలహంబు । లతిశయిల్లు
వైదికం బై యున్న । వర్ణాశ్రమాచార, ధర్మ మించుక లేక । తప్పి పోవు

ఆ. నంతమీఁద లోకు । లర్థకామంబులఁ, దగిలి సంచరింప । ధరణి నెల్ల
వర్ణసంకరములు । వచ్చు మర్కటసార, మేయములకు వచ్చుమేరఁ బుత్ర. 483

ఉ. భారతవంశజుం బరమ । భాగవతున్ హయమేధయాజి నా
చారపరున్ మహానయవి । శారదు రాజకులైకభూషణున్
నీరము గోరి నేఁడు మన । నేలకు వచ్చినయర్థి భక్తి స
త్కారము సేసి పంపఁ జనుఁ । గాక శపింపఁగ నీకు ధర్మమే. 484

క. భూపతికి నిరపరాధమ, శాపము దా నిచ్చె బుద్ధి । చాపలమున మా
పాపఁడు వీఁ డొనరించిన, పాపము దొలఁగింపు కృష్ణ । పరమేశ హరీ. 485

క. పొడిచినఁ దిట్టినఁ గొట్టినఁ, బడుచుందురు గాని పరమ । భాగవతులు దా
రొడఁబడరు మాఱు సేయఁగఁ, గొడుకా విభుఁ డెగ్గు సేయఁ । గోరఁడు నీకున్

క. [1]చెలఁగరు కలఁగరు సాధులు, మిళితము లయి పరులవలన । మేలుం గీడున్
నెలకొనిన నైన నాత్మకు, నొలయవు సుఖదుఃఖచయము । లుగ్రము లగుచున్.

వ. అని యిట్లు శమీకమహామునీంద్రుండు గ్రమ్మఱింప శక్తి లేనికొడుకు సేసినపాపంబునకు సంతాపంబు నొంది తనశిష్యు నొకమునికుమారునిం బిలిచి యోతద్వృత్తాంతం బంతయు రాజున కెఱింగించి రమ్మని పంచె నంత నాయభిమన్యు

1. తలఁగరు.

పుత్త్రుండు శమీకమునిశిష్యునివలన శాపవృత్తాంతంబు విని కామక్రోధాదివిష
యాసక్తుం డగుతనకుం దక్షకవిషాగ్ని విరక్తిబీజం బగు ననుచుఁ గరినగరంబున
కుం జనియె నంతంబున. 488

పరీక్షిత్తుఁడు విప్రశాపం బెఱింగి ప్రాయోపవిష్టుం డగుట.

ఉ. ఏటికి వేఁట వోయితి మునీంద్రుఁడు గాఢసమాధి నుండఁగా
నేటికిఁ దద్భుజాగ్రమున నేసితి సర్పశవంబుఁ దెచ్చి నే
నేటికిఁ బాపసాహసము లీక్రియఁ జేసితి దైవయోగమున్
దాఁటఁగ రాదు వేగిరమ తథ్యము గీడు జనించు ఘోరమై. 489

ఉ. పామువిషాగ్నికీలములఁ బ్రాణము లేఁగిన నేఁగుఁ గాక యీ
భూమియు రాజ్యభోగములుఁ బోయిన నిప్పుడ పోవుఁ గాక సౌ
దామినిఁ బోలుజీవనముఁ దథ్యముగాఁ దలపోసి యింక నే
నే మని మాఱు దిట్టుదు మునీంద్రకుమారకు దుర్నివారకున్. 490

ఆ. రాజ ననుచుఁ బోయి రాజ్యగర్వంబున, వనముకొఱకు వారివనము సొచ్చి
దండశూకశవముఁ దండ్రిపై వైచినఁ, బోలియఁ దిట్ట కేల పోవు సుతుఁడు.

క. గోవులకును బ్రాహ్మణులకు, దేవతలకు నెల్లప్రొద్దుఁ దెంపునఁ బీడల్
గావించుపాపమానస, మేవిధమునఁ బుట్టకుండ నే వారింతున్. 492

వ. అని వితర్కించి. 493

క. దామోదరపదభక్తిం, గామాదుల గెల్చినాఁడు గావునఁ గరుణన్
భూమీశుఁ డలుగఁ డయ్యెను, సామర్థ్యము గలిగి దోషసంగిన్ శృంగిన్. 494

వ. అంత మునికుమారుండు శపించినవృత్తాంతంబు దక్షకుండు విని యెడరు వేచి
యుండె నిట తక్షకవ్యాళవిషానలజ్వాలాజాలంబునం దనకు సప్తమదినంబున
మరణం బని యెఱింగినవాఁడు గావున భూపాలుండు భూలోకస్వర్గలోకభోగం
బులు హేయంబు లని తలంచి రాజ్యంబు విసర్జించి నిరశనత్వదీక్షాచరణంబు
సంకల్పించుకొని. 495

మ. తులసీసంయుతదైత్యజిత్పదరజస్స్తోమంబుకంటెన్ మహో
జ్జ్వల మై దిక్పతిసంఘసంయుతజగత్సౌభాగ్యసంపాది యై
కలిదోషావళి నెల్లఁ బాపెడివియద్గంగాప్రవాహంబులో
పలికిం బోయి మరిష్యమాణుఁ డగుచుం బ్రాయోపవేశంబునన్. 496

క. చిత్తము గోవిందపదా, యత్తముఁ గావించి మౌని యై తనలో నే
తత్తఱము లేక భూవర, సత్తముఁడు వసించె ముక్తసంగత్వమునన్. 497

వ. ఇట్లు పాండవపౌత్త్రుండు ముకుందచరణారవిందవందనానందకందాయమాన
మానసుం డై విష్ణుపదీతీరంబునం బ్రాయోపవేశంబున నుండుట విని సకలలోక

పావనమూర్తులు మహానుభావులు నగుచుఁ దీర్థంబులకుం దీర్థత్వంబు నొసంగ సమర్థు లైన యత్రి విశ్వామిత్ర మైత్రేయ భృగు వసిష్ఠ పరాశర చ్యవన భరద్వాజ పరశురామ దేవల గౌతమ కశ్యప కవష కణ్వ కలశసంభవ వ్యాస పర్వతనారదప్రముఖు లైన బ్రహ్మర్షి దేవర్షి రాజర్షిపుంగవులును గాండర్షు లయిన యరుణాదులును మఱియు నానాగోత్రసంజాతు లైన మునులును శిష్యప్రశిష్యసమేతు లై చనుదెంచిన వారలకుఁ బ్రత్యుత్థానంబు సేసి పూజించి దండప్రణామంబు లాచరించి కూర్చుండ నియోగించి. 498

క. క్రమ్మఱ నమ్మునివిభులకు, నమ్మనుజేంద్రుండు మ్రొక్కి హర్షాశ్రుతతుల్
గ్రమ్మఁగ ముకుళితకరుఁ డై, సమ్మతముగఁ జెప్పె నాత్మసంచారంబున్. 499

ఉ. ఓపిక లేక చచ్చినమహోరగముం గొని వచ్చి కోపి నై
తాపసుమూఁపుపై నిడినదారుణచిత్తుఁడ మత్తుఁడన్ మహా
పాపుఁడ మీరు పాపతృణపావకు లుత్తము లయ్యలార నా
పాపము వాయుమార్గముఁ గృపాపరులార విధించి చెప్పరే. 500

ఉ. భూసురపాదరేణువులు పుణ్యులఁ జేయు నరేంద్రులన్ ధరి
త్రీసురులార మీచరణరేణుకణంబులు మేను సోఁకి నా
చేసినపాప మంతయు నశించెఁ గృతార్థుఁడ నైతి నద్ది గాఁ
జేసిన ముక్తిపద్ధతికిఁ జెచ్చెరఁ బోవఁగ వచ్చుఁ జెప్పరే. 501

క. శీకరతరసంసార, వ్యాకులతఁ [1]విసిగి దేహవర్జనగతి నా
లోకించునాకుఁ దక్షక, కాకోదరవిషము ముక్తికారణ మయ్యెన్. 502

క. ఏపారునహంకార, వ్యాపారములందు మునిఁగి వర్తింపంగా
నాపాలిటిహరి భూసుర, శాపవ్యాజమున ముక్తిసంగముం జేసెన్. 503

మ. ఉరగాధీశువిషానలంబునకు మే నొప్పింతు శంకింప నీ
శ్వరసంకల్పము నేఁడు మానదు భవిష్యజ్జన్మజన్మంబులన్
హరిచింతారతియున్ హరిప్రణుతిభాషాకర్ణనాసక్తియున్
హరిపాదాంబుజసేవయుం గలుగ మీ రర్థిం బ్రసాదింపరే. 504

క. చూడుఁడు నాకల్యాణము, పాడుఁడు గోవిందుమీఁదిపాటలు [2]దయతోఁ
నాడుఁడు హరిభక్తులకథ, లే డహములలోన ముక్తి కేఁగెద నిచటన్. 505

క. అమ్మా నినుఁ జూచినవరుఁ, బొమ్మా యని ముక్తికడకుఁ బుత్తు వఁట కృపన్
లెమ్మా నీరూపముతోఁ, రమ్మా నా కెదుర గంగ రమ్యతరంగా. 506

వ. అని తనకు మీఁద నయ్యెడిజన్మాంతరంబులందును హరిపాదభక్తిసౌజన్యంబులు సంధిల్లుంగాత మని గంగాతరంగిణీదక్షిణకూలంబునం బూర్వాగ్రదర్భాసనంబున నుత్తరాభిముఖుండై [3]యుపవేశించి జనమేజయు రప్పించి రాజ్యభారంబు సమ

1. విఁగి. 2. దమితోఁ. 3. కూర్చుండి.

ర్పించి [1]యత్నంబు సంసారబంధంబునకుఁ దప్పించి చిత్తంబు హరికినొప్పించి పర
మభాగవతుం డైనపాండవపౌత్రుండు ప్రాయోపవిష్టుం డై యున్నసమయంబున.

క. ఒత్తిలి పొగడుచు సురలు వి, యత్తలమున నుండి మెచ్చి యలరులవానల్
ముత్తము లై కురిసిరి నృప, సత్తముపై భూరిభేరిశబ్దంబులతోన్. 508

వ. ఆసమయంబున సభాసీను లయినఋషు లి ట్లనిరి. 509

మ. క్షితినాథోత్తమ నీచరిత్రము మహాచిత్రంబు మీతాత లు
గ్రతపోధన్యులు విష్ణుపార్శ్వపదవిం గామించి రాజన్యశో
భితకోటీరమణిప్రభాన్వితమహాపీఠంబు వర్జింతు రు
న్నతు లై నీవు మహోన్నతుండవు గదా నారాయణధ్యాయి వై. 510

మ. వసుధాధీశ్వర నీవు మర్త్యతనువున్ వర్జించి నిశ్శోక మై
వ్యసనచ్ఛేదక మై రజోరహిత మై వర్తించులోకంబు స
ర్వసమత్వంబునఁ జేరునంతకు భవద్వాక్యంబులన్ వించు నే
డెసకుం బోవక చూచు చుండెదము నీదివ్యప్రభావంబులన్. 511

వ. అని యిట్లు పక్షపాతశూన్యంబులును మహనీయమాధుర్యగాంభీర్యసౌజన్యధు
ర్యంబులును నైనభాషణంబు లాడుచు మూఁడులోకంబులకు నవ్వలి దై సత్య
లోకంబునందు మూర్తిమంతంబు లై [2]నెగడుచున్ననిగమంబులచందంబునం
దేజరిల్లుచున్నఋషులం జూచి భూవరుండు నారాయణకథాశ్రవణకుతూహలుం
డయి నమస్కరించి యి ట్లనియె. 512

క. ఏడుదినంబుల ముక్తిం, గూడఁగ నేరీతి వచ్చు గురుసంసార
క్రీడన మేక్రియ నెడతెగుఁ, జూడుఁడు మాతండ్రులార [3]శ్రుతివచనములన్.

శా. ప్రాప్తుల్ పెద్దలు బ్రహ్మబోధనకళాపారీణు లాత్మప్రభా
లుప్తాజ్ఞానమహాంధకారులు దయాళుత్వాభిరాముల్ మనో
గుప్తంబుల్ సకలార్థజాలములు మీకుం గాన వచ్చుం గదా
సప్తాహంబుల ముక్తి కేఁగెడుగతిం జర్చించి భాషింపరే. 514

వ. అని యుత్తరానందనుం డాడినవచనంబులకు మును లందఱుఁ బ్రత్యుత్తరంబు
విమర్శించునెడ దైవయోగంబున. 515

శుకమహర్షి పరీక్షిన్మహారాజునొద్ద కేతెంచుట

సీ. ప్రతినిమేషముఁ బరబ్రహ్మంబు వీక్షించి, మదిఁ జొక్కి వెలుపల మఱచువాఁడు
కమలంబుమీఁదిభృంగములకై వడి మోము, పై నెఱసినకేశపటలివాఁడు
గెఱ వ్రాసి మాయ నంగీకరించినభంగి, వసనంబుఁ గట్టక వచ్చువాఁడు
సంగి గాఁ డని వెంటఁ జాటుభూతములు నా, బాలురహాసశబ్దములవాఁడు

తే. మహితపదజానుజంఘోరుమధ్యహస్త, బాహువక్షోగళాననఫాలకర్ణ

---

1 యత్నంబున సంసారబంధంబుఁ దప్పించి. 2 నిగమించు. 3 శ్రుతివచనంబుల్.

నాసికాగండమస్తకనయనయుగళుఁ, డైనయవధూతమూర్తివాఁ డరుగుదెంచె.

ఉ. ఈ రని లోకులం గినిసి యెగ్గులు వల్కనివాఁడు కోరికల్
గోరనివాఁడు గూటువలఁ గూడనివాఁడు వృథాప్రపంచముం
జేరనివాఁడు దైవగతిఁ జేరినలాభముఁ జూచి తుష్టుఁడై
నేరనివానిచందమున నేర్పులు సూపనివాఁడు వెండియున్. 517

ఆ. అమ్మహాత్ము [1]షోడశాబ్దవయోరూప, గమనగుణవిలాసకౌశలములు
ముక్తికాంత సూచి మోహితయగునన, నితరకాంత లెల్ల నేమి సెప్ప. 518

ఆ. వెఱ్ఱితనము మాని విజ్ఞానమూర్తియై, బ్రహ్మభావమునను [2]బర్యటింప
వెఱ్ఱి యంచు శుకునివెంట నేతెంతురు, వెలఁదు లర్భకులును వెఱ్ఱు లగుచు.

వ. ఇట్లు వ్యాసనందనుం డైనశుకుం డరుగుదెంచిన నందలిమునీంద్రు లమ్మహానుభా
వుని ప్రభావంబు తెఱం గెఱుంగుదురు గావున నిజాసనంబులు డిగ్గి ప్రత్యుత్థా
నంబు సేసిరి పాండవపౌత్రుండు నా యోగిజనశిఖామణికి నతిథిసత్కారంబులు
గావించి దండప్రణామంబు సేసి పూజించె మఱియు గ్రహనక్షత్రతారకామ
ధ్యంబునం దేజరిల్లు రాకాసుధాకరుండునుం బోలె, బ్రహ్మర్షి దేవర్షి రాజర్షి మధ్యంబు
నం గూర్చుండి విరాజమానుం డైనశుకయోగీంద్రుం గనుంగొని. 520

ఉ. ఫాలము నేల మోపి భయభక్తులతోడ నమస్కరించి భూ
పాలకులోత్తముండు కరపద్మములన్ ముకుళించి నేఁడు నా
పాలిటిభాగ్య మెట్టిదియొ పావనమూర్తివి పుణ్యకీర్తి వీ
వేళకు నీవు వచ్చితి వివేకవిభూషణ దివ్యభాషణా. 521

మ. అవధూతోత్తమ మంటి నేఁడు నిను డాయం గంటి నీవంటివి
ప్రవరుం జేర్కొనునంతటన్ భసిత మౌఁ బాపంబు నాబోఁటికిన్
భవదాలోకనభాషణార్చనపదప్రక్షాళనస్పర్శనా
దివిధానంబుల ముక్తి చేపడుట చింతింపంగ నాశ్చర్యమే. 522

క. హరిచేతను దనుజేంద్రులు, ధరఁ ద్రుంగెడుభంగి నీపదస్పర్శముచే
గురుపాతకసంఘంబులు, [3]పొరిమాలుఁ గదయ్య యోగిభూషణ వింటే. 523

మ. ఎలమిన్ మేనమఱంది యై సచివుఁడై యే మేటి మాతాతలన్
బలిమిం గాచి సముద్రముద్రితధరం బట్టంబుఁ గట్టించె న
య్యలఘుం డీశుఁడు చక్రరక్షకుఁడు గా కన్యుల్ విపద్రక్షకుల్
గలరే వేఁడెద భక్తి నాగుణనిధిం గారుణ్యవారాన్నిధిన్. 524

సీ. అవ్యక్తమార్గుండ వైననీదర్శన, మాఱడిఁ బో నేర దభిమతార్థ
సిద్ధి గావించుట సిద్ధంబు నేఁ డెల్లి, దేహంబు వర్జింతు దేహధారి
కేమి చింతించిన నేమి జపించిన, నేమి గావించిన నేమి వినిన

---

1 'మందహాసవయో' అని వ్రాఁతప్రతులు. 2 బరిభవింప. 3 పొరిదూలుఁ.

నేమి సేవించిన నెన్నఁడు సంసార, పద్ధతిఁ బాసినపదవి గలుగు
తే. నుండు మన కాదు గురుఁడవు యోగివిభుఁడ, వావుఁబిదికినతడ వెంతయంత సేపు
గాని యొకదెస నుండవు కరుణతోడఁ, జెప్పవే తండ్రి ముక్తికిఁ జేరు తెరువు.
వ. అని పరీక్షిన్నరేంద్రుండు బాదరాయణి నడిగె నని చెప్పి. 526
క. రాజీవపత్త్రలోచన, రాజేంద్రకిరీటఘటితరత్నమరీచి
భ్రాజితపాదాంభోరుహ. భూజనమందార నిత్యపుణ్యవిచారా. 527
మా. అనుపమగుణహారా హన్యమానారివీరా, జనవినుతవిహారా జానకీచిత్తచోరా
దనుజఘనసమీరా దానవశ్రీవిదారా, ఘనకలుషకఠోరా కంధిగర్వాపహారా.

గద్యము. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్యప్రణీతం బైన శ్రీమహాభాగవతం బనుమహాపురాణంబునందు నైమిశారణ్యవర్ణనంబును శౌనకాదులప్రశ్నంబును సూతుండు నారాయణకథాసూచనంబు సేయుటయు వ్యాసచింతయు నారదాగమనంబును నారదునిపూర్వకల్పవృత్తాంతంబును బుత్రశోకాతుర యైనద్రుపదరాజనందన కర్జునుం డశ్వత్థామం దెచ్చి యొప్పగించి గర్వపరిహారంబు సేయించి విడిపించుటయు భీష్మనిర్యాణంబును ధర్మనందనురాజ్యాభిషేకంబును గోవిందునిద్వారకాగమనంబును విరాటకన్యాగర్భవిద్యమానుం డైనయర్భకు నశ్వత్థామ బాణానలంబువలనం బాపి విష్ణుండు రక్షించుటయుఁ బరీక్షిజ్జన్మంబును గాంధారీధృతరాష్ట్రవిదురులనిర్గమంబును నారదుండు ధర్మజునకుఁ గాలసూచనంబు సేయుటయుఁ గృష్ణనిర్యాణంబు విని పాండవులు మహాపథంబునం జనుటయు నభిమన్యుపుత్త్రుండు దిగ్విజయంబు సేయుచు శూద్రరాజలక్షణలక్షితుం డగు కలిగర్వంబు సర్వంబు మాపి గోవృషాకారంబుల నున్నధరణీధర్మదేవతల నుద్ధరించుటయు శృంగిశాపభీతుం డై యుత్తరానందనుండు గంగాతీరంబునం బ్రాయోపవేశంబున నుండి శుకసందర్శనంబు సేసి మోక్షోపాయం బడుగుటయు ననుకథలం గలప్రథమస్కంధము. 529

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

శ్రీ

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

ద్వితీయస్కంధము.

మద్భక్తచకోరక
సోమ వివేకాభిరామ సురవినుతగుణ
స్తోమ నిరలంకృతాసుర
రామాసీమంతసీమ రాఘవరామా. 1

వ. మహనీయగుణగరిష్ఠు లగుసమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డైనసూతుం డి ట్లనియె నట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 2

—శుకుఁడు పరీక్షిత్తునకు ముక్తిమార్గము చెప్పుట.—

సీ. క్షితిప నీప్రశ్నంబు సిద్ధంబు మంచిది, యాత్మవేదులు మెత్తు రఖిలశుభద
మాకర్ణనీయంబు లయుతసంఖ్యలు గల [1]వందులోపల నిది యధికతరము
గృహములలోపల గృహమేధు లగునరు, లాత్మతత్త్వము [2]లేశమైన నెఱుఁగ
రంగనారతుల నిద్రాసక్తిఁ జను రాత్రి, పోవుఁ గుటుంబార్థబుద్ధి నహము
ఆ. పశుకళత్రపుత్రబాంధవదేహాది, సంఘ మెల్లఁ దమకు సత్య మనుచుఁ
గాఁపురములు సేసి కడపటఁ జత్తురు, కనియుఁ గాన రంతకాలసరణి. 3
క. కావున సర్వాత్మకుఁడు మహావిభవుఁడు విష్ణుఁ డీశుఁ డాకర్ణింపన్
సేవింపను వర్ణింపను, భావింపను భావ్యుఁ [3]డభవభాజికి నధిపా. 4
ఆ. జనుల కెల్ల శుభము సాంఖ్యయోగము దాని,వలన ధర్మనిష్ఠవలన నయిన
నంతకాలమందు హరిచింత సేయుట, పుట్టువునకు ఫలము భూవరేంద్ర. 5
తే. అరసి నిర్గుణబ్రహ్మంబు నాశ్రయించి
విధినిషేధ[4]నివృత్తి సద్విమలమతులు
సేయు చుందురు హరిగుణచింతనములు
మానసంబుల నెప్రొద్దు మానవేంద్ర. 6

---

1 వందు ముఖ్యం బిది. 2 లు నింతైన నెఱుఁగ. 3 డుభయ. 4 ను లెల్ల నిర్విమల.

సీ. ద్వైపాయనుఁడు నాదుతండ్రి ద్వాపరవేళ, బ్రహ్మసమ్మిత మైన భాగవతముఁ
బఠనంబు సేయించె బ్రహ్మతత్పరుఁడ నై, యుత్తమశ్లోకలీలోత్సవమున
నాకృష్టచిత్తుండ నై పఠించితి నీవు, హరిపాదభక్తుండ వగుటఁ జేసి
యెఱిఁగింతు విన వయ్య యీభాగవతమున, విష్ణుసేవాబుద్ధి విస్తరిల్లు
ఆ. మోక్షకామునకును మోక్షంబు సిద్ధించు, భవభయంబు లెల్లఁ బాసిపోవు
యోగిసంఘమునకు నుత్తమవ్రతములు, వాసుదేవనామవర్ణనములు. 7
తరలము. హరి నెఱుంగక యింటిలో బహుహాయనంబులు మత్తుఁ డై
పొరలు చుండెడివెఱ్ఱి ముక్తికిఁ బోవ నేర్చునె వాఁడు సం
సరణముం బెడఁబాయఁ డెన్నఁడు, సత్య మాహరినామసం
స్మరణ మొక్కముహూర్తమాత్రము చాలు ముక్తిద మానృపా. 8
సీ. కౌరవేశ్వర తొల్లి ఖట్వాంగుఁ డనువిభుం, డిల నేడుదీవుల నేలు చుండి
శక్రాదిదివిజులు సంగ్రామభూముల, నుగ్రదానవులకు నోడి వచ్చి
తమకుఁ దో డడిగిన ధరనుండి దివి కేఁగి, దానవవిభుల నందఱ వధింప
వర మిత్తు మనుచు దేవతలు సంభాషింప, జీవితకాలంబు సెప్పుఁ డిదియ
ఆ. వరము నాకు నొండువర మొల్ల ననవుడు, నాయు వొకముహూర్త మంత దడవు
గల దటంచుఁ బలుక గగనయానమున నయ్యానవేశ్వరుండు మహికి వచ్చి.
క. గిరులం బోలెడికరులను, హరులం దనప్రాణదయిత లైన మనియెడిసుం
దరులను హితవరులను బుధ, వరులను వర్జించి గాఢవైరాగ్యమునన్. 10
క. గోవిందనామకీర్తనఁ, గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి
త్రీవిభుఁడు సూఱ గొనియెను, గైవల్యముఁ దొల్లి రెండుగడియలలోనన్. 11
వ. వినుము నీకు నేడుదివసంబులకుం గాని జీవితాంతంబు గాదు తావత్కాలంబు
నం *(పారలౌకికసాధనభూతం బగు) పరమకల్యాణంబు సంపాదింప వచ్చు నం
తకాలంబు డగ్గఱినం బెగ్గడిలక దేహి దేహపుత్రకళత్రాదిసందోహంబువలని
మోహసాలంబు నిష్కామకరవాలంబున నిర్మూలనంబు సేసి గేహంబు వెడలి
పుణ్యతీర్థజలావగాహంబు సేయుచు నేకాంతశుచిప్రదేశంబున విధివత్ప్రకారం
బునం గుశాజినచేలంబులతోడం గల్పితాసనుండై మానసంబున *(నిఖిలజగత్పవి
త్రీకరణసమర్థం బై) యకారాదిత్రివర్ణకలితం బై బ్రహ్మబీజం బైన ప్రణవంబు
సంస్మరించుచు వాయువుల జయించి విషయంబులవెంట నంటి గెంటి పాఱెడియిం
ద్రియంబుల బుద్ధిసారథి యై మనోనామకంబు లైనపగ్గంబుల బిగ్గఁ బట్టి
మొగ్గం దిగిచి దట్టంబు లైనకర్మఘట్టంబుల నిట్టట్టు మెట్టెడుమనంబును శే
ముషీబలంబున నిరోధించి భగవదాకారంబుతోడ బంధించి నిర్విషయం బైన
మనంబున భగవత్పాదాద్యవయవంబులం గ్రమంబున ధ్యానంబు సేయుచు

*కుండలీకరణములు మూలానుసారముగాఁ జేర్పఁబడినయధిక పాఠము లని మీఁద నెల్లఁ దెలియునది.

రజస్తమోగుణంబులచేత నాక్షిప్తం బైనచిత్తంబు విమూఢం బైన ధారణా వశంబునం దద్గుణంబులవలన నయ్యెడిమలంబులం జెఱిచి నిర్మలచిత్తంబునం బరమం బైనవిష్ణుపదంబునకుం జను ధారణానియమంబున *(సుఖాత్మకం బగు విషయంబు నవలోకించు)యోగికి భక్తిలక్షణంబై నయోగాశ్రయంబున వేగంబ మోక్షంబు సిద్ధించు ననిన యోగీంద్రునకు నరేంద్రుం డి ట్లనియె. 12

క. ధారణ యేక్రియ నిలుచును, ధారణ కేరూప మెద్ది । ధారణ యనఁగా
ధారణ పురుషుమనోమల, మేరీతి హరించు నాకు । నెఱిఁగింపఁ గదే. 13

వ. అనిన విని రాజునకు నవధూతవిభుం డి ట్లనియె. 14

ఆ. పవనము [1]నియమించి । పరిహృతసంగుఁ డై, యింద్రియముల[2]వర్గ । మెల్ల మాపి
హరివిశాలరూప । మందుఁ జిత్తముఁ జేర్చి, నిలుపవలయు బుద్ధి । నెఱపి బుధుఁడు.

వ. వినుము భగవంతుం డైనహరి విరాడ్విగ్రహంబునందు భూతభవిష్యద్వర్తమానం బైనవిశ్వంబు విలోక్యమానంబగు ధరణీసలిలతేజస్సమీరణగగనాహంకారమహత్తత్త్వంబు లనియెడిసప్తావరణంబులచేత నావృతం బగుమహాండకోశం బైనశరీరంబునందు ధారణాశ్రయం బయినవైరాజపురుషుండు దేజరిల్లు నమ్మహాత్మునికిఁ బాదమూలంబు పాతాళంబు పార్ష్ణిభాగపాదాగ్రభాగంబులు రసాతలంబు గుల్ఫంబులు మహాతలంబు జంఘలు తలాతలంబు జానుద్వయంబు సుతలంబు దొడలు వితలాతలంబులు జఘనంబు మహీతలంబు నాభీవివరంబు నభస్తలంబు వక్షంబు గ్రహతారకాముఖజ్యోతిస్సమూహసమేతం బగు [3]సువర్లోకంబు గ్రీవంబు మహర్లోకంబు ముఖంబు జనలోకంబు లలాటంబు దపోలోకంబు శీర్షంబు సత్యలోకంబు బాహుదండంబు లింద్రాదులు గర్ణంబులు దిశలు శ్రవణేంద్రియంబు శబ్దంబు నాసాపుటంబు లశ్విదేవతలు ఘ్రాణేంద్రియంబు గంధంబు వదనంబు వహ్ని నేత్రంబు లంతరిక్షంబు చక్షురింద్రియంబు సూర్యుండు రేవగళ్లు ఱెప్పలు భ్రూయుగ్మవిజృంభణంబు బ్రహ్మపదంబు దాలువులు జలంబులు జిహ్వేంద్రియంబు రసంబు వేదంబులు బ్రహ్మరంధ్రంబు దంష్ట్రలు దండధరుండు దంతంబులు పుత్త్రాదిస్నేహకళలు నగవులు జనోన్మాదకరంబు లయినమాయావిశేషంబులు కటాక్షంబు లనంతసర్గంబులు పెదవులు వ్రీడాలోభంబులు స్తనంబులు ధర్మమార్గంబులు వె న్నధర్మమార్గంబు మేఢ్రంబు ప్రజాపతి వృషణంబులు మిత్త్రావరుణులు జఠరంబు సముద్రంబులు శల్యసంఘంబులు గిరులు నాడీనివహంబులు నదులు దనూరుహంబులు దరువులు నిశ్వాసంబులు వాయువు ప్రాయంబు నిరవధికం బయినకాలంబు [4]గర్మంబులు నానావిధజంతునివహసంవృతసంసరణంబులు శిరోజంబులు మేఘంబులు గట్టు

1 లలయించి. 2 గర్వ ♦ మెల్ల. 3 స్వర్గలోకంబు. 4 లీలావినోదంబులు నానా.

పుట్టంబులు సంధ్యలు హృదయంబు ప్రధానంబు సర్వవికారంబులకు నాశ్రయం
బైనమనంబు చంద్రుండు చిత్తంబు మహత్తత్త్వం బహంకారంబు రుద్రుం [1]డశ్వా
శ్వతర్యుష్ట్రగజంబులు నఖంబులు కటిప్రదేశంబు పశుమృగాదులు విచిత్రంబు
లైన[2]యాలాపనైపుణంబులు పక్షులు బుద్ధి మనువు నివాసంబు పురుషుండు షడ్జ
ములైనస్వరవిశేషంబులు గంధర్వవిద్యాధరచారణాప్సరస్సమూహంబులు స్మృతి
ప్రహ్లాదుండు వీర్యంబు దైత్యదానవానీకం బయి యుండు మఱియు నమ్మహా
విభునకు ముఖంబు బ్రాహ్మణులును భుజంబులు క్షత్త్రియులు నూరులు వైశ్యులును
జరణంబులు శూద్రులును నామంబులు నానావిధంబు లైనవసురుద్రాదిదేవ
తాభిధానంబులును ద్రవ్యంబులు హవిర్భాగంబులును గర్మంబులు యజ్ఞప్రయో
గంబులును నగు నిట్టిసర్వమయుం డైనపరమేశ్వరునివిగ్రహంబు బుద్ధిమంతుం
డై ముముక్షు వైనవాఁడు మనంబున ననుసంధానంబు సేయ వలయు నని
వక్కాణించి వెండియు నిట్లనియె. 16

క. హరిమయము విశ్వ మంతయు, హరి విశ్వమయుండు సంశయము పని లే దా
హరిమయము గాని ద్రవ్యము, పరమాణువు లేదు వంశపావన వింటే. 17

సీ. కలలోన జీవుండు గౌతూహలంబునఁ, బెక్కుదేహంబులఁ బేరు వడసి
యింద్రియంబులవెంట నెల్లవృత్తంబులు, వీక్షించి మఱి తన్ను నెఱుఁగుకరణి
నఖిలాంతరాత్మకుఁ డగుపరమేశ్వరుఁ, డఖిలజీవులహృదయముల నుండి
బుద్ధివృత్తుల నెల్ల బోధి యై వీక్షించు, బంధబద్ధుఁడు గాఁడు ప్రాభవమున

తే. సత్యుఁ డానందబహుళవిజ్ఞానమూర్తి, యతని సేవింప నగుఁగాక యన్యసేవఁ
గలుగ నేరవు కైవల్యగౌరవములు, పాయ దన్నఁడు సంసారబంధ మధిప. 18

మ. బహువర్షంబులు బ్రహ్మ వ్రాల్గి జగ ముత్పాదింప విన్నాణి గా
క హరిప్రార్థనధారణావశమునం గాదే యమోఘోల్లస
న్మహనీయోజ్జ్వలబుద్ధి యై భువననిర్మాణప్రభావంబుతో
విహరించెన్ నరనాథ జంతునివహావిర్భావనిర్ణేత యై. 19

వ. విను మూఢుండు శబ్దమయవేదమార్గం బైనకర్మఫలబోధనప్రకారంబున వ్యర్థం
బు లైనస్వర్గాదినామలోకసుఖంబుల నిచ్ఛయించుచు మాయామయమార్గం
బున వాసనామూలంబున నిద్రించువాఁడు గలలు గను తెఱంగునం బరిభ్రమిం
చుచు నిరవద్యసుఖలాభంబుం జెందఁడు తన్నిమిత్తంబున విద్వాంసుండు నామ
మాత్రసారంబు లగుభోగ్యంబులలోన నెంతట దేహనిర్వాహణంబు సిద్ధించు
నంతియ కైకొనుచు నప్రమత్తుం డై సంసారంబు సుఖం బని నిశ్చయింపక
యొండుమార్గంబున సిద్ధి గల దని చూచి పరిభ్రమణంబు సేయుచుండు. 20

సీ. కమనీయభూమిభాగములు లేకున్నవే, పడియుండుటకు దూదిపఱుపు లేల

---

1 డు నడపులు చతుర్యుగంబులు. 2 శిల్పనైపుణంబులు.

సహజంబు లగుకరాం।జలులు లేకున్నవే, భోజనభాజన।పుంజ మేల
వల్కలాజినకుశా।వళులు లేకున్నవే, కట్టదుకూలసం।ఘంబు లేల
గొనకొని వసియింప। గుహలు లేకున్నవే, ప్రాసాదసౌధాది।పటల మేల
తే. ఫలరసాదులు గురియవే । పాదపములు, స్వాదుజలముల నుండవే । సకలనదులు
పొసఁగ భిక్షలు వెట్టరే । పుణ్యసతులు, ధనమదాంధులకొలు వేల । తాపసులకు.

క. రక్షకులు లేనివారల, రక్షించెద ననుచుఁ జక్రి । రాజై యుండన్
రక్షింపు మనుచు నొకనరు, నక్షముఁ బ్రార్థింప నేల । యాత్మజ్ఞులకున్. 22

వ. అని యిట్లు చిత్తంబున స్వతస్సిద్ధుండును నాత్మయు నిత్యుండును సత్యుండును భగవంతుండును నైనవాసుదేవుని భజియించి తదీయసేవానుభవానందంబున సంసారహేతు వగునవిద్యవలన బుద్ధిమంతుండు విడివడుం గావున. 23

మ. హరిఁ జింతింపక మత్తుఁడై విషయచిం।తాయత్తుఁడై చిక్కి వా
సరముల్ [1]ద్రోసెడువాఁడు కింకరగదా।సంతాడితోరస్కుఁడై
ధరణీశోత్తమ దండభృన్నివసన।ద్వారోపకంఠాగ్రవై
తరణీవహ్నిశిఖాపరంపరలచే । దగ్ధుండు గాఁ గుందునే. 24

క. మొత్తుదురు గదల మంటల, కెత్తుదు రద్దంబు దేహ । మింతింతలుగా
నొత్తుదు [2]రసిపత్త్రికలను, హత్తుదురు కృతాంతభటులు । హరివిరహితులన్. 25

వ. మఱియు హరిచరణకమలగంధరసాస్వాదనం బెఱుంగనివారలు నిజకర్మబంధంబుల దండధరమందిరద్వారదేహళీసమీపజాజ్వల్యమానవైతరణీతరంగిణీదహన దారుణజ్వాలాజాలదందహ్యమానదేహులం గూడి శిఖిశిఖావగాహంబుల నొందుచుండుదురు మఱియు విజ్ఞానసంపన్నులై మనఃప్రపన్నులు మాయాపన్నులు గాక విన్నాణంబునం దమతమహృదయాంతరాళంబులం బ్రాదేశమాత్రదివ్యదేహుండును దిగిభరాజశుండాదండసంకాశదీర్ఘచతుర్బాహుండును గందర్పకోటిసమానసుందరుండును ధృతమందరుండును రాకావిరాజమానరాజమండలసన్నిభవదనుండును సౌభాగ్యసదనుండును ప్రభాతకాలభాసమానభాస్కరబింబప్రతిమానవిరాజితపద్మరాగరత్నరాజీవిరాజమాన కిరీటకుండలుండును శ్రీవత్సలక్షణలక్షితవక్షోమండలుండును రమణీయకౌస్తుభరత్నఖచితకంఠికాలంకృతకంధరుండును నిరంతరపరిమళమిళితవనమాలికాబంధురుండును నానావిధగంభీరహారకేయూరకటకకంకణమేఖలాంగుళీయకవిభూషణవ్రాతసముజ్జ్వలుండును నిటలతటవిలంబమానవిమలస్నిగ్ధనీలకుంచితకుంతలుండును దరుణచంద్రచంద్రికాధవళమందహాసుండును బరిపూర్ణకరుణావలోకనభ్రూభంగసంసూచితసుభగసంతతానుగ్రహలీలావిలాసుండును మహాయోగిరాజవిలసితహృదయకమలకర్ణికామధ్యసంస్థాపితవిలసితచరణకిసలయుండును సంతతానందమ

1. ద్రొబ్బెడువాఁడు. 2 రసిపుత్త్రికలను

యుండును సహస్రకోటిసూర్యసంఘాతసన్నిభుండును మహావిభుండును నైనపరమేశ్వరుని మనోధారణావశంబున నిలిపికొని తదీయగుల్ఫచరణజానుజంఘాద్యవయవంబులం గ్రమంబున నొక్కొకటిని బ్రతిక్షణంబును ధ్యానంబుసేయుచు నెంతకాలంబునకుఁ బరిపూర్ణనిశ్చలభక్తియోగంబు సిద్ధించు నంతకాలంబునుం దదీయచింతాతత్పరు లై యుందు రని మఱియు ని ట్లనియె. 26

సీ. ఆసన్నమరణాగ్రుఁ డైనయతీశుండు, గాలదేశములను గాచికొనఁడు
తనువు విసర్జించుతలఁపు జనించిన, భద్రాసనస్థుఁడై ప్రాణపవను
మనసుచే నిర్జించి మానసవేగంబు, బుద్ధిచే [1]భంగించి బుద్ధిఁ దెచ్చి
క్షేత్రజ్ఞుతోఁ గూర్చి క్షేత్రజ్ఞు నాత్మలోఁ,బలఁ జేర్చి యాత్మను బ్రహ్మమందుఁ
తే. గలిపి యొక్కటి గావించి గారవమున, శాంతితోడ నిరీహుఁడై సకలకార్య
నివహ మెల్లనుడిగి వాఁడు నిత్యసుఖము, వలయు నని చూచునటమీఁద వసుమతీశ.

వ. వినుము పరమాత్మ యైనబ్రహ్మంబునందుఁ గాలదేశసత్త్వరజస్తమోగుణాహంకారమహత్తత్త్వప్రధానంబులకుఁ బ్రభుత్వంబు లేదు కావునం బరమాత్మవ్యతిరిక్తంబు లేదు లే దని సకలం బుత్సర్జనంబుసేసి దేహాదులయం దాత్మత్వంబు విసర్జించి యన్యసౌజన్యంబు మాని పూజ్యం బయినహరిపదంబుం బ్రతిపదంబును హృదయంబున నాలింగనంబు సేసి పరమపదంబు వైష్ణవం బని సత్పురుషులు దెలియుదు రివ్విధంబున విజ్ఞానదర్శనబలంబున నిర్దగ్ధవిషయవాసనుం డై క్రమంబున నిరపేక్షత్వంబున. 28

సీ. అంఘ్రిమూలమున మూలాధారచక్రంబుఁ, బీడించి ప్రాణంబు బిగియఁ బట్టి
నాభితలముఁ జేర్చి నయముతో మెల్లన, హృత్సరోజముమీఁది కెగయఁ బట్టి
యటమీఁద నురమందు హత్తించి క్రమ్మఱఁ, దాలుమూలమునకుఁ దఱిమి నిలిపి
మతముతో భ్రూయుగమధ్యంబుఁ జేర్చి దృ,క్కర్ణనాసాస్యమార్గములు మూసి
ఆ. యిచ్చ లేనియోగి యెలమి ముహూర్తార్ధ, మింద్రియానుషంగ మింత లేక
ప్రాణముల లయించి బ్రహ్మరంధ్రము చించి, బ్రహ్మమందుఁ గలయుఁ గౌరవేంద్ర.

వ. మఱియు దేహత్యాగకాలంబున నింద్రియంబులతోడిసంగమంబు విడువనివాఁడు వానితోడన గుణసముదాయరూపం బగుబ్రహ్మాండంబునందు [2]ఖేచరసిద్ధవిహారయోగ్యంబును నణిమాదికసకలైశ్వర్యసమేతంబును నైనపరమేష్ఠిపదంబుఁ జేరు విద్యాతపోయోగసమాధిభజనంబు సేయుచుఁ బవనాంతర్గతలింగశరీరు లైనయోగీశ్వరులకు బ్రహ్మాండబహిరంతరాళంబులు గతి యని చెప్పుదు రగ్నికి నేరికిం గర్మంబులం బోవరాదు యోగి యగువాఁడు బ్రహ్మలోకంబునకు నాకాశపథంబునం బోవుచు సుషుమ్ననాడివెంట నగ్ని నధిదేవతం జేసి జ్యోతిర్మయం బైనతేజంబున నిర్మలుం డై యెందునుం దగులువడక తారా

1. బంధించి; బంటించి. 2. 'ఖేచ...సమేతంబును గుణసముదాయరూపంబును నైనపరమే. వ్రా.ప్ర.

మండలంబుమీఁద సూర్యాదిధ్రువాంతపదంబులఁ గ్రమక్రమంబున నతిక్ర
మించి హరిసంబంధం బయినశింశుమారచక్రంబుఁ జేరి (యొంటరి యగుచుఁ)
బరమాణుభూతం బయినలింగశరీరంబుతోడ బ్రహ్మవిదులకు నెల వైనమహర్లో
కంబుఁ జొచ్చి మహాకల్పకాలంబు క్రీడించుచుఁ గల్పాంతం బైన ననంతము
ఖానలజ్వాలాజాలదందహ్యమానం బగులోకత్రయంబు నీక్షించుచుఁ దన్నిమి
త్తసంజాతానలదాహంబు సహింపం జాలక. 30

సీ. ఇలమీఁద మనువు లీరేడ్వురుఁ జనువేళ, దివస మై యెచ్చోటఁ దిరుగుచుండు
మహనీయసిద్ధవిమానసంఘము లెందు, దినకరప్రభము లై తేజరిల్లు
శోకజరామృత్యుశోషణభయదుఃఖ,నివహంబు లెందు జనింప కుండు
విష్ణుపదధ్యానవిజ్ఞానరహితుల, శోకంబు లెందుండి చూడ వచ్చుఁ

ఆ. బరమసిద్ధయోగిభాషణామృత మెందు, శ్రవణపర్వ మగుచు జరగుచుండు
నట్టిబ్రహ్మలోకమందు వసించును, రాజవర్య తిరిగి రాఁడు వాఁడు. 31

వ. మఱియు నొక్కవిశేషంబు గలదు పుణ్యాతిరేకంబున బ్రహ్మలోకగతు లైనవారు
కల్పాంతరంబునం బుణ్యతారతమ్యంబుల నధికారవిశేషంబు నొందువార లగు
దురు బ్రహ్మాదిదేవతాభజనంబునం జనువారు బ్రహ్మజీవనంబునకాలంబు బ్రహ్మ
లోకంబున వసియించి ముక్తు లగుదురు నారాయణచరణకమలభక్తిపరాయణ
త్వంబునం జనినవారు నిజేచ్ఛావశంబున నిరర్గళగమనులై బ్రహ్మాండంబు భేదిం
చి మహోన్నతం బగువైష్ణవపదంబు నారోహింతు రీశ్వరాధిష్ఠితం బైనప్రకృ
తియంశంబున మహత్తత్త్వం బగు మహత్తత్త్వాంశంబున నహంకారం బగు
నహంకారాంశంబున శబ్దతన్మాత్రం బగు శబ్దతన్మాత్రాంశంబున గగనం బగు
గగనాంశంబున స్పర్శతన్మాత్రం బగు స్పర్శతన్మాత్రాంశంబున సమీరణం బగు
సమీరణాంశంబున రూపతన్మాత్రం బగు రూపతన్మాత్రాంశంబువలనఁ దేజం బగుఁ
దేజోంశంబున రసతన్మాత్రం బగు రసతన్మాత్రాంశంబువలన జలం బగు జలాంశం
బున గంధతన్మాత్రం బగు గంధతన్మాత్రాంశంబునఁ బృథివి యగు వానిమేళనం
బునం జతుర్దశభువనాత్మకం బైనవిరాడ్రూపంబగు నారూపంబునకుఁ గోటియోజన
విశాలం బైనయండకటాహంబు ప్రథమావరణం బైనపృథ్వియగు దీనిఁ బంచాశ
త్కోటివిశాలం బని కొందఱువలుకుదు రియ్యావరణంబుమీఁద సలిలతేజస్సమీ
రగగనాహంకారమహత్తత్త్వంబు లనియెడియావరణంబులు క్రమంబున నొం
డొంటికి దశగుణోత్తరాధికంబు లై యుండు నట్టియేడింటిమీఁదఁ బ్రకృత్యావర
ణంబున మహావ్యాపకంబగు బ్రహ్మాండంబు భేదించి వైష్ణవపదారోహణంబుసేయు
వాఁడు నిర్భయుండై మెల్లన లింగదేహంబునఁ బృథివ్యాత్మకత్వంబునొంది యట్టి
పృథివ్యాత్మకత్వంబున ఘ్రాణంబున గంధంబును జలాత్మకత్వంబున రసనేంద్రి
యంబున రసంబును దేజోరూపకత్వంబున దర్శనంబునరూపంబును సమీరణాత్మ

కత్వంబున దేహంబున స్పర్శంబును గగనాత్మకత్వంబున శ్రవణంబున శబ్దం
బును నతిక్రమించి భూతసూక్ష్మేంద్రియలయస్థానం బైనయహంకారావరణం
బున సంప్రాప్తుం డై యందు మనోమయంబును దేవమయంబును నైనసాత్త్వి
కాహంకారగమనంబున మహత్తత్త్వంబు సొచ్చి గుణత్రయంబున లయించి
ప్రధానంబునొంది ప్రధానాత్మకత్వంబున దేహంబును నుపాధిపరంపరావస్థానం
బునం బ్రకృతిం బాసి యానందమయుం డై యానందంబునం బరమాత్మరూపం
బైనవాసుదేవబ్రహ్మంబునందుఁ గలయు నని చెప్పి వెండియు ని ట్లనియె. 32

ఆ. పరమభాగవతులు పాటించుపథ మిది, యీపథమున యోగి యేఁగెనేని
మగిడి రాఁడు వాఁడు మఱి సంశయము లేదు, కల్పశతములైనఁ గౌరవేంద్ర.

వ. వినుము నీ వడిగినసద్యోముక్తియుఁ గ్రమముక్తియు ననియెడునీరెండుమార్గం
బులు వేదగీతలందు వివరింపంబడియె వీనిం దొల్లి భగవంతుం డైనవాసు
దేవుండు బ్రహ్మచేత నారాధితుం డై చెప్పె సంసారప్రవిష్టుం డైనవానికిఁ
దపోయోగాదు లయినమోక్షమార్గంబులు పెక్కులు గల వందు భక్తిమార్గం
బుకంటెఁ సులభంబు లేదు. 34

శుకుఁడు పరీక్షిత్తునకు భక్తిమార్గంబె ముఖ్యం బని తెలుపుట.

మ. విను మంభోజభవుండు మున్ను మదిలో వేదంబు ముమ్మాఱు [1]స
మ్మనమందుం దలపోసి యంతయుఁ బరామర్శించి మోక్షంబు ద
క్కినమార్గంబున వెంట లే దనుచు భక్తిం జింత సేసెన్ జనా
ర్దను నాత్మాకృతి నిర్వికారుఁ డగుచున్ దద్వ్యగ్రనిర్ణేత యై. 35

సీ. అఖిలభూతములందు నాత్మరూపంబున, నీశుండు హరి యుండు నెల్లప్రొద్దు
[2]బుద్ధ్యాదిలక్షణంబులఁ గానఁబడును మ,హాత్మ సేవనీయుఁ డహర్నిశంబు
వందనీయుఁడు భక్తవత్సలుం డత్యంత, నియతుఁ డై సతతంబు నియతబుద్ధి
నాత్మరూపకుఁ డగు హరికథామృతమును, గర్ణపుటంబులఁ గాంక్ష దీరఁ
తే. గ్రోలుచుండెడుధన్యులు కుటిలబహుళ, విషయమలినీకృతాంగముల్ వేగవిడిచి
విష్ణుదేవునిచరణారవిందయుగము, కడకుఁ జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర. 36

క. మానుషజన్మము నొందిన, మానవులకు లభ్యమానమరణులకు మహా
జ్ఞానులకుఁ జేయ నలయువి, ధానము నిగదింపఁబడియె ధరణీనాథా. 37

వ. వినుము బ్రహ్మవర్చసకాముఁ డైనవానికి వేదవిభుం డగుచతుర్ముఖుండును నిం
ద్రియపాటవకామునకు నింద్రుండును బ్రజాకామునకు దక్షాదిప్రజాపతులును
భోజనకామునకు నదితియు స్వర్గకామునకు నాదిత్యులును రాజకామునకు విశ్వ
దేవతలును దేశప్రజాసాధనకామునకు సాధ్యులును శ్రీకామునకు దుర్గయుఁ దేజ
స్కామునకు నగ్నియు వసుకామునకు వసువులును వీర్యకామునకు వీర్యప్రదు

1. మర్మనయజ్ఞత్వముతోడ నెంతయు. 2. బుద్ధివిశేషణంబులఁ గానఁ.

లగురుద్రులును నాయుష్కామునకు నాశ్వినదేవతలును బుష్టికామునకు భూమి యుఁ బ్రతిష్ఠాకామునకు లోకమాత లైనగగనభూదేవతలును సౌందర్యకాము నకు గంధర్వులును గామినీకామునకు నప్సరస యైనయూర్వశియు సర్వాధిపత్య కామునకు బ్రహ్మయుఁ గీర్తికామునకు యజ్ఞంబులును విత్తసంచయకామునకుం బ్రచేతసుండును విద్యాకామునకు నుమావల్లభుండును దాంపత్యప్రీతికామునకు నుమాదేవియు ధర్మార్థకామునకు నుత్తమశ్లోకుం డగువిష్ణువును సంతానకాము నకుఁ బితృదేవతలును రక్షాకామునకు యక్షులును బలకామునకు మరుద్గణం బులును రాజత్వకామునకు మనురూపదేవతలును శత్రుమరణకామునకుఁ గోణ పాలకుం డైనరాక్షసుండును భోగకామునకుం జంద్రుండును భజనీయు లగు దురు మఱియును. 38

క. కామింపకయును సర్వముఁ, [1]గామించియు నైన ముక్తిఁ గామించి తగన్
[2]లోమించి పరమపురుషుని, నేమించి [3]భజించుఁ దత్త్వనిపుణుం డధిపా. 39

మ. అమరేంద్రాదులఁ గొల్చుభంగి జనుఁ డాయత్తాత్ము సేవింపఁగా
విమలజ్ఞానవిరక్తిముక్తు లొదవున్ వేయేల భూనాథ! త
త్కమలాధీశకథాసుధారసనదీకల్లోలమాలాపరి
భ్రమ మెవ్వారికి నైనఁ గర్ణయుగళీపర్వంబు గాకుండునే. 40

వ. అని యిట్లు రాజునకు శుకుండు సెప్పె నని విని శౌనకుండు సూతున కిట్లనియె.

క. వరతాత్పర్యముతో నిటు, భరతాన్వయవిభుఁడు శుకునిపలుకులు విని స
త్వరతాయుతుఁ డై శ్రేయ, స్కరతామతి నేమి యడిగెఁ గణుతింపఁ గదే.

క. ఎప్పుడిహరికథ లెయ్యవి, సెప్పెడినో యనుచు మాకుఁ జిత్తోత్కంఠల్
గుప్పలుగొను చున్నవి రుచు, లుప్పతిలన్ నీమనోహరోక్తులు వినఁగన్. 43

వ. అనిన విని సూతుం డి ట్లనియె. 44

క. మూలెడికూఁకటితోడను, బాలురతో నాడుచుండి బాల్యమున మహీ
పాలుఁడు హరిచరణార్చన, హేలలనుఁ దగుచు నుండె నెంతయునియతిన్. 45

వ. అట్టిపరమభాగవతుం డైనపాండవేయునకు వాసుదేవపరాయణుం డైనశుకుం డిట్లనియె. 46

సీ. వాసుదేవశ్లోకవార్త లాలించుచుఁ, గాల మేపుణ్యుండు గడపుచుండు
నతనియాయువుఁ దక్కఁ దక్కినవారలయాయువు, నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించి కొనిపోవువాఁ డది యెఱుఁగక, జీవింతుఁ బెక్కేండ్లు సిద్ధ మనుచు
సంగనాపుత్రగేహారామవిత్తాది, సంసారహేతుకసంగసుఖముఁ

తే. దగిలి వర్తింపఁ గాలంబుదఱచి యడరి, దండధరకింకరులు వచ్చి తాడనములు
సేసి కొనిపోవఁ బుణ్యంబుసేయ నైతిఁ, బాపరతి నైతి నని బిట్టు పలవరించు.

---

1. కామియు నై ముక్తి యైనఁ. 2. నోమించి. 3. పఠించు.

వ. అది గావున. 48

సీ. అలరుజొంపములతో ♦ నభ్రంకషంబులై, బ్రదుకవే వనములఁ ♦ బాదపములు
ఖాదనమేహనా ♦ కాంక్షలఁ బశువులు, జీవింపవే గ్రామ ♦ సీమలందు
నియతిమై నుచ్ఛ్వాస ♦ నిశ్వాసపవనముల్, ప్రాపింపవే చర్మ ♦ భస్త్రికలును
గ్రామసూకరశున ♦ కక్రోష్టు లింటింటఁ, దిరుగవే ¹దుర్యోగ ♦ దీనవృత్తి [వృ

తే. నుష్ట్రఖరములు మోవవే ♦ యురుభరములఁ, బుండరీకాక్షు నెఱుఁగని ♦ పురుషపశు
లడవులందు నివాసము ♦ లందుఁ బ్రాణ, విషయభరయుక్తితో నుంట ♦ విఫల మధిప.

సీ. విష్ణుకీర్తనముల ♦ వినని కర్ణంబులు, గొండలబిలములు ♦ కువలయేశ
చక్రిపద్యంబులఁ ♦ జదువని జిహ్వలు, కప్పలజిహ్వలు ♦ కౌరవేంద్ర
శ్రీమనోనాథు వీ ♦ క్షింపని కన్నులు, కేకిపింఛాక్షులు ♦ కీర్తిదయిత
కమలాక్షుపూజకుఁ ♦ గాని హస్తంబులు, శవముహస్తంబులు ♦ సత్యవచన

ఆ. హరిపదతులసీద ♦ ళామోదరతి లేని, ముక్కు పందిముక్కు ♦ మునిచరిత్ర
గరుడగమనుభజన ♦ గతి లేనిపదములు, పాదపములపాద ♦ పటల మనఘ. 50

సీ. నారాయణుని దివ్య ♦ నామాక్షరములపైఁ, గరఁగనిమనములు ♦ కఠినశిలలు
మురవైరికథలకు ♦ ముదితాశ్రురోమాంచ, మిళితమై యుండని ♦ మేను మొద్దు
చక్రికి మ్రొక్కని ♦ జనుని యౌఁదల నున్న, కనకకిరీటంబు ♦ గట్టెమోపు
మాధవార్పితముగా ♦ మనని మానవుసిరి, వనదుర్గచంద్రికా ♦ వైభవంబు

ఆ. కైటభారిభజన ♦ గలిగి యుండనివాఁడు, గాలిఁబోన నుండి ♦ కదలుశవము
కమలనాభుపదముఁ ♦ గననివాని బ్రదుకు, పసిఁడికాయలోని ♦ ప్రాణి బ్రదుకు. 51

వ. అని యిట్లు పలికిన వైయాసకివచనంబుల కౌత్తరేయుం డానందకందళితహృదయుం డై నిర్మలమతివిశేషంబున. 52

ఆ. సుతుల హితుల విడిచి ♦ చుట్టాల విడిచి యి, ల్లాలి విడిచి బహుబ ♦ లాళి విడిచి
రాజు హృదయమిడియె ♦ రాజీవనయనుపై, ధనము విడిచి జడ్డుఁ ♦ దనము విడిచి.

వ. ఇట్లు మృత్యుభయంబు నిరసించి ధర్మార్థకామంబులు సన్న్యసించి పురుషోత్తము నందుఁ జిత్తంబు విన్యసించి హరిలీలాలక్షణంబు ²లుపన్యసింపు మనుతలంపున నరేంద్రుం డిట్లనియె. 54

క. సర్వాత్ము వాసుదేవుని, సర్వజ్ఞుఁడ వైన నీవు ♦ సంస్తుతి సేయన్
సర్వభ్రాంతులు వదలె మ, హోర్వీసురవర్య మాన ♦ సోత్సవ మగుచున్. 55

సీ. ఈశుండు హరి విష్ణుఁ ♦ డీవిశ్వ మే రీతిఁ, బుట్టించు రక్షించుఁ ♦ బొలియఁ జూచు
బహుశక్తియుతుఁ డగు ♦ భగవంతుఁ డవ్యయుఁ, డాది నేశక్తుల ♦ నాశ్రయించి
బ్రహ్మశక్రాదిరూ ♦ పముల వినోదించెఁ, గ్రమముననో నేక ♦ కాలముననొ
ప్రకృతిగుణంబులఁ ♦ బట్టి గ్రహించుట, నేకత్వమున నుండు ♦ నీశ్వరుండు

---

1 దుర్యోగ్యవిధిన మగు మ. 2 లుపన్యసించి నను.

ఆ. భిన్నమూర్తి యగుచుఁ । బెక్కువిధంబుల, నేల యుండు నతని । కేమి చిక్కు
నుండఁ గున్నఁ దాపసోత్తమ తెలుపవే, వేడ్క నాకు సర్వ । వేది వీవు. 56

వ. అనిన నయ్యుత్తరానందనువచనంబులకు నిరుత్తరుండు గాక సదుత్తరప్రదానకుతూహలుం డై లోకోత్తరగుణోత్తరుం డైన తాపసోత్తముండు దనచిత్తంబున.

మ. పరుఁ డై యీశ్వరుఁ డై మహామహిముఁ డై । ప్రాదుర్భవస్థానసం
హరణక్రీడనుఁ డై త్రిశక్తియుతుఁ డై । యంతర్గతజ్యోతి యై
పరమేష్ఠిప్రముఖామరాధిపులకుం । బ్రాపింప రాకుండు దు
స్తరమార్గంబునఁ దేజరిల్లుహరికిం । దత్త్వార్థి నై మ్రొక్కెదన్. 58

వ. మఱియు సజ్జనదురితసంహారకుండును దుర్జననివారకుండును సర్వరూపకుండును బరమహంసాశ్రమప్రవర్తమానమునిజనహృదయకమలకర్ణికామధ్యప్రదీపకుండును సాత్వతశ్రేష్ఠుండును నిఖిలకల్యాణగుణగరిష్ఠుండును బరమభక్తియుక్తసులభుండును భక్తిహీనజనదుర్లభుండును నిరతిశయనిరుపమనిరవధికప్రకారుండును నిజస్వరూపబ్రహ్మవిహారుండును నైనయప్పరమేశ్వరునకు నమస్కరించెద. 59

ఉ. [1]ఏవిభువందనార్చనము । లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము । లెవ్వనిసంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శు । భ్రాయతవృత్తిఁ జెలంగు నండ్రు నే
నావిభు నాశ్రయించెద న । ఘౌఘనివర్తను భద్రకీర్తనున్. 60

ఉ. ఏపరమేశుపాదయుగ । మెప్పుడుఁ గోరి భజించు నేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయ । లోకములందుల జడ్డుఁ బాసి యే
తాపము లేక బ్రహ్మగతిఁ । దారు జితశ్రము లై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద న । ఘౌఘనివర్తను భద్రకీర్తనున్. 61

చ. తపములఁ జేసి యైన మఱి । దానము లెన్నియుఁ జేసి యైన నే
జపములఁ జేసి యైన ఫల । సంచయ మెవ్వనిఁ జేర్చ కున్న హే
యపదము లై దురంతవిప । దాస్థితి నెప్పుడు నొప్పుచుండు న
య్యపరిమితున్ భజించెద న । ఘౌఘనివర్తను భద్రకీర్తనున్. 62

మ. యవనవ్యాధపుళిందహూణకశకం । కాభీరచండాలసం
భవులుం దక్కినపాపవర్తనులు నే । భక్తాత్ము సేవించి భా
గవతశ్రేష్ఠుల డాసి శుద్ధతను లై । కల్యాణు లై యుండు రా
యవికారుం బ్రభవిష్ణు నాదుమదిలో । నశ్రాంతమున్ మ్రొక్కెదన్. 63

మ. తపముల్ సేసిననో మనోనియతినో । దానవ్రతావృత్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో । సద్భక్తినో యెట్లు ల
భ్యపదుం డౌ నని బ్రహ్మరుద్రముఖరుల్ । భావింతు రెవ్వాని న

---

1 'ఏవిభునామకీర్తనము । లేవిభుచింతయు వందనార్చనల్'. అనియే వ్రాఁతప్రతులు.

య్యపవర్గాధిపుఁ డాత్మమూర్తి సులభుం డేఁ గాక నా కెప్పుడున్. 64

క. శ్రీపతియు యజ్ఞపతియుఁ బ్ర, జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రే, ణీపతియున్ గతియు నైన నిపుణు భజింతున్. 65

మ. అణువో కాక కడున్ మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణుఁడో యటంచు విబుధుల్ గుంఫీభవత్తత్త్వమా
ర్గము లై యావిభుపాదపద్మభజనోత్కర్షంబులం దత్త్వవీ
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్. 66

మ. జగదుత్పాదనబుద్ధి బ్రహ్మకు మదిన్ సంధింప నూహించి యా
భగవంతుండు సరస్వతిం బనుప నాపద్మాస్యదా నవ్విభున్
మగనిం గా [1]నియమించి తద్భువనసామ్రాజ్యస్థితిన్ సృష్టిపా
రగుఁ జేసెన్ మును బ్రహ్మ నట్టిగుణి నారంభింతు సేవింపఁగన్. 67

సీ. పూర్ణుఁ డయ్యును మహాభూతపంచకయోగ,మున మేను లను పురములు సృజించి
పురములలో నుండి పురుషభావంబున, దీపించు నెప్పుడు ధీరవృత్తిఁ
బంచభూతములను బదునొకొండింద్రియ,ములఁ బ్రకాశింపించి భూరిమహిమ
షోడశాత్మకుఁ డన శోభిల్లి జీవత్వ,నృత్తవినోదంబు నెఱపుచుండు

తే. నట్టిభగవంతుఁ డవ్యయుం డచ్యుతుండు, మానసోదితవాక్పుష్పమాలికలను
మంజునవరసమకరందమహిమ లుట్ట, శిష్టహృద్భావలీలలఁ జేయుఁ గాత. 68

ఉ. మానధనుల్ మహాత్ములు సమాధినిరూఢులు యన్ముఖాంబుజ
ధ్యానమరందపానమున నాత్మభయంబులఁ బాసి ముక్తులై
లూనత నొంద రట్టిమునిలోకశిఖామణికిన్ విశంకటా
జ్ఞానతమోనభోమణికి సాధుజనాగ్రణి కేను మ్రొక్కెదన్. 69

వ. అని యిట్లు హరిగురువందనంబు సేసి శుకయోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె.

మ. అవిరోధంబున నీవు నన్నడుగునీయర్థంబు మున్ బ్రహ్మ మా
ధవుచేతన్ విని నారదుం డడిగినం దథ్యంబుగాఁ జెప్పె మా
నవలోకేశ్వర నారదుండు వెనుకన్ నాకుం బ్రసాదించె సం
శ్రవణీయంబు మహాద్భుతంబు వినుమా సందేహవిచ్ఛేది వై. 71

నారదుండు బ్రహ్మను బ్రపంచప్రకారంబు నడుగుట.

వ. నారదుండు బ్రహ్మ కిట్లనియె. 72

మ. చతురాస్యుండవు వేల్పుఁబెద్దవు జగ[2]త్సర్గానుసంధాయి వీ
శ్రుతిసంఘాతము నీముఖాంబుజములన్ శోభిల్లు శబ్దార్థసం
యుత మై సర్వము నీకరామలక మై యుండుం గదా భారతీ
సతి యిల్లాలఁట నీకు నోజనక నాసందేహముం బాపవే. 73

---

[1]వరియించి అని యున్న యెడ నర్థము పొసఁగి యుండు నని తోఁచెడిని. 2 త్సంధానుసంధాయి.

శా. [1]ప్రారంభించువివేక మెవ్వఁ డొసఁగుం బ్రారంభసంపత్తి కా
ధారం బెయ్యది యేమిహేతువు యదర్థం బేస్వరూపంబు సం
సారానుక్రమ మూర్ణనాభిపగిదిం జాగించె దొక్కప్పుడుం
బారం బెన్నఁడు లేదు నీమనువు దుష్ప్రాపంబు వాణీశ్వరా. 74

శా. నాకుం జూడఁగ నీవు రాజ వను చున్నాఁడన్ యథార్థస్థితిన్
నీకంటెన్ ఘనుఁ డొక్కరాజు గలఁడో నీ వంతకున్ రాజవో
నీ కేలాభము రాఁ దలంచి జగముల్ నిర్మించె దీచేతనా
నీకం బెందు జనించు నుండు నడఁగున్ నిక్కంబు భాషింపుమా. 75

మ. సదసత్సంగతి నామరూపగుణదృశ్యం బైనవిశ్వంబు నీ
హృదధీనంబు గదా ఘనుల్ సములు నీ కెవ్వారలున్ లేరు నీ
పద మత్యున్నత మిట్టినీవు తపముం బ్రావీణ్యయుక్తుండ వై
మది నేయీశ్వరుఁ గోరి చేసితివి తన్మార్గంబు సూచింపవే. 76

శా. అంభోజాసన నీకు నీశుఁడు గలం డంటేని దత్పక్షమం
దంభోజాతభవాండ మేవిభునిలీలాపాంగసంభ్రాంతిచే
సంభూతం బగు వర్తమాన మగు సంరక్షన్నం బగుం దద్విభున్
సంభాషింపఁగ వచ్చునేఁ దలఁప నేచందంబువాఁ డాకృతిన్. 77

క. తోయజసంభవ నాకీ, తోయము వివరింపు చాలఁ దోఁచిన నే నా
తోయమువారికి నన్యుల, తోయములం జెంద కుండ ధ్రువ మెఱిఁగింతున్. 78

వ. దేవా భూతభవిష్యద్వర్తమానంబు లగువ్యవహారంబులకు నీవ వల్లభుండవు నీ యెఱుంగనియర్థం బొం డెద్దియు లేదు విశ్వప్రకారంబు వినిపింపు మనిన విని వికసితముఖుం డై విరించి యి ట్లనియె. 79

క. రారా బుధులు విరక్తులు, గారా యీరీతి నడుగఁ గా నేరరు వి
స్మేరావహము భవన్మత, మారా నాపసిఁడిమర్మ మడిగితి వత్సా. 80

శా. నానాస్థావరజంగమప్రకరముల్ నాయంత నిర్మింప [2]వి
జ్ఞానం బేమియు లేక తొట్రుపడఁగా నాకున్ సమస్తానుసం
ధానారంభవిచక్షణత్వము మహోదారంబుగా నిచ్చె ము
న్నే నాయీశ్వరునాజ్ఞఁ గాక జగముల్ నిర్మింప శక్తుండనే. 81

మ. అనఘా విశ్వము నెల్ల దీప్తముగఁ జేయన్ నే సమర్థుండనే
యినచంద్రానలతారకాగ్రహగణం బేరీతి నారీతి నె
వ్వనిదీప్తిం బ్రతిదీప్త మయ్యె నఖిలవ్రాతంబు దద్దీప్తిచే
ననుదీప్తం బగు నట్టియీశ్వరున కే నశ్రాంతమున్ మ్రొక్కెదన్. 82

1. ప్రారంభాదివివేక. 2. 'వ్రాఁతప్రతుల నిట్లె పాఠము చూపట్టెడి. అచ్చుప్రతులందు 'వి, జ్ఞానం బేమియు లేక తొట్రుపడ నిచ్చెన్ నాకు సర్వానుసం.' అని యున్నది.

మ. విము మే నీశ్వరుదృష్టిమార్గమున నావేశింప శంకించి సి
గ్గున సంకోచము నొందుమాయవలనం గుంఠీభవత్ప్రజ్ఞచే
నను లోకేశ్వరుఁ డంచు మ్రొక్కుమతిహీనవ్రాతముం జూచి నే
ననిశంబున్ నగి ధిక్కరింతు హరిమాయాకృత్య మంచున్ సుతా. 83

వ. మఱియు దేహంబునకు ద్రవ్యంబు లైనమహాభూతంబులును జన్మనిమిత్తంబు లైనకర్మంబులును గర్మక్షోభకం బైనకాలంబును గాలపరిణామహేతు వైనస్వభావంబును భోక్త యైనజీవుండును వాసుదేవుండ కా నెఱుంగుము వాసుదేవవ్యతిరిక్తంబు లేదు సిద్ధంబు నారాయణనియమ్యంబులు లోకంబులు దేవతలు నారాయణశరీరసంభూతులు వేదయాగతపోయోగవిజ్ఞానంబులు నారాయణపరంబులు జ్ఞానసాధ్యం బగుఫలంబు నారాయణాధీనంబు కూటస్థుండును సర్వాత్మకుండును సర్వద్రష్టయు నయినయీశ్వరునికటాక్షవిశేషంబున [1]సృజియింపంబడి ప్రేరితుండనై సృజ్యం బైనప్రపంచంబు సృజియించుచుండుదు నిర్గుణుం డైనయీశ్వరునివలన రజస్సత్త్వతమోగుణంబులు ప్రభూతంబు లై యుత్పత్తిస్థితిలయంబులకుఁ బాలుపడి కార్యకారణకర్తృత్వభావంబులందు ద్రవ్యంబు లైనమహాభూతంబులును జ్ఞానమూర్తు లయినదేవతలును గ్రియారూపంబు లయినయింద్రియంబులును నాశ్రయంబులుగా నిత్యముక్తుం డయ్యును మాయాసమన్వితుం డైనజీవుని బంధించు జీవునకు నావరణంబు లయి యుపాధిభూతంబు లయినమూఁడులింగంబులు సేసి పరులకు లక్షితంబు గాక తనకు లక్షితం బైనతత్త్వంబు గలయీశ్వరుం డివ్విధంబునం గ్రీడించు చుండు. 84

క. ఆయీశుఁ డనంతుఁడు హరి, నాయకుఁ డీభువనములకు నాకున్ నీకున్
నాయకుఁ బ్రాణివ్రాతము, కేయెడలన్ లేద యీశ్వరేతరము సుతా. 85

వ. వినుము మాయావిభుం డైనయీశ్వరుండు దనమాయం జేసి దైవయోగంబునం బ్రాప్తంబు లయినకాలజీవాదృష్టస్వభావంబులు వివిధంబులు సేయ నిశ్చయించి కైకొనియె నీశ్వరాధిష్ఠితం బైనమహత్తత్త్వంబువలన నగుకాలంబున గుణవ్యతికరంబును స్వభావంబునఁ బరిణామంబును జీవాదృష్టభూతం బయినకర్మంబున జన్మంబును నయ్యె రజస్సత్త్వంబులచే నుపబృంహితం బై వికారంబు బొందినమహత్తత్త్వంబువలనం దమఃప్రధానం బై దివ్యజ్ఞానక్రియాత్మకం బగు నహంకారంబు గలిగె నదియు రూపాంతరంబు లొందుచు ద్రవ్యశక్తి యైనరాజసంబును గ్రియాశక్తి యైనతామసంబును జ్ఞానశక్తి యైనసాత్త్వికంబును నన మూఁడువిధంబు లయ్యె నందు భూతాది యైనతామసాహంకారంబువలన నభంబు గలిగె నభంబునకు సూక్ష్మరూపంబు భూతదృశ్యంబునకు బోధకం బైనశబ్దంబు గుణంబగు నభంబువలన వాయువు గలిగె వాయువునకుం బరాన్వయం

---

1 అనుజీవింపంబడి.

బున శబ్దంబు స్పర్శంబు ననురెండుగుణంబులు గలిగి యుండు నది దేహంబులం దుండుటం జేసి ప్రాణరూపంబై యింద్రియమనశ్శరీరపాటవం బైనయోజస్సహోబలంబులకు హేతువై వర్తించు వాయువువలన రూపస్పర్శశబ్దంబు లనియెడు గుణంబులు మూఁటితోడఁ దేజంబు గలిగెఁ దేజంబువలన రసరూపస్పర్శశబ్దంబు లనియెడునాలుఁగుగుణంబులతోడ జలంబు గలిగె జలంబువలన గంధరసరూపస్పర్శశబ్దంబు లనియెడుగుణంబు లయిదింటితోడం బృథివి గలిగె వైకారికం బైన సాత్త్వికాహంకారంబువలనఁ జంద్రదైవతం బయినమనంబు గలిగె మఱియు దిక్కులును వాయువును నర్కుండును బ్రచేతసుండును నాశ్వినులును వహ్నియు నింద్రుండును నుపేంద్రుండును మిత్రుండును బ్రజాపతియు ననియెడిదశదేవతలు గలిగిరి తైజసం బైనరాజసాహంకారంబువలన దిగ్దైవతం బైనశ్రవణేంద్రియంబును వాయుదైవతం బైనత్వగింద్రియంబును సూర్యదైవతం బైననయనేంద్రియంబును బ్రచేతోదైవతం బైనరసనేంద్రియంబును నశ్విదేవతం బైనఘ్రాణేంద్రియంబును వహ్నిదైవతం బైనవాగింద్రియంబును నింద్రదైవతం బైనహస్తేంద్రియంబును నుపేంద్రదైవతం బైనపాదేంద్రియంబును మిత్రదైవతం బైనగుదేంద్రియంబును బ్రజాపతిదైవతం బైనగుహ్యేంద్రియంబును ననియెడిదశేంద్రియంబులును బోధజనకాంతఃకరణైకభాగం బయినబుద్ధియుఁ గ్రియాజనకాంతఃకరణం బయినప్రాణంబునుం గలిగె నిట్టి శ్రోత్రాదు లగుదశేంద్రియంబులతోఁ గూడినభూతేంద్రియమనోగుణంబులు వేర్వేఱుగ బ్రహ్మాండశరీరనిర్మాణంబునం దసమర్థంబు లగునప్పుడు గృహనిర్మాణంబునకుం బెక్కుపదార్థంబులు సంపాదించినం గాని చాలనిచందంబున భూతేంద్రియమనోగుణంబులవలన గృహంబుగా వడి (భగవచ్ఛక్తిప్రేరితంబు లగుచు నేకీభవించి సమష్టివ్యష్ట్యాత్మకత్వంబు నంగీకరించి చేతనాచేతనంబులు గల) బ్రహ్మాండంబు కల్పితం బయ్యె నట్టియండంబు వర్షాయుతసహస్రాంతంబుదనుక జలంబునం దుండెఁ గాలకర్మస్వభావంబులం దగులువడక సమస్తంబును జీవయుక్తంబుగఁ జేయునీశ్వరుం డచేతనంబును సచేతనంబునుగ నొనర్చె నంతఁ గాలకర్మస్వభావప్రేరకుం డయినపరమేశ్వరుండు జీవరూపంబున మహాపరణాజలమధ్యస్థితం బయినబ్రహ్మాండంబులోను సొచ్చి సవిస్తారంబు గావించి (యట్టియండంబు భేదించి నిర్గమించె నట్లుం గాని). 86

క. భువనాత్మకుఁ డాయీశుఁడు, భువనాకృతితోడ నుండు బ్రహ్మాండంబున్
వివరముతోఁ బదునాలుగు, వివరంబులుగా నొనర్చు విశదంబులుగన్. 87

మ. బహుపాదోరుభుజాననేక్షణశిరశ్ఫాలశ్రవోయుక్తుఁ డై
విహరించున్ బహుదేహిదేహగతుఁ డై విద్వాంసు లూహించి త

ద్బహురూపావయవంబులన్ భువనసంపత్తిన్ విచారింతు రా
మహనీయాద్భుతమూర్తి యోగిజనహృద్గ్రాహ్యుండు మేధానిధీ. 88

వ. వినుము చతుర్దశలోకంబులందు మీఁదటియేడులోకంబుల శ్రీమహావిష్ణువు
నకుఁ గటిప్రదేశంబుననుండి మీఁదటిదేహ మనియును గ్రిందటియేడులోకంబులు
జఘనంబుననుండి క్రిందటిదేహ మనియునుం బలుకుదురు (ప్రపంచశరీరుండగు
భగవంతుని) ముఖంబువలన బ్రహ్మకులంబును బాహువులవలన క్షత్త్రియకులం
బును నూరువులవలన వైశ్యకులంబును బాదంబులవలన శూద్రకులంబును జని
యించె నని చెప్పుదురు భూలోకంబు గటిపర్యంతప్రదేశంబు భువర్లోకంబు నాభి
సువర్లోకంబు హృదయంబు మహర్లోకంబు వక్షంబు జనలోకంబు గ్రీవంబు దపో
లోకంబు స్తనద్వయంబు సనాతనంబును బ్రహ్మనివాసంబును నైనసత్యలోకంబు
శిరంబు జఘనప్రదేశం బతలంబు దొడలు వితలంబు జానువులు సుతలంబు జం
ఘలు దలాతలంబు గుల్ఫంబులు మహాతలంబు పాదాగ్రంబులు రసాతలంబు పా
దతలంబు పాతాళంబు నని (లోకమయుంగా) భావింతురు కొందఱు మఱియుం
[1]పాదతలంబువలన భూలోకంబును నాభివలన భువర్లోకంబును శిరంబువలన
స్వర్లోకంబును గలిగె నని లోకకల్పనంబు నెన్నుదురు పురుషోత్తమునిముఖం
బువలన సర్వజంతువాచాజాలంబుం (దదధిష్ఠాత యగు) వహ్నియు నుదయించెం
జర్మరక్తమాంసమేదశ్శల్యమజ్జాశుక్లంబులు సప్తధాతువు లందురు పక్షాంతరం
బున రోమ[2]త్వఙ్మాంసాస్థిస్నాయుమజ్జాప్రాణంబులును సప్తధాతువు లని యందు
రందుఁ దంతురోమంబు లుష్ణిక్ఛందం బనియుఁ ద్వక్కు ధాత్రీఛందం బనియు
మాంసంబు త్రిష్టుప్ఛందం బనియు స్నాయు వనుష్టుప్ఛందం బనియు నస్థి జగతీ
ఛందం బనియు మజ్జ పంక్తిచ్ఛందం బనియుఁ బ్రాణంబు బృహతీఛందం బనియు
నాదేశింతురు హవ్యకవ్యామృతాన్నంబులకు మధురాదిషడ్రసంబులకు (రసనేం
ద్రియంబునకు) రసాధీశ్వరుం డైనవరుణునికి హరిరసనేంద్రియంబు జన్మస్థానంబు
సర్వప్రాణాదులకు వాయువునకు విష్ణునాసికావివరంబు నివాసంబు సమీపదూర
వ్యాపిగంధంబులకు నోషధులకు నశ్వి దేవతలకు దిశాంబరునిఘ్రాణేంద్రియంబు
నివాసంబు దేవలోకసత్యలోకంబులకుఁ దేజంబునకు సూర్యునకు సకలచక్షువు
లకు లోకలోచనునిచక్షురింద్రియంబు స్థానంబు దిశలకు నాకాశంబునకు
శ్రుతిభూతంబు లైనయంశంబులకు [3]శబ్దంబునకు సర్వేశ్వరునికర్ణేంద్రియంబు
జన్మస్థానంబు వస్తుసారంబులకు వర్ణనీయసౌభాగ్యంబులకుఁ బరమపురుషుని
గాత్రంబు భాజనంబు స్పర్శంబునకు వాయువునకు సకలస్నిగ్ధత్వంబులకు దివ్య

---

1. 'పాదతలంబు భూలోకంబును నాభి భువర్లోకంబును శిరంబు స్వర్లోకంబు నగు నని నిగమింతురు పురుషోత్తముని' అని మే. వ్రాఁత ప్రతులు. 2. త్వఙ్మాంసస్నాయూపస్థమజ్జా. 3. సర్వకర్ణంబులకు సర్వేశ్వరుని.

దేహునిదేహేంద్రియంబు గేహంబు యూపప్రముఖయజ్ఞోపకరణంబు లగు తరుగుల్మలతాదులకుఁ బురుషోత్తమునిరోమంబులు మూలంబులు శిలాలోహంబులు సర్వమయునినఖంబులు మేఘజాలంబులు హృషీకేశునికేశంబులు మెఱుంగులు విశ్వేశ్వరునిశ్మశ్రువులు భూర్భువస్సువర్లోకరక్షకు లైనలోకపాలకులపరాక్రమంబులకు (భూరాదిలోకంబులక్షేమంబునకు శరణంబునకు) నారాయణుని విక్రమంబు నికేతనంబు సర్వకామంబులకు నుత్తమంబు [1]లైనవరంబులకుఁ దీర్ఘపాదునిపాదారవిందంబు లాస్పదంబులు జలంబులకు శుక్లంబునకుఁ బర్జన్యునకుఁ బ్రజాపతిసర్గంబునకు సర్వేశ్వరునిమేఢ్రంబు సంభవనిలయంబు [2]సంతానంబునకుఁ గామాదిపురుషార్థంబులకుఁ జిత్తసౌఖ్యరూపంబు లగునానందంబులకు శరీరసౌఖ్యంబునకు నచ్యుతునియుపస్థేంద్రియంబు స్థానంబు యమునికి మిత్రునికి మలవిసర్గంబునకు భగవంతునిపాయ్వింద్రియంబు భవనంబు హింసకు నిరృతికి మృత్యువునకు నిరయంబునకు నిఖిలరూపకునిగుదంబు నివాసంబు పరాభవంబునకు నధర్మంబునకు నవిద్యకు నంధకారంబునకు ననంతునిపశ్చిమభాగంబు సదనంబు నదనదీనివహంబునకు నీశ్వరునినాడీసందోహంబు జన్మమందిరంబు పర్వతంబులకు నధోక్షజునిశల్యంబులు జనకస్థలంబులు [3]ప్రధానంబునకు నన్నరసంబునకు సముద్రంబులకు భూతనిధనంబునకు బ్రహ్మాండగర్భునియుదరంబు నివేశంబు మనోవ్యాపార[4]రూపం బగులింగశరీరంబునకు మహామహిమునిహృదయంబు సర్గభూమి యగు మఱియును. 89

ఆ. నీలకంధరునకు । నీకు నాకు ననత్కు-, మారముఖ్యసుతస । మాజమునకు
ధర్మసత్త్వబుద్ధి । తత్త్వములకు నీశ్వ, రాత్మ వినుము పరమ । మైననెలవు. 90

సీ. నరసురాసురపితృ । నాగకుంజరమృగ, గంధర్వయక్షరా । క్షసమహీజ
సిద్ధవిద్యాధర । జీమూతచారణ, గ్రహతారకాప్సరో । గణవిహంగ
భూతతటిద్వసు । పుంజంబులును నీవు, ముక్కంటియును మహా । మునులు నేను
సలిలనభస్స్థల । చరములు మొదలైన, వివిధజీవులతోడి । విశ్వ మెల్ల
ఆ. విష్ణుమయము పుత్ర । వేవేల బ్రహ్మాండ, మతనిజేనలోన । నడఁగి యుండు
బుద్ధి నెఱుఁగ రాదు । భూతభవద్భవ్య, లోక మెల్ల విష్ణు । లోన నుండు. 91

క. [5]ఏకోనాకకర్మఫల, ప్రాదుర్భావ మగులోక । పాలనకే కా
కాదేవుం డభయప్రతి, పాదక మగుమోక్షమునకుఁ । బతి యెట్లన్నన్. 92

---

1. లైనపదంబులకు. 2. 'ప్రజాసుఖోపశమనంబులకు నచ్యుతునిగుహ్యేంద్రియంబు స్థానంబు' అనియే వ్రాఁతప్రతులు. 3. ప్రధానద్రవ్యసముద్రంబులకు. 4. 'రూపంబులకు మహా' అనియే వ్రా.ప్ర. 5. ఈయధికపాఠము మూలమున 'సోఽమృతస్యాభయస్య' అనుట మొదలుకొని, 'పురుషస్త్వాభయాశ్రయః' అనువఱకుఁ గలనాలుగుశ్లోకములకును వానికి శ్రీధరులు రచించినవ్యాఖ్యానమునకును దెనుఁగై యీఘట్టమున నుండవలసినదియే. అయిన నిది పెక్కువ్రాఁతప్రతులను నచ్చుప్రతులనుగాన రాదు.

వ. వినుము పరమాత్మయు నానందేశ్వరుం డగునవ్విష్ణునకుఁ బ్రపంచమాత్రాధిక త్వం బేమి యద్భుత మగుటం జేసి యతనిమహిమాతిశయం బస్మదాదులు నెఱుంగనేర్తురె స్థిత్యర్థపాదుం డగునీశ్వరునిపాదాంశంబులందు భూర్భువస్స్వర్లోకంబులు గుదురుకొనియుండుఁ దదీయవిలయసమయంబునం దదుపరిమహర్లోకంబు దపియింప నందుఁ గలజనంబు లంతరాళంబు నందక మహర్లోకశిరఃస్థానం బైనజనలోకంబుఁ బ్రవేశించి యత్యంతం బగునవినాశిసుఖంబు లనుభవింతురు తపోలోకంబు సంకర్షణానలశక్తిచేత నధస్త్రిలోకంబులుం దందహ్యమానంబు లగునప్పుడు తదూష్మలం బెందక విలక్షణం బై క్షేమంబు గలిమిఁ దజ్జనం బంద సుఖించు జన్మజరామరణభయంబులు లేక ముక్తికిఁ బ్రత్యాసన్ను లగుటం జేసి సత్యలోకప్రవాసు లంద యానందింతురు భూర్భువస్స్వర్లోకంబు లవ్విరాట్పురుషునిపదస్థలం బగుట నేకపాద్విభూతి యయ్యె మహర్లోకంబు మధ్యమవిభూతి యన నమరె జనతపస్సత్యలోకంబు లమ్మహాపురుషునిశిరఃస్థానంబు గావున నది త్రిపాద్విభూతి యనంబడుఁ దదీయలోకంబు బ్రహ్మచర్యవానప్రస్థయతులకుం దక్క నితరుల కసాధ్యంబు గృహస్థు లయ్యె నితరత్రివిధాశ్రమధర్మంబులు గలిగినం జేకుఱు క్షేత్రజ్ఞుం డైనపురుషుండు స్వర్గాపవర్గహేతుభూతం బైనదక్షిణోత్తరకర్మజ్ఞానమార్గంబులు సృజించి యంతయుఁ దాన యై యుండు. 93

క. మండలములోన భాస్కరుఁ, డుండి జగంబులకు దీప్తి నొసఁగెడిక్రియ బ్ర
హ్మాండములోపల నచ్యుతుఁ, డుండుచు [1]బహిరంతరముల నొగి వెలిఁగించున్.

ఇది మొదలుకొని వెలిగందల నారయకవిత్వము.

ఉ. అట్టియనంతశక్తి జగదాత్మునినాభిసరోజమందు నేఁ
బుట్టి యజింపఁగా మనసు పుట్టిన యజ్ఞపదార్థజాతముల్
నెట్టన కాన రామికి విరనిర్మల మైనతదీయరూపముల్
గట్టిగ బుద్ధిలో నిలిపి కంటి నుపాయము నామనంబునన్. 95

సీ. పశుయజ్ఞవాటయూపస్తంభపాత్రమ్ము, ఘటశరావవసంతకాలములును
స్నేహౌషధీబహులోహచాతుర్హోత్ర, మతనామధేయసస్మంత్రములును
సంకల్పఋగ్యజుస్సామనియుక్తవ, షట్కారమంత్రానుచరణములును

ఒకానొకవ్రాఁతప్రతియందే చూపట్టుచున్నది. మఱియుఁ బోతన మూలమును శ్రీధరవ్యాఖ్యాన సహితముగాఁ దెనిఁగించినవాఁడు. కనుకఁ గ్రింది నాలుగుశ్లోకములు పోతనకు లభించినమూలమున లేకుండవచ్చునని తలఁచినను వానివ్యాఖ్యానమునం దైనను దప్పక కనుపట్టియుండును గాన వానిని దెనిఁగింపకుండఁడు. అయిన నీతెనిఁగింపు పోతనవాని యంతసమంజసమును బ్రౌఢమును గాకున్నది. వెలిగందల నారయకవిత్వ మాసన్నముగా నుంటచే నీభాగమును గొంత యుత్పన్నమై యుండు ననియుఁ గావున నారయకవిత్వ మిందును గొంత చేరియుండుననియుఁ గనుకనే యిది పోతనరచనవలె సమంజసమును బ్రౌఢమును గాదయ్యె ననియు నూహింపఁదగి యున్నది.

1. నావరణపటలి ♦ కొసఁగును దీప్తిన్.

దక్షిణల్ దేవతాధ్యానతదనుగత, తంత్రవ్రతోద్దేశధరణిసురులు

తే. సర్వణంబులు బోధాయనాదికర్త
సరణి మొదలగు యజ్ఞప్రకరణసమితి
యంతయును నమ్మహాత్మునియవయవములు
గాఁగఁ గల్పించె విధివత్ప్రకారమునను. 96

క. యజ్ఞాంగి యజ్ఞఫలదుఁడు, యజ్ఞేశుఁడు యజ్ఞకర్త యగుభగవంతున్
యజ్ఞపురుషుఁగా నారసి, యజ్ఞముఁ గావించితిని సమర్పణబుద్ధిన్. 97

క. అప్పుడు బ్రహ్మలు దమలోఁ, దప్పక నన్నుఁ జూచి సముచితక్రియ [1]లగుచు
న్నప్పరమేశున కభిమత, మొప్పఁగ దగుసప్తతంతువులు గావింపన్. 98

చ. మనువులు దేవదానవులు మానవనాథులు మర్త్యకోటి [2]దా
రనయము వారివారికిఁ బ్రియం బగుదేవతలన్ గుఱించుచున్
ఘన మగునిష్ఠ యజ్ఞములఁ గైకొని చేసిరి తత్ఫలంబు ల
య్యనుపమమూర్తి యజ్ఞమయుఁ డైనరమావరునందుఁ జెందఁగన్. 99

క. సువ్యక్త[3]తంత్రరూపకుఁ, డవ్యక్తుఁ డనంతుఁ డభవుఁ డాఢ్యుం డీశుం
డవ్యయుఁ డగుహరి సురగణ, సేవ్యుఁడు క్రతుఫలదుఁ డగుటఁ జేసిరి మఖముల్.

క. అగుణుఁ డగుపరమేశుఁడు, జగములఁ గల్పించుకొఱకుఁ జతురత మాయా
సగుణుం డగుఁ గావున హరి, భగవంతుం డనఁగఁ బరఁగె భవ్యచరిత్రా. 101

క. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు, విశ్వమయుం డఖిలనేత విష్ణుం డజుం డీ
విశ్వములోఁ దానుండును, విశ్వము దనలోన జాల వెలుఁగుచు నుండున్. 102

చ. అతనినియుక్తిఁ జేసి సచరాచరభూతసమేతసృష్టి నే
వితతముగా సృజింతుఁ బ్రభువిష్ణుఁడు విష్ణుఁడు ప్రోచుఁ బార్వతీ
పతి లయ మొందఁ జేయు హరి పంకరుహోదరుఁ డాదిమూర్తి య
చ్యుతుఁడు త్రిశక్తియుక్తుఁ డగు[4]చుండును నింతకుఁ దాన మూలమై. 103

క. విను వత్స నీవు నన్నడి, గినప్రశ్నకు నుత్తరంబు కేవలపరమం
బును బ్రహ్మం బీయఖిలం, బున కగు నాధారహేతుభూతము సుమ్మీ. 104

క. హరి భగవంతుఁ డనంతుఁడు, గుణాంబుధి సృష్టికార్యకారణహేతు
స్ఫురణుం డవ్విభుఁ డతఁడె, పరుఁ డన్యుఁడు లేఁడు తండ్రి పరికింపంగన్. 105

సీ. ఇది యంతయును నిక్కమే బొంక నుత్కంఠ, మతిఁ దద్గుణధ్యానమహిమఁ జేసి
పరికింప నే నేఁడు వలికిన నది యెల్ల, సత్యంబ యగు బుధస్తుత్య! మము
ధీయుక్తమానమకేంద్రియములు మఱచియుఁ, బొరయ వసత్పథస్ఫురణ లెందు
నది గాక మత్తను వామ్నాయతుల్యంబు, నమరేంద్రవందనీయంబు నయ్యెఁ

1 'లగుచు, న్నప్పరమేశు' అనియే వ్రా. ప్ర. 2 'యున్, అనయము' వ్రా. ప్ర. 3 మంత్రరూప. 4 చున్నతఁ డింతకు.

తే. దవిలి యద్దేవదేవుని దివ్యమహిమ, గారణంబును మంగళకారణంబు
నఖిలసంపత్కరంబు నై యలరుపాద, వనజముల కే నొనర్చెద వందనములు

ఉ. ఆనలినాక్షునందనుఁడ నయ్యుఁ బ్రజాపతి నయ్యు యోగవి
ద్యానిపుణుండ నయ్యును బరిదంపడి మజ్జననప్రకారమే
నేను నెఱుంగ నవ్విభునియిద్ధమహత్త్వ మెఱుంగ నేర్తునే
కానఁబడున్ [1]పరమేశపరికల్పితవిశ్వము గొంతకొంతయున్. 107

మ. విను వేదంబుల కెక్కి తాపసప్రవర యవ్విశ్వాత్మకుం డీశుఁడున్ దాఁ
దనమాయామహిమాంతముం దెలియఁగాఁ దత్త్వంబుగాఁ జాలఁ డ
న్నను నే నైనను మీర లైన సుర లైనన్ వామదేవుండు నై
నను నిక్కం బెఱుఁగంగఁ జాలుదుమె [2]విజ్ఞానప్రశక్తియుక్తులన్. 108

వ. అమ్మహాత్ముం డైన పుండరీకాక్షుండు సర్వజ్ఞుం డగుటం జేసి. 109

క. గగనము దనకడపలఁ గాఁ, దగ నెఱుఁగనికరణి విష్ణుఁడుఁ దా నెఱుఁగఁ డతన్
గగనప్రసవము లెఱుఁగ, నగునే సర్వజ్ఞులకు నైనఁ దలంపన్. 110

చ. తలకొని యమ్మహాత్ముఁడు ధరించినయయ్యవతారకర్మముల్
వెలయఁగ సన్మునీంద్రులు వివేకవిధంబుల సన్నుతింతు మ
య్యలఘు ననంతునిం జగచ్చరితాత్మకు నాద్యు ననీశు నీశ్వరుం
దెలియఁగ నేర్తుమే తవిలి దివ్యచరిత్రుని కేను మ్రొక్కెదన్. 111

మ. పరమాత్ముం డజుఁ డీజగంబులు ప్రతికల్పంబునుం గల్పించుఁ దాఁ
బరిరక్షించును ద్రుంచు నట్టియనఘున్ బ్రఖ్యాతు నిత్యున్ జగ
ద్భరితుం గేవలు నద్వితీయుని విశుద్ధజ్ఞాను సర్వాత్ము ని
ర్వాణాద్యంతవిహీను నిర్గుణుని శశ్వన్ముక్తుఁ జింతించెదన్. 112

చ. సరసగతిన్ మునీంద్రులు ప్రసన్నశరీరహృషీకమానస
స్ఫురణ గలప్పు డవ్విభునిభూరికళాకలితస్వరూపముం
గరిమను జూతు రెప్పుడుఁ గుతర్కతమోహముచేత నజ్ఞతం
బొరసినయప్పు డవ్విభునిమూర్తి గనుంగొన లేరు నారదా. 113

వ. అని వెండియు నిట్లను ననఘా యమ్మహాత్మునియవతారంబుల మొదలియవతారంబు
[3]సహస్రశీర్షాదియుక్తంబై ప్రకృతిప్రవర్తకంబగు నాదిపురుషరూపంబగు
నందుఁ గాలస్వభావంబు లనుశక్తు లుదయించె నందుఁ గార్యకారణరూపంబగు
నప్రకృతి జనించెఁ బ్రకృతివలన మహత్తత్త్వంబును దానివలన నహంకారత్ర
యంబును బుట్టె నందు రాజసాహంకారంబువలన నింద్రియంబులును దామ
సాహంకారంబువలన భూతకారణంబు లగు శబ్దస్పర్శరూపరసగంధతన్మాత్రం

---

1 దరీయాపరికల్పిత. 2 విజ్ఞానప్రక్రియాయుక్తులన్. 3 'సహస్రమస్తకం బగు నాదిపురుషుం డుద్భవం బయ్యె నందు' అనియే వ్రాఁతప్రతులు.

బులునుం బొడమెం బంచతన్మాత్రంబువలన గగనానిలవహ్నిసలిలధరాదికంబైన భూతపంచకంబు గలిగె నందు జ్ఞానేంద్రియంబు లయినత్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులును గర్మేంద్రియంబు లైనవాక్పాణిపాదపాయూపస్థంబులును మనంబును జనియించె నన్నింటిసంఘాతంబున విశ్వరూపుం డయినవిరాట్పురుషుండు పుట్టె నతనివలన స్వయంప్రకాశుం డైనస్వరాట్టు సంభవించె నందుం జరాచరరూపంబుల స్థావరజంగమాత్మకం బయినజగత్తు గలిగె నందు సత్త్వరజస్తమోగుణాత్మకుల మయినవిష్ణుండును హిరణ్యగర్భుండ నయిన నేనును రుద్రుండునుం గలిగితి మందు సృష్టిజననకారణుం డయినచతుర్ముఖుండు పుట్టె వానివలన దక్షాదు లగుప్రజాపతులు బ్రహ్మంబు గలిగి రందు ¹భగవత్ప్రముఖు లైనసనకసనందనాదియోగీంద్రులును నాకలోకనివాసు లయినవాసవాదులును (ఖగలోకపాలకు లగుగరుడాదులును నృలోకపాలకు లగుమనుమాంధాతృప్రముఖులును నలలోకపాలకు లగునసంతవాసుకిప్రభృతులును) గంధర్వసిద్ధవిద్యాధరచారణసాధ్యరక్షోయక్షోరగనాగలోకపాలురును మఱియు ఋషులును పితృదేవతలును దైత్యదానవభూతప్రేతపిశాచకూశ్మాండపశుమృగాదులును నుద్భవించి రిట్టి జగత్త్రివిధమోద్భవంబు మహత్తత్త్వసృష్టియును ద్వితీయం బఖండసంస్థానంబును తృతీయంబు సర్వభూతజననంబును గలిగియుండు నందు మహదైశ్వర్యతేజోబలసంపన్ను లైనపురుషులు సర్వేశ్వరుం డైననారాయణునియంశసంభవులుగా నుండు రప్పుండరీకాక్షునిలీలావతారంబు లనంతంబులు సత్కర్మంబులు లెక్క-వెట్ట నెవ్వరికి నలవి గా దయినను నాకుం దోఁచినంత నిరూపించెద వినుము.

—శ్రీమన్నారాయణునిలీలావతారంబుల యుపవర్ణనము.—

ఉ. అన్యకథానులాపము లకర్ణ్ణితముల్ వినునట్టిసత్క్రియా
శూన్యము లైనకర్ణముల సూరిజనస్తుత సర్వలోకస
మ్మాన్యము లైనవిష్ణునవతారమహాద్భుతదివ్యకథామృతంబు నా
జన్యతఁ గ్రోల వయ్య బుధసత్తమ నీవు వివరించి చెప్పవే. 115

వ. అని పలికి మఱియు నిట్లనియె. 116

మ. కనకాక్షుండు భుజావిజృంభణమునన్ గర్వించి చక్రమ్ముఁ జాపఁ జు
ట్టినమాడ్కిం గొని పోవ యజ్ఞమయ²దంష్ట్రాకృతిం దాల్చి య
ద్దనుజాధీశ్వరుఁ దాఁకి యుద్ధమున నంతఃపాతిం బంపె దా
త్రిని గూలం గులిశాహతిం బడుమహాద్రిం బోలె నత్యుగ్రతన్. 117

వ. మఱియు సుయజ్ఞావతారంబు వినుమని యిట్లనియె. 118

సీ. ప్రకటరుచిం బ్రజాపతికిని స్వాయంభువునికూఁతు రాకూతి యనులతాంగి
కర్థి జన్మించి సుయజ్ఞుండు నా నొప్పు, నతఁడు దక్షిణ యనునతివయందు

1. 'భగవదీయముఖు లైన' వ్రా. ప్ర. 2. 'దంష్ట్రిరూపముఁ' వ్రా. ప్ర.

ద్వితీయ స్కంధము

సుయమ నామాసురస్తోమముం బట్టించి యింద్రుండై వెలసి యుపేంద్రరూ
నఖిల లోకంబుల యార్తి హరింపఁ నతఁడు మహామహాండ్రైన మనువు

తే. ధీమహితుఁడు దత్త్రిపుత్రుఁ కల్గి పదము
పుణ్యుఁడగు హరిదయ్ పరికెఁ గాన
యుంగార బ్రహ్మర్థియై సురులఁ గొలువఁ, దాపసో
త్తము హరియవతారమయ్యె.

ఆ. ధాత్రి సాంఖ్యయోగ ప్రవర్తకాచార్య వరుఁడగు కపిలుఁ
డుదయించె విను మనుజేంద్ర.

చ. కృపను దేవహూతికిఁ గర్దమునకు దయమున్నతో
పరిఁ బ్రమోద మొప్ప నవతారమునొందఁ గపిలాఖ్యుఁ డనఁబడు
గడి హరి తాను నస్త్ర సుగుణ మగు సాంఖ్యము దత్త్రిగొ గల
పుణ్యగుణములు వాసి మాపి మునిసంఘ మై చేరాదు మోక్షమున్.

వ. మఱియును దత్తాత్రేయావతారంబు వినుము.

సీ. తాపసోత్తముఁ డత్రి తనయునిఁ గోరి దేవు
వేఁడిన హరి యేను నీకు
ననఘుడట్టుండ నైతిని పుత్ర కదమునఁ దలఁచు
దత్తాత్రేయుండై ప్రభవ
సమ్యగ్యోగిశ్రీ చరణాబ్జపరాగ సందోహంబునఁ
బూత దేహులగుచు

హైహయ యదువంశ్యులై హాకా ముష్టికీష్టలరూపి
మగు యోగ బలము వడసి.

తే. సంచిత జ్ఞాన ఫలసుఖైశ్వర్యశక్తి, శౌర్యములఁ
బొంది తమకీర్తి సదల వెలుఁగ
నిందు నందును వాసికి నెక్కి రట్టి, దివ్యతరమూర్తి
విష్ణు నుతింపఁ దరమె.

వ. వెండియు సనకాద వతారంబు వినుము.

సీ. ఆనహాత్మయేను గల్పాదిని నిర్గుణంబు సృష్టియుయుఁ
దలఁచి యుల్పిత తపంబు
నర్థిఁ జేయుచు సనయున్ బల్కు బయయు
నది కారణంబుగ సనాఖ్యలను గల స
నందన సనక సనత్కుమార సనత్సుజాతులు
నల్వురు సంభవించి
మానవ పుత్రులై మహిని కెక్కిరి పోయిన కల్పాం
తమున నశించి

తే. నర్థి యాత్మీయతత్త్వంబు పుట్టఁజేసి,
సంప్రదాయక భంగిని జగతి నెల్లఁ
గలుగఁ జేసిరి యవిన్యస్త కళలఁ దనరి,
నలువు రయ్యుత్తము నొక్కడ నము చరిత్ర.

వ. మఱియును నరనారాయణావ తరంబు వినుము.

క. గణుతింపఁగ నరనారా, యణులన ధర్మునకు నుదయమందిరి దాక్షా
యణి యైన మూర్తివలనం, బ్రణుతగుణోత్తరులు పరమపావనమూర్తుల్.

క. ఆనఘులు బదరీవనమున, నియత తపోవృత్తినుండ విబుధాధిపుఁడున్
మనమున నిజపదహానికి, ఘనముగఁ జింతించి దివిజకాంతామణులన్.

క. రావించి తపోవిఘ్నముఁ, గావింపుండనుచు బనుపఁ గడువేడుకతో
భావ భవానీకినులఁ, గావసలు సేరి బదరికావనమునకున్.

వ. అందు

మ. నరనారాయణులున్న చోటికి మరున్నారీ సమూహంబు భా
సురలీలం జని రూప విభ్రమకళా చాతుర్యమే పారఁగాఁ
బరిహాసోక్తుల నాటపాటలఁ జరింపం జూచి నిశ్చింతతన్
భరిత ధ్యానతపః ప్రభావరతిం బాటించి నిష్ఠామతులై.

క. క్రోధము దమ తపములకును, బాధకమగు నెఱిఁగి దివిజభామలకైన
మేధాత్ములు లౌక మింతయుఁ గ్రోధముఁ దొరైరి సత్యగుణసంగతులై.

క. నారాయణుఁ డప్పుడప్పుడు దన, యూరువు వెసఁ జీరఁ బొడమయించెను వెం
పారంగ నూర్వశీముఖ, నారీజనకోటి దివిజాదులు మెచ్చన్.

క. ఊరువులందు జనించిన, కారణమున నూర్వశియను ఘనతకునెక్కెన్
వారలు [illegible] రూపవిలాసవిహారములకు నోడిరంతన మఱిఁ జనముల్.

వ. అంతం దాము నరనారాయణుల తపోవిఘ్నంబు గావింపం బూని
చేయు విలాసంబులు మానసిక సంకల్ప మాత్రంబున సృష్టిస్థితి
సంహారంబులతో సర్వం జాలు నమ్మహాత్ముల దేసం బనికి రాక కృతఘ్ను

నకుం జేయునుపకృతులం బోలె నిష్ఫలంబులైన సిగ్గునం
గుందుచు మూర్ఖ్యాం దమకు ముఖ్యరాలింగాఁ గైకొని తన
వచ్చిన బాధన మఱలి చను రంత.

క. కాముని దహించెఁ గ్రోధము, హోమహిమను రుద్రుఁడట్టి
యతి కోపము నా
ధీమంతులు గెలిచి రనం, గామము గెలుచుటలు సెప్పఁగా
నేమిటికిన్.

వ. అట్టి నరనారాయణావతారంబు జగత్ప్రసన్నంబై విలసిల్లె వెండియు
ధ్రువావతారంబు వివరించెద వినుము.

సీ. మానితచరితుఁ డుత్తాన పాదుండను
భూవరేణ్యునకు సత్పుత్రుఁడనఁగ
నుదయించి మహిమఁ బెంపొంది బాల్యంబున
జనకునికడ నుండి సవతి తల్లి
దను నాడు వాక్యాస్త్రతతిఁ గుంది మహిత
తపంబు గావించి కామంబు గోరఁ
జనిమింట ధ్రువపదస్థాయి యై యు
మ యమ్మీఁద నర్థి వర్తించు భృగ్వాదిమునులు.

తే. చతురగతిఁ గ్రింద వర్తించు సప్తఋషులు
చెంపు దీపింపఁ దన్ను నుతింప వెలసి
ధ్రువుఁడు నానొప్పి యవిఘ్న తుల్యుఁడగుచు
నున్న పుణ్యాత్ముఁ డిప్పుడు నున్నవాఁడు

వ. మఱియుఁ బృథుని యవతారంబు వినుము.

ఉ. వేనుఁడు విప్రభాషణవి ప్రహతిన్మృతి భాగ్యపౌరుషం
దై నిరయంబునం బడిన నాత్మతనూభవుఁడై పృథుండు నాఁ

బూని జనించి తజ్జనకుఁ బున్నరకంబును బాపి మేదినిన్
ధేనువుఁ జేసి వస్తువితతిం బిదికెన్ హరి సత్కళాంశుఁడై. 140

వ. అని మఱియు వృషభావతారం బెఱింగింతు విను మాగ్నీధ్రుం [1]డనువానికి సుదేవివలన నాభి యనువాఁ డుదయించె నతనికి మేరుదేవియందు హరి వృషభావతారంబు నొంది జడస్వభావంబైన యోగంబు దాల్చి ప్రశాంతాంతఃకరణుండును బరిముక్తసంగుండును నై పరమహంసాభిగమ్యం బగు నపదం బిది యని మహాత్ములు వలుకుచుండం జరించె మఱియు హయగ్రీవావతారంబు సెప్పెద వినుము. 141

చ. అనఘచరిత్ర మస్మఖమునందు జనించె హయాననాఖ్యతన్
వినుతసువర్ణవర్ణుఁడును వేదమయుండు నశేషదేవతా
త్మకుం డనుపమయజ్ఞపూరుషుఁడు నైన భగవంతుఁడు దత్సమస్తపా
వన మగు నాసికాశ్వసనవర్గములం దుదయించె వేదముల్. 142

వ. మఱియు మత్స్యావతారంబు వినుము. 143

సీ. ఘనుఁడు వైవస్వతమనువుకు దృష్టుఁడై, యరుదెంచినట్టియుగాంత[2]సమయ
మందు విచిత్రమత్స్యావతారము దాల్చి, యఖిలావనిమయంబు నగుచుఁ జాల
సర్వజీవులకు నాశ్రయభూతుఁ డగుచు నే,కార్ణవంబై సలిలోచ్చయమున నడుమ
మనుముఖ్యులకు వేదమార్గంబులను జెప్పు, నడ పుండ శాఖ లేర్పడఁగఁ జేసి

తే. దివ్యలక్షణనానాకథలు దెచ్చి యిచ్చి, మనువు నెక్కించుకొన్నావ నవధినడుమ
మునుఁగకుండంగ నరసిన యనిమిషావ, తార మేరికి నుతియింపఁ దరమె వత్స.

వ. మఱియుఁ గూర్మావతారంబు వినుము, 145

మ. అమృతోత్పాదనయత్నులై విబుధదైత్యానీకముల్ మందరా
గముఁ గవ్వంబుగఁ జేసి యబ్ధిఁ దరువంగా గవ్వపుంగొండ వా
ర్ధి మునుంగన్ హరి కూర్మరూపమున నద్రిం దాల్చెఁ దత్పర్వత
భ్రమణవ్యాజత వీఁపుఁదీఁట శమియింపం జేయఁగా నారదా. 146

వ. వెండియు నృసింహావతారంబు వినుము. 147

మ. సురలోకంబుఁ గలంచి దేవసమితిన్ స్రుక్కించి యుగ్రగదా
ధనుఁడై వచ్చు నిశాచరుం గని కనద్దంష్ట్రాకరాళాస్యవి
స్ఫురితభ్రూకుటితో నృసింహాకృతి రక్షోరాజవక్షంబు ఖ
కరభాస్వన్నఖరాజిఁ ద్రుంచె ద్రిజగత్కల్యాణసంధాయియై. 148

వ. ఇంక నాదిమూలావతారంబు సెప్పెద వినుము. 149

1 'డనువానికి నాభి యను...... మేరుదేవి యను నామాంతరంబు గల సుదేవియందు' అచ్చుప్రతి. 2 మందు, నౌన్నత్యలీల మత్స్యావతారము.

మ. కరినాథుండు జలగ్రహగ్రహణదుఃఖాక్రాంతుఁడై వేయివ
త్సరముల్ గుయ్యిడుచుండ వేల్పులకు విశ్వవ్యాప్తి లేకుండుటన్
హరి నీవే శరణంబు నా కనినఁ గుయ్యాలించి [1]వేవేగ వా
శ్చరముం ద్రుంచి కరీంద్రుఁ గాచె మహితోత్సాహంబునం దాపసా. 150

వ. మఱియును వామనావతారంబు వినుము. 151

సీ. యజ్ఞేశ్వరుం డగుహరి విష్ణుఁ డదితిసం, తానంబునకు నెల్లఁ దమ్ముఁ డయ్యుఁ
బెం పారుగుణములఁ బెద్ద యై వామన, మూర్తితో బలిచక్రవర్తిఁ జేరి
తద్భూమి మూఁడుపాదముల నడిగి పదత్రయంబునకు జగత్త్రయంబు
వంచించి కొనియును వాసవునకు రాజ్య, మందింప నీశ్వరుండయ్యు మొఱఁగి

తే. యర్థిరూపంబుఁ గొనియడుగవలసె, ధారిత్రికులస్వాము వినయోచితములఁ గాని
వెడఁగుఁదనమున నూరక విగ్రహించి, చలన మందింపరాదు నిశ్చయము పుత్త్ర.

చ. బలి నిజమౌళి నవ్వటునిపాదసరోరుహభవ్యతీర్థము
త్కలిక ధరించి తన్నును జగత్త్రయమున్ హరి కిచ్చి కీర్తులన్
నిలిపె వసుంధరాస్థలిని నిర్జరలోకవిభుత్వహానికిం
దలఁకక శుక్రుమాటలకుఁ దారక భూరివదాన్యశీలుఁడై. 153

వ. మఱియు నప్పరమేశ్వరుండు నారదా నీకు హంసావతారంబు నొంది యతిశయభక్తియోగంబున సంతుష్టాంతరంగుం డగుచు నాత్మతత్త్వప్రదీపకం బగు భాగవతమహాపురాణం బుపదేశించె మన్వవతారంబు నొంది స్వకీయతేజఃప్రభావంబున నప్రతిహతం బైనచక్రంబు ధరియించి దుష్టవర్తను లైనరాజుల దండించుచు శిష్టప్రతిపాలనంబు సేయుచు నాత్మీయకీర్తిచంద్రికలు సత్యలోకంబున వెలింగించె మఱియు ధన్వంతరి యన నవతరించి తననామస్మరణంబున భూజనంబులకు సకలరోగనివారణంబు సేయుచు నాయుర్వేదంబు గల్పించె నింకఁ బరశురామావతారంబు వినుము. 154

మ. ధరణీకంటకు లైన హైహయనరేంద్రవ్రాతమున్ భూరివి
స్ఫురితోదారకుఠారధారఁ గలనన్ ముయ్యేడుమాఱుల్ పోరిం
బోరి మర్దించి సమస్తభూతలము విప్రుల్ వేఁడఁగా నిచ్చి [2]భా
సురకీర్తిన్ జమదగ్నిరాముఁ డన మించుం దాపసేంద్రోత్తమా. 155

వ. మఱియు శ్రీరామావతారంబు సెప్పెద వినుము. 156

సీ. తోయజహితవంశదుగ్ధపారావార, రాకావిహారకైరవహితుండుఁ
గమనీయకోసలక్ష్మాభృత్సుతాగర్భ, శుక్తిసంపుటలసన్మౌక్తికంబు
నిజపాదసేవకవ్రజదుఃఖనిబిడాంధ, కారవిస్ఫురితపంకరుహసఖుఁడు
దశరథేశ్వరకృతాధ్వరవాటికాప్రాంగ, ణాకరదేవతానోకహంబుఁ

---

1 వక్రంబు కం, ధరముం. 2 తాఁ, జరకీర్తిన్······మించెం.

తే. ఖలదానవగహనవైశ్వానరుండు, రావణాటోపశైలపురందరుండు
నగుచు లోకోపకారార్థ మవతరించె, రాముఁ డై చక్రి లోకాభిరాముఁ
క. చిత్రముగ భరతలక్ష్మణ, శత్రుఘ్నుల కర్థి నగ్రజన్ముం డగుచున్ [డగుచు.
ధాత్రిన్ రాముఁడు వెలసెఁ బవిత్రుఁడు దుర్భవలతాలవిత్రుం డగుచున్.
వ. అంత. 159

సీ. కిసలయఖండేందుబిసకుంద[1]పద్మాబ్జ, పదఫాలభుజరదపాణినేత్రఁ
గాహళకరభచక్రవియత్పులినశంఖ, జంఘోరుకుచమధ్యజఘనకంఠ
ముకురచందనబింబశుకగజశ్రీకార, గండగంధోష్ఠగమనకర్ణఁ
జంపకేందుస్వర్ణ[2]శఫరధనుర్నీల, నాసాననాంగదృగ్భ్రూశిరోజ
తే. నలిసుధావర్తకుంతలహాసనాభి, కలిత జనకావనీపాలకన్యకాల
లామఁ బరిణయ మయ్యె లలాటనేత్ర, కార్ముకధ్వంస ముంకువగాఁగ నతఁడు.
వ. అంత. 161

క. రామున్ మేచకజలద, శ్యామున్ సుగుణాభిరాము సద్వైభవసు
త్రామున్ దుష్టనిశాటవి, రాముం బొమ్మనియెఁ బంక్తిరథుఁ డడవులకున్. 162
వ. ఇట్లు వంచిన. 163

చ. అరుదుగ లక్ష్మణుండు జనకాత్మజయుం దనతోడ నేఁగుదే
నరిగి రఘూత్తముండు మునమారఁగఁ జొచ్చెఁ దరక్షు సింహ సూ
కర కరి పుండరీక కపి ఖడ్గ కురంగ వృకాహి భల్ల కా
సరముఖవన్యసత్త్వచయచండతరాటవి దండకాటవిన్. 164
క. ఆవనమున వసియించి నృ, పావననయశాలి యిచ్చె నభయములు జగ
త్పావనమునిసంతతికిఁ గృ, పావననిధి యైనరామభద్రుం డెలమిన్. 165
క. ఖరకరకులజలనిధిహిమ, కరుఁ డగురఘురామవిభుఁడు గఱకటితోడన్
ఖరుని వధించెను ఘనభీ, కరశరముల నఖిలజనులుఁ గర మరు దందన్. 166
క. హరిసుతుఁ బరిచరుఁగాఁ గొని, హరిసుతుఁ దునుమాడి పనిచె హరిపురమునకున్
హరివిభునకు హరిమధ్యను, హరిరాజ్యపదంబు నిచ్చె హరివిక్రముఁ డై. 167
వ. అంత సీతానిమిత్తంబునం ద్రిలోకకంటకుం డగుదశకంఠుం దునుమాడుటకునై
కపిసేనాసమేతుం డయి చని ముందట నతిదుర్గమం బయినసముద్రంబు పేర్చి
తెరువు సూప కున్న నలిగి. 168

మ. వికటభ్రూకుటిఫాలభాగుఁ డగుచున్ వీరుండు క్రోధారుణాం
బకుఁ డై చూచినయంతమాత్రమున నప్పాథోధి సంతప్తతో
యకణ గ్రాహ తిమింగిల ప్లవ ఢులీ వ్యాళప్రవాళోర్మిభృ
ద్బక కారండవ చక్ర ముఖ్యజలసత్త్వశ్రేణితో నింకినన్ 169

1 పద్మాస్త్రీ. 2 శంపాధనుర్నీల.

వ. అయ్యవసరంబున సముద్రుండు గరుణాసముద్రుం డగు శ్రీరామభద్రుని శరణంబు సొచ్చినం గరుణించి యెప్పటియట్ల నిలిపి నలునిచే సేతువు బంధింపించి తన్మార్గంబునం జని. 170

మ. పురముల్ మూఁడును నొక్కబాణమున నిర్మూలంబు గావించు శం
కరుచందంబున నేర్చి రాఘవుఁడు లంకాపట్టణం బిద్ధగో
పురశాలాంగణహర్మ్యరాజభవనప్రోద్యత్ప్రతోళీకపా
టరథాశ్వద్విపశస్త్రమందిరనిశాటశ్రేణితో వ్రేల్మిడిన్. 171

క. రావణు నఖిలజగద్వి, ద్రావణుఁ బరిమార్చి నిలిపె రక్షోవిభుఁ గా
రావణు ననుజన్ముని నై, రావణసితకీర్తి మెఱసి రాఘవుఁ డెలమిన్. 172

సీ. ధర్మసంరక్షకత్వప్రభావుం డయ్యు, ధర్మవిధ్వంసకత్వమునఁ బొదలి
ఖరదండనాభిముఖ్యతఁ బొంద కుండియు, ఖరదండనాభిముఖ్యతను మెఱసి
పుణ్యజనావనస్ఫూర్తిఁ బెంపొందియుఁ, బుణ్యజనాంతకస్ఫురణఁ దనరి
సంతతాశ్రితవిభీషణుఁడు గాకుండియు, సంతతాశ్రితవిభీషణత నొప్పి

తే. మించెఁ దనకీర్తిచేత వాసించె దిశలు, దరమె నుతియింప జగతి నెవ్వరికి నైనఁ
జారుతరమూర్తి నవనీశచక్రవర్తిఁ, బ్రకటగుణసాంద్రు దశరథరామచంద్రు.

వ. అట్టి శ్రీరామావతారంబు జగత్పావనంబును నస్మత్ప్రసాదకారణంబును నై నుతి కెక్కె నింకఁ గృష్ణావతారంబు వివరించెద వినుము. 174

సీ. తాపసోత్తమ విను దైత్యాంశములఁ బుట్టి, నరనాథవితతి సేనాసమేతు
లగుచు ధర్మేతరులై ధాత్రిఁ బెక్కుబాధల నలంచుటఁ జేసి ధరణి వగలఁ
బొందుచు వాపోవ భూభార ముడుపుట, కై హరి పరుఁడు నారాయణుండు
[1]తన మేనిధవళాసితపుఁగేశయుగమున, బలరామకృష్ణరూపములఁ దనరి

తే. యదుకులంబున లీలతో నుదయ మయ్యె, భవ్యయశుఁ డగువసుదేవుభార్య లైన
రోహిణియు దేవకియును నురూపవతుల, యందు నున్నతదైత్య[2]సంహారి యగుచు.

వ. ఇట్లు పుండరీకాక్షుం డగు నారాయణుండు సమస్తభూభారనివారణంబు సేయం దన మేని కేశద్వయంబ చాలు నని యాత్మప్రభావంబు దెలుపుకొఱకు నిజకళాంశసంభవు లైన రామకృష్ణుల దేహవర్ణంబులు శ్వేతకృష్ణంబు లని నిర్దేశించుకొఱకు సితాసితకేశద్వయవ్యాజంబున రామకృష్ణాఖ్యల నలరి యవతరించె నందు భగవంతుండును సాక్షాద్విష్ణుండును నైన కృష్ణుండు జనమార్గవర్తి యయ్యును నతిమానుషకర్మంబుల నాచరించుటం జేసి కేవలపరమేశ్వరుం డయ్యె నమ్మహాత్ముం డాచరించు కార్యంబులు లెక్క వెట్ట నెవ్వరికి నలవి గా దయినను నాకు గోచరించినయంత యెఱింగించెద వినుము. 176

క. నూతనగరళస్తని యగు, పూతనఁ బురిటింటిలోనఁ బొత్తులశిశు వై

---

1 'చెచ్చెరఁ దనసితాసితకేశ' అ. ప్ర. 2 'సంహారు లగుచు' వ్రా. ప్ర.

చేతనమును హరియించి ప, రేతనగరమునకు ననిచెఁ గృష్ణుఁడు పెలుచన్. 177

క. వికటముగ నిజపదాహతిఁ, బ్రకటముగా మూఁడునెలలబాలకుఁ డై యా
శకటనిశాచరు నంతక, నికటస్థునిఁ జేసె భక్తనికరావనుఁ డై. 178

క. ముద్దులకొమరుని వ్రేతల, రద్దుల కై తల్లి ఱోల రజ్జునఁ గట్ట
[1]న్మద్దు లన మిన్ను ముట్టిన, మద్దుల వడిఁ గూల్చె జనసమాజము వొఁగడన్.

మ. [2]మదిఁ గృష్ణుండు యశోదబిడ్డఁ డని నమ్మం జాల యోగీంద్ర త
ద్వదనాంభోజములోఁ జరాచరసమస్తప్రాణిజాతాటవీ
నదనద్యద్రిపయోధియుక్త మగునానాలోకజాలంబు భా
స్వదనూనక్రియఁ జూపెఁ దల్లికి మహాశ్చర్యంబు వాటిల్లఁగన్. 180

చ. వరయమునానదీహ్రదనివాసకుఁ డై నిజవక్త్రనిర్గత
స్ఫురితవిషాంబుపానమున భూజనులన్ మృతిఁ బొందఁ జేయుభీ
కరగరళద్విజిహ్వుఁ డగుకాళియపన్నగుఁ దన్నదంబుఁ జె
చ్చెర వెడలించి కాచె యదుసింహుఁడు గోపకగోగణంబులన్. 181

మ. తనయా [3]గోపకు లొక్కరేయి తటి నిద్రం జెందఁ గార్చిచ్చు వ
చ్చినఁ గృష్ణా మము నగ్నిపీడితుల రక్షింపం దగుం గావవే
యనినం గన్నులు మీరు మోడ్చుఁ డిదె దావాగ్నిన్ వెస న్నాస్త నే
నన వా రట్ల యొనర్ప మ్రింగె శిఖిఁ బద్మాక్షుండు లీలాగతిన్. 182

క. మందునిగతి యమునాంబువు, లందు నిసిం గ్రుంకి బద్ధుఁ డై చిక్కినయా
నందుని వరుణునిబంధన, మందు నివృత్తునిఁగఁ జేసె హరి సదయుం డై. 183

మ. హయసూనుం డగుదానవుండు నిజమాయన్ గోపరాజిన్ గుహా
[4]శ్రయ యౌన న్నొనరించి తత్పథము నీరంధ్రంబు గావించినన్
రయ మొప్పం గుటిలాసురాధమునిఁ బోరం ద్రుంచి గోపావళిన్
దయతోఁ గాచినకృష్ణుసన్మహిమ మేతన్మాత్రమే తాపసా. 184

క. దివిజేంద్రప్రీతిగ వ,ల్లవజను లేఁటేఁటఁ జేయులాలితసవనో
త్సవము హరి మానిపిన గో,పవరులు గావింప కుస్న బలరిపుఁ డలుకన్. 185

తే. మందగొందలమంద నమందవృష్టిఁ, గ్రందుకొనుఁడంచునింద్రుండు మందలింపఁ
జండపవనసముద్ధూతచటులవిలయ, సమయసంవర్తకాభీలజలధరములు. 186

శా. సప్తస్కంధశిఖాకలాపరుచిమత్సౌదామనీవల్లికా
దీప్తోదగ్రముహుస్తమఃపిహితధాత్రీభాగనీరంధ్ర మై

1 'బద్దులను మిన్ను' అ. ప్ర. 2 'మదిలోఁ గృష్ణుఁ డశోద' అనియే వ్రాఁతప్రతులు. 3 'యొక్కనిశందు గోపకులు నిద్రం' అనియే వ్రా. ప్ర. 4 'శ్రయులంగా నొనరించి' అనియే వ్రాఁతప్రతులు.

సప్తాశ్వస్ఫురదిందుమండలనభస్సంఛాదితాశాంతర
వ్యాప్తాంభోదనిరర్గళస్ఫుటశిలావాఃపూరధారాళమై. 187

వ. కురియువానజల్లుపెల్లున రిమ్మలు గొని సొమ్మలువోయి గోకులం బాకులం బయి కృష్ణ కృష్ణ రక్షింపు రక్షింపు మని యార్తిం బొంది కుయ్యిడ నఖండకరుణాసముద్రుండును భక్తజనసురద్రుముండును నగుచుం బుండరీకాక్షుండు. 188

శా. సప్తాబ్దంబులబాలుఁడై నిజభుజాస్తంభంబునన్ లీలతో
సప్తాహంబులు శైలరాజము లసచ్ఛత్త్రంబుగాఁ దాల్చి సం
గుప్తప్రాణులఁ జేసె మాధవుఁడు గోగోపాలకవ్రాతమున్
సప్తాంభోధిపరీతభూధరున కాశ్చర్యంబు చింతింపఁగన్. 189

సీ. సాంద్రశరచ్చంద్రచంద్రికాధవళిత, విమలబృందావనవీథియందు
రాసకేళీమహోల్లాసుఁడై యుత్ఫుల్ల,జలజాక్షుఁ డొకనిశాసమయమునను
దనరారుమంద్రమధ్యమతారముల నింపు, దళుకొత్త రాగభేదములఁ జెలఁగి
ధైవతఋషభగాంధారనిషాదపం,చమషడ్జమధ్యమస్వరము లోలిఁ

తే. గళలు జాతులు మూర్ఛనల్ గలుగ వేణు
నాళవివరాంగుళిన్యాసలాలనమున
మహితగతిఁ బాడె నవ్యక్తమధురముగను
బంకజాక్షుండు దారువు లంకురింప. 190

మ. హరివంశోద్గతమంజులస్వననినా[1]దాహూతలై గోపసుం
దరు లేతేర ధనేశుచారుఁ డగు గంధర్వుండు గొంపోవఁ ద
త్తరుణుల్ గుయ్యిడ శంఖచూడునిభుజాదర్పంబు మాయించి తాఁ
బరిరక్షించినయట్టికృష్ణుని నుతింపన్ శక్యమే యేరికిన్. 191

చ. నరక మురప్రలంబ యవన ద్వివిద ముష్టిక మల్ల కంస శం
బర శిశుపాల పంచజన పౌండ్రక పల్వల దంతవక్త్ర వా
నర ఖర సాల్వ వత్స బక నాగ విదూరథ రుక్మి కేశి ద
ర్దుర వృష ధేనుక ప్రముఖదుష్టనిశాటులఁ ద్రుంచె వేల్మిడిన్. 192

వ. మఱియును. 193

మ. [2]బలభీమార్జునముఖ్యచాపధరరూపవ్యాజతం గ్రూరులన్
ఖలులన్ దుష్టధరాతలేశ్వరుల సంగ్రామైకపారీణదో
ర్బలకేళిం దునుమాడి సర్వధరణీభారంబు మాయించి సా
ధుల రక్షించినయట్టికృష్ణుని ననంతుం గొల్తు నెల్లప్పుడున్. 194

వ. అట్టిలోకోత్కృష్టుండైనకృష్ణునియవతారమాహాత్మ్యం బెఱింగించితి నింక వ్యాసావతారంబు వినుము. 195

1 'దాహూయలై' అని వ్రా. 2 'బలభీమార్జునచాపనైపుణులరూపవ్యాజతం' అనియు వ్రా.

చ. [1]ప్రతియుగమందు సంకుచితభావులు నల్పతరాయువుల్ సుదు
ర్గతికులు నైనమర్త్యుల కగమ్యములున్ స్వకృతంబులున్ సుశా
శ్వతములు నైనవేదతరుశాఖలు దా విభజించినట్టిస
న్నుతుఁడు పరాశరప్రియతనూజుఁడు నా హరి పుట్టె నర్మిలిన్. 196

వ. మఱియు బుద్ధావతారంబు వినుము. 197

మ. అతిలోభాత్ములు సూనృతేతరులు భేదాచారసంశీలు రు
ద్ధతపాషండమతౌపధర్మ్యులు జగత్సంహారు లైనట్టియా
[2]దితిసంజాతు లధర్మవాసనల వర్తింపం దదాచారసం
హతి మాయించి హరించె దానవులఁ బద్మాక్షుండు బుద్ధాకృతిన్. 198

వ. మఱియుఁ గల్క్యవతారంబు వినుము. 199

మ. వసజాతు స్తవశూన్యు లై మఱి వషట్స్వాహాస్వధావాక్యశో
భసరాహిత్యులు సూనృతేతరులునుం బాషండులు నైనవి
ప్రనికాయంబును శూద్రభూపులుఁ గలిం బాటిల్లినం గల్కి యై
జననం బంది యధర్మము న్నడఁచు సంస్థాపించు ధర్మంబులన్. 200

వ. అని మఱియుఁ బితామహుండు నారదున కిట్లనియె మునీంద్రా పుండరీకాక్షుం డంగీకరించినలీలావతారకథావృత్తాంతంబు నేను నీకు నెఱింగించునంతకు మున్న హరి వరాహాద్యవతారంబు లంగీకరించి తత్ప్రయోజనంబులఁ దీర్చె మన్వంతరావతారంబు లంగీకరించినవియు నంగీకరింపం గలవియు నై యున్నయవి వర్తమానంబున ధన్వంతరిపరశురామావతారంబులుం దాల్చి యున్నవాఁడు భావికాలంబున శ్రీరామాద్యవతారంబుల నంగీకరింపంగలవాఁ డమ్మహాత్ముండు సృష్ట్యాదికార్యభేదంబులకొఱకు మాయాగుణావతారంబు లందు బహుశక్తిధారణుం డై యభగవంతుండు సర్గాదిని దపస్సులును నేనును ఋషిగణంబులును నవప్రజాపతులును నై యవతరించి విశ్వోత్పాదనంబు గావించుచుండు ధర్మంబును విష్ణుండును యజ్ఞంబులును మనువులును నింద్రాది దేవగణంబులును ధాత్రీపతులును నయి యవతరించి జగంబుల రక్షించుచుండు నధర్మంబును రుద్రుండును మ

---

1 "ఉ. ప్రత్యుగమందు సంకుచితభావులు నల్పతరాయువుల్ సుదు
ర్గత్యగు లైనమర్త్యుల కగమ్యమునున్ స్వకృతంబు నిత్యమున్
సత్యము నైనవేదతరుశాఖలఁ దా విభజించినట్టియా
సాత్యవతేయమూర్తియయి జాతమునొందె హరి ప్రసన్నుఁడై". అని మే వ్రాఁతప్రతులం దీపద్యము చూపట్టుచున్నది. యకారమును అచ్చుగాఁగొని పూర్వస్వరముతో సంధిగూర్చుట నాచయ కవనమునఁ బెక్కుచోట్లఁ జూపట్టెడి. 'యజ్ఞాంగుఁ డెజ్ఞఫలదుఁడు' 'మదిలోఁ గృష్ణుఁ డెశోద' 'ప్రత్యుగమందు' ఇత్యాదులు పెక్కుగలవు. పండితులు సాంతకవనముతో వీనిని దిద్దిరని తోఁచెడిని.

2 'దితిసంతాన మనంతధామముల' వ్రా. ప్ర.

హోరగంబులును రాక్షసానీకంబులును నై (యవతరించి) విలయంబు నొందించు
చుండు నిస్త్రైగుణ్యుండునుం బరమేశ్వరుండును సర్వాత్మకుండును నైనహరి విశ్వోత్ప
త్తిస్థితిలయహేతుభూతుం డై విలసిల్లు ధరణీరేణువుల నయిన గణుతింప నలవి
యగుం గాని యమ్మహాత్మునిలీలావ[1]తారాద్భుతకర్మంబులు లెక్కవెట్ట నెవ్వరికి
నశక్యం బై యుండు నీకు సంక్షేపరూపంబున నుపన్యసించితి సవిస్తరంబుగా
నెఱింగింప నాకుం దరంబు గా దనిన నన్యులం జెప్ప నేల వినుము. 201

చ. అమరఁ ద్రివిక్రమస్ఫురణ నందినయమ్మహితాత్ముపాదవే
గమున హతంబు లైనత్రిజగంబుల కావల వెల్గుసత్యలో
కము చలియించినం గరుణఁ గైకొని కాచి [2]ధరించెఁ బాదప
ద్మమునను నట్టియప్రతిహతం బగుశక్తి గణింప శక్యమే. 202

మ. హరిమాయాబల మే నెఱుంగ నఁట శక్యంబే సనందాదిస
త్పురుషవ్రాతము కైన బుద్ధి నితరంబున్ మాని సేవాధిక
స్ఫురణం దచ్చరితానురాగ[3]గుణవిస్ఫూర్తిన్ సహస్రాస్యుఁ డ
నరతం బొల్పగు శేషుఁడుం దెలియఁ డన్నన్ జెప్ప నే లొండొరున్. 203

చ. ఇతరము మాని తన్ను మది నెంతయు నమ్మి భజించువారి నా
శ్రితజనసేవితాంఘ్రిసరసీరుహుఁ డైనసరోజనాభుఁ డం
చితదయతోడ నిష్కపటచిత్తమునం గరుణించునట్టివా
రతులదురంత మై తనరునవ్విభుమాయఁ దరింతు రెప్పుడున్. 204

వ. మఱియును సంసారమగ్ను లయి దివసంబులు [4]ద్రోచియు నంతంబున శునక
సృగాలభక్ష్యంబు లైనకాయంబులందు మమత్వంబు సేయక భగవదర్పణంబు
సేసినపుణ్యాత్ములుం గొందఱు గల రెఱింగింతు వినుము నేను నీబ్రహ్మత్వంబునం
జెందురాజసంబు విడిచి యమ్మహాత్మునిపాదారవిందంబుల భక్తినిష్ఠుండ నయి
శరణాగతత్వంబున భజియించునప్పుడు దెలియుదు రాజసగుణుండ నై యున్న
వేళం దెలియం జాలఁ గావున శాస్త్రంబులు ప్రపంచింపక కేవలభక్తిజ్ఞానయో
గంబున సేవింతు మఱియు సనకాదు లగుమీరును భగవంతుం డైనరుద్రుండును
దైత్యపతియైనప్రహ్లాదుండును స్వాయంభువమనువును నతనిపత్ని (యగుశతరూప)
యుఁ దత్పుత్త్రు (లగుప్రియవ్రతోత్తానపాదు)లునుం బ్రాచీనబర్హియు ఋభువు
ను (వేనజనకుం డగునంగుండును) ధ్రువుండును వెండియు. 205

సీ. గాధి రఘూత్త మేక్ష్వాకు దిలీప మాం, ధాతృ భీష్మ శుక యయాతి సగర
రఘు ముచుకుం దైళ రంతిదే వోద్ధవ, సారస్వ తోదంక భూరిషేణ
శ్రుతదేవ మారుతి శతధన్వ పిప్పల, బలి విభీషణ శిబి పార్థ విదురు
లంబరీష పరాశ రాలర్క దేవల, సౌభరి మిథిలేశ్వ రాభిమన్యు

---

1 తారంబులు లెక్క. 2 ధరించుపాద. 3 'గణిత; గణుతి' వ్రా. ప్ర. 4 ద్రొబ్బియు.

తే. లార్ష్టిషేణాదు లైనమహాత్ము లెలమిఁ, దవిలి యద్దేవుభక్తిఁ జిత్తముల నిల్పి
తత్పరాయణు లౌట దుర్దాంత మైన, విష్ణుమాయఁ దరింతురు విమలచరిత.

మ. అనఘా వీరల నెన్న నేమిటికిఁ దిర్యగ్జంతుసంతానప
క్షినిశాటాటవికాఘజీవనివహస్త్రీశూద్రహూణాదు లై
నను నారాయణభక్తియోగమహితానందాత్ము లై రేని వా
రనయంబుం దరియింతు రవ్విభునిమాయావైభవాంభోనిధిన్. 207

వ. కావున. 208

క. శశ్వత్ప్రశాంతు నభయుని, విశ్వాత్ముఁ బ్రబోధమాత్రు విభు సంశుద్ధున్
శాశ్వతు సదసత్పూరుషు, నీశ్వరుఁ జిత్తమున నిలుపు మెప్పుడు మునీంద్రా. 209

వ. అట్లయిన నప్పుణ్యాత్ముల ననవద్యశీలుర నవిద్య లజ్జావనతవదన యై పొందంజాలక వైముఖ్యంబున దవ్వుదవ్వులం దలంగి పోవు మఱియును. 210

చ. హరిఁ బరమాత్ము నచ్యుతు ననంతునిఁ జిత్తములం దలంచి సు
స్థిరత విశోక[1]సౌఖ్యములఁ జెందినధీనిధు లన్యకృత్యము
లఱియఁ జేయ నొల్లరు తలంచిన నట్టిద యౌ సురేంద్రుఁడుం
బరువడి నుయ్యి ద్రవ్వునె పిపాసితుఁ డై సలిలాభిలాషితన్. 211

ఉ. సర్వఫలప్రదాతయును సర్వశరణ్యుఁడు సర్వశక్తుఁడున్
సర్వజగత్ప్రసిద్ధుఁడును సర్వగతుం డగుచక్రపాణి యా
సర్వశరీరులున్ విగమసంగతిఁ జెంది విశీర్యమాణు లై
పర్వినచో [2]నభంబుగతి బ్రహ్మము దాఁ జెడ కుండు నెప్పుడున్. 212

ఉ. కారణకార్యహేతు వగుకంజదళాక్షునికంటె నన్యు లె
వ్వారును లేరు తండ్రి భగవంతు ననంతుని విశ్వభావనో
దారుని సద్గుణావళు లుదాత్తమతిం గొనియాడ కుండినం
జేరవు చిత్తముల్ ప్రకృతిఁ జెందనినిర్గుణ మైనబ్రహ్మమున్. 213

మ. నిగమార్థప్రతిపాదకప్రకట మై నిర్వాణసంధాయి గా
భగవంతుండు రచింప భాగవతకల్పక్ష్మాజ మై శాస్త్రరా
జగరిష్ఠం బగునీపురాణకథ సంక్షేపంబునం జెప్పితిన్
జగతిన్ నీవు రచింపు దీని నతివిస్తారంబుగాఁ బుత్రకా. 214

చ. పురుషభవంబు నొందుట యపూర్వము జన్మములందు నందు భూ
సురకులమందుఁ బుట్టు టతిచోద్యము నిట్లగుటన్ మనుష్యు ల
స్థిర మగుకార్యదుర్దశలచేత నశింపక విష్ణుసేవనా
పరతఁ దనర్చి నిత్య మగుభవ్యపథంబునఁ బొందు టొప్పదే. 215

1 రాజ్యములఁ. 2 నభంగగతి.

మ. ఉపవాసవ్రతశౌచశీలమఖసంధ్యోపాసనాగ్నిక్రియా
జపదానాధ్యయనాదికర్మముల మోక్షప్రాప్తి సేకూర ద
చ్చపుభక్తిన్ హరిఁ బుండరీకనయనున్ [1]సర్వాత్మశాయిన్ రమా
ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని సద్ధిం గొల్వ లే కుండినన్. 216

క. వనజాక్షుమహిమ నిత్యము, వినుతించుచు నోరులు పొగడ వినుచున్ మదిలో
ననుమోదించుచు నుండెడు, జనములు దన్మోహవశతఁ జనరు మునీంద్రా. 217

క. అని వాణీశుఁడు నారద, మునివరునకుఁ జెప్పినట్టి ముఖ్యకథాసూ
చన మతిభక్తిఁ బరీక్షి, జ్జనపాలునితోడ యోగిచంద్రుఁడు నుడివెన్. 218

పరీక్షితుఁడు శుకుని బ్రపంచోద్భవాదికంబు నడుగుట.

సీ. విను శుకయోగికి మనుజేశుఁ డిట్లను, మునినాథ దేవదర్శనుఁడు గలుగ
నారదమునికిఁ బంకేరుహభవుఁ డెఱిం, గించిన తెఱఁగు సత్కృప దలిర్ప
గణుతింప సత్త్వాదిగుణశూన్యుఁ డగుహరి, కమలాక్షు లోకమంగళము లైన
కథలు నా కెఱిఁగింపు కైకొని నిస్సంగ, మైననాహృదయాబ్జమందుఁ గృష్ణు
తే. భవ్యచరితుని నాద్యంతభావశూన్యుఁ, జిన్మయాకారు ననఘు లక్ష్మీసమేతు
నిలిపి యస్థిరవిభవంబు నిఖిలహేయ, భాజనం బైనయీకళేబరము విడుతు.

వ. అదియునుం గాక యెవ్వం డేని శ్రద్ధాభక్తియుక్తుం డై కృష్ణగుణకీర్తనంబులు
వినుచుం బలుకుచుండు నట్టివానిహృదయపద్మంబునందుఁ గర్ణరంధ్రమార్గంబులం
బ్రవేశించి కృష్ణుండు విశ్రమించి సలిలగతం బైన కలుషంబును శరత్కాలంబు
నివారించుచందంబున నాత్మగతం బైనమాలిన్యంబు నపకర్షించుఁ గావున. 220

మ. భరితోదగ్రనిదాఘతప్తుఁ డగునప్పాంథుం డరణ్యానిసం
[2]చరణక్లేశసముద్భవం బగుపిపాసం జెంది యాత్మీయమం
దిరముం జేరి గతశ్రముం డగుచు నెందేనిం జనఁ బోనిభం
గి రమాధీశుపదారవిందయుగసంగీభూతుఁ డై మానునే. 221

వ. అదియునుం గాక సకలభూతసంసర్గశూన్యం బైనయాత్మకు భూతసంసర్గం బేప్ర
కారంబునం గలిగె నది నిర్నిమిత్తంబునం జేసియో కర్మమూలంబునం జేసి
యో యాక్రమంబు నా కెఱింగింపుము. 222

సీ. ఎవ్వనినాభియం దెల్లలోకాంగసం, స్థానకారణపంకజంబు వొడమె
నం దుదయించి సర్వావయవస్ఫూర్తిఁ, దనరారునట్టిపితామహుండు
గడఁగి యెవ్వనియనుగ్రహమున నిఖిలభూ, తముల సృజించె నుత్కంఠతోడ
నట్టివిధాత యోగ్యుననుపున సర్వేశు, రూపంబు గనుఁగొనె రుచిరభంగి
తే. నాపరంజ్యోతి యైనపరమాత్మునకును, నలినజునకుఁ బ్రతీకవిన్యాసభావ
గతులవలనను భేదంబుగలదె చెప్పుమ, యతిదయాసాంద్ర యోగికులాబ్ధిచంద్ర.

1. సర్వాధిశాయిన్. 2 'చరణక్లేశపిపాసపీడితబుభుక్షుం' అని వ్రా. ప్ర.

వ. మఱియును భూతేశ్వరుం డయినసర్వేశ్వరుం డుత్పత్తిస్థితిలయకారణం బైనతన మాయను విడిచి రమానాయకుం డై యేయేప్రదేశంబుల శయనంబు సేసె నదియునుం గాక పురుషావయవంబులచేఁ బూర్వకాలంబున లోకపాలసమేతంబు లైనలోకంబు లెత్తెఱంగునం గల్పితంబు లయ్యె నదియునుం గాక మహాకల్పంబులును నవాంతరకల్పంబులును (భూతభవిష్యద్వర్తమానకాలంబులును) దేహాభిమానులై జనియించినదేవపితృమనుష్యాదులకుం గలుగు నాయుఃప్రమాణంబులును(బృహత్సూక్ష్మ)కాలానువర్తనంబును (నేయేకర్మంబులం జేసి) జీవు లే(యే లోకంబుల నొందుదురు మఱియు నే)యేకర్మంబులం జేసి దేవాదిశరీరంబులం బ్రాపింతు రట్టికర్మమార్గప్రకారంబును [1]సత్త్వాదిగుణంబులపరిణామంబు లగు దేవాదిరూపంబులం గోరుజీవులకు నేయేకర్మసముదాయం బెట్లు సేయం దగు నెవ్వానికి నర్పింపం దగు నవి యెవ్వానిచేత గ్రహింపంబడు భూపాతాళకకుబ్వ్యోమగ్రహనక్షత్రపర్వతంబులును సరిత్సముద్రంబులును ద్వీపంబులును నేప్రకారంబున సంభవించె నాయాస్థానంబులం గలవారిసంభవం బేలాగు (వియద్బాహ్యాభ్యంతరంబులం) గలుగు బ్రహ్మాండప్రమాణం బెంత మహాత్ములచరిత్రంబు లెట్టివి వర్ణాశ్రమవినిశ్చయంబులును ననుగతంబులై (యాశ్చర్యావహంబు లగు హరి)యవతారచరిత్రంబులును యుగంబులును యుగప్రమాణంబులును యుగధర్మంబులును బ్రతియుగంబునందును మనుష్యుల కేయే ధర్మంబు లాచరణీయంబు (లట్టిసాధారణధర్మంబులును విశేషధర్మంబులును జాతివిశేషధర్మంబులును రాజర్షిధర్మంబులును నాపత్కాలజీవనసాధనభూతంబు లగుధర్మంబులును)మహదాదితత్త్వంబులసంఖ్యయు సంఖ్యాలక్షణంబును నాతత్త్వంబులకు హేతుభూతలక్షణంబులును భగవత్సమారాధనవిధంబును నష్టాంగయోగక్రమంబును యోగీశ్వరులయణిమాద్యైశ్వర్యప్రకారంబును వారలయర్చిరాదిగతులును లింగశరీరభంగంబులును ఋగ్యజుస్సామవేదంబులును నుపవేదంబు లైన యాయుర్వేదాదులును ధర్మశాస్త్రంబులును నితిహాసపురాణంబులసంభవంబును సర్వభూతంబులయవాంతరప్రళయంబును (మహాప్రళయంబును) నిష్టాపూర్తంబులును (యాగాదివైదికకర్మజాలంబులును) వాపీకూపతటాకదేవాలయాదినిర్మాణంబులును నన్నదానం బారామప్రతిష్ఠ (మొదలగుస్మార్త) కర్మంబులును గ్రామ్యంబు లైనయగ్నిహోత్రంబు (లయనుష్ఠానప్రకారంబు)ను జీవసృష్టియు (ధర్మార్థకామంబు లనియెడుత్రివర్గంబున నాచరణప్రకారంబును మలినోపాధిక) పాషండసంభవంబును జీవాత్మబంధమోక్షప్రకారంబును స్వరూపావస్థానవిధంబును సర్వతంత్రుం (డైనయీశ్వరుం డాత్మమాయం జేసి సర్వకర్మసాక్షి య

1. గుణవంతు లయి పరిణామాపేక్షకు లయినవా రెవ్వరియం దేకర్మము లాచరింపఁ దగు నెవ్వనిచేత గ్రహింపంబడు.

య్యు) నమ్మాయ నెడఁబాసి యుదాసీనగతిని (విభుం డై) క్రీడించు తెఱంగును గ్రమంబునఁ బ్రసన్నుండ నై ననాకు నెఱింగింపుము బ్రాహ్మణశాపంబునం జేసి శోకవ్యాకులితచిత్తుండ నై యనశనవ్రతుండ నైననీవు వినుట యెట్లని సందేహింపవలవదు (త్వదీయముఖారవిందవినిస్సృత) నారాయణకథామృతపానకుతూహలి నై ననాకు నింద్రియంబులు వశంబు లై యుండు నది గావున నే నడిగిన ప్రశ్నంబులకు నుత్తరంబులు సవిస్తరంబులుగా [1]నానతిచ్చి కృతార్థునిం జేయఁ బరమేష్ఠితుల్యుండ వగునీవ పూర్వసంప్రదాయానురోధంబున నర్హుండ వగుదు వని విష్ణురాతుం డయినపరీక్షిన్నరేంద్రుండు బ్రహ్మరాతుం డైనశుకయోగి నడిగిన నతండు బ్రహ్మనారదసంవాదంబును నేకసంప్రదాయానుగతంబును గతానుగతిక ప్రకారంబును నై తొల్లి సర్వేశ్వరుండు బ్రహ్మకల్పంబున బ్రహ్మ కుపదేశించిన భాగవతపురాణంబు వేదతుల్యంబు నీ కెఱింగింతు వినుమని చెప్పె నని సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నట్లు శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. 224

సీ. భూపాలకోత్తమ భూతహితుండు సుజ్ఞానస్వరూపకుఁ డై నయట్టి
ప్రాణికి దేహసంబంధ మెట్లగు నన్న, మహి నొప్పనీశ్వరమాయ లేక
కలుగదు నిద్రలోఁ గలలోనఁ దోఁచిన, దేహబంధంబులు తెఱఁగువలెను
హరియోగమాయామహత్త్వంబునం బొంచ, భౌతికదేహసంబంధుఁ డగుచు
తే. నట్టిమాయాగుణంబుల నాత్మ యొలి
బాల్య కౌమార యౌవనభావములను
నరసుపర్వాదిమూర్తులఁ బొరసి యేను
నాయ దిది యనుసంసారమాయఁ దగిలి. 225

వ. వర్తించుచు నిట్లున్నజీవునికి భగవద్భక్తియోగంబున ముక్తి సంభవించుట యెట్లన్న నెప్పుడేని జీవుండు ప్రకృతిపురుషాతీతం బయినబ్రహ్మస్వరూపంబు నందు మహితధ్యాననిష్ఠుం డగు నప్పుడు విగతమోహుం డై యహంకారమమకారాత్మకం బయినసంసరణంబు దొలంగి ముక్తుం డయి యుండు మఱియు జీవేశ్వరులకు దేహసంబంధంబులు గానంబడు చుండు నట్టిదేహధారి యైనభగవంతునందలిభక్తిం జేసి జీవునకు ముక్తి యెత్తెఱంగునం గలుగు నని యడిగితివి జీవుం డవిద్యామహిమం జేసి కర్మానుగతం బయినమిథ్యారూపదేహసంబంధుండు భగవంతుండు నిజయోగమాయామహిమంబునం జేసి స్వేచ్ఛాపరికల్పితచిద్ఘనలీలావిగ్రహుండు గావున భగవంతుండై నయీశ్వరుండుస్వభజనంబు ముక్తిసాధనజ్ఞానార్థంబు కల్పితం బని చతుర్ముఖునకుఁ [2]దదీయనిష్కపటతపశ్చర్యాదిసేవితుం డయి నిజజ్ఞానానందఘనం బయినస్వరూపంబు సూపుచు నానతిచ్చె నదిగావున జీవునికి భగవద్భక్తి మోక్షప్రదాయకం బగు నిందులకు నొక్కయితిహాసంబు

1 నానతి మ్మని విష్ణురాతుం. 2 నాతనియొక్క నిష్కపట.

గల దెఱింగింతు నాకర్ణింపుము దాన [1]భవదీయసంశయనివృత్తి యయ్యెడు
నని శుకయోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె. 226

నారాయణుండు బ్రహ్మతపంబునకు మెచ్చి వరంబు లిచ్చుట.

సీ. హరిపాదభక్తిరఽహస్యోపదేష్టయు, నఖిలదేవతలకు ఽ నధివిభుండు
నైనవిధాత గఽల్పాదియందును నిజా, శ్రయపద్మమున కధిఽష్ఠాన మరయ
నర్థించి జలముల ఽ నన్వేషణముసేసి, నలినంబుమొదలు గాఽనంగ లేక
విసివి క్రమ్మఱను దఽద్బిసరుహాసీనుఁ డై, సృష్టినిర్మాణేచ్ఛఁ ఽ జిత్తమందుఁ
తే. జాలనూహించి తత్పరఽజ్ఞానమహిమ, సరణి మనమునఁ దోఁపక ఽ జడనుపడుచు
లోకజాలంబుఁ బుట్టింపఽ లేకమోహి, తాత్ముఁడై చింతనొందు నఽయ్యవసరమున.

వ. జలమధ్యంబున నుండి కాదిస్పర్శషోడశాక్షరంబును నేకవింశాక్షరంబునుం గా నక్షరద్వయం బినుమాఱు మహామునిజనధనం బయినతపస్తపేతివాక్యంబు వినంబడిన నవ్వాక్యంబు వలికినయప్పురుషుని వీక్షింపంగోరి నలుదిక్కులకుం జని వెదకి యెందునుం గానక మరలివచ్చి నిజస్థానంబైనపద్మంబునం దాసీనుండై యొక్కింత చింతించి యట్టివాక్యంబు దన్నుఁ దపంబు సేయు మని నియమించుటగాఁ దలంచి ప్రాణాయామపరాయణుండై జ్ఞానేంద్రియకర్మేంద్రియంబులజయించి యేకాగ్రచిత్తుండై సకలలోకసంతాపహేతు వగుతపంబు వేయిదివ్యవత్సరంబులు గావింప నీశ్వరుండు ప్రసన్నుండై పొడసూపిన నక్కమలసంభవుండు తత్క్షణంబ రాజసతామసమిశ్రసత్త్వగుణాతీతంబును శుద్ధసత్త్వగుణావాసంబును నకాలవిక్రమంబును సర్వలోకోన్నతంబును సకలసురగణస్తుత్యంబును లోభమోహభయవిరహితంబును నపునరావృత్తిమార్గంబును ననంతతేజోవిరాజితంబును నైన వైకుంఠపురంబుం బొడగని యందు. 228

సీ. సూర్యచంద్రానలఽస్ఫురణలఁ జొర నీక, నిజదీధితిస్ఫూర్తి ఽ నివ్వటిల్ల
దివ్యమణిప్రభాఽదీపితసౌధవి, మానగోపురహర్మ్యఽమండపములుఁ
బ్రసవగుచ్ఛస్వచ్ఛఽభరితకామితఫల, సంతానపాదపఽసముదయములుఁ
గాంచనదండసంఽగతమారుతోద్ధూత, తరళవిచిత్రకేఽతనచయములుఁ
తే. వికచకైరవదళదరఽవిందగతమ, రందరసపానమదవదిందిందిరప్ర
భూతమంజులనినదప్రఽబుద్ధరాజ, హంసశోభితవరకమఽలాకరములు. 229

సీ. వల నొప్పఁగా నద్వైఽవం కేశవాత్పర, మ్మని పల్కు రాజకీఽరావళియును
మహిమ [2]సర్వం విష్ణుఽమయ మీజగ త్తని, చదివెడుశారికాఽసముదయంబు
నే పారఁగా జితం ఽ తే పుండరీకాక్ష, యని లీలఁ బాడుపిఽకావళియును
లలిమీఱఁగా [3]మంగఽళం భగవాన్ విష్ణు, వో యని పల్కుమఽయూరములును

---

1 'భగవదీయశరీరబాధానివృత్తి'. అని వ్రాఁతప్రతులు. 2, 3 ఈరెండును వ్యాకరణదుష్టము లయ్యు వ్రాఁతప్రతుల నిట్లె కానిపించుచున్నవి. 2. జగద్విష్ణుమయ మఖిల మ్మని. 3, మంగళం మధుసూదన, యనుచుఁ బల్కెడుమయూరావళియును. అ. ప్ర.

తే. దవిలి [1]వషడితిస్వాహాస్వధానుశబ్ద
కలితముగ మ్రోయుమధుపనికాయములును
గలిగి యఖిలైకదివ్యమంగళవిలాస
మహిమఁ జెన్నొందు వైకుంఠమందిరంబు. 230

వ. మఱియుం బయోధరావళీవిభాసితనభంబునుంబోలె వెలుంగు చున్నయద్దివ్య
ధామంబునందు. 231

సీ. సలలితేందీవరశ్యామాయమానోజ్జ్వ, లాంగులు నవ్యపీతాంబరులును
ధవళారవిందసుందరపత్త్రనేత్రులు, సుకుమారతనులు భాసురవినూత్న
రత్నవిభూషణగ్రైవేయకంకణ, హారకేయూరమంజీరధరులు
నిత్యయౌవనులు వినిర్మలచరితులు, రోచిష్ణు లంచితారూఢయశులు
తే. నగుసునందుండు నందుండు నర్హణుండుఁ
బ్రబలుఁడును నాది యగునిజపార్శ్వచరులు
మఱియు వైదూర్యవిద్రుమామలమృణాళ
తుల్యగాత్రులు దను భక్తితో భజింప. 232

సీ. క్షాళితాఖిలకల్మషవ్రజామరనదీ, జనకకోమలపదాబ్జములవాని
నఖిలసంపత్కారణాపాంగలక్ష్మీవి, లాసితవక్షస్స్థలంబువానిఁ
బద్మమిత్రామిత్ర[2]భాసితకరుణాత, రంగితచారునేత్రములవాని
[3]భువననిర్మాణనైపుణభవ్యనిజజన్మ, కారణనాభిపంకజమువాని
తే. నహిహితాహితశయనవాహములవాని, సేవితామరతాపసశ్రేణివాని
నఖిలలోకంబులకు గురుఁడైనవానిఁ, గాంచెఁ బరమేష్ఠి కన్నులకఱవు దీఱ.

క. కమనీయరూపరేఖా, రమణీయతఁ జాల నొప్పురమణీమణి య
క్కమలాలయ దనమృదుకర,కమలంబుల విభునిపాదకమలము లొత్తన్. 234

వ. వెండియు. 235

శా. శ్రీకాంతాతిలకంబు రత్నరుచిరాజిప్రేంఖితస్వర్ణడో
లాకేళిన్ విలసింపఁ దత్కచభరాలంకారస్రగ్గంధలో
భాకీర్ణప్రచరన్మధువ్రతమనోజ్ఞాలోలనాదంబు ల
స్తోకానుస్వరలీల నొప్పఁగ నిజేశున్ వేడ్కతోఁ బాడఁగన్. 236

వ. అట్టినిత్యవిభూతియందు. 237

మ. సతతజ్ఞానరమాయశోబలమహైశ్వర్యాదియుక్తున్ జగ
త్పతి యజ్ఞేశు ననంతు నచ్యుతు దళత్పంకేరుహాక్షున్ శ్రియః

---

1 'శ్రౌషడ్వషట్స్వధేత్యాదిశబ్ద' అచ్చుప్రతి. 2 భాసితపుష్పక, న్నయనాభినవదళనంబువాని. 3 సృష్టికారణవిరించిప్రభూతస్థాన, కమనీయనాభి.

పతి నాద్యంతవికారదూరుఁ గరుణాపాథోనిధిన్ సాత్వతాం
పతి వర్ధిష్ణు సహిష్ణు విష్ణు గుణవిభ్రాజిష్ణు రోచిష్ణునిన్. 238

మ. దరహాసామృతపూరితాస్యు నిజభక్తత్రాణపారాయణు
న్నరుణాంభోరుహపత్రలోచనునిఁ [1]బీతావాసుఁ డై త్రైలోక్యసుం
దరు మంజీరకిరీటకుండలముఖోద్యద్భూషు యోగీశ్వరే
శ్వరు లక్ష్మీయుతవక్షుఁ జిన్మయు దయాసాంద్రుం జతుర్బాహునిన్. 239

వ. మఱియు ననర్ఘరత్నమయసింహాసనాసీనుండును సునందనందకుముదాదిసేవితుండును బ్రకృతిపురుషమహదహంకారంబు లనుచతుశ్శక్తులును గర్మేంద్రియజ్ఞానేంద్రియమనోమహాభూతంబు లనుషోడశశక్తులును బంచతన్మాత్రంబులును బరివేష్టింపఁ గోటికోట్యర్కప్రభావిభాసితుండును (స్వేతరాలభ్య)స్వాభావికసమస్తభాగ్యోదయుండును నై (స్వస్వరూపంబునం గ్రీడించుసర్వేశ్వరుం డై)నపరమపురుషుం బురుషోత్తముం బుండరీకాక్షు నారాయణుం జూచి సాంద్రానందకందళితహృదయారవిందుండును రోమాంచకంచుకితశరీరుండును నానందబాష్పధారాసిక్తకపోలుండును నగుచు. 240

క. వరపరమహంసగమ్య, స్ఫురణం దనరారుపరమపురుషునిపదపం
కరుహము లజుఁ డాత్మ చతు, శ్శిరములు సోఁకంగ నతులు సేసిన హరియున్.

చ. ప్రియుఁ డగుబొడ్డుఁదమ్మితొలిబిడ్డఁడు వేలుపుఁబెద్ద భూతసం
చయములఁ జేయుకర్త నిజశాసనపాత్రుఁడు ధాత మ్రొక్కినన్
దయ దళుకొత్తఁ బల్కెఁ బ్రమదస్మితచారుముఖారవిందుఁ డై
నయమునఁ బాణిపంకజమునన్ హరి యాతనిదేహ మంటుచున్. 242

వ. ఇట్లనియె. 243

ఆ. కపటమునుల కెంతకాలంబునకు నైన, సంతసింప నేను జలజగర్భ
చిరతపస్సమాధిఁ జెంది విసర్గేచ్ఛ, మెలఁగునిన్నుఁ బరిణమింతుఁ గాని. 244

తే. భద్ర మగుఁగాక నీకు నోపద్మగర్భ, వరము నిపుడిత్తు నెఱిఁగింపు వాంఛితంబు
దేవదేవుఁడ నగునస్మదీయపాద, దర్శనావధి వో విపద్దశల కనఘ. 245

చ. సరసిజగర్భ నీయెడఁ బ్రసన్నత నొంది మదీయలోక మే
నిరవుగఁ జూపు టెల్లను నహేతుకభూరిదయాకటాక్షవి
స్ఫురణన కాని నీ దగుతపోవిభవంబునఁ గాదు నీతప
శ్చరణము నాదువాక్యములసంగతిఁ గాదె సరోజసంభవా. 246

---

1 'బీతాచ్ఛాదు' అచ్చుప్రతి. 2 'ప్రియుఁ...తొలిబిడ్డఁడు...సం, చయములఁ బుట్టఁజేయు నిజశాసనపాత్రు నుపస్థితున్ మనో, దయ దళుకొత్తఁ బల్కె' అనియే వ్రాఁతప్రతులు.

క. [1]తప మనఁగ మత్స్వరూపము, తప మనుతరువునకు ఫలవితానము నే నా
తపమున కే జననస్థి, త్యుపసంహరణము లొనర్చుచుండుదుఁ దనయా. 247

క. కావున మద్భక్తికిఁ దప, మేవిధమున మూలధనము నిది నీమది రా
జీవభవ యెఱిఁగి తప మిటు, గావించుట విగతమోహకర్ముఁడ వింకన్. 248

క. అని యానతిచ్చి కమలజ, యొనయఁగ భవదీయమానససేప్సిత మే మై
నను నిత్తు వేఁడు మనినను, వనరుహసంభవుఁడు వికచవదనుం డగుచున్. 249

చ. హరివచనంబు లాత్మకుఁ బ్రియం బొనరింపఁ బయోజగర్భుఁ డో
పరమపదేశ యోగిజనభావన యీనిఖిలోర్వియందు నీ
యరయనియట్టియర్థ మొకఁ డైనను గల్గునె యైన నామదిన్
బెరసినకోర్కి దేవ వినిపింతు దయామతిఁ జిత్తగింపవే. 250

వ. దేవా సర్వభూతాంతర్యామి వై భగవంతుండ వై ననీకు నమస్కరించి మదీయ వాంఛితంబు విన్నవించెద నవధరింపు మవ్యక్తరూపంబు లై వెలుంగుభవదీయ స్థూలసూక్ష్మరూపంబులును నానాశక్త్యుపబృంహితంబు లైన బ్రహ్మాదిరూపంబులును నీయంత నీవే ధరియించి జగదుత్పత్తిస్థితిలయంబులం దంతుకీటంబునుం బోలెఁ గావించుచు నమోఘసంకల్పుండ వై లీలావిభూతిం గ్రీడించుమహిమంబుఁ దెలియునట్టిపరిజ్ఞానంబుఁ గృప సేయుము భవదీయశాసనంబున జగన్నిర్మాణంబు గావించునపుడు బ్రహ్మాభిమానంబునం జేసి యవశ్యంబును మహదహంకారంబులు నామదిం బొడముం గావునఁ దత్పరిహారార్థంబు వేఁడెద నన్నుం గరుణార్ద్రదృష్టి విలోకించి దయ సేయు మని విన్నవించిన నాలించి పుండరీకాక్షుం డతని కి ట్లనియె. 251

క. వారిజభవ శాస్త్రార్థవి, చారజ్ఞానమును భక్తిసమధికసాక్షా
త్కారము లనునీమూఁడు ను, దారత నీమనమునందు ధరియింప నగున్. 252

సీ. పరికింప మత్స్వరూపస్వభావములును, మహిమావతారకర్మములుఁ దెలియఁ
దత్త్వవిజ్ఞానంబు దలకొని మత్ప్రసా, దమునఁ గల్గెడి నీకుఁ గమలగర్భ
సృష్టిపూర్వమునఁ జర్చింప నేనొకరుండఁ, గలిగి యుండుదు వీతకర్మ నగుచు
సమధికస్థూలసూక్ష్మస్వరూపములుఁ ద, త్కారణప్రకృతియుఁ దగ మదంశ
ఆ. మందు లీన మైన నద్వితీయుండ నై, యుందు నాకు నన్య మొకటి లేదు
సృష్టికాలమందు [2]సృజ్యమానం బగు, జగము మత్స్వరూప మగును వత్స.

క. అరయఁగఁ గల్పప్రళయాం, తరమున నాద్యంతవిరహితక్రియతోడం
బరిపూర్ణనిత్యమహిమం, బరమాత్ముఁడ నై సరోజభవ యే నుందున్. 254

---

1 'తప మనఁగ నాదుహృదయము, దప మన మద్రూప మనఘ ధర్మము దప మా, తపమున నే జనన' అనియే వ్రాఁతప్రతులు. 2. దృష్టమానం బగు.

వ. అదియునుం గాక నీవు న న్నడిగినయీజగన్నిర్మాణమాయాప్రకారం బెఱింగింతు
లేనియర్థంబు శుక్తిరజతభ్రాంతియుంబోలె నేమిటి మహిమం దోఁచి క్రమ్మఱం
దోఁపకమాను నదియె నామాయామావిడంబనం బని యెఱుంగు మఱియునుం
గాక లేనియర్థంబు దృశ్యమానం బగుటను గలయర్థంబు దర్శనగోచరంబు గా
కుండుటను ద్విచంద్రాదికంబును దమఃప్రభాసంబును దృష్టాంతంబులుగాఁ దెలి
యు మే ప్రకారంబున మహాభూతంబులు భౌతికంబు లయిన ఘటపటాదులందుఁ
బ్రవేశించి యుండు నా ప్రకారంబున నేను నీభూతభౌతికంబు లయినసర్వకార్యం
బులందు సత్త్వాదిరూపంబులం బ్రవేశించి యుండుదు భౌతికంబులు భూతంబు
లందుఁ గారణావస్థం బొందుచందంబున భూతభౌతికంబులు గారణావస్థం బొంది
నాయందు నభివ్యక్తంబులై యుండవు సర్వదేశంబులయందును సర్వకాలంబుల
యందును నేది చోదితం బై యుండు నట్టిదియ పరబ్రహ్మస్వరూపంబు తత్త్వం
బెఱుంగ నిచ్ఛయించిన మిముబోఁటివారలకు నీచెప్పినమదీయతత్త్వాత్మకం బైన
యర్థంబ యర్థం బని యెఱుఁగు మీయర్థం బుత్కృష్టం బయినయది యేకాగ్ర
చిత్తుండ వై యాకర్ణించి భవదీయచిత్తంబున ధరియించిన నీకు సర్గాదికర్మంబు
లందు మోహంబు సెంద కుండెడి నని భగవంతుం డయినపరమేశ్వరుండు చతు
ర్ముఖున కానతిచ్చి నిజలోకంబుతో నంతర్ధానంబు నొందె నని చెప్పి శుకుండు
వెండియు నిట్లనియె. 255

సీ. అవనీశ బ్రహ్మ యి ట్లంతర్హితుం డైనఁ, బుండరీకాక్షుని బుద్ధి నిలిపి
యానందమునఁ బొంది యంజలి గావించి, తత్పరిగ్రహమునఁ దనదుబుద్ధి
గైకొని పూర్వప్రకారంబునను సమ, స్తప్రపంచంబును దగ సృజించి
మఱియొకనాఁడు ధర్మప్రవర్తకుఁ డగు, చఖిలప్రజాపతి యైనకమల
తే. గర్భుఁ డాత్మహితార్థమై కాక సకల, భువనహితబుద్ధి నున్నతస్ఫురణ మెఱసి
మానితం బైనయమనియమములరెంటి, నాచరించెను సమ్మోదితాత్ముఁ డగుచు.
వ. అయ్యవసరంబున. 257
క. ఆనలినాసననందను, లైనసనందాదిమునుల కగ్రేసరుఁడున్
మానుగఁ బ్రియతముఁడును నగు, నానారదుఁ డేఁగుదెంచె నబ్జజుకడకున్.
క. చనుదెంచి తండ్రికిం బ్రియ, మొనరఁగ శుశ్రూషణంబు లొనరిచి యతఁడుం
దనదెసఁ బ్రసన్నుఁ డగుటయుఁ, గని భగవన్మాయఁ దెలియఁ గానుత్సుకుఁ డై.
సీ. అవనీశ నీవు న న్నడిగినపగిది నా, తఁడుఁ దండ్రి నడుగఁ బితామహుండు
భగవంతుఁ డాశ్రితపారిజాతము హరి, గృపతోడఁ దన కెఱింగించినట్టి
లోకమంగళచతుఃశ్లోకమూలంబున, దశలక్షణంబులఁ దనరుభాగ
వతము నారదున కున్నతిఁ జెప్పె నాతఁడు, చారుసరస్వతీతీరమునను
తే. హరిపదధ్యానపారీణుఁ డాత్మవేది, ప్రకటతేజస్వి యగుబాదరాయణునకుఁ

గోరి యెఱిఁగించె నమ్మహాదారుఁ డెలమి, నాకు నెఱిఁగించె నెఱిఁగింతు నీకు నేను.

వ. అదియునుం గాక యిప్పుడు విరాట్పురుషునివలన నీజగంబు లేవిధంబున జనియించె ననునివి మొదలయిన ప్రశ్నంబులు గొన్ని నన్నడిగితి వేను నన్నింటికి నుత్తరం బగునట్లుగా నమ్మహాభాగవతం బుపన్యసించెద నాకర్ణింపు మమ్మహాపురాణంబు చతుఃశ్లోకరూపంబును దశలక్షణంబును నై సంకుచితమార్గంబున నొప్పు నందు దశలక్షణంబు లెవ్వి యనిన సర్గంబును విసర్గంబును స్థానంబును బోషణంబును నూతులును మన్వంతరంబులును నీశానుచరితంబులును నిరోధంబును ముక్తియు నాశ్రయంబును నన బదితెఱంగు లయ్యె దశమాశ్రయవిశుద్ధ్యర్థంబు దక్కినతొమ్మిదిలక్షణంబులు సెప్పంబడె నవి యెట్టి వనిన. 261

తే. మహదహంకార పంచతన్మాత్రగగన, పవనశిఖితోయభూభూతపంచకేంద్రి
యప్రపంచంబు భగవంతునందుఁ గనుట, సర్గ మందురు దీనిని జనవరేణ్య.

క. సరసిజగర్భుండు విరా, ట్పురుషునివలనన్ జనించి భూరితరచరా
చరభూతసృష్టిఁ జేయుట, పరువడిని విసర్గ మండ్రు భరతకులేశా. 263

క. లోకద్రోహినరేంద్రా, నీకముఁ బరిమార్చి జగము నిల్పినహరి యా
వైకుంఠనాథువిజయం, బాకల్పస్థాన మయ్యె నవనీనాథా. 264

క. హరి సర్వేశుఁ డనంతుఁడు, నిరుపమశుభమూర్తి సేయునిజభక్తజనో
ద్ధరణము పోషణ మవనీ. వర యూతు లనంగఁ గర్మవాసన లరయన్. 265

తే. జలజనాభదయాకటాక్షప్రసాద, లబ్ధసుఖులై సకలలోకపాలకవిభూతి
మహిమఁ బొందినవారిధర్మములు విస్తరమునఁ బలుకుట మన్వంతరములు భూప.

క. వనజోదరు నవతారక, థనముఁ దదీయానువృత్తిఁ దచ్చారిత్రం
బును విస్తరించి పలుకం, జనునవి యీశానుకథలు సౌజన్యనిధీ. 267

సీ. వసుమతీనాథ సర్వస్వామి యైనగో, విందుండు చిదచిదానందమూర్తి
సలలితస్వోపాధిశక్తిసమేతుఁ డై, తనరారునాత్మీయధామమందు
ఫణిరాజమృదులతల్పంబుపై సుఖలీల, యోగనిద్రారతి నున్నవేళ
నఖిలజీవులు నిజవ్యాపారశూన్యులై, యున్నతేజంబు [1]లురులుకొనఁగ

తే. జరుగునయ్యవస్థావిశేషంబు లెల్ల, విదితమగునట్లు వలుకుట యది నిరోధ
మన నిది యవాంతర ప్రళయంబనంగఁ, బరఁగునిఁక ముక్తిగతి వినుపార్థివేంద్ర.

సీ. జీవుండు భగవత్కృపావశంబునఁ జేసి, దేహధర్మంబు లై ధృతి ననేక
జన్మానుచరితదృశ్యము లైనయజ్జరా, మరణంబు లాత్మధర్మంబు లయిన
ఘనపుణ్యపాపనికాయనిర్మోచన, స్థితి నొప్పి పూర్వసంచితము లైన
యపహతపాప్మవత్త్వాదృష్టతద్గుణ, వంతుఁ డై తగ భగవచ్ఛరీర

1. ఉఱ్లుమనఁగ ; లుఱ్లుమడఁగ.

తే. భూతుఁ డై పారతంత్ర్యాత్మబుద్ధి నొప్పి, దివ్యమాల్యానులేపనదివ్యగంధ
కలితమంగళదివ్యవిగ్రహవిశిష్టుఁ, డగుచు హరిరూప మొందుటే యనఘ ముక్తి.

వ. మఱియు నుత్పత్తిస్థితిలయంబు లెందగుఁ (నుఁ బ్రకాశింపఁబడు) నది యాశ్రయం బనంబడు నదియ పరమాత్మ బ్రహ్మశబ్దవాచ్యంబు నదియ ప్రత్యక్షానుభవంబున విదితంబు సేయుకొఱకు నాత్మ కాధ్యాత్మికాదివిభాగంబు సెప్పంబడియె నది యె ట్లనిన నాత్మ యాధ్యాత్మికాధిదైవికాధిభౌతికంబులం ద్రివిధం బయ్యె నందు నాధ్యాత్మికంబు చక్షురాదిగోళకాంతర్వర్తి యై యెఱుంగంబడుఁ జక్షు రాదికరణాభిమాని యై ద్రష్ట యైనశరీరకుం డతండె యాధిదైవికుం డనం దగుఁ జక్షురాద్యధిష్ఠానాభిమానిదేవత యై సూర్యాదితేజోవిగ్రహుండు నగుచు నెవ్వ నియందు నీయుభయవిభాగంబునుం గలుగు నతండె యాధిభౌతికుండును విరాడ్విగ్రహుండును నగుం గావున ద్రష్టయు దృక్కును దృశ్యంబు ననం దగునీమూఁటి యందు నొకటి లేకున్న నొకటి గానరా దీత్రితయంబు నెవ్వం డెఱుంగు నతండు సర్వలోకాశ్రయుం డై యుండు నతండె పరమాత్మయును నమ్మహాత్ముండు లీలార్థం బై జగత్సర్జనంబు సేయుతలంపున బ్రహ్మాండంబు వినిర్భేదించి తనకు సుఖశయనంబు నపేక్షించి మొదల [1]జలతత్త్వంబు సృజియించె స్వతఃపరిశుద్ధుండు గావున (స్వసృష్టం బై) యేకార్ణవాకారం బైనజలరాశియందు శయనంబు సేయుటం జేసి "శ్లో. ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః। అయనం తస్య తాః పూర్వం తేన నారాయణః స్మృతి" యను (ప్రమాణము చొప్పున) నారాయణశబ్దవాచ్యుం డగు గావున నతనిప్రభావంబు వర్ణింప దుర్లభం బుపాదానభూతం బయినద్రవ్యంబును ద్రివిధం బయినకర్మంబును గలాకాష్ఠాద్యుపాధిభిన్నం బయినకాలంబును [2]జ్ఞానాదికం బగుజీవస్వభావంబును (భోక్త యగు) జీవుండును నెవ్వనియనుగ్రహంబునం జేసి వర్తించుచుండు నెవ్వనియుపేక్షం జేసి వర్తింపకుండు నట్టిప్రభావంబు గలసర్వేశ్వరుండు దా నేక మయ్యు ననేకంబుగాఁ దలంచి యోగతల్పంబునం బ్రబుద్ధుం డై యుండి యటమీఁద స్వసంకల్పంబునం జేసి హిరణ్మయం బైనతనవిగ్రహంబు నధిదైవతంబును నధ్యాత్మికంబును నధిభూతంబును ననుసంజ్ఞాయుతం బై త్రివిధంబు గా సృజియించె. 270

సీ. అట్టివిరా[3]డ్విగ్రహంబందు గగనతే,జః ప్రాణములు సర్వజంతుతతుల
నైన నట్టిజీవుని ననుసరింపుచు నుండుఁ, బంచి జీవుండు శరీరంబువలన
వెలువడి చన జీవి వెనుకొని ప్రాణముల్, చనుచుండు నిజనాథు ననుసరించి
భటులచందంబునఁ బాటిల్లు క్షుత్తును, భూరితృష్ణయు మఱి ముఖమువలనఁ

1 జలతల్పంబు 2. ద్రవ్యకాలాదిస్వభావంబును భోక్త. 3 'డ్విగ్రహాంతరాకాశంబు, వలన నోజస్సహోబలము లయ్యెఁ, బ్రాణంబు సూక్ష్మరూపక్రియాశక్తిచే, నేనియించి ముఖ్యాసు వనఁగఁ బరఁగె' అనియే అచ్చుప్రతి.

తే. దాలుజిహ్వాదికంబు లుద్భవము నొందె
నందు నుదయించె నానావిధైకరసము
లెనయ నవి యెల్ల జిహ్వచే నెఱుఁగఁబడును
మొనసి పలుక నపేక్షించుముఖమువలన. 271

వ. *మఱియు [1]వాగింద్రియంబు పుట్టె దానికి దేవత యగ్ని యారెంటివలన భాషణంబు వొడమె నాయగ్నికి మహాజలవ్యాప్తం బగుజలంబున నిరోధంబు గలుగుటం జేసి యాజలంబె ప్రతిబంధకం బయ్యె దోధూయమానం బైనమహావాయువువలన ఘ్రాణంబు పుట్టెం గావున వాయుదేవతాకం బైనఘ్రాణేంద్రియంబు గంధగ్రహణసమర్థం బయ్యె నిరాలోకం బగునాత్మ నాత్మయందుఁ జూడం గోరి తేజంబువలన నాదిత్యదేవతాకం బై రూపగ్రాహకం బైనయక్షియుగళంబు పుట్టె ఋషిగణంబులచేత బోధితుం డగుచు భగవంతుండు దిగ్దేవతాకంబును శబ్దగ్రాహకంబును నైనశ్రోత్రేంద్రియంబు పుట్టించె సర్జనంబు సేయుపురుషుని వలన మృదుత్వకాఠిన్యంబులును లఘుత్వగురుత్వంబులును నుష్ణత్వశీతలత్వంబులునుం జేసెడుత్వగింద్రియాధిష్ఠానం బగుచర్మంబు పుట్టె బహిర్గతం బయిన చర్మంబువలన రోమంబు లుదయించె వానికి మహీరుహంబు లధిదేవత లయ్యె నందు నధిగతస్పర్శగుణుండును నంతర్బహిః ప్రదేశంబుల నావృతుండును నగువాయువువలన బలవంతంబులును నింద్రదేవతాకంబులును నాదానసమర్థంబులును నానాకర్మకరణదక్షంబులును నగుహస్తంబు లుదయించె స్వేచ్ఛావిషయగతిసమర్థుం డగునీశ్వరునివలన విష్ణుదేవతాకంబు లగుపాదంబు లుదయించెఁ బ్రజానందామృతార్థి యగుభగవంతునివలనఁ బ్రజాపతిదేవతాకం బై స్త్రీసంభోగాది కామ్యసుఖంబులు గార్యంబులుగాఁ గలశిశ్నోపస్థంబు లుదయించె మిత్రుం డధిదైవతంబుగాఁ గలిగి భుక్తాన్నాద్యసారాంశత్యాగోపయోగం బగుపాయువనెడిగుదం బుద్భవించె వానికృత్యం బుభయమలమోచనంబు దేహంబుననుండి దేహాంతరంబుఁ జేరం గోరి పూర్వకాయంబు విడుచుటకు సాధనం బగునాభిద్వారంబు సంభవించె నట్టినాభియ ప్రాణాపానబంధస్థానం బనంబడుఁ దద్బంధవిశ్లేషంబె మృత్యువగు నదియ యూర్ధ్వాధోదేహభేదకం బనియును జెప్పఁబడు నన్నపానాదిధారణార్థంబుగ నాంత్రకుక్షినాడీనిచయంబులు గల్పింపంబడియె వానికి నదులును సముద్రంబులును నధిదేవత లయ్యె వానివలనఁ దుష్టిపుష్టులను నుదరభరణరసపరిణామంబులు గలిగియుండు నాత్మీయమాయాచింతనం బొనర్చునప్పుడు కామసంకల్పాదిస్థానం బగుహృదయంబు గలిగె దానివలన మనంబును

* ఈవచనమంతయు వ్రాఁతప్రతులపాఠమునకు భిన్నము. ఇట విస్తరభీతిచే నాభేదము తెలుపఁబడినది గాదు. 1 'వహ్నియు వాగ్దేవతయు నానికవలన నోధూయమానం బైనమహా' వ్రా.ప్ర.

జంద్రుండును గాముండును సంకల్పంబును నుదయించె నంతమీఁద జగత్సర్జ
నంబు సేయువిరాడ్విగ్రహంబువలన సప్తధాతువులును బృథివ్యప్తేజోమయంబు
లయినసప్తప్రాణంబులును వ్యోమాంబువాయువులచే నుత్పన్నంబు లై గుణాత్మ
కంబు లైనయింద్రియంబులును నహంకారప్రభవంబు లైనగుణంబులును సర్వ
వికారస్వరూపం బగుమనస్సును విజ్ఞానరూపిణి యగుబుద్ధియును వివిధం బగు
నిది యంతయు సర్వేశ్వరునిస్థూలవిగ్రహంబునం బుట్టుమఱియును. 272

క. వరుసఁ బృథివ్యాద్యష్టా, వరణావృత మై సమగ్రవై భవములఁ బం
కరుహభవాండాతీత, స్ఫురణం జెలువొందు నతివిశోభూతి దలిర్పన్. 273

క. పోలు పగుసకలవిలక్షణ, ములు గలయాద్యంతశూన్యమును నిత్యము నై
లలి సూక్ష్మమై మనోవా, క్కులకుం దలపోయఁగా నగోచర మగుచున్. 274

సీ. అలఘుతేజోరూప మైనరూపమునకు, క్షితినాథ నాచేతఁ జెప్పఁబడిన
మానితస్థూలసూక్ష్మస్వరూపంబులు, వల నొప్పఁగలభగవత్స్వరూప
మమ్మహాత్మకునిమాయాబలంబునఁ జేసి, దివ్యమునీంద్రులుఁ దెలియలేరు
వసుధేశ వాచ్యమై వాచకంబై నామ,రూపముల్ క్రియలునురూఢిఁ దాల్చి

ఆ. యుండునట్టియీశ్వరుండు నారాయణుం, డఖిలధృతి జగన్నియంత యైన
చిన్మయాత్మకుండు సృజియించు నీప్రజా,పతుల ఋషుల మునులఁ బితృవరులను.

వ. మఱియును. 276

సీ. సుర సిద్ధ సాధ్య కిన్నరవర చారణ, గరుడ గంధర్వ రాక్షస పిశాచ
భూత వేతాళ కింపురుష కూశ్మాండ గు,హ్యక డాకినీ యక్ష యాతుధాన
విద్యాధ రాప్సరో విషధర గ్రహ మాతృ,గణ వృక హరి ఘృష్టి ఖగ మృగాళి
భల్లూక రోహిత పశు వృక్షయోనుల, వివిధకర్మంబులు వెలయఁ బుట్టి

తే. జలనభోభూతలంబుల సంచరించు, జంతురాసుల సత్త్వరజస్తమోగు
ణములఁ [1]దిర్యక్సురాసురనరధరాది,భావముల భిన్ను లగుదురు పౌరవేంద్ర.

మ. ఇర వొందన్ [2]ద్రుహిణాత్మకుం డగు రమాధీశుండు విశ్వంబు సు
స్థిరతన్ నిల్పి కృపాకటాక్షమున రక్షించున్ సమస్తప్రజో
త్కరసంహారము సేయునప్పుడు హరాంతర్యామి యై యంతయున్
హరియించుం బవనుండు మేఘముల మాడ్కియం దేయుచందంబునన్. 278

క. ఈపగిదిని విశ్వము సం, స్థాపించును మనుచు నడఁచు ధర్మాత్ముఁ డై
దీపితతిర్యఙ్నరసుర, రూపంబులు దాల్చి హరి పరుం డజుఁ డెలమిన్. 279

సీ. హరియందు నాకాశ మాకాశమున వాయు, వనిలంబువలన హుతాశనుండు
హవ్యవాహునునందు నంబువు లుదకంబు, వలన వసుంధర గలిగె ధాత్రి

1 'సురనరతిర్యగ్నాగ కాఁడ; సురనరకీటకనాగ కాఁడ' అని వ్రాఁతప్రతులు.

2 'భువనావనుం డయి' అని వ్రాఁతప్రతులు.

వలన బహుప్రజావళి యుద్భవం బయ్యె, నింతకు మూల మై యెసఁగునట్టి
నారాయణుఁడు చిదానందస్వరూపకుం, డవ్యయుం డజరుఁ డనంతుఁ డాఢ్యుఁ

తే. డాదిమధ్యాంతశూన్యుం డనాదినిధనుఁ, డతనివలనను సంభూత మైనయట్టి
సృష్టిహేతుప్రకార మీక్షించి తెలియఁ,జాల రెంతటిమును లైన జనవరేణ్య.

వ. అదియునుం గాక. 281

మ. ధరణీశోత్తమ భూతసృష్టి నిటు సంస్థాపించి రక్షించుచు నా
హరి కర్తృత్వము నొల్ల కాత్మగతమాయారోపితం జేసి తా
నిరవద్యుండు నిరంజనుండుఁ బరుఁడున్ నిష్కించనుం డాఢ్యుఁడున్
నిరపేక్షుండును నిష్కళంకుఁ డగుచున్ నిత్యత్వముం బొందెడిన్. 282

వ. (బ్రహ్మసంబంధి యగు) నీకల్పప్రకారం (బవాంతరకల్పంబుతోడ) సంకుచితప్ర
కారంబున నెఱింగించితి నిట్టిప్రాకృతవైకృతకల్పప్రకారంబులును దత్పరిమాణం
బులును గాలకల్పలక్షణంబులును విగ్రహంబును నవాంతరకల్పంబులు మన్వం
తరాదిభేదవిభాగస్వరూపంబును నతివిస్తారంబుగ నెఱింగింతు విను మదియునుం
బద్మకల్పం బనం దగు నని భగవంతుం డైనశుకుండు పరీక్షిత్తునకుం జెప్పె నని
సూతుండు మహాత్ములకు నెఱింగించిన. 283

క. విని శౌనకుండు సూతుం, గనుఁగొని యి ట్లనియె సూత కరుణోపేతా
జననుతగుణసంఘాతా, ఘనపుణ్యసమేత విగతకలుషవ్రాతా. 284

వ. పరమభాగవతోత్తముం డైనవిదురుండు బంధుమిత్రజాతంబుల విడిచి సకలభువన
పావనంబులును గీర్తనీయంబులును నైనతీర్థంబులను నగణ్యంబు లైనపుణ్యక్షే
త్రంబులను దర్శించి క్రమ్మఱ వచ్చి కౌషారవి యగుమైత్రేయుం గని యతనివలన
నధ్యాత్మబోధంబు వడసె నని వినంబడు నది యంతయుః నెఱింగింపు మనిన
నతం డి ట్లనియె. 285

క. వినుఁ డిపుడు మీరు న న్నడిగిన తెఱఁగున శుకమునీంద్రగేయుఁ బరీక్షి
జ్జనపతి యడిగిన నతఁ డాతని కెఱిఁగించినవిధంబుఁ దగ నెఱిఁగింతున్. 286

వ. సావధానుల రై వినుం డని. 287

ఉ. రామ గుణాభిరామ దినరాజకులాంబుధిసోమ తోయద
శ్యామ దశాననప్రబలసైన్యవిరామ సురారిగోత్రసు
త్రామ సుబాహుబాహుబలదర్పతమఃపటుతీవ్రధామ ని
ష్కామ కుభృల్లలామ గరకంఠసతీనుతనామ రాఘవా. 288

క. అమరేంద్రసుతవిదారణ, కమలాప్తతనూజరాజ్యకారణ భవసం
తమసదినేశ్వర రాజో, త్తమ దైవతసార్వభౌమ దశరథరామా. 289

మాలిని. నిరుపమగుణజాలా ! నిర్మలానందలోలా
దురితఘనసమీరా ! దుష్టదైత్యప్రహారా
శరధిమదవిశోషా ! చారుసద్భక్తపోషా
సరసిజదళనేత్రా ! సజ్జనస్తోత్రపాత్రా. 290

గద్యము. ఇది శ్రీ పరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన శ్రీమహాభాగవతపురాణంబునందుఁ బరీక్షిత్తుతోడ శుకయోగి భాషించుటయు భాగవతపురాణవైభవంబును ఖట్వాంగు మోక్షప్రకారంబును ధారణాయోగవిషయం బయినమహావిష్ణుని శ్రీపాదాద్యవయవంబుల సర్వలోకంబులు నున్నతెఱంగును సత్పురుషవృత్తియు మోక్షవ్యతిరిక్తసర్వకామ్యఫలప్రదదేవతాభజనప్రకారంబును మోక్షప్రదుండు శ్రీహరి యనుటయు హరిభజనవిరహితులైనజనులకు హేయతాపాదనంబును రాజప్రశ్నంబును శుకయోగి శ్రీహరిస్తోత్రంబు సేయుటయు వాసుదేవప్రసాదంబునం జతుర్ముఖుండు బ్రహ్మాధిపత్యంబు వడయుటయు శ్రీహరివలన బ్రహ్మరుద్రాదిలోకప్రపంచంబు పుట్టుటయు శ్రీమన్నారాయణదివ్యలీలావతారపరంపరావైభవవృత్తాంతసూచనంబును భాగవతవైభవంబును బరీక్షిత్తు శుకయోగి నడిగినప్రపంచాదిప్రశ్నంబులును నందు శ్రీహరి ప్రధానకర్త యని తద్వృత్తాంతంబు సెప్పుటయు భగవద్భక్తివైభవంబును బ్రహ్మతపశ్చరణంబునకుం బ్రసన్నుండైహరి వైకుంఠనగరంబుతోడఁ బ్రసన్నుం డయిన స్తోత్రంబు సేసి తత్ప్రసాదంబునం దన్మహిమంబు వినుటయు వాసుదేవుం డానతిచ్చినప్రకారంబున బ్రహ్మ నారదునికి భాగవతపురాణప్రధానదశలక్షణంబు లుపన్యసించుటయు నారాయణవైభవంబును జీవాదితత్త్వసృష్టియు శ్రీహరినిత్యవిభూత్యాదివర్ణనంబును గల్పప్రకారాదిసూచనంబును శౌనకుండు విదురమైత్రేయసంవాదంబు సెప్పు మని సూతు నడుగుటయు ననుకథలం గలద్వితీయస్కంధము.

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

శ్రీ

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

తృతీయస్కంధము.

శ్రీమహితవినుతదివిజ
స్తోమ యశస్సీమ రాజసోమ సుమేరు
స్థేమ వినిర్జితభార్గవ
రామ దశాననవిరామ రఘుకులరామా. 1

వ. మహనీయగుణగరిష్ఠు లగునమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డైనసూతుం డి ట్లనియె నట్లు ప్రాయోపవిష్టుం డైనపరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 2

ఉ. పాండునృపాలనందనులు బాహుబలంబున ధార్తరాష్ట్రులన్
ఖండనభూమిలోఁ గెలిచి పాండురశారదచంద్రచంద్రికా
ఖండయశఃప్రసూనకలికాతతిఁ గౌరవరాజ్యలక్ష్మి నొం
డొండ యలంకరించుచు జయోన్నతి రాజ్యము సేయు చుండఁగన్. 3

క. మనుజేంద్ర విదురుఁ డంతక,మును వనమున కేఁగి యచట మునిజనగేయున్
వినుతతపోధారేయు, న్ననుపమగుణజనవిధేయు నమ్మైత్రేయున్. 4

క. కనుఁగొని తత్పాదంబులు, దనఫాలము సోఁక మ్రొక్కి తగ ని ట్లనియెన్
మునివర సకలజగత్పా,వనచరితుఁడు కృష్ణుఁ డఖిలవంద్యుం డెలమిన్. 5

క. మండితతేజోనిధి యై, పాండవహితమతిని దూతభావంబున వే
దండపురి కేఁగి కురుకుల, మండనుఁ డగుధార్తరాష్ట్రమందిరమునకున్. 6

తే. చనఁగ నొల్లక మద్గృహంబునకు భక్త
వత్సలుం డగుకృష్ణుండు వచ్చు టేమి
కతము నా కది యెఱిఁగింపు కరుణతోడ
ననుచు విదురుండు మైత్రేయు నడిగె ననిన. 7

క. విని వెఱఁ గంది పరీక్షి,న్మనుజవరేణ్యుండు విమలమతిని స్తంద్రున్

మునికులజలనిధిచంద్రున్, సునిశితహరిభక్తిసాంద్రు శుకయోగీంద్రున్. 8

క. కని యిట్లనె మైత్రేయుని, ననఘుం డగువిదురుఁ డేరహస్యము లడిగెన్
ముని యేమి సెప్పె నేపగి, దిని దీర్థము లాడె నెచటఁ దిరుగుచు నుండెన్. 9

తే. ఇన్నియును దెలియఁగ నానతిచ్చి నన్ను, నర్థి రక్షింపవే విమలాంతరంగ
ఘనదయాపాంగ హరిపాదకమలభృంగ, మహితగుణసంగ పాపతమఃపతంగ.

చ. అనవుడు బాదరాయణి ధరాధిపు కిట్లనుఁ బూరువంశవ
ర్ధన విను కష్టుఁడైనధృతరాష్ట్రనృపాలుఁడు పెంపుతో సుయో
ధనముఖపుత్త్రులం గడు ముదంబునఁ బెంచుచుఁ బాండురాజు ద
ప్పినపిదపం దదాత్మజులు వెల్కుఱి తన్నని చేర వచ్చినన్. 11

వ. ఇట్లు సేర వచ్చినపాండవులయెడ నసూయానిమగ్నులై సుయోధనాదులు. 12

క. పెట్టిరి విషాన్న మంటం, గట్టిరి ఘనపాశములను గంగానదియం
దొట్టిరి రాజ్యము వెడలం, గొట్టిరి ధర్మంబు విడిచి కుటిలాత్మకులై. 13

క. క్రూరాత్ము లగుచు లాక్షా, గారంబున వారు నిద్రఁ గైకొని యుండన్
దారుణశిఖ దరికొలిపిరి, మారణకర్మముల ¹కప్రమత్తత వెలయన్. 14

తే. సూరిజనగేయ మగురాజసూయయజ్ఞ, విలసదవభృథసేకపవిత్ర మైన
ద్రౌపదీచారువేణీభరంబు వట్టి, కొలువులోపలి కీడ్చిరి కుచ్చితమున. 15

క. కావున వారల కపకృతి, గావింపని దొకదినంబుఁ గలుగదు తమజ
న్మావధి నిజనందనులను, వావిరి నయ్యంధనృపతి వల దనఁ డయ్యెన్. 16

తే. మాయజూదంబు వన్ని దుర్మార్గవృత్తిఁ
బుడమిఁ గొని యడవులకుఁ బో నడువ నచటఁ
దిరిగి వారలు సమయంబు దీర్చి యేఁగు
దెంచి తమయంశ మడిగినఁ బంచి యీక. 17

వ. ఉన్నయెడ. 18

చ. సకలనియంత యైనహరి సర్వశరణ్యుఁడు మాధవుండు సే
వకనవకల్పకంబు భగవంతుఁ డనంతుఁ డనంతశక్తి నం
దకధరుఁ డబ్జలోచనుఁడు ధర్మతనూభవుచే నియుక్తుఁడై
యకుటిలభక్తియోగమహితాత్మకుఁడై ధృతరాష్ట్రుపాలికిన్. 19

క. చని యచట భీష్మగురుత, త్తనయకృపాచార్యనిఖిలధాత్రీపతులున్
విని యనుమోదింపఁగ ని, ట్లనియెన్ ధృతరాష్ట్రుతోడ నవనీనాథా. 20

క. కౌరవపాండవు లిరువురు, నారయ నీ కొక్కసమమ యవనీవర నీ
వేరీతి నైనఁ బాండుకు, మారులపా లొసఁగితేని మను నుభయంబున్. 21

క. అని ధర్మబోధమునఁ బలి, కినమాటలు సెవుల నిడమిఁ గృష్ణుఁడు విదురున్

---

1 'కప్రమత్తుల రగుచుఁ' వ్రా. ప్ర.

ఘననీతిమంతుఁ బిలువం, బనిచినఁ జనుదెంచెఁ గురుస। భాస్థలమునకున్. 22

వ. చనుదెంచి యచటిజనంబులచేత నుపస్థితం బయిన కార్యంబు దెలిసినవాఁ డయి
ధృతరాష్ట్రు నుద్దేశించి యి ట్లనియె. 23

మ. ధరణీనాయక పాండుభూవిభుఁడు నీ। తమ్ముండు తత్పుత్రులం
బరిరక్షించిన ధర్మువుం దగవునుం। బాటిల్లు వంశంబు సు
స్థిరసౌఖ్యోన్నతిఁ జెందు శత్రుజయముం। జేకూరు గోపాలశే
ఖరుచిత్తంబును వచ్చు న ట్లగుట యాఁ। గౌరవ్యవంశాగ్రణీ. 24

ఆ. వారితండ్రిపాలు। వారికి నొసఁగి నీ, పాలు సుతుల కెల్లఁ। బంచి యిచ్చి
చలము విడిచి ధర్మ। మలవడ నీబుద్ధిఁ, జొనుపవయ్య కులము। మనుపవయ్య.

చ. వినుము నృపాల నాపలుకు। వేయును నేల సమీరసూతి నీ
తనయులపేరు విన్నఁ బద। తాడితదుష్టభుజంగమంబుచా
డ్పునఁ గన లొందు నింతయును। మున్నును జెప్పితిఁ గాదె వానిచే
తన భవదీయపుత్రులకుఁ। దప్పదు మృత్యువ దన్నిభంగులన్. 26

వ. అదియునుం గాక. 27

క. నీపుత్రులశౌర్యంబును, జాపాచార్యాపగాత్మ। జాతకృపభుజా
టోపంబును గర్ణురా, లాపంబులు నిజముగాఁ ద। లంతె మనమునన్. 28

వ. అ ట్లేని వినుము. 29

ఉ. ఏపరమేశుచే జగము। లీసచరాచరకోటితో సము
ద్దీపిత మయ్యె నేవిభుని। దివ్యకళాంశజు లబ్జగర్భగౌ
రీపతిముఖ్యదేవముని। బృందము లెవ్వఁ డనంతుఁ డచ్యుతుం
డాపురుషోత్తముండు గరు। ణాంబుధి గృష్ణుఁడు వో నరేశ్వరా. 30

ఉ. అట్టిజగన్నివాసుఁడు ము। రాసురభేది పరాపరుండు చే
పట్టి సఖుండు వియ్యమును। బాంధవుఁడున్ గురుఁడున్ విభుండు నై
యిట్టల మైనప్రేమమున। నెప్పుడుఁ దోడ్పడు చుండ వారలన్
జుట్టన వ్రేల నెవ్వరికిఁ। జూపఁగ వచ్చునె పార్థివోత్తమా. 31

ఉ. కావునఁ బాండునందనులఁ। గాఱియపెట్టక రాజ్యభాగమున్
వావిరి నిచ్చి రాజ్యమును। వంశముఁ బుత్రుల బంధువర్గముం
గావుము గాక లోభి యగు। కష్టసుయోధనుమాట వింటివే
భూవర నీయుపేక్ష నగుఁ। బో కులనాశము బంధునాశమున్. 32

తే. ఒకనికై యిట్లు కుల మెల్ల। నుక్కడంప
నెత్తికొనఁ జూచె దిది నీతి। యే నృపాల
వినుము నామాట నీసుయో। ధనుని విడిచి
కులము రాజ్యంబుఁ దేశంబు। నిలుపవయ్య. 3

క. అని యిట్లు దఱిమి చెప్పిన, విని దుర్యోధనుఁడు రోషవివశుం డగుచు
న్ననతనయశకునిదుశ్శా,సనుల నిరీక్షించి తామసంబునఁ బలికెన్. 34

క. దాసీపుత్త్రుని మీరలు, దాసీనుం జేయ కిటకుఁ దగునె పిలువఁగా
నాసీనుం డై ప్రేలెడు, గాసిలి చెడి పోవ వెడలఁగా నడువ రనా. 35

వ. అని యిట్లు దుర్యోధనుం డాడినదురాలాపంబులు దనకు మనస్తాపంబు సేయం గార్యంబు విచారించి ధైర్యం బవలంబించి యొండు వలుక నొల్లక శరశరాసనంబులు విడిచి క్రోధంబు నడంచి వనంబునకుం జని యందు. 36

సీ. విష్ణుస్వయంవ్యక్తవిమలభూములను బ,విత్త్రంబు లగుహరిక్షేత్త్రములను
నెలకొని దేవతానిర్మితహరిదివ్య,భూముల గంగాదిపుణ్యనదుల
సిద్ధపురాణప్రసిద్ధపుణ్యాశ్రమ, స్థలముల నుపవనస్థలములందు
గంధమాదనముఖక్ష్మాభృత్తటంబుల, మంజులగిరికుంజపుంజములను

తే. వికచకైరవపద్మహల్లకమరంద, పానవశమత్తమధుకరగానబుద్ధ
రాజహంసవిలోలషిరాజమాన, మగుచుఁ జెలు వొందుపంకేరుహాకరముల. 37

క. మఱియును ఋష్యాశ్రమ వన, సరి దుపవన నద పుళింద జనపద గిరిగ
హ్వర గోష్ఠ యజ్ఞశాలా, పుర దేవాయతనపుణ్యభూములయందున్. 38

క. కూరలుఁ గాయలు సీల్లా, హారముగాఁ గొనుచు నియమ మలవడఁగ నసం
స్కారశరీరకుం డగుచు ను, దారత నవధూతవేషధరుఁ డై వరుసన్. 39

క. హర్షము గదురఁగ భారత, వర్షమునం గలుగుపుణ్యవరతీర్థము లు
త్కర్షం జూచుచు విగతా,మర్షుం డై సంచరించె మనుజవరేణ్యా. 40

వ. ఇట్లు సంచరించుచుఁ బ్రభాసతీర్థమ్మునకు వచ్చునప్పుడు. 41

చ. అరుగుచు దైత్యభేదనదయాపరిలబ్ధసమస్తమేదినీ
భరణధురంధరుం డగుచుఁ బాండుసుతాగ్రజుఁ డొప్పు [1]చుండు న
త్తఱి విదురుండుఁ దత్సరిదుదంచితసాల రసాల మాధవీ
కురువక మాలతీ వకుళ కుంజ లసత్తటమందు నున్నెడన్. 42

చ. నరవర వేణుజానలవినష్టమహాటవిమాడ్కిఁ బాండుభూ
వరధృతరాష్ట్రపుత్త్రును [2]లనివారణఁ జాల విరోధ మెత్తి యొం
డొరుల జయింపఁ గోరి కదనోర్విఁ గురుక్షితిపాలముఖ్యు లం
దఱు మృతు లౌటయున్ విని ఘనంబుగ శోకనిమగ్నచిత్తుఁ డై. 43

ఉ. ఆయెడఁ గాలు దన్నక రయంబున నేఁగి సరస్వతీనదీ
తోయములందుఁ గ్రుంకి మునితుల్యుఁడు వే చని యెం దనూనపా
త్తోయరుహాప్తభార్గవపృథుత్రితసోమ[3]సుదాసశక్తిభృ

---

1 'చుండ భూ, వర విదురుండుఁ దన్నికటపర్వతమాలరసాల' అ. ప్ర. 2 'లనివార్య నిరూఢవిరోధ' అచ్చుప్రతి. 3 'కుమారగోసుధా, వాయు' ప్రా. ప.

ద్యాయుయమాభిధానయుతవాహినులం దనరక్తిఁ గ్రుంకుచున్. 44

ఉ. వెండియుఁ బుణ్యభూములఁ బవిత్రసరిత్తులఁ జూచుచున్ రమా
మండనుఁ డుండుదివ్యరుచిమన్మణిచారుకవాటగేహళీ
మండితసౌధగోపురవిమానము లున్నతభక్తిఁ జూచుచున్
నిండినవేడ్కఁ గృష్ణపదనీరజచింతనుఁడై క్రమంబునన్. 45

విదురుం డుద్ధవుం గని కృష్ణాదులవృత్తాంతం బడుగుట.

చ. చని చని తొంటిమత్స్యకురుజాంగలభూము లతిక్రమించి చ
య్యన యమునానదిం గదిసి యచ్చట భాగవతున్ సరోజలో
చన[1]నిజభక్తు సద్గుణవిశారదు శాంతుని దేవమంత్రిశి
ష్యుని మహితప్రసిద్ధుఁ బరిశోషితదోషుఁ బ్రబుద్ధు నుద్ధవున్. 46

క. కని యనురాగవికాసము, దనమనమునఁ దొంగలింపఁ దగ గాఢాలిం
గన మాచరించి నెయ్యం, బునఁ గుశలప్రశ్న సేసి ముదమునఁ బలికెన్. 47

క. [2]హరిభక్తుల పుణ్యాత్ముల, దురితవిదూరుల విరోధిదుర్దమబలులం
గురుకులతిలకుల కుంతీ, వరసూనుల సేమ మరసి వారనిభక్తిన్. 48

వ. ఇట్లనియె. 49

చ. హరి దననాభిపంకరుహమందు జనించినయట్టిభారతీ
శ్వరుఁ డతిభక్తి వేఁడ యదువంశమునన్ బలకృష్ణమూర్తులై
పరఁగ జనించి భూభరముఁ బాపినభవ్యులు రేవతీందిరా
వరు లట శూరసేనునినివాసమునన్ సుఖ మున్నవార తే. 50

చ. కురుకులు లాదరింపఁగ సఖుండును నాప్తుఁడునై తనర్చి సో
దరతరుణీజనంబులను దత్సుతులం గడుగారవంబునం
గరుణ దలిర్ప నాత్మజులకంటెఁ బ్రియోన్నతిఁ బ్రోచువాఁడు సు
స్థిరమతి నున్నవాఁడె వసుదేవుఁడు వృష్ణికులప్రదీపకా. 51

శా. కందర్పాంశమునం దనూజుఁ బడయం గామించి భూదేవతా
బృందంబున్ భజియించి తత్కరుణఁ [3]దాపింఛప్రభావస్ఫురం
బొందన్ రుక్మిణి గన్ననందనుఁడు ప్రద్యుమ్నుండు భాస్వచ్ఛమా
సందోహంబులు దన్నుఁ గొల్వ మహితోత్సాహంబుతో నొప్పునే. 52

క. సరసిజలోచనకరుణా, పరిలబ్ధసమస్తధరణిపాలనమహిమం
బరమప్రీతి సుఖించునె, చిరవిభవోదారుఁ డుగ్రసేనుఁడు జగతిన్. 53

చ. లలితపతివ్రతామణి విలాసవతీతిలకంబు పార్వతీ
లలన కుమారుఁ గన్నటు సులక్షణ జాంబవతీలలామ ని

---

1 నిజభక్తసద్గుణ. 2 హరిభక్తులు పుణ్యాత్ములు, దురితవిదూరులు విరోధిదుర్దమబలులుఁ గురుకులతిలకులుఁ గుంతీ, వరసూనులు కుశలులే యవారితభక్తిన్' అ.ప్ర. 3 'దీపింపం బ్రభావంబు' అ.ప్ర.

ర్మలగతిఁ గన్నపట్టి సుకుమారతనుఁడు విరోధిభంజనో
త్కలిక సుఖించునే గుణకదంబుఁడు సాంబుఁడు వృష్ణిపుంగవా. 54

క. హరిపదసేవకుఁ డరిభీ, కరుఁ డర్జునువలన మిగులఁ గార్ముకవిద్యల్
[1]దిరముగఁ గఱచినసాత్యకి, వరసుఖవిభవముల నున్నవాఁడె ధరిత్రిన్. 55

మ. జలజాతాంకుశచక్రచాపకులిశచ్ఛత్త్రాదిరేఖాంకితో
జ్జ్వలగోవిందపదాబ్జలక్షితవిరాజన్మార్గధూళిచ్ఛటా
కలితాంగుండు విధూతకల్మషుఁడు నిష్కామైకధర్ముండు స
త్కులజాతుం డన నొప్పునట్టిఘనుఁ డక్రూరుండు [2]జీవించునే. 56

క. శ్రుతులును గ్రతుజాతము స, మ్మతిఁ దాల్చినయట్టి వేదమాతగతిన్ శ్రీ
పతిఁ దనగర్భంబున ర, క్షితుఁ జేసినగరిత దేవకీసతి [3]సుఖమే. 57

వ. మఱియు మహాత్మా మహితోపాసకు లగువారలకోర్కులు నిండింపం జాలిన భగవంతుండును శబ్దశాస్త్రంబునకుం గారణం బని తన్ను నఖిలదేవతాజనంబు లర్చింపం గలమేటియును సకలజీవచతుర్విధాంతఃకరణంబు లయినచిత్తాహంకారబుద్ధిమనంబులకుం గ్రమంబున వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులధిదైవతంబు లగుచు నట్టిచతుర్విధతత్త్వంబులకుఁ దుర్యం బైనతత్త్వంబు మనస్సు తన్మనోమయుండు నైనయనిరుద్ధకుమారుండు సంతోషచిత్తుం డగునే యని. 58

మ. ఇతరారాధనవాని కృష్ణుఁ గమలాధీశుం బయోజాసనా
ర్చితు భక్తిన్ నిజనాథుఁగా సతతమున్ సేవించుపుణ్యుల్ జగ
న్నుతు లధ్యాత్మవిదుల్ మహాభుజులు మాన్యుల్ ధర్మమార్గుల్ సము
న్నతి సత్యాత్మజచారుదేష్ణగదు లానందాత్ములే యుద్ధవా. 59

తే. క్రోధమాత్సర్యధనుఁడు సుయోధనుండు
వాలుచు నెవ్వనిసభఁ జూచి కలుష మొదవి
మనములోన నసూయానిమగ్నుఁ డయ్యె
నట్టిధర్మజుఁ డున్నాఁడె యనఘచరిత. 60

తే. ఘనగదాభ్యాసచిత్రసంగతుల మెఱసి, కురుకుమారుల భూరిసంగరములోన
హతులఁ గావించి వెలసినయట్టి జెట్టి, వాయుతనయుండు కుశలియై వఱలునయ్య.

చ. హరికరుణాతరంగితకటాక్షనిరీక్షణలబ్ధశౌర్యవి
స్ఫురణఁ దనర్చి తన్ను నని బోయగతి న్నభవుం డెదిర్చినన్
బరవస మొప్పఁగా గెలిచి పాశుపతాస్త్రముఁ గొన్నశత్రుభీ
కరుఁడు ధనంజయుండు సుభగస్థితి మోదము నొందునే గదా. 62

---

1. 'గఱచిన బలియుఁడు సాత్యకి, గఱలినసుఖలీల నున్నవాఁడె' గ్రా. ప్ర. 2. 'భద్రాత్ముఁడే' అ. ప్ర. 3. 'సుఖియే' వ్రాఁతప్రతులు.

మ. తెలియఁ గొప్పన్ జననీవియోగమునఁ గుం ǂ తీస్తన్యపానంబు సో
దరసంరక్షయుఁ గల్గి దేవవిభువ ǂ క్త్రస్థామృతంబుల్ ఖగే
శ్వరుఁ డర్థిం గయికొన్నమాడ్కిఁ గురువం ǂ శశ్రేణి నిర్జించి త
ద్ధరణీరాజ్యముఁ గొన్నమాద్రికొడుకుల్ ǂ ధన్యాత్ములే యుద్ధవా. 63

తే. పాండుభూమీశ్వరుండు సం ǂ ప్రాప్తమరణుఁ, డైనశిశువులఁ బ్రోచుట ǂ కై నిజేశుఁ
గూడి చన కున్నయట్టి మా ǂ కుంతిభోజ, తనయ జీవించునే నేఁడు ǂ మనుచరిత్ర.

వ. అని వెండియు. 65

మ. అనుసంభూతుఁడు పాండుభూవిభుఁడు ని ǂ ర్యాణంబునం బొంద నా
తనిపుత్రుల్ దనుఁ జేర వచ్చినను మా ǂ ధ్యస్థ్యంబుఁ బోఁ దట్టి యె
గ్గొనరించెన్ [1]ధృతరాష్ట్రభూమివిభుఁ డ ǂ ట్లూహింపఁగా నెగ్గు సే
సినవాఁడే యగుఁ గాక మేలు గలదే ǂ చింతింపఁగా నుద్ధవా. 66

క. అనుజుఁడు వీఁ డసకయ తన, తనయులు నను వెడల నడువఁ ǂ దా నూరక యుం
డినధృతరాష్ట్రుఁడు నరకం, బునఁ బడు నా దైనదుఃఖ ǂ మున ననఘాత్మా. 67

వ. అదియునుం గాక పరమశాంతుండ వైననీమనంబున దుఃఖంబు గర్తవ్యంబు గా
దంటేని. 68

క. నరలోకవిడంబనమున, హరి పరమపరుండు మాన ǂ వాకృతితో ని
ద్ధరఁ బుట్టి యాత్మమాయా, స్ఫురణన్ మోహింపఁజేయు ǂ భూజనకోటిన్. 69

ఉ. కావున నమ్మహాత్ముని వి ǂ కారవిదూరుని సర్వమోహమా
యావిలమానసుండ నగు ǂ నప్పుడు సంసృతి దుఃఖి నౌదు న
ద్దేవునిసత్కృపామహిమఁ ǂ దెలిసవేళ సుఖింతు నేన కా
[2]దావిధిశంకరప్రభృతు ǂ లవ్విభుమాయఁ దరింప నేర్తురే. 70

వ. అయిన నమ్మహాత్మునికరుణాతరంగితాపాంగపరిలబ్ధవిజ్ఞానదీపాంకురనిరస్తసమస్త
దోషాంధకారుండ నగుటను మదీయచిత్తంబు హరిపరాయత్తం [3]బయినఁ దన్మా
ర్గంబు సతతంబు నిరీక్షించుచు నుండుదు మఱియును. 71

సీ. అట్టిసరోజాక్షుఁ ǂ డాత్మీయపదభక్తు, లడపుల నిడుమలఁ ǂ గుడుచు చుండ
దాత్యంబు సేయఁ గొం ǂ దఱు విరోధులు పట్టి, బద్ధునిఁ జేయ స ǂ న్నద్ధులైన
బలహీనుమాడ్కి మా ǂ ర్పడ లేఁడ యసమర్థుఁ, డని తలంచెద వేని ǂ నచ్యుతుండు
పరుల జయింప నో ǂ పక కామ విద్యాభి, [4]జనధనమత్తులై ǂ జగతిఁ బెక్కు
తే. బాధల నలంచుదుష్టభూ ǂ పతుల నెల్ల, సైన్యయుక్తంబుగా నని ǂ సంహరించు
కొఱకు సభలోన నప్పుడా ǂ కురుకుమారు,లాడుదుర్భాషణములకు ǂ నలుగఁ డయ్యె.

---

1 'మఱిఁ బాండుభూవిభునకు ♦ నూహింపఁగా' వ్రా. ప్ర. 2 'దావిధిరుద్రముఖ్యులకు ♦ నవ్వి...రచ్చునే.' వ్రాఁతప్రతులు. 3 'బయినకారణంబునను దత్త్వంబు సతతంబు' అచ్చుప్రతి 4 'జాత్యధనఁబుల ♦ జగతిఁ' అ. ప్ర.

మ. జననం బందుట లేనియీశ్వరుఁడు దా జన్మించు టెల్లన్ విరో
ధినిరాసార్థము వీతకర్ముఁ డగునద్దేవుండు కర్మప్రవ
ర్తనుఁ డౌ టెల్లఁ జరాచరప్రకటభూతశ్రేణులం గర్మవ
ర్తనులం జేయఁ దలంచి కాక కలవే దైత్యారికిం గర్మముల్. 73

క. హరి నరుల కెల్లఁ బూజ్యుఁడు, హరి లీలామనుజుఁడును గుణాతీతుఁడు నై
పరఁగిసభవకర్మంబులఁ, బొరయం డఁట హరికిఁ గర్మములు లీల లగున్. 74

క. మదిఁ దనశాసన మిడి నిజ, పదములు సేవించులోకపాలాదులఁ [1]బెం
పొదవింప యదుకులంబున, నుదయించెను భువిని బలసహోదరుఁ డగుచున్.

తే. చలన మందక భూరిసంసరణతరణ, మైనసత్కీర్తి దిక్కుల నతిశయిల్లి
వఱల సమమతి నై యున్నవాఁడె కృష్ణుఁ
డనుచు విదురుఁడు యుద్ధవు నడుగుటయును. 76

వ. అట్టియెడ నయ్యుద్ధవుండు. 77

క. యదుకులనిధి యగుకృష్ణుని, పదజలజవియోగతాపభరమున మాటల్
ప్రిదులక హృదయం బెరియఁగఁ, బెదవులు దడుపుచును వగలఁ బెంపఱియుండెన్.

క. అని చెప్పి బాదరాయణి, మనుజేంద్రునివలను సూచి మఱి యిట్లనియెన్
విను మొకనాఁ డయ్యుద్ధవుఁ, డనయము నై దేండ్లబాలుఁడై యున్నతఱిన్. 79

వ. మున్ను కృష్ణునిం గూడి యాడుబాలకులలో నొక్కబాలునిఁ గృష్ణునింగా
భావించి పరిచర్య సేయుచుండ గుణవతీమతల్లి యగుతల్లి సనుదెంచి యాఁ
కొంటి నది వేల రా వన్న యని పిలిచిన జననీవాక్యంబులు గైకొనక యఖండ
తేజోనిధి యైన పుండరీకాక్షుపాదారవిందమకరందసేవానురక్తిం జేసి యున్నయుద్ధ
వుండు నేఁడు కృష్ణవియోగతాపంబున హరివార్త విదురునకుఁ జెప్పం జాలక
(యొప్పఱి)యుండుట యిది విచిత్రం బని వెండియు నిట్లనియె నంత నుద్ధవుండు
సరోజాక్షుపాదారవిందమకరందసుధాజలనిధిమగ్నమానసుం డై సముత్కంఠం
జింతించి యొక్కముహూర్తమాత్రంబునకు బాష్పజలపూరితలోచనుం డై
గద్గదకంఠుం డగుచు. 80

క. ఘనముగ నెమ్మనమున [2]ఘుం, చినకృష్ణవియోగజనితశిఖి దరికొనఁగాఁ
గనుఁగవఁ బెడచే నొత్తుచుఁ, బెను పొందినమరితశిఖరిభిదుమున్ విదురున్. 81

వ. కనుంగొని యిట్లనియె. 82

క. యముఁ డనుఘనకాలభుజం, గముపుంగవుఁ డెగచి పట్టఁగా యదువంశో
త్తములచరిత్రలుఁ దత్కళ, లము లే మని చెప్పుదుం గలంగెడి మనమున్.

సీ. మునిజనముఖపద్మములు ముకుళింపంగ, ఖలజనలోచనోత్పలము లలర
జారచోరులకోర్కి సఫలత నొందంగ, దానవదర్పాంధతమస మడర

1 బెం, పొదవించుట కొఱకులమున. 2 ‘ఘుం, చిన......దరికొలుపన్’ అచ్చుప్రతి.

వరయోగిజనచక్రవాకంబు లడలంగఁ, గలుషజనానురాగంబు పర్వ
భూరిదోషాగమస్ఫూర్తి వాటిల్లంగ, నుదితధర్మక్రియ [1]లుడిగి మడఁగ
తే. మానుషాకారరుచికోటి మందపఱచి, యనఘుఁడే మననేర్తుఁ గృష్ణాభిధాన
లోకబాంధవుఁ డుత్తమశ్లోకమూర్తి, మించుతేజంబుతో నస్తమించె నయ్య.
వ. మఱియును. 85

క. హలకులిశజలజరేఖా, లలితశ్రీకృష్ణపాదలక్షితయై ని
ర్మలగతి నొప్పెడుధరణీ, లలనామణి నేఁడభాగ్యలక్షణ యయ్యెన్. 86

క. యాదవులవలన రాజ్య, శ్రీ దొలఁగెను ధర్మగతి నశించెను భువి మ
ర్యాదలు దప్పె నధర్మో, త్పాదనమున దైత్యభేది దప్పినపిదపన్. 87

వ. మఱియు లలితనికషణవిరాజమానమణిగణకిరణసుషమావిశేషవిడంబితవిమలసలి
లంబులందుఁ బ్రతిఫలితసంపూర్ణచంద్రమండలరుచి నిరీక్షించి జలచరబుద్ధిం జేసి
తజ్జలవిలోలమీనంబు లనూనస్నేహంబునం దలంచుచందంబునఁ గృష్ణానుచరు
లైనయదువృష్ణికుమారు లమ్మహనీయమూర్తిం దమకు నగ్రేసరుం డని కాని
లీలామానుషవిగ్రహుం డైనపరమాత్ముం డని యెఱుంగక హరిమాయాజనితం
[2]బగునసద్భావంబునం జేసి భోజనశయనాసనానుగమనంబులం జేరి సహోదరా
దిభావంబులం గూడి చరియింతు రట్టిదేవుని మాయాపయోనిధినిమగ్నులు గా
కుండ నబ్జభవభవాదులకైనం దీఱని సర్వగుణగరిష్ఠులును సత్పురుషశ్రేష్ఠులును
నగుపరమభాగవతులకుం దక్కఁ దక్కినవారలకుం జెప్ప నేల యదియునుం గాక
యభిజనవిద్యాధనబలగర్వమదాంధీభూతచేతస్కు లైనశిశుపాలాదిభూపాలకు ల
మ్మహాత్మునిం బరతత్త్వం బని యెఱుంగక నిందించుదుర్భాషలు దలంచి మనస్తా
పంబు నొందుచుండుదు ననివెండియు. 88

మ. అవితృప్తవ్రతధీసమాహితతపోవ్యాసంగు లైనట్టిభా
గవతశ్రేష్ఠుల కాత్మమూర్తి నిఖిలైకజ్యోతిమైఁ జూపి [3]శో
కవిశోకంబులు నిర్దహించి కమలాకాంతుండు శాంతుండు మా
నవరూపం బగుదేహమున్ వదలి యంతర్ధానుఁ డయ్యెం జుమీ. 89

సీ. మర్త్యవికాసైకమానమై తనరును, విస్మయజనకమై వెలయునట్టి
యాత్మీయయోగమాయాశక్తిఁ జేపట్టి, చూపుచు నత్యంతసుభగ మగుచు
భూషణంబులకును భూషణంబై వివేకముల కెల్లను బరకాష్ఠ యగుచు
సకలకల్యాణసంస్థానమై సత్వమై, తేజరిల్లెడునట్టిదివ్యమూర్తి
తే. తాన తనమూర్తినిజశక్తిఁ దగ ధరించి, యమతనూభవురాజసూయాధ్వరంబు
నందు నెవ్వనిశుభమూర్తి నర్థితోడ, నిందువేడుకఁ జూచి వర్ణించుచుండు.

1 'లుర్లు మడఁగ ; లుర్లి పడఁగ' వ్రా. ప్ర. 2 'బైనయసద్భావంబునం జేసి' వ్రా. ప్ర.
8 'లో, కవిలోకంబులు' వ్రా. ప్ర.

క. ప్రకటముగఁ గమలభవసృష్టికిఁ గారణ మిమ్మహాత్ముఁ డే యనుచును ను
త్సుకు లై తన్మూర్తిని దప్పక చూచిరి గాదె తత్సభాజను లెల్లన్. 91

వ. మఱియు శాంతోగ్రరూపధరుం డైన సర్వేశ్వరుండు శాంతరూపుండు గావునఁ బరకృతాపరాధనిపీడ్యమానమానసుం డయ్యు ననుకంపాయత్తచిత్తుం డై వర్తించుచు పరాపరుండును బ్రకృతికార్యం బైన మహత్తత్త్వరూపుండును జననవిరహితుం డయ్యును దారువులవలన ననలంబు దోఁచుచందంబున జననంబు నొందుచుండు నట్టిసరోజనాభుని హాసరాసలీలానురాగవిలోకనప్రతిలబ్ధమాన లైన గోపకామినులు దన్మూర్తిదర్శనానుషక్తమనీషలం గలిగి వర్తించి రదియునుం గాక. 92

చ. దివిజులకోర్కిఁ దీర్ప వసుదేవునియింట జనించి కంసదా
నవుఁడు హరించు నన్భయమునం జని నందునియింట నుంటకున్
యవనజరాసుతాదులకు నాజి నెదుర్పడ లేక సజ్జన
స్తవ మధురాపురిన్ విడిచి దాఁగుటకున్ మదిఁ జింత నొందుదున్. 93

వ. అదియునుం గాక. 94

సీ. కడఁగి పెక్కిడుములఁ గుడుచుచుఁ జిత్రముల్, గలఁగఁగ బంధనాగారములను
వనరిన దేవకీవసుదేవులను డాయఁ, జనుదెంచి భక్తివందన మొనర్చి
తలిదండ్రులార యేఁ గలుగంగ మీరలు, కంసుచే నలజడిఁ గ్రాఁగుచుండఁ
గడిఁదిశత్రునిఁ జంపఁగా లేక చూచుచు, నున్నాఁ దప్పఁ బ్రసన్ను లగుచుఁ

తే. గావుఁ డని యానతిచ్చిన దేవదేవు, నద్భుతావహమధురవాక్యములఁ దలఁచి
తలఁచి నాచిత్తమునఁ బెగ్గలఁగుచుందుఁ, బృథులపాతకభూమిభృద్భిదురవిదుర.

క. విమలమతిఁ దలఁప నెవ్వని, బొమముడిమాత్రమున నఖిలభూదేవీభా
రము వాయు నట్టిహరిపదకమలమరందంబుఁ గ్రోలుఘనుఁ డెవ్వాఁడో. 96

క. మందప్రజ్ఞుఁడ నై గో, విందుని మురదైత్యహరుని విష్ణునిఁ బరమా
నందుని నందతనూజుని, మందరధరుఁ జిత్తమందు మఱతునె యెందున్. 97

చ. అదియును గాక మీఁదు నృపు లందఱుఁ జూడఁగ ధర్మసూతిపెం
పొదవిన రాజసూయసవనోత్సవమందును జన్మమాదిగాఁ
బదపడి యుగ్రనిస్వశిశుపాలుఁడు యోగిజనంబు నెట్టిద
ట్టి దని యెఱుంగ నోపనికడిందిపదంబునఁ బొందెనే కదా. 98

చ. కురునృపపాండునందను లకుంఠితకేళిఁ జమూసమేతు లై
యరిదిరణోర్వి నెవ్వనిముఖాంబుజహాసామృత మాత్మలోచనో
త్కరములఁ గ్రోలి పార్థవిశిఖప్రకరక్షతపూతగాత్రు లై
గురుతరమోక్షధామమునకుం జని సౌఖ్యము [2]నొందిరో తుదిన్. 99

---

1 ననుకంపాయుక్తుం డై. 2 ‘నొందరే కదా’ ప్రా. ప్ర.

సీ. అట్టిసరోజాక్షుఁ డాద్యంతశూన్యుండు, సుభగుండు త్రైలోక్యసుందరుండు
గమనీయసాగరకన్యకాకుచకుంకు, మాంకితవిపులబాహాంతరుండు
సకలదిక్పాలభాస్వత్కిరీటన్యస్త, పద్మరాగారుణపాదపీఠుఁ
డజుఁ డనంతుఁడు సమానాధికవిరహితుం, డిద్ధమూర్తి త్రయాధీశ్వరుండు
తే. నైనహరి యుగ్రసేనుని నఖిలరాజ్య, రుచిరసింహాసనమునఁ గూర్చుండఁబెట్టి
భృత్యభావంబునొంది సంప్రీతినతని, పనుపు సేయుట కెపుడు వాయమనము గుండు.

వ. అని వెండియు నిట్లనియె ననఘా (పరాత్పరుండును యోగీశ్వరేశ్వరుండును నగు కృష్ణుండు భగవద్భక్తుండును బరమభాగవతోత్తముండును నైనయుగ్రసేనుని సేవించుట యాశ్చర్యంబు గాదు తన్ను హరియింపం దలంచి కుచంబుల విషంబు ధరియించి స్తన్యపానంబు సేయించినదుష్టచేతన యైనపూతనకుం జన్నిచ్చి పెంచిన యశోదాదేవికి నైన నందరానినిజపదంబుఁ గారుణ్యాయత్తచిత్తుండై యొసంగె ననిన నిజపదధ్యానపరాయణు లగువారల ననుసరించి సేవించుట సెప్ప నేల యనిన నుద్ధవునికి విదురుం డిట్లనియె భక్తవత్సలుండును గారుణ్యజలనిధియు (నై భాగవతజనుల ననుగ్రహించు) పుండరీకాక్షుండు భాగవతసేవ సేసెం గాక నిజదాసులోకంబున కొసంగుపరమపదంబు నుగ్రకర్ములైనరాక్షసుల కెట్లొసంగె నత్తెఱం గెఱింగింపు మనిన విదురునకు నుద్ధవుం డిట్లనియె. 101

మ. దనుజానీక మనేకవారములు దోర్దర్పంబు సంధిల్లఁగా
వినతాసూనుభుజాధిరోహుఁ డగు నవ్విష్ణున్ సునాభాయుధు
న్ననిలో మార్కొని పోకు పోకు హరి వైరత్యారాతి యంచుం దదా
ననముం జూచుచుఁ గూలి మోక్షపదము న్ప్రాపింతు రత్యున్నతిన్. 102
క. ధీరజనోత్తమ నవసిత, సారసలోచనుఁడు గృష్ణుఁ జననంబును ద
చ్చారిత్రము నెఱిఁగింతు ను, దారత నీ విపుడు వినుము తద్విధ మెల్లన్. 103
చ. ధరణిభరంబు వాపుటకుఁ దామరసాసనుప్రార్థనన్ రమా
వరుఁ డలకంసబంధననివాసమునన్ వసుదేవదేవకీ
వరులకు నుద్భవింప బలవంతుఁడు గంసుఁడు హింస సేయు న
న్వెఱపున నర్ధరాత్రి సుతుఁ గొని యన్వసుదేవుఁ డిమ్ములన్. 104
క. నందునిమందకుఁ జని త, త్సుందరితల్పమునఁ బాలుఁ బూడకయుండన్
నందనుని నునిచి యూనక, దుందుభి మరలంగ నేఁగెఁ దొల్లిటిపురికిన్. 105
క. హరి యేకాదశసంవ, త్సరములు నందవ్రజమునఁ దను హరి యని యె
వ్వరు నెఱుఁగకుండ బాలుర, ధృతితోఁ [1]గ్రీడించుచుండె దద్దయుఁ బ్రీతిన్.
క. గోపాలవరుల కైనను, నాపోవఁగఁ దనసమాంచితాకార మొగిం
జూపని శ్రీపతి వేడుక, గోపాలురఁ గూడి కాచె గోవత్సములన్. 107

1 'గూడాడుచుండె' అనియే వ్రాతప్రతులు.

వ. అయ్యవసరంబునం గృష్ణుండు లీలావినోదంబులు దోడిగోపాలబాలురకుం జూపం దలంచి. 108

చ. వరయమునానదీసలిలవర్ధితసౌరభయుక్తపుష్పమే
దురమకరందపాన[1]పరితుష్టమధువ్రతయూథమాధవీ
కురవకకుందచందననికుంజములందు మయూరశారికా
పరభృతరాజకీరమృదుభాషలభంగిఁ జెలంగి పల్కుచున్. 109

ఉ. శ్రీరమణీమనోవిభుఁడు సింహకిశోరముఁబోలె లీలఁ గా
మారదశన్ రమావిమలమందిరముం బురుడించుగోతతిన్
వారక మేపుచుం దరళవంశరవస్ఫుటమాధురీసుధా
సారముచేత గోపజనసంఘములన్ ముద మందఁ జేయుచున్. 110

వ. మఱియును. 111

మ. చిరకేళీరతి బాలకుల్ దృణములన్ సింహాదిరూపంబులం
గర మొప్పన్ విరచించి వాని మరలన్ ఖండించుచందంబునం
గరుణాతీతులఁ గామరూపు లగునక్కంసప్రయుక్తక్షుపా
చకులం గృష్ణుఁడు సంగరస్థలములం [2]జక్కాడె లీలాగతిన్. 112

చ. వరయమునానదీజలనివాసమహోరగవిస్తృతాస్యవి
స్ఫురితవిషానలప్రభలసోఁకునఁ గ్రాఁగినగోపగోధనో
త్కరముల నెల్లఁ గాచి భుజగప్రవరున్ వెడలంగఁ దోలి త
త్సరిదమలాంబుపానమున సంతస మందఁగఁ జేసె గోతతిన్. 113

మ. దివిజాధీశుగుఱించి వానకొఱకై దీపింప నందాదివ
ల్లవు లేఁటేఁట ననూనసంపదల నుల్లాసంబునం జేయును
త్సవముం గృష్ణుఁడు మాన్పి గోపగణముల్ సంప్రీతి నొందన్ శచీ
ధవుగర్వం బడఁపంగ నవ్యయముగాఁ దాఁ జేసె గోయాగమున్. 114

చ. హరిహయుఁ డంత రోషవివశావిలమానసుఁ డై సరోరుహో
దరుమహిమం బెఱుంగక మదం బడరంగ వలాహకాదిభీ
కరఘనపంక్తిఁ బంపిన నఖండశిలామయభూరివర్షముల్
గురిసె ననూనగర్జనల గోకుల మాకుల మంది మ్రందఁగన్. 115

ఉ. ఆతఱి మంద గొందలము నందఁగ వల్లవు లెల్లఁ గృష్ణ కృ
ష్ణేతివిభీతవాక్యములఁ జిందఱవందఱ లై కలంగుచుం
గాతరు లై మముం గరుణఁ గావుము కావు మనాథనాథ ని
ర్ధూతకళంక భక్తపరితోషణభూషణ పాపశోషణా. 116

మ. అని యిబ్బంగి విపన్ను లై పలుకఁ గుయ్యాలించి కృష్ణుండు స

1 పరితుష్టితభృంగసమూహమాధవీ. 2. 'జెండాడె' వ్రా. ప్ర.

జనవర్ధిష్ణుఁడు గోపగోనివహరక్షాదక్షుఁ డై దేవతా
జను లగ్గింపఁ గరాంబుజాతమున సచ్ఛత్త్రంబుఁగాఁ దాల్చె బో
రన గోవర్ధనశైలముం దటచరద్రమ్యామరీజాలమున్. 117

వ. వెండియు. 118

సీ. శరదాగమారంభ।సంపూర్ణపూర్ణిమా,చంద్రసాంద్రాతపోజ్జ్వలిత మగుచు
వెలయుబృందాటవీ।వీథియం దొకనాఁడు, రాసకేళీమహో।ల్లాసుఁ డగుచు
రుచిరసౌభాగ్యతా।రుణ్యమనోరమ,స్ఫూర్తిఁ జెన్నొందిన।మూర్తి దనర
సలలితముఖచంద్ర।చంద్రిక గోపికా,నయనోత్పలముల కా।నంద మొదవ

తే. భవ్యచాతుర్యభంగిఁ ద్రి।భంగి యగుచు, నబ్జనాభుండు సమ్మోద।మతిశయిల్ల
లీలఁ బూరించువరముర।ళీనినాద, మర్థి వీతేర విని మోహి।తాత్మ లగుచు. 119

చ. పతులు మఱందులున్ సుతులు । బావలు నత్తలు మామలున్ సము
న్నతి వల దన్న మానక మ।నంబునఁ గృష్ణపదాబ్జసేవనా
న్వితరతి గోపకామినులు । వే చనుదేఁ గరుణాపయోధి శో
భితగతి రాసకేళి సలి।పెం దరుణీనవపుష్పచాపుఁ డై. 120

ఉ. రాముఁడు దాను గూడి మథు।రాపురికిం జని యందు వైభవో
ద్దామనృపాసనంబున ము।దంబున నున్నదురాత్ముఁ గంసు దు
ష్టామరశత్రుఁ ద్రుంచి ముద । మారఁగఁ దల్లిని దండ్రి నంచిత
శ్రీమహితాత్ము లై తనరఁ । జేసె సరోరుహనాభుఁ డున్నతిన్. 121

మ. నలు వొప్పంగ షడంగయుక్తమహితా।[1]మ్నాయంబుఁ జౌషష్టివి
ద్యలు సాందీపనిచే నెఱింగెఁ జెలు వొం।దన్ విన్నమాత్రంబులో
పల నే లోకగురుండు దాన తనకున్ । భావింప నన్యుల్ గురు
ల్గల రే లోకవిడంబనార్థ మగు లీ।లల్ గావె యమ్మేటికిన్. 122

ఉ. [2]మించి ప్రభాసతీర్థమున । మృత్యువశంబునఁ బొంది పోయి యా
పంచజనోదరస్థుఁ డగు।బాలకు దేశికునందనుం బ్రభో
దంచితలీలఁ దెచ్చి గురు।దక్షిణగా నతిభక్తియుక్తి న
ర్పించె గురుండు చిత్తమునఁ । బెం పెసలార మురారి వెండియున్. 123

సీ. ఘనుఁడు విదర్భేశుఁ । డన నొప్పుభీష్మకు, వరసుతామణి నవ।వారిజాక్షిఁ
బద్మాసమాన రూ।పశ్రీవిభాసితఁ, గమనీయభూషణఁ । గంబుకంఠిఁ
జతురస్వయంవరో।త్సవసమాగతచైద్య,సాల్వమాగధముఖ్య।జనవరేణ్య
నికరసమావృతఁ । బ్రకటసచ్చారిత్ర, రుక్మిణి నసమాన।రుక్మకాంతి

తే. సమరగుప్తామృతంబు వి।హంగవిభుఁడు, గొనినకైవడి మనుజేంద్ర।కోటిఁ దోలి

---

1 'మ్నాయాగసైర్మల్యవి, ద్యలు' వ్రా. ప్ర. 2 'మంచిప్రభాసతీర్థజల।మధ్యమునన్ మృతిఁ బొంది పోయి' వ్రా. ప్ర.

కమలనాభుండు నిజభుజాగర్వ మలరఁ, దెచ్చి వరియించె నతని నుతింపవశమె.

చ. పసువడి భూరిసత్త్వవృషభంబుల ముక్కులు గుట్టఁ దద్బల
స్ఫురణ సహింపఁ జాలక నృపుల్ దలపడ్డ జయించి నగ్నజి
ద్ధరణిపునందనన్ వికచతామరసాక్షిఁ బ్రమోదియై స్వయం
వరమునఁ బెండ్లియాడె గుణవంతుఁ డనంతుఁ డనంతశక్తితోన్. 125

మ. ప్రతివీరక్షయకారి నాఁ బరఁగి సత్రాజిత్తనూజాహృదీ
ప్సితముం దీర్పఁ దలంచి నాకమునకుం బెంపారఁ గా నేఁగి వ
ర్ణితశౌర్యోన్నతిఁ బారిజాత మిలకు న్లీలాగతిం దెచ్చె ను
ద్ధతి దేవేంద్రు జయించి కృష్ణుఁ డన నేతన్మాత్రుఁడే చూడఁగన్. 126

సీ. మానితాఖిలజగన్మాన్యదేహమునఁ బొల్చు, ధరణిదేవికిఁ బ్రియతనయుఁ డైన
నరకదానవుని సునాభాఖ్యఁ జెన్నొందు, ఘనచక్రధారావిఖండితోత్త
మాంగునిఁ జేయ నయ్యవనీలలామంబు, వేఁడినఁ దత్పుత్రు విపులరాజ్య
పదమున నిల్పి లోపలిమందిరమునకుఁ, జేరఁగ నరకుండు సెఱలఁ బెట్టి

తే. నట్టికన్యలు నూఱుఁ బదాఱువేలు, నార్తబాంధవుఁ డైనసర్వాత్ముఁ జూచి
హర్షబాష్పాంబుధారాప్రవర్ష మొదవఁ, బంచశరబాణనిర్భిన్నభావ లగుచు.

చ. లలితతదీయసుందరవిలాసవిమోహిత లైనవారి నిం
పొలసినకోర్కిఁ దీర్చుటకు నొక్కముహూర్తమునన్ వరించి క
న్యల లలితావరోధభవనంబుల నందఱ కన్నిరూపులై
కలసి సుఖస్థితిం దనిపెఁ గాంతల భక్తినితాంతచిత్తలన్. 128

క. చతురతతో సందొక్కొక, యతివకుఁ బదురేసి సుతుల నాత్మసముల ను
న్నతభుజశక్తులఁ గాంచెను, వితతం బై కీర్తి దిశల వినుతికి నెక్కన్. 129

సీ. మథురాపురముఁ జతుర్విధబలౌఘములతో, నావరించినకాలయవనసాల్వ
మగధభూపాలాదిమనుజేంద్రలోకంబు, సైన్యయుక్తము గాఁగ సంహరించి
తనబాహుశక్తిఁ జిత్తముల నర్థించిన, భీమపార్థులకు సుద్దామవిజయ
మొసఁగి తద్వైరుల నుక్కడంగఁగఁ ద్రుంచి, బాణశంబరమురపల్వలాది

తే. దనుజనాయకసేనావితానములను, హలధరాదిసమేతుఁడై హతులఁ జేసె
[1]దంతవక్త్రాదిదైత్యులు దన్ను నెదుర, భండనములోనఁ ద్రుంచె దోర్బలము మెఱసి.

వ. వెండియుం గృష్ణుండు కౌరవపాండవభండనంబునకుం దోడ్పడి రాజన్యులన్యోన్యమాత్సర్యోత్సాహసమేతులై సైనికపాదఘట్టనంబుల ధరాచక్రంబు గంపింప ననన్యసామాన్యంబు లయినశంఖభేరీప్రముఖతూర్యఘోషంబులు నింగి మ్రింగఁ దురంగమరింఖాసముద్ధూతధూళిపటలపరిచ్ఛన్నభానుమండలంబునుం గాఁ జనుదెంచి కురుక్షేత్రంబున మోహరించిన నుభయపక్షబలంబులం దునుమాడి నిఖిల

---

1 దతిమె యవనాదిదైత్యులు.

రాజ్యవైభవమదోన్మత్తుం డయిన సుయోధనుండు నిఖిలరాజసమక్షంబునఁ గర్ణ శకునిదుశ్శాసనాదులదుర్మంత్రంబున నిరంతరంబుఁ గుంతీనందనుల కెగ్గు సేసిన దోషంబునం జేసి సంగరరంగంబున భీముగదాఘాతంబునం దొడలు విఱిగి పుడమిం బడి గతాయుశ్శ్రీవిభవుం డై యుండ సపరితోషచిత్తుండ నై చూచితిని గదా యపరిమితబాహుబలోత్సాహు లైన భీష్మద్రోణభీమార్జునులచేత నఖిలధరాధిపతుల నష్టాదశాక్షౌహిణీబలంబులతోడం దునిమించితి నింకను మత్త మానవు లయిన యదువీరుల జయింప నెంతవారలకైనం దీరదు మధుపానమద విఘూర్ణితతామ్రవిలోచను లై వర్తించు యాదవుల కన్యోన్యవైరంబులు గల్పించి పోరించి యితరేతరకరాఘాతంబుల హతు లై తన్నుఁ గలసినం గాని భూభారం బుడుగదని చిత్తంబునం దలంచి యంత ధర్మనందనుచే నిస్సపత్నంబగు రాజ్యంబు పూజ్యంబుగాఁ జేయించుచు మర్త్యులకుం గర్తవ్యంబు లైన ధర్మపథంబులు సూపుచు బంధుమిత్రుల నెల్లఁ బరితోషంబు నొందించుచుం దత్పరోక్షంబున వారి వంశం బుద్ధరింపం దలంచి యభిమన్యువలని యుత్తరాగర్భంబు నిలిపి గురుతనయప్రయుక్తమహితబ్రహ్మాస్త్రపాతంబునం దద్గర్భదళనంబు గాకుండ నర్భకుని రక్షించి నిజపదారవిందసేవారతుం డైన ధర్మసుతుచేఁ గీర్తిప్రతాపంబులు నివ్వటిల్లం దురంగమేధంబులు మూఁడు సేయించి వెండియు. 131

సీ. వల నొప్ప లౌకికవైదికమార్గముల్, నడపుచు ద్వారకానగరమందు
నవిదితాత్మీయమాయాప్రభావమున ని, స్సంగుఁ డై యుండి సంసారిపగిదిఁ
జెంది కామంబులచేత విమోహితుం, డై సుఖించుచు ముదితాత్ముఁ డగుచు
నంచితస్నిగ్ధస్మితావలోకముల సు, ధాపరిపూర్ణసల్లాపములను

తే. శ్రీనికేతన మైనశరీరమునను, బాండునందనయదుకులప్రకరములను
లీలఁ గారుణ్య మొలయఁ బాలించుచుండె, నార్తరక్షాచణుండు నారాయణుండు.

సీ. సంపూర్ణపూర్ణిమాచంద్రచంద్రిక నొప్పు, రమణీయశారదరాత్రులందు
సలలితకాంచనస్తంభసౌధోపరి, చంద్రకాంతోపలస్థలములందు
మహితకరేణుకామధ్యదిగ్గజముల, గతిని సౌదామినీలతలనడిమి
నీలమేఘంబులలీల [1]ముక్తానుయు, క్తస్నిగ్ధనీలరత్నములభాతి

తే. సతతయౌవనసుందరీయుతవిహారుఁ, డగుచు సతు లెంద ఱందఱ కన్నిరూప
ములను గ్రీడించెఁ బెక్కబ్దములు సెలంగి, నందనందనుఁ డభినవానందలీల. 133

వ. అంత నొక్కనాఁడు. 134

చ. మునివరు లేఁగుదేర యదు[2]భోజవరేణ్యులు గూడి ముట్టఁ బ
ల్కినఁ గన లొంది వారు దమకించి శపించినఁ గొన్నిమాసముల్
చనునెడ దైవయోగమున జాతరఁ బో సమకట్టి వేడుకల్

1 ముక్తాయుక్త. లాలితస్నిగ్ధనీలములభాతి. 2 'ముఖ్యులు గొందఱు గూడి' అ. ప్ర.

మనములఁ దొంగలింపఁ గరిమన్ నిజయానము లెక్కి యాదవుల్. 135

ఉ. కోరి ప్రభాసతీర్థమునకుం జని తన్నదిఁ గ్రుంకి నిర్మలో
దారత నందు దేవముని-తర్పణముల్ పితృతర్పణంబులున్
వారనిభక్తిఁ జేసి నవ-వత్సలతోఁ బాలుపారుగోవులన్
భూరిసదక్షిణాకముగ - భూసురకోటికి నిచ్చె వెండియున్. 136

క. అజినపట రత్నకంబళ, రజత మహారజత తిల ధ-రా వరకన్యా
గజ తురగ రథములను సద్ద్విజకోటికి నిచ్చెఁ బెంపు - దీపింపంగన్. 137

వ. ఇట్లు సఫలంబు లయినభూదానంబుమొదలుగాఁ గలదానంబు లనూనంబులుగా భగవదర్పణబుద్ధిం జేసి యనంతరంబ. 138

తే. ఎసఁగుమోదంబు సంధిల్ల - నిష్టమైన, రసికమృదులాన్న మర్థిఁ బా-రణలు సేసి
మంజులాసవరసపాన-మత్తులగుచుఁ, గడఁగియన్యోన్యహాస్యవా-క్యములఁ గలఁగి.

వ. ఇట్లు దమలోన మదిరాపానమదవిఘూర్ణితతామ్రలోచను లయి మత్సరంబుల నొండొరులం బొడిచి సమస్తయాదవులును వేణుజాతానలంబునఁ దద్వంశపరంపరలు దహనంబు నొందుచందంబునం బొలిసి రది యంతయుం గనుంగొని శ్రీకృష్ణుం డప్పుడు. 140

క. చతురతతో నిజమాయా, గతిఁ జూచి లసద్విలోల-కల్లోలసమం
చితవిమలకమలసార, స్వతజలముల విహితవిధులు - సలిపినవాఁ డై. 141

క. ఒకవృక్షమూలతలమున, నకలంకగుణాభిరాముఁ - డాసీనుం డై
యకుటిలమతి [1]బదరీవన, మునకును బొమ్మనుచు మొఱఁగి - పోయిన నేనున్. 142

క. క్రమమున నిజకులసంహా, రము సేయఁ గడంగు టెఱిఁగి - రమణీయశ్రీ
రమణుచరణాబ్జయుగవిర, హమునకు మది నోర్వలేక - యనుగమనుఁడ నై. 143

క. హరి నరయుచుఁ జని చని యొక, తరుమూలతలంబునందుఁ - దనదేహరుచుల్
నరఁగఁగ నున్నమహాత్ముని, బరుని బ్రపన్నార్తిహరుని - భక్తవిధేయున్. 144

వ. మఱియును. 145

సీ. అస్మత్ప్రియస్వామి - నచ్యుతుఁ బరు సత్త్వ, గుణగరిష్ఠుని రజో-గుణవిహీను
సురుచిరద్వారకా-పురసమాశ్రయు ననా, శ్రయు నీలనీరద-శ్యామవర్ణు
దళదరవిందసుం-దరపత్త్రనేత్రు లక్ష్మీయుతుఁ బీతకౌ-శేయవాసు
విలసితవామాంక-విన్యస్తదక్షిణ, చరణారవిందు శ-శ్వత్ప్రకాశు

తే. ఘనచతుర్బాహు సుందరా-కారు ధీరుఁ, జెన్ను గలలేఁతరావిపై - వెన్ను మోపి
యున్నవీరాసనాసీను - నన్నుఁ గన్న, తండ్రి నానందపరిపూర్ణు - దనుజహరుని.

మత్తకోకిలము. కంటిఁ గంటి భవాబ్ధి దాఁటఁగఁ - గంటి నాశ్రితరక్షకుం
గంటి యోగిజనంబుడెందముఁ - గంటిఁ జుట్టముఁ గంటి ము

---

1 'బదరీవని, కిఁక నీ వరుగు మని మొఱఁగి ♦ యేఁగిన' అ. ప్ర.

కన్గొంటికిం గన రానియెక్కటిఁ బొగంటిఁ దామరకంటిఁ జే
కొంటి ముక్తివిధానముం దలఁకొంటి సౌఖ్యము లందఁగన్. 147

వ. అయ్యవసరంబునం బరమభాగవతోత్తముండును మునిజనసత్తముండును ద్వైపాయనసఖుండును బరమతపోధనుండును నఘశూన్యుండును నఖిలజనమాన్యుండును బుధజనవిధేయుండును నగు మైత్రేయుండు దీర్థాచరణంబు సేయుచుం జనిచని. 148

మ. కనియెం దాపసపుంగవుం డఖిలలోకఖ్యాతవర్ధిష్ణు శో
భనభాస్వత్పరిపూర్ణయౌవనకళాభ్రాజిష్ణు యోగీంద్రహృ
ద్వనజాతైకచరిష్ణుఁ గౌస్తుభముఖోద్యద్భూషణాలంకరి
ష్ణు నిలింపాహితజిష్ణు విష్ణుఁ బ్రభవిష్ణుం గృష్ణు రోచిష్ణునిన్. 149

క. తదనంతరంబ హరిఁ దన, హృదయాంభోరుహము ముకుళితేక్షణముల స
మ్మదమునఁ జూచుచు నానత, వదనుం డై యుండె ముదము వఱలఁగ ననఘా.

వ. అంత దగ్గఱ నేతెంచి యున్న మైత్రేయుండు వినుచు నుండ దరహాసచంద్రికాసుందరవదనారవిందుండును నానందసుధానిష్యందకందళితహృదయుండును భక్తానురక్తదయాసక్తవిలోకనుండును నగు పుండరీకాక్షుండు నన్ను నిరీక్షించి యి ట్లని యానతిచ్చెఁ బూర్వభవంబున వసుబ్రహ్మలు సేయు సత్త్రయాగంబున వసువై భవదీయహృదయంబున నితరపదార్థంబులు గోరక మదీయపాదారవిందసేవఁ గాంక్షించితివి గావునం దన్నిమిత్తంబున నేను నీహృదయంబున వసియించి సమస్తంబును గనుచుండుదు నాత్మారాముండ నై నన్ను నెవ్వరేనియు సదసద్వివేకులై యెఱుంగం జాలరు వారలకు నేను నగోచరుండ నై యుండుదు మత్పరిగ్రహంబు గలనీకు నీజన్మంబ కాని పునర్భవంబు నొంద కుండుటకు భవదీయపూర్వజన్మకృతసుకృతవిశేషఫలంబు కతన నియ్యాశ్రమంబున మత్పాదారవిందసందర్శనంబు గలిగె నదియునుం గాక పద్మకల్పంబునందు మన్నాభిపద్మమధ్యనిషణ్ణుం డయిన పద్మసంభవునకు (జన్మమరణాదిసంసృతినివర్తకంబును నవిరతానశ్వరసౌఖ్యప్రవర్తకంబును నగు) మన్మహత్త్వంబుఁ దెలియఁ జేయు నట్టిదివ్యజ్ఞానంబు నీకు నెఱింగింతు నని యమ్మహనీయతేజోనిధి యానతిచ్చినసుధాసమానసరసాలాపంబులు గర్ణకలాపంబులై మనస్తాపంబులం బాపిన రోమాంచకంచుకితశరీరుండను నానందబాష్పధారాసిక్తకపోలుండను బరితోషసాగరాంతర్నిమగ్నమానసుండను నయి యంజలిపుటంబు నిటలతటంబున ఘటియించి యి ట్లంటి. 151

క. పురుషోత్తమ నీపదసర,సిరుహధ్యానామృతాభిషేకస్ఫురణం
గర మొప్పిననాచిత్త మి,తరవస్తువులందు వాంఛఁ బొదఁగులునె యెందున్. 152

చ. జననము లేనినీవు భవసంగతి నొందుట కేమికారణం
బనియును గాలసంహరుఁడవై జగముల్ ¹విలయించునీవు పా
యనిరిపుభీతికై సరిదుదంచితదుర్గము నాశ్రయించు టె
ట్లనియును దేవ నామనమునందుఁ దలంతు సరోజలోచనా. 153

వ. అదియునుం గాక. 154

క. శ్రీరమణీశ్వర నీ వా, త్మారాముఁడ వయ్యు లీలఁ దరుణీకోటిం
గోరి రమించితి వనియును, వారక నేఁ దలఁతు భక్తవత్సల కృష్ణా. 155

క. పరతత్త్వజ్ఞులు గరుణా, కర నిను సంసారి వనుచుఁ గడఁకఁ దలంపన్
అరసి ననుఁ గాచు టెల్లను, గర మరుదు తలంచి చూడఁ గమలాధీశా. 156

వ. దేవా నీ వఖండితవిజ్ఞాననిర్మలాంతఃకరణుండ వయ్యును ముగ్ధభావంబునఁ బ్రమ
త్తునిచందంబున విమోహికై వడిం బ్రవర్తించుచు నెందేని నొదిఁగి యుండుటం
దలంచి నాడెందంబు గుందుచుండు నరవిందలోచన పురందరవందిత ముకుంద
యిందిరాసుందరీరమణ సరస్వతీరమణునకుం గరుణించి యానతిచ్చినసుజ్ఞానంబు
ధరించుశక్తి నాకుం గలదేనిఁ గృపసేయుము భవదీయశాసనంబు ధరియించి భూరి
సంసారపారావారోత్తరణంబు సేయుదు నని విన్నవించి బహుభంగులం బ్రస్తు
తించిన భగవంతుండును బ్రసన్నపారిజాతంబును నైనకృష్ణుండు పరతత్త్వనిర్ణ
యంబు నెఱింగించిన. 157

క. సరసిజలోచనకరుణా, పరిలబ్ధజ్ఞానకలితభావుఁడ నగుటం
బరతత్త్వవేది నై తచ్చరణసరోజముల కెరఁగి సమ్మతితోడన్. 158

క. హరిపదజలరుహవిరహా, తురతన్ దుర్దాంతదుఃఖతోయధిఁ గడవన్
వెర వేది తిరుగ వలసెను, సరసిజభవకల్పవిలయసమయము²దాఁకన్. 159

వ. ఇట్లు దిరుగుచు. 160

మ. నరనారాయణతాపసాశ్రమపదాసన్నత్వంబునం గల్పభూ
సురమందార రసాల సాల వకుళాశోకామ్ల పున్నాగ కే
సర జంబీర కదంబ నింబ కుట జాశ్వత్థ స్ఫురన్మల్లికా
కరవీరక్షితిజాభిరామ బదరీకాంతార సేవారతిన్. 161

క. చను చున్నవాఁడ నని పల్కినపలుకుల కులికి కళవళించుచు విదురుం
డనుపమశోకార్ణవమున, మునిఁగియు నిజయోగసత్త్వమునఁ దరియించెన్. 162

వ. ఇట్లు విదురుండు శోకపావకునిం దనవివేకజలంబుల నార్చి యుద్ధవుని కిట్లనియె.

మ. అనఘా యుద్ధవ నీకుఁ గృష్ణుఁడు సురేంద్రారాతి మన్నించి చె
ప్పినయధ్యాత్మరహస్యతత్త్వవిమలాభిజ్ఞానసారంబు బో
రన నన్నుం గరుణించి చెప్పినఁ గృతార్థత్వంబునం బొందెదన్

1 'విలయించు' అ. ప్ర. 2 తుదగాన్; తడగాన్.

విను పుణ్యాత్ములు శిష్యసంఘముల నర్థిం బోవరే వెండియున్. 164

క. భగవద్భక్తులు సుజనులు, దగ వెఱఁగి పరోపకారతాత్పర్యవివే
కగరిష్ఠు లై చరింతురు, జగతిం బొగడొంది వృష్ణిసత్తమ యెందున్. 165

క. అనవుడు నుద్ధవుఁ డవ్విదు, రున కిట్లను ననఘ మునివరుఁడు సాక్షాద్వి
ష్ణునిభుం డగుమైత్రేయుఁడు, దనమనమున మనుజగతి వదలఁ దలఁచి తగన్.

క. హరి మురభేదిఁ బరాపరుఁ, గరుణాకరుఁ దలఁచునట్టి ఘనుఁ డమ్మునికిం
జరుకడ కేఁగిన నాతఁడు, గర మర్థిం దెలుపు సాత్త్వికజ్ఞానంబున్. 167

వ. అని యుద్ధవుండు విదురుం గూడఁ జని చని. 168

ఉ. ముందటఁ గాంచె నంత బుధముఖ్యుఁడు హల్లకఫుల్లపద్మని
ష్యందమరందపానవిలసన్మదభృంగఁ జలత్తరంగ మా
కందలవంగలుంగలతికాచయసంగ సురాంగనాశ్రితా
నందితపుణ్యసంగ యమునన్ భవభంగ శుభాంగ నర్మిలిన్. 169

క. కని డాయ నేఁగి మోదం, బునఁ దత్సరిదమలపులినభూములఁ దగ నా
దినశేషము [1]నివసించెను, వనజోదరపాదపద్మవశమానసుఁ డై. 170

క. మఱునాఁడు రేపకడ భా, సురపుణ్యుఁడు ఘనుఁడు మధునిషూదనచరణ
స్మరణక్రీడాకలితుఁడు, దరియించెం గలుషగహన[2]దమునన్ యమునన్. 171

వ. ఇట్లు యమునానది నుత్తరించి యుద్ధవుండు బదరికాశ్రమంబునకుం జనియె
ననిన విని రాజేంద్రుండు యోగీంద్రున కిట్లనియె. 172

క. శౌరియు నతిరథవరులు మ, హారథసమరథులు యదుబలాధిపు లెల్లం
బోరి మృతిఁ బొంద నుద్ధవుఁ, డేరీతిన్ బ్రదికె నాకు నెఱిఁగింపు తగన్. 173

సీ. నావుడు రాజేంద్రునకు శుకయోగీంద్రుఁ, డిట్లను మున్ను లోకేశుచేత
సంప్రార్థితుం డైన జలరుహనాభుండు, వసుమతిపై యదువంశమందు
నుదయించి తనుఁదాన మదిలోనఁ జింతించి, తెలి వొంది యాత్మీయకులవినాశ
మొనరించి తాను బంచోపనిషణ్మయ, మగుదివ్యదేహంబు నందుఁ జెందఁ

తే. దలఁచి విజ్ఞానతత్త్వంబు ధరణిమీఁదఁ. దాల్చి జనకోటి కెఱిఁగింపఁ దగినధీరుఁ
డుద్ధవుఁడుదక్క నితరు లేరోప రితఁడు, నిర్జితేంద్రియుఁ డాత్మసన్నిభుఁ డటంచు.

క. క్షితిపై నిలిపినకతమున, నతనికి మృతి దొరక దయ్యె నవనీశ రమా
పతియభిమానము గలిగిన, యతిపుణ్యుఁడు సనియె బదరికాశ్రమమునకున్.

వ. అంత. 176

క. ఉద్ధవుఁ డరిగినపిదప స, మిద్ధపరిజ్ఞాను సుజనహితు మైత్రేయున్
వృద్ధజనసేవ్యుఁ దాపస, వృద్ధశ్రవుఁ జూడఁ గోరి విదురుఁడు గడఁకన్. 177

---

1 నివసించిరి ..మానసు లై. 2 దమునశ్శబ్దము సాంతము గాన 'దమునసన్' అని యుండఁ దగు. అయినను వ్రాఁతప్రతులందు 'దమునన్' అనియే కానిపించుచున్నది.

వ. యమునానది దాఁటి కతిపయప్రయాణంబులఁ బుణ్యనదులను హరిక్షేత్రంబుల
ను దర్శించుచు నతిత్వరితగమనంబున. 178

క. చని చని ముందటఁ గనుఁగొనె, ఘనపాపతమఃపతంగఁ గరుణాపాంగం
గనదుత్తుంగతరంగన్, జనవరసుతబహుళపుణ్యసంగన్ గంగన్. 179

క. అందు నరవిందసౌరభ, నందితపవమానఘూర్ణనటదూర్మిపరి
స్పందితకందళశీకర, సందోహలసత్ప్రవాహజలమజ్జనుఁడై. 180

సీ. ఘనసారరుచివాలుకాసముదంచిత, సైకతవేదికాస్థలమునందు
యమనియమాదియోగాంగక్రియానిష్ఠఁ, బూని పద్మాసనాసీనుఁ డగుచు
హరిపాదసరసీరుహన్యస్తచిత్తుఁడై, బాహ్యేంద్రియవ్యాప్తిఁ బాఱఁ దోలి
సకలవిద్వజ్జనస్తవనీయసముచితా, చారవ్రతోపవాసములఁ గృశి

తే. యున్నపుణ్యాత్ము విగతవయోవికారు, వినుతసంచారు భువనపావనవిహారు
యోగిజనగేయు సత్తతిభాగధేయు, శ్రితవిధేయు నమేయు మైత్రేయుఁ గాంచె.

విదురమైత్రేయసంవాదము.

వ. ఇట్లు గనుంగొని యమ్మునీంద్రునిపాదంబులకుం బ్రణమిల్లి ముకుళితహస్తుండై యి
ట్లనియె మునీంద్రా లోకంబున సకలజనంబులు మనంబుల ఘనంబు లగుసౌఖ్యం
బు లందం దలంచి తత్ఫలప్రాప్తిహేతువు లైనకర్మంబు లాచరించి దైవోపహ
తు లై తత్కర్మంబులచేత నిష్ఫలారంభు లగుదురు కర్మంబులు బంధకంబులును
దుఃఖహేతువులునుం గాని సౌఖ్యదాయకంబులై పాపనిష్కృతిఁ జేయ నోప వది
యట్లుండె భూరిదుఃఖానుసారం బైనసంసారచక్రంబునందుఁ బరిభ్రమించుచుం
గామవిమోహితు లై పూర్వకర్మానుగతంబు లైనశరీరంబులు దాల్చుచుం జ
చ్చుచు మరలం బుట్టుచు నెంతకాలంబునకుం బాపనిష్కృతిఁ గానక మాత్మయా
వనవనకుఠారు లై జనియించి వర్తించుమూఢాత్ములం బశుప్రాయుల రక్షించు
కొఱకుఁ గాదె నారాయణపరాయణు లైనమీవంటిపుణ్యాత్ములు లోకంబునం
జరియించుట యదియునుం గాక. 182

మ. అవివేకానుగతస్వకార్యజలవేలాకీర్ణమై మిత్రబం
ధువధూపుత్రజలగ్రహోగ్రయుతమై దుర్దాంతమైనట్టిదు
ర్భవపాథోధిఁ దరించువారె హరిసంబంధక్రియాలోలభా
గవతానుగ్రహనావ లేనియధముల్ గారుణ్యసంధాయకా. 183

క. మునినాథచంద్ర నను గై, కొని కాచుతలంపు బుద్ధిఁ గూడినయేనిన్
వినుము మదీప్సిత మది నా, చనవునఁ గావింపవయ్య సజ్జనతిలకా. 184

వ. అని వెండియు విదురుండు మైత్రేయుం జూచి మునీంద్రా [1]త్రిగుణాత్మకమాయా
నియంత యగుభగవంతుండు స్వతంత్రుం డయ్యు నవతరించి యేయే యవతారం

1. 'పురుషాధీశ్వరుం డైనభగవంతుఁడు.' వ్రా. ప్ర.

బుల నేయేకర్మంబు లాచరించె నదియు [1]నిష్క్రియుం డగునీశుండు మొదలం బ్రపంచంబు నేవిధంబునం గల్పించె నేరీతిం బాలించె (మఱియు నీవిశ్వంబు) నాత్మీయహృదయాకాశగత[2]ముం జేసి నివృత్తవృత్తి యగుచు యోగమాయ యం దెట్లు వసియించె బ్రహ్మాండంబునందు నేలీల వర్తించె నందు బ్రహ్మాదిరూపంబులం బొంది బహుప్రకారంబుల నెట్లు క్రీడించె భూసురగోసురాదులం బరిరక్షించుటకై మత్స్యాద్యవతారంబులు ధరియించి యేయే ప్రయోజనంబులం దీర్చెం బయోరుహగర్భాండకటాహాంతర్గతంబు [3]లై లోకపాలసహితంబు లైన లోకంబులను లోకాలోకపర్వతంబులను బహిర్భాగంబులను నేయే తత్త్వభేదంబులను నెత్తెఱంగునం బుట్టించె నందుఁ (బ్రదీపితం బగు) జీవకోటి యెవ్వానిం గొల్చి బ్రదుకు జనులకుఁ [4]గర్మనామరూపభేదంబు లెట్లు నిర్దేశించె నింతయు సవిస్తరంబుగా వివరింపు ముత్తమశ్లోకమౌళిమండనుండును యోగీశ్వరేశ్వరుండును నైన పుండరీకాక్షునిచరిత్రశ్రవణంబునం గాని (జన్మమరణాదిసకలదుఃఖాకరంబులును దుష్కర్మప్రాప్తంబులును నగు) భవబంధంబులు దెగ వని వెండియు నిట్లనియె.

తరలము. సతతమున్ సరసీరుహోదరసత్కథామృతపూరమున్
శ్రుతిపుటాంజలిచేత నిమ్ముల జుర్రియుం దనివోదు భా
రతకథామిష మూని విష్ణుఁ బరాశరప్రియసూతి స
న్మతి నుతించినచోట సన్మునినాథ నామది నుబ్బుచున్. 186

క. ఇతరకథావర్ణనముల, నతిహేయత నొందెఁ జిత్త మనఘూత్త రమా
పతిచరితామృతరతి సం,సృతివేదన లెల్లఁ బాయఁ జేయు మునీంద్రా. 187

తే. భూరివిజ్ఞాననిధు లగునారదాది, నిర్మలాత్ముల కయిన వర్ణింప రాని
హరికథామృతపానంబునందు విసివి, యొల్లననువాఁడెపో వెఱ్ఱిగొల్లఁ డనఘ.

వ. అదియునుం గాక. 189

సీ. అరవిందనాభునియపరావతార మై, జనన మందినపరాశరసుతుండు
[5]చతురవర్ణాశ్రమాచారధర్మములును, ఠవణింప లోకవిడంబనములు
నగుగ్రామ్యకథలు పెక్కర్థిఁ గల్పించుచు, హరికథావర్ణనమందు లోన
నించుకించుక గాని యేర్పడఁ జెప్పమి, నంచితవిజ్ఞాన మాత్మ నిలువ

తే. కున్నఁ జింతించి మఱి నారదోపదిష్టుఁ, డగుచు హరికీర్తనామృతమాత్రఁ గ్రోలి
విమలసుజ్ఞాననిధి యన వినుతికెక్కి, ధన్యుఁ డయ్యెను లోకైకమాన్యుఁ డగుచు.

వ. కావున. 191

క. సరసిరుహోదరుమంగళ, చరితామృత మాత్మఁ గ్రోలుజనుఁ డితరకథా

---

1. 'సృష్టిపూర్వంబునఁ బ్రపంచంబు' వ్రా. ప్ర. 2 'యైనయోగమాయ' వ్రాఁతప్రతులు.
3 'లై నలోకాంతరంబులను లోకాలోకపర్వతంబులను లోకపాలురను విశ్వంబును నెత్తెఱంగునఁ బుట్టించె' వ్రాఁతప్రతులు. 4 జాతకర్మనామ. 5. మహి నొప్పువర్ణాశ్రమాచారధర్మముల్. అ. ప్ర.

గరళముఁ గ్రోలునె హరిసం, స్మరణము జీవులకు నఖిలసౌఖ్యద మనఘా. 192

క. శ్రీవనితాధిపనామక, థావిముఖుల కిహముఁ బరము దవ్వై పిదపం
బోవుదురు నరకమునకున్, వావిరి నే వారిఁ జూచి వగతు మునీంద్రా. 193

క. ఏనరుఁడే నొకనిమిషం, బైన వృథావాదగతిని హరిపదకమల
ధ్యానానందుఁడు గాఁడే, నానరునకు నాయు వల్ప మగు మునినాథా. 194

చ. మృదుగతిఁ బువ్వుఁదేనియ రమించుచుఁ బానము సేయఁ బాఱుష
ట్పదవిభుపోల్కి నార్తజనబాంధవు విశ్వభవస్థితివ్యయా
స్పదమహితావతారుఁ డగుపంకరుహోదరునిత్యమంగళ
ప్రదగుణకీర్తనామృతముఁ బాయక [1]గ్రోలెదఁ జెప్పవే దయన్. 195

క. అని విదురుఁడు మైత్రేయుం, డనుమునినాయకుని నడిగె నని వేదవ్యా
సునితనయుం డభిమన్యుని, తనయునకుం జెప్పి మఱియుఁ దగ ని ట్లనియెన్.

వ. ఇట్లు విదురుండు మైత్రేయు నడిగిన నతం డతనిం గని యతిమృదుమధురవచన రచనుం డై యి ట్లనియె ననఘా కృష్ణకథాశ్రవణతత్పరుండ వై నీవు నన్నడిగితివి గావున భద్రం బయ్యె నీవు భగవద్భక్తుండవు గావున హరికథాసక్తుండ వగుట విచిత్రంబు గా దదియునుం గాక మాండవ్యశాపంబున సాత్యవతేయు వలన (భ్రాతృక్షేత్రంబున) శూద్రయోనిం బుట్టినట్టి (ప్రజాసంయమనుండవగు) ధర్ముండవు పరమజ్ఞానసంపన్నుండవు నారాయణునకుం బ్రియతముండవు గావునఁ గృష్ణుండు నిర్యాణకాలంబునం దనసన్నిధికిం జనినన్ను డాయం జీరి విజ్ఞానం బెల్ల నుపదేశించి నీకు నెఱింగింపు మని యానతిచ్చుటం జేసి యవశ్యంబును నీకు నెఱింగింతు దత్తావధానుండ వై వినుము. 197

క. వనజాక్షుయోగమాయా, జనితం బగువిశ్వజననసంస్థానవినా
శనముల తెఱఁ గెఱిఁగించుచు, ననఘా విష్ణునిమహత్త్వ మభివర్ణింతున్. 198

సీ. సకలజీవుల కెల్లఁ బ్రకటదేహము నాత్మ, నాథుండుఁ బరుఁడు నానావిధైక
మత్యుపలక్షణమహితుండు నగుభగ, వంతుండు సృష్టిపూర్వంబునందు
నాత్మయమాయ లయంబు నొందినవిశ్వ, గర్భుఁడై తాన యొక్కఁటి వెలుంగు
పరమాత్ముఁ డభవుం డుపద్రష్ట యయ్యు వ, స్త్వంతరపరిశూన్యుఁ డగుటఁ జేసి

తే. ద్రష్ట గాకుండు మాయాప్రధానశక్తి, నతులచిచ్ఛక్తిగలవాఁడు నగుచుఁ దన్ను
లేనివానిఁగఁ జిత్తంబులోనఁ దలఁచి, ద్రష్ట యగుఁ దనభువననిర్మాణవాంఛ.

తే. బుద్ధిఁ గోచిన సమ్మహాపురుషవరుఁడు, గార్యకారణరూప మై ఘనత కెక్కి
భూరిమాయాభిధానవిస్ఫురితశక్తి, వినుతి కెక్కినయట్టియవిద్యయందు. 200

క. పురుషాకృతి నాత్మాంశ, స్ఫురణము గలశక్తి నిలిపి పురుషోత్తముఁ డీ
శ్వరుఁ డభవుం డజుఁడు నిజో, దరసంస్థితవిశ్వ మపుడు దగఁ బుట్టించెన్. 201

---

1. గ్రోలెదఁ.

సీ. ధృతిఁ బూని కాలచోదితము నవ్యక్తంబుఁ, బ్రకృతియు ననుపేళ్లఁ బరఁగు మాయ
వలన మహత్తత్త్వ మెలమిఁ బుట్టించె మా, యాంశకాలాదిగుణాత్మకంబు
నైన మహత్తత్త్వ మచ్యుతదృగ్గోచ, ర మగుచు విశ్వనిర్మాణవాంఛ
నందుటఁ జేసి రూపాంతరంబునఁ బొంది, నట్టిమహత్తత్త్వమందు నోలిఁ

తే. గార్యకారణకర్తృత్వకత్వ మైన, మహితభూతేంద్రియకమనోమయ మనంగఁ
దగు నహంకారతత్త్వ ముత్పన్నమయ్యెఁ, గోరి సత్త్వరజస్తమోగుణక మగుచు.

వ. వెండియు రూపాంతరంబులం బొందుచున్న సాత్త్వికాహంకారంబువలన మనంబును వైకారికకార్యభూతంబు లైన దేవతాగణంబులును సంభవించె నింద్రియాధిష్ఠాత లైన వానివలన శబ్దంబు పూర్వంబునఁ బ్రకాశంబగుటం జేసి జ్ఞానేంద్రియంబు లయిన త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులును గర్మేంద్రియంబు లయిన వాక్పాణిపాదపాయూపస్థములును దైజసాహంకారంబున నుత్పన్నంబు లయ్యెఁ దామసాహంకారంబువలన శబ్దస్పర్శరూపరసగంధంబు లుదయించె నందు శబ్దంబు నిజగుణం బయిన శబ్దంబువలన నాకాశంబుఁ బుట్టించె గగనంబు గాల[1]మాయాంశయోగంబునం బుండరీకాక్షునిరీక్షణంబున స్పర్శతన్మాత్రంబువలన వాయువుం గలిగించెఁ బవనుండు నభోబలంబున రూపతన్మాత్రంబువలన లోకలోచనం బైన తేజంబు నుత్పాదించెఁ దేజంబు గాల[2]మాయాంశయోగంబున నుత్తమశ్లోకుని విలోకనంబునఁ బవమానయుక్తం బగుచు రసతన్మాత్రంబువలన నంబువులం బుట్టించె సలిలంబు గాల[3]మాయాంశయోగంబునం బరమేశ్వరానుగ్రహంబు గలిగి తేజోయుక్తం బైన గంధగుణంబువలనఁ బృథివిఁ గలిగించె నందు గగనంబునకు శబ్దంబును వాయువునకు శబ్దస్పర్శంబులును దేజంబునకు శబ్దస్పర్శరూపంబులును సలిలంబునకు శబ్దస్పర్శరూపరసంబులును బృథివికి శబ్దస్పర్శరూపరసగంధంబులును గుణంబు లై యుండుఁ గాల[4]మాయాంశలింగంబులు గలిగి మహదాద్యభిమానంబులు నొందిన దేవతలు విష్ణుకళాకలితు లగుచు నట్టిమహదాదితత్త్వంబు లైక్యంబు సాలమిం బ్రపంచంబులు గల్పింప సమర్థంబులు గాక కృతాంజలు లై యోగీశ్వరేశ్వరుం డైన నారాయణు ని ట్లని స్తుతియించె. 203

దండకము. శ్రీనాథ నాథా జగన్నాథ నమ్రైకరక్షావిపక్షక్షమాభృత్సహస్రాక్ష నీరేజపత్త్రేక్షణా దేవదేవా భవద్దాసవర్గోపతాపంబులం బాపఁగా నోపుదివ్యాతపత్రంబు నాఁ బొల్చుయుష్మత్పదాంభోజమూలంబు పుణ్యాలవాలంబుగాఁ బొంది యోగీంద్రు లుద్దామసంసారతాపంబులం బోవఁగా మీటి వర్తింతు రోతండ్రి యీశా సమస్తాఘనిర్నాశ యీవిశ్వమం దెల్లజీవుల్ భవోదగ్రదుర్వారతాపత్రయాభీలదావాగ్నిచేఁ గ్రాఁగి దుఃఖాబ్ధిలోఁ దోఁగి యేకర్మమున్ ధర్మముం బొందఁ

1 మాయాశక్తియోగ. 2 మాయాశక్తియోగ. 3 మాయాశక్తియోగ. 4 మాయాశక్తిలింగ.

గా లేక సంసారచక్రంబునందుం బరిభ్రామ్యమాణాత్ములై యుండు రున్మాథ
చేతస్కులం జెప్పఁగా నేల యో దేవ విజ్ఞానదీపాంకురం బైనమీపాదపంకేరుహ
చ్ఛాయఁ బ్రాపింతుమజ్ఞాత సన్మౌనిసంఘంబులై కాంతికస్వాంతతం బేర్చి దుర్దాం
తపాపౌఘనిర్ణాశకాంబుప్రవాహాభ్రగంగానివాసంబు గా నొప్పుమీపాదయుగ్మం
బు యుష్మన్ముఖాంభోజనిర్గతం బైన వేదాండజశ్రేణిచేతం గవేషించి సంప్రా
ప్తులై యుండు గోనాథ వైరాగ్యశక్తిస్ఫుటజ్ఞానబోధాత్ములై నట్టిధీరోత్త
ముల్ నిత్యనైర్మల్యభవ్యాంతరంగంబులం దేపరంజ్యోతిపాదాబ్జపీఠంబు గీలించి
కైవల్యసంప్రాప్తులై రట్టినిర్వాణమూర్తిం బ్రశంసింతు మింద్రాదివంద్యా ము
కుందా సమస్తంబుఁ గల్పింపఁ బాలింపఁ దూలింపఁగాఁ బెక్కుదివ్యావతారం
బులం బొందునీపాదపంకేరుహధ్యానపారీణసుస్వాంతులై యొప్పుభక్తాళికిన్ మో
క్షదం బైననీపాదకంజాతముల్ గొల్తు మీశా రమాధీశ పుత్రాంగనామిత్రసంబం
ధబంధంబులం జెంది [1]నిత్యంబు దుష్టక్రియాలోలురై దేహగేహంబులం దోలి
వర్తించుదుర్మానవశ్రేణులం దంతరాత్ముండ వై యుండియున్ దూరమై తోఁచు
నీపాదపద్మంబు లర్చింతు మో దేవ బాహ్యేంద్రియవ్యాప్తి నుద్వృత్తులై నట్టి
మాధాత్ము లధ్యాత్మతత్త్వప్రభావాఢ్యులై నీపదాబ్జాతవిన్యాసలక్ష్మీకళావాస
ముం గన్నయయ్యుత్తమశ్లోకులం గానఁగాఁజాల రప్పుణ్య [2]లామష్టులం జూడఁగా
నొల్ల రంభోధిరాట్కన్యకాకాంత వేదాంతశుద్ధాంతసిద్ధాంతమై యొప్పునీసత్క
థాసారచంచత్సుధాసారపూరంబులం గ్రోలి సౌఖ్యోన్నతిన్ సోలి ధీయుక్తు
లై వ్రాలి తాపంబులం దోలి మోదంబులం దేలి సంపన్నులై మాన్ననిత్యప్ర
పన్నుల్ మహోత్కంఠతం బేర్చి వైకుంఠధామంబు నల్పక్రియాలోలురై
కాంతు రద్దివ్యవాసైకసంప్రాప్తికిం గోరుచున్నార మో దేవ వైరాగ్యవిజ్ఞాన
బోధాత్మయోగక్రియారూఢి నంతర్బహిర్వ్యాప్తిఁ జాలించి శుద్ధాంతరంగంబు
గావించి స్వాత్మపద్మవాసుండ వై చిన్మయాకారత న్మున్ననీయున్నతానంత తేజో
విలాసోల్లసన్మూర్తిఁ జిత్తంబులం జేర్చి యానందలోలాత్మతం బొల్చుయోగీశ్వర
శ్రేణికిం దావకీనానుకంపానులబ్ధస్ఫుటజ్ఞానముం గల్గుటం జేసి యాయాసముల్
లేద యో దేవతాచక్రవర్తీ సదానందమూర్తీ జగద్గీతకీర్తీ [3]లసద్భూతవర్తీ భవ
ద్దాసులై నట్టిమమ్మున్ జగత్కల్పనాసక్తచిత్తుండ వై నీవు త్రైగుణ్యవిస్ఫూర్తిఁ
బుట్టించినం బుట్టుటే కాక నీభవ్యలీలానుమేయంబుగా సృష్టినిర్మాణముం జేయ
నేమెంతవా [4]రాము మీశక్తియుక్తిన్ భవత్పూజ గావింతు మట్లుండె నీసత్క
ళాజాతులై నట్టిమ మ్మెన్న నే మున్న దధ్యాత్మతత్త్వంబ వన్నం బరంజ్యోతి
వన్నం బ్రపంచంబు కెల్ల న్నధిష్ఠాత వన్నన్ సదాసాక్షి వన్నన్ గుణాతీత నీవే

---

1. 'సోహంమనేతిక్రియాలోలురై' వ్రా. ప్ర. 2. లాఘర్మదాంధాత్ములన్. 3. 'శుభావర్తి ద్దాసుల మైనమమ్మున్' వ్రా. ప్ర. 4. రమ్ము.

కదా పద్మపత్త్రాక్ష సత్త్వాదిత్రైగుణ్యమూలంబు నా నొప్పు మాయాగుణం బం
దు నుద్యన్మహత్త్వ మైనట్టినీవీర్యముం బెట్టుటం జేసి నీ వింతకుం గారణం
బౌదు వాయాయుకాలంబుల న్నీకు సౌఖ్యంబు లే మెట్లు గావింతు మేరీతి నన్నం
బు భక్షింతు మెబ్భంగి వర్తింతు మేనిక్కడ న్నుందు మీజీవలోకంబ యాధా
రమై యుండి భోగంబులం బొందుచు న్నన్న మేరీతి భక్షించు నిష్కార్యసం
ధాను [1]లైనట్టిమాకుం జగత్కల్పనాశక్తికిన్ దేవ నీశక్తి దోడ్పాటు గావించి
విజ్ఞానముం జూపి కారుణ్యసంధాయి వై మమ్ము రక్షింపు లక్ష్మీమనఃపల్వలక్రోడ
యోగీంద్రచేతస్సరోహంస దేవాదిదేవా నమస్తే నమస్తే నమః. 204

సీ. అనినఁ బ్రసన్నుఁడై హరి మహదాదుల, కన్యోన్యమిత్రత్వ మంద కున్న
కతమున నిఖలజగత్కల్పనాశక్తి, వొడమ కుండుటఁ దనబుద్ధి నెఱిఁగి
కైకొని కాలవేగమున నుద్రేకంబు, నొందినప్రకృతితోఁ బొంది నిజబ
లము నిల్పి తా నురుక్రముఁడన సప్తవింశతితత్త్వములయందు సమత నొక్క

తే. పరిప్రవేశించి యాతత్త్వభవ్యగుణము, నందు జ్యేష్ఠానురూపంబు లలరఁ జెంది
యొకటి నొకటిని గలయక యుండి విశ్వ, రచన నెఱుఁగ నియాతత్త్వనిచయమునకు.

వ. ఇట్లు విశ్వనిర్మాణనిపుణత్వంబు నెఱుంగం జూపుచు నన్నింటికి నన్యోన్యతం
గల్పించి తనయనుగ్రహంబునం బ్రేరితం బై కానంబడి క్రియాసామర్థ్యంబునం
జె న్నొందినతత్త్వవితానంబు [2]దేవప్రేరితం బయి స్వకీయంబు లగునంశంబుల
చేతం బుట్టించిన విరాడ్విగ్రహంబై తత్త్వవితతి దమయందుఁ జెందినపుండరీకా
క్షునికళాంశంబున నొకటికొకటికి నైక్యంబు వాటిల్లి పరిణతం బై రూపాంతరం
బునుం జెందె నేతత్త్వంబున నేనియుఁ జరాచరలోకపుంజంబులు నిండి యుండు
నాహిరణ్మయం బైనవిరాడ్విగ్రహంబు నొందినపురుషుండు సర్వజీవసమేతుం
డై యుండె నంత. 206

క. జలములలోపల నిమ్ముల, జలరుహజా[3]తాండమందు సాహస్రాబ్దం
బులు నిలిచెఁ గార్యరూపా, కలితం బగు [4]నవ్విరాట్సుగర్భము వసుసన్. 207

తే. దైవకర్మాత్మశక్తివితానములను
దగిలి తనచేతఁ దనుఁ దాన దైవశక్తి
యగుచు వెలుఁ గొందుచును బ్రకారాంతరమునఁ
దనువు వితతంబు గాని చైతన్య మొంది. 208

తే. రూపసంసక్తిఁ జేసి నిరూఢకర్మ, శక్తి యగుచుఁ గ్రియాధురాసక్తి దశవి
ధములు గలిగినప్రాణరూపమున నాత్మ, శక్తిభోక్తృత్వమగుచున్నశక్తి గలిగి.

క. త్రివిధం బగుచును నాధ్యా, త్మ్యవిభేదంబులను బాపి [5]మఱి యభిభూతా

---

1 లమ్మైనమాకుం. 2 'లం గూడి స్వకీయం బైనకళలచేత' వ్రాఁతప్రతులు, 3 తఘటమందు.
4 'నవ్విరాజితగర్భము' వ్రా. ప్ర. 5 'మఱియును బొలుపొం, దువిరాజం బగుగర్భము' వ్రా. ప్ర.

త్మవిరాడ్రూపమ్మగు నిది, వివిధప్రాణులకు [1]నాత్మవిధ మై మఱియున్. 210

క. జీవం బై పరమాత్మకుఁ, దావల మై యాదిమావతారం బగున
ద్దేవునిగర్భంబున భూ, తావలితోడం బ్రపంచ మర్థిం దోఁచెన్. 211

వ. ఇట్లు దోఁచినవిరాట్పురుషుం డాధ్యాత్మికాధిదైవికాధిభౌతికంబు లనుభేదంబు
లచేఁ బూర్వోక్తక్రమంబున వెలుఁ గొందు ననుచు విదురునకు మైత్రేయుం
డెఱింగించె నని చెప్పి వెండియు ని ట్లనియె. 212

చ. హరి పరమాత్ముఁ డీశుఁ డజుఁ డాఢ్యుఁ డనంతుఁ డనంతమూర్తి సా
గరతనయాహృదీశుఁడు వికారవిదూరుఁడు నిత్యమంగళా
కరుఁడు కృపాపయోనిధి యకల్మషచిత్తుఁడు సర్వశక్తి దా
మరసవిలోచనుండు బుధమాన్యచరిత్రపవిత్రుఁ డిమ్ములన్. 213

వ. ఇత్తెఱంగున (నీశుం డగునక్షోభ్యుండు) మహదాది[2]తత్త్వంబులమనంబుల ఘనం
బు లగుతలంపులు దా మనంబున నెఱింగి (యట్టితత్త్వంబుల వివిధవృత్తిలాభం
బునకై స్వకీయచిచ్ఛక్తిచే నిట్టు లొనర్తు నని చింతించి) నిజకళాకలితం బగు
విరాడ్విగ్రహంబునందు (నగ్నిప్రముఖం బగు)[3]దేవతావళి కెల్ల నివాసంబగుచుఁ
గానంబడినవై రాజపురుషుని మూర్త్యవయవంబుల వినిపింతు దత్తావధానుండ
వై వినుము. 214

సీ. నరనుత యాదివ్యపురుషోత్తమునిపృథ, గ్భావంబు నొంది ముఖంబువలన
భువనపాలకుఁ డై సరపవమానసఖుఁ డంత, వాత్మ నీశ్వరునంశ మైన వాణి
కనయంబు ననుకూల మగుచు నిజస్థాన, మునఁ బ్రవేశించె నమ్ముఖమునందుఁ
బరఁగ జీవుండు శబ్దము నుచ్చరించుఁ బృ, థగ్భావము లగునేత్రముల నినుఁడు
తే. చక్షురింద్రియయుక్తుఁ డై సరవిఁ జెంది, రూపవిజ్ఞానమహిమ నిరూఢిఁ బొందు
మఱియుఁ జర్మంబులను బవమానుఁ డీశ్వ, రాంశ మైతత్త్వగింద్రియమందుఁ గూడి.

వ. నిజవాసంబు నాశ్రయించిన జీవుండు స్పర్శేంద్రియగతుం డగుఁ బృథగ్భావం బైన
శ్రోత్రంబుల దిక్కు లచ్యుతకళాంశం బగు శ్రవణేంద్రియయుక్తంబులై నిజస్థానం
బునం బొందిన జీవుండు శబ్దజ్ఞానగతుం డగు (వెండియుఁ దాలువు నిర్భిన్నం బయిన
లోకపాలుం డగువరుణుం డందుఁ బ్రవేశించి రసనేంద్రియంబుచేఁ బ్రకాశించినం
బ్రాణి రసంబులం గ్రహించెఁ బరమేశ్వరుని నాసికేంద్రియంబు పృథగ్భావంబు నొంది
యాశ్వినేయాధిష్ఠానం బై ఘ్రాణాంశంబు నొందిన జంతువు గంధగ్రహణసమర్థం
బయ్యె) వెండియు భిన్నం బయిన చర్మంబును నోషధులును బరమపురుషాంశంబు
లయిన కేశంబులం గూడి నిజనివాసంబు నొందిన జీవుండు [4]కండూయమానుం
డగు భిన్నభూతం బైన మేఢ్రంబునం బ్రజాపతి రేతంబున నిజస్థానంబు నొందిన జీవుం
డానందంబునం బొరయు భిన్నభావం బైన గుదంబున మిత్రుం డచ్యుతాంశంబును

1 లాత్మవిభురూపం బై. 2 భూతంబులమనంబుల. 3 భూతావళి. 4. కండూయనంబందు.

బొందువాయువుం గూడి నిజాధిష్ఠానంబు నొందుడు జీవుండు విసర్గంబుఁ జెందు వేయువేత్రైన బాహువులం దింద్రదశాధీశ్వరుండయిన పురందరుండు క్రయవిక్రయాది శక్తియుక్తుం డగుచు నిజస్థానంబు నొందినజీవుండు వానిచేత జీవికం బొందు(మఱియుఁ బాదంబులు నిర్భిన్నంబులయినవిష్ణుండు స్వావాసంబుగైకొని గతిశక్తిం బొందిన జీవుండు గమనాగమనాగ్నుం డయ్యె) వెండియు భిన్నభావం బయినహృదయంబును మనంబుతోడం గలసి(నిజాధిష్ఠానంబుగఁ) జంద్రుండు ప్రవేశించిన జీవుండు శరీరసంకల్పాదిరూపం బగువికారంబునం బొందు భిన్నభావంబైనయహంకారంబు నహంప్రకృతియుక్తుండై రుద్రుండు (నిజస్థానంబుగా) వసియించిన నాయహంకృతిచే శరీరి కర్తవ్యంబులు నడుపు బుద్ధివాగీశ్వరావాసంబై హృదయంబుతోడం గలసి నిజాధిష్ఠానంబున [1](*బోధాంశంబుచే వెలింగిన శరీరి బోద్ధవ్యతం బొందు భిన్నంబైనచిత్తంబు బ్రహ్మావాసంబై చేతనాంశంబు నొందినఁ బ్రాణి) విజ్ఞానంబునుం బొందు నట్టివిరాట్పురుషునిశీర్షంబున స్వర్గంబును జరణంబుల వసుమతియు నాభియందు గగనంబునుం గలిగె సత్త్వాదిగుణపరిణామంబుల నమరులై యూర్జిత సత్త్వగుణంబున నద్దేవతలు త్రిదివంబును బొందిరి రజోగుణంబున మనుజులును గవాదులును ధరణిం బొందిరి తామసంబున భూతాదులై నరుద్ర పారిషదులు (ద్యావాపృథివ్యంతరం బగు) వియత్తలంబునుం బొందిరి ముఖంబు వలన నామ్నాయంబు లుత్పన్నంబు లయ్యె వెండియు. 216

క. ధరణీదివిజులు శ్రుతులును, నరవర యమ్మేటిముఖము। నం బొడముట భూ
సురుఁ డఖిలవర్ణములకున్, గురుఁడున్ ముఖ్యుండు నయ్యె। గుణరత్ననిధీ. 217

క. ధర బ్రాహ్మణాదికము ద, స్కరబాధలఁ బొందకుండఁ। గైకొని కావం
బురుషోత్తముబాహువులన్, నరనాథకులంబు పుట్టె। నయతత్త్వనిధీ. 218

క. గణుతింపఁగఁ గృషిగోర, క్షణవాణిజ్యాదికర్మ। కలితంబుగ నా
గుణనిధియూరువులందుం, బ్రణుతింపఁగ వైశ్యజాతి। ప్రభవం బయ్యెన్. 219

తే. తివిరి సేవకధర్ములై। దేవదేవు, పదములను శూద్రసంతతు। లుదయమైరి
వీర లందఱుఁ దమతమ। విహితకర్మ, మలరఁ జేయుచు జనకుండు। నాత్మగురుఁడు.

క. అగుసర్వేశుఁ బరాత్పరు, జగదేకప్రభునిపాద। జలజాతంబుల్
దగిలి భజింతురు సతతము, నిగమోక్తిన్ భక్తియోగ। నిపుణాత్మకులై. 221

తే. మహిమ దీపింపఁ గాలక। ర్మస్వభావ
శక్తిసంయుక్తుఁ డగుపరే। శ్వరునిభూరి
యోగమాయావిజృంభణో। ద్యోగ మెవ్వఁ
డెఱిఁగి నుతియింపఁగా నోపు। నిద్ధచరిత, 222

1 (*) శరీరవిజ్ఞానంబు.

ఉ. అన్య[1]కథాకలాపము ల। హర్నిశముం బఠియించి చాలమా
లిన్యము నాత్మ శోభనవి। లీ[2]నత నొందుమదీయజిహ్వ సౌ
జన్యముఁ జెందె నేఁడు హరి। సద్గుణదివ్యకథామృతంబు స
న్మాన్య[3]చరిత్రమై నెగడు। మద్గురువాక్యపథంబుఁ జెందఁగన్. 223

మ. హరినామాంకితసత్కథామృతరస। వ్యాలోలుఁడై నట్టిస
త్పురుషశ్రేష్ఠుఁ డసత్కథాలవణవా। ర్పూరంబుఁ దా గ్రోలునే
వరమందారమరందపానకుతుక। స్వాంతద్విరేఫంబు స
త్వరమై పోవునె చేఁతివేములకుఁ ద। ద్గంధానుమోదాత్మమై. 224

క. హరిమహిమముఁ దన్నాభీ, సరసిజసంజాతుఁడైన। చతురాననుఁడుం
బరికించి యెఱుఁగఁ డన్నని, తరమనుజులఁ జెప్ప నేల। తత్త్వజ్ఞనిధీ. 225

తే. శ్రుతులు దమలోన వివరించి। చూచి పుండ, రీకలోచను నుత్తమ। శ్లోకచరితు
సమరగణవంద్యమానపా। దాబ్జయుగళు, వెదకి కనుఁగొనలేవం। డ్రు విమలమతులు.

క. [4]హరియుం దనమాయాగతిఁ, బరికించియుఁ గానఁ డయ్యెఁ। బరిమితి లేమిన్
మఱి మాయావిని మోహిని, చరితముఁ గనుఁగొందు రెట్లు। చతురాస్యాదుల్.

క. ఆదివిజాధీశుఁడు మహా, దాదులు దిక్పతులుఁ బంక। జాసనుఁడున్ గా
రీదయితుఁడు గనఁ జాలని, శ్రీదేవునిపదయుగంబుఁ। జింతింతు మదిన్. 228

క. అని మైత్రేయుం డవ్విదు, రున కెఱిఁగించిన తెఱంగు। రుచిరముగా న
జ్జనపౌత్రునకుఁ బరాశర, మునిమనుమం డెఱుఁగఁ జెప్పి। ముదము దలిర్పన్.

వ. వెండియు ని ట్లనియె. 230

క. భూమీశ్వర మైత్రేయమ, హాముని విదురునకు నట్లు। హరిగుణశుభలీ
లామాహాత్మ్యముఁ జెప్పిన, నామైత్రేయునకు విదురుఁ। డనియెన్ మఱియున్.

క. అగుణుం డగునీశ్వరునకు, జగదవనోద్భవవినాశ। సత్కర్మములుం
దగులీలలైన నాతఁడు, సగుణుం డై యుండు టెట్లు। సౌజన్యనిధీ. 232

సీ. అనిన నర్భకుగతి। ననవుడు మైత్రేయ, మునిఁ జూచి విదురుఁ డి। ట్లనియె మరల
బాలుఁడు క్రీడావి। లోలమానసమున, దీపించి లీలాను। రూపుఁ డగుచుఁ
గైకొని కామాను। గతుఁ డై రమించును, నర్భకుఁ డర్థి వ। స్త్వాంతరమున
నర్భకాంతరమున। నైనను బాలకే, లీసంగుఁ డగుచు నో। లిని జరించు

తే. [6]దనుజభేదనుఁ డెట్లు స్వా। తంత్ర్యవృత్తి
వెలయ వర్తించె నేరీతి। విక్రమించె

---

1 కథానులాపము. 2 'నము నైనమదీయ' వ్రా. ప్ర. 3 'చరిత్రుఁడై నెగడు' వ్రాఁత ప్రతులు. 4 ఈపద్యము పెక్కుప్రతులఁ గనుపట్టదు. 5 'గానిచో' అచ్చుప్రతి. 6 'హరియు నెపుడు నివృత్తుఁ డత్యంతతృప్తుఁ, డగుట వర్తించు టెట్లు క్రీడాదులందు' అచ్చుప్రతి.

మఱియుఁ ద్రిగుణాత్మకం బైనయీమాయఁ గూడి
యఖిలజగములఁ గల్పించి యంతమీఁద. 233

సీ. అమ్మాయచేత నీయఖిలంబు [1]ద్రుంచిన, శశ్వత్ప్రకాశుఁ డీశ్వరుఁడు పరుఁడు
ననఘాత్మ దేశకాలావస్థలందును, నితరులయందు నహీనమైన
జ్ఞానస్వభావంబుఁ బూని యాప్రకృతితో, నెబ్భంగిఁ గలసెఁ దా నేకమయ్యు
గోరి సమస్తశరీరంబులందును, జీవరూపమున వసించి యున్న

తే. [2]జీవుని దగువిభూతిప్రసిద్ధి యేమి, కర్మమున సంభవించెను గడఁగి నాదు
చిత్త మజ్ఞానదుర్గమస్థితిఁ గలంగి, యమృతంబునఁ బొందెడు ననఘచరిత.

వ. అది గావున సూరిజనోత్తముండ వైననీవు మదీయవాంఛితంబు నెఱింగింప సమర్థుండ వని విదురుండు మైత్రేయమహామునీంద్రు నడిగె నని బాదరాయణతనూభవుం డభిమన్యునందనున కి ట్లనియె. 235

క. సరసిరుహోదరుమంగళ, చరితామృతపానకుతుకసంగంబున ని
ర్భరుఁ డగువిదురునకు మునీశ్వరుఁ డగుమైత్రేయుఁ డనియె సజ్జనతిలకా. 236

చ. వినుము వితర్క[3]వాదములు విష్ణుని ఫుల్లసరోజపత్త్రనే
త్రుని ఘనమాయ నెప్పుడు విరోధము సేయుఁ బరేశు నిత్యశో
భనయుతు బంధనాదికవిపద్దశలుం గృపణత్వభావము
న్ననయముఁ బొంద లేవు విభుఁ డాద్యుఁ డనంతుఁడు నిత్యుఁ డౌటనున్. 237

వ. మఱియును. 238

చ. పురుషుఁడు నిద్రవోఁ గలలఁ బొందుసమస్తసుఖంబు లాత్మసం
హరణశిరోవిఖండనము లాదిగ జీవునికిం బ్రబోధమం
దరయఁగఁ దోఁచు చున్నగతి నాదిఁ బరేశుఁడు బంధనాదులం
బొరయక తక్కె ట్లనుచు బుద్ధిని సంశయ మందె దేనియున్. 239

వ. అవ్విధం బతనికిం గలుగ నేర దది యె ట్లంటేని. 240

చ. లలితవిలోలనిర్మలజలప్రతిబింబితపూర్ణచంద్రమం
డలము దదంబుచాలనవిడంబనహేతువు నొందియున్ వియ
త్తలమునఁ గంప మొందనివిధంబున సర్వశరీరధర్మముల్
గలిగి రమించునీశునకుఁ గల్గఁగ నేరవు కర్మబంధముల్. 241

వ. కావున జీవునకు నవిద్యామహిమం జేసి కర్మబంధనాదికంబు సంప్రాప్తం బగుం గాని సర్వభూతాంతర్యామి యైనయీశ్వరునకుం బ్రాప్తంబు గానేర దని వెండియు. 242

చ. నరునకు నాత్మదేహజగుణంబులఁ బాపఁగ నోపుఁ బంకజో

---

1 'సృజియించి; పాలించి పాలియించి ♦ పరమపురుషుఁ డనఘాత్మ' అచ్చుప్రతి.
2 'జీవునకు దుర్భగక్లేశసిద్ధి యెట్టి' అచ్చుప్రతి. 3 'వాక్యములు' వ్రా. ప్ర.

దరచరణారవిందమహిత॥స్ఫుటభక్తియ యింద్రియంబు లీ
శ్వరవిషయంబు లైన మది॥ సంచితనిశ్చలతత్త్వ మైనచో
సరసిజనేత్రుకీర్తనమె॥ చాలు విపద్దశలన్ జయింపఁగన్. 243

చ. హరిచరణారవిందయుగ॥ళార్చనసన్నుతిభక్తియోగముల్
నిరతముఁ గల్గువారు భవ॥నీరజగర్భుల కంద రానిభా
సురపదమందుఁ జేరుదురు॥ సూరిజనస్తవనీయ యట్టిస
త్పురుషులపూర్వజన్మఫల॥మున్ గణుతింపఁ దరంబె యేరికిన్. 244

వ. అని చెప్పిన విదురుండు మైత్రేయుం గనుంగొని ముకుళితహస్తుం డై తనమనంబున వినమితమస్తకుండుగాఁ దలంచుచుఁ (దనమనంబున శ్రీహరిం దలంచుచు) వినయవచనరచనుం డై యి ట్లనియె మునీంద్రా భవదీయవాక్యంబులచేత నా మనంబున నారాయణుండు లోకైకనాథుం డెట్లయ్యె ననియు శరీరధారి యైన జీవునికిఁ గర్మబంధంబు లేరీతి సంభవించె ననియుం బొడమినసంశయంబు నేఁడు నివృత్తం బయ్యెఁ బూర్వమున నేను నామనంబున లోకంబున కీశ్వరుండు హరి యనియు జీవుండు పరతంత్రుం డనియును దలంపుదు నారాయణభక్తిప్రకారంబు ప్రాణిగోచరం బైనయవిద్యకు [1]నధిష్ఠానం బనం దనరుచుండు (నారాయణుండు) దనకు నాధారంబు లేక సమస్తంబునకుం దాన యాధారభూతుం డై విశ్వంబుం బొదివి విశ్వంబులోనఁ దా నుండు నెఱం గెట్లు శరీరాభిమానంబును బొంది యెవ్వాఁడు (మూఢతముం డై) సంసారప్రవర్తకుం డగు నెవ్వాఁడు (భక్తిమార్గంబునఁ) బరమాత్ముం డైనపుండరీకాక్షునిం జెందు వీర [2]లిద్ధయును (సంశయక్లేశంబులు లేమిం జేసి) సుఖానందపరిపూర్ణు లై యభివృద్ధి నొందువార లగుదు రెవ్వాఁడు సుఖదుఃఖానుసంధానంబుచే లోకానుగతుం డగుచుం బ్రమోదఖేదంబుల నొందు నతండు దుఃఖాశ్రయుం డగు నారాయణభజనంబున సమస్తదుఃఖనివారణం బగుటను భవదీయచరణసేవానిమిత్తంబునను బ్రపంచంబు ప్రతీతిమాత్రంబు గలిగి యున్న దయిన నందులకుఁ గారణంబు లే [3]కుండుటం జేసి తెలియనివాఁడ నై వర్తింతు నని వెండియు. 245

క. లలి నామదిఁ దలఁపుదు సుమ, తులు గొనియాడంగఁ దగిన॥తోయజనాభుం
డలవడ నల్పతపోవృ, త్తులతలఁపోఁతలకు మిగుల॥ దుర్లభుఁ డనియున్. 246

సీ. ఇంద్రియంబులతోడ॥ నెలమి నొప్పెడిమహ, దాదుల నితరేత॥రానుషంగ
ముగఁ జేసి వానియం॥ దొగి విరాడ్దేహంబు, పుట్టించి యందుఁ జే॥పట్టి తాను
వసియించు నాతఁడు॥ వరుస సహస్రసం, ఖ్యాకంబు లగుమస్త॥కాంఘ్రిబాహు

1 నాశనకారణం. 2 'లిద్ధతయుందును సుఖానందపరిపూర్ణుఁ డై యభివృద్ధి నొందువాఁ డెవ్వం డని సంశయంబు నొందుమానవుండు దుఃఖాశ్రయుం డగు' వ్రా. ప్ర. 3 కుంటఁ దెలిసిన వాఁడ నై యది నివర్తింతు నని' వ్రా. ప్ర.

కలితసత్పురుషునిఁ గాఁ బ్రహ్మవాదులు, వలుకుదు రావిరాట్పుభువునందు
తే. భువనజాలంబు లలజడిఁ బొరయ కుండఁ
ప్రాణదశకంబు నింద్రియార్థములు నింద్రి
యాధిదైవతములుఁ గూడ ననఘ త్రివిధ
మగుచు విప్రాదివర్ణము [1]లయ్యె నట్టి. 247
క. ఇలఁ బుత్రపౌత్రనప్తృల, గలిగినవంశములతోడఁ గడుఁ జోద్యముగా
లలిఁ బ్రజ లేగతిఁ గలిగిరి, గలిగినయాప్రజలచే జగము లెట్లుండెన్. 248
క. చతురత దీపింపఁ బ్రజా, పతులకుఁ బతి యనఁగ వెలయుపద్మాపతి యే
గతిఁ బుట్టించెను స్రష్టృ, ప్రతతులచే నవవిధప్రపంచము మఱియున్. 249
తే. వానిభేదంబులును మనువంశములును, మనుకులాధీశ్వరులును దన్మనుకులాను
చరితములు నేవిభూతి నేజాడ దీని, నింతయును బుట్టఁ జేసె నాకెఱుఁగఁ బలుకు.
క. [2]ధరణిం గ్రిందట మీఁదట, ధరణికిఁ గలలోకములను దత్త్వస్థితులున్
వరుసలుఁ బరిమాణంబులు, నెఱిఁగింపఁ గదయ్య నాకు నిద్ధచరిత్రా. 251
క. సుర తిర్యఙ్నర రాక్షస, గరుడోరగ సిద్ధ సాధ్య గంధర్వ నభ
శ్చరముఖభవములు మునికుం, జర గర్భస్వేదజాండజముల తెఱంగున్. 252
క. త్రిగుణప్రధానకంబులు, నగునవతారములఁ బూర్ణ మై వెలసినయా
జగదుత్పాదనరక్షణ, నిగమములవిధంబు వానినిలుకడలుఁ దగన్. 253
క. చక్రాయుధుసౌందర్యప, రాక్రమముఖగుణములును ధరామరముఖవ
ర్ణక్రమములు నాశ్రమధ, ర్మక్రియలును శీలవృత్తమతభావములున్. 254
తే. యోగవిస్తారమహిమలు యోగములును
జ్ఞానమార్గంబులును బరిజ్ఞానసాధ
నములు నై యొప్పుసాంఖ్యయోగములు వికచ
జలజనయనకృతంబు లాశాస్త్రములును. 255
సీ. పాషండధర్మంబుఁ బ్రతిలోమకులవిభా, గములు జీవులగుణకర్మములును
బలుకులగతులను గలిగెడిధర్మమో, క్షములయందులపరస్పరవిరోధ
ములు లేనిసాధనమును భూమిపాలక, నీతివార్తలు దండనీతిజాడ
యును బృథగ్భావంబులును విధానములును, బితృమేధములును దత్పితృవిసృష్టి
తే. గతులుఁ దారాగ్రహంబులుఁ గాలచక్ర
మున వసించిననిలుకడలును దపములు
దానములుఁ దత్ఫలంబులుఁ [3]దగుప్రవాస
ధర్మములుఁ బ్రజ లొనరించుకర్మములును. 256

---

1 'లయ్యె నందు' అ. ప్ర. 2 'సరవిం గ్రిందన్ మీఁదన్' అ. ప్ర. 3 'దనరు ప్రబల, ధర్మ' అచ్చుప్రతి.

చ. వదలక భూజనావళికి వచ్చువిపద్దశధర్మముల్ సరో
జదళనిభాక్షుఁ డేగతిని సంతస మందెడు నెట్టివారి కిం
పొదవఁగఁ గాన వచ్చు గురువుల్ ప్రియశిష్యులు గొల్చు వారు స
మ్మదమునఁ గోరునర్థములు మానుగ నెఱిఁగింతు రిమ్ములన్. 257
క. విలయాదిభేదముల న, య్యలఘునిఁ బరమేశు నెవ్వ రంచితభక్తిం
గొలుతు ర దెవ్వరిలో ను, త్కలికన్ సుఖియించు జీవతత్త్వము మఱియున్.
క. గోవిందునిరూపంబున, జీవబ్రహ్మలకు నైక్యసిద్ధియు నెటు సం
భావన నుపనిషదర్థం, బై [1]వెలసెడిజ్ఞాన మెట్టి దార్యస్తుత్యా. 259
తే. ఉచిత మగునట్టిశిష్యప్రయోజనములు
సజ్జనులచేత విజ్ఞానసాధనములు
నేమి పలుకంగఁబడు వాని నెల్ల మఱియుఁ
బొలుచువైరాగ్యమునఁ దగుపురుషభక్తి. 260
తే. ఇన్నియుఁ దెలియ నానతి యిచ్చి నన్ను, నర్థి రక్షింపు యజ్ఞదానాదిపుణ్య
ఫలము వేదంబు సదివినఫలము నార్త, జనులఁ గాచినఫలముతో సమముగావు.
క. అని విదురుఁడు మైత్రేయుని, వినయంబునఁ దెలియ నడుగువిధ మెల్లను వ్యా
సునిసుతుఁ డభిమన్యూసినం, దనున కెఱింగించి మఱియుఁ దగ నిట్లనియెన్. 262
చ. ఇలఁ గలమానవావళికి నెల్ల నుతింప భజింప యోగ్యమై
వెలసినపూరువంశము పవిత్రము సేయఁగఁ బుట్టి సద్గుణా
కలితయశఃప్రసూనలతికాతతికిం బ్రతివాసరంబుఁ బెం
పలరఁగఁ బ్రోది వెట్టుదు గదయ్య ముకుందకథామృతంబునన్. 263
తే. అల్పతర మైనసుఖముల నందుచున్న, జనులదుఃఖంబు మాన్పంగఁజాలునట్టి
[2]పుండరీకాక్షుగుణకథాప్రోత మైన, వితతనిగమార్థ మగుభాగవతము నీకు. 264
వ. ఎఱింగింతు విను మని యిట్లనియె. 265
సీ. అమ్మహాభాగవతామ్నాయ మొకనాఁడు, గైకొని పాతాళలోకమందు
నప్రతీకజ్ఞాని యై వాసుదేవాఖ్యఁ, బొలుచుసంకర్షణమూర్తి దివ్య
పురుషుండు దనుఁ దాన బుద్ధిఁ గోఁ జూచుచు, సలలితధ్యానముకుళితనేత్రుఁ
డై సనందాభ్యదయార్థంబు గను విచ్చి, చూచిన వారు సంస్తుతు లొనర్ప
తే. సమర గంగావగాహను లై యహీంద్ర, కన్య లార్ద్రజటాబంధకలిత లగుచు
భర్తృవాంఛానుబుద్ధి నప్పరమపురుషుఁ, గదియ నేతెంచి తత్పాదకమలయుగము.
క. సేవించి భక్తితో నా, నావిధపూజోపహారనతిసుతులను నా
దేవునిహృదయము వడసిరి, యావేళ సనందనాదు లమ్మహితాత్మున్. 267
మ. ఘనసాహస్రకిరీటరత్నవిలసత్కాంతిప్రసిద్ధచ్ఛటా

---

1 'వెలయుజ్ఞాన' అ. ప్ర. 2 'పుండరీకవిలోచనప్రోక్త మైన' వ్రా. ప్ర.

జనితోదగ్రరుచిప్రకాశితఫణాసాహస్రునిన్ దేవతా
వనదక్షు న్ననురాగపకృత్యము లొగిన్ వాంఛం బ్రశంసించి వా
రనురాగస్థలితోక్తు లొప్ప నడుగన్ హర్షించి యాదేవుఁడున్. 268

తే. భూరినిగమార్థసారవిచార మగుచుఁ, దనరునీభాగవతము సాదరతఁ బలికె
నలినభవసూతియైనసనత్కుమార, కునకు నెఱిఁగించె[2]నతఁడుసాంఖ్యునకుఁదగను.

క. [3]ఎఱిఁగించిన నతఁడు పరా, శరునకు నుపదేశ మిచ్చె సన్మతి నతఁడున్
సురగురున కొసఁగె నాతఁడు, గరమనుమగ నాకుఁ జెప్పెఁ గైకొని యేనున్.

క. నీ కిప్పుడు వివరించెద, నాకర్ణింపుము సరోరుహాక్షుం డగుసు
శ్లోకునిచరితామృతపరి, షేకుఁడ వై ముదము గదురఁ జెలఁగుము విదురా. 271

వ. ఇట్లు భగవత్ప్రోక్తంబును ఋషిసాంప్రదాయికంబును బురుషోత్తమస్తోత్రంబును బరమపవిత్రంబును భవలతాలవిత్రంబును నయినభాగవతకథాసూత్రంబు (శ్రద్ధాళుండవు భక్తుండవు నగు)నీకు నుపన్యసించెద వినుము. 272

సీ. అనఘ యేకోదక మై యున్నవేళ నం, తర్నిరుద్ధానలదారువితతి
భాతిఁ జిచ్ఛక్తిసమేతుఁ డై కపటని, ద్రాలోలుఁ డగుచు నిమీలితాక్షుఁ
డైననారాయణుం డంబుమధ్యమున భా, సురసుధాఫేనపాండురశరీర
రుచులు సహస్రశిరోరత్నరుచులతోఁ, జెలిమి సేయఁగ నొప్పుశేషభోగ

తే. తల్పమునఁ బవ్వళించి యనల్పతత్త్వ
దీప్తిఁ జెన్నొందఁగా నద్వితీయుఁ డగుచు
నభిరతుం డయ్యుఁ గోర్కులయందుఁ బాసి
ప్రవిమలాకృతి నానందభరితుఁ డగుచు. 273

తే. యోగమాయావిదూరుఁ డై యుగసహస్ర
కాలపర్యంత మఖిలలోకములు మ్రింగి
పేర్చి మఱి కాలశక్త్యుపబృంహితమున
సమత సృష్టిక్రియాకలాపములఁ దగిలి. 274

క. తనజఠరములోపలఁ దాఁ, చినలోకనికాయముల సృజించుటకును సా
ధన మగుసూక్ష్మార్థము మన, సునఁ గని కాలానుగతరజోగుణ మంతన్. 275

సీ. పుట్టించెఁ దద్గుణంబునఁ బరమేశ్వరు, నాభిదేశమునందు నలిననాళ
ముదయించె మఱి యప్పయోరుహముకుళంబు, గర్మబోధిత మైనకాలమందు,
దనతేజమునఁ బ్రవృద్ధం బైనజలముచే, జలజాప్తుగతిఁ బ్రకాశంబు నొందఁ
జేసి లోకాశ్రయస్థితి సర్వగుణవిభా, సితగతి నొప్పారుజీవమందు

తే. నిజకళాకలితాంశంబు నిలిపి దాని, వలన నామ్నాయమయుఁడు నవరగుణుండు

---

1 'బ్రశంసించు చు, న్నను...నడుగ న్నాదేవుఁడున్ వారికిన్' వ్రా. ప్ర.

2 'సాంఖ్యాయనునకు నతఁడు. 3 పరఁగ నతం డంతఁ బరా' అ. ప్ర.

నాత్మయోనియునై నతోయజభవుండు, సరవిఁజతురాననుండు నాజననమయ్యె.

తే. అతఁడు తత్పద్మకర్ణికయందు నిలిచి
వికచలోచనుఁ డై లోకవితతి దిశలు
నంబరంబును నిజచతురాననములఁ
గలయఁ బరికించి చూచుచుఁ గమలభవుఁడు. 277

చ. అలఘుయుగాంతకాలపవనాహతసంచలదూర్మిజాలసం
కలితజలప్రభూత మగుకంజముఁ దద్వనజాతకర్ణికా
తలమున నున్నతన్ను విశదక్రియ గల్గినలోకతత్త్వమున్
నలిఁ దెలియంగ నోపక మనంబునఁ జాల విచార మొందుచున్. 278

వ. ఇట్లని వితర్కించె. 279

ఉ. ఈజలమందు నీకమల మేగతి నుద్భవ మయ్యె నొంటి యే
నీజలజాతపీఠమున నేగతి నుంటి మదాఖ్య యెద్ది నా
కీజననంబు నొందుటకు నెయ్యది హేతువు బుద్ధిఁ జూడ నే
యోజ నెఱుంగలే నని పయోరుహగర్భుఁడు విస్మితాత్ముఁ డై. 280

క. ఆవనజనాళమూలం, బావనములలోన నర్థి నరయుటకొఱకై
యావనజాతప్రభవుం, డావనరుహనాళవివరమం దభిముఖుఁ డై. 281

మ. అతిగంభీరవిశాలవారినిధితోయాంతర్నిమగ్నాంగుఁ డై
చతురాస్యుం డొగి దివ్యవత్సరసహస్రం బబ్జమూలంబు స
న్మతి నీక్షించియుఁ గాన లేక భగవన్మాయామహత్త్వంబు వి
స్మృతిఁ గావింప విభీతుఁ డై మరలఁ జేరెం దత్సరోజాతమున్. 282

తే. అట్లు గ్రమ్మఱఁ జేరి యయ్యబ్జపీఠ, మందు నష్టాంగయోగక్రియానురక్తిఁ
బవను బంధించి మహితతపస్సమాధి, నుండి శతవర్షములు సనుచుండ నంత.

ఆ. అట్టియోగజనితమైనవిజ్ఞానంబు, గలిగి యుండి దానఁ గమలనయనుఁ
గాన లేక హృదయకమలకర్ణికయందు, నున్నవానిఁ దన్నుఁ గన్నవాని. 284

మ. కనియెన్ నిశ్చలభక్తియోగమహిమం గంజాతగర్భుండు శో
భనచారిత్రు జగత్పవిత్రు విలసత్పద్మాకళత్రున్ సుధా
శనముఖ్యస్తుతిపాత్రు దానవచమూజైత్రున్ దళత్పద్మనే
త్రు నవీనోజ్జ్వలనీలమేఘనిభగాత్రుం బక్షిరాట్పత్త్రినిన్. 285

వ. మఱియును, 286

చ. అలఘుఫణాతపత్త్రనిచయాగ్రసమంచితనూత్నరత్నని
ర్మలరుచిచే యుగాంతతిమిరంబు నడంచి యకల్మషోల్లస
జ్జలములఁ జేసి యందు నవసారసనాళసితైకభోగముం
గలిగినశేషతల్పమునఁ గైకొని యున్నమహాత్ము నొక్కనిన్. 287

సీ. వరపీతకౌశేయపరిధానకాంతి సం, ధ్యాంబుదరుచినిచయంబు గాఁగఁ
గమనీయనవహేమకలితకిరీటంబు, రమణఁ గాంచనశిఖరంబు గాఁగ
మానితమౌక్తికమాలికారుచి సాను, పతితనిర్ఝరపరంపరలు గాఁగఁ
జెలు వొందునవతులసీదామకములు లా, లితతటజౌషధీలతలు గాఁగ

తే. వరభుజంబులు నికటస్థవంశములుగఁ, బదము లంగణపాదపప్రచయములుగ
లలితగతి నొప్పుమరకతాచలవిడంబి, తాత్మదేహంబు గలుగుమహాత్ము హరిని.

వ. మఱియు నపరిచ్ఛిన్నంబును నిరుపమానంబును నిఖిలలోకసంగ్రహంబును నతివిస్తారవర్తులాయామంబును నై వివిధవిచిత్రదివ్యమణిభూషణంబున నాత్మీయనిర్మలద్యుతిచేతం బ్రకాశంబు నొందం జేయుదివ్యదేహంబు దనర వివిధంబు లగుకామంబు లభిలషించి విశుద్ధం బైనవేదోక్తమార్గంబున భజియించుపురుషశ్రేష్ఠులకుఁ గామధేను వనందగినపాదపద్మయుగంబును నలికఫలకలలితరుచినిచయంబులకు నోటువడి కృపాపాత్రం బై చంద్రుండు బహురూపంబులఁ బదసరోజంబుల నాశ్రయించె నన నొప్పుపదనఖంబులును గమలాభూకాంతలకు నుపధానరూపంబు లనం దగి నీలకదళికాస్తంభంబులడంబు విడంబించునూరుయుగళంబును గనకమణిమయమేఖలాకలాపాభిరామంబుఁ గదంబకింజల్కశోభితపీతాంబరాలంకృతంబు నై విలసిల్లుకటీమండలంబును శృంగారవాహినీజలావర్తంబు నాఁ బొలుపొందునాభివివరంబును జఠరస్థనిఖిలబ్రహ్మాండముహుర్ముహురుద్భవకృశీభూతం బనం దగుమధ్యభాగంబును మహితముక్తాఫలమాలికావిరచితరంగవల్లీవిరాజితంబు నవతులసీదామకిసలయతల్పంబుఁ గుసుమమాలికాలంకృతంబు ఘనసారకస్తూరికాచందనవిలిప్తంబుఁ గౌస్తుభరత్నదీప్తిప్రదీప్తంబు శ్రీవత్సలక్షణలక్షితంబు నై యిందిరారమణికిఁ గేళీమందిరం బనం బొల్చువక్షస్స్థలంబును సుఖకేళీసమారంభపరిరంభణాంభోధిరాట్కన్యాకాకరాంభోజకీలితకనకమణికంకణనికషంబు లనం బొలుపారురేఖాత్రయవిరాజమానం బైనకంధరంబును సుమహితానర్ఘదివ్యమణిప్రభావిభాసితకేయూరకంకణముద్రికాలంకృతంబు లయినబాహువులును సకలలోకార్తినివారకదరహాసచంద్రికాధవళితంబు లైనకర్ణకుండలమండనమణిమరీచులు నర్తనంబులు సలుపం దనరి నిద్ధంబు లగుచెక్కుటద్దంబులును బరిపక్వబింబఫలప్రవాళపల్లవాధరశోణాయితంబును నఖిలభువనపరిపాలనంబునకు నేన చాలుదు నని వివాదించునయనయుగళంబునకు సీమాస్తంభంబుఁ జంపకప్రసూనరుచివిభాసంబు నగునాసాదండంబును గమలకుముదంబులకుం బెంపు సంపాదించుచుఁ గరుణామృతతరంగితాపాంగంబు లై కర్ణాంతవిశ్రాంతంబు లై చెలువొందునేత్రంబులును సలలితశ్రీకారంబునకు నక్షరత్వంబు సార్థకం బయ్యె ననం దగుకర్ణంబులును నిక్షుచాపచాపద్వయంబురూపంబునఁ జూపట్టుభ్రూయుగళంబును నపరపక్షాష్టమీశశాంకశంకాస్పదఫాలఫలకంబును నీలగిరీం

ద్రశృంగసంగతబాలమార్తాండ మండలవిడంబిత పద్మరాగమణిఖచితకాంచనకిరీ
టంబునం బొలుపారి సూర్యేందుపవనానలప్రకాశంబులకు నవకాశంబు సూపక
త్రిలోకవ్యాపకసమర్థంబు లగు తేజోవిశేషంబులఁ జెలు వొంది సంగరరంగంబుల
దానవానీకంబుల హరింపం జాలుసుదర్శనాదిదివ్యసాధనంబులచే దురాసదం
బగుదివ్యరూపంబునుం గలిగి మఱియును. 289

ఉ. హారకలాపపుష్పనిచయంబులఁ జంచదనర్ఘరత్నకే
యూరకరాంగుళీయకమహోజ్జ్వలబాహుసహస్రశాఖ [1]లో
ప్పారఁగఁ జూడ నొప్పి భువనాత్మకలీల నదృష్టమూలవి
స్ఫారితభోగివేష్టితవిభాసితచందనభూరుహాకృతిన్. 290

మ. విలసత్కుండలిరాజసఖ్యమున నుర్వీభృత్సమాఖ్యన్ సము
జ్జ్వలితోదారశిరోవిభూషణసహస్రస్వర్ణకూటంబునన్
సలిలావాసతఁ జారుకౌస్తుభవిరాజద్రత్నగర్భంబునన్
నలినాక్షుండు గనుంగొనంగఁ దగె మైనాకావనీభృద్గతిన్. 291

క. వితతార్థజ్ఞానజప, స్తుతిమకరందప్రహృష్టశ్రుతిజాతమధు
వ్రతగణపరివృతశోభా, గతకీర్తిప్రసవమాలికలు గలవానిన్. 292

వ. కనుంగొని చతురాననుండు. 293

సీ. అనఘు సర్వేశ్వరు నాద్యంతశూన్యుని, ధన్యుని జగదేకమాన్యచరితుఁ
[2]దన్నాభిసరసిజోద్భవసరోజంబును, నప్పల ననిలుని నంబరమును
మానితభువననిర్మాణదృష్టిని బొడఁ,గనెఁ గాని యితరముఁ గానలేక
యాత్మీయకర్మబీజాంకురంబున రజో,గుణయుక్తుఁ డగుచు నకుంఠితప్ర

తే. జాభిసర్గాభిముఖత నవ్యక్తమూర్తిఁ, దైనహరియందుఁ దనహృదయంబుఁ జేర్చి
యమ్మహాత్మునిఁ బరము ననంతు నభవు, నజు [3]నమేయుని నిట్లని యభినుతించె.

సీ. నలినాక్ష మాయాగుణవ్యతికరమునఁ, జేసి కార్యం బైనసృష్టిరూప
మునఁ బ్రకాశించునీఘనరూపవిభవంబు, రూపింప దేహధారులకు దుర్వి
భావ్యంబు దలపోయ భగవంతుఁడవు నైన,పద్మాక్ష నీస్వరూపంబుకంటె
నన్య మొక్కటి సత్యమై బోధకం బైన,యది లేదు గాన నీయతులదివ్య

తే. మైనరూపంబు నాకుఁ బ్రత్యక్ష మయ్యె, నదియుఁ గాక వివేకోదయమునఁ జేసి
వరద నీరూప మజ్ఞానగుణతమోని,వారకం బయ్యె నాకు శశ్వత్ప్రదీప. 295

క. ఘన[4]సత్పురుషానుగ్రహ,మునకై యమితావతారమూలం బగుచుం
దనరెడినీరూపము శో,భన మగు భవదీయనాభిపద్మమువలనన్. 296

---

1 'ల, న్నారయఁ జూడ' వ్రా. ప్ర. 2 'దన్నాభిసరసముద్భవసరోజంబును' వ్రా. ప్ర. 3 'నమేయు నజేయు నిట్లని నుతించె' వ్రా. ప్ర. 4 'సత్పురుషపరిగ్రహ' వ్రాతప్రతులు.

క. జననం బందిననాఁచే, ననయము మొదలనె గృహీతశమయ్యె జగత్పా
వన నీదుసుస్వరూపము, ఘనరుచిరం బై స్వయంప్రకాశక మగుటన్. 297

వ. మఱియు జ్ఞానానంద[1]పరిపూర్ణమాత్రంబును (ననావృతప్రకాశంబును) భేదరహి
తంబును బ్రపంచజనకంబును బ్రపంచవిలక్షణంబును భూతేంద్రియాత్మకంబును
నేకంబును నైనరూపంబు నొందియు నెందును బొడగాననట్టినిన్ను నాశ్రయించె
ద ననదియునుం గాక జగన్మంగళస్వరూపధరుండ వై నీయుపాసకుల మైనమామం
గళంబులకొఱకు నిరంతరధ్యానంబుచేత నీదివ్యరూపంబునం గానంబడితి విట్టినీవు
నిరయభాక్కు లై నిరీశ్వరవాదంబునం జేసి కుతర్కంబులు ప్రసంగించుభాగ్యర
హితులచేత నాదృతుండవు గావు మఱియుం గొందఱు కృతార్థు లైనమహాత్ములు
భవదీయశ్రీచరణారవిందకోశగంధంబు వేదమారుతానీతం బగుటం జేసి తమత
మకర్ణకుహరంబులచేత నాఘ్రాణించుచుందురు వారలహృదయకమలంబుల
యందు భక్తిపారతంత్ర్యంబున గృహీతపాదారవిందంబులు గలిగి ప్రకాశింతు
వదియునుం గాక ప్రాణులకు [2]ద్రవ్యాగారసుహృన్నిమిత్తం బయినభయంబును
దన్నాశనిమిత్తం బయినశోకంబును ద్రవ్యాదిస్పృహయును దన్నిమిత్తం బయిన
పరిభవంబును (మఱియు నంతఁ దృష్ణయు నది ప్రయాసంబున లబ్ధం బైన నార్తి
మూలం బగు) [3]తదీయం బైనవృథాగ్రహంబును నిశ్రీపాదారవిందంబులందు వై
ముఖ్యం బెంతకాలంబు గలుగు నంతకాలంబును బ్రాప్తంబు లగుం గాని మా
న వాత్మనాయకుండ వగునిన్ను నాశ్రయించిన భయనివృత్తిహేతు వైనమో
క్షంబు గలుగు మఱియునుం గొందఱు సకలపాపనివర్తకం బయినత్వదీయనామ
స్మరణకీర్తనంబులందు విముఖు లై కామ్యకర్మప్రావీణ్యంబునం జేసి నష్టమతు లై
యింద్రియపరతంత్రు లై యమంగళంబు లైనకార్యంబులు సేయుచుందురు దా
నం జేసి వాతాదిత్రిధాతుమూలం బైన (క్షుత్తృడాది) దుఃఖంబులచేతను శీతోష్ణ
వర్షవాతాదిదుఃఖంబులచేతను నతిదీర్ఘం బైనకామాగ్నిచేతను (నవిచ్ఛిన్నం బగు
క్రోధంబుచేతనుం) దహ్యమాను లగుదురు వారలఁ గనిన నాచిత్తంబు గలంకం
బొందు జీవుండు భవదీయమాయా[4]పరిభ్రామ్యమాణుం డై యాత్మ వే ఱని యె
ప్పుడు దెలియు నంతదాఁక (నిరర్థకం బై దుస్తరం బైన) సంసారసాగరంబు దరి
యింపం జాలకుండు సన్మునీంద్రు లైనను భవదీయనామస్మరణంబు మఱచి
యితరవిషయాసక్తు లై రేని వారలు దివంబులందు వృథాప్రయత్ను లై సంచ
రించుచు రాత్రులయందు నిద్రాసక్తు లై స్వప్నగోచరంబు లయినబహువిధ
సంపదలకు నానందించుచు శరీరపరిణామాదిపీడలకు దుఃఖించుచుం బ్రతిహతంబు
లైనయుద్యోగంబుల భూలోకంబున సంసారు లై వర్తింతురు నిష్కామధర్మ

---

1 'స్వరూపమాత్రంబును' వ్రా. ప్ర. 2 'ద్రవ్యశరీరసుహృ' వ్రా. ప్ర. 3 'మదీయం బనువృథాగ్రహ' వ్రా. ప్ర. 4 సంక్రాంతుం డై.

లై నిన్ను భజియించుసత్పురుషులకర్ణమార్గంబులం బ్రవేశించి భవదీయభక్తి
యోగపరిశోభితం బై సహృత్సరోజకర్ణికాపీఠంబున వసియింతు వదియునుంగాక.

మ. వరయోగీంద్రులు యోగమార్గముల భావంబందు నేనీమనో
హరరూపంబుఁ [1]దలంచి యే గుణగణధ్యానంబు గావింతు ర
ప్పురుషశ్రేష్ఠపరిగ్రహంబునకు నై పోల్పారఁ దద్ధ్యానగో
చరమూర్తిన్ ధరియింతు గాదె పరమోత్సాహుండ వై మాధవా. 299

తే. అరయ నిష్కామధర్ము లైనట్టిభక్తులందు నీవు ప్రసన్నుండ వైనరీతి
హృదయముల బద్ధకాము లై యెనయు దేవ,గణములందుఁ బ్రసన్నత గలుగ వీవు.

చ. అరయ సమస్తభూతహృదయంబులయందు వసించి యేక మై
పరఁగి సుహృత్క్రియానుగుణభాసితధర్ముఁడవుం బరాపరే
శ్వరుఁడవు నై తనర్చుచు నసజ్జనదుర్లభ మైనయట్టిసు
స్థిర మగుసర్వభూతదయచేఁ బొడగానఁగ వత్తు వచ్యుతా. 301

మ. క్రతుదానోగ్రతపస్సమాధిజనసత్కర్మాగ్నిహోత్రాఖిల
వ్రతచర్యాదుల నాచరింప నఖిలవ్యాపారపారాయణ
స్థితి నొప్పారెడినీపదాబ్జయుగళీసేవాభిపూజాసమ
ర్పితధర్మం బగువానిభంగి నసురారీ దేవచూడామణీ. 302

తే. తవిలి శశ్వత్స్వరూపచైతన్యభూరి,మహిమచేత నపాస్తసమస్తభేద
మోహుఁడ వఖిలవిజ్ఞానమునకు నాశ్ర,యుండ వగుసీకు మ్రొక్కెద నోరమేశ.

క. జననస్థితివిలయంబుల, కనయంబును హేతుభూత మగుమాయాలీ
లను జెంది నటన సలిపితి, వనఘాత్మక సీకొనర్తు నభివందనముల్. 304

సీ. అనఘాత్మ మఱి భవదవతారగుణకర్మ, ఘనవిడంబనహేతుకంబు లయిన
రమణీయ మగుదాశరథవసుదేవకు, మారాదిదివ్యనామంబు లోలి
వెలయంగ మనుజులు వివశాత్ము లై యవ, సానకాలంబున సంస్మరించి
జన్మజన్మాంతరసంచితదురితంబుఁ, బాచి కైవల్యసంప్రాప్తు లగుదు

తే. రట్టిదివ్యావతారంబు లవతరించు, నజుఁడ వగుసీకు మ్రొక్కెద ననఘచరిత
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార. భక్తమందార దుర్భవభయవిదూర. 305

తరలము. జననవృద్ధివినాశహేతుకసంగతిం గలదే ను నీ
వును హారుండుఁ ద్రిశాఖ లై మనువుల్ మరీచిముఖామరుల్
దనర నం దుపశాఖ లై చెలువొంద నింతకు మూల మై
యనయమున్ భువనద్రుమాకృతి వైననీకిదె మ్రొక్కెదన్. 306

మ. పురుషాధీశ భవత్పదాబ్జయుగళీపూజాదికర్మక్రియా

---

1 'ధరించి తద్గుణగణ' వ్రా. ప్ర. 2 'దనర నం దుపశాఖ లై భువనాత్మ దీనికి మూలమై' అచ్చుప్రతి.

పరతం జెందనిమూఢచిత్తునిఁ బశుప్రాయున్ మనుష్యాధమున్
జరయు న్నంతము నొందఁ జేయ నతిదక్షుం బైన కాలంబు త
ద్గురుకాలాత్ముఁడ వైన నీకు మది సంతోషంబునన్ మ్రొక్కెదన్. 307

సీ. సర్వేశ కల్పాంతసంస్థిత మగుజల, జాతమం దేను సంజనన మంది
భవదీయసుస్వరూపముఁ జూడ నర్థించి, బహువత్సరములు దపంబు సేసి
క్రతుకర్మములు పెక్కు గావించియును నినుఁ, బొడగానఁగా లేక బుద్ధి భీతిఁ
బొందిననాకు నిప్పుడును నిర్హేతుక, కరుణచే నఖిలలోకైకవంద్య
తే. మాన సతతప్రసన్నకోమలముఖాబ్జ, కలితభవదీయదివ్యమంగళవిలాస
మూర్తిదర్శింపఁగలిగెభక్తార్తిహరణ, కరణతుభ్యానమో[1]యని మరలఁ బలుకు.

సీ. అమరతిర్యఙ్మనుష్యాదిచేతనయోను, లందు నాత్మేచ్ఛచేఁ జెందినట్టి
కమనీయశుభమూర్తి గలవాఁడ వై ధర్మ, సేతు వనంగఁ బ్రఖ్యాతి నొంది
విషయసుఖంబుల విడిచి సంతతనిజా, నందానుభవసమున్నతిఁ దనర్తు
వది గాన పురుషోత్తమాఖ్యఁ జెన్నొందుదు, వట్టి నిన్నెప్పుడు నభినుతింతు
తే. నర్థి భవదీయపాదంబు లాశ్రయింతు, మహితభక్తిని నీకు నమస్కరింతు
భక్తజనపోషపరితోష పరమపురుష, ప్రవిమలాకార సంసారభయవిదూర.

సీ. తలకొని పంచభూతప్రవర్తక మైన, భూరిమాయాగుణస్ఫురణఁ జిక్కు
వడక లోకంబులు భవదీయజఠరంబు,లో నిల్పి ఘనసమాలోలచటుల
సర్వంకషోర్మిభీషణవార్ధినడుమను, ఫణిరాజభోగతల్పంబునందు
యోగనిద్రారతి నుండంగ నొకకొంత, కాలంబు సనఁగ మేల్కనినవేళ
తే. నలఘుభవదీయనాభితోయజమువలనఁ, గడఁగి ముల్లోకములు సోపకరణములుగఁ
బుట్టఁ జేసితి వతులవిభూతి మెఱసి, పుండరీకాక్ష సంతతభువనరక్ష. 310

క. నిగమస్తుత లక్ష్మీపతి, జగదంతర్యామి వగుచు సర్గము నెల్లం
దగుభవదైశ్వర్యంబున, నగణితసౌఖ్యానుభవము నందింతు గదే. 311

సీ. జలజాక్ష యెట్టివిజ్ఞానబలంబునఁ, గల్పింతు నఖిలలోకంబు లోలి
నతజనప్రియుఁడవు నా కట్టిసుజ్ఞాన, మర్థిమైఁ గృపసేయు మయ్య వరద
సృష్టినిర్మాణేచ్ఛఁ జెందినా చిత్తంబు, దత్కర్మకౌశలత్వమునఁ దగిలి
యును గర్మవైషమ్యమునఁ బొందుకతమున, దురితంబుఁ బొరయక తొలఁగు[నట్టి
తే. వెరవు నాకెల్లఁ గలుగు నవ్విధము దలఁచి, కర్మవర్తను నను భవత్కరుణ మెఱసి
తగఁ గృతార్థునిఁ జేయవే నిగమవినుత, సత్కృపామూర్తి యో దేవచక్రవర్తి.

చ. భవదుదరప్రభూత మగుపద్మమునందు వసించి యున్న నే
నవిరళతావకీనకలితాంశమునం దనరారు విశ్వముం
దవిలి రచించుచున్ బహువిధంబులఁ బల్కెడి వేదజాలముల్

---

1 'విశ్వంభరణదేవ.' వ్రా. ప్ర.

శివతరమై ఫలింపఁ గృప సేయుము భక్తఫలప్రదాయకా. 313

చ. అని యనుకంప దోఁప వినయంబునఁ జాఁగిలి మ్రొక్కి చారులో
చనసరసీరుహుం డగుచు సర్వజగత్పరికల్పనారతిం
దనరిన నన్నుఁ బ్రోచుటకుఁ దా నిటు సన్నిధి యైన యీశ్వరుం
డనయము నాదుదుఃఖము దయామతిఁ బాపెడు నంచు నమ్రుఁడై. 314

క. వనరుహసంజాతుఁడు నెమ్మనమున హర్షించె ననుచు మైత్రేయమహా
ముని ఘనుఁ డగువిదురునకున్, వినయంబున నెఱుఁగఁ జెప్పి వెండియుఁ బలికెన్.

మ. వనజాతప్రభవుండు కేవలతపోవ్యాసంగుఁడై పద్మలో
చను గోవిందు ననంతు నాద్యుఁ దనవాక్శక్తిన్ నుతింపన్ సుధా
శనవంద్యుండు ప్రసన్నుఁడై నిఖిలవిశ్వస్థాపనాలోకనం
బునఁ జూచెన్ విలయప్రభూతబహువార్పూరంబులన్ వ్రేల్మిడిన్. 316

తే. అట్లు వొడగని యాప్తుఁడై నట్టిపద్మ, భవునివాంఛిత మాత్మఁ దీర్పంగఁ దలఁచి
యతనిమోహనివారకమైనయట్టి, యమృతరసతుల్యమధురవాక్యముల ననియె.

చ. తలకొని నీయొనర్చుతపసి దప్పి మదిం దలపోయుదుఃఖముం
దలఁగుము నాదులీలకుఁ బ్రధానగుణం బగు సృష్టికల్పనం
బలవడఁ జేయుబుద్ధి హృదయంబునఁ జొన్పి తపస్సమాధిని
ష్ఠల నతిభక్తులన్ ననుఁ బ్రసన్నునిఁ జేయుము చెందు కోరికల్. 318

క. నీ వొనరించుతపోవి, ద్యావిభవవిలోకనీయ మగునీసృష్టిం
గావింపుము లోకంబుల,లో వెలిఁగెడినన్నుఁ గందు లోకస్తుత్యా. 319

క. నాలోనిజీవకోటులు, వాలాయము నీకుఁ గానవచ్చు నిపుడు నీ
వాలోకింపుము దారువి, లోలహుతాశనునికరణి లోకస్తుత్యా. 320

సీ. నలు వొంద నఖిలజీవులయందుఁ గలనన్నుఁ, దెలిసి సేవింపుము నలినగర్భ
భవదీయదోషముల్ వాయును భూతేంద్రి, యాశ్రయవిరహిత మై విశుద్ధ
మైనజీవుని విమలాంతరాత్ముఁడ నైన, నను నేకముగఁ జూచునరుఁడు మోక్ష
పదమార్గవర్తి యై భాసిల్లు బ్రహ్మాండ, మందును వివిధకర్మానురూప

తే. పద్ధతులఁ జేసి పెక్కురూపముల నొందు, జీవతతి రచియించు నీచిత్త మెపుడు
మత్పదాంబుజయుగళంబు మఱగియున్న, కతన రాజసగుణమునఁ గలుగ దఘము.

క. విను మదియుఁ గాక ప్రాణుల, కనయము నెఱుఁగంగ రానియనఘుఁడఁ దేజో
ధనుఁడఁ బరేశుఁడ నీచే, తను గానంబడితి నిదె పితామహ కంటే. 322

వ. మఱియు భూతేంద్రియగుణాత్మం డనియు జగన్మయుం డనియు నన్ను నీచిత్తం
బునందుఁ దలంపుము తామరసనాళవివరపథంబువెంటం జని జలంబులలోనం
జూడం గోరినట్టిమదీయస్వరూపంబు. 323

క. నీ కిప్పుడు గానంబడ, నాకులకును నురగపతిపరాకుల కైనన్
[1]వాకొనఁగం దలపోయను, రా కుండు మదీయరూప[2]రమ్యత్వంబుల్. 324

క. కావున మచ్చారిత్రక, థావిలసిత మైనసుమహితస్తవము జగ
త్పావనము విగతసంశయ, భావుఁడ వై బుద్ధి నిలుపు పంకజజన్మా. 325

క. సగుణుఁడ నై లీలార్థము, జగములఁ గల్పింపఁ దలఁచు చతురుని నన్నున్
సగుణునిఁగా నుతియించితి, దగ సంతస మయ్యె నాకుఁ దామరసభవా. 326

క. ఈమంజుస్తవరాజము, నీమనమునఁ జింతఁ దక్కి నిలుపుము భక్తిన్
ధీమహిత నీమనంబునఁ, గామించినకోర్కె లెల్లఁ గలుగుం జుమ్మీ. 327

క. అనుదినమును ద్విజగత్పా, వన మగునీమంగళస్తవంబుఁ బఠింపన్
వినినను జనులకు నేఁ బొడ, గనఁబడుదు నవాప్తసకలకాముఁడ నగుచున్. 328

తే. వనతటాకోపనయనవివాహదేవ, భవననిర్మాణభూమ్యాదివివిధదాన
జపతపోవ్రతయోగయజ్ఞములఫలము, మామకస్తవఫలము సమంబు గాదు.

క. జీవావళిఁ గల్పించుచు, జీవావలిలోనఁ దగ వసించుచుఁ బ్రియవ
స్త్వావలి లోపలఁ బ్రియవ, స్త్వావలి యై యుండునన్ను ననిశముఁ బ్రీతిన్.

క. తలఁపుము మత్ప్రీతికి నై, కలిగించితి నిన్ను భువనకారక నాలో
పల నడఁగి యేక మై ని, ష్కలగతి వసియించి యున్నజగముల నెల్లన్. 331

తే. తగ నహంకారమూలకతత్త్వంబునొంది, నీవు పుట్టింపు మనుచు రాజీవభవుఁడు
వినఁగ నానతియిచ్చి యవ్విష్ణుఁ డభవుఁ, డంత నంతర్హితుం డయ్యె ననఘచరిత.

క. అని చెప్పిన మైత్రేయునిఁ, గనుఁగొని విదురుండు పలికెఁ గడుముద మొప్పన్
జననుత నలినదళాక్షుఁడు, సనినం బద్మజుఁడు దేహసంబంధమునన్. 333

క. మానససంబంధంబును, బూనినయీసర్గ మెట్లు పుట్టించె దయాం
భోనిధి వై నా కింతయు, మానుగ నెఱిఁగింపవయ్య మహితవిచారా. 334

వ. అనవుడు న మ్మునివరేణ్యుండు విదురున కిట్లనియెఁ బుండరీకాక్షువరదానప్రభావం
బునం బంకజాసనుండు శతదివ్యవత్సరంబులు భగవత్పరంబుగాఁ దపంబుగావించి
(తత్కాలవాయువుచేఁ గంపితం బగునిజనివాసం బయిన) పద్మంబును వాయు
వును జలంబులను గనుంగొని యాత్మీయతపశ్శక్తిచేత నభివృద్ధిం బొందినవిద్యా
బలంబున వాయువు బంధించి తోయంబులతోడ నొక్కతోయంబ సమస్తం
బునుం గ్రోలి యంత గగనవ్యాపి యగుజలంబును గనుంగొని. 335

ఉ. వారిజసంభవుండు బుధవంద్యుఁడు చిత్తమునం దలంచె దై
త్యారిఁ బయోవిహారి సముదంచితహారి నతాఖిలామృతా
హారి రమాసతీహృదయహారి నుదారి విదూరభూరిసం
సారి భవప్రహారి విలసన్నుతసూరి నఘారి నయ్యెడన్. 336

---

1 'వాక్రువ్వఁగ' వ్రా. ప్ర. 2 'రమణీయంబుల్' వ్రా. ప్ర.

తే. అట్లు దలఁచి సరోజజుం డ[1]ంబుజమును గగనతలమునఁ జూచి యాలోకములకోశ
లీన మై యున్నలోకవితానములను, నొయ్యఁ బొడగని హరిచే నియుక్తుఁడై న.

తే. వానిఁగాఁ దన్నుఁ దలఁచి యవ్వనరుహంబు
లోపలికిఁ బోయి ము న్నందులోన నున్న
ముజ్జగంబులఁ జూచి యిమ్ముల సృజించె
మఱి చతుర్దశభువనముల్ మహిమఁ జేసి. 338

క. [2]పరఁగ సుధాశనతిర్య,జ్నరవివిధస్థావరాదినానాసృష్టి
స్ఫురణ నజుం డొనరించెం, బరువడి నిష్కామధర్మఫలరూపమునన్. 339

వ. ఇట్లు భువనంబులఁ బద్మజుండు గల్పించె నని మైత్రేయుండు విదురున కెఱిం
గించిన. 340

క. విదురుఁడు దురితావనిభృ,ద్భిదురుఁడు మునివరునిఁ జూచి ప్రియము మనమునం
గదురఁగ ని ట్లని పలికె న,తిదురంతం బయినవిష్ణుదేవునిమహిమన్. 341

తే. అమరె భువనంబు లతనికాలాఖ్యతయును, గణుతి సేయుతదీయలక్షణము లర్థి
నాకు నెఱిఁగింపు మయ్య విశేషచరిత, యనిన మైత్రేయుఁ డవ్విదురునకు ననియె.

సీ. ఆద్యంతశూన్యంబు నవ్యయం బై తగు, తత్త్వ మింతకు నుపాదాన మగుట
గుణవిషయములుగాఁ గొని కాలమును మహ, దాదిభూతములు దన్నాశ్రయింపఁ
గాలానురూపంబుఁ గైకొని యీశుండు, దనలీలకై తనుఁ దా సృజించెఁ
గర మొప్ప నఖిలలోకములందుఁ దానుండుఁ, దనలోన నఖిలంబుఁ దనరుచుండుఁ

తే. గాన విశ్వమ్మునకుఁ గార్యకారణములు
దాన యమ్మహాపురుషునితనువువలనఁ
బాసి విశ్వంబు వెలి యై ప్రభాస మొందె
మానితాచార యావర్తమానసృష్టి. 343

క. తెఱఁ గొప్ప నఖిలవిశ్వముఁ, బురుషోత్తము[3]మాయచేతఁ బుట్టుం బెరుఁగున్
విరతిం బొందుచు నుండుం, గర మర్థిన్ భూతభావికాలములందున్. 344

వ. అట్టిసర్గంబు నవవిధం బందుఁ బ్రాకృతవైకృతభేదంబులు గాల ద్రవ్యగుణంబులను
త్రివిధంబులకుఁ బ్రతిసంక్రమంబు లగుచునుండు నందు మహత్తత్త్వగుణాశ్రయం
బు ప్రథమసర్గం బది నారాయణసకాశంబున గుణవైషమ్యంబునం బొందు ద్రవ్య
జ్ఞానక్రియోదయంబై నయహంకారతత్త్వంబు ద్వితీయసర్గంబు శబ్దస్పర్శరూపరస
గంధంబు లనుపంచతన్మాత్రద్రవ్యశక్తియుక్తం బై నపృథివ్యాదిభూతసర్గంబు మూఁ
డవది యైయుండు [4]జ్ఞానేంద్రియంబు లైనత్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులుఁ
[5]కర్మేంద్రియంబు లైనవాక్పాణిపాదపాయూపస్థములు నను దశవిధేంద్రియ

---

1 డంబువులను. 2 మఱియు. 3 దేహమందు. 4 'జ్ఞానయుక్తంబు లైన' ప్రాఁతప్రతి.
5 'కర్మకలాపంబు లైన' ప్రా. ప్ర.

జననంబు చతుర్థసర్గంబు సాత్త్వికాహంకారజనితం బైనమనోమయసుమనోగణసర్గం బైదవసర్గం బై యొప్పు జీవలోకంబునకు నబుద్ధికృతంబు లైన యావరణవిక్షేపంబులం జేయుతామససర్గం బాఱవ దై యుండు నియ్యాఱు నీశ్వరునకు లీలార్థంబు లయినప్రాకృతసర్గంబు లయ్యె నింక వైకృతసర్గంబు లేడవది మొదలుగాఁగలుగు నవి వినిపింతు వినుము [1]పుష్పోత్పత్తిరహితంబు లై ఫలించెడు నశ్వత్థోదుంబరపనసన్యగ్రోధాదు లైన వనస్పతులును బుష్పితంబు లై ఫలపాకాంతంబు లైన(వ్రీహియవముద్గా)ద్యోషధులును నారోహణానపేక్షంబు లైన(మాలతీమల్లికాది)లతలును ద్వక్సారంబు లైన వేణ్వాదులును [2]కఠినీభూతమూలంబులును శిఖావిస్తృతంబులును నగులతావిశేషరూపంబు లైన వీరుధంబులును బుష్పవంతంబు లయి ఫలప్రాప్తంబు లగు(చూతాది)ద్రుమంబులును నవ్యక్తచైతన్యంబులు నూర్ధ్వస్రోతంబులు నంతస్స్పర్శంబులుఁ దమఃప్రాయంబులు నై [3]స్థావరంబు లయినయీయాఱు నేడవసర్గంబగు నెనిమిదవసర్గంబు తిర్యక్సర్గంబిరువదియెనిమిదిభేదంబులుగలిగి శ్వస్తనాదిజ్ఞానశూన్యంబు లయి యాహారాదిజ్ఞానమాత్రనిష్ఠంబు లయి ఘ్రాణంబువలన నెఱుంగం దగినవాని నెఱుంగుచు హృదయంబున దీర్ఘానుసంధానరహితంబు లై వర్తించు ద్విశఫంబులు గలవృషభమహిషాజ కృష్ణ సూకర రోహిష గవయ రురు మేష ముఖరనవకంబును నేకశఫంబు గలఖరాశ్వాశ్వతరగౌరశరభచమర్యాదిషట్కంబును బంచనఖంబులు గలశునక సృగాల వృక వ్యాఘ్ర మార్జార శశ శల్యక సింహ కపి గజ కూర్మ గోధాముఖభూచర ద్వాదశకంబును మకరాదిజలచరంబులును గంక గృధ్ర బక శ్యేన భాస భల్లూక బర్హి హంస సారస చక్రవాక కాకోలూకాది(*ఖేచరంబులు నయ్యె) (నర్వాక్స్రోతం బై యేకవిధం బగు) మానుషసర్గంబు రజోగుణప్రేరితం బై [5]కర్మకరణదక్షం బై దుఃఖం బందును సుఖంబు గోరు నిది దొమ్మిదవసర్గం బనం దగు నీత్రివిధసర్గంబులు వైకృతసర్గంబు లనంబడు నింక దేవసర్గంబు వినుమదియు నెనిమిదిదెఱంగులు గలిగి యుండు నందు విబుధ పితృ సురాదులు మూఁడును గంధర్వాప్సరస లొకటియు యక్షరక్షస్సు లేకంబును భూతప్రేత పిశాచంబు లొకటియు సిద్ధ చారణ విద్యాధరు లేకంబును గిన్నర కింపురుషు లొకటియునుం గా దేవసర్గం బయ్యె నిట్లు బ్రహ్మనిర్మితంబు లైనదశవిధసర్గంబులు నెఱింగించితి (నింక మనువులం దదంతరంబుల నెఱింగించెదఁ గల్పాదులయందు నీప్రకారంబున స్వయంభూతుండును) నమోఘసంకల్పుండును నగునప్పుండరీ

1 'అపుష్పఫలవంతంబు లైన వనస్పతులును' వ్రా. ప్ర. 2 'లతలు ముదిరి కాఠిన్యంబు నొంది యారోహణానపేక్షంబు లైన వీరుధంబులును' వ్రాఁతప్రతి. 3 'యీస్థావరంబు లాఱు సప్తమసర్గం బయ్యె' వ్రా. ప్ర. 4 (*) 'ఖేచరంబులు మొదలుగాఁ గలని తిర్యక్సర్గం బయ్యె' అ. ప్ర. 5 'కర్మారంభంబునం గలిగి తొమ్మిదవసర్గం బనం' వ్రా. ప్ర.

కాక్షుండు రజోగుణయుక్తుండై స్రష్ట యగుచు స్వస్వరూపం బయినవిశ్వంబు
నాత్మీయసామర్థ్యంబునం గల్పించె నయ్యీశ్వరునిమాయావ్యాపారంబులచే నీ
సృష్టియందు నద్యావర్తంబులం బడి భ్రమించుచున్నమహీరుహంబులుంబోలెఁ
బూర్వాపరభావంబు లెఱుంగంబడకుండు నీకల్పంబునం దుండు దేవాసురా
దులు ప్రతిమన్వంతరంబునందును నిట్లు నామరూపంబులచే నిర్దేశింపంబడుదురు
మఱియు నిం దొక్కవిశేషం బెఱింగించెదఁ గౌమారసర్గం బనునది దేవసర్గాంత
ర్భూతం బయ్యును బ్రాకృతవైకృతోభయాత్మకంబై దేవత్వమనుష్యత్వరూపం
బైనసనత్కుమారాదిసర్గం బనంబడె నమోఘసంకల్పుం డైనపుండరీకాక్షుండు
దనుఁ దాన యిట్లు విశ్వభేదంబును గల్పించె నని మైత్రేయుండు విదురునకుం
జెప్పి కాలలక్షణం బెఱింగించువాఁ డై యిట్లనియె. 345

సీ. భువిఁ గనకార్యాంశములకు నంతము నన్య, వస్తుయోగంబు నేరవలన లేక
ఘటపటాదికజగత్కార్యంబునకు నిజ, సమవాయకారణత్వమునఁ బరఁగి
జాలసూర్యమరీచిసంగతగగనస్థ, మగుత్రసరేణుషడంశ మరయఁ
బరమాణు వయ్యెఁ దత్పరమాణువం దర్క, గతియెంతదడవుదత్కాలమగును

తే. సూక్ష్మకాలంబు విను మదిసూర్యమండ, లంబు ద్వాదశరాశ్యాత్మకం బనంగఁ
గలుగుజగమునకొకయేఁడుగడచిచనినఁ, గాలమెంతగునదిమహత్కాలమనఘ.

వ. అందుఁ బరమాణుద్వయం బొక్కయణు వగు నణుత్రితయం బొక్కత్రసరేణు
వగు నవి మూఁడు గూడ నొక్కత్రుటి యగు నాత్రుటిశతం బొక్కవేధ యనం
బరఁగు నట్టివేధలు మూఁడు గూడ నొక్క లవం బనందగు నవి మూఁడైన నొ
క్కనిమేషం బనం జను నిమేషత్రయం బొక్కక్షణం బగు క్షణపంచకం బొక్క
కాష్ఠ యనందగు నవి పది యైన నొక్కలఘు వన నొప్పు నట్టిలఘుపంచదశకం
బొక్కనాడి యనం బరఁగు నట్టినాడికాద్వయం బొక్కముహూర్తం బయ్యె నట్టి
నాడిక లాఱైన నేడైన మనుష్యులకు నొక్కప్రహరంబగు నదియ యామంబనం
జను దివసపరిమాణవిజ్ఞేయం బగునాడికోన్మానలక్షణం బెఱింగింతువినుము షట్పల
తామ్రంబునం బాత్రంబు రచియించి చతుర్మాషసువర్ణంబునం జతురంగుళా
యామశలాకంబుఁ గల్పించి దానం దత్పాత్రమూలంబున ఛిద్రంబుఁ గల్పించి
తచ్ఛిద్రంబునం బ్రస్థమాత్రతోయంబు పరిపూర్ణంబు నొందునంతకాలం బొక్క
నాడిక యగు యామంబులు నాలుగు సన నొక్కపగ లగు రాత్రియు నిప్పగిది
జరగు నట్టియహర్నిశంబులు గూడ మర్త్యుల కొకదివసం బగు నవి పదునేనైన
నొక్కపక్షం బగు శుక్లకృష్ణ(నామంబులం బరఁగినయ)పక్షంబులు రెండు
గూడ నొక్కమాసం బగు నది పితృదేవతలకు నొక్కదివసం బగు నట్టిమాసం
బులు రెం డైన నొక్కఋతు వగు షణ్మాసంబు లరిగిన నొక్కయయనం బగు
నవి దక్షిణోత్తరాయణంబులు రెండు గూడి ద్వాదశమాసంబు లైన నొక్క

సంవత్సరం బగు నది దేవతలకు నొక్కదివసంబు నట్టిసంవత్సరశతంబు నరులకుం బరమాయు వై యుండుఁ గాలాత్ముండును నీశ్వరుండును నైనసూర్యుండు గ్రహనక్షత్రతారాచక్రస్థుం డై పరమాణ్వాదిసంవత్సరాంతం బైనకాలంబునం జేసి ద్వాదశరాశ్యాత్మకం బైనజగంబున సౌరబార్హస్పత్యసావనచాంద్రనాక్షత్రమానభేదంబులం గానంబడుచున్నవాఁ డై సంవత్సర పరివత్స రేడావత్స రానువత్సర వత్సరనామంబుల సృజ్యం బైనబీజాంకురంబులశక్తిం గాలరూపం బైనస్వశక్తిచేత నభిముఖంబుగాఁ జేయుచుం బురుషులకు నాయురాదివ్యయంబులం జేసి విషయాసక్తి నివర్తింపం జేయుచుం గోరికలు గలవారికి యజ్ఞముఖంబులం జేసి గుణమయంబు లైనస్వర్గాదిఫలంబుల విస్తరింపం జేయుచు గగనంబునఁ బరువువెట్టు వత్సరపంచకప్రవర్తకుం డగుమార్తాండునకుం బూజ గావింపు మని మైత్రేయుండు వలికిన విదురుం డి ట్లనియె. 347

క. నరపితృదేవగణాయువు, పరిమాణము లెఱుఁగ నాకుఁ బలికితివి మునీ
శ్వర యెఱిఁగింపు త్రిలోకో,పరిలోకవిలోక నైకపరు లగువారిన్ 48

ఉ. పూనినయోగసిద్ధి దగఁ బొందిననేత్రయుగంబునన్ బహి
ర్జ్ఞానము గల్గి యుండి భువనంబులఁ జూచుచు నుండువారికి
న్మానుగఁ గల్గు కాలగతి నా కెఱిఁగింపు మునీంద్ర నావుడు
న్నానయశాలి యవ్విదురు నాదర మొప్పఁగఁ జూచి యి ట్లనున్. 349

సీ. జననుతకృతయుగసంఖ్య నాలుగువేలు, దివ్యవర్షములు దదీయసంధ్య
లెనుబదినూఱేండ్లు విను త్రేత వత్సర, త్రిసహస్రము లగుఁ దదీయసంధ్య
లాఱునూఱేడులు నగు ద్వాపరము రెండు, వేలవత్సరముల వెలయుసంధ్య
లోలి నన్నూఱేడు లొగిఁ గలియుగము స,హస్రవర్షములు సంధ్యాంశమరయ

తే. [1]రెండునూఱేడులును నిల్చి యుండుఁ జువ్వె
యనఘ సంధ్యాంశమధ్యంబు లందు ధర్మ
మతిశయించును సంధ్యాంశమందు ధర్మ
మల్ప మై కానఁబడు చుండు ననఘచరిత. 350

వ. మఱియు ధర్మదేవత కృతయుగంబున నాలుగుపాదంబులును త్రేతయందు మూఁడుపాదంబులును ద్వాపరంబునం బాదద్వయంబును గలియుగంబున నేకపాదంబును గలిగి సంచరించు న ట్లగుటం జేసి. 351

క. పాదవిభేదంబున మ,ర్త్యాదులును దఱుఁగు నధర్మ మాకొలఁదిన యు
త్పాదిల్లి వృద్ధిఁ బొందు ధ,రాదివిజులు [2]పాదబుద్ధిరతు లగుదు రిలన్. 352

సీ. భూర్భువస్స్వర్లోకములకంటెఁ బొడువునఁ, గడు నొప్పుసత్యలోకంబునందు
నుండు బ్రహ్మకుఁ జతుర్యుగసహస్రము లేఁగ, దివ మొక్కటియగు రాత్రి యునునిట్ల

1 'యుగశతాబ్దంబులును నిల్చి యుండు' వ్రా. ప్ర. 2 పాపబుద్ధి.

చన ధాతనిద్ర వో జగములు మడఁగు మేల్కని చూడ మరల లోకములు వుట్టుఁ
దద్దినమునఁ జతుర్దశమను లగుదు రం, దొక్కొకమనువున కొనర దివ్య
తే. యుగములోలిని డెబ్బదియొక్క మాఱు, సనిన మనుకాలమయ్యె నమ్మనుకులంబు
సురలు మునులును సప్తర్షులరయ భగవ, దంశమునఁ బుట్టి పాలింతు రఖిలజగము.
క. హరి పితృసుపర్వతిర్య, జ్నరరూపములన్ జనించి నయమున మన్వం
తరముల నిజసత్త్వంబునఁ, బరిపాలన సేయు జగముఁ బౌరుష మొప్పన్. 354
క. క్రమమునఁ ద్రైవర్గికస, ర్గము సెప్పంబడె సరోజగర్భుఁడు దివసాం
తమునఁ దమఃపిహితపరా, క్రముఁడై శయనించు నిద్రఁ గైకొని యంతన్.
సీ. ఆరాత్రి భువనత్రయము దమఃపిహితమై, భానుచంద్రులతో విలీనమైన
సర్వాత్ముఁ డగుహరి శక్తిసమేతమై, కడఁగి వెలుంగు సంకర్షణాగ్ని
భువనత్రయంబును దవిలి దహింప న, య్యనలకీలలఁ బొడమిన మహోష్మ
లలమినఁ గమరి మహర్లోకవాసులు, జనలోకమునకును జనుదు రపుడు
తే. విలయసమయసముత్కటవిపులచండ
వాతధూతోర్మిజాలదుర్వారవార్ధి
భువనములు మున్గు నమ్మూఁడుభువనములను
దత్పయోరాశి మీఁదఁ బద్మావిభుండు. 356
ఉ. చారుపటీర హీర ఘనసార తుషార మరాళ చంద్రికా
పూర మృణాళ హార పరిపూర్ణసుధాకర కాశ మల్లికా
సారనిభాంగశోభితభుజంగమతల్పమునందు యోగని
ద్రారతిఁ జెంది యుండు జరరస్థిరభూర్భువరాదిలోకుఁడై. 357
క. జనలోకనివాసకు లర్థిని వినుతింపంగ నతులదివ్యప్రభచేఁ
దనరుచు మీలితనిజలో, చనుఁడై వసియించు నతఁడు సముచితలీలన్. 358
వ. ఇవ్విధంబున. 359
సీ. కైకొని బహువిధకాలగత్యుపలక్షి, తములై యహోరాత్రతతులు జరగ
శతవత్సరంబులు జనులకుఁ బరమాయు, వై నసంగతిఁ బంకజాసనునకుఁ
బరమాయు వగుశతాబ్దంబు లందుల సగ, మరిగిన నదియ పరార్థ మండ్రు
గాన పూర్వార్ధంబు గడచుటఁ జేసి ద్వి, తీయపరార్ధంబు దీని పేరు
తే. గడఁగి పూర్వపరార్ధాదికాలమందు, బ్రహ్మకల్పాఖ్య నెంతయుఁ[1] బరఁగు నందు
బ్రహ్మయుదయించుటం జేసి బ్రహ్మకల్ప, మనియు శబ్దాత్మక బ్రహ్మమనియు నెగడె.
క. విను మెన్నఁడు పంకజనా, భునినాభీసరసియందు భువనాశ్రయమై
తనరిన పద్మము వొడవదు, ననఘా యది పద్మకల్ప మన విలసిల్లున్. 361

---

1. 'బరఁగుచుండు, బ్రహ్మకల్పంబు శబ్దంబు బ్రహ్మమనుచుఁ, బలుకఁబడు నట్టి బ్రహ్మకల్పంబు తుదిని.' వ్రా. ప్ర.

వ. పూర్వపరార్ధాదినిం గలిగిన[1] బ్రహ్మకల్పంబుఁ జెప్పితి నింక ద్వితీయపరార్ధంబు మొ
దల నెన్నఁడేని హరి సూకరాకారంబు దాల్చు నది వరాహకల్పం బనందగు
నట్టి వరాహకల్పం బిపుడు వర్తమానం బగుచున్నది వెండియు. 362

సీ. దీపింపఁ గాలస్వరూపుఁ డై నట్టిప,ద్మాత్ముఁ డనంతుఁ డనాదిపురుషుఁ
డఖిలవిశ్వాత్మకుఁ డగునీశునకుఁ బర,మాణ్వాదియుగపరార్ధాంత మగుచు
జరగునీకాలంబు చర్చింప నొక్కని,మిషమాత్రకాల మై మెలఁగు చుండుఁ
గాని యీశ్వరునకుఁ గర్త గాఁ జాల ది,క్కాలంబు వినుమది గాక దేహ

తే. మందిరార్థాదికర్త్రాభిమానశీలు, రైనవారికి నాశ్రయం బగుటఁ జేసి
యరయ హరి తద్గుణవ్యతికరుఁడు గాన, కాల మమ్మేటి కెన్నఁడుఁ గర్తగాదు.

వ. మఱియు షోడశవికారయుక్తంబై పృథివ్యాదిపంచభూతపరివృతం బయి దశావర
ణంబులు గలిగి పంచాశత్కోటివిస్తీర్ణం బై బ్రహ్మాండకోశంబు దనర్చుచుండు.

చ. హరి పరమాణురూపమున నందు వసించి విరాజమానుఁ డై
సరి వెలుఁ గొందు నిమ్ముల నసంఖ్యము లైనమహాండకోశముల్
నెఱిఁ దనయందు డింద నవనీరజనేత్రుఁ డనంతుఁ డాద్యుఁ డ
క్షరుఁడు పరాపరుం డఖిలకారణకారణుఁ డప్రమేయుఁ డై. 365

క. నిరతిశయోజ్జ్వలతేజ,స్స్ఫురణం దనరారుపరమపురుషుని విష్ణుం
బురుషోత్తము వర్ణింపను, సరసిజభవభవుల కైన శక్యమె చెపుమా. 366

క. అని మైత్రేయుఁడు విదురుం, గనుఁగొని వెండియును బలికెఁ గాలాహ్వయుఁడై
తనరినహరి[2]మహిమల నే, వినిపించితి సృష్టిమహిమ వినుమెఱిఁగింతున్. 367

వ. పరమేష్ఠి యీసృష్ట్యాది నహమ్మను దేహాభిమానబుద్ధిం గలమోహంబును నంగ
నాసంగమస్రక్చందనాదిగ్రామ్యభోగేచ్ఛలు గలమహామోహంబును దత్ప్రతి
ఘాతజాతం బైనక్రోధంబునందుఁ గలుగునంధతామిస్రంబును దన్నాశంబునం
దహ మేవ మృతోఽస్మి యనుతామిస్రంబును జిత్తవిభ్రమంబును ననునవిద్యా
పంచకమిశ్రంబుగా సర్వభూతావలిం బుట్టించి యాత్మీయచిత్తంబునం బాప
సృష్టిఁ గల్పించుటకుఁ బశ్చాత్తాపంబు నొంది భగవద్ధ్యానామృతపూతమాన
సుం డై యూర్ధ్వరేతస్కులును బరమబవిత్రులును నైనసనక సనందన సనత్కు
మార సనత్సుజాతు లనుమునులఁ బుణ్యవర్తనుల నతిసత్త్వగుణగరిష్ఠులధీరజనో
త్తముల నార్యుల హరి ప్రపన్నులంగా దివ్యదృష్టిం గల్పించి వారలం జూచి మీమీ
యంశంబులం బ్రజలం బుట్టించి ప్రపంచంబు వృద్ధిఁ బొందింపుం డనిన వారలు
తద్వచనంబు లపహసించుచుఁ బద్మజుం గని మోక్షధర్ములును నారాయణపరా
యణులును నై ప్రపంచనిర్మాణంబునకుఁ బ్రతికూలవాక్యంబులు పలికిన [3]నుద
యించినక్రోధంబు బుద్ధిచే నిగ్రహింపఁబడినను నరవిందసంభవునిభ్రూమధ్యంబు

1 పద్మకల్పంబు. 2 మహి మెల్లను. 3 'గనలాంశు నరవిందసంభవు భ్రూమధ్య' వ్రా. ప్ర..

వలనఁ గ్రోధస్వరూపంబున నీలలోహితుండు నిఖిలసురాగ్రజుం డై యుదయించె
నివ్విధంబున. 368

మ. జననం బందిననీలలోహితుఁడు కంజాతాసనుం జూచి యి
ట్లను నో దేవ మదాఖ్య యెట్టిది మదీయావాస మెచ్చోటు నా
కనయంబు న్నెఱిఁగింపవే యనుడు నయ్యంభోజగర్భుండు లా
లనముం దోఁపఁ గుమార నీజననవేళన్ రోదనం బిచ్చుటన్. 369

తే. రుద్రనామంబు నీకు నిరూఢ మయ్యెఁ, జంద్రసూర్యానలానిలసలిలగగన
పృథివిప్రాణతపోహృదింద్రియము లనఁగఁ, గలుగు నేకాదశస్థానములు వసింప.

వ. అని వెండియు మన్యు మను మహాకాల మహచ్ఛివ ఋతధ్వజోరు రేతో భవ
కాల వామదేవ ధృతవ్రతు లనునేకాదశనామంబులు గలిగి ధీ వృత్త్యశ
నోమా నియుత్సర్పి రిలాంబి కేరావతీ సుధా దీక్షా నామపత్నీసమేతుండ వై
పూర్వనియుక్తంబు లయిననామంబులం దత్తన్నివాసంబుల వసియించి ప్రజలం
గల్పింపు మని నిర్దేశించిన భగవంతుం డగునీలలోహితుండు విశ్వగురుం డైన
పితామహునిచే నియుక్తుం డై సత్త్వాకృతిస్వభావంబుల నాత్మసము లైనప్రజ
లం గల్పించె. 371

ఉ. రుద్రునిచేత నీగతి నిరూఢమతిన్ సృజియింపఁబడ్డయా
రుద్రగణంబు లోలి నవరుద్ధత విశ్వము మ్రింగ నమ్మహో
పద్రవశాంతికై యజుఁడు భర్గులఁ జూచి కుమారులార మీ
రౌద్రవిలోకనానలభరంబునఁ గ్రాఁగె సమస్తలోకముల్. 372

క. మీసృష్టి సాలు నింకన్, ధీసత్తములార వినుఁడు ధృతి మీకు తపో
వ్యాసంగచిత్తు లై చనుఁ, డాసన్మంగళము లగు దృఢంబుగ మీకున్. 373

మ. భగవంతుం బురుషోత్తమున్ హరిఁ గృపాపాథోధి లక్ష్మీశ్వరున్
సుగుణభ్రాజితు నచ్యుతుం బరుఁ బరంజ్యోతిం బ్రభున్ సర్వభూ
తగుహావాసు నధోక్షజున్ శ్రితజనత్రాణైకదక్షు న్నజున్
జగదాత్ముం గను చుండు రార్యులు తపశ్శక్తిన్ స్ఫుటజ్ఞాను లై. 374

వ. అనిన విని. 375

ఉ. కై కొని యిట్లు పంకరుహగర్భనిమంత్రితు లైనరుద్రు లు
ద్రేకముఁ దక్కి కానలకు దీయుతు లై తప మాచరింప న
స్తోకచరిత్రు లేఁగిరి చతుర్ముఖుఁ డంతఁ బ్రపంచకల్పనా
లోకనుఁ డై సృజించె జనలోకశరణ్యుల ధీవరేణ్యులన్. 376

తే. వినుము భగవద్బలాన్వితవినుతగుణులు, భువనసంతానహేతువిస్ఫురణకరులు
పద్మసంభవతుల్యప్రభావయుతులు, పదురు గొడుకులు పుట్టిరి భవ్యయశులు.

సీ. అరవిందసంభవునంగుష్ఠమున దక్షుఁ, డూరువువలనను నారదుండు

నాభిఁ బులహుఁడు గర్ణములఁ బులస్త్యుండు, త్వక్కున భృగువు హస్తమునఁ గ్రతువు
నాస్యంబువలన నయ్యంగిరసుఁడు ప్రాణ, మున వసిష్ఠుఁడు మనమున మరీచి
గన్నుల నత్రియుఁ గాఁ బుత్రదశకంబు, గలిగిరి వెండియు నలినగర్భు

తే. దక్షిణస్తనమువలన ధర్మ మొదవె, వెన్నువలనను నుదయించె విశ్వభయద
మైనమృత్యు వధర్మంబు నందఁ గలిగె, నాత్మఁ గాముండు జననము నందె మఱియు.

సీ. భ్రూమధ్యతలమునఁ గ్రోధంబు నధరంబునందు లోభంబు నాస్యమున వాణి
యును మేఢ్రమందుఁ బయోధు లపానంబునందు నఘాశ్రయుఁ డైననిర్ఋతి
లాలితచ్ఛాయవలన దేవహూతివిభుండు గర్దముఁడును బుట్టి రంత
నబ్జజుఁ డాత్మదేహమున జనించిన, భారతిఁ జూచి విభ్రాంతిఁ బొరసి

తే. పంచశరబాణనిర్భిన్నభావుఁ డగుచుఁ, గూఁతు రని పాపమునకు సంకోచపడక
కవయఁ గోరినజనకునిఁ గని మరీచి, మొదలుగాఁ గలయమ్మునిముఖ్యు[1]లెఱిఁగి.

వ. ఇట్లనిరి. 380

ఉ. చాలుఁ బురే సరోజభవ సత్పథవృత్తిఁ దొలంగి కూఁతు ని
ట్లాలరి వై రమింప హృదయంబునఁ గోరుట ధర్మ[2]రీతియే
చేలరి వైతి నీతగవుఁ బెద్దతనంబు[3]ను నేలపాలు గా
శీలము వోవఁ దట్టి యిటు సేసినవారలు మున్ను గల్గిరే. 381

ఉ. నీవు మహానుభావుఁడ వనింద్యచరిత్రుఁడ విట్టిచోట రా
జీవభవుండు దా విధినిషేధము లాత్మ నెఱుంగఁ డయ్యె నీ
భావభవప్రసూనశరబాధితుఁ డై తనకూఁతుఁ బొందెఁ బో
వావి దలంప లే కనుచు వారక లోకులు ప్రువ్వఁ దిట్టరే. 382

క. పాపము దలఁపక నిమిషము, లోపలఁ జెడుసౌఖ్యమునకు లో నైతివె యిం
తే పో ధారుణిఁ 'గామా, న్ధోఽపి న పశ్యతి' యనంగఁ దొల్లియు వినమే. 383

మ. అని యిబ్భంగి మునీంద్రు లాడినకఠోరాలాపముల్ వీనుల
న్విని లజ్జావనతాననుం డగుచు నానీరేజగర్భుండు స
య్యన దేహంబు విసర్జనీయముగఁ జేయన్ దిక్కు లేతెంచి త
త్తనువుం గైకొనఁ బుట్టె దిక్కలితమై తామిస్రనీహారముల్. 384

వ. అంత. 385

చ. ఉడుగక పంకజాతభవుఁ డొండొకదేహముఁ దాల్చి ధైర్యమున్
విడువక సృష్టిపూర్వసమవేతమునన్ సృజియించునైపుణిం
బొడమమి కాత్మ లోనఁ దలపోయుచు నుండఁ జతుర్ముఖంబులన్
వెడలె ననూనరూపముల వేదము లంచితధర్మయుక్తిమై. 386

---

1 అలిగి. 2 సంగతే. 3 జలంబుపాలు గా.

తే. మఱియు మఖములు మహితకర్మములుఁ దంత్ర
ములును నడవళ్లు నాశ్రమములుఁ దదీయ
ముఖచతుష్కమునందున పొడమె ననిన
విని మునీంద్రునిఁ జూచి యవ్విదురుఁ డనియె. 387

క. తోయజసంభవుఁ డప్పుడు, నేయే ముఖమండలమున నేయే సృష్టిన్
ధీయుతుఁడై సృజియించెను, బాయక యత్తెఱఁగుఁ దెలియఁ బలుకుము నాకున్.

వ. అని యిట్లు విదురుం డడిగిన మైత్రేయుం డతనితో నిట్లనియె ఋగ్యజుస్సామాథర్వంబు లను వేదంబులును [1]హోతృకర్మంబు లయిన యప్రగీతమంత్రస్తోత్రంబు లగు శస్త్రంబులును నధ్వర్యుకర్మం బైన యిజ్యయు సంప్రగీతస్తోత్రం బయిన స్తుతియును నుద్గాతృప్రయోజ్యం బైన ఋక్సముదాయరూపం బగు స్తోమంబును బ్రాయశ్చిత్తం బగు బ్రహ్మకర్మంబును నాయుర్వేదధనుర్వేదగాంధర్వవేదంబు లను నుపవేదంబులును విశ్వకర్మశాస్త్రం బగు స్థాపత్యంబును బ్రాగాది ముఖంబుల నుత్పన్నంబు లయ్యెఁ బంచమవేదం బగు నితిహాసపురాణంబులు సర్వముఖంబులం గలిగె మఱియుఁ గర్మతంత్రంబు లయిన షోడశ్యుక్థ్యలును జయనాగ్నిష్టోమంబులును నాప్తోర్యామాతిరాత్రంబులును వాజపేయగోసవంబులును ధర్మపాదంబు లైన విద్యాదానతపస్సత్యంబులును బ్రహ్మచర్యగృహస్థవానప్రస్థయత్యాశ్రమంబులును ననువీనికి నొక్కొక్కటికిం జతుర్విధంబు లైన వృత్తులును గలిగియుండు నందు సావిత్రం బన బ్రహ్మచర్యం బది యుపనయనంబాదిగా దివసత్రయంబు గాయత్రి జపించుటయు ప్రాజాపత్యం బన వేదవ్రతచతుష్టయం బందుఁ బ్రతివ్రతంబును వ్రతులు సంవత్సరపర్యంతంబుగా నాచరింప నగు బ్రాహ్మంబు వేదగ్రహణాంతంబు నాచరింపం దగు బృహత్తన నైష్ఠికంబియ్యవి యను బ్రహ్మచారివృత్తిచతుష్టయంబును ననిషిద్ధకృష్యాదివృత్తి యగు వార్తయు యజనాది[2]కర్మోపయుక్తం బైన యాచ్ఞాదిరూపధనసంచయంబును బరుల యాచింప కుండున యాచితం బగు శాలీనంబును క్షేత్రపతితకణిశకణసంగ్రహణరూపం బగు శిలోంఛంబును ననుగృహస్థవృత్తులు నాలుగును నకృష్టపచ్యాహారు లగు వైఖానసులును నూతనఫలంబు లబ్ధం బైనఁ బూర్వసంచితపదార్థత్యాగంబు గలవాలఖిల్యులును బ్రాతఃకాలంబున నేదిక్కు విలోకింతు రద్దిక్కునకుం జని యచ్చట లభించుపదార్థంబుల భుజించి జీవించు నౌదుంబరులును దమంత ఫలించి తరుపతితంబు లగుఫలంబులఁ దినుచుండు ఫేనపులును ననుచతుర్విధవృత్తులు గలవానప్రస్థులును స్వాశ్రమవిహితకర్మప్రధానకుం డగుకుటీచకుండును

---

1 'హోతృకర్మకం బైన శాస్త్రంబును నధ్వర్యుకర్మం బైన యిజ్యయు స్తుతియు సామగానంబును స్తోమంబును గాతృప్రయోజ్యం బైన ఋక్సముదాయంబును ప్రాయశ్చిత్త.' వా. ప్ర.

2 'కర్మంబులు గలయర్థసంపాదన మనుసంచయంబును' వా. ప్ర.

గర్మోపసర్జనంబు సేసి జ్ఞానప్రధానుం డయినబహూదుండును గేవలజ్ఞానాభ్యాస నిష్ఠుం డగ్గుహాంసుండును ప్రాప్తం బైనపరబ్రహ్మతత్త్వంబు గల నిష్క్రియుం డును ననుసన్న్యాసిచతుర్విధవృత్తులును (మోక్షఫలప్రదం బై యాత్మానాత్మ వివేకవిద్యారూపం బగు)నాన్వీక్షకి(యు స్వర్గాదిఫలప్రదం బై కర్మవిద్యారూప మగు) త్రయి(యు జీవనఫలప్రదానం బై కృష్యాదిరూపం బగు) వార్త(యు నర్థ సంపాదనైకప్రయోజనం బగు)దండనీతియు మోక్షధర్మకామార్థంబు లైన న్యాయవిద్యాచతుష్టయంబును భూర్భువస్సువ యనువ్యాహృతులును బూర్వాది ముఖంబులవలన నుదయించె మఱియు నతనిహృదయాకాశంబువలనం బ్రణవం బును రోమంబులవలన నుష్ణిక్ఛందంబును ద్వగింద్రియంబువలన గాయత్రీఛం దంబును మాంసంబువలనఁ ద్రిష్టుప్ఛందంబును స్నాయువువలన ననుష్టుప్ఛందం బును నస్థివలన జగతీఛందంబును మజ్జవలన పంక్తిచ్ఛందంబును బ్రాణంబు వలన బృహతీఛందంబును గకారాదిపంచవర్గాత్మకంబు లయినస్పర్శంబు లనుజీ వుండును నకారాదిస్వరాత్మకం బైనదేహంబును నూష్మంబు లను శషసహవర్ణ చతుష్టయరూపంబు లగునింద్రియంబులును నంతస్థంబు లగుయరలవ యను వర్ణంబులు షడ్జాదిసప్తస్వరరూపంబు నాత్మబలంబు నయిన శబ్దబ్రహ్మంబును జతుర్ముఖునిలీలావిశేషంబున నుత్పన్నం బయ్యె వ్యక్తావ్యక్తం బై వైఖరీప్రణ వాత్మకం బైనశబ్దబ్రహ్మంబువలనం [1]బరమాత్మ యవ్యక్తాత్మకుం డగుటం జేసి పరిపూర్ణుండును వ్యక్తాత్మకుం డగుటం జేసి యింద్రాదిశక్త్యుపబృంహితుండును నై కానంబడు నయ్యవసరంబున నజుండు భూరివీర్యవంతు లయినఋషిగణం బులసంతతి యవిస్తృతం బని తలంచి పూర్వతనుపరిగ్రహంబు సాలించి యని షిద్ధకామాసక్తం బైనదేహాంతరపరిగ్రహంబు సేసి [2]నిత్యంబుఁ బ్రజాసృష్టియందు వ్యాసక్తుండ నైనం బ్రజ లభివృద్ధి నొందక యుండుట కేమి కారణం బగు నని యచ్చెరు వొంది తద్వృద్ధి యగువిధం బాలోచించుచు దైవం బిచ్చట విఘాతు కంబు గాన తదానుకూల్యం బావశ్యకం బని దాని నెమరు చూచుచు యథో చితకృత్యకరణదక్షుం డగుచుండుచతుర్ముఖునిదేహంబు ద్వివిధం బయిన నట్టి రూపద్వయవిభాగంబు స్వరాట్టగుస్వాయంభువమనువును దన్మహిషి యగు శతరూప యనుకన్యకయుం గా మిథునం బయి జనియించె నమ్మిథునంబువలనం బ్రియవ్రతోత్తానపాదు లనుపుత్రద్వయంబు నాకూతి దేవహూతి ప్రసూతు

1 'నింద్రాదిశక్త్యుపబృంహితుండును వ్యక్తాత్ముండును బరిపూర్ణుండునగునారాయణుండు కానంబడు. వ్రా.ప్ర. 2 మిథునసృష్టిఁగల్పింపఁ దలంచెనని శుకుండు పరీక్షిత్తునకుఁజెప్పిన నతం డిట్లనియె నిత్యంబై వ్యాపకంబై యథోచితకార్యకరణసమర్థం బైనచతుర్ముఖునిరూపద్వయంబునందు నొక్క రూపంబునందుఁ బ్రజాసంవోహసంకోచంబును నొక్కరూపంబునఁ బ్రజావిస్తారంబు నెట్లు సంభవించె ననిన రూపద్వయవిభాగంబువలన మనువును శతరూప యనుకన్యకయుం. వ్రా. ప్ర.

లనుకన్యకాత్రయంబునుం గలిగి రందు నాకూతిని రుచికునకును దేవహూతిం
గర్దమునకును బ్రసూతిం దక్షునకును నిచ్చె వీరలవలనఁ గలుగుప్రజాసంతతుల
చేత జగంబులు పరిపూర్ణంబు లయ్యె. 389

స్వాయంభువమనువు ప్రజావృద్ధి సేయుట.

క. అని మైత్రేయుఁడు పలికిన, విని మనమున హర్ష మొదవ । విదురుఁడు మునినా
థునిఁ జూచి పలికెఁ గ్రమ్మఱ, వనజోదరపాదభక్తి। వశమానసుఁడై. 390

క. ఘనుఁడు స్వాయంభువునకుఁ బ్రియ,తనయుఁడు స్వాయంభువుండు । దైతేయవిభే
దనసేవాచతురుండును, జనవినుతుం డాదిరాజ।సత్తముఁ డౌటన్. 391

క. అతనిచరిత్రం బవ్యా, హతసుఖదము నిఖిలమంగ।ళావహము సమం
చితముం గావున బుధసే, వితనా కెఱుఁగంగఁ బలుక।వే మునితిలకా. 392

క. అదియును గాక ముకుందుని, పదకమలమరందపాన।పరవశు లై పెం
పొదవినవారిచరిత్రము, సదమలమతి వినిన భవము। సఫలము గాదే. 393

చ. అని విదురుండు వల్కిన దర।యాన్వితుఁడై మునినాథచంద్రుఁ డి
ట్లను శ్రుతిశాస్త్రపారకలి।తాత్మకుఁ డైనసరుండు పద్మలో
చనచరణారవిందయుగ।సంగము గల్గినసజ్జనుండు వొం
దినఫల మొందు భాగవత।దివ్యకథాశ్రవణుండు ప్రేల్మిడిన్. 394

క. అని చెప్పి మునికులాగ్రణి, దనుజారికథాసుధాప్లు।తస్వాంతుం డై
తనువునఁ బులకాంకురములు, మొనయఁగ నానందబాష్ప।ములు జడిగురియన్.

సీ. వినిపింపఁ దొడఁగె నా।ఘనుఁడు స్వాయంభువుఁ, డంగనాయుక్తుఁడై।యబ్జగర్భు
నకుమ్రొక్కి వినయవి।నమితోత్తమాంగుఁడై, హస్తముల్ మొగిచియి।ట్లనియెఁ బ్రీతి
జీవరాసులకు రా।జీవసంభవ నీవ, జననరక్షణవినా।శముల కరయ
హేతుభూతుఁడవు మా।కెద్ది యాచరణీయ, మైనకర్మము దాని। నానతిమ్ము
తే. ఎట్టికర్మంబు సేసిన। నెసఁగు నీకు, నవహితం బైనసంతోష। మాత్మజుండు
జనకునకు భక్తిఁ బరిచర్య।సలిపి కీర్తి, నంది నుతికెక్కి వర్తించు। నందు నిందు.

వ. [1]కావున నెఱింగింపు మట్టిసత్కర్మంబు.

క. అని పలికినస్వాయంభువ, మనుమృదుభాషలకు నలరి। మనమునఁ గమలా
సనుఁ డనురాగము ముప్పిరి,గొనఁ బ్రియతముఁ డైనసుతున।కును నిట్లనియెన్.

చ. మునుకొని తండ్రియాజ్ఞఁ దల। మోచి నిజోచితకృత్య మేమి వం
చినఁ దనశక్తియుక్తి నెడ। సేయక చేయుట పుండరీకలో
చనపదసేవ సేయుట ప్ర।జాపరిపాలనశాలి యాటయున్
జనకునకున్ సుతుండు పరి।చర్య లొనర్చుట సువ్వె పుత్రకా. 398

1 'కావ యెఱింగింపు మట్టిసత్కర్మ మనఘ' అని యిది క్రిందితేటగీతిలో నైదవపాదముగాఁ గొన్నిప్రతులఁ గనుపట్టెడి.

వ. కావున. 399

మ. వివరింపన్ హరి యజ్ఞమూర్తిఁ బరమున్ విష్ణున్ హృషీకేశుఁ గే
శవుఁ బద్మాక్షుఁ గుఱించి జన్నములు శశ్వద్భక్తిఁ గావింప మా
ధవుఁ డాత్మం బరితోష మొందు నతఁ డుద్యత్ప్రీతుఁడై యున్న లో
కవితానంబులు దుష్టి నొందు ననఘా కావింపుమా యజ్ఞముల్. 400

చ. అకుటిలభక్తిఁ గేశవసమర్పణబుద్ధిఁ గ్రతుక్రియల్ వొన
ర్పక విపరీతులై యుముకరాసులు దంచి ఫలంబు నందఁ గా
నక చెడురీతి నూరక ధరన్ వ్యయ మాటయ కాని మోక్షదా
యక మగు చున్నసత్ఫలము నందరు విష్ణుపరాఙ్ముఖక్రియుల్. 401

ఉ. కావున యజ్ఞముల్ హరి వికారవిదూరుఁ గుఱించి చేయు నీ
భావము సూనృతవ్రత శుభస్థితిఁ జెందెడు నీకుమారులున్
నీవును నీధరాభరము నెమ్మి వహింపుము సజ్జనావళిం
బ్రోవుము ధర్మమార్గమునఁ బుత్రక దోషలతాలవిత్రకా. 402

క. అనవుడు నతనికి నతఁ డి, ట్లనియె స్వఘనాశ నీయానతి యెట్ల
ట్లొనరించెద నాకును నా, తనయులకు వసించి యుండఁ దగు నెల వెందున్. 403

శ్రీయజ్ఞవరాహావతారాభివర్ణనము.

తే. అరయ లేదు విధాత యీయఖిలజంతు, జాతముల కెల్ల నాధారభూత మైన
ధరణి యిప్పుడు ఘనజలాంతర్నిమగ్న, మైనకతమునఁ జోటు లేదంటిఁ దండ్రి.

క. కావున భూమ్యుద్ధరణము, గావించు నుపాయ మిపుడు గైకొని నాకున్
దేవా నీ వెఱిఁగింపుము, నావుడుఁ బద్మజుఁడు దనమనంబునఁ దలఁచెన్. 405

మ. జలమధ్యంబున లీన మొందినధరాచక్రంబు నే నేర్పునన్
నిలుపన్ వచ్చును బూర్వమందు జగముల్ నిర్మించునాఁ డాదిన
ప్పులఁ బుట్టించినమీఁద నవ్వసుమతిం బుట్టించితిన్ సృష్టియ
ప్పులలోఁ గ్రుంకి రసాతలాంతరమునం బొందెం గదా పృథ్వియున్. 406

సీ. అఖిలజగత్కల్పనాటోపమునకుఁ బా, ల్పడిననాచేత నెబ్బంగి నిపుడు
దగిలి విశ్వంభరోద్ధరణంబుఁ గావింప, నగు నని సర్వభూతాంతరాత్ముఁ
బురుషోత్తముని నవపుండరీకాక్షు ల, క్ష్మీపతిఁ దనమనస్స్థితునిఁ జేసి
తలపోయుచున్నఁ బద్మజునాసికావివ, రమ్మున యజ్ఞవరాహమూర్తి
తే. యర్థి నంగుష్ఠమాత్రదేహంబుతోడ, జనన మంది వియత్తలస్థాయి యగుచు
క్షణములోపల భూరిగజప్రమాణ, మయ్యె నచ్చటిజనముల కద్భుతముగ. 407

సీ. అంతఁ బ్రజాసర్గమందు నియుక్తులై, [1]నట్టిమరీచ్యాదు లైనమునులు
మనుకుమారకులు [2]నమ్మనుసహితంబుగ, యజ్ఞవరాహంబు నర్థిఁ జూచి

---

1 'నట్టిమరీచిముఖాద్యమరులును' వ్రా. ప్ర. 2 'నమ్మనువును సహిత మై' వ్రా. ప్ర.

యిట్టియాశ్చర్య మె ట్లొందేనిఁ గలదె నా, సారంధ్రనిర్గతస్తబ్ధరోమ
లోకంబు మనము విలోకింప నంగుష్ఠ, మాత్ర మై యాక్షణమాత్రలోన
తే. మహిమ దీపింప దంతిప్రమాణమును మ, హోన్నతం బైనగండశైలోపమంబు
నయ్యెనని వితర్కించి రయ్యబ్జభవుఁడు, హర్ష మిగురొత్తఁ జూచి యిట్లనితలంచె.
క. నామనమునఁ గలదుఃఖవి, రామముఁ గావించుకొఱకు రాజీవాక్షుం
డీమేర యజ్ఞపోత్రి, శ్రీమూర్తి వహించె నిది విచిత్రము దలఁపన్. 409
వ. అని వితర్కించుసమయంబున సూకరాకారుం డయినభగవంతుండు. 410
తే. ప్రళయజీమూతసంఘాతభయదభూరి, గర్జనాటోపలోభకృద్ఘనగభీర
రావమడరింపనపుడు రాజీవభవుఁడు, మునులునానందమునఁబొందిరనఘచరిత.
వ. అంత మాయామయవరాహఘుర్ఘురారావంబు బ్రహ్మాండకోటరపరిస్ఫోటనంబు
గావింప విని జనస్తపస్సత్యలోకనివాసు లయినమునులు ఋగ్యజుస్సామమంత్రం
బుల వినుతించిరి యజ్ఞవరాహరూపధరుం డయినసర్వేశ్వరుండు సత్పురుష
పాలనదయాపరుండు గావున దిగ్గజేంద్రలీలావిలోలుం డై. 412
సీ. కఠినసటాచ్ఛటోత్కటజాతవాతని, ర్ధూతజీమూతసంఘాతముగను
క్షురనిభసునిశితఖురపుటాహతచల, త్ఫణిరాజదిగ్గజప్రచయముగను
జండదంష్ట్రోత్థితవైశ్వానరార్చిస్స్రవ, ద్రజతహేమాద్రివిస్రంభముగను
ఘోరగంభీరఘుర్ఘురభూరినిస్వన, పంకిలాఖిలవార్ధిసంకులముగఁ
తే. బొరలుఁ గెరలునటించుసంబరముఁ జెరల, రొప్పు నుప్పర మెగయును గొప్పరించు
ముట్టెబిగించు మసముసమూరుకొనుచు, నడఁగుసంరక్షితక్షోణి యజ్ఞఘోణి.
వ. మఱియు నయ్యజ్ఞవరాహంబు. 414
సీ. తివిరి చతుర్దశభువనంబు లనుదొంతు, లోరగఁ గొమ్ములఁ జిమ్ము నొక్కమాటు
[1]పుత్తడికొండ మూఁపుర మను నొరగంట, నొరసు రారా పాదు నొక్కమాటు
ఖురముల సప్తసాగరమున [2]సేతువు, లొనరొత్త మట్టాడు నొక్కమాటు
నాభీలవాలవాతాహతిచే [3]మిన్ను, నొదవించు బయలుగా నొక్కమాటు
తే. గన్నుఁగొనల విస్ఫులింగములు సెదర
నురుభయంకరగతిఁ దోఁచు నొక్కమాటు
పరమయోగీంద్రజనసేవ్యభవ్యవిభవ
యోగ్య మై కానఁగా నగు నొక్కమాటు. 415
వ. ఇట్లు విహరించుచుఁ బ్రాతర్మధ్యందినతృతీయసవనరూపుం డయినయజ్ఞవరాహ
మూర్తి యగుసర్వేశ్వరుండు మహాప్రళయంబునందు యోగనిద్రావశుం డై
యుండునవసరంబున నుదకస్థం బైనభూమి రసాతలగతం బైనదాని నుద్ధరించు

---

1 'బంగారుకొండ మూఁపర మను నొరగంట' ప్రా. ప్ర. 2 రొంపిగా, నుక్కించి మట్టాడు' అ. ప్ర. 3 'మింటి, నొరసి బ్రద్దలు సేయు నొక్కమాటు' అచ్చుప్రతి.

టకు సముద్రోదరంబుఁ దఱియం జొచ్చు వేగంబు సైరింపం జాలక సముద్రుం డూర్ములనుభుజంబు లెత్తి విశీర్ణహృదయుం డై యార్తునిపగిది యజ్ఞవరాహ నన్ను రక్షింపు రక్షింపు మని యాక్రోశింప నిశితకరాళక్షురతీక్ష్ణంబు లైన ఖురాగ్రంబుల జలంబులు విచ్ఛిన్నంబులు గావించి యపారంబయినరసాతలంబుఁ బ్రవేశించి భూమిం బొడగనునవసరంబున. 416

క. శరనిధిలోన మహోగ్ర, మకరకంటకుఁ డెమరఁ గాంచె మఖమయగాత్రిన్
ఖురవిదళితకులగోత్రిన్, ధరణికళత్రిన్ గవేషధాత్రిం బోత్రిన్. 417

వ. ఇట్లు పొడగని దైత్యుండు రోషభీషణాకారుం డై. 418

మ. గద సారించి యసహ్యవిక్రమసమగ్రస్ఫూర్తితో వ్రేయఁగా
నది దప్పించి వరాహమూర్తి నిజదంష్ట్రాగ్రాహతిం ద్రుంచెఁ బెం
పొదవం గ్రోధమదాతిరేకబలశౌర్యోదారవిస్తారసం
పదఁ బంచాస్యము సామజేంద్రుఁ జలమొప్పం ద్రుంచుచందంబునన్. 419

మ. దితిజాధీశుని నీగతిం దునిమి యుద్వృత్తిం దదీయాంగశో
ణితపంకాంకితగండతుండుఁ డగుచు న్విష్ణుండు దా నొప్పె వి
స్తృతసంధ్యాంబుదధాతుచిత్రితసముద్దీప్తక్షమాభృద్గతిన్
క్షితి దంష్ట్రాగ్రమునన్ ధరించి జలరాశిం బాసి పై తేరఁగన్. 420

తే. బాలశీతాంశురేఖావిభాసమాన, ధవళదంష్ట్రాగ్రమున నున్నధరణి యొప్పె
హరికి నిత్యానపాయినియైనలక్ష్మి, నెరయఁ బూసినకస్తూరినికర మనఁగ. 421

శ్రీయజ్ఞవరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించుట.

వ. అట్టియజ్ఞపోత్రిమూర్తిం జూచి కమలాసనప్రముఖు లి ట్లని స్తుతియించిరి. 422

సీ. దేవ జితం జితం తే పరమేశ్వర, జితయజ్ఞభావనశ్రుతిశరీర
కారణసూకరాకారుండ వగునీకు, నతిభక్తి మ్రొక్కెద మయ్య వరద
భవదీయరోమకూపములందు లీనంబు, లై యుండు నంబుధు లట్టియధ్వ
రాత్మకమై తనరారునీరూపంబు, గానంగ రాదు దుష్కృతులకు

తే. నట్టినీకుఁ బ్రణామంబు లాచరింతు, మఖిలజగదేకకీర్తి దయానువర్తి
భవ్యచారిత్ర పంకజపత్త్రనేత్ర, చిరశుభాకార యిందిరాచిత్తచోర. 423

వ. అని వెండియు నిట్లు స్తుతియించిరి. 424

సీ. త్వక్కున నఖిలవేదములు రోమంబుల, యందు బర్హిస్సులు నక్షులందు
నాజ్యంబు పాదంబులందుఁ జాతుర్హోత్ర, కలితంబు లగుయజ్ఞకర్మములును
స్రుక్కు తుండంబున స్రువము నాసికను ని, డాపాత్ర ముదరకోటరమునందుఁ
[2]కర్ణరంధ్రంబుల గ్రహపాత్రచమసముల్, గళమునందు నుపసత్తులును జిహ్వఁ

1 'నగుచుఁ బూసినకస్తూరినిగమ మనఁగ' వ్రా. ప్ర.

2 ఇందులకు మూలము 'చమసాః కర్ణరన్ధ్రే। ప్రాశిత్ర మాస్యే గ్రసనే గ్రహాస్తుతే యచ్చ.

తే. దగుఁ బ్రవర్గ్యపాత్రయును దం♦తంబులందుఁ
బ్రాయణీ[1]యోదయనులు శి♦రమున సవన
రూపమునఁ బంచప్రాణముల్ ♦ రూఢి యగుచు
సభ్య మపసభ్యమును సగ్ని♦చయన మయ్యె. 425

వ. వెండియు ముఖంబువలనఁ బ్రాశిత్రారణ్యాగ్నిహోత్రహవిర్భక్షణంబులును నభివ్యక్తిదీక్షయు, రేతంబున సోమంబును, నవస్థానంబున సవనంబులును, ధాతువుల సప్తసంస్థలును, సంధుల సర్వయాగంబులు నై యొప్పుచుండు. 426

క. హవరూపివి హవనేతవు, హవభోక్తవు నిఖిలహవఫ♦లాధారుఁడవుఁ
హవరక్షకుఁడవు నగునీ, కవితథ మగునుతు లొనర్తు ♦ మయ్యా ముకుందా. 427

తే. సత్త్వగుణమున సద్భక్తి ♦సంభవించు, భక్తియుతముగఁ జిత్తంబు♦భవ్యమగును
హృదయపద్మంబునందుల ♦ నెలకొనఁబడిన, యట్టినీకు నమస్కార♦మయ్య వరద.

మ. అరవిందోదర తావకీనసితదం♦ష్ట్రాగ్రావలగ్నక్షమా
ధరనద్భినదాటవీయుతసమ♦స్తక్ష్మాతలం బొప్పె భా
సురకాసారబలావతీర్ణమదవ♦చ్ఛుండాలరాడ్దంతశే
ఖరసంసక్తసపత్రపంకజము రే♦ఖం బొల్పు దీపింపఁగన్. 429

వ. మఱియును. 430

మ. చతురామ్నాయవపుర్విశేషధర చం♦చత్సూకరాకార నీ
సితదంష్ట్రాగ్రవిలగ్న మైనధర రా♦జిల్లం గులాగేంద్ర రా

ర్వాణం తే భగవ న్నగ్నిహోత్రమ్ ॥ దీక్షానుజన్మోపసదశ్శిరోధరం త్వం ప్రాయణీయోదయనీయదంష్ట్రః । జిహ్వా ప్రవర్గ్య స్తవ శీర్షకం క్రతో స్సభ్యావసథ్యం చితయో௨సవో హి తే। సోమస్తు రేత స్సవనా న్యవస్థితిః సంస్థావిభేదా స్తవ దేహ ధాతవః। సర్వాణి సత్రాణి శరీరసంధయ స్త్వం సర్వయజ్ఞక్రతు రిష్టిబన్ధనః' దీనికిఁ బయి తెనుఁగు కొంత యందంద విరుద్ధముగాఁ గానిపించుటచే నచ్చుప్రతులందు

'శ్రవణాస్యబిలములఁ ♦ జమస ప్రాశిత్రముల్, గళమున నిష్టి♦కంబు జిహ్వఁ

తే. దగుఁ బ్రవర్గ్యము నగ్నిహో♦త్రములు నీకు, చర్వణంబున సభ్యాప♦సభ్యలుత్త
మాంగ మసువులు చయనము ♦ లగుఁ గిటీశ, యనుచు నుతియించి రత్తఱి ♦ యజ్ఞవిభుని.

వ. వెండియు ముహుర్ముహుర్భగవదావిర్భావం బుదీక్షణీయేష్టి యగునీదుదంష్ట్రలు ప్రాయణీయం బను దీక్షానంతరేష్టియు నుదయనీయం బనుసమాప్తేష్టియు యుష్మద్రేతంబు సోమంబును ద్వదీయావస్థానంబు ప్రాతస్సవనాదులు నీదుత్వఙ్మాంసాదిసప్తధాతువు లగ్నిష్టోమోక్థ్యషోడశీవాజపేయాతిరాత్రాప్తోర్యామంబు లనుసంస్థాభేదంబులును ద్వాదశాహాదిరూపంబు లైనబహుయాగసంఘాతరూపంబులు నగుసర్వసత్త్రంబులు భవదీయశరీరసంధులు ససోమాసోమంబు లగుయజ్ఞక్రతువులు నీవ మఱియును నీవు యజనబంధనంబులచే నొప్పుచుందు వదియునుం గాక' అని మూలమునకును శ్రీధరవ్యాఖ్యకును ననుగుణముగా నొకపాఠము గూర్పఁబడె నని తోఁచెడిని.

1 'ఉదయనీయ' మని శబ్దరూపము.

జితశృంగోపరిలగ్నమేఘముగతిం । జెల్వారె విద్వజ్జనాం
చితహృత్పల్వల[1]కోల భూరమణ లక్ష్మీనాథ దేవోత్తమా. 431

సీ. సమధికస్థావర । జంగమాత్మక మైన, వసుమతీచక్ర మవక్రలీల
నుద్ధరింపుము కరు।ణోపేతచిత్తుండ, వగుచు నస్మన్నాత । యయ్య ధరణి
[2]మాత యా వెట్లని । మదిఁ దలంచెద వేనిఁ, జర్చింప మాకు వి।శ్వమున కీవు
జనకుఁడ వగుట యు।ష్మత్పత్ని భూదేవి, యగుట మాకును దల్లి । యయ్య నిపుడు
తే. ధరకు నీతోడఁ గూడ వం।దన మొనర్తు, మరణియందునుయాజ్ఞికుఁ । డగ్నినిలుపు
కరణి మీ తేజ మీధరా।కాంతయందు, నిలుప ధరణి పవిత్రయై । నెగడెఁ గాన.

వ. అదియునుం గాక. 433

చ. తలఁప రసాతలాంతరగ।తక్షితిఁ గ్రమ్మఱ నిల్పినట్టినీ
కలితన మెన్న విస్మయము । గాదు సమస్తజగత్తు లోలి మైఁ
గలుగఁగఁ జేయు టద్భుతము । గాక మహోన్నతి నీ వొనర్చుపెం
పలరినకార్యముల్ నడప । నన్యులకుం దరమే రమేశ్వరా. 434

చ. సకలజగన్నియామకవి।చక్షణలీలఁ దనర్చునట్టినం
దకధర తావకస్ఫురదు।దారత మంత్రసమర్థుఁ డైనయా
జ్ఞికుఁ [3]డరణిన్ హుతాశనుని । నిల్పినకైవడి మన్నివాస మా
టకుఁ దలపోసి యీక్షితి దృ।ఢంబుగ నిల్పితి వయ్య మాధవా. 435

చ. సలలితవేదశాస్త్రమయ।సౌకరమూర్తిఁ దనర్చుచున్ రసా
తలమున నుండి వెల్వడును।దారత మేను విదుర్పఁ దత్సటో
చ్ఛలితశివాంబుబిందువుల । సాధుజనస్తపసత్యలోకవా
సుల మగుమేము దోఁగి పరి।శుద్ధి వహించితి మయ్య మాధవా. 436

ఉ. విశ్వభవస్థితిప్రళయ।వేళలయందు వికారసత్త్వమున్
విశ్వము నీవ యై నిఖిల।విశ్వము లోలి సృజింపు దిందిరా
ధీశ్వర యీశ కేశవ త్ర।యీమయ దివ్యశరీర దేవ నీ
శాశ్వతలీల లిట్టి వని । సన్నుతి సేయఁగ మాకు శక్యమే. 437

సీ. పంకజోదర నీ వ।పారకర్ముండవు, భవదీయకర్మముల్ । పార మెద్ది
నెఱిఁగెద నని మది । నిశ్చయించినవాఁడు, పరికింపఁగా మతి।భ్రష్టు గాక
విజ్ఞానిగా చూడ । విశ్వంబు నీయోగ, మాయాపయోనిధి।మగ్న మాటఁ
దెలిసియుఁ దమబుద్ధిఁ । దెలియనిమూఢుల, నే మన నఖిలలో।కేశ్వరేశ
తే. దాసజనకోటి కతిసౌఖ్య।దాయకములు, వితలకరుణాసుధాతరం।గితము లైన
నీకటాక్షేక్షణములచే । నెఱయ మమ్ముఁ, జూచి సుఖులను జేయవే । సుభగచరిత.

క. అని బ్రహ్మవాదు లగుస, న్మునివర్యులు భక్తియోగ।మున వినమితు లై

1 లోల - క్రోడ. 2 'మాతాట యె ట్లని' వ్రా. ప్ర. 3 'డరణందుఁ బావకుని' వ్రా. ప్ర.

మనమున మోదము ముప్పిరి, గొనఁ బొగడిరి ఖురవిదళితగోత్రిం బోత్రిన్.

ఉ. అంతట లీలవోలె జగదాత్ముఁడు యజ్ఞవరాహమూర్తి య
త్యంతగభీరభీషణమహార్ణవతోయచయంబులన్ ఖురా
క్రాంతముఁ జేసి క్రమ్మఱ ధరాతల మప్పులమీఁద నిల్పి వి
శ్రాంతి వహింపఁ జేసి గుణశాలి తిరోహితుఁ డయ్యె నయ్యెడన్. 440

ఉ. మంగళ మైనయీకథ సమంచితభక్తిఁ బఠింప విన్నవా
రిం గరుణార్ద్రదృష్టిఁ గని శ్రీహరి నాలఁ బ్రసన్నుఁ డౌను స
త్సంగతుఁ డైనవిష్ణుఁడు ప్రసన్నుఁడు దా నగునేని వారికిన్
మంగళముల్ లభించు ననుమానము లే దది గాక వెండియున్. 441

చ. హరి నిజదాసకోటికి గుహాశయుఁ డై రమియించు నట్టిస
త్పురుషుల కిష్టవస్తుపరిపూర్ణమనోరథసిద్ధి గల్గు సు
స్థిర మగు చున్నమోక్ష మఱచేతిది యై చెలు వారు నన్న న
స్థిరతరతుచ్ఛవస్తువులు సేకుఱుటల్ మఱి చెప్ప నేటికిన్. 442

ఉ. కాన సరోజలోచను జగత్స్తవనీయకథాసుధారసం
బానినయట్టిజిహ్వ యితరానుకథాలవణోదకంబులం
బానము సేయఁ జూచునె సురపర్వమహీజమరందపానశో
భానయశాలి యైనమధుపప్రభుఁ డేఁగునె వేఁపచెట్లకున్. 443

క. అని మైత్రేయమునీంద్రుం, డనఘుఁడు విదురునకుఁ జెప్పి నట్టితెఱం గ
ర్జునపౌత్రునకున్ వ్యాసుని,తనయుఁడు వినిపించి మఱియుఁ దగ నిట్లనియెన్.

క. అని చెప్పిన[1]మైత్రేయునిఁ, గనుఁగొని విదురుండు పల్కె ఘనతర మగునా
దనుజకులాంతకుచరితము, విని తనియదు నామనంబు విమలచరిత్రా. 445

చ. సవనవరాహమూర్తికథ సర్వము నీదయ వింటి వెండియున్
వివరముగా వినం బలుకవే గుణసాంద్ర మునీంద్రచంద్ర మా
ధవగుణకీర్తనామృతవితానముఁ గర్ణపుటాంజలిన్ వెసం
జవిఁ గొన కేల మాను జనసంతతికిన్ భవతాపవేదనల్. 446

వ. కావున. 447

సీ. శ్రీహరి యజ్ఞవరాహరూపముఁ దాల్చి, మించి హిరణ్యాక్షుఁ ద్రుంచె ననుచు
నప్పుడు మునినాథ చెప్పితి నాతోడ, నవ్వరాహంబు దంష్ట్రాగ్రమునను
ధరణి నెబ్భంగిని ధరియించె హరికి హి, రణ్యాక్షుతోడ వైరమున కేమి
కారణ మసుర నేగతి సంహరించెఁ దా, నింతయు నెఱిఁగింపు మిద్ధచరిత
తే. యనిన మైత్రేయముని విదురునకు ననియె, హరికథాకర్ణనమునఁ బెంపారునీకు

---

1 యమ్మైత్రే, యునిఁ గని విదురుండు పల్కె నుత్తమ మగు.

జన్మఫలసిద్ధియగుటకు సందియంబు, వలదు హరిమాయ విధికైన నవశమె తెలియ.

క. అనఘాత్మ నన్ను నీ వడి, గినయీకథ ధ్రువుఁడు విష్ణుకీర్తనపరతం
దనరిననారదు నడుగ న, తని కతఁ డెఱిఁగింప హరికథాశ్రవణమునన్. 449

క. దండధరుఁ బెల్చ డాకాలఁ దన్ని ధ్రువుఁడు, నిందు నందును వాసికి నెక్కె నట్టి
విష్ణుసంకీర్తనం బరవిందభవుఁడు, దివిజులకుఁ జెప్పె నది నీకుఁ దేటపఱుతు.

వ. ఆకర్ణింపుము. 451

మైత్రేయమహాముని విదురునకు హిరణ్యాక్షహిరణ్యకశిపులవృత్తాంతం బెఱింగించుట.

సీ. బలిసి దక్షప్రజాపతితనూభవ దితి, సంతానవాంఛితచింత వొడమ
నొకనాఁడు పుష్పసాయకశరనిర్భిన్న, భావ యై విరహతాపమున వచ్చి
పతిసమాగమవాంఛ ప్రభవింప నిజనాథు, సన్నిధి నిలిచి యస్ఖలితనియతి
నగ్నిజిహ్వుండును యజురధీశుండును, నగువిష్ణుఁ దనచిత్తమందు నిలిపి

తే. తగఁ బయస్సున నగ్నిహోత్రంబు సేసి
కమలహితుఁ డస్తశైలసంగతుఁడు గాఁగ
హోమశాలాంగణమునఁ గూర్చున్నవిభుని
గశ్యపునిఁ గాంచి విమలవాక్యముల ననియె. 452

చ. గజవిభుఁ డుద్ధతి న్ననఁటికంబములన్ విదళించులీలఁ జి
త్తజుఁడు ప్రసూనసాయకవితానముచేత మదీయచిత్తమున్
గజిబిజి సేసి పెన్వగలఁ గాఱియ వెట్టఁగ నాథ నీపదాం
బుజములఁ గాన వచ్చితిఁ బ్రభుత్వ మెలర్పఁగ నన్నుఁ గావవే. 453

వ. అదియునుం గాక నాతోడిసవతు లెల్లను భవత్కృపావిశేషంబున గర్భాధానంబులు వడసి నిర్భరానందంబున నుండం జూచి శోకవ్యాకులితచిత్త నై యున్న నన్ను రక్షించుట పరమధర్మంబు నీవు విద్వాంసుండవు నీయెఱుంగనియర్థంబు గలదే నీవంటిమహానుభావు లయినసత్పురుషు లార్తు లైనవారికోర్కులు వ్యర్థంబులు గా కుండఁ దీర్చుట ధర్మపథం బని వెండియు ని ట్లనియె. 454

క. పతిసమ్మానము వడసిన, సతులకు నభిమతఫలార్థసంసిద్ధియు నూ
ర్జితయశముఁ గలిగి లోక, స్తుత లై చెలువారుచుండుఁ జువ్వె మహాత్మా. 455

క. తనధర్మపత్నివలనను, మునుకొని తాఁ బుత్త్రరూపమున నుదయించున్
విను దీప మందు ముట్టిం, చినదీపము రెండు గావె శిఖ యొకఁ డయ్యున్. 456

క. కావున నీయర్థమ యా, [1]త్మా వై పుత్త్ర యని వేదతతులం దోలిన్
వావిరిఁ బలుకుట వినవే, ధీవర ననుఁ గావు మధికదీనం గరుణన్. 457

చ. వరకరుణామతి న్దుహితృవత్సలతం దనరారునట్టిమ
ద్గురుఁ డొకనాఁడు మమ్ముఁ దనకూఁతుల నందఱఁ బిల్చి మీమనో

---

1 ‘త్మా వై నామాసి పుత్ర యని వేదములన్’ వ్రా. ప్ర.

హరు నెఱిఁగింపుఁ డిత్తుఁ గమలాననలార యటన్న నందులోఁ
బురుషవరేణ్య యేము పదుమువ్వుర మర్థిలి నిన్ వరింపవే. 458

క. దితి యీగతిఁ గామవిమో, హితమతి బహువచనముల హృదీశునిఁ బలుకన్
ధృతిఁ గృపణురాలి నిజప్రియ, సతిఁ గని కశ్యపుఁడు వలికె సల్లాపమునన్.

వ. నీవు చెప్పినయట్ల పురుషులకు నంగనలవలన ధర్మార్థకామంబులు సిద్ధించుఁ గర్ణధారుండు నావచేతం బయోధిఁ గడచుచందంబున గృహమేధిసర్వాశ్రమవాసుల నరసి రక్షించుచు నిజాశ్రమంబున వ్యసనార్ణవంబుఁ దరియించు నట్లు సేయుపురుషునందుల నర్ధంబుభార్య భార్యయందు సకలగృహకార్యభారంబునుం జేర్చి పురుషుండు నిశ్చింతుండై సుఖయించుచుండు మఱియు నితరాశ్రమదుర్జయంబులైన యింద్రియశత్రువర్గంబుల భార్యాసమేతుండైన గృహస్థుండు దుర్గాధిపతి యైనరాజు శత్రుసంఘంబుల జయించుచందంబున లీలామాత్రంబునం జయించు నిట్టి నీకుం బ్రత్యుపకారంబు సేయ సకలగుణసంపన్ను లగుసత్పురుషులు నూఱేండ్లకును జన్మాంతరంబులకు నైన సమర్థులు గా రనిన మముబోఁటివారలు సేయ నోపుదురే యైన నీమనంబునం గలదుఃఖంబు దక్కు మని యిట్లనియె. 460

తే. తరళలోచన నీవు సంతానవాంఛఁ, జేసి వచ్చితి వేఁ గులశీలవర్త
నములుగలభార్యమనమున నమరుకోర్కెఁ, దవిలి తీర్చుటపతికిఁ గర్తవ్యమరయ.

మ. తరుణీ యొక్కముహూర్త ముండు మిది సంధ్యాకాల మిక్కాలమం
దరయన్ భూతగణావృతుం డగుచుఁ గామారాతి లీలన్ వృషే
శ్వరయానంబున సంచరించుట నభావ్యం బయ్యె నీయుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధకర్మ మగు నేలా ధర్మమున్ వీడఁగన్. 462

మ. అరవిందానన వీఁడె నీమఱఁది లీలాటోపరుద్రక్షమా
చరఝంఝానిలధూతపాంసుపటలచ్ఛన్నుండు ధూమ్రైకదు
ర్భరవిద్యోతవికీర్ణభీషణజటాబద్ధుండు భస్మావలి
ప్తరుచిస్ఫారసువర్ణవర్ణుఁడును నై భాసిల్లు నత్యుగ్రుఁడై. 463

క. అనలసుధాకరరవిలో, చనముల వికసింపఁ జేసి సమధికరోషం
బునఁ జూచుచున్నవాఁ డదె, వనితాబంధుత్వ మరయ వలవదు సుమ్మీ. 464

క. అతనికిఁ దలపోయ హితా, హితులును సమ్మాన్యులును విహీనులు నతిగ
ర్హితులును లేరీశుఁడు సమ, మతియును నిఖిలైకభూతమయుఁడై యుండున్.

క. కావున మద్భ్రాత భవ, ద్దేవరుఁ డని తరుణి నీమదిం జూడకు మా
దేవాదిదేవుఁ ద్రిజగ, త్పావను నిఖిలైకనేత భగవంతు హరున్. 466

వ. ఏమును సత్పురుషులైనవిద్వాంసులును భుక్తభోగంబై దూరతోన్యస్తంబైన పుష్పమాలికయునుం బోలె నమ్మహాత్మునిచరణారవిందవందనాభిలాషిణి యైనయవిద్యాదేవి ననుసరించి వర్తింతు మదియునుం గాక. 467

సీ. ఎవ్వనికరుణ బ్రహ్మేంద్రాదిదిక్పాల, వరు లాత్తపదవైభవములఁ దనరి
రెవ్వనియాజ్ఞ వహించి వర్తించును, విశ్వనేత్ర యగునవిద్య యెపుడు
నెవ్వనిమహిమంబు లిట్టి వట్టివి యని, తర్కింప లేవు వేదంబు లయిన
నెవ్వని సేవింతు రెల్లవారును సమా, నాధికరహితుఁ డై యలరు నెవ్వఁ
తే. డట్టిదేవునిఁ ద్రిపురసంహారకరుని, నస్థిమాలాధరుండు భిక్షాశనుండు
భూతిలిప్తాంగుఁ డుగ్రప్రేతభూమి, వాసుఁ డనియు హసించెదురు వారు మఱియు.
క. ధర శునకభోగ్యమును నిహ, పరదూరము నైనతను నుపాదేయముగా
నెఱి నమ్మి వస్త్రమాల్యా, భరణంబు లలంకరించు పామరజనులున్. 469
క. ఘననిర్భాగ్యులుగా మదిఁ, గను మని యీరీతిఁ బ్రియకుఁ గశ్యపుఁ డెఱిఁగిం
చిన దితి గ్రమ్మఱఁ బలికెను, మనసిజసాయకవిభిన్నమానస యగుచున్. 470
క. మునుకొని లజ్జావనతవ, దన యై ప్రాణేశుకొంగుఁ దాలిమి దూలం
బెనఁగొనియె వారకామిని, యనువున వినిషిద్ధకర్మం బభిముఖి యై. 471
వ. ఇట్లు సేసినభార్యానిర్బంధంబునకుం దొలంగ నేరక యీశ్వరనమస్కారం బొనరించి యేకాంతంబున నిజకాంతాసంగమంబు దీర్చి సంగమానంతరంబున వార్చి స్నాతుం డై ప్రాణాయామంబును జేసి విరజంబును సనాతనంబును నైన బ్రహ్మగాయత్రి జపియించె నంత. 472
క. దితియును నిషిద్ధకర్మ, స్థితికై మదిలోన సిగ్గు చిట్టాడఁగ నా
నతవదన యగుచు నాపశు, పతివలనిభయంబు గల్గి పరమప్రీతిన్. 473
వ. కశ్యపుం గనుంగొని యిట్లనియె సమస్తభూతపతి యైనపరమేశ్వరుండు నాచేసిన యపరాధంబు సహించి మద్గర్భపరిపాలనంబు సేయుంగాక రుద్రుండును మహాత్ముండును స్వయంప్రకాశుండును నలంఘ్యుండును సకామజనఫలప్రాపకుండును నిష్కామజనమోక్షప్రదుండును న్యస్తదండుండును ధృతదండుండును దుష్టశిక్షకుండును బరమాత్ముండును జగదంతర్యామియు నిర్గుణుండును నిష్కాముండును భక్తసులభుండును భగవంతుండును నగునప్పరమేశ్వరునకు నమస్కరించెద మఱియు షడ్గుణైశ్వర్యసంపన్నుండును జగద్భర్తయు మహానుగ్రహశీలుండును నిర్దయపరిపాల్యవధూరక్షకుండును సతీదేవీపతియు నైనయాసర్వేశ్వరుండు నన్ను రక్షించుం గాత మని సన్నుతించి. 474
క. అర్భకులు లేని దగుటను, గర్భము నిజనాథువలనఁ గమలానన కా
విర్భూత మైనఁ గర్తవి, నిర్భరపరితోష మాత్త నెలకొన నుండెన్. 475
వ. అంతఁ గశ్యపుండు దత్కాలసముచితసంధ్యావందనంబులు దీర్చి. 476
క. ఆచెలువగర్భచిహ్నము, లేచినఁ బరితోష మాత్త నేపారక మా
రీచి తగ నిజతలోదరిఁ, జూచి యకర్తమున కాత్త స్రుక్కుచుఁ బలికెన్. 477

1 ఈవచనము వ్రాఁతప్రతులం గనుపట్టదు.

మ. సతి నీ వేగతి నింద కోడక మనోజాతేక్షుకోదండని
ర్గతనారాచపరంపరాహతవిశీర్ణస్వాంత వై పాపసం
గతి లజ్జాభయధర్మముల్ విడిచి దుష్కాలంబు నాతో రమిం
చితి బల్మిన్ వెలయాలికై వడిని దుశ్శీలక్రియాలోలతన్. 478

వ. అట్లగుటం జేసి. 479

[1]క. సతి విను భూతగణప్రే, రితు లై రుద్రానుచరులు ప్రకృష్టశక్తిసమ
న్వితు లుగ్రకర్ము లతిశౌ, ర్యతములు భద్రానుభద్రు లనునామములన్. 480

క. పరఁగినదర్పోద్ధతు లిద్దఱు గొడుకులు నీకుఁ బుట్టి ధరణికి వేఁగై
నిరతము బుధజనపీడా, పరులై వర్తింతు రాత్తబలగర్వమునన్. 481

తే. అట్టిదుష్టాత్ములకును మహాత్ము లలిగి, విశ్వవిదుఁడైనహరికిని విన్నవింప
నతఁడు కోపించి హరి కులిశాయుధమున,గిరుల నఱికినగతి వారి ధరణిఁగూల్చు.

క. అని కశ్యపుఁ డెఱిఁగించిన, విని దితి భయ మంది చాల విహ్వలమతి యై
తనహృదయేశముఖాబ్జముఁ, గనుఁగొని యిట్లనియె విగతకౌతుక యగుచున్.

చ. ధర సుజనాపరాధు లగుతామసచిత్తుల కెందు నాయువున్
సిరియు నశించి పోవు మృతి సేకుఱు శత్రులచేత నింత యూ
నరయఁగ నిక్కువంబు భవదాత్మజు లార్యుల కెగ్గు [2]సేసినం
గరుణను వారు వారి మదిఁ గైకొని కావ ననుగ్రహింపరే. 484

చ. అనవుడుఁ గశ్యపుండు కమలానన కిట్లను నింతి నీవు చే
సినవిపరీత[3]కర్మమునఁ జేకుఱె నిట్టియవస్థ దీనికిన్
మనమునఁ దాప మొందుటను మాధవుపాదసరోజయుగ్మచిం
తనమునఁ జేసియున్ నను ముదంబునఁ గొల్చుటఁ జేసియుం దగన్. 485

తే. రమణి నీసుతులలో హిరణ్యకశిపు,వలన నుదయించువారిలోపల ముకుంద
పదసరోజాతవిన్యస్తభావుఁ డైన,తనయుఁ డుదయింపఁ గలఁ డతిధార్మికుండు.

వ. మఱియును. 487

క. ఘనపుణ్యుం డన్వయపా, వనుఁ డగుసత్పుణ్యతమునివరకీర్తులతల్
వనజభవాండోదర మెల్లను నిండఁగఁ బర్వ బుధలలాముం డగుటన్. 488

తే. వామలోచన వినుము దుర్వర్ణహేమ, మగ్ని[4]పుటమునఁ బరిశుద్ధ మై వెలుంగు
నట్లు దుష్టాత్మసంభవుఁ డయ్యు వంశ, పావనుం డగు హరిపాదభక్తుఁ డగుట.

తే. అంచితాష్టాంగయోగక్రియాకలాపు, లైనయోగీశ్వరులు నమ్మహానుభావు
నతులశీలస్వభావవిజ్ఞానసరణిఁ, దాముఁ జరియింప నాత్మలఁ దలఁతు రెపుడు.

ఉ. ఆమహితాత్మకుండు సుగుణాంబుధి భాగవతోత్తముండు ల

1 ఈపద్యము వ్రాఁతప్రతులం జూపట్టెడి. 2 'సేయుభూ, సురులద్రుదగ్నిపాల్పడక క్రోధన మా హరిచేతిపంచతన్' అ. ప్ర. 3 ధర్మమునఁ. 4 ముఖమునఁ.

క్ష్మామహిళాధినాథుఁ దులసీదళదాముఁ బరేశు నాత్మహృ
త్తామరసంబునందుఁ బ్రమదంబున నిల్పి తదన్యవస్తువుం
దా మదిలో హసించు హరిదాస్యవిహారవినిశ్చితాత్ముఁ డై. 491

వ. అట్టినీపౌత్రుండు. 492

సీ. మహితదేహాద్యభిమానంబు దిగనాడి, చిరతరాలంపటశీలుఁ డగుచుఁ
బరసమృద్ధికి నాత్మఁ బరితోష మందుచు, బరదుఃఖమునకుఁ దాపమునఁ బొందు
నీవిశ్వ మంతయు నేవిభుమయ మని, యెవ్వనికరుణచే నెఱుఁగ నయ్యె
నట్టియీశ్వరునకు నాత్మసాక్షికి మోద, మడరంగఁ జూచు నన్యదృష్టి
తే. నతినిదాఘోగ్రసమయంబునందునిఖల, జంతుసంతాపమడఁగించు చంద్రుమాడ్కి
నఖిలజగములదుఃఖంబు లపనయించు, రూఢి నాతఁ డజాతవిరోధి యగుచు.

1వ. మఱియు హరిధ్యాననిష్ఠాగరిష్ఠుం డగునమ్మహాభాగవతాగ్రగణ్యుండు. 494

క. హిమలాంతరంగబహిరం, గములను స్వేచ్ఛానురూపకలితుం డగునా
కమలాధీశ్వరుకుండల, రమణీయముఖంబుఁ జూచుఁ బ్రమదం బెసఁగన్. 495

తే. మఱియునీవిశ్వ మాహరిమయముగాఁగ, మనములోఁ బలఁదలఁచునమ్మనునిభుండు
మనుమహాత్ములలోన నీమనుమఁ డధికుఁ, డనఁగ నుతికెక్కనంచుఁ గశ్యపుఁడు వలుక.

క. విని తనతనయులు మధుసూ, దనుచే హతు లగుదు రనుచుఁ దనమనుమఁడు స
జ్జననుతభాగవతుం డగు, ననుచు మదిం జాల దుఃఖహర్షము లొందవన్. 497

వ. ఉండునంత నా దితియుఁ గశ్యపవీర్యసంభృతం బైనగర్భంబు దుర్భరతేజోభిరామంబును నన్యతేజోవిరామంబును దినదినప్రవర్ధమానంబును నై నివ్వటిల్ల నిజోదరస్థితు లైనకుమారు లమరదమను లై వర్తింపఁగల రని చింతించుచు గర్భంబు శతవర్షంబులు ధరియించి యున్నయనంతరంబ. 498

ఉ. ఆదితిగర్భమందు రుచిరాకృతితో నొకతేజ మన్యతే
జోదమలీల వెల్వడి వసుంధరయుం గగనంబు నిండి సం
ఛాదితపద్మబాంధవనిశాకరదీప్తులు గల్గి సూచికా
భేదమహోగ్రసంతమసభీషణ మైన భయాకులాత్ము లై. 499

చ. అమరగణంబు లెల్లఁ గమలాసనుపాలికి నేఁగి తత్పదా
బ్జములకు మ్రొక్కి యంజలులు ఫాలములం గదియంగఁ జేర్చి చి
త్తముల భయంబు సంభ్రమముఁ దార్కొన ని ట్లని విన్నవించి రో
యమరకులాగ్రగణ్య దురితార్ణవతారణ సృష్టికారణా. 500

ఉ. నీవు చరాచరప్రచయనేతవు ధాతవు సర్వలోకపా
లావళిమౌళిభూషణుఁడ వంచితమూర్తివి దేవదేవ వా
ణీవర యీయజాండమున నీవు నెఱుంగనియర్థ మున్నదే

1 ఈవచనము వ్రాఁతప్రతులఁ గనుపట్టదు.

భావమునం దలంపుము వి(పన్నుల ముమ్ము భవత్ప్రపన్నులన్. 501

వ. దేవా [1]కార్యరూపం బగుచేతనాచేతనాత్మకప్రపంచంబునకుఁ గారణుండ వైన నీచేత సమస్తభువనంబులును సృజియింపంబడియె నీవు సర్వభూతాత్మభావవిదుండవు లోకనాథశిఖామణిభూతుండవు విజ్ఞానవీర్యుండ వవిద్యం జేసి యిట్టిస్రష్టరూపంబు నొందితి గృహీతరజోగుణుండవు నీయందుఁ బ్రపంచంబు లీనం బై యుండు సుపక్వయోగంబు నొంది నిష్కాము లై ధ్యానంబున నిన్నరయుచు నిర్జితశ్వాసేంద్రియాత్ము లై భవత్ప్రసాదంబు వడసినవారలకుం బరాభవంబు లెక్కడి వెవ్వని[2]వాక్పాశబద్ధు లై పశువులచందంబున నిఖిలజీవులు వర్తింతు రట్టినీకు నమస్కరింతు (మహోరాత్రవిభాగాభావంబున లుప్తకర్మంబు లగు) లోకంబులకు సేమంబు గావింపుము శరణాగతుల మైనమమ్ముఁ గరుణాకటాక్షంబుల నీక్షించి రక్షింపుము కశ్యపువీర్యంబు దితిగర్భంబుననుండి సకలదిగ్వలయంబు నాక్రమించి దారువందులహుతాశనుచందంబున (లీనం బై) ప్రవృద్ధం బగుచున్న దని విన్నవించినబృందారకసందోహంబులకు నానందకందళితంబుగా నరవిందనందనుం డి ట్లనియె. 502

సనకసనందనాదులు వైకుంఠమున కరుగుట.

క. గీర్వాణులార యుష్మ, త్పూర్వజు లాత్మీయసుతులు పుణ్యులు విచర
న్నిర్వాణులు సనకాదులు, సర్వంకషశేముషీవిశేషులు లెందున్. 503

క. వారలు నిస్స్పృహు లగుచు న,వారణ భువనంబు లెల్ల వడిఁ గ్రుమ్మరుచున్
ధీరు లొకనాఁడు భక్తిన్, శ్రీరమణీశ్వరపదాబ్జసేవానిరతిన్. 504

చ. చని చని కాంచి రంత బుధసత్తము లంచితనిత్యదివ్యశో
భనవిభవాభిరామముఁ బ్రపన్నజనస్తవనీయనామమున్
జననవిరామ మార్యజనసన్నుతభూమము భక్తలోకపా
లనగుణధామముం బురలలామముఁ జారువికుంఠధామమున్. 505

ఉ. ఆమహనీయపట్టణమునందుల నుండెడువార లాత్మని
ష్కామఫలంబు సత్ఫలముగాఁ దలపోసి ముముక్షుధర్ము లై
శ్రీమహిళాధిపాంఘ్రిసరసీరుహపూజ లొనర్చుచున్ మహో
ద్దామతదీయరూపములఁ దాల్చి సుఖించుచు నుందు రెప్పుడున్. 506

చ. విగతరజస్తమోగుణుఁడు విశ్రుతచారుయశుండు శుద్ధస
త్త్వగుణుఁ డజుం డనాది భగవంతుఁ డనంతుఁ డనంతశక్తియున్

---

1 'కార్యకారణరూపంబును జేతనాచేతన ప్రపంచకారణంబును నైనసమస్తభువనంబులు నీచేతం గ్రుచ్చంబడిన వనియు నీవు సర్వభూతాత్మభావుండ వనియు సుపక్వయోగంబునొంది నిష్కాము లైనవారు ధ్యానంబున నరయుదురు నిర్జితేంద్రియాత్ము లై' వ్రా. ప్ర. 2 'వాగ్జాలంబుచేఁ బాశబద్ధంబు లైనపశువుల' అ. ప్ర.

నిగమచయాంతవేద్యుఁడు వికారనిశ్చలనిర్మలధర్మమూర్తియు
న్నగుహరిపేరఁ బెం పెసఁగు నన్నగరోపవనమ్ము లిమ్ములన్. 507

వ. మఱియుఁ గైవల్యశబ్దంబు మూర్తీభవించిన తెఱంగునం బొలుపారుచు నైశ్శ్రేయసనామంబున నభిరామంబై సతతంబును సకలర్తుధర్మంబులు గలిగి యర్థిజనంబులమనంబుల ఘనంబులుగ నీరిక లెత్తినకోరికలు సారికలు గొన నొసంగుచు నితరతరురహితంబులును గామదోహనసహితంబులును బుష్పఫలభరితంబులును నై తనర్చుసంతానవనసంతానంబులు సమంచితవసంతసమయసౌభాగ్యసంపదభిశోభితవాసంతికాకుసుమవిసరపరిమళమిళితగళితమకరందలలితామోదముదితహృదయు లై యఖండతేజోనిధి యగుపుండరీకాక్షుచరిత్రంబు లుగ్గడింప లేక ఖండితజ్ఞాను లయ్యును నిరతిశయవిషయసుఖానుభవకారణం బగుట నిందిరాసుందరీరమణచరణసేవావిరమణకారి యై యున్న దని తలంచి తద్గంధప్రాపకగంధవహునిం దిరస్కరించి నారాయణభజనపరాయణు లై చరియించుసుందరీయుక్తవైమానికులును వైమానికమానసోత్సేకంబునుం బారావత హంస సారస శుక పిక చాతక తిత్తిరి మయూర రథాంగముఖ్యవిహంగకోలాహలవిరామంబునుం గా నరవిందనయనకథాగానంబు లనూనంబులుగా మొరయ మదవదిందిందిరసందోహకలితపుష్పవల్లీమతల్లికలును నకుంఠితచరిత్రుం డై నవికుంఠనిలయునికంఠంబునం దేజరిల్లువిలసితతులసీదామంబుం గనుంగొని యీతులసీదామంబు హరిమంగళగళవిలగ్నం బై యుండుసౌభాగ్యంబు వడయుట కేమితపంబు గావించెనో యని బహూకరించుచందంబున నొప్పుచందనమందారకుందారవిందపున్నాగనాగవకుళాశోకకురవకోత్పలపారిజాతాదిప్రసూనమంజరులును మంజరీపుంజరంజితనికుంజంబులయందు నుత్తుంగపీనకుచభారాకంపితమధ్యంబులుఁ గటితటఘటితకనకమేఖలాకలాపనినదోపలాలితనీలదుకూలశోభిత పృథునితంబభారాలసయానహసితకలహంసమయూరగమనంబులు నసమశరకుసుమశరవిలసితంబు నపహసించునయనకమలంబులుం గలిగినసుందరీసందోహంబులం దగిలి కందర్పకేళీవిహారంబుల నానందంబు నొందక ముకుందచరణారవిందసేవాపరిలబ్ధమరకతవైడూర్యహేమమయవిమానారూఢు లై హరిదాసులు విహరించుపుణ్యప్రదేశంబులును నిందిరాసుందరి త్రైలోక్యసౌందర్యఖని యైనమనోహరమూర్తి ధరియించి రమణీయరణితమణినూపురచరణారవింద యై నిజహృదయేశ్వరుం డైన సర్వేశ్వరునిమందిరంబునం జాంచల్యదోషరాహిత్యంబుగ వర్తింపం గరకమల[1]భ్రమణీకృతలీలాంబుజాత యై తననీడ కాంచనస్ఫటికమయకుడ్యప్రదేశంబులం బ్రతిఫలింప శ్రీనికేతనునినికేతనసమ్మార్జనకైంకర్యంబ పరమధర్మం బని తెలుపు చందంబునం జూపట్టుచు నిజవనంబునం దనరుసౌరభాభిరామంబు లగుతులసీదళ

1 భ్రమరీకృత.

దామంబుల నాత్మనాయకునిచరణారవిందంబుల నర్పించుచు నొసలిమృగమదపు
టసలున మసలుకొని 1తుంపెసలుగునియుకురులనులలితతిలప్రసూనరుచిరాభనాసం
దనరుమోముఁదామర విమలసలిలంబులఁ బ్రతిబింబింప నిజమనోనాయకుచేతం
జుంబితం బగుట గాఁ దలంచి లజ్జావనతవదనలై యుండం జేయుప్రవాళలతికాకు
లంబులైనకూలంబులు గలనడబావులును గలిగి పుణ్యంబునకు శరణ్యంబును
ధర్మంబునకు నిర్మలస్థానంబును సుకృతమూలంబునకు నాలవాలంబును నయి
పోలు పొందుచుండు. 508

చ. హరివిముఖాత్ము లన్యవిషయస్పృహచిత్తులుఁ బాపవర్తులు
న్నిరయనిపాతహేతువును నింద్యచరిత్రము నైనదుష్కథా
నిరతిఁ జరించువారలును నేరరు పొందఁగ నిందిరామనో
హరచరణారవిందభజనాత్మకు లుండెడుగొంది నారయన్. 509

వ. వెండియు. 510

చ. హరిఁ బరమేశుఁ గేశవు ననంతు భజింపఁగ ధర్మతత్త్వధీ
పరిణతిసాధనం బగుస్వభావముఁ దాల్చినయట్టిమర్త్యులా
సరసిజనేత్రుమాయను భృశంబుగ మోహితులై తదంఘ్రిపం
కరుహము లర్థిమైఁ గొలువఁ గానమిఁ బొందరు తత్పదంబునన్. 511

చ. మఱియు సరోరుహోదరునిమంగళదివ్యకథానులాపని
ర్భరపరితోషబాష్పకణబంధురచారుకపోలగద్గద
స్వరపులకీకృతాంగు లగువారలు నిస్పృహచిత్తులు న్నహం
కరణవిదూరులు న్నగుసుకర్ములయుండెడిపుణ్యవాసముల్. 512

వ. అందు. 513

మ. వరవైకుంఠము సారసాకరము దివ్యస్వర్ణశాలాంకగో
పురహర్మ్యావృతమైనతద్భవన మంభోజంబు దన్మందిరాం
తరవిభ్రాజితభోగి కర్ణిక తదుద్యద్భోగపర్యంకమం
దిర వొందన్ వసియించుమాధవుఁడు దా నేపారు భృంగాకృతిన్. 514

వ. అంత. 515

మ. హరిచేఁ బాలితమైనకాంచనవిమానారూఢమైనట్టిస
త్పురుషానీకముచేఁ దనర్చి విభవాపూర్ణప్రభావోన్నతిం
గర మొప్పారుతదీయధామము జగత్కల్యాణమూర్తుల్ మునీ
శ్వరు లర్థిన్ నిజయోగశక్తిఁ బరితుష్టస్వాంతులై చెచ్చెరన్. 516

వ. డాయం జని. 517

చ. మరకతరత్నతోరణసమంచితకుడ్యకవాటగేహళీ

---

1 తుంపెసలాడుకురులను.

విరచితకక్ష్యాషట్క మరవిందదళాక్షవిలోకనోత్సవా
దరమతి నవ్యముం గనక దాఁటి యనంతరకక్ష్యయందు ని
ద్దఱను దదీయపాలుర నుదారసమానవయోవిశేషులన్. 518

సీ. కాంచననవరత్నకటకాంగుళీయక, హారకేయూరమంజీరధరులఁ
గమనీయసౌరభాగతమత్తమధుకర, కలితసద్వనమాలికావిరాజి
తోరస్థ్సలుల గదాధారుల ఘనచతు, ర్బాహుల నున్నతోత్సాహమతుల
నారూఢరోషానలారుణితాక్షుల, భ్రూలతాకౌటిల్యఫాలతలుల

తే. వేత్రదండాభిరాముల వెలయునమ్ము
కుందశుద్ధాంతమందిరాళిందభూమి
నున్నయిద్దఱ సనకాదియోగివరులు
సూచుచును వృద్ధు లయ్యు నాసుభగమతులు. 519

క. ధీరతఁ బంచాబ్దములకు, మారకులై కానఁబడుచు మనమున శంకం
గూరక చతురాత్మకు లని, వారితగమనముల డాయవచ్చిన నెదురన్. 520

క. శ్రీలలనేశ్వరదర్శన, లాలసులై యేఁగుబుధలలాముల నతిదు
శ్శీలతఁ దద్వచనప్రతి, కూలమతిం బోవ కుండఁ గుటిలాత్మకులై. 521

క. వారించిన వారలు బ్రం, దారకు లీక్షించు చుండ దారుణపటురో
షారుణితాంబకులై రొద, వారించుచు వారు నచటివారును వినఁగన్. 522

వ. ఇట్లనిరి. 523

చ. పరము ననంతు భక్తపరిపాలు [1]సుహృత్తము నిష్టు నీశ్వరే
శ్వరు భజియింపఁ గోరి యనివారణ నిద్దఱు నేఁగి నిచ్చలుఁ
భరితముదాత్ములై కొలువఁ బాయక తద్భజనాంతరాయత
త్పరమతి మాకు నిప్పు డరిపడ్డదురాత్ముల నేఁడు గంటిరే. 524

వ. అని మఱియు సనకసనందనాదులు జయవిజయులం జూచి యిట్లనిరి మీమనంబుల స్వామిహితార్థంబై నిష్కపటవర్తనుల మైనమాబోఁటులఁ గుహకవృత్తి గలయితరజనంబులు భగవత్సదనంబుఁ బ్రవేశింతురో యను శంకం జేసి కొందఱం బ్రవేశింపం జేయుటయుఁ గొందఱ వారించుటయు దౌవారికస్వభావం బని వారింపం దలంచితిరేనిఁ బ్రశాంతదివ్యమంగళవిగ్రహుండును గతవిగ్రహుండును భగవంతుండును విశ్వగర్భుండును నైనయీశ్వరుండు ప్రాప్యంబును బ్రాపకంబును బ్రాప్తయు ననుభేదశూన్యుండుగావున మహాకాశంబునందు ఘటపటాద్యాకాశంబులు వేఱులేక యేకంబై తోఁచుచందంబున విద్వాంసు లగువారమ్మహాత్ముని సకలాత్మభేదరహితునింగాఁ బొడగందు రదియునుం గాక లోకంబునందులరాజులు సాప

1 సుహృత్తు ననీశు నీశ్వ.

రాధు లయినకింకరజనంబుల నాజ్ఞాపించుచందంబున నీశ్వరుండు దండించునో
యనుభయంబునం జేసి వారించితి మని తలంచితి రేని భూసురవేషధారుల మైన
మాకును వైకుంఠనాయకుం డైన సర్వేశ్వరునకును భేదంబు లేకుండుటం జేసి
శంక సేయం బని లే దిట్లగుట యెఱింగి మందబుద్ధుల రై మమ్ము వారించినయ
నుచితకర్ము లగుమీరలు మదీయశాపార్హు లగుదురు గావున భూలోకంబున లో
భమోహంబు లనుశత్రువులు బాధింపం బుట్టుం డని పలికిన. 525

క. వారలు విని తమమనముల, భూరిస్ఫుటచండకాండపూగంబులచే
వారింప రానిభూసుర, దారుణవాక్యముల కులికి తల్లడపడుచున్. 526

క. పరితాపంబును బొందుచు, సరసిజలోచనునిభటులు సనకాదిమునీ
శ్వరులపదాంబుజములకుం, గర మర్థిఁ మ్రొక్కి నిటలఘటితాంజలు లై. 527

వ. ఇట్లనిరి. 528

మ. వరయోగీశ్వరులార మమ్ము మది నొవ్వ న్నిట్లు మీ రన్నని
ష్ఠురవాక్యంబుల కింక మామనముల౯ శోకింపఁగా రాదు స
త్పురుషశ్రేణిఁ బరాభవించినవృథాభూతాత్ముల౯ మమ్ము మా
దురితం బెంతకుఁ దెచ్చె మీఁద శుభముం దూకొందుమే మారయన్. 529

వ. అని యెట్లంటి రేని. 530

ఉ. మీకరుణావలోకనసమేతులఁ గా మముఁ జేయఁ జిత్తముల్
దూకొనె నేని మా చనవుఁ ద్రోయక యీఁ దగు లోభమోహముల్
గైకొని పుట్టుచోట నవకంజదళాక్షునినామవిస్మృతిం
బైకొనకుండ దాననె శుభం బగు మీఁది మదీయజన్మముల్. 531

వ. అనుసమయంబున. 532

మ. హరి సర్వేశుఁ డనంతుఁ డాకలకలం బాలించి పద్మాలయా
సరసాలాపవినోదసౌఖ్యరచనల్ సాలించి శుద్ధాంతమం
దిరమాణిక్య[1]కవాటముల్ గడచి యేతెంచెం బ్రపన్నార్తిసం
హారుఁ డై నిత్యవిభూతిశోభనకరుం డై మానితాకారుఁ డై. 533

వ. మఱియును. 534

చ. శరనిధికన్యకామణియు సంభ్రమ మొప్పఁగఁ దోడ రా మనో
హరనిజలీలమైఁ బరమహంస[2]మునీంద్రగవేషపాదపం
కరుహముల౯ వినూత్నమణికాంచననూపురమంజుఘోషముల్
వరుసఁ జెలంగ నార్యజనవంద్యుఁడు యోగిజనైకసేవ్యుఁ డై. 535

చ. కరమణిహేమకంకణనికాయఝణంకృతు లుల్లసిల్ల న
చ్చర లిడుహంసపక్షసితచామరగంధవహోచ్ఛలత్సుధా

---

1 ముగేహాళుల్. 2 'మునీశ్వరవంద్యపాద' అ. ప్ర.

కరరుచిరాతపత్రసుభగప్రవిలంబితహారవల్లరీ
సరసగళత్తుషారకణజాలవిరాజితమంగళాంగుఁడై. 536

వ. మఱియును. 537

సీ. నిఖిలమునీంద్రవర్ణితసస్మితప్రస,న్నాననాంబుజముచే నలరువాఁడు
విశ్రుతస్నేహార్ద్రవీక్షణనిజభక్త,జనగుహాశయుఁ డనఁ దనరువాఁడు
మానితశ్యామాయమానవక్షమున నం,చితవైజయంతి రాజిల్లువాఁడు
నతజనావనకృపామృతతరంగితములై, భాసిల్లులోచనాబ్జములవాఁడు

తే. నఖిలయోగీంద్రజనసేవ్యుఁ డైనవాఁడు
సాధుజనముల రక్షింపఁ జాలువాఁడు
భువనచూడావిభూషణభూరిమహిమ
మించువైకుంఠపురము భూషించువాఁడు. 538

సీ. కటివిరాజితపీతకౌశేయశాటితో, వితతకాంచీగుణద్యుతి నటింప
నాలంబికంఠహారావళిప్రభలతోఁ, గౌస్తుభరోచులు గ్రందుకొనఁగ
నిజకాంతిజితతటిద్ద్విజకర్ణకుండల,రుచులు గండద్యుతుల్ ప్రోదిసేయ
మహనీయనవరత్నమయకిరీటప్రభా,నిచయంబు దిక్కుల నిండఁ బర్వ

తే. వైనతేయాంసవిన్యస్తవామహస్త,కలితకేయూరవలయకంకణము లొప్ప
నన్యకరతలభ్రమణీకృతానుమోద,సుందరాకారలీలారవింద మమర. 539

వ. మఱియుఁ జరణారవిందమంజుకింజల్కపుంజప్రభారంజితతులసీమరందబంధురగంధానుబంధసుగంధిగంధవహాస్వాదకలితసేవాతత్పరులై చనుదెంచుయోగీంద్రులకు మానసానందకారియు బహిఃకరణాంతఃకరణపరితోషప్రకీర్ణరోమాంచరుచిదాయకంబును బ్రభాపూర్తియుక్తంబును నగుమూర్తితోడ నిజసౌందర్యవరకళావినిర్జితశ్రీరమణీసౌందర్యభాసమానుం డగుచుఁ బాదచారి యై యఖిలవిశ్వగురుం డైన సర్వేశ్వరుండు వేంచేసె నప్పుడు. 540

చ. స్థిరశుభలీల నట్లు నగుదెంచినయవ్విభువిద్రుమారుణా
ధరనవపల్లవస్ఫురదుదంచితకుందరుచిస్మితైకసుం
దరవదనారవిందము ముదంబునఁ దప్పక చూచి యమ్మునీ
శ్వరులు నిజాత్మలం దనివి సాలక వెండియుఁ జూచి రిమ్ములన్. 541

చ. సునిశితభక్తిఁ దన్ముఖముఁ జూచినచూడ్కులు ద్రిప్పలేకయుం
గనుఁగొని రెట్టకేలకు నకల్మషభక్తవిఘాతభేదముల్
మునిజనచిత్తమోదములు ముక్తినివాసకవాటభేదముల్
వినుతవినూత్నసూనపూరితవేదము లమ్మహనీయపాదముల్. 542

చ. కని నఖపద్మరాగమణికాంతివిభాసితపాదపద్మము
ల్మనములయందుఁ గీల్కొలిపి లబ్ధమనోరథయుక్తులై పునః

పునరభివందనంబులు విభూతి దలిర్ప నొనర్చి యోగమా
ర్గనిరతచిత్తులున్ వెదకి కానఁగ లేనిమహానుభావునిన్. 543

క. మానసమున నిలిపిరి త, ద్ధ్యానాస్పదుఁ డైనవానిఁ దత్త్వజ్ఞులకుం
గాన నగువాని భక్తజ, నానందకరైకమూర్తి నలరినవానిన్. 544

వ. మఱియుం జక్షురింద్రియగ్రాహ్యం బగుదివ్యమంగళవిగ్రహంబు ధరియించి యున్నపురుషోత్తము నుదాత్తతేజోనిధిం జూచి సనకాదు లిట్లని స్తుతియించిరి.

సనకాదులు నారాయణదేవుని స్తుతియించుట.

చ. వనజదళాక్ష భక్తజనవత్సల దేవ భవత్సుతుండు మ
జ్జనకుఁడు నైనపంకరుహజాతుఁడు మాకు రహస్య మొప్పఁ జె
ప్పినభవదీయమంగళగభీరపరిగ్రహవిగ్రహంబు నే
మనయముఁ జూడఁ గంటిమి కృతార్థుల మైతగ మంటి మీశ్వరా. 546

సీ. దేవ దుర్జనులకు భావింప హృదయసం,గతుఁడ వై యుండియుఁ గానఁబడవు
కడఁగి నీదివ్యమంగళవిగ్రహంబునఁ, జేసి సమంచితాశ్రితుల నెల్ల
జేకొని సంప్రీతచిత్తులఁగాఁ జేయు, దతిశయకారుణ్యమతిఁ దనర్చి
కమలాక్ష సర్వలోకప్రజాధిప [1]భవ,దనుదర్శనాభిలాషానుతాప

తే. విదితదృఢభక్తియోగప్రవీణు లగుచు, స్థిర మై వీతరాగు లైనట్టియోగి
జనమనఃపంకజాతనిషణ్ణమూర్తి, వని యెఱుంగుదు రయ్య నిన్నాత్మవిదులు.

క. యుక్తిం దలఁప భవద్వ్యతి, రిక్తము లైనట్టియితరదృఢకర్మంబుల్
ముక్తిదము లయిననీపద, భక్తులు తత్కర్మములను పాటింప రిలన్. 548

ఉ. కావునఁ గీర్తనీయగతకల్మషమంగళతీర్థకీర్తిసు
శ్రీవిభవప్రశస్తసుచరిత్రుఁడ వైనభవత్పదాబ్జసే
వావిమలాంతరంగబుధవర్గ మనస్థితిభంగి నన్యమున్
భావమునం దలంచునె కృపాగుణభూషణ పాపశోషణా. 549

చ. పరమతపోవిభూతభవపాపుల మై చరియించుమాకు నేఁ
డరయ భవత్పదాశ్రితుల నల్గి శపించిన భూరిదుష్కృత
స్ఫురణ నసత్పథైకపరిభూతుల మై నిజధర్మహాని గా
నిరయము నొందఁగా వలసె నేరము వెట్టక మమ్ముఁ గావవే. 550

చ. కర మనురక్తి షట్పదము గమ్రసుగంధమరందవాంఛ చేఁ
దర మిడి శాతకంటకవృతస్ఫుటనవ్య[2]తరప్రసూనముం
జరులను డాయుపోలిక భృశం బగువిఘ్నములన్ జయించి నీ
చరణసరోజముల్ గొలువ సమ్మతి వచ్చితి మయ్య కేశవా. 551

చ. అలరుభవత్పదాంబుజయుగార్పిత మై పెను పొందునట్టియీ

---

1 'భవ, దనుసరణాభిలాషానులాప' అ. ప్ర. 2 'దరత్ప్రసూన' గ్రా. ప్ర.

తులసి పవిత్రమైనగతిఁ దోయజనాభ భవత్కథాసుధా
కలితము లైనవాక్కుల నకల్మషయుక్తిని విన్నఁ గర్ణముల్
విలసితలీలమై భువిఁ బవిత్రము లై విలసిల్లు మాధవా. 552

చ. మహితయశోవిలాసగుణమండన సర్వశరణ్య యింద్రియ
స్పృహులకుఁ గాన రాక యతసీకుసుమద్యుతి నొప్పుచున్ననీ
సహజశరీర మిప్పుడు భృశంబుగఁ జూచి మదీయ[1]దృక్కు లిం
దహహ కృతార్థతం బొరసె నచ్యుత మ్రొక్కెద మాదరింపవే. 553

క. అని సనకాదులు దత్పద, వనజములకు మ్రొక్కి భక్తివశమానసు లై
వినిపించిన గోవిందుఁడు, మునివరులం జూచి పలికె ముదితాత్ముం డై. 554

వ. ఈయిరువురు జయవిజయాభిధానంబులు గలమదీయద్వారపాలకులు మీరు మి
మ్ముం గైకొనక మదీయాజ్ఞాతిక్రమణు లయి చేసినయపరాధంబునకుఁ దగినదం
డంబు గావించితి రది నాకు నభిమతం బయ్యె నదియునుం గాక భృత్యవర్గంబు
సేయునపరాధంబు స్వామిదియ కాన యీతప్పునకు మానసీయుండ నై నన్ను
మన్నించి ప్రసన్ను లగుదురు గాక యని వెండియు ని ట్లనియె. 555

చ. తనువునఁ బుట్టినట్టిబెడిదం బగుకుష్ఠమహాగదంబుచే
వనరి తదీయచర్మము [2]వివర్ణత నొందినరీతి భృత్యులో
పునిపని సేసినన్ విభులు బంధురచారుయశంబుఁ బేరు పెం
పును జెడి పోయి దుర్యశముఁ బొందుచు నుందురు లోకమందులన్. 556

చ. అలవడ నాకు మీవలన నబ్బినతీర్థసుకీర్తనీయస
ల్లలితవినిర్మలామృతవిలాసయశోవిభవాభిరామ మై
వెలయువికుంఠనామ మపవిత్రమనశ్శ్వపచాధమాదిలో
కులచెవి సోఁకఁ దత్క్షణమ కోరి [3]పునీతులఁ జేయు వారలన్. 557

తే. అట్టినేను దలంప మీయట్టిసాధు, జనుల కపకార మర్థిఁ జేసిన మదీయ
బాహుసము లైనఁ ద్రుంతు నుత్సాహలీల,నన్ను నితరుల మీ ప్రోల నెన్న నేల.

క. ధరణీసురోత్తమసేవా, పరిలబ్ధం బయినయట్టిపాతకనాశం
కరనిఖిలభువనపూత,స్ఫురితాంఘ్రిసరోజతోయములు గలనన్నున్. 559

క. అలఘుమతి విరక్తునిఁ గాఁ, దలఁపక నిజశుభకటాక్షదామకకలితా
ఖిలసంపద్విభవ శ్రీ,లలనారత్నం బురస్స్థలంబును జెందున్. 560

చ. క్రతువులు సేయుచో శిఖిముఖంబున వేలుచునట్టిసద్ఘృత
ప్లుతచరుభక్షణన్ ముదముఁ బొందదు నిస్పృహధర్మమార్గసం
గతుఁ డగుభూసురోత్తమముఖంబున వేడ్క భుజించునయ్యవి
స్తృతకబళంబులన్ మనము తృప్తి వహించినరీతి నిచ్చలున్. 561

1 'నేత్రముల్, అహహ' వ్రా. ప్ర. 2 'వివర్ణము' వ్రా. ప్ర. 3 'పవిత్రుల' వ్రా. ప్ర.

సీ. సతతంబు నప్రతిహతయోగమాయావి, భూతిచేఁ బ్రఖ్యాతిఁ బొందునేను
నేమహీసురులసమిద్ధనిర్మలపాద, నలినరజోవితానములు భక్తి
హాటకనవరత్నకోటీరమునఁ దాల్తు, నట్టినాచరణాంబుజాంబువులను
దవిలి ధరించి సద్యఃపునీతాత్ము లై, రర్థిఁ జంద్రావతంసాదిదేవ
తే. చయము లెవ్వాఁడు బ్రాహ్మణజనులు దమకు
నపకృతుల్ సేసిరేని మాఁ బలుకఁ డతఁడు
విప్రులను నన్నుఁ గాఁగ భావించునతఁడు
ధర్మపద్ధతి నాప్రియతముఁడు వాఁడు. 562

ఉ. గోవితతిన్ ధరాదివిజకోటిని నన్నును దీనవర్గమున్
వావిరి భేదబుద్ధిఁ గనువార లధోగతిఁ బొంద నందు నా
శీషరోషవిస్ఫురణఁ జెంది కృతాంతభటుల్ మహోగ్రగృ
ధ్రావలిపోలెఁ జంచువుల నంగము లుద్ధతిఁ జింతు రెప్పుడున్. 563

చ. ధరణిసురోత్తముల్ బహువిరోధంబులఁ దమ్ముఁ బరాభవించినన్
దరహసితాస్యు లై యతిముదంబున నిచ్చలుఁ బూజ సేయుచున్
సరసవచోవిలాసముల సన్నుతి సేయుచుఁ దండ్రి నాత్మజుల్
గర మనురక్తిఁ బిల్చుగతిఁ గైకొని పిల్చినవారు నాసముల్. 564

క. వినుఁ డయ్యనఘచరిత్రుల, కనయముఁ బ్రియతముఁడ నగుచు నమ్ముదువోదున్
ముని నన్ను భృగువు దన్నినఁ, గనలక పరితోషయుక్తిఁ గైకొంటిఁ గదే.

సీ. పొలుచునా[1]చిత్తమందులయభిప్రాయంబు, దెలియంగలేక యుద్వృత్తు లగుచుఁ
గడఁగి మీయానతిఁ గడచినఁ దద్దోష, ఫలము వీరలకు సంప్రాప్త మయ్యె
మునులార నాచిత్తమున నున్నతెఱఁగును, నిట్టిద భూమిపైఁ బుట్టి వీర
లచిరకాలమున నాయంతికంబునకును, నరుదెంచునట్లుగా ననుమతింప
తే. వలయునని యమ్ముకుందుండు వలుకుటయును, వినిమనంబున సనకాదిమునివరేణ్యు
లమ్మహాత్మునిమృదులభాషామృతంబుఁ, దవిలి క్రోలియు రోషసందష్టు లగుచు.

సీ. మునివరుల్ దమచిత్తములఁ దృప్తిఁ బొందక, పంకజాతాక్షుఁడు వలికినట్టి
పరిమితగంభీరబహుళార్థదురవగా, హములును విస్ఫురదతిసుఘోష
మానమాధుర్యసమన్వితమ్ములు విని, గతశబ్దరోషనికాయములును
నైనవాక్యములకు నాత్మలఁ బరితోష,మంది [2]యిట్లనిరి నెయ్యమున మనల
తే. నొడయఁ డిప్పుడు నందించెనో తలంప, నర్థి నిందించెనో మత్కృతైకదండ
మునకు సంకోచమందియో యనుచు సంశ, యాత్ము లగుచు వివేకించియంతలోన.

క. నలినాక్షుఁడు దమ దెసఁ గృప, గలిగినభావంబుఁ దెలిసి కౌతుక మొలయం
బులకీకృతాంగు లై యు,త్కలికన్ హర్షించి నిటలఘటితాంజలు లై. 568

---

1 'మానసాంభోజాతభావంబు' అ. ప్ర. 2 'యుల్లముల...మనిచె' అ. ప్ర.

క. భరితనిజయోగమాయా,స్ఫురణం దనరారునతివి।భూతియు బలమున్
పరమోత్కర్షముఁ గలయీ,శ్వరునకు నిట్లనిరి మునులు । సద్వినయమునన్.
తే. పొలుపు దీపింప నిత్యవి।భూతినాయ,కుఁడవు భగవంతుఁడవు నన।ఘుఁడవు నీవు
మత్కృతం బిప్డు నీ కభి।మత మటంటి, వీశ భవదీయచారిత్ర।మెఱుఁగఁ దరమె.
ఉ. దేవగణాలి కెల్లఁ బర।దేవత వై తనరారునట్టివి
ప్రావలి కాత్మనాయకుఁడ। వై పెను పొందిననీకు నీధరా
దేవత లెల్ల నెన్న నధి।దేవత లై రఁట యెట్టిచోద్యమో
దేవ సమస్తపావన సు।ధీజనతావన విశ్వభావనా. 571
చ. కమలదళాక్ష నీవలనఁ। గల్గినధర్మము దావకావతా
రముల సురక్షితం బగుఁ ది।రంబుగ నీశ్వర నిర్వికారత
త్త్వమునఁ దనర్చుని న్నరయఁ। దత్ఫలరూపముఁ దత్ప్రధానగో
ప్యము నని పల్కుచుందురు కృ।పామయలోచన పాపమోచనా. 572
చ. మహిఁ దలపోయ నెవ్వనిస।మగ్రపరిగ్రహముల్ లభింప ని
స్పృహమతు లై మునీశ్వరులు । మృత్యుభయంబునఁ బాతు రట్టిస
న్మహితవివేకశాలి గుణ।మండన నీ కిల నన్యసత్పరి
గ్రహ మది యెట్టిచోద్యము జ।గత్పరిపాలన నిత్యఖేలనా. 573
సీ. సతతంబు నర్థార్థి।జనశిరోలంకార, పదరేణువులు గల।పద్మ[1]నేఁడు
జలజకింజల్కని।ష్యందమరందలో, భాగత భ్రమర[2]నా।యకివిధమున
ధన్యజనార్పితో।దంచితతులసికా,దామంబునకు నిజ।ధామ మగుచు
భాసిల్లుభవదీయ।పాదారవిందముల్, విలసితభక్తి సే।వించు చుండఁ
తే. గమలనయన కృపావలో।కనము లోలయు, నర్థిఁ [3]జూడవు భాగవ।తానురక్తిఁ
జేసి భవదీయమహిమంబు । చిత్ర మరయ,చిరశుభాకార యిందిరా।చిత్తచోర.
మ. చిరభాగ్యోదయ దేవదేవ లలిత।శ్రీవత్సలక్ష్మాంగ యీ
వరవిప్రానుపదైకపుణ్యరజమే । వర్ణింప నీమేని కా
భరణం బంటివి సర్వలోకులకు వి।ప్రశ్రేణిమాహాత్మ్య మీ
వెఱుఁగం జెప్పుట కై ధరించితి గదా । యెన్నం బునీతాకృతిన్. 575
వ. అదియునుం గాక. 576
సీ. ధర్మమూర్తివి జగ।త్కర్తవు నగునీవు, పోవంగఁ దగువారిఁ । బ్రోవవేని
నవిరళవేదోక్త। మగుధర్మమార్గ మ,సన్మార్గ మగుఁ గాన । సత్త్వగుణవి
శిష్టుండ వగుచు నీ।జీవరాసులసేమ, మరసి రక్షింతు నీ । దైవశక్తి
చేతను ధర్మవి।ఘాతుల దండించు, నీకు నంచిత మైన।నిగమధర్మ
తే. మార్గనాశకరంబులు । మదికి నింపు, గావు విప్రులయందు స।త్కరుణ మెఱసి

1 'మనెడు. 2 నాయకునిపగిది. 3 బొడసూపు' అ. ప్ర.

ఘనతఁ బలికినవినయవాక్యములునీకు, యుక్తమగుచుండుసతతంబుభక్తవరద.

వ. అట్లయినం బరులయెడ వినయంబులు వలికినఁ బ్రాభవహాని యగు నని తలంచితివేని. 578

తే. విశ్వమున కెల్లఁ గర్తవు విశ్వనిధివి, విశ్వసంరక్షకుఁడవు నై వెలయునీకుఁ
గడఁగిప్రాభవహాని యెక్కడిది దలఁప, వినయములునీకు లీల లై వెలయుఁ గాన.

తే. మునుల మగుమమ్ము నతిమోదమునను నీవు, సత్కరించుట యెల్ల సజ్జనపరిగ్ర
హార్థమె యుండుఁ గాదె మహాత్మ యొకటి, విన్నవించెద మీజయవిజయులకును.

తే. అలిగి యేము శపించినయంతకంటె, బెడిద మగునాజ్ఞ సేయ నభీష్టమేనిఁ
జేయు మది గాక సమధికశ్రీ దనర్పఁ, జేసి రక్షించితేని రక్షింపు మీశ.581

వ. అట్లయిన మాకుం బ్రియం బగుం గావున ననపరాధులు నతినిరర్గళాంతఃకరణులు నైనవీరలకు ననృతంబులు వలికితి మేనియు మమ్ము ఘనం జిత్తంబుకొలంది నాజ్ఞాపింపు మని కరకమలంబులు మొగిచి కృతాంజలులై యున్నమునులం గరుణార్ద్రదృష్టిం గనుంగొని. 582

క. అనఘుఁడు భగవంతుం డిట్లనియె మునులార వీర లనయము భువికిం
జని యచట నసురయోనిం, జనియించి మహోగ్రలోభసంగతు లగుచున్.583

క. దేవజనావళి కుపహతిఁ, గావించుచు నిఖిలభువనకంటకవృత్తిం
జీవించుచు నాయెడ సం, భావితవైరానుబంధభావను లగుచున్. 584

క. ఆహవముఖమున నను నతి, సాహసమున నెదిరి పోరి చక్రనిశితధా
రాహతిఁ దెగి వచ్చెద రుత్సాహ మెలర్పంగ నాదుసన్నిధి కంతన్. 585

వ. అదియునుం గాక. 586

క. నను వైరంబున నైనను, మనమునఁ దలఁచుటను నాసమక్షమున మదా
నన మీక్షించుచు నిల్చుట, ననఘాత్మకులై వసింతు రస్మత్పదవిన్. 587

క. వినుఁ [1]డిలమీఁద నిఁకెన్నఁటి, కిని బుట్టువు లేదు వీరికిని మీరలు వ
లికినయట్ల నాదుచిత్తము, ననుఁ దలఁతుం గాన మీమనంబుల నింకన్. 588

ఉ. దీనికిఁ జింతఁ దక్కుఁడు సుధీజనపుంగవులార నావుడు
న్నానలినాసనాత్మజు లనంతునిభావము దా మెఱింగి సం
పూనినవేడ్కఁ దేలి తెలి వొందినచిత్తములన్ నుతించి రం
భోనిధిశాయి నార్తజనపోషణభూషణుఁ బాపశోషణున్. 589

వ. మఱియును. 590

ఉ. ఆసనకాదు లంతఁ బులకాంకురముల్ నన లొత్త బాష్పధా
రాసుభగాక్షులై మునిశరణ్యు వరేణ్యు నగణ్యు దేవతా
గ్రేసరుదివ్యమంగళశరీరముఁ జూచి తదీయధామమున్

1 డిట మీఁదటి కెన్నఁటి.

భాసురలీలఁ జూచి నవ|పద్మదళాక్షునకున్ వినమ్రులై. 591

క. తమపలికినభాషణములు, కమలోదరు[1]వాక్యసరణి | గాఁ దలఁచుచు నె
య్యమునన్ వైష్ణవలక్ష్మిం, బ్రమదంబునఁ బ్రస్తుతించి | పరమేశ్వరుచేన్. 592

క. ఆమంత్రితులై తగ నిజ,ధామములకుఁ జనిరి వారు | దడయక లక్ష్మీ
రాముఁడు జయవిజయుల నభి,రామంబుగఁ జూచి పలికె | రయ మొప్పారన్.

క. మీ రసురయోనియం దని, వారితులై జనన మంద | వలసెను నే దు
ర్వారబలాఢ్యుఁడ నయ్యును, వారింపఁగ నోప విప్ర|వచనము లెందున్. 594

క. అది గాన దనుజయోనిం, బదపడి జనియించి మద్వి|పక్షులరై మీ
మది నెపుడు నన్నె తలఁచుచు, వదలక నాచేతఁ జచ్చి | వచ్చెద రిటకున్. 595

ఉ. పొం డని యాన తిచ్చి హరి | ఫుల్లసరోరుహపత్రనేత్రుఁ డా
ఖండలముఖ్యదిగ్వరని|కాయకిరీటలసన్మణిప్రభా
మండితపాదపీఠుఁడు ర|మారమణీమణి దోడ నేఁగుదే
నిండినవేడ్క నేఁగె నిజ|నిర్మలమందిరపుణ్యభూమికిన్. 596

వ. అంత. 597

క. నిజతేజోహాని గ జయ,విజయులు ధరఁ గూలి రపుడు | విహ్వలు లగుచుం
త్రిజగముల సురవిమాన,వ్రజముల హాహారవంబు | గ్రందుగఁ జెలఁగన్. 598

క. వారలువో దితిగర్భా,గారంబున నున్నవారు | గడఁగి తదీయో
దారఘనతేజ మిపు డని, వారణ మీ తేజ మెల్ల | వమ్ముగఁ జేసెన్. 599

ఉ. ఇంతకు మూల మాహరి ర|మేశ్వరుఁ డర్థి నొనర్చుకార్యముల్
వింతలె సర్వభూతభవ|వృద్ధివినాశనహేతుభూతుఁ డా
ద్యంతవికారశూన్యుఁడు ద|యానిధి మీయెడ మేలు సేయు నీ
చింత దొఱంగి వే చనుఁడు | చేకుఱు మీఁద మనోరథార్థముల్. 600

క. అని వనజాసనుఁ డాడిన, విని తద్వృత్తాంత మెఱిఁగి | విబుధులు నాకం
బున కేఁగిరి దితి నిజనా,థునిమాటలు దలఁచి యపరి|తోషముతోడన్. 601

—జయవిజయులు దితియందు హిరణ్యాక్షహిరణ్యకశిపు లై పుట్టుట.—

తే. ఇంతితనసుతుల్ సురలఁగా|రింతు రనుచుఁ, దలఁచుచుండంగ నంత వ|త్సరశతంబు
సనఁగ నటమీఁదఁ గనియెఁ గ|శ్యపునిదేవి, యఖిలలోకైకకంటకు | లైనసుతుల.

వ. అయ్యవసరంబున. 603

తే. ధరణి గంపించెఁ గులపర్వ|తములు వడఁకె
జలధులు గలంగెఁ దారకా|వళులు డుల్లె
గగన మగలెను మ్రొగ్గె దిక్|కరులు దిశల
మిడుఁగుఱు చెదరెఁ బిడుగులు | పుడమిఁ దొరఁగె. 604

---

1 'భాషణములు' అ. ప్ర.

సీ. హోమానలంబుల ధూమంబు లడరెను, బ్రతికూలవాయువుల్ బలసి వీచెఁ
దరువు లెల్లెడ విటతాటంబు లై కూలె, గ్రహతారకావళి కాంతి మాసె
బెరసి మొగిళ్లు నెత్తురువాన గురిసెను, మెఱుఁగులు దెసల మిట్టిల్లు గొలిపె
స్వర్భానుఁ డొగి నపర్వమున భానునిఁ బట్టెఁ, గైకొని చిమ్మచీఁకట్లు పర్వె
తే. మొనసి కుక్కలు మొఱఁగెను మోర లెత్తి, పగలు నక్కలు వాపోయె ఖగములార్త
రవములిచ్చెను దేవతాప్రతిమ లొరగెఁ, గన్నులను నశ్రుకణములు గ్రందుకొనఁగ.
క. మొదవులు నెత్తురుఁ జీమును, బిదికెన్ గార్దభరవంబు భీషణ మయ్యెన్
మద ముడిగెఁ గరులకటములఁ, బొదివెఁ దురంగములవాలముల నిప్పు లొగిన్.
క. గుహలు రొద లిచ్చెఁ బాప, గ్రహమిత్రతఁ జెంది నక్రగతులను సౌమ్య
గ్రహములు వర్తించెను దుస్సహతేజోదితితనూజసంభవ వేళన్. 607
మ. భయదప్రక్రియ నట్లు దోఁచినమహోత్పాతంబు లీక్షించి సం
క్షయకాలం బని కాని సాధుహననోగ్రక్రూరదేవాహితో
దయసంక్షోభము గా నెఱుంగక సమస్తప్రాణిజాతంబు స
ద్భయ మందెన్ సనకాదియోగిజనముల్ దక్కన్ బుధేంద్రోత్తమా. 608
వ. అట్లావిర్భవించినయనంతరంబ. 609
మ. కులశైలాభశరీరముల్ దనర రక్షోనాథు లత్యుగ్రదో
ర్బల మొప్పం బదఘుట్టనన్ ధర సలింపన్ రత్నకేయూరకుం
డలకాంచీకటకాంగుళీయకకిరీటస్వర్ణమంజీరని
ర్మలకాంతుల్ దులకింప నాత్మరుచిచే మందీకృతార్కాంశులై. 610
వ. ఉన్నసమయంబునం గశ్యపుండు నిజతనూభవులఁ జూడం దలంచి దితిమందిరంబునకుఁ జనుదెంచి సుతులం గనుంగొని వారలకు నామకరణంబు సేయం దలంచి.
చ. దితిజఠరంబునందుఁ దన తేజము మున్నిడినట్టిపుత్త్రు న
ద్భుతచరితున్ హిరణ్యకశిపుం డనుపేరుఁ బ్రసూతివేళ నా
దితి మును గన్నపట్టి రవితేజునిఁ గాంచనలోచనుండు నా
హితమతిఁ బేరుఁ బెట్టి చనియెన్ నిజనిర్మలపుణ్యభూమికిన్. 612
వ. అయ్యవసరంబున నతులతేజోవిరాజితుం డైనహిరణ్యకశిపుండు హిరణ్యగర్భవరదానగర్వంబునను దుర్వారపరిపంథిగర్వనిర్వాపణాఖర్వభుజావిజృంభణంబునను నిఖిలలోకపాలాదుల జయించి (స్వవశం బొనర్చి) సంతుష్టాంతరంగుం డై యెందునుం దనకు మృత్యుభయంబు లేక నిర్భయుండై సుఖం బుండెఁ దత్సోదరుం డైనహిరణ్యాక్షుండు ప్రతివాసరంబుఁ జండవేదండశుండాదండమండితభుజాదండంబున గదాదండంబు ధరియించి తన్ను నెదిరి కదనంబు సేయం జాలినయరివీరునిం గానక భూలోకం బెల్లఁ గ్రుమ్మరి దివంబునకు దాడివెట్టి యందు సమరవిముఖు లయినబర్హిర్ముఖులం గనుంగొని వనజాసనవరప్రదానంబుఁ జింతించి హి

తులు సెలంగ నహితులు గలంగ సుమహితవైజయంతికాదామం బభిరామం
బై వెలుంగం జరణంబుల మణినూపురంబులు మొరయ నిజదేహద్యుతి దిక్కు
లం బిక్కటిల్లం జనుదెంచువానిం గని విభీతచిత్తు లయి దేవతాగణంబులు గరు
డునిం గని పఱచునురగనికరంబులుంబోలె నిజనివాసంబు లర్కనివాసంబులుఁ
గాంచనావాసంబులుం గా నొనర్చి యెక్కడి కేనియుం జనిన. 613

ఉ. శౌర్యము వోవఁ దట్టి నిజసాధనముల్ దిగ నాడి విక్రమా
దార్యపరాక్రమక్రమము [1]దప్పఁగ భీతిలి పాఱి రక్కటా
కార్యముఁ దప్పె నాకు లని గైకొని యార్చి సుమేరుపర్వత
స్థైర్యుఁడు వార్ధిఁ జొచ్చె నతిదర్పితభూరిభుజావిజృంభి యై. 614

వ. ఇట్లు సొచ్చిన. 615

క. వరుణునిబలములు దనుజే, శ్వరుతేజముఁ దేఱి చూడఁ జాలక శౌర్య
స్ఫురణము సెడి యెందేనియుఁ, బఱచెం దజ్జలధిమధ్యభాగమునందున్. 616

క. అమరారివిపులనిశ్శ్వా,సములం బ్రభవించినట్టిజలనిధికల్లో
లములను విపులగదాదం,డమునం బో నడిచె నతిదృఢం బగుశక్తిన్. 617

చ. మఱియును నమ్మహాజలధిమధ్యమునన్ సురవైరి పెక్కువ
త్సరములు గ్రీడ సల్పి రిపుసైన్యవిదారణశౌర్యఖేలనా
పరతఁ జరించి యవ్వరుణపాలిత మైనలసద్విభావరీ
పురమున కేఁగి యందుఁ బరిపూర్ణత నున్నపయోధినాథునిన్. 618

వ. మఱియును. 619

సీ. యాదోగణాధీశుఁ డగుచుఁ బాతాళభు, వనపరిపాలుఁ డై తనరుచున్న
వరుణునిఁ గనుఁగొని పరిహసితోక్తుల, ని ట్లను విశ్వమం దెన్నఁ గలుగు
సకలలోకైకపాలకులలో నతిబలా, ధికుఁ డని జగము నుతింపఁ దగిన
శూరుండ విపుడు నీపౌరుష మొప్పంగఁ, గదనరంగమున న న్నెదిరి చూడు
తే. నీభుజావిక్రమంబును బ్రాభవంబు
నడఁతు నని పల్కుటయు విని యబ్ధివిభుఁడు
పగఱజయమును వృద్ధియు బలము నాత్త
బలముఁ దలపోసి దనుజుతో బవరమునకు. 620

క. సమయము గా దని తనచి, త్తమునం గలరోషవహ్నిఁ దాలిమి యనుతో
యములం దగ నార్చుచు నుప, శమితోక్తులఁ బలికె దనుజసత్తముతోడన్.

చ. మనమున శాంతిఁ బూని నియమంబున సంగర ముజ్జగించి యే
మనయము నున్నవార మిపు డాహవకేళిఁ జరింప రాదు నీ
ఘనభుజవిక్రమస్ఫురితగాఢవిజృంభణముల్ జయింపఁ జా

1. దఫ్వఁగ.

లినప్రతివీరు లెవ్వరును § లేరు ముకుందుఁడు దక్క నెక్కడన్. 622

చ. గొనకొని యమ్మహాత్ముఁడు వి § కుంఠపురంబున నున్నవాఁడు దా
నని మొనఁ బెక్కుమాఱు లభి § రాముతుల నోలి జయించి శక్తిపెం
పున నడిసన్నవీరుఁ డని § భూజనకోటి నుతింప విందు వే
చను మతఁ డిచ్చు నీకు నని § సర్వముఁ దీఱెడు నంతమీఁదటన్. 623

ఉ. నిందకు నోర్చి యాజిమొన § నిల్వఁగ నోపక వీఁగి పాఱునీ
పందల వెంటఁబెట్ట మఱి § పంతమె సర్వశరణ్యుఁ డైనగో
విందుఁడు దీర్చు నీపని వి § వేకవిహీన చనంగ నోపుదే
నందుల కేఁగు మాతఁ డమ § రారులఁ బోర జయించు నిచ్చలున్. 624

వ. అదియునుం గాక. 625

క. పురుషాకృతిఁ బ్రతియుగమునఁ, బురుషోత్తముఁ డవతరించి § భూరిభుజావి
స్ఫురణన్ దుష్టనిశాటుల, హరియించుచు నుండు మునిగ § ణార్చితపదుఁడై. 626

ఉ. కావున నావిభుం డొడరి § కయ్యము దయ్యమెఱుంగఁ జేసి ర
క్షోవర నీభుజాబలము § సొం పఱి మేదినిఁ గూలి సారమే
యావళి కాశ్రయం బగుదు § వచ్చుటి కిప్పుడ యేఁగు దేని నీ
చేవయు లావు నేర్పడును § జెప్పఁగ నేటికి మీఁదికార్యముల్. 627

చ. అని వరుణుండు పల్కిన దు § రాగ్రహ మెత్తి హిరణ్యలోచనుం
డనయము మానసంబున భ § యం బొకయింతయు లేక సంగరా
వని నెదిరింతు నేఁ డమర § వర్ధను దుష్టవిమర్దనున్ జనా
ర్దను ననుచున్ వికుంఠనగ § రస్ఫుటసంచితమార్గవర్తియై. 628

క. చనునవసరమున నారద, మునివరుఁ డెదు రేఁగుదెంచి § ముదము దలిర్పన్
దనుజేంద్ర యెందుఁ బోయెద, వని యడిగిన నారదునకు § నతఁ డిట్లనియెన్.

చ. సరసిరుహోదరుం దొడరి § సంగర మే నొనరించి యిందిరా
వరుని ననంతుఁ ద్రుంచి సుర § వైరికులంబుల కెల్ల మోదవి
స్ఫురణ ఘటింపఁ జేయుటకుఁ § బూని వికుంఠపురానువర్తినై
యరిగెద నన్న నమ్మునికు § లాగ్రణి దానవనాథు కిట్లనున్. 630

చ. గురుభుజుఁ డమ్మహాత్ముఁడు వి § కుంఠపురంబున నేఁడు లేఁడు భూ
భరము వహింప నాదికిటి § భావము దాల్చి రసాతలంబునం
దిరవుగ నున్నవాఁ డచటి § కేఁగఁగ నోపుదు వేని నేఁగు మం
దరయఁగఁ గల్గు నీకు నసు § రాంతకుతోడి రణం బవశ్యమున్. 631

—హిరణ్యాక్షుఁడు యజ్ఞవరాహం బగుహరి నెదిరించి పోరుట.—

చ. అనవుడు దానవేంద్రుఁడు హు § తాశనుకైవడి మండి పద్మలో
చను నెదిరించువేడుకలు § సందడిగొల్పఁ ననల్పతేజుఁ డై

ఘనగదఁ గేలఁ బూని త్రిజగద్భయదాకృతిఁ దాల్చి వేల్పుడిం
జనియె రసాతలంబునకుఁ జండభుజాబలదర్ప మేర్పడన్. 632

వ. చని జలమధ్యంబున. 633

క. దివిజారి యెదురఁ గాంచెను, నవిరళదంష్ట్రాభిరాము నమరలలాముం
గువలయభరణోద్దాముఁ, బవనమయ స్తబ్ధరోము జలదశ్యామున్. 634

వ. అయ్యవసరంబున సూకరాకారుం డైన హరియు. 635

క. వనజరుచిసన్నిభము లగు, తనలోచనయుగళదీప్తిఁ దనరఁ దదాలో
కనముల దనుజాధీశుని, తనుకాంతి హరింపఁ జేసెఁ దత్క్షణమాత్రన్. 636

వ. మఱియు నయ్యాదివరాహం బవార్యశౌర్యంబున మాఱు లేనివిహారంబునం
జరియించునట్టియెడ. 637

సీ. తుదమొదళ్లకుఁ జిక్కఁ దునిసి పాఱఁగ మోరఁ, గులశైలములఁ జిమ్ముఁ గొంతదడవు
బ్రహ్మాండభాండంబు పగిలి చిల్లులువోవఁ, గొమ్ములఁ దాటించుఁ గొంతదడవు
జలధు లేడును బంకసంకులం బై యింక, ఖురముల మట్టాడుఁ గొంతదడవు
నుడురాజుసూర్యుఁడు నొక్క మూలకుఁ బోవఁ, గుఱుచవాలము ద్రిప్పుఁ గొంతద[డవు

తే. గునియుఁ గుప్పించు లంఘించుఁ గొప్పరించు
నెగయు ధరఁ ద్రవ్వు బొఱియఁగా నేపు మిగిలి
దానవేంద్రునిగుండెలు దల్లడిల్లఁ
బంది మెల్లన రణపరిస్పంది యగుచు. 638

వ. మఱియును. 639

క. కనుఁగవ నిప్పులు రాలఁగ, సునిశితదంష్ట్రాగ్రయుతవసుంధరుఁ డగుచుం
దన కెదు రేతేరఁగ నీ, వనచర మేరీతి నిపుడు వనచర మయ్యెన్. 640

క. అని యాశ్చర్యభయంబులు, దనమనమునఁ దొంగలింపఁ దనుజాధిపుఁ డి
ట్లనియెఁ భీకరసూకర, తను వొంది చరించుదనుజదర్పాపహుతోన్. 641

క. ఘనసూకర మాఘాత్మక, వనరుహసంభూతదత్తవరదానమునం
గనినరసాతలగతభువి, యనయంబును నాయధీన మై వర్తించున్. 642

క. కొనకొని నీ వీధరణిం, గొని పోకుము విడుము కాక కొని పోఁగెద వేఁ
గొనియెద నీప్రాణముఁ గై, కొను నావచనములు సలము కొన నేమిటికిన్. 643

క. మాయావి వగుచు నిప్పుడు, వాయక యీపుడమిఁ జోరభావంబున [1]నీ
వీయెడఁ గొని పోఁ జూతువె, యాయతభుజబలముచేత నడఁపక యనుచున్.

సీ. అవిరళయోగమాయాబలంబునఁ జేసి, యల్పపౌరుషమున నలరునిన్ను
నర్థి సంస్థాపించి యస్మత్సుహృద్భృత్య, కులుల కెల్లను మోదమొలయఁ జేయఁ
జెలు వేది మద్గదాక్షీణ్ణుఁడ వగునిన్నుఁ, గనుఁగొని దేవతాగణము లెల్ల

1 (గొం,పోయెదు నాశత్రువులకు, ధియుత మిత్రుండపోలెఁ దెంపు తలిర్పన్. వ్రా. ప్ర.

ర్మూలులై చాల నెఱి నశించెద రన్న, విని యజ్ఞపోత్రియై వెలయుచున్న

తే. హరి సరోజాతభవముఖామరుల కెల్ల, వచ్చు నురవస్థ కాత్తలో వంత నొంది
నిశితదంష్ట్రాగ్ర[1]లసితయై నెగడు ధరణి, దేవితో నొప్పె నా దేవదేవుఁ డంత.

క. [2]సురరిపువాక్యాంకుశముల, గుఱుకుపితస్వాంతుఁ డగుచుఁ గొమరారె వసుం
ధరతోడ భీతి నొందిన, కరిణిం గలకరికులేంద్రుకరణిం బెలుచన్. 646

తే. నిశితసితదంతరోచులు నింగిఁ బర్వఁ, గంధి వెడలి భయంకరాకారలీల
నరుగుభీషణముఖవరాహావతార, మొనరఁ దాల్చినపద్మలోచనుని వెనుక. 647

క. కరివెనుకఁ దగులు నక్రము, కరణిం జని దైత్యవిభుఁడు గదిసి యిటు లనున్
దురితపయోనిధితరికిం, గిరికిన్ ఖురదళితమేరుగిరికిన్ హరికిన్. 648

క. నిందకు రోయక లజ్జం, జెందక వంచనను రణము సేసి జయంబుం
బొందెద నని [3]తలఁచుచు నిటు, పందగతిం బాఱ బంటుపంతమె నీకున్. 649

వ. అని యాక్షేపించినం బుండరీకాక్షుండు కోపోద్దీపితమానసుం డై. 650

క. తోయములమీఁద భూమి న, నాయాసత నిల్పి దానికాధారముగాఁ
దోయజనాభుఁడు దనబల, మాయతమతిఁ బెట్టె సురలు హర్షము వొందన్.

తే. కుసుమములవృష్టి బోరనఁ గురిసె నంత
విభవ మొప్పార దేవదుందుభులు మొరసెఁ
గడఁక వీతెంచె గంధర్వగానరవము
నందితము లయ్యె నప్సరోనర్తనములు. 652

వ. అయ్యవసరంబున నయ్యజ్ఞవరాహమూర్తిధరుం డైనకమలలోచనుండు కనక
కుండలకేయూరగ్రైవేయకటకాంగుళీయకభూషణరోచులు నింగిఁ బర్వ సమర
సన్నద్ధుం డై. 653

చ. ఘనగదఁ గేలఁ బూని మణికాంచనదివ్యవిచిత్రవర్మ మిం
పొనరఁగఁ దాల్చి దానవనియుక్తమరుక్తినిశాతబాణముల్
దనఘనవర్మముల్ గలఁప దానవహంత నితాంతశౌర్యుఁ డై
కనలుచు వచ్చు నద్దనుజుఁ గన్గొని రోషవిభీషణాకృతిన్. 654

వ. ఇట్లనియె. 655

మ. వినరా యోరి యమంగళాచరణ యుద్వృత్తిన్ ననున్ నీమది
న్ననయంబున్ వనగోచరం బగుమృగం బంచుం దలం తౌర నే
నెనయన్ వన్యమృగంబ యౌదు బలిమి న్నేతెంచు నీబోఁటియౌ
శునకశ్రేణి వధింతు నేఁ డని మొనం జోఁ కోర్చి వర్తించినన్. 656

క. బలిమి గలదేని నాతోఁ, గలనను నెదిరించి పోరఁ గడఁగుము నీకో

---

1 కోరకవసితధరణి. 2 'వరబలయూత జలచరగణ, పరిపీడాకులవిలోలభావముతోడం, గురి చాలఁ భీతి నొందిన, కరిణిం గల' వ్రా. ప్ర. 3 మదిఁ దలఁచిటు.

ర్కులు నేఁడు దీర్తు నూరక, తలపోయ వికత్థనంబు నీ దగదు దురాత్మా. 657

చ. విను మిది గాక సంగరవివేకవిశారదులై నయట్టి స
జ్జనములు మృత్యుపాశములఁ జాల నిబద్ధులు నయ్యు నీవలెన్
గొనకొని యాత్మసంస్తుతులు సేయరు మద మంద రిదేల యీ పక
త్థనములు బంటుపంతములె దైత్యకులాధమ యెన్ని చూడఁగన్. 658

మ. ధృతిఁ బాతాళమునందు నీ వనెడి సందీప్తోగ్రనిక్షేప మే
నతిదర్పంబునఁ గొందుఁ జూడు మిదె దేవారాతి నన్నెన్న దా
గతలజ్జుం డన దాఁగి యుండి రణముం గావింతు యుష్మద్గదా
వితతద్రావితుఁ డన్న నన్నెదురుమా యే తీర్తు నీకోరికల్. 659

ఉ. ఎన్నఁ బదాతియూథముల కెల్ల విభుండవు పోటుబంటవై
నన్ను రణోర్వి నేఁ డెదిరినన్ భవదీయబలంబు నాయువున్
మిన్నక కొందుఁ జూడు మిది మేరఁగ మేదిని వీతదైత్యమై
వన్నెకు నెక్కఁ జేసెద నవార్యపరాక్రమవిక్రమంబునన్. 660

చ. నను నెదురంగఁ జాలిన ఘనం బగు శౌర్యము ధైర్యముం బలం
బును గలవేని నిల్వు రణభూమిని నీహితులైనవారికిం
గనుఁగవ బాష్పపూరములు గ్రమ్మఁగ మాన్పఁగ నోపుదేనిఁ జ
య్యనఁ జనఁ బొమ్ము దానవకులాధమ యూరక రజ్జులేటికిన్. 661

క. నను నిట సంస్థాపించెద, నని పలికితి వంతివాఁడ వౌదువు నీకున్
నెన వైనచుట్టములఁ బొడ,గని రా యిదె యమునిపురికిఁ గాఁపుర మునుగన్.

మ. అని యిబ్భంగి సరోరుహాక్షుఁడు హిరణ్యాక్షున్ విడంబించి ప
ల్కినహాసోక్తుల కుల్కి రోషమదసంరంభాతిచేతస్కుఁడై
కనుఁగ్రేవన్ మిడుఁగుర్లు నాలుఁ బొడమన్ గాఁ గిన్కమైఁ దోఁకఁ ద్రొ
క్కినకృష్ణోరగరాజుమాడ్కి మదిలోఁ గీడ్పాటు వాటిల్లఁగన్. 663

క. చలితేంద్రియుఁడై నిట్టూర్పులు నిగిడించుచును బొమలు ముడివడ రోషా
కులమానసుఁడై గదఁ గొని, జలజాక్షున కెదురునడచె సాహస మొప్పన్.

వ. అట్టి హిరణ్యాక్షుఁ డతిభయంకరాకారుండై. 665

మ. గద సారించి మదాంధుఁడు సమగ్రక్రోధుఁడై మాధవుం
గుదియన్ వ్రేసిన వ్రేటు గైకొనక రక్షోహంత శౌర్యోన్నతిన్
గద కేలన్ ధరియించి దానిఁ దునుకల్ గావించినం దైత్యుఁ డు
న్మదుఁడై యొండుగదన్ రమావిభుని భీమప్రక్రియన్ వ్రేసినన్. 666

చ. అది దనుఁ దాఁకకుండ దనుజారి గదారణకోవిదక్రియా
స్పదకరలాఘవక్రమముఁ బైకొని చూపి విరోధిపేరురం
బదయత వ్రేయ వాఁడు వివశాకులభావము నొంది యంతలో

మదిఁ దెలి వొంది వ్రేసె రిపుమానవిమర్దను నాజనార్దనున్. 667

వ. ఇట్లు దలపడి యన్యోన్యజయకాంక్షల నితరేతరతుంగతరంగతాడితంబు లగు దక్షిణోత్తరసముద్రంబులరాగంబునఁ బరస్పరశుండాదండఘట్టితమదాంధగంధ సింధురయుగంబుచందంబున రోషభీషణాటోపంబులం దలపడుబెబ్బులులగబ్బున నతిదర్పాతిరేకంబున నెదిర్చి అంకెలు వైచుమదవృషభంబులరభసంబున నసహ్యసింహపరాక్రమంబున విక్రమించి పోరునెడ హిరణ్యాక్షుండు సవ్యమండలభ్రమణంబునఁ బరివేష్టించినం బుండరీకాక్షుండు దక్షిణమండలభ్రమణంబునం దిరిగి విపక్షువక్షుం బశనిసంకాశం బగుగదాదండంబునం బగిల్చిన వాఁడు దెప్పిఱి తెలివొంది లేచి దనుజపరిపంథిఫాలంబు నొప్పించె నప్పు డమ్మేటివీరులు శోణితసిక్తాంగులై పుష్పితాశోకంబులం బురుడించుచుం గాయుచు డాయుచు వ్రేయుచు రోయుచు నొండొరులరుధిరంబు లాఘ్రాణించుచుఁ దిరస్కారపరిహాసోక్తుల నిచ్చుచుఁ బోరుసమయంబున నమ్మహాబలులసమరంబుఁ జూచువేడ్కఁ బద్మసంభవుండు నిఖిలమునిసంసిద్ధసాధ్యదేవగణంబులతోడఁ జనుదెంచి ధరిత్రీనిమిత్తంబున నసురవరునితోడం బోరుయజ్ఞవరాహున కిట్లనియె. 668

ఉ. అంచితదివ్యమూర్తి పరమాత్మక యీకలుషాత్ముఁ డైన న
క్తంచరుఁ డస్మదీయవరగర్వమునన్ భువనంబు లెల్లఁ గా
రించు మదించి యిట్టివిపరీతచరిత్రునిఁ ద్రుంప కిట్లుపే
క్షించుట గాదు వీని బలిసేయు వసుంధరకున్ శుభం బగున్. 669

క. బాలుఁడు కరమున నుగ్ర, వ్యాళము ధరియించి యాడువడువున రక్షః
పాలునిఁ ద్రుంపక యూరక, పాలార్చుట నీతిగా శుభప్రద యింకన్. 670

వ. అదియునుం గాక. 671

మ. అనఘా యీయభిజిన్ముహూర్తమున దేవారాతి మర్దింపవే
ననయంబున్ మఱి దైత్యవేళ యగుసంధ్యాకాల మేతెంచినన్
ఘనమాయాబలశాలి యైనదనుజున్ ఖండింపఁగా రాదు గా
వున నీవేళన త్రుంపు సజ్జనహితప్రోద్యోగరక్షుండ వై. 672

క. అని సరసిజగర్భుఁడు ప, ల్కినవచనము లర్థి విని నిరీక్షింపులు గుంపుల్
గొని చూడ సస్మితానన,వనజము సెలువొంద నసురవరు కభిముఖుఁ డై. 673

తే. పుండరీకాక్షుఁ డయ్యును భూరిరోష,నిరతిఁ దరుణారుణాంభోజనేత్రుఁ డగుచు
ఘనగదాదండ మెత్తి రాక్షసునిహనువు,నుగ్రగతి మొత్తెవాఁడును నోసరించె.

క. పసువడి దితిసుతుఁ డతిభీ, కరగదఁ జేఁ బూని చిత్రగతులను బర్వో
దరు డాసి చేతిగద సా, గరమునఁ బడ నడిచె బాహుగర్వ మెలర్పన్. 675

వ. అంత. 676

తే. హరి నిరాయుధుఁ డైన సురారి సమర, ధర్మమాత్మనుదలఁచియుద్ధంబుఁ దక్కి

నిలిచి చూచుచు నుండెను । నింగి యమర,వరులహాహారవంబుల । భరిత మయ్యె.

క. సరసిజనేత్రుఁడు దనుజే,శ్వరుసంగరధర్మమునకు । సమధికశౌర్య
స్ఫురణకుఁ దనచిత్తంబునఁ, గర మాశ్చర్యంబు నొంది । కడఁక దలిర్పన్. 678

మ. కుతలోద్ధర్త మనంబునం దలఁచె రక్షోరాడ్వధార్థంబుగా
దితిసంతానకులాటవీమహితసందీప్తప్రభాశుక్రముఁ
సతతోద్యజ్జయశబ్దసన్ముఖరభాస్వచ్చక్రముఁ సంతతా
శ్రితనిర్వక్రముఁ బాలితప్రకటధాత్రీచక్రముం జక్రమున్. 679

వ. అదియునుం బ్రచండమార్తాండమండలప్రభాపటలచటులవిద్యోతమానంబును
బటునటజ్జ్వాలికాపాస్తమస్తకుటిలారాతిబలాఖర్వదుర్వారబాహాగర్వాంధకారం
బును నసహ్యకహకహనినదాధరీకృతసాగరఘోషంబును సకలదేవతాగణ
జేగీయమానంబును ననంతతేజోవిరాజితంబును నిజప్రభాపటలపూరితబ్రహ్మాండ
కటాహంబును నై రయంబునం జనుదెంచి దనుజారిదక్షిణకరసరోజంబు నలంక
రించిన నాశుభాంగుండు రథాంగపాణి యై దివంబున నమరగణంబులు జయ
జయశబ్దంబులు వలుక నసురవిభున కెదురు గా నడచిన. 680

క. పొడగని దనుజుఁడు పెదవులు, దడుపుచుఁ బొలివోనిబంటు । తనమున బీరం
బుడుగక భీషణగదఁ గొని, యడిచెఁ మఖమయవరాహు । ననమితోత్సాహున్.

క. త్రిదశారి దన్ను వ్రేసిన, గదఁ బదమునఁ బోవఁ దన్ని । కమలాక్షుఁడు పెం
పొదవఁగ మనమున మోదము, గదురఁగ లేనగవు వదన । కమలముఁ [1]బొదువన్.

వ. ఇవ్విధంబున గదఁ బోవం దన్ని యసురవిభునితో ని ట్లనియె. 683

చ. ఘనగదఁ గేలఁ బూని భుజ । గర్వ మెలర్పఁగ నన్ను సంగరా
వని నెదిరింతు రార యని । వారణ దైత్యకులేశ్వరాధమా
యనవుడు వాఁడు [2]నుబ్బి గద । నంబుజనాభుని వ్రేసె వ్రేసినం
దనుజవిభేది వట్టికొనెఁ । దార్క్ష్యుఁ డహీంద్రునిఁ బట్టుకైవడిన్. 684

క. దితిజుఁడు దనబల మప్రతి,హతతేజుం డగుసరోరు । హాక్షునిశౌర్యో
న్నతిమీఁదఁ బెట్టకుండుట, మతి నెఱిఁగియుఁ బెనఁగె దురభి । మానముపేర్మిన్.

వ. అంత. 686

సీ. కాలానలజ్వాల । జ్వాలావిలోలక, రాళ మై పెంపొందు । శూల మంది
సురవైరి యక్షసూ । కరరూపధరుఁ డైన, వనజనాభునిమీఁద । వైవ నదియు
సద్ద్విజోత్తముమీఁదఁ । జపలత గావించు, నభిచారకర్మంబు । నట్లు బెండు
పడి పఱతేఁ గని । పద్మోదరుఁడు దానిఁ, జక్రధారాహతిఁ । జండవిక్ర

తే. మమున నడుమన వడిఁ ద్రుంచె । నమరభర్త, మహితదంభోళిచే గరు । త్మంతుపక్ష
మతిరయంబునఁ ద్రుంచిన । గతిఁ జెలంగి, సురలు మోదింప నసురులు । సొంపుడింప.

---

1. మ్రోవన్. 2. నవ్వి.

వ. అయ్యవసరంబున నయ్యసుర దనశూలంబు చక్రంబుచేత నిహతం బగుటం గని.

క. దితిజుఁడు రోషోద్ధతుఁడై, యతినిష్ఠురముష్టిఁ బొడిచె హరి నాలోకో
న్నతుఁ డొప్పెఁ గుసుమమాలా,హతి దిగ్గజరాజుఁబోలె నతిదర్పితుఁడై. 689

మ. హరిమీఁదన్ దితిసంభవుండు ఘనమాయాకోట్లు పుట్టించినన్
ధరణీచక్రము భూరిపాంసుపటలధ్వాంతంబునం గప్పె భీ
కరపాషాణపురీషమూత్రఘనదుర్గంధాస్థిరక్తావళుల్
గురిసెన్ మేఘము లభ్రవీథిని మహాక్షోభక్రియాలోలమై. 690

వ. మఱియును. 691

చ. తవిలి విముక్తకేశపరిధానము లుగ్రకరాళదంతతా
లువులును రక్తలోచనములుం గలభూతపిశాచఢాకినీ
నివహము లంతరిక్షమున నిల్చి నిజాయుధపాణులై మహా
రవము గ యక్షదైత్యచతురంగబలంబులఁ గూడి తోఁచినన్. 692

వ. అంత. 693

క. త్రిసవనపాదుం డగునా,బిసరుహనేత్రుండు లోకభీకర మగునా
యసురాధిపు మాయావిని.రసనకరం బైనశస్త్రరాజముఁ బనుపన్. 694

క. ఆచక్రభానుదీప్తి ధ, రాచక్రమునందు నిండి రయమున నమ్మా
యాచక్రము నడఁగించెను, నీచక్రముఁ డైనయామినీచరు నెదురన్. 695

వ. అంత నక్కడ. 696

క. దితి దనవిభువాక్యంబుల, గతి దప్పద యనుచుఁ దలఁపఁగాఁ జన్నుల శో
ణితధార లొలికె రక్షః, పతి యగుకనకాక్షుపతనభావము దోఁపన్. 697

వ. అయ్యవసరంబున నసురవిభుండు దనచేసినమాయాశతంబులు గృతఘ్నునకుం గావించినయుపకారంబులుంబోలె హరిమీఁదఁ బని సేయక విఫలంబు లయినం బొలివోవనిబంటుతనంబునఁ బుండరీకాక్షుఁ జేరం జనుదెంచి బాహుయుగళంబు సాఁచి పూఁచి పొడిచి రక్షోవైరివక్షంబుఁ బీడించిన నయ్యధోక్షజుండు దప్పించుకొని తలంగినం జెలంగి దైత్యుండు నిష్ఠురం బగుముష్టిం బొడిచిన నసురాంతకుండు మిసిమింతుండు గాక రోషభీషణాకారంబున వాసవుండు వృత్రాసురుం దెగటార్చినచందంబున వజ్రి వజ్రసన్నిభం బగునఱచేతం [1]గఱకుటసురకటితటంబుఁ జటులగతి వ్రేసిన (నాహిరణ్యాక్షుండు దిర్దిరం దిరిగి యుదస్తలోచనుండై సోలి యొట్టకేలకు నెదుర నిలువంబడె నంత.) 698

క. దిట చెడి లోఁబడె దైత్యుఁడు, సటికిన్ దంష్ట్రావిభిన్నశత్రుమహోర
స్తటికిన్ ఖరఖురపుటికిం, గటితటహతకమలజాండఘటికిం గిటికిన్. 699

వ. ఇట్లు లోఁబడిన. 700

1 గఱకు దనుజకటి.

మ. [1]దివి నింద్రాదులు సంతసింప హరి మొత్తెం గర్ణమూలంబునం
బవిసంకాశకఠోరహస్తమున శుంభల్లీల మై దానవా
నవలోకేశుఁ డుదస్తనేత్రుఁ డగుచు న్దైన్యంబు వాటిల్లఁగా
భువిమీఁదన్ వడిఁ గూలె మారుతహతోన్మూలావనీజాకృతిన్. 701

క. బుడబుడ నెత్తురు గ్రక్కుచు, వెడరూపము దాల్చి గ్రుడ్లు వెలికుఱుక నిలం
బడి పండ్లు గీఁటుకొనుచును, విడిచెం బ్రాణములు దైత్యవీరుం డంతన్. 702

తే. పడినదనుజేశ్వరునిఁ జూచి పద్మసంభ, వాదిదివిజులు వెఱఁగంది రాత్మలందు
నితఁడు వొందుట యెట్లొకో యీయవస్థ, ననితలంచుచు మఱియు నిట్లనిరి వరుస.

మ. వరయోగీంద్రులు యోగమార్గముల నెవ్వానిన్ మనోవీథి సు
స్థిరతన్ లింగశరీరభంగమునకై చింతింతు రాపంకజో
దరుపాణ్యాహతిఁ దన్ముఖాంబురుహముం దర్శించుచుం జచ్చె దు
ర్భరి[2]తోత్తంసుఁడు దైత్యవల్లభుని [3]సౌభాగ్యంబు దా నెట్టిదో. 704

చ. సమమతి వీరు దైత్యకులశాసనుపారిషదుల్ మునీంద్రశా
పమున నికృష్టజన్మమునఁ బైకొని పుట్టియు నేఁడు విష్ణుచే
సమయుటఁ జేసి మీఁద నగుజన్మమునన్ జలజాక్షునిత్యవా
సమున వసింతు రెన్నఁటికిఁ జావును బుట్టువు లేవు వీరికిన్. 705

క. అని వెఱఁగందుచుఁ ద్రిసవన, తను వొందినయట్టివికచతామరసాక్షు
న్ననిమిషమునియోగిజనా, వనదక్షున్ దనుజకరటివరహర్యక్షున్. 706

వ. కనుంగొని. 707

చ. వనజదళాక్ష యీజగతి వారలమర్త్యము లీ వెఱింగి యీ
సునఁ బగఁ బుట్టనీ దివిజసూదనుఁ జంపితి గాన యింక శో
భన మగు నంచు హస్తములు ఫాలములం గదియించి యందఱున్
వినమితులై నుతించిరి వివేకవిశాలునిఁ బుణ్యశీలునిన్. 708

వ. అంత. 709

చ. సవనవరాహమూర్తి సురశాత్రవుఁ ద్రుంచినమీఁద భారతీ
ధవముఖదేవతామునికదంబము దన్ను నుతించునట్టిసం
స్తవమున కాత్మలోనఁ బ్రమదంబునఁ బొంది సమగ్రమంగళో
త్సవము దలిర్ప నందఱఁ బ్రసాదవిలోకన మొప్పఁ జూచుచున్. 710

చ. అరిగె వికుంఠధామమున కమ్మహితోత్సవసూచకంబుగా
మొరసె సుపర్వదుందుభులమోఘములై ధరణీతలంబునం

---

1 'దివి నింద్రాదులు సంతసింప హరి యుద్రేకం బనేకంబుగాఁ, బవిసంకాశకఠోరహస్తమున శుంభల్లీలమై వ్రేయ దానవ'—వ్రాఁతప్రతులు. 2 తోదాత్తుఁడు. 3 యీభాగ్యంబు.

గురిసెఁ బ్రసూనవృష్టి శిఖికుండము లెల్లెడఁ దేజరిల్లె భా
స్కరశశిమండలంబులు నిజద్యుతితో వెలుఁ గొందె నత్తఱిన్. 711

క. అని యీపుణ్యచరిత్రము, వనరుహసంభవుఁడు త్రిదివవాసులకుం జె
ప్పినయది మైత్రేయుఁడు విదురున కెఱిఁగించినవిధంబు రూఢము గాఁగన్.

క. శుకయోగి పరీక్షిత్తున, కకుటిలమతి నెఱుఁగఁ జెప్పె నని సూతుఁడు శౌ
నకముఖ్యులైన మునివరులకుఁ దెలియఁగఁ జెప్పె మఱియు లాలన యొప్పన్.

వ. ఇవ్విధంబున మైత్రేయుండు సెప్పిన విని విదురుండు సంతసిల్లె నని. 714

క. అనఘం బగు నీచరితము, వినినఁ బఠించిన లభించు విశ్రుతకీర్తుల్
వనజోదరుపదభక్తియు, మునుకొని యిహపరసుసౌఖ్యములు జనములకున్.

వ. అని చెప్పి వెండియు సూతుండు మహర్షుల కిట్లనియె నట్లు పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రుం గనుంగొని మునీంద్రా హిరణ్యాక్షవధానంతరంబున వసుంధర సమస్థితిం బొందినవిధంబును స్వాయంభువమనువుఁ బుట్టించినయనంతరంబున విరించి తిర్యగ్జాతిజంతుసృష్టినిమిత్తంబు లైనమార్గంబు లెన్ని సృజించె మహాభాగవతోత్తముం డగువిదురుండు కృష్ణున కపకారంబు దలంచినపాపవర్తను లగుధృతరాష్ట్రపుత్త్రులం బాసి జనకుం డగుకృష్ణద్వైపాయనునకు సముం డగుచుఁ దనమనోవాక్కాయకర్మంబులు కృష్ణునందఁ జేర్చి భాగవతజనోపాసకుం డై పుణ్యతీర్థసేవాసమాలబ్ధయశోవిగతకల్మషుం డగుచు మైత్రేయమహాముని నేమిప్రశ్నంబు లడిగె నని యెల్లం దెలియ నానతి మ్మనిన రాజేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 716

సీ. విమలాత్ముఁ డైనయవ్విదురుండు మైత్రేయ,మునివరుఁ జూచి యిట్లనియెఁ బ్రీతిఁ
జతురాత్మ సకలప్రజాపతి యైనట్టి, జలజగర్భుఁడు ప్రజాసర్గమందు
మును ప్రజాపతులను బుట్టించి వెండియుఁ, జిత్తమం దేమి సృజింపఁ దలఁచె
మును సృజించినయట్టిమునులు మరీచ్యాదు, లబ్జజునాదేశమాత్ర నిలిపి

తే. యర్థి నెట్లు సృజించిరి యఖిలజగము, మెఱసి మఱి వారు భార్యాసమేతు లగుచు
నేమి సృజియించి రది గాక కామినులను, బాసి రేమి సృజించి రాభద్రయశులు.

క. అందఱుఁ దమలో నైక్యముఁ, జెందినచో నేమి దగ సృజించిరి కరుణా
కందళితహృదయ యన్నియుఁ, బొందుగ నెఱిఁగింపు మయ్య బుధనుత నాకున్.

చతుర్ముఖుం డొనర్చు యక్షాదిదేవతాగణసృష్టిఁ దెలుపుట.

సీ. అనిన మునీంద్రుఁ డిట్లనియె జీవాదృష్ట,పరుఁడు మాయాయుక్తపురుషవరుఁడుఁ
గాలాత్మకుఁడు నను కారణంబున నిర్వి,కారుఁ డైనట్టిజగన్నివాసుఁ
డాది జాతక్షోభుఁ డయ్యె నమ్మేటివ,లనను గుణత్రయంబును జనించె
నాగుణత్రయమునం దయ్యె మహత్తత్త్వ, మది రజోగుణహేతు వైన దాని

తే. యందు దహంకార మొగిఁ ద్రిగుణాత్మకమునఁ

బొడమె మఱి దానివలనఁ బ్రభూత మయ్యెఁ
బంచతన్మాత్ర లందు సంభవము నొందె
భూతపంచక మీసృష్టిహేతు వగుచు. 719

వ. అవియును దమలోనఁ బ్రత్యేకంబ భువననిర్మాణకర్మంబునకు సమర్థంబులు గాక యన్నింటిసంఘాతంబునఁ బాంచభౌతికం బైనహిరణ్మయాండంబు సృజియించె నదియును జలాంతర్వర్తి యై వృద్ధిఁ బొందు చుండె నందు. 720

సీ. నారాయణాఖ్య సుస్థితి నొప్పుబ్రహ్మంబు, సాహస్రదివ్యవర్షంబు లోలి
వసియించి యుండె నావాసుదేవునినాభి,యందు సహస్రసూర్యప్రదీప్తిఁ
దనరుచు సకలజీవనికాయయుత మగు,పంకజాతంబు సంభవము నొందెఁ
బరఁగంగ నందులో భగవదధిష్ఠితుం, డై స్వరాట్టగుచతురాననుండు
తే. జనన మందెను దత్పద్మసంభవుండు, [1]నామరూపగుణాదిసంజ్ఞానమేతుఁ
డగుచు నిర్మాణమొనరించెనఖిలజగము, వనజజుండు నిజచ్ఛాయవలన మఱియు.

సీ. తామిస్రమునునంధతామిస్రమును దమ.మును మోహనముమహామోహనంబు
ననుపంచమోహరూపాత్మక మైనయ,విద్యఁ బుట్టించి యవ్వేధఁ దనకు
నది తమోమయదేహ మని మది రోసి త,త్తనువు విసర్జించె ధాతృముక్త
దేహంబు సతతక్షుత్తృష్ణల కావాస,మును రాత్రిమయము నయ్యెను దలంప
తే. నందులో యక్షరక్షస్సులన జనింప, వారికప్పుడు క్షుత్తృషల్ వఱలఁ గొంద
ఱాచతుర్ముఖు భక్షింత మనిరి కొంద, ఱతని రక్షింత మని తగ నాడి రంత.

వ. ఇట్లు పలుకుచు భక్షించువార లయి ధాతసన్నిధికిం జనిన నతండు భయవిహ్వలుం డై యేను మీజనకుండను మీరలు మత్పుత్రులరు నన్ను హింసింపకుం డనుచు మా మాజక్షత రక్షత యనుశబ్దంబులు పలుకం దన్నిమిత్తంబున వారలకుం గ్రమంబున యక్షరక్షోనామంబులు ప్రకటంబు లయ్యె వెండియుం బ్రభావిభాసితం బైనయొక్కకాయంబు ధరియించి సత్త్వగుణగరిష్ఠులుం బ్రభావంతులు నగుసుపర్వాలం బ్రముఖులంగా సృజియించి తత్ప్రభామయగాత్రవిసర్జనంబు సేసిన నది యహోరూపం బై దేవతాళికి నాశ్రయం బయ్యె మఱియు జఘనంబువలన నతిలోలుపు లైనయసురలం బుట్టింప వార (లతికాముకు లగుటం జేసి య)య్యజునిం జేరి మిథునకర్మం బపేక్షించిన విరించి నగుచు నిర్లజ్జులయినయసురులు దనవెంటం దగులం బఱచి ప్రపన్నార్తిహరుండును భక్తజనానురూపసందర్శనుండును నైననారాయణుం జేరి తత్పాదంబులకుం బ్రణమిల్లి యిట్లనియె.

క. రక్షింపుము రక్షింపు ము,పేక్షింపక వినుతనిఖిలబృందారక వి
శ్వక్షేమంకర విను మిటు, దక్షత నీయాజ్ఞ నేను దల నిడి వరుసన్. 724

తే. ఈప్రజాసృష్టికల్పనం జే నొనర్ప, నందుఁ బాపాత్ము లైనయీయసురు లిపుడు

---

1 నామధేయాభిరూపసంజ్ఞా.

ననుఁ రమింపఁగ డాయ వచ్చినఁ గలంగి, యిటకు వచ్చితి ననుఁ గావు మిద్ధచరిత.

వ. అదియునుం గాక లోకంబువారలకుం గ్లేశంబు లొనరింపం గ్లేశంబునం బొందినవారల క్లేశంబు లపనయింపను నీవ కాక (యితరులు గలరే) యని స్తుతియించినఁ బద్మజుకార్పణ్యం బెఱుంగ నవధరించి వివిక్తాధ్యాత్మదర్శనుం డగుచుఁ గమలసంభవ భవద్ఘోరతనుత్యాగంబు సేయు మని యానతిచ్చిన నతండు నట్ల చేసె నంత నదియును. 726

సీ. నవ్యకాంచనరణన్మణినూపురారావ, విలసితపాదారవిందయుగళ
కాంచీకలాపసంకలితదుకూలవ, స్త్రస్ఫారపులిననితంబబింబ
రాజితానోన్యసంఘర్షపీనకరికుంభ, పృథుకుచభారకంపితవలగ్న
మదిరారసాస్వాదమదవిఘూర్ణితచారు, సితనవవికచరాజీవనయన
తే. యపరపక్షాష్టమీశశాంకాభనిటల, మదవదలికులరుచిరోపమానచికుర
లలితచంపకకుసుమవిలాసనాస, హాసలీలావలోకన యబ్జపాణి. 727

క. అనఁ దగి సంధ్యారూపం, బున లలనారత్న మపుడు పుట్టిన దానిం
గనుఁగొని దానవు లపగూ, హన మొగిఁ గావించి పలికి రందఱుఁ దమలోన్.

క. ఈసౌకుమార్య మీవయ, సీసౌందర్యక్రమంబు నీస్థైర్యంబు
న్నీ[1]సౌభాగ్యవిశేషము, నేసతులకుఁ గలదు చూడ నిది చిత్రమగున్. 729

చ. అని వెఱఁగంది యద్దనుజు లందఱు నిట్లని రిట్టిలోదరిం
గని మన మంతనుండియును గాముకవృత్తిఁ జరించుచుండఁగా
మనవెడ దీనిచిత్తమున మక్కువ లేమికి నేమిహేతువో
యని బహుభంగులం బలికి రాప్రమదాకృతి నైనసంధ్యతోన్. 730

వ. ఇట్లనిరి. 731

క. ఓకదళీస్తంభోరువ, యేకుల మేజాడదాన వెవ్వరిసుత వి
ట్లేకాంతంబున నిచ్చట, నేకారణమునఁ జరించె దెఱిఁగింపు తగన్. 732

క. భవదీయచారురూప, ద్రవిణలసత్పణ్యభూమిఁ దగు మోహమునం
దవిలినదుర్భరులను మముఁ, గవయవు పుష్పాస్త్రబాధ ఘనమయ్యెఁ గదే.

వ. [2]అని యంత. 734

సీ. గురుకుచభారసంకుచితావలగ్నంబు, దనరారునాకాశతలము గాఁగ
లలితపల్లవపాణితలమునఁ జెన్నొందు, చెండు పతత్పతంగుండు గాఁగ
సలలితనీలపేశలపృథుధమ్మిల్ల, బంధంబు ఘనతమపటలి గాఁగఁ
బ్రవిమలతరకాంతిభావవిలోకన, జాలంబు దారకాసమితి గాఁగఁ
తే. గడఁగి మైపూఁత సాంధ్యరాగంబు గాఁగ
నంగనాకృతి నొప్పుసంధ్యావధూటిఁ

1 సౌబగు నీవిశేషము. 2. మఱియుఁ దదీయసౌందర్యం బుగ్గడింప నలవి కాక చింతించుచు.

గదిసి మనముల మోహంబు • గడలుకొనఁగ
నసురు లందఱుఁ గూడి యి • ట్లనిరి మఱియు. 735

క. వెలయఁగఁ బద్మం బేక, స్థలముననే యొప్పుఁ గాని • త్వత్పదపద్మం
బిల బహుగతుల ననేక,స్థలములఁ దనరారుఁ గాదె • తరుణాబ్జముఖీ. 736

క. అని దనుజులు దమమనముల, ననురాగము లుప్పతిల్ల • నందఱు నాసం
ధ్యను బట్టికొనిరి వనజా,సనుఁ డప్పుడు హృదయమందు • సంతస మందెన్.

క. సరసిజభవుఁ డయ్యెడఁ దన, కర మాఘ్రాణింప నపుడు • గంధర్వులు న
ప్సరసలుఁ బుట్టిరి ధాతయుఁ, బరువడి నా త్రియతనువుఁ • బాసిన నదియున్. 738

వ. చంద్రికారూపంబైనఁ దద్గాత్రంబు (విశ్వావసుపురోగములగు) గంధర్వాప్సరో
గణంబులు గైకొనిరి వెండియుం గమలగర్భుండు దంద్రోన్మాదజృంభికానిద్రా
రూపంబైన శరీరంబు దాల్చి పిశాచగుహ్యకసిద్ధభూతగణంబులం బుట్టించిన
వారలు దిగంబరులు ముక్తకేశులు నయినం జూచి ధాత లోచనంబులు ముకు
ళించి తద్గాత్రంబు విసర్జనంబు గావించిన నది వారలు గైకొనిరి వెండియు
నజుండు దన్ను నన్నవంతునిఁ గాఁ జింతించి యదృశ్యదేహుం డగుచుం బితృ
సాధ్యగణంబులం బుట్టించిన వారలు దమ్ముఁ బుట్టించినయదృశ్యశరీరంబునకుం
గార్యం బగుదేవభాగంబుఁ గైకొనినం దత్కారణంబునం బితృసాధ్యగణంబుల
నుద్దేశించి శ్రాద్ధంబుల హవ్యకవ్యంబు లాచరింతురు మఱియును. 739

సీ. సజ్జనస్తుత విను • చతురతఁ బంకజా,సనుఁడు దిరోధానశక్తివలన
నరసిద్ధవిబుధకిన్నరులను బుట్టించి, తవిలి వారికిఁ దిరోధాననామ
ధేయ మైనట్టియా • దేహంబు నిచ్చెను, వెండియు భారతీవిభుఁడు దనకుఁ
బ్రతిబింబ మగుశరీరమునఁ గిన్నరులఁ గిం,పురుషులఁ బుట్టింపఁ • బూని వారు

తే. ధాతృప్రతిబింబదేహముల్ • దాల్చి వరుస,నిద్దఱిద్దఱు గవగూడి • యింపులొదవ
బ్రహ్మపర మైనగీతముల్ • వాడుచుండి, రంతఁ బంకజసంభవుఁ • డాత్మలోన.

క. తనసృష్టి వృద్ధిలేమికిఁ, గనలుచు శయనించి చింతఁ • గరచరణాదుల్
గొనకొని కదలింపఁగ రా, లినరోమము లుగ్రకుండలివ్రజ మయ్యెన్. 741

క. వనజజుఁడు దన్నుఁ గృతకృ,త్యునిఁ గా భావించి యాత్మఁ • దుష్టి వహింపన్
మనమున నిఖిలజగత్పా,వను లగు[1]మనులం ద్రిలోకవరుల సృజించెన్. 742

సీ. పుట్టించి వారికిఁ • బురుషరూపంబైన, తనదేహ మిచ్చినఁ • దగిలి వారు
గనుఁగొని మున్ను పుట్టినవారిఁ గూడి యా,వనజసంభవున కి • ట్లనిరి దేవ
యఖిలజగత్స్రష్ట • వైననీచేతఁ గా,వింపఁగఁబడినయీ • వితతసుకృత
[2]మాశ్చర్యకరము యజ్ఞాదిక్రియాకాండ, మీమనుసర్గ మం • దీడ్య మయ్యెఁ

1 బ్రహ్మణ్యముఖ్యవరుల. 2 మాశ్చర్యకర మయ్యె • నందు యజ్ఞాదిక్రియాకాండ మిది నిశ్చ
•యంబు నొందె.

తే. దగ్ధవిర్భాగములు మాకుఁ దవిలి జిహ్వ
లందు నాస్వాదనములు సేయంగఁ గలిగె
ననుచు మనముల హర్షంబు లతిశయిల్ల
వినుతి సేసిరి భారతీవిభుని మఱియు. 743

వ. వరతపోయోగవిద్యాసమాధియుక్తం బగుచు ఋషివేషధరుండును హృషీకాత్ముండును నై ఋషిగణంబులం బుట్టించి సమాధియోగైశ్వర్యతపోవిద్యావిరక్తియుక్తం బగు నాత్మీయశరీరాంశంబు వారికిం గ్రమంబున నొక్కొక్కనికి నిచ్చె నని మైత్రేయుండు సెప్పిన విని విదురుండు పరమానందంబునం బొంది గోవిందుచరణారవిందంబులు డెందంబునం దలంచి వెండియు మైత్రేయునిం జూచి యి ట్లనియె.

సీ. మునినాథ స్వాయంభు వనుమనువంశంబు, పరమసమ్మతము దప్పదు తలంపఁ
గొనకొని తద్వంశమున మిథునక్రియఁ, జేసి ప్రజావృద్ధిఁ జెప్పి తీవు
అదియును గాక స్వాయంభువమనువుకుఁ, బూని ప్రియవ్రతోత్తానపాదు
లనునందనులు గల రంటివి వారు స, ప్తద్వీపవతి యైనధాత్రి నెల్ల
తే. ధర్మమార్గంబు లేమియుఁ దప్పకుండ, ననఘు లై యెట్లు పాలించి రయ్య వారి
చరిత మెల్లను సత్కృపానిరతబుద్ధి, నెఱుఁగ వినిపింపు నాకు మునీంద్రచంద్ర.

వ. అదియునుం గాక తన్మనుపుత్రియు యోగలక్షణసమేతయు నగు దేవహూతి యను కన్యకారత్నంబును స్వాయంభువుండు గర్దమునకు నేవిధంబునం బెండ్లి చేసె నా దేవహూతియందు మహాయోగి యయిన కర్దముండు ప్రజల నేలాగునం బుట్టించె నదియునుం గాక కర్దముండు రుచి యను కన్యను దక్షప్రజాపతికి నిచ్చె నని చెప్పితి వారుచియందు నమ్మహాత్ముం డీసృష్టి నేలాగునం బుట్టించె నవి యన్నియుం దెలియ నానతీయవలయు నని యడిగిన విదురునకు మైత్రేయుం డి ట్లనియె.

కర్దముఁడు భగవదనుజ్ఞ వడసి దేవహూతిని బెండ్లి యాడుట.

క. విను మనఘ కృతయుగంబున, మునినాథుం డయినకర్దముఁడు ప్రజల సృజిం
పను వనజసంభవునిచే,త నియుక్తుం డగుచు మది ముదము సంధిల్లన్. 747
తే. ధీరగుణుఁడు సరస్వతీతీరమందుఁ, దవిలి పదివేలదివ్యవత్సరము లోలిఁ
దపము సేయుచు నొకనాఁడు జపసమాధి, నుండి యేకాగ్రచిత్తుఁడై నిండువేడ్క.
క. వరదుఁ బ్రసన్ను మనోరథ, వరదానసుశీలు నమరవంద్యు రమేశున్
దురితవిదూరు సుదర్శన, కరుఁ బూజించిన నతండు కరుణాకరుఁడై. 749
వ. అంతరిక్షంబునం బ్రత్యక్షం బైన. 750
సీ. తరణిసుధాకర[1]కిరణసమంచిత, సరసీరుహోత్పలస్రగ్విలాసుఁ
గంకణనూపురగ్రైవేయముద్రికా, హారకుండలకిరీటాభిరాముఁ
గమనీయసాగరకన్యకాకౌస్తుభ, మణిభూషణోద్భాసమానవక్షు

---

1 కిరణదరాంచిత.

సలలితదరహాససచంద్రికాధవళిత,చారుదర్పణవిరాజత్కపోలు
తే. శంఖచక్రగదాపద్మచారుహస్తు, నలికులాలకరుచిభాస్వదలికఫలకుఁ
బీతకౌశేయవాసుఁ గృపాతరంగి,తస్మితేక్షణుఁ బంకజోదరుని హరిని. 751

వ. మఱియు శబ్దబ్రహ్మశరీరవంతుండును సదాత్మకుండును జ్ఞానైకవేద్యుండును వైన తేయాంసవిన్యస్తచరణారవిందుండును నయినగోవిందుని గనుంగొని సంజాత హర్షలహరీపరవశుండును లబ్ధమనోరథుండును నగుచు సాష్టాంగదండప్రణామంబు లాచరించి తదనంతరంబ. 752

క. ముకుళితకరకమలుం డయి, యకుటిలసద్భక్తిపరవశాత్మకుఁ డగుచుఁ
వికచాంభోరుహలోచను,నకు ని ట్లనియెం దదాననముఁ గనుఁగొనుచున్. 753

సీ. అజ్ఞాతసకలభూతాంతరాత్ముఁడ వనఁ, దనరు చుండెడిభవద్దర్శనంబుఁ
దలకొని సుకృతసత్ఫలభరితంబులై,నట్టియనేకజన్మానుసరణిఁ
బ్రకటయోగక్రియాభ్యాసనిరూఢులై,నట్టియోగీశ్వరు లాత్మ నిచ్చ
యింతురు యోగీశ్వరేశ్వర దేవ భవ,త్పాదారవిందసందర్శనంబు

తే. గంటి భవవార్ధిఁ గడవంగఁ గంటి మంటిఁ,గడఁగినాలోచనంబులకలిమి నేఁడు
తవిలి సఫలత నొందె మాధవ ముకుంద, చిరదయాకార నిత్యలక్ష్మీవిహార.

వ. అదియునుం గాక దేవా భవదీయమాయావిమోహితులై హతమేధస్కులై సంసారపారావారోత్తారకంబులైనభవదీయపాదారవిందంబులు దుష్ప్రవృత్తి కాము లయి సేవించి నిరయగతులైనవారికిం దత్కామయోగ్యంబు లగు మనోరథంబుల నిత్తు వట్టిసకాములైనవారి నిందించు నేనును (గృహమేధధేనువునశేషమూలయుం) ద్రివర్గకారణయు సమానశీలయునయినభార్యం బరిణయంబుగా నపేక్షించి కల్పతరుమూల(సదృశ)ంబులైనభవదీయపాదారవిందంబులు సేవించితి నయిన నొక్కవిశేషంబు గలదు విన్నవించెద నవధరింపుము బ్రహ్మాత్మకుండ వయినభవద్వచస్తంత్రీనిబద్ధులై లోకులు కామహతులై రంట యేనును వారల ననుసరించినవాఁడనై కాలాత్మకుండ వైననీకు నభిమతం బగునట్లుగాఁ గర్మమయం బైనభవదాజ్ఞాచక్రంబు ననుసరించుటకుఁ గాని మదీయకామంబు కొఱకుఁ గాదు భవదీయమాయావినిర్మితంబును ([1]గాలాత్మకభూరివేగసమాయుక్తంబును నక్షరంబును నైనబ్రహ్మంబునందు భ్రమణశీలంబును)నధిమాససమేతత్రయోదశమాసారంబును షష్ట్యుత్తరశతత్రయాహోరాత్రమయపర్వంబును ఋతుషట్కసమాకలితనేమియుం జాతుర్మాస్యత్రయవిరాజితనాభియు నపరిమితక్షణలవాదిపరికల్పితపత్త్రశోభితంబునుం గాలాత్మకభూరివేగసమాయుక్తంబును నైనకాలచక్రంబు సకలజీవనికరాయుర్గ్రసనతత్పరం బగుం గాని కామాభిభూతజనానుగతపశుప్రాయు లగులోకుల విడిచి భవపరితాపనివారణకారణం బయిన

1 'బ్రహ్మాత్మకంబును' అని వ్రాఁతప్రతులు.

భవదీయచరణాతపత్రచ్ఛాయాసమాశ్రయులై తావకీనగుణకథనసుధాస్వాదన
రుచిరలహరీనిరసితసకలదేహధర్ములైన భగవద్భక్తజనాయుర్హరణసమర్థంబు గా
కుండు నని వెండియు. 755

మ. అనఘా యొక్కఁడ వయ్యు నాత్మకృతమాయాజాతసత్త్వాదిశ
క్తిని కాయస్థితి నీజగజ్జననవృద్ధిక్షోభహేతుప్రభా
వనిరూఢిం దగు దూర్ణనాభిగతి విశ్వస్తుత్య సర్వేశ నీ
ఘనలీలామహిమార్ణవంబుఁ గడవంగా వచ్చునే యేరికిన్. 756

వ. దేవా శబ్దాదివిషయసుఖకరం బగురూపంబు విస్తరింపం జేయు టెల్ల నస్మదను
గ్రహార్థంబు గాని నీకొఱకుం గాదాత్మీయమాయాపరివర్తితలోకతంత్రంబు గలిగి
మదీయమనోరథసుధాప్రవర్షి వైన నీకు నమస్కరించెద. 757

మ. అని యిబ్భంగి నుతించినన్ విని సరోజాక్షుండు మోదంబునన్
వినతానందనకంధరోపరిచరద్విభ్రాజమానాంగుఁడు
న్ననురాగస్మితచంద్రికాకలితశోభాలోకుఁడు నై మునీం
ద్రునిఁ గారుణ్య మెలర్పఁ జూచి పలికెన్ రోచిష్ణుఁడై వేడ్కడిన్. 758

క. మునివర యేకోరిక నీ, మనమునఁ గామించి నను సమంచితభక్తిన్
నెనరునఁ బూజించితి నీ, కనయము నాకోర్కి సఫలమయ్యెఁ జుమ్మీ. 759

వ. అని యాన తిచ్చి ప్రజాపతిపుత్త్రుండును సమ్రాట్టును నైనస్వాయంభువమనువు
బ్రహ్మావర్తదేశంబునందు సప్తార్ణవమేఖలామండితమహీమండలంబుఁ బరిపాలించు
చున్నవాఁ డమ్మహాత్ముం [1]డపరదివసంబున నిందులకు శతరూప యనుభార్యా
సమేతుం డై భర్తృకామ యగుకూఁతుం దోడ్కొని భవదీయసన్నిధికిం జను
దెంచి నిను ననురూపవయశ్శీలసంకల్పగుణాకర వైనతనపుత్త్రిం బరిణయంబు
గావించు భవదీయమనోరథంబు సిద్ధించు ననుం జిత్తంబున సంస్మరించుచుండు
నమ్ముకన్య నిను వరించి భవద్వీర్యంబువలన నతిసౌందర్యవతు లగుకన్యలం
దొమ్మండ్రం గను నాకన్యకానవకంబునందు మునీంద్రులు పుత్త్రోత్పాదనంబులు
సేయుంగలరు నీవు మదీయశాసనంబును ధరియించి మదర్పితాశేషకర్ముండ వగుచు
నైకాంతికస్వాంతంబున భూతాభయదానదయాచరితజ్ఞాని వై నాయందు జగం
బులు గల వనియు నీయందు నేఁ గల ననియు నెఱింగి సేవింపుము చరమకాలం
బున ననుం బొందఁగలవు భవదీయవీర్యంబువలన నేను నీభార్యాగర్భంబుఁ బ్రవే
శించి మత్కళాంశంబునఁ (బుత్త్రుండనై) సంభవించి నీకుం దత్త్వసంహిత నుప
న్యసింతు నని జనార్దనుండు గర్దమున కెఱింగించి యతండు గనుంగొను చుండ
నంతర్హితుండై. 760

చ. అతులసరస్వతీసరిదుదంచితబాలరసాలసాలశో

1 డట్లుండి యిందులకు.

ఖితతటతుంగరంగ మగు బిందుసరంబు వినిర్గమించి యం
చితగరుడావరోహణము సేసి తదీయగరుత్ప్రభూతరు
క్ప్రతతివిలక్షణక్రమవిరాజితసామము వించు మోది యై. 761

చ. అరిగె వికుంఠధామమున కంత సకాముఁ డైనకర్దముం
డరయ విమోహి యై మనమునందలిముందటవచ్చుకోరికల్
పరిగొనుచుండఁ దత్క్షణమ బిందుసరంబున కేఁగి యిందిరా
వరుఁ దలపోయుచుండె జనవంద్యుఁడు భక్తినితాంతచిత్తుఁ డై. 762

వ. అంత స్వాయంభువుండు గనకరథారూఢుం డగుచు నిజభార్యాసమేతుఁ డై భర్తృవాంఛాపర యైనపుత్త్రికం దోడ్కొనుచు నిజతనూజకుం దగినవరు నన్వేషించుచు భువనంబునం గలయం గ్రుమ్మరి యెందునుం గానక వచ్చి వచ్చి. 763

ఉ. ముందటఁ గాంచె నంత బుధముఖ్యుఁడు విష్ణుఁడు గర్దముఁ డయా
నంద మెలర్పఁ జూడ నయనంబుల రాలినబాష్పముల్ ధరన్
బిందువు లై వెసం దొరఁగి పేర్చి సరస్వతిఁ జుట్టి పాఱుటన్
బిందుసరోవరం బనెడి పేరఁ దనర్చినపుణ్యతీర్థమున్. 764

ఉ. అందుఁ దమాల సాల వకుళార్జున నింబ కదంబ పాటలీ
చందన నారికేళ ఘనసార శిరీష లవంగ లుంగ మా
కంద కుచందన క్రముక కాంచన బిల్వ కపిత్థ మల్లికా
కుంద మధూక మంజులనికుంజములం దనరారి వెండియున్. 765

క. పరిపక్వఫలభరానత, తరుశాఖానికరనివసితస్ఫుటవిహగో
త్కరబహుకోలాహలరవ, భరితదిగంతములు గలిగి భవ్యం బగుచున్. 766

క. అతినిశితచంచుదళన, క్షతనిర్గతపక్వఫలరసాస్వాదనమో
దితరాజశుకవచోర్థ, శ్రుతిఘోషము సెలఁగ శ్రవణసుఖదం బగుచున్. 767

క. లలితసహకారపల్లవ, కలితాస్వాదనకషాయకంఠవిరాజ
త్కలకంఠపంచమస్వర, కలనాదము లుల్లసిల్లఁ గడు రమ్యము లై. 768

క. అతులతమాలమహీజ, ప్రతతిక్షణజాతజలదపరిశంకాంగీ
కృతతాండవఖేలనవిల, సితపింఛవిభాసిబాలశిఖిసేవ్యం బై. 769

క. కారండవ జలకుక్కుట, సారస బక చక్రవాక షట్పద హంసాం
భోరుహ కైరవ నవక, హ్లార విరాజితసరోరుహాకరయుత మై. 770

క. కరి పుండరీక వృక కా, సర శశ భల్లూక హరిణ చమరీ హరి సూ
కర ఖడ్గ గవయ వలిముఖ, శరభ ప్రముఖోగ్ర వన్యసత్త్వాశ్రయ మై. 771

వ. ఒప్పునప్పరమతాపసోత్తమునియాశ్రమంబుఁ గనుంగొని మితపరిజనంబులతోడం జొచ్చి యందు. 772

సీ. అంచితబ్రహ్మచర్యవ్రతయోగ్య మై, విలసిల్లుఘనతపోవృత్తిచేత

దేహంబు రుచిరసందీప్తమై చెలువొందఁ, గడుఁ గృశీభూతాత్మకాయుఁ డయ్యు
నలినోదరాలాపనవసుధాపూరంబు, శ్రోత్రాంజలులఁ ద్రావి సొక్కి యున్న
కతనఁ గృశీభూతకాయుండు గాక జటావల్కలాజినశ్రీ వెలుంగఁ

తే. కమలపత్త్రవిశాలనేత్రములు దనర, నలినసంస్కారసంచితానర్ఘ్యయత్న
రత్నమును బోలియున్నకర్దమునిఁ జూచి, భక్తి నమ్మను వెరఁగందె తత్పదములకు.

వ. ఇట్లు వందనంబు గావించినం గర్దముండు దనగృహంబునకు వింతైచనుదెంచిన యమ్మనువు నాదరించి యర్ఘ్యపాద్యాదివిధులం బరితుష్టునిం గావించి పూర్వోక్తం బైనభగవదాదేశంబు సంస్మరించి స్వాయంభువున కిట్లనియె. 774

సీ. వరగుణాకర భగవద్భక్తియుక్తుఁడ, వైనత్వదీయపర్యటన మెల్ల
శిష్టపరిగ్రహదుష్టనిగ్రహములకొఱకుఁ గదా పుణ్యపురుష మఱియు
వనజహితాహితవహ్నిసమీరవై, వస్వతవార్ధిపవాసవాత్మ
కుఁడవు హరిస్వరూపుఁడవైననీకును, మానితభక్తి నమస్కరింతు

తే. ననఘ నీ విప్పుడే నేమియఖిలలోక, జైత్రమగు హేమమణిమయస్యందనంబు
నెక్కి కోదండపాణివై యుగ్రసైన్య, పదవిఘట్టనచే భూమిభాగ మగల. 775

మ. తరణింబోలెఁ జరింప కున్న ఘననిద్రం బొంది [1]యెందేని భూ
వర పక్షోదరకల్పితంబు లగునీవర్ణాశ్రమోదారవి
స్తరపాథోనిధిసేతుభూతమహిమాచారక్రియల్ దప్పి సం
కరమై చోరభయంబునన్ నిఖిలలోకంబుల్ నశించుం జుమీ. 776

వ. అని పలికి భవదాగమనంబునకు నిమిత్తం బెయ్యది యనవుడు సమాహితసకల నిత్యకర్మానుష్ఠానుం డైనమునీంద్రునకు స్వాయంభువుం డిట్లనియె. 777

క. సరసిజగర్భుఁడు దనచే, విరచితమైనట్టి వేదవితతుల నెల్లన్
ధర వెలయించుటకై బుధ,వర మిమ్ముం దనముఖంబువలన సృజించెన్. 778

క. దురితస్వరూపపాట, చ్చరపీడం బొందకుండ సకలక్షోణిం
బరిపాలించుటకై మము, నరవిందభవుండు భుజములందు సృజించెన్. 779

క. నెఱి నట్టిజలజభవునకుఁ, [2]గర మంతఃకరణగాత్రకములై వరుసం
బరఁగిన బ్రహ్మక్షత్త్రము, లరయ రమాధీశ్వరునకు నవనీయంబుల్. 780

వ. కావున హరిస్వరూపుండవై దుర్దసమర్దర్శనుండ వయిన[3]నినుం గనుట మదీయ భాగ్యంబున సిద్ధించె భవత్పాదకంజకింజల్కపుంజరంజితంబైనమదీయమస్తకంబును దావకవచనసుధాపూరితంబులైనశ్రవణంబులును మంగళాకరత్వంబున సాఫల్యంబునం బొందె నేను గృతార్థుండ నైతి దుహితృస్నేహదుఃఖపరిచ్ఛిన్నాంతఃకరణుండ(నై సకలదేశభ్రమణఖిన్నుండ) నయిననావిన్నపం బవధరింపు మని యిట్లనియె. 781

1 యొండేని. 2 'గరుణాంతఃకరణ. 3 భవద్దర్శనంబు మదీయ' వ్రా. ప్ర.

మ. వరయోగీశ్వర దేవహూతి యనునీవామాక్షి మత్పుత్రి దా
వరలావణ్యగుణాఢ్యులన్ వినియు నీవార్తల్ మదిం గోర గా
తుర యై నారదుపంపునన్ మిము వరింతు న్నంచు నేతెంచె నీ
తరుణీభిక్షఁ బరిగ్రహింపుము శుభోదాత్తక్రియాలోలతన్. 782

క. అమలినగృహమేధికకర్మములకు ననురూపగుణవిరాజితశీల
క్రమములఁ దనరినతరుణిం, బ్రమదమున వరింపుమయ్య భవ్యచరిత్రా. 783

క. అనఘ విరక్తుల కైనం, దనయంత లభించుసౌఖ్యతతి వర్జింపం
జన దఁట కాముకులకు న, బ్బిన మానుము రే లభించుప్రియసౌఖ్యంబుల్. 784

క. వినుము ఫలారంభుఁడు కృప, ణుని నడిగినఁ దనయశంబును దగుమానం
బును జెడుఁ గావున నీవును, నెనయ వివాహేచ్ఛఁ దగులు[1]ఒఱఁగి యుచితికిన్.

క. చనుదెంచితి మస్మత్ప్రార్థనఁ, గైకొని మత్తనూజఁ దగ వరియింపుం
డని ముని స్వాయంభువునిం, గనుఁగొని మఱలంగఁ బలికెఁ గడుముద మొప్పన్.

సీ. అనఘ నీచేత ననన్యవృత్తముగఁ బ్రతిష్ఠితం బైనయీతీవఁబోఁడి
కమనీయరూపరేఖావిలాసంబుల, మానితలక్ష్మీసమాన యగుచు
నొకనాఁటిరాత్రియం దుడురాజచంద్రికా, ధవళితనిజసౌధతలమునందు
మహిత[2]హిరణ్మయమంజీరశోభిత, చరణ యై నిజసఖీసహిత యగుచుఁ

తే. కందుకక్రీడఁ జరియింప గగనమందు, వరవిమానస్థుఁ డగుచు విశ్వావసుండు
నాఁగఁ దనరినగంధర్వనాయకుండు, తరుణిఁ జూచి విమోహి యై ధరణిఁ బడియె.

తే. పుండరీకాక్షు నెఱుఁగనిపురుషపశువు, లీతలోదరిఁ బొడగాన రేమి సెప్ప
నట్టి[3]కొమరాలు భాగ్యోదయమునఁ దాన, వచ్చి కామింప నొల్లనివాఁడు గలఁడె.

క. ఈకన్యారత్నమునకు, నాకును గుణరూపవర్తనంబులయెడ నా
లోకింప సమము కావునఁ, గైకొని వరియింతు విగతకల్మషవృత్తిన్. 789

క. విమలాత్మ దీని కొకసమ, యము గల దెఱిఁగింతు విను గుణాకర యగునీ
రమణికి నపత్యపర్యం, తము వర్తింపుదు గృహస్థధర్మక్రియలన్. 790

ఆ. అంతమీఁద విష్ణునాజ్ఞ యాదలఁ దాల్చి, శమదమాదియోగసరణిఁ బొంది
సన్న్యసించువాఁడ జలజనేత్రునివాక్య, కారణమునఁ జేసి ధీరచరిత. 791

క. శ్రీవిభునివలన నీలో, కావళి యుదయించుఁ బెరుఁగు నడఁగును విను రా
జీవభవాదుల కతఁడే, భూవర నిర్వాణహేతుభూతుం డరయన్. 792

వ. అది గావున నమ్మహాత్మునియాజ్ఞోల్లంఘనంబు సేయ రా దని కర్దముండు వలికిన విని స్వాయంభువుండు నిజభార్య యైనశతరూపతలంపును బుత్త్రి యైనదేవహూతిచిత్తంబును నెఱింగినవాఁడై మునిసమయంబున కియ్యకొని ప్రహృష్టహృదయుం డగుచు సమంచితగుణగణాఢ్యుం డయినకర్దమునకు దేవహూతిని విధ్యు

1 'ఒఱఁ గేమిటకున్' వ్రా. ప్ర. 2 రణన్మణిమంజీర. 3 'కోమలి' వ్రా. ప్ర.

క్తప్రకారంబున వివాహంబు సేయించెఁ దదనంతరంబు శతరూపయును బారిబర్హ
సంజ్ఞికంబు లైనవివాహోచితదివ్యాంబరాభరణంబులు దేవహూతికర్దముల కొ
సంగె నివ్విధంబున నిజకులాచారసరణిం బరిణయంబు గావించి విగతచింతాభరుం
డై స్వాయంభువుండు దుహితృవియోగవ్యాకులితచిత్తుం డగుచుఁ గూఁతుం గౌఁగి
లించుకొని చుబుకంబుఁ బుడుకుచుఁ జెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రే
మాతిరేకంబున బాష్పధారాసిక్తమస్తకం జేసి తల్లీ పోయివచ్చెద నని చెప్పి కర్ద
మునిచేత నామంత్రితుం డై నిజభార్యాసమేతుం డై రథం బెక్కి సపరివారుం డై.

చ. తరళతరంగవీచిసముదంచితబిందుసరస్సరస్వతీ
సరిదరవిందతుందిలలసత్తరుతీరనివాససన్ముని
శ్వరనికరాశ్రమాకలితసంపదలం గనుఁగొంచు వేడ్క ము
ప్పిరిగొన నేఁగె నాత్మపుటభేదనవిస్ఫుటమార్గవర్తి యై. 794

వ. ఇట్లు సని చని బ్రహ్మావర్తదేశంబునందు. 795

సీ. ఎందేనిఁ దొల్లి లక్ష్మీశుండు యజ్ఞసూ, కరమూర్తిఁ గైకొని సరభసమున
నొడలు జాడించినఁ బుడమిపై రాలిన, రోమజాలంబులు రుచిరహరిత
వర్ణ మై పొలుపారు వరకుశకాశమ, యంబును యజ్ఞక్రియాకలాప
యోగ్యంబు లై చాలఁ బొల్పారి బర్హిస్సు, సంభవించిన దాన సకలఋషులుఁ

తే. గ్రతువులొనరించి తద్విఘ్నకారు లైన, యసురులను ద్రుంచిరట్లు స్వాయంభువుండు
విష్ణుపరముగ మఖముగావించి రుచిర, మేధఁ జెలువొందె నట్టియాతీయపురము.

క. డాయం జనఁ బురజనములు, పాయనములు దెచ్చి యిచ్చి బహుగతులనుతుల్
సేయఁగ మంగళతూర్యము, లాయతగతి మొరయఁ జొచ్చె నంతఃపురమున్.

వ. ఇట్లు ప్రవేశించి తాపత్రయాపశామకం బగు భగవద్భక్తి వృద్ధిఁ బొందించుచుఁ
బుత్రమిత్రకళత్రసుహృద్బాంధవసహితుం డై పరమానందంబున. 798

మ. అతిభక్తిం బ్రతివాసరంబును హరివ్యాసంగుఁ డై మాధవాం
కితగంధర్వవిపంచికాకలితసంగీతప్రబంధానుమో
దితుఁ డై యిష్టవిభూతులందు ననురక్తిం జెంద కేప్రొద్దు న
చ్యుతసేవైకపరాయణుం డగుచు సత్స్తోత్రప్రభావోన్నతిన్. 799

మ. హరిపాదాంబురుహద్వయార్పితమతిన్ స్వామోదముం గొంచుఁ ద
చ్చరితంబుల్ దలపోయుచుం బొగడుచుం జర్చించుచున్ వించుఁ ద
త్పరిచర్యావ్యతిరిక్తసంసరణసద్ధ్వారకామంబులం
బరిభూతంబులఁ జేసి మోక్షపదసంప్రాప్తిక్రియారంభుఁ డై. 800

క. నిగమార్థగోచరుం డనఁ, దగుహరిచరితప్రసంగతత్పరచిత్తుం
డగునతనికి [1]మన్వంతర, మగుయామము లోఁగి నయాతయామము లయ్యెన్.

---

1 'స్వాంతరగము, లగుయామము.

సీ. వెండియు నమ్మేటి విష్ణుమంగళకథా, కర్ణనధ్యానానుగాననుతులు
సలుపుచు దా స్వప్నజాగ్రత్సుషుప్తులఁ, దలఁగించి యాపుణ్యతముఁడు దాను
జక్రిదాసుఁడు గాన శారీరమానస,దివ్యమానుషభౌతికవ్యథలను
దగులక సన్మునీంద్రశ్రేణి[1]తోఁగూడఁ, దనరువర్ణాశ్రమధర్మగతులు
తే. దప్పకుండంగ నడపుచుఁ దగిలి సర్వ,భూతహితవృత్తి నతులవిఖ్యాతలీల
నేకసప్తతియుగము లస్తోకచరితుఁ, డగుచు వర్తించె నమ్మోద మతిశయిల్ల.
క. అని యమ్మనుచరితము విదు,రున కమ్మైత్రేయమునివరుఁడు దయతోడన్
వినిపించి కర్దమునికథ, దనరఁగ నెఱిఁగింతు నని ముదంబునఁ బలికెన్. 803

కర్దమప్రజాపతి యోగభావంబుచే విమానంబు గల్పించి భార్యతోఁ గూడఁ దాను విహరించుట.

వ. ఇట్లు స్వాయంభువుండు దేవహూతిం గర్దమునికి వివాహంబు సేసి మరలి చనినం దదనంతరంబ దేవహూతియుఁ బతిభక్తి గలిగి భవునికి భవాని పరిచర్య సేయు చందంబునఁ బతియ తనకు నేడుగడయుం గా నెఱింగి యమ్మునీంద్రుని చిత్తవృత్తి కొలఁది దినదినంబునకు భక్తితాత్పర్యస్నేహభయంబులు రెట్టింపం బ్రియశుశ్రూషణంబులు గావించుచు ననూనతేజోవిరాజిత యగుచుఁ గామక్రోధదంభలోభాదిగుణవిరహిత యై శరీరశుద్ధి వహించి చతురసౌహార్దస్నేహంబులు గలిగి పతియ దైవంబుగా భావించి మృదుమధురవచనరచన యై పతిభక్తి నేమఱక వర్తింప దైవయోగంబు నైనను దప్పింప సమర్థుం డైనకర్దముండు నిజసేవాయాసకృశీభూతదేహ యై యున్న దేవహూతిం గరుణాతరంగితాపాంగుం డై కనుంగొని మంజుభాషణంబుల ని ట్లనియె. 804

ఉ. మానితధర్మమార్గమహిమస్ఫుటభూరితపస్సమాధివి
ద్యానిభృతాత్మయోగసముపార్జితవిష్ణుకటాక్షలబ్ధశో
భానఘదివ్యభోగబహుభద్రవితానము లస్మదీయసే
వానిరతిన్ లభించు ననివారణ నిత్తును దివ్యదృష్టియున్. 805

తే. నెలఁత తద్దివ్యదృష్టి నన్నియును నీకుఁ, గానవచ్చు విలోకింపు కమలపత్త్రి
నయన బొమముడిమాత్రనాశమందు, నితరమగుతుచ్ఛభోగంబు లేమి సెప్ప.
సీ. అనుపమరాజ్యదర్పాంధచేతస్కులై, పాపవర్తనులైన పార్థివులకు
ధృతిఁ బొంద రాని యీదివ్యభోగంబులు, నీదు పాతివ్రత్యనిష్ఠఁ జేసి
సంప్రాప్తములు నయ్యె సమత భోగింపుము, [2]కార్యసిద్ధియు నగుఁగాక నీకు
ననుటయు నతివయు ననుపమయోగమా,యావిచక్షణశాలి యైనకర్ద
తే. మునిఁ గనుంగొని[3]విగతాధియును నపాంగ,కలితలజ్జానతాస్యపంకజయు నగుచు
వినయ[4]సౌహార్దములఁ జేసి విహ్వలంబు, లయినపలుకులఁ బతికి ని ట్లనియెఁ బ్రీతి.

1'ఇందగఁ' అ.ప్ర. 2'కార్యసిద్ధ్యయ్యెడుఁగాక' వ్రా.ప్ర. 3నిశ్చింతయును. 4'ప్రణయములం జేసి' వ్రా.ప్ర.

వ. అనఘా (యమోఘ) యోగమాయావిభుండవు[1] సమర్థుండవు నయిన నీయందు నీయనుపమదివ్యభోగంబులు గలుగుట నిక్కంబని యెఱుంగుదు భవత్సంగతి నన్నియు నాకుం గలుగు నయినను దేవా నీ వానతిచ్చిన సంతానపర్యంతం బైన శరీరసంగమసమయంబు చిత్తంబునం దలంచి భవదంగసంగమంబుఁ గృపసేసి మన్నింపుము భవదీయసంయోగవాంఛాపరతం గృశీభూతం బయిన యీ దేహం బేవిధంబున మజ్జనభోజనపానసుఖంబులం బరితుష్టిం బొందు నట్టిమన్మనోరథంబుఁ దీర్ప రతితంత్రం బగు కామశాస్త్రప్రకారం బుపశిక్షించి యందులకు నుచితంబులయిన వివిధాంబరాభరణమాల్యానులేపన మందిరారామ ప్రముఖనిఖిలవస్తువిస్తారంబు గావించి నన్నుం గరుణింపు మనిన నమ్మహాత్ముండు నిజయోగమాయాబలంబునం దత్క్షణంబ. 808

సీ. దివ్యమణిస్తంభదీప్తిఁ జెన్నొందుచు, మరకతస్థలములమహిమ దనర
వరవజ్రకుడ్యకవాటశోభితము లై, విద్రుమదేహళీవీథు లమరఁ
గోమ రొప్పు నవశాతకుంభకుంభము లొప్ప, హరినీలశకలవిస్ఫురణ మెఱయఁ
దగఁ బద్మరాగంపుఁ దొడవులఁ జెలువొందు, వైడూర్యవలభులు వన్నెఁ జూపఁ
తే. దరళతరధూతకేతుపతాక లొలయ, మంజుశింజత్సమంచితమధుపకలిత
సురుచిరాలంబమానప్రసూన[2]రాజి, మాలికల నొప్పు వివిధగృహాళి దనరి. 809

క. మఱియును దుకూలచీనాం, బరకౌశేయాదివివిధపటపరివృతమం
దిరసుభగాకారం బై, యరుదార విచిత్రపట్టికాలంకృత మై. 810

మ. లలితోద్యానవనాంతసంచరణలీలాలోలహంసాళికో
కిలపారావతచక్రవాకశుక[3]కేకివ్యూహమంచత్సము
త్కలికం గృత్రిమపక్షులన్ నిజవిహంగశ్రేణి యంచుం గుతూ
హలి యై పల్కుచు నాడుచుండుఁ బ్రతిశాఖారోహణవ్యాప్తులన్. 811

వ. వెండియు. 812

క. ఘనసౌధాంతరశయ్యా, సనకేళీగేహకృతకజగతీధరశో
భనచంద్రకాంతచారుభ, వనఫలభరితావనీజవంతము లగుచున్. 813

క. సకలర్తుశోభితంబును, సకలశుభావహము సకలసంపత్కరమున్
సకలోపభోగయోగ్యము, సకలేప్సితకామదంబు సదలంకృతమున్. 814

వ. అగుచు నొప్పుదివ్యవిమానంబుఁ గల్పించి తదీయసుషమావిశేషవిచిత్రంబులు నిర్మించినతానునుం దెలియం జాలనియద్భుతకర్మం బైనవిమానంబు దేవహూతికిం జూపినం జూచి యమ్ముదియ సంతసింప కుండుట యెఱింగి సర్వభూతా(ంతరా)శయాభిజ్ఞుండును సంతుష్టాంతరంగుండును నై నకర్దముం డిట్లనియె.

1 నధికుండవు 2 'మాలికములఁ దనరినవివిధగేహములఁ గలిగి, 3 కేకిశారికానీకము' వ్రా.ప్ర.

తే. అతివ భగవత్కృతంబును నఖిలమంగ, ళాకరంబును నగునీజలాశయమునఁ
దవిలి క్రుంకినజంతువితానములకుఁ, గామ్యఫలసిద్ధి సేకుఱుఁ గాన నీవు. 816

క. ఇజ్జలముల నతిభక్తిని, మజ్జన మొనరించి యావిమానము వేడ్కన్
లజ్జావతి యెక్కవె యని, బుజ్జవ మొుగిఁ దోఁపఁ గర్దముఁడు వల్కుటయున్.

వ. విని యాకువలయాక్షి పతిసేవాయాసమలినాంబరయు వేణీభూతశిరోజయు ధూళిధూసరి[1]తాతికృశీభూతాంగయు శబలస్తనయు నై భర్తృనియోగంబున సరస్వతీసలిలసంభూతజలచరాశ్రయం బగుబిందుసరోవరంబుఁ బ్రవేశించి తజ్జలంబులఁ గ్రుంకు లిడుసమయంబునఁ దద్వాఃపూరమధ్యంబున [2]రుచిరసూక్ష్మాంశుకధారిణులుఁ గిశోరవయఃపరిపాకశోభితులు నుత్పలగంధులు నగుకన్యాసహస్రంబులు దేవహూతిం గనుంగొని యి ట్లనిరి. 818

క. తరుణీ సంచితకర్మా, చరణల మగుమేము నీకు సమమలభక్తిం
బరిచర్య సేయ నేర్తుము, కరుణాకలితేక్షణములఁ గనుఁగొను మమ్మున్. 819

సీ. అని పల్కి డాసి యయ్యతివకు నభ్యంజ,నోద్వర్తనములు పెంపొనరఁ జేసి
మలయజకర్పూరమహితవాసితహేమ,కలశోదకంబుల జలక మార్చి
ధవళవస్త్రంబులఁ దడియార్చి సర్వాంగ,ధూపంబు లొసఁగి కస్తూరి యలఁది
మంజుశింజన్మణిమంజీరకింకిణీ, కలరవాకలితమేఖలలు [3]పూన్చి

తే. కనకతాటంకముద్రికాకంకణాది, సముచితానర్ఘ్యహేమభూషణము లొసఁగి
భవ్యమాల్యానులేపనాంబరము లిచ్చి, షడ్రసోపేతవివిధాన్నసమితిఁ దనిపి.

వ. మఱియుం గనకపాత్రరచితంబు లయినకర్పూరనీరాజనంబులనివాళించి రుచిరాసనంబునఁ గూర్చుండఁ బెట్టి దర్పణంబు చేతి కిచ్చినం దత్ప్రతిఫలితనిజదేహంబు గనుంగొని కర్దముని మనంబునం దలంచిన నతండును గన్యాసహస్రంబును దత్క్షణంబునఁ దనసన్నిధి నుండుటం జూచి నిజభర్తృయోగమాయాప్రభావంబునకు నద్భుతంబు నొందె నంతఁ గర్దముండును గృతస్నాన యైనదేవహూతిం గనుంగొని వివాహంబునకు ముందట నేచందంబునం దనకు జూపె నాచందంబునం జెన్నొందుచుండుటకు నానందభరితుం డై భార్యాసహితంబుగఁ దత్కన్యాసహస్రంబు గొలువ నిజవిమానారూఢుం డై తారాగణపరివృత రోహిణీయుక్తుం డగుసుధాకరుండునుంబోలె నొప్పుచుం దదనంతరంబ. 821

చ. చిరశుభమూర్తి యమ్ముని యశేషదిగీశవిహారయోగ్యమున్
సురుచిరమందగంధవహశోభితమున్ నికటప్రపాతని
ర్ఝరసరిదంబుశీతలతుషారము నై తనరారుమేరుకం
దరమున కేఁగి దేవవనితాయుతుఁ డై నకుబేరుచాడ్పునన్. 822

---

1 'తనుచసమేతయు నై'. 2 'రుచిరమందిరావాసులు'. 3 'రత్నఖచితతాటంక' ప్రా.ప్ర.

వ. మఱియును. 823

మ. అమరోద్యానవనప్రదేశములు స|వ్యారామభూముల్ దళ
త్కుముదాంభోజవిభాసిమానససర|స్కూలంబులున్ మంజుకుం
జములుం జైత్రరథంబు విస్ఫురితవి|స్రంభంబునం జూచె నె
య్యమునం గర్దమయోగి గామగవిమా|నారూఢుఁ డై చెచ్చెరన్. 824

వ. ఇవ్విధంబున సమస్తభూభాగంబును వాయువేగంబునం గలయం గ్రుమ్మరి నిఖిల వైమానికలోకంబు నతిశయించి (లోకంబులం జరించె) మోక్షదాయకుండుఁ దీర్ఘపాదుండు నగుపుండరీకాక్షుని సన్నుతించి సేవించుపుణ్యాత్ములకుం బొందరానిపదార్థంబులు గలవే యిట్లు కర్దముండు దేవహూతికి నిఖిలధరాచక్రంబంతయుం జూపి మరల నిజనివాసంబునకుం జనుదెంచి కామకేళీవినోదార్థిక యై యున్నభార్య నుపలక్షించి రతిప్రసంగవ్యాసంగంబు గైకొని బహువిధంబు లయినయిష్టోపభోగంబుల బహువత్సరంబు లొక్కముహూర్తంబు గా జరపుచు నన్యోన్యసరసావలోకనంబుల సముచితాలింగనసంభాషణంబులం గాలనిరూపణంబు సేయ నేరక శతవత్సరంబులు గడపి తదనంతరంబ. 825

క. మునివరుఁ డొకనాఁ డిమ్ములఁ, దననిజదేహంబు నవవి|ధంబులు గావిం
చి నయంబునఁ దద్వీర్యముఁ, దనసతిగర్భమున నవవి|ధంబుగ నిలిపెన్. 826

క. అది కారణంబుగాఁ, బెం, పొదవినమునివలన [1]దేవ|హూతియుఁ గూఁతుల్
ముదమునఁ గనెఁ దొమ్మండ్రన్, ముదితయు మది సంతసించె| మునివరుఁ డంతన్.

తే. సన్న్యసింపంగఁ గోరుట | సతి యెఱింగి, యాత్మఁ బొడమినసంతాప | మగ్గలింపఁ
జింత వాటిల్లఁ జెక్కిటఁ | జేయి సేర్చి, పదమునను నేల వ్రాయుచుఁ | బలికెఁ బతికి.

సీ. అనఘ సంతానప|ర్యంతంబునునుఁ గూడి, వర్తింతు ననుచుఁ బూ|ర్వమునఁ బలికి
కూఁతుల నిచ్చితి | కోమ రార నిప్పుడీ, తరుణులు పతులను | దమకుఁ దార
యరసి వర్తింతురో | యని భీతి నొందెదఁ, గావున నీపుత్త్రి|కలకుఁ దగిన
వరుల సంపాదించి | పరిణయంబులు సేసి, తత్త్వసంహిత నాకుఁ | దవిలి తెలుపు

తే. సుతునిఁ గృప సేసి ననుఁ గావు|సుజనవినుత, యర్థసంసారదుఃఖంబు|నపనయింప
నర్హుఁడవు నీవ కావె మో|హమున నింత, కాల మూరక పోయె నే|గతియు లేక.

చ. [2]ఉపరతి పుట్టె నైహికసు|ఖోపగతానుభవంబులందు మున్
చపలతఁ గామభోగరతి|సంగముఁ గోరి మహాత్మ నిన్ను న
చ్చపుఁదలఁ పొప్పఁగాఁ దెలియఁ | జాలకయున్ వరియించుటన్ భవ
త్కృప ఫలియించె ముక్తి నినుఁ | గేవలభక్తి భజింపఁ గల్గదే. 830

వ. అదియునుం గాక. 831

---

1 'దేవ♦హూతికిఁ గూఁతు,ర్లుదయించిరి తొమ్మండ్ర,మ్ముదితయు' వ్రా. ప్ర. 2 'అపరతి పుట్టె నీయిహసు♦ఖానుభవంబులయందు మున్నె చపలత' వ్రా. ప్ర.

చ. సమమతి నొప్పు సత్పురుష సఖ్యము సద్గతి కారణంబు నీ
చమతి విలోల దుష్పురుష సఖ్యము దుర్గతి హేతు వంచుఁ జి
త్తమునఁ దలంచి యోగిజన తానుత మిమ్ము భజింతుఁ బ్రాణిసం
గమమునఁ బుణ్యపాపములు గైకొని పొందవె యెట్టివారలన్. 832

క. అని యిట్లు వేదనాభర, మున మునుకుచుఁ బలుకఁ గర్దముఁడు మనుపుత్రిం
గనుఁగొని సరసిజనయనువ, చనములు మది సంస్మరించి సతి కిట్లనియెన్. 833

క. మనుసుత నీమది దుఃఖం, బునఁ బొందకు మచిరకాలమున భగవంతుం
డనఘుం డక్షరుఁడు జనా, ర్దనుఁడు భవద్గర్భమందుఁ దగ వసియించున్. 834

క. వరనియమవ్రతనిష్ఠా, చరణనియుక్తాంతరంగ సమధికవై సం
భరితతపోధనదాన, స్ఫురితశ్రద్ధానుభక్తిపూర్వము గాఁగన్. 835

మ. హరి నారాయణుపాదపద్మములు సమ్యగ్భక్తిఁ బూజింపు త
త్పురుషశ్రేష్ఠుఁడు మానసంబున భవత్పూజానుసంప్రీతుఁడై
కర మర్థిం దరుణీశిరోమణి భవద్గర్భస్థుఁడై యుండి తాఁ
గరుణం జేయు భవన్మనోజనితశంకాగ్రంథివిచ్ఛేదమున్. 836

దేవహూతిగర్భంబున విష్ణుండు కపిలాచార్యుండు గాఁ బుట్టుట.

చ. అనవుడు దేవహూతి హృదయంబున సంతస మంది యమ్మునీం
ద్రునివచనక్రమంబునఁ బరుఁ భగవంతు ననంతుఁ బద్మలో
చను 1హరి విష్ణు నర్చనము సల్పుచు నుండఁగఁ గొన్నియబ్దముల్
చనునెడ దానవాంతకుఁడు సమ్మతిఁ గార్దమ మైన తేజమున్. 837

క. ధరియించి యమ్మునీంద్రుని, తరుణీగర్భంబువలన దనుజారి శమీ
తరుకోటరమున వైశ్వా, నరుఁ డుదయించినవిధంబునను జనియించెన్. 838

సీ. అయ్యవసరమున నాకాశమున దేవ, తూర్యఘోషంబులు దుముల మయ్యె
నందిత దేవతాబృందంబు లండండ, కురిసిరి మందారకుసుమవృష్టి
గంధర్వకిన్నరగానంబు వీతెంచె, నప్సరోగణములయాట లొప్పె
వావిరి దిక్కులఁ గావిరి విరిసెను, దవిలి వార్ధుల2కలంతలును మానె

తే. సాధుజనములమనములు సంతసిల్లె, హోమవహ్నులు ప్రభలఁ జెన్నొంది వెలిఁగెఁ
గుసుమఫలభారముల నొప్పెఁ గుజములెల్ల, సర్వసస్యాళిఁ జెన్నొందెఁ జగతియెల్ల.

వ. ఇట్టిమహోత్సవంబున దేవహూతికిం దత్త్వబోధంబుఁ గావించుకొఱకుఁ దదీ
యగర్భంబున నుదయించినపరబ్రహ్మస్వరూపుం డైననారాయణుని దర్శించు
కొఱకు మరీచిప్రముఖమునిగణసమేతుం డై చతుర్ముఖుండు సనుదెంచి యమ్మహా
త్ముని దర్శించి కర్దమదేవహూతులం గనుంగొని యిట్లనియె. 840

క. నుతచరితులార మీరలు, కృతకృత్యులు విష్ణుపూజఁ గేవలభక్తిన్

1 'చరణాంబుజార్చనలు. 2 కలంతపులు' వ్రా. ప్ర.

మతి నిష్కపటులరై చే, సితిరి తదర్చనఫలంబు సేకుఱె మీకున్. 841

క. శ్రితభయహరణుఁడు మునిజన, నుతచరితుఁడు పరుఁడు మీమనోరథసిద్ధిన్
వితతంబుగఁ గావించుటఁ, జతురత మీజన్మ మింక సఫలతఁ బొందెన్. 842

క. వినుఁడు సకాములరై హరి, ననుపమభక్తిన్ భజించు నదె ముక్తికి జా
లును మీపుణ్యం బేమని, కొనియాడఁగ వచ్చు నీతికోవిదులారా. 843

వ. అని వెండియుం గర్దమునిం గనుంగొని యిట్లను భవదీయతనూభవలఁ బ్రకటశీలవ్రతాచారసంపన్నులైన మునివరేణ్యులకుం బెండ్లి సేయు మట్లయిన వారి వలనం బ్రజాసృష్టి బహువిధంబుల వృద్ధిం బొందు నని చెప్పి మఱియు నిట్లనియె.

చ. అనఘ భవత్సుతుండు సముదంచితతేజుఁడునై నయిమ్మహా
త్మునిఁ బరమేశు నీశు నజితు న్నవికారు నమేయు నచ్యుతు
న్ననఘుని నక్షరున్ హరి ననంతుని నీశునిఁగాఁ దలంపు మీ
ఘనుఁడు సమస్తచేతననికాయహృదీప్సితదాయి గావునన్. 845

సీ. మానితజ్ఞానవిజ్ఞానయోగంబులు, ననునుపాయంబుల నొనరఁ జేసి
యోలిమైఁ గర్మజీవుల నుద్ధరించుట,కొఱకు సమాహితాత్మకుఁడు సమగ్ర
హాటకరుచిజటాజూటుండు నుత్ఫుల్ల,పంకజనేత్రుండుఁ బద్మవజ్ర
హలకులిశాంకుశలలితరేఖాంకిత,చరణతలుండును సత్త్వగుణుఁడు

తే. నగుచు నిప్పుడు సరసీరుహాక్షి నీకు,గర్భమం దుదయించును ఘనుఁడు నీకుఁ
దత్త్వబోధంబుఁ గావించు దాన నీకు, హృదయమందులసంశయ మెల్లఁ బాపు.

వ. మఱియును. 847

క. మతి కెక్కు సిద్ధగణసే,వితుఁడై ఘనసాంఖ్యయోగవిలసితతత్త్వ
స్థితినిరతుఁ డగుచుఁ గపిలా,ఖ్యతఁ దనరి చరించు నిజగత్త్రయ మెల్లన్. 848

క. అని పలికి యమ్మరీచిం, గని యుద్వాహార్థ మునిచి కమలజుఁ డంతం
దనసందను లగునారద, సనకాదులఁ గూడి యాత్మసదనము కరిగెన్. 849

వ. అంత నాకర్దముండు కమలసంభవచోదితుం డగుచు యథోచితంబుగా నాత్మీయ దుహితల వివాహంబు సేయం దలంచి మరీచికిం గళ యనుకన్యకను నత్రికి ననసూయను నంగిరసునకు శ్రద్ధను బులస్త్యునకు హవిర్భువును బులహునకు గతిని గ్రతువునకుఁ గ్రియను భృగునకు ఖ్యాతిని వసిష్ఠునకు నరుంధతిని నథర్వునకు శాంతినిం గ[1] నిజకులాచారసరణిం బరిణయంబు గావించిన వారును గృతదారపరిగ్రహులును గర్దమకృతసంభావనాసంభావితులును నగుచు నతని చేత ననుజ్ఞాతులై జాయాసహితు లగుచు నిజాశ్రమభూములకుం జని రిట్లు వర్తింప యుగత్రయంబు సనుటయుం గర్దముండు (దేవోత్తముం డగువిష్ణుండు దనమందిరంబున నవతరించి వసించి యుంటం) దనచిత్తంబున నెఱింగి వివిక్తస్థలం

---

1 'నాయాసమె చాలును' వ్రా. ప్ర.

బునకుం జని యచ్చటఁ గపిలునికి వందనం బాచరించి యి ట్లనియె. 850

సీ. చతురాత్మ వినుమాత్మకృతము లైనట్టియ, మంగళభూతకర్మంబు లనెడి
దావాగ్నిశిఖలచే దందహ్యమాను లై, నట్టిజీవులు దుద ముట్ట లేక
పాయక సంసారబద్ధు లై యుందురు, [1]తద్భవహేతుభూతంబు లయిన
సకలదేవతలుఁ [2]బ్రసన్నులు నగుదురు, బహుజన్మపరిచితప్రాప్తయోగ

తే. చిరసమాధితపోనిష్ఠచే వివిక్త, దేశముల యోగిజనములు ధృతుల నేమ
హానుభావు విలోకింతు రట్టిదివ్య, పురుషరత్నంబ నాయింటఁ బుట్టితీవు. 851

వ. మఱియు సంసారచక్రపరిభ్రామ్యమాణుల మగుచు గ్రామ్యుల మయినమా వర్తనంబులును గణింపక మదీయగృహంబునం బూర్వంబునం బ్రతిశ్రుతంబు లైన భవదీయవాక్యంబులు దప్పకుండ ననుగ్రహింప నుదయించి తని వెండియు ని ట్లనియె.

క. తలపోయఁగ నప్రాకృత, బలయుక్తచతుర్భుజాదిభవదవతారం
బులు నీ కనురూపము లై, పొలుపొందుం గాదె పరమపురుష మహాత్మా. 853

వ. అదియునుం గాక. 854

క. అనయము భవదీయాశ్రిత, జనసంరక్షణముకొఱకు సమ్మతితోఁ దా
ల్చినమానవరూపంబులు, ననురూపము లయ్యెఁ గాదె హరి నీ కెప్డున్. 855

క. సుమహితతత్త్వజ్ఞానా, ర్థము విద్వజ్జనగణంబు దవిలి నమస్కా
రము లోలిఁ జేయు[3]పదపీ, ఠము గలనినుఁ బొగడ వశమె రవణిల్లంగన్. 856

సీ. సమధికషడ్గుణైశ్వర్యసాకారుఁడవు, పరమేశ్వరుండవు ప్రకృతిపురుష
మహదహంకారతత్త్వాత్మతత్త్వోధక, హేతుకాలాత్మ విఖ్యాతిధృతివి
జగదాత్మకుఁడవు చిచ్ఛక్తివి నాత్మీయ, జఠరనిక్షిప్తవిశ్వప్రపంచ
మును గలసర్వజ్ఞమూర్తివి స్వచ్ఛంద, శక్తియుక్తుండవు సర్వసాక్షి

తే. వగుచుఁ గపిలాఖ్యఁ దనరారునట్టినీకు, ననఘ మ్రొక్కెదఁ బుత్రుండవగుచునీవు
నాకుఁ బుట్టినకతన ఋణత్రయంబు, వలనఁ బాసితి నిక్కమో వరద నేను.

తే. మానితవ్రతయోగసమాధినియతిఁ, జెంది భవదీయపాదారవిందయుగము
డెందమునఁ జేర్చి శోకంబులందుఁ దొలఁగి, సంచరించెద నంచితస్థలములందు.

క. అని యిట్లు విన్నవించిన, మునిపుంగవుఁ డైనకర్దమునివచనంబుల్
విని భగవంతుం డగున, య్యనఘుఁడు కపిలుండు పలికె నర్మిలి దోఁపన్. 859

సీ. నాచేతఁ బూర్వంబునం బ్రతిశ్రుత మైన, వచనముల్ దప్పక వరమునీంద్ర
నీయింటఁ బుట్టితి నీమనిర్హేతుక, భూరిదయాగుణంబున నవాప్త
సకలకాముఁడ నేను సన్మునివేషంబు, ధరియించు టెల్ల నాకొఱకుఁ గాదు
విను మహాత్మకు లైనమునులకుఁ బరమాత్మ, గురుసద్వివేకంబు నరసి చూపు

---

1 'బహుళకాలం బిట్లు వఱలు చుండ. 2 బ్రసన్నతనొందిరి. 3 పదయుగ్మము గల...గణు తింపంగాన్' వ్రా. ప్ర.

తే. తత్త్వబోధంబు కొఱకును దాల్పఁబడిన, యంచితవ్యక్తమార్గ మైనట్టి దేహ
మని తలంపుము మత్పదధ్యానభక్తి, దీపరాయణమహిమంబు దేజరిల్ల. 860

క. సమధికనిష్ఠం గృతయో, గమునన్ సన్న్యస్తసకలకర్ముఁడ వై మో
హముఁ బాసి భక్తిచే మో, క్షము[1]కై భజియింపు నను వికారరహితుఁ డై. 861

క. ననుఁ బరమేశుఁ బరంజ్యో, తిని ననఘు ననంతు దేవదేవు సకలభూ
తనికాయగుహాశయు నా, ద్యని నజు నాద్యంతశూన్యు దురితవిదూరున్. 862

క. తిరముగ భవదీయాంతః, కరణసరోజాతకర్ణికాతలమున సు
స్థిరుఁ జేసి యింద్రియంబుల, నిరసించి మనోంబకమున నెఱిఁ గను మనఘా.

వ. అట్లని. 864

క. తనరిన మోక్షము నొందెద, నని పలికినఁ గర్దముండు నమ్మునికులచం
ద్రుని వలగొని వందనములు, ఘనముగ నతిభక్తిఁ జేసి కౌతుక మలరన్.

క. మునిగణసేవిత మగువన, మునకుం జని యందు మౌనమున నిస్సంగుం
డును వహ్నిరహితుఁ డనికే, తనుఁడును నాత్మైకశరణతత్పరుఁ డగుచున్. 866

వ. పరబ్రహ్మంబుఁ జిత్తంబున నిల్పి యహంకారంబు విడిచి మమత్వంబు నిరసించి దయాగుణంబునం జేసి సకలభూతంబులందు సమత్వంబు భజియించి శాంతశేముషీగరిష్ఠుం డగుచు నిస్తరంగం బగువార్ధిచందంబున ధీరుం డై నిఖిలప్రపంచంబును వాసుదేవమయంబుఁగాఁ దలంచుచు భక్తియోగంబున భాగవతగతిం బొందె నని చెప్పి వెండియు మైత్రేయుండు విదురునిం గనుంగొని కర్దముండు వనంబునకుం జనినయనంతరంబ మాతృవత్సలుం డయినకపిలుండు బిందుసరంబున వసియించి యుండ దేవహూతి తత్త్వమార్గప్రవర్తకుం డయినసుతునిం గనుంగొని బ్రహ్మవచనంబులు దలంచుచు నిట్లనియె. 867

దేవహూతి పుత్రుం డైనకపిలునిచేఁ దత్త్వజ్ఞానంబు వడయుట.

క. అసదింద్రియ[2]ఘర్షణమున, వసుమతి నిర్విణ్ణ నగుచు వనరెడి నాకీ
యసదృశమోహతమోవిని, రసనం బనఘా త్వద్గే వెఱవున ఘటించున్. 868

క. పటుఘననీరంధ్రతమః, పటలపరీవృతజగత్ప్రపంచమునకు నె
క్కటిలోచన మై మహితో, త్కటరుచి వెలుఁగుదువు భానుకైవడి ననఘా.

ఉ. భూరిమదీయమోహతమముం బెడఁబాప సముద్ధు లన్యు లె
వ్వారలు నీవ కాక నిరవద్య నిరంజన నిర్వికార సం
సారలతాలవిత్ర బుధసత్తమ సర్వశరణ్య ధర్మవి
స్తారక సర్వలోకశుభదాయక నిత్యవిభూతినాయకా. 870

చ. నిను శరణంబు సొచ్చెద ననింద్యతపోనిధి నన్నుఁ గానవే
యని తను దేవహూతి వినయంబున సన్నుతి సేసి వేఁడిన

1. 'భజియింపుము వివిక్తకానవమ్ముంగున్' వ్రా. ప్ర. 2. మర్షణమున.

న్ననుపమసత్కృపాకలితుఁడై కపిలుం డనురాగ మొప్ప స
జ్జననిచయాపవర్గఫలసాధన మై తగుతల్లి వాక్యమున్. 871

క. విని మందస్మితలలితా, ననకమలుం డగుచు నెమ్మనమునఁ బ్రమోదం
బనయంబుఁ గడలుకొన నిజ, జననికి ని ట్లనియెఁ బరమశాంతుం డగుచున్. 872

క. విను జీవునిచిత్తము దా, ఘనభవబంధాపవర్గకారణ మది యే
చినఁ ద్రిగుణాసక్తం బయి, నను సంసృతిబంధకారణం బగు మఱియున్. 873

తే. అదియు నారాయణాసక్త మయ్యెనేని, మోక్షకారణ మగు నని మునికులాబ్ధి
చంద్రుఁడన నొప్పుకపిలుండు జననితోడ, నర్థి వినఁ జెప్పి మఱియు నిట్లనియెఁ బ్రీతి.

వ. మఱియుఁ జిత్తం బహంకారమమకారరూపాభిమానజాతంబు లగు (కామలోభాది) కలుషవ్రాతంబులచేత నెప్పుడు విముక్తం బై పరిశుద్ధం బగు నప్పుడు సుఖదుఃఖ వివర్జితంబు (నేకరూపంబు) నై ప్రకృతికంటెఁ బరుండును బరమపురుషుండును నిర్భేదనుండును స్వయంజ్యోతియు సూక్ష్మస్వరూపుండును నితరవస్త్వంతరాపరిచ్ఛిన్నుండును నుదాసీనుండును నైనపరమాత్మునిం దదీయమహోహతౌజస్కం బైనప్రపంచంబును (జ్ఞానవైరాగ్యభక్తియుక్తం బగుమనంబుచేఁ) బొడగాంచి యోగిజనులు పరతత్త్వసిద్ధికొఱకు నిఖిలాత్మకుం డైననారాయణునందు సంయుజ్యమానం బయినభక్తిభావంబువలన నుదయించినమార్గంబునకు నితరమార్గంబులు సరి గావండ్రు [1]విద్వాంసులు సంగం బింద్రియార్థాద్యసద్విషయంబుగ నొనరింపంబడి జీవునకు నశిథిలం బగుబంధంబునకుఁ గారణం బగు ననియు నదియె సద్విషయం బైన నంతఃకరణసంయమనహేతుభూతం బగుచు సాధుజనులకు ననర్గళమోక్షద్వారం బగుననియుఁ దెలియుదురు (సహనశీలురు) సమస్తశరీరధారులకు సుహృత్తులును బరమశాంతులును గారుణికులును నై పరిత్యక్తకర్మఫలస్వభావులును (విస్మృతస్వజనబంధుజనులును) నై మత్పదాశ్రయులును మద్గుణధ్యానపారీణులును మత్కథాప్రసంగసఫలితశ్రవణులును నగుచు (మదీయకథలనొడువుచు వినుచు) నుండుపరమభాగవతోత్తముల (నాధ్యాత్మికాది) తాపత్రయంబు దపింపఁ జేయం జాల దట్టిసర్వసంగవివర్జితు లగుపరమభాగవత (జనులసంగం బపేక్షణీయం బది సకలదోషనివారకం బగు నట్టి) సత్సంగంబునను (సర్వప్రాణిహృత్కర్ణరసాయనంబు లగుమదీయకథాప్రసంగంబులు గలుగు) మద్గుణాకర్ణనంబునుం జేసి శీఘ్రంబుగఁ (గ్రమంబునం) [2]గైవల్యమార్గదంబులగు శ్రద్ధాభక్తు లుదయించు (నదియునుంగాక) యేపురుషుం డైన నేమి మద్విరచితజగత్కల్పనాది విహారచింతనంబున నుదయించినభక్తిం జేసి యింద్రియసుఖంబులవలననుదృష్టశ్రు

1. 'ఇదియు విద్వాంసులు సత్సంగంబునుంగా నజరంబునుగా నంతఃకరణసంయమనహేతుభూతంబునుంగా సాధుజనులకు ననర్గళమోక్షద్వారంబునుంగాఁ దెలియుదురు' వ్రా. ప్ర. 2 'గైవల్యమార్గదం బగుభక్తి యుదయించు' వ్రా. ప్ర.

తంబులైన యైహికాముష్మికంబులవలనను విముక్తుం డగుచుఁ జిత్తగ్రహణార్థంబు ఋజువు లైనయోగమార్గంబులచే [1]సంయుక్తుం డగునట్టియోగి ప్రకృతిగుణసేవనంబుచేత వైరాగ్యగుణవిజృంభితం బైనజ్ఞానయోగంబుచేతను మదర్పితభక్తియోగంబుచేతను బ్రత్యగాత్మకుండ నైననన్ను నంతఃకరణనియుక్తునిం గావించు నని చెప్పిన విని దేవహూతి కపిలున కి ట్లనియె. 875

క. ఏభక్తి భవద్గుణపర, మై భవపాపప్రణాశ మై ముక్తిశ్రీ
లాభము రయమునఁ జేయునొ, యాభక్తివిధంబుఁ దెలియ నానతి యీవే. 876

వ. అదియునుం గాక భవదుదితం బయినయోగంబును దదంగంబులును దద్గతతత్త్వావబోధంబును సాకల్యంబుగ మందబుద్ధి నైననాకు స్ఫుటంబుగాఁ దెలియ నానతి మ్మనినఁ గపిలుం డి ట్లనియె. 877

సీ. జనయిత్రి వినుము మఱిసకలపదార్థప,రిజ్ఞానతత్త్వపారీణ మగుచు
నామ్నాయవిహితకర్మాచారములు గల్గి, తివుటమై వర్తించు దేవగణము
పూని నైసర్గికం బైననిర్హేతుక, మగుభగవత్సేవ దగిలి ముక్తి
కంటె గరిష్ఠంబు గావున నదియు భుక్తాన్నంబు జీర్ణంబు నందఁ జేయు
తే. దీప్తజఠరాగ్నిగతి లింగదేహనాశ,కంబు గావించు నదియును గాక విష్ణు
భక్తివైభవములఁ దేటపఱుతు వినుము, సద్గుణవ్రాత యోగలక్షణసమేత.

చ. అమలినభక్తిఁ గొందఱు మహాత్ములు మచ్చరణారవిందయు
గ్మము హృదయంబునన్ నిలిపి కౌతుకులై యితరేతరానులా
పముల మదీయదివ్యతనుపౌరుషముల్ గొనియాడుచుండి మో
క్షము మదిఁ గోర నొల్ల రనిశంబు మదర్పితసర్వకర్ములై. 879

సీ. పరికింపఁ గొందఱు భాగవతోత్తముల్, ఘనత కెక్కినపురాతనము లైన
చారుప్రసన్నవక్త్రారుణాలోచన,ములు గల్గి వరదానకలితములుగఁ
దనరుమద్దివ్యావతారవైభవములు, మది నొప్పఁ దమయోగమహిమఁ జేసి
యనుభవించుచుఁ దదీయాలాపములు సంస్తు,తించుచుఁ దివుటఁ దద్దివ్యవిలస
తే. దవయవోదారసుందరనవవిలాస, మందహాసమనోహరమధురవచన
రచనచే నపహృతమనఃప్రాణు లగుచు, నెలమి నుందురు నిశ్శ్రేయసేచ్ఛ లేక.

మ. కణఁకన్ వారలు వెండి మోక్షనిరపేక్షస్వాంతు లై యుండియు
న్నణిమాద్యష్టవిభూతిసేవితము నిత్యానందసంధాయియున్
గణనాతీతము నప్రమేయము సమగ్రశ్రీకమున్ సర్వల
క్షణయుక్తంబును నైనమోక్షపదవిం గైకొందు రత్యున్నతిన్. 881

వ. ఇట్లు వొంది. 882

---

1. 'యోగయుక్తుం డగుచుఁ బ్రకృతిగుణంబులఁ గైకొనక జ్ఞానవైరాగ్య...మదర్పితభక్తిం జేసియు నతిసూక్ష్మకుం డైననన్ను నంతఃకరణ' వ్రా. ప్ర.

క. తనరుదు రప్పుణ్యాత్ములు, జనయిత్రి మదీయకాలచక్రగ్రసనం
బును నొందక నిత్యం బగు, ననుపమసుఖవృత్తి నుందు రది యెట్లన్నన్. 883

మ. [1]సముఁడై స్నేహముచే సుతత్వమును విశ్వాసంబుచేతన్ సఖి
త్వముఁ జాలన్ హితవృత్తిచేతను సుహృత్త్వంబున్ సుమంత్రోపదే
శముచేతన్ నిజదేశికుండ ననఁగ నిచ్చల్ ప్రోచుచు న్నిష్టదై
వము నై వారికిఁ గాలచక్రభయముల్ వారింపుచుం గావునన్. 884

వ. అని యిట్లు దెలుపుచు మఱియు ని ట్లనియె. 885

చ. విను మది గాక యీభువి దివిం బలుమాఱుఁ జరించు నాత్మ దా
ధనపశుపుత్రమిత్రవనితారతిపైఁ దగులంబు మాని న
న్ననఘుని విశ్వతోముఖు ననన్యగతిన్ భజియించెనేని వా
నిని ఘనమృత్యురూపభవసరధి నేఁ దరియింపఁ జేయుదున్. 886

సీ. రూఢిఁ బ్రధానపూరుషనాయకుండను, భగవంతుఁడను జగత్ప్రభుఁడ నైన
నాకంటె నన్యులఁ గైకొని తగిలిన, యాత్మలు భవభయం బందు నెపుడుఁ
గావున నాయాజ్ఞఁ గడవంగ నోడుటఁ, జేసి వాయువు వీచు శిఖి వెలుంగు
నినుఁడు దపించుఁ దా నింద్రుండు వర్షించు, భయమంది మృత్యువు పఱువువెట్టుఁ

తే. గాన విజ్ఞానవైరాగ్యకలిత మైన, భక్తియోగంబునం జేసి పరమపదము
కొఱకున యోగివరులు మచ్చరణభజను, లగుచుఁ జరియింపుదురు నిర్భయాత్ము లగుచు.

క. గురుభక్తిం జిత్తము మత్పర మై విలసిల్లునంతపర్యంతము స
త్పురుషుల కిహలోకంబునఁ, జిరతరమోక్షోదయంబు సేకుఱుచుండున్. 888

క. అని యిట్లు సన్మునీంద్రుఁడు, జననికి హరిభక్తియోగసంగతి నెల్లన్
వినిపించి వెండియును ని, ట్లనియెన్ సమ్మోదచిత్తుఁ డగుచుఁ గపిలుఁడున్. 839

వ. అవ్వా యివ్విధంబున భక్తియోగప్రకారంబు సెప్పితి నింకఁ దత్త్వలక్షణంబు వేఱు వేఱ యెఱింగింతు నేతత్త్వగుణంబుల నెఱింగినవారలు ప్రకృతిగుణంబులవలన విముక్తు లగుదురు హృదయగ్రంథివిచ్ఛేదకంబు (నాత్మదర్శనరూపంబు) నగు నాజ్ఞానం బాత్మకు నిశ్శ్రేయసకారణంబు గావున దాని నెఱింగింతు నందు నాత్మకు స్వరూపం బెట్టి దనిన ననాదియుఁ బురుషుండును సత్త్వాదిగుణశూన్యుండును బ్రకృతిగుణవిలక్షణుండును బ్రత్యక్స్వరూపుండును స్వయంప్రకాశుండును నెవ్వం డెవ్వనితోడ నీవిశ్వంబు సమన్వితం బగు నతండు[2] గుణత్రయాత్మకత్వంబున వ్యక్తంబును భగవత్సంబంధియు నగు ప్రకృతియందు యదృచ్ఛచే లీలావశంబునం బ్రవేశించిన నాప్రకృతి గుణత్రయమయం బై స్వరూపం బయిన ప్రజాసర్గంబుఁ జేయం గనుంగొని యప్పుడు మోహితుం డయి విజ్ఞానతిరోధానంబునం జేసి గుణత్రయాత్మకం బయిన ప్రకృత్యధ్యాసంబున నన్యోన్యమేళనం బగుటయు నంతం బ్రకృతి

1. సమతిన్. 2 'జీవసంబంధియై గుణత్రయాత్మవస్థలఁ బ్రకృతియందు లీలావశ' వ్రా.ప్ర.

గుణంబుఁ దనయందు నారోపించుకొని క్రియమాణంబు లగుకార్యంబులవలనం గర్తృత్వంబు గలిగి సంసారబద్ధుం డై పారతంత్ర్యంబు గలిగి యుండుఁ గర్తృత్వశూన్యుం డగునీశ్వరుండు సాక్షి యగుటం జేసి యాత్మకుం గార్యకారణకర్తృత్వంబులు ప్రకృత్యధీనంబు లనియు సుఖదుఃఖభోక్తృత్వంబులు ప్రకృతివిలక్షణుం డగునపురుషుని వనియు నెఱుంగుదు రని చెప్పిన విని దేవహూతి కపిలున కిట్లనియెఁ బురుషోత్తమా ప్రకృతిపురుషులు (సదసదాత్మకప్రపంచంబునకుఁ) గారణభూతులు గావున వానిలక్షణంబు సదసద్వివేకపూర్వకంబుగా నానతి మ్మనిన భగవంతుం డైనకపిలుం డి ట్లనియె. 890

క. క్రమమునఁ ద్రిగుణము నవ్యక్తము నిత్యము సదసదాత్మకము మఱియుఁ బ్రధా
నము ననఁగాఁ బ్రకృతివిశేషము లదియు విశిష్ట మనిరి సద్విదు లెలమిన్. 891

వ. అందుఁ బ్రకృతి చతుర్వింశతితత్త్వాత్మకం బై యుండు నది యెట్లనినఁ బంచమహాభూతంబులును బంచతన్మాత్రలును జ్ఞానకర్మాత్మకంబు లయినత్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులు వాక్పాణిపాదపాయూపస్థంబులు ననుదశేంద్రియంబులును మనోబుద్ధిచిత్తాహంకారంబు లనునంతఃకరణచతుష్టయంబును నను చతుర్వింశతితత్త్వాత్మకం బైనసగుణబ్రహ్మసంస్థానంబు సెప్పితి నిటమీఁద [1]గాలం బనుపంచవింశతితత్త్వంబు సెప్పెద నది గొందఱు పురుషశబ్దవాచ్యుం డైన యీశ్వరునిపౌరుషంబు గాలశబ్దంబునఁ జెప్పంబడు నందు రందు నహంకారమోహితుం డై (ప్రకృతి నొందుజీవుం డుభయంబుఁ జెందుఁ) బ్రకృతిగుణసామ్యంబునం జేసి వర్తించి నిర్విశేషుం డగుభగవంతునిచేష్టావిశేషంబు (దేనివలన నుత్పన్నం బగు నదియ) కాలం బని చెప్పంబడు [2]నదియు జీవరాశ్యంతర్గతం బగుటం జేసి పురుషుం డనియు వాని బహిర్భాగవ్యాప్తిం జేసి కాలం బనియుఁ జెప్పంబడు నాత్మమాయం జేసి తత్త్వాంతర్గతుం డయినజీవునివలన క్షుభితం (బయి జగత్కారణం) బగుప్రకృతియందుఁ బరమపురుషుండు దనవీర్యంబు వెట్టిన నాప్రకృతి హిరణ్మయం బైనమహత్తత్త్వంబు పుట్టించె నంత సకలప్రపంచ[3]బీజభూతుండును లయవిక్షేపశూన్యుండును నగునీశ్వరుండు దనసూక్ష్మవిగ్రహంబునందు (నాత్మగతం బైన) మహదాదిప్రపంచంబుల [4]వెలిఁగించుచు స్వతేజోవిపత్తిం జేసి యాత్మప్రస్వాపనంబు [5]సేయునట్టితమంబును గ్రసించె నని చెప్పి వెండియు నిట్లనియె. 892

క. దివ్య మగువాసుదేవా, దివ్యవ్యూహచతుష్టయంబు త్రిజగములందుం
సేవ్యం బని చెప్పం బడు, భవ్యగుణా దాని నెఱుఁగఁ బలికెద నీకున్. 893

సీ. సత్త్వప్రధాన మై స్వచ్ఛ మై శాంత మై, యూర్మిషట్కంబుల నోసరించి

---

1 'గాలపురుషుండు పంచవింశకుం డనంబడు. 2 నదియు నంతఃప్రదేశంబునఁ బురుషుం డనియు బహిఃప్రదేశంబునఁ గాలంబనియుఁ జెప్పంబడు. 3 కారణుండును. 4 జూచుచు స్వతేజో. 4 సేయు నది తమ స్సయ్యె నని చెప్పి వెండియు' వ్రా. ప్ర.

సురుచిరషాడ్గుణ్యపరిపూర్ణ మై నిత్య, మై భక్తజనసేవ్య మై తనర్చి
వల నొప్పుచుండునవ్వాసుదేవవ్యూహ, మంత మహత్తత్త్వ మందు నోలి
రూఢిఁ గ్రియాశక్తిరూపంబు గల్గున,హంకార ముత్పన్న మయ్యె నదియు

తే. సరవి వైకారికంబుఁ దైజసముఁ దామ
సంబు నా మూఁడుదెఱఁగుల జరగు నందుఁ
దనరు వైకారికము మనస్సునకు నింద్రి
యములకును గగనముఖభూతముల కరయ. 894

వ. అది దేవతారూపంబున నుండుఁ దైజసాహంకారంబు బుద్ధిప్రాణంబులుం గలిగి యుండుఁ దామసాహంకారం బింద్రియమేళనంబున నర్థమాత్రం బై యుండు మఱియును. 895

సీ. అట్టియహంకారమం దధిష్ఠించి సా,హస్రఫణామండలాభిరాముఁ
డై తనరారునంతుఁడు సంకర్ష,ణుం డనఁ దగుపురుషుండు ఘనుఁడు
మహితభూతేంద్రియమానసమయుఁడు నై, కర్తృత్వకార్యత్వకారణత్వ
ప్రకటశాంతత్వఘోరత్వమూఢత్వాది, లక్షణలక్షితోల్లాసి యగుచు

తే. నుండు నమ్మోటి రెండవవ్యూహ మనఁగ, ఘనవికారంబుఁ బొందువైకారికంబు
వలనవినుము[1]మనస్తత్త్వమెలమిఁబుట్టె,మఱియువైకారికంబునమాత వినుము.

వ. [2]సామాన్యచింతయు విశేషచింతయు ననం దగుసంకల్పవికల్పంబులం జేసి కామసంభవం బయ్యె నదియ యనిరుద్ధాఖ్యం బయినవ్యూహం బదియ హృషీకంబులకు నధీశ్వరం బయి సకలయోగీంద్రసేవ్యం బగుచు శరదిందీవరశ్యామం బయి యుండు వెండియుం దైజసంబువలన బుద్ధితత్త్వంబు పుట్టె దానిలక్షణంబులు ద్రవ్యప్రకాశకం బైనజ్ఞానంబును నింద్రియానుగ్రహంబును సంశయంబును మిథ్యాజ్ఞానంబును నిద్రయు నిశ్చయంబును స్మృతియు ననం దగి యుండు మఱియుఁ దైజసాహంకారంబువలన జ్ఞానేంద్రియకర్మేంద్రియంబులును గ్రియాజ్ఞానసాధనంబులును గలిగి యుండుఁ బ్రాణంబునకుం గ్రియాశక్తియు బుద్ధికి జ్ఞానశక్తియు నగుటం జేసి యింద్రియంబులకుఁ దైజసత్వంబు గలిగి యుండు భగవచ్ఛక్తిప్రేరితం బయినతామసాహంకారంబువలన శబ్దతన్మాత్రంబు పుట్టె దానివలన నాకాశంబును నాకాశంబువలన శ్రోత్రేంద్రియంబును బుట్టె శ్రోత్రంబు శబ్దగ్రాహి యయ్యె శబ్దం బర్థంబునకు నాశ్రయం బై శ్రోతకు [3]జ్ఞానజనకం బయ్యె మఱియు శబ్దతన్మాత్రంబువలన నాకాశం బయి యాయాకాశంబు భూతంబులకు బాహ్యాభ్యంతరంబుల నవకాశం బిచ్చుటయు నాత్మప్రాణేంద్రియాదులకు నాశ్రయం బగుటయు ననులక్షణంబులు గలిగి యుండుఁ [4]గాలగతిచే

---

1. తమస్తత్త్వ. 2. 'అది యెట్టు లంటేని సామాన్య... కామసంభవంబనంబడునెద్ది యనిరుద్ధా' అ. ప్ర. 3. జ్ఞాపకం బయ్యె. 4. నభశ్శబ్దతన్మాత్రంబువలన స్పర్శంబును.

వికారంబు నొందు శబ్దతన్మాత్రలక్షణం బగునభంబువలన స్పర్శంబును స్పర్శంబు వలన వాయువును వాయువుచే స్పర్శగ్రాహి యై త్వగింద్రియంబును (బుట్టె) మృదుత్వంబును కఠినత్వంబును శైత్యంబును నుష్ణత్వంబును ననునివి (స్పర్శంబునకు స్పర్శత్వం బని) చెప్పంబడు మఱియు వాయువునకుఁ జాలనంబును (పరస్పర విభాగకరణంబును ద)న్మేళనంబును [1] ద్రవ్యశబ్దనేతృత్వంబును నగు నందు గంధవంతం బగుద్రవ్యంబును ఘ్రాణేంద్రియంబు నొందించుట ద్రవ్యనేతృత్వంబు దూరస్థం బగుశబ్దంబును శ్రోత్రేంద్రియగ్రాహ్య మగున ట్లొనరించుట శబ్దనేతృత్వంబు సర్వేంద్రియాత్మకత్వంబు ననునవి లక్షణంబు లై యుండు (దైవప్రేరితం బై) [2]స్పర్శతన్మాత్రగుణకం బగువాయువువలన రూపంబును దాని వలనఁ దేజంబును బుట్టె (రూపంబు నేత్రేంద్రియగ్రాహకం బయ్యె) నేత్రగతం బయినరూపంబునకు నుపలంభకత్వంబును ద్రవ్యాకార[3]సమత్వంబును ద్రవ్యంబునకు నుపసర్జనం బగుటయు ద్రవ్యపరిణామప్రతీతియు నివి రూపవృత్తు లనంబడుఁ దైజసంబునకు సాధారణంబు లగుధర్మంబులు ద్యోతం బనం బ్రకాశంబు పచనం బనఁ దండులాదులపాకంబు పిపాసానిమిత్తం బైన పానంబు (క్షున్నిమిత్తకం బైన) యోదనంబు (హిమమర్దనం బగు) శోషణంబు ననునివి వృత్తు లై యుండురూపతన్మాత్రంబువలన దైవచోదితం బై వికారంబు నొందు తేజస్సువలన రసతన్మాత్రంబు వుట్టె రసతన్మాత్రంబువలన జలంబు వుట్టె జిహ్వ యనురసనేంద్రియంబు రసగ్రాహకం బయ్యె నారసం బేకం బై యుండియు భూతవికారంబునం జేసి కషాయ తిక్త కట్వమ్ల మధు రాదిభేదంబుల ననేకవిధం బయ్యె వెండియు సాంసర్గికద్రవ్యవికారంబునం జేసి యార్ద్రం బగుటయు ముద్ద గట్టుటయుఁ దృప్తిదాతృత్వంబును జీవనంబును దద్వైక్లబ్యనివర్తనంబును మృదూకరణంబును దాపనివారణంబును గూపగతం బయినజలంబు దివియ మఱియు నుద్గమించుటయు ననునివి జలవృత్తు లనంబడు రసతన్మాత్రంబువలన దైవచోదితం బై వికారంబునం బొందినజలంబువలన గంధతన్మాత్రంబు వుట్టె దాని వలనం బృథ్వియుఁ గలిగె ఘ్రాణంబు గంధగ్రాహకం బయ్యె నందు గంధం (బేకంబయ్యు వ్యంజనాదిగతం బయి) హింగ్వాదినిమిత్తంబయిన (మిశ్రగంధం బను కరంభంబును గృంజనాదిగతం బయిన) పూతిగంధంబును ఘనసారాదినిమిత్తం బైనసుగంధంబును (శతపత్త్రాదిగతం బగుశాంతగంధంబును లశునాదిగతం బైనయుగ్రగంధంబును బహ్వుషితచిత్రాన్నాదిగతం బయినయామ్లగంధంబును ద్రవ్యావయవవైషమ్యంబునం జేసి) యనేకవిధం బై యుండు నదియునుం గాక ప్రతిమాదిరూపంబులం జేసి సాకారతాపాదనం బగుభావనంబును జలాదివిలక్షణ

---

1. ద్రవ్యసంబంధంబును ద్రవ్యశబ్దంబులకుం బ్రాపకత్వంబును సర్వేంద్రియవ్యాపకత్వంబు నను లక్షణంబు లై యుండు. 2 వాయుస్పర్శతన్మాత్రంబువలన రూపంబును. 3. సమర్థకత్వంబు.

త్రయాంతరనిరపేక్షం బయినస్థితియు జలాద్యాధారత యనుధారణంబును నాకాశాద్యవచ్ఛేదకత్వంబును సకలప్రాణిపుంస్త్వాభివ్యక్తీకరణంబును ననునివి పృథ్వీవృత్తు లనంబడు నని చెప్పి వెండియు నిట్లనియె నభో(సాధారణ)గుణ(శబ్ద)విశేష(గ్రాహక)ంబు శ్రోత్రంబును వాయ్వ(సాధారణ)గుణవిశేష(గ్రాహక)ంబు స్పర్శంబును దేజోఽ(సాధారణ)గుణవిశేష(గ్రాహక)ంబు చక్షురింద్రియంబును నంభోఽ(సాధారణ)గుణవిశేష(గ్రాహక)ంబు రసనేంద్రియంబును భూమ్య(సాధారణ)గుణవిశేష(గ్రాహక)ంబు ఘ్రాణేంద్రియంబు[1]ను నాకాశాదిగుణంబు లగుచు శబ్దాదికార్యంబు లగువాయ్వాదులందుఁ గారణాన్వయంబున నన్నిటికిం బృథ్వీసంబంధంబు గలుగుటం జేసి భూమియందు శబ్దస్పర్శరూపరసగంధంబులు గలుగుట మహదాదిపృథివ్యంతంబు లగునీయేడుతత్త్వంబులు పరస్పరమిళితంబులై భోగాయతనం బగుపురుషునిం గల్పింప సమర్థంబులై యున్నం జూచి (కాలాదృష్టసత్త్వాదులం గూడి) జగత్కారణుండును (త్రైగుణ్యవిశిష్టుండును నశేషనియామకుండును నిరంజనాకారుండును నగు)సర్వేశ్వరుం డందుఁ బ్రవేశించు నంత నన్యోన్యక్షుభితంబులై మిళితంబులైన మహదాదులవలన నధిష్ఠాతృచేతనరహితం బగునొకయండంబు పుట్టె నందు. 897

సీ. గురుశక్తితో విరా౯ట్పురుషుండు సంభవం, బయ్యె నయ్యండంబు౯ నర్థిఁ బొదివి
యంబుముఖావర౯ణంబు లొక్కొకటికి, దశగుణితంబులై ౯ తవిలి యావ
రణములై యుండును ౯ గ్రమమున లోకంబు,లకు మేలుకట్లపో౯లికఁ దనర్చు
పంకజోదరునిరూ౯పము విలసించును, లోలత [2]జలములోఁ ౯ దేలు చున్న
తే. హేమమయమైనయండంబు౯లో మహాను,భావుఁ డభవుండు హరి దేవ౯దేవుఁ డఖిల
జేత నారాయణుఁడు ప్రవే౯శించి యపుడు,విష్ణుపదభేదనంబు గా౯వించి యుందు.
సీ. కర మొప్పఁగా విరా౯ట్పురుషుండు వెలుఁగొందు, నావిరాట్పురుషుని౯ యాననంబు
వలనను వాణియు ౯ వాణితో వహ్నియు, నాసంబువలనఁ [3]బ్రా౯ణములఁ గూడి
ఘ్రాణేంద్రియం[4]బయ్యె ౯ ఘ్రాణంబువలనను, వాయువులును బ్రాణ౯వాయువులును
నందు నక్షులు చక్షు౯వందు సూర్యుండును, నం దభిధ్యానంబు ౯ నర్థిఁ జేయఁ
తే. గర్ణములు జాత మయ్యెఁ ద౯త్కర్ణసమితి
వలన శ్రోత్రేంద్రియంబు ది౯క్కులును గలిగెఁ
[5]ద్వక్కుచే శ్మశ్రురోమవి౯తానకములు
నోషధివ్రాతమును భవ ౯ మొందె మఱియు. 899
తే. దానివలనను మేఢ్రంబు ౯ గానఁబడియెఁ, బరఁగ రేతంబువలన నా౯పంబు పుట్టె

1. 'వాయువీర్యకారణంబు లగుటం జేసి శబ్దస్పర్శములు వాయుగతంబు లిన్నింటికిం బృథ్వీ... గంధంబులు గలుగుట నివి యన్నియు నసంహతంబులై యున్నం జూచి. 2 జలధిలో. 3 ఘ్రాణమును. 4 బులు రసధారణంబును. 5 ద్వక్కువలనను రోమవితానములును' వ్రా. ప్ర.

గుదమువలన నపానంబు ౯ నుదయమయ్యె, దానివలనను మృత్యువు౯ దగ జనించె.

క. కరములవలనను బలమును, నిరవుగ నారెంటివలన ౯ నింద్రుఁడుఁ బాదాం
బురుహంబులవలన గతియు, నరుదుగ నారెంటివలన ౯[1]హరియును గలిగెన్. 901

క. ఘననాడీపుంజమువల, నను రక్తము దానివలన ౯ నదులును నుదరం
బున నాఁకలియును దప్పియు, ననయము నారెంటివలన ౯ నబ్ధులు పుట్టెన్. 902

క. వినుహృదయమువలనను మన, మును మనమునఁదుహినకరుఁడు ౯బుద్ధియుఁజిత్తం
బున[2]బ్రహ్మయు క్షేత్రజ్ఞుం, డును గలిగిరి యవ్విరాజుఁ౯డుం బూరుషతన్. 903

వ. ([3]మఱియు విరాట్పురుషునం దుదయించినవ్యష్టిరూపంబు లగునాకాశాదిభూతంబులును శబ్దంబు మొదల లగుభూతతన్మాత్రంబులును వాగాదీంద్రియజాతంబును దదధిదేవతలును దమంతన సమష్టిరూపుం డగుక్షేత్రజ్ఞుం బ్రవృత్తిప్రవర్తకుం జేయ నసమర్థంబు లయ్యె నెట్లనిన దేవాధిష్ఠితంబు లగునింద్రియంబులు దాము వేర్వేఱ యయ్యీశ్వరుం బ్రవృత్త్యున్ముఖుం జేయ నోపక క్రమంబునం దత్తదధిష్ఠానాదుల నొందె నందు నగ్ని వాగింద్రియంబుతోడ ముఖంబు నొంది ప్రవర్తించిన విరాట్కార్యం బగువ్యష్టిశరీరజాతం బనుత్పన్నం బయ్యె నంత నాసయు ఘ్రాణేంద్రియంబుతోడ వాయువుం గూడిన నట్టిద యయ్యె నాదిత్యుండు చక్షురింద్రియంబుతోడ నేత్రంబుల నొందిన వృథాభూతం బయ్యె దిగ్దేవతాకం బగుకర్ణంబు శ్రోత్రేంద్రియంబుతోఁ గూడిన విరాట్కార్యప్రేరణాయోగ్యం బయ్యె నోషధులు రోమంబులం ద్వగింద్రియంబుఁ జెంద విఫలం బయ్యె నద్దైవం బగుమేఢ్రంబు రేతంబు నొందనఁ దత్కార్యకరణాదక్షుం బయ్యెఁ బదంపడి గుదంబు మృత్యువుతోడ నపానేంద్రియంబుఁ జేరిన నది హైన్యంబు నొందె విష్ణుదేవతాకంబు లగుచరణంబులు గతితోఁ గూడిన ననీశ్వరంబు లయ్యెఁ బాణీంద్రియంబు లింద్రదైవతంబు లగుచు బలంబు నొందిన శక్తిహీనంబు లయ్యె మఱియు నాడులు ననదీకంబు లై లోహితంబు నొందిన నిరర్థకంబు లయ్యె నుదరంబు సింధువులతోడం జేరి క్షుత్పిపాసలం బొందిన వ్యర్థం బయ్యె హృదయంబు మనంబుతోడం జంద్రు నొందిన నూరక యుండె బుద్ధి బ్రహ్మాధిదైవతం బై హృదయంబు నొందిన నిష్ఫలంబయ్యెఁ జిత్తం బభిమానంబుతో రుద్రునిం జెందిన విరాట్కార్యజాతం బనుద్భూతం బయ్యె నంతఁ జైత్యుం డగుక్షేత్రజ్ఞుండు హృదయాధిష్ఠానంబు నొంది చిత్తంబుతోడం బ్రవేశించిన విరాట్పురుషుండు సలిలకార్యభూతబ్రహ్మాండంబు నొంది ప్రవృత్త్యున్ముఖక్షముం డయ్యె సుప్తుం డగుపురుషునిం బ్రాణాదులు దమబలంబుచే భగవత్ప్రేరితంబు లగుచు నుత్థాపనాసమర్థంబు లగుచందంబున నగ్న్యాదులు స్వాధిష్ఠానభూతంబు లగునింద్రియంబులతోడ దేవాదిశరీరంబుల నొందియు

1 నాడియు. 2 నెగడినక్షేత్ర. 3 ఇది వ్రాతప్రతుల నెల్ల లేదు.

నశక్తంబు లయ్యె నని) మఱియు[1] నవ్విరాట్పురుషుని ననవరతభక్తిం జేసి విరక్తులై యాత్మలయందు వివేకంబు గలమహాత్ములు చింతింపుదు రనియుఁ బ్రకృతిపురుష వివేకంబున మోక్షంబును బ్రకృతిసంబంధంబున సంసారంబును గలుగు నని యుఁ జెప్పి మఱియు ని ట్లనియె. 904

సీ. జననుత సత్త్వరజస్తమోగుణమయ, మైనప్రాకృతకార్య మగుశరీర [వలనఁ
గతుఁ డయ్యుఁ బురుషుండు గడఁగి ప్రాకృతములు, నగుసుఖదుఃఖమోహములఁ
గర మనురక్తుండు గాఁడు వికారవిహీనుఁడు ద్విగుణరహితుఁడు నగుచు
బలసి నిర్మలజలప్రతిబింబితుం డైన, దినకరుభంగి వర్తించునట్టి

తే. యాత్మ ప్రకృతిగుణంబులయందుఁ దగులు
వడి యహంకారమూఢుఁ డై తొడరి నేను
గడఁగి నిఖిలంబునకు నెల్లఁ గర్త నని ప్ర
సంగవశతను బ్రకృతిదోషములఁ బొంది. 905

క. సుర తిర్యఙ్మనుజ స్థావరరూపము లగుచుఁ గర్మవాసనచేతం
బర మైనమిశ్రయోనులఁ, దిరముగ జనియించి సంసృతిం గైకొని తాన్. 906

క. పూని చరించుచు విషయధ్యానంబునఁ జేసి స్వాప్నికార్థాగమసం
ధానమురీతి నసత్పథమానసుఁ డగుచుం భ్రమించు మతిలోలుం డై. 907

వ. అట్లు గావున. 908

తే. పూని మోక్షార్థి యగువాఁడు దీనిఁ దీవ్రభక్తియోగంబుచేత విరక్తిఁ బొంది
మనమువశముగఁ జేసియమనియమాధియోగమార్గక్రియాభ్యాసయుక్తిఁ జేసి.

సీ. శ్రద్ధాగరిష్ఠుఁ డై సత్య మైనట్టిమ, ద్భావంబు మత్పాదసేవనంబు
వర్ణితమత్కథాకర్ణనంబును సర్వ, భూతసమత్వ మజాతవైర
మును బ్రహ్మచర్యంబు ఘనమౌన[2]మాదిగాఁ, గలనిజధర్మసంగతులఁ జేసి
సంతుష్టుఁడును మితాశనుఁడు నేకాంతియు, మననశీలుఁడు వీతమత్సరుండు

తే. నగుచు మిత్త్రత్వమునఁ గృపఁ దగిలి యాత్మ, కలితవిజ్ఞాన మై బంధకంబు లైన
ఘనశరీరపరిగ్రహోత్కంఠయందు, నాగ్రహముసేసి వర్తింపఁదగును మఱియు.

వ. జీవేశ్వరతత్త్వజ్ఞానంబునం జేసి నివృత్తం బయినబుద్ధి దదవస్థానంబునుం గలిగి దూరీభూతేతరదర్శనుం డై జీవాత్మజ్ఞానంబునం జేసి చక్షురింద్రియంబున సూర్యుని దర్శించుచందంబున నాత్మనాయకుం డయిన శ్రీమన్నారాయణుని దర్శించి

1 'నమ్మహాత్ముని ననన్యభక్తింజేసి విరక్తులై యాత్మలందు వివేకంబు గలమహాత్ములు చింతింతు రని చెప్పి వెండియు ని ట్లనియెఁ బ్రకృతిపురుషవివేకజ్ఞానంబున మోక్షం బెఱుంగుము ప్రకృతిసంబంధంబువలన నైనసంసారస్వరూపం బెఱింగించెద నాకర్ణింపుము' వా. ప్ర.

2 మును నాది, గాఁ గలధర్మసంగతులఁ జేసి.

¹నిరుపాధికం బై మిథ్యాభూతం బగునహంకారంబున సద్రూపంబుచేఁ బ్రకాశ
మానం బగుచుఁ బ్రధానకారణంబునకు నధిష్ఠానంబును గార్యంబునకుఁ జక్షు
వుం బోలెఁ బ్రకాశంబును సమస్తకార్యకారణానుస్యూతంబును బరిపూర్ణంబును
సర్వవ్యాపకంబును నగుబ్రహ్మంబును బొందు నని చెప్పి వెండియు ని ట్లనియె.

సీ. విను మాత్మవేత్తకు విష్ణుస్వరూపంబు, నెఱుఁగంగఁబడు నది యె ట్లటన్న
గగనస్థుఁ డగుదినకరుకిరణచ్ఛాయ, జలముల గృహకుడ్యజాలకముల
వలనఁ దోఁచినప్రతిఫలితంబుచేత నూ,హింపఁగఁబడినయయ్యినునిపగిది
నద్ధి మనోబుద్ధ్య²హంకరణత్రయ, నాడీప్రకాశమునను నెఱుంగ

తే. వచ్చు నాత్మస్వరూపంబు వలఁతి గాఁగఁ, జిత్తమునఁ దోఁచు నంచితశ్రీఁ దనర్చి
యమ్మహామూర్తిసర్వభూతాంతరాత్ముఁ, డగుట నాత్మజ్ఞులకుఁ గాననగును మఱియు.

వ. జీవుండు సుషుప్త్యాద్యవస్థలయందుఁ బరమాత్మానుషక్తుం డైన భూతాదితత్త్వం
బులు లీనంబు లై ప్రకృతియందు వాసనామాత్రంబు గలిగి యకార్యకరణం
బులు గాకున్న సుషుప్తిసమయంబునం దాను నిస్తంద్రుం డగుచు నితరంబు
చేతఁ గప్పంబడినవాఁ డై పరమాత్మానుభవంబు సేయుచుండు నని చెప్పిన
విని దేవహూతి యి ట్లనియె. 913

సీ. విమలాత్మ యీపృథివికిని గంధమునకు, సలిలంబునకును రసంబునకును
నన్యోన్య మగునవినాభావసంబంధ, మైనసంగతిఁ బ్రకృత్యాత్మలకును
సతతంబు నన్యోన్యసంబంధ మై యుండు, బ్రకృతితో నయ్యాత్మ పాయు టెట్లు
దలపోయ నొకమాటు తత్త్వబోధముచేత, భవభయంబుల నెల్లఁ బాయు టెట్లు

తే. చచ్చి క్రమ్మఱఁ బుట్టనిజాడ యేది, యిన్నియుఁ దెలియ నానతియిచ్చి నన్నుఁ
గరుణ రక్షింపవే దేవగణనిషేవ్య, భక్తలోకానుగంతవ్య పరమపురుష. 914

వ. అనిన భగవంతుం డి ట్లనియె ననివృత్తం బయినస్వధర్మంబునను నిర్మలాంతఃకర
ణంబునను సునిశ్చితం బైనమద్భక్తియోగంబునను (సత్కథా)శ్రవణసంపాదితం
బైనవైరాగ్యంబునను (దృష్టప్రకృతిపురుషయాథాత్మ్యం బగుజ్ఞానంబునను బలి
ష్ఠంబయి కామానభిష్వంగం బగువిరక్తివలన) దపోయుక్తం బయినయోగంబు
నను దీవ్రం బయినచిత్తైకాగ్రతం జేసి పురుషుని దగుప్రకృతి దందహ్యమానం బై
తిరోధానంబునం బొందు నదియునుం గాక యరణిగతం బైనవహ్ని(చే నరణి
దహింపంబడుచందంబున) జ్ఞానంబునను దత్త్వదర్శనంబునునుం జేసి నిరంతరంబు
బలవంతంబును ³దృష్టదోషంబును నగుప్రకృతి జీవునిచేత భుక్తభోగ యై విడువం
బడు నని చెప్పి. 915

1 'విముక్తలింగశరీరుం డై స్వప్రకాశమానజ్ఞానంబు గలిగి సత్పురుషబాంధవుం డై శత్రుమిత్రసమ
దర్శనుం డైనయాత్మసమానాధికరహితుండును బ్రహ్మత్వాదిశబ్దవాచ్యుండును సమస్తపదార్థానుస్యూతుం
డును నగుచు సర్వేశ్వరుం బొందు నని వెండియు.' 2 'హంకారత్రితయనా,డీప్రకాశచేత ♦ లీల నె
ఱుఁగ' వ్రా. ప్ర. 3 'దృష్టదోషంబులం గలప్రకృతి' వ్రా. ప్ర.

క. విను ప్రకృతి నైజమహిమం, బునఁ దనలో నున్నయట్టి పురుషునకు మహే
శునకు నశుభవిస్ఫురణం, బనయముఁ గావింప జాల దది యెట్లనినన్. 916

చ. పురుషుఁడు నిద్రవోఁ గలలఁ బొందున నర్థకముల్ ప్రబోధమం
దరయఁగ మిథ్య లై పురుషునందు ఘటింపని కైవడిం బరే
శ్వరునకు నాత్మనాథునకు సర్వశరీరికిఁ గర్తసాక్షికిం
బరువడిఁ బొంద వెన్నఁటికిఁ బ్రాకృతదోషము లంగనామణీ. 917

వ. అని వెండియు నిట్లనియె. 918

సీ. అధ్యాత్మతత్త్వరుం డగువాఁడు పెక్కుజ, న్మంబులఁ బెక్కుకాలంబులందు
బ్రహ్మపదప్రాప్తిపర్యంతమును బుట్టు, సర్వార్థవైరాగ్యశాలి యగుచుఁ
బూని నాభక్తులచే నుపదేశింపఁ, బడినవిజ్ఞానసంపత్తిచేతఁ
బరఁగఁ బ్రబుద్ధుఁ డై బహువారములు భూరి, మత్ప్రసాదప్రాప్తి మతిఁ దనర్చు

తే. నిజపరిజ్ఞానవిచ్ఛిన్ననిఖిలసంచ
యుండు నిర్ముక్తలింగదేహుండు నగుచు
ననఘయోగీంద్రహృద్గేయ మగుమదీయ
దివ్యధామంబు నొందు సందీప్తుఁ డగుచు. 919

వ. మఱియు నణిమాద్యష్టైశ్వర్యంబులు మోక్షంబున కంతరాయంబులు గావున వానియందు విగతసంగుండును మదీయచరణసరోజస్థితలలితాంతరంగుండును నగువాఁడు మృత్యుదేవత నపహసించి మోక్షంబునం బొందు నని చెప్పి వెండియు యోగలక్షణప్రకారంబు వినిపింతు విను మని భగవంతుం డైన కపిలుండు నృపాత్మజ కిట్లనియె. 920

క. ధీనిధు లయ్యును యోగవి, ధానంబునఁ జేసి మనము దగ విమలం బై
మానిత మగుమత్పదముం, బూనుదు రాయోగధర్మము న్నెఱిఁగింతున్. 921

వ. అది యెట్లనిన [1]శక్తికొలఁది స్వధర్మాచరణంబును శాస్త్రవినిషిద్ధధర్మకర్మంబులు మానుటయు దైవికం బై వచ్చినయర్థంబువలన సంతోషించుటయు మహాభాగవతశ్రీపాదారవిందార్చనంబును గ్రామ్యధర్మనివృత్తియు మోక్షధర్మంబులయందు రతియు మితం బై శుద్ధం బయినయాహారంబు సేవయు విజనం బయి నిర్బాధకం బయినస్థానంబున నుండుటయు హింసారాహిత్యంబును సత్యంబును నస్తేయంబును దన కెంతయర్థం బుపయోగించు నంతయర్థంబ స్వీకరించుటయు బ్రహ్మచర్యంబును దపశ్శౌచంబులును స్వాధ్యాయపఠనంబును బరమపురుషుం డైన సర్వేశ్వరునియర్చనంబును మౌనంబును నాసనజయంబును దానం జేసి స్థైర్యంబును [2]ప్రాణవాయుస్వవశీకరణంబును నింద్రియనిగ్రహరూపం బైన ప్రత్యాహారం

1 'త్రైవర్గికకర్మంబులు మానుటయు' వ్రా. ప్ర. 2 ప్రాణజయంబును నింద్రియ.

బును మనంబుచే నింద్రియంబుల విషయంబులవలన మరలించి హృదయమందు నిలుపుటయు) దేహగతం బైనమూలాధారాదిస్థానంబులలో నొక్కస్థానంబునందు హృదయగతం బయినమనస్సుతోడం గూడఁ బ్రాణధారణంబును వైకుంఠుం డైనసర్వేశ్వరుండు ప్రవర్తించినదివ్యలీలాచరిత్రధ్యానంబును మానసైకాగ్రీకరణంబును) బరమాత్మ యగుపద్మనాభునిసమానాకారత యనుసమాధానంబునుం గావించి యివియునుం గాక తక్కిన వ్రతదానాదులం జేసి మనోదుష్టం బయినయసన్మార్గంబును బరిహరించి జితప్రాణుం డై మెల్లన యోజించి శుచి యైనదేశంబునం బ్రతిష్ఠించి విజితాసనుం డై యభ్యస్తకుశాజినచేలోత్తరాసనం బైనయాసనంబు సేసి ఋజుకాయుం డై [1]ప్రాణమార్గంబును గుంభకరేచకపూరకంబులం (గోశశోధనంబు) సేసి కుంభకపూరకంబులచేతం బ్రతికూలంబు గావించి చంచలం బయినచిత్తంబు సుస్థిరంబు గావించి తీవ్రం బయినయమంబునం బ్రతప్తం బయి [2]విగతసమస్తదోషం బగుచామీకరంబుకరణి విరజంబు సేసి జితమారుతుం డగుయోగికిం గ్రమ్మఱం బ్రాణాయామం బనుపావకునిచేత వాతపిత్తశ్లేష్మంబు లనుదోషంబుల భస్మీకరణంబు సేసి ధారణంబుచేతఁ గిల్బిషంబులను బ్రత్యాహారంబుచేత సంసర్గంబులను దహనంబు సేసి ధ్యానంబుచేత రాగంబుల సత్త్వాదిగుణంబులను నివారించి స్వనాసాగ్రావలోకనంబు సేయుచు. 922

సీ. దరదరవిందసుందరపత్త్రరుచిరాక్షు, సలలితశ్రీవత్సకలితవక్షు
నీలనీరదనీలనీలోత్పలశ్యాము, నళికులాలకమాలికాభిరాముఁ
గౌస్తుభరుచిరముక్తాహారయుతకంఠు, యోగిమానసపంకజోపకంఠు
సతతప్రసన్నసస్మితవదనాంభోజు, దినకరకోటిసందీప్తతేజు
తే. సలలితానర్ఘ్యరత్నకుండలకిరీట, హారకంకణకటకకేయూరముద్రి
కాతులాకోటిభూషు భక్తప్రపోషుఁ, గింకిణీయుతమేఖలాకీర్ణజఘను. 923

వ. మఱియు. 924

సీ. కంజాతకింజల్కపుంజ[3]రంజితపీత, కౌశేయవాసు జగన్నివాసు
శత్రుభీకరచక్రశంఖగదాపద్మ, విహితచతుర్బాహు విగతమోహు
నుతభక్తలోకమనోనేత్రవర్ధిష్ణు, లాలితసద్గుణాలంకరిష్ణు
వరకుమారకవయఃపరిపాకు సుశ్లోకు, సుందరాకారు యశోవిహారు
తే. సకలలోకనమస్కృతచరణకమలు, భక్తలోకపరిగ్రహప్రకటశీలు
దర్శనీయమనోరథదాయిఁ గీర్తనీయతీర్థయశోమహనీయమూర్తి. 925

వ. వెండియు. 926

క. [4]అనుపమగుణసంపూర్ణుని, ననఘుని సుస్థితుని గతుని నాసీను శయా

---

1 ప్రణవమార్గ. 2 విగతసమస్తదోషంబులం గలచామీకరం. 3 వద్రు చిపీత. 4 అనుపమసంపూర్ణాంగుని.

మని భక్తహృద్గుహాశయు, ముని సర్వేశ్వరు ననంతు నుతసచ్చరితున్. 927

మ. విమలంబై పరిశుద్ధమై తగుమనోవిజ్ఞానతత్త్వప్రబో
ధమతిన్ నిల్పి తదీయమూర్తివిభవధ్యానంబు గావించి చి
త్తము సర్వాంగవిమర్శనక్రియలకుం దార్కొల్పి ప్రత్యంగముల్
సుమహాధ్యానము సేయఁగా వలయుఁ బో శుద్ధాంతరంగంబునన్. 928

వ. అది యెట్టి దనిన. 929

సీ. హలకులిశాంకుశజలజధ్వజచ్ఛత్త్ర,లాలితలక్షణలక్షితములు
సలలితనఖచంద్రచంద్రికానిర్ధూత,భక్తమానసతమఃపటలములును
సురుచిరాంగుష్ఠనిష్ఠ్యూతగంగాతీర్థ,మండితహరజటామండలములు
నంచితధ్యానపారాయణజనభూరి,కలుషపర్వతదీప్రకులిశములును
తే. దాసలోకమనోరథదాయకములుఁ, జారుయోగిమనఃపద్మషట్పదములు
ననఁగఁ దనరినహరిచరణాబ్జములను, నిరుపమధ్యానమున మది నిలుపవలయు.

చ. కమలజమాత యై సురనికాయసమంచితసేవ్యమాన యై
కమలదళాభనేత్రములు గల్గి హృదీశ్వరభక్తి నొప్పన
క్కమల నిజాంకపీఠమునఁ గైకొని యొత్తుపరేశుజానుయు
గ్మము హృదయారవిందమున మక్కువఁ జేర్చి భజింపఁగాఁ దగున్. 931

ఉ. చారువిహంగవల్లభభుజంబులమీఁద విరాజమానసు
శ్రీరుచి నుల్లసిల్లి యతసీకుసుమద్యుతిఁ జాల నొప్పపం
కేరుహనాభునూరువు లకిల్బిషభక్తి భజించి మానసాం
భోరుహమందు నిల్పఁ దగుఁ బో మునికోటికి నంగనామణీ. 932

క. పరిలంబితమృదుపీతాం,బరకాంచీగుణనినాదభరితం బగున
ప్పురుషోత్తమునితంబముఁ, దరుణీ భజియింప వలయుఁ దద్దయుఁ బ్రీతిన్. 933

క. విను భువనాధారత్వం,బునఁ దగి విధిజననహేతుభూతం బగున
వ్వనజాతముచేఁ గడు మిం,చినహరినాభీసరస్సుఁ జింతింపఁ దగున్. 934

తే. దివ్యమరకతరత్నసందీప్తలలిత,కుచములను మౌక్తికావళీరుచులఁ దనరి
యిందిరాదేవిసదనమై యెసకమెసఁగు,వక్ష మాత్మ నుదలఁపోయవలయుఁ జుమ్ము.

మ. నిరతంబున్ భజియించుసజ్జనమనోనేత్రాభిరామైకసు
స్థిరదివ్యప్రభ గల్గుకౌస్తుభరుచిశ్లిష్టంబు నై యొప్పునా
వరయోగీశ్వరవంద్యమానుఁ డగుసర్వస్వామి లక్ష్మీశుకం
ధర మాత్మం గదియించి తద్గుణగణధ్యానంబు సేయం దగున్. 936

క. ఘనమందరగిరిపరివ,ర్తననికషోజ్జ్వలితకనకరత్నాంగదముల్
దనరార లోకపాలకు,లనఁ గలిగినబాహుశాఖలను దలఁపఁ దగున్. 937

వ. మఱియు విమతజనాసహ్యంబులైనసహస్రారంబులు గలుగుసుదర్శనంబును

సరసిజోదరకరసరోరుహంబందు రాజహంసరుచిరం బయినపాంచజన్యంబును న
రాతిభటశోణితకర్దమలిప్తాంగం బై భగవత్ప్రీతికారిణి యగుకౌమోదకియును
బంధురసుగంధగంధానుబంధమంథరగంధవహాహూయమానపుష్పంధయఝంకా
రనినదవిరాజితం బైనవైజయంతీవనమాలికయును జీవతత్త్వం బైనకౌస్తుభ
మణియును బ్రత్యేకంబ ధ్యానంబు సేయం దగు వెండియు భక్తసంరక్షణార్థం
బంగీకరించుదివ్యమంగళవిగ్రహంబున [1]కనురూపంబును మకరకుండలమణి
నిచయమండితముకురోపమాననిర్మలగండమండలంబును [2]సంతతశ్రీనివాసలోచన
పంకజకలితంబును లాలితభ్రూలతాజుష్టంబును మధుకరసమానరుచిచికురవిరా
జితంబును నైనముఖకమలంబు ధ్యానంబు గావింప వలయు మఱియు శరణాగ
తుల కభయప్రదంబు లగుచు నెగడుపాణిపంకేరుహంబుల మనంబునఁ దలఁప
వలయు. 938

క. గురుఘోరరూపకం బై, [3]పరఁగెడుతాపత్రయం బుపశమింపఁగ శ్రీ
హరిచేత నిసృష్టము లగు,కరుణాలోకములఁ దలఁపఁగాఁ దగు బుద్ధిన్. 939

క. ఘనరుచి గలమందస్మిత,మున కనుగుణ మగుప్రసాదమును జిత్తమున
న్ననిచియు ధ్యానము సేయఁ, జను యోగిజనాళి కెపుడు సౌజన్యనిధీ. 940

తే. పూని సతతంబు నై సర్వభూజనముల, శోకబాష్పాంబుజలధిసంశోషకంబు
నత్యుదారతమము హరిహాస మెపుడుఁ, దలఁపఁగావలెనంత్యలోఁదవిలివినుము.

సీ. మునులకు మకరకేతనునకు మోహనం, బై నస్వకీయమాయావిలాస
మున రచితం బై నభ్రూమండలంబును, మునిమనఃకుహరసమ్మోదమానుఁ
డగునీశ్వరునిమందహాసంబు నవపల్ల,వాధరకాంతిచే నరుణ మైన
మొల్లమొగ్గలకాంతి నుల్లసం బాడెడు, దంతపంక్తిని మదిఁ దలఁపవలయు

తే. వెలయ నీరీతి నన్నియు వేఱువేఱ, సంచితధ్యాననిర్మలస్థానములు గ
మనములోఁ గనుమని చెప్పి మఱియుఁబలికె, దేవహూతికిఁగపిలుండు దేటపడఁగ.

సీ. ఈప్రకారమున సర్వేశ్వరునందును, బ్రతిలబ్ధభావసంపన్నుఁ డగుచుఁ
జిరతరసద్భక్తిచేఁ బ్రవృద్ధం బైన, యతిమోదమునఁ బులకితశరీరుఁ
డగుచు మహోత్కంఠానందబాష్పముల్, జడిగొనఁ బరితోషజలధిఁ గ్రుంకి
భగవత్స్వరూప మై భవగుణగ్రాహక, [4]మగుచు మత్సంబంధ మనుకరించి

తే. సుమహిత[5]ధ్యానమునఁ బరంజ్యోతియందు
మనముఁ జాల నియోజించి మహిమఁ దనరు
మోక్షపద మాత్మలోన నపేక్ష సేయు
ననఘవర్తనుఁ డై నమహాత్ముఁ డెపుడు. 943

---

1 కనురూపం బైనవాసంబును. 2 సంతతశ్రీనివాసంబు లైన. 3 జరిగెడుతాపత్రయోపశమ
నార్థము. 4 మగు మత్ప్రబంధంబు ♦ ననుకరించి. 5 ధ్యేయమున.

వ. అది గావున ముక్తి నపేక్షించుమహాత్ముం డగువానిచిత్తంబు విముక్తం బై నభగవద్వ్యతిరిక్తాశ్రయంబు గలిగి విషయాంతరశూన్యం బై విరక్తిం బొందుటం జేసి పురుషుండు శరీరభావంబుల ననన్యభావం బగునిర్వాణపదంబు సూక్ష్మం బగు తేజంబు దనకంటె నధికం బగుతేజంబుతోడిసమానాకారంబు నగుచందంబు నిచ్ఛగించు వెండియు. 944

సీ. పురుషుఁడు చరమమై భువి నన్యవిషయని,వృత్తమై తగ నివర్తించుచిత్త
వృత్త్యాదులను గల్గి వెలయంగ నాత్మీయ,మగుమహిమ సునిష్ఠుఁడై లభించు
సుఖదుఃఖముల మనస్సునఁ దలంపక యహం,కారధర్మంబులుగాఁ దలంచి
యనయంబుసాక్షాత్కృతాత్మతత్త్వముగల్గు,నతఁడు జీవన్ముక్తుఁడండ్రు బుధులు
తే. నతఁడు నేచందమున నుండు ననిన వినుము
తనశరీరంబు నిలుచుటయును జరించు
టయును గూర్చుండుటయు నిఁ కేమియు నెఱుంగ
కర్థి వర్తించు విను తల్లి యతఁడు మఱియు. 945

వ. మదిరాపానంబునం జేసి మత్తుం డగువాఁడు దనకుఁ బరిధానం బగునంబరంబు మఱచి వర్తించుచందంబునఁ దనశరీరంబు దైవాధీనం బని నశ్వరం బని తలంచి యాత్మతత్త్వనిష్ఠుం డై యుపేక్షించు నదియునుం గాక సమాధియోగంబునం జేసి సాక్షాత్కృతాత్మతత్త్వంబు గలవాఁ డయి స్వాప్నికశరీరంబుచందంబున యావత్కర్మఫలానుభవపర్యంతంబు పుత్రదారసమేతం బగుప్రపంచంబు ననుభవించి యటమీఁదఁ బుత్రదారాదిసంబంధంబువలనం బాసి వర్తించు. 946

సీ. సుతదారమిత్రానుజులకంటె మర్త్యుండు, భిన్నుఁ డై వర్తించుచున్నరీతి
విస్ఫులింగోల్ముఖవిపులధూమములచే, హవ్యవాహనుఁడు వే అయినరీతి
వల నొప్పు దేహంబువలన నీజీవాత్మ, పరికింప భిన్నరూపమున నుండుఁ
దవిలి భూతేంద్రియాంతఃకరణంబుల, భాసిల్లుచున్నయీప్రకృతిరూప
తే. బ్రహ్మమున కాత్మ దాఁ బృథగ్భావ మగుచు
ద్రష్ట యయి బ్రహ్మసంజ్ఞచేఁ దనరుచుండు
నఖిలభూతప్రపంచంబులందుఁ దన్నుఁ
దవిలి తనయందు నఖిలభూతములఁ గనుచు. 947

వ. వెండియు. 948

సీ. వరుస ననన్యభావంబులఁ జేసి భూ,తావళియందుఁ దదాత్మకత్వ
మునఁ జూచునాత్మీయఘనతరోపాదాన,ములయందుఁ దవిలి యిమ్ములవెలుంగు
నిద్ధదివ్యజ్యోతి యేక మయ్యును బహు,భావంబులను దోఁచుప్రకృతిగతుఁడు
నగుచున్నయాత్మయుఁ బొగడొందు దేవతి,ర్యఙ్మనుష్యస్థావరాదివివిధ
తే. యోనులను భిన్నభావంబు నొందుటయును, జాలఁ గల్గునిజగుణవైషమ్యమునను

భిన్నుఁడై వెల్గుఁగావునఁ జేర్చియదియు, దేహసంబంధి యగుచు వర్తించుచుండు.

క. భావింప సదసదాత్మక, మై వెలయుచు దుర్విభావ్య మగుచు స్వకీయం
బై వర్తించుచుఁ బ్రకృతిని, భావమునఁ దిరస్కరించు భవ్యస్ఫూర్తిన్. 950

వ. ఈయాత్మ నిజస్వరూపంబునం జేసి వర్తించు నని కపిలుం డెఱింగించిన విని దేవహూతి వెండియు నిట్లనియె మహాత్మా మహదాదిభూతంబులకుం బ్రకృతికినిఁ బురుషునకుం గల్గినపరస్పరవిలక్షణంబులను దత్స్వరూపంబులను నెఱింగించితి వింక నీప్రకారంబుల సాంఖ్యంబునందు నిరూపింపంబడునట్టిప్రకారంబును భక్తియోగమాహాత్మ్యంబును బురుషుండు భగవద్భక్తియోగంబునం జేసి సర్వలోకవిరక్తుం డగునట్టియోగంబును బ్రాణిలోకంబునకు సంసారం బనేకవిధం బయి యుండుఁ గావునఁ బరాపరుండ వై కాలస్వరూపి వైన నీస్వరూపంబును నేసివలనిభయంబునం జేసి జనులు పుణ్యకర్మంబులు సేయు చుండుదురు మిథ్యాభూతం బైనదేహంబునందు నాత్మాభిమానంబు సేయుచు మూఢుం డై కర్మంబులందు నాసక్తం బైనబుద్ధిం జేసి విభ్రాంతుం డగుచు సంసారస్వరూపం బగుమహాంధకారంబునందుఁ జిరకాలప్రసుప్తుం డైనజనునిఁ బ్రబోధించుకొఱకు యోగభాస్కరుండ వై యావిర్భవించినపుణ్యాత్ముండవు గావున నాకు నిన్నియుం దెలియ సవిస్తరంబుగా నానతియ్య వలయు ననిన దేవహూతికిఁ గపిలుం డిట్లనియె. 951

కపిలుండు దేవహూతికి భక్తియోగమును దెలియఁజేయుట.

క. నలినాయతాక్షి విను జన, ములఫలసంకల్పభేదమునఁ జేసి మదిం
గలభక్తియోగమహిమం, బలవడఁగ ననేకవిధము లనఁ దగు నవియున్. 952

వ. వివరించెదఁ దామసరాజససాత్త్వికాదిభేదంబులం ద్రివిధం బై యుండు నందుఁ దామసభక్తిప్రకారం బెట్టి దనిన. 953

తే. సతతహింసాతిదంభమాత్సర్యరూప, తమములను జేయుచును భేదదర్శి యగుచు
బరఁగ నాయందుఁ గావించుభక్తి దలఁపఁ, దామసం బనఁ దగువాఁడు దామసుండు.

క. ఘనవిషయప్రావీణ్యము, లను [1]సుమహైశ్వర్యయశములను బూజాద్య
ర్హుని నను నర్థి భజించుట, చను రాజసయోగ మనఁగ సౌజన్యనిధీ. 955

చ. అనుపమపాపకర్మపరిహారము కై భజనీయుఁ డైనశో
భనచరితుం డితం డనుచు భావమునం దలపోసి భక్తిచే
ననితరయోగ్యతన్ భగవదర్పణబుద్ధి నొనర్చి కర్మముల్
జనహితకారి యై నెగడ సాత్త్వికయోగ మనంగఁ జొప్పడున్. 956

చ. మనుసుత మద్గుణశ్రవణమాత్ర లభించినయట్టిభక్తిచే
ననఘుఁడ సర్వశోభనగుణాశ్రయుఁడం బరమేశ్వరుండ నై
తనరిన నన్నుఁ జెందినయుదాత్తమనోగతు లవ్యయంబు లై

1 మహదైశ్వర్యయశము.

వననిధిగామి యైనసురవాహినిఁబోలె ఫలించు నిమ్ములన్. 957

క. హేయగుణరహితుఁ డనఁ గల, నాయందులభక్తిలక్షణముఁ దెలిపితి నర్క
ఛాయక నిర్హేతుక మై, చేయు మదీయవ్రతైకచిరతరభక్తిన్. 958

వ. (నిష్కాము లయినమదీయభక్తులకు నట్టిభక్తియోగంబు) సాలోక్య(సార్ష్టి) సామీప్యసారూప్యసాయుజ్యంబులకు సాధనంబు గావున మహాత్ము లగువారు నిజమనోరథఫలదాయకంబు లయినను మదీయసేవావిరహితంబు లయినయితరకర్మంబు లాచరింప నొల్లరు దీని నాత్యంతికభక్తియోగం బని చెప్పుదురు సత్త్వరజస్తమోగుణవిహీనుం డయినజనుండు మత్సమానాకారతం బొందు నని చెప్పి మఱియు నిట్లనియె. 959

సీ. నిత్యనైమిత్తికనిజధర్మమున గురు, శ్రద్ధాగరిష్ఠతఁ జతురపాంచ
రాత్రోక్తహరిసమారాధనక్రియలను, నిష్కామనంబున నెఱి మదీయ
విగ్రహదర్శనవినుతిపూజావంద, నధ్యానసంశ్రవణములఁ గర్మ
సంగి గా కుండుట సజ్జనప్రకరాభి, మానంబు నొందుట హీనులందుఁ

తే. జాల ననుకంపసేయుట సములయందు, మైత్రి నెఱపుట యమనియమక్రియాది
యైనయోగంబుచేత నాధ్యాత్మికాధి, భౌతికాదులఁ దెలియుట పలుకుటయును.

వ. మఱియును. 961

క. హరిమంగళగుణకీర్తన, పరుఁ డవుటయు నార్జవమున భగవత్పరులం
గర మనురక్తి భజించుట, నిరహంకారమున నుంట నిశ్చలుఁ డగుటన్. 962

క. ఇవి మొదలు గాఁగఁ గలుగుభ, గవదుద్దేశాభిధర్మకలితుం డై వీ
నివలనఁ బరిశుద్ధగతిం, దవిలినమది గలుగుపుణ్యతముఁ డెయ్యెడలన్. 963

తే. గురుతరానేకకల్యాణగుణవిశిష్టుఁ, డనఁగ నొప్పిననినుఁ బొందు నండ గొనక
పవనవశమునఁ బుష్పపరిమళంబు, ఘ్రాణమున నావరించినకరణి మెఱసి.

చ. అనిశము సర్వభూతహృదయాంబుజవర్తి యనం దనర్చునీ
శు నను నవజ్ఞ సేసి మనుజుం డొగి మత్ప్రతిమార్చనావిడం
బనమున మూఢుఁ డై యుచితభక్తిని నన్ను భజింపఁ డేని న
మ్మనుజుఁడు భస్మకుండమున మానక వేల్చినయట్టివాఁ డగున్. 965

సీ. అబ్జాక్షి నిఖలభూతాంతరాత్ముఁడ నైన, నాయందు భూతగణంబునందు
నతిభేదదృష్టి మాయావులై సతతంబుఁ, ఛాయక వైరానుబంధనిరతు
లగువారిమనములఁ దగులదు శాంతి యెన్నఁటికైన నేను నాకుటిలజనుల
మానక యెప్పుడు సామాన్యాదికద్రవ్య, సమితిచే మత్పదార్చన మొనర్ప

తే. నర్థినాచిత్తమున ముదంబందకుండు, ననుచు నెఱిఁగించి మఱియు నిట్లని యెఁగరుణఁ
గలితసద్గుణజటిలుఁ డకల్మషిలుఁ డెలమిఁ. దల్లితోడ గుణవతీమతల్లితోడ. 966

సీ. తరళాక్షి విను మచేతనదేహములకంటెఁ, జేతనదేహముల్ శ్రేష్ఠ మందుఁ

ప్రాణవంతంబు లై స్పర్శనజ్ఞానంబు, గలుగుచైతన్యవృక్షములకంటె
ఘనరసజ్ఞానసంకలితచేతను లుత్తములు రసజ్ఞానంబు గలుగువాని
కంటె గంధజ్ఞానకలితభృంగంబులు, గడు[1]నుత్తములు వానికంటె శబ్ద
తే. వేదు[2]లగునహుల్ శ్రేష్ఠమై వెలయు శబ్దవిదులకంటెను సద్రూపవేదులైన
వాయసాదులు శ్రేష్ఠముల్ వానికంటె, వరుస బహుపాదులుత్తముల్ వానికంటె.
క. తలఁపఁ జతుష్పదు లధికులు, బలకొని మఱి వానికంటెఁ బాదద్వయముం
గలమనుజు లలఘుతము లి,మ్ముల వారలయందు వర్ణములు నాల్గరయన్. 968
వ. అందు. 969
సీ. [3]తలఁప బ్రాహ్మణు లుత్తములు వారికంటెను, వేదవేత్తలు వేదవిదులకంటె
విలసితవేదార్థవిదులు వారలకంటె, సమధికశాస్త్రసంశయము మాన్పు
మీమాంసకులు మఱి మీమాంసకులకంటె, నిజధర్మవిజ్ఞాననిపుణు లరయ
వారికంటెను సంగవర్జితచిత్తులు, దగ వారికంటె సద్ధర్మపరులు
తే. ధార్మికులకంటె నుత్తమోత్తములు వినుము
మత్సమర్పితసకలధర్మస్వభావ
మహిమములు గల్గి యితరధర్మములు విడిచి
సమత వర్తించునప్పుణ్యతముఁడు ఘనుఁడు. 970
వ. అట్టివాని. 971
క. కని సకలభూతగణములు, మనమున నానందజలధిమగ్నము లగుచున్
ఘనబహుమానపురస్సర, మనయముఁ బాటిల్ల వినుతు లర్థిం జేయున్. 972
వ. అంత నీశ్వరుండు జీవస్వరూపానుప్రవిష్టుం డై యుండు నట్టిభగవంతుం జూచి
భక్తియోగంబున (నేని యోగంబున నేనిఁ) బురుషుండు పరమార్థం బొందుఁ
(బ్రకృతిపురుషాత్మకంబును దద్వ్యతిరిక్తంబును నైనదైవంబు నై కర్మచేష్టితం
బగుచు నుండు) నదియ [4]భగవద్రూపం (బిట్టిభగవద్రూపంబు భేదాస్పదం
బగుచు నద్భుతప్రభావంబు గలకాలం బనియుఁ జెప్పంబడు, నట్టికాలంబు మహ
దాదితత్త్వంబులకును మహత్తత్త్వాభిమాను లగుజీవులకును భయావహం
బగుటం జేసి సకలభూతంబులకు నాశ్రయం బయ్యును (నంతర్గతం బై) భూతంబుల
చేత భూతంబుల గ్రహించుచు యజ్ఞ(ఫల)ప్రదాత గావున వశీకృతభూతుం డై
ప్రభుత్వంబు భజియించి విష్ణుండు ప్రకాశించు చుండు నతనికి మిత్రుండును
శత్రుండును బంధుండును లేఁ డట్టివిష్ణుండు సకలజనంబులయం దావేశించి యప్ర
మత్తుం డై ప్రమత్తు లయినజనంబులకు సంహారకుం డై యుండు నతనిభయంబు

1. "శ్రేష్ఠములు. 2. లగుగురు శ్రేష్ఠు లై. 3. తలపోయ బ్రాహ్మ లుత్తములు వారలకంటె.
4. భగవద్రూపంబు ప్రకృతిపురుషకాలాత్మకం బై యుండుకాలస్వరూపం బొక్కరూపం బై యుం
డు నట్టికాలంబు. 5. మమత్వాభి." వ్రా. ప్ర.

నంజేసి వాయువు వీచు సూర్యుండు దపియించు నింద్రుండు వర్షించు (నక్షత్రగణంబు వెలుంగుఁ) జంద్రుండు ప్రకాశించుఁ దత్తత్కాలంబుల వృక్షలతాదు లోషధులతోడం గూడి పుష్పఫలభరితంబు లగు సరిత్తులు ప్రవహించు సముద్రంబులు మేరలు దప్పక యుండు నగ్ని ప్రజ్వలించు భూమి గిరులతోఁ గూడ బరువునఁ గ్రుంగ వెఱచు నాకాశంబు సకలజనంబులకు నవకాశం బిచ్చు మహత్తత్త్వంబు జగత్తునకు నంకురస్వరూపంబు గావున (సప్తావరణావృతం బగులోకం బను) స్వదేహంబు విస్తరింపం జేయు (గుణాభిమాను లగు బ్రహ్మాదులు సర్వేశ్వరునిచేత జగత్సర్గంబునందు నియోగింపంబడి ప్రతిదినంబు నయ్యయిసర్గంబు సేయ నప్రమత్తులై యుండుదురు పిత్రాదులు పుత్రోత్పత్తిఁ జేయుదురు కాలుండు మృత్యుసహాయుండై మారకుండై యుండుఁ (జరాచరాత్మకం బగు సకలప్రపంచంబు భగవదధీనం బై యుండు) నని చెప్పి కపిలుండు వెండియు ని ట్లనియె. 973

క. నెఱి నిట్టినిఖిలలోకే, శ్వరునిపరాక్రమముఁ దెలియ సామర్థ్యం బె
వ్వరికిని గలుగదు మేఘము, గరువలివిక్రమముఁ దెలియఁగా లేనిగతిన్. [illegible]

క. మగువా విను సుఖహేతుక, మగునర్థము దొరకమికి మహాదుఃఖమునం
దగులుదు రిది యంతయు నా, భగవంతునియాజ్ఞఁ జేసి ప్రాణులు మఱియున్.

సీ. పూని యనిత్యంబు లైన గృహక్షేత్ర, పశుధనసుతవధూ బాంధవాది
వివిధవస్తువులను ధ్రువముగా మది నమ్మి, వఱలుదుర్మతి యగువాఁడు జంతు
సంఘాత మగుదేహసంబంధమున నిల్చి, యర్థి నయ్యైయోనులందుఁ జొరఁగ
ననుగమించును వానియందు విరక్తుండు, గాక చరించు దుర్గతిగుఁ డైన

తే. దేహి యాత్మీయదేహంబు దివిరి వదల, లేక తన కది పరమసౌఖ్యాకరంబు
గాఁగ వర్తించునదియును గాక యతఁడు, దేవమాయావిమోహితభావుఁ డగుచు.

క. ఘన మగుతనయవధూపశు, ధనగృహరక్షణమునందుఁ దత్తత్క్రియలన్
మనమునఁ దలపోయుచు దిన, దినముఁ దందహ్యమానదేహుం డగుచున్. 977

క. అతిమూఢహృదయుఁ డగుచు దు, రితకర్మారంభమునఁ జరించుచుఁ దరుణీ
కృతగోప్యభాషణములను, సుతకలసంభాషణములఁ జొక్కుచు మఱియున్.

క. విను మింద్రియపరవశుఁ డై, మునుకొని తత్కూటధర్మములు గలదుఃఖం
బనయము సుఖరూపంబు గ, మనమునఁ దలపోసి తదభిమానుం డగుచున్.

క. సతతముఁ దమతమసంపా, దిత మగునర్థములచేత ధృతిఁ బరులకుఁ గు
త్సితమతి హింసలు సేయుచు, నతిమూఢమనస్కు లగుచు నాత్మజనములన్.

తే. పూని రక్షించుచును వారిభుక్తశేష
మనుభవించుచు నంత జీవనము వోకఁ
గడఁగి మఱి మఱి యపరార్థకాముఁ డగుచు

సత్త్వ మెడలి కుటుంబపోషణమునందు. 980

సీ. బలిమిసాలక మందభాగ్యుఁడై కుమతియై, పూనియప్పుడు క్రియాహీనుఁడగుచుఁ
దవిలి వృథాప్రయత్నంబులు సేయుచు, మూఢుఁడై కార్పణ్యమునఁ జరించు
నట్టియకించనుఁ డగువానిఁ జూచి త,ద్దారసుతాదు లాత్తలను వీఁడు
గడునశక్తుఁడు ప్రోవఁగాఁ జాలఁ డితఁ డని, నెగ్గింతు రర్థిఁ గృషీవలుండు

తే. బడుగుముసలెద్దు రోసినపగిది నంత
నతఁడు నేవెంటలను సుఖం బంద లేక
[1]తాను బోషించుజనులు దగ దనరఁ బ్రోవ
బ్రదుకు ముదిమియు మిక్కిలి బాధపఱుప. 981

క. వెడరూపుఁ దాల్చి బాంధవు, లడలఁగ నిర్యాణమునకు నభిముఖుఁడై యి
ల్వెడలఁగఁ జాలక శునకము,వడువునఁ గుడుచుచును మేను వడవడ వడఁకన్.

సీ. అతిరోగపీడితుం డై మంద మగుజఠ,రాగ్నిచే మిగుల నల్పాశి యగుచు
మెఱసి వాయువుచేత మీఁదికి నెగసిన,కన్నులు కఫమునఁ గప్పఁబడిన
నాళంబులను గంఠనాళంబునను ఘుర,ఘుర మనుశబ్దంబు దోరయ బంధు
జనులమధ్యంబున శయనించి బహువిధ,ములఁ దన్నుఁ బిలువంగఁ బలుకలేక

తే. చటులతరకాలపాశవశంగతాత్ముఁ, డగుచు బిడ్డలఁ బెండ్లాము నరసి ప్రోచు
[2]చింత వికలము లైనహృషీకములును, గలిగి విజ్ఞానమును బాసి కష్టుఁడగుచు.

వ. అంత మరణావస్థం బొందునమయంబున నతిభయంకరాకారులు సరభసేక్షణులు
నగుయమదూత లిద్దఱు దనముందఱ నిలిచినం జూచి త్రస్తహృదయుండై శకృ
న్మూత్రంబులు విడుచుచు యమపాశబద్ధుం డై శరీరంబువలన నిర్గమించి యాత
నాశరీరంబు నవలంబించి (బలాత్కారంబున) దీర్ఘం బై దుర్గమం బగుమార్గంబు
ను బొంది రాజ(భటులచే నీయమానుం డగుచు) దండనంబున కభిముఖుం డై
[3]చనుభటునిచండంబునఁ జను చుండి. 984

చ. అనయము మూర్ఛ నొందు శునకావళిచేతను భక్ష్యమాణుఁ డై
యనుపమకాలకింకరభయంకరతర్జనగర్జనంబులన్
మనము గలంగ దేహము సమస్తముఁ గంపము నొందఁ గాఁ బురా
తనభవపాపకర్మసముదాయముఁ జిత్తములోఁ దలంచుచున్. 985

సీ. అనుపమక్షుత్తృష్ణ లంతర్వ్యథలఁ జేయ, ఝంఝానిలజ్వాలజ్వాలనచండ
భానుప్రదీప్తితప్తం బై నవాలుకా,మార్గానుగతతప్యమానగాత్రుఁ
డై వీఁపుఁ గశలచే నడువంగ వికలాంగుఁ,డగుచుమార్గమునందునచటనచటఁ
జాలమూర్ఛిల్లు చాశ్రయశూన్యమగునీళ్ల, మునుఁగుచు లేచుచు మొనసి పాప

1 'కోరి తిరిగినవారల మాఁటు లరసి, బ్రదుకుచును ముది మిక్కిలి. 2 చిత్తము వికలమైనహృషీక' వ్రా.ప్ర. 3 'చనునపరాధిచండం' అ.ప్ర.

తే. రూప మయినతమముచే నిరూఢుఁ డగుచు
వెలయఁ దొంబదితొమ్మిది వేలయోజ
నములదూరంబు గలయమనగరమునకుఁ
బూని యమభటుల్ గొంపోవఁ బోవునంత. 986

వ. ఇట్లు మహాపాపాత్ముం డైనవాఁడు ముహూర్తత్రయకాలంబునను సామాన్యదోషి యగువాఁడు ముహూర్తద్వయంబునను నేఁగి యాతనం బొందు నందు.

క. పట్టుదురు కొఱవులను వడిఁ, బెట్టుదు రసిపత్రికలను బెనుమంటలయం
దొట్టుదు రొడళ్లు నలియఁగ, మట్టుదు రప్పాపచిత్తు మత్తుం బెలుచన్. 988

ఉ. ముంతురు తప్తతోయముల మొత్తుదు రుగ్రగదాసిధారలం
ద్రెంతురు పొట్టప్రేవులు వధింతురు మీఁద నిభేంద్రపంక్తి త్రొ
ప్పింతురు ఘోరభంగిఁ గఱపింతురు పాములచేత బిట్టు ద్రొ
బ్బింతురు మీఁద గుండ్లు దినిపింతురు దేహముఁ గోసి కండలన్. 989

వ. మఱియుఁ గుటుంబపోషణంబునఁ గుక్షింభరుం డగుచు నధర్మపరుం డై భూతద్రోహంబున నతిపాపుం డై నిరయంబునం బొంది నిజధనంబులు గోలుపడి మొఱవెట్టునాపన్నునిచందంబునం [1]బరస్పరసంబంధంబునఁ గల్పింపంబడినతమిస్రాంధతామిస్రరౌరవాదు లగునరకంబులం బడి తీవ్రంబు లయినబహుయాతనల ననుభవించి క్షీణపాపుం డై పునర్నరత్వంబునం బొందు నని చెప్పి వెండియు నిట్లనియె. 990

కపిలుండు దేవహూతికిఁ బిండోత్పత్తిక్రమంబుఁ దెలుపుట.

సీ. కైకొని మఱి పూర్వకర్మానుగుణమున, శశ్వత్ప్రకాశకుం డీశ్వరుండు
ఘటకుండు గావునఁ గ్రమ్మఱ జీవుండు, దేహసంబంధంబుఁ దివిరి తాల్ప
దొరఁకొని పురుషరేతోబిందుసంబంధి, యై వధూగర్భంబునందుఁ జొచ్చి
కైకొని యొకరాత్రిఁ గలిలంబు పంచరా, త్రముల బుద్బుదమును దశమదివస
తే. మందుఁ[2]గర్కంధువంతయా నంతమీఁదఁ, బేశియగు నంతమీఁదటఁ బేర్చి యండ
కల్పమగు నొక్కనెలమస్తకమును మాస, యుగళమైనను గరచరణములుఁ బొడము.

వ. మఱియు మాసత్రయంబున నఖరోమాస్థిచర్మంబులు లింగచ్ఛిద్రంబులును గలిగి నాలవమాసంబున సప్తధాతువులును బంచమమాసంబున క్షుత్తృష్ణలును గలిగి [3]షష్ఠమాసంబున మావిచేతం బొదువంబడి తల్లికుక్షిని దక్షిణభాగంబునం దిరుగుచు మాతృభుక్తాన్నపానంబులవలనఁ దృప్తిం బొందుచు మేధమానధాతువులు గల్గి జంతుసంకీర్ణం బగువిణ్మూత్రగర్తంబందుఁ దిరుగుచుఁ గ్రిమిభక్షితశరీరుం డై మూర్ఛలం బొందుచుఁ దల్లి భక్షించినకటుతిక్తోష్ణలవణక్షారామ్లాద్యుల్బణంబు లైనరసంబులచేతఁ బరితప్తాంగుం డగుచు జరాయువునఁ గప్పంబడి

1 జరమం బగుతమిస్రాంధ. 2 కల్కంబు నై యుండునంత. 3 షణ్మాసంబున 'వ్రా. ప్ర.

బహిఃప్రదేశంబునందు నాంత్రంబులచేత బద్ధుండై కుక్షియందు శిరంబు మోపి
కొని భుగ్నుం డైనపృష్ఠగ్రీవోదరుం డై (స్వాంగచలనంబునందు నసమర్థుం
డగుచుఁ) బంజరంబునం దుండుశకుంతంబుచందంబున నుండి దైవకృతం బైన
జ్ఞానంబునం బూర్వజన్మదుష్కర్మశతంబులం దలంచుచు దీర్ఘోచ్ఛ్వాసంబు సేయు
చు నేసుఖలేశంబునుం బొందక వర్తించు నంత నేడవనెలయందు లబ్ధజ్ఞానుం
డై చేష్టలు గలిగి [1]విట్క్రిమిసోదరుం డై యొక్కదిక్కున నుండక సంచరిం
చుచుం బ్రసూతిమారుతంబులచేత నతివేపితుం డగుచు యాచమానుండు
(దేహాత్మదర్శియుఁ బునర్గర్భవాసంబునకు భీతుండు నగుచు బంధనభూతం బగు
సప్తధాతువులచే బద్ధుం డై) కృతాంజలిపుటుండు దీనవదనుండు నై జీవుండు
దా నెవ్వనిచే నుదరంబున వసియింప నియమింపంబడె నట్టిసర్వేశ్వరుని ని ట్లని
స్తుతియించు. 992

గర్భస్థుం డగుజీవుండు భగవంతుని స్తుతియించుట.

క. అనయమును భువనరక్షణ, మున కై స్వేచ్ఛానురూపమునఁ బుట్టెడివి
ష్ణుని భయవిరహిత మగుపద, వనజయుగం బర్థిఁ గొల్తు వారనిభక్తిన్. 993

వ. అదియునుం గాక పంచభూతవిరహితుం డయ్యుం బంచభూతవిరచితం బైనశరీ
రంబునందుఁ గప్పంబడి యింద్రియగుణార్థచిదాభాసజ్ఞానుం డై ననేను. 994

సీ. ఎవ్వఁడు నిఖిలభూతేంద్రియమయ మగు, మాయా[2]వలంబనమహితకర్మ
బద్ధుఁ డై వర్తించు నిపగిది దందహ్యమా,నం బగుజీవచిత్తంబునందు
నవికార మై శుద్ధ మై యఖండజ్ఞాన,మున నుండువానికి ముఖ్యచరితు
నకు నకుంఠితశౌర్యునకుఁ బరంజ్యోతికి, సర్వజ్ఞునకుఁ గృపాశాంతమతికిఁ

తే. గడఁగియుఁ బ్రకృతిపురుషులకంటెఁ బరముఁ, డగునవానికి మ్రొక్కెద నస్మదీయ
దుర్భరోదగ్రభీకరగర్భనరక, వేదనలఁ జూచి శాంతిఁ గావించుకొఱకు. 995

సీ. [3]అనవుడు సుతునకు జననియి ట్లనుఁ దగ, మహితాత్మ యెవ్వనిమాయచేత
ఘనమోహు లై గుణకర్మనిమిత్తసం,సారికమార్గసంచారములను
ధృతి సెడి యలసి యేదిక్కు నెఱుంగక, హరిపదధ్యానంబు నాత్మ మఱచి
యుండువారలకు నేరీయుక్తియు నమ్మహా,పురుషునను గ్రహబుద్ధి లేక

తే. తద్గుణధ్యానతన్మూర్తిదర్శనములు, గోచరించుట యెట్లు నాకును ప్రబోధ
కలితముగ నానతిమ్మన్నఁ గపిలుఁ డనియె, నంబతోడను సుగుణకదంబతోడ.

వ. అట్టియీశ్వరుండు గాలత్రయంబునందును జంగమస్థావరాంతర్యామి యగుటం
జేసి జీవకర్మమార్గంబులం బ్రవర్తించువారు తాపత్రయనివారణంబుకొఱకు భజి
యింతు రని చెప్పి మఱియు ని ట్లనియె. 997

క. జనయిత్రిగర్భమందుల, ఘనకృమివిణ్మూత్రరక్తగర్తములోనన్

1. విష్ఠాసోదరుం డై. 2. వలంబిత. 3. నావుడు సుతునకు దేవహూతి ట్లను.

మునుఁగుచు జఠరాగ్నిని దిన,దినమును దంతప్యమానదేహుం డగుచున్. 998

ఆ. దీనవదనుఁ డగుచు దేహి యీదేహంబు, వలన నిర్గమింపఁ దలఁచి చనిన
నెలల నెన్నికొనుచు నెలకొని గర్భంబు,వలన వెడలఁదోయు వారు గలరె. 999

వ. అని తలంచుచు దీనరక్షకుం డయినపుండరీకాక్షుండు దన్ను గర్భనరకంబువలన విముక్తునిం జేయ నమ్మహాత్మునికిఁ బ్రత్యుపకారంబు సేయ లేమికి నంజలిమాత్రంబు సేయం దగునట్టిజీవుండ నైననేను శమదమాదియుక్తుం డై నశరీరంబునందు విజ్ఞానదీపాంకురంబునం బురాణపురుషు నిరీక్షింతు నని మఱియు ని ట్లనియె. 1000

సీ. [1]నెలకొని బహుదుఃఖములకు నాలయ మైన,యీగర్భనరకము నేను వెడలఁ
జాల బహిఃప్రదేశమునకు వచ్చిన, ననుపమదేవమాయావిమోహి
తాత్ముండ నై ఘోర మైనట్టిసంసార,చక్రమందును బరిభ్రమణశీలి
నై యుండ వలయుఁ దా నది గాక గర్భంబు,నం దుండుశోకంబు నపనయించి

తే. యాత్మ కనయంబు సారథి యైనయట్టి,రుచిరవిజ్ఞానమునఁ దమోరూప మైన
భూరిసంసారసాగరోత్తారణంబు, సేసి యీయాత్మ నరసి రక్షించుకొందు.

వ. మఱియును. 1002

చ. పరఁగుచు నున్నదుర్వ్యసనభాజన మై ఘనదుఃఖమూల మై
యరయఁగఁ బెక్కుతూంట్లు గల దై క్రిమిసంభవ మైనయట్టిదు
స్తరబహుగర్భవాసములసంగతి మాన్పుట కై భజించెదన్
సరసిజనాభభూరిభవసాగరతారకపాదపద్మముల్. 1003

క. అని కృతనిశ్చయుఁ డయి యే,చినవిమలజ్ఞాని యగుచు జీవుఁడు గర్భం
బున వెడల నొల్లకుండం,జనియెడునవమాసములును జన నట యంతన్. 1004

వ. దశమమాసంబున వాని నధోముఖుం గావించిన నుచ్ఛ్వాసనిశ్శ్వాసంబులు లేక ఘనదుఃఖభాజనుండు విగతజ్ఞానుండు [2]రక్తదిగ్ధాంగుండు నై విష్ఠాస్థక్రిమియుంబోలె నేలం బడి యేడ్చుచు [3]జ్ఞానహీనుం డై జడుండునుంబోలె నుండి యంతని జభావానభిజ్ఞు లగునితరులవలన వృద్ధిం బొందుచు నభిమతార్థంబులం జెప్ప నేరక యనేకకీటసంకులం బయినపర్యంకంబునందు శయానుం డై యవయవంబులు గండూయమానంబు లైనఁ గోఁక నేరక యాసనోత్థానగమనంబుల నశక్తుం డై తనశరీరచర్మంబు మశకమత్కుణమక్షికాదులు వొడువఁ (గ్రిములచే వ్యథంబడు క్రిమియుంబోలె) దోధూయమానుం డై రోదనంబు సేయుచు విగతజ్ఞానుం డై మెలంగుచు శైశవంబునం దత్తత్క్రియానుభవంబుఁ గావించి పౌగండవయోనురూపంబు లగునధ్యయనాదిదుఃఖంబు లనుభవించి తదనంతరంబ యౌవనంబు ప్రాప్తం బైన నభిమతార్థఫలప్రాప్తికి సాహసపూర్వంబు లగువృథాగ్రహంబులు సేయుచుఁ గాముకుం డై పంచమహాభూతారబ్ధం బగుదేహంబందుఁ బెక్కు

1 బలకొని; మునుకొని. 2 రక్తవిణ్మూత్రపంకిలుండు నై నేలం. 3. నంతఁ బరులచే వృద్ధిం.

మాఱు లహంకారమమకారంబులం జేయుచుం దదర్థంబు లైనకర్మంబు లాచరించుచు సంసారబద్ధుం డగుచు దుష్పురుషసంగమంబున శిశ్నోదరపరాయణుం డై వర్తించుచు (నజ్ఞానంబునం జేసి వర్ధిష్యమాణరోషుం డగుచుం దత్ఫలంబు లగు దుఃఖంబు లనుభవించుచుం గాముకుం డై నిజనాశంబునకు హేతువు లగుకర్మంబులం బ్రవర్తించు) చుండు మఱియును. 1005

సీ. జనయిత్రి సత్యంబు శౌచంబు దయయును, ధృతియు మానంబు బుద్ధియును సిగ్గు
క్షమయును యశమును శమమును దమమును, మొదలుగాఁగలగుణంబులు నశిం
జనుల కసత్సంగమున నని యెఱిఁగించి, వెండియు నిట్లను వినుము మూఢ [చు
హృదయులు శాంతివిహీనులు దేహాత్మ,బుద్ధులు సంగనామోహపాశ
తే. బద్ధకేళీమృగంబులపగిదిఁ దగిలి, పరవశస్వాంతముల శోచ్యభావు లైన
వారిసంగతి విడువంగవలయు నండ్రు, నంగనాసంగమము దోష మండ్రు గాన.

వ. దీని కొక్కయితిహాసంబు గలదు తొల్లి యొక్కనాఁడు ప్రజాపతి దనకూఁతు రయినభారతి (మృగీరూపధారిణి యై యుండఁ) జూచి తదీయరూపరేఖావిలాసంబులకు నోఁటువడి వివశీకృతాంతరంగుండును విగతత్రపుండును నై [1]తానును మృగరూపంబు నొంది తదనుధావనంబు హేయం బని తలంపక ప్రవర్తించెం గావున సంగనాసంగమంబు వలన (త్వదీయనాభికమలసంజాతచతుర్ముఖనిర్మిత మరీచ్యాద్యుద్భూతకశ్యపాదికల్పితదేవమనుష్యాదులందు) నామాయాబలంబునం గామినీజనమధ్యంబున విఖండితమనస్కుండు గాకుండఁ బుండరీకాక్షుం డైన నారాయణఋషికిం దక్క నన్యులకు నెవ్వరికిం దీర దని వెండియు నిట్లనియె.

తే. రూఢి నామాయ గామినీరూపమునను
బురుషులకు నెల్ల మోహంబుఁ బొందఁ జేయుఁ
గాన పురుషులు సతులసంగంబు మాని
యోగవృత్తిఁ జరించుచు నుండవలయు. 1008

క. ధీరతతో మత్పదసర,సీరుహసేవానురక్తిఁ జెందినవారల్
నారీసంగము నిరయ,ద్వారము గా మనములందుఁ దలఁపుదు రెపుడున్. 1009

క. హరిమాయావిరచిత మై, తరుణీరూపంబుఁ దాల్చి ధరఁ బర్వినబం
ధురతృణపరివృతకూపము, కరణి నదియు మృత్యురూపకం బగు మఱియున్.

చ. ధనపశుపుత్త్రమిత్త్రవనితాగృహకారణభూత మైనయీ
తనువున నున్నజీవుఁడు పదంపడి యెట్టిశరీర మెత్తిన
న్ననుగత మైనకర్మఫల మండక పోవఁగ రాదు మిన్నుఁ బ్రాఁ
కిన భువిఁ దూఱినన్ దిశల [2]గీల్కొని యెచ్చట నైన డాఁగినన్. 1011

వ. అట్టి (పురుషరూపంబు నొందిన) జీవుండు నిరంతరస్త్రీసంగంబు చేవిత్తాపత్యగృహాది

1 తాను గాఱానిపని సేసెం గావున. 2 గ్రుమ్మరిన స్నెలనైన.

ప్రదం బగుస్త్రీత్వంబు నొందు నీక్రమంబున నంగనారూపుం డగుజీవుండు
మన్మాయచేఁ బురుషరూపంబు నొంది ధనాదిప్రదుం డగుభర్తను నాత్మబంధ
కారణం బగుమృత్యువునుగ నెఱుంగ వలయు మఱియు జీవోపాధిభూతం
బగులింగదేహంబుచే స్వావాసభూతలోకంబుననుండి లోకాంతరంబు నొందు
చుం బ్రారబ్ధకర్మఫలంబుల ననుభవించుచు మరలఁ గర్మాదులం దాసక్తుం డగుచు
(మృగయుండు గాననంబున ననుకూలసుఖప్రదుం డైనను మృగంబునకు మృత్యు
వగుచందంబున జీవుండు) భూతేంద్రియమనోమయం బైనదేహంబు గలిగి
యుండు నట్టిదేహనిరోధంబె మరణంబు నావిర్భావంబె జన్మంబునుం గాన సకల
వస్తువిషయజ్ఞానంబు గలుగుటకు జీవునకు సాధనంబు చక్షురింద్రియంబ కావున
ద్రష్టృదర్శనీయయోగ్యతాప్రకారంబున (జీవునకు జన్మమరణంబులు లేవు
గావున) భయకార్పణ్యంబులు విడిచి సంభ్రమంబు మాని [1]జీవప్రకారంబు జ్ఞానం
బునం దెలిసి ధీరుం డై ముక్తసంగుం డగుచు యోగవైరాగ్యయుక్తం బైన
సమ్యగ్జ్ఞానంబున మాయావిరచితం బైనలోకంబున (దేహాదులం దాసక్తి మాని)
వర్తింప వలయు నని చెప్పి వెండియు ని ట్లనియె. 1012

సీ. గృహమందు వర్తించు | గృహమేధు లగువారు, మహితధర్మార్థకా | మములకొఱకు
సంప్రీతు లగుచుఁ ద | త్సాధనానుష్ఠాన, నిరతు లై వేదని | ర్ణీత[2]భూరి
భగవత్స్వధర్మత | ద్భక్తిపరాఙ్ముఖు, లై దేవగణముల | ననుదినంబు
భజియించుచును భక్తిఁ | బైతృకకర్మముల్, సేయుచు నెప్పుడు | శిష్టచరితు
తే. లగుచుఁ దగ దేవపితృసువ్ర | తాఢ్యు లయిన
కామ్యచిత్తులు ధూమాది | గతులఁ జంద్ర
లోకమును జెంది పుణ్యంబు | లుప్త మయిన
మరలి వత్తురు భువికి జ | న్మంబు నొంద. 1013

వ. అదియునుం గాక. 1014

తే. ప్రవిమలానంతభోగిత | ల్పంబునందు, యోగనిద్రాళు వై హరి | యున్నవేళ
నఖిలలోకంబులను విల | యంబు నొందు, నట్టిసర్వేశ్వరునిఁగూర్చి | యలఘుమతులు.
మ. పరికింపన్ [3]నిజభక్తియుక్తిగరిమం | బాటిల్లుపంకేరుహో
దరవిన్యస్తసమస్తధర్మముల శాం | తస్వాంతు లై సంగముం
బరివర్జించి విశుద్ధచిత్తు లగుచుం | బంకేజపత్త్రేక్షణే
తరధర్మైకనివృత్తు లై సతతముం | దైత్యారిఁ జింతించుచున్. 1016

సీ. మఱియు నహంకార | మమకారశూన్యు లై, యర్థి వర్తించుచు | నర్చిరాది
మార్గగతుండును | మహనీయచరితుండు, విశ్వతోముఖుఁడును | విమలయశుఁడు

---

1 జగత్ప్రకారంబు. 2 మైన, యలభగవద్ధర్మములకుఁ బరా. 3 నిజవర్మధర్మగరిమం.

జగదుద్భవస్థానసంహారకారణుం, డవ్యయుం డజుఁడుఁ బరాపరుండుఁ
బురుషోత్తముఁడు నవపుండరీకాక్షుండు, నైన సర్వేశ్వరునందుఁ బొంది
తే. మానితాపునరావృత్తిమార్గ మయిన, ప్రవిమలానంద తేజోవిరాజమాన
దివ్యపదమున సుఖయించు ధీరమతులు, మరలిరా రెన్నఁటికిని జన్మములఁ బొంద.

వ. మఱియుఁ (బరమేశ్వరదృష్టిచే హిరణ్యగర్భు నుపాసించువారు సత్యలోకంబున ద్విపరార్థావసానం బగు ప్రళయంబుదనుకఁ బరుం డగు చతురాననుం బరమాత్మ రూపంబున ధ్యానంబు సేయుచు నుండి) పృథివ్యప్తేజోవాయ్వాకాశమానసేంద్రియ(శబ్దాది)భూతాదులతోడం గూడ (లోకంబును) బ్రకృతియందు లీనంబు సేయ సర్వేశ్వరుండు సకలసంహర్త యగు సమయంబున గతాభిమానంబులు గలిగి బ్రహ్మలోకవాసు లగు నాత్మలు బ్రహ్మతోడం గూడి [1]పరమానందరూపుండును సర్వోత్కృష్టుండును నగు పురాణపురుషుం బొందుదురు గావున నీవు సర్వభూతహృదయపద్మనివాసుండును [2]శ్రుతానుభావుండును నిష్కళంకుండును నిరంజనుండును నిర్ద్వంద్వుండును నగు పురుషుని భావంబుచే శరణంబు నొందు మని చెప్పి మఱియు నిట్లనియె. 1018

మ. సకలస్థావరజంగమప్రతతికిం జర్చింపఁ దా నాద్యుఁ డై
యకలంకశ్రుతిగర్భుఁడుం బరముఁడున్ నైష్ఠియోగీశుండు సే
వకయోగీంద్రకుమారసిద్ధమునిదేవశ్రేణి యోగప్రవ
ర్తక మై తన్ను భజింపఁ జూపు సగుణబ్రహ్మంబు లీలాగతిన్. 1019

సీ. అట్టి సర్వేశ్వరుం డయ్యాయుకాలంబు, లందును దద్గుణవ్యతికరమున
జనియించుచుండు నీచాడ్పున ఋషిదేవ,గణములు దమతమకర్మనిర్మి
[3]తైశ్వర్యపారమేష్ఠ్యములందుఁ బురుషత్వ,మునఁ బొంది యధికారములు వహించి
వర్తించి క్రమ్మఱ వత్తురు మఱికొంద, ఱారూఢకర్మానుసార మైన
తే. మనములను జాలఁ గలిగి ధర్మములయందు, శ్రద్ధతోఁ గూడి యప్రతిషిద్ధమైన
నిత్యనైమిత్తికాచారనిపుణు లగుచుఁ, దగి రజోగుణకలితచిత్తములు గలిగి.

వ. సకాము లై యింద్రియజయంబు లేక పితృగణంబుల నెల్లప్పుడుఁ బూజించుచు గృహంబులయందు వర్తించి హరిపరాఙ్ముఖు లగువారు త్రైవర్గికపురుషు లని చెప్పంబడుదురు. 1021

[4]చ. వినుతగుణోత్తరుండు నురువిక్రముఁ డైన హరిన్ భజించి త

---

1 'యమృతరూపుం డగుపురాణ. 2 మహానుభావుని శరణం' వ్రా. ప్ర. 3 తము లైనయైశ్వర్యశమ లగుపురుషులఁ బొంది యయ్యధికార. 4 చ. వినుతగుణోత్తరుండు నురువిక్రముఁడు న్నగునట్టివిష్ణుకీ,ర్తనరుచిరామృతంబు ప్రమదంబునఁ గ్రోలుటమాని దుష్కథల్, విని ముద మందువారలు వివేకవిహీనత నూరఁబంది యా, త్మను మధురాజ్యభక్ష్యములు మాని పురీషము మెక్కఁ జాడ్పునన్. అని వ్రా. ప్ర.

న్ననలసత్కథామృతము మానుగఁ గ్రోలుట మాని దుష్కథల్
విని ముద మందుచుందురు వివేకవిహీనత నూఱఁబంది యా
త్మను మధురాజ్యభక్ష్యములు మాని పురీషము కేఁగుచాడ్పునన్. 1022

చ. అలవడ ధూమమార్గగతు లై పితృలోకముఁ బొంది పుణ్యముం
బొలసినవారు [1]దొంటితమపుత్త్రులకుం దగఁ దాము పుట్టి వి
హ్వలమతి గర్భగోళపతనాదిపరేతధరాగతాంత మై
వెలసినకర్మ మిం దనుభవింతురు గావున నీవు భామినీ. 1023

క. విను సర్వభావములఁ బర,ముని ననఘు ననంతు నీశుఁ బురుషోత్తముని
న్ననయము భజియింపుము ముద,మునఁ బునరావృత్తి లేనిముక్తి లభించున్.

వ. అని చెప్పి వెండియు నిట్లనియె (భగవంతుం డగువాసుదేవునియందుం బ్రయుక్తం బగుభక్తియోగంబు బ్రహ్మసాక్షాత్కారసాధనంబు లగువైరాగ్యజ్ఞానంబులం జేయు)నట్టిభగవద్భక్తియుక్తం బైనచిత్తం (బింద్రియవృత్తులచే సమంబు లగు) నర్థంబులందు వైషమ్యంబును బ్రియాప్రియంబులను లేక నిస్సంగంబు సమదర్శనంబు హేయోపాదేయవిరహితంబు నై యారూఢం బైనయాత్మపదంబు (నాత్మచేఁ) జూచుచుండు జ్ఞానపురుషుండును బరబ్రహ్మంబును బరమాత్ముండును నీశ్వరుండును నగుపరమపురుషుం డేకరూపంబు గలిగి (యుండియు) దృశ్యద్రష్టకరణంబులచేతం బృథగ్భావంబును బొందుచుండు నిదియ యోగికి (సమగ్రం బగు)యోగంబునం జేసి ప్రాప్యం బగుఫలంబు గావున విషయవిముఖంబు లగు నింద్రియంబులచేత జ్ఞానరూపంబును హేయగుణరహితంబును నగుబ్రహ్మంబు మనోవిభ్రాంతిం జేసి [2]శబ్దాదిధర్మం బగునర్థరూపంబునం దోఁచు నది యెట్టులర్థాకారంబునం దోఁచు నని యడిగితివేని నహంకారంబు గుణరూపంబునం జేసి త్రివిధంబును భూతరూపంబునం బంచవిధంబును నింద్రియరూపంబున నేకాదశవిధంబును నై యుండు జీవరూపుం డగువిరాట్పురుషుండు జీవవిగ్రహం బైన యండం బగుజగంబునం దోఁచుచుండు దీని శ్రద్ధాయుక్తం బయినభక్తిచేత యోగాభ్యాసంబునం జేసి సమాహితమనస్కుం డై నిస్సంగత్వంబున విరక్తుం డైనవాఁడు వొడగనుచుండు నది యంతయు బుధజనపూజనీయచరిత్రవు గావున నీకుం జెప్పితి సర్వయోగసంప్రాప్యుం డగునిర్గుణుండు భగవంతుం డని చెప్పిన జ్ఞానయోగంబును మదీయభక్తియోగంబును నను రెండు నొక్కటియ యింద్రియంబులు భిన్నరూపంబులు గావున నేకరూపం బయినయర్థం బనేకవిధంబు లగునట్లు యేకం బగుబ్రహ్మం బనేకవిధంబులుగఁ దోఁచు మఱియును. 1025

సీ. అంబ నారాయణుం డఖిలశాస్త్రములను, సమధికానుష్ఠితసవనతీర్థ
దర్శనజపతపోఽధ్యయనయోగక్రియా, దానకర్మంబులఁ గానఁబడఁడ

---

1 ద్రోఁచి-త్రోవ. 2 యథార్థాకారంబునం దోఁచు.

మేఁచినమనము బాహ్యేంద్రియంబుల గెల్చి, సకలకర్మత్యాగసరణి నొప్పి
తలకొని యాత్మతత్త్వజ్ఞానమున మించి, యుడుగక వైరాగ్యయుక్తిఁ దనరి
తే. మహితఫలసంగరహితధర్మమునఁ దనరు
నట్టిపురుషుండు దలపోయ నఖిలహేయ
గుణములను బాసి కల్యాణగుణవిశిష్టుఁ
డైనహరి నొందుఁ బరమాత్ము ననఘుఁ డగుచు. 1026

వ. అది గావున నీకుం జతుర్విధభక్తియోగప్రకారంబుఁ దేటపడ నెఱింగించితి నదియునుం గాక కామరూప యగుమదీయగతి జంతువులయందు నుత్పత్తివినాశరూపంబుల నుండు నవిద్యాకర్మనిర్మితంబు లైనజీవునిగతు లనేకప్రకారంబు లైయుండు నదియు జీవాత్మ వానియందుఁ బ్రవర్తించి యాత్మగతి యిట్టి దని యెఱుంగక యుండు నని చెప్పి మఱియు నిట్లనియె (నిట్టియతిరహస్యం బగు) సాంఖ్యయోగప్రకారంబు ఖలునకు నవినీతునకు జడునకు దురాచారునకు డాంబికునకు నింద్రియలోలునకుఁ [1]పుత్రదారాగారాద్యత్యంతాసక్తచిత్తునకు భగవద్భక్తిహీనునకు విష్ణుదాసులయందు ద్వేషపడువానికి నుపదేశింప వలవదు శ్రద్ధాసంపన్నుండును భక్తుండును వినీతుండును ననసూయుండును సర్వభూతమిత్రుండును శుశ్రూషాభిరతుండును బాహ్యార్థజాతవిరక్తుండును శాంతచిత్తుండును నిర్మత్సరుండును శుద్ధాత్ముండును మద్భక్తులయందుఁ బ్రేమ గలవాఁడును నన్యకాంతావిముఖుండును నిష్కాముండును నగునధికారికి నుపదేశింప నర్హంబగునీయుపాఖ్యానం బేపురుషుం డేనిఁ బతివ్రత యగునుత్తమాంగన యేని శ్రద్ధాభక్తులు గలిగి మదర్పితచిత్తంబునన్ వినుఁ బఠియించు నట్టిపుణ్యాత్ములు మదీయదివ్యస్వరూపంబుఁ బ్రాపింతు రని చెప్పె నని మైత్రేయుండు విదురునకు వెండియు నిట్లనియె నీప్రకారంబునం గర్దమదయిత యైనదేవహూతి గపిలుని వచనంబులు విని నిర్ముక్తమోహపటల యగుచు సాష్టాంగదండప్రణామంబు లాచరించి తత్త్వవిషయా(ంకితసాంఖ్యజ్ఞానప్రవర్తకం)బగుస్తోత్రంబు సేయ నుపక్రమించి కపిలున కిట్లనియె. 1027

సీ. అనయంబు విను మింద్రియార్థమనోమయం, బును భూతచయమయంబును నశే
భూరిజగద్బీజభూతంబును గుణప్ర, వాహకారణమును వలను మెఱయు [ష
[2]నారాయణాభిఖ్య నాఁ గలభవదీయ, దివ్యమంగళమూర్తి దేజరిల్లుఁ
జారుభవద్గర్భసంజాతుఁ డగునట్టి, కమలగర్భుండు సాక్షాత్కరిం[3]ప
తే. లేక మనమునఁ గనియె నయ్యనేకశక్తి, వర్గములు గల్గి సుగుణప్రవాహరూప
మంది విశ్వంబు దాల్చి సహస్రశక్తిఁ, గలితుఁ డై సర్వకార్యముల్ గలుగఁ జేయు.

---

1 'గృహక్షేత్రపుత్రదారాసక్తునకు. 2 నారాయణంబు ననంగల 3. చె నదియు నానావిధంబు లై యలరుశక్తి...కలిత మై సర్వ' వ్రా. ప్ర.

వ. అంత. 1029

తే. అతులభూరియుగాంతంబునందుఁ గపట, శిశువ వై యొంటి కుక్షినిక్షిప్తనిఖిల
భువననిలయుండవై మహాంభోధినడుమఁ, జారువటపత్త్రతల్పసంస్థాయి వగుచు.

తే. లీల నాత్మీయపాదాంగుళీవినిర్గ, తామృతము గ్రోలినట్టిమహాత్మ నీవు
గడఁగి నాపూర్వభాగ్యంబుకతన నిపుడు, పూని నాగర్భమున నేఁడు పుట్టితయ్య.

వ. అట్టిపరమాత్ముండ వయిననీవు. 1032

సీ. వరుస విగ్రహాపారవశ్యంబునను జేసి, రఘురామ కృష్ణ వరాహ నార
సింహాదిమూర్తు లంచితలీల ధరియించి, దుష్టనిగ్రహమును శిష్టపాల
నమును గావించుచు నయమున సద్ధర్మ, నిరతచిత్తులకు వర్ణింపఁ దగిన
చతురాత్మతత్త్వవిజ్ఞానప్రదుండవై, వర్తింతు వనఘ భవన్మహత్త్వ

తే. మజున కయినను వాక్రువ్వ నలవిగాదు, నిగమజాతంబు లయిన వర్ణింపలేవ
యెఱిఁగి సంస్తుతిసేయ నే నెంతదాన, వినుతగుణశీల మాటలు వేయు నేల.

వ. అదియునుం గాక. 1034

క. ధీమహిత భవన్మంగళ, నామస్మరణానుకీర్తనము గలహీనుల్
శ్రీమంతు లగుదు రగ్నిష్టోమాదిక్రతువాళికంటె శుద్ధులు దలఁపన్. 1035

వ. అదియునుం గాక. 1036

క. నీనామస్తుతి శ్వపచుం, డైనను జిహ్వాగ్రమందు ననుసంధింపన్
వానికి సరి భూసురుఁడుం, గా నేరఁడు చిత్ర మిది జగంబుల నరయన్. 1037

ఉ. ఈవిధ మాత్మలం దెలిసి యెప్పుడు సజ్జనసంఘముల్ జగ
త్పావన మైననీగుణకథామృత మాత్మలఁ గ్రోలి సర్వతీ
ర్థావళిఁ గ్రుంకినట్టిఫల మందుదు రంచు సమస్తవేదముల్
వావిరిఁ బల్కుఁ గావునను వారలు ధన్యులు మాన్యు లుత్తముల్. 1038

వ. అది గావునఁ బరబ్రహ్మంబవును బరమపురుషుండవును బ్రత్యఙ్మనోవిభావ్యుండ
వును సమస్తజనపాపనివారకస్వయంప్రకాశుండవును వేదగర్భుండవును శ్రీమహా
విష్ణుండవును నగునీకు వందనంబు లాచరించెద నని స్తుతియించిన బరమపురు
షుండును మాతృవత్సలుండును నగుకపిలుండు గరుణారసార్ద్రహృదయకమలుం
డై జనని కి ట్లనియె. 1039

తే. తవిలి సుఖరూపమును మోక్షదాయకంబు, నైనయీయోగమార్గ మే నంబ నీకు
నెఱుఁగ వివరించి చెప్పితి నిది దృఢంబు, గాఁగ భక్తి ననుష్ఠింపు కమలనయన.

క. జీవన్ముక్తి లభించుం, గావున నేమఱక తలఁపు కైకొని దీనిన్
వావిరి నొల్లనివారికిఁ, దావల మగు మృత్యుభయము దవ్వగు సుఖమున్.

క. అని యిట్లు దేవహూతికి, మన మలరఁగఁ గపిలుఁ డాత్మమార్గం బెల్లన్
వినిపించి చనియె నని విదు, రునకున్ మైత్రేయమునివరుం డెఱిఁగించెన్. 1042

వ. అట్లు కపిలుం డేఁగినఁ బిదప దేవహూతియుం బుత్త్రుండు సెప్పినయోగమార్గం
బున విజ్ఞానంబు గలిగి యుండియుం బెనిమిటి యైనకర్దమునిం దనయుం డైన
కపిలునిం బాసి వినష్టవత్సంబు గలగోవుచందంబునం దల్లడిల్లుచుఁ గపిలమహా
మునిం దలంచుచుం గర్దమతపస్సామర్థ్యరచితం బైనయట్టి. 1043

ఉ. మానితసౌరభప్రసవమంజులపక్వఫలప్రవాళభా
రానతచూతపోతవిటపాగ్రనికేతనరాజకీర[1]స
ఖ్యానిసుఖానులాపపరిమండితకర్దమతాపసాశ్రమో
ద్యానవనప్రదేశకమలాకరతీరనికుంజపుంజముల్. 1044

వ. వెండియు. 1045

సీ. అంచితస్ఫటికమణిమయస్తంభదీప్తిచేఁ, గోమరారుమరకతకుడ్యములను
సజ్జాతివజ్రాలసజ్జాలరుచులచే, భాసిల్లునీలసోపానములను
దీపించుచంద్రకాంతోపలవేదుల, విద్రుమగేహళీవిలసితముల
హాటకరత్నకవాటశోభితముల, నలరినసౌధశాలాంగణముల
తే. వరపయఃఫేనపటలపాండురకరీంద్ర, దంతనిర్మితఖట్వాంగధవళపటవి
రచితశయ్యాళులను జతురంతయాన, కనకపీఠాదివస్తుసంఘముల నెల్ల. 1046

వ. మఱియు వికచకమలకుముదసౌగంధికబంధురసుగంధానుబంధిగంధవహశోభితం
బును నరవిందనిష్యందకందళితమరందరసపానమదవదిందిందిరసందోహఝం
కారసంకులంబును నై చెలువారుబావులుగలిగి పురందరసుందరీనందితం బైన
కర్దమాశ్రమంబుఁ బరిత్యజించి కుటిలంబు లైనకుంతలంబులు జటిలంబులుగా
ధరియించి సరస్వతీబిందుసరోవరంబులం ద్రిషవణస్నానంబు గావించుచు నుగ్ర
తపోభారంబునం గృశీభూతశరీర యై నిజకుమారుండును బ్రసన్నవదనుండును
గపిలనామధేయుండును నగునారాయణుని (సమస్తన్యస్తచింతలచే) ధ్యానంబుసే
యుచుఁ బ్రవాహరూపం బైనభక్తియోగంబునను నధికవైరాగ్యంబునను [2]యుక్తా
నుష్ఠానజాతం బై బ్రహ్మాత్మావపాదకం బగుజ్ఞానంబునను విశుద్ధమనంబును గలిగి.

సీ. అనయంబు నాత్మనాయకుఁడు సువిశ్వతో, ముఖుఁ డనంతుఁడు పరముఁడు నజుండు
చతురుండు నిజపరిజ్ఞానదీపాంకుర, మహిమనిరస్తసమస్తభూరి
మాయాంధకారుఁ డప్రమేయుఁ డీశ్వరుఁ డగు, నాపరబ్రహ్మంబునం దవిరత
బద్ధతత్త్వజ్ఞానపరతచే నిర్ముక్త, జీవభావమున విశిష్టయోగ
తే. భవ్యసంప్రాప్తనిర్మలబ్రహ్మభావ, ములను గలిగి సమాధిచే నెలమి దనరు
నపునరావృత్తమగుత్రిగుణప్రధాన, తత్త్వముల నొప్పి సంతతోదారనియతి.

తే. కలలఁ దోఁచినవస్తుసంఘముల మేలు, కని కనుంగొనఁగా లేనిమనుజుపోల్కిఁ

---

1 'కేకీనికరానులాప పరికీర్తిత...తీరనికుంజ'. 2 'బ్రహ్మజ్ఞానంబునను జ్ఞానహేతువు లైనయు
క్తానుష్ఠానంబులను విశుద్ధ' వ్రా. ప్ర.

బోలెంతి దనయోత్తమఱచి యి।మ్ముల సధూమ, మైనపావకుగతినుండె।నంతలోన.

క. గురుయోగశక్తిచే నం, బరతలమున కెగసి సత్కృ।పామయుఁ డగునా
పరవాసుదేవుచరణాం, బురుహయుగన్యస్తచిత్త।మును గల దగుచున్. 1050

వ. ఇట్లు కపిలోక్తమార్గంబున దేవహూతి శ్రీహరియందుఁ గలసె నయ్యంగనారత్నంబు మోక్షంబునకుం జనినక్షేత్రంబు సిద్ధిపదం బనుపేరం బరఁగి ప్రసిద్ధి వహించె నంత నక్కడఁ గపిలుండు దల్లిచేత ననుజ్ఞాతుం డై సిద్ధచారణగంధర్వాప్సరోమునినివహసంస్తూయమానుం డగుచు సముద్రునిచేత దత్తార్హణపూజానికేతనంబులు వడసి సాంఖ్యాచార్యాభిష్టుతం బగుయోగంబు నవలంబించి (లోకత్రయ)శాంతికొఱకు సమాహితుం డై (స్వపిత్రాశ్రమంబు విడిచి) యుదగ్భాగంబునకుం జనియె నని మైత్రేయమహాముని విదురున కిట్లనియెఁ దండ్రీ యీయుపాఖ్యానంబు నాకు గోచరించినరీతి నీకుం జెప్పితి నిది కపిలదేవహూతిసంవాదం బత్యంతపావనంబు గపిలప్రణీతంబు నయినయోగంబు దీనిం బరమభక్తియుక్తుం డై యెవ్వండు పఠించు నెవ్వండు విను నట్టిపుణ్యాత్ములు విగతపాపు లై గరుడధ్వజుం డైనపుండరీకాక్షుని శ్రీచరణారవిందంబులం బొందుదు రని మైత్రేయుండు విదురున కెఱిఁగించినవిధంబున శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పె నని సూతుండు శౌనకాదిమహామునులకు నీకథావృత్తాంతంబు సెప్పిన విని ప్రహృష్టహృదయు లై మునికులోత్తమా భవద్వాక్పూరం బగుభగవత్కథామృతంబులు గ్రోలు చుండ మామనంబులు దనివోవ దింకను దరువాతివృత్తాంతంబులు మాకు విశదంబులుగ వినిపింప నీవ యర్హుండ వని యడుగుటయు. 1051

చ. జనకసుతామనోవిమల।సారసకోమలచంచరీక చం
దన శరదిందు కుందహార । తార మరాళ పటీర చంద్రికా
వినుతయశోవిశాల రఘు।వీర దరస్మితపద్మపత్త్రలో
చన నిటలాంబకప్రకట।చాపవిఖండన వంశమండనా. 1052

తరలము. పరమపావన విశ్వభావన । బాంధవప్రకరావనా
శరధిశోషణ సత్యభాషణ । సత్కృపామయభూషణా
దురితతారణ సృష్టికారణ । దుష్టలోకవిదారణా
ధరణిపాలన ధర్మశీలన । దైత్యమర్దనఖేలనా. 1053

మాలిని. దివిజగణశరణ్యా । దీపితానంతపుణ్యా
ప్రవిమలగుణజాలా । భక్తలోకానుపాలా
భవతిమిరదినేశా । భానుకోటిప్రకాశా
కువలయహితకారీ । ఘోరదైత్యప్రహారీ. 1054

గద్యము. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ

పాండిత్యపోతనామాత్యప్రణీతం బయిన శ్రీమహాభాగవతం బనుమహాపురాణంబు నందు విదురనీతియు విదురునితీర్థాభిగమనంబును యుద్ధవసందర్శనంబును గౌరవ యాదవకృష్ణాదినిర్యాణంబును గంగాద్వారంబున విదురుండు మైత్రేయునిం గనుట యు విదురుమైత్రేయసంవాదంబును జగదుత్పత్తిలక్షణంబును మహదాదులసంభవ ప్రకారంబును మహదాదులు నారాయణు నభినందించుటయు విరాడ్విగ్రహప్ర కారంబును శ్రీమహాభాగవతభక్తికారణం బగుపద్మసంభవు జన్మప్రకారంబును బ్రహ్మతపంబును బరమేష్ఠికిఁ బుండరీకాక్షుండు ప్రత్యక్షం బగుటయు బ్రహ్మకృతం బయినవిష్ణుస్తోత్రంబును గమలసంభవునిమానససర్గంబును బరమాణువులపుట్టువు ను భూర్భువస్సువరాదిలోకవిస్తారంబును గాలదివసమాసవత్సరాదినిర్ణయంబును నాయుఃపరిమాణంబును జతుర్యుగపరిమాణంబును బద్మసంభవుసృష్టిభేదనంబును సనకాదులజన్మంబును స్వాయంభువమనువుజన్మంబును శ్రీహరివరాహావతారంబు ను భూమ్యుద్ధరణంబును సూకరాకారుం డైనహరిని విధాత స్తుతియించుటయు దితికశ్యపసంవాదంబును గశ్యపుండు రుద్రునిం బ్రశంసించుటయుఁ గశ్యపువలన దితి గర్భంబు ధరించుటయుఁ దత్ప్రభావంబునకు వెఱచి దేవతలు బ్రహ్మసన్నిధికిం జని దితిగర్భప్రకారంబు విన్నవించుటయు సనకాదులు వైకుంఠంబున కరుగుట యు నందు జయవిజయుల కలిగి సనకాదులు శపించుటయు శ్రీహరిదర్శనంబును బ్రాహ్మణప్రశంసయు సనకాదులు హరిని నుతించుటయు హిరణ్యకశిపుహిరణ్యా క్షులజన్మప్రకారంబును హిరణ్యాక్షునిదిగ్విజయంబును సవనవరాహహిరణ్యాక్షు లయుద్ధంబును బ్రహ్మస్తవంబును హిరణ్యాక్షవధయు నమరగణంబులు శ్రీహరి నభినందించుటయు హరి వరహావతారవిసర్జనంబు సేయుటయును దేవతిర్యఙ్మను ష్యాదులసంభవంబును గర్దమమహామునితపంబునకు సంతసించి శ్రీహరి ప్రత్యక్షం బగుటయుఁ గర్దముండు స్వాయంభువమనుపుత్త్రి యైనదేవహూతిం బరిణయంబగు టయు దేవహూతిపరిచర్యలకు సంతసిల్లి కర్దముండు నిజయోగకల్పితం బగువి మానంబునందు నిలిచి సహస్రదాసీపరివృత యైనదేవహూతిం గూడి భారతా దివర్షంబులు గలయం గ్రుమ్మరుటయు దేవహూతి గర్దమునివలనఁ గన్యకానవకం బును గపిలునిం గనుటయుఁ దత్కన్యకావివాహంబులును గర్దమునితపోయా త్రయుఁ గపిలదేవహూతిసంవాదంబును శబ్దాదిపంచతన్మాత్రలజన్మప్రకారంబును బ్రహ్మాండోత్పత్తియు విరాట్పురుషకర్మేంద్రియపరమాత్మప్రకారంబును బ్రకృ తిపురుషవివేకంబును నారాయణునిసర్వాంగస్తోత్రంబును సాంఖ్యయోగంబును భక్తియోగంబును జీవున కైనగర్భసంభవప్రకారంబును జంద్రసూర్యమార్గం బును బితృమార్గంబును దేవహూతినిర్యాణంబును గపిలమహాముని దపంబు నకుం జనుటయు ననుకథలం గలతృతీయస్కంధము. 1055.

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

శ్రీ ర స్తు

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

చతుర్థస్కంధము

విలసితధరణీతన
యావదనసరోజవాసరాధిప సితరా
జీవదళనయన నిఖిలధ
రావరనుతసుగుణధామ రాఘవరామా. 1

వ. మహనీయగుణగరిష్ఠు లగునమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డైనసూతుం డి ట్లనియె నట్లు ప్రాయోపవిష్టుం డైనపరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 2

సీ. జననాథ విను విదురునకును మైత్రేయ,మునినాథచంద్రుఁ డి ట్లనియె మఱియు
స్వాయంభువున కర్థి శతరూపవలనను, గూఁతులు మువ్వు రాకూతి దేవ
హూతి ప్రసూతులు నొనరఁ బ్రియవ్రతో,త్తానపాదులు ననుతనయయుగము
జనియింప నం దగ్రసంభవ యైనయా,కూతిని సుమహితభ్రాతృమతిని

తే. దనకు సంతానవిస్తారార్థంబుగాఁగఁ, బుత్రికాధర్మ మూఁది యాపువ్వుఁబోఁడిఁ
బ్రకటమూర్తి రుచిప్రజాపతికి నిచ్చె,మనువుముద మొంది శతరూప యనుమతింప.

వ. అట్లు వివాహం బైనరుచిప్రజాపతి బ్రహ్మవర్చస్వియుఁ బరిపూర్ణగుణుండును గావునఁ జిత్తైకాగ్రతం జేసి యాకూతియందు శ్రీవిష్ణుండు యజ్ఞరూపధరుం డగు పురుషుండుగను జగదీశ్వరి యగునాదిలక్ష్మి యమ్మహాత్మునకు నిత్యానపాయిని గావునఁ దదంశంబున దక్షిణ యనుకన్యకారత్నంబుగను మిథునంబు సంభవించె నందు స్వాయంభువుండు సంతుష్టాంతరంగుం డగుచుఁ బుత్రికాపుత్రుండును వితతతేజోధనుండును శ్రీవిష్ణుమూర్తి (రూపుండును నగుయజ్ఞునిఁ) దనగృహంబునకుఁ దెచ్చి యునిచె రుచియుఁ గామగమన యైనదక్షిణ యనుకన్యకాలలామంబును దనయొద్దన నిలిపె నంత సకలమంత్రాధిదేవత యగుశ్రీయజ్ఞుండు (దనుఁ బతిఁగం గోరెడు) దక్షిణ యనుకన్యకం బరిణయం బయ్యె వార లాదిమిథునంబు

గావున నది నిషిద్ధంబు గాకుండె నని చెప్పి మైత్రేయుండు వెండియు నిట్లనియె.

క. ధీమహిత యంత వారల, యామాఖ్యులు గలుగు దేవతావళి గడఁకన్
వేమఱు [1]నభినందించుచు, నామిథునమువలనఁ బుట్టె నతిబలయుతమై. 5

వ. వారు తోషుండును బ్రతోషుండును సంతోషుండును భద్రుండును శాంతియు నిడస్పతియు నిధ్ముండును గవియు విభుండును వహ్నియు సుదేవుండును రోచనుండును నసం బన్నిద్దఱు సంభవించిరి (వారలు స్వాయంభువాంతరంబునం దుషితు లను దేవగణంబులై వెలసిరి మఱియు) మరీచిప్రముఖులైనమునీశ్వరులును యజ్ఞుండును దేవేంద్రుండును మహాతేజోరూపసంపన్నులయినప్రియవ్రతోత్తానపాదులునుం గలిగి పుత్రపౌత్రనప్తృజనసంకీర్ణం బయి యామన్వంతరంబు (పాలితం బగుచు) వర్తిల్లె మనువు ద్వితీయపుత్త్రియైనదేవహూతిం గర్దమున కిచ్చి తద్వంశవిస్తారంబు గావించె నని మున్న యెఱింగించితి వెండియు నమ్మనువు మూఁడవచూలైనప్రసూతి యనుకన్యకను (బ్రహ్మపుత్త్రుం డగు) దక్షప్రజాపతికి నిచ్చె నాదక్షునకుఁ బ్రసూతివలన నుదయించినప్రజాపరంపరలచేత ముల్లోకంబులు విస్తృతంబు లయ్యె మఱియుఁ గర్దమపుత్త్రికాసముదయంబు బ్రహ్మర్షిభార్య లగుటం జేసి వారివలనం గలిగినసంతానపరంపరల వివరించెద. 6

కర్దమప్రజాపతిసంతతిని దెలుపుట.

సీ. ఘనుఁ డౌమరీచికిఁ గర్దమాత్మజ యగు, కళ యనునంగనవలనఁ గశ్య
పుం డనుకొడుకును బూర్ణిమ యనువాఁడు, బిడ్డయుఁ బుట్టిరి పేర్చి వారి
వలనఁ బుట్టినప్రజావళిపరంపరలచే, భువనంబు లెల్ల నాపూర్ణ మగుచు
జరగెను బూర్ణిమ జన్మాంతరంబున, హరిపదప్రక్షాళితాంబువులను

తే. గంగ యనుపేరఁ బుట్టె యక్కన్య దేవ, కుల్యయనుపేరఁ దగునొక్కకూఁతు నఖిల
విశ్వసంవ్యాపకుం డగువిరజుఁ డనెడి, తనయు నొక్కనిఁ గాంచె మోదంబుతోడ.

క. అనఘుం డత్రిమహాముని, యనసూయాదేవివలన నజహరిపురసూ
దనులకళాంశంబుల నం, దనులను ముప్వురను గనియెఁ దద్దయుఁ బ్రీతిన్. 8

క. అనవుడు విదురుఁడు మైత్రే, యునిఁ గనుఁగొని పలికె మునిజనోత్తమ జగతిన్
జననస్థితిలయకారకు, లన వెలసినపద్మగర్భహరిహరు లెలమిన్. 9

క. ఏమినిమిత్తం బత్రిమ, హామునిమందిరమునందు ననసూయకు ను
ద్దామగుణు లుదయమైర న, నామైత్రేయుండు పలికె నవ్విదురునితోన్. 10

సీ. సుచరిత్ర విను విధిచోదితుం డై యత్రి, దప మాచరింపఁ గాంతాసమేతుఁ
డయి ఋక్షనామకులాద్రితటంబున, ఘుమఘుమారావసంకులవిలోల
కల్లోలజాలసంకలితనిర్వింధ్యాన, దీజలపరిపుష్టరాజితప్ర

1. 'నభినందించిరి... సమరగణంబుల్' వ్రా. ప్ర.

సూనగుచ్ఛస్వచ్ఛమానితాశోకప,లాశకాంతారస్థలమున కెలమి
తే. నరిగి యచ్చటనిర్ద్వంద్వుఁడగుచుఁ బ్రాణ,నియమమున నేకపదమున నిలిచిగాలిఁ
దివుటఁ గ్రోలి కృశీభూతదేహుఁడగుచుఁ, దపము గావించె దివ్యవత్సరశతంబు.
వ. ఇట్లతిఘోరంబైన తపంబు సేయుచుఁ దనచిత్తంబున. 12
క. ఏవిభుఁడు జగదధీశ్వరుఁ, డావిభుశరణంబు సొత్తు నతఁ డాత్మసమం
బై వెలసినసంతతిని ద,యావరమతి నిచ్చుఁ గాక యని తలఁచు నెడన్. 13
చ. మునుకొని యత్త్రిపోధనునిమూర్ధజమైనతపఃకృశానుచే
తను త్రిజగంబులుం గరఁగి తప్తములైనను జూచి పంకజా
సనమురశాసనత్రిపురశాసను లచ్చటి కేఁగి రప్సరో
జనసురసిద్ధసాధ్యమునిసన్నుతభూరియశోభిరాములై. 14
వ. అట్లు మునీంద్రునాశ్రమంబు డాయం జనునవసరంబున. 15
చ. అనఘతపోభిరాముఁ డగునత్త్రిమునీంద్రుఁడు గాంచెఁ దప్తకాం
చనఘనచంద్రికారుచిరచారుశరీరుల హంసనాగసూ
దనవృషభేంద్రవాహుల నుదారకమండలుచక్రశూలసా
ధనుల విరించివిష్ణుపురదాహుల వాక్కమలాంబికేశులన్. 16
వ. మఱియుఁ గృపావలోకనమందహాససుందరవదనారవిందంబులు గలమహాత్ముల సందర్శించి యమందానందకందలితహృదయారవిందుండై సాష్టాంగదండప్రణామంబు లాచరించి పుష్పాంజలి గావించి నిటలతటఘటితకరపుటుండై దుర్నిరీక్షంబైన తత్తేజోవిశేషంబు దేఱి చూడం జాలక ముకుళితనేత్రుండై తత్పరాయత్తచిత్తుండగుచు సర్వలోకగరిష్ఠంబులైనమృదుమధురగంభీరభాషణంబుల నిట్లని స్తుతియించె. 17
సీ. ప్రతికల్పమందు సర్వప్రపంచోద్భవ,స్థితివినాశంబులఁ జేయునట్టి
మహితమాయాగుణమయదేహములఁ బొల్చు, నజవాసుదేవశివాభిధాన
ములు గల్గుమీపాదజలజాతములకు నే, నతిభక్తి వందనం బాచరింతు
నఖిలచేతనమానసాగమ్య మన నొప్పు, మూర్తులు గల్గుమీముగ్వురందుఁ
తే. బరఁగ నాచేతఁ బిలువంగఁబడినధీరుఁ, డెవ్వఁడే నొక్కరునిఁ బిల్వనిపుడుమీరు
ముగ్వు రేతెంచుటకు నాదుబుద్ధి విస్మ,యంబు గదిరెడిఁ జెప్పరే యనఘులార.
వ. అదియునుం గాక సంతానార్థంబు నానావిధపూజలు గావించి నాచిత్తంబున ధరియించినమహాత్ముం డొక్కరుండ యనిన నమ్ముగ్వురు విబుధశ్రేష్ఠులు నతనిం గనుంగొని సుధామధురంబు లయినవాక్యంబుల నిట్లనిరి. 19
క. విను మేము ముగుర మయ్యును, ననుపమమతిఁ దలఁప నేకమై యుందుము నీ
మనమందు నేమి గోరితి, వనయము నాకోర్కి సఫల మయ్యెడుఁ జుమ్మీ. 20
క. మాముగ్వురయంశంబుల, ధీమంతులు సుతులు పుట్టి త్రిజగము లెల్లన్

నీమంగళగుణకీర్తిన్, శ్రీమహితము సేయఁ గలరు సిద్ధము సుమ్మా. 21

క. అని మునిచంద్రుఁడు దనమన, మునఁ గామించినవరంబు బుధవరులు ముదం
బున నొసఁగి యతనిచేఁ బూ, జనములఁ బరితృప్తు లగుచుఁ జనిరి యథేచ్ఛన్.

ఉ. ఆసుచరిత్రదంపతు లుదంచితలీలఁ గనుంగొనంగ న
బ్జాసనునంశమందు నమృతాంశుఁడు [1]విష్ణుకళన్ సుయోగవి
ద్యాసుభగుండు దత్తుఁడుఁ బురాంతకుభూరికళాంశమందు దు
ర్వాసుఁడు నై జనించి రనవద్యపవిత్రచరిత్రు లిమ్ములన్. 23

క. అంగిరసుఁ డనెడుమునికిఁ గు, లాంగన యగుశ్రద్ధయందు సంచితసౌంద
ర్యాంగులు గూఁతులు నలువురు, మంగళవతు లుదయ మైరి మాన్యచరిత్రా.

క. వారు సినీవాలి యనఁ గు, హూరాకానుమతు లనఁగ నొప్పిరి మఱియుం
గోర సుతయుగము గలిగెను, స్వారోచిషమనువువేళ శస్తఖ్యాతిన్. 25

వ. వార లెవ్వ రనిన భగవంతుం డగునుచథ్యుండును బ్రహ్మనిష్ఠుం డగుబృహస్పతియు ననం బ్రసిద్ధి వహించిరి పులస్త్యుండు హవిర్భుక్కను నిజభార్యయందు నగస్త్యునిం బుట్టించె నాయగస్త్యుండు జన్మాంతరంబున జఠరాగ్నిరూపంబై ప్రవర్తించె వెండియు నాపులస్త్యుండు విశ్రవసునిం గలిగించె నావిశ్రవసునకు నిలబిల యనుభార్యవలనం గుబేరుండును గైకసి యనుదానివలన రావణకుంభకర్ణవిభీషణులునుం బుట్టిరి పులహునకు గతి యనుభార్యవలనఁ గర్మశ్రేష్ఠుండును వరీయాంసుండును సహిష్ణుండును ననుమువ్వురు కొడుకులు జనియించిరి మఱియుఁ గ్రతువునకుఁ గ్రియ యనుభార్యయందు (బ్రహ్మతేజంబున జ్వలించుచున్న) షష్టిసహస్రసంఖ్యలు గలవాలఖిల్యు లనుమహర్షులు గలిగిరి వసిష్ఠుం డూర్జ యనుభార్యయందుఁ జిత్రకేతుండును సురోచియు విరజుండును మిత్రుండును నుల్బణుండును వసుభృద్యానుండును ద్యుమంతుండును ననుసప్తఋషులను భార్యాంతరంబున శక్తిప్రముఖపుత్రులనుం బుట్టించె నథర్వుం డనువానికిఁ జిత్తి యనుభార్యయందు ధృతవ్రతుండు నశ్వశిరస్కుండు నయినదధ్యంచుండు పుట్టె మహాత్ముం డగుభృగువు ఖ్యాతి యనుపత్నియందు ధాతయు విధాతయు నను పుత్రద్వయంబును భగవత్పరాయణ యగు శ్రీ యనుకన్యకం బుట్టించె నాధాతృవిధాతృలు మేరు వనువానికూఁతు లయినయాయతినియతు లనుభార్యలవలన మృకండప్రాణు లనుకొడుకులం బుట్టించి రందు మృకండునకు మార్కండేయుండును బ్రాణునకు వేదశిరుం డనుమునియుం బుట్టిరి భృగువునకు నుశన యనుకన్యయందుఁ గవి యనువాఁడు పుట్టె నిట్లు కర్దమదుహిత లయినకన్యకానవకంబువలనం గలిగినసంతానపరంపరలచేత సమస్తలోకంబులుఁ బరిపూర్ణంబు లయ్యె నట్టిసద్యఃపాపహరంబును శ్రేష్ఠతమంబును నైనకర్దమదౌహిత్రసంతాన

1. 'విష్ణుకళందుయోగ' వ్రా. ప్ర.

ప్రకారంబు శ్రద్ధాగరిష్ఠచిత్తుండ వగునీకుం జెప్పితి నింక దక్షప్రజాపతివంశం బెఱింగింతు వినుము. 26

దక్షప్రజాపతిసంతతిని దెలియఁజేయుట.

క. వనజజునివలన భవ మం, దినయాదక్షప్రజాపతికి మనునిజనం
దన యగుప్రసూతివలనను, ననఘా పదియాఱ్వు రుదయ మందిరి కన్యల్. 27

వ. ఇట్లుదయించినయక్కన్యకాషోడశంబునందు శ్రద్ధయు మైత్రియు దయయు శాంతియుఁ దుష్టియుఁ బుష్టియుఁ బ్రియయు నున్నతియు బుద్ధియు మేధయుఁ దితిక్షయు హ్రీయు మూర్తియు ననునామంబులు గలపదుమువ్వురను ధర్మరాజున కిచ్చె నొక్కకన్యక నగ్నిదేవునకును నొక్కతెం బితృదేవతలకును నొక్కతె (జన్మమరణాదినివర్తకుం డగు) నభవునకుం బెండ్లి సేసె నంత నాధర్మునిపత్నులయందు శ్రద్ధవలన శ్రుతంబును మైత్రివలనఁ బ్రసాదంబును దయవలన నభయంబును శాంతివలన సుఖంబును దుష్టివలన ముదంబును బుష్టివలన స్మయంబును గ్రియవలన యోగంబును నున్నతివలన దర్పంబును బుద్ధివలన నర్థంబును మేధవలన స్మృతియుఁ దితిక్షవలన క్షేమంబును హ్రీవలనఁ బ్రశ్రయంబును మూర్తివలన సకలకల్యాణగుణోత్పత్తిస్థానభూతు లగునరనారాయణు లనుఋషు లిద్దఱును సంభవించిరి వారలజన్మకాలంబున. 28

సీ. గంధవాహుఁడు మందగతి ననుకూలుఁడై, వీచె నల్దిక్కులు విశద మయ్యె
నఖిలలోకంబులు నానందమును బొందెఁ, దుములమై దేవదుందుభులు మొరసెఁ
గర మొప్పు జలధులు గలఁక లడంగెను, మించినగతిఁ బ్రవహించె నదులు
గంధర్వకిన్నరగానముల్ వీతెంచె, నప్సరోజనములాస్యములు సెలఁగె

తే. సురలు గురియించి రందంద విరులవాన, మునిజనంబులు సంతోషమునఁ జెలంగి
వినుతు లొనరించి రవ్వేళ విశ్వమెల్లఁ, బరమమంగళ మై యొప్పె భవ్యచరిత.

వ. ఆసమయంబున బ్రహ్మాదిదేవతలు మహాత్ములకడకుఁ జనుదెంచి యిట్లని స్తుతియించిరి.

సీ. గగనమందులఁ దోఁచుగంధర్వనగరాది, రూపభేదములట్లు రూఢి మెఱసి
యేయాత్మయం దేని నేపారుమాయచే, నీవిశ్వ మిట్లు రచింపఁబడియె
నట్టియాత్మప్రకాశార్థమై మునిరూప, మున ధర్మగృహమునఁ బుట్టినట్టి
పరమపురుష నీకుఁ బ్రణమిల్లెద మదియుఁ, గాక యీసృష్టి దుష్కర్మవృత్తి

తే. జరగనీకుండుకొఱకు నై సత్త్వగుణము, చే సృజించినమ యిట్లు శ్రీనివాస
మైనసరసీరుహప్రభ నపహసించు, నీకృపాలోకనంబుల నెమ్మిఁ జూడు. 31

క. అని యిట్లు దేవగణములు, వినుతింపఁ గృపాకటాక్షవీక్షణములచేఁ
గని వారు గంధమాదన, మున కేఁగిరి తండ్రిముదము ముప్పిరిగొనఁగన్. 32

క. ధరణీభర ముడుపుట కా, నరనారాయణులు భువి జనన మనయము నొం
దిరి యర్జునకృష్ణాఖ్యలఁ, గురుయదువంశముల సత్త్వగుణయుతు లగుచున్. 33

వ. మఱియు నగ్నిదేవునకు దక్షపుత్త్రి యైన స్వాహాదేవి యను భార్యయందు హుతభోజను లగు పావకుండును బవమానుండును శుచియు నను మువ్వురు గొడుకులు గలిగిరి వారివలనం బంచచత్వారింశత్సంఖ్యలం గల యగ్ను లుత్పన్నంబు లయ్యె నిట్లు పితృపితామహయుక్తంబుగా నేకోనపంచాశత్సంఖ్యలు గల యగ్నులు బ్రహ్మవాదులచే యజ్ఞకర్మంబులం దగ్నిదేవతాకంబు లైన యిష్టులు దత్తన్నామంబులచేతఁ జేయంబడు చుండు (నాయగ్ను లెవ్వ రనిన నగ్నిష్వాత్తులు బర్హిషదులు సౌమ్యులు పితలు నాజ్యపులు సాగ్నులు నిరగ్నులు నన నేను దెఱంగు లై యుందురు దాక్షాయణి యగు స్వధ యను ధర్మపత్నియందు వారలవలన వయునయు ధారిణియు నను నిద్దఱు కన్య లుదయించి జ్ఞానవిజ్ఞానపారగ లగుచు బ్రహ్మనిష్ఠ లయి పర(గిరి) వెండియు. 34

ఈశ్వరునకును దక్షప్రజాపతికిని విరోధము సంభవించుట.

సీ. దక్షప్రజాపతి తనయ యా భవుని భార్య యనఁగా దగు సతి యనులతాంగి
సతతంబుఁ బతిభక్తి సలుపు చుండియుఁ దనూజాతలాభము నందఁ జాల దయ్యె
భర్గుని దెసఁ జాలఁ బ్రతికూలుఁ డై నట్టి తమ తండ్రి మీఁది రోషమునఁ జేసి
వల నేది తా ముగ్ధ వలె నిజయోగమార్గంబున నాత్మదేహంబు విడిచె
తే. నని మునీంద్రుండు వినిపింప నమ్మహాత్ముఁ డైన విదురుండు మనమున నద్భుతంబు
గదురఁ దత్త్వవిద వేడ్క గడలుకొనఁగ మునివరేణ్యునిఁ జూచి యిట్లని యె మఱియు.
సీ. చతురాత్మ దుహితృవత్సలుఁ డైన దక్షుండు దనకూఁతు సతి ననాదరము సేసి
యనయంబు నఖిలచరాచరగురుఁడు నిర్వైరుండు శాంతవిగ్రహుఁడు ఘనుఁడు
జగముల కెల్లను జర్చింప దేవుండు సంచితాత్మారాముఁ డలఘుమూర్తి
[1]శీలవంతులలోన శ్రేష్ఠుండు నగునట్టి భవునందు విద్వేషపడుట కేమి
తే. కారణము సతి దా నేమి కారణమున విడువరానట్టి ప్రాణముల్ విడిచె మఱియు
శ్వశురజామాతృవిద్వేషసరణి నాకుఁ దెలియ నానతియ్యుము సుధీవిధేయ. 36
క. అని యడిగిన నవ్విదురునిఁ గనుఁగొని మైత్రేయుఁ డనియెఁ గౌతుక మొప్పన్
విను మనఘ తొల్లి బ్రహ్మలు జననుతముగఁ జేయునట్టి సత్త్రముఁ జూడన్. 37
చ. సరసిజగర్భయోగిజనశర్వసుపర్వమునీంద్రహవ్యభు
క్పరమఋషిప్రజాపతులు భక్తిమెయిం జనుదెంచి యుండ [2]న
త్తరణిసమానతేజుఁ డగు దక్షుఁడు వచ్చినఁ దత్సదస్యులుం
దర మిడి లేచి రప్పుడు పితామహభర్గులు దక్క నందఱున్. 38
క. చనుదెంచిన యాదక్షుఁడు వనజజునకు మ్రొక్కి భక్తివశు లై సభ్యుల్
దన కిచ్చినపూజలు గైకొని యర్హాసనమునందుఁ గూర్చుండి తగన్. 39
తే. తన్నుఁ బొడగని సభ్యు లందఱును లేవ నాసనము దిగనట్టి పురారివలను

1. శీలవ్రతులలోన. 2 'నత్తఱిఁ దరుణార్కతేజుఁ' వ్రా. ప్ర.

గన్నుఁగొనలను విస్ఫులింగములు సెదరఁ, జూచి యిట్లను రోషవిస్ఫురణ మెఱయ.

తే. (వినుఁడు మీరలు రోదమాని విబుధముని హుతాశనాదిసురోత్తములార మోహ మత్సరోక్తులు గావు నామాట లనుచు, వారి కందఱ కాపురవైరిఁ జూపి.) 41

సీ. పరికింప నితఁడు దిక్పాల[1]యశోహాని, కరుఁ డసత్క్రియాశూన్యపరుని చేతఁ గర మొప్ప సజ్జనాచరితమార్గము దూషి,తం బయ్యె నెన్న గతత్రపుండు మహితసావిత్రీసమానను సాధ్వి న, స్మత్తనూజను మృగశాబనేత్ర ననలభూసురబంధుజనసమక్షమున మ,ర్కటలోచనుఁడు కరగ్రహణ మరిఁ

తే. జేసి తా శిష్యభావంబుఁ జెందుటొత్తఁ, దలఁచి ప్రత్యుద్గతాభివందనము లెలమి నడప కుండిన మానసీ నన్నుఁ గన్న, నోరిమాటకుఁ దన కేమి గోరవోయె. 42

సీ. *అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మాన, హీనుఁడు మర్యాదలేనివాఁడు మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగం,బరుఁడు భూతప్రేతపరివృతుండు దామసప్రమథభూతములకు నాథుఁడు, భూతిలిప్తుండు దస్థిభూషణుండు నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్ట, హృదయుఁ డుగ్రుఁడును బరేతభూని

తే. కేతనుఁడు వితతస్రస్తకేశుఁ డశుచి, యయినతన కొక్కశివనామమను ప్రవాద గలిగెఁ గాని యశివుఁ డనిరాన కెఱిఁగి, యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినట్టులు.

వ. ఇతనికి నస్మత్తనూజను విధివత్ప్రకారంబున నిచ్చితి. 44

క. అని యిట్టులు ప్రతికూలవ, చనములు దక్షుండు వలికి శపియింతును శ ర్వాని నని జలములు గొని కర,మున నిలిచి యిటు లనె రోషమున ననఘాత్మా.

క. ఇతఁ డింద్రోపేంద్రపరీ,వృతుఁడై మఖసమయమున హవిర్భాగము దే వతలం గూడఁగ మహితని,యతిఁ బొందక యుండుఁ గాక యని శపియించెన్.

వ. ఇట్లు దక్షుండు వల్కినగర్హితవాక్యంబులు వినిందితంబు లగుం గాని యాథార్థ్యంబున వాస్తవంబు లగుచు భగవంతుం డగు రుద్రునందు ననిందితంబులై స్తుతిరూపంబుల నొప్పెఁ దదనంతరంబ రుద్రునకు శాపం బిచ్చినకారణంబున దక్షుండు సదస్యముఖ్యులచే నకృత్యం బని నిషేధింపంబడి ప్రవృద్ధం బయినక్రోధంబుతోడ నిజనివాసంబునకుం జనియె నంత గిరిశానుచరాగ్రసరుం డగు నందికేశ్వరుండు దక్షుండు నిటలాక్షుని శపియించినశాపంబు నతనిపల్కినయనర్హవాక్యంబులును విని కోపారుణితలోచనుం డై యిట్లను నీదక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబుగాఁ దలఁచి యప్రతిద్రోహి యైనభగవంతునందు భేదదర్శి యై యపరాధంబుఁ గావించె నిట్టిమూఢాత్ముండు దత్త్వవిముఖుం డగు మఱియుం గూట

1 కవరయశో, హానికరుఁడు క్రియాహీనుచేత. *42 వ 43వ పద్యములకు నడుమ 'ఇట్లను చున్న సమయంబున, క. శివు దక్షుఁడు నిందించుతఱి, నవరుఁడు శిర మూఁచె రుచి భృగుఁడు కనుఁగీటెం. గకవక నగియెను బూషుఁడు, దివిజులు ఋత్విజులు ననుమతిన్ వినుచుండన్. వ. అంత దక్షుండు మఱియును,' అని యధికపాఠ మొకప్రతిని గానిపించుచున్నది.

ధర్మంబు(లయిననివాసంబు)లగ్రామ్యసుఖకాంక్షలంజేసి సక్తుండై యర్థవాదంబు
లయినవేదంబులచేత నష్టమనీషం గలిగి కర్మతంత్రంబు విస్తృతంబు సేయు
వెండియు దేహాదికంబు లుపాదేయంబులుగాఁ దలఁచుచు బుద్ధిచేత నాత్మత
త్త్వంబు మఱచి వర్తించుచుఁ బశుప్రాయుండై స్త్రీకాముండు నగు నిదియునుం
గాక దక్షుం డచిరకాలంబున మేషముఖుం డగు నని మఱియు. 47

మ. అనయంబుం దనమానసంబున నవిద్యన్ ముఖ్యతత్త్వంబు గాఁ
గని గౌరీశుఁ దిరస్కరించినయసత్కర్మాత్ము నీదక్షుని
న్ననువర్తించినవాఁడు సంసరణకర్మారంభుఁ డై నిచ్చలున్
జననం బందుచుఁ జచ్చుచున్ మరల నోజం బుట్టుచున్ వర్తిలున్. 48

వ. అదియునుం గాక యాహారద్వేషు లైనద్విజు లర్థవాదబహుళంబు లైనవేద
వాక్యంబులవలన మధుగంధసమం బైనచిత్తక్షోభంబుచేత విమోహితమనస్కు
లయి కర్మాసక్తు లగుదురు మఱియును భక్ష్యాభక్ష్యవిచారశూన్యు లై దేహాది
పోషణంబుకొఱకు ధరియింపఁబడినవిద్యాతపోవ్రతంబులు గలవార లై ధన
దేహేంద్రియంబులయందుఁ బ్రీతిం బొంది యాచకు లై విహరింతు రని నంది
కేశ్వరుండు బ్రాహ్మణజనంబుల శపియించినవచనంబులు విని భృగుమహాముని
మరల శపియింపం బూని యి ట్లనియె. 49

తే. వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు వారు, వారికనుకూలు రగుదు రెవ్వారువారు
నట్టిసచ్ఛాస్త్రపరిపంథు లైనవారు, నవనిఁ బాషండు లయ్యెద రని శపించె. 50

సీ. సకలవర్ణాశ్రమాచారహేతువు లోక, మునకు మంగళమార్గమును సనాత
నముఁ బూర్వఋషిసమ్మతము జనార్దనమూల, మును నిత్యమును శుద్ధమును బరంబు
[1]నార్యపథానుగం బగు వేదమును విప్ర, గణము నిందించినకారణమున
నేశివదీక్షయం దేని మధ్యముపూజ్యుఁ, డై భూతపతి దైవ మగుచు నుండు

తే. నందు మీరలు భస్మజటాస్థిధార, ణములఁ దగి మూఢబుద్ధులు నష్టశౌచు
లై నశింతురు పాషండు లగుచు ననుచు, శాప మొనరించె నాద్విజసత్తముండు.

వ. ఇట్లన్యోన్యంబును శాపంబులం బొందియు భగవదనుగ్రహంబు గలవార లగుటం
జేసి నాశంబు నొంద రై రట్టియెడ విమనస్కుం డగుచు ననుచరసమేతుం డై
భవుండు సనియె నంత. 52

సీ. అనఘాత్మ యేయజ్ఞమందు సర్వశ్రేష్ఠుఁ, డగుహరి సంపూజ్యుఁ డై వెలుంగు
నట్టియజ్ఞంబు సమ్యగ్విధానమున స, హస్రవత్సరములు నజుఁ డొనర్చెఁ
గర మొప్ప నమరగంగాయమునాసంగ, మావనిఁ గలుగు ప్రయాగయందు
నవభృథస్నానంబు లతిభక్తిఁ గావించి, గతకల్మషాత్ము లై ఘనత కెక్కి

తే. [2]తగ నిజాశ్రమభూములఁ దలఁచి వార, లందఱును వేడ్కతోఁ జనిరనుచువిదురు

1. నార్యపథంబును నగు. 2. తమతమాశ్రమ.

నకును మైత్రేయుఁ డను మునినాయకుండు, నెఱుఁగ వినిపించి వెండియు నిట్టులనియె.

—దక్షప్రజాపతియజ్ఞమునకు దాక్షాయణి వోఁ గోరుట.—

వ. అంత శ్వశురుండగు దక్షునకు జామాత యైన భర్గునకు నన్యోన్యవిరోధంబు పెరుఁగుచుండ నతిచిరం బగు కాలం బరిగె నంత దక్షుండు రుద్రవిహీనంబగు యాగంబు లేనిది యైనను శర్వుతోడి పూర్వవిరోధంబునను బరమేష్ఠికృతం బైన సకలప్రజాపతివిభుత్వగర్వంబుననుం జేసి బ్రహ్మనిష్ఠు లగు నీశ్వరాదుల ధిక్కరించి యరుద్రకంబుగా వాజపేయసవనంబు గావించి తదనంతరంబ బృహస్పతిసవననామకం బైన మఖంబు సేయ నుపక్రమించిన నచ్చటికిం గ్రమంబున. 54

చ. కరమనురక్తి నమ్మఖము గన్గొను వేడుక దొంగలింపఁగాఁ
బరమముని ప్రజాపతి సురపర్వమహర్షి వరుల్ సభార్యులై
పరువడి వచ్చి యందఱు శుభస్థితి దీవన లిచ్చి దక్షుచేఁ
బోరిఁ బొరి నచ్చటన్ విహితపూజల నొందిరి[1] సమ్మదంబునన్. 55

తే. దక్షతనయ సతీదేవి దవిలి యాత్మ, సదనమున నుండి జనకుని సవనమహిమ
గగనచరులు నుతింప నాకలకలంబు, విని కుతూహలిని యయి వియద్వీథిఁ జూడ.

వ. అయ్యవసరంబునఁ దదుత్సవదర్శనకుతూహలులై సర్వదిక్కులవారును జనుచుండి రాసమయంబున. 57

సీ. తనరారు నవరత్నతాటంకరోచులు, చెక్కుటద్దములతోఁ జెలిమి సేయ
మహనీయతపనీయమయపదకద్యుతు, లంసభాగంబుల నావరింప
నంచితచీనిచీనాంబరప్రభలతో, మేఖలాకాంతులు మేలమాడఁ
జంచలాచంచలచారువిలోచన, ప్రభలు దిక్కులఁ బ్రబ్బికొనఁగ

తే. మించు వేడుక భర్తృసమేత లగుచు, మానితము లైన దివ్యవిమానయాన
లగుచు నాకాశపథమున నరుగుచున్న, ఖచరగంధర్వకిన్నరాంగనలఁ జూచి. 58

క. సతి దనపతి యగు నాపశు, పతిఁ జూచి సముత్సుకతను భాషించి ప్రజా
పతి మామామ మఖము సు, వ్రతమతి నొనరించుచున్నవాఁ డట వింటే. 59

క. కావున నయ్యజ్ఞమునకు, నీ విబుధగణంబు లర్థి నేఁగెద రదె వో
దేవ మన మిప్పు డచటికిఁ, బోవలె నను వేడ్క నాకుఁ బుట్టెడు భవా. 60

క. ఆయజ్ఞముఁ గనుఁగొనఁగా, నాయనుజలు భక్తిఁ బ్రాణనాథులతోడం
బాయక వత్తురు మనముం, బోయిన నే వారి నచటఁ బొడగనఁ గల్గున్. 61

క. జనకునిమఖమునకర్థిం, జని నీతోఁ బారిబర్వా సంజ్ఞకతఁ గడుం
దనరిన భూషణములఁ గైకొన వేడ్క జనించె నీశ కుజనవినాశా. 62

క. నాతోడను స్నేహము గల, మాతను దత్సోదరీసమాజము బుషిసం
ఘాతకృతమఖసమంచిత, కేతువుఁ గన వేడ్క గగనకేశ జనించెన్. 63

1 వసించి రిమ్ములన్.

వ. అదియునుం గాక దేవా మహాశ్చర్యకరం బై గుణత్రయాత్మకం బగుప్రపంచంబు భవదీయమాయావినిర్మితం బగుటం జేసి నీకు నాశ్చర్యకరంబు గా దయినను భవదీయతత్త్వం బెఱుంగంజాలక కామినీస్వభావంబు గలిగి కృపణురాల నై మదీయజన్మభూమిఁ గనుంగొన నిచ్ఛగించితి నని వెండియు నిట్లనియె. 64

చ. ముదమునఁ దన్మఖోద్భవవిభూతిఁ గనుంగొన నన్యకామినుల్
పసువులు గట్టి భూషణవిభాసిత లై నిజనాథయుక్త లై
మదకలహంసపాండురసమంచితదివ్యవిమానయాన లై
యదె చను చున్నవారు గను మభ్రపథంబున నీలకంధరా. 65

క. అనఘా విను లోకంబుల, జనకునిగేహమునఁ గలుగుసకలసుఖంబుల్
తనయలు సని సంప్రీతిం, గనుఁగొన కేరీతి నిలుచుఁ గాయము లభవా. 66

క. అనయముఁ బిలువక యుండం, జన ననుచిత మంటి వేని జనకగురుసుహృ
జ్జననాయకగేహములకుఁ, జను చుందురు పిలువ కున్న సజ్జను లనఘా. 67

వ. అని మఱియు నిట్లనియె దేవా నాయందుఁ బ్రసన్నుండ వై మదీయమనోరథంబు దీర్ప నర్హుండవు సమధికజ్ఞానంబు గలనీచేత నేను భవదీయదేహంబునం దర్ధంబున ధరియింపంబడితి నట్టినన్ను ననుగ్రహింప వలయు నని ప్రార్థించిన మందస్మితవదనారవిందుం డగుచు [1]జగత్స్రష్టలసమక్షంబున దక్షుండు త న్నాడిన మర్మభేదంబు లైనకుహకవాక్యసాయకంబులం దలంచుచు నిట్లనియె. 68

సీ. కల్యాణి నీమాట గడు నొప్పు బంధువుల్, పిలువ కుండినను సంప్రీతిఁ జనుదు
[2]రంటి విదియు లెస్స యైనను దేహాభి,మానమదమున నమర్షమునను
గడఁగి యారోపితఘనకోపదృష్టులు, గాకేనిఁ బోఁ దగుఁ గాని వినుము
వినుతవిద్యాతపోవిత్తవయోరూప,కులములు సుజనులకును గుణంబు

తే. లివియ కుజనులయెడ దోషహేతుకంబు,లై వివేకంబు సెఱుచు మహాత్ము లైన
వారిమాహాత్మ్యమాత్మగర్వమునఁ జేసి, జడులు పొడగానఁజాలరు జలజనేత్ర.

క. విను మట్టికుటిలు లగుదు,ర్జనులగృహంబులకు బంధుసరణిని బోవం
జనదు వినీతుల కది గడు, ననుచిత మైనట్ల యుండు నది యె ట్లనినన్. 70

ఆ. కుటిలబుద్ధు లయినకుజనులయిండ్లకు, నార్యు లేఁగ వా రనాదరమున
బొమలు ముడివడంగ భూరిరోషాత్ము లై, చూతు రదియుఁగాక సుదతి వినుము.

చ. సమదరిపుప్రయుక్తపటుసాయకజర్జరితాంగుఁ డయ్యు దుః
ఖము[3]ను బొఱంగి నిద్రఁ గనుఁ గాని కృశింపఁడు మానవుండు నో
యుమ విను మిష్టబాంధవదురుక్తులు మర్మము లంట నాటఁ జి
త్తమున నహర్నిశంబుఁ బరితాపము నొంది కృశించు నెప్పుడున్. 72

క. విను లోకోత్కృష్టుఁడు ద, క్షునికిఁ దనూభవలలోనఁ గూరిమిసుత వై

1 బ్రహ్మలసమక్ష. 2 నంటి. 3 నఁ గడంగి.

నను నాసంబంధంబున, జనకునిచేఁ బూజ వడయఁ డె జాలవు తరుణీ. 73

వ. అది యెట్లతనిచేత భవత్సంబంధవశంబునం జేసి పూజఁ బడయ లేమికి నతనికి నీకు విరోధంబునకు హేతు వెట్టి దని యంటి వేని. 74

మ. నిరహంకారనిరస్తపాపసుజనానీకిందోల్లసత్కీర్తిఁ గొం
డఱు కామించి యశక్తులై మనములన్ దందహ్యమానేంద్రియా
తురులై యూరక మచ్చరింతురు మహాత్మున్ డీశ్వరుం డైనయా
హరితో బద్ధవిరోధమున్ దొడరుదైత్యశ్రేణిచందంబునన్. 75

వ. అదియునుం గాక నీ వతనికిం బ్రత్యుత్థానాభివందనంబులు గావింప కుండుటం జేసి తిరస్కృతుండ నైతి వంటి వేని లోకంబున జను లన్యోన్యంబును బ్రత్యుత్థానాభివందనంబులు గావింతు రదియ ప్రాజ్ఞు లయినవారు సర్వభూతాంతర్యామి యైనపరమపురుషుండు నిత్యపరిపూర్ణుండు గావునఁ గాయికవ్యాపారం బయుక్తం బని తదుద్దేశంబుగా మనంబునంద నమస్కారాదికంబులు గావింతురుగాని దేహాభిమానంబులు గలుగుపురుషులందుఁ గావింపరు గాన యేనును వాసుదేవశబ్దవాచ్యుండు శుద్ధసత్త్వమయుండు నంతఃకరణంబునందు నావరణవిరహితుండు నై ప్రకాశించువాసుదేవునకు నెల్లప్పుడు నమస్కరించు చుండుదు నిట్లనపరాధి నై నన్నుఁ బూర్వంబున బ్రహ్మలు సేయుసత్త్రంబునందు దురుక్తులం జేసి పరాభవించి మద్ద్వేషి యైనదక్షుండు భవజ్జనకుం డైన నతఁడును దదనువర్తు లయినవారలును జూడఁ దగరు గావున మద్వచనాతిక్రమంబునం జేసి యరిగితి వేని నచట నీకుఁ బరాభవంబు సంప్రాప్తం బగు లోకంబున బంధుజనంబులవలనఁ బూజ వడయక తిరస్కారంబు వొందుట చచ్చుటయ కాదే యని పలికి మఱియు నభవుండు పొమ్మని యనుజ్ఞ యిచ్చిన నచ్చట నవమానంబునం జేసి యశుభం బగు ననియు నిచ్చటఁ బొమ్మనక నివారించిన మనోవేదన యగు ననియు మనంబున దలపోయుచు నూరకుండె నంత. 76

సీ. సతి సుహృద్దర్శనేచ్ఛాప్రతికూలదుః,ఖస్వాంత యగుచు నంగములు వడఁక
నందంద తొరఁగెడునశ్రుపూరంబులు, గండభాగంబులఁ గడలుకొనఁగ
నున్నతస్తనమండలోపరిహారముల్, వేఁడినిట్టూర్పుల వెచ్చఁ గంద
నతిశోకరోషాకులాత్యంతదోధూయ,మాన మై హృదయంబు మలఁగుచుండ

తే. మఱియుఁగుపితాక్షి యై స్వసమానరహితు, నాత్మదేహంబుసగమిచ్చినట్టిభవుని
విడిచిమూఢాత్మ యగుచు నవ్వేలఁది సనియె, జనకుఁ జూచెడువేడుకనందడింప. 77

వ. ఇట్లతిశీఘ్రగమనంబున. 78

సీ. మానిని చను చుండ మణిమన్మదాదిస,హస్రసంఖ్యాతరుద్రానుచరులు
యక్షులు నిర్భయు లై వృషభేంద్రుని, ముస్నిడికొనుచు నమ్ముదిత దాల్చు
కందుకాంబుజశారికాతాళవృంతద,ర్పణధవళాతపత్రప్రసూన

మాలికాసౌవర్ణమణివిభూషణఘన, సారకస్తూరికాచందనాది
తే. వస్తువులు గొంచు నేఁగి శర్వాణి గదిసి, శంఖదుందుభివేణునిస్స్వనము లొప్ప
మానితం బైనవృషభేంద్రయానఁ జేసి, యజ్ఞభూమార్గులై యర్థి నరిగి యరిగి.
వ. ముందట. 80
చ. మనమున మోద మందుచు నుమారమణీమణి గాంచెఁ జారుమ
త్కనకకుశాజినాయసనికాయవినిర్మితపాత్రసీమము
న్ననుపమవేదఘోషసుమహాత్పశుబంధనకర్మభూమము
న్మునివిబుధాభిరామము సముజ్జ్వలహోమము యజ్ఞధామమున్. 81
వ. ఇట్లు గనుంగొని యజ్ఞశాలం బ్రవేశించిన. 82
క. చనుదెంచినయమ్మగువను, జననియు సోదరులుఁ దక్క సభఁ గలజను లె
ల్లను దక్షువలనిభయమున, ననయము నపు డాదరింప రైరి మహాత్మా. 83
క. నెఱిఁ దల్లియుఁ బినతల్లులు, బరిరంభణ మాచరింపఁ బరితోషాశ్రుల్
దొరఁగఁగ డగ్గుత్తికతో, సరసిజముఖి సేమ మరయ సతియును నంతన్. 84
క. జనకుం డవమానించుట,యును సోదరు లర్థిఁ దనకు నుచితక్రియఁ జే
సినపూజల నందక శో,భన మరసిన మాఱుమాట వలుకక యుండెన్. 85
వ. ఇట్లు తండ్రిచే నాదరింపంబడని దై విభుం డైనయీశ్వరునందు నాహ్వానక్రియా శూన్యత్వరూపం బైనతిరస్కారంబును నరుద్రభాగం బైన యజ్ఞంబునుం గనుంగొని నిజరోషానలంబున లోకంబులు భస్మంబు సేయం బూనిన తెఱంగున నుద్రేకించి రుద్రవిద్వేషియుఁ గ్రతుకర్మాభ్యాసగర్విష్ఠుండు నగుదక్షుని వధియింతు మనుచు లేచిన భూతగణంబుల నివారించి రోషవ్యక్తభాషణంబుల నిట్లనియె లోకంబున శరీరధారు లైనజీవులకుఁ బ్రియాత్మకుం డైనయీశ్వరునకుఁ బ్రియాప్రియులును నధికులును లే రట్టిసకలకారణుండును నిర్మత్సరుండును నైనరుద్రునందు నీవు దక్క నెవ్వండు ప్రతికూలం బాచరించు నదియునుం గాక మిముబోఁటివారలు పరులవలనిగుణంబులందు దుర్గుణంబులన యాపాదింతురు మఱియుం గొందఱు మధ్యస్థు లైనవారలు పరులదుర్గుణంబులయందు దోషంబుల నాపాదింపరు గొందఱు సాధువర్తనంబు గలవారలు పరులదోషంబుల నైన గుణంబుల గా ననుగ్రహింతురు మఱియుం గొంద ఱుత్తమోత్తములు పరులయందు దోషంబుల నాపాదింపక తుచ్ఛగుణంబులు గలిగినను సద్గుణంబులుగాఁ గైకొందు రట్టిమహోత్తములయందు నీవు పాపబుద్ధి గల్పించితి వని వెండియు నిట్లను మహాత్ము లగువారలపాదధూళిచే నిరస్తప్రభావు లై జడస్వభావంబు గలదేహంబు నాత్మ యని పల్కుకుజను లగువారు మహోత్తముల నిందించుట కార్యంబు గా దదియు వారి కనుచితం బగు నని వెండియు నిట్లనియె. 86
సీ. అనయంబు శివ యనునక్షరద్వయ మర్థి, వాక్కునఁ బలుకు భావమునఁ దలఁప

సర్వజీవులపాపసంఘముల్ సెడు నట్టి, మహితాత్మునందు నమంగళుండ
వగునీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు, నందెద వినుము నీ వదియుఁ గాక
చర్చింప నెవ్వని చరణపద్మంబుల, నరసి బ్రహ్మానంద మనుమరంద
తే. మతులభక్తిని తమహృదయంబు లనెడి, తుమ్మెదలచేతఁ గ్రోలి సంతుష్టచిత్తు
లగుదు రత్యంతవిజ్ఞాను లట్టిదేవు, నందు ద్రోహంబు సేసి తే మందు నిన్ను.

క. మఱియును నమ్మహితాత్ముని, చరణసరోజాతయుగము సకలజగంబుల్
నెఱిఁ [1]గొలువఁ గోరుకోర్కులు, దర మిడి వర్షించు నతనిఁ దగునే తెగడన్.

చ. పరఁగఁ జితాస్థిభస్మనృకపాలజటాధరుఁడుం బరేతభూ
చరుఁడు పిశాచయుక్తుఁ డని శర్వ నమంగళుఁ గాఁ దలంప రె
వ్వారు నొకఁ డీవు దక్క మఱి వాక్పతిముఖ్యులు నమ్మహాత్ము న
చ్చరణసరోజరేణువులు సమ్మతిఁ దాల్తురు మస్తకంబులన్. 89

చ. నెలకొని ధర్మపాలనవినిర్మలు భర్తఁ దిరస్కరించున
క్కలుషునిజిహ్వఁ గోయఁ దగు గా కటు సేయఁగ నోపఁ డేనిఁ దాఁ
బొలియుట యొప్పు రెంటికిఁ బ్రభుత్వము సాలమిఁ గర్ణరంధ్రముల్
బలువుగ మూసికొంచుఁ జనఁ బాడి యటందురు ధర్మవర్తనుల్. 90

వ. అది గావున. 91

మ. జనుఁ డజ్ఞానమునన్ భుజించినజుగుప్సం బైనయన్నంబు స
య్యన వెళ్లించి పవిత్రుఁ డైనగతి దుష్టాత్ముండ వై యీశ్వరున్
ఘను నిందించిననీతనూభవ యనం గా నోర్వ నీహేయభా
జన మైనట్టిశరీరమున్ విడిచి భాస్వచ్ఛుద్ధి వాటిల్లెదన్. 92

వ. అదియునుం గాక దేవతల కాకాశగమనంబును మనుష్యులకు భూతలగమనంబును స్వాభావికంబు లయినట్లు ప్రవృత్తినివృత్తిలక్షణకర్మంబులు రాగవైరాగ్యాధికారంబులు గా వేదంబులు విధించుటం జేసి రాగయుక్తు లై కర్మతంత్రు లయినసంసారులకు వైరాగ్యయుక్తు లయి యాత్మారాము లయినయోగిజనులకు విధినిషేధరూపంబు లయినవైదికకర్మంబులు గలుగుటయు లేకుండుటయు నైజంబు లగుటం జేసి స్వధర్మనిష్ఠుం డగువాని నిందింపం జన దాయుభయకర్మశూన్యుండు బ్రహ్మభూతుండు నయినసదాశివునిఁ గ్రియాశూన్యుం డని నిందించుట పాపం బగుఁ దండ్రీ సంకల్పమాత్రప్రభవంబు లగుటం జేసి మహాయోగిజనసేవ్యంబు లయినయస్మదీయంబు లగునణిమాద్యష్టైశ్వర్యంబులు నీకు సంభవింపవు భవదీయంబు లగునైశ్వర్యంబులు ధూమమార్గప్రవృత్తు లై యాగాన్నభోక్త లైనవారిచేత యజ్ఞశాలయందె చాల నుతింపంబడి యుండుఁగాన నీమనం

---

1 గోరినకోరికలను.

బున నే నధికసంపన్నుండ ననియుఁ జితాభస్మాస్థిధారణుం డైనరుద్రుండు దరి
ద్రుం డనియును గర్వింపం జన దని వెండియు ని ట్లనియె. 93

ఉ. నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా
చాలుఁ గుమర్త్య నీదుతనుజాత ననన్ మది సిగ్గుపుట్టెడి
న్నేల ధరన్ మహాత్ములకు నెగ్గొనరించెడివారిజన్మముల్
గాలుపనే తలంప జనకా కుటిలాత్మక యెన్ని చూడఁగన్. 94

చ. వరవృషకేతనుండు భగవంతుఁడు నైనహరుండు నన్ను నా
దరపరిహాసవాక్యముల దక్షతనూభవ యంచుఁ బిల్వ నేఁ
బురపురఁ బొక్కుచున్ ముదముఁ బొందక నర్మవచఃస్మితంబులం
దొఱఁగుదు నీతనూజ ననుమఖముకంటెను జచ్చు టొప్పగున్. 95

వ. అని యిట్లు యజ్ఞసభామధ్యంబునం బ్రతికూలుం డగుదక్షు నుద్దేశించి పలికి
కామక్రోధాదిశత్రువిఘాతిని యగుసతీదేవి యుదఙ్ముఖి యయి జలంబుల నాచ
మనంబు సేసి శుచి యై మౌనంబు ధరియించి జితాసన యై భూమియం దాసీన
యగుచు యోగమార్గంబునం జేసి శరీరత్యాగంబు సేయం దలంచి. 96

సీ. వరుసఁ బ్రాణాపానవాయునిరోధంబు, గావించి వాని నేకముగ నాభి
తలమునఁ జేర్చి యంతట నుదానముదాఁక, [1]నెగయించి బుద్ధితో హృదయపద్మ
మున నిల్పి వాని మెల్లన కంఠమార్గము,నను మఱిభ్రూమధ్యమున వసింపఁ
జేసి శివాంఘ్రిరాజీవచింతనముచే, నాథునిఁ దక్క నన్యంబుఁ జూడ

తే. కమ్మహాత్మునియంకపీఠమ్మునందు, నాదరంబున నుండు దేహంబు దక్షు
వలనిరోషంబునను విడువంగఁ దలఁచి, తాల్చెఁ దనువున ననిలాగ్నిధారణములు.

వ. ఇట్లు ధరియించి గతకల్మషం బైనదేహంబు గలసతీదేవి నిజయోగసమాధిజని
తం బయినవహ్నిచేఁ దత్క్షణంబ దగ్ధ యయ్యె నంత. 98

క. అది గనుఁగొని హాహారవ, మొదవఁగ ని ట్లనిరి మానవులుఁ ద్రిదశులు నీ
మదిరాక్షి యకట దేహము, వదలెఁ గదా దక్షుతోడి వైరముకతనన్. 99

వ. మఱియు ని ట్లనిరి. 100

సీ. సకలచరాచరజనకుఁ డైనట్టియీ, దక్షుండు దనకూర్మితనయ మాన
వతి పూజనీయ యీసతి దనచే నవ, మానంబు నొంది సమక్షమందుఁ
గాయంబుఁ దొఱఁగంగఁ గనుఁగొనుచున్నవాఁ, డిట్టిదారాత్మ్య మెందేనిఁ గలదె
యనుచుఁ జిత్తంబుల నాశ్చర్యములఁ బొంది, రదియునుఁగాక యిట్లనిరి యిట్టి

తే. దుష్టచిత్తుండు బ్రహ్మబంధుండునయిన, యీతఁడనయంబుఁ దానపఖ్యాతిఁ బొందు
నిందఁబడి మీఁదదుర్గతిఁ జెందుఁగాక, యనుచు జనములు వలుకునయ్యవసరమున.

క. దేహము విడిచినసతిఁ గని, బాహాబల మొప్ప రుద్రపార్షదులును ద

1 గదియించి.

ద్రోహిం ద్రుంచుటకై యుత్సాహంబున లేచి రసిగెదాపాంసులు నై. 102

క. ఆరవ మపు డీక్షించి మహారోషముతోడ భృగుమహాముని క్రతుసం
హారకమారక మగునభిచారకహోమం బొనర్చె సరభసవృత్తిన్. 103

వ. ఇట్లు దక్షిణాగ్నియందు వేల్చిన నందుఁ దపం బొనర్చి సోమలోకంబున నుండు సహస్రసంఖ్యలు గలఋభునామధేయులైన దేవత లుదయించి బ్రహ్మతేజంబునం జేసి దివ్యవిమానులై యుల్ముకంబులు సాధనంబులుగా ధరియించి రుద్రపార్షదులయిన ప్రమథగుహ్యకగణంబులం బాఱందోలిన వారును బరాజితులైరి తదనంతరంబ నారదువలన భవుండు దండ్రిచే నసత్కృతురాలగుటం జేసి భవాని పంచత్వంబు నొందుటయుం బ్రమథగణంబులు ఋభునామకదేవతలచేఁ బరాజితు లగుటయు విని. 104

శా. ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁ డిభదైత్యారాతి దష్టోష్ఠుఁడై
మాద్యద్భూరిమృగేంద్రఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్
విద్యుద్వహ్నిశిఖాసముచ్చయరుచిన్ వెల్గొందుచంచజ్జటన్
సద్యఃక్రోధముతోడఁ బుచ్చి వయిచెన్ క్ష్మాచక్రమధ్యంబునన్. 105

వ. ఇట్లు వెఱికి వైచినరుద్రునిజటయందు. 106

శివుఁడు వీరభద్రునిచే దక్షుయజ్ఞంబు ధ్వంసంబు సేయించుట.

సీ. అభ్రంలిహాదభ్రవిభ్రమాభ్రభ్రమ, కృష్ణనీలదీర్ఘశరీర మమరఁ
బ్రజ్వలజ్జ్వలనదీప్తజ్వాలికాజాల, జాజ్వల్యమానకేశములు మెఱయఁ
జండదిగ్వేదండశుండాభదోర్దండ, సాహస్రధృతహేతిసంఘ మొప్ప
వీక్షణత్రయలోకవీక్షణద్యుతిలోక, వీక్షణతతిదుర్నిరీక్షముగను

తే. గ్రకచకఠినకరాళదంష్ట్రలు వెలుంగ, ఘనకపాలాస్థివనమాలికలును దనర
నఖిలలోకభయంకరుఁడగుచు వీరభద్రుఁ డుదయించె మాఱటరుద్రుఁడగుచు.

తే. వీరభద్రుండు విహతవిద్వేషిభద్రుఁ, డగుచుఁ దనవేయిచేతులు మొగిచి వినయ
మెసఁగ నేనేమి సేయుదు నెఱుఁగ నాకు, నాన తిమ్మన నతని కయ్యభవుఁ డనియె.

చ. గురుభుజశౌర్య భూరిరణకోవిద మద్భటకోటి కెల్ల నీ
వరయ వరూథినీవరుఁడ వై చని యజ్ఞము గూడ దక్షునిం
[1]బరిపరిసేసి ద్రుంపు మట బ్రాహ్మణతేజ మజేయ మంటి వే
నరిది మదంశసంభవుఁడ వై తగు నీకు నసాధ్య మెయ్యెడన్. 109

వ. అని కుపితచిత్తుండై యాజ్ఞాపించిన నట్ల కాక యని. 110

చ. అనఘుఁడు రుద్రుఁ జేరి ముద మారఁ బ్రదక్షిణ మాచరించి వీ
డ్కొని యనివార్యవేగమునఁ గుంభిని గ్రక్కదలన్ ఝళంఝళ
ధ్వని మణినూపురంబులు పదంబుల మ్రోయఁగ భీషణప్రభల్

1 బరువడిఁ ద్రుంపు మీ వచట.

దనరఁ గృతాంతకాంతకశితస్ఫుటశూలముఁ బూని చెచ్చెరన్. 111

చ. సరభసవృత్తి నట్లరుగు సైన్యపదాహతపాదధూళిధూ
సరితకుబేరదిక్తటము సభ్యులు దక్షుఁడుఁ జూచి యెట్టిభీ
కరతమ మంచనం దమము గాదు రజఃపటలం బటంచు ని
వ్వెఱపడి పల్కి రాత్మల వివేకవిహీనతఁ బొంది వెండియున్. 112

సీ. ఈధూళి పుట్టుట కెయ్యది హేతువో, విలయసమీరమా పొలయ దిపుడు
ప్రాచీనబర్హి ధరాపతి మహితోగ్ర, శాసనుఁ డిపుడు రాజ్యంబు సేయఁ
జోరసంఘములకో రా రాదు మఱి గోగ,ణాళిరాకకు సమయంబు గాదు
కావున నిప్పుడు కల్పావసానంబు, గాఁ బోలుఁ గా దటు గాక యున్న

తే. నిట్టియాత్వాతికరజ మెందు దేనిఁ గలదె, యనుచు మనముల భయమంది రచటిజనులు
సురలు దక్షుఁడు నంతఁ బ్రసూతిముఖ్య, లయినభూసురకాంత లిట్లనిరి మఱియు.

క. తనకూఁతులు సూడఁగ నిజ, తనయను సతి ననపరాధఁ దగ వఱి యిట్లె
గ్గొనరించినయాదక్షుని, ఘనపాపవిపాక మిదియుఁ గాఁ దగు ననుచున్. 114

వ. అని వెండియు నిట్లనిరి కుపితాత్ముం డైనదక్షుండు దనకూఁతుతోడివిరోధంబు
సాలక జగత్సంహారకారణుం డయినరుద్రునిం గ్రోధింపం జేసె నమ్మహాత్ముం డెంత
టివాఁ డం టేనిం బ్రళయకాలంబున. 115

సీ. సుమహితనిశితత్రిశూలాగ్ర[1]సంప్రోత, నిఖిలదిక్కరిరాజనివహుఁ డగుచుఁ
జటులోగ్రనిష్ఠురస్తనితగంభీరాట్ట, హాసనిర్భిన్నాఖిలాశుఁ డగుచు
భూరికరాళవిస్ఫారదంష్ట్రాహతి, పతితతారాగణప్రచయుఁ డగుచు
వివిధహేతివ్రాతవిపులప్రభాపుంజ, మండితచండదోర్దండుఁ డగుచు

తే. వికటగోపభయంకరభ్రుకుటిదుర్ని, రీక్షదుస్సహతేజోమహిముఁ దనర్చి
ఘనవికీర్ణజటాబంధకలితుఁ డగుచు, నఖిలసంహారకారణుఁ డయి నటించు. 116

తే. అట్టిదేవునిఁ ద్రిపురసంహారకరుని, జంద్రశేఖరు సద్గుణసాంద్రు నభవు
మనము గోపింపఁ జేసిన మంగళములఁ, బొంద వచ్చునె పన్నగఘ్నునకు నైన.

వ. అని యివ్విధంబున భయవిహ్వలలోచనులై పలుకుచున్నసమయంబున మహా
త్ముం డైనదక్షునకు భయావహంబు లై సహస్రసంఖ్యాతంబు లైనమహోత్పా
తంబులు భూనభోంతరంబులఁ గానంబడుచుండె నాసమయంబున రుద్రాను
చరులు నానావిధసాధనంబులు ధరియించి కపిలపీతవర్ణంబులు గలిగి వామనా
కారులు మకరోదరాననులు నై యజ్ఞశాలాప్రదేశంబునం బరువులు వెట్టుచుఁ
గదియం జనుదెంచి దక్షాధ్వరవాటంబులు విటతాటంబులు సేయుచుం గొందఱు
ప్రాగ్వంశంబును గొందఱు పత్నీశాలయుఁ గొందఱు సదస్యశాలయుఁ గొంద
ఱాగ్నీధ్రశాలయుఁ గొందఱు యజమానశాలయుఁ గొందఱు మహానసగృహం

---

1 కుంఠిత.

బును విధ్వంసంబులు గావించిరి మఱియుఁ గొందఱు యజ్ఞపాత్రంబుల నగ్ను
లనుం జెఱిచిరి వెండియుఁ గొందఱు హోమాగ్ను లార్చిరి పదంపడి కొందఱు
హోమకుండంబులయందు మూత్రంబులు విడిచిరి కొంద ఱుత్తరవేదికామేఖ
లలు ద్రెంచిరి కొందఱు మునుల బాధించిరి కొందఱు తత్పత్నుల వెఱపించిరి
మఱికొందఱు దేవతానిరోధంబుఁ గావించి రంత మణిమంతుండు భృగువును
వీరభద్రుండు దక్షునిఁ జండీశుండు పూషుని నందీశ్వరుఁడు భగునిఁ బట్టి
రివ్విధంబున సదస్యదేవర్త్విక్కాయంబుల శిలల ఱువ్వియు జానువులఁ బొడి
చియు నఱచేతుల నడిచియుఁ గూర్పరంబులఁ బొడిచియు వివిధబాధలు వఱచిన
వారు కాందిశీకులై యెక్కడెక్కడేనియుం జనిరి మఱియును. 118

క. మును దక్షుఁ డభవుఁ బలుకఁగఁ, గను గీఁటినభగునిఁ బట్టి కన్నులు పెకలిం
చెను నందీశ్వరుఁ డచ్చటి, జనములు హాహారవముల సందడిఁ బెట్టన్. 119

తే. కుపితుఁడై నాఁడు భవుని దక్షుఁడు శపింపఁ, బరిహసించినపూషునిపండ్లు డుల్లఁ
గొట్టె బలభద్రుఁ డాకళింగునిరదంబు, లెలమి డులిచినపగిదిఁ జండీశ్వరుండు.

క. తగ వేది దక్షుఁ డాసభ, నగచాపుఁ దిరస్కరించునాఁ డట శ్మశ్రుల్
నగుచుం జూపుట నాభృగు, పగకై శ్మశ్రువులు వీరభద్రుఁడు వెఱికెన్. 121

సీ. అతులదర్పోద్ధతుండై వీరభద్రుండు, గైకొని దక్షువక్షంబుఁ ద్రొక్కి
ఘనసితధారాసిఁ గొని మేను వొడిచియు, మంత్రసమన్వితమహితశస్త్ర
జాలావినిర్భిన్నచర్మంబు గలదక్షుఁ, జంపఁగా లేక విస్మయము నొంది
తద్వధోపాయంబు దనచిత్తమునఁ జూచి, కంఠనిష్పీడనగతిఁ దలంచి

తే. మస్తకముద్రుంచి యంచితామర్షణమున, దక్షిణానలమున వేల్చెఁ దదనుచరులు
హర్షమునఁ బొంద నచటిబ్రాహ్మణజనంబు, లాత్తలనుజాలదుఃఖంబులందుచుండ.

వ. ఇట్లు వీరభద్రుండు దక్షునియాగంబు విధ్వంసంబుగావించి నిజనివాసంబైన కైలా
సంబునకుఁ జనియె నయ్యవసరంబున. 123

దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితులై బ్రహ్మకు విన్నవించుట.

చ. హరభటకోటిచేత నిశితాసి గదా కరవాల శూల ము
ద్గరముస లాదిసాధనవిదారితజర్జరితాఖిలాంగులై
సురలు భయాకులాత్ములగుచుం సరసీరుహగర్భుఁ జేరి త
చ్చరణసరోరుహంబులకు సమ్మతిఁ జాఁగిలి మ్రొక్కి నమ్రులై. 124

క. తమ ధూర్జటిసైనికులగు, ప్రమథులు దయ మాని పెలుచ బాధించుట స
ర్వముఁ జెప్పి రనుచు మైత్రే, యమునీంద్రుఁడు విదురుతోడ ననియె మఱియున్.

తే. ఇంతయును మున్న మనమున నెఱిఁగియున్న
కతన విశ్వాత్మకుండును గమలలోచ
నుండు నన నొప్పునారాయణుండు నజుఁడుఁ

జూడ రారైరి మున్ను దక్షునిమఖంబు. 126

వ. అని చెప్పి సురలిట్లు విన్నవించినఁ జతుర్ముఖుండు వారల కిట్లనియె. 127

క. ఘనతేజోనిధి పురుషుం, డనయంబుఁ గృతాపరాధుఁ డయినను దా వ
ల్లన ప్రతీకారముఁ గావిం,చినజనులకు లోకమందు సేమము గలదే. 128

వ. అని మఱియు నిట్లనియె. 129

క. క్రతుభాగార్హుం డగుపశు,పతి నీశ్వరు నభవు శర్వు భర్గుని దూఱి
కృతయజ్ఞభాగుఁ జేసిన,యతిదోషులు దుష్టమతులు నగుమీ రింకన్. 130

సీ. పూని యేదేవునిబొమముడిమాత్రన, లోకపాలకులును లోకములును
నాశ మొందుదు రట్టియీశుండు ఘనదురు,క్తాస్త్రనికాయవిద్ధాంతరంగుఁ
డును ప్రియావిరహితుండును నైనవాఁ డమ్మహాత్మునిఁ ద్రిపురసంహారకరుని
మఖపునస్సంధానమతి నపేక్షించు మీ,రలు సేరి శుద్ధాంతరంగు లగుచు

తే. భక్తినిష్ఠలఁ దత్పాదపద్మయుగళ,ఘనపరిగ్రహపూర్వంబు గాఁగ నతని
శరణ మొందుఁడ తండు ప్రసన్నుఁడయినఁ,దివిరిమీకోర్కి సిద్ధించు దివిజులార.

వ. అని మఱియు నిట్లనియె నద్దేవుని డాయం జన వెఱతు (మని తలంపకుం)డతనిఁ
జేరునుపాయం బెఱింగింపు మంటి రేని నేను నింద్రుండును మునులును మీర
లును(మఱియు దేహధారు లెవ్వరేని)నమ్మహాత్మునిస్వరూపంబు నతనిబలపరాక్ర
మంబులకొలందియు నెఱుంగఁ జాల మతండు స్వతంత్రుండు గావునఁ దదుపాయం
బెఱింగింప నెవ్వఁడు సమర్థుం(డగు నయిన నిపుడుభక్తపరాధీనుండును శరణాగత
రక్షకుండు నగునీశునిఁ జేరం బోవుద) మని వినం బలికి పద్మసంభవుండును దేవ
పితృగణప్రజాపతులం గూడి కైలాసాభిముఖుం డై చని చని. 132

ఉ. భాసురలీలఁ గాంచిరి సుపర్వులు భక్తజనైకమానసో
ల్లాసముఁ గిన్నరీజనవిలాసము నిత్యవిభూతిమంగళా
వాసము సిద్ధగుహ్యకనివాసముఁ జారువిరాజమానకై
లాసము గాంతినిర్జితకులక్షితిభృత్సుమహద్విభాసమున్. 133

సీ. ధాతువిచిత్రితోదాత్తరత్న[1]వ్రజ,రుగ్విభాసితతుంగశృంగములును
గిన్నరగంధర్వకింపురుషాప్సరో,జననికరాకీర్ణసానువులును
మానితనిఖిలవైమానికమిథునస,ద్విహారార్హైకశుభప్రదేశములును
గమనీయనవమల్లికాసుమనోవల్లి,కామతల్లీలసత్కందరములు

తే. నమరసిద్ధాంగనాశోభితాశ్రమములు, విబుధజనయోగ్యసంపన్నివేశములును
గలిగి బహువిధపుణ్యభోగములనొప్పు, వినుతసుకృతములకుదండ వెండికొండ.

వ. అది మఱియును మందార పారిజాత సరళ తమాల సాల తాల తక్కోల కోవి
దార శిరీషార్జున చూత కదంబ నింబ నీప నాగ పున్నాగ చంపక పాటలాశోక

1 'ప్రభాసంగతోజ్జ్వలతుంగ' అ. ప్ర.

వకుళ కుంద కురవక కన కామ్ర శతపత్త్రి కింశుక కైలా లవంగ మాలతీ మధూక
మల్లికా పనస మాధవీ కుట జోదుంబ రాశ్వత్థ ప్లక్ష వట హింగుళ భూర్జ పూగ
జంబూ ఖర్జూ రామ్రాతక ప్రియాళు నారికే ళేంగుద వేణు కీచక ముఖర తరుశో
భితంబును గలకంఠ కాలకంఠ కలవింక రాజకీర మత్తమధుకరనానావిహంగకోలా
హలనినదబధిరీభూతదిగంతరాళంబును సింహ తరక్షు శల్య గవయ శరభ శాఖా
మృగ వరాహ వ్యాఘ్ర కుర్కుర రురు మహిష వృక సారంగ ప్రముఖవన్యసత్త్వస
మాశ్రయవిరాజితంబును గదళీషండసమావృతమండిత కమల కహ్లార కైరవకలిత
పులినతల లలితకమలాకర విహరమాణ కలహంస కారండవ సారస చక్రవాక బక
జలకుక్కుటాదిజలవిహంగకులకూజితసంకులంబును సలిలకేళీవిహరమాణ సతీర
మణీరమణీయ కుచమండలవిలిప్తమృగమదమిళితహరిచందనగంధసుగంధజలపూ
రితగంగాతరంగిణీసమావృతంబును నైన కైలాసపర్వతంబు వొడగని యరవింద
సంభవపురందరాదిదేవగణంబు లత్యద్భుతానందంబులం బొంది ముందటఁ దార
హీర హేమమయవిమానసంకులంబును బుణ్యజనమానినీశోభితంబును నైన యలకా
పురంబుఁ గడచి తత్పురోబాహ్య(ప్రదేశ)ంబునం దీర్థపాదుం డైనపుండరీకాక్షు
పాదారవిందరజఃపావనంబును రతికేళీవ్యాసంగపరిశ్రమనివారకసలిలకేళీవిలోల
దేవకామినీపీనవక్షోజవిలిప్తకుంకుమపంకసంగతపిశంగవర్ణ వారిపూరవిలసితంబును
నైన నందాలక నందాభిధానంబులు గలనదీద్వితయంబు దాఁటి తత్పురో
భాగంబున వనగజసంఘృష్టమలయజ(పరిమిళిత)మలయపవనాస్వాదనముహుర్ము
హురున్మథితమానసపుణ్యజనకామినీకదంబంబును వైడూర్యసోపానసముంచితకన
కోత్పలవాపీవిభాసితంబును గింపురుషసంచారయోగ్యంబును నగుసౌగంధికవన
సమీపంబునందు. 135

బ్రహ్మాదులు దక్షిణామూర్తి రూపుం డగునీశ్వరుని స్తుతించుట.

సీ. ఉజ్జ్వలం బగు శతయోజనంబులపొడవునుఁ బంచసప్తతియోజనముల
పఱపును గల్గి సేపట్టునఁ దఱుగని, నీడ శోభిల్ల నిర్ణిత మగుచుఁ
బర్ణశాఖాసమాకీర్ణ మై మాణిక్య,ములఁ బోలఁ గలఫలములఁ దనర్చి
కమనీయసిద్ధయోగక్రియామయ మయి, యనఘముముక్షుజనాశ్రయమును
తే. భూరిసంసారతాపనివారకమును, నగుచుఁ దరురాజ మనఁగఁ బెంపగ్గలించి
భక్తజనులకునిచ్చలుఁ బ్రమద మెసఁగ, వలయుసంపద లందునావటమువటము.
వ. ఆవృక్షమూలతలంబున. 137

సీ. ఇద్ధసనందాదిసిద్ధసంసేవితు, శాంతవిగ్రహుని వాత్సల్యగుణునిఁ
గమనీయలోకమంగళదాయకుని శివు, విశ్వబంధుని జగద్వినుతయశుని
గుహ్యకసాధ్యరక్షోయక్షనాథకు, బేరసేవితుని దుర్వారబలుని
నుదితవిద్యాతపోయోగయుక్తుని బాల,చంద్రభూషణుని మునీంద్రనుతునిఁ

తే. దాపసాభీష్టకరు భస్మదండలింగ, ఘనజటాజినధరుని భక్తప్రసన్ను
వితతసంధ్యాభ్రరుచివిడంబితవినూత్న, రక్తవర్ణు సనాతను బ్రహ్మమయుని. 138

వ. మఱియును. 139

సీ. అంచితవామపాదాంభోరుహము దక్షి, ణోరుతలంబున నొయ్య నునిచి
సవ్యజానువుమీఁద భవ్యబాహువు సాఁచి, వలపలిముంజేత సలలితాక్ష
మాలిక ధరియించి మహనీయతర్కము, ద్రాయుక్తుఁ డగుచుఁ జిత్తంబులోన
నవ్యయం బయినబ్రహ్మానందకలితస, మాధినిష్ఠుఁడు వీతమత్సరుండు

తే. యోగపట్టాభిరాముఁ డై యుచితవృత్తి, రోషసంగతిఁ బాసి కూర్చున్నజముని
యనువునను దర్భరచితబృస్యాసనమున, నున్నమునిముఖ్యసంచితయోగనిరతు.

క. అలఘుని నభవుని యోగీం, ద్రులు వినుచుండంగ నారదునితోఁ బ్రియభా
షలు జరపుచున్నరుద్రుని, సలలితపన్నగవిభూషు సజ్జనపోషున్. 141

క. కని లోకపాలురును ముని, జనులును సద్భక్తి నతనిచరణంబులకుం
వినతు లయి రప్పు డబ్జా, సనుఁ గని యయ్యభవుఁ డధికసంభ్రమ మొప్పన్.

క. అనఘ మహోత్తముఁ డగువా, మనుఁ డాకశ్యపున కొగి నమస్కారము సే
సినగతి నజునకు నభివం, దన మొగిఁ గావించె హరుఁడు దద్దయుఁ బ్రీతిన్. 143

తే. అంత రుద్రానువర్తను లైనసిద్ధ, *దేవమహాఋషిజనము లర్థిని బయోజ
గర్భునకు మ్రొక్కి రంతనాకమలభవుఁడు, శర్వుఁ గనిపల్కె మందహాసంబుతోడ.

తే. జగములకు నెల్ల యోనిబీజంబు లైన, శక్తిశివకారణుండ వై జగతి నిర్వి
కారతత్త్వంబ వగునిన్నుఁ గడఁగి విశ్వ, నాథుఁగా నెఱిఁగెద నామనమున నభవ.

తే. సమత నది గాక తావకాంశంబు లైన, శక్తిశివరూపములఁ గ్రీడ సలుపు దూర్ణ
నాభిగతి విశ్వజననవినాశవృద్ధి, హేతుభూతుండ వగుచుందు వీశ రుద్ర.

సీ. అనఘ లోకంబునయందు వర్ణాశ్రమ, సేతువు లనఁగఁ బ్రఖ్యాతి నొంది
బలసి మహాజనపరిగృహీతంబు లై, యఖిలధర్మార్థదాయకము లైన
వేదంబులను మఱి వృద్ధి నొందించుట, కొఱకు నై నీవ దక్షుని నిమిత్త
మాత్రునిఁ జేసి యమ్మఖముఁ గావించితి, వటు గాన శుభమూర్తి వై ననీవు

తే. గడఁగి జగముల మంగళకర్తు లయిన, వారి ముక్తి నమంగళాచారు లయిన
వారి నరకంబు నొందింతు భూరిమహిమ, భక్తజనపోష రాజితఫణివిభూష.

వ. అట్లగుటం దత్కర్మంబు లోకానోకనికి విపర్యాసంబు నొందుటకుఁ గారణం
బెయ్యదియో భవదీయరోషంబు హేతు వని తలంచితి నేనిఁ ద్వదీయపాదార
విందభజను లై సమస్తభూతంబులయందు నిన్నుం గనుంగొనుచు భూతంబుల
నాత్మకు వేఱుగాఁ జూడక వర్తించుమహాత్ములయందు నజ్ఞు లైనవారియందుం
బోలె రోషంబు దలఁచు వారయ దఁట నీకుఁ గ్రోధంబు గలదే యని. 148

---

* 'దేవమహాఋషి' యనియే. వ్రాఁతప్రతులు.

సీ. మఱి భేదబుద్ధిఁ గర్మప్రవర్తనముల, మదయుతు లయి దుష్టహృదయులగుచుఁ
బరవిభవాసహ్యభవమనోవ్యాధులఁ, దగిలి [1]మర్మాత్తభేదకము లయిన
బహుదురుక్తులచేతఁ బరులఁ బీడించుచు, నుండుమూఢులను దైవోపహతులఁ
గాఁ దలపోసి యక్కపటచిత్తులకు నీ,వంటిసత్పురుషు లేవలన నైన
తే. హింసఁ గావింప కుండ్రు సమిద్ధచరిత, నీలలోహిత మహితగుణాలవాల
లోకపాలనకలిత గంగాకలాప, హర జగన్నుతచారిత్ర యదియుఁ గాక. 149
సీ. అమర సమస్తదేశములందు నఖిలకా,లములందుఁ దలఁప [2]దుర్లంఘ్యమహిముఁ
డగుపద్మనాభుమాయామోహితాత్మకు, లై భేదదర్శను లైనవారి
వలనను ద్రోహంబు గలిగిన నైనను, నది దైవకృత మని యన్యదుఃఖ
ముల కోర్వలేక సత్పురుషుఁడు దయసేయుఁ, గాని హింసింపఁడు గాన నీవు
తే. నచ్యుతునిమాయమోహము నందకుంటఁ, జేసి సర్వజ్ఞుఁడవు మాయచేత మోహి
తాత్ములై కర్మవర్తను లయినవారి,వలన ద్రోహంబు గలిగిన వలయుఁ బ్రోవ.
వ. అది గావున యజ్ఞభాగార్హుండ వయిననీకు సవనభాగంబు సమర్పింపనికతన నీ చేత విధ్వస్తం బయి పరిసమాప్తి నొందనిదక్షాధ్వరంబు మరల నుద్ధరించి దక్షునిఁ బునర్జీవితుం జేయుము భగునినేత్రంబులును (భృగుమునిశ్మశ్రువులును) బూషునిదంతంబులును గృపసేయుము భగ్నాంగు లయినదేవఋత్విజ్నికాయంబులకు నారోగ్యంబు గావింపు మీమఖావశిష్టంబు యజ్ఞపరిపూర్తిహేతుభూతం బయినభవదీయభాగం బగుం గాక. 151

శివుఁడు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుఁ డై దక్షాదుల ననుగ్రహించుట.

చ. అని చతురాననుండు వినయంబున వేఁడిన నిందుమౌళి స
య్యనఁ బరితుష్టిఁ బొంది దరహాసమునం గృప దొంగలింప ని
ట్లను హరిమాయచేత ననయంబును బామరు లైనవారు సే
సినయపరాధదోషములు చిత్తములోఁ గణియింప నెన్నఁడున్. 152
వ. అట్లయ్యుండి. 153
క. బలియుర దండింపను దు,ర్బలులను రక్షింప ధర్మపద్ధతి యగుటం
గలుషాత్ములయపరాధము,కొలఁదిని దండించుచుండు గొనకొని నేనున్. 154
వ. అని దగ్ధశీర్షుండయినదక్షుం డజముఖుం డగు భగుండు బర్హిస్సంబంధభాగంబులు గలిగి మిత్రనామధేయచక్షుస్సునం బొడగాంచుఁ బూషుండు పిష్టభుక్కగు(చు యజమానదంతంబులచే భక్షించు) దేవతలు (యజ్ఞావశిష్టంబు నా కొసంగుటం జేసి) సర్వావయవపూర్ణులై వర్తింతురు ఖండితాంగు లైనయధ్వర్యుఋత్విగాదిజనంబు లశ్విదేవతలబాహువులచేతను బూషునిహస్తంబులచేతను లబ్ధబాహుహస్తులై జీవింతురు భృగువు బస్తశ్మశ్రువులు గలిగి వర్తించు నని శివుం డానతిచ్చిన

---

1 పరాత్మభే. 2 గుర్లంఘనీయ మగు.

సమస్తభూతంబులు సంతుష్టాంతరంగంబు లై తండ్రీ తండ్రీ యని సాధువాదం
బుల నభినందించి రంత (నాశంభుని యామంత్రణంబు వడసి) సునాసీరప్రముఖు
లగుదేవతలు (ఋషులతోడం గూడి రా) నజుండును రుద్రునిం బురస్కరించు
కొని దక్షాధ్వరవాటంబునకుం జని రచ్చట. 155

క. శర్వునియోగక్రమమున, సర్వావయవములుఁ గలిగి సన్నుతఋత్వి
గ్గీర్వాణముఖ్యు లొప్పిరి, పూర్వతనుశ్రీల నార్యభూషణ యంతన్. 156

క. విను దక్షు నంత మేషము, ఖునిఁ జేసిన నిద్ర మేలుకొని లేచినపో
ల్కిన నిలిచె దక్షుఁ డభవుఁడు, గనుఁగొనుచుండంగ నాత్మఁ గౌతుక మొప్పన్.

వ. ఇట్లు లేచి నిలిచి ముందఱ నున్నశివునిం గనుంగొనినమాత్రన శరత్కాలంబున
నకల్మషం బైనసరస్సునుంబోలెఁ బూర్వరుద్రవిద్వేషజనితంబు లైనకల్మషం
బులం బాసి నిర్మలుం డై యభవుని నుతియింపం దొడంగి మృతిఁ బొందినసతీ
తనయం దలంచి యనురాగోత్కంఠల బాష్పపూరితలోచనుండును గద్గదకంఠుం
డు నై పలుకం జాలక యెట్టకేలకు దుఃఖంబు సంస్తంభించికొని ప్రేమాతిరేక
విహ్వలుం డగుచు సర్వేశ్వరుం డగుహరున కిట్లనియె. 158

క. విను నీ కపరాధుఁడ నగు,నను దండించు టిది దండనము గాదు మది
న్నను రక్షించుటగా మన,మునఁ దలఁతును దేవ యభవ పురహర రుద్రా. 159

సీ. అనఘాత్మ తగ నీవు నబ్జాంభుండును, బరికింప బ్రాహ్మణాభాసు లయిన
వారలయెడల నెవ్వాలన నుపేక్షింప, రఁట దృఢవ్రతచర్యు లైనవారి
యెడ నీ కుపేక్ష యెక్కడిది సర్గాదిని, నామ్నాయసంప్రదాయప్రవర్త
నము నెఱింగించుట కమరవిద్యాతపో,వ్రతపరాయణు లైనబ్రాహ్మణులను

తే. వరుసఁ బుట్టించితివి కాన వారి నెపుడుఁ, గల దండంబుఁ బూని గోపాలకుండు
బలసి గోవుల రక్షించుపగిది నీవు, నరసి రక్షించుచుందు గదయ్య రుద్ర. 160

సీ. తలపోయ నవిదితతత్త్వవిజ్ఞానుండ, నై ననాచేత సభాంతరమున
నతిదురుక్తాంబకక్షతుఁడవయ్యును మత్కృ,తాపరాధము హృదయంబునందుఁ
దలఁపక సుజననిందాదోషమున నధో,గతిఁ బొందు చున్నముష్కర్ము నన్నుఁ
గరుణఁ గాచిననీకుఁ గడఁగి ప్రత్యుపకార, మొఱఁగి కావింప నేర నెంతవాఁడ

తే. నుతచరిత్ర భవత్పరానుగ్రహాను,రూపకార్యంబుచేత నిరూఢ మైన
తుష్టి నీచిత్తమందు నొందమదువుగాక, క్షుద్రసంహార కరుణాసముద్ర రుద్ర.

వ. అని యిట్లు రుద్రక్షమాపణంబు గావించి పద్మసంభవుచేత ననుజ్ఞాతుం డై
దక్షుం డుపాధ్యాయఋత్విగ్గణసమేతుం డగుచుఁ గ్రతుకర్మంబు నిర్వర్తించు
సమయంబున బ్రాహ్మణజనంబులు యజ్ఞంబులు నిర్విఘ్నంబు లై సాగుటకుఁ బ్ర
మథాదివీరసంసర్గకృతదోషనివృత్త్యర్థంబుగా విష్ణుదేవతాకంబును ద్రికపాలపు
రోడాశద్రవ్యకంబును నైనకర్మంబుఁ గావింప నుపాత్తహవిష్యుం డగుభృగువు

తోడం గూడి నిర్గళాంతఃకరణుం డగుచు దక్షుఁడు ద్రవ్యత్యాగంబుఁ గావింపఁ బ్రసన్నుం డై సర్వేశ్వరుండు. 162

దక్షాధ్వరంబునకు వచ్చిన నారాయణుని దక్షాదులు నుతించుట.

సీ. మానితశ్యామాయమానశరీర దీ, ధితులు సద్దిక్కుల దీటుకొనఁగఁ
గాంచనమేఖలాకాంతులతోడఁ గా, శేయచేలద్యుతుల్ సెలిమి సేయ
లక్ష్మీసమాయుక్తలలితవక్షంబున, వైజయంతీప్రభల్ వన్నె సూప
హాటకరత్నకిరీటకోటిప్రభల్, బాలార్కరుచులతో మేల మాడ
తే. లలితనీలాభ్రరుచిఁ గుంతలములు దనరఁ, బ్రవిమలాత్మీయదేహజప్రభ సరోజ
భవభవామరముఖ్యులప్రభలు మాప, నఖిలలోకైకగురుఁడు నారాయణుండు.

చ. సలలితశంఖ చక్ర జలజాత గదా శర చాప ఖడ్గని
ర్మలరుచులన్ సువర్ణరుచిరమన్మణికంకణముద్రికాప్రభా
వలులును దేజరిల్ల భుజవర్గ మనర్గళకాంతియుక్త మై
విలసితకర్ణికారపృథివీరుహముం బురుడింపఁ బట్టుగన్. 164

క. సరసోదారసమంచిత. దరహాసవిలోకనములఁ దగ లోకములం
బరితోషము నొందించుచుఁ, బరమోత్సవ మొప్ప విశ్వబంధుం డగుచున్. 165

చ. మఱియును రాజహంసరుచిమధ్యమణీకృతతాలవృంతచా
మర లిరువంకలన్ దివిజమానిను లీయ సుధామరీచివి
స్ఫురితసితాతపత్రరుచిపుంజము దిక్కులఁ బిక్కటిల్లఁగాఁ
గరివరదుండు వచ్చె శుభగస్తుతివర్ణసుపర్ణయానుఁ డై. 166

చ. ఘనరుచి నట్లు వచ్చినవికారవిదూరు ముకుందుఁ జూచి బో
రన నరవిందనందనపురందరచంద్రకళాధరామృతా
శనముఖు లర్థి లేచి యతిసంభ్రమ మొప్ప నమో నమో దయా
వననిధయే యటంచు ననివారణ మ్రొక్కిరి భక్తియుక్తు లై. 167

వ. అట్లు కృతప్రణాము లై యనంతరంబ. 168

ఉ. ఆనలినాయతాక్షునియనంతపరాక్రమదుర్నిరీక్ష్యతే
జోనిహతస్వతేజు లగుచున్ నుతి సేయ నశక్తు లై భయ
గ్లాని వహించి బాష్పములు గ్రమ్మఁగ గద్గదకంఠు లై తనుల్
మ్రానుపడంగ నవ్విభునిమన్ననఁ గైకొని యట్టకేలకున్. 169

వ. నిటలతటఘటితకరపుటు లై యమ్మహాత్మునియపారమహిమం బెఱింగి నుతియింప శక్తులు గాక యుండియు భక్తానుగ్రహపరిగ్రహుం డగుటం జేసి తమతమ మతులకు గోచరించినకొలంది నుతియింపఁ దొడంగి రందు (గృహీతంబు లగు పూజాద్యుపచారంబులు గలిగి బ్రహ్మాదులకు జనకుండును సునందనందాదిపరమ భాగవతజనసేవితుండును యజ్ఞేశ్వరుండు నగు భగవంతుని శరణ్యునిం గాఁ దలం

చి) దక్షుం డి ట్లనియె దేవా నీవు స్వస్వరూపంబునం దున్నయప్పు (డుపర
తంబులు గాని) రాగాద్యఖిలబుద్ధ్యవస్థలచే విముక్తుండవును నద్వితీయుండవును
జిద్రూపకుండవును భయరహితుండవును నై మాయం దిరస్కరించి మఱియు
నామాయ ననుసరించి నటనకొఱకు లీలామానుషరూపంబుల నంగీకరించి స్వతం
త్రుండ వయ్యును మాయాపరతంత్రుండ వై రాగాదియుక్తుండునుంబోలె రామ
కృష్ణాద్యవతారంబులఁ గానంబడు చుందువు గావున నీలోకంబులకు నీవ యీ
శ్వరుండ వనియు నితరులైన బ్రహ్మరుద్రాదులు భవన్మాయావిభూతు లగుటం
జేసి లోకంబులకు నీశ్వరులు గా రనియును భేదదృష్టి గలనన్ను రక్షింపు మీవిశ్వ
కారణు లైన ఫాలలోచనుండును బ్రహ్మయు దిక్పాలురును సకలచరాచరజంతు
సంతానములును నీవ గానిది లేశంబు లే దని విన్నవించినం దదనంతరంబ ఋత్వి
గ్జనంబు లి ట్లనిరి. 170

సీ. వామదేవుని శాపవశమునఁ జేసి క, ర్మానువర్తులము మే మైనకతన
బలసి వేదప్రతిపాద్యధర్మోపల, క్ష్యం బైనయట్టిమఖంబునందు
దీపింప నింద్రాదిదేవతాకలితరూ, పవ్యాజమునఁ బొంది పరఁగునిన్ను
యజ్ఞస్వరూపుండ వని కాని కేవల, నిష్కించనుండవు నిర్గుణుఁడవు
తే. నరయ ననవద్యమూర్తివి నైననిను, లలితతత్త్వస్వరూపంబుఁ దెలియఁ జాల
మయ్య మాధవ గోవింద హరి ముకుంద, చిన్మయాకార నిత్యలక్ష్మీవిహార.
వ. సదస్యు లి ట్లనిరి. 172
సీ. శోకదావాగ్నిశిఖాకులితంబు పృ, థుక్లేశఘనదుర్గదుర్గమంబు
దండధరక్రూరకుండలిశ్లిష్టంబు, పాపకర్మవ్యాఘ్రపరివృతంబు
గురుసుఖదుఃఖకాకోలపూరితగర్త, మగుచు ననాశ్రయ మైనయట్టి
సంసారమార్గసంచారు లై మృగతృష్ణి, కలఁ బోలువిషయసంఘము నహమ్ము
తే. మేటిసేతుకదేహనికేతనములు, నయి మహాభారవహు లైనయట్టిమూఢ
జనము లేనాఁట మీపదాబ్జములు గానఁ, జాలువారలు భక్తప్రసన్న దేవ. 173
వ. రుద్రుం డి ట్లనియె. 174
చ. వరద నిరీహ యోగిజనవర్గసుపూజిత నీపదాబ్జముల్
నిరతము నంతరంగమున నిల్పి [1]సమగ్రభవత్పరిగ్రహ
స్ఫురణఁ దనర్చునన్ను నతిమూఢులు సంతతము న్నమంగళా
[2]చరణుఁ డటంచుఁ బల్కి నది సన్నతి నే గణియింప నచ్యుతా. 175
వ. భృగుం డి ట్లనియె. 176
మ. అరవిందోదర తావకీనఘనమాయామోహితస్వాంతు లై
పరమం బైనభవన్మహామహిమముం బాటించి కానంగ నో

1 'భవత్పదనుగ్రహాదికస్ఫురణఁ. 2 చరణు...బల్కఁగ భవన్నతి నే గణి.' అ. ప్ర.

పరు బ్రహ్మాదిశరీరధారులును నో । పద్మాక్ష భక్తార్తిసం
హరణాలోకన నన్నుఁ గావఁ దగు ని । త్యానందసంధాయి వై. 177

వ. బ్రహ్మ యిట్లనియె. 178

సీ. సమధికజ్ఞానార్థ । సత్త్వాదిగుణముల, కాశ్రయభూత మై । నట్టిపురుషుఁ
డగ్రపదార్థభే । దగ్రాహకము లైన, చక్షురింద్రియముల । సరవిఁ జూడఁ
గలుగునీరూపంబు । గాదు మాయామయం, బగునసద్వ్యతిరిక్త । మైనయట్టి
నిరుపమాకారంబు । నీకు విలక్షణ, మై యుండు ననుచు నే । నాత్మఁ దలఁతు

తే. నిర్వికార నిరంజన । నిష్కళంక, నిరతిశయ నిష్క్రియారంభ । నిర్గళాత్మ
విశ్వసంపాద్య నిరవద్య । వేదవేద్య, ప్రవిమలానంద సంసార । భయవిదూర. 179

వ. ఇంద్రుం డిట్లనియె. 180

మ. దితిసంతానవినాశసాధనసము । ద్దీప్తాష్టబాహాసమ
న్వితమై యోగిమనోనురాగకరమై । వెల్గొందునీదేహ మా
యత మైనట్టిప్రపంచముం బలెను మి । థ్యాభూతముం గామి శా
శ్వతముం గా మదిలోఁ దలంతు హరి దే । వా దైవచూడామణీ. 181

వ. ఋత్విక్పత్ను లిట్లనిరి. 182

చ. కడఁగి భవత్పదార్చనకుఁ । గా నిటు దక్షునిచే రచింపఁ గాఁ
బడి శితికంఠరోషమునఁ । భస్మము నొంది పరేతభూమి యై
చెడి కడుశాంతమేధమునఁ । జెన్నఁటి యున్నమఖంబుఁ జూడు మే
ర్పడ జలజాభ నేత్రములఁ । బావన మై విలసిల్లు నచ్యుతా. 183

వ. ఋషు లిట్లనిరి. 184

మ. అనఘా మాధవ నీవ మావలెనె క । ర్మారంభి వై యుండియున్
విను తత్కర్మఫలంబు వొందవితరుల్ । విశ్వంబునన్ భూతికై
యనయంబున్ భజియించునిందిర మిము । న్నర్థించి యేతేరఁ గై
కొన వే మందుము నీచరిత్రమునకున్ । గోవింద పద్మోదరా. 185

వ. సిద్ధు లిట్లనిరి. 186

చ. హరి భవదుఃఖభీషణద । వానలదగ్ధతృషార్తమన్మనో
ద్విరదము శోభనంబును బ । విత్రము నైనభవత్కథాసుధా
సరిదవగాహనంబునను । సంసృతితాపము వాసి క్రమ్మఱం
దిరుగదు బ్రహ్మముం గనిన । ధీరునిభంగిఁ బయోరుహోదరా. 187

వ. యజమాని యగుప్రసూతి యిట్లనియె. 188

చ. కరచరణాదికాంగములు । గల్గియు మస్తము లేనిమొండెమం
బరువడి నొప్ప కున్నగతిఁ । బంకజలోచన నీవు లేనియ
ధ్వరము ప్రయాజలం గలిగి । తద్దయు నొప్పక యున్నదయ్యె యో

హరి యిటు నీదురాక శుభ మయ్యె రమాధిప మమ్ముఁ గావవే. 189

వ. లోకపాలకు లి ట్లనిరి. 190

సీ. దేవాదిదేవ యీదృశ్యరూపం బగు,సుమహితవిశ్వంబుఁ జూచు ప్రత్య
గాత్మభూతుండ వై నట్టినీ[1]వు నసత్ప్ర,కాశరూపంబు లై కలుగుమామ
కేంద్రియంబులచేత నీశ్వర నీమాయ, నొందించి పంచభూతోపలక్షి
తం బగు దేహవిధంబునఁ గానంగఁ, బడుదువు గాని యేర్పడినశుద్ధ
తే. సత్త్వగుణయుక్తమైనభాస్వత్స్వరూప,ధరుఁడవై కానఁబడవు గా పరమపురుష
యవ్యయానంద గోవింద యట్లు గాన,యెనయమాజీవనము నీకనేమిసెలవు.

వ. యోగీశ్వరు లి ట్లనిరి. 192

సీ. విశ్వాత్మ నీయందు వేఱుగా జీవులఁ, గనఁ డెవ్వఁ డట వానికంటెఁ బ్రియుఁడు
నీకు లేఁ డయినను నిఖిలవిశ్వోద్భవ,స్థితివిలయంబులకతన ద్వైవ
సంగతి నిర్భిన్నసత్త్వాదిగుణవిశి,ష్టాత్మీయమాయచే నజభవాది
వివిధభేదము లొందుదువు స్వస్వరూపంబు,నం దుండుదువు వినిహతవిమోహి
తే. వగుచు నుండువుగద ని న్ననన్యభక్తి, భృత్యభావంబుదాల్చి సంప్రీతిఁగొల్చు
మమ్ము రక్షింపవే కృపామయ రమేశ, పుండరీకాక్ష సంతతభువనరక్ష. 193

వ. ప్రజాపతు లి ట్లనిరి. 194

చ. హరి భవదీయతత్త్వము సమంచితభక్తి నెఱుంగ నేను నా
సరసిజసంభవాదులును జాలము సత్త్వగుణాశ్రయుండవున్
బరుఁడవు నిర్గుణుండవును బ్రహ్మము మున్నగునీకు నెప్డు నిం
దఱముఁ జతుర్విధార్థఫలదాయక మ్రొక్కెద మాదరింపవే. 195

వ. అగ్నిదేవుం డి ట్లనియె. 196

మ. హవరక్షాచరణుండ వై నెగడుచు న్నయ్యగ్నిహోత్రాదిపం
చవిధంబుల్ మఱి మంత్రపంచక[2]సుపూజ్యాయోగ్యము న్నైనయా
హవరూపం బగునీకు మ్రొక్కెదను నీయాజ్ఞన్ భువిన్ హవ్యముల్
సవనవ్రాతములన్ వహింతు హరి యుష్మత్తేజముం బూనుచున్. 197

వ. దేవత లి ట్లనిరి. 198

మ. మును కల్పాంతమునందుఁ గుక్షి నఖిలంబున్ దాఁచి యేకాకి వై
జనలోకోపరిలోకవాసులును యుష్మత్తత్త్వమార్గంబు చిం
తనముం జేయఁ బయోధియందు నహిరాట్తల్పంబునం బవ్వళిం
చిన [3]నీరూపము నేఁడు సూపితివి లక్ష్మీనాథ దేవోత్తమా. 199

వ. గంధర్వు లి ట్లనిరి. 200

---

1 విదె యసత్ప్రకాశరూప మై పరఁగుమామ. 2 'సుస్పష్టంబై తగం బొల్చునాహవ' అ. ప్ర. 3 'నీరూపముఁ జూడఁ గంటి మిదె రాజీవాక్ష సర్వాత్మకా' వ్రా. ప్ర.

మ. హరపంకేజభవామరాలియు మరీచ్యాదిప్రజానాథులు
న్నరవిందాక్ష రమాహృదీశ భవదీయాంశాంశసంభూతులై
పరఁగం దావకలీలకై నెగడు నీ బ్రహ్మాండము న్సృష్టియీ
శ్వర నీకే మతిభక్తి మ్రొక్కెదము దేవా దేవచూడామణీ. 201

మ. [1]భవదంశాంశజులీ మరీచిముఖరుల్ బ్రహ్మామరేంద్రాదిజా
ధవముఖ్యుల్ దివిషద్గణంబుఁ బరమాత్మా నీకు విశ్వంబు ను
త్సవలీలాకరకందుకోపమము నాథా వేదశాఖాశిఖా
స్తవనీయాంఘ్రికి నీకొనర్తుము నమస్కారంబు లశ్రాంతమున్. 202

వ. విద్యాధరు లిట్లనిరి. 203

సీ. నలినాక్ష విను భవన్మాయావశంబున, దేహంబు దాల్చి తద్దేహమందు
నాత్మ నహమ్మమేత్యభిమానమునఁ బొంది, పుత్రజాయాగృహక్షేత్రబంధు
ధనపశుముఖవస్తుతతులసంయోగవి,యోగదుఃఖంబుల నొందు చుండు
ధృతివిహీనుఁడు నసద్విషయలాలసుఁడును, నతిదుష్టమతియు నైనట్టివాఁడు
తే. దవిలి భవదీయగుణసత్కథావిలోలుఁ, డయ్యెనేనియు నాత్మమోహంబువలనఁ
బాసి వర్తించువిజ్ఞానపరతఁ దగిలి, చిరదయాకార యిందిరాచిత్తచోర. 204

వ. బ్రాహ్మణజనంబు లిట్లనిరి దేవా యీ క్రతువును హవ్యంబును నగ్నియు మంత్రం
బులును సమిద్దర్భపాత్రంబులును సదస్యులును ఋత్విక్కులును దంపతులును
దేవతలును నగ్నిహోత్రంబులును స్వధయు సోమంబును ధరియించి దంష్ట్రాదండం
బున వారణేంద్రంబు నళినంబు ధరియించుచందంబున రసాతలగత యైనభూమి
నెత్తితి వట్టియోగిజనస్తుత్యుండవును మఖరూపకుండవును నైననీవు పరిభ్రష్ట
కర్ముల మై కాంక్షించుమాకుం బ్రసన్నుండ వగుము భవదీయనామకీర్తనంబుల
సకలయజ్ఞవిఘ్నంబులు నాశంబు నొందు నట్టినీకు నమస్కరింతుము. 205

క. అని తన్ను సకలజనములు, వినుతించిన హరి భవుండు విఘ్నము గావిం
చినయాదక్షునియజ్ఞము, ఘనముగఁ జెల్లించెఁ గొఱఁత గాకుండంగన్. 206

క. సకలాత్ముఁడు దా నగుటను, సకలహవిర్భోక్త యయ్యు జలజాక్షుండుం
స్వకీయభాగమునను న,య్యకలంకుఁడు తృప్తిఁ బొంది యనె దక్షునితోన్. 207

వ. అనఘా కారణభూతుండును నీశ్వరుండును ద్రష్టయును స్వయంప్రకాశకుండును
నైన యేను గుణమయం బైనయాత్మీయమాయం బ్రవేశించి జననవృద్ధివిల
యంబులకు హేతుభూతంబు లగుతత్క్రియోచితంబు లైనబ్రహ్మరుద్రాది
నామభేదంబుల నొందు చుండుదు నట్టియద్వితీయబ్రహ్మరూపకుండ నైననాయం
దు నజభవాదులును భూతగణంబులను మూఢుం డగువాఁడు వేఱుగాఁ జూచు

1 ఇది యొకానొకప్రతిని జూపట్టెడి.

మద్భక్తుం డగువాఁడు శరీరంబునకుఁ గరచరణాదులు వేఱుగాఁ దలంపనిచందంబున నాయందు భూతజాలంబు భిన్నంబుగాఁ దలంపఁడు గావున మామువ్వురయందు నెవ్వండు వేఱుసేయకుండు వాఁడు కృతార్థుం డని యానతిచ్చిన దక్షుండును. 208

క. విను విష్ణుదేవతాకం, [1]బనఁగాఁ ద్రికపాలకలిత మగునాయాగం
బునఁ దగ నవ్విష్ణునిపద, వనజంబులు పూజ సేసి వారనిభక్తిన్. 209

వ. మఱియును. 210

సీ. అంగప్రధానకయాగంబులను జేసి, యమరుల రుద్రుని నర్థిఁ బూజ
సేసి విశిష్టేష్టశిష్టభాగమున ను,దవసానకర్మంబుఁ దవిలి తీర్చి
దాను ఋత్విక్కులుఁ దగ సోమపాను లై, యవభృథస్నానంబు లాచరించి
కడఁక నవాప్తసకలఫలకాముఁ డై, తనరుదక్షునిఁ జూచి ధర్మబుద్ధి

తే. గలిగి సుఖవృత్తి జీవింతు గాక యనుచుఁ
బలికి దివిజులు మునులును బ్రాహ్మణులును
జనిరి నిజమందిరముల కా జలజనయన
భవులు వెంచేసి రాత్మీయభవనములకు. 211

వ. అంత దాక్షాయణి యయినసతీదేవి పూర్వకళేబరంబు విడిచి హిమవంతునకు మేనకయందు జనియించి ప్రళయకాలంబునం బ్రసుప్తం బయినశక్తి సృష్టికాలంబున నీశ్వరునిఁ బొందుచందంబునఁ బూర్వదయితుం డగురుద్రుని వరియించె నని దక్షాధ్వరధ్వంసకుం డగురుద్రునిచరిత్రంబు బృహస్పతి శిష్యుం డయిన యుద్ధవునకు నెఱింగించె నతండు నాకుం జెప్ప నేను నీకుం జెప్పితి నని మైత్రేయుండు వెండియు విదురున కి ట్లనియె. 212

క. ఈయాఖ్యానముఁ జదివిన, ధీయుతు లై వినినయట్టిధృతిమంతులకు
న్నాయుఃకీర్తులు గలుగును, బాయును దురితములు దొలఁగు భవబంధంబుల్.

వ. అని వెండియు ని ట్లనియె. 214

క. విను సనకాదులు నారదుఁ, [2]డును హంసుఁడు నరుణియు ఋభుఁడు యతియుఁ గమలా
సనజులు నైష్ఠికు లని కే,తను లగుటం జాఁగ వయ్యెఁ దద్వంశంబుల్. 215

వ. మఱియు నధర్మునకు మృష యనుభార్యయందు దంభుండును మాయ యను కామినియుం బుట్టి రధర్మసంతానం బగుట వారిరువురును మిథునం బైన వారిని సంతానహీనుం డగునిరృతి గైకొనియె నాదంపతులకు లోభుండును నికృతి యను సతియునుం గలిగి మిథునం బైరి నామిథునంబునకుఁ గ్రోధుండు హింస యను నంగనయుం బుట్టి మిథునం బైరి నామిథునంబునకుఁ గలియు దురుక్తి యనునతి

1 'బును ద్రికపాలపురోడాశమును నగుయాగం' వ్రా. ప్ర. 2 'డును నరుణియు యతియు ఋభుఁడును నజానకు నం, దనులును' వ్రా. ప్ర.

వయు జన్మించి దాంపత్యంబు గైకొని రాదంపతులకు భయమృత్యువు లను మిథునంబు గలిగె దానివలన యాతనయు నిరయంబునుం బుట్టిరి వీరలు సంసారహేతు వగునధర్మతరుశాఖ లయి నెగడిరి వీని శ్రేయస్కాముం డగుజనుం డీపన్మాత్రంబు ననువర్తింపం జన దివ్విధంబున బ్రతిసర్గంబును సంగ్రహంబున వినిపించితి నిప్పుణ్యకథ నెవ్వండేని ముమ్మాటు వినిన నతండు నిష్పాపుం డగు నని చెప్పి మఱియు నిట్లనియె. 216

ధ్రువోపాఖ్యానము.

క. విను నిఖిలభువనపరిపా, లనమునకై చంద్రధరకళాకలితుం డై
వనజజునకు స్వాయంభువ, మను వపు డుదయించెఁ గీర్తిమంతుం డగుచున్. 217

తే. రూఢి నమ్మనువుకు శతరూపవలన, భూనుతు లగు ప్రియవ్రతోత్తానపాదు
లనఁగ నిద్దఱు పుత్రులై రందులోన, భవ్యచారిత్రుఁ డుత్తానపాదునకును. 218

క. వినుము సునీతియు సురుచియు, ననుభార్యలు గలరు వారియందును ధ్రువునిం
గనినసునీతియు నప్రియ, యును సురుచియుఁ బ్రియయు నగుచు నున్నట్టియెడన్.

సీ. ఒకనాఁడు సుఖలీల నుత్తానపాదుండు, నెఱిఁ బ్రియురా లైనసురుచి గన్న
కొడుకు నుత్తముఁ దనతొడలపై నిడికొని, యుపలాలనము సేయుచున్న వేళ
నర్థిఁ దదారోహణాపేక్షితుం డైన, ధ్రువునిఁ గనుంగొని తివుట నాద
రింప కుండుటకు గర్వించి యాసురుచియు, సవతిబిడ్డం డైనధ్రువునిఁ జూచి

తే. తండ్రితొడ నెక్కు వేడుక దగిలె నేనిఁ, బూని నాగర్భమున నాఁడ పుట్ట కన్య
గర్భమునఁ బుట్టికొరినఁ గలదె నేఁడు, జనకుతొడ యెక్కు భాగ్యంబు సవతికొడుక.

క. అది గాన నీ వధోక్షజు, పదపద్మము లాశ్రయింపు పాయక హరి నా
యుదరమునఁ బుట్టనిచ్చును, వదలక యట్లయిన ముదము వఱలెడి నీకున్. 221

క. అని యారీతి నసహ్యవ, చనములు పినతల్లి యపుడు జనకుఁడు వినఁగాఁ
దను నాడినదుర్భాషా, ఘనశరములు మనము నాటి కాఱియఁ బెట్టన్. 222

క. తను నట్లుపేక్ష సేసిన, జనకునికడఁ బాసి దుఃఖజలనిధిలోనన్
మునుఁగుచును దండతాడిత, ఘనభుజగముఁబోలె రోషకలితుం డగుచున్. 223

క. ఘనరోదనంబు సేయుచుఁ, గనుఁగవలను శోకబాష్పకణములు దొరఁగన్
జననికడ కేఁగుటయు నిజ, తనయునిఁ గని యాసునీతి దద్దయుఁ బ్రేమన్. 224

వ. తొడలపై నిడికొని. 225

క. కర మనురక్తిని మోము ని, విరి తద్వృత్తాంత మెల్ల వెలఁదులు నంతః
పురవాసులుఁ జెప్పిన విని, పఱపుగ నిట్టూర్పు లెసఁగ బాష్పాకుల యై. 226

తే. సవతి యాడినమాటలు సారెఁ దలఁచి, కొనుచుఁ బేర్చినదుఃఖాగ్నిఁ గుందుచుండె
దావపావకశిఖలచేఁ దగిలి కాంతి, వితతిఁ గందినమాధవీలతికవోలె. 227

వ. అంత నాసునీతి బాలకునిం జూచి తండ్రీ దుఃఖింపకు మని యిట్లనియె. 228

క. అనఘా యీదుఃఖమునకుఁ, బనిలే దన్యులకు సొలయ బలవంతం బై
తనపూర్వజన్మదుష్కృత, ఘనకర్మము వెంట నంటఁ గా నెవ్వలనన్. 229

వ. కావున. 230

క. పనిమిటిచేతను బెండ్లా, మని కాదు నికృష్టదాసి యనియును బిలువం
గను జాలనిదుర్భగురా, లనఁ గలనాకుక్షి నుదయ మందినకతనన్. 231

క. విను నాడినయీసురుచివ, చనములు సత్యంబు లగును సర్వశరణ్యుం
డనఁ గలహరిచరణంబులు, గను జనకునియంక మెక్కఁ గాఁ దలఁతేనిన్. 232

వ. కావునం బినతల్లి యైనయీసురుచియాదేశంబున నధోక్షజు నాశ్రయింపు మని
వెండియు ని ట్లనియె. 233

సీ. పరికింప నవిశ్వపరిపాలనమునకై, యర్థి గుణవ్యక్తుఁ డైనయట్టి
నారాయణునిపాదనలినముల్ సేవించి, తగ బ్రహ్మ బ్రహ్మపదంబు నొందె
ఘనుఁడు మీతాత యాయమనువు సర్వాంతర, యామిత్వ మగునేక మైనదృష్టిఁ
జేసి యాగముల యజించి తా భూమసు, ఖములను దివ్యసుఖమున మోక్ష

తే. సుఖములను బొందె నట్టియచ్యుతునిఁ బొగని, వితతయోగీంద్రనికరసంవేష్యమాణ
చరణసరసిజయుగళు శశ్వత్ప్రకాశు, భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని. 234

వ. మఱియును. 235

క. [1]కరసరసీజగృహీతాం, బుజహాయు నరవిందగర్భముఖగీర్వాణుల్
పరికింపం గలలక్ష్మీ, తరుణీమణిచేత వెదకఁ దగుపరమేశున్. 236

ధ్రువుఁడు నారదోపదేశంబు వడసి తపంబు సేయుట.

వ. నిజధర్మపరిశోభితం బైనయేకాగ్రచిత్తంబున నిలిపి సేవింపు మమ్మహాత్మునికంటె నీదుఃఖం బపనయించువాఁ డన్యుం డొక్కరుండు గలండే యని పలికినఁ బరమార్థప్రాప్తిహేతుకంబు లైనతల్లివాక్యంబులు విని తన్నుఁ దాన నియమించుకొని పురంబు వెడలి చనునవసరంబున నారదుండు తద్వృత్తాంతం బెఱింగి యచ్చటికిం జనుదెంచి యతనిచికీర్షితంబు దెలిసి పాపనాశకరం బైనతనకరతలంబున నాధ్రువునిశిరం బంటి మానభంగంబునకు సహింపనిక్షత్త్రియులప్రభావం బద్భుతంబు గదా బాలకుం డయ్యుఁ బినతల్లి యాడినదురుక్తులు చిత్తంబునం బెట్టి చనుచున్నవాఁ డని మనంబున నాశ్చర్యంబు నొంది (యోబాలక సకలసంపత్సమృద్ధం బగుమందిరంబు దెగడి యొంటి యెందు నేఁగెదవు స్వజనకృతం బగు నవమానంబుచే నిను సంతప్తుంగాఁ దలంచెద ననిన ధ్రువుం డి ట్లనియె సపత్నీమాతృవాగిషుక్షతం బగువ్రణంబు భగవద్ధ్యానయోగరసాయనంబున మాపి కొందు ననిన విని) ధ్రువునికి నారదుం డి ట్లనియె. 237

క. విను పుత్రక బాలుఁడ వై, యనయంబును గ్రీడలందు నాసక్తమనం

---

1 కరకమలగృహీతలీలాం.

బునఁ దిరిగెడునిక్కాలం, బున నీ కవమానమానములు లేవెందున్. 238

తే. కాన మనమునఁ దద్వివేకంబు నీకుఁ, గలిగె నేనియు సంతోషకలితు లయిన
పురుషు లాత్మీయకర్మవిస్ఫురణఁ జేసి, వితతసుఖదుఃఖము లనుభవింతు రెపుడు.

వ. కావున వివేకంబు గలపురుషుండు దనకుం బ్రాప్తంబు లగుసుఖదుఃఖంబులు దైవవశంబులుగాఁ దలంచి తావన్మాత్రంబునం బరితుష్టుం డగు నీవును దల్లి చెప్పినయోగమార్గప్రకారంబున సర్వేశ్వరానుగ్రహంబునం బొందెద నంటివేని.

సీ. అనఘాత్మ యోగీంద్రు లనయంబు ధరఁ బెక్కు, జన్మంబులందు నిస్సంగ మైన
మతిని బ్రయోగసమాధినిష్ఠలఁ జేసి, యైనను దెలియ లే రతనిమార్గ
మదిగాన యతఁడు దురారాధ్యుఁ డగు నీవు, నుడుగుము నిష్ఫలోద్యోగ మిపుడు
గాక నిశ్శ్రేయసకాముఁడ వగుదేని, దండ్రి వర్తించు తత్కాలమందుఁ

తే. బూని సుఖదుఃఖములు రెంటిలోన నెద్ది, దైవవశమునఁ జేకుఱు దానఁ జేసి
డెందమునఁ జాలసంతుష్టిఁ బొందువాఁడు, విమలవిజ్ఞాని యన ధర వెలయుచుండు.

వ. మఱియు గుణాఢ్యుం డగువానిం జూచి సంతోషించుచు నాధముం డగువానిం జూచి కరుణించుచు సమానునియెడ మైత్రి సలుపుచు వర్తించుచున్నవాఁడు తాపత్రయాదికంబులం బొందం డని నారదుండు వలికిన విని ధ్రువుం డిట్లని యె ననఘా యీశమంబు సుఖదుఃఖహతాత్ము లగుపురుషులకు దుర్గమం బని కృపాయత్తుండ వైన నీచేత వినంబడె నట్లయినం బరభయంకరం బగుక్షాత్ర స్వభావంబు నొందినయవినీతుండ నగునేను సురుచిదురుక్తిబాణవినిర్భిన్నహృదయుండ నగుట మదీయచిత్తంబున శాంతి నిలువదు కావునం ద్రిభువనోత్కృష్టంబు నన్యాధిష్ఠితంబు నగుపదంబునం బొంద నిచ్ఛయించిననాకు సాధుమార్గంబు నెఱింగింపుము నీవు భగవంతుం డగునజునియూరువువలన జనించి వీణావాదనకుశలుండ వై జగద్ధితార్థంబు సూర్యుండునుంబోలె వర్తింతు వనిన విని. 242

క. నారదుఁ డిట్లను ననఘ కు, మారక విను నిన్ను మోక్షమార్గంబునకుం
బ్రేరేచినవాఁ డిప్పుడు, ధీరజనోత్తముఁడు వాసుదేవుం డగుటన్. 243

వ. నీవు నమ్మహాత్మునిపదధ్యానప్రవణచిత్తుండ వై భజియింపుము. 244

క. పురుషుఁడు దవిలి చతుర్విధ, పురుషార్థశ్రేయ మాత్మఁ బొందెద ననినన్
ధరఁ దత్ప్రాప్తికి హేతువు, హరిపదయుగళంబు దక్క నన్యము గలదే. 245

వ. కావున. 246

క. వరయమునానదితటమున, హరిసాన్నిధ్యంబు శుచియు నతిపుణ్యము నై
పరఁగినమధువనమునకును, సరసగుణా చనుము మేలు సమకుఱు నచటన్. 247

క. ఆయమునాతటినీశుభ, తోయములం గ్రుంకి నిష్ఠతో నచ్చట నా
రాయణునకును నమస్కృతు, లాయతమతిఁ జేసి చేయు యమనియమములన్.

వ. మఱియు (బాలుండ వగుటం జేసి వేదాధ్యయనాద్యుచితకర్మానర్హుండ వయ్యు

నుచితంబు లగుకుశాజినంబులం జేసి స్వస్తికప్రముఖాసనంబులం గల్పించికొని త్రివృత్ప్రాణాయామంబులచేతం బ్రాణేంద్రియమనోమయంబు లనుచాంచల్యదోషంబులం బ్రత్యాహరించి స్థిరం బయినచిత్తంబున. 249

సీ. ఆశ్రితసత్ప్రసాదాభిముఖుండును, నిర్మలప్రసన్నాననేక్షణుండు
సురుచిరనాసుండు సుభ్రూయుగుండును, సుకపోలతలుఁడును సుందరుండు
హరినీలసంశోభితాంగుండుఁ దరుణుండు, నరుణావలోకనోష్ఠాధరుండుఁ
గరుణాసముద్రుండుఁ బురుషార్థనిధియును, బ్రణతాశ్రయుండు శోభనకరుండు

తే. లలితశ్రీవత్సలక్షణలక్షితుండు, సర్వలోకశరణ్యుండు సర్వసాక్షి
పురుషలక్షణయుక్తుండుఁ బుణ్యశాలి, యసితమేఘనిభశ్యాముఁ డవ్యయుండు.

వ. మఱియును. 251

సీ. హారకిరీటకేయూరకంకణఘన, భూషణుం డాశ్రితపోషణుండు
లాలితకాంచీకలాపశోభితకటి, మండలుం డంచితకుండలుండు
మహనీయకౌస్తుభమణికీలితాచ్ఛగ్రై, వేయకుం డానందదాయకుండు
సలలితఘనశంఖచక్రగదాపద్మ, హస్తుండు భువనప్రశస్తుఁ డజుఁడుఁ

తే. గమ్రసౌరభవనమాలికాధరుండు, హతవిమోహుండు నవ్యపీతాంబరుండు
లలితకాంచననూపురాలంకృతుండు, నిరతిశయసద్గుణుఁడు దర్శనీయతముఁడు..

క. సరసమనోలోచనము, త్కరుఁడు సుహృత్పద్మకర్ణికానివసితవి
స్ఫురదురునఖమణిశోభిత, చరణసరోజాతుఁ డతులశాంతుఁడు ఘనుఁడున్. 253

వ. అయ్యపురుషోత్తముం బూజించుచు హృదయగతుండును సానురాగవిలోకనుండును వరదశ్రేష్ఠుండును నగునారాయణు నేకాగ్రచిత్తంబునం ధ్యానంబు సేయుచుఁ బరమనివృత్తిమార్గంబున ధ్యానంబు సేయంబడ్డపురుషోత్తమునిదివ్యమంగళస్వరూపంబు చిత్తంబునం దగిలిన మరల మగుడ నేర దదియునుం గాక యేమంత్రం బేని సప్తవాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొనుసామర్థ్యంబు గలుగు నట్టిప్రణవయుక్తం బగుద్వాదశాక్షరకలితంబును దేశకాలవిభాగవేది యగుబుధానుష్ఠితంబును నయినవాసుదేవమంత్రంబునం జేసి. 254

సీ. దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము, జలజంబులను జాతజలజనయనుఁ
దులసీదళంబులఁ దులసికాదాముని, మాల్యంబులను సునైర్మల్యచరితుఁ
బత్త్రంబులను బక్షిపత్త్రునిఁ గడు వన్య, మూలంబులను నాదిమూలఘనుని
నంచితభూర్జత్వగాదినిర్మితవివి, ధాంబరంబులను బీతాంబరునిని

తే. దనరుభక్తిని మృచ్ఛిలాదారురచిత, రూపములయందుఁ గాని నిర్బాధ మైన
సలిలములయందుఁ గాని సుస్థలములందుఁ, గానిపూజింపవలయు నక్కమలనాభు.

క. ధృతచిత్తుఁడు శాంతుండు ని, యతపరిభాషణుఁడు సుమహితాచారుఁడు వ
ర్ణితహరిమంగళగుణుఁడును, మితవన్యాశనుఁడు నగుచు మెలఁగుచు మఱియున్.

వ. ఉత్తమశ్లోకుం డగుపుండరీకాక్షుండు నిజమాయాస్వేచ్ఛావతారచరితంబుల
చేత నచింత్యంబుగా నెద్ది సేయు నద్దియ హృదయగతంబుగా ధ్యానంబు సేయం
దగు మఱియుం గార్యబుద్ధిం జేసి సేయంబడుపూజావిశేషంబులు వాసుదేవ
మంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింప వలయు నిట్లు మనోవాక్కాయకర్మం
బులచేత మనోగతం బగునట్లుగా భక్తియుక్తంబు లయినపూజలచేతఁ బూజిం
పంబడి సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక సేవించుపురుషులకు ధర్మాది
పురుషార్థంబులలోన నభిమతార్థంబు నిచ్చు విరక్తుం డగువాఁడు నిరంతరభావం
బయినభక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజియించు నని చెప్పిన విని
ధ్రువుండు నారదునకుం బ్రదక్షిణపూర్వకంబుగా నమస్కరించి (మహర్షిజన
సేవ్యం బై సకలసిద్ధుల నొసంగుచు) భగవత్పాదసరోజాలంకృతం బైనమధు
వనంబునకుం జనియె నంత. 257

తే. పద్మభవసూనుఁ డుత్తానపాదుకడకు, నరిగి యారాజుచే వివిధార్చనముల
నంది సంప్రీతుఁ డై యుచితాసనమున, నెలమిఁ గూర్చుండి యాతనివలనుసూచి.

వ. ఇట్లనియె. 259

క. భూనాయక నీ విపు డా,మ్లానాస్యుఁడ వగుచుఁ జాల మదిలోఁ జింతం
బూనుట కేమికతం బన, నానారదుతోడ నాతఁ డనియెన్ మరలన్. 260

క. మునివర వివేకశాలియు, ననఘుఁడు నై దేండ్లబాలుఁ డస్మత్ప్రియనం
దనుఁ డదయుఁడ నగునాచే,తను బరిభవ మొంది చనియెఁ దల్లియుఁ దానున్.

మ. చని యుగ్రాటవిఁ జొచ్చి యచ్చటఁ బరిశ్రాంతుండు క్షుత్పీడితుం
డును నామ్లానముఖాంబుజుండు ననఘుండున్ బాలుఁడు నైనమ
త్తనయుం ఘోరవృకాహిభల్లముఖసత్త్వశ్రేణి నిర్జించెనో
యని దుఃఖించెద నాదుచిత్తమున నాశ్చర్యస్తుత్య యిట్లాటకున్. 262

తే. అట్టియుత్తమబాలు నాయంకపీఠ,మందుఁ గూర్చుండ నీక నిరాకరించి
యంగనాసక్తచిత్తుండ నైనయట్టి,నాదుదౌరాత్మ్య మిది మునినాథచంద్ర.

ఉ. నా విని నారదుండు నరనాథున కిట్లను నీకుమారుఁ డా
దేవకిరీటరత్నరుచిదీపితపాదసరోజుఁ డై నరా
జీవదళాక్షరక్షితుఁ డశేషజగత్పరికీర్తనీయకీ
ర్తీవిభవప్రశస్తసుచరిత్రుఁడు వానికి దుఃఖ మేటికిన్. 264

ఉ. కావున నమ్మహాత్ముఁడు సుకర్మముచేత సమస్తలోకపా
లావళి కందరానిసముదంచితనిత్యపదంబునం బ్రభు
శ్రీ విలసిల్లఁ జెందుఁ దులసీదళదాము భజించి యాజగ
త్పావనుఁ డైననీసుతుప్రభావ మెఱుంగవు నీవు భూవరా. 265

వ, అదియునుం గాక. 266

క. నీకీర్తియు జగములయం, దాకల్పము నొందఁ జేయు ǂ నంచితగుణర
త్నాకరుఁ డిట కేతెంచును, శోకింపకు మతనిఁగూర్చి ǂ సుభగచరిత్రా. 267

క. అని నారదుండు వలికిన, విని మనమున విశ్వసించి ǂ విభుఁడును బ్రియనం
దనుఁ జింతించుచు నాదర, మునఁ జూడం డయ్యె రాజ్యǂమును బూజ్యముగన్.

వ. అంత నక్కడ నాధ్రువుండు. 269

క. చని ముందటఁ గనుఁగొనె మధు, వనమును మునియోగిదేవǂవర్ణితగుణపా
వనమును దుర్భవజలదప, వనమును నిఖిలైకపుణ్యǂవరభవనంబున్. 270

వ. అట్లు గని డాయం జని యమునానదిం గృతస్నానుం డై నియతుండును సమా
హితచిత్తుండును నై సర్వేశ్వరుని ధ్యానంబు సేయుచుం [1]త్రిరాత్రత్రిరాత్రం
బుల కొక్కమాఱు కృతకపిత్థబదరీఫలపారణుం డగుచు దేహస్థితి ననుసరించి
యొక్కమాసంబు హరిం బూజించి యంతనుండి యాఱేసిదినంబుల కొక్కపరి
కృతజీర్ణతృణపర్ణాహారుం డగుచు రెండవమాసంబున విష్ణుసమారాధనంబు
సేసి యంతనుండి నవరాత్రంబుల కొకమాఱు దకభక్షణంబు సేయుచు మూఁ
డవమాసంబున మాధవు నర్చించి యంతనుండి ద్వాదశదినంబుల కొకతోయం
బు వాయుభక్షణుం డగుచు (జితశ్వాసుం డై) నాలవమాసంబునం బుండరీకా
క్షుని భజియించి యంతనుండి మనంబున (నలయక నిరుచ్ఛ్వాసుం డై యేక
పదంబున నిలిచి పరమాత్మం జింతించుచు) నచేతనం బైన స్థాణువుంబోలె నై
దవమాసంబును జరపె నంత. 271

సీ. సకలభూతేంద్రియాǂశయ మగుహృదయంబు, నందు విషయములఁ ǂ జెంద నీక
మహదాదితత్త్వసǂమాజమ్ములకును నా, ధారభూతమును బ్రǂధానపూరు
షేశ్వరుఁ డైనట్టిǂశాశ్వతబ్రహ్మంబుఁ, దన ఘనహృదయపǂద్మమున నిలిపి
హరిరూపమునకంటె ǂ నన్యంబు నెఱుఁగక, చిత్త మవ్విభునందుఁ ǂ జేర్చియున్న

తే. కతన ముల్లోకములు సాలఁǂగంప మొందె, వెండియును బేర్చి యయ్యర్భǂకుండు ధరణి
నొక్కపాదంబు చేర్చి నిǂల్చున్నవేళఁ, బేర్చి యబ్బాలుసంగుష్ఠǂపీడఁ జేసి. 272

తే. వసుమతీతల మర్ధము ǂ వంగఁ ద్రొచ్చె, భూరిమదదుర్నివారణǂవారణేంద్ర
మెడమఁ గుడి నొరగఁగ నడుǂగడుగునకును, జలన మగును దధిస్థితǂకలము వోలె.

చ. అతఁడు ననన్యదృష్టిని జǂరాచరదేహశరీరధారణా
స్థితి గలయీశునందుఁ దనǂజీవితముం ఘటియింపఁ జేసి యే
కతఁ గనఁ దన్నిరోధమునఁ ǂ గైకొని కంపము నొందె నీశ్వరుం
డతఁడు చలింప నిజ్జగము ǂ లన్నియుఁ జంచల మయ్యె భూవరా. 274

క. ఆలోకభయంకర మగు, నాలోకమహావిపద్దǂశాలోకను లై
యాలోకపాలు రందఱు, నాలోకశరణ్యుఁ గాన ǂ నరిగిరి భీతిన్. 275

1 త్రిరాత్రోపవాసంబులఁ గృత.

వ. అట్లరిగి నారాయణు నుద్దేశించి కృతప్రణాములై కరంబులు ముకుళించుకొని యిట్లనిరి. 276

చ. హరి పరమాత్మ కేశవ చరాచరభూతశరీరధారివై
పరఁగుదు వీవు నిట్టులుగఁ బ్రాణనిరోధము లెందు మున్ను నే
మెఱుఁగ మనాథనాథ జగదీశ్వర సర్వశరణ్య నీపదాం
బురుహము లర్థిమై శరణు పొందెద మార్తి హరించి కావవే. 277

వ. అని దేవతలు విన్నవించిన నీశ్వరుండు వారల కిట్లనియె నుత్తానపాదుం డను వానితనయుండు విశ్వరూపుఁడ నయిననాయందుఁ దనచిత్తం బైక్యముసేసి తపంబు గావించుచుండ దానం జేసి భవదీయప్రాణనిరోధం బయ్యె నట్టిదురత్యయం బైనతపంబు నివర్తింపఁజేసెద వెఱవక మీమీనివాసంబులకుం జనుం డని యానతిచ్చిన నాదేవతలు నిర్భయాత్ములై యీశ్వరునకుం బ్రణామంబు లాచరించి త్రివిష్టపంబునకుం జనిరి తదనంతరంబ. 278

సీ. హరి యీశ్వరుండు విహంగకులేశ్వరయానుఁడై నిజభృత్యుఁడైన ధ్రువుని
గనుఁగొను వేడుకఁ జనియింప నామధువనమున గప్పుడు సని ధ్రువుండు
పరువడి యోగవిపాకతీవ్రం బైన బుద్ధిచే నిజమనోంబురుహముకుళ
మందుఁ దటిత్ప్రభాయతమూర్తి యటఁ దిరోధానంబునను బొంది తత్క్షణంబ

తే. తనపురోభాగమందు నిల్చినను బూర్వ
సమధికజ్ఞాననయనగోచరసమగ్ర
మూర్తిఁ గనుఁగొని సంభ్రమమునను సమ్మ
దాశ్రువులు రాలఁ బులకీకృతాంగుఁ డగుచు. 279

—సాక్షాత్కరించిన భగవంతుని ధ్రువుండు స్తుతించుట.—

తే. నయనముల విభుమూర్తిఁ బానంబు సేయు
పగిదిఁ దనముఖమునను జుంబనము సేయు
లీలఁ దగిలి భుజముల నాలింగనంబు
సేయుగతి దండవన్నమస్కృతు లొనర్చె. 280

వ. ఇట్లు దండప్రణామంబు లాచరించి కృతాంజలియై స్తోత్రంబుసేయ నిశ్చయించి స్తుతిక్రియాకరణసమర్థుండు గాకయున్నధ్రువునకును [1]సమస్తభూతంబులకు నంతర్యామి యైనయీశ్వరుం డాతనితలం పెఱింగి వేదమయం బయినతనశంఖంబుచేత నవ్వాలునికపోలతలం బంటిన జీవేశ్వరనిర్ణయజ్ఞుండును భక్తిభావనిష్ఠుండును నగుధ్రువుండు నిఖిలలోకవిఖ్యాతకీర్తి గలయీశ్వరుని (భగవత్ప్రతిపాదితంబులగుచు) [1]వేదాత్మకంబు లైనతనవాక్కుల నిట్లని స్తుతియించె దేవా నిఖిలశక్తిధరుండవు నంతఃప్రవిష్టుండవు నైననీవు లీనంబు లైనమదీయవాక్కులం బ్రా

1 తనవేదస్వరూపంబు లైన.

ణేంద్రియంబులం గరచరణశ్రవణత్వగాదులను జిచ్ఛక్తిచేఁ గృపంజేసి జీవింపం
జేసినభగవంతుండవును బరమపురుషుండవును నైననీకు నమస్కరింతు నీ వొక్క
రుండ వయ్యు మహదాద్యం బైనయీయశేషవిశ్వంబు మాయాఖ్యం బయిన
యాత్మీయశక్తిచేతం (గల్పించి యందుం) బ్రవేశించి యింద్రియంబులం[1]దు
వసించుచుఁ దత్తద్దేవతారూపంబులచే నానాప్రకారంబుల దారువులం దున్న
వహ్నిచందంబునం బ్రకాశింతు వదియునుం గాక. 281

చ. వరమతి నార్తబాంధవ । భవఘ్నసబోధసమేతుఁ డై భవ
చ్చరణముఁ బొందినట్టివిధి । సర్గము సుప్తజనుండు బోధమం
దరయఁగఁ జూచురీతిఁ గను । నట్టిముముక్షుశరణ్యు డైననీ
చరణములం గృతజ్ఞుఁ డగు । సజ్జనుఁ డెట్లు దలంప కుండెడున్. 282

సీ. మహితాత్మ మఱిజన్మ । మరణప్రణాశన, హేతుభూతుండవు । సిద్ధకల్ప
తరువవు నగునిన్నుఁ । దగ నెవ్వ రేనేమి, పూని నీమాయావి । మోహితాత్ము
లగుచు ధర్మార్థకా । మాదులకొఱకుఁ [2]దా, మర్చించుచును ద్రిగు । ణాభ మైన
దేహోపభోగ్య మై । దీపించుసుఖముల, నెనయంగ మదిలోన । నెంతు రట్టి

తే. విషయసంబంధజన్య మై । వెలయుసుఖము, వారికి నిరయమందును । వఱలు దేవ
భూరిసంసారతాపని । వారగుణక, థామృతాపూర్ణ యీశ మా । ధవ ముకుంద.

మ. అరవిందోదర తావకీనచరణ । ధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ । స్వానందకబ్రహ్మమం
దరయన్ లేవట దండభృద్భటవిఘూ । ర్ణనాకీర్ణు లై కూలునా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజన । స్తోమైకచింతామణీ. 284

చ. హరి భజనీయమార్గనియ । తాత్ముకు లై భవదీయరూప మై
వఱలినభక్తియుక్తు లగు । వారలసంగతిఁ గల్గఁజేయు స
త్పురుషసుసంగతిన్ వ్యసన । దుర్భరసాగర మప్రయత్నతన్
సరసభవత్కథామృతర । సంబున మత్తుఁడ నై తరించెదన్. 285

చ. నిరతముఁ దావకీనభజ । నీయపదాబ్జసుగంధలుబ్ధు లె
వ్వారిమదిఁ బొందఁగాఁ గలుగు । వారలు తత్ప్రియమర్త్యదేహము
న్నరయఁ దదీయదారతన । యాదిసుహృద్గృహబంధువర్గమున్
మఱతురు విశ్వతోముఖ ర । మాహృదయేశ ముకుంద మాధవా. 286

సీ. పరమాత్మ మర్త్యసు । పర్వతిర్యఙ్మృగ, దితిజసరీసృప । ద్విజగణాది
సంవ్యాప్తమును సద । సద్విశేషంబును, గైకొని మహదాది । కారణంబు
నైనవిరాడ్విగ్ర । హంబు నే నెఱుఁగుదుఁ, గాని తక్కినసుమం । గళము నైన
సంతతసుమహితై । శ్వర్యరూపంబును, భూరిశబ్దాదివ్యా । పారశూన్య

---

1 జేష్టింపం జేయుచు దారువులందు. 2 గా భజియించుచును గుణప్రభవ మైన.

తే. మైన బ్రహ్మస్వరూప మే నాత్మ నెఱుఁగఁ, బ్రవిమలాకార సంసార భయవిదూర
పరమమునిగేయ సంతత భాగధేయ, నలిననేత్ర రమాలలనాకళత్ర. 287

సీ. సర్వేశ కల్పాంత సమయంబునందు నీ, వఖిలప్రపంచంబు నాహరించి
యనయంబు శేషసహాయుండ వై శేష, పర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీసింధు, జస్వర్ణలోకకంజాతకర్ణి
కందుఁ జతుర్ముఖు నమరఁ బుట్టించుచు, రుచి నొప్పు బ్రహ్మస్వరూపి వైన

తే. నీకు మ్రొక్కెద నత్యంత నియమ మొప్ప, భవ్యచారిత్ర పంకజ పత్రనేత్ర
చిరశుభాకార నిత్యలక్ష్మీవిహార, యవ్యయానంద గోవింద హరి ముకుంద. 288

వ. అట్లు యోగనిద్రాపరవశుండ వయ్యును జీవులకంటె నత్యంతవిలక్షణుండ వై యుండుదు వది యె ట్లనిన బుద్ధ్యవస్థాభేదంబున నఖండితం బయినస్వశక్తిం జేసి చూచులోకపాలననిమిత్తంబు యజ్ఞాధిష్ఠాతవు గావున నీవు నిత్యముక్తుండవును బరిశుద్ధుండవును జిద్రూపకుండవును నాత్మవును గూటస్థుండవును (నాదిపురుషుండవును భగవంతుండవును) గుణత్రయాధీశ్వరుండవును నైవర్తింతువు భాగ్యహీనుం డైనజీవునియందు నీగుణంబులుగలుగ వేసర్వేశ్వరునందే నేమి విరుద్ధగతు లైవివిధ శక్తియుక్తంబు లైనయవిద్యాదు లానుపూర్వ్యంబునం జేసి ప్రలీనంబు లగుచుండు నట్టివిశ్వకారణంబు నేకంబు ననంతంబు నాద్యంబు నానందమాత్రంబు నవికారంబు నగు బ్రహ్మంబునకు నమస్కరించెద మఱియు దేవా నీవు సర్వవిధ ఫలం బని చింతించునిష్కాము లయినవారికి రాజ్యాదికామితంబు లొసఁగ బరమార్థం బయినఫలంబు సర్వార్థరూపుండ వైనభవదీయపాదపద్మసేవనంబ యిట్లు నిశ్చితంబ యైనను సకాము లైనదీనులను గోవు వత్సంబును స్తన్యపానంబు సేయించుచు వృకాదిభయంబువలన రక్షించుచందంబునం గామప్రదుండ వై సంసారభయంబువలనం గాపుదు వని యిట్లు సత్యసంకల్పుండును సుజ్ఞానియు నయినధ్రువునిచేత వినుతింపంబడి భృత్యానురక్తుం డైనభగవంతుండు సంతుష్టాంతరంగుఁ డై యి ట్లనియె. 289

క. ధీరవ్రత రాజన్యకు, మారక నీహృదయమందు మసలినకార్యం
బారూఢిగా నెఱుంగుదు, నారయ నది వొంద రాని దైనను నిత్తున్. 290

వ. అది యెట్టి దనిన నెం దేని మేధియందుఁ బరిభ్రామ్యమాణగోచక్రంబునుం బోలె గ్రహనక్షత్రతారాగణజ్యోతిశ్చక్రంబు నక్షత్రరూపంబు లయినధర్మాగ్నికశ్యపశుక్రులును సప్తర్షులును దారకాసమేతు లై ప్రదక్షిణంబు దిరుగుచుండుదు రట్టి దురాపంబును ననన్యాధిష్ఠితంబును లోకత్రయప్రళయకాలంబునందు నశ్వరంబు గాక ప్రకాశమానంబును నయినధ్రువక్షితి యనుపదంబు ముందట నిరువది యాఱువేలేండ్లు సనం బ్రాపింతువు తత్పదప్రాప్తిపర్యంతంబు భవదీయజనకుండు వనవాసగతుం డైనం దద్రాజ్యంబు పూజ్యంబుగా ధర్మమార్గంబున జితేం

ద్రియుండ వై చేయుదువు భవదనుజుం డగు నుత్తముండు మృగయార్థంబు వనం
బునకుం జని మృతుం డగుటఁ దదన్వేషణార్థంబు తదాహితచిత్తయై తన్మాతయు
వనంబునకుం జని యందు దావదహననిమగ్న యగు వెండియు. 291

సీ. అనఘాత్మ మఱి నీవు । యజ్ఞరూపుం డనఁ, దగు నన్ను సంపూర్ణ । దక్షిణంబు
లగుమఖంబులచేత । నర్చించి సత్యంబు, లగునిహసౌఖ్యంబు । లనుభవించి
యంత్యకాలమున న । న్నాత్మఁ దలంచుచు, మఱి సర్వలోకన । మస్కృతమును
మహిఁ బునరావృత్తి । రహితంబు సప్తర్షి, మండలోన్నత మగు । మామకీన
తే. పదము దగఁ బొందఁ గల వని । పరమపురుషుఁ
డతనియభిలషితార్థంబు । లర్థి నిచ్చి
యతఁడు గనుఁగొను చుండంగ । నాత్మపురికి
గరుడగమనుఁడు వేంచేసెఁ । గౌతుకమున. 292

తే. అంత ధ్రువుఁడును బంకేరు । హాక్షపాద, కమలసేవోపపాదిత । ఘనమనోర
థములఁ దనరియుఁ దనమచి । త్తంబులోన, దుష్టిఁ బొందక చనియె వి । శిష్టచరిత.

క. అని మైత్రేయుఁడు ధ్రువుఁ డ, ట్లనయము హరిచేఁ గృతార్థుఁ । డైనవిధం బె
ల్లను వినిపించిన విదురుఁడు, విని మునివరుఁ జూచి పలికె । వినయం బెసఁగన్.

క. మునినాయక విను కాముక, జనదుష్ప్రాపంబు విష్ణు । చరణాంబురుహా
ర్చనమునిజనసంప్రాప్యము, ననఁ గలపంకేరుహాక్షు । నవ్యయపదమున్. 295

వ. పెక్కుజన్మంబులం గాని పొంద రానిపదంబు దా నొక్కజన్మంబుననే పొంది
యుం దనమనంబునం దప్రాప్తమనోరథుండ నని పురుషార్థవేది యైనధ్రువుం
డెట్లు దలంచె ననిన మైత్రేయుం డి ట్లనియె. 296

తే. అనఘ పినతల్లి దన్నుఁ బ । ల్కినదురుక్త
బాణవిద్ధాత్ముఁ డగుచుఁ ద । ద్భాషణములు
చిత్తమందుఁ దలంచుటఁ । జేసి ముక్తి
గోరమికి నాత్మలో వగఁ । గూరుచుండె. 297

వ. అంత నాధ్రువుండు. 298

చ. అనఘ జితేంద్రియుల్ సుమహి । తాత్ములు నైనసనందనాదు లెం
దనయము నైకజన్మసము । పార్జితయోగసమాధిఁ జేసి యె
వ్వనిచరణారవిందములు । వారనిభక్తి నెఱుంగు చుందు రా
ఘనుఁ బరమేశు నీశు నవి । కారు నమేయు నజయ్యు నాద్యునిన్. 299

వ. ఏను షణ్మాసంబులు భజియించి తత్పాదపద్మచ్ఛాయం బ్రాపించియు భేదదర్శి
నుండ నైతి నక్కటా యిట్టిభాగ్యహీనుండ నైన నేను భవనాశకుం డైనయ
తనిం బొడగనియు నశ్వరంబు లైనకామ్యంబు లడిగితి నిట్టినారాత్మ్యం బెం
దేనిం గలదే తమపదంబులకంటె నున్నతపదంబునం బొందుదునో యని సహిం

పం జాలని యీ దేవతలచేత మదీయమతి కలుషితం బయ్యెం గాక నాఁడు నారదుం డాడిన మాట తథ్యం బయ్యె నతని వాక్యంబు లంగీకరింపక యే నసత్తముండనై స్వప్నావస్థలం బొందినవాఁడు దైవికం బైన మాయం జెంది భిన్నదర్శనుం డగుచందంబున నద్వితీయుండ నైన నను భ్రాత యను శత్రువుచేఁ బ్రాప్తం బైన దుఃఖంబు నొంది జగదాత్మకుండును సుప్రసాదుండును భవనాశకుండును నైన యీశ్వరు నారాధించి తత్ప్రసాదంబు వడసియు నాయుర్విహీనుం డైన రోగికిం బ్రయోగించు నౌషధంబుం బోలె నిరర్థకంబు లై నశ్వరంబు లైన యీ కామితంబులు గోరితి నని వెండియు. 300

మ. ధనహీనుండు నృపాలుఁ జేరి [1]మిగులన్ ధాత్రీఫలీకార మి
మ్మని యర్థించినరీతి ముక్తిఫలదుం డై నట్టి పంకేజలో
చనుఁడే చాలఁ బ్రసన్నుఁ డైన నతనిన్ సాంసారికం బర్థిఁ గో
రిన నావంటి విమూఢమానసులు ధాత్రిం గల్గిరే యెవ్వరున్. 301

ధ్రువుండు మరలఁ దన పురంబునకు వచ్చుట.

సీ. అని యిట్లు చింతించె ననుచు మైత్రేయముని విదురునకు నిట్లనియెఁ దండ్రి
కమనీయహరిపాదకమలరజోభిసంస్కృతశరీరులును యాదృచ్ఛికముగ
సంప్రాప్త మగుదాన సంతుష్టచిత్తులై, వఱలుచు నుండు మీవంటివారు
తగ భగవత్పాదదాస్యంబు దక్కంగ, నితరపదార్థమే యెడఁదలంచు
తే. మఱచియును గోరనొల్లరు మనుచరిత్ర, తవిలి యిట్లు హరిప్రసాదంబు నొంది
మరల వచ్చుచు నున్నకుమారువార్తఁ, జారుచే విని యుత్తానచరణుఁ డంత.

వ. మనమ్మున నిట్లని తలంచె. 303

క. చచ్చినవారలు క్రమ్మఱ, వచ్చుటయే కాక యిట్టివార్తలు గలవే
నిచ్చలు నమంగళుఁడ నగు, నిచ్చట మఱి నాకు శుభము లేల ఘటించున్.

క. అని విశ్వసింప కుండియు, మనమున నానారదుఁడు కుమారుఁడు వేగం
బున రాఁగలఁ డనుచును బలికినపలుకులు దలఁచి నమ్మి కృతకృత్యుం డై.

క. తనసుతుని రాక సెప్పిన, ఘనునకు ధనములును మౌక్తికప్రహారములున్
మన మలర నిచ్చి తనయునిఁ, గనుఁగొనుసంతోష మాత్మఁ గడలుకొనంగన్.

సీ. వలను మీఱిన సైంధవంబులఁ బూన్చిన, కనకరథంబు నుత్కంఠ నెక్కి
బ్రాహ్మణకులవృద్ధబంధుజనామాత్య, పరివృతుం డగుచు విస్ఫురణ మెఱసి
బ్రహ్మనిర్ఘోషతూర్యస్వనశంఖకాహళవేణురవము లందంద చెలఁగ
శిబిక నెక్కియు విభూషిత లై సునీతి సురుచు లుత్తముండు నారూఢి నడవ
తే. గరిమ దీపింప నతిశీఘ్రగమన మొప్ప, నాత్మనగరంబు వెలువడి యరుగుచుండి
బలసి నగరోపవనసమీపంబునందు, వచ్చుధ్రువుఁ గని మేదినీశ్వరుఁ డంత.

---

1 'యడుగన్ దార్కొన్నచో శీఘ్ర మిమ్మని' వ్రా. ప్ర.

చ. అరదము డిగ్గి ప్రేమ దొలఁకాడ ససంభ్రముఁడై రమామనో
హరుచరణారవిందయుగళార్చననిర్దళితాఖిలాఘు నీ
శ్వరకరుణావలోకనసుజాతసమగ్రమనోరథుం సుతుం
గర మనురక్తి డాసి పులకల్ నన లొత్తఁ బ్రమోదితాత్ముఁడై. 308

తే. బిగియఁ గౌఁగిటఁ జేర్చి నెమ్మొగము నివిరి, శిరము మూర్కొని చుబుకంబు సేతఁ బుణికి
యవ్యయానందబాష్పధారాభిషిక్తుఁ, జేసి యాశీర్వదింప నాచిరయశుండు.

క. జనకుని యాశీర్వచనము, లనయముఁ గైకొని ప్రమోదియై తత్పదముల్
దనఫాలతలము సోఁకఁగ, వినతులు గావించి భక్తివిహ్వలుఁ డగుచున్. 310

తే. అంత నాసజ్జనాగ్రణియైన ధ్రువుఁడు, దల్లులకు భక్తి వినతులు దగ నొనర్చె
సురుచి మ్రొక్కిన యర్భకుఁ జూచి యెత్తి, నగుమొగంబున నాలింగనంబు సేసి.

సీ. కరమొప్ప నానందగద్గదస్వరమున, జీవింపు మనుచు నాశీర్వదించె
భగవంతుఁ డెవ్వనిపై మైత్రి వాటించు, సత్కృపానిరతఁ బ్రసన్నుఁ డగుచు
నతనికిఁ దమయంత ననుకూలమై యుండు, సర్వభూతంబులు సమతఁ బేర్చి
మహిఁ దలపోయ నిమ్నప్రదేశములకు, ననయంబుఁ జేరుతోయములపగిదిఁ

తే. గాన ఘను నమ్మహాత్ముని గారవించె, సురుచి పూర్వంబుఁ దలఁపక సుజనచరిత
విష్ణుభక్తులు ధరను బవిత్రు లగుట, వారి కలుగరు ధరణి నెవ్వారు మఱియు.

వ. కావున నుత్తముండును ధ్రువుండును బ్రేమవిహ్వలు లగుచు నన్యోన్యాలింగితులై పులకాంకురాలంకృతశరీరులై యానందబాష్పంబుల నొప్పి రంత సునీతియుఁ దనప్రాణంబులకంటెం బ్రియం బగుసుతు నుపగూహనంబు సేసి తదవయవస్పర్శనంబుచేత నానందంబు నొంది విగతశోక యయ్యె నప్పుడు సంతోషబాష్పధారాసిక్తంబులై చనుఁబాలును గురిసె నంత. 313

సీ. అప్పుడు సంతోష ముప్పతిల్లఁగఁ బౌర,జనము లాధ్రువుతల్లి నెనయఁ జూచి
తొడరినభవదీయదుఃఖనాశకుఁ డైన, యిట్టితనూజుఁ డెం దేనిఁ బెద్ద
కాలంబు క్రిందటఁ గడఁగి నష్టుం డైన, వాఁ డిప్డు నీభాగ్యవశముచేతఁ
బ్రతిలబ్ధుఁ డయ్యెను నితఁడు భూమండల, మెల్లను రక్షించు నిద్ధమహిమఁ

తే. గమలలోచనుఁ జింతించు ఘనులు లోక,దుర్జయం బైన యట్టిమృత్యువును గెల్తు
రట్టిప్రణతార్తిహరుఁ డైన యబ్జనాభుఁ, డర్థి నీచేతఁ బూజితుం డగుట నిజము.

వ. అని ప్రశంసించి రట్లు పౌరజనంబులచేత నుపలాల్యమానుండును (సంస్తూయమానుండును) నగుచు నుత్తానపాదుం డుత్తమసమేతంబుగా ధ్రువుని గజారూఢునిం జేసి ప్రహృష్టాంతరంగుం డగుచుఁ బురాభిముఖుం డై చనుదెంచి. 315

సీ. స్వర్ణపరిచ్ఛదస్వచ్ఛకుడ్యద్వార, రాజితగోపురాట్టాలకంబు
ఫలపుష్పమంజరీకలితరంభాస్తంభ, పూగపోతాదివిభూషితంబు
ఘనసారకస్తూరికాగంధజలబంధు, రాసిక్తవిపణిమార్గాంచితంబు

మానితనవరత్నమయరంగవల్లివి, రాజితప్రతిగృహప్రాంగణంబు
తే. శుభనదీజలకుంభసంశోభితంబు, తండులస్వర్ణలాజాక్షతప్రసూన
ఫల[1]బలివ్రాతకలితవిభ్రాజితంబు, నగుచు సర్వతోలంకృతమైనపురము. 316
వ. ప్రవేశించి రాజమార్గంబునం జనుదెంచునప్పుడు. 317
మ. హరిమధ్యల్ పురకామినీజనులు సౌధాగ్రంబులందుండి భా
స్వరసిద్ధార్థఫలాక్షతప్రసవదూర్వావ్రాతదధ్యంబువుల్
గరవల్లీమణిహేమకంకణరుణత్కారంబు శోభిల్లఁ జ
ల్లిరి యాభాగవతోత్తమోత్తమునిపై లీలాప్రమేయంబుగన్. 318
వ. ఇట్లు వాత్సల్యంబునం జల్లుచు సత్యవాక్యంబుల దీవించుచు సువర్ణపాత్రరచిత మణిదీపనీరాజనంబుల నివాళింపం (బౌరజానపదమిత్రామాత్యబంధుజనపరివృతుం డై) చనుదెంచి. 319
సీ. కాంచనమయమరకతకుడ్యమణిపరి, చ్ఛదవిరాజిస్వచ్ఛసౌధములను
వరసుధాఫేనపాండురసూక్ష్మపరికరో, దాత్తసమంచితతల్పములను
[2]సురతరుశోభితశుకపికమిథునాళి, గానవిభాసితోద్యానములను
సుమహితవైడూర్యసోపానవిమలశో, భితజలపూర్ణవాపీచయముల
తే. వికచకహ్లారదరదరవిందకైర, వప్రదీపితబకచక్రవాకరాజ
హంససారసకారండవాదిజలవి, హంగనినదాభిరామపద్మాకరముల. 320
వ. మఱియును. 321
తే. చారుబహువిధవస్తువిస్తార మొప్ప
నంగనాయుక్త మగుచుఁ బెంపగ్గలించి
యర్థిఁ దనరారుజనకుగృహంబు సొచ్చె
నెలమిఁ ద్రిదివంబు సొచ్చుదేవేంద్రుపగిది. 322
వ. ఇట్లు ప్రవేశించిన రాజర్షి యైనయుత్తానపాదుండు సుతునియాశ్చర్యకరం బైన ప్రభావంబు వినియుం జూచియు మనంబున విస్మయంబు నొంది ప్రజానురక్తుండును బ్రజాసమ్మతుండును నవయౌవనపరిపూర్ణుండును నైనధ్రువుని రాజ్యాభిషిక్తుం జేసి వృద్ధవయస్కుం డై నతన్నుఁ దాన యెఱింగి యాత్మగతిఁ బొంద నిశ్చయించి విరక్తుం డై వనంబునకుం జనియె నంత నాధ్రువుండు శింశుమారప్రజాపతికూఁతు రైన భ్రమి యనుదాని వివాహం బై దానివలనఁ గల్పవత్సరు లను నిద్దఱు గొడుకులం బడసి వెండియు వాయుపుత్త్రి యైనయిల యనుభార్యయందు నుత్కలనామకుం డైనకొడుకు నతిమనోహర యైనకన్యా(రత్నంబు)నుం గనియె నంతఁ దద్భ్రాత యైనయుత్తముండు వివాహంబు లేకుండి మృగయార్థంబు వనంబున కరిగి హిమవంతంబున యక్షునిచేత హతుం డయ్యె నతనితల్లియుఁ దద్దుః

1 పరివ్రాత. 2 సురతప్రశోభిత.

ఖంబున వనంబున కేఁగునెడ గహనదహనుచేత మృతిం బొందె ధ్రువుండు భ్రా
తృమరణంబు విని శోకవ్యాకులితచిత్తుం డై జైత్రం బగురథం బెక్కి యుత్తరా
భిముఖుం డై చని హిమవద్ద్రోణియందు భూతగణసేవితంబును గుహ్యకసంకులం
బును నైనయలకాపురంబు వొడగని యమ్మహాబాహుండు. 323

ధ్రువుండు కుబేరానుచరు లైనగుహ్యకులతో యుద్ధము సేయుట.

మ. ఘనశౌర్యోన్నతితోడ సర్వకకుబ్భాగాకాశంబులందుం బ్రతి
ధ్వను లొలి న్నిగుడంగ శంఖము మహాభవ్యల్లీలఁ బూరింపఁ ద
న్నినదంబు న్విని యక్షకాంతలు భయాక్రాంతాత్మ లై రుగ్రసా
ధను లై యక్షభటుల్ పురి న్వెడలి రుత్సాహంబు సంధిల్లఁగన్. 324

వ. ఇట్లు వెడలి యాధ్రువునిం దాఁకిన. 325

చ. కరము మహారథుండు భుజగర్వపరాక్రమశాలియు న్ధను
ర్ధరుఁడును నైనయాధ్రువుఁడు దన్ను నెదిర్చినయక్షకోటిఁ జె
చ్చెరఁ బదుమూఁడువేల నొకచీరికిఁ గైకొన కొక్కపెట్ట భీ
కరముగ మూఁడుమూఁడుశితకాండములం దగ గ్రుచ్చ నేసినన్. 326

ఉ. వారు లలాటముల్ వగిలి వారక సోలియుఁ దేఱి యమ్మహో
దారుపరాక్రమప్రకటధైర్యముఁ దత్కరలాఘవంబుఁ బ
ల్మాఱు నుతించుచుం గుపితమానసు లై పదతాడితప్రదు
ష్టోరగకోటివోలెఁ జటులోగ్రభయంకరరోషమూర్తు లై. 327

ఉ. ఆరథికోత్తముం దొడరి యందఱు నొక్కటఁ జుట్టు ముట్టి యా
రాఱుశిలీముఖంబులమ నంగములం బగిలించి వెండి వి
స్ఫారగదాశరక్షురికపట్టిసతోమరశూలఖడ్గముల్
సారథియుక్తుఁ డైనరథసత్తముపైఁ గురియించి రేపునన్. 328

వ. అట్లు గురియించిన నతండు. 329

క. పెం పఱి యుండెను ధారా,సంపాతచ్ఛన్ను మైనశైలముభంగి న్
గుంపులు గొని యాకసమునఁ, గంపించుచు నపుడు సిద్ధగణములు వరుసన్.

క. హాహాకారము లెసఁగఁగ, నోహో యీరీతి ధ్రువపయోరుహహితుఁ డు
త్సాహము సెడి యిటు దైత్యస,మూహార్ణవమందు నేఁడు మునిఁగె నకటా.

వ. అని చింతించునవసరంబున. 332

క. తా మాతని గెలిచితి మని, యామనుజాశనులు వలుక నట నీహార
స్తోమము సమయించుమహో,ద్దాముం డగుసూర్యుఁ బోలి తద్దయుఁ దోఁచెన్

వ. అట్లు దోఁచిన. 334

మ. అరిదుఃఖావహ మైనకార్ముకము శౌర్యస్ఫూర్తితోఁ దాల్చి భీ
కరబాణావళిఁ బింజఁ బింజ గఱవంగా నేసి ఝంఝానిలుం

దురుమేఘావళిఁ బోలెఁ దోలుగతి నత్యుగ్రాహితక్రూరబం
ధురశస్త్రావళి రూపు మాపె విలసద్దోర్లీల సంధిల్లఁగన్. 335

చ. మఱియును నమ్మహాత్ముఁ డసమానబలుండు మహోగ్రబాణముల్
గఱి గఱిఁ దాఁక నేసి భుజగర్వ మెలర్ప విరోధివర్గముల్
పఱిపఱి సేసి యంగములు భంగము నొందఁగఁ జేసె వ్రేల్మిడిన్
[1]గిఱికొని పర్వతంబుల నొగిం దెగఁ గొట్టమునింద్రుకైవడిన్. 336

వ. అయ్యవసరంబున. 337

చ. అలఘుచరిత్రుఁ డమ్మనుకులాగ్రణిచే వికలాంగులైన వా
రలసకిరీటకుండలవిరాజితమస్తకకోటిచే సము
జ్జ్వలమణికంకణాంగదలసద్భుజవర్గముచేత సంగర
స్థల మతిరమ్యమై తనరె సంచితవీరమనోహరాకృతిన్. 338

వ. అంత హతశేషులు. 339

క. వరబలుఁ డగుమనుమనుమని, శరసంఛిన్నాంగు లగుచు సమరవిముఖులై
[2]హరిరాజముఁ గని పఱచిన, కరిబృందముఁ బోలెఁ జనిరి కళవళపడుచున్. 340

క. అప్పుడు రాక్షసమాయలు, గప్పిన ధ్రువుఁ డసురవరుల కార్యం బెఱుఁగం
జొప్పడక వారిఁ బొడగని, దెప్పర మగుటయును సారథిం గని యంతన్. 341

క. తలపోయఁగ భువి మాయా, వులకృత్యం బెఱుఁగ నెవ్వ రోపుదు రనుచుం
బలుకుచుఁ దత్పురిఁ జొరఁగాఁ, దలఁపఁగ నది గానరాక తద్దయు మానెన్.

వ. అట్లు పురంబున కరుగుట మాని చిత్రరథుం డైనయాధ్రువుండు సప్రయత్నుం డయ్యును [3]బరప్రతియోగశంకితుం డై యుండె నయ్యెడ మహాజలధిఘోషంబు ననుకరించుశబ్దంబు వినంబడె నంత సకలదిక్తటంబుల వాయుజనితం బయినరజఃపటలంబు దోఁచెఁ దత్క్షణంబ యాకాశంబున విస్ఫురత్తటిత్ప్రభాకలితగర్జారవయుక్తంబు లగుమేఘంబు లమోఘంబులై భయంకరాకారంబులై తోఁచె నంత.

మ. అనయంబుల్ ధ్రువుమీఁద దైత్యకృతమాయాజాల మట్లేచి బో
రన మస్తిష్కపురీషమూత్రపలదుర్గంధాస్థిమేదశ్శరా
సన నిస్త్రింశ శరాసి తోమర గదా చక్ర త్రిశూలాదిసా
ధనభూభృద్భుజగావళిం గురిసె నుద్దండక్రియాలోలతన్. 344

వ. మఱియు మత్తగజసింహవ్యాఘ్రసమూహంబులును నూర్మిభయంకరం బై సర్వతఃప్లవనం బయినసముద్రంబును గానంబడియె వెండియుం గల్పాంత(ంబునందుం బోలె) భీషణం బైనమహాహ్రదంబునుం దోఁచె నివ్విధంబున నానావిధంబులు ననేకంబులును నవిరళభయంకరంబులు నయినయసురమాయలు క్రూరప్రవర్తను

1. 'గిఱిగొనఁ బర్వతంబులఁ బగిల్చుమహాశనికోటిరూపునన్' వ్రా. ప్ర. 2 'హరియక్షముఁ గని' వ్రా. ప్ర. 3 'బరోద్యోగశంకితు' వ్రా. ప్ర.

లగుయక్షులచేత సృజ్యమానంబు లై యడరె నాసమయంబున. 345

క. అనయంబును నయ్యక్షుల, ఘనమాయ నెఱింగి మునినికాయము వరుసన్
మనుమనుమని మను మను మని, మనమునఁ దలఁచుచును దత్పరమతులకున్.

వ. చనుదెంచి యాధ్రువునిం గని యిట్లనిరి. 347

సీ. అనఘాత్త లోకు లెవ్వనిదివ్యనామంబు, సమత నాకర్ణించి సంస్మరించి
దుస్తరంబైనమృత్యువు నైన సుఖవృత్తిఁ, దరియింతు రట్టియీశ్వరుఁడు పరుఁడు
భగవంతుఁడును శార్ఙ్గపాణియు భక్తజ, నార్తిహారుండును నైనవిభుఁడు
భవదీయవిమతులఁ బరిమార్పఁగా కని, పలికిన మునులసంభాషణములు

తే. విని కృతాచమనుఁడయి మాధవవిభునిపాద
కమలముఁ దలంచి రిపుభయంకరమహోగ్ర
కలితనారాయణాస్త్రంబుఁ గార్ముకమునఁ
బూనఁ దడవఁ దదీయసంధానమునను. 348

తే. కడఁగి గుహ్యకమాయాంధకారమపుడు, వెరవు సెడి దవ్వుదవ్వుల విరిసి పోయె
విమల మైనవివేకోదయమునఁ జేసి, సమయు రాగాదికంబులసరణి నంత. 349

మ. వరనారాయణబాణరాడ్జనితదుర్వారప్రభాహేమపుం
ఖరుచిస్ఫారమరాళరాజసితపక్షక్రూరధారారణ
చ్ఛరసాహస్రము లోలి భీషణవిపక్షశ్రేణిపై వ్రాలె భీ
కరరావంబునఁ గానఁ జొచ్చుశిఖిసంఘాతంబుచందంబునన్. 350

వ. అట్లేసిన. 351

చ. ఖరనిశితప్రదీప్తఘనకాండపరంపరవృష్టిచేఁ బొరిం
బొరి వికలాంగు లై యడరి పుణ్యజనుల్ పృథుహేతిపాణు లై
గరుడునిఁ జూచి భూరిభుజగప్రకరంబు లెదిర్చి పేర్చి చె
చ్చెర నడతెంచుచందమునఁ జిత్రరథుం బలు పూని తాఁకినన్. 352

ఉ. వారలఁ జండతీవ్రశరవర్గముచేత నికృత్తపాదజం
ఘోరుశిరోధరాంబకకరోదరకర్ణులఁ జేసి యోగిపం
కేరుహమిత్రమండల[1]నికృద్భిద నెట్టిపదంబుఁ జెందు నా
భూరిపదంబునం బెలుచఁ బొందఁగఁ బంపె భుజావిజృంభి యై. 353

వ. ఇవ్విధంబున నాచిత్రరథు(ండగుధ్రు)వు)నిచేత నిహన్యమానులును నిరపరాధులు
ను నయినగుహ్యకులం జూచి యతనిపితామహుండైనస్వాయంభువుండు [2]ఋషి
గణపరివృతుండై చనుదెంచి ధ్రువునిం జూచి యిట్లనియె వత్సా నిరపరాధులైన
యీపుణ్యజనుల నెట్టిరోషంబున వధియించితి విట్టి[3]నిరయహేతు వైనరోషంబు
చాలుఁ భ్రాతృవత్సల భ్రాతృవధాభీత వ్రుండ వై కావించునీయత్నం బుడుగు మని.

1 'నికృత్తత నేమిపదంబు' వ్రా. ప్ర. 2 ఋచిసమేతుం డై. 3 నిరహేతు వైనరోష' వ్రా. ప్ర.

క. అనఘా మనుకులమున కిది, యనుచితకర్మంబ యొకనికై పెక్కండ్రి
ట్లని మొనఁ ద్రుంగిరి యిది నీ, కనయంబును వలవ దుడుగుమయ్య కుమారా.

వ. అదియునుం గాక దేహాభిమానంబునం బశుప్రాయులై భూతహింస గావించుట
హృషీకేశానువర్తు లయిన సాధువులకుం దగదు నీవు సర్వభూతంబుల నాత్మభావం
బునఁ (దలఁచి) సర్వభూతావాసుండును దురారాధ్యుండును నైన విష్ణుని పదంబులఁ
బూజించి తత్పరమపదంబునం బొందితి వట్టి భగవంతుని హృదయంబున (ననుధ్యా
తుండవు) భాగవతులచిత్తంబులకును (సమ్మతుండవు మఱియు) సాధువర్తనుండ
వన నొప్పు నీ వీపాపకర్మం బెట్లు సేయ సమకట్టితి వేపురుషుం డైన నేమి మహా
త్ములయందుఁ దితిక్షయు సములయందు మైత్రియు హీనులయందుఁ గృపయు
నితరంబు లగు సమస్తజంతువులయందు సమత్వంబును గలిగి వర్తించువాని
యందు సర్వాత్మకుం డైన భగవంతుండు ప్రసన్నుం డగు నతండు ప్రసన్నుం
డయిన వాఁడు ప్రకృతిగుణంబులం బాసి లింగశరీరభంగంబు గావించి బ్రహ్మా
నందంబునం బొందు నదియునుం గాక కార్యకారణసంఘాతరూపం బయిన విశ్వం
బయస్కాంతసన్నిధానంబు గలిగిన లోహంబు చందంబున నే సర్వేశ్వరుండు నిమి
త్తమాత్రంబుగాఁ బరిభ్రమించు నట్టి యీశ్వరుని మాయాగుణవ్యతికరంబున నా
రబ్ధంబు లయిన పంచభూతంబులచేత యోషిత్పురు)షవ్యవాయంబువలన యోషి
త్పురు)షాదిరూప(సంభూతి యగు నివ్విధంబునఁ ద)త్సర్గంబుఁ దత్సంస్థానంబుఁ
దల్లయంబు నగుచు నుండు నిట్లు దుర్విభావ్యుం డైన కాలశక్తిం జేసి గుణక్షోభం
బున విభజ్యమానవీర్యుండు ననంతుండు ననాదియు నై జనంబులచేత జనంబులం
బుట్టించుచుండుటం జేసి జగదాదికరుండును మృత్యుహేతువు లగు జనంబుల ల
యంబు నొందించుటం జేసి యంతకరుం[1]డును ననాది యగుటం జేసి యవ్యయుం
డును నైన భగవంతుండు జగత్కారణుం డగుం గావున నీసృష్టిపాలనవిలయంబు
లం గర్త గానివాఁడునుం బలెఁ జేయుచుండు నిట్లు మృత్యురూపుండును బరుం
డును సమవర్తియు నైన యీశ్వరునికి స్వపక్షపరపక్షంబులు లే వతనికిఁ గర్మా
ధీనంబు లయిన భూతసంఘంబును మహావాయువు ననుసరించు రజంబులచా
డ్పున (నస్వతంత్రంబు లగుచు) ననువర్తించు నతండును (జంతుచ)యాయురుప
చయాపచయకరణంబులం దస్పృష్టుండును (నగు జీవుండు) కర్మబద్ధుం డగుఁ(టం
జేసి కర్మంబ) వానికి నాయురుపచయాపచయంబులం జేయుచుండు మఱియు
(సర్వజగత్కర్మసాక్షి యగు) సర్వేశ్వరుని. 356

క. కొందఱు కర్మం బందురు, కొందఱు స్వాభావ్య మండ్రు కొందఱు కాలం
బందురు కొందఱు దైవం, బందురు కొంద ఱొగిఁ గామ మండ్రు మహాత్మా.

వ. ఇట్టు లవ్యక్తరూపుండును నప్రమేయుండును నానాశక్త్యుదయహేతుభూతుం

---

1 డు నై యవ్యయుం డైనభగ.

డును నైనభగవంతుండు సేయుకార్యంబులు బ్రహ్మరుద్రాదు లెఱుంగ రఁట యతనితత్త్వంబు నెవ్వ రెఱుంగ నోపుదు [1]రాభగవంతుండు సృష్టిస్థితిలయంబులు సేయు చుండియు ననహంకారుం డగుట గుణకర్మంబులం బొరయఁడు సర్వభూతాత్ముండును సర్వభూతనియంతయు సర్వభూతభావనుండు నైనభగవంతుండు తనమాయతోడఁ గూడి భూతసృష్టిస్థితిసంహారంబులు సేయుచుండుఁ గావునఁ బుత్రా యీ సృష్ట్యుత్పత్తిస్థితిలయంబులకు దైవంబు కారణం బై యుండ నీధనదానుచరులు భవదీయభ్రాతృహంత లగుదు రే యదియునుంగాక యీ ప్రజాపతులు విశ్వసృణ్ణామంబుల నియంత్రితు లై ముకుఁద్రాళ్లు వెట్టినపశువులుం బోలె నెవ్వనియాజ్ఞాధీనకృత్యు లై వర్తింతు రట్టిదుష్టజనమృత్యువును సుజనామృతస్వరూపుండును సర్వాత్మకుండును జగత్పరాయణుండును నైనయీశ్వరుని సర్వప్రకారంబుల శరణంబుఁ బొందు మదియునుం గాక. 358

సీ. అనఘాత్మ నీవు పంచాబ్దవయస్కుండ, వై పినతల్లి నిన్నాడినట్టి
మాటల నిర్భిన్నమర్ముండ వగుచును, జనయిత్రి దిగనాడి వనము కేఁగి
తపమునఁ జేసి యచ్చపుభక్తి నీశ్వరుఁ, బూజించి మహితవిభూతి మెఱసి
రమణఁ ద్రిలోకోత్తరం బైనపదమును, బొందితి వది గాన భూరిభేద
తే. రూప మైనప్రపంచంబు రూఢి నేను, నాత్మనందుఁ బ్రతీత మై యలరు నట్టి
యగుణుఁ డద్వితీయుండును నక్షరుండు, నైనయీశ్వరుఁ బరమాత్మ ననుదినంబు.
సీ. కైకొని శుద్ధంబు గతమత్సరంబును, నమలంబు నగుహృదయంబునందు
పొలవ కన్వేషించుచును బ్రత్యగాత్ముండు, భగవంతుఁడును బరబ్రహ్మమయుఁడు
నానందమాత్రుండు నవ్యయుఁ డుపపన్న, సకలవీర్యుండును సగుణుఁ డజుఁడు
నయిన సర్వేశ్వరు నం దుత్తమం బైన, సద్భక్తిఁ జేయుచు సమత నొప్పి
తే. రూఢి సోహమ్మ మేతిప్రరూఢమగుచు, ఘనత కెక్కువవిద్య యన్ గ్రంధి నీవు
ద్రెంచి వైచితి కావున ధీవరేణ్య, సర్వశుభహాని యైనరోషంబు వలదు. 360
క. విను రోషహృదయుచేతను, ననయము లోకము నశించు నౌషధములచే
ఘనరోగములు నశించిన, యనువున నది గాన రోష మడఁపు మహాత్మా. 361
తే. అనఘ నీదుసహోదరహంత లనుచుఁ, బెనఁచి యీపుణ్యజనులఁ జంపితి కడంగి
పరఁగ నిది యె సదాశివభ్రాత యైన, యర్థవిభునకు నపరాధ మయ్యెఁ గాన.
క. నతినుతులచేత నీ విపు, డతనిఁ బ్రసన్నునిఁగ జేయు మని మనువు దయా
మతిఁ జెప్పి ధ్రువునిచే స, త్కృతుఁ డై నయ మొప్పఁ జనియె ఋషియుక్తుం డై.
వ. అంత. 364

2 'భూతాత్మకుండు భూతేశుండు భూతభావనుండు సర్వేశ్వరుండుఁ బరాపరుండు నగునీశుండు మాయాయుక్తుం డై స్వశక్తిచే సృష్టిస్థితిలయంబులం జేయు నయిన నహంకారంబునం జేసి గుణకర్మంబులచే నస్పృశ్యుం డగుచు వర్తించు నదియునుం గాక' అ. ప్ర.

తే. యక్షచారణసిద్ధవిద్యాధరాది, జనగణస్తూయమానుఁడై ధనదుఁ డంతఁ
బుణ్యజనవైశసనివృత్తుఁ బూరిరోష, రహితుఁడై నట్టిధ్రువునిఁ జేరంగ వచ్చె.

సీ. చనుదెంచి వెసఁగృతాంజలి యైనధ్రువుఁ జూచి, తివుటనిట్లని యె క్షత్రియకుమార
తగ భవదీయపితామహాదేశంబు, నను దుస్త్యజం బైనఘనవిరోధ
ముడిగితి వటు గాన యొనరంగ నిపుడు నీ, యందుఁ బ్రసన్నుండ నైతి భూత
జననలయంబుల కనయంబుఁ గాలంబె, కర్త యై వర్తించుఁ గాన యుష్మ

తే. దనుజుఁ జంపినవార లీయక్షవరులు, గారు తలపోయ నీయక్షగణము నిట్లు
నెఱి వధించినవాఁడవు నీవు గావు, వినుతగుణశీల మాటలు వేయు నేల. 366

వ. అదియునుం గాక యేఁబుద్ధిం జేసి కర్తృసంబంధదుఃఖా(దిక)ంబులు దేహాత్మానుసంధానంబునం జేసి సంభవించు నట్టియహంత్వమ్మను నపార్థజ్ఞానంబు స్వప్నమందుం బోలెఁ బురుషునకుం దోఁచు నది గావున సర్వభూతాత్మవిగ్రహుండును నధోక్షజుండును భవచ్ఛేదకుండును భజనీయపాదారవిందుండును ననంతామేయశక్తియుక్తుండును గుణమయాత్మమాయావిరహితుండును నైనయీశ్వరుని సేవింపుము నీకు భద్రం బయ్యెడు భవదీయమనోగతం బైనవరంబుఁ గోరుము నీ వంబుజనాభపాదారవిందసేవనంబుఁ దిరంబుగఁ జేయుదు వని యెఱుంగుదు ననిన రాజరాజుచేత నట్లు మహామతియు భాగవతోత్తముండు నైనధ్రువుండు ప్రేరేపింపంబడి యేహరిస్మరణంబుచేత నప్రయత్నంబున దురత్యయం బైనయజ్ఞానంబుఁ దరియింతు రట్టిహరిస్మరణం (బచలితం బగున ట్లొసంగు మని యడిగిన నట్ల కాక యని) యంగీకరించి యంతం గుబేరుండు సంప్రీతచిత్తుం డయి ధ్రువునికి శ్రీహరిస్మరణం బట్లుపదేశించి యంతర్ధానంబు నొందె నంత ధ్రువుండు (యక్షకిన్నరకింపురుషగణసంస్తూయమానవైభవుం డగుచు) నాత్మీయపురంబునకు మరలి చనుదెంచె నంత. 367

సీ. గణుతింప భూరిదక్షిణలచేఁ గడు నొప్పు, యజ్ఞముల్ సేయ నయ్యజ్ఞవిభుఁడు
ద్రవ్యక్రియాదేవతాఫలరూపస, త్కర్మఫలప్రదాతయును నైన
పురుషోత్తముని నర్థిఁ బూజించి మఱియు స, ర్వోపాధివర్జితుఁ డుత్తముండు
సర్వాత్మకుఁడు నగుజలజాక్షునందుఁ దీ, వ్రం బై ప్రవాహరూపంబు నైన

తే. భక్తి నలుపుచు నఖిలప్రపంచమందు, నలరఁ దనయందు నున్నమహాత్ము హరిని
జిదచిదానందమయుని లక్ష్మీవరుఁ బరము, నీశ్వరేశ్వరుఁ బొడగనె సిద్ధచరిత.

వ. ఇట్లు సుశీలసంపన్నుండును బ్రహ్మణ్యుండును ధర్మసేతురక్షకుండును దీనవత్సలుండు నయి యవని పాలించుధ్రువుండు దన్నుఁ బ్రజలు దండ్రి యని తలంప నిరువదియాఱువే లేండ్లు భోగంబులచేతం బుణ్యక్షయంబును నభోగంబు లైనయాగాదులచేత నశుభక్షయంబునుం జేయుచు బహుకాలంబు దనుకఁ ద్రివర్గసాధనంబుగా రాజ్యంబు సేసి కొడుకునకుఁ బట్టంబు గట్టి యచలితేంద్రియుం డై య

విద్యారచితస్వప్నగంధర్వనగరోపమం బయిన దేహాదికం బగువిశ్వంబు భగవన్మా
యారచితం బని యాత్మం దలంచుచు వెండియు. 369

చ. మనునిభుఁ డంత భృత్యజనమంత్రిపురోహితబంధుమిత్రనం
దనపశువిత్తరత్నవనితాగృహరమ్యవిహారశైలవా
రినిధిపరీతభూతలహరిద్వీపముఖ్యపదార్థజాలముల్
ఘనమతిచే ననిత్యములు గాఁ దలపోసి విరక్తచిత్తుఁడై. 370

సీ. పురము వెల్వడి చని పుణ్యభూబదరికా, ఘనవిశాలానదీకలితమంగ
ళాంబుపూరంబుల ననురక్తిమైఁ గ్రుంకి, కమనీయపరిశుద్ధకరణుఁ డగుచుఁ
బద్ధాసనస్థుఁడై పవనుని బంధించి, నెలకొని ముకుళితనేత్రుఁ డగుచు
హరిరూపవైభవధ్యానంబు సేయుచు, భగవంతు నచ్యుతుఁ బద్మనేత్రు

తే. నందు సతతంబు నిశ్చలమైనయట్టి
భక్తిఁ బ్రవహింపఁ జేయుచుఁ బరమమోద
బాష్పధారాభిషిక్తుండు భవ్యయశుఁడుఁ
బులకితాంగుండు నగుచు నిర్మలుఁ దనర్చి. 371

వ. మఱియు విగతక్లేశుండును ముక్తలింగుండును నైన ధ్రువుండు తన్నుఁ దా మఱచి యుండుసమయంబున దశదిక్కుల నుద్యద్రాకానిశానాయకుండునుంబోలె వెలింగించుచు నాకాశంబుననుండి యొక్కవిమానంబు సనుదేర నందు దేవశ్రేష్ఠులును జతుర్భుజులును రక్తాంబుజేక్షణులును శ్యామవర్ణులును గదాధరులును సువాసులును గిరీటహారాంగదకుండలధరులును గౌమారవయస్కులును నుత్తమశ్లోకకింకరులు నయినవారల నిద్దఱం గని సంభ్రమంబున లేచి మధుసూదననామంబులు సంస్మరించుచు వారల భగవత్కింకరులం గాఁ దలంచి దండప్రణామంబు లాచరించినం గృష్ణపాదారవిందవిన్యస్తచిత్తుండుఁ గృతాంజలియు వినమితకంధరుండు నైన ధ్రువునిం గనుంగొని పుష్కరనాభభక్తు లైన సునందనందులు ప్రీతియుక్తులై మందస్మితు లగుచు నిట్లనిరి. 372

ఉ. ఓనృప నీకు భద్ర మగు నొప్పగు చున్నమదీయవాక్యముల్
వీనులయందుఁ జొన్పుము వివేకముతో నయిదేండ్లనాఁడు మే
ధానిధి వై యొనర్చినయుదాత్తతపోవ్రతనిష్ఠచేతఁ దే
జోనయశాలి వైనమధుసూదనుఁ దృప్తి వహింపఁ జేయవే. 373

ఆ. అట్టిశార్ఙ్గపాణి యఖిలజగద్భర్త, దేవదేవుఁ డతులదివ్యమూర్తి
[1]మమ్ముఁ బనుప మేము మాధవపదమున, కర్థి నిన్నుఁ గొనుచు నరుగుటకును.

వ. వచ్చితిమి యేపదంబు నేని సూరిజనంబులు (సర్వోత్తమంబని) పొందుదురు దేనిఁ జంద్రదివాకరగ్రహనక్షత్రతారాగణంబులు ప్రదక్షిణంబుగాఁ దిరుగుచుండు

1 పార్షదులము మేము భగవత్పదంబున.

(మఱియు నీదుపితరులచేతను నన్యులచేతను ననధిష్ఠితంబును జగద్వంద్యంబును భక్తజనార్తి([1]దుర్జయంబును నయినవిష్ణుపదంబుం బొందుదువు రమ్మిదె విమానశ్రేష్ఠం బుత్తమశ్లోకజనమౌళిమణి యైనశ్రీహరి పుత్తెంచె దీని నెక్క నర్హుండ వనిన నురుక్రమప్రియుం డయినధ్రువుండు తన్మధురవాక్యంబులు విని కృతాభిషిక్తుం డయి యచ్చటిమునులకుఁ బ్రణమిల్లి తదాశీర్వాదంబులు గైకొని విమానంబునకుం బ్రదక్షిణార్చనంబులు గావించి హరిపార్షదు లైనసునందనందులకు వందనం బాచరించి భగవద్రూపవిన్యస్తచక్షురంతఃకరణాదికుం డగుచు విమానాధిరోహణంబు గావించుటకు హిరణ్మయరూపంబు ధరియించె నప్పుడు. 375

క. సురదుందుభిపణవానక, మురజాదులు మొరసె విరులముసురు గురిసెఁ గి
న్నరగంధర్వులపాటలు, భరితము లై చెలఁగె నపుడు భవ్యచరిత్రా. 376

వ. అట్టిసమయంబున ధ్రువుండు దుర్గమం బగుత్రివిష్టపంబునకు నేఁగువాఁ డగుచు దీన యగుజనని డిగనాడి యెట్లు వోవుదు నని చింతించువానిం బార్షదు లవలోకించి యగ్రభాగంబున విమానారూఢ యై యేఁగుచున్నజననిం జూపిన సంతుష్టాంతరంగుం డగుచు. 377

క. జనని సునీతిని మున్నిడి, కొని యతులవిమాన మెక్కి కొనకొని విబుధుల్
దనమీఁదఁ బుష్పవర్షము, లనయముఁ గురియింప ధ్రువుఁడు హర్షముతోడన్.

క. చని చని వెసగ్రహమండల, మును ద్రైలోక్యంబు సప్తమునిమండలముం
ఘనుఁ డుత్తరించి యవ్వలఁ, దనరెడుహరిపదము నొందెఁ దద్దయుఁ బ్రీతిన్.

వ. అది మఱియు నిజకాంతిచేతం ద్రిలోకంబులం బ్రకాశింపం జేయుచు నిర్దయాగమ్యంబును శాంతులు సమదర్శనులు శుద్ధులు సర్వభూతానురంజనులు నచ్యుతభక్తబాంధవులు నయినభద్రాచారులకు సుగమ్యంబును నయి గంభీరవేగంబు ననిమిషంబు నగుజ్యోతిశ్చక్రమంబు సమాహితం బై గోగణంబు మేధియందుం బోలె నెందుఁ బరిభ్రమించుచుండు నట్టియచ్యుతపదంబునం బొంది విష్ణుపరాయణుం డైనధ్రువుండు త్రిలోకచూడామణి యై యొప్పుచుండె నప్పుడు భగవంతుం డైననారదుండు ధ్రువునిమహిమం గనుంగొని ప్రచేతస్సత్త్రంబునందు వీణ వాయించుచు. 380

సీ. పతియె దైవంబుగా భావంబులోపలఁ, దలఁచుసునీతి నందనుతపఃప్ర
భా[2]వముక్రియ ధర్మభవ్యనిష్ఠలఁ బొందఁ, జాలు బ్రహ్మర్షి జనము లనిన
క్షత్త్రియకులు లెన్నఁగా నేల యెవ్వఁడు, పంచసంవత్సరప్రాయమునను
సురుచిమరుక్త్యగ్రశరభిన్నహృదయుఁ డై, మద్వాక్యహితబోధమహిఁ దనర్చి

తే. వనమునకు నేఁగి హరిభక్తివశత నొంది, యజితుఁ డగుహరి తనవశుఁ డై చరింపఁ
జేసి వెసఁ దత్పదంబును జెందె నట్టి, హరిపదంబును బొంద నెవ్వరికిఁ దరము.

1 నట్టిదుర్జయంబును. 2. భగవద్ధర్మ.

క. అని పాడె ననుచు విదురున, కనఘుఁడు మైత్రేయుఁ డనియె నంచితభక్తిన్
వినుతోద్దామయశస్కుం, డనఁ గల యా ధ్రువునిచరిత మార్యస్తుత్యా. 382

సీ. మహితసత్పురుషసమ్మతమును ధన్యంబు, స్వర్గప్రదంబు యశస్కరంబు
నాయుష్కరంబుఁ బుణ్యప్రదాయకమును, మంగళకర మఘమర్షణంబు
సౌమనస్యముఁ బ్రశంసాయోగ్యమును బాప, హరమును ధ్రువపదప్రాపకంబు
నై యొప్పునీయుపాఖ్యానంబుఁ దగ నీకు, నెఱిఁగించితిని దీని నెవ్వఁ డేనిఁ

తే. దివుట శ్రద్ధాగరిష్ఠుఁడై తీర్థపాద
చరణసరసీరుహద్వయాశ్రయుఁడు నైన
భవ్యచరితుఁ[1] దినాంతప్రభాతవేళ
నలఘుమతిఁ బూర్ణిమావాస్యలందు మఱియు. 383

తే. ద్వాదశిని బద్ధబాంధవవాసరమున, శ్రవణనక్షత్రమున దినక్షయమునందుఁ
బరఁగ సంక్రమణవ్యతీపాతలందు, సఫల భక్తిని వినునట్టిసజ్జనులకు. 384

వ. క్లేశనాశంబును మహాప్రకాశంబును నైన భగవద్భక్తియు శీలాదిగుణంబులును గలుగు మఱియుఁ దేజఃకామునకుఁ దేజంబును మనఃకామునకు మనంబును నిష్కామునకుఁ దత్త్వవిజ్ఞానంబును గలుగు దీని వినిపించువారికి దేవతానుగ్రహంబు గలుగు నిట్టియుపాఖ్యానంబు నీ కెఱింగించితి నని మైత్రేయుండు విదురునకుఁ జెప్పినక్రమంబున శుకయోగి పరీక్షిత్తున కెఱింగించిన తెఱంగు సూతుండు శౌనకాదులకు వినిపించి వెండియు నిట్లనియె నట్లు చెప్పినమైత్రేయునిం గని విదురుం డి ట్లనియె. 385

సీ. అనఘాత్మ నారదమునిపతి ధ్రువచరి, త్రము ప్రచేతసులసత్త్రంబునందు
నర్థిమైఁ గీర్తించె నంటి ప్రచేతసు, లన నెవ్వ రెవ్వరి కెఱయఁ బుట్టి
వంశజుల్ సత్త్ర మెవ్వలనను జేసి ర, ధ్వరమందు నిజకులధర్మశీలు
రగు ప్రచేతసులచే యజియింపఁబడునట్టి, యజ్ఞపూరుషుఁ డగు నచ్యుతాంఘ్రి

తే. భక్తియుక్తుఁడు విదితసద్భాగవతుఁడు, దివిరి హరిపాదసేవావిధిప్రయుక్త
దేవదర్శనుఁ డగునట్టిదివ్యయోగి, నారదుం డెట్లు గొనియాడె శౌరికథలు.

క. నా కిపు డెఱిఁగింపుము సు, శ్లోకునిచరితామృతంబు శ్రోత్రాంజలులం
బైకొని జుఱ్ఱియుఁ దనివిం, గైకొన కున్నది మనంబు గరుణోపేతా. 387

క. అని యడిగిన విదురునిఁ గనుఁ, గొని మైత్రేయుండు వలికె గొనకొని ధ్రువుఁడున్
వనమునకుఁ జనిన నాతని, తనయుం డగునుత్కలుండు దనఘుం డై. 388

సీ. చతురుఁ డాజన్మప్రశాంతుండు నిస్సంగుఁ, డును సమదర్శనుండును ఘనుండు
నై యాత్మయందు లోకావలి లోకంబు, లందు నాత్మను జూచు చనఘమైన
యనుపమయోగక్రియాపావకాదగ్ధ, కర్మమలాశయకలనఁ బేర్చి

---

1. 'ఁడు సాయముప్రాతలందు' వ్రా. ప్ర.

జడునికైవడిఁ జీఁకుచందంబునను మూఁగుపగిది నున్మత్తునిభంగిఁ జెవిటి

తే. వడువునను గానఁబడుచు సర్వజ్ఞుఁడై ప్ర, శాంతకీలహుతాశనుకరణిఁ బొల్చి
సతతశాంతంబు సంచితజ్ఞానమయము, నైనబ్రహ్మస్వరూపంబు నాత్మఁదలఁచి.

క. తనకంటె నితర మొకటెఱుఁ, గనికతమున సార్వభౌమకశ్రీఁ బొందన్
మనమునఁ గోరక యుండుటఁ, గని కులవృద్ధులును మంత్రిగణములు నంతన్.

వ. అతని నున్మత్తునింగాఁ దెలిసి తదనుజుండైన వత్సరునికిఁ బట్టంబు గట్టి రా వత్సరునికి సర్వర్థి యనుభార్యయందుఁ బుష్పార్ణుండును జంద్రకేతుండును నిషుండును నూర్జుండును వసువును జయుండును నన నార్వురుతనయులు గలిగి రందుఁ బుష్పార్ణుం డనువానికిఁ బ్రభయు దోషయు ననునిద్దఱు భార్యలై రందుఁ బ్రభ యనుదానికిం బ్రాతర్మధ్యందినసాయంబు లనుసుతత్రయంబును దోష యను దానికిం బ్రదోషనిశీథవ్యుష్టు లనువారు ముగ్గురును బుట్టి రందు వ్యుష్టుఁ డనువానికిఁ బుష్కరిణి యనుపత్నియందు సర్వతేజుం డనుసుతుండు పుట్టె వానికి నాకూతి యనుమహిషివలనఁ జక్షుస్సంజ్ఞుం డయినమనువు జనియించె వానికి నడ్వల యనుభార్యయందుఁ బురువును గుత్సుండును ద్రితుండును ద్యుమ్నుండును సత్యవంతుండును ఋతుండును వ్రతుండును నగ్నిష్టోముండును నతిరాత్రుండును సుద్యుమ్నుండును శిబియును నుల్ముకుండును ననుపన్నిద్దఱు తనయులు గలిగి రందు నుల్ముకునికిఁ బుష్కరిణి యనుదానివలన నంగుండును సుమనసుండును ఖ్యాతియుఁ గ్రతువును నంగిరసుండును గయుండును సత్యవంతుండును నను నార్వురు గొడుకులు పుట్టి రందు నంగునికి సునీథ యనుధర్మపత్నివలన వేనుం డనుపుత్రుం డుదయించిన. 391

మ. క్షితినాథోత్తముఁ డాత్మనందనునిదుశ్శీలంబు వీక్షించి దుః
ఖితుఁడై యొంటిగఁ దప్పురిన్ వెడలి యేఁగెన్ వేగ మొం డేనిఁ ద
ద్గతి వీక్షించి మునీశ్వరుల్ గుపితులై దంభోళిసంకాశవా
క్యతతిన్ జావ శపింప వాఁ డపుడు పోకం గూలె నమ్మేదినిన్. 392

సీ. కైకొని యప్పుడు లోకం బరాజక, మైనఁ బ్రజలు దస్కరపీడఁ బల్లటిల్ల
గనుఁగొని దుఃఖించి మునులు గతాసుఁడై, పడినవేనునివలపలిభుజంబు
నర్థి మథింప నారాయణాంశంబున, నాదిరాజన నొప్పునట్టిపృథుఁడు
జనియించె ననవుడుఁ విని విదురుఁడు మునిఁ, గనుఁగొని పలికె నోయనఘచరిత

తే. సాధువు సుశీలనిధియును సజ్జనుండు, నలఘుబ్రహ్మణ్యుఁడును నైనయట్టియంగ
ధరణివిభునకు దుష్టసంతాన మెట్లు, గలిగె నయ్యంగపతి యేమికారణమున.

వ. విమనస్కుండగుచుఁ బురంబు విడిచె ధర్మకోవిదులైన మునులు దండవ్రతధరుండును రాజునగు వేనునియందు నేపాపంబు నిరూపించి బ్రహ్మదండం బొనర్చిరది యునుంగాక లోకంబున రాజులు లోకపాలతేజోధరులుఁ (బ్రజాపాలనాసక్తులుఁ)

గావునఁ గల్మషంబు గలిగినం బ్రజలచేత [1]నవజ్ఞానర్హు లై యుందురు గావున నా వేనునిచరిత్రంబు శ్రద్ధాగరిష్ఠుండు భక్తుండు నైననాకుం బరాపరవిదగ్రేసరుండ వయిననీ వెఱింగింప నర్హుండ వనిన మైత్రేయుం డతని కిట్లనియె. 393

అంగపుత్రుం డగు వేనునిచరిత్రము.

సీ. అనఘాత్మ రాజర్షి యైనట్టియయ్యంగ, మేదినీవిభుఁ డశ్వమేధమఖము
గావింప ఋత్విజ్నికాయంబుచేత నా,హూత మయ్యును సురవ్రాత మంత
నాత్మహవిర్భాగ మందరా కుండిన, నప్పుడు ఋత్విక్కు లద్భుతంబు
నందుచు యజమానుఁ డైనయయ్యంగమ,హీవరుఁ జూచి రాజేంద్ర యిట్లు
తే. త్రిదశు లిదె పిల్వఁబడియు సంప్రీతి నాత్మ
భాగములఁ బొందరా రైరి భవ్యచరిత
యేమి హేతువొ యిది మాకు నెఱుఁగఁబడదు
కనఁగ హోమంబు దుష్టంబు గాదు మఱియు. 394

వ. శ్రద్ధాయుక్తు లై దృఢవ్రతు లైనయీబ్రహ్మవాదులచేత సంప్రయుక్తంబు లైన యీఛందస్సులు వీర్యవంతంబు లయి యున్నయవి యిందు దేవతాపరాధం బణుమాత్రం బయిన నెఱుంగ మిట్టిచోటం గర్మసాక్షు లయినదేవతలు స్వకీయ భాగంబు లంగీకరింపకుండుటకుఁ గతం బెయ్యదియో యనిన నయ్యంగుండు దుఃఖితస్వాంతుం డై తన్నిమిత్తంబు సదస్యుల నడుగం దలంచి వారలయనుమతిం బడసి మౌనంబు మాని యిట్లనియె. 395

ఆ. అనఘచరితులార యాహూతు లయ్యును, సర్వగణము లాత్మభాగములను
స్వీకరింప రేను జేసినయపరాధ, మెట్టి దనిన వార లిట్టు లనిరి. 396

క. నరనాథా యిది యిప్పుడు, వొరసినదుష్కృతము గాదు పూర్వభవమునం
బరఁగినదురితం బిది యా,దరమున నెఱిఁగింతు మింత ధన్యచరిత్రా. 397

క. నీ వింతవాఁడ వయ్యును, భూవర సంతానలాభమును బొందమి నా
దేవతలు యాగభాగము, లీవేళ భుజింప రైరి యిందుకు నీవున్. 398

తే. పుత్త్రకామేష్టిఁ గావించి పుత్త్రుఁ బడయు, మట్లు సేసిన దేవత లాత్మభాగ
మర్థి నంగీకరింతు రయ్యజ్ఞపురుషు, హరి భజించిన సకలకార్యములుఁ గలుగు.

వ. అనిన నాతండు సంతానార్థంబు శిపివిష్టదేవతాకం బయినపురోడాశంబుచే హోమంబు గావించినం దదీయహోమకుండంబునందు హేమమాల్యాంబరాభరణుం డయినపురుషుండు హిరణ్మయపాత్త్రంబున స్నిగ్ధపాయసంబు గొనుచు నుదయించిన నప్పుడు విప్రానుమతంబున నారాజు దత్పాయసంబు నంజలిచే గ్రహించి సంతోషయుక్తుం డగుచు భార్య కొసంగె నంత. 400

చ. కమలదళాక్షి పాయసముఁ గౌతుక మొప్ప భుజించి భర్తృసం

---

1 నవధ్యు లై యుందురు.

గమమునఁ జేసి తత్తృణామ గర్భముఁ దాల్చి కుమారుఁ గాంచె న
క్కొమరుఁడు నంత మాతృజనకుం డగుమృత్యువుఁ బోలి తా నధ
ర్మమునఁ జరించుచుండె గుణమండన వేనుఁ డనంగ నిచ్చలున్. 401

చ. ఎనయఁగ బాల్యమందుఁ దనయీడుకుమారులఁ గ్రీడఁబోలె నె
మ్మనమున భీతి లేక కృప మాలి పశుప్రకరంబు నొంచుపో
ల్కిని నరికట్టి చంపుచును గిల్బిషలుబ్ధకవృత్తిమై శరా
సనశరముల్ ధరించి మృగజాతి నసాధుగతిన్ వధించుచున్. 402

వ. ఇట్లు మాతామహదోషంబునం బాపప్రవర్తనుం డై చరియించుకొడుకుం జూచి యంగుండు వివిధశాసనంబుల దండించియు నతనిదుశ్చేష్టితంబులు మానుపం జాలక దుఃఖితాత్ముం డై మనంబున. 403

క. అనయము నిట్టికుపుత్రునిఁ, గని పరితాపంబుఁ బొందుకంటెను ధరణి
న్ననపత్యుం డగు టొప్పును, వనజాక్షు భజించునట్టివాఁ డగువాఁడున్. 404

వ. అని వెండియు నిట్లనియె. 405

సీ. జనులకు దుష్పుత్రకునిచేత నపకీర్తి, యు నధర్మమును సర్వజనవిరోధ
మును మనోవ్యథయును ననయంబు ప్రాపించు, నట్టికుపుత్రు మోహమున విడువఁ
జాలక బహుమానసంగతిఁ గను నెవ్వఁ, డతనిగేహంబు దుఃఖాలయంబు
నగు నని మఱియు నిట్లను మనుజుండు శో, కస్థాన మగుపుత్రకతనఁ జేసి

తే. యనుపమక్లేశభాజనం బయినగృహము
విడుచుఁ గావున నిట్టివివేకహీనుఁ
డగుకుపుత్రు సుపుత్రుఁగా నాత్మఁ దలఁతు
ననుచు నారాజు బహుదుఃఖితాత్ముఁ డగుచు. 406

క. తగుసుమహైశ్వర్యోదయ, మగుగృహమును బ్రజల నిద్ర నందినభార్యన్
దిగవిడిచి యెక్కడేనియు, జగతీశుఁడు సనె నిశీథసమయమునందున్. 407

వ. అంతఁ దద్వృత్తాంతం బంతయు సుహృద్బాంధవపురోహితామాత్యప్రభృతు లయినప్రజ లెఱింగి దుఃఖించుచున్నసమయంబున భూమియం దెల్లయెడలఁ దదన్వేషణం బాచరించి గూఢుం డయినపరమపురుషునిం గాన లేనికుయోగి చందంబున నారాజుం బొడగాన లేక విఫలోద్యోగు లయి మగిడి పురంబునకు వచ్చిరి తదనంతరంబ. 408

సీ. సమధికబ్రహ్మనిష్ఠాతిగరిష్ఠు లౌ, భృగ్వాదిమౌనీంద్రబృంద మపుడు
[1]లోకావనైకలోకనోత్సుకు లైన, జనులు స్వరక్షకజనవిభుండు
లేమిఁ బశుప్రాయు లై మెలంగుటఁ గని, యంత వేనునిమాత యగుసునీథ
యనుమతి నఖిలప్రజావళి కప్రియుం, డైన నవ్వేనుఁ బట్టాభిషిక్తుఁ

1 కైకొని లోకరక్షకు నెల్ల నీలోక, జనరక్షకుం డగు జనవిభుండు.

తే. జేసి రంతట మహితోగ్రశాసనుఁ డగు, వేనుఁ బట్టంబు గట్టుట విని సమస్త
[1]తస్కరులు సర్పభీతిచేఁ దలఁగుమూషి,కములకైవడి నడఁగిరి గహనములను.

వ. అంత నతండు. 410

చ. పసువడి నష్టలోకపరిపాలకముఖ్యవిభూతియుక్తుఁ డై
పరఁగి నృపాసనంబున విభాసితుఁ డౌట స్వభావసిద్ధ మై
వఱలుమహావలేపమున వారక సంతతమాననీయస
త్పురుషుల నెల్ల నెంచుఁ బరిభూతులఁ జేయుచు నుండె నిచ్చలున్. 411

చ. మఱియు నతండు భూగగనమార్గములం దొకవేళ నొక్కఁడు
న్నరదము నెక్కి క్రుమ్మరు నిరంకుశవృత్తిఁ జరించు మత్తసిం
ధురవిభుపోల్కి సత్పురుషదూషితవర్తన నొప్పుచున్ నిరం
తరసుజనాపరాధకృతతత్పరమానసుఁ డై క్రమంబునన్. 412

క. దివ్యులు వెఱఁ గందఁగఁ బృథ్వీవ్యోమములు గలగ భేరి వేయించె నయ
ష్టవ్య మదాతవ్య మహో,తవ్యం విప్రా యనుచు నురుదాత్తధ్వనులన్. 413

క. అని యిట్లు భేరీరవ,మునఁ జేసి సమస్తధర్మములు వారింపన్
మును లవినీతుం డగు వే,నునిదుశ్చరితంబు జనమనోభయ మగుటన్. 414

తే. కని కృపాయత్తు లగుచు ని ట్లనిరి యిట్టి
రాజచోరభయంబు లీభూజనులను
బలసి యిరువంకలను బాధ వఱుపఁ జొచ్చె
దారువందులవహ్ని చందమునఁ బెలుచ. 415

చ. అరయ నరాజకం బగుమహాభయముం దొలఁగింపఁ గోరి యి
ట్లెఱుఁగక యీయనర్హుని మహీపతిఁ జేసినయట్టిదోషముం
బరువడిఁ జెందె దుగ్ధచయపానమునం బరివృద్ధి నొందున
య్యురగముభీతి పోషకుని నొందినరీతి ననర్హహేతు వై. 416

వ. అదియునుం గాక. 417

క. మునుకొని సునీథగర్భం,బున జనియించియు స్వభావమున దుర్జనుఁ డై
యెనయఁ బ్రజాపాలనమున,కును బాల్పడి ప్రజల మన్ని గొనఁ జొచ్చెఁ గదే.

వ. అదిగాన యీవేనుండు పూర్వంబున జ్ఞానసంపన్నులచేత రాజుగాఁ జేయంబడియెఁ గావున నిట్టివాని మన మంగళమును గూర్చి ప్రార్థింతము లోకరక్షణార్థం బగుటఁ దద్ద్రోహంబు మనల స్పృశింపదు సమీచీనోక్తులం జేసి పిదప ననునయింప వాని గ్రహింపకుండెనేని మున్న లోకధిక్కారాగ్నిసందగ్ధుం డగువీని మన తేజోమహాగ్నిచేత భస్మీభూతుం జేయుద మని యాలోచించి గూఢమన్యులగుచు వేనునిం గదియం జని యతని కిట్లనిరి. 419

1 జనులు హార్జాంబును గని ♦ చనెడిమూషి,కములకైవడి నడచిరి ♦ గహనములను.

క. నరపాలక నీ కాయువు, సిరియును బలమును యశంబుఁ జేకుఱు వృద్ధిం
బొరయుదు గాకనుచు మనో,హరముగ నాశీర్వదించి యతివినయమునన్. 420

వ. ఇట్లనిరి నరేంద్రా యే మొక్కటి విన్నవించెద మవధరింపుము పురుషులకు వాఙ్మనఃకాయవృత్తులవలన నాచరించుధర్మంబు సమస్తలోకంబులను విశోకంబులం జేయు నసంగు లయినవారికి మోక్షంబు నిచ్చు నట్టిధర్మంబు ప్రజలకు క్షేమకారణంబు గావున నీయందుఁ జెడకుండుం గాక యని పలికి మఱియు ధర్మంబు నాశంబునొందిన నైశ్వర్యంబువలన మోసపోవుటచే రాజు విడువంబడు నని చెప్పి వెండియు నిట్లనిరి దుష్టచిత్తులగునమాత్యులవలనను దస్కరులవలనను బ్రజలు నాశంబు నొందకుండ రక్షించుచు యథాన్యాయంబుగ వారలచేఁ గరంబు గొనుచు నుండుమహీపతి యిహపరసౌఖ్యంబుల నందు నదియునుం గాక యెవ్వనిరాష్ట్రంబున నేపురంబున యజ్ఞేశ్వరుం డయినపురుషోత్తముండు నిజవర్ణాశ్రమోచితం బయినధర్మంబు గలవారిచేత యజియింపంబడు నట్టినిజశాసనవర్తి యగురాజువలన సర్వభూతభావనుండును మహాభాగుండును భగవంతుండును నగుసర్వేశ్వరుండు సంతుష్టుండగు నట్టిసకలజగదీశ్వరుం డైన సర్వేశ్వరుండు సంతోషించిన రాష్ట్రాధిపతికి సర్వసౌఖ్యంబులుఁ బ్రాపించు లోకపాలకు లగువారు సర్వేశ్వరునికొఱకు బలిప్రదానంబులు సేయుదురు సమస్తలోకదేవతాయజ్ఞాదిసంగ్రహుండును వేదమయుండును ద్రవ్యమయుండును దపోమయుండు నగునారాయణుని విచిత్రంబు లైనయజ్ఞంబులచేత యజనంబు సేసిన నీకు నభయం బగు మోక్షంబునుం గలుగుం గావున నీరాజ్యంబున మఖంబులు సేయు మని యాజ్ఞాపింపుము నీదేశంబునఁ జేయంబడినయజ్ఞంబులచేత హరికళాయుక్తంబు లగుదేవగణంబులు సృష్టంబు లై తుష్టంబు లగుచు భవదీయవాంఛితార్థంబుల నిత్తురు గావున దేవతాతిరస్కారంబు నీకు యుక్తంబు గాదు వేదచోదితంబు లగుధర్మంబులం దాసక్తుండవు గ మ్మనిన వేనుం డి ట్లనియె. 421

క. మునులార మీర లిప్పుడు, నను నీగతిఁ బడుచుఁదనమునం బలికితి రై
నను నది యధర్మ మందుల, నెనయఁగ ధర్మ మనఁ గలదె యెచ్చటనైనన్.

వ. అదియునుం గాక. 423

చ. ఎనయఁగ జారకామిని నిజేశుని ముచ్చిలి జారపూరుషుం
దనపతి గాఁ దలంచుగతిఁ దద్దయు మూఢమనస్కు లై తన
ర్చిననరపాలరూపము ధరించినయీశ్వరు నన్నెఱుంగ క
న్యుని భజియింప మీ రిహపరోన్నతసౌఖ్యము లంద రెన్నఁడున్. 424

వ. అని మఱియు నిట్లనియె యజ్ఞపురుషుం డన నెవ్వాం డెవ్వనియందు మీకు భక్తిస్నేహంబు లుదయించె భర్తృస్నేహవిదూరము లైనకుయోషిద్గణంబులు జారునందుఁ జేయుభక్తిచందంబునఁ బలికెద రదియునుం గాక. 425

క. హరి హర హిరణ్యగర్భ, స్వరధీశ్వర వహ్ని శమన జలధిపతి మరు
న్నరవాహన శశి భూ రవి, సురముఖ్యులు నృపశరీరసూచకు లగుటన్. 426

క. పరికించి నను భజింపుఁడు, ధరణీశుఁడు సర్వదేవతామయుఁ డగు మ
త్సర ముడుగుఁడు నాకంటెను, బురుషుఁడు మఱియెవ్వఁ డగ్రపూజార్హుఁ డిలన్.

వ. అది గాన మీరు నాయందు బలివిధానంబులు సేయుం డని పాపకర్ముండు నస
త్ప్రవర్తకుండు విపరీతజ్ఞానుండు నష్టమంగళుండు నగు వేనుండు పండితమాని య
గుచుం బలికి మునులవచనంబులు నిరాకరించి యూరకున్న మునులు భగ్నమ
నోరథులై తమలో నిట్లని రీదారుణకర్ముం డయినపాతకుండు హతుం డగుం
గాక వీఁడు జీవించెనేని వీనిచేత నీజగంబులు భస్మంబులు గాఁగల విది నిశ్చితంబు
దుర్వృత్తుం డగువీఁడు మహారాజసింహాసనంబున కర్హుండు గాఁడు వీఁడు మున్ను
నేసర్వేశ్వరునను గ్రహంబున నిట్టివిభూతియుక్తుం డయ్యె నట్టియజ్ఞపతి యైనశ్రీ
మహావిష్ణుని నిందించుచున్నవాఁడు గావున నిర్లజ్జుం డైనహరినిందకుని హననంబు
సేయ వలయు నని మును లుద్యోగించి యాత్మప్రకాశితం బైనక్రోధంబునం జేసి
హుంకారమాత్రంబున నాయీశ్వరనిందాహతుం డగు వేనునిం బొలియం జేసి
రంత. 428

క. అరసి సునీథయు శోకాతుర యై తనసుతుఁడు దనువుఁ దొఱఁగినఁ దదనం
తరమునను యోగశక్తిం, బరువడి నిజరాజ్య మరసి పరిపాలించెన్. 429

వ. అంత నొక్కనాఁడు. 430

సీ. మునివరేణ్యులు భక్తిఁ దనర సరస్వతీ,సలిలంబులను గృతస్నాను లగుచు
మునుకొని తత్తీరమున నగ్నిహోత్రముల్, విలసిల్ల నియతిఁ గావించి యచటఁ
దవిలి సత్పురుషకథావిశేషంబులు, సలుపుచు నుండంగ సకలలోక
భయదంబు లగుమహోత్పాతముల్ దోఁచిన,మసలి లోకంబు లమంగళములు

తే. పొరయకుండెడుఁ గాకనిబుద్ధిలోనఁ, దలఁచుచుండఁగఁ బెలుచ నుదగ్రమగుచు
సర్వదిశలను బాంసువర్షంబు గురిసెఁ, దస్కరులు సర్వజనులవిత్తములు గొనిరి.

వ. ఇట్టిలోకోపద్రవం బెఱింగి జననాథుం డుపరతుం డగుటం జేసి జనపదంబు లరాజ
కంబులై యన్యోన్యహింసల నొందుచుం దస్కరబాధితంబు లగుచునుండుట యె
ఱింగియుఁ దన్నివారణంబునకు సమర్థు లయ్యును జోరాదిబాధలం గనుంగొనుచు
మునులు వారింపక యుండిరి మఱియు సమదర్శనుండు శాంతుండు మననశీలుం
డు నగుబ్రాహ్మణుండు దీనుల నుపేక్షించిన నతనితపంబు భిన్నభాండగతం బయిన
క్షీరంబుచందంబున క్షయించుం గావున నంగవసుధాధిశవంశోద్భవులు హరిపదా
శ్రయు లగుటం జేసియు నమోఘసత్త్వనిష్ఠు లగుటం జేసియు వీరలవంశంబు వి
చ్ఛిత్తి నొందింప ననర్హంబు గాన స్థాపనీయం బగు నని నిశ్చయించి మృతుం
డైనవేనునికళేబరంబు డగ్గఱ వచ్చి తదూరుమథనంబు గావింప నందు. 432

సీ. ఘనకాకకృష్ణసంకాశవర్ణుండును, హ్రస్వావయవుఁడు మహాహనుండు
హ్రస్వబాహుండును హ్రస్వపాదుండును, నిమ్ననాసాగ్రుండు నెఱయ రక్త
నయనుండుఁ దామ్రవర్ణశ్మశ్రుకేశుండు, నతిదీనవదనుండు నైనయట్టి
యొక్క నిషాదకుం డుదయించి నేమి సేయుదు నని పలుకుచు నున్నఁ జూచి
తే. వరమునులు నిషీద యనుచుఁ బలుకుటయును
దాన వాఁడు నిషాదాభిధానుఁ డయ్యె
నతనివంశ్యులు గిరికాననాళి వేను
కల్మషముఁ దెల్పుచుండిరి కడఁగి మఱియు. 433
క. అనయము ననపత్యుం డగు,మనుజేంద్రుని బాహు లంత మథియించిన నం
దనఘం బగు లోకమిథునము, జనియించెను సకలజనులు సమ్మద మందన్. 434
వ. అందు లోకరక్షణార్థంబు గా నారాయణాంశంబున నొక్క పురుషుండును హరికి
నిత్యానపాయిని యగు లక్ష్మీకళాకలిత (యై గుణంబు లనుభూషణంబులకు నలం
కారప్రదాత్రి) యగు కామినియు జనియించె నందుఁ బృథుశ్రవుండును బృథుయ
శుండు నగుట నతండు పృథుచక్రవర్తి యను పేరం బ్రసిద్ధుం డయ్యె నయ్యంగన
యు నర్చి యనునామంబునం జనుచు నతని వరియించె నాసమయంబున. 435
సీ. అంతంత కురియించి రమరులు మునినాథ,వితతి మోదం బంద విరులవానఁ
బరమానురక్తి శుంభల్లీలఁ జూపట్టె, సురపతివీట నచ్చరలయాట
కర్ణరసాయనక్రమముగ వీతెంచెఁ, బలుపైన తేటికిన్నరులపాట
యనిమిషకరహతం బై చాలఁ జెలఁగెను, విభవోత్సవంబు దుందుభిరవంబు
తే. మునినుతి సెలంగె [1]శిఖి గుండములఁ వెలింగె, నంత నచటికి సరసీరుహాసనుండు
గరుడగంధర్వదేవతాగణముతోడ, నర్థిఁ జనుదెంచె సమ్మోద మతిశయిల్ల.
వ. అంత. 437
కవిరాజవిరాజితము. అరయఁగ వైన్యునిదక్షిణహస్తమునందు రమారమణీయమనో
హరలలితాయుధ[2]చిహ్నము లంఘ్రులయందు సమగ్రహలాంకుశభా
స్వరకులిశధ్వజచాపసరోరుహశంఖవిరాజితరేఖలు వి
స్ఫురగతి నొప్పఁ బితామహముఖ్యులు చూచి సవిస్మయు లైరి తగన్. 438
వ. (ఇతండు నారాయణాంశసంభూతుండు నితనియంగన రమాంశసంభూతయుం గా
నోపుదు రని తలంచి) యయ్యవసరంబున బ్రహ్మవాదు లగు బ్రాహ్మణోత్తము లత
నికి విధ్యుక్తప్రకారంబున రాజ్యాభిషేకంబు గావించిరి తదనంతరంబ. 439
క. సరిదంభోనిధిఖగమృగ,ధరణీసురవర్గపర్వతప్రముఖము లై
పరఁగినభూతశ్రేణులు, నరవరునకుఁ దగ నుపాయనము లిచ్చె నొగిన్. 440
తే. సమధికఖ్యాతి నాపృథుచక్రవర్తి

---

1 రజఃచంద్రములు వెలింగె. 2 చిహ్నాలు పాదములందు.

దేవి యగునర్చితోఁ గూడ దివ్యవస్త్ర
గంధమాల్యవిభూషణకలితుఁ డగుచుఁ
బావకుఁడుఁబోలె సత్ప్రభాభాసి యయ్యె. 441

సీ. రాజరా జాపృథురాజుకు హేమమయం బైనవీరవరాసనంబు
జలపతి జలకణస్రావకం బగుపూర్ణ, చంద్రసన్నిభసితచ్ఛత్రికమును
బవమానుఁ డతులశోభన మగువాలవ్య, జనసముంచితసితచామరములు
ధర్ముండు నిర్మలోద్యత్కీర్తిమయ మగు, మహనీయనవపుష్పమాలికయును

తే. జంభవైరి కిరీటంబు శమనుఁ డఖిల, జననియామకదండంబు జలజభవుఁడు
నిగమమయకవచంబు వాణీలలామ, స్వచ్ఛమగునవ్యహారము సమత నిచ్చె.

సీ. దామోదరుండు సుదర్శనచక్రంబు, నవ్యాహతైశ్వర్య మబ్జపాణి
చంద్రార్ధధరుఁ డర్ధచంద్రరేఖాంకిత, కమనీయకోశసంకలితఖడ్గ
మంబిక శతచంద్రమనుఫలకముఁ జంద్రుఁ, డమృతమయశ్వేతహయచయంబు
ద్వష్ట రూపాశ్రయోదాత్తరథంబును, భానుండు ఘృణిమయబాణములను

తే. [1]శిఖియు నజగోవిషాణసంచితమహోజ, గవ మనం దగుచాపంబు నవని దేవి
యోగమయ మైనపాదుకాయుగము గగన, చరులు గీతంబు లిచ్చిరి సంతసమున.

వ. వెండియుం బ్రతిదివసంబు నాకాశంబు పుష్పంబులు గురియింప మహర్షులు సత్యంబు లైనయాశీర్వచనంబులు సలుప సముద్రుండు శంఖంబును నదంబులు పర్వతంబులు నదులును రథమార్గంబు నొసంగెఁ దదనంతరంబ సూతమాగధవందిజనంబులు దన్ను నుతియించినం బ్రతాపశాలి యగువైన్యుండు మందస్మితసుందరవదనారవిందుం డై చతురవచనుం డగుచు మేఘగంభీరభాషణంబుల వారల కి ట్లనియె. 444

సీ. వందిమాగధసూతవరులార నాయందుఁ, గమనీయగుణములు గలిగె నేని
సర్వంబు నుతిసేయ నవి లేవు నాయందు, నది గాన మీనుతి వ్యర్థమయ్యె
నిటమీఁద గుణముల నేపారి యుండిన, నపుడు నుతించెద రంటి రేని
చతురభాషణు లైనసభ్యులు నుత్తమ, శ్లోకునిగుణము లస్తోకభూప్ర

తే. సిద్ధములు గాన సన్నుతి సేయుఁ [2]డజుని, నతనిబహువిధభావంబు లభినుతింప
నలవిగాకయె యుండుసురదియుఁ గాక, చతురమతులార మాగధజనములార.

వ. మఱియు మహాత్ములగుణంబులు దనయందు సంభావితంబులు సేయుసామర్థ్యంబులు గలిగిన నందు మహాత్ములగుణంబులు ప్రసిద్ధంబులు గావునం దత్సమంబుగా నెట్లు నుతింపవచ్చు నెవ్వండే నొకండు శాస్త్రాభ్యాసంబునం దనకు విద్యాతపోయోగగుణంబులు గలుగు నని పలికిన వానిం జూచి సభ్యులు పరిహసింతు రది కుమతి యగువాఁ డెఱుంగిం డదియునుం గాక. 446

1 శిఖి యజాగోవి. 2 వేళ, లందు సర్వార్చనంబుల...నలవి గా దని.

క. అతిపరిశుద్ధులు లజ్జా,న్వితులు స్వగుణట్టిసభ్యనికరము లాత్మ
స్తుతిపరనిందల దోషము, లతిహేయము లని తలంతు రాత్మ్యు లెపుడున్. 447
క. వందిజనంబులు లోకము,లందును బరిశిష్టకర్ము లగుభూపతులన్
నందించు టవశ్యం బై,నం దగదు నుతింప శిశుజనంబులపగిదిన్. 448
క. అని సూతవందిమాగధ, జను లానరనాయకునివచనములు వినియున్
మునిచోదితు లై క్రమ్మఱ, ననురాగము లుప్పతిల్ల నమ్మనుజేంద్రున్. 449
వ. అమృతోపమానంబు లయినమధురవాక్యంబుల ని ట్లనిరి. 450
క. వేనాంగసంభవుండవు, శ్రీనాథకళాంశజుఁడవు చిరతరగుణస
మ్మానార్హుండ వతర్క్యత, మైనభవన్మహిమఁ బొగడ నలవియె మాకున్. 451
క. అని వెండియు ని ట్లని రై,నను నొకమార్గంబు గలదు నందింప భవ
ద్ఘనచరితామృతపానం,బునఁ జేసియు మునులవచనములఁ జేసి తగన్. 452
వ. శ్లాఘ్యంబు లైనభవదీయచరిత్రంబుల స్తోత్రంబులు సేసెద మని యి ట్లనిరి. 453
సీ. ఈవైన్యుఁ డఖిలలోకావలి ధర్మాను,వర్తనముల నెప్డు వఱలఁ జేసి
ఘనధర్మమార్గవర్తనులతోఁ దుల్యుఁ డై, ధర్మసేతువుఁ బ్రీతిఁ దగిలి ప్రోచు
ధరను శాత్రవులను దండించు నప్టది, క్ప్రాలకావయవసంకలితుఁ డగుచు
నయ్యాయికాలంబులందు భాషణదాన,ములఁ బ్రజారంజనములఁ దనర్చు
తే. [1]సవనసద్వృష్టికరణాదిసక్తుఁ డగుట
నుభయలోకంబులకుఁ బ్రీతి నొదవఁ జేయు
న్యాయమార్గంబునను భూజనాళిధనముఁ
బుచ్చుకొని యిచ్చు సూర్యుఁడుఁబోలె నితఁడు. 454
వ. మఱియును. 455
సీ. సర్వభూతములకు సముఁడు[2]ను బర్యాప్తి,క్రమమున లోకాపరాధములను
నతిశాంతసంయుక్తుఁడై సహించుచునార్తు, లగువారియెడఁ గృపాయత్తుఁడగుచు
నరరూపు దాల్చినహరిమూర్తి గావున, నింద్రుండు వర్షించి యెల్లప్రజల
రక్షించుగతిఁ దాను రక్షించు నమృతాంశు,సన్నిభవదనాబ్జసస్మితాను
తే. రాగమిళితావలోకనరాజిఁ జేసి, సకలజనులకు సంప్రీతి సంభవింపఁ
జేయు సంతతమును గూఢచిత్తుఁ డగుచు, శత్రువరుల కగమ్యుఁ డై సంచరించు.
వ. అని వెండియుఁ బ్రవేశనిర్గమశూన్యమార్గనిరూఢకార్యుండును నపరిమితమహత్త్వా దిగుణగణైకధాముండును సముద్రునిభంగి గంభీరచిత్తుండును సుగుప్తవిత్తుండును వరుణుండునుంబోలె సంవృతాత్ముండును శాత్రవాసహ్యప్రతాపయుక్తుండును దురాసదుండును సమీపవర్తి యయ్యును దూరస్థునిభంగి వర్తించుచు వేనారణిజనితహుతాశనుండు గావున హుతాశనుచందంబున నన్యదుస్స్పర్శనుఁ

1 'సవనకరణాదికాచారసమితిచేత' వ్రా. ప్ర. 2 నై క్రమ మతిక్రమమున.

డును నై చారులవలన సకలప్రాణిబాహ్యాభ్యంతరకర్మంబులం దెలియుచు (దేహ
ధారులకు నాత్మభూతుం డై సూత్రాత్మకుం డైన)వాయువుభంగి వర్తించుచు
నాత్మస్తుతిపరనిందలవలన నుదాసీనుం డగుచు (ధర్మపథంబున వర్తించుచు) నా
త్మీయసుహృద్బంధువులవలనం దప్పు గలిగినను దండించుచు నాత్మశత్రువుల
నైన నదండ్యుల దండింపక ధర్మమార్గగతుం డగుచుఁ దనయాజ్ఞాచక్రం బప్రతి
హతంబగుచు మానసాచలపర్యంతంబు వర్తింప సూర్యుండు నిజకిరణంబులచేత
నెంతపర్యంతంబు భూమిం బ్రకాశింపం జేయు నంతపర్యంతంబు నిజగుణంబులచేత
లోకంబుల రంజిల్లం జేయు నదియునుంగాక ప్రకృతిరంజకంబు లైనగుణంబులచేత
దృఢవ్రతుండును సత్యసంధుండును బ్రహ్మణ్యుండును సర్వభూతశరణ్యుండును
వృద్ధసేవకుండును మానప్రదుండును దీనవత్సలుండును బరవనితామాతృభావ
నుండును దనపత్ని నర్ధశరీరంబుగాఁ దలంచువాఁడును నగుచుం బ్రజలయెడఁ
దండ్రివలెఁ బ్రీతి సేయుచు రక్షించు చుండు మఱియును. 457

సీ. తలపోయ బ్రహ్మవిద్యానిష్ఠజనముల, కనయంబుఁ గింకరుం డైనవాఁడు
నఖిలశరీరగుఁ డాప్తసుహృజ్జన, తానందకరుఁ డన నలరువాఁడు
సంసారఘనకర్మసంగహీనులయందు, సంగసంప్రీతుఁ డై జరగువాఁడు
దుర్మార్గమనుజసందోహంబునకు నుగ్ర,దండధరుం డనఁ దనరువాఁడుఁ

తే. ప్రకృతిపురుషకావేశుఁ డై పరఁగువాఁడు
భగవదవతారయుక్తుఁ డై నెగడువాఁడు
నగుచు వర్తించు సమ్మోద మతిశయిల్లఁ
జారుతరమూర్తి యారాజచక్రవర్తి. 458

వ. మఱియుఁ (ద్రవ్యాధీశుండుఁ) గూటస్థుండుఁ బరమాత్మయు బ్రహ్మకళారూపుండు
నగువాఁడును నై యుదయించెం గావున నితనియందు నవిద్యారచితం బైన
భేదంబు నిరర్థకం బగు నని పెద్ద లగువారలు చూతు రని మఱియు నిట్లనిరి.

సీ. ఉదయాద్రిపర్యంత ముర్వీతలం బేక,వీరుఁ డై రక్షించి వెలయునీతఁ
డేకనాఁడు విజయయాత్రోత్సవం బేపార, సన్నద్ధుఁ డై మణిస్యందనంబు
నెక్కి చాపముఁ బూని దిక్కుల సూర్యుని,పగిదిని శత్రుభూపాలతమము
విరియింతు నని చాల వెలుఁగొందుచును ధరా,చక్రప్రదక్షిణశాలి యగుచుఁ

తే. దిరుగునెడ సర్వదిక్పాలవరసమేత, పార్థివోత్తమనికర ముపాయనంబు
లిచ్చి తనుఁ జక్రపాణిని నెనయునాది, ధరణివిభుఁ డని నుతియించి తలఁతు రెదల.

క. ఈనృపతి ధరాచక్రము, ధేనువు గాఁ జేసి పిదుకు ధృతి నఖిలపదా
ర్థానీకము విబుధులు సన్మానింపఁగఁ బ్రజకు జీవనప్రదుఁ డగుచున్. 461

చ. అమరవరేణ్యుఁ బోలి యనయంబును నీతఁడు గోత్రభేదన

త్వమునఁ జెలంగు చున్న జగదీశ్వరప్రదరాసనశింజినీనినా
దమున విరోధిభూపతులు దల్లడ మంద నసహ్యసింహవి
క్రమమున సంచరించు నని కౌతుక మొప్పఁగఁ బల్కి వెండియున్. 462

వ. ఇట్లనిరి. 463

చ. సకలదిగంతరాళములఁ జారుయశోనిధి యశ్వమేధముల్
ప్రకటముగా [1]శతంబు దగఁ బావన మైనసరస్వతీతటీ
నికటధరిత్రిఁ జేయుతఱి నేర్పున నంతిమయాగమందుఁ గొం
జక మఖసాధనాశ్వమును జంభవిరోధి హరించు నుద్ధతిన్. 464

సీ. ఒకనాఁడు నిజమందిరోపాంతవనమునకుఁ, జని యందు సద్గుణశాలి యైన
ఘనుని సనత్కుమారునిఁ గాంచి యమ్ముని,వరు బ్రహ్మతనయుఁగా నెఱిఁగి భక్తి
బూజించి [2]విజ్ఞానమును బొందు నచ్చటి, బ్రహ్మవేత్తలు మునిప్రవరులవలన
మానితలబ్ధవిజ్ఞాను లై వర్తింతు, రిమ్మహారాజు మహీతలంబు

తే. నందు విశ్రుతవిక్రముఁ డై నయట్టి,తనకథావళి భూప్రజాతతి నుతింప
నక్కడక్కడ వినుచు శౌర్యమున నఖిల,దిక్కులను గెల్చి వర్తించు ధీరయశుఁడు.

వ. ఇట్లు విపాటితవిరోధిశల్యుండును సురాసురజేగీయమాననిజవైభవుండు నై ధరా
చక్రంబున కీతండు రా జయ్యెడి నని యువ్విధంబున స్తోత్రంబు సేసినవందిమా
గధసూతజనంబులం బృథుచక్రవర్తి పూజించి మఱియుం బ్రాహ్మణభృత్యా
మాత్యపురోహితపౌరజానపదతైలికతాంబూలికనియోజ్యప్రముఖాశేషజనంబు
లం దత్తదుచితక్రియలం బూజించె నని మైత్రేయుండు సెప్పిన విని విదురుం డి
ట్లనియె. 466

పృథుచక్రవర్తి గోరూపిణి యగుభూమివలన నోషధులఁ బిదుకుట.

సీ. ఏమినిమిత్త మై భూమి [3]గోరూపిణి, యయ్యె దానికి వత్స మయ్యె నెద్ది
గొనకొని దోహదమునకు నర్హం బైన,పాత్ర మెయ్యది దలఁపంగ దోగ్ధ
యైనయాపృథు వేపదార్థముల్ పిదికెను, బరికింప నవని స్వభావమునను
విషమ మై యుండియు వెలయంగ నేరీతి, సమగతిఁ [4]జెందెను జంభవైరి

తే. క్రతుహయంబును గొనిపోవఁ గార్య మెద్ది,ధీరనిధి యాతఁడు సనత్కుమారువలనఁ
గలితవిజ్ఞానుఁ డగుచు నేగతిని బొందె,ననఘచారిత్ర మైత్రేయ యదియుఁ గాక.

వ. మఱియుఁ (బరబ్రహ్మంబును) భగవంతుండును బుణ్యశ్రవణకీర్తనుండును సర్వ
నియామకుండును నగుకృష్ణునియవతారాంతరాశ్రయం బగుదివ్యకథలను భగ
వంతుం డైనపుండరీకాక్షుండు పృథ్వవతారంబు ధరియించి గోరూపిణి యగు

---

1 'నొనర్చుటకు భారతి సన్నిధనుండి వెండియు న్నకుటిలభక్తిఁ దత్పవన మాదర మొప్పఁగఁ జేయుచుండఁ గొంజక' వ్రా. ప్ర. 2 తత్ఫలములఁ బొందు. 3 'గోరూపయై వఱలెడు దానికి వత్స మెద్ది' వ్రా. ప్ర 4. జేఁపెను.

పృథివిం బిదికినది మొద లగుకథలన్నియు నీకు నధోక్షజునకు దాసుండ నయిన నాకు నెఱిఁగింపు మనిన వాసుదేవకథాసంప్రీతచేతస్కుం డగువిదురుం బ్రశంసించి మైత్రేయుం డి ట్లనియె నట్లు బ్రాహ్మణజనంబులచేత రాజ్యంబునం దభిషిక్తుం డగుచు సకలప్రజాపాలననియుక్తుం డై పృథువు రాజ్యంబు సేయుచుండు నంత (నీరస యగుధరిత్రియం దన్నరహితు లగుచుం) బ్రజలు క్షుత్పీడాక్షీణ
దేహు లై వైన్యునిం జూచి యి ట్లనిరి. 468

క. అరయఁగ నేము బుభుక్షా,పరిపీడం బడితి మయ్య । పైకొని తరుకో
టరజనితవహ్నిచేతను, దరికొనువృక్షములుఁ బోలె । ధరణీనాథా. 469

క. శరణశరణ్యుఁడ వగునిను, శరణము వేఁడెదము మాకు । సత్కృప నన్నం
బరసి కృప సేసి ప్రోవుము, నరనాయక యనుచుఁ బ్రజలు । నతులై పలుకన్.

క. విని దానికి నదుపాయము, జననాయకుఁ డాత్మఁ దలఁచి । సక్రోధుం డై
ధనువున బాణముఁ దొడిగెను, ఘనరౌద్రుం డైన త్రిపుర । ఘస్మరు పగిదిన్. 471

వ. ఇట్లు దొడిగిన. 472

క. మహిపతి నప్పుడు గనుఁగొని,[1]మహి గోరూపమునఁ గంప్య । మానయు నగుచుం
గుహకుం డగులుబ్ధకుఁ గని, గహనంబునఁ బాఱుహరిణి । కైవడిఁ బాఱెన్. 473

వ. ఇట్లు ధరణి పాఱిన నతండు కుపితారుణేక్షణుం డై వెంటం దగిలి నలుదిక్కులను విదిక్కులను భూభాగనభోభాగంబుల నెక్కడఁ జనియె నక్కడికి వెనుతగిలి యుద్యతాయుధుం డై చనుచుండ నవ్వైన్యునిం [2]గని మృత్యుగ్రస్త లగు ప్రజలచందంబున ననన్యశరణ్య యై యతిభయంబునఁ బరితప్యమానహృదయ యగుచు వైన్యా ధర్మవత్సలుండవును నాపన్నరక్షకుండవును మహాత్ముండవును సకలప్రాణిపరిపాలనావస్థితుండవును నయిననీ వీదీనయుం బాపరహితయుం గామినియు నగునన్ను వధియింపం బూని యేల వెనుతగులు చున్నవాఁడవు (ధర్మతత్త్వం బెఱుంగువారు) సతీజనులు కృతాపరాధు లైనం దీనవత్సలతం జేసి వధింప రని పలికి మఱియు నాధరణీదేవి పృథుచక్రవర్తి కి ట్లనియె. 474

క. జననాథచంద్ర యీభూ,జనకోటికి యానపాత్ర । సదృశస్థితితో
ఘనదృఢశరీర నగుచును, ననయము నాధారభూత । నగుచుఁ జరింతున్. 475

తే. ఇట్టినన్నుఁ గృపామతి । నెడలి యిటు వి,పాటనముసేసి త్రుంచెదు । ప్రజలు నీట
మునుఁగ కుండంగ నేరీతి । ననఘచరిత,యరసి రక్షింతు వన నతం । డవని కనియె.

వ. ధరిత్రీ మదీయాజ్ఞోల్లంఘనంబు సేయుచున్నదాన వదియునుం గాక నీవు యజ్ఞంబులందు హవిర్భాగంబుల ననుభవించుచు ధాన్యాదికంబుల విస్తరింపం జేయక గోరూపంబు ధరియించి యనయంబుఁ దృణభక్షణంబు సేయుచుఁ బాలం బిదు

1 మహివలయము కంపమానమానస. 2 'మృత్యుసమునిఁగా భావించి విత్రాసంబు నొందుచుండ నాసమయంబునఁ గంపమానహృదయ యై వసుంధర యి ట్లనియె వైన్యా'.

కక నీయందఁ యడంచికొంటివి నీయం దున్నయోషధీబీజంబులు బ్రహ్మచేతం
బూర్వంబునందె కల్పింపంబడినయవి వానిని నీదేహంబునందఁ యడంచికొని
యిప్పు డీయక మూఢహృదయవు మందమతివియు నై యపరాధంబు సేసినదు
రాత్మురాల వగుదాని నాబాణంబులచే జర్జరీభూతశరీరం జేసి వధియించి నీమేని
మాంసంబునం జేసి క్షుద్బాధితులు దీనులు నగునీప్రజలయార్తి నివారించెద నీవు
కామిని నంటివి స్త్రీపురుషనపుంసకులలో నెవ్వరేని భూతదయ లేక స్వమాత్ర
పోషకు లగుచు నిరనుక్రోశంబుగ భూతద్రోహు లై వర్తింతురు వారిని రాజు
లు వధించినఁ వధంబు గాదు గాన దానఁ బాపంబు వొరయదు నీవు కామిని
వై నను దుర్మదవు స్తబ్ధవు నగుచు మాయాగోరూపంబునం బాఱి పోవు చున్న
నిన్నుఁ దిలలంతలఖండంబులు సేసి నాయోగమహిమం బ్రాణికోటి నుద్ధరించెద
నని పలికి రోషభీషణాకారంబు ధరియించి దండధరునివడువున వర్తించుపృథునిం
జూచి వడంకుచు మేదిని ప్రాంజలి యై యి ట్లని నుతియింపం దొడంగె. 477

క. ఓనాథ పరమపురుషుఁడ, వై నిజమాయాగుణంబు లందినకతనన్
నానావిధదేహములం, బూనుదు సగుణుండ వగుచు బుధనుతచరితా. 478

వ. అట్టినీవు. 479

క. నను సకలజీవతతికిని, మును నీ వాధారభూతముగ నిర్మింపన్
విను నాయందుఁ జతుర్విధ, ఘనభూతవిసర్గ మర్థిఁ గైకొన వలసెన్. 480

వ. అ ట్లయ్యు యుండ. 481

క. నను నుద్యతాయుధుఁడ వై, మనుజేంద్ర వధింపఁ బూని మసలెదు నీకం
టెను నన్యుని నెవ్వని నే, ఘనముగ శరణంబు సొత్తుఁ గరుణాభరణా. 482

వ. అదియునుం గాక. 483

సీ. అనఘ స్వకీయంబు నై యతర్కితము నై, మహిమ నొప్పినభవన్మాయచేత
సకలచరాచరసర్గంబు నిర్మించి, ధర్మపరుండ వై తనరు దీశ
నవిక్రమము నవసరసిజలోచన, సకలలోకులకు దుర్జయము దలఁపఁ
దగు నట్టినీవు స్వతంత్రుఁడ వగుటను, బ్రహ్మఁ బుట్టించి యాబ్రహ్మచేత

తే. సకలజగములఁ జేయింతు సమతఁ బేర్చి
యేక మయ్యు మహాత్మ యనేకవిధము
లగుచు వెలుఁగొందు చుందు వీ వఖిలమందుఁ
జారుతరమూర్తి యోపృథుచక్రవర్తి. 484

వ. మఱియు మహాభూతేంద్రియకారకచేతనాహంకారంబు లనుశక్తులం జేసి యీ
జగంబుల కుత్పత్తిస్థితివిలయంబులఁ గావించుచు సముత్కటవిరుద్ధశక్తులు గల
పురుషునకు నమస్కరించెద నట్టిపరమపురుషుండ వయిననీవు నిజనిర్మితంబును
భూతేంద్రియాంతఃకరణాత్మకంబును నైనయీవిశ్వంబు సంస్థాపింపం బూని. 485

సీ. ఆదివరాహంబ వై యారసాతలగత నైన నన్ను [1]నక్కటికతోడ
నుద్ధరించితి వట్టి యుదకాగ్రభాగంబు, నం దర్థి నున్న నే ననెడినావ
యం బన్న నిఖిలప్రజావళి రక్షింపఁ, గోరి యీపృథురూపధారి వైతి
వట్టిభూభరణుండ వైన నీ విపుడు ప, యోనిమిత్తంబుగా నుగ్రచరుఁడ
తే. వగుచు నన్ను వధించెద ననుచు బుద్ధిఁ, దలఁచుచున్నాఁడ విది విచిత్రంబుగాదె
విశ్వసంపాద్య నిరవద్య వేదవేద్య, భవ్యగుణసాంద్ర వైన్యభూపాలచంద్ర.
వ. కావున నీశ్వరగుణసర్గరూపం బైన మాయావిమోహితాంతఃకరణుల మైన మా వంటివారలచేత హరిభక్తులచేష్టితం బెఱుంగఁబడ దన్న హరిచేష్టితం బెట్లెఱుంగఁబడు నట్టి జితేంద్రియయశస్కు లయినవారలకు నమస్కరింతు ననుచు నివ్విధంబునం గోపప్రస్ఫురితాధరుం డైనప్పృథుని నభినుతించి ధైర్యం బవలంబించి వెండియు నిట్లనియె. 487
క. విమలాత్మ నాకు నభయము, సమకూరెడునట్లు గాఁగ సన్మతి నీక్రో
ధము నుపశమించి కరుణిం, పుము నావిన్నపము వినుము పురుషనిధానా. 488
క. ధర విరులు గంగ కుండఁగ, సరసగతిం బూవుఁదేనెఁ జవి గొనునిందిం
దిరవిభు కైవడి బుధుఁ డగు, పురుషుఁడు సారాంశ మాత్మఁ బూని గ్రహించున్.
సీ. వినవయ్య తత్త్వదర్శను లైనయట్టిస, న్మునులచే నైహికాముష్మికంబు
లైనఫలప్రాప్తి కర్థి కృష్యాద్యగ్ని, హోత్రాద్యుపాయంబు లుర్విమీఁద
దృష్టంబులును నాచరితములు నగుచుండా, నెనయఁ దగునుపాయ మెవ్వఁ డాచ
రించును వాఁడు ప్రాపించుఁ దత్ఫలమును, విద్వాంసుఁ డైనను వెలయ దీని
తే. నాదరింపక తనయంత నాచరించె, నేని నాయాసమే యగుఁ గాని తత్ఫ
లముసఁ బొందఁడు బహుళకాలమున కైన, వినుతగుణశీల మాటలు వేయునేల.
వ. అని మఱియు మహి యిట్లనియె. 491
చ. జలరుహగర్భుచేత మును చాల సృజింపఁగఁ బడ్డయోషధుల్
కలుషమతిన్ ధృతవ్రతులు గానియసజ్జనభుజ్యమాన మై
[2]వెలయుటఁ జూచి యోనృపతి వీరులు మాన్పమిఁ జోరబాధలన్
బలుమఱుఁ బొందుచు న్నపరిపాలిత నై కృశియించి వెండియున్. 492
క. అనుపమమఖకర్తక్రియ, లనయము లేకుంట నే ననాదృత నగుచున్
జననాయక యీలోకము, ఘనచోరీభూత మగుటఁ గనుఁగొని యంతన్. 493
క. సవనాదిసిద్ధికొఱకై, తవిలి తదీయౌషధీవితతులను ధరణీ
ధవ నే నపుడు గ్రసించితి, నవియును నాయందు జీర్ణ మయ్యెఁ గడంకన్.
క. విను వాని నొకయుపాయం, బునఁ గ్రమ్మఱఁ బడయ వచ్చు భూవరచంద్రా
విను మది యెఱిఁగించెద నీ, కును వత్సలురాల నగుట గుణతరచరితా. 495

1 [illegible] 2 [illegible]

క. అనయము నా కొక వత్సము, ననురూపసుదోహనమ్ము ననురూపకదో
గ్ధను గల్పింపుము యట్లయిన, నను నీభూతముల కవనినాయక దానన్. 496

క. పరఁగ నభీప్సితములు బల, కరములు నగునన్న దుగ్ధకలితము లగుభా
సురకామంబులఁ బిదికెద, నరనాయకచంద్ర వినుము నావచనంబుల్. 497

చ. మనుజవరేణ్య యేను విషమస్థలి నై యిపు డున్నదానఁ గా
వున జలదాగమాదితపయోనివహంబు తదాగమంబు వో
యినను దదంబువుల్ పుడమి నింకక యంతట నిల్చునట్లు గా
మనునిభ నన్ను నిప్పుడు సమస్థలి నై పెను పొందఁ జేయవే. 498

క. అని యివ్విధమున నాభూ, వనితామణి వలుకుమధురవచనంబులు దా
విని యనురాగము దనమన, మునఁ గడలుకొనంగ రాజముఖ్యుం డంతన్. 499

చ. మనువును [1]దూడఁ జేసి గరిమన్ నిజపాణితలంబు లీల దో
హనము గఁ జేసి యందు సకలౌషధులం బిదికెం గ్రమంబునం
దనరఁగఁ దద్విధంబునను దత్పృథువత్సల యైనభూమియం
దనయము వారువారును బ్రియం బగుకోర్కులు వొంది యున్నతిన్. 500

సీ. బలసి ఋషుల్ బృహస్పతిని వత్సంబు గా, నరించి తమయింద్రియంబులందు
నంచితచ్ఛందోమయక్షీరమును దేవ, తలు సురరాజవత్సకము గాఁగఁ
గనకపాత్రమునందుఁ దనరునోజోబల, [2]వీర్యామృతంబు నై వెలయుపయసు
దైత్యదానవులు దైత్యశ్రేష్ఠుఁ డగుగుణ, శాలిఁ బ్రహ్లాదు వత్సంబుఁ జేసి

తే. ఘనసురాసవరూపదుగ్ధంబు వరుస, నప్సరోజనగంధర్వు లలరి యపుడు
[3]దనర విశ్వావసువు వత్సముగఁ జేసి, పద్మమయనిర్మితం బైనపాత్రమందు.

వ. మాధుర్యసౌందర్యసహితగాంధర్వక్షీరంబును బితృదేవతలుసూర్యవత్సకంబుగా నామపాత్రంబునందుఁ గవ్యం బనుదుగ్ధంబును సిద్ధులు గపిలవత్సకంబుగా నాకాశపాత్రమందు సంకల్పనామాపాణిమాదిసిద్ధి యనుక్షీరంబును విద్యాధరాదులు తద్వత్సకంబును దత్పాత్రకంబునుం గా ఖేచరత్వాదివ్యాపారరూపక్షీరంబును గింపురుషాదులు మయవత్సకంబుగా నాత్మపాత్రంబున సంకల్పమాత్రప్రభవంబు నంతర్ధానాద్భుతాత్మ[4]సంబంధియు నగుమాయ యనుక్షీరంబును యక్షరక్షోభూతపిశాచంబులు భూతేశవత్సకంబుగాఁ గపాలపాత్రంబుగా రుధిరాసవం బను దుగ్ధంబును నహిదందశూకసర్పనాగంబులు తక్షకవత్సంబు బిలపాత్రంబునుం గా విషరూపక్షీరంబును బశువులు గోవృషవత్సకంబుగ నరణ్యపాత్రంబునందుఁ దృణం బనుక్షీరంబును గ్రవ్యాదమృగంబులు మృగేంద్రవత్సకంబును నాత్మకళేబరపాత్రకంబునుంగాఁ గ్రవ్యం బనుదుగ్ధంబును విహంగంబులు సువర్ణవత్సకంబు

1 వత్సఁ. 2 వీర్యస్వరూప మై. 3 వలను మెఱయు విశ్వావసు వత్సఁ జేసి. 4 సంబంధిని యగుబుద్ధి యనుక్షీరంబు.

గా నిజకాయపాత్రంబులందుఁ గీటకఫలాదికం బనుదుగ్ధంబును వనస్పతులు వట
వత్సకంబుగా భిన్నరోహరూపపయస్సును గిరులు హిమవద్వత్సకంబుగా నిజసాను
పాత్రలయందు నానాధాతువు లనుదుగ్ధంబునుంగా నివ్విధంబున సమస్తచరాచర
వర్గంబు స్వముఖ్యవత్సకంబు స్వస్వపాత్రకంబునుం గా భిన్నరూపంబు లైనక్షీరం
బులఁ బిదికె నని చెప్పి మఱియును. 502

క. క్రమమున నిటు పృథ్వాదులు, దమతమకామితము లనఁగఁ దగుభిన్నక్షీ
రము దోహనవత్సకభే, దమునం దగఁ బిదికి రంత ధరణీధవుఁడున్. 503

తే. సముచితానందమును బొంది సర్వకామ, దుఘ యనందగుభూమిని దుహితఁ గాఁగఁ
గోరి కైకొని నిజధనుఃకోటిచేత, భూరిగిరికూటములఁ జూర్ణములు గఁ జేసి.

తే. చండకోదండలీల భూమండలంబు, సమతలంబు గఁ జేసి శశ్వత్ప్రసిద్ధి
నొంది యవ్విభుఁ డీలోకమందు నెల్ల, ప్రజకుఁ దండ్రియు జీవనప్రదుఁడునగుచు.

తే. అక్కడక్కడఁ బూర్వంబునందు లేని, గ్రామపట్టణదుర్గఖర్వటపుళింద
ఖేటశబరాలయవ్రజవాటఘోష, వివిధనిలయము లర్థిఁ గావించె నంత. 506

క. వారును భయవిరహితు లై, బోరన దత్తన్నివాసములయందు సుఖ
శ్రీఁ గని యొప్పుచు నుండిరి, వారక యాపృథునిఁ బొగడ వశమె ధరిత్రిన్.

సీ. అని చెప్పి మునినాథుఁ డైన మైత్రేయుఁ డ, వ్విదురున కిట్లను వేడ్కతోడ
ననఘాత్ముఁ డా రాజర్షి యైన వైన్యుం డశ్వ, మేధశతంబు సమృద్ధితోడఁ
గావింతు నని దీక్ష గైకొని ప్రతినిష్ఠఁ, దివిరి బ్రహ్మావర్తదేశమందు
నలరుమనుక్షేత్రమందు సరస్వతీ, నదిప్రాంతఁ దా మహోన్నతి నొనర్చు

తే. సవనకర్మక్రియకు నతిశయవిశేష
ఫలము గలిగెడి నని బుద్ధిఁ దలఁచి యచట
వరుసఁ గావించునతిశయాధ్వరమహోత్స
వము సహింపక యుండె నసూయామరవిభుఁడు. 508

పృథుచక్రవర్తి యశ్వమేధంబున నింద్రుం డశ్వము నపహరించుట.

సీ. అట్టియధ్వరకర్మమందు సాక్షాద్భగ, వంతుఁడు హరి రమేశ్వరుఁడు లోక
గురుఁడును సర్వాత్మకుండును విభుఁడును, నీరజభవభవాదినుతుఁడు లోక
పాలకనిఖిలసురపరివృతుండును, యజ్ఞాంగుఁ డఖిలాధ్వరాదివిభుఁడు
గంధర్వ మునిసిద్ధగణ సాధ్య విద్యాధ, రాప్సరో దైత్య గుహ్యకాళి దాన

తే. వాదిజేగీయమానుఁ డత్యలఘుయశుఁడు, ప్రకటనందసునందాదిపార్షదుండు
కపిలనారదసనకాదిప్రముఖ్య, మహితయోగీంద్రసంస్తూయమానుఁ డజుఁడు.

వ. మఱియుం బరమభాగవతసేవితుండును నారాయణాంశప్రభవుండును నైనపృథు
చక్రవర్తికి భూమి హవిరాదిదోగ్ధ్రి యయ్యును సర్వకామదుఘయై సమస్తపదా
ర్థంబులం బిదుకుచుండె మఱియుఁ దరువులు ఘనతరాకారంబులు గలిగి మకరం

దస్రావు లగుచు నిక్షుద్రాక్షాదిరసంబులును దధిక్షీరాజ్యతక్రపానకాదికంబులును
వర్షింప నవియెల్ల నదులు వహించె సముద్రంబులు హీరాదిరత్నవిశేషంబుల నీ
నుచుండెఁ బర్వతంబులు భక్ష్యభోజ్యలేహ్యచోష్యంబు లను చతుర్విధాన్నంబులు
గురియు చుండె లోకపాలసమేతు లైన సకలజనంబులు నుపాయనంబులు దెచ్చి
యిచ్చు చుండి రిట్టిపరిపూర్ణవిభవాభిరాముం డై యధోక్షజసేవాపరాయణుం
డగుపృథుచక్రవర్తి దేకోనశతాశ్వమేధంబులు సన్మేధంబునం గావించి నూఱవ
యాగంబునందు యజ్ఞపతి యైనపుండరీకాక్షుని యజించు చుండం దదీయపర
మోత్సవంబు సహింపం జాలక. 510

క. అమరేంద్రుఁడు ఘనరోషో,గ్రముఁ డై పాషండవేష । కలితతిరోభా
వమునం దన్మఖపశువుం, గ్రమ మేది హరించి చనియె । గగనంబునకున్. 511

వ. అట్లు సనునప్పుడు. 512

క. అనఘుం డగునత్రిమహా,మునిచోదితుఁ డగుచుఁ బృథునిపుత్రుఁడు బాణా
సనతూణీరధరుం డై, యనిమిషపతివెనుకఁ జనియె । నతిదర్పమునన్. 513

వ. అట్లు సని చని ముందట. 514

సీ. యజ్ఞసాధనపశు।హారణుని వధియించు,ధర్మంబునందు న।ధర్మ మనెడి
బుద్ధిఁ బుట్టఁగఁ జేయ । భూరిమాయావేష,ధారి యై యరుగుసు।త్రాముఁ గదిసి
నిలు నిలు మని యార్చి । వింటిగుణధ్వని సేసి, ఘనజటాభస్మాస్థి।కలిత మైన
మూర్తిఁ గనుంగొని । మూర్తిభవించిన, ధర్మంబ కా బుద్ధి । దలఁచి యమర

తే. నాయకునిమీఁద సాయక।మేయఁ జాల,కున్నఁ గనుఁగొని యత్రివి।శ్వన్నుతుండు
వైన్యజున కని వాసవు।వలను సూపి, మనములోపల రోషంబు । మల్లడింప.

క. విను మితఁడు యజ్ఞహంతయు, ననిమిషనికరాధముండు । నగునింద్రుఁడు గా
వున నితని జంపుము నీ, వని ముమ్మా ఱుచ్చరింప । నవ్వైన్యజుఁడున్. 516

మ. వినువీధిం జను దేవవల్లభునిపై । వీరుండు క్రోధాంతరం
గనిరూఢిన్ మృగరాట్కిశోరము మహా।గంధద్విపేంద్రంబుమీఁ
దను లంఘించువిధంబునం బడిన నా।తం డశ్వచౌర్యైకసా
ధనరూపంబుఁ దదశ్వమున్ విడిచి యం।తర్ధానముం బొందినన్. 517

క. వీరుఁడు పృథుభూపాలకు,మారుఁడు నిజయజ్ఞపశువు । మరలం గొని దు
ర్వారబలుఁ డగుచు జనకుని,భూరిసవనవాటపుణ్య।భూమికి వచ్చెన్. 518

వ. అయ్యవసరంబున నచ్చటనున్నపరమర్షిపుంగవు లతనియద్భుతకర్మంబు గనుం
గొని యాశ్చర్యంబు నొంది యతనికి జితాశ్వుం డనునన్వర్థనామంబు వెట్టి
యున్నసమయంబున. 519

చ. మఱియును దేవతాపతి తమఃపటలంబు జనింపఁ జేసి యె
వ్వరుఁ దనుఁ గాన కుండ నని।వారణఁ గాంచనపాశబద్ధ మై

సురుచిరయూపదారుపరిశోభిత మైనహయంబుఁ గొంచుఁ జె
ల్చెర విను వీధి నేఁగఁగ ఋషిప్రవరుం డగునత్రి సెప్పినన్. 520

క. విని పృథుభూవరతనయుఁడు, ఘనబలమునఁ జని కపాలఖట్వాంగము లో
లిని ధరియించి రయంబునఁ, జనునింద్రునిఁ గాంచి నొంపఁ జాలక యంతన్.

ఉ. క్రమ్మఱ నత్రిచేఁ దెలుపఁ గాఁ బడి వైన్యతనూభవుండు రో
షమ్మునఁ దోఁకఁ ద్రొక్కినభుజంగమపుంగవుఁ బోలి యుగ్రుఁడై
య మ్మరిఁ బోసినం గని సురాధిపుఁ డప్పటియట్లఁ బాతె న
శ్వమ్మును రూపముఁ విడిచి చాలఁ దిరోహితుఁడై రయంబునన్. 522

వ. అట్లు సనినం బశువుం గొని మరలి యవ్వీరోత్తముండు పితృయజ్ఞశాలకుం జను
దెంచె నంత. 523

సీ. హరిహయుం డధ్వరహయహరణార్థమై, మించి కైకొని విసర్జించినట్టి
భూరియమంగళభూతమాయారూప,ములను [1]ధరించిరి మూఢజనులు
పాషండచిహ్నముల్ పరఁగుట వారలు, జగతిపై నగ్నవేషములు గలుగు
జైనులు భూరికాషాయవస్త్రంబులు, ధరియించుబౌద్ధులుఁ దగ జటాస్థి

తే. భస్మధారులు నయినకాపాలికులును, ననఁగ వెలసిరి లోకంబులందుఁ జాలఁ
దలఁప ధర్మోపమం బనఁ దగుసధర్మ,మందు నభిరతి వొడమినయజ్ఞజనులు.

వ. తదీయచిహ్నంబులు పారంపర్యంబుగా ధరియింపం దొడంగిరి తద్వృత్తాంతంబు
భగవంతుం డయినపృథుచక్రవర్తి యెఱింగి కుపితుండై యుద్యతకార్ముకుం
డగుచు నింద్రునిమీఁద బాణంబు నేయ నుద్యమించిన ఋత్విక్కులు శక్రవధో
ద్యుక్తుండు నసహ్యరంహుండు నయినపృథుచక్రవర్తిం గనుంగొని యి ట్లనిరి.

క. జననాయక యజ్ఞములం, దనుపమవిధిచోదితంబు లనఁ దగుపశుబం
ధనహింస[2]ల కా కితరుల, ఘనదీక్షితునకు వధింపఁ గా దండ్రు బుధుల్. 526

వ. కావున నీ విప్పు డింద్రవధోద్యోగం బుపసంహరింపుము భవదీయధర్మవిరోధి
యైనయట్టి యింద్రుని. 527

క. జనపాల వీర్యవంతము, లనఁ దగుమంత్రములచేత నాహ్వానము సే
సిన నతఁ డిచటికి వచ్చును, జనుదెంచినయమరవిభుని సరభసత దగన్. 528

క. ధృతి సెదరఁ బట్టి శిఖి కాహుతిఁ గా వేల్చెదము దాన నుర్వీవర నీ
వితతమహోహతవీర్యో,న్నతుఁడై చెడి పోవు నమరనాథుం డంతన్. 529

వ. అని పృథుని వారించి ఋత్విగ్జనంబులు కుపితస్వాంతులై హస్తంబుల స్రుక్స్రు
వంబులు ధరియించి వేల్చుసమయంబునం జతుర్ముఖుండు సనుదెంచి ఋత్విజులం
గనుంగొని యి ట్లనియె యజ్ఞంబులందు యజింపంబడుదేవత లెవ్వనియంశంబు
లెవ్వండు యజ్ఞనామకం బగుభగవదంశం బగు నట్టి యింద్రుండు మీచేత వధా

1 జనించిరి. 2 లు కాని పరుల.

ర్థుండు గాఁ డితండు భగవదంశసంభవుం డగుట నీయజ్ఞకర్తవిధ్వంసనేచ్ఛుం డయి కావించుధర్మవ్యతికరంబులు నూచుచుండ వలయుం గాని ప్రతికారంబులు గర్తవ్యంబులు గావు పృథుకీర్తి యగునీపృథునకు నేకోనశతం బగునధ్వర ప్రయోగఫలంబు సిద్ధించుం గాక యని పృథుచక్రవర్తి కి ట్లనియె. 530

సీ. మనుజేంద్ర మోక్షధర్మము నెఱింగిననీకు, సననముల్ సేయుట ♦ సాలు వినుము నేవిధంబున నైన ♦ దేవేంద్రు మనమునఁ, గ్రొని రోషంబు ♦ గదురకుండ వర్తింప వలయును ♦ వాసవుండును నీవుఁ, బూని సుశ్లోకులు ♦ గాన మీకు మంగళం బగుఁ గాక ♦ మానవనాథ నీ, చిత్తంబులోపలఁ ♦ జింతఁ దొఱఁగి

తే. మించిమద్వాక్యముల నాదరించివినుము, దైవహతమగుయజ్ఞంబుఁ ♦ దగిలిచేయు కొఱకు భవదీయచిత్తంబు ♦ గుంది రోష, కలుషితం బైన నజ్ఞానకలిత మగును.

వ. భవదీయయజ్ఞహననార్థం బశ్వహరణుం డై నయింద్రుండు దేవతలలోన దురాగ్రహుం డగుటం జేసి యతనిచేత నిర్మింపంబడి చిత్తాకర్షకంబు లైనయీపాషండధర్మంబులచేత ధర్మవ్యతికరంబు గలుగుం గాన యీయజ్ఞంబు పాలింపు మని మఱియు ని ట్లనియె. 532

సీ. అది గాక వినుము వేనాపచారంబునఁ, బూని విలుప్తంబు ♦ లైనయట్టి యలఘునానాసమయానుధర్మంబులఁ, బరిపాలనము సేయఁ ♦ బరఁగి వేను దేహంబువలనను ♦ దివిరి జనించి యు,న్నాఁడవు నారాయణాంశజుఁడవు గావున నీనరకలితలోకంబునఁ, బుట్టిన తెఱఁగు నిబ్బుద్ధిఁ దలఁచి

తే. యెవరిచే నేమిటికి సృజియింపఁబడితి, వట్టియాబ్రహ్మసంకల్ప ♦ మవనినాథ తప్ప కుండంగఁ బాలింపు ♦ ధర్మగతిని, జారుశుభమూర్తి యోపృథుచక్రవర్తి.

వ. అని మఱియు ని ట్లనియె నుపధర్మమాతయుం బ్రచండపాషండమార్గంబు నైనయీయింద్రకృతం బగుమాయను జయింపు మని వనజసంభవుం డాన తిచ్చినం బృథుచక్రవర్తియుఁ దదాజ్ఞాపితుం డై దేవేంద్రునితోడ బద్ధసఖ్యుం డయ్యె నంత నవభృథానంతరంబున. 534

చ. సుచిరలబ్ధదక్షిణలసొంపునఁ బొంపిరి వోయి భూసురుల్ వరుసను బెక్కుదీవన లవారణ నిచ్చిరి సర్వదేవతల్ భరితముదంతరంగములఁ ♦ బాయనివేడ్క వరంబు లిచ్చి రా నరవరుఁ డైనవైన్యునకు ♦ నందితకీర్తికిఁ బుణ్యమూర్తికిన్. 535

వ. అంత నచ్చటిజనంబు లి ట్లనిరి. 536

తే. అనఘ నీచేత నాదృతు ♦ లైరి సర్వ,జనులు మఱి దానమానోపచారములను బితృక దేవర్షిమానవవితతి పూజ, నొంది యంచితమోదంబు ♦ నొంద నయ్యె.

నారాయణుండు పృథుచక్రవర్తి ననుగ్రహించుట.

వ. అని పలుకుసమయంబున యజ్ఞభోక్తయు యజ్ఞవిభుండును భగవంతుండు నైన

సర్వేశ్వరుం డింద్రసమేతుం డై యచ్చటికిం జనుదెంచి యాపృథున కి ట్లనియె.

క. జనవర భవదీయం బై, జననుత మగునశ్వమేధ✱శతమున కిపు డీ
యనిమిషపతి భంగము సే,సినకతన క్షమాపణంబు ✱ సేసెడిఁ గంటే. 539

వ. కావున నితని క్షమింపుము సత్పురుషు లగువారు దేహాభిమానులు గా కుండుటం జేసి భూతంబులయెడ ద్రోహం బాచరింప రట్లగుటం జేసి నీవంటిమహాత్ములు దేవమాయామోహితు లై పరోపతాపంబులు సేసి రేని దీర్ఘతరం బైనవృద్ధజనసేవ వ్యర్థంబు గాదె యదియునుం గాక యీశరీరం బవిద్యాకామకర్మంబులచేత నారబ్ధం బని తెలిసినభూతద్రోహి గానిపరమజ్ఞాని యీదేహంబునందు ననుషక్తుండు గాకుండుట సహజం బన దేహోత్పాదితంబు లైనగృహదారాదులయందు మమత్వంబు లేకుండుటం జెప్ప నేల యిట్టిదేహంబునం దున్నయాత్మ యేకంబును శుద్ధస్వరూపంబును స్వయంజ్యోతియు నిర్గుణంబును గుణాశ్రయంబును వ్యాప్యవ్యాపకంబును నసంవృతంబును సాక్షిభూతంబును నిరాత్మంబును నగు దీని దేహంబుకంటె వేఱుగా నెవ్వండు దెలియు వాఁడు మత్పరుం డగుటంజేసి దేహధారి యై యుండియుఁ దద్గుణంబులం బొరయక వర్తించు మఱియు నెవ్వం డేని స్వధర్మాచారపరుండును నిష్కాముండును శ్రద్ధాయుక్తుండు నై న న్నెల్లప్పుడు భజియించు నట్టివానిమనంబు క్రమంబునఁ బ్రసన్నం బగు నట్లు ప్రసన్నమనస్కుండును ద్రిగుణాతీతుండును సమ్యగ్దర్శనుండును నై నయతండు మదీయసమవస్థానరూపశాంతిఁ బొందు నదియ కైవల్యపదం బనం బడుఁ గూటస్థం బైన యీయాత్మ యుదాసీనభూతం బైనను దీని ద్రవ్యజ్ఞానక్రియామనంబులకు నీశ్వరుం గా నెవ్వండు దెలియు వాఁడు భవంబు నొందకుండు నీసంసారంబు ద్రవ్యక్రియాకారకచేతనాత్మకం బగుటం జేసి ప్రభిన్నదేహోపాధికంబు గావునఁ బ్రాప్తంబు లైనయాపత్సంపదలయందు మత్పరు లైనమహాత్ములు వికారంబు నొందరు గావున నీవు సుఖదుఃఖంబులయందు సమచిత్తుండవును సమానోత్తమమధ్యమాధముండవును జితేంద్రియాశయుండవును నై వినిష్పాదితాఖిలామాత్యాదిసంయుతుండ వై యఖిలలోకరక్షణంబు సేయు మని వెండియు ని ట్లనియె. 540

సీ. పార్థివోత్తములకుఁ ✱ బ్రజల రక్షించుట, పరమధర్మం బగు ✱ నరవరేణ్య
ధరణీశులకుఁ బ్రజా✱పరిపాలనంబునఁ, బూని లోకులు సేయు✱పుణ్యమందు
షష్ఠాంశ మర్థిని ✱ సంప్రాప్త మగు నట్లు, ప్రజలఁ బ్రోవనిరాజు ✱ ప్రజలచేత
నపహృతసత్పుణ్యుఁ ✱ డై వారు గావించు, ఘనపాపఫలముఁ దా ✱ ననుభవించుఁ

తే. గాన నీవును విప్రవ✱రానుమతము, సాంప్రదాయికవిధము నై ✱ జరగుధర్మ
మహిమఁ జేపట్టి యర్థకా✱మములఁ జెందు, సమత నమ్మోఁటియందు నా✱సక్తి లేక.

వ. ఇవ్విధంబున. 542

క. జనులకు ననురక్తుండ వై, జననాయక నీవు ధరణి ✱ సమచిత్తుండ వై

యనయముఁ బరిపాలించిన, సనకాదులఁ గాంతు వాత్మసదనమునందున్. 543
వ. అని వెండియు నిట్లని యాన తిచ్చె. 544
సీ. భూవర యోగతపోమఖంబులచేతఁ, గైకొని సులభుండఁ గానియేను
సమచిత్తులైనసజ్జనులచిత్తంబుల, వర్తించుచుండెడివాఁడ నగుటఁ
జేసి తావకశమశీలవిమత్సర, [1]కీర్తనముల వశీకృతుఁడనైతి
నే నీకు నొకవరం బిచ్చెద వేఁడుము, నావుడు విని మేదినీవరుండు
తే. లోకగురుఁడైనయప్పుండరీకనయనుఁ, డాన తిచ్చినమృదులలితామృతోప
మానవాక్యములాత్మ యమ స్తకమునఁ,దాల్చి సమ్మోదితాత్ముఁడై ధరణివిభుఁడు.
క. తనపాదములకు భక్తిని, వినతుండై యాత్మకరవితతికి లజ్జం
దనరుచు నున్నసురేంద్రునిఁ, గనుఁగొని సత్ప్రేమ మొదవఁ గౌఁగిటఁ జేర్చెన్.
వ. ఇట్లు గౌఁగిటం జేర్చి గతద్వేషుండై యున్నయనంతరంబ. 547
మ. భగవంతుండును విశ్వరూపకుఁడునై భాసిల్లునవ్విష్ణుఁ డా
జగతీనాథకృతార్చనానతులచే సంప్రీతచేతస్కుఁడున్
నిగృహీతాంఘ్రిసరోరుహద్వయుఁడునై నిల్చెం బ్రయాణాభిము
ఖ్యగరిష్ఠాత్మకుఁ డయ్యు నాపృథునిపైఁ గారుణ్య మేపారఁగన్. 548
వ. ఇట్లు దనమీఁదియనుగ్రహంబునం జేసి విలంబితుం డగుటయు నయ్యాదిరాజ
న్యుండైనపృథుచక్రవర్తి యమ్ముకుందసందర్శనానందబాష్పజలబిందుసందోహ
కందళితనయనారవిందుండై యవ్విభుమూర్తిం గనుంగొని కనుంగొన లేక గద్గ
దకంఠుండై పలుక లేక యుండియు నెట్టకేలకుఁ దనహృదయంబునఁ దద్దేవుని నుప
గూహనంబు గావించి తన్మూర్తి ధరియించి కన్నులం దొరఁగునానందబాష్పం
బులు దుడిచికొని విలోకనంబు సేయుచు నత్యుత్కృష్టోచరుండును గరుడస్కంధ
విన్యస్తహస్తుండును వసుధాతలస్థితపాదకమలుండును నై యొప్పునద్దివ్యపురుషున
కిట్లనియె. 549
క. వరదా యీశ్వర నిను సత్పురుషుఁడు దేహాభిమానిని[2]భోగములకు నీ
వర మెట్లు గోరు నిహసుఖ,వరములు నారకుల కైన వఱలవె చెపుమా. 550
చ. ఘన మగుదేవ యీవరమె కాదు మహాత్మక వాగ్వినిర్గతం
బనఁ దగుతావకీనచరణాంబుజచారుమరందరూపమై
తనరినకీర్తియున్ విని ముదంబును బొందఁగ లేనిమోక్షమై
నను మదిఁ గోర నొల్ల నఘనాశ రమేశ సరోజలోచనా. 551
క. అది గాన పద్మలోచన. సదమలభవదీయఘనయశము వినుటకు నై
పదివేలచెవులు కృప ని, మ్మది గా నా కభిమతంబు నగును ముకుందా. 552
చ. అనఘ మహాత్మ వాగ్గళితమైనభవత్పదపంకజాతసం

---

1 గుణములచే. 2 భోగ్యం బగునీవర.

జనితసుధాకణానిలవ।శంబున విస్మృతతత్త్వమార్గ
ర్తను లగుదుష్టయోనులకుఁ । గ్రమ్మఱఁ దత్త్వముఁ జూపఁ జాలుఁ గా
వున నిది దక్క నన్యవర । మొల్లఁ బయోరుహపత్త్రలోచనా. 553

సీ. వినుతమంగళయశో।విభవ సర్వేశ్వర, యిందిర గుణసంగ్ర।హేచ్ఛఁ జేసి
యే నీదుశివతరం।బైనసత్కీర్తిని, నర్థిమై వరియించె । నట్టికీర్తి
చతురసత్పురుషసం।గతము గల్గుచు నుండ, ధృతి నెవ్వఁడేని యా।దృచ్ఛికమునఁ
జేసియు నొకమాటు । చెవులార విన్నవాఁ, డనయంబును గుణజ్ఞుఁ । డయ్యెనేని

తే. విరతి నేరీతిఁ బొందును । ధరణిఁ బశువుఁ, దక్కఁ దక్కినతజ్జ్ఞుండు । దనుజభేది
గాన యుత్సుకమతి నైన।నేను లక్ష్మి,కరణి నిన్ను భజింతు నో।పరమపురుష.

వ. ఇట్లు భవదీయసేవాతత్పరుల మైనయిందిరయు నేను నేకపదార్థాభిలాషం జేసి స్పర్ధమానుల మగు చున్నమాయిద్దఱకును బర్యాయసేవం జేసి కలహంబు లేకుండ నిట్లు గాక భవదీయచరణసరోరుహసేవాసక్తమనోవిస్తారుల మగుటం జేసి నేను నేను మున్ను భజియింతు ననుతలంపులం గలహం బయినను గా నిమ్ము దేవా యని వెండియు నిట్లనియె. 555

సీ. జగదీశ దేవ యు।ష్మత్పదకైంకర్య,పరతఁ దనర్చుసా।గరతనూజ
కృత్యంబునందు స।కల్పితబుద్ధి నేఁ, బ్రీతిఁ గోరుట జగ।న్మాత యైన
యారమాసతితోడ । వైర మవశ్యంబుఁ, గల్గు నైనను దయా।కార నీవు
దీనవత్సలుఁడవు । గాన స్వల్పంబును, నధికంబు సేయుము । వట్లు గాన

తే. భవ్యచరిత నిజస్వరూ।పంబునందు, నభిరతుఁడ వైననీవు న। న్నాదరించు
పగిది నిందిర నాదరిం।పవు మహాత్మ, భక్తజనలోకమందార । భవవిదూర. 556

వ. ఇట్లగుటం జేసి సత్పురుషు లైనవారలు నిరస్తమాయాగుణసముదయంబు గల నిన్ను భజియింతురు వారలు భవత్పాదానుస్మరణరూపం బయినప్రయోజనంబు దక్క నితరప్రయోజనంబుల నెఱుంగరు దేవా సేవకజనంబులను వరంబులు వేఁడు మని జగద్వ్యామోహనంబు లైనవాక్యంబులు పలుకుదు వట్టిభవదీయవాక్యతంత్రీనిబద్ధులు లోకులు గా కుండి రేని ఫలకాము లై కర్మంబుల నెట్లు లాచరింతు రీశా భవదీయమాయావిమోహితు లై జను లేమికారణంబున నీకంటె నితరంబులఁ గోరుచుందు రిట్లగుటం జేసి తండ్రి దనంతన బాలహితం బాచరించు నట్లు మాకు నీవ హితాచరణం బాచరింప నర్హుండ వని పలికిన నాదిరాజర్షి యైన పృథుచక్రవర్తియర్థవంతంబు లయినవచనంబులు విని విశ్వద్రష్ట యగునారాయణుండు సంతుష్టాంతరంగుం డై యిట్లనియె మహారాజా దైవప్రేరితుండ వై నా యెడ నిట్టిబుద్ధి గలుగుటం జేసి యచలాచలంబగుభక్తివొడముదానిచే దుస్తరం బగుమదీయమాయం దరింతువు నీవు నాచే నాదిష్టం బగుకృత్యం బప్రమత్తుండ

వగుచు నాచరించిన సకలశుభంబులం బొందుదువు మదీయభక్తజనంబులు స్వ
ర్గాపవర్గనరకంబులం దుల్యంబులు గా నవలోకింతురు గావున నీయధ్యవసాయం
బు నట్టిదియ మఱియు మదీయాదేశంబున దుస్త్యజం బగురోషంబును ద్యజించి
నాయెడ భక్తిసలిపితివి గాన యిదియె నాకుఁ బరమహర్షదం బగు నని యభినం
దించి యనుగ్రహించి యతండు గావించుపూజలు గయికొని గమనోన్ముఖుం
డయ్యె నయ్యవసరంబున. 557

సీ. నర సిద్ధ చారణ । సుర ముని గంధర్వ, కిన్నర పితృ సాధ్య । పన్నగులును
నఖిలజనంబులు । హరిపార్శ్వవర్తులు, నానందమగ్నాంగు । లగుచు వేడ్క
యజ్ఞేశచింతనుం । డైనయాపృథువుచే, సత్కారములఁ బొంది । సమ్మదమునఁ
జనిరి నిజాధివా । సములకు భగవంతుఁ, డైననారాయణుం । డచ్యుతుండు
తే. తగ నుపాధ్యాయసహితుఁ డై । తనదుపృథుని
విమలమతు లయి చూచుచు । నమరవరులు
దన్ను జయజయకలితశ । బ్దములఁ బొగడ
జనియె నప్పుడు వైకుంఠ । సదనమునకు. 558

వ. అంతఁ బృథుచక్రవర్తియు నింద్రియాగోచరుం డయ్యును దర్శితాత్ముండును దేవ
దేవుండును నయినవాసుదేవునకు నమస్కరించి నిజపురంబునకుం జనుదెంచుసమ
యంబున మౌక్తికకుసుమమాలికాదుకూలస్వర్ణతోరణాలంకృతంబును లలితసు
గంధధూపవిలసితంబును రత్నమయరంగవల్లికావిరాజితంబును ఫలపుష్పలాజా
క్షతదీపమాలికాస్తంభపూగపోతాభిరామప్రతిగృహప్రాంగణంబును మృగమద
ఘనసారచందనాగరువాఃపూరసంసిక్తరథ్యావళీవిభాసితంబును దరుపల్లవాభి
శోభితంబును నైనపురంబుఁ బ్రవేశించి రాజమార్గంబునం జనుదేర మండిత
రత్నకుండలమణిమరీచులు గండఫలకంబులం దాండవంబులు సలుపం బురకామి
నులు గనకపాత్రవిరచితంబు లయినయశేషమంగళనీరాజనంబుల నివాళింప శం
ఖదుందుభిప్రముఖతూర్యఘోషంబులును ఋత్విజ్నికాయాశీర్వచనంబులును జె
లంగ వందిమాగధజనసంస్తూయమానుం డగుచు విగతగర్వుం డై యంతఃపు
రంబుం బ్రవేశించి యనంతరంబ. 559

సీ. సమధికమతిఁ బౌర । జనజానపదులచేఁ, దనరారువివిధపూ । జనము లొంది
రాజు సంతుష్టాంత । రంగుండుఁ బ్రియవర, ప్రదుఁడు నై వారల । బహువిధములఁ
బూజించె నివ్విధం । బున మహత్తరము లై, నట్టికర్మంబుల । నాచరించు
చును నిరవద్యచే । ష్టుం డై మహత్తముఁ, డన నొప్పునాపృథు । మనుజవిభుఁడు
తే. మించి భూమండలంబుఁ బా । లించి విశద, యశము సర్వధరాచక్ర । మందు నిలిపి
చారుశుభమూర్తి రాజన్య । చక్రవర్తి, పరమమోదమునఁ బరమ । పదమునొందె.
క. అని మైత్రేయమహాముని, యనఘుఁడు విదురునకుఁ జెప్పె । నని శుకుఁ డభిమ-

న్యనిసుతునకుఁ జెప్పిన తెఱఁగని సూతుఁడు సెప్పె శౌనకాదులతోడన్.

పృథుచక్రవర్తి సభాసదులకు సద్ధర్మము నుపదేశించి బ్రాహ్మణప్రశంస సేయుట.

వ. అని యెఱింగించి వెండియు నిట్లనియె నివ్విధంబున నాదిరాజన్యుఁడైనపృథుచ
క్రవర్తియశేషగుణవిజృంభితంబును నిర్దోషంబును సత్పురుషసత్కృతంబును నగు
యశంబును బ్రకటంబుగాఁ జేయం జాలుమైత్రేయునిం జూచి మహాభాగవతుం
డైనవిదురుం డిట్లనియె. 562

సీ. మునినాథ విను పృథుజనపాలచంద్రుండు, సాల గొప్ప మేదినీసురులచేత
రాజ్యాభిషేకసంపూజ్యుఁడై దేవతా, గణముచే లబ్ధార్హణుఁడు నగుచు
వైష్ణవతేజంబు వలనొప్ప ధరియించి, యర్థి నేయేకర్మ మాచరించె
నది నాకు నెఱిఁగింపు మనఘాత్మ భూమి యే, రూఢి గవాకృతిరూఢ యెవని
తే. విక్రమోద్దీప్తమై యొప్పి వెలయునట్టి, కర్మమున నిష్ఠ రాజన్యగణము బ్రదుకు
నట్టిపృథుకీర్తి ధరలోన నతివివేకి, దవిలి యెవ్వఁడు వినకుండు ధన్యచరిత.

క. నావుడు విని మైత్రేయుం, డావిదురునిఁ జూచి పలికె నతివినయమునం
బావనచరితుఁడు పృథుఁడు ధ, రావరనుతుఁ డలఘుయశుఁడు ప్రమదం బలరన్.

సీ. రంగదుత్తుంగతరంగగంగాయము, నామధ్యమందు నున్నతి వసించి
కైకొని ప్రారబ్ధకర్మక్షయార్థమై, యఖిలపుణ్యంబుల ననుభవించు
చును సర్వదేశంబులను దనయాజ్ఞ య, ప్రతిహతసత్ప్రతాపమునఁ జెల్లఁ
బూని సప్తద్వీపములకుఁ దా నొక్కఁడ, వైష్ణవభూసురావలికిఁ దక్కఁ
తే. దక్కఁ గల్గినప్రజకెల్ల దండధరునిఁ, బోలి వర్తించుచును గొంతకాల మరుగఁ
దవిలి యొకనాఁడు దీర్ఘసత్త్రంబు సేయ, నర్థిఁ గైకొని దీక్షితుండయ్యె నందు.
తే. రాజఋషి దేవఋషిపితృబ్రహ్మఋషులు, జనపతినిచేత విహితపూజనములొంది
సమధికైశ్వర్యగతి నున్నసమయమునను, జిరశుభాకారుఁ డారాజశేఖరుండు.

సీ. ఉన్నతోన్నతుఁడు సముత్తుంగభుజుఁడు స, న్నహనీయతరశోభమానముఖుఁడుఁ
జారుసంఫుల్లకంజారుణేక్షణుఁడు సు, నాసాపుటుండు మందస్మితుండు
వక్రసూక్ష్మస్నిగ్ధవరసీలకేశుండుఁ, గమనీయరుచికంబుకంధరుండు
సుభగవిశాలవక్షుండును ద్రివళిశో, భితమధ్యభాగుండుఁ బృథునితంబ
తే. మండలుండు నావర్తసమానసనాభి
వివరుఁడును గాంచనస్తంభవిలసదూరు
రాజితుండును నరుణచరణుఁడు లలిత
నవదుకూలోత్తరీయుఁ డున్నతయశుండు. 567

వ. మఱియు నియమనిమిత్తంబునం బరిత్యక్తభూషణుం డగుటం జేసి వ్యక్తాశేషగా
త్రశ్రీకుండును గృష్ణాజినధరుండును శ్రీమంతుండును గుశహస్తుండును గృతో
చితుండును శిశిరస్నిగ్ధతారాక్షుండును నైనపృథుచక్రవర్తి సభామధ్యంబునం

దారాగణమధ్యవిభాసితుండును సకలజనాహ్లాదకరుండును నగుసుధాకరుండునుం
బోలె వెలుంగుచు లేచి నిలుచుండి సదస్యసంతోషదాయకంబులును జిత్రపద
విరాజితంబులును బ్రసన్నంబులును బరిశుద్ధంబులును గంభీరార్థంబులును నవ్యా
కులంబులును నైనభాషణంబుల ని ట్లనియె. 568

క. వినుఁడీ సభ్యులు ధర్మము, ననయము నెఱుఁగంగఁ గోరునట్టిజనుఁడు దాఁ
దనతలఁపునఁ గలయర్థముఁ, జను నెఱిఁగింపంగ ధీరసత్పురుషులకున్. 569

సీ. ఏను నీలోకవితానంబు నెల్లను, శాసించి భూప్రజాసంతతులను
దత్తద్విహితవృత్తిదానంబులను జేసి, రక్షింప వివిధమర్యాదఁ దప్పి
పోకుండ నిలుపుట కై కమలజుచే ని,యోగింపఁబడితి ని ట్లొనరి యుంట
నిట్టిప్రజాపాలనాద్యనుష్ఠానవ,శంబునఁ బ్రాక్కర్మసాక్షి యీశుఁ

తే. డెట్టివానికి సంతుష్టి నెసఁగుచుండు, నట్టివానికి నేలోక మందు బుధులు
గామదుఘములు నైనలోకములు నాకు,సరవిఁ గలుగు ననుష్ఠానపరుఁడ నగుట.

వ. ఇట్లు ప్రజలను ధర్మంబులయందు ననుశాసింపక యర్థకాముండై వారివలన నప్ప
నంబులు గొనె నేని వారలపాపంబు దనకుఁ బ్రాపింపం దేజోహీనుండై భూవి
భుండు సెడుఁ గావునం బజలు భూపతిహితార్థంబునకు స్వార్థంబునకు ననసూ
యారహితులై వాసుదేవార్పణబుద్ధిం జేసి ధర్మంబు నెప్పుడు నాచరింప వలయు
నిదియు నన్ను ననుగ్రహించుట యదియునుం గాక పితృదేవర్షితుల్యు లగుమీర
లనుమోదించి కర్తయు ననుశాసకుండు ననుజ్ఞాతయు నగుననాకుఁ బరలోకం
బున నేఫలంబు గలుగు నట్టిఫలంబునకు సదృశం బైనకర్మం బాచరింప వలయు
న ట్లయిన సంతోషంబు నొందుదు ననిన వార లారాజేంద్రున కి ట్లనిరి. 571

క. జననాయక ప్రజ లిర వొం,దినధర్మము లెల్ల వాసుదేవార్పణబు
ద్ధిని జేయ వలయు నంటివి, యనయంబును వాసుదేవుఁ డనఁ గలఁడె మహిన్.

సీ. అన విని వారికి మనుజేశుఁ డను నద్వ్ర,తములార వినుఁడయ్య తవిలి మీరు
యజ్ఞాధిపతి యైనయఖిలేశ్వరుఁడు గొన్ని,మతములఁ గలఁడు ధీమంతులార
య ట్లైన మీరలు నందుకు విప్రతి,పత్తి గల్గుటను బ్రపన్న మరయఁ
గా దంటి రేని నాఘనునిచే రచిత మై, కాంతిమంత మగుజగంబు గానఁ

తే. బడుచు నున్నది యిట్టిప్రపంచరచిత
కర్మవైచిత్ర్య మమ్మేటి గలుగ కున్న
నమర నది తదుక్తులుఁ బ్రపన్నములు గావు
గాన యవ్వాసుదేవుండు గలఁడు మఱియు. 573

వ. అదియునుం గాక యీజగద్వైచిత్ర్యంబు గర్త యైనయీశ్వరుండు లేకున్నం
గర్మవశంబునం జేసి యుపపన్నం బగు నంటి రేని. 574

సీ. పూని ప్రియవ్రతోత్తానపాదధ్రువ, మనుల కన్నత్పితామహుఁ డనంగఁ
దగునంగమేదినీధవునకు మఱియును, వినుతి కెక్కినపృథివీపతులకుఁ
బర్హసంభవభవప్రహ్లాదబలిచక్ర, వర్తిప్రముఖభాగవతుల కర్థి
వర్గసుస్వర్గాపవర్గంబులకు నను, గతకారణుం డన ఘనత కెక్కి

తే. హీను లగుమృత్యుదాహిత్రుఁ డైనవేన, ముఖదురాత్ములధర్మవిమోహితులును
దక్కఁ దక్కినవారికిఁ దాఁ బ్రసన్ను, వరదుఁ డై యిచ్చు నభిమతార్థముల నతఁడు.

వ. ఇట్టివిధ్వదనుభవంబున భువనహితుం డగువాసుదేవుండు లేఁ డనుట యుపపన్నంబు గా దదియునుం గాక. 576

ఉ. భూరితపోభిరామమునిపూజన[1] మెవ్వనిపాదపద్మసే
వారతి వృద్ధిఁ బొంది యనివారణఁ బూర్వభవానుసారసం
సారమహోగ్రతాపము భృశంబుగఁ బాపఁగ నోపుఁ దత్పదాం
భోరుహజాతదేవనదిఁ బోలి యశేషమనోఘహారి యై. 577

వ. మఱియు.

చ. అనుపమభక్తి నెవ్వనిపదాంబుజమూలము మందిరంబు గా
ననయముఁ బొందువాఁడు నిహతాఖిలభూరిమనోమలుండు స
ద్వినుతవిరక్తిబోధధృతివీర్యవిశేషసమన్వితుండు[2] దా
ననఁ దగి భూరిసంసృతిమహత్తరదుఃఖము నందఁ డెన్నఁడున్. 578

క. నారాయణుండు జగదా, ధారుం డగునీశ్వరుండు దలఁప నతనికిఁ
లే రెందు సములు నధికులు, ధీరోత్తముఁ డతఁడు నద్వితీయుం డగుటన్. 579

వ. అదియునుం గాక. 580

ఉ. కర్మవశంబునన్ జగము గల్గును హెచ్చు నడంగు నన్నచోఁ[3]
గర్మముఁ బుద్ధిఁ జూడ జడకార్యము గాని ప్రపంచకల్పనా
కర్మమునందుఁ గర్త యనఁ గా విలసిల్లఁగఁ జాల దీజగ
త్కర్మకకార్యకారణము గావున నీశుఁడు విష్ణుఁ డారయన్. 581

వ. కావున మీర లవ్వాసుదేవుని నధికారానుసారంబున నిశ్చితార్థఫలసిద్ధి గలవార లై మనోవాక్కాయకర్మంబుల నిష్కపటవృత్తిం దగిలి వినుతినతిపరిచర్యాపూర్వకంబు గాఁ గామదుఘంబు లయిన యతనిపాదపంకజంబులు భజియింపుం డదియునుం గాక. 582

సీ. యాఢి నీశ్వరుఁడు స్వరూపంబునం జేసి, పూని విశుద్ధవిజ్ఞానఘనుఁడు
నగుణుండు నయినఁ దా నరయనికర్మమా, ర్గమునందు వ్రీహ్యాదిద్రవ్యములను
శుక్లాదిగుణము విస్ఫురదవఘాతాది, సత్క్రియలును మంత్రసంచయంబు
సంకల్పమును యాగసాధ్య మైనట్టియ, ఖండోపకారంబు ఘనపదార్థ

1 పూజ్యము లెవ్వని. 2 'మనీషకంతుఁడున్'. 3 నందులో' వ్రా. ప్ర.

తే. శక్తియు మఱి జ్యోతిష్టోమసవనముఖ్య, నామత బహువిశేషగుణతను మెఱయు
నట్టియధ్వరరూపమై యఖిలజగము, నందు ననిశంబుఁ బ్రఖ్యాతి నొందుచుండు.

వ. అదియునుం గాక దారుసంస్థితం బైనయనలంబు తద్దారుగుణంబు లయినదైర్ఘ్య వక్రత్వాదికంబుల ననుసరించుచందంబున నవ్యక్తంబు తత్క్షోభకం బయినకాలంబును వాసనయు నదృష్టంబు ననుకారణంబులచేతం బుట్టినశరీరంబునందు విషయాకారం బయినబుద్ధి నొంది తద్విషయాభివ్యంగ్యం బైనయానందస్వరూపుం డగుచుఁ గ్రియాఫలంబునం బ్రసిద్ధి నొందు నని చెప్పి వెండియు నిట్లను మఱీ యజనంబు లిమ్మేదినీతలంబున దృఢవ్రతులై యజ్ఞభుగీశ్వరుండును గురుండును నయినసర్వేశ్వరుని హరిని నిరంతరంబును స్వధర్మయోగంబునం బూజించుచున్నవారలు వారు న న్నాశ్చర్యకరంబుగా ననుగ్రహించువారని హరిభక్తిరతులైనమహాత్ముల నుతియించి వెండియు నిట్లనియె. 584

మ. వరసంపద్విభవప్రతాపసుమహైశ్వర్యంబులం బొల్చునీ
ధరణీనాథులతేజ మంచితతపోదాంతిక్షమావిద్యలం
గర మొప్పారు ధరాసుపర్వహరిభక్తశ్రేణులం దెప్పుడున్
ధరలోనం బ్రభవింప కుండు నని యద్ధాత్రీవిభుం డిట్లనున్. 585

చ. అరయఁగ నేధరామరపదాంబుజరేణువు లర్థిఁ దాల్చి య
ప్పరమపురాణపూరుషుఁడు బ్రాహ్మణదేవుఁడు నైనయట్టియీ
శ్వరుఁడు సదానపాయినిని సాగరకన్యను సర్వలోకవి
స్ఫురితపవిత్రకీర్తియును బొంది విభూతిఁ దనర్చెఁ గావునన్. 586

సీ. ఏవసుధామరసేవను జేసి య, శేషగుణాన్వితస్థితిఁ దనర్చు
సర్వేశ్వరుఁడు మతిసంతుష్టుఁ డగు నట్టి, ధరణిదివిజులఁ దద్ధర్మపరులు
నలఘువినీతులునై యవశ్యంబును, సేవింపరే ధరాదేవనిత్య
సేవచేఁ బురుషుఁడు చిరతరజ్ఞానవి, ద్యాభ్యాసి గాకున్న నైన నతఁడు

తే. వేగమున నంతరంగంబు విశద మగుటఁ, జేసి కైవల్యపదమును జెందునట్లు
గాన లోకులు భూదేవతానికరముఁ, దగిలి భజియింపవలయు నుదాత్తమతిని.

వ. మఱియు. 588

సీ. విజ్ఞానఘనుఁ డనువెలయునీశ్వరుఁడు త, త్త్వజ్ఞానయుతులైనవారిచేత
దీపింప నింద్రాదిదేవతోద్దేశంబు, నను భూమిసురముఖంబున హుతంబు
లగుహవిస్సులఁ దృప్తి నందినగతి నచే, తనమైనయాహుతాశనముఖంబు
వలన వేల్చినహవిస్సులచేతఁ దృప్తుండు, గాకుండుఁ గావున లోకమందు

తే. నగ్నిముఖముకంటెను ధరామరేంద్ర, ముఖముపరిశుద్ధ మత్యంతముఖ్యమనఁగఁ
దనరు నదిగాన భూసురార్చనము సకల, జనులుఁ గావింపఁదగు నార్యజనములార.

వ. అదియునుం గాక. 590

సీ. ఏవేదమందేని యీవిశ్వ మెల్లను, దర్పణప్రతిబింబితప్రభూప
నివహంబుకైవడిఁ దవిలి ప్రకాశించు, నట్టివిరజమును నవ్యయమును
నగుచు సనాతనం బగువేద మేధరా, దేవతాజన మనుదినముఁ దగిలి
మహితశ్రద్ధాతపోమంగళమౌనసం, యమసమాధులఁ బొలుపారుచుండి

తే. యర్థిసదసద్విచారులై యధికరింతు. రట్టివారల పదరజం బర్థిఁ దాల్చు
నలఘులకు సర్వపాపక్షయంబు నఖిల,సద్గుణావాప్తియును నగుఁ జతురులార.

వ. కావున నట్టివిప్రపాదసరోజరేణువు లేనును గిరీటంబున ధరియింతు నిట్లు బ్రాహ్మణ
భజనంబునం జేసి యవాప్తసకలగుణుండును శీలధనుండును గృతజ్ఞుండును శ్రద్ధా
యుక్తుండును నైనమహాత్ము నఖిలసంపదలు ప్రాపించుం గావున గోబ్రాహ్మణ
కులంబును ననుచరసమేతుం డయినజనార్దనుండును నామీఁదం బ్రసన్ను లయ్యె
దరు గాక యని పలుకుచున్నపృథుచక్రవర్తిం గనుంగొని పితృదేవద్విజసత్పురు
షులు సంతుష్టాంతరంగులై సాధువాదంబుల నభినందించి యి ట్లనిరి. 592

క. మనుజేంద్ర వినుతంబున, ననుపమఘన బ్రహ్మదండహతుఁ డత్యఘవ
ర్తనుఁడు నగునట్టి వేనుం, డనయము నరకంబువలన నర్థిఁ దరించెన్. 593

వ. కావునం బుత్రేణ లోకాన్ జయతి యను వేదవచనంబు నిశ్చయం బదియునుం
గాక. 594

చ. పురుషవరేణ్య హేమకశిపుండు రమాలలనేశునిందచే
నరకము నొందఁ గోరియు గుణజ్ఞుఁడు భాగవతుండు నైనయా
వరతనయప్రభావమున వాసికి నెక్కి విధూతపాపుఁడై
నిరయముఁ బొందఁ డయ్యె నతినిర్గలకీర్తిఁ [1]దనర్చెఁ గావునన్. 595

క. అని పలికి వీరవర్యం, డనఁ దగుపృథునిశాశ్వతంబు లగుహాయనముల్
దనరఁగ జీవింతువు గా, కని తగ నాశీర్వదించి యభిమత మొప్పన్. 596

వ. వెండియు ని ట్లనిరి దేవా నీవు సకలలోకభర్త యగునారాయణునందు నిట్టిభక్తి
వొడముటం జేసియు బ్రహ్మణ్యదేవుండు నుత్తమశ్లోకుండు నైనసర్వేశ్వరుని
సత్కథాజాలంబు వ్యక్తంబు సేయుచున్ననీవు మాకు నాథుండ వగుటం జేసి
యు నేము ముకుందదాసుల మైతి మీభవదీయప్రజానుశాసనంబు ప్రజానురా
గంబు గలకారుణ్యమూర్తులైనమహాత్ములకు స్వభావంబులు గావున నాశ్చర్యం
బు గాదు దైవసంజ్ఞితంబు లగునకర్మంబులచేత విసృష్టజ్ఞానుల మై పరిభ్రమించు
మాదగుతమఃపారంబుఁ గంటి మేసర్వేశ్వరుండు బ్రాహ్మణజాతి నధిష్ఠించి క్ష
త్రియులను క్షత్రియజాతి నధిష్ఠించి బ్రాహ్మణులను నీయుభయంబు నధిష్ఠించి
విశ్వంబును భరియించు నట్టివివృద్ధసత్త్వుండు సర్వరూపుండు మహాపురుషుండు

1 ధరించెఁ.

నైనపృథునకు నీశ్వరబుద్ధిం జేసి యేము నమస్కరింతు మనుసమయంబున. 597

పృథుచక్రవర్తియొద్దకు సనకాదు లరుగుదెంచుట.

క. వినువీదినుండి మెల్లన, చనుదెంచిరి బాలసూర్యసంకాశతనుల్
జనవినుతసిద్ధవర్యులు, సనకాదులు శేముషీవిచక్షణు లంతన్. 598

వ. ఇట్లు సనుదెంచి. 599

క. అనఘాత్ము లతిథిరూపం,బున రా గృహమేధి ప్రాణములు నుద్గతిచేఁ
దనరినఁ బ్రత్యుద్గతివం,దనముల [1]మరలం బ్రతిష్ఠితము లగు ననుచున్. 600

క. వినఁబడువచనన్యాయం,బున నుద్గతము లగుప్రాణములఁ గ్రమ్మఱఁ బొం
దను గోరువాఁడునుంబలె, ననుచరయుక్తుండు నిస్పృహుండై పృథుఁ డంతన్. 601

తే. ఇంద్రియేశుఁడు గంధాదిశేష్టగుణముఁ, గూర్చి యుద్గమనక్రియఁ గోరి చేయు
పగిదిఁ బృథుచక్రవర్తి సంభ్రమముతోడ, మహితభక్తిని బ్రత్యుద్గమంబుసేసె.

క. ఘనగౌరవమున నమ్ముని,జనచిత్తవశీకృతుండు సభ్యుఁడుఁ బ్రియుఁడున్
వినయానతకంధరుఁడై, జనవరుఁ డాపరమయోగిచంద్రుల నెలమిన్. 603

సీ. పూని యర్హాసనాసీనులఁ గావించి, కర మర్థి విధివత్పురస్కారమునను
బూజించి తత్పదాంభోరుహక్షాళన,సలిలంబు లాత్మమస్తమునఁ దాల్చి
హాటకకలితసింహాసనాసీనులై, విహితాగ్నులను బోలి వెలుఁగుచున్న
శర్వాగ్రజన్ముల సనకాదులను జూచి, యతులశ్రద్ధాసంయమాన్వితుండుఁ

తే. బరమసంప్రీతమతియునై పలికె రాజు, గోరి యోమంగళాయనులార పూర్వ
భవమునం దెద్ది మంగళప్రదసుకర్మ, మేను జేసితి మిముఁ జూడ నిపుడు గలిగె.

వ. అని వెండియు. 605

క. భువి నెవ్వనియెడ విప్రులు, భవుఁడును విష్ణుఁడుఁ దదీయభక్తులును బ్రస
న్నవదను లగుదురు వానికి, భువి దివిని నసాధ్యకర్మములు లే వరయన్. 606

వ. అని మఱియు ననఘాత్ములారా లోకంబుల నీక్షించుచుం బర్యటనంబు సేయు మిమ్ము సర్వదర్శనుం డయినయాత్మం గనుంగొనఁ జాలనిసర్వదృశ్యంబుచందంబున నీలోకంబు గనుంగొనఁ జాలకుండు నట్టిమహాత్ముల రయినమీదర్శనంబునం జేసి నేను ధన్యుండ నైతి నదియునుం గాక. 607

చ. అరయ ధరిత్రి నెవ్వనిగృహంబు మహార్హజనోపయోగ్యవి
స్ఫురితతృణాంబుభృత్యగృహభూముల సారెఁ దనర్చు నట్టిమం
దిరపతి పేదవైన జగతిం గడు ధన్యుఁ డటంద్రు గాన సు
స్థిరమతి మీరు వచ్చుట నశేషశుభంబుల నేను బొందెదన్. 608

వ. అదియునుం గాక. 609

చ. వరమతులార యెవ్వనినివాసముఁ [2]దీర్థపదాంతరంగులై

---

1 ను బునః ప్రతిష్ఠి. 2 దీర్ఘపదాంబుజాతులై.

పరఁగినయట్టిభాగవత। పాదజలంబులు సోఁక వేనిఁ ద
త్పురుషుఁడు భూరిసంపదలఁ । బొంపిరిపోయిన నైన వానిమం
దిర మురగప్రకీర్ణజగ। తీజముఁ బోలు నటండ్రు కోవిదుల్. 610
వ. అని పలికి వెండియు ని ట్లనియె. 611
సీ. పరమపావనులార । బాల్యంబునందుండి, మానితశ్రద్ధాస। మన్వితులును
గుణనిధుల్ ధైర్యయు। క్తులు ముముక్షువులు నై, యధికవ్రతంబుల। నాచరించు
రట్టిపుణ్యులు భవ। దాగమనంబు స్వాగత మయ్యె సత్కృపా। కలితులార
యనివారితవ్యస। నార్ణవం బయినట్టి, భూరిదుర్లంఘ్యసం। సారమందు
తే. [1]మతివిహీనస్వకీయక। ర్మములఁ జేసి, యడరి మగ్నుల మై యింద్రి। యార్థములనె
తివిరిపురుషార్థములుగాఁగఁ। దెలియుమాకుఁ, గుశలమున్నదె లోకైక। కుశలులార.
వ. మీర లాత్మారాము లగుటం జేసి మీయందుఁ గుశలాకుశలరూపంబు లయిన
మతివృత్తులు సంభవింపవు గావునం గుశలప్రశ్నం బుపపన్నంబు గాదు నేను
గృతవిశ్వాసుండ నై సంతప్తు లయినవారలకు సుహృత్తు లైన మిమ్ము నాకు నీసం
సారంబునందు నేమిట వేగంబె క్షేమంబు గలుగు నని యడిగెద నాత్మవంతులకు
నాత్మయు నాత్మభావనుండు నయిన యీశ్వరుండు భక్తానుగ్రహంబుకొఱకు నీ
లోకంబుల మీవంటిసిద్ధరూపంబున వర్తించుచుండు నని పలికిన యతనిగంభీ
రార్థగౌరవంబులును శుభకరంబులును న్యాయసహితంబులును మితాక్షరంబు
లును శ్రోత్రప్రియంబులును నయిన వచనంబులు విని సంప్రీతచేతస్కుండును
మందస్మితుండును నై సనత్కుమారుం డి ట్లనియె. 613
మ. ధరణీశోత్తమ సర్వభూతహితచే। తస్కుండ వై ధర్మసు
స్థిరభాగ్యోదయశాలి వై యెసఁగునీ। చే సాధులోకోత్తరో
త్తరసంప్రశ్నము సేయఁగాఁబడె మహా। త్మా సాధులోకైకస
చ్చరితంబుం దలపోయ నిట్టిద కదా । చర్చింప లోకత్రయిన్. 614
తే. ధరణి సజ్జనసంగంబు । దలఁప నుభయ, సమ్మతం బగువారలు । సలుపునట్టి
సరససంభాషణప్రశ్న। సరణి నిఖిల, జనములకు సుఖకర మగు । జనవరేణ్య. 615
వ. అని యభినందించి మోక్షసాధనోపదేశకాముం డైన యప్పృథుచక్రవర్తికి వెండియు
ని ట్లనియె. 616
సీ. ధరణీశ మధునిషూ। దనుఁ డైనయట్టినా, రాయణులలితపా। దారవింద
వరగుణధ్యానధీ। పరిణతత్వంబున, సకలాత్మమలవిమో। చనము లైన
రతియును నిత్యవై। రాగ్యంబు మొదలు గా, లోకోత్తరుఁడ వైన। నీకుఁ గలవు
సమ్యగ్విచారశా। స్త్రములందు జనులకు, సేమంబునకును ని। శ్చితము లయిన
తే. యాత్మవ్యతిరిక్తవస్తువు। లందు వీత, రాగతఁ దలంప నిర్గుణ। బ్రహ్మ మయిన

1 మఱి యెపుడు స్వకీయ.

యాత్మయందులరతియును · ననఁగ నివియ, హేతువులు బుద్ధిఁ జింతింప · నిద్ధచరిత.

వ. కావున శ్రద్ధయు భగవద్ధర్మచర్యయుఁ దద్విశేషజిజ్ఞాసయు నాధ్యాత్మికయోగ నిష్ఠయు యోగీశ్వరోపాస్తియుఁ బుణ్యోపాశ్రయుండును బుణ్యశ్రవణుండును నైననారాయణకథాలాపంబులు నర్థేంద్రియారామ్ములైనవారలతోడిసంగతుల యందు విరక్తియు వారల కభిమతంబులైనయర్థకామంబులందు ననాకాంక్షయు సర్వేశ్వరునిగుణకీర్తనామృతపానంబు దక్క నితరపదార్థంబులందు వైరాగ్యంబు నొంది యాత్మారామత గలిగి విజనస్థలంబులందులనుచి గలుగుటయును నహింసయు శమాదిప్రధానవృత్తియు నాత్మహితానుసంధానంబును భగవత్కథాను స్మరణంబును నకామ్యంబు లయినయమనియమంబులును నితరభక్తిమార్గాగర్హణంబును యోగక్షేమార్థక్రియారాహిత్యంబును శీతోష్ణాదిద్వంద్వసహిష్ణుతయు భాగవతకర్ణాలంకారభూతం బగుభగవద్గుణాభిధానంబును వీనిచేత విజృంభమాణం బయినభక్తియోగంబునం జేసి యనాత్మయందు నసంగంబును గార్యకారణ రూపం బగునిర్గుణబ్రహ్మంబునందు రతియును నెప్పుడు గలుగు నప్పుడ సదాచార్యానుగ్రహవంతుం డయినపురుషుండు బ్రహ్మనిష్ఠులతోడఁ జెలిమి సేయుచు నీషణత్రయంబు వర్జించి ప్రకృతిం జేరక జ్ఞానవైరాగ్యవేగంబునం జేసి. 618

సీ. అనఘ సాక్షాత్కార · మగుభక్తియోగాగ్నిఁ, గడఁగి జీవాధార · కమును బంధ
భూతాత్మకంబు నై · పొలుచుహృద్గ్రంథిని, బూని స్వకారణ · భూత మయిన
యరణి దహించుహు · తాశనుకైవడి, నిర్దహించిన నిట్లు · నెఱిసి దగ్ధ
చిత్తుఁడై ముక్తని · శ్శేషాత్మగుణుఁడు [1]స, ద్గురుఁడు నైనయ · తండు మిగుల

తే. నర్థబాహ్యంబులయినఘ · టాదికములు, నాంతరములైనసౌఖ్యదుః · ఖాదికములు
ననువిభేదము లాత్మ[2]భే · దనము లగుట, నయ్యుపాధివినాశంబు · నందఁగలఁడు.

వ. అది యెట్లనిన. 620

చ. పురుషుఁడు నిద్రవోఁ గలలఁ · బొందినయాత్మసుఖైకహేతు వై
పరఁగిన రాజభృత్యజన · భావగుణంబులు సంప్రబోధమం
దరయఁగ మిథ్య యైనగతి · నాంతరబాహ్యగుణప్రభేదముల్
పరువడిఁ గాన కుండు జన · పాలనశీలన నిత్యఖేలనా. 621

వ. మఱియును ద్రష్ట యైనయాత్మయు దృశ్యం బయినయింద్రియార్థంబు ననువీనికి నహంకారంబు సంబంధహేతు వగుటం జేసి యది యంతఃకరణంబునం గలుగు చుండు జాగ్రత్స్వప్నంబులయం దీభేదంబు గనుంగొను చుండు నిట్టియంతఃకరణంబు లేనిది యగుసుషుప్తికాలంబునం బురుషుండు జలదర్పణాదినిమిత్తాభావం బగునప్పుడు బింబప్రతిబింబభేదంబు గనుంగొననిచందంబున దృశ్య భేదంబు గనుంగొన కుండుం గావున నంతఃకరణవిలయంబు నొందిన బాహ్యం

1 సహృదయుఁడు. 2 సాధనము లగుట.

తరభేదంబు గన కుండుట నిశ్చయం బని వెండియు ని ట్లనియె. 622

సీ. భువి విషయాకృష్టభూతంబు లయినయిం, ద్రియములచేతను దివిరి మనము
దగ విషయాసక్తిఁ దగిలి యాంతర మైన, మహితవిచారసామర్థ్య మెల్ల
[1]శరకుశాది స్తంబజాలంబు హ్రదతోయ, ములు గ్రోలుగతిఁ గ్రమంబున హరించు
నీరీతి నంతర్విచారసామర్థ్యంబు, నపహృతం బయినఁ బూర్వాపరాను

తే. మేయసంధానురూపసంస్మృతి నశించు, నది నశించిన విజ్ఞాన మంతఁ దొలఁగు
నట్టివిజ్ఞాననాశంబు నార్యజనులు, స్వాత్మ కది సకలాపహ్నవం బటండ్రు. 623

వ. అదియునుం గాక యాత్మన స్తు కామాయ సర్వం ప్రియం భవతి యనువేద వచనంబునం జేసి విషయంబులకుం బ్రియతమత్వం బైనయాత్మోపాధికంబు నొంది యాత్మాపహ్నవంబునం బాటిల్లుస్వార్థనాశం బెద్ది గలుగు దానికంటె లోకంబున నధికం బైనస్వార్థనాశంబు లే దది యె ట్లనిన సర్వార్థనాశంబునకు స్థైర్యంబు నొందించునట్టియర్థకామాభిధ్యానంబునం దద్ధేతుకం బైనస్వార్థనాశంబునం బరోక్షాపరోక్షరూపజ్ఞానంబునం జేసి నశించుం గావున నాత్మాపహ్నవంబునకంటె నధికతరం బైనసర్వార్థనాశంబు లే దని వెండియు ని ట్లనియె. 624

సీ. అనఘ యీసంసార మతిశయంబునఁ దరి, యింపంగ మది నిశ్చయించువాఁడు
గైకొని ధర్మార్థకామమోక్షములకు, నతివిఘాతుక మెద్ది యట్టిదాని
వలన సంగము సేయ వలవ దాధర్మాను, లందుఁ ద్రివర్గంబు నంతకోగ్ర
భయయుతంబగుటను బరమమోక్షంబె ము, ఖ్యార్థ మై విలసిల్లు నండ్రు బుధులు

తేఁ. భువి గుణవ్యతికరమునఁ బుట్టినట్టి, యబ్జజాతాదులకు నస్మదాదులకును
గాలవిధ్వంసితాఖిలక్రమము గల్గుఁ, గలుగ దెన్నఁడు సేమంబు గాని వినుము.

వ. కావున మోక్షంబె పరమపురుషార్థం బని చెప్పి వెండియు ని ట్లనియె నరేంద్రా దేహేంద్రియప్రాణబుద్ధ్యహంకారపరివృతంబు లయినయీస్థావరజంగమంబుల హృదయంబులందు వ్యాపకుండుఁ బ్రత్యక్షభూతుండుఁ బ్రత్యగ్రూపుండు భగవంతుండు నయినయీశ్వరుం డంతర్యామిరూపంబునం బ్రకాశించుచుండు నది నారాయణునిసద్రూపంబు గాఁ దెలియు మని వెండియు ని ట్లనియె. 626

ఉ. భూవర యీమహాపురుషభూషణునందుల నీసమస్తవి
శ్వావళి లీలమై సదసదాత్మకభావము నొంది భూరిమా
యావిభవంబులం దగి సమగ్రవివేకనిరోధిస్రగ్ఘనా
శీవిషబుద్ధిఁ దోఁచుచు విశేషగతిన్ వెలుఁగొందు నెప్పుడున్. 627

చ. సుమహితనిత్యముక్తపరిశుద్ధవిబుద్ధసుతత్త్వుఁ డై యుగు
క్రముఁ డభిభూతసత్ప్రకృతి[2]కర్మకళంకుఁడు నైనయట్టియు
త్తమచరితుం గృపాకరు నుదాత్తగుణోన్నతు నీశ్వరేశుఁ జి

1. శకులకుశీరాదిజాలంబు. 2 కర్మకలుండును నైన.

త్తమునఁ దలంపు మయ్య జనతాపరిరక్షణ దుష్టశిక్షణా. 628

సీ. వసుమతీనాథ యెవ్వనిపాదపద్మప,రాగవిలాససల్లలితభక్తి
సంస్మరణంబుచే సజ్జనప్రకరంబు, ఘనకర్మసంచయగ్రథిత మగున
హంకార మనుహృదయగ్రంథిఁ జెఱుతురు, వివరింప నిట్లు నిర్విషయమతులు
మహి నిరుద్ధేంద్రియమార్గులు నైనట్టి,యతులకుఁ జేరంగ నలవి గాని
తే. యట్టిపరమేశుఁ గేశవు నాదిపురుషు, వాసుదేవుని భువనపావనచరిత్రు
నర్థి శరణంబు గాఁ దత్పదాంబుజములు, భక్తి సేవింపు గుణసాంద్ర పార్థివేంద్ర.

మ. అరిషడ్వర్గమహోర్మినక్రనికరవ్యాకీర్ణసంసారసా
గర మజ్ఞోదరకీర్తనాతరణిసాంగత్యంబునం బాసి తా
మరు దారంగ నఘాపహప్రకటయోగాదిక్రియాయుక్తిచేఁ
దరియింపన్ మదిఁ గోరువారలకు దుర్దాంతం బగుం గావునన్. 630

మ. ధరణీశోత్తమ నీవు కేవలసముద్యద్భక్తి ధీయుక్తిమై
వరగోవిందపదారవిందయుగభాస్వన్నావ సంధించి దు
స్తరభూరివ్యసనాకరోల్లసితదుర్దాంతోగ్రగంభీరసం
సరణాంభోధిఁ దరింపవయ్య పరమోత్సాహంబు దీపింపఁగన్, 631

క. అని యీగతిఁ బంకరుహా,సనసుతుఁడును బ్రహ్మబోధశాలియు నగునా
ఘనయోగివల్లభునిచే,తను దెలియఁగఁబడిన బ్రహ్మతత్త్వుం డగుచున్. 632

క. జనపతి మునిఁ బొగడి ముదం,బున నిట్లనుఁ బూర్వజన్మమున నే దీనా
వనుఁ డైనయీశ్వరునిచే,తను నిక్క మనుగ్రహింపఁ దగితి మునీంద్రా. 633

క. వినుఁ డట్టియనుగ్రహసా,ధనమున కై మీర లిపుడు దగ నిచ్చటికిం
జనుదెంచితిరి దయాళురు, ననఘులు భగవత్తములును నగుమీచేతన్. 634

సీ. నిరతంబు నాయందు నిష్పాదితము లగు, దేహసమేతమదీయరాజ్య
సర్వసంపదలును సద్ద్విజదత్తముల్, గావునఁ బ్రాణకాంతావిభూతి
మందిరసుతరాజ్యమహిబలకోశప,రిచ్ఛదంబుల నెల్ల ధృతిఁ దలంప
రాజుకు భృత్యుండు రాజకీయము లగు,తాంబూలముఖపదార్థములఁ జేసి
తే. రమణసంతర్పణోపచారములు నడపు,గతిని వారల కవి నివేదితము లయ్యెఁ
గాన మీకుపచార మేగతి నొనర్తు, [2]నతులగుణసాంద్ర యోగికులాబ్ధిచంద్ర.

వ. అది యెట్లు బ్రాహ్మణాధీనం బంటి రేని సేనాధిపత్యరాజ్యదండనేతృత్వసర్వలో
కాధిపత్యంబులు వేదశాస్త్రవేది యైనబ్రాహ్మణునకు కాని యితరులకు యోగ్యం
బులు గావు గావున బ్రాహ్మణులకు భోజనవసనదానంబులు స్వకీయంబు లై
యుండు క్షత్త్రియాదులకు బ్రాహ్మణానుగ్రహంబున నన్నమాత్రంబు దక్కం
దక్కినవస్తుస్వాతంత్త్ర్యంబు లేదు గావున మీకు గురుదక్షిణ నేమి సమర్పించు

1. నీపదార్చనమున. 2. నతులగుణసాంద్రులార మహాత్ములార.

వాఁడ నదియునుం గాక స్వాతంత్ర్యంబు గలిగిన నిట్టి యధ్యాత్మవిచారులు వేదాంతవేదులు నై భగవద్భక్తి నుపదేశించెడుమీవంటిపుణ్యాత్ములకుం బరిహాసాస్పదుండు దక్కఁ దక్కినవాఁ డెవ్వం డంజలిమాత్రంబు దక్కఁ దక్కిన ప్రత్యుపకారంబు సేయం దలంచు నది గావున దయాళువులై నమీరలు స్వకృతోపచారంబులం జేసి సంతుష్టాంతరంగు లగుదురు గా కని పలుకుచున్న యాదిరాజయినపృథుచక్రవర్తిచేతఁ బూజితులై యాత్మయోగనిష్ఠులై నసనకాదులతనిస్వభావంబుఁ బ్రశంసించుచు సమస్తజనంబులుఁ జూచుచుండ నాకాశగమనంబునం జని రయ్యవసరంబున. 636

పృథుచక్రవర్తి జ్ఞానవైరాగ్యవంతుండై ముక్తి నొందుట.

ఆ. విను మహాత్మముఖ్యుఁ డనఁ దొప్పు వైన్యుఁ డే, కాగ్రచిత్తుఁ డగుచు నాత్మనిష్ఠుఁ
డై నయట్టితను నవాప్తకామునిఁ గాఁగ, బుద్ధిలోనఁ దలఁచె భూవరుండు. 637

వ. అంత. 638

సీ. కర్మంబులను యథాకాలదేశోచిత, బలవిత్తములు గాఁగఁ బరఁగుధర్మ
ములను బ్రహ్మార్పణబుద్ధిని జేసి క, ర్మాసక్తుఁ డగుచు సమాహితుండు
ప్రకృతికంటెను దన్నుఁ బరమైనయాత్మను, గర్మసంచయసాక్షిఁగాఁగ బుద్ధి
నర్థిఁ దలంచుచు నాచరించుచు నట్లు, మెఱసి సామ్రాజ్యలక్ష్మీసమేత

తే. మందిరోద్యానవనభూములందు రాజ్య
గరిమ వర్తింపఁగా నహంకారరహితుఁ
డగుచుఁ దనచిత్తమున నింద్రియార్థములను
దగులకయ యుండె సన్మహోదారుఁ డగుచు. 639

వ. ఇట్లధ్యాత్మయోగనిష్ఠుం డై కర్మంబుల నాచరించుచు నర్చి యనుభార్యయందు విజితాశ్వుండు ధూమ్రకేశుండు హర్యశ్వుండు ద్రవిణుండు వృకుండు ననునాత్మసము లైనపుత్రుల నేవురం గనియె నంత. 640

క. జనవినుత భూమివలనను, ధనముల మర్యాదఁ గొనుచు దాననిమిత్తం
బునఁ గ్రమ్మఱఁ దా నిచ్చుచు, దిననాయకుఁ బోలి వసుమతీపతి యొప్పెన్.

వ. అతండు మఱియు నగ్నిచందంబునం దేజోదుర్ధర్షుండును మహేంద్రునిపగిది దుర్జయుండును ధరణికరణి సతతక్షమాయుక్తుండును స్వర్గంబునుంబోలె నభీష్టదుండును బర్జన్యునిభాతిఁ గామితప్రవర్షణుండును సముద్రురీతి గాంభీర్యయుక్తుండును మేరువుపోలికి ధైర్యవంతుండును ధర్మరాజుకై వడి ననుశాసకుండును మహేంద్రునివిధంబున నైశ్వర్యవంతుండును గుబేరునిమాడ్కి ధనవంతుండును వరుణునిసరణి గుప్తార్థుండును సర్వాత్మకుం డగువాయువుచెలువున బలౌజస్తేజోయుక్తుండును రుద్రునిపగిది నసహ్యతేజుండును గందర్పునియనువున సౌందర్యవంతుండును మృగరాజునోజ నధికశౌర్యోపేతుండును మనువునవువున వాత్సల్య

యుక్తుండును నజునిచందంబునం బ్రభుత్వసమేతుండును బృహస్పతిగరిమ బ్రహ్మ
వాదియు సర్వేశ్వరునిజాడ జితేంద్రియుండును నై విష్వక్సేనానువర్తను లైన
గోగురువిప్రజనంబులందు భక్తి గలిగి లజ్జావినయశీలంబులందు బరోపకా
రంబునందును నిరుపముం డై యివ్విధంబున సర్వలోకపాలకపృథగ్విధగుణంబుల
నన్నింటినిం దా నొక్కరుండ ధరియించి. 642

క. అనఘాత్మక లోకత్రయ,మున సజ్జనకర్ణరంధ్రముల వినఁబడు నా
వినుతయశోమహనీయుఁడు, జనవినుతుం డైనరామచంద్రునిమాడ్కిన్. 643

చ. సరసవచోర్థసత్పురుషసంఘసమంచితగీయమానసు
స్థిరవరకీర్తిపూరముల దిగ్గజకర్ణములందు నించి తా
నిరుపమసౌమ్యభాషణమనీషలచేతఁ బ్రజానురంజి యై
ధరణిని రాజనామమునఁ దాఁ దగు రెండవచంద్రుఁడో యనన్. 644

వ. మఱియు నమ్మహాత్ముండు విజ్ఞానియు వర్ధితాశేషసత్త్వానుసర్గుండును బ్రజాపాలకుం
డును స్థావరజంగమవృత్తిదాయకుండును సత్పురుషధర్మవర్తనుండును నిష్పాది
తేశ్వరాదేశకుండును నై నప్పృథుం డొక్కనాఁడు దనవార్ధకంబు నీక్షించి నిజా
త్మజ [1]నాత్మజులయందు నిలిపి ప్రజలు చింతాతురచిత్తు లగుచుండ నిజభా
ర్యాసమేతుం డై యప్రతిహతనియమంబున వైఖానససమ్మతం బైనయుగ్రతపం
బునందుఁ బూర్వంబున దిగ్విజయప్రవృత్తుం డగుచందంబునం బ్రవృత్తుం డై
తపోవనంబునకుం జని యందు. 645

మత్తకోకిలము. కందమూలఫలాశి యై బహుకాల ముగ్రతప పరి
స్పందుఁ డై యటమీఁదటం దృణపర్ణభక్షణ సేసి యా
చంద మేది జలాశి యై నృపసత్తముం డది మాని తా
మందగంధవహాశి యయ్యెఁ గ్రమంబునన్ దృఢచిత్తుఁ డై. 646

వ. ఇట్లు వర్తించుచు. 647

సీ. మెండుగా మిటమిటమండు వేసవియందుఁ, దప్తపంచాగ్నిమధ్యమున నిలిచి
మానక జడి గొన్నవానకాలంబునఁ, బైఁ గోక వేయక బయట నిలిచి
జనులు హూహూ యనుచలివేళఁ గుత్తుక,బంటితోయములలోపల వసించి
శిశిరంబు సాల నర్దిశలఁ బర్విన వేళ, వెలయ భూశయనుఁ డై విశ్రమించి
తే. మహితనియతిఁ దితిక్షాసమన్వితుండు
నియతపరిభాషణుఁడు జితానిలుఁడు దాంతుఁ
డిద్ధమతి యీశ్వరార్పితబుద్ధి యనఘుఁ
డూర్ధ్వరేతస్కుఁడును నై క్రమోచితముగ. 648

వ. అతిఘోరం బగునతపం బాచరించె నివ్విధంబునం గ్రమానిరుద్ధం బయినత

1 నాత్మజాలయందు నిలిపి జితాశ్వునకుఁ బట్టంబు గట్టి ప్రజలు.

పంబున విధ్వస్తాశేషకర్మమలాశయుండును బ్రాణాయామంబులచే జితారిషడ్వర్గుండును ఛిన్నబంధనుండును నై పురుషశ్రేష్ఠుం డైనపృథుచక్రవర్తి భగవంతుం డైనసనత్కుమారుం డెఱింగించినయోగమార్గంబున సర్వేశ్వరభజనంబు గావించె నిట్లు భగవద్ధర్మపరుండును సాధువర్తనుండును శ్రద్ధాసమన్వితుండును నైన పృథునకు నారాయణునందు భక్తి యనన్యవిషయం బై ప్రవృద్ధ బయ్యె నివ్విధంబున. 649

క. నరలోకోత్తర భగవ,త్పరిచర్యారాధనమునఁ దతశుద్ధాంతః
కరణుం డగునాపృథునకు, సరసిరుహోదరుకథానుసంస్మరణమునన్. 650

క. పరిపూర్ణం బగుభక్తిని, గర మనిశము సంశయాత్మకం బై చాలన్
వఱలినహృదయగ్రంథిని, నిరసించువిరక్తియుతమనీష జనించెన్. 651

వ. దానం జేసి యతండు సంఛిన్నదేహాత్మజ్ఞానుండు నధిగతాత్మస్వరూపుండు నై గదాగ్రజుం డగుశ్రీకృష్ణునికథాసక్తి నొంది సమస్తయోగసిద్ధులందు నిస్స్పృహుం డగుటను హృదయగ్రంథివిచ్ఛేదకం బగునజ్ఞానయోగంబును విడిచి యాత్మయందు నాత్మయోగంబుఁ గావించి బ్రహ్మభూతుం డయి నిజకళేబరంబు విడువ నిశ్చయించి. 652

సీ. కోరి మడమలచే గుదపీడనము సేసి, పూని యుక్తాసనాసీనుఁ డగుచుఁ
దనరుమూలాధారముననుండి వాయువు, నూర్ధ్వ మెగయించి యొనర నాభి
కలితంబు గావించి క్రమమున హృద్వక్ష,కంఠశిరఃకోష్ఠకములఁ జేర్చి
కైకొని మూర్ధభాగమునకు నెగయించి, ప్రాణముల్ విడిచి యాపవనుఁ బవను
తే. నందు నాకాశ మాకాశమందుఁ దేజ,మందు దేజంబు నుదకంబునందు నుదక
మర్థిఁ గాయంబు మేదినియందుఁ గలిపెఁ, బూని వానియథోచితస్థానములుగ.

వ. మఱియు భూమి నుదకంబునందును నుదకంబును దేజమందుఁ దేజంబును వాయువున వాయువు నాకాశంబునందు నాకాశంబును మనంబున మనంబు నింద్రియంబుల నింద్రియతన్మాత్రల భూతాది యైనయహంకారంబునందు నహంకారంబు మహత్తత్త్వంబునందును గూర్చి యట్టిసర్వకార్యహేతుభూతం బైనమహత్తత్త్వంబును జీవోపాధిభూతం బగునప్రకృతియందుఁ గలిపి జీవభూతుం డగునప్పురుషుండు జ్ఞానవైరాగ్యంబులచేత బ్రహ్మనిష్ఠుం డై మాయోపాధిం బాసి ముక్తుం డయ్యె నని చెప్పి వెండియు నిట్లనియె. 654

సీ. అంత నాపృథునిభార్యామణి యగునర్చి, పుడమిపై నడిపదముఁ గదిసినఁ గందు
సుకుమారపాదాబ్జసుందరీరత్నంబు, నతులపతివ్రత యగుటఁ జేసి
యాత్మేశకృతసువ్రతాచరణంబును, సుమహితభక్తిశుశ్రూషణమును
నార్షేయ మగుదేహయాత్రయు ననువీని, చేత మిక్కిలి కృశీభూతదేహ
తే. యయ్యుఁ బ్రియనాథకృతకరుణావలోక

కరతలస్పర్శనాదిసత్కారములను
నబల సుఖవృత్తిఁ జెంది యయ్యడవులందుఁ
గృశత మదిఁ దోఁప కుండఁ జరించునపుడు. 655

క. తనమనమున నేదుఃఖము, ననయంబు నెఱుంగనట్టియర్చి నిజాధీ
శునిప్రాణరహితదేహము, గనుఁగొని విలపించి విగతకౌతుక యగుచున్. 656

సీ. మానితమందరసానుప్రదేశంబు,నందుఁ జితారోప మర్థిఁ జేసి
లలితమహానదీసలిలసుస్నాత యై, కలితమహోదారకర్ముఁ డయిన
నాథున కుదకదానక్రియల్ గావించి, యతిభక్తి సురలకు నతు లొనర్చి
వహ్నికి ముమ్మాటు వలగొని పతిపాద,కమలయుగంబుఁ జిత్తమున నిలిపి
తే. వీరవరుఁ డైనపృథుపృథ్వీతలేశు, నందు ననుగమనము సేయునట్టిసాధ్వి
నర్చిఁ గనుఁగొని దేవభార్యాసహస్ర, మాత్మనాథులఁగూడి నెయ్యంబుతోడ.

క. పరమోత్కంఠను నమ్మం,దరగిరిసానుప్రదేశతలమున వరుసం
గురియించిరి నవసురభిత,వరమందారప్రసూనవర్షము లంతన్. 658

క. తర మిడి యచ్చర లాడిరి, మొరయించిరి శంఖతూర్యములు దివిజులు వా
డిరి కిన్నరజనులు పర,స్పరనుతు లొనరించి రాసురవర్యాంగనలున్. 659

వ. మఱియు ని ట్లనిరి. 660

సీ. చర్చింప నిట్టియాశ్చర్య మెందేనిని, గనుఁగొంటిరే యర్చి యనులతాంగి
ధన్యాత్మురాల్ గదా తనవిభుతోఁ గూడి, యిందిరారమణి యజ్ఞేశుఁ గూడి
వెనుచనుకైవడి ననుగమనము సేసె, నియ్యమ నిజహృదయేశుఁ డయిన
ఘను వైన్యు నూర్ధ్వలోకమ్మును బొందును, నేఁ డింతవట్టును నిశ్చితంబు
తే. పరమయోగీంద్రులకు దుర్విభావ్య మైన,దృఢసుకర్మమువలన నతిక్రమించి
వైన్యభూమీశు వెనుచని వరుసనూర్ధ్వ,[1]గామినియు నయ్యెనీ యింతి ఘనత నొంది.

వ. కాన పతివ్రతలకు నసాధ్యం బెందునుం గలదే యని మఱియును. 662

క. పరికింపఁగ నేమనుజుఁడు, హరిపదమును బొందఁ జేయునట్టివివేక
స్ఫురణం దనర్చు వానికిఁ, బరువడి నిలఁ బొంద రానిపదముం గలదే. 663

తే. అట్టియపవర్గసాధన మైనమనుజ, భావ మొందియు విషయసంబద్ధుఁ డగుచు
వసుధ నెవ్వఁడు వర్తించు వాఁడు ధరణి, ననయము నిజాత్మవంచకుఁ డనఁగఁ బరఁగు.

క. అని వారలు దన్నర్థిని, వినుతింపఁగ నర్చి యాత్మవిభుఁ డగుపృథుఁ డొం
దినయచ్యుతలోకంబున, ననుపమవిభవమును బొందె నని విదురునకున్. 665

క. మునివరుఁ డగుమైత్రేయుఁడు, వినయంబున నెఱుఁగఁ జెప్పి వెండియుఁ దగ ని
ట్లను నమ్మహానుభావుం, డనఘుఁడు భగవద్వరుండు నగుఁ బృథుఁ డనఘా. 666

క. ఏ నీ కిప్పుడు సెప్పితి, మాను గ నీపుణ్యకథను మహితశ్రద్ధా

1 గామి యగుచున్న దీయింతి గాన యిపుడు.

ధీనుండై విస్ఫురదవ,ధానుం డై యెవ్వఁడేనిఁ దనరినభక్తిన్. 667

క. వినినఁ బఠించిన వ్రాసిన, వినిపించిన వాఁడు పృథుఁడు విమలగతిం బొం
దినక్రియ హరిపద మొందెడు, ననయము నిర్ధూతపాపుఁ డగుచు మహాత్మా.

సీ. బ్రాహ్మణుఁ డంచితభక్తిఁ బఠించిన, బ్రహ్మవర్చసము సంప్రాప్త మగును
క్షత్రియుం డర్థిమైఁ జదివిన విన్నను, జగతీవిభుత్వంబు సంభవించు
వైశ్యుండు విని ధనవంతుఁ డై యొప్పును, శూద్రుండు వినిన సుశ్లోకుఁ డగును
మఱియును భక్తి ముమ్మాటు పఠించిన, విత్తవిహీనుండు విత్తపతియు

తే. నప్రసిద్ధుఁడు ప్రఖ్యాతయశుఁడుఁ బ్రజలు
లేనియధముఁడు వితతసంతానయుతుఁడు
మూర్ఖచిత్తుండు విజ్ఞానబోధమతియుఁ
నగుచు నుతి కెక్కుదురు మహితాత్మ మఱియు. 669

వ. ఈలోకంబునం బురుషులకు స్వస్త్యయనంబును నమంగళనివారణంబును ధనప్ర
దంబును యశస్కరంబును నాయుష్కరంబును స్వర్గదాయకంబులు గలిమలాప
హంబును నైనయీపుణ్యచరిత్రంబు చతుర్విధపురుషార్థకాము లైనవారికిఁ జతు
ర్విధపురుషార్థకారణం బగుం గావున వినం దగు సంగ్రామాభిముఖుం డైనరా
జీచరిత్రంబు ననుసంధించి విరోధి నెదిర్చిన నవ్విరోధి పృథునకుం బోలెఁ గప్పంబు
లిచ్చు ముక్తాన్యసంగుండును భగవద్భక్తుండును నైనవాఁడు పుణ్యంబును వైన్య
మాహాత్మ్యసూచకంబును నైనయీచరిత్రంబు వినుచుం బఠియించుచుం గృత
మతి యై దినదినంబును నాదరంబునం బ్రకటంబు సేయువాఁడు భవసింధుపోత
పాదుం డైనసర్వేశ్వరునియందు నచలం బయినభక్తి గలిగి పృథుచక్రవర్తి వోలెం
దినవిష్ణుపదంబుం బొందు నని యిప్పుణ్యచరిత్రంబు మైత్రేయుండు విదురున
కెఱింగించి వెండియు ని ట్లనియె. 670

క. పృథునకు నర్చికిఁ బుట్టిన, పృథుకీర్తిధనుండు ఘనుఁడు పృథుతుల్యుం డై
[1]పృథుశౌర్యధైర్యధుర్యుఁడు, పృథివిన్ విజితాశ్వుఁ డొప్పెఁ బృథివీపతి యై.

క. (విను మంతర్ధానగతిం, దనరుసునాసీరువలనఁ దగ విజితాశ్వుం
డును మఱి యంతర్ధానుం, డనుపేరఁ బ్రసిద్ధుఁ డయ్యె నతిచతురుం డై).672

సీ. స్థిరమతి రాజ్యాభిషిక్తుఁ డై యమ్మేటి, సమమతి నయ్యనుజన్ము లైన
హర్యశ్వునకు సమాదరమునఁ దూర్పు ద,క్షిణదిశఁ దగ ధూమ్రకేశునకును
బరఁగంగ వృకునకుఁ బశ్చిమభాగంబు, ద్రవిణున కర్థి నుత్తరపుదిశను
గొమ రొప్ప నలువురకును బంచి యిచ్చి స్వ,కాంత యైనట్టిశిఖండినికిని

తే. మనుజయోనిని జనియింపుఁ డనుచు మున్ను, పలికినట్టివసిష్ఠుశాపమునఁ జేసి
పూని త్రేతాగ్ను లతనికిఁ బుత్రు లగుచు, జనన మొందిరి సజ్జనస్తవ్యచరిత.

1 'పృథుశ్రవసుం డనుపేరను...విజితాశ్వుఁ డనెడిపేరం గడఁకన్' వ్రా. ప్ర.

వ. వారలు పావకుండుఁ బవమానుండు శుచియు ననునామంబుల మనుష్యయోనిం
బుట్టియు నాత్మప్రభావంబునం గ్రమ్మఱ నగ్నులయి చనిరి తదనంతరంబ. 674

క. అతఁడు నభస్వతి యనియెడి, ద్వితీయపత్నివలనను హవిర్ధానుఁడు నా
సుతుఁ గని విజితాశ్వుం డా, నతివిమతుఁడు రాజ్యవర్తనము దలపోయున్. 675

క. విమలాత్మ కరాదానము, దమశుల్కాదికము గరము దారుణ మని ధై
ర్యమునం దీర్ఘమఖవ్యా, జమునం దద్వర్తనంబు సమమతి విడిచెన్. 676

వ. ఇట్లు విడిచి. 677

క. అతఁ డాత్మదర్శనుం డయి, చతురతఁ బరమాత్ము హంసు సర్వేశ్వరుఁ ద
త్క్రతువున యజించి కుశలా, గ్భృతయోగసమాధ ముక్తిఁ బొందె మహాత్మా.

వ. అంత విజితాశ్వుండు పరలోకగతుం డయిన హవిర్ధానుండు హవిర్ధాని యను
భార్యవలన బర్హిషదుండు గయుండు శుక్లుండు గృష్ణుండు సత్యుండు జితవ్ర
తుండు ననుపుత్రుల నార్వురం గాంచె నందు బర్హిషదుండు. 679

సీ. సంతతసవనదీక్షాశాలి యగుచు ధ, రాతలం బెల్లను గ్రతువులకును
విలసిల్లుయజనశాలలు వేఱువేఱ క, ల్పించి యజ్ఞములు గావించు చుండి
చిరకీర్తి యతఁడు ప్రాచీనాగ్రకుశలచే, క్షితితలం బెల్ల నాస్తృతము సేయ
వసుధయెల్లను యజ్ఞవాట మై విలసిల్ల, సత్క్రియాకాండనిష్ఠాఢ్యుఁ డగుచు
తే. సుభగయోగసమాధినిష్ఠుఁడు ప్రజాప, తియగు ననితన్ను జనము నుతింప వెలయు
[1]నట్టిఘనుఁడు హవిర్ధాని యఖిలజగతిఁ, బఱపె కుశలను బ్రాచీనబర్హి యయ్యె.

వ. మఱియు నతండు. 681

చ. అలవడ నేసతీమణి సమంచితలీల వివాహవేళ ను
త్కలికఁ బ్రదక్షిణంబు లిడఁగాఁ గని హవ్యవహుండు దొల్లి యి
మ్ములఁ శుకిఁ జూచి మోహమును బొందినరీతి విమోహి యయ్యె నా
లలితవినూత్నభూషణ యలంకృతచారుశుభాంగి వెండియున్. 682

చ. సురుచిరభంగి నాసతి గిశోరవయఃపరిపాక యై రణ
ద్వరమణిహేమనూపురరవంబు సెలంగఁగ నాడుచుం దివా
కరరుచిరేఖ నొప్పెసఁగఁ గాఁ గని నిర్జితులైరి దేవకి
న్నరనరసిద్ధసాధ్యమునినాగనభశ్చరముఖ్యు లందఱున్. 683

వ. అట్టిసౌందర్యఖనియు సముద్రపుత్రియు నయినశతధృతి యనుకన్యం బ్రహ్మదే
శంబునం బాణిగ్రహణంబు సేసె నాశతధృతివలనం బ్రాచీనబర్హికిఁ బదుగురు
గొడుకులు జనియించిరి వారలు తుల్యనామవ్రతులును ధర్మపారగులును నయిన
ప్రచేతసులు ప్రజాసర్గంబునందుఁ దండ్రిచేత నాజ్ఞాపితు లయి తపంబు గావింప
నర్ణవంబునకుం జనుసమయంబునం దన్మార్గంబునఁ బ్రసన్నుం డగుచు దృశ్యమా

1 'నట్టిసుతుఁడు హవిర్ధానుఁ డనెడి పేరఁ, బరఁగ జనియించెఁ బ్రాచీనబర్హి యనఁగ' ప్రా. ప్ర.

నుండైన శ్రీరుద్రునిచేత నేది యుపదేశింపంబడె [1]దానివస్తుధ్యానపూజానియ
మంబునం దపంబు సేయుచుండం దపఃపతి యైననారాయణుం బదివేలదివ్యసం
వత్సరంబులు పూజించి రని చెప్పిన విని విదురుండు మైత్రేయున కి ట్లనియె.

సీ. తాపసోత్తమ ప్రచేతసులకు నర్ణవ,మార్గంబునందు నాభర్గుతోడ
సంగ మెట్లయ్యెం బ్రసన్నుం డై హరుం డెద్ది, తివుట వారల కుపదేశ మిచ్చె
జీవరాసులకు నాశివుతోడిసంగంబు, గడుదుర్లభం బీజగంబునందుం
జర్చింప నమ్మేటి సన్మునీంద్రులకును, సంచితధ్యానగోచరుఁడు గాని
తే. పుడమిం బ్రత్యక్షమునం గానంబడండు మఱియు,నంచితాత్మసదారాముం డఖిలలోక
రక్షణార్థంబుగా విరూపాక్షుం డాత్మ,శక్తితోం గూడి జగతిపై సంచరించు.

రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశ మనుస్తోత్రముం జెప్పుట.

క. కావున భగవంతుండును, దేవస్తుతుం డయిన దేవదేవునిసంగం
బే వెరవున ఘటియించెనో, యావిధ మంతయును దెలియ నానతి యీవే.

క. అనవుడు విదురున కమ్ముని,జననాయకుం డనియె నట్టిసాధుమనీషం
దనరు ప్రచేతసులును నిజ,జనకునిపరిభాషణములు సమ్మతితోడన్. 687

క. శిరసా వహించి ప్రాగ్దిశ, కరిగెడుసమయమున నెదుర నంబుధికంటెం
బఱపగునొకసరసి మనో,హరనిర్మలసలిలపూర్ణ, యైనది మఱియున్. 688

సీ. రక్తోత్పలేందీవర ప్రఫుల్లాంభోజ,కమనీయకహ్లారకలిత మగుచుం
గంజాతకింజల్కపుంజవిక్షేపక,మందగంధానిలానంద మగుచు
రమణీయహంససారసచక్రవాకకా,రండవనినదాభిరామ మగుచు
వరమత్తమధుపసుస్వరమోహపల్లవాం,కురితలతాతతిభరిత మగుచు
తే. [2]సిద్ధచారణగంధర్వసేవ్య మగుచుం
బుణ్యముల కాలయం బయి పొలుపు మిగిలి
లలిత మై చూడ నొప్పుసులక్షణములం
బరంగి శుచిలఘుమధురాంబుభవ్య మగుచు. 689

తే. [3]సజ్జనునిహృదయముం బోలిస్వచ్ఛమగుచు, హరిపదాకృతిదివిజవిహారమగుచు
ఘనునిసిరిభంగి సర్వజీవనము నగుచు, మానవతివృత్తిగతిని నిమ్నంబునగుచు.
తే. (శశికరంబులుం బోలె విశదము లగుచు
హరికథలం బోలి కల్మషహరము లగుచు

---

1 'దాని జపధ్యానపూజానియమంబుల సేవించుచు'. అ. ప్ర. 2 'భువనపాలననిర్మలస్ఫూర్తి మెఱసి, నిర్మలం బైనజీవనాన్వితము నగుచు, మహితయోగీంద్రసంవేద్యమాన మగుచు,లోకపావన మన నొప్పునొకసరస్సు' అని యొకప్రతి. 3 సజ్జనునిహృదయముం బోలెస్వచ్ఛ మగుచు,మత్స్యకచ్ఛపమకరసంపాది యగుచు, భేకదర్వీకరావళీభీమ మగుచు,నుదధినందన కనిశంబు నునికి యగుచు— అని పాఠాంతరము.

వహ్నులునుబోలె భువనపావనము లగుచుఁ
బొగడఁ దగునీరములచేఁ బ్రపూర్ణ మగుచు.) 691

వ. ఒప్పునట్టిసరోవరంబుఁ బొడగని యందు నొక్క దివ్యపురుషునిం గని రతండు. 692

మ. సమదశ్రీకమృదంగవేణుముఖభాస్వన్నాద మై దివ్యమా
ర్గమనోరంజక మై తనర్చువిలసద్గాంధర్వగానంబు నె
య్యము సంధిల్లఁగ వించుఁ దన్మహిమ కత్యాశ్చర్యముం బొంది వే
గమునం దత్కమలాకరంబు వెడలెం గౌతూహలోల్లాసి యై. 693

వ. ఇట్లు వెడలి వచ్చిన. 694

మ. కని రాతాపసపుంగవుల్ దివిజలోకశ్రేష్ఠునిం దప్తకాం
చనవర్ణున్ సనకాదియోగిజనభాస్వద్ధ్యేయమానుం ద్రిలో
చను భక్తానుగుణానుగున్ సుమహితైశ్వర్యున్ బ్రసాదాభిశో
భనవక్త్రున్ నిహతాఘకర్తృజనసంపద్భద్రునిన్ రుద్రునిన్. 695

క. కని వారలు దమమనముల, ననురాగము నద్భుతంబు ననయముఁ బొడమన్
వినయము దోఁపఁగఁ దత్పద,వనజములకు మ్రొక్కి భక్తివశగతు లగుచున్.

వ. భగవంతుండును (నఖిలధర్ముండును గృపాళుండును) ధర్మవత్సలుండును (నఖిల
పాపహారుండును) నయినహరుండు (ప్రీతుం డగుచుం) బ్రసన్నాంతఃకరణులు
ధర్మజ్ఞులు శీలసంపన్నులు సంప్రీతులు నయినవారల కిట్లనియె. 697

సీ. వినుఁడు నృపాలనందనులార మీమదిఁ, గలతలం పెల్లను గాన వచ్చె
మీకు భద్రం బగు మీయెడ నే నను,గ్రహబుద్ధిచే నిటు గానఁబడితిఁ
గైకొని యిపుడు సూక్ష్మముఁ ద్రిగుణాత్మక,ము నగునా ప్రకృతికంటెను ధరణిని
బరఁగుజీవునికంటెఁ బరుఁ డైనవాసుదే,వునిచరణాబ్జముల్ దనరుభక్తి

తే. నర్థి నెవ్వారు భజియింతు రట్టివారు
నాకుఁ బ్రియతముల్ వారికి నయచరిత్రు
లార యేను బ్రియుండ నై భూరిమహిమ
వెలయుచుండుదు నది గాక వినుఁడు మీరు. 698

వ. స్వధర్మనిరతుం డైనపురుషుం డనేకజన్మాంతరసుకృతవిశేషంబులం జతుర్ముఖ
త్వంబు నొంది తదనంతరంబునం బుణ్యాతిరేకంబున నన్నుం బొంది యధికా
రాంతంబున నేనును దేవతాగణంబులును నవ్యాకృతం బైనయీహరిపదంబును
బొందుదు మట్టిపదంబు భాగవతుండు దనంతనె పొందుం గావున మీరు భాగ
వతత్వంబు నొందియు నాకుం బ్రియంబు ఘటియింపుఁడు భాగవతజనంబు
లకు నాకంటె నధికప్రియుండు లేఁడు గాన వివిక్తంబును జప్యంబును బవిత్రం
బును మంగళంబును నిశ్శ్రేయసకరంబును నైననావచనంబు నాకర్ణింపుఁడు
సర్గాదిని బ్రహ్మ నిజనందనుల కెఱింగించినశ్రీహరిస్తోత్రంబు మీకు నెఱింగింతు

వినుం డది యెట్టి దనిన. 699

క. వనజాసనుఁ డాత్మజు లగు,సనకాదులఁ జూచి పలికె సమ్మతితోడన్
వినుఁడు కుమారకులారా, వనజోదరుమంగళ స్తవం బెఱిఁగింతున్. 700

వ. (అని హరినుద్దేశించి వారలు విన నిట్లనియె)నోయీశా యాత్మవేదులైనవారలకు భవదీయోత్కర్ష స్వానందలాభకరంబు గావున నట్టిస్వానందలాభంబు మాకుం గలుగ వలయు నీవు పరిపూర్ణానందస్వరూపుండ విట్టిసర్వాత్మకుండ వైననీకు నమస్కరింతు నని వెండియు ని ట్లనియె. 701

సీ. పఙ్కజనాభాయ సఙ్కర్షణాయ శా,న్తాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేన్ద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదే,వాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి
కారాయ కర్మనిస్తారకాయ క్షేత్రపాలాయ త్రైలోక్యపాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వ,యంజ్యోతిషే దురన్తాయ కర్మ

తే. సాధనాయ పురాపురుషాయ యజ్ఞ,రేతసే జీవతృప్తాయ పృథ్వీరూప
కాయ లోకాయ నభసే౽న్తకాయ విశ్వ,యోనయే విష్ణవే జిష్ణవే నమో౽స్తు.

సీ. స్వర్గాపవర్గసుద్వారాయ సర్వర,సాత్మనే పరమహంసాయ [1]కర్మ
పాకాయ తదితరఫలరూపకాయ కృ,ష్ణాయ ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ ఘనసాఙ్ఖ్యయోగీశ్వరాయ హి,రణ్యవీర్యాయ రుద్రాయ శిష్ట
నాథాయ దుష్టవినాశాయ శూన్యప్ర,వృత్తాయ కర్మణే మృత్యవే వి

తే. రాట్ఛరీరాయ నిఖిలధర్మాయ [2]వాగ్వి,భూతయే నివృత్తాయ సత్పుణ్యభూరి
వర్చసే౽ఖిలధర్మదేవాయ చాత్మ,నే నిరుద్ధాయ నిభృతాత్మనే నమో౽స్తు.

తే. సర్వసత్త్వాయ దేవాయ సన్నియామ,కాయ బహిరన్తరాత్మనే కారణాత్మ
నే సమస్తార్థలిఙ్గాయ [3]నిర్గుణాయ, వేధసే జితాత్మకసాధవే నమో౽స్తు.

వ. అని మఱియుఁ బ్రద్యుమ్నుండవును నంతరాత్మవును సమస్తశేషకారణుండవును జాతుర్హోత్రరూపుండవును నంతకుండవును సర్వజ్ఞుండవును జ్ఞానక్రియారూపుండవును నంతఃకరణవాసివియు నైననీకు నమస్కరింతు నని. 705

క. అనఘా దేవ భవత్పద,వనరుహసందర్శనేచ్ఛ వఱలిన మాకున్
విను వైష్ణవసత్కృత మై, యెనయుభవద్దర్శనంబు నీవె మహాత్మా. 706

వ. అది యెట్టి దనిన. 707

క. అనఘ సకలేంద్రియగుణాం,జనమును భక్తప్రియంబు జలదశ్యామం
బును సౌందర్యసమగ్రము, ననుపమమును నిఖిలమంగళావహ మగుచున్. 708

వ. మఱియును. 709

1 ధర్మపాలాయ సద్గతిఫల' అ. ప్ర. 2 'భూతివర్చసే పితృదేవాయ వాగ్విభూతయే నివృత్తాయ వరహృషీకేంద్రియాత్మ, నే నిరుద్ధాయ నిభృతాత్మనే నమస్తే' వా. ప్ర. 3 నిర్వికల్పమేధసేహం కృతాత్మనే' వా. ప్ర.

సీ. అళికులోపమలసదలకశోభిత మగు, నమృతాంశురేఖానిభాననమును
సమకర్ణదివ్యభూషాప్రభాకలితంబు, సుందరభ్రూనాసాసురుచిరంబు
సలలితకుందకుట్మల[1]సన్నిభద్విజ, పూరితస్నిగ్ధకపోలయుగము
పద్మపలాశశోభనలోచనంబును, మందస్మితాపాంగసుందరమును

తే. సస్మితాలోకసతతప్రసన్నముఖము, కంబుసుందరరుచిరమంగళగళంబు
హారమణికుండలప్రభాపూరకలిత, చారుమృగరాజసన్నిభస్కంధయుతము. 710

వ. వెండియు శంఖచక్రగదాపద్మకలితాయతబాహుచతుష్టయంబును వైజయంతీ
వనమాలికాకౌస్తుభమణిశ్రీవిరాజితంబును నిత్యానపాయిని యయిన యిందిరా
సుందరీరత్నపరిస్ఫురదంబునం దనరి తిరస్కృతనికషోపలం బైన వక్షస్స్థలంబును
నుచ్ఛ్వాసనిశ్వాసంబులం జంచలంబు లైన వళిత్రయరుచిరప్రకాశమానదళోద
రంబును బూర్వవినిర్గతనిఖిలవిశ్వంబునుం బ్రవిష్టంబు సేయు రీతి నొందు
సలిలావర్తసన్నిభగంభీరనాభివివరంబును బంకజకింజల్కవిభాసితదుకూలనిబద్ధ
కనకమేఖలాకలాపశోభితశ్యామపృథునితంబబింబంబును నీలకదళీస్తంభరుచిరోరు
యుగళంబును సమచారుజంఘంబును నిమ్నజానుయుగళంబును బద్మపత్త్రభా
సురపాదద్వయంబును మదీయాంతరంగతమోనివారకనిర్మలచంద్రశకలసన్నిభ
నఖంబును గిరీట కుండల గ్రైవేయ హార కేయూర వలయ ముద్రికామణినూపు
రాదివివిధభూషణభూషితంబును నిరస్తసమస్తనతజనసాధ్వసంబును భక్తజన
మనోహరంబును సర్వమంగళాకరంబును నైన భగవద్దివ్యరూపంబుఁ దామసజన
సన్మార్గపరిదర్శకుండ వైన నీవు మాకుఁ జూపి మమ్ముఁ గృతార్థులం జేయు మని
వెండియు నిట్లనియె. 711

సీ. ఆత్మఁ బరిశుద్ధి నర్థించువారికి, ధ్యేయవస్తువు భవదివ్యమూర్తి
యంచితస్వర్గరాజ్యాభిషిక్తున కైన, సమధికస్పృహణీయతముఁడ వీవు
సద్భక్తియుతభక్తజనసులభుండవు, దుష్టాత్మలకుఁ గడు దుర్లభుండ
వాత్మదర్శనులకు నరయ గమ్యుండవు, నై యర్థి విలసిల్లు దనఘచరిత

తే. యిట్టినిఖిలదురారాధ్య యీశ నిన్ను, నెఱయ సుజనుల కైన వర్ణింప రాదు
వఱల నెవ్వఁడు పూజించువాఁడు విమువఁ, జాలునే పద్మదళనేత్ర సచ్చరిత్ర.

చ. ఎనసినభక్తియోగమున నే భవదీయపదాబ్జమూలము
న్ననయముఁ బొందువాఁడు చటులాగ్రహభీషణవీర్యశౌర్యత
ర్జనములచే ననూనగతి సర్వజగంబులు సంహరించున
య్యనుపముఁ డైనకాలునిభయంబును బొందఁడు దాను గావునన్. 713

తే. ఇట్టినీపాదమూలంబు లెవ్వఁడేనిఁ, బొంది ధన్యాత్ముఁ డౌ నట్టిపుణ్యుఁ డొందు
మనములోపలఁ గోరు నేమఱచియైన, నవ్యయానందగోవింద హరి ముకుంద.

---

1 నిభద్విజకంబు.

క. హరి నీభక్తులతోడను, నిరుపమగతిఁ జెలిమి సేయు నిమిషార్ధముతో
సరి గాదు మోక్ష మనినను, చిరశుభ మగుమర్త్యసుఖముఁ జెప్పఁగ నేలా. 715

క. దురితవినాశకపదపం, కరుహా భవత్కీర్తితీర్థకణచయబాహ్యాం
తరసేకధూతకల్మష, పురుషులు ధరమీఁదఁ దీర్థభూతులు గారే. 716

వ. అట్టిభూతదయాసమేతులును రాగాదివిరహితచిత్తులును నార్జవాదిగుణయుక్తులు
ను నయినభాగవతజనులసంగంబు మాకుం గలుగఁజేయు మిదియ మమ్మనుగ్ర
హించుట యని వెండియు నిట్లనియె. 717

చ. సరసిజనాభ! సత్పురుషసంగసమంచితభక్తియోగవి
స్ఫురణ ననుగ్రహింపఁబడి శుద్ధము నొందినవానిచిత్తము
స్థిరబహి[1]రంగముం గనదు చెందదు భూరితమస్స్వరూపసం
సరణగుహాగతంబుఁ గనఁ జాలు భవన్మహనీయతత్త్వమున్. 718

వ. అది యెట్టి దనిన. 719

సీ. అరయంగ నేమిటియందు నీవిశ్వంబు, విదిత మై యుండు నీవిశ్వమందు
నేది ప్రకాశించు నెప్పుడు నట్టిస్వ, యంజ్యోతి నిత్యంబు నవ్యయంబు
నాకాశమును బోలి యవిరళవ్యాపక, మగునాత్మతత్త్వంబు నధికమహిమ
నమగుపరబ్రహ్మ మగు నని పల్కుఁ యి, ట్లనియె నవిక్రియుం డైనవాఁడు

తే. నెవ్వఁ డాతఁడు దనయందు నెపుడు నాత్మ, కార్యకరణసమర్థంబు గానిభేద
బుద్ధిజనకంబు నాఁ దగుభూరిమాయఁ, జేసి విశ్వంబు సత్యంబు గా సృజించె.

ఆ. మరల మరలఁ బెక్కుమార్లు లీవిశ్వంబు, జననవృద్ధివిలయసంగతులను
నందఁజేయుచుండు నట్టియీశ్వరుఁడ వై, తనరునిన్ను నాత్మతత్త్వము గను.

వ. తెలియుదు మని వెండియు నిట్లనియె యోగపరాయణు లగువారు శ్రద్ధాసమ
న్వితు లై క్రియాకలాపంబుల నంతఃకరణోపలక్షితం బయినభవదీయరూపంబు
యజింతురు వారు వేదాగమతత్త్వజ్ఞానులు నీ వాద్యుఁడవును ననాదియు నద్వి
తీయుండవును మాయాశక్తియుక్తుండవు నై విలసిల్లుచుండుదు వట్టిమాయా
శక్తిచేత. 722

సీ. చతురాత్మ సత్త్వరజస్తమోగుణములు, వసుస జనించెను వానివలన
మహదహంకారతన్మాత్రనభోమరు, దనలజలావనిమునిసుపర్వ
భూతగణాత్మకస్ఫురణ నీవిశ్వంబు, భిన్నరూపమున నుత్పన్న మయ్యె
దేవ యీగతి భవదీయమాయను జేసి, హాళిఁ జతుర్విధరూప మైన

తే. పురము నాత్మాంశమునఁ జెందుపురుషుఁ డింద్రి
యములచే విషయసుఖము లనుభవించు
మహిని మధుమక్షికాకృతమధువుఁ బోలి

1 రర్థముం.

యతనిఁ బురవర్తి యగుజీవుఁ డండ్రు మఱియు. 723

వ. ఇట్టిజగత్సర్జకుండ వైననీవు. 724

క. భూతగణంబులచేత నె, భూతగణంబులను మేఘపుంజంబుల ని
ర్ధూతముగఁ జేయుననిలుని, భాతిని జరియింపఁ జేసి పౌరుష మొప్పన్. 725

తే. రూఢిఁ దత్త్రిక్రియాలబ్ధరూపుఁడవును, సుమహితస్ఫురదమితతేజుఁడవుఁ జండ
వేగుఁడవు నయి ఘనభుజావిపులమహిమ, విశ్వసంహార మర్థిఁ గారవింతు వీశ.

వ. అది యెట్లనిన. 727

క. ఇతికర్తవ్యవిచారక, మతిచేత ననూనముగఁ బ్రమత్తంబును సం
చితవిషయలాలసము నూర్జితలోభము నైనయట్టిసృష్టి గడంకన్. 728

తే. అప్రమత్తుండ వగుచుఁ బద్మాక్ష నీవు, మ్రింగుదువు చాలనాఁకట మ్రేఁగుచుండి
నాలుకలు గ్రోయుభూరిపన్నగమువాతఁ, బడినయెలుకను భక్షించుపగిది ననఘ.

చ. అనిశము నస్మదీయగురుఁ డైనసరోరుహసంభవుండు న
మ్మనువులు నాత్మసంశయము మాని భజించుభవత్పదాబ్జముల్
మనమున నిల్పి యుష్మదవమానమహావ్యథఁ జెందునట్టిస
జ్జనుఁడు పరిత్యజించు నె భుజంగమతల్పక భక్తకల్పకా. 730

క. కావున నాకును సూరిజ, నావళికిని సర్వసంశయంబులు వాపం
గావను బోవను దగుగతి, నీ వని వినుతించినట్టియీస్తవ మెలమిన్. 731

వ. రుద్రుండు ప్రచేతసుల కెఱింగించి వెండియు నిట్లనియెఁ బ్రచేతసులారా యిట్టి యోగాదేశనామకంబైనయీస్తోత్రంబు [1]బహువారావృత్తిచేఁ బఠించి మనంబున ధరియించి సమాహితచిత్తులై మీరందఱు నాదరంబున విశ్వాసయుక్తులును స్వధర్మాచారవంతులును భగవదర్పితాశయులును నై జపియించుచు సర్వభూతావస్థితుండు నాత్మారాముండు నైనసర్వేశ్వరుని [2]నుతించుచు ధ్యానంబు సేయుచుఁ బూజించుచుండుఁడు తొల్లి యీస్తోత్రంబు భగవంతుం డైనపద్మసంభవుండు (సిసృక్షు వగుచు) నాత్మజుల మైనమాకును (సృజియింప నిచ్ఛగించు)భృగ్వాదులకును నెఱింగించె నేము (నాభృగ్వాదులును) బ్రజాసర్గంబునందు బ్రహ్మాదిచోదితుల మై యీస్తోత్రంబునం జేసి విధ్వస్తసమస్తతమోగుణుల మై వివిధప్రజాసర్గంబు గావించితిమి కావున నీస్తోత్రంబు నెల్లప్పుడు నేకాగ్రచిత్తుండును వాసుదేవపరాయణుండు నై యెవ్వండు జపియించు వాఁడు వేగంబె శ్రేయస్సును బొంది తదీయజ్ఞానప్లవంబున వ్యసనార్ణవరూపం బయినసంసారంబును సుఖతరంబుగఁ దరియించు నట్టిమదుపదిష్టం బయినయీహరిస్తవంబు నెవ్వండు సదువుచు దురారాధ్యుండైనశ్రీహరిం బూజించు వాఁడు మదుక్తస్తోత్రగానసంతుష్టుండును శ్రేయస్సులకు నేకాశ్రయభూతుండును నగుశ్రీమన్నారాయణునివలన సమస్తాభీష్టం

1 ‘నాచార్యోపదేశంబునం బఠించి’ వ్రా. ప్ర. 2 ధ్యానయుక్తంబుగాఁ బూజింపుఁడు.

బులం బొందు నెవ్వం డేనిఁ బ్రభాతంబున లేచి ప్రాంజలియు శ్రద్ధాసమన్వి
తుండు నై యీమంగళ స్తవరాజంబును వినును వినిపించును వాఁడు కర్మబంధ
విముక్తుం డగు నని మఱియు ని ట్లనియె. 732

క. నరదేవతనయులారా, పురుషార్థేశుండు పరమపురుషుఁడు నగునీ
శ్వరుసుస్తోత్రము మీ కే, నెఱిఁగించితి మీరు మదిని నెడపనిభక్తిన్. 733

క. ఏకాగ్రచిత్తులును సుశ్లోకులు నై జపము సేయుచును ఘనతపముం
గైకొని చేసిన మీకును, జేకుఱు మహితేప్సితార్థసిద్ధి గడంకన్. 734

క. అని యీగతి నుపదేశం, బొనరించి సదాశివుండు నాఁగి వారలచే
తను బూజితుఁడై వారలు, గన నంతర్ధానుఁ డయ్యెఁ గౌతుక మొప్పన్. 735

వ. అంత. 736

తే. తిపుట వారలు రుద్రోపదిష్ట మైన, యచ్యుత స్తవము జపించు చయుతసంఖ్య
వత్సరము లుగ్రతపము దుర్వారవారి, మధ్యమునఁ జేయుచున్న సమయమునందు.

నారదుండు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలియఁజేయుట.

వ. ఘనకర్మాసక్తచిత్తుం డై యున్నప్రాచీనబర్హి కడకు సధ్యాత్మవేదియుం గృపాళువు
నై ననారదుండు సనుదెంచి యారాజునకు జ్ఞానబోధంబు సేయుకొఱకు నతనితో
ని ట్లనియె రాజా యీకర్మంబునం జేసి యెట్టిశ్రేయస్సు నభిలషించుచున్నవాఁడ
వట్టియనిష్టనిరసనేష్టప్రాప్తికరంబు నయినశ్రేయం బీకర్మంబువలన లభింప దని
నం బ్రాచీనబర్హి నారదున కి ట్లనియె. 738

సీ. అనఘ మునీంద్ర మహాభాగ యేను కర్మాపవిగ్నజాని నగుచు మోక్ష
మెఱుఁగంగ లే నైతి నిట్టినా కిప్పుడు, గడువిమలంబును గర్మబంధ
నాశకంబును నగుజ్ఞానోపదేశంబు, గావింపు మతిదయాకార కూట
ధర్మంబు లగుగేహ తతులందుఁ జెంది జా, యాతనూజాతధనాదికములె

తే. భూరిపురుషార్థములుగాఁ గబుద్ధిఁ దలఁచు, మతివిహీనుండు సంసారమార్గములను
దగఁ బరిభ్రామ్యమాణుఁడై నాఁగిటి మోక్ష, పదమునొందంగఁజాలఁడు భవ్యచ

క. అనవుడు నతనికి నతఁడును, ననఘా యీయధ్వరంబులందును గృపమాలిత
లినసిచే విశసింపం, జని కూలినపసుల వేలసంఖ్యలఁ గనుమా. 740

వ. కావునం బశువ్రాతంబులు త్వదీయవైశసంబును స్మరించుచున్న వై లోహాయం
త్రమయశృంగంబులచేత నెప్పుడు నీవు పరలోకంబు నొందెద వప్పుడ నిన్ను
హింసింతు మని భవదీయమృతికి నెదురుచూచుచున్న విట్టిసంకటంబు నొందం
గలనీకు నిస్తారకం బయినయొక్కయితిహాసంబు గల దెఱింగింతు వినుమని
యి ట్లనియె. 741

పురంజనోపాఖ్యానము.

సీ. భూమీశ వినవయ్య పూర్వకాలమునఁ బురంజనుం డనునొక్కరాజు గలఁడు

నతనికి విజ్ఞాతుఁ డనుపేరఁ దగినవి,జ్ఞాతచేష్టితుఁ డగుసఖుఁడు గలఁడు
నాపురంజనుఁడు పురాన్వేషి యై ధరా,చక్రంబు గలయంగ సంచరించి
తన కనురూపమై పెను పొందుపుర మెందు, వీక్షింపఁ జాలక విమనుఁ డగుచు

తే. నేపురము లుర్విఁ బొడగనె నాపురములు
గామములఁ గోరుతనకు సకామములను
బొందుటకు నానిని ననర్హములు గఁ దనమ
నమునఁ దలఁచి యొకానొకనాఁ డతండు. 742

వ. చనుచున్నసమయంబున హిమవత్పర్వతదక్షిణసానువులందు. 743

సీ. వరనవద్వారకవాటగవాక్షతో,రణదేహళీగోపురముల నొప్పి
ప్రాకారయంత్రవప్రప్రతోళీపరి,ఖాట్టాలకోపవనాళిఁ దనరి
సౌవర్ణరౌప్యాయసఘనశృంగంబుల, రమణీయవివిధగేహముల మించి
రథ్యాసభాచత్వరధ్వజక్రీడాయ, తనసుచైత్యాపణతతిఁ దనర్చి

తే. మరకతస్ఫటికవిదూరమణివినూత్న,మౌక్తికాయుతఖచితహర్మ్యములు గలిగి
విద్రుమద్రుమవేదుల వెలయునొక్క,పురముఁ గనె భోగవతి కెనఁబోలుదాని.

వ. ఇట్లు గనుంగొని యనంతరంబ ముందటం బురబాహ్యాంతరంబున దివ్యద్రుమ
లతాకుంజపుంజంబును సమదనదద్విహంగమత్తమధుకరకులకోలాహలసంకులజ
లాశయశోభితంబును హిమనిర్ఝరబిందుసందోహపరిస్పందకందలితమందమలయ
మరుదుచ్చలితప్రవాళవిటపనళినీతటంబును బాంథజనమనోరంజనాహ్వానబుద్ధిజ
నకకలహంసరాజకీరకోకిలాలాపవిరాజమానంబును మునివ్రతనానావిధవనమృగ
వ్రాతబాధారహితంబును నైనపురబాహ్యోద్యానవనంబునందు యాదృచ్ఛికం
బుగ నేకైకశతనాయకం బైనయనుచరదశకంబును బంచమస్తకసర్పప్రతీ
హారుండును దోడ రాఁ జనుదెంచుచున్న భర్త్రన్వేషిణియుం గామరూపిణియు
నవోఢయు నయినయట్టి. 745

సీ. ఘనసమవిన్యస్తకర్ణకుండలరుచుల్, గండభాగంబుల నిండి పర్వఁ
దమ్మితేకులసిరిఁ దటమటింపఁగఁ జాలు,మెఱుఁగుఁగన్నులు దలఁ దిరిగి రాఁగ
జఘనసంకలితపిశంగనీవిస్ఫూర్తి, కనకకాంచీరుచిఁ గరము పెనుపఁ
జరణసరోజభాసురచలన్నూపుర,ఝణఝణధ్వని సర్వసరణిఁ జూప

తే. లలితయౌవనలక్ష్మివిలాసభాసు, రోదయవ్యంజితప్రభాయుక్తపీన
సమనిరంతరకుచకుట్మలముల వ్రీడఁ, జెంది పయ్యెదఁ గప్పు బాలేందుముఖిని.

వ. మఱియును బాలయు సుదతియు గజగామినియు నయినయొక్కప్రమదోత్తమఁ
గాంచి. 747

క. తర మిడి ప్రేమోద్గత నై, మరువిండులకోమరు నగుబోమలు గలతరుణీ
సరసాపాంగవిలోకన,శరపరివిద్ధాంగుఁ డగుచు జనవిభుఁ డనియెన్. 748

క. ఎవ్వరిదానవు జనకుం, డెవ్వఁడు పే రేమి భృత్యు లీపదియొకరుం
డెవ్వరు సతు లెవ్వరు మఱి, యివ్వనమున నుండఁ గార్య మెద్ది మృగాక్షీ. 749

క. భవదీయపురస్సరుఁ డగు, పవనాశనుఁ డెవ్వఁ డతికృపామతి నాకుం
వివరింపు మనుచు వెండియు, ధవళేక్షణఁ జూచి ధరణీధవుఁ డిట్లనియెన్. 750

సీ. తరళాక్షి పతి యగు ధర్ము నన్వేషింపఁ, జరియించుహ్రీ యను సతివొ కాక
రుద్రు నన్వేషించు రుద్రాణివో కాక, బ్రహ్మను వెదకుభారతివొ కాక
నారాయణుని భక్తిఁ గోరి యన్వేషించు, నిందిరవో కాక యెవ్వ రీవు
త్వత్పాదకామనత్వమునను సంప్రాప్త, సకలకాముం డగు సరసు నెట్టి

తే. వాని వెదకెదు తరుణి భవత్కరాగ్ర, పద్మకోశంబ దెక్కడఁ బతిత మయ్యె
నాకు నెఱిఁగింపఁదగుదు పవేకచరిత, యని నృపాలుఁడు మఱియు నిట్లనియె సతికి.

క. కర మొప్పఁగ నీ విటు భూ, చర వగుటను హ్రీవి శివవు శారదవును సా
గరకన్యవుఁ గాకుండుటఁ, దరుణీ పొడగంటి నని పదంపడి పలికెన్. 752

సీ. మొనసి యదభ్రకరస్థుఁడ నైననాచేత, నిపుడు పాలిత మైనయీపురంబు
సరసిజోదరునిభుజాపాలితోదాత్త, లలిత వైకుంఠ మలంకరించు
నిందిరాసుందరిచందంబునను నీవ, లంకరింపఁ గడంగుపంకజాక్షి
యది గాక తావకీనాపాంగరుచి మోహి, తాంతరంగుండ నైనట్టినన్ను

తే. మహితసవ్రీడభావసన్మందహాస, చారువిభ్రమభ్రూలతాప్రేరితుఁడుగఁ
దనరుభగవంతుఁడగునట్టిమనసిజుండు, పడఁతి యుడుగక పీడింపఁదొడఁగె నిపుడు.

వ. కావున. 754

చ. తరుణి సుతారలోచనయుతంబును మంజుసుధాసమానభా
సురమృదువాక్యయుక్తమును శోభితకోమలలంబమానసుం
దరచికురాభిరామము నుదారము నైనభవన్ముఖాబ్జముం
సురుచిరలీల నెత్తి ననుఁ జూడుము సిగ్గునఁ జెంద నేటికిన్. 755

వ. అని యివ్విధంబున నర్థితుం డై పలుకుపురంజనుం జూచి యాప్రమదోత్తమ వీర
మోహిత యై సస్మితానన యగుచు నానందంబు నొంది యి ట్లనియె. 756

క. పురుషవర నాకు నీకును, గురువును నామమును గులముఁ గోరి యెఱుఁగ నీ
పురమున నుండుదుఁ గాకీ, పురమును నిర్మించినట్టిపురుషు నెఱుంగన్. 757

క. వీరలు నాసఖు లీలల, నారత్నము లార్యవినుత నాచెలు లీవృ
ద్ధోరగ మే నిద్రింపఁగ, ధీరత మేల్కాంచి పురము ధృతిఁ బాలించున్. 758

వ. అని వెండియు ని ట్లనియె. 759

సీ. మనుజనాయక నీవు మద్భాగ్యవశమున, నిటకు నేతెంచితి విపుడు నీకు
మంగళం బగు నీవు మహితేంద్రియగ్రామ, భోగ్యంబు లగు కామపుంజములను
నర్థి సంపాదింతు వనఘాత్మ యీనవ, ద్వారప్రయుక్త మై తనరుపురము

[1]నీవు గైకొని యేలు నీకంటె దీనికి, నధిపుఁ డన్యుండు లేఁ డనఘ యిందు
తే. మదుపనీతము లైన కామములననుభ, [2]వింపఁగా సమాశత మధిష్ఠింపు మెలమిఁ
గోరినీకంటెఁ బ్రియులు నెవ్వారునాకు, నరసిచూడంగ మనుజేంద్ర యదియుఁగాక.

వ. మఱియు రతిజ్ఞానవిహీనుండు నకోవిదుండు నిహపరచింతాశూన్యుండుఁ బశుప్రా
యుండుఁ ద్వదన్యుండు నైనవాని నెవ్వని వరియింతు గృహస్థాశ్రమమందు ధర్మార్థ
కామమోక్షప్రజానందంబులును యశంబును [3]యతివేద్యంబులు గానిరజస్తమో
విహీనపుణ్యలోకంబులును గలుగుఁ బితృదేవర్షిమర్త్యభూపగణంబులకుం దనకు
నీలోకంబున గృహస్థాశ్రమంబు సర్వక్షేమార్థం బయినయాశ్రమం బండ్రు గా
వున వదాన్యుండవు వీరవిఖ్యాతుండవుఁ బ్రియదర్శనుండవు స్వయంప్రాప్తుండవు
నయి భోగిభోగసదృశభుజాదండంబులచే నొప్పుభవాదృశుం దగిలి మాదృశ
యగుకన్య వరియింప కుండునే యని వెండియు. 761

క. కరుణారసపరిపూర్ణ, స్ఫురితస్మితరుచివిలోకపుంజముచేతం
గర మర్థి దీనజనభయ, హరణుండ వై సంచరింపు మఖిలజగములన్. 762

క. అని యీగతిఁ బలికినయూ, వనజాక్షిఁ బురంజనుండు వరియించి ముదం
బున నన్యోన్యము మైత్రిం, దనరుచుఁ దత్పురము సొచ్చి ధన్యుం డగుచున్.

చ. శతసమకాల మప్పురి నజస్రము భూరిసమస్తసౌఖ్యసం
గతులం దనర్చి వందిజనగాయకసద్వినుతోరుగానమో
దితమతి నొప్పి సుందరసతీజనసేవితుఁ డై నృపాలకో
చితలలితస్థలంబుల వసించుచుఁ గ్రీడలు సల్పుచుండఁగన్. 764

క. నరనాథుఁడు లోకభయం, కరగతి వర్తించు గ్రీష్మకాలము దోఁపం
దరళలహరీ[4]మనోహర, వరహ్రదినిసలిలమందు వసియించెఁ దగన్. 765

వ. ఇట్లు వసియించి కతిపయదినంబు లరుగుసమయంబున. 766

సీ. అవనీశ్వరోత్తమ యప్పురంబున నాల్గు, వంకల నున్నగవాఁకులు వినుము
తూర్పుదిక్కునను నైదును దక్షిణోత్తరం, బుల రెండుఁ బశ్చిమంబునను రెండుఁ
గాఁగ నాతొమ్మిదిగవఁకుల నుపరిది, క్కున నేడుఁ గ్రిందిదిక్కునను రెండు
నయి యుండు మఱి వానియందుఁ బృథగ్విధ, విషయగత్యర్థ మై వెలయు నీశ్వ
తే. రుం డొకం డరయఁ గలండు రూఢిఁ దత్పు, రంబుఁ బాలించునట్టిపురంజనుండు
నాపురద్వారనవకంబునందులోన, నర్థిఁ బ్రాగ్ద్వారపంచకమందు వరుస. 767

వ. ఖద్యోతయు నావిర్ముఖియు నను నామంబులు గలద్వారయుగంబున ద్యుమ
త్సఖుం డై విభ్రాజితాఖ్యజనపదంబును బొందు వెండియు నళినియు నాళినియు

---

1 నందును వసియించి యనుదినంబును మన్మ, థోభీష్టనిరత మైఁ బ్రాభవమున; నందు నాచెలులచే నభిమతకామములన్, నెమ్మి నరిందమ నీవుఁ గూరు. 2 వించుమను సమశత. 3 స్వాద్యంబులు గాని. 4 యుతమనో, హరశీతలసలిలహ్రదమునందు వసించెన్.

ననుపేళ్లు గలవాకిళ్లు రెంటియందు నవధూతసఖుం డై సౌరభరూపంబు లయిన విషయంబులం బొందు మఱియు ముఖ్యానామకం బైనప్రధానప్రాగ్ద్వారంబున రసజ్ఞవిపణాన్వితుం డై యాపణబహూదనంబు లనువిషయంబుల నొందుఁ బితృహూనామకం బయినదక్షిణద్వారంబున శ్రుతధరాన్వితుం డై దక్షిణపాంచాలం బనురాష్ట్రంబు నొందు దేవహూనామకం బయిన యుత్తరపువాకిట శ్రుతధరాన్వితుం డై యుత్తరపాంచాలం బనురాష్ట్రంబు నొందు వెండియుం బడమటివాకిళ్లు రెంటియందు నాసురీనామకం బైనవాకిట దుర్మదసమేతుం డై గ్రామకనామకం బైనవిషయంబును నిర్‌ృతినామకం బయినవాకిటియందు లుబ్ధకయుక్తుం డై వైశసం బనువిషయంబు నొందు చుండు వెండియుం బురంజనుం డప్పురంబునం బౌరజనంబులందు నిర్వాగ్యేశస్కరు లన నిద్ద అంధులు గలరు వారలచేత గమనకరణంబు లనుక్రియల నొందుచు నంతఃపురగతుం డగునప్పుడు విషూచీసమన్వితుం డై జాయాత్మజోద్భవంబు లైనమోహప్రసాదహర్షంబుల నొందు చుండు నవ్విధంబునం గర్మాసక్తుండుఁ గామాత్మకుండు నై బుద్ధి యను మహిషిచేత వంచితుం డయ్యె నక్కామినియు. 768

సీ. పానంబుసేసినఁ • దానుఁ బానముసేయుఁ, గుడిచినఁ దానును • గుడుచు మఱియు
భక్షింపఁ దానును • భక్షించు నడచిన, నడచును నవ్విన • నవ్వు నేడ్వ
నేడుచుఁ బాడినఁ • బాడు విన్నను వినుఁ, జూచినఁ జూచుఁ గూ • ర్చున్న నుండు
దుఃఖింప దీనుఁ డై • దుఃఖించు నిలిచిన, నిలుచు నిద్రింపంగ • నిద్ర వోవు
తే. ముట్టినను ముట్టు మూర్కొన్న • మూరుకొనును
బలుకఁ బలుకును బవళింపఁ • బవ్వళించు
హర్షమును బొంద నాత్మను • హర్ష మొందు
మోదమును బొంద దానును • మోద మందు. 769

వ. ఇవ్విధంబున నతండు మహిషీవిప్రలబ్ధుండును వంచితస్వభావుండును నై పారవశ్యంబునం జేసి యజ్ఞుండును నితరేచ్ఛావిరహితుండును నై క్రీడామృగంబుచాడ్పున వర్తించుచు నాపురంబునఁ గాఁపురం బుండఁ గొన్నిదినంబుల కాపురంజనుండు ధనుర్ధరుం డై. 770

సీ. పంచాశ్వయుక్తంబు • పంచబంధనముఁ జ,క్రద్వితయమును యు • గద్వయంబు
నాశువేగంబు నే • కాక్షంబు కూబర,ద్వయముఁ [1]బతాకాత్రి • తయయుతంబు
నేకప్రగ్రహమును • నేకసారథికంబు, సప్తవరూథంబు • స్వర్ణభూష
మును బంచవిక్రమ • మును నేకనీడంబుఁ, బ్రకటపంచప్రహా • రణము నయిన
తే. రథము కాంచనరచితవ • ర్మము ధరించి, విలసదక్షయతూణీర • కలితుఁ డగుచుఁ
గడఁక దీపింప నెక్కి యే • కాదశప్ర,సంఖ్యసేనాసమేతుఁ డై • సరభసము గ.

1. 'ద్రితయపతాకయుతము' వ్రా. ప్ర.

వ. పురంబు వెడలి పంచప్రస్థం బనువనంబునకుం జని యందు విడువ రానిమహిషిని
విడిచి మృగయాసక్తుం డై తృప్తుం డగుచు ధనుర్బాణంబులు ధరియించి
సంచరించుచు నాసురవర్తనంబునం దగిలి ఘోరాత్ముండు నదయుండు నై నిశా
తసాయకంబులచేత నమృగవ్రాతంబులం బరిమార్చె రాజులకు మృగయావినో
దంబు విహితానుష్ఠానం బగు చుండ నాసురవృత్తి యె ట్లయ్యె నని యంటివేని
నిది రాగప్రాప్తం బగుటను విహితంబు [1]గాదు వినుము శ్రాద్ధాదులందే ప్రఖ్యా
తశ్రాద్ధదివసంబులయందే రాజైనవాఁడే మేధ్యంబు లయినపశువులనే వనంబు
నందే యథోపయుక్తంబుగానే వధియింపం జను ననునియమమాత్రంబు గల
దు గావున జ్ఞానియైనవిద్వాంసుండు యాచరింపండుగాక యాచరించినం గర్మాను
ష్ఠానజనితం బయినజ్ఞానంబునం జేసి యందుఁ బొరయం డట్లుగాక నియమోల్లం
ఘనంబునం గర్మాచరణుం డగువాఁ డభిమానంబు నొంది కర్మబద్ధుం డై గుణ
ప్రవాహపతితుండును నష్టప్రజ్ఞుండును నై యథోగతిం గూలు ని ట్లగుటం జేసి
సాధుజనులకు సర్వప్రకారంబుల నాసురవృత్తి మానం దగు నని వెండియు ని
ట్లనియె నంతం బురంజనుం డవ్వనంబున. 772

క. వరచిత్రపక్షసునిశిత,శరములచే శశ వరాహ చమరీ రురు కా
సర గవయ శల్య హరిణీ, కరి హరి వృక పుండరీక కపి ఖడ్గములన్. 773

వ. వధియించి మఱియును. 774

సీ. వరుస మేధ్యామేధ్యవనమృగంబుల[2]ఘృణ, నన దుస్సహక్రీడ సంహరించి
శ్రమయుక్తుం డై వేఁట సాలించి మరలి మం,దిరమున కరిగి నేర్తెంచి యందు
సముచితస్నానభోజనకృత్యములు దీర్చి, యతివిశ్రమమున శయానుఁడగుచుఁ
బరిమళమిళితధూపవ్రాతవాసిత,సర్వాంగుఁ డగుచు స్రక్చందనములు

తే. వివిధభూషణచేలముల్ వెలయఁ దాల్చి
తనమనోహరియందుఁ జిత్తంబు వెట్టి
తుష్టుఁడును హృష్టుఁడున్ మఱి దృప్తుఁ డై య
నన్యజాకృష్టచిత్తుండు నై రతిప్ర
సంగకౌతుక మాత్మను దొంగలింప. 775

వ. అంత స్వకీయప్రాణవల్లభ యగుమహిషియందు మనంబు నునిచిన నావరారో
హయు గృహమేధినియు నయినగృహిణిం గానక విమనస్కుం డై నిజాంతఃపుర
కామినులం గనుంగొని యి ట్లనియె. 776

క. రామాజనసంఘములా,రా మానవతీలలామ రామామణి నా
రామకృప వడసి మెలఁగుదు,రా మానుగఁ గుశలమా పరామర్శింపన్. 777

ఉ. సారవివేకలార గృహసంపద [3]లీ యెడఁ బూర్వరీతిచే

1‘గాదయిననుప్రఖ్యాతతీర్థదివసంబులయందే’ వ్రా. ప్ర. 2. కృపాజనదుస్సహ. 3లంచుఁబురాతనక్రియన్

నారయఁ గా రుచింపవు గృహస్థునకుం గృహమందు మాత గా
నీ రమణానుకూలరమణీమణి యై తన దారుభార్య గా
నీ రుచి నొంద కున్నఁ గన నేర్చునె తద్గృహమేధి సౌఖ్యముల్. 778

వ. అదియునుం గాక. 779

క. పొగ డొందుజనని గానీ, తగవున వర్తించునట్టిదయితయ కానీ
తగ నుండనిగృహమున నుం, టగుఁ జక్రవిహీనరథమునం దుం టరయన్.

వ. కావున. 781

చ. తలఁకొని నాకుఁ దాను సుపథంబునఁ బ్రజ్ఞ జనింపఁ జేసి సం
చలదురుదుర్భరవ్యసనసాగరమగ్నుఁడ నైననన్ను ని
శ్చలమతి నుద్ధరించి యనిశంబును మత్ప్రియ యైనభార్య యే
వలనఁ జరించు చున్న దనివారణ నా కెఱిఁగింప రే దయన్. 782

క. అనవుడు విని యక్కాంతలు, జనపతి కి ట్లనిరి రాజసత్తమ యిదిగోఁ
దనకొం గైనను బఱువు గ, నొనరింపక నేలఁ బొరలు చున్నది వగలన్. 783

తే. ఏమికతమున నున్నదో యెఱుఁగ మేము, నీవు సూడు మటన్న నా భూవరుండు
నేలఁబడి పొరలెడుభార్యఁ బోలఁజూచి, మనములో దుఃఖతాపంబు మల్లడింప.

వ. అంత. 785

ఆ. జలజనేత్ర ప్రణయసంజాతరోషభా, వమున నయినయట్టివక్రదృష్టి
జనవిభుండు సూచి యనునయకోవిదుఁ, డగుచు నప్పయోరుహాక్షిఁ జేరి. 786

క. పొలఁతుకఁ దనయుత్సంగం, బుల నిడి తత్పాదయుగళమును సంటుచు మం
జులమృదుభాషణముల నా, లలనామణిఁ జూచి పలికె లాలన మొప్పన్. 787

చ. రమణిరో భృత్యులందు నపరాధము గల్గిన నాయకుల్ స్వప
క్షముఁ దలపోసి యుగ్రతరశాసనముం దెగి చేయ రట్లు గా
క మనములోనికిన్కఁ దమకంబున నాజ్ఞ యొనర్చి రేని ని
క్కముగ ననుగ్రహించుటయ కాక తలంపఁగ నాజ్ఞ సేయు టే. 788

క. కమలానన బాంధవకృ, త్యముఁ దలఁపక రోషచిత్తుఁ డగుకుటిలాత్మున్
సమదామ్షుఁడు నీలి, క్రమరహితుఁడు నైనబాలుఁ గా నెన్నఁ దగున్. 789

వ. అని వెండియు ని ట్లనియె సుదతీ హృదయేశ్వరి వైననీవు. 790

మ. సరసోదారసుధారసోపమవచశ్చాతుర్యసౌభాగ్య మై
హరినీలోపమకోమలాలకయుతం బై విభ్రమభ్రూలతా
పరిజుష్టస్మితసద్విలోకనము నై భాసిల్లుయుష్మన్ముఖాం
బురుహంబున్ భవదీయదాసునకుఁ బూఁబోఁడీ కృపం జూపవే. 791

క. ఏను వీరపత్ని నీయెడ, ననయంబును బ్రాహ్మణులును హరిభక్తులుఁ ద

క్కను నితరు లెగ్గు సేసిన, వనితా శిక్షింతు నెంతవారల నయినన్. 792

క. ఈముల్లోకములందును, నామనమున రోష మొదవినను భయరహితుం
డై మదిలోఁ బరితోషము,తో మెలఁగెడువానిఁ గానఁ దోయజనేత్రా. 793

సీ. ఇందీవరేక్షణ గో నెందు భవదీయ,తిలకవిరహితము మలినయుతము
హర్షశూన్యంబు మనోప్రకాశకము నై, యత్యమర్షయుతంబు నయినముఖము
గళితాశ్రుబిందుసంకలితసంచితశోభ,మానపీన స్తనమండలమును
రమణీయతాంబూలరాగవిహీన మై,నట్టిసుపక్వబింబాధరంబు

తే. గాఁగ నిట్లుంట కిపు డేమికతము నాకు, నర్థి నెఱిఁగింపవే మృగవ్యసనమంది
యబల నీ కెఱిఁగింపక యరిగినట్టి,తప్పు సైరించి కావంగఁ దగుదు నేను.

క. వనితాజనపరవశుఁ డై, మనసిజశరబాధ్యమానమానసుఁ డగువా
నిని దగఁ గర్తవ్యార్థము,లను భజియింపక తొలంగులలనలు గలరే. 795

వ. అనుచుం దదీయవిభ్రమవశంగతుం డై పలికిన విని. 796

క. కంజాతపత్త్రనేత్ర పు,రంజను దెస రోష ముడిగి రమణీయశ్రీ
మంజులమృదూక్తుల మనము, రంజించుచుఁ బలికె సదనురాగ మెలర్పన్.

వ. అంత. 798

సీ. అమ్మహాదేవి నెయ్యంబున మంగళ,స్నాత యై మృదులవస్త్రంబు గట్టి
స్రక్చందనాదిభూషణములు ధరియించి, కమనీయమోహనాకార యగుచుఁ
బతికడ నిలిచిన నతఁడు సంతుష్టాంత,రంగుఁ డై యభ్యంతరమున నుండి
యన్యోన్యసరసగాఢాలింగనంబులు, గావించి గోప్యవాక్యములచేత

తే. నతఁడు ప్రమదాపరిగ్రహవ్యసనమునను
గడఁక నపకృష్టఘనవివేకంబు గలిగి
పగలు రే యని ప్రొద్దు లేర్పఱుప రాక
మొనసి యాయుర్వ్యయంబు దా నెఱుఁగఁ డయ్యె. 799

వ. మఱియు నతం డున్నద్ధమదుండును మహామనుండును సర్వాశయ్యాశయానుండును మహిషీభుజోపధానుండును నై యజ్ఞానాభిభూతుం డగుటం జేసి స్వరూపభూతపరమపురుషార్థంబు నెఱుంగక నిజమహిషియె పరమపురుషార్థంబు గాఁ దలంచుచు రమించుచుం గామకశ్మలచిత్తుం డైన నతనికి నవయౌవనం బైన కాలంబు క్షణార్ధంబునుం బోలె గతం బయ్యె నంత. 800

క. విశదయశోజలనిధి యా, శశిముఖి యగుభార్యవలన సమ్మతి నేకా
దశశతపుత్త్రుల రణక,ర్కశదేహులఁ గాంచి కౌతుకంబున మఱియున్. 801

క. గురుశీలౌదార్యగుణో, త్తరలను సల్లలితగుణకదంబలఁ బ్రియలన్
వరకులపావనల దశో, త్తరశతదుహితలను గాంచెఁ దత్సతివలనన్. 802

వ. ఇట్లు పుత్త్రపుత్త్రికాజనంబులం గని యున్నంత. 803

క. విను మాతనియాయువులో, నను నర్థం బరిగె నంత । నరపతికులవ
ర్థను లగుసుతులకుఁ బరిణయ, మొనరించెన్ సదృశ లయిన।యువిదలతోడన్.

క. నరనాథుఁ డాఁడుబిడ్డల, వరరూపవయోవిలాస। వైభవములచేఁ
బరఁగిననిజతనయసదృశ, వరులకు సంప్రీతితో వి।వాహము చేసెన్. 805

వ. అట్లు వివాహంబులు గావించి యున్నసమయంబున. 806

క. విను తత్సుతు లొక్కొకనికి, ననయముఁ బాంచాలదేశ।మందులఁ బౌరం
జనకులవర్ధను లగుచున్, జనియించిరి నూర్వు రేసి । శౌర్యబలాఢ్యుల్. 807

ఆ. అనఘు యట్టిరిక్థ।హారులు గేహకో, శానుజీవయుతులు । నయినయట్టి
నందనాదులందుఁ । జెందినమమత ని, బద్ధుఁ డయ్యె నంతఁ । బార్థివుండు. 808

చ. తిర మగునిష్ఠతో నతఁడు । దీక్షితుఁ డై పశుమారకంబులు
న్నరిది భయంకరంబులును । నైనమఖంబులఁ బెక్కు సేసి యా
దరమున నీవునుంబలెను । దత్తదనూనఫలాప్తికాముఁ డై
సురపితృభూతసంఘము న।సూయఁ దనర్ప భజించె భూవరా. 809

వ. ఇట్లాత్మహితంబు లైనకర్మంబులయం దనవహితుండును గుణంబాసక్తమాన
సుండును నై యున్నయతనికి విరోధి యై ప్రియాంగనాజనంబులకు నప్రియం
(బగుకాలంబు సంభవించినం) జండవేగవిఖ్యాతుం డనుగంధర్వాధీశుండు షష్ట్యు
త్తరశతత్రయసంఖ్యాకు లైనగంధర్వులును నంగఅ గంధర్వీజనంబులును (సితా
సితవర్ణంబులు గలిగి మిథునీభూతు లగుచు) ననుగమింపం జనుదెంచి (స్వపరి
భ్రమణంబుచేతనే సర్వకామంబుల నిర్మితం బగు) నాపురంబు నిరోధించిన నప్పు
డా చండవేగానుచరు లైనగంధర్వు లాపురంజనుపురంబు [1]వ్యాకులత్వంబునొందిం
చుచు నపహరింప నుపక్రమించుసమయంబునఁ బురంజనపురాధ్యక్షుం డైనప్ర
జాగరుం డనువాఁడు వింశత్యుత్తరసప్తశతంబు లైనగంధర్వగంధర్వీజనంబుల
నివారించి బలవంతుం డై సంవత్సరశతంబు యుద్ధంబు గావించి యొక్కరుం డ
య్యు నప్పుక్కండ్రతో నిట్లు పోరి క్షీణుం డైనం బురంజనుండు దాన నిలిచి
తత్పురంబున నల్పసుఖంబు లనుభవించుచుఁ బాంచాలదేశంబులందు నిజపార్ష
దులచేత నాసీతంబు లైనపదార్థంబుల నొందుచుం గామినిజనసమేతుం డై
భయపర్యాలోచనంబు సేయ నేరక రాష్ట్రపురబాంధవసమేతుం డై యార్తి
నొంది చింతాక్రాంతుం డై యుండె నంత. 810

క. అనయంబుఁ గాలపుత్త్రిక, యనునొకకామిని వరేచ్ఛ । నఖిలజగంబుం
దనయంతఁ గలయఁ దిరుగుచుఁ, జని చని యొకనాఁడు రాజ।సత్తము వింటే.

సీ. అనఘాత్త రాజర్షి । యైనయయాతికు, మారకుం డయినట్టి । పూరుచేత
వరియింపఁగాఁ బడి । వల నొప్ప నతనికి, వర మిచ్చి సౌభాగ్య।వశత నొంది

1. ‘ఁ బర్యాయంబున విశీర్ణత్వంబు నొందిం’ వ్రా. ప్ర.

ప్రఖ్యాతి గనుట దుర్భగ యనుపేరను, బరఁగునక్కాంత నేపురుషవరుఁడు
వరియింపఁడయ్యె నాతరుణియు నొకనాఁడు, గర మొప్ప బ్రహ్మలోకమున నుండి

తే. వసుధ కేతెంచి విను బృహద్వ్రతుఁడ వయిన
నన్ను వరియింపఁ గోరి మనమునఁ గామ
శరవిమోహిత వై వేఁడఁ గరము నేను
సమ్మతింపక యున్న రోషమున నలిగి. 812

వ. ఇట్లను మునీంద్రా మదీయాశావిముఖుండ వై ననీకు నేకత్రావస్థానంబు లేక యుండుం గాక యని శపించి విహతసంకల్ప వై మసుపదేశంబునం జని యవనేశ్వరుండును భయనామకుండును నయినవానిం గదిసి యిట్లనియె. 813

క. అవనీపతి భయనామక, యవనకులాధీశ్వరుండ వగు నిన్నుఁ బతిఁ గాఁ
దవిలి వరింపఁగ వచ్చితి, సవినయముగ వినుము భూతసంకల్పమునన్. 814

వ. కలుగు మత్కామితంబు వృథ గాదు లోకంబున వేదంబులందు దేయగ్రాహ్యరూపంబైన వస్తువు యాచ్యమానం బగుచుండ నెవ్వండీఁ డెవ్వండిందు దీయమానం బగు చుండం గోరం డట్టివీర లిద్దఱును జడస్వభావు లని సత్పురుషులు శోకంబు నొందుదురు గావున నిన్ను భజియించుచున్న నన్నుం గరుణార్ద్రచిత్తుండ వై భరియింపు మిట్టియార్తానుకంపయుఁ బురుషధర్మం బని పలికిన నక్కాలపుత్రిక వచనంబులు విని యవనేశ్వరుండు దేవగుహ్యచికీర్షు వగుదానిం గనుంగొని మందస్మితవదనుం డగుచు నిట్లనియె. 815

క. విను తరుణి యాచ్యమానం, బనఁ దగు నీలోకమందు సత్యశుభవు స
జ్జనముల కసమ్మతవు నగు, నిను నభినందింప కుండ్రు నెఱి నెవ్వారున్. 816

వ. కావున నేను జ్ఞానదృష్టిం జేసి నీకుం బతినిరూపణంబు సేసెద నది యెట్లనిన మదీయసేనాసాహాయ్యంబు వడసి ప్రజానాశం బొనరించునట్టి నీ వవ్యక్తగతి వై కర్మనిర్మితం బైన లోకంబు ననుభవింపు మీ ప్రజ్వారుం డనువాఁడు నాకు సహోదరుండు నీవు మదీయభగినివి మీ రిద్దఱుం గూడి యీలోకంబునందు నవ్యక్తుండును భీమసైనికుండును నై యేను వర్తింతు ననిన నాభయనామకుం డయినయవనేశ్వరునిదిష్టకారు లైన సైనికులు ప్రజ్వారకాలకన్యాయుక్తు లై భూమండలంబెల్లఁ దిరుగుచు నొక్కనాఁ డతివేగంబున భామభోగాఢ్యంబును జరత్పన్నగపాలితంబును నయినపురంజనుపురంబు నావరించి యున్నంత స్వాభిభూతుం డయిన పురుషునకు నిస్సారత్వంబు గలిగించునట్టికాలకన్యక బలాత్కారంబున నాపురంజనుపురంబు ననుభవించె నట్లు కాలకన్యోపభుజ్యమానం బైనపురంబు సర్వద్వారంబులందును సర్వతోధికంబు గా నయ్యవనులు ప్రవేశించి తత్పురంబు సమస్తంబును బీడింప నిట్లు పురంబు ప్రపీడ్యమానం బగు చుండ నభిమాని యైనపురంజనుండు. 817

సీ. అనఘ యెంతయు మమతాకులచిత్తుఁ డై, బహువిధభూరితాపములఁ బొందె
ఘనకుటుంబియుఁ గాలకన్యోపగూఢుండు, నష్టసంపదుఁడు వినష్టమతియు
విషయాత్తకుండును వినిహతైశ్వర్యుండుఁ, గృపణుండు సాలనకించనుండు
నగుపురంజనుఁడు శోకావిలభావుఁ డై, గంధర్వయవనసంఘములచేత
తే. నోజ సెడి వికలత నొందు నైజపురముఁ
దవిలి ప్రతికూలురును ననాదరణయుతులు
నయినపుత్రుల బౌత్రుల ననుచరులను
సచివపౌరోహితుల నిజసతిని జూచి. 818

వ. మఱియుం గాలకన్యాగ్రస్తుం డయినతన్నును నరిదూషితంబు లైనపాంచాలబలంబులనుం జూచి యపారచింత నొంది తత్ప్రతీకారంబు సేయ నెఱుంగక కాలకన్యాపహృతవీర్యంబు లయినం గామంబుల నభిలషించుచు దీనుండును విగతాత్మగతికుండును స్నేహంబునం జేసి పుత్రదారోపలాలనపరుండును నై కాలకన్యోపమర్దితంబును గంధర్వయవనాక్రాంతంబును నైనపురంబు విడువ నిచ్చ లేకయు విడువ నుపక్రమించె నప్పుడు. 819

క. అనఘా భయనామాగ్రజుఁ, డనఁ గల ప్రజ్వారుఁ డపుడ యరుదెంచి పురం
బును సకలంబును భయనా,మునికిం బ్రీతిగ దహించె మునుకొని యంతన్.

వ. అట్లు పురంబు దహ్యమానం బగుచుండఁ బౌరభృత్యవర్గాదిసమన్వితుండును గౌటుంబికుండును బుత్త్రాదిసమన్వితుండును యవనోపరుద్ధాలయుండును గాలకన్యాగ్రస్తుండును నయినపురంజనుం డప్పురంబునందుఁ బ్రజ్వారసంస్పృష్టుం డై యనుతాపంబు నొంది తత్పురపాలనంబునందు సమర్థుండు గాక పురుకృచ్ఛ్రగువేపథుం డయి యుండ నశక్తుం డయ్యె నంత. 821

క. దవశిఖియుతతరుకోటర,నివసితపన్నగము పగిది నిజపురి వెడలం
దివురుచు నతఁడు శిథిలదవ,యవుఁడును గంధర్వగణవిహతశౌర్యుండున్. 822

సీ. అయిచాల ఘురఘురమనుశబ్ద మడరంగ, మనమునఁ జింతానిమగ్నుఁ డగుచుఁ
గొడుకులఁ గోడండ్రఁ గూఁతుల నల్లుర, మనుమల నాప్తుల ననుచరాళి
ననయంబు నల్పమాత్రావశిష్టం బైన, గృహకోశనివహపరిచ్ఛదముల
మసలునహంకారమమకారములఁ జేసి, మతిహీనుఁ డగుచు నెమ్మనములోనఁ
తే. గడఁకఁ దలఁచుచు విప్రయోగమునఁ దాను, గటకటా యిట్లు నరలోకగతుఁడ నైన
యిట్టిభార్య యనాథ యై యీకుమార, వరుల నేరీతిఁ బ్రోచునో యరసి యనుచు. 824

వ. మఱియు ని ట్లని తలంచు.

సీ. పడఁతి యే మును భుజింపక భుజింపదు నేను, నిద్రవోవక మఱి నిద్రవోదు
నేను నీళ్లాడక నీళ్లాడ నొల్లదు, పదరి యేఁ గోపింప భయము నొందు
భర్జించినను మాఱు పలుకక వా యోదు, బుద్ధిహీనుఁడ నైన బుద్ధి సెప్పు

లలి మీఱ నిట్టికళత్రంబుతో నేను, గడఁగి దేహాంతరగతుఁడ నైన

తే. ననయమును దాను బుత్రిణి యగుటఁజేసి
యాత్తశోచిని యగుచు గృహస్థధర్మ
మాచరించుచు నుండునో యనుగమనము
సేయునో యని మనమునఁ జింత నొంది. 825

క. తనపుత్రులు దత్తనయులు, ననయముఁ దాఁ జనినయెడ నిరాశ్రయు లగుచున్
వననిధిమధ్యంబున నవి,సినకలముంబోలె నెట్లు జీవించెదరో. 826

క. అని యివ్విధమునఁ గృపణుని,యనువున ఘనదుఃఖవిహ్వలానర్హుం డ
య్యును దుఃఖించుపురంజను, ననయముఁ గానిపోవ నిశ్చితాత్ముం డగుచున్.

క. చనుదెంచెను భయనామముఁ, డనువాఁ డప్పుడు పురంజనాఖ్యుఁడు పెలుచన్
వినుతాత్మ పశువుభంగిని, మనము గలఁగ యవననీయమానుం డయ్యెన్.828

వ. అనుచరవర్గంబు భృశాతురులును దుఃఖితులు నై వెనుచనుచుండ నుపరుద్ధం బగుభుజంగమం బప్పురంబు నెపుడు వాసె నప్పు డాపురంబు పురంజనుం బాసి విశీర్ణంబై ప్రకృతిం బొందె బలవంతుం డయినయవనునిచేత బలాత్కారంబున విక్రుష్యమాణుం డైనపురంజనుండు దమఃపిహితుం డై పూర్వసుహృత్తగు సఖు నీశ్వరు నెఱుంగ కుండె నంతం బరలోకగతుం డైనపురంజనుం గదిసి పూర్వంబున నదయుం డైనయతనిచేత హింసింపం బడినయజ్ఞపశువులు క్రోధోద్రేకంబునఁ గుఠారంబుల నతని నఱకె నివ్విధంబునఁ బ్రమదాసంగదోషదూషితుండును నపారతమోనిమగ్నుండును నష్టజ్ఞానుండును నయి పురంజనుం డనేక కాలంబు పరలోకంబున నార్తి ననుభవించి తద్భార్య యైనప్రమదోత్తమం జిత్తంబున నశ్రాంతంబును దలంచు చుండం దదీయసంస్మరణంబునంజేసి తరువాతిజన్మంబున విదర్భరాజగృహంబునం బ్రమదోత్తమ యై జన్మించె నంత.

సీ. అవనీశ వీర్యపణాత్త యైనట్టివై,దర్భిని మలయకేతనుఁ డనంగఁ
బరపురంజయుఁ డైనపాండ్యభూమీశుండు, దారుణసంగరస్థలమునందు
శక్తి ననేకరాజన్యుల నిర్జించి, పరిణయం బయ్యె నాగుణభుజుండు
నావిదర్భాత్మజయం దసితేక్షణ, యైనకూఁతును ద్రవిడాధినాథు

తే. లైనకొమరుల నేడ్వుర నర్థిఁ గనియె, వారలకు నెల్ల నొక్కొక్కవరుస నర్బు
దాహ్వదసుతులు సంజాతులైరి యతని,సుత ధృతవ్రత నాయగస్త్యుఁడువరించె.

క. అతఁ డాకన్యకవలనను, జతురుం డై యిధ్మవాహజనకుఁ డగుదృఢ
చ్యుతుఁ డనుమునీంద్రుఁ గనియెను,మఱి నంతవిరక్తుఁడగుచు మలయధ్వజుఁడున్.

తే. క్ష్మాతలం బెల్ల నిజతనూజాతులకును, బంచి యిచ్చి సరోజాక్షపాదపంక
జార్చనాయత్తుఁ డగుచుఁ గులాద్రికరుగ,నంత మదిరాక్షి సతియగునావిదర్భి.

తే. కడఁక గృహములు నఖిలభోగములు విడిచి
చంద్రు వెనుచను చంద్రికచందమునను
భక్తి దళుకొత్తఁ బాండ్యభూపాలుఁ డయిన
మలయకేతను వెనుకొని మగువ సనియె. 833

వ. ఇట్లు ధర్మపత్ని వెంట రాఁ జని యందుఁ జంద్రవసాతామ్రపర్ణీనవోదక లను నదులపుణ్యజలంబుల సుస్నాతుం డయి ప్రక్షాళితబాహ్యాభ్యంతరమలుండును గందమూలఫలబీజపుష్పపర్ణతృణతోయాహారుండు నై కాయకర్శనం బైన తపం బాచరించుచు శీతోష్ణవర్షవాతంబులు క్షుత్పిపాసలుఁ బ్రియాప్రియంబులు సుఖదుఃఖంబులు ననుద్వంద్వంబులు సమదర్శనుం డై జయించి తపోవిద్యాయమనియమంబులం జేసి పక్వకషాయుం డై బ్రహ్మంబునందు నిజాత్మ ననుసంధించి విజితేంద్రియప్రాణచిత్తుం డై స్థాణువుంబోలె దివ్యవర్షశతంబు తపంబు సేసి భగవంతుం డయినవాసుదేవునియందుఁ బ్రీతి వహించుచు నన్యం బెఱుంగక వర్తించుచుఁ దన్ను స్వప్నమందు మమేదం శిరశ్ఛిన్న మిత్యాది ప్రతీతియందుంబోలె వ్యతిరిక్తునిఁగా వ్యాపకునిఁగా సంతతకరణవృత్తిసాక్షినింగా నెఱింగి. 834

సీ. సాక్షాత్కృతుండును సర్వేశ్వరుండును, భగవంతుఁడును గృపాపరుఁడు నైన
హరి యనులోకైకగురునిచే నుక్తమై, సర్వతోముఖమును స్వప్రకాశి
తము నగుమహితశుద్ధజ్ఞానదీపప్ర, భాతతిచేఁ బరబ్రహ్మమందుఁ
దన్నును దనయందుఁ దగఁ బరబ్రహ్మంబు, నెనయఁగ్గనుచు దగ్ధేంధనాగ్ని

తే. భంగి నీషణములఁ బెడఁబాసి భూరి, వ్యసననాగరసంస్మృతివలనఁ జాల
నుపరతుండయ్యె నామహితోన్నతుండు, నవనినాయక విను మప్పుడతనిభార్య.

క. పతివ్రత శీలసమం, చిత వేణీభూతచికుర చీరాంబర సు
వ్రతచర్యాక్షామాంగి వి, గతదోష విదర్భరాజకన్యక యచటన్. 836

తే. కమలలోచన నిఖిలభోగములఁ బాఱఁగి, మలయకేతనుఁ బరమధర్మజ్ఞుఁ జేరి
నిరుపమైకపాతివ్రత్యనియమ మొప్ప, సాధ్వియై భక్తిఁ బరిచర్య సలుపుచుండె.

క. విమలమతి నిజేశుసమీ, పమునన్ సతి ధూమరహిత [1]పవమానసఖా
గ్రమున వెలుఁగొందుకీలవి, ధమునఁ బ్రకాశించుచుండెఁ దద్దయు వేడ్కన్.

క. సతి దనప్రాణేశ్వరుఁ డుప, రతుఁ డగుట మనంబులో [2]నరయకయు పూర్వ
స్థితి నుపచారక్రియ లం, చితమతిఁ గావింపఁ గలఁచి చిరతరభక్తిన్. 839

క. అనుపమసుస్థిరనియమా, సనుఁ డగునిజనాథు డాయఁ జని పూర్వగతిన్
వినమిత యై సతి తత్పద, వనజము లర్చించునపుడు వరుపాదములన్. 840

క. విను మూష్మత లేకున్నను, గని యూథభ్రష్టహరిణి కైవడి సతి నె
మ్మనమున బెగడుచు దీనత, ననయంబును బంధురహిత యై శోకించెన్. 841

---

1 'వహ్నిపురోభాగమున. 2 నెఱుఁగకయు.' వ్రా. ప్ర.

చ. అనయము నిట్లు శోకవివశాలాశ్రుపయఃకణసిక్తమానిత
స్తనయుగ యై వియోగపరితాపమునన్ హృదయంబు మాఁడ శో
భనలలితాధరోష్ఠనవపల్లవము గందఁగ సుస్వరంబు గా
వనజదళాక్షి. యేడ్చె ననివారణఁ దద్విపినాంతరంబునన్. 842

ఉ. హా నరనాథ హా సుమహితాత్మక హా గుణశాలి యింక నం
భోనిధిమేఖలాకలితభూతల మెల్లను నుగ్రచోరపీ
డానిరతిం గృశింప నకటా తగు నయ్య యుపేక్ష సేయ శో
భానయశాలి నీవు పరిపాలన సేయుదు లెమ్ము భూవరా. 843

చ. అని విలపించుచున్ సరసిజాక్షి నిజేశుపదారవిందముల్
దననిటలంబు సోఁకఁ బరితాపమునం బడి బిట్టు చాల రో
దన మొనరించుచుం గఠినదారువులం జితిఁ బేర్చి యందులోఁ
బెను పగుతత్కళేబరముఁ బెట్టి శిఖిం దరికొల్పి యుమ్ములన్. 844

క. తా ననుగమనము సేయం, బూనుటయును నంతలోనఁ బూర్వసఖుఁడు వి
జ్ఞానస్వరూపకుండును, నైన ధరాదివిజుఁ డొక్కఁ డబలం గనుచున్. 845

క. చనుదెంచి యత్తలోదరి, సునయోక్తుల ననునయించుచుం దగ ననియెన్
వనితా నీ వెవ్వతె వె,వ్వనిదాన [1]వితం డెవండు వగచెద వేలా. 846

క. అని యడిగి వెండియును ని, ట్లనియెను నీసృష్టిపూర్వమందును నీ వె
వ్వనితోడిసఖ్యసౌఖ్యం, బనయంబు న్ననుభవించి తట్టిసఖుండన్. 847

క. న న్నెఱుఁగు దేని మనమున, న న్నెఱుఁగక యున్న నైన నలినదళాక్షీ
నన్నుఁ బురాతనసఖుఁ గా, నెన్నం గలదాన నైన నెఱుఁగవె చెప్పుమా. 848

వ. కావున నీవును నేనును బూర్వంబునందు మానసనివాసుల మైనహంసల మై యుండి గృహంబుఁ బాసి సహస్రవత్సరంబులు సఖుల మై వర్తించునంత నీవు నన్నుం బాసి భూమభోగరతుండ వై మనంబున నివాసంబు నిచ్ఛయించుచు మహీమండలంబు గలయం గ్రుమ్మరునప్పు డొక్కకామినీనిర్మితంబుం బంచారామంబు నవద్వారసమేతంబు నేకపాలకంబుఁ ద్రికోష్ఠంబు షట్కులంబుఁ బంచవిపణంబుఁ బంచప్రకృతియు స్త్రీనాయకంబు నైనయొక్కపురంబు వొడగంటి వది యెట్టి దనినం బంచారామంబు లనం బంచేంద్రియార్థంబులు నవద్వారంబు లన నాసికాదిద్వారంబు లేకపాలకం బనం బ్రాణపాలనంబు త్రికోష్ఠంబు లనం దేజోభిన్నంబులు షట్కులంబు లన నింద్రియసంగ్రహంబు విపణంబు లనం గర్మేంద్రియంబులు పంచప్రకృతి యనం బంచభూతంబులు ప్రకృతి యను కామిని యన బుద్ధి యిట్టిపురంబునకుం బ్రవిష్టుం డైనపురుషుం డంగనాపరతంత్రుఁడు నజ్ఞుండు నైననీవ యప్పురంబునం గామినీసంస్పృష్టుండ వై రమియించుచుఁ దత్సంగమం

1 వు నిట్లు పడినవాఁ డెవ్వఁ డిలన్.

బున నష్టస్మృతి వై వైదర్భీజనసంభావితసుఖాభాసంబు లగుదుఃఖంబులచే నిట్టి పాపిష్ఠం బైనదశం బొందితివి గావున. 849

సీ. నీవు వైదర్భివి గావు వీరుఁ డితండు, వివరింపఁగాఁ గాఁడు విభుఁడు నీకు
నొగి మున్ను పురమున నుపరుద్ధుఁ జేసిన, యాపురంజనపతి వరయఁ గావు
[1]మఱియు నీ వన్యసీమంతిని యనియును, జర్చింపఁగాఁ బూర్వజన్మమందుఁ
బురుషుండ ననియును బుద్ధిఁ దలంచుట, యరయంగ నీయుభయము నసత్య

తే. మింతయును మామకీన మై యెసఁగుమాయఁ
జేసి కల్పిత మయ్యెఁ జర్చింప మనము
పూర్వమున హంసలమ యని పూని తెలియఁ
బలికితిఁ దెలియ మనలరూపంబుఁ జూడు. 850

వ. ఏనే నీవు గాని యన్యుండవు గావు నీవే నేఁ గాని యన్యుండం గా నిట్లని యెఱుంగుము విద్వాంసులు మనయిద్దఱయందు నంతరంబు నీక్షింపరు పురుషుండు దన నొక్కనినె యాదర్శచక్షువులందు భిన్నరూపునిం గాఁ దలంచు చందంబున మనయిద్దఱికిని భేదంబు గలిగినయట్లు తోఁచు నని యివ్విధంబున నతం డతనిచేత నీవు పూర్వంబున మదీయసఖుండ వైనహంస వని తెలుపంబడి స్వస్థుం డై తద్వియోగనష్టం బైనజ్ఞానంబు గ్రమ్మఱం బొందె నని చెప్పి నారదుండు ప్రాచీనబర్హిం జూచి యీయధ్యాత్మతత్త్వంబు రాజకథామిషంబున నీకు నెఱింగించితి ననిన. 851

క. విని భూమీశుఁడు నారద, ముని కను భవదీయవచనములు సూరులు ద
క్కను గర్మమోహితుల మై, వనరెడు నే మెట్లు దెలియువారము చెపుమా.

వ. అనిన యోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె నరేంద్రా యేమికతంబున నాత్మచేత నేకద్విత్రిచతుష్పాదంబును బహుపాదంబును నపాదంబు నగుచుఁ బురంజనదేహంబు ప్రకటం బగు చుండు నాకతంబునం బురంజనుండు పురుషుం డయ్యె నట్టిపురుషునకు నామక్రియాగుణంబుల విజ్ఞాయమానుండు గాకుండుటం జేసి యవిజ్ఞాతశబ్దంబునం జెప్పంబడుసఖుం డీశ్వరుండు పురుషుండు సాకల్యంబునం జేసి దేహపరిగ్రహంబు సేయ నిచ్ఛయించునప్పుడు నవద్వారకలితంబును ద్విహస్తచరణయుక్తంబును నయినపురం బేది గల దదియ లెస్స యని తలంచి యప్పురం బనుదేహంబునందుఁ బురుషుం డింద్రియంబులం జేసి నేబుద్ధి నధిష్ఠించి విషయంబుల ననుభవించు నహంకారమమకారంబులకు నేబుద్ధితత్త్వంబు గారణం బగు నట్టిబుద్ధి ప్రమదోత్తమ యనంబడు దానికి సఖులు జ్ఞానకర్తృకారణంబు లైనయింద్రియగుణంబులు సఖీజనంబులు దదీయవృత్తులు పంచముఖోరగం బనం బంచవృత్తి యైనప్రాణంబు నేకాదశమహాభటు లన బృహద్బలుండు నుభ

1 నర్థి నీ విపుడు పరాంగన ననియును.

యేంద్రియనాయకుండు నైనమనంబు నవద్వారసమేతం బైనయప్పురంబు చుట్టి వచ్చినపాంచాలదేశంబు లనం బంచవిషయంబులు నవద్వారంబు లన నక్షినాసికాకర్ణముఖగుదశిశ్నంబులు నందు నక్షినాసాస్యంబు లైదునుం బ్రాగ్ద్వారపురస్కృతంబులు దక్షిణోత్తరకర్ణంబులు దక్షిణోత్తరద్వారంబులు గుదశిశ్నంబులు పశ్చిమద్వారంబు లందు [1]నేకస్థలనిర్మితంబు లయినఖద్యోతావిర్ముఖులు నేత్రంబులు విభ్రాజితం బన రూపంబు ద్యుమంతుం డనం జక్షురింద్రియంబు నళినీనాళిను లన నాసికాద్వారంబులు సౌరభం బన గంధంబు నవధూత యన ఘ్రాణేంద్రియంబు ముఖ్య యన నాస్యంబు విపణం బన వాక్కు రసజ్ఞుం డన రసం బాపణం బన వ్యవహారంబు బహూదనం బన వివిధాన్నంబు పితృహూ వన దక్షిణకర్ణంబు దేవహూ వన నుత్తరకర్ణంబు చండవేగుం డనం గాలోపలక్షికం బైనసంవత్సరంబు గంధర్వు లన దివంబులు గంధర్వీజనంబు లన రాత్రులు పరివర్తనం బన నాయుర్హరణంబు గాలకన్యక యన జర యవనేశ్వరుం డన మృత్యు వతనిసైనికు లన నాధివ్యాధులు ప్రజ్వారుం డనం బ్రాణిహింస యందు శీఘ్రవేగంబు గలిగి శీతోష్ణభేదంబులం ద్వివిధం బైనజ్వరంబు దక్షిణపాంచాలం బనం బితృలోకప్రాపకంబును బ్రవృత్తిరూపకంబును నైనశాస్త్రం బుత్తరపాంచాలం బన దేవలోకప్రాపకంబును నివృత్తిసంజ్ఞికంబు నయినశాస్త్రంబు శ్రుతధరుం డన శ్రోత్రంబు నాసురీనామకం బనం బశ్చాద్ద్వారం బైనమేఢ్రంబు గ్రామకం బన సురతసుఖంబు దుర్మదుం డన గుహ్యేంద్రియంబు నిరృతినామకం బైనపశ్చిమద్వారం బన గుదంబు వైశసం బన నరకంబు లుబ్ధకుం డనం బాయువు సంధు లన హస్తపాదంబు లంతఃపురం బన హృదయంబు విషూచి యన మనం బని వెండియు నిట్లనియె. 853

సీ. అనఘాత్మ వినుము జాగరయాత్మజు [2]ననుగుణా, క్తం బగు మఱి బుద్ధిరతి త్త్వ మద్ధి
వెలయ నేగాగతిని [3]విక్రృతి సేయంబడు, నేగాతెఱంగుల ని నింద్రియములు
వికసించు నాయాయివిధమునఁ దద్గుణా, న్వితుఁడును వరుసఁ దద్వృత్తులకును
ఘనుఁడు నుపద్రష్టయును దగు నాత్మయుఁ, దద్వృత్తులును బలాత్కారమునను

తే. ననుకరింపంగ నర్థిఁ జేయంగఁ బడుట
ననయమును నాత్మమహిమని ని ననుసరించు
టయు నెఱుఁగఁ జెప్పి యిట్టు లనియెను మఱియు
జనవరేణ్యునితో యోగిసత్తముండు. 854

వ. మఱియు నరదం బన దేహంబు దురంగంబు లన నింద్రియంబు లీషాద్వయం బన సంవత్సరంబునుం దత్కృతవయస్సును జక్రద్వయం బనం బుణ్యపాపకర్మ

---

1 'నేకత్రనిర్మితం' వ్రా. ప్ర. 2 'లన గుణత్రయ మగు మతి బుద్ధి. 3 వివరింపఁగాఁబడు' వ్రా. ప్ర. 4 'వికృతిని బొందు నావిధము' అ. ప్ర.

ద్వయంబు వేణుత్రయం బన గుణత్రయంబు పంచబంధురం బనం బంచప్రాణంబులు రశ్మి యన మనంబు సారథి యన బుద్ధి రథికోపవేశస్థానం బన హృదయంబు కూబరంబు లన శోకమోహంబులు పంచప్రహరణంబు లనం బంచేంద్రియార్థప్రక్షేపంబు పంచవిక్రమం బనం గర్మేంద్రియంబులు సప్తవరూథంబు లన ధాతువులు హేమోపస్కరం బన రజోగుణం బక్షయతూణీరం బన ననంతవాసనాహంకారోపాధి యేకాదశచమూపతి యన నేకాదశేంద్రియం బై నమనం బాసురీవృత్తి యనం బాహ్యవిక్రమంబు పంచేంద్రియంబులచేత మృగయావినోదంబు[1] చందంబున హింసాదులం జేసి పంచవిషయంబు లనుభవించుటయ మృగయాచరణంబును గా నీప్రకారంబున నుండ జీవుండు దేహంబున స్వప్నసుషుప్తిజాగ్రదవస్థలయందు నాధ్యాత్మికాధిదైవికాధిభౌతికంబు లైనబహువిధదుఃఖంబులం జేసి క్లేశంబుల ననుభవించుచు నజ్ఞానావృతుం డయి వర్షశతంబు నిర్గుణుం డయ్యును బ్రాణేంద్రియమనోధర్మంబులం దనయందు నధ్యవసించి కామలవంబుల ధ్యానంబు సేయుచు నహంకారమమకారసహితంబు గాఁ గర్మాచరణంబు సేయుచుండు. 855

క. పురుషుఁడు నిజప్రకాశతఁ, బరఁగియు నలఘుఁడుఁ బరుండు భగవంతుండున్
గురుఁడును నగునయ్యాత్మను, బరువడి నెఱుఁగంగ లేక ప్రకృతిగుణములన్.

క. విను మెప్పుడు దగులు నప్పుడ, యొనరంగ గుణాభిమానియయును గర్తవశుం
డనఁ దగునాపురుషుఁడు దా, ఘన మగుత్రైగుణ్యకర్మకలితుం డగుచున్.

సీ. ధృతి నొప్పుచున్నసాత్త్వికకర్మమునను బ్ర, కాశభూయిష్ఠలోకముల భూరి
రాజసప్రకటకర్మమున దుఃఖోదర్క, లోలక్రియాయాసలోకములను
గైకొని తామసకర్మంబునను దమ, శ్శోకమోహోత్కటలోకములను
[2]బొందుచుఁ బుంస్త్రీనపుంసకమూర్తుల, దేవతిర్యఙ్మర్త్యభావములను

తే. గలుగుఁ గర్మానుగుణములుగాఁగ జగతిఁ, బుట్టి చచ్చుచుఁ గ్రమ్మఱఁ బుట్టు చిట్లు
దివిరి కామాశయుం డైనదేహి యొప్పు, నున్నతానతపదముల నొందుచుండు.

వ. అని మఱియు నిట్లనియె. 859

మ. ఎనయన్ క్షుత్పరిపీడఁ గుంది శునకం బింటింటికిం బోవఁ బూ
నినఁ దద్దైవిక మైనదండహతి గానీ కాక చౌర్యాన్న మై
నను గానీ తగఁ బొందుచందమున నెన్నన్ దైవయోగంబు పెం
పున నీజీవుఁడు దాఁ బ్రియాప్రియములం బొందుం ద్రిలోకంబులన్. 860

చ. గొనకొని యట్టిదుఃఖములకుం బ్రతికారము మానవేంద్ర క
ల్గిన విను తత్ప్రతిక్రియ నరకించనవృత్తి జనుండు మస్తకం

---

1 'న నన్యాయంబునం జేసి' వ్రా. ప్ర. 2 'గడఁక నొందుచుఁ ద్రిలింగస్వరూపములను' వ్రా. ప్ర.

బాన నిదుమోపు మూఁపునను బూనినఁ దద్భరదుఃఖ మాత్మఁ బా
యనిగతి జీవుఁడుం ద్రివిధ మై తగుదుఃఖముఁ బాయఁ డెన్నఁడున్. 861

క. ఘనదుఃఖహేతుకర్మం,బును దత్ప్రతికారకర్మమును నన మాయా
జననము లగుటను బురుషుఁడు, గనుఁ గలలోఁ దోఁచినట్టికలచందమునన్.

వ. సవాసనోచ్ఛేదకంబు గా దని వెండియు ని ట్లనియె. 863

సీ. నరనాథ వినుము స్వప్నంబుచందంబున, నజ్ఞానవిలసితం బగుటఁ జేసి
తివిరి మిథ్యాభూతదేహాదికమునకు, నరయ నివర్తనాయాస మేటి
కని యంటి వేనియు నర్థంబు లేకున్న, నర్థి సోపాధికం బైనమనము
వాంఛతో స్వప్నము వర్తింపఁ బురుషునిఁ, బూని జాగ్రద్బోధచే నుపాధి

తే. చెడక స్వాప్నికసంసృతి విడువనట్లు, తత్త్వవిజ్ఞానమున నవిద్యానివృత్తి
దార దేహాదికనివృత్తి దగుల కున్నఁ, దివుట సంసృతి దా నివర్తింప కుండు.

చ. ఘనపురుషార్థభూత మనఁగాఁ దగు నాత్మకు నేనిమిత్త మై
యొనర ననర్థహేతు వన నూల్కొనుసంసృతి సంభవించిన
ట్లనయముఁ దన్నిమిత్తపరిహారక మర్థి జగద్గురుండు నాఁ
దనరినవాసుదేవపదతామరసస్ఫుటభక్తి యారయన్. 865

క. పూనినతద్భక్తి సమీ,చీనగతిం దెలియ ననఘ చిరవైరాగ్య
జ్ఞానకరం బగుభక్తిని, దానము గోవింద వరకథాశ్రయమ యగున్. 866

వ. కావున నది తత్కథాకర్ణనగాననిరతుండు విశ్వాససంయుక్తుండు నైనవానికి
సంభవించు మఱియును. 867

క. ధర సాధులు విమలాంతః,కరణులు భగవద్గుణానుకథనశ్రవణ
స్ఫురితస్వాంతులు ననఘులు, [1]వరధిషణులు నైనభాగవతజనులసభన్. 868

క. సరసోదారమహాత్మము,ఖరితము లగుమధువిరోధికమనీయగుణో
త్కరసురుచిరచరితామృత,పరిపూరితవాహినులను బరమప్రీతిన్. 869

క. మన మలరఁగ శ్రోత్రాంజలు,లను బానము సేయుపుణ్యులకు క్షుత్తృష్ణా
ఘనభయశోకవిమోహము, లనయంబును సోఁక కుండు నవనీనాథా. 870

వ. కావున నిట్టిభాగవతసహవాసంబు లేకయున్నఁ (దనంతన భగవద్భాగవతగుణాభి
వర్ణనకథానుచింతనాదులయందుం బ్రవర్తించిన) నాలస్యాదిదోషంబు లొంది
యాజీవలోకంబు సహజక్షుదాదికంబున నుపద్రుతం బై సర్వేశ్వరకథామృత
వాహినియందు రతిం జేయ దిది నిశ్చితం బని మఱియు ని ట్లనియె. 871

సీ. పద్మసంభవుఁడును భవుఁడును మనుకుల,సమితి దక్షాదిప్రజాపతులును
నైష్ఠికులై నసనకముఖ్యమునులుఁ బు,లస్త్యుండుభృగువుఁ బులహుఁడుఁ గ్రతువు
నత్రి మరీచియు నంగిరసుండు న,రుంధతీవిభుఁడును ఋషి మెఱయ

1 వరమతులు న్నయనభాగవతనిలయములన్.

బహుపుణ్యులే కడఁ బలఁగాఁగఁ గల బ్రహ్మవాదులు నందఱు వాక్కులకును
తే. నెనయ నీశ్వరులై యుండియును సమగ్ర,మతిఁ దపోయోగవిద్యాసమాధివరవి
చారులై యుండియును సర్వసాక్షి యైన,యీశ్వరుని వెదకియుఁ గానరిద్ధచరిత.
వ. అది యెట్లం టేని. 873
మ. ఘనవిస్తార మపార మద్వయ మనంతంగా నొప్పు నీ వేదము
న్ననువర్తించుచు మంత్రయుక్తి వివిధంబై నట్టి దేవాఖ్యశో
భనసామర్థ్యముచేత నింద్రముఖరూపం బిష్టదైవంబు గాఁ
గని వేడ్కన్ భజియించువారలు గనంగా నేర్తురే యీశ్వరున్. 874
క. విను మాత్మభావితుం డన, ననఘ భగవంతుఁ డెప్పు డెవ్వనిఁ గరుణ
నన్నయము నను గ్రహించును, మనుజేశ్వర యపుడ వాఁడు మహితాత్మకుఁ డై.
క. ధీరత నీలోకవ్యవ,హారంబును వైదికంబు నన దగుకర్మా
చారములందు వినిష్ఠిత, మై రూఢిఁ దనర్చుబుద్ధి నరిఁ విడుచున్. 876
సీ. కావున రాజేంద్ర నీవును బరమార్థ,[1]రూపంబు లగుచుఁ బ్రరోచమాన
ములును గర్ణప్రియంబులును నస్పష్టవ, స్తువులును నైనయీవివిధకర్మ
ములయందుఁ బురుషార్థబుద్ధి గావింపకు, మతిఘనస్వాంతులై నట్టివారు
పరఁగుజనార్దనప్రతిపాదకం బైన,శ్రుతి గర్మపర మని చూపు చుందు
తే. వారు వేదజ్ఞు లనఁ దగువారు గారు, రూఢి మఱి వారు నిత్యస్వరూపభూత
మైనయీయాత్మతత్త్వంబు నలరు వేద,కలితతాత్పర్యమని యాత్మఁ దెలియలేరు.
వ. కావునం బ్రాగగ్రంబులైన దర్భలచేత సకలక్షితిమండలాస్తరణంబు గావించి
యహంకారయుక్తుండవు నవినీతుండవు నై పెక్కుపశువులఁ జంపనే కాని కర్మ
స్వరూపంబును విద్యాస్వరూపంబును నెఱుంగ వాక మవిద్యాస్వరూపంబు లె
ట్టి వనిన సర్వేశ్వరపరితోషకం బేది యదియ కర్మం బగు సర్వేశ్వరునియందు
నేమిట మతి సంభవించు నదియ విద్య యతండే దేహులకు నాత్మయు నీశ్వరుండు
నగు చుండుఁ గావునఁ బురుషులకు క్షేమకరం బైన యాశ్రయంబు దత్పాద
మూలంబ యతండు ప్రియతముండును సేవ్యమానుండును నగు చుండ నణుమా
త్రం బయిన దుఃఖంబు లే దట్టియాభగవత్స్వరూపం బెవ్వం డెఱుంగును వాఁడు
విద్వాంసుండును గురుండును హరియు నని చెప్పి వెండియు ని ట్లనియె. 878
క. అవనీశ యీవిధంబున, భవదీయప్రశ్న మిట్లు పరిహృత మయ్యెం
దవిలి యింక నొక్కగోప్యము, వివరించెదఁ జిత్తగింపు విమలచరిత్రా. 879
సీ. లలి సుమనోవాటికలయందు నల్పప్ర,సూనమరందగంధానుమోద
సంచారియును మృగీసహితముఁ దన్నివే,శితచిత్తమును మధువ్రతనినాద
మేదురశ్రవణానుమోదితమును బుగ్గ,భాగచరన్నిజప్రాణహారి

---

1 కలితంబు లగుచుఁ బ్రకాశమాన.

దీపితవృకగణాధిష్ఠితమును లుబ్ధకక్రూరఘనసాయకప్రభిన్న
తే. పృష్ఠభాగంబు నై [1]తగనెదను మృత్యుభీతి వాటిల్ల నొందు దప్పింప నెరవు
గాన కడవిఁ జరించుమృగంబుపగిది, భూవరోత్తమ వినవయ్యపురుషుఁ డెపుడు.

వ. అంగనానివాసంబులయందు క్షుద్రతమం బగుకామ్యకర్మపరిపాకజనితం బైన జిహ్వోపస్థాదికామజనితసుఖలేశంబుల నన్వేషించుచుఁ గామినీయుక్తుండును దన్నివేశితమానసుండును సతిమనోహరవాంఛితవనితాజనాలాపశ్రవణతత్పరచిత్తుండును బ్రత్యక్షంబున నాయుర్హరణకారణాహోరాత్రాదికాలవిశేషగణనాపరుండును గాక పరోక్షంబునం గృతాంతశరనిర్భిన్నగాత్రుండును నగుచు ఈజీవుండు విహరించుచుండుం గావున నీవు ఈజీవుని [2]మృగచేష్టితంబుగా విచారించి శ్రోత్రాదులం దున్న [3]శబ్దాదులంబోలె బాహ్యవృత్తు [4]లగుశ్రోత్రస్మార్తాదిరూపకర్మంబులను హృదయంబునందు నియమించుచు నసజ్జనయూథవార్తాసహితం బైనగృహాశ్రమంబు విడువుము సకలజీవాశ్రయుం డైనయీశ్వరుని భజియింపు మిట్లు సర్వతోవిరక్తుండవు గమ్మని నారదుండు వలికిన బ్రాచీనబర్హి యిట్లనియె.

క. మునివర భగవంతుండవు, ననుపమవిజ్ఞాననిధివి ననఁ దగునిచే
తను వివరింపంగాఁ దగి, యొనసినయీయాత్మతత్త్వ మిట నాచేతన్. 882

వ. శ్రుతంబును విచారితంబును నయ్యెఁ [5]గర్మనిష్ఠు లగునుపాధ్యాయు లైనవారలీయాత్మతత్త్వంబు నెఱుంగ రెఱింగి రేని నుపదేశింపరు గావునఁ దత్కృతం బయినమహాసంశయంబు నీచేత నివృత్తిం బయ్యె నని వెండియు నిట్లనియె.

సీ. అనఘాత్మ యేమిటియందు నీయింద్రియవృత్తులు దగఁ బ్రవర్తింప కుండు
టను జేసి బుధు లైన ఘనముగ మోహంబు, రట్టియర్థమునందు ననాత్మసంశ
యము గల్గుచున్నది యది యెట్టి దనినను, బురుషుఁ డేయే దేహమునను జేసి
కర్మముల్ సేసి తత్కార్యంబు ఈలోకమందునే విడిచి తా నన్యదేహ
తే. మర్థితో ఘటియించి లోకాంతరమునఁ
బొంది తత్కర్మఫలమును బొందు ననుచుఁ
బ్రకటముగ వేదవేత్తలు వలుకుచుందు
రన్న నది యెట్లు విను నుపపన్న మగును. 884

వ. అదియునుం గాక యాచరితం బైనకర్మంబు తత్క్షణంబ వినష్టం బగుటం జేసి దేహాంతరలోకాంతరభావి యైనఫలం బెట్లు సంభవించు ననినఁ బ్రాచీనబర్హికి నారదుం డిట్లనియె నరేంద్రా స్వప్నావస్థయందు లింగశరీరాధిష్ఠాత యైనజీవుండు జాగ్రద్దేహాభిమానంబు విడిచి తాదృశంబ కాని యతాదృశంబ కాని యైనశరీరాంతరంబు నొంది మనంబునందు సంస్కారరూపంబున నాహితం బైనక

1. మనంబునను 2. యొక్కమృగ. 3. నదులంబోలె. 4. లు ధరియించుచు ఈచిత్తంబునందు నియ. 5 నిష్ఠోపదేష్ట లైనవారు.

నాచరించు నాలింగశరీరంబున లోకాంతరంబున దేహవిభేదంబు నొందక తత్ఫ
లం బనుభవించు నదియునుం గాక దానప్రతిగ్రహాదులయందు స్థూలదేహంబున
కుం గర్తృత్వంబు గల దంటివేని నహంకారమమకారయుక్తుం డయినపురుషుండు
మనంబునంజేసి యేయేదేహంబు పరిగ్రహించు నాయాదేహంబున సిద్ధం బైన
కర్మం బాజీవుం డనుభవించు నట్లు గా కున్నం గర్మంబు పునర్భవకారణం బగు
ట యుపపన్నంబు గా కుండుం గావున మనఃప్రధానం బైనలింగశరీరంబునకే
కర్తృత్వం బుపపన్నం బగు నని వెండియు ని ట్లనియె. 885

క. క్షితి నుభయేంద్రియకర్మస్థితు లనుభవ మందఁబడినరుచి త్తముపగిదిన్
ధృతిఁ జిత్తవృత్తులను లక్షిత మగుఁ దత్పూర్వదేహకృతకర్మంబుల్. 886

వ. అది యె ట్లనిన నీదేహంబునంజేసి యేరూపంబు నేప్రకారంబున నెప్పు డెచ్చ
ట నగు నది యననుభూతంబును నదృష్టంబును నశ్రుతంబును నై యుండు నట్టిది
యొకానొకకాలంబున వాసనాశ్రయుం డయినపురుషునకుఁ (దదనుభవాది
యుక్తం బగు) పూర్వదేహంబున ననుభూతంబును దృష్టంబును శ్రుతంబును నని
విశ్వసింపు మీమనంబున ననుభూతార్థంబు గోచరింపఁ జాల దీమనంబె పురు
షులకు శుభాశుభనిమిత్తంబు లైనపూర్వాపరదేహంబులం బ్రకాశింపం జేయు
చుండు నీమనంబునందు నదృష్టంబు నశ్రుతంబు నైనయర్థంబు స్వప్నాదిక
మందుం దోఁచు నంటి వేని నది దేశకాలక్రియాశ్రయం బని తలంపం దగు
నీసమస్తవిషయంబులుఁ గ్రమానురోధంబున మనంబునంజేసి భోగ్యంబు లగు
నని మఱియు ని ట్లనియె. 887

చ. సుమహితశుద్ధసత్త్వగుణశోభితముం గరసీరుహోదరో
త్తమగుణచింతనాపరము ధన్యము నైనమనంబునందు భూ
రమణ సుధాంశునందు నుపరాగమునం దివిఁ దోఁచురాహుచం
దమునను గోచరం బగు నుదారత నీయఖిలప్రపంచమున్. 888

వ. అని వెండియు ని ట్లనియె లింగదేహమునకుఁ గర్తృత్వభోక్తృత్వంబులు స్థూల
దేహద్వారకంబు లగుటంజేసి స్థూలదేహవినాశంబు గలుగం జీవునకుఁ గర్తృ
త్వభోక్తృత్వంబులు లే కుండుటంజేసి ముక్తి గలుగు నంటి వేని నీస్థూలదేహ
సంబంధంబు జీవునియందు బుద్ధిమనోమోహార్థగుణవ్యూహరూపాదిలింగశరీర
భంగపర్యంతంబు గలుగు చుండును సుషుప్తిమూర్ఛాదులయందు (నిష్టవియో
గాదిదుఃఖమందు) నహంకారంబు గలిగి యుండు నది యింద్రియోపహతింజేసి
యమావాస్యయందలిచంద్రుండునుంబోలెఁ దరుణపురుషునకు గర్భబాల్యా
వస్థలయందు నింద్రియపౌష్కల్యంబు లేకుండుటంజేసి యేకాదశేంద్రియస్ఫురణ
సమర్థం బైనయహంకారంబు (గర్భాదులకుఁ) బ్రకాశింపనిచందంబునం దోఁప
కుండుఁ గావున స్థూలదేహవిచ్ఛేదకంబు లే కుండుటంజేసి వస్తుభూతార్థంబు లే

కున్న నీసంసారంబు (విషయంబులయం దాసక్తుం డగుజీవునకు) స్వాప్నికాప
ర్థాగమనంబునుంబోలె నివర్తింప దీతీరునఁ బంచతన్మాత్రాత్మకంబును (త్రిగుణా
త్మకంబును) షోడశవికారయుక్తంబును నయినలింగశరీరంబు నధిష్ఠించి చేతనా
యుక్తుం డైనజీవుం డని చెప్పంబడు మఱియును. 889

సీ. తివిరి యప్పురుషుండు దేహంబునను జేసి, యనయంబుఁ బెక్కు దేహాంతరముల
నంగీకరించుచు నవి విసర్జించుచు, సుఖదుఃఖభయమోహశోకములను
[1]బొలుపొందుతద్దేహములనె పొందుచు నుండు, నది యెట్లు లన్ననగ్రభాగ
తృణమూఁదిమఱిపూర్వతృణపరిత్యాగంబు, గావించుతృణజలూకయునుబోలె
ఆ. జీవుఁ డవనిఁ గొంత జీవించి మ్రియమాణుఁ, డగుచు నొందుదేహమర్థిఁ జెంది
కాని పూర్వ మైనకాయంబు విడువఁడు, గాన మనమె జన్మకారణంబు. 890

తరలము. నరవరోత్తమ యట్లు గాన మనంబె జీవుల కెల్ల సం
సరణకారణ మట్టికర్మవశంబునన్ సకలేంద్రియా
చరణుఁ డౌట నవిద్య గల్గును సంతతంబు నవిద్యచేఁ
బరఁగుటన్ బహుదేహకర్మనిబంధముల్ గలుగుం జుమీ. 891

చ. విను మది గాన భూవర యవిద్య లయించుటకై రమాపతిన్
ఘనజననస్థితిప్రళయకారణభూతుఁ బయోజపత్త్రలో
చనుఁ బరమేశు నీశ్వరుని సర్వజగంబుఁ దదాత్మకంబు గాఁ
గనుఁగొనుచుం దదీయపదకంజము లర్థి భజింపు మెప్పుడున్. 892

క. అని యీగతి భగవంతుం, డనఘుఁడు ఘనభాగవతుఁడు నగునారదుఁ డా
ఘనునకు జీవేశ్వరగతి, ఘనకృప నెఱిఁగించి సిద్ధగతిఁ జనినయెడన్. 893

సీ. రాజర్షి యైనట్టిప్రాచీనబర్హి దాఁ, దగఁ బ్రజాపాలనార్థంబు సుతుల
ధరకు నియోగించి [2]తపము సేయుటకునై, కపిలాశ్రమంబున కపుడు వోయి
యచ్చట నియతి నేకాగ్రచిత్తుండును, ముక్తసంగుండును భూరిధైర్య
యుక్తుండు నగుచు సద్భక్తియోగంబున, ననఘ గోవిందపదారవింద
తే. చింతనామృతపానవిశేషచిత్తుఁ, డగుచు విధిప్రముఖ్యుల కంద రాని
యవ్యయానందమయపదమం దనప్పు, డనుచు మైత్రేయముని విదురునకుఁ జెప్పె.

వ. వెండియు నిట్లనియె నిట్లు ముకుందయశంబునం జేసి భువనపావనంబు మనశ్శుద్ధి
కరంబు సర్వోత్కృష్టఫలప్రదాయకంబు దేవర్షివర్యముఖవినిస్సృతంబు నైన
యీయధ్యాత్మపారోక్ష్యంబు నెవ్వండు పఠియించు నెవ్వండు విను నట్టివారు
లింగశరీరవిధూననంబు గావించి ముక్తసమస్తబంధు లయి (విదేహకైవల్యంబు
నొంది) సంసారంబునందుఁ బరిభ్రమింప రనిన మైత్రేయునకు విదురుం డి
ట్లనియె. 895

1 'పురుషుండు తదేహ. 2 దాఁ దపోరూపంబుఁ, బూని కపిలాశ్రమమునకు నేఁగి' వ్రా.ప్ర.

క. మునినాథ [1]ప్రచేతసు లా, ఘన మగురుద్రోపదిష్టకమలోదరకీ
ర్తనమున నేగతిఁ బొందిరి, వనజాక్షుఁడు సంతసింప వా రనఘాత్మా. 896

-ప్రచేతసులతపంబునకు భగవంతుండు మెచ్చి వరంబు లిచ్చుట.-

తే. కడఁగి మఱి వారుయాగ్రచ్ఛకమునఁ జేసి, హరికినిత్యప్రియుండగుహరునిఁ గాంచి
[2]యతనివలనియనుగ్రహమందిమోక్ష, మందిరని చెప్పితది నిశ్చయంబు మఱియు.

క. హరిదర్శనపూర్వం బిహ, పరలోకములందు నానృపాలతనయు లం
దఱు నేఫలముల నందిరి, యెఱిఁగింపు మటన్న నమ్మునీంద్రుఁడు పలికెన్. 898

క. విను జనకాదేశము ముద, మునఁ దాల్చి నృపాత్మజులు సముద్రోదరమం
దనుపమజపయజ్ఞంబున, నొనరఁ దపం బూని ముదము నొందుచు నుండన్.

క. పదివేలేఁడులు నిష్ఠను, వదలక తప మాచరింప వారల కర్థి
సదయాంతరంగుఁ డభయప్రదుఁడు సనాతనుఁడు నైనపద్మోదరుఁడున్. 900

క. అనుపమశాంతము లగునిజ, తనురశ్ములచే నృపాలతనయతపోవే
దనలు శమింపఁగఁ జేయుచు, ననయముఁ బ్రత్యక్షమయ్యె నచ్యుతుఁ డంతన్.

సీ. ఘనమేరుశృంగసంగతనీలమేఘంబు, నెఱి గరుడస్కంధనివసితుండు
కమనీయనిజదేహకాంతివిపాటితా, ఖిలాఖిలాశాంతరాళతముఁడు
సుమహితాష్టాయుధసుమనోమునీశ్వర, సేవకపరిజనసేవితుండు
మండితకాంచనకుండలరుచిరోప, లాలితవదనకపోలతలుఁడు

తే. చారునవరత్నదివ్యకోటీరధరుఁడు, కౌస్తుభప్రవిలంబమంగళగళుండు
లలితపీతాంబరప్రభాలంకృతుండు, హారకేయూరవలయమంజీరయుతుఁడు.

క. లలితాయతాష్టభుజమం, డలమధ్యస్ఫురితరుచివిడంబితలక్ష్మీ
లలనాకాంతిస్పర్ధా, కలితలసద్వైజయంతికాశోభితుఁడున్. 903

క. సురగరుడయక్షకిన్నర, నిరుపమ జేగీయమాననిఖిలాశాసం
భరితయశోమహనీయ, స్ఫురణుం డగునప్పురాణపురుషుం డెలమిన్. 904

క. కరుణావలోకనంబుల, నిర వొంద నృపాలసుతుల వీక్షించి రమా
వరుఁ డంబుదగంభీరమ, ధురభాషలఁ బలికెఁ బ్రియము దూఁకొనుచుండన్. 905

తే. తాపసోత్తము లగుప్రచేతసులు వేడ్క, వినుఁడు మీరలు సౌహార్దమున నభిన్న
ధర్ములగుట భవత్సౌహృదమున కేను, జాలఁ బరితోష మందితి సమత నేఁడు.

క. అనయమును మీమనోరథ, మొనరింతు నెఱుంగఁ బలుకుఁ డుత్తము లగుమి
మ్మనుదినము నెవ్వఁడు సుఖశ, యనుఁడై మదిలోనఁ దలఁచు నానరుఁ డెపుడున్.

క. భ్రాతృజనసౌహృదంబును, భూతదయాగుణము విమలబుద్ధియు సుజన
ప్రీతియుఁ గల్గి సుఖించును, వీతసమస్తాఘుఁ డగుచు విశ్వములోనన్. 908

1 ప్రచేతస్కులు; 'ప్రచేతస్కులు' అనియే నార్యప్రయోగము. 2 యతనిచే ననుగ్రహీతులై యంతరు మోక్ష.

వ. మఱియు రుద్రగీతం బయిన మదీయస్తవం బెవ్వ రనుదినంబును స్తోత్రంబు సేయుదురు వారల కభిమతవరంబులు శోభనకరం బగు ప్రజ్ఞయు నిత్తు మీరలు ముదన్వితులై జనకాదేశం బంగీకరించుటం జేసి మీకీర్తి లోకంబుల విస్తరిల్లు మీకు ననూన బ్రహ్మగుణుండు నాత్మసంతతిం జేసి లోకత్రయపరిపూర్ణగుణాకరుండు నైన పుత్త్రుండు సంభవింపం గలండు కండుమహామునితపోవినాశార్థంబుగా నింద్రప్రేషిత యగు ప్రమ్లోచ యను నప్సరస గర్భంబు దాల్చి యమ్మునీంద్రుని వీడ్కొని దివంబునకుం జనుసమయంబునం బ్రసూత యై తత్పుత్త్రిని వృక్షంబులందుఁ బెట్టి చనిన. 909

సీ. ఆశిశు వపుడు పేరాఁకలిచేఁ గుంది, వాపిచ్చి బిట్టు వాపోవుచుండ
నాలించి యటకు రాజైన సోముఁడు వచ్చి, వల నొప్ప నవసుధావర్షి యైన
యాత్మీయతర్జని నర్థిఁ బానము సేయింపంగఁ బెరిఁగి యయ్యిందువదనఁ
గన్య వరారోహఁ గడఁక మారిష యను, చెలువఁ బుణ్యుండు ప్రాచీనబర్హి
తే. [1]యన్నృపునిచేఁ బ్రజావిసర్గావసరము
నందు వేడ్కఁ దదాదిష్టు లైన మీర
లందఱును నెయ్యమున వివాహంబు గండ్రు
యని సరోరుహనయనుఁ డిట్లనియె మఱియు. 910

వ. అనఘాత్ములారా యభిన్నధర్మశీలనాముల రయిన మీకు నందఱకు నాసుమధ్య యైనకన్య యభిన్నధర్మశీలయు భవదర్పితాశయయు నయినభార్య యగు మీర లప్రతిహతతేజస్కుల రై దివ్యవర్షసహస్రంబులు భౌమదివ్యభోగంబులు మదనుగ్రహులై యనుభవించెద రంత నాయందుల భక్తిం జేసి నిర్మలాంతఃకరణులై యాభోగంబులు నిరయప్రాయంబులు గాఁ దలంచి మదీయస్థానంబు నొందెద రని వెండియు నిట్లనియె. 911

చ. అరయ గృహస్థు లయ్యును మదర్పితకర్ములు నస్మదీయసుం
దరచరితామృతశ్రవణతత్పరమానసయాతయాములుఁ
సరసగుణాఢ్యులై తనరుసాధుల కిగ్గృహముల్ దలంప దు
ష్కరభవబంధహేతువులు గావు నృపాత్మజులార యెన్నఁడున్. 912

వ. అది యెట్లంటి రేని. 913

చ. అనుపమబ్రహ్మవాదు లగు సంచితయోగిజనానుగీయమా
ననిజకథాసముత్సుకుఁడ నైనం దగునేను [2]మదీయులం దనూ
తనముగ నుండుఁ గావున నుదారత వారికి నీగృహావళుల్
ఘనభవబంధహేతువులు గా విది యంతయు నిక్క మారయన్. 914

క. సరసుఁడ నగు ననుఁ బొందిన, పురుషులు ఘనశోకమోహమోదంబులఁ బొం

---

1 'రాజుచేతఁ బ్రజావిసర్గంబునందుఁ, బూని వేడ్కన్. 2 దదీయులం.

దరుగావున [1]నెనయఁగను ద్రిపురుషార్థేశ్వరుఁడ బ్రహ్మభూతుఁడ నగుదున్. 915

వ. అని యిట్లు పలుకుచున్న పురుషార్థభాజనుం డగుజనార్దను దర్శించి తద్దర్శనవిధ్వ
స్తరజస్తమోగుణు లయిన ప్రచేతస్కులు. 916

చ. కరసరసీరుహంబు లెసకం బెసఁగన్ ముకుళించి గద్గద
స్వరములఁ జేసి యిట్లనిరి సర్వశరణ్యు నగణ్యు నిందిరా
వరు నజితు న్ననంతు ననవద్యచరిత్రుఁ బవిత్రు నచ్యుతుం
బరుఁ బరమేశు నీశు భవబంధవిమోచనుఁ బద్మలోచనున్. 917

సీ. కేశవ సంతతక్లేశనాశనుఁడవు, గోరి మనోవాగగోచరుఁడవు
నిగ్ధమనోరథహేతుభూ[2]తోదార, గుణనాముఁడవు సత్త్వగుణుఁడ వఖిల
విశ్వోద్భవస్థితివిలయార్థధారిత, విపులమాయాగుణవిగ్రహుఁడవు
మహితాఖిలేంద్రియమార్గనిరధిగత. మార్గుఁడ వతిశాంతమానసుఁడవు
తే. తవిలి సంసార[3]సారిమేధస్కుఁడవును, దేవదేవుఁడవును వాసుదేవుఁడవును
సర్వభూతనివాసివి సర్వసాక్షి, వైననీకు నమస్కార మయ్య కృష్ణ. 918

వ. మఱియును. 919

ఉ. తోయరుహోదరాయ భవదుఃఖహరాయ నమో నమః పరే
శాయ సరోజకేసరపిశఙ్గవినిర్మలదివ్యవస్త్ర
త్రాయ పయోజసన్నిభపదాయ సరోరుహమాలికాయ కృ
ష్ణాయ పరాపరాయ సుగుణాయ సురారిహరాయ వేధసే. 920

వ. అని వినుతించి. 921

చ. కమలదళాక్ష దుఃఖలయకారణ మైతగు తావకీనరూ
పము ననివార్యదుర్భరవిపద్దశ దుఃఖము నొందుమాకు నీ
సుమహితసత్కృపాగరిమఁ జూపుటకంటె ననుగ్రహంబు లో
కమునఁ దలంప నొం డొకటి గల్గునె భక్తఫలప్రదాయకా. 922

ఉ. భూరిశివేతరాపహ విభుత్వసమేత మహాత్మ దీనర
క్షారతి నొప్పునీవు చిరకాలమునన్ సుఖవృత్తి వీరు మా
వార లటంచు బుద్ధి ననవద్య తలంచినయంతమాత్రస
త్కారమె చాలు న ట్లగుటఁ గాక కిటు సన్నిధి నైతి వీశ్వరా. 923

చ. అరయఁగ క్షుద్రభూతహృదయంబులయందుల నంతరాత్మ వై
తిరముగ నుండునీవు భవదీయపదాంబుగుహాద్వ మార్చనా
పరమతు లైనమామక శుభప్రదభూరిమనోరథంబు లీ
వెఱుఁగవె భక్తలోకహృదయేప్సితదాయక ముక్తినాయకా. 924

సీ. అయినను విను సరోజాయతలోచన, తగుమోక్షమార్గప్రదర్శకుఁడవుఁ

1 నే నింద్రియ, పుర. 2 తాధార. 3 హారణచేతస్కుఁడవును.

బురుషార్థభూతవిరక్తుఁడవు నగునీవు, దగిలి ప్రసన్నుఁడ వగుట మాకు
నర్థి మనోభీష్ట మైనవరం బయ్యె, నైనను నాథ పరాపరుండ
వైనని న్నొకవరం బర్థింతు మనినను, భువిఁ దావకీనవిభూతు లెన్న
తే. నంత మెఱుఁగంగ రామి ననంతుఁ డనుచుఁ
బలుకుదురు నిన్ను నది గాన పరమపురుష
యేవరం బని కోరుదు మేము దప్పి
గొన్నబాలకుఁ డబ్ధినీ ళ్లెన్ని గోరిలు. 925
వ. అదియునుం గాక. 926
ఉ. పూని భవత్పదాంబురుహమూలనివాసుల మైనమేము మే
ధానిధి నీవిలోకనముఁ దక్కఁగ నన్యముఁ గోర నేర్తు మే
మానితపారిజాతకుసుమస్ఫుటనవ్యమరందగంధశో
భానయశాలి యైనమధుపంబు భజించునె యన్యపుష్పముల్. 927
చ. హరి భవదీయమాయ ననయంబును జెందిననేము నిచ్చలుం
గర మనురక్తి నేటితుదగా భవకర్ముల మై ధరిత్రిపైఁ
దిరుగుదు మంతదాఁక భవదీయజనంబులతోడిసంగతిన్
గుఱుమతి జన్మజన్మములకున్ సమకూరఁగఁ జేయు మాధవా. 928
మ. కమలాధీశ్వర తావకీనపదభక్తవ్రాతసంసర్గ లే
శముతోడన్ సరిగాఁ దలంప మెలమిన్ స్వర్గాపవర్గాదిసౌ
ఖ్యము లన్నన్ వినుమానుషంబు లగునీకామంబులం జెప్ప నే
ల మునిప్రస్తుతపాదపద్మ సుజనాలాపానుమోదాత్మకా. 929
వ. మఱియు భగవద్భక్తసంగంబులయందుఁ దృష్ణాప్రశమనంబు లైనమృష్టకథలు
చెప్పఁబడు(టచేత భూతంబుల)యందు వైరంబును లేకుండు నని. 930
చ. వనముల ముక్తసంగు లగువారు నుతింపఁ దనర్తు వీవు గా
వున నిలఁ బుణ్యతీర్థముల [1]నొప్పఁ బునీతము సేయఁ బూని య
ర్థిని బదచారు లై ధరఁ జరించు భవత్పదభక్తసంగమం
బనుపమభూరిసంసృతిభయస్థునిబుద్ధి రుచింప కుండునే. 931
వ. కావున. 932
చ. వనరుహపత్త్రలోచన భవత్సఖుఁ డైనసుధాంశుమౌళితో
డనిమిషమాత్రసంగతిఁ గడిందివ్రణంబును దుశ్చికిత్సము
న్ననుభవకుష్ఠరోగమున కగ్గలివైద్యుఁడ వైనవిన్న నే
మనయముఁ జూడఁ గంటిమి కృతార్థుల మై తగ మంటి మీశ్వరా. 933
వ. దేవా మదీయస్వాధ్యాయాధ్యయనంబులును గురుప్రసాదంబును విప్రవృద్ధాను

1 'బోలఁ బవిత్రము' అ. ప్ర.

వర్తనంబును నార్యజననమస్కరణంబును సర్వభూతానసూయయు నన్నవిరహితంబు గా ననేకకాలం బుదకంబులయందు సుతప్తం బయినతపంబు సేయుటయు విని యన్నియును బురాణపురుషుండ వైనభవదీయపరితోషంబుకొఱకు నగుంగాక యని విన్నవించెద మని వెండియు ని ట్లనిరి. 934

మ. మనుపద్మాసనధూర్జటిప్రముఖధీమంతుల్ తపోజ్ఞానస
త్త్వనిరూఢిం దగువారు నీమహిమముల్ వర్ణింపఁ బారం బెఱుం
గనివా రయ్యును నోపినంత వినుతుల్ గావింతు ర ట్లాట నే
మును ని న్నర్థి నుతింతు మీశ వరదా [1]బుద్ధ్యాదిమూలంబు గన్. 935

వ. అని మఱియు సముండవు నాదిపురుషుండవుఁ (బరుండవు బుద్ధుండవు వాసుదేవుండవు) సత్త్వమూర్తివియు భగవంతుండవు నైననీకు నమస్కరించెదము (అని యిట్లు ప్రచేతసులచేత నుతింపంబడి శరణ్యవత్సలుం డగుహరి సంతుష్టాంతరంగుండై వారలకోరినయట్ల వరంబు లిచ్చిన). 936

తరలము. అనుచు నానృపనందనుల్ మురవైరి సన్నుతిఁ జేయఁగాఁ
మనములోఁ బరితోష మంది రమాహృదీశుఁడు భక్తపా
లనకరుండు తదీయదర్శనలాలసాత్మకు లాత్మలం
దనివి సాలక చూడ నాత్మపదంబు కేఁగె రయంబునన్. 937

వ. తదనంతరంబ ప్రచేతసులు భగవదాజ్ఞ శిరంబుల ధరియించి సముద్రసలిలనిర్గతులయి. 938

క. భూరిసమున్నతినాక,ద్వారనిరోధంబు గాఁగఁ దగఁ బెరిఁగినయా
భూరుహసంపిహితాఖిల,ధారుణి నీక్షించి రాజతనయులు వరుసన్. 939

చ. ఘనకుపితాత్ము లై విలయకాలభయంకరహవ్యవాహులో
చనుగతి నుగ్రు లై ధరణిచక్రము నిర్వసుధారుహంబు గా
ననయముఁ జేయఁ బూనిన జనాధిపసూనులమోముఁదమ్ముల
న్ననలసమీరముల్ జనన మంది కుజంబులఁ గాల్పఁ జొచ్చినన్. 940

క. నలినభవుఁ డామహీజ,ప్రళయముఁ గని వచ్చి ధరణిపాలతనూజా
తుల మధురోక్తుల నుపశాం,తులఁ గావించుచును నయము దూఁకొనఁ బలికెన్.

వ. అట్లు పలికి వారల నుపశమితక్రోధులం జేసినయనంతరంబ. 942

సీ. అవశిష్టధరణీరుహంబులు భయ మంది, తివిరి చతుస్సాఖాదేశమునను
మారిష యనుసతీమణిఁ దమకూఁతును, నాప్రచేతసులకు నర్థి నిచ్చె
నానరపాలకసూనులు దక్షున, కరయంగ [2]ము న్నీశ్వరాపరాధ
మునఁ బ్రాప్త మైనట్టిజనపాలజన్మంబు,నకుఁ గారణం బైననలినయన

తే. నాదరంబునఁ గమలజునాజ్ఞఁ జేసి, కడఁక దీపింప విధివత్ప్రకారమునను

1 బుద్ధ్యానుసారంబు గన్. 2 మును సజ్జనాపరాధ.

వరుస నందఱుఁ గూడి వివాహ మైరి, గడవ వచ్చునె దైవసంకల్ప మెందు.

క. కలదె జగతిం బదురు నృపుల కిల నొకభార్య యెందుఁ బొసఁగునె వినఁగా
నలినోదరుఘనమాయా,కలితాద్భుతములకు నతులు గావింపఁ దగున్. 944

వ. అంతఁ జాక్షుషమన్వంతరంబున దైవచోదితుం డై యిష్టప్రజాసర్గంబు గావిం
చుచుఁ బ్రసిద్ధుం డైనదక్షుండు పూర్వదేహంబు గాలవిస్రుతంబుగాఁ బ్రచేతసు
లకు నమ్మారిష యనుభార్యయందు సంభవించి నిజకాంతిం జేసి సమస్తతేజో
ధనుల తేజంబును బిహితంబుగాఁ జేయుచుఁ గర్మదాక్ష్యంబున దక్షుం డనునామం
బు వహించి బ్రహ్మచేతం బ్రజాసర్గరక్షయందు నియోగింపఁబడి మరీచ్యాదులం
దత్తద్వ్యాపారంబులందు నియోగించి యుండె నంత. 945

సీ. ఒనరఁ బ్రచేతస్కు లుత్పన్నవిజ్ఞాను, లగుచు వేగంబ నారాయణోక్తిఁ
దలఁచుచు నాత్మనందనుకడ నిజభార్య, నిడి వనవాసు లై కడఁగి మున్ను
జాబాలి యనుమునీశ్వరునాశ్రమం బైన, భూరిపశ్చిమవార్ధితీరమునను
సర్వభూతాత్మవిజ్ఞానంబు గలయాత్మ,ఘనవిమర్శకృతసంకల్పు లైరి

తే. యంత నచటికి సమ్మోద మతిశయిల్ల, నరసురాసురయక్షకిన్నరవరేణ్య
మానితోన్నతసంపూజ్యమానుఁ డైన,నారదుండు వివేకవిశారదుండు. 946

వ. చనుదెంచి నిర్జితప్రాణమనోవాగ్దర్శనులును జితాసనులును శాంతులును నస
మానవిగ్రహులును నిర్మలం బైనపరబ్రహ్మంబునందు నియోజితం బైనయంతః
కరణంబు గలవారును నైనరాజనందనులకడ నిలిచిన. 947

క. చనుదెంచిననారదమునిఁ, గనుఁగొని నృపసుతులు లేచి కౌతుక మొప్పన్
వినమితు లై సముచితపూ,జనములఁ బరితుష్టుఁ జేసి సద్వినయమునన్. 948

చ. అనఘ మునీంద్రచంద్ర భవదాగమనంబు సమస్తలోకశో
భన మగు నస్మదీయ మగుభాగ్యవశంబున నేఁడు విశ్వపా
వన నినుఁ జూడఁ గంటి మనివార్యభవద్భ్రమణంబు లోకలో
చనుగతి వోలెఁ బ్రాణులకు సర్వభయాపహరంబు గావునన్. 949

వ. అని మఱియు ని ట్లనిరి. 950

సీ. అనఘాత్మ భగవంతు లైనకేశవవామ,దేవులచే నుపదిష్ట మైన
యాత్మతత్త్వంబు గృహస్థుల మగుమాకు, ననయంబు విస్మృతం బయ్యె నట్టి
కలితతత్త్వార్థప్రకాశకంబును భూరి,తరళసంసారాబ్ధితారణంబు
నై కర మొప్పారునాత్మతత్త్వము నేఁడు, చిరదయామతిఁ బ్రకాశింపఁజేయు

తే. మని ప్రచేతస్కు లర్థిఁ బల్కినఁ జెలంగి,భగవదాయత్తచిత్తుండు భవ్యగుణుఁడు
నఖిలలోకవిహారుండు నైనయట్టి,నారదుఁడు వల్కె నారాకుమారులకును.

సీ. చర్చింప నరుల కేజన్మకర్మాయుర్మ,నోవచనంబుల దేవదేవుఁ
డఖిలవిశ్వాత్మకుం డైనగోవిందుండు, విలసిల్లుభక్తి సేవింపఁబడును

నవియ పో జన్మకర్మాయుర్మనోవచనములను ధరణి నెఱన్నంగఁ దగును
వనరుహనాభసేవారహితము లైన, జననోపనయనదీక్షాకృతంబు

తే. లైనజన్మంబు లేల దీర్ఘాయు వేల, వేదచోదిత యగుకర్మవితతి వేల
జపతపశ్శ్రుతవాగ్విలాసంబు లేల, మహితనానావధానసామర్థ్య మేల. 952

వ. మఱియు హరివిరహితం బైనయింద్రియపాటవంబును నిపుణ మైనబుద్ధియుఁ బ్రాణాయామాదియోగంబును దేహాదివ్యతిరిక్తాత్మజ్ఞానంబును సన్న్యాసాధ్యయనంబులును దక్షిణవ్రతవైరాగ్యాదిశ్రేయస్సాధనంబులును నేల సర్వేశ్వరుండును సమస్తశ్రేయస్స్వరూపుండును సమస్తశ్రేయోవధిభూతుండును సర్వభూతావాసుండును సర్వభూతాత్మప్రముండును సర్వభూతప్రియుండును (సర్వవ్యాపకుండునుం) గావున. 953

మ. కమలాక్షేశ్వరుఁ బూజ సేయుట సమగ్రప్రీతిఁ బ్రాణోపహా
రము సర్వేంద్రియతృప్తిహేతువును సర్వక్ష్మాజమూలాభిషే
కము శాఖాభుజపుష్టిదంబు నగు రేఖన్ సర్వదేవార్హణ
క్రమ మై యొప్పు ధరావరేణ్యసుతులారా బుద్ధి నూహించినన్. 954

వ. అదియునుం గాక. 955

క. ఘను పగువర్షాకాలం, బున దిననాయకునివలనఁ బొడమినసలిలం
బనయముఁ గ్రమ్మఱ గ్రీష్మం, బున సూర్యునియందుఁ జెందుపోలిక మఱియున్.

క. ధరణిఁ జరాచరభూతము, లరయఁగ జనియించి యందె యడఁగినపగిదిన్
హరిచేఁ బుట్టినవిశ్వము, హరియందె లయంబు నొందు నది యెట్లన్నన్. 957

మ. [1]అసితాసన్భ్రతమః ప్రభల్ మును నభంబం దొప్పఁగాఁ దోఁచి క్ర
మ్మఱ నీక్షింపఁగ నందె లేనిగతి బ్రహ్మాండంబునం దశక్తులుం
బరికింపం ద్రిగుణప్రవాహమున నుత్పన్నంబు లై క్రమ్మఱన్
విరతిం బొందుచు నుండుఁ గావున హరిన్ విష్ణున్ భజింపం దగున్. 958

వ. మఱియును సమస్తదేహులకు నాత్మయు (నిమిత్తభూతుండును) నద్వితీయుండును శశ్వత్ప్రకాశుండును బ్రధానపురుషుండును స్వతేజోవిధ్వస్తగుణప్రవాహుండును (మానసబుద్ధిసుఖేచ్ఛాద్వేషాదివికల్పరహితుండును సగుణుండును దేహాత్మభ్రమనివృత్త్యుపలభ్యుండును నాదిమధ్యాంతరహితుండును నిత్యానందస్వరూపుండును సర్వజ్ఞుండునుఁ) బరమేశ్వరుండును నైననారాయణు నభేదబుద్ధిం జేసి భజింపుఁడు తెండు సర్వభూతదయయు నెంతమాత్రంబు సంభవించు నంతమాత్రంబున సంతుష్టుం డగుటయును సర్వేంద్రియోపశాంతియు ననుసీగుణంబులు గలిగినయెడ సంతుష్టుం డగు నని వెండియు నిట్లనియె. 959

చ. చతురత నట్టియీశ్వరుఁడు సజ్జనలోకనిరస్తసర్వకా

---

1 అరయ స్నభ్రతమఃప్రకాశల నభం.

మితవిమలాంతరంగమున మిశ్రితభావనఁ జేసి సన్నిధా
పితుఁ డగుచుం దయాకరగభీరగుణంబులఁ జాల నొప్పి యా
శ్రితజనపారతంత్ర్యమును జేకొని పాయక యుండు నిచ్చలున్. 960

క. శ్రుతధనకులకర్మసము,న్నతమదములఁ జేసి సజ్జనప్రతతికి సం
తతమును నెగ్గొనరించుకు,మతు లర్థిం జేయుపూజ మతిఁ గొనఁ డెందున్.

వ. అది యెట్లనిన. 962

సీ. వల నొప్పఁ దను ననువర్తించు నిందిరా,కామినీమణిఁ దదాకాంక్షు లగుచు
ధృతి ననువర్తించు దేవేంద్రముఖ్యుల, నే ననువర్తింప కెప్పు డాత్మ
నిత్యస్వతంత్రుఁడు నిజభక్తవరదుఁడు, దీనవత్సలుఁడును నైనయట్టి
పురుషోత్తముని జగద్భర్తు సర్వేశ్వరు, నారాయణునిఁ జిదానందమయుని

తే. నజితు నచ్యుతుఁ బుండరీకాయతాక్షుఁ, దవిలి సేవింపకుండు నే ధరఁ గృతజ్ఞుఁ
డైనపురుషుండు సర్వోదితాత్ముఁ డగుచుఁ, సుమతులార రాజకుమారులార.

వ. (అని మఱియు నిట్లనియె భవదీయవంశధుర్యుండుఁ జిత్రరథుండు నగుధ్రువుండు
సపత్నీమాతృవాగ్బాణభిన్నహృదయుం డై పంచవర్షార్భకుం డగుచుఁ దపోవనం
బున కరుగునపుడు మార్గంబున నాచే నుపదిష్టం బైనక్రమంబున భగవంతుం
డగుపుండరీకాక్షు నారాధించి యితరులచే నొందరానిసర్వోత్తమం బగుపదంబు
నొందెఁ గాన మీరును గురూపదేశక్రమంబున సర్వభూతాంతర్యామి యగు
నీశ్వరు భవచ్ఛేదంబున కై భజియింపుఁడు.) 964

క. అని యివ్విధమున నారద,ముని రాజకుమారులకును ముదము దలిర్పన్
వనజోదరుసచ్చరితము, వినిపించి సరోజభవునివీటికిఁ జనియెన్. 965

వ. ఇట్లు నారదుండు చనినయనంతరంబ. 966

చ. నరవరనందనుల్ గడఁక నారదవక్త్రవినిర్గతంబు సుం
దరమును మంగళావహము ధన్యము లోకమలాపహంబు నై
పరఁగినవిష్ణుకీర్తి విని పాయక తత్పదపద్మచింతనా
నిరుపమభక్తిఁ జెంది హరినిత్యపదంబునఁ బొంది రున్నతిన్. 967

వ. అని మైత్రేయుండు విదురున కిట్లనియె మహాత్మా నీవు న న్నడిగినప్రచేతోనార
దసంవాదరూపం బైనహరికీర్తనంబు మనుపుత్త్రుం డైనయుత్తానపాదునివంశ
ప్రకారంబును జెప్పితి నని వెండియు నిట్లనియె నారదువలనం బ్రియవ్రతుం
డాత్తవిజ్ఞానంబు నొంది [1]మహీమండలంబుఁ బరిపాలించి యనంతరంబునఁ
బుత్త్రులకు రాజ్యంబుఁ బంచి యిచ్చి పరలోకగతుం డయ్యె ననిన. 968

క. విని విదురుం డాతాపసు,ఘనచరణము లాత్మమస్తకంబున మధుసూ
దనుచరణాంభోరుహములు, మనమునఁ దగఁ దాల్చి పలికె మైత్రేయునితోన్.

1 'మహీభోగానంతరమున' వ్రా. ప్ర.

క. మునినాథచంద్ర కరుణా, వననిధి నీచేత భక్తవత్సలుఁ డగునా
వనజాక్షుతత్త్వ మెఱిఁగితి, నని తత్పదములకు వినతుఁడై వినయమునన్. 970

క. ఆమునిచే నామంత్రితుఁ, డై మనమున బంధుదర్శనాకాంక్షితుఁడై
ధీమహితుఁడై నవిదురుఁడు, సామజపురమునకుఁ జనియె సమ్మద మొప్పన్.

క. అని శుకుఁడు పరీక్షిత్తున, కనుకంపం జెప్పె నీయుపాఖ్యానంబుల్
వినువారై శ్వర్యాయు, ర్ధనకీర్తిస్వస్తిగతులఁ దగఁ బ్రాపించున్. 972

క. అని శుకయోగి పరీక్షి, జ్జనపాలసుధాపయోధిచంద్రున కర్థిన్
వినిపించినకథ మోదం, బున సూతుఁడు శౌనకాదిమునులకుఁ జెప్పెన్. 973

చ. సరసవచోవిలాసగుణసాగర సాగరమేఖలామహీ
భరణధురంధర ప్రకటభవ్యభుజాభుజగేంద్ర రాజశే
ఖర ఖరదూషణప్రముఖగాఢతమఃపటలప్రచండభా
స్కర కటకంఠకార్ముకవిఖండనఖేలన భక్తపాలనా. 974

క. శరవిదళితసారంగా, సరసదయాపాంగ భక్తజలధితరంగా
దురితధ్వాంతపతంగా, వరజనకసుతాభిషంగ వననిధిభంగా. 975

మాలిని. సురవిమతవిదారీ సుందరీశంబరారీ, సరసవినుతసూరీ సర్వలోకోపకారీ
నిరుపమగుణహారీ నిర్మలానందకారీ, గురుసమరవిహారీ ఘోరదైత్యప్రహారీ.

గద్యము. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్త్ర సహజపాండిత్య పోతనామాత్యప్రణీతం బయిన శ్రీమహాభాగవతం బనుమహాపురాణంబునందు స్వాయంభువమనువునకు నాకూతిదేవహూతిప్రసూతిప్రియవ్రతోత్తానపాదులు జన్మించుటయు నందు నాకూతిని రుచిప్రజాపతికి నిచ్చుటయు నారుచిప్రజాపతికి నాకూతిదేవియందు శ్రీవిష్ణుమూర్త్యంశజుం డైనయజ్ఞుండును లక్ష్మీకళాంశజ యగుదక్షిణ యనుకన్యకయు నుద్భవించుటయు మనుపుత్త్రి యైనదేవహూతిని గర్దమున కిచ్చుటయుఁ బ్రసూతిం దక్షప్రజాపతి కిచ్చుటయు బ్రసూతిదక్షులవలనం బ్రజాపరంపరలు గలుగుటయు మఱియుం గర్దమప్రజాపతిపుత్త్రికాసముదయంబును క్షత్త్రిబ్రహ్మర్షుల కిచ్చుటయుఁ గర్దమపుత్త్రి యైనకళవలన మరీచికిఁ గశ్యపుం డనుపుత్త్రుండును బూర్ణిమ యనుకూఁతురుం బుట్టుటయును బూర్ణిమవలన గంగయు విరజుం డనెడుకుమారుండును జన్మించుటయుఁ గశ్యపప్రజాపతివలన నయినప్రజాపరంపరలచే ముల్లోకంబు లాపూర్ణంబు లగుటయు నత్రిమహామునితపంబున నతనికి హరిహరబ్రహ్మలు ప్రత్యక్షం బగుటయు ననసూయాపాతివ్రత్యమాహాత్మ్యంబువలన ననసూయాత్రులకుం ద్రిమూర్తులకళాంశజు లయినచంద్రదత్తాత్రేయదుర్వాసులజన్మంబును దక్షాత్మజలజన్మంబును భృగువువలన ఖ్యాతి యనునంగనకు శ్రీమహాలక్ష్మి జన్మించుటయును భృగుపౌత్త్రుం డయినమార్కండేయుజన్మంబును ధర్మునకు మూర్తివల

న నరనారాయణులు సంభవించుటయును సత్త్రయాగంబునందు దక్షుండు శివుని
నిందించుటయును దక్షాధ్వరధ్వంసంబును బ్రహ్మచేఁ బ్రార్థితుండై శివుండు దక్షా
దుల ననుగ్రహించుటయును దక్షాదికృతశ్రీహరిస్తవంబును శ్రీహరి ప్రసన్నుం
డై దక్షునియజ్ఞంబు సఫలంబుగా ననుగ్రహించుటయును సతీదేవి హిమవంతు
నకు జనించి హరునకుం బ్రాప్తించుటయు నుత్తానపాదునివృత్తాంతంబును ధ్రు
వోపాఖ్యానంబును ధ్రువుండు దండ్రిచేత నవమానితుం డై నారదోపదేశం
బున మధువనంబునకుం జని తపంబు సేయుటయు హరి ప్రసన్నుం డై యతని
మనోరథంబు లిచ్చుటయును నతండు మరలఁ బురంబునకు వచ్చుటయుఁ గుబే
రానుచరు లైనయక్షులతోడియుద్ధంబును ధ్రువుండు యజ్ఞంబులు సేయుచు
రాజ్యభోగంబులం దనిసి తనయు నుత్కలునిం బట్టంబు గట్టి హరియనుగ్రహం
బున ధ్రువక్షితిని నిలుచుటయు నుత్కలుండు వత్సరుం డనుతనసుతునిఁ బట్టం
బు గట్టి హరిం జేరుటయు వత్సరునివంశపరంపరయు నంగు నంగునిసుతుండయిన
వేనుకళేబరంబున లక్ష్మీనారాయణులయంశంబున నర్చియుఁ బృథుండును జన్మిం
చుటయుఁ బృథుండు భూమిం గామధేనువురీతి నఖిలవస్తువులుం బిదుక నియ
మించి సమస్థలిం జేసి యింద్రుండు వశవర్తి యై యుండ బహుయజ్ఞంబులు
సేసిన నతనికి హరి ప్రత్యక్షం బగుటయు నధ్యాత్మప్రబోధంబును నింద్రుని
వలనఁ బాషండసంభవంబును నింద్రుని జయించినవిజితాశ్వుని నతనితమ్ములను
బృథివీపాలనంబునకు నిలిపి పృథుండు నర్చియుం బరమపదప్రాప్తు లగుటయు
వసిష్ఠుశాపంబున ద్రేతాగ్నులు విజితాశ్వునికిఁ దనయు లై జనియించుటయుఁ
బృథునిపౌత్రుం డయినప్రాచీనబర్హిరాజ్యంబును నతనియజ్ఞంబు లసంఖ్యాతం
బు లైన నారదుండు మాన్యం దలంచి పురంజనుకథ నధ్యాత్మప్రపంచంబుగాఁ
దెలుపుటయుఁ బ్రాచీనబర్హిసుతు లయిన ప్రచేతసులు పదువురకు శ్రీమహాదేవుం
డు ప్రత్యక్షం బై హరిస్తవం బుపదేశించుటయుఁ బ్రచేతసులతపంబునకు మెచ్చి
హరి ప్రత్యక్షం బగుటయు వారికి మారిషవలన దక్షుండు పూర్వకాలంబున
శివవిద్వేషప్రయుక్తశాపంబునం బుత్రుం డై జనియించుటయును బ్రచేతసులు
ముక్తికిం జనుటయును విదురుండు మైత్రేయుని వీడ్కొని హస్తిపురంబున కరు
గుటయు ననుకథలు గలచతుర్థస్కంధము. 977

ఓం తత్స ద్బ్రహ్మార్పణ మస్తు.

శ్రీ ర స్తు

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

పంచమస్కంధము

ప్రథమాశ్వాసము.

[1]శ్రీకర కరుణాసాగర
ప్రాకటలక్ష్మీకళత్ర ♦ భవ్యచరిత్రా
లోకాతీతగుణాశ్రయ
గోకులవిస్తార నంద♦గోపకుమారా. 1

[2]వ. మహనీయగుణగరిష్ఠు లగునమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డైనసూతుం డి ట్లనియె. 2

క. భూనాథుఁ డుత్తరాత్మజుఁ, డైనపరీక్షిన్నరేంద్రుఁ ♦ డభిమన్యుసుతుం
డానంద మంది ఘనసు, జ్ఞానుం డగుశుకునిఁ గాంచి ♦ సరసతఁ బలికెన్. 3

వ. మునీంద్రా పరమభాగవతుండు నాత్మారాముండు నైనప్రియవ్రతుండు గృహంబుననుండి యెట్లు రమించెఁ గర్మబంధంబు లయినపరాభవంబులు గలగృహంబులయందు ముక్తసంబంధు లైనపురుషులకు సంతోషంబు కానేర దుత్తమశ్లోకుం డైనపుండరీకాక్షునిపాదచ్ఛాయం జేసి నిర్వృతచిత్తు లయినమహాత్ములు కుటుంబంబునందు నిస్స్పృహత సేయుదురు గాన ప్రియవ్రతునికి సంసారంబునందుఁ దగులంబు గలుగు టెట్లు దారాగారసుతాదులందుఁ దగులంబు గలవానికి నెట్లు సిద్ధి గలుగు శ్రీహరియం దస్ఖలితమతి యెట్లు గలుగు నీసంశయంబుఁ దేటపఱుపు మని పరీక్షిన్నరేంద్రుఁ డడిగిన శుకయోగీంద్రుం డి ట్లనియె. 4

క. హరిచరణాంబుజమకరం, దరసావేశితమనః ప్ర♦ధానుం డగుస

---

1 ‘శ్రీసీతానయనోత్పల, శ్రీసతిసహజన్మ త్రిదశ♦సేవిత యాశా, వాసప్రకాశజయభాసురపతిహరణ రామ♦చంద్రనృపాలా’ 2 ‘సకలపురాణార్థజ్ఞానవిఖ్యాతుం డగుసూతుండు శౌనకాదిమహామునుల కి ట్లనియె’ వ్రా.ప్ర.

త్పురుషుఁ డొకవేళ విఘ్నముఁ బొరసినఁ దనపూర్వమార్గము విడువఁడిలన్.

క. ధరణీవల్లభ వినుమా, నరవరుఁడు ప్రియవ్రతుండు నారదమునిస
చ్చరణోపసేవఁ జెందుచు, నరుదుగ నధ్యాత్మసత్త్రయాగంబందున్. 6

సీ. దీక్షితుం డై ధరిత్రీపాలనముఁ దండ్రి, పనిచిన సుజ్ఞానభంగ మనుచు
నంగీకరింపమి నంతయుఁ దెలిసి పద్మాసనుఁ డతనికి నతులరాజ్య
మందుల మిక్కిలి యాసక్తిఁ బుట్టింతు, ననుచును దనచిత్తమందుఁ దలఁచి
తారకాపరివృత తారాధిపునిమాడ్కి, శ్రుతులతోఁ గూడి యచ్యుతవిభూతి

తే. హంసవాహనుఁ డగుచు నింద్రాదు లెల్లఁ, గదిసి సేవింప బ్రహ్మలోకమున నుండి
సన్మునీంద్రులు దన్నుఁ బ్రశంస సేయ, నల్లనల్లన యుడువీథి నరుగుదెంచె. 7

వ. మఱియు నాయాయిమార్గంబులయందు సిద్ధసాధ్యగంధర్వచారణగరుడకింపురుషు లిరుదెసల స్తోత్రంబులు సేయుచుండ గంధమాదనద్రోణులం బ్రకాశంబు నొందించుచుఁ జనుదెంచినపద్మాసనునకు నారదుండు స్వాయంభువప్రియవ్రతులతోఁ గూడి ముకుళితకరకమలుండై యెదురు చనుదెంచి సంస్తుతిస్తబకంబులం బూజించిరి విరించి సంతసించి ప్రియవ్రతునిం జూచి నవ్వుచు నిట్లనియె. 8

క. హరి నాముఖమున నీకును, [1]గర మెఱిఁగింపంగఁ బనిచె గావున నిదె ను
స్థిరమతి వినుమంతయు శ్రీ, హరివాక్యము గా నెఱింగి యవనీనాథా. 9

ఆ. కోరి వేడ్క నీవు నారదుండును నేను, నందఱమును నీశ్వరాజ్ఞఁ బూని
యుడుగ కెపుడుఁ జేయుచున్నవారము గాన, యతనియాజ్ఞఁ దప్ప నలవిగాదు.

వ. మఱియు శ్రీహరియాజ్ఞను జీవుండు తపోవిద్యలను యోగజ్ఞానదానార్థధర్మంబులను దనచేత నొరులచేతం దప్పింప సమర్థుండు గాఁ డుత్పత్తిస్థితినాశంబులకు శోకమోహభయసుఖదుఃఖంబులకు నీశ్వరాధీనుండ కాని జీవుండు స్వాతంత్ర్యుండు గాఁడు శ్రీహరి వాగ్రూపంబు లయినశ్రుతులందు గుణత్రయం బనురజ్జువున బంధింపంబడినయస్మదాదులము ముకుఁద్రాటిచేఁ బశువు మనుష్యులకు వశం బయినచందంబున నీశ్వరాజ్ఞం బ్రవర్తించుచుండుము నరుండు సుఖదుఃఖానుభవంబులకు నీశ్వరాధీనుండు నేత్రంబులు గలవానిచేతఁ దివియంబడిన యంధుండునుం బోలె నీశ్వరుం డిచ్చినసుఖదుఃఖంబు లనుభవించుచున్నవారము స్వప్నంబునం గన్నపదార్థంబు మేల్కాంచి మిథ్యగాఁ దలఁచినకరణి మోక్షార్థియైనసుజ్ఞానవంతుండు ప్రాప్తసుఖదుఃఖంబు లనుభవించుచు దేహారబ్ధకర్మంబులం బాయకొల్లఁడు వనవాసి యైనను జితేంద్రియుండు గాకుండెనేనిఁ (గామాదిసహితుం డగుటం జేసి) సంసారబంధంబులు సిద్ధించు గృహస్థాశ్రమంబందు జితేంద్రియుండై యాత్మజ్ఞానంబు గలపురుషునకు మోక్షంబు సిద్ధించు శత్రువుల గెలువ నిచ్ఛయించినపురుషుండు దుర్గం బాశ్రయించి శత్రువుల జయించిన

1 'యెఱిఁగింపఁ దలంచి నాకు నెఱిఁగించెను సు' వ్రా. ప్ర.

మాడ్కి నిమోక్షార్థి యగుపురుషుండు గృహాశ్రయుం డగుచు శ్రీనారాయణ చరణారవిందంబు లనుదుర్గం బాశ్రయించి యరిషడ్వర్గంబుల జయించు నీవును ముక్తసంగుండవై యీశ్వరకల్పితంబు లగుభోగంబుల ననుభవించి ముక్తిం జెందు మనినం బ్రియవ్రతుండు త్రిభువనగురుం డయినచతురాననువాక్యంబు లవనతమస్తకుం డై బహుమానపూర్వకంబున నంగీకరించె నంత. 11

ఆ. సరసిజాసనుండు స్వాయంభువునిచేత, నధిక మైనపూజ లంది నార
దుండు నాప్రియవ్రతుండును జూడంగఁ, జనియెఁ దనదుపూర్వసదనమునకు.

ఆ. సత్యసంధుఁ డైన స్వాయంభువుం డను, మనువు బ్రహ్మచేత మన్ననఁ దగ
నంది యంత నారదానుమతంబునఁ, దనదుసుతుని రాజ్యమునను నిలిపె. 13

వ. ఇట్లు స్వాయంభువమనువు భూచక్రపరిపాలనంబునకుం బ్రియవ్రతునిఁ బట్టంబు గట్టి విషమంబు లగువిషయంబులవలన విముక్తుండై వనంబునకుం జనియె నంత.

మ. ధరణీవల్లభుఁ డా ప్రియవ్రతుఁడు మోదం బందుచున్ లీల నీ
శ్వరవాక్యంబునఁ గర్తతంత్రపరుఁడై సంగంబులం బాపు శ్రీ
హరిపాదాంబుజచింతనం దగిలి నిత్యానందముం బొంది దు
ర్భరరాగాదులఁ బాఱఁ ద్రోలి ప్రజలం బాలించె సత్త్వస్థితిన్. 15

వ. ఇట్లు ప్రియవ్రతుండు రాజ్యంబు సేయుచు విశ్వకర్మప్రజాపతిపుత్రిక యగు బర్హిష్మతి (యనుదానిం బత్నిఁగాఁ బడసి యాసతి)వలన శీలవృత్తగుణరూపవీర్యౌదార్యంబులం దనకు సమాను లైనయాగ్నీధ్రేధ్మజిహ్వయజ్ఞబాహుమహావీరహిరణ్యరేతోఘృతపృష్ఠసవనమేధాతిథివీతిహోత్రకవు లనునామంబులు గల పుత్రదశకంబును నూర్జస్వతి యనునొక్కకన్యకను గాంచె నందుఁ గవిమహావీరసవనులు మువ్వురు బాలకు లయ్యు నూర్ధ్వరేతస్కు లై [1] బ్రహ్మవిద్యానిష్ణాతు లై యుపశమనశీలు రగుచుం బారమహంస్యయోగం బాశ్రయించి సర్వజీవనికాయవాసుండు భవభీతజనశరణ్యుండు సర్వాంతర్యామియు భగవంతుండు నగు వాసుదేవునిచరణారవిందావిరతస్మరణానుగతపరమభక్తియోగానుభావంబున విశోధితాంతఃకరణు లగుచు నీశ్వరుతాదాత్మ్యంబు నొంది రంత. 16

సీ. వసుధేశ యాప్రియవ్రతుఁ డొండుకాంతయం, దధికుల మన్వంతరాధిపతుల
మఱియు నుత్తముఁడు తామసుఁడు రైవతుఁడను, సుతులను బుట్టించె సుమహి
మున్ను జన్మించినమువ్వురుపుత్త్రులు, నవ్యయపదవికి నరుగుటయును [తులను
నంతఁ బ్రియవ్రతుఁ డఖిలశాత్రవకోటిఁ, దనబాహుబలముచేతను జయించి

తే. యతఁడు బర్హిష్మతీకాంతయందుఁ బ్రీతి, గలిగి యౌవనలీలావికాసహాస
హేలనాదులఁ జిత్తంబు గీలుపఱచి, గతవివేకుఁడుఁబోలె భోగములఁ బొందె.

---

1. 'బ్రహ్మవిద్యావాసనం జెంది పరమహంసయోగం బాశ్రయించి జీవాంతర్యామియగునీశ్వరుం బొంది రంత' వ్రా. ప్ర.

వ. ఇట్లు ప్రియవ్రతుం డేకాదశార్బుదపరివత్సరంబులు రాజ్యంబు సేసి యొక్క నాఁడు మేరునగప్రదక్షిణంబు సేయుసూర్యునకు నపరభాగంబునం బ్రవర్తించు నంధకారంబు నివర్తింపం బూని [1]భగవదుపాసనాజనితాతిపురుషప్రభావుం డై సవితృరథసదృశవేగంబు గలిగి తేజోమయం బైనరథంబు నారోహణంబు సేసి (రాత్రుల నెల్ల దివంబు లొనర్తు నని) సప్తరాత్రంబులు ద్వితీయతపనుండునుం బోలె నరదంబు వఱపుటయుఁ గని చతురాననుండు వారించె నారథనేమిమార్గం బులు సప్తసముద్రంబులును నామధ్యభూసంధులు సప్తద్వీపంబులు నయ్యె నందు.

సీ. వరుస జంబూప్లక్ష వరకుశక్రౌంచముల్, శాకశాల్మలులు పుష్కరము ననఁగ
నలరునాద్వీపంబు లందు జంబూద్వీప, మొనరంగ లక్షయోజనము లయ్యె
నట యుత్తరోత్తరాయతసంఖ్యఁ దాద్విగుణితమయి యొండొంటి కతిశయిల్లు
క్షారేక్షురససురాజ్యక్షీరదధ్యుదకంబులు గలుగుసాగరము లేడు

తే. ద్వీపపరిమాణములు గల్గి విస్తరిల్లు, సంధిసంధిని బరిఖల చందమునను
క్రమముదప్పక యొండొంటిఁ గలయకుండు, సకలజీవులకెల్ల నాశ్చర్యముగను.

వ. అట్టిద్వీపంబులందుఁ బరిపాలనంబునకుం బ్రియవ్రతుం డాత్మభవులు (నాత్మస మానశీలురు) నైనయాగ్నీధ్రేధ్మజిహ్వయజ్ఞబాహుహిరణ్యరేతోఘృతపృష్ఠ మేధాతిథివీతిహోత్రుల (నొక్కొకని నొక్కొక్కద్వీపంబునకుం) బట్టంబు గట్టి యూర్జస్వతి యనుకన్యకను భార్గవున కిచ్చిన నాభార్గవునకు నూర్జస్వతియందు దేవయాని (యనుకన్యారత్నంబు జనించె) నట్టిబలపరాక్రమవంతుం డైన ప్రియ వ్రతుండు విరక్తుం డై యొక్కనాఁడు నిజగురు వగునారదముని (చరణానుసేవా నుపతితరాజ్యాదిప్రపంచసంసర్గంబుఁ) దలంచి (దుఃఖించి) యి ట్లనియె. 20

సీ. అక్కట యే నింద్రియములచేఁ గట్టంగఁ, బడి యుండి యందులఁ బాయ లేక
యజ్ఞానవిరచితం బగువిషయము లను, నంధకూపంబున నడఁగియుండి
తరుణులకే వినోదమృగంబ నై యుండి, యవి యెల్ల నే నొల్ల ననుచు రోసి
హరికృపచే నప్పు డబ్బినయాత్మవిద్యను గల్గి తనవెంట నరుగుదెంచు

తే. కొడుకులకు నెల్లరాజ్యముఁ గుదురుపఱిచి, తనదుపత్నుల దిగనాడి ధనము విడిచి
హరివిహారంబు చిత్తంబునందు నిలిపి, పరఁగ నల్లన నారదపదవి కరిగె. 21

వ. ఇట్లు దనరథమార్గంబులు సప్తద్వీపసాగరంబులు గాఁ జేసి సూర్యునకుఁ బ్రతి సూర్యుండై సరిద్గిరివనాదిచిహ్నములచేత (భూతనిర్వృతికొఱకుఁ బ్రతిద్వీపంబు నకు నవధులు గల్పించి) ద్వీపవర్షనిర్ణయంబులం బుట్టించి పాతాళభూస్వర్గాది సుఖంబులు నరకసమానంబులు గాఁ దలంచి విరక్తిం బొంది [2]నిరంతరభగవ ద్ధ్యానవిమలీకృతాశయుం డగుచు హరిభక్తిప్రియుం డైనప్రియవ్రతునిచరిత్రం బు లీశ్వరునకుఁ దక్క నన్యుల కెఱుంగఁ దరంబు గా దతనిమహిమంబులు నేఁడును

1 భగవదుపాసనాప్రభావజనితవేగంబున. 2 'హరిధ్యానపరుం డైనప్రియవ్రతునిచరిత్రంబు' వ్రా.ప్ర.

గొనియాడుదు రని శుకుండు మఱియు నిట్లనియె. 22

క. హరిసేవ నాప్రియవ్రతుఁ, డరయఁగఁ గైవల్యపదవి నందుట యరుదే
ధరఁ జండాలుం డైనను, హరినామస్మరణఁ జెందు నవ్యయపదమున్. 23

వ. అని పలికి శుకుండు మఱియు నిట్లనియె. 24

మ. జనకుం డిట్లు విరక్తుఁ డై [1]నను దదాజ్ఞంజేసి యాగ్నీధ్రుఁ డే
పున ధర్మప్రతిపాలనుం డగుచు జంబూద్వీపము న్నేలుచుం
దనసత్పుత్త్రులమాడ్కి నెల్లప్రజలం దాత్పర్యచిత్తంబునన్
ఘనతం బ్రోచె ననేకకాల మిలఁ బ్రఖ్యాతంబు గా భూవరా. 25

వ. ఇట్లాగ్నీధ్రుండు రాజ్యంబు సేయుచు నొక్కనాఁడు పుత్త్రకాముం డై మందరాద్రిసమీపంబున నఖిలోపచారంబుల నేకాగ్రచిత్తుం డై యర్చించినం గమలసంభవుండు సంతసిల్లి తనసమ్ముఖంబున సంగీతంబు సేయుపూర్వచిత్తి యనునప్సరోంగనం బంపుటయు నాయప్సరోంగన సనుదెంచి [2]రమణీయవివిధనిబిడవిటపివిటపసమాశ్లిష్టసమీపసువర్ణలతికారూఢస్థలవిహంగమమిథునోచ్చార్యమాణషడ్జాదిస్వరంబులచే బోధ్యమానసలిలకుక్కుటకారండవబకకలహంసాదివిచిత్రకూజితసంకులంబు లయిననిర్మలోదక కమలాకరంబులు గల తదాశ్రమవనోపవనంబునందు [3]విహరించుచు విలాసవిభ్రమగతివిశేషంబులం జలనంబు నొందు స్వర్ణచరణాభరణస్వనం బన్నరదేవకుమారుం డాలించి యోగసమాధిం జేసి ముకుళితనేత్రుం డై యుండి యల్లన కను విచ్చి చూచి తనసమీపంబున మధుకరాంగనయుంబోలెఁ బుష్పాఘ్రాణంబు సేయుచు దేవమానవులమనోనయనంబుల కాహ్లాదంబుఁ బుట్టించు చున్నగతి విహారవినయావలోకనసుస్వరావయవంబుల మన్మథశరపరంపర నొందించుచు [4]ముఖకమలవిగళితామృతసమానహాసభాషణామోదమదాంధంబు లయినమధుకరమిథునంబుల వంచించి శీఘ్రగమనంబునం జలించుకుచకచమేఖలలు గలదేవిం గనుంగొని చిత్తచలనంబు నొంది మన్మథపరవశుం డై జడునిచందంబున నిట్లనియె. 26

క. సతి నీ వెవ్వతె వీప,ర్వతమున కేమేనిఁ గోరి వచ్చినవనదే
వతవో శారదవో రతి,పతి పంచినమాయవో తపస్సారమవో. 27

ఉ. అంగజుఁ డెక్కు డించినశరాసనముల్ ధరియించి యంత నా
యంగజువెంట మానవమృగావళిఁ జూచుచు నున్నదానవో
రం గగునీదుచర్యల తెఱంగు నెఱుంగఁగ నాకుఁ బల్కుమా
యంగన నిన్నుఁ గన్గొనినయంత ననంగుఁడు సందడించెడున్. 28

---

1 ననతనాజ్ఞంజేసి. 2 'రమణీయవివిధశాఖానికరవిటపిసమీపసువర్ణలలితారూఢస్థలవిహంగమమిథునసంచారంబును సలిలకుక్కుట··· కలహంసాదిసంకులంబునుం గలనిర్మలో' వ్రా. ప్ర. '3 మోదించుచుండ నన్నరదేవకుమా' వ్రా. ప్ర. 4 'ముఖకమల మదిరామోదమదాంధ' వ్రా. ప్ర.

క. పోలు పగుచున్న విలాసం,బులు గలయంగజుని బాణ।ములఁ బోలెడిచం
చలసత్కటాక్షవీక్షణ,ముల నెవ్వనియింతి చిత్త।ముం గలఁచెదవే. 29

చ. చెదరఁగ వేదముల్ సదువు।శిష్యులపైఁ దగఁ బుష్పవృష్టి స
మ్మదమున నంతలోఁ గురియు।మాడ్కిని మన్మథసామగానముల్
సదివెడుశిష్యులో యనఁగ । షట్పదపంక్తులు సేరి మ్రోయఁగాఁ
బడపడి మీఁద రాలుఁ గచ।భారమునందుల జాఱు క్రొవ్విరుల్. 30

క. [1]అందియలు డిండిమంబుల, చందమునం బాదపంక।జంబులయందు
న్నందంద మ్రోయుచును నా,డెందంబునఁ దగిలి సంద।డించెడిఁ దరుణీ. 31

క. పాయక కదంబపుష్ప,చ్ఛాయం గలవస్త్రకాంతి । సల్లెడుఁ గంచే
యూఱెడ నితంబరోచులు, గాయుచు నెడతెగక తఱిమి । కప్పెడుఁ దన్వీ. 32

క. నిరతము నీతనుమధ్యము, గర మరుదుగ నరసి చూడఁ । గానంబడ దీ
కరికుంభంబులఁ బోలెడి,గురుకుచముల నెట్లు నిలుపు।కొంటి లతాంగీ. 33

క. పొంకము లగుకుచములపైఁ, గుంకుమపంకంబు సొంపు।గొని వాసనలం
గొంకక వెదచల్లెడునీ,బింకం బగుచన్నుదోయి । పెంపో సొంపో. 34

శా. ఏలోకంబుననుండి వచ్చితివి నీ । విచ్చోటికిన్ మున్ను నే
నేలోకంబునఁ జెప్పఁ జూప నెఱుఁగ । న్నీసుందరాకారము
న్నీలాలిత్యము లీవినోదములు నీ కి । ట్లొప్పునే కామినీ
భూలోకంబున కెట్లు వచ్చితివి నా।పుణ్యం బగణ్యంబు గన్. 35

క. హాసావలోకనంబుల, భాసిల్లెడునీముఖంబు । పలుమఱు నిపుడే
యాసలు పుట్టింపఁగ నే, నాసగొనెద నిన్నుఁ జూచి । యంబుజనేత్రా. 36

ఆ. [2]కందులేనియిందు।కళ మించి నెమ్మోము, కాంతియుక్త మగుచుఁ । గానిపించెఁ
గాన విష్ణుకలయుఁ । గాఁబోలు నని నామ,నంబునందుఁ దోఁచె । నళిననేత్ర.

మ. పటుతాటంకరథాంగయుగ్మమునకుం । బల్మాఱు భీతిల్లుచున్
నటనం బందెడుగండుమీనములతో । నాసన్ననీలాలకో
త్కటభృంగావళితో ద్విజావళి లస।త్కాంతిన్ విడంబించుమా
అటకాసారముఁబోలె నెమ్మొగము దా । రంజిల్లు నత్యున్నతిన్. 38

చ. కరువలిఁ బాయువస్త్రమును । గట్ట నెఱుంగవు చూడ్కి దిక్కులం
బరపుచుఁ జంచరీకముల।భాతిఁ జెలంగెడుఁ గంధరంబునం
బొరలెడుముక్తకేశభర।ముం దఱుమంగఁ దలంప విప్పు డి
ట్లరుదుగ రత్నకందుకవి।హారము సల్పెదు సంభ్రమంబునన్. 39

---

1 అందియలు టిట్టిభంబులు; అందియలవెలయురత్నము, లందంబుగ లలితపదములన్ సుభగము లై యందంద మ్రోయుచును నా,డెందంబునఁ దగిలి సంవడించుచు నున్నన్. 2 'కందు లేక యుండి కడుమించి కెమ్మోవి.

వ. మఱియు నిట్లనుఁ దపోధను లగువారలతపంబులను నీరూపంబున నపహ్నవించి నదాన వీచక్కఁదనం బేమితపంబున సంపాదించితి నాతోడం గూడి తపంబు సేయుము సంసారంబు వృద్ధిఁ బొందం జేయుము పద్మాసనుండు [1]నాకుం బ్రత్యక్షుంబై నిన్ను నిచ్చినవాఁడు గావున నిన్ను విడువం [2]జాలను నీసఖీజనంబులు [3]నావాక్యంబులకు ననుకూలింతురు గాక నీవు చనుచోటికి [4]నన్నుం దోడ్కొని చను మని స్త్రీలకు ననుకూలంబుగాఁ బలుక నేర్చినయాగ్నీధ్రుండు పెక్కుభంగులం బలికి(న)నాపూర్వచిత్తి(యు నతనియనునయవాక్యంబులకు సమ్మతించి వీరశ్రేష్ఠుం డగునారాజవర్యుని బుద్ధిరూపశీలౌదార్యవిద్యావయశ్శ్రీలచేఁ బరాధీనచిత్త యగుచు జంబూద్వీపాధిపతి యగునారాజశ్రేష్ఠుని) తోడం గూడి శతసహస్రసంవత్సరంబులు భూస్వర్గభోగంబు లనుభవించి యాపూర్వచిత్తివలన నాభి కింపురుష హరివర్షేలావృత రమ్యక హిరణ్మయ కురు భద్రాశ్వ కేతుమాలసంజ్ఞలు గలకుమారులఁ (బ్రతిసంవత్సరంబు నొక్కొక్కనిఁగఁ) దొమ్మండ్రం గాంచెనంత నాపూర్వచిత్తి (యాయర్భకుల గృహంబున విడిచి) యాగ్నీధ్రుం బాసి బ్రహ్మలోకంబునకుం జనిన నాయాగ్నీధ్రిపుత్త్రులు మాతృసామర్థ్యంబునం జేసి [5]స్వభావంబునన శరీరబలయుక్తు లగుచుఁ దండ్రిచేత ననుజ్ఞాతులై తమతమనామంబులఁ బ్రసిద్ధంబు లయినజంబూద్వీపవర్షంబులం బాలించు చుండి రంత నాగ్నీధ్రుండు నాపూర్వచిత్తివలనం గామోపభోగంబులం దృప్తిం బొందక పూర్వచిత్తిం దలంచుచు [6]వేదోక్తంబు లగుకర్మంబులం జేసి (తత్సలోకంబగు) బ్రహ్మలోకంబునకుం జనియె నిట్లు దండ్రి పరలోకంబునకుఁ జనిన నాభిప్రముఖు (లగునాగ్నీధ్రికుమారు)లు దొమ్మండ్రును మేరుదేవియుఁ బ్రతిరూపయు నుగ్రదంష్ట్రయు లతయు రమ్యయు శ్యామయు నారియు భద్రయు దేవియు ననునామంబులు గల [7]మేరుపుత్త్రిక లగుతొమ్మండ్రుకన్యకలను వివాహం బై రంత. 40

భగవంతుం డగు నారాయణుండు ఋషభావతార మెత్తుట.

ఆ. నరవరేణ్యుఁ డైనయా నాభి సంతానార్థ, మంగనయును దాను నధికనియతిఁ
యజ్ఞపురుషుఁ డయినయా వాసుదేవుని, శ్రద్ధతోడఁ బూజ సరవిఁ జేసి. 41

వ. మఱియుం (బ్రవర్గ్యసంజ్ఞికంబు లగుకర్మంబులు శ్రద్ధావిశుద్ధద్రవ్య) దేశకాలమంత్రర్త్విగ్దక్షిణావిధానయోగంబులం బరమేశ్వరుని మెప్పించిన నెవ్వరికిం బ్రసన్నుండు గానిపుండరీకాక్షుండు భక్తవత్సలుం డై సురుచిరావయవంబులతోయజనశీలం బయినయాతనిహృదయంబునందుఁ బాయనిరూపంబు గలిగి [8]మనోనయనానందకరావయవంబులు గలతనస్వరూపం బాతనికిఁ జూపం దలంచి. 42

---

1 'మాకుం. 2 జాలము. 3 మావాక్య. 4 మమ్ముం. 5 సారూప్యంబునం జేసి వయోబలయుకు వ్రా. ప్ర. 6 'వేదోక్తంబున జన్నంబు సేసి. 7 'మేరుదేవిబిడ్డల వివాహం. 8 మనోనందకరం బైన తనస్వరూపంబు' వ్రా. ప్ర.

సీ. అంత నావిష్కృత కాంతచతుర్భుజం, బులును బీతాంబరం బును వెలుంగ
శ్రీవత్సకౌస్తుభ శ్రీరమాచిహ్నంబు, లురమందు రమ్యమై యిరవుపడఁగ
శంఖచక్రగదాంబుజాతఖడ్గాదిది, వ్యాయుధంబులు సేతు లందు మెఱయ
నతులితనవరత్న హాటకాంకితనూత్న, ఘనకిరీటద్యుతుల్ గడలుకొనఁగ
తే. గర్ణకుండలకటిసూత్ర కనకరత్న, హారకేయూరవరనూపు రాదిభూష
ణముల భూషితుఁడై న శ్రీనాయకుండు, దంపతులకప్పు డెదురఁ బ్రత్యక్షమయ్యె.
తే. ఇట్లు ప్రత్యక్షమయినపర మేశ్వరునిని, బెన్నిధానంబుఁ గనుఁగొన్న పేదమాడ్కి
హర్ష మొందినబుత్త్వికు లవనతాస్యు, లగుచు నభినుతిసేసి రి ట్లనుచు నపుడు.
క. పరిపూర్ణుఁడ వై యుండియు, మఱవక మాపూజ లెల్ల మన్నింతువు నీ
చరణారవిందసేవయు, ధరఁ బెద్దలు వినిచినటులు దగఁ జేసెద మా. 45
క. ఏ మిపుడు సేయుసంస్తుతి, నీమహిమ నెఱింగి కాదు నిరతముఁ బెద్దల్
దా మెది యుపదేశించిరొ, యామతమునఁ బ్రస్తుతింతు మయ్య మహాత్మా. 46
వ. మఱియు నీవు సంసారాసక్తమతి గలిగినవారికి వశ్యుండవుగా వీశ్వరుండవును
బ్రకృతిపురుషవ్యతిరిక్తుండవును బరమపురుషుండవును నయిననిన్నుఁ బొందని
ప్రపంచాంతర్గతంబు లయిననామరూపంబులు గలయస్మదాదులచేత నిరూపింప
నశక్యం బగు సర్వజీవులం జెందినదురితసంఘంబుల నిరసించుస్వభావంబు గల
నీయుత్తమగుణంబులయందు నేకదేశంబు గాని సర్వగుణనిరూపణంబు సేయ
నెవ్వరికి శక్యంబు గా నేరదు నీభక్తులు మిక్కిలి భక్తిం జేసి సంస్తుతించుగద్గదా
క్షరంబులను సలిలశుద్ధపల్లవతులసీదళదూర్వాంకురంబులను సంపాదించినపూ
జను సంతసిల్లెడినీకు బహువిధద్రవ్యసంపాదనంబు గలిగి విభవయుక్తంబు లయిన
యశ్వమేధాదులును దృప్తికరంబులు గానేరవు స్వభావంబున సర్వకాలంబు
లందును సాక్షాత్కరించి యతిశయం బై వర్తించుచు నశేషపురుషార్థస్వరూప
మవు పరమానందరూపమవు నైనవాఁడ వగుటం జేసి యజ్ఞాదులయందు నీకుఁ
దృప్తిలేక యున్న నస్మదాదులకోరికల నాపాదించుకొఱకు యజ్ఞాదుల నొనరిం
తు మని మఱియు ని ట్లనిరి. 47
క. బాలిశుల మగుచు మిక్కిలి, మే లెఱుఁగనిమమ్ము నీదు క్షమించినదయచేఁ
బాలించి యిత్తు వెప్పుడుఁ, జాలఁగ నిహపరములందు సకలసుఖములున్. 48
ఆ. ఇపుడు మేము నీకు నిష్టంబు లగుపూజ, లాచరింప కున్న నైన నధిక
మయిననీకృపాకటాక్షవీక్షణములఁ, జక్కఁ జూచి తగఁ బ్రసన్నుఁ డగుచు.
క. వర మీయఁదలఁచి మమ్ముం, గరుణించితి గాక నిన్నుఁ గనుఁగొనుటకు నై
యరసి నుతింపఁగ మాకుం, దర మగునే వరద నీరదశ్యామాంగా. 50

1 గలిగి వశుండు గాని జీవుండు నీశ్వరుండవు నైననీస్వరూపంబు నిన్ను ముట్టి నీప్రపం...
రూపంబుల నిరూపింప శక్యుండు గాఁడు.

వ. మఱియు నిస్సంగులై నిశితజ్ఞానంబునం జేసి దోషరహితులై భగవత్స్వభావులు నాత్మారాములు నగుమునులకు స్తుతియింపఁదగినగుణంబులు గలవాఁడ వగుచుండియుఁ బ్రసన్నుండవు [1]స్ఖలనక్షుతపతనజృంభణాదిదురవస్థలందును జ్వరమరణాదిదుర్దశలందును (వివశుల మగుమాకుఁ) గల్మషనాశకరంబు లయినభవద్దివ్యనామంబులు మావచన[2]గోచరంబు లగుం గాక మఱియు నీరాజర్షి పుత్రకాముం డై నీతోడ సమానుం డయినకుమారునిం గోరి కామంబుల స్వర్గాపవర్గంబుల నీ నోపిననిను బూజించి ధనకాముం డై నవాఁడు ధనవంతునిం జేరి తుషమాత్రం బడిగినచందంబున మోక్షనాథుండ వైననీవలన సంతానంబు గోరుచున్నవాఁడు జయింప రానినీమాయచేత నెవ్వండు మోహంబు నొంది విపర్యాసక్తుండు గాక యుండు[3] నర్థకాములము మదాంధులము నగుమేము నిన్ను నాహ్వానంబు సేసినయపరాధంబు (సర్వాత్మకుండ వగుటం జేసి సామ్యంబుచే) మన్నింపం దగుదువు మమ్ము దయఁ జూడు మని ప్రణమిల్లిన సర్వేశ్వరుండు వర్షాధిపతి యగునాభిచేతను ఋత్విక్కులచేతను వంద్యమానుం డై దయాకలితుం డగుచు ని ట్లనియె. 51

క. మునులార వేదవాక్యములను బ్రస్తుతి సేసి సర్వ లక్షణముల నా
కెన యగుపుత్త్రుని నిమ్మని, వినఁ బలికితి రిపుడు మిగుల వేడుకతోడన్. 52

క. [4]నాకాదిలోకములలో, నాకున్ సరివచ్చునట్టి నందను నెటు నా
లోకింప లేరు గావున, నాకున్ సరి నేన కా మనసమున నెఱుఁగుఁడీ. 53

వ. అదియునుం గాక భూసురోత్తములు నాముఖం బగుటం జేసి విప్రవాక్యంబు దప్పింపరాదు మీరు నాయీడుకుమారు నడిగితిరి గావున నాభిపత్ని యగుమేరుదేవియందు నేన పుత్త్రుండ నై జనియించెద నని పలికి పరమేశ్వరుం [5]డాగ్నీధ్రీయపత్ని యగుమేరుదేవి సూచుచుండ నాయజ్ఞంబున నంతర్ధానంబు నొంది యానాభిమీఁదిదయం జేసి (దిగంబరులును దపస్వులును జ్ఞానులును నూర్ధ్వరేతస్కులును నగునైష్ఠికులకు) యోగధర్మంబుల నెఱింగింపం దలంచి పుండరీకాక్షుండు నాభిపత్ని యగుమేరుదేవిగర్భాగారంబునం బ్రవేశించె నంత. 54

ఆ. మేరుదేవియందు మేరుధీరుం డగు, హరి సమస్తలక్షణాన్వితుండు
శమదమాదిగుణవిశారదుం డుదయించె, సకలజనుల కపుడు సంతసముగ. 55

ఆ. అతనికాంతియుక్త మయినదేహంబును, మహితబలపరాక్రమంబు వీర్య
మును దలంచి చూచి జనకుండు పేరిడె, సుతుని ఋషభుఁ డనుచు సొంపుతోడ.

క. ధరణీసురులును మంత్రులుఁ, బరివారము హితులుఁ బ్రజలు బాంధవులును సు
స్థిరమతి నాబాలకునిం, గర మనురాగమున రాజుగాఁ జూచి రిలన్. 57

1 స్వప్నాదిదురవస్థం. 2 బులకు గోచరంబులు గాకున్నను నీతోడ. 3 మునుల మగుమేము. 4 లోకాలోకములందును...నందనులను నెట్లా కాంక్షింపరు. 5 డు హోమగుండంబునందు నంతర్ధానంబు

క. పురుహూతుఁ డతనిమహిమలు, సరగున విని చిత్తమునకు సహ్యము గామిం
బరికించి ఋషభుఁ డేలెడి, ధరణి ననావృష్టి మిగులఁ దట్టము సేసెన్. 58

ఆ. అది యెఱింగి ఋషభుఁ డంతట యోగమా, యాబలంబు కతన నఖిలరాజ్య
మందుఁ గురియఁ జేసె నత్యంతసంపూర్ణ, వృష్టి దినదినంబు వృద్ధిఁ బొంద. 59

వ. ఇట్లు ఋషభుండు పురందరుండు సేయు[1]దౌష్ట్యంబునకు నవ్వి (యజనాభం బను) తనమండలంబు సుభిక్షంబుగాఁ జేసి నాభియుం దనకోరినచందంబునం బుత్రుండు జనియించి వర్ధిల్లుటకు సంతసిల్లి తనచేత నంగీకరింపంబడునరలోక ధర్మంబు గల పుండరీకాక్షునిమాయావిలసితంబునం జేసి బాలక నాతండ్రి యని మోహంబున నుపలాలించుచుఁ బ్రజానురాగంబున సర్వసమ్మతుం డయినపుత్రుని (సమయసేతురక్షణంబునకుఁ) బూజ్యం బయినరాజ్యంబునం దభిషిక్తుం జేసి భూసురులకుఁ బ్రధానవర్గంబునకు నప్పగించి మేరుదేవిం గూడి నరనారాయణస్థానం బయినబదరికాశ్రమంబునకుం జని యచ్చట మహాయోగసమాధిచే [2]నరనారాయణాఖ్యుండుఁ బురుషోత్తముండు నగువాసుదేవు నారాధించి క్షీణదేహుం డై యానాభి హరితాదాత్మ్యంబు నొందె నంత. 60

చ. సరసత నేనృపాలకుని జన్మమునందు భూసురోత్తముల్
సరసిజనాభునిం దగఁ బ్రసన్నతఁ బెట్టిన నంత మెచ్చి యీ
శ్వరుఁడు దనంత గర్భమున వచ్చి తనూభవుఁ డై జనించె నా
నరపతి నాభికిన్ సరి యనం దగునే నరనాథ యన్యులన్. 61

వ. అంత. 62

సీ. భూవరుఁ డగుఋషభుఁడు దనరాజ్యంబుఁ, గర్మభూమిఁగ నాత్మఁ గాంచి జనుల
కందఱకును బ్రియం బగునట్లు కర్మతం, త్రంబెల్లఁ దెలుపంగఁ దలఁచి కర్మ
ములు సేయుటకు గురువులయొద్ద వేదంబు, సదివి వారలయనుజ్ఞను వహించి
శతమన్యుఁ డిచ్చినసతి జయంతీకన్యఁ, బరిణయం బై యట్టిపడఁతివలన

తే. భరతుఁ డాదిగ సుతుల నూర్వురను గాంచె, నట్టిభరతునిపేరను నవనితలము
పురవరాశ్రమగిరి[3]తరుపూర్ణ మగుచు, నమరి భారతవర్షనామమున మించె.

వ. ఆమహాభారతవర్షంబునందుఁ దమతమపేరం బరఁగుభూములకుం గుశావర్త నిలావర్త బ్రహ్మావర్త నార్యావర్త మలయకేతు భద్రసేన నిద్రస్పృ గ్విదర్భ కీకటు లనుతొమ్మండ్రు కుమారులను [4]దక్కం గలతొంబండ్రు పుత్రులకుఁ బ్రధానులం జేసె నంతం గవి హరి నంతరిక్ష ప్రబుద్ధ పిప్పలాయ నావిర్హోత్ర ద్రమిళ చమస కరభాజను లనువారు దొమ్మండ్రును [5]భాగవతధర్మప్రకాశకు లైరి (భగవన్మహిమోపబృంహితంబు లగు) వారలచరిత్రంబులు ముంద ఱెఱింగించెదఁ

1 గర్వబుద్ధికి. 2 నిశ్శ్వాసోపాస్తి సేయుచు క్షీణ. 3 కుంజపుంజ మగుచు. 4 రాజులుగాఁ జేసె.
5 భగవద్ధర్మంబు గలవారైరి.

దక్కిన యెనుబదియొక్క కుమారులు (పిత్రాదేశకరులు నతివినీతులు) మహాశ్రోత్రి
యులు యజ్ఞశీలురుఁ గర్మనిష్ఠులు నయిన బ్రాహ్మణోత్తములైరి ఋషభుండు స్వతం
త్రుండై సంసారధర్మంబులం బొరయక కేవలానందానుభవుం డయినయీశ్వరుం
డై యుండియుఁ బ్రాకృతుండునుంబోలెఁ (గాలానుగతంబు లగు) ధర్మంబుల నాచ
రించుచు (ధర్మప్రవర్తకులకు సముండును నుపశాంతుండును మైత్రుండును గారు
ణికుండును నై ధర్మార్థయశఃప్రజానందామృతావరోధంబుచే గృహస్థాశ్రమంబు
లం బ్రజల నియమించుచుఁ) గొంతకాలంబు నీతిమార్గంబు దప్పక ప్రజాపాలనంబు
సేయుచు (వేదరహస్యంబు లగుసకలధర్మంబులు స్వవిదితంబు లయినను) బ్రాహ్మ
ణోప[1]దేశపూర్వకంబుగా ద్రవ్యదేశకాలవయశ్శ్రద్ధర్త్విగ్వివిధోద్దేశోపచితంబులు
గ నొక్కొక్క క్రతువును శతవారంబు యథావిధి గఁ జేసి సుఖం బుండె నంత.

క. జనవర ఋషభుని రాజ్యంబున నైహికఫలముఁ గోరు పురుషుని నొకనిం
గనుఁగొన నెఱుంగ మెవ్వఁడు, నినతేజుం డతనిమహిమ లే మని చెప్పన్. 65

ఋషభుండు పుత్రులకు నీతి యుపదేశించుట.

సీ. ఆఋషభుండు రాజ్యంబు సేయుచు నుండి, యంతట నొక్కనాఁ డాత్మ యందుఁ
దలపోసి భూలోకఫల మపేక్షింపక, మోహంబు దిగనాడి పుత్రులకును
దనరాజ్యమెల్ల నొప్పనచేసి వెనువెంటఁ, గొడుకులు మంత్రులుఁ గొలిచి రాఁగ
నల్లన యరిగి బ్రహ్మావర్తదేశంబు, నందుల నపుడు మహాత్ము లయిన

తే. యట్టిమునిజనసమ్ముఖంబందుఁ జేరి, తనదుపుత్రుల నందఱ దాయఁ బిలిచి
పరమపుణ్యుండు ఋషభుండు ప్రణయ మొప్ప, హర్ష మందుచు నప్పుడి ట్లనుచుఁ బలికె.

ఆ. తనయులార వినుఁడు ధరలోనఁ బుట్టిన, పురుషులకును శునకములకు లేని
కష్టములను దెచ్చుఁగాన కామంబుల, వలన బుద్ధి సేయ వలదు మీరు. 67

చ. నరులకు నేతపంబున ననంతసుఖంబులు గల్గుచుండు శ్రీ
కరమతి నాతపంబుఁ దగఁ గైకొని చేసిన బ్రహ్మసౌఖ్య[2]ముం
దిరముగఁ గల్గు వృద్ధులను దీనులఁ బ్రోవుఁడు దుష్టవర్తనం
జరుగుచు నుండు కాముకులసంగతిఁ బోకుఁడు మీఁద మే లగున్. 68

వ. మఱియు (సంగనాసక్తు లగుకాముకులసంగంబు నిరయరూపం బయినసంసారం
బగు మహత్సంగంబు మోక్షద్వారం బగు నట్టిమహాత్ము లెవ్వ రనిన) శత్రు
మిత్రవివేకంబు లేక సమచిత్తులును శాంతులును (క్రోధరహితులును) సకలభూ
తదయాపరులును సాధువులును నగువారలు మహాత్ము లనంబడుదు రట్టిమహాత్ము
లు నాయందలిస్నేహంబె (ప్రయోజనంబుగాఁ) గలిగియుండుటం జేసి (విషయవా
ర్తాప్రవృత్తు లగుకుజనులందుఁ) దమదేహగృహమిత్రదారాత్మజాదులందుఁ బ్రీతి
లేక యుండుదురు విషయాసక్తుఁ డయినవాఁడు వ్యర్థకర్మంబులం జేయు నట్టిదు

---

1 దేశంబునఁ గ్రతుశతంబు సేసి సుఖం బుండె. 2 మం దిరవునఁ బొందు.

ష్కృతకర్మంబులం జేయువాఁ డెప్పుడును బాపకర్ముఁ డగుచుం (గ్లేశదం బగు దేహంబు నొందు) చుండుఁ గావునఁ బాపమూలంబు లయినకామంబులు గోరకుండిజ్ఞానం బెంతకాలంబు లేకయుండు నంతకాలంబు నాత్మతత్త్వం బెఱుంగ(ంబడ దాతత్త్వం బెఱుంగ) కుండుటం జేసి దేహికి దుఃఖం బధికం బై యుండు లింగదేహం బెంతదడ వుండు నంతదడవును మనంబు కర్మవశంబై జ్ఞానవంతంబు గాక యవిద్యం బాయ కుండు శరీరంబు గర్మమూలం బగుటవలనఁ గర్మంబులు సేయఁ జనదు (వాసుదేవుం డగు)నాయందుఁ బ్రీతి యెంతదడవు లేక యుండు నంతదడవును దేహధర్మంబులు బాధించు విద్వాంసుం డైనను దేహేంద్రియాదులయందుఁ బ్రీతిసేసిన(మిథునీభావసుఖప్రధానం బగు)గృహస్థాశ్రమంబు నంగీకరించి (స్వరూపస్మృతిశూన్యుం డై మూఢుం డగుచు) నందు సంసారతాపంబులఁ బొందుఁ బురుషుండు స్త్రీతోడం గూడి యేకీభావంబు నొం(దుట)ద(నకు హృదయగ్రంథియై యుండు) నందు (జనునకు గృహక్షేత్రసుతాప్తవిత్తంబులందు నేను నాయది యనియెడిమోహంబు గలుగు నట్టిస్త్రీపురుషమిథునీభావంబుచే) సంతానంబు గలుగు నాసంతానకారణంబున గృహక్షేత్రవిత్తాదులు సంపాదింపంబడు నందు మోహం బధికం బగుటం జేసి మోక్షమార్గంబు దవ్వగు నిట్లు సంసారంబునం దుండియు మనంబున నెప్పుడు ముక్తిచింతం జేయు నప్పుడు సంసారంబునుం బాయు మోక్షోపాయంబులు పరమగురుండ నైననాయందుల భక్తి సేయుటయు విగతతృష్ణయు ద్వంద్వతితిక్షయు [2]సర్వలోకంబులందులజంతువ్యసనావగతియు [3]నీశ్వరవిషయజ్ఞానాపేక్షయుఁ (దపంబును) విగతేచ్ఛయు (మత్కృతకర్మంబులు) మత్కథలు వినుటయు నన్నె దైవంబు గా నెఱుంగుటయు నద్గుణకీర్తనంబులును [4]నిర్వైరత్వసామ్యోపశమంబులును దేహగేహంబులందు నాత్మబుద్ధిజిహాసయు నధ్యాత్మయోగంబును నేకాంతసేవయుఁ [5]బ్రాణేంద్రియాత్మల గెలుచుటయుఁ గర్తవ్యాపరిత్యాగంబును సచ్ఛ్రద్ధయు బ్రహ్మచర్యంబును గర్తవ్యకృత్యంబులందుల నప్రమత్తుం డగుటయు వాఙ్నియమనంబును సర్వంబు నన్నుగాఁ దలంచుటయు జ్ఞానంబును విజ్ఞానవిజృంభితం బైన యోగంబును (ధృత్యుద్యమంబును) సాత్త్వికంబును నాదిగాఁ గల తెఱంగులచేత లింగదేహంబు జయించి దేహి కుశలుం డగుచు నుండ వలయు. 69

ఆ. అరయఁ గర్మరూప మగునవిద్యాజన్మ, మైనహృదయబంధనాదిలతల
నప్రమత్తయోగమను [6]మహాచ్ఛురికచేఁ, ద్రెంప వలయు నంతఁ ద్రెంపుతోడ.

ఆ. ఒనర నిట్లు యోగయుక్తుండు గురుఁ డైన, భూపుఁ డైన శిష్యపుత్రవరుల

1 కర్మంబులుం గాయుచుండు. 2 సర్వజంతువ్యసననిరీక్షణంబును. 3 నీశ్వరదర్శనాపేక్షయు. 4 నిరహంకారంబును గర్మత్యాగేచ్ఛయు నధ్యాత్మ. 5 నాత్మజయంబును శ్రద్ధయు. 6 మహాసురియచే. 7 నరప తైన శిష్యవరుల నెల్ల.

యోగయుతులఁ జేయ ॰ నొప్పఁగా వలయును, గర్మపరులఁ జేయఁ ॰ గాదు కాదు.

సీ. జను లెల్ల నర్థవాం॰ఛలఁ జేసి యత్యంత, మూఢు లై యైహిక॰ంబును మనంబు
లందును గోరుదు ॰ రల్పసౌఖ్యములకు, నన్యోన్యవైరంబు ॰ లంది దుఃఖ [నెంత
ములఁ బొందుదురు గాన ॰ మును గొని గురుఁ డైన, వాఁడు మాయామోహ॰వశుఁడు
జడుఁడును నైనట్టి ॰ జంతువునందును, దయ గల్గి మిక్కిలి ॰ ధర్మబుద్ధిఁ

ఆ. గన్ను లున్నవాఁడు ॰ గానని వానికిఁ, దెరువుఁ జూపినట్లు ॰ దెలియఁ బలికి
యతులమగుచు దివ్య॰మైన యా మోక్షమా,ర్గంబుఁ జూపవలయు ॰ రమణతోడ.

వ. మఱియుఁ బితృగురుజననీబంధుపతిదైవతంబులలో నెవ్వ రైనను (సంసారరూప) మృత్యురహితం బైన మోక్షమార్గంబుఁ జూప కుండిరేని వా రెవ్వరును హితులు గానేరరు నాదుశరీరంబు (దుర్విభావ్యంబు నాదుమనంబు) సత్త్వయుక్తంబును ధర్మసమేతంబును బాపరహితంబును నగుటం జేసి పెద్దలు నన్ను ఋషభుం డండ్రు గావున (శుద్ధసత్త్వమయం బైన) నాశరీరంబునం బుట్టినకుమారు లందఱును (సోదరుండును మహాత్ముండును నగ్రజుండును) నైన భరతు నన్నుఁ గాఁ జూచి (యక్లిష్టబుద్ధిచే భజింపుం డదియ నాకు శుశ్రూషణంబు) ప్రజాపాలనంబు సేయుట మీకును బరమధర్మం బని మఱియు ని ట్లనియె. 73

సీ. భూతజాలములందు ॰ భూజముల్ వర్యముల్, భూరుహములకంటె ॰ భోగికులము
భోగిసంతతికన్న ॰ [1]బోధనిష్ఠులు బోధ, మాన్యులకన్నను ॰ మనుజవరులు
వీరికన్నను సిద్ధ॰విబుధగంధర్వులు, వారికన్నను సురల్ ॰ వారికన్న
నింద్రాదిదేవత ॰ లిందఱికన్నను, దక్షాదిసన్మునుల్ ॰ దలఁప నెక్కు

తే. డంతకన్నను భర్గుఁ డా॰యభవుకన్నఁ, గమలభవుఁ డెక్కు డాతని॰కంటె విష్ణుఁ
డధికుఁ డాతఁడు విప్రుల ॰ నాదరించుఁ, గాన విప్రుండు దైవంబు ॰ మానవులకు.

క. భూసురులకు సరిదైవం, బీసచరాచరమునందు ॰ నెఱుఁగను నాకున్
భూసురులు గుడుచునప్పటి, యాసంతోషంబు [2]దోఁప ॰ దగ్నులయందున్. 75

సీ. మంగళం బైన బ్రహ్మస్వరూపంబును, వేదరూపంబు న॰నాదిరూప
మగుచున్న నాదుదే॰హము బ్రాహ్మణోత్తముల్, ధరియింతు రెప్పుడుఁ ॰ సత్త్వబుద్ధి
శమదమానుగ్రహ॰సత్యతపస్తితి,క్షలు గల్గువిప్రుండు ॰ సద్గురుండు
గాన మిక్కిలిభక్తి ॰ గల్గి యర్చించను, నైనభూసురులదే॰హములవలన

తే. నందుచుండును నాదుదే॰హంబు గాఁగ, నెఱిఁగి [3]వరు లగువిప్రుల ॰ నెల్ల భక్తిఁ
బూజసేయుటచే నన్నుఁ ॰ బూజసేయు, టనుచు వినిపించి మఱియు ని॰ట్లనుచుఁ బలికె.

క. ఈ తెఱఁగు దెలిసి భూసుర, జాతిం బూజించునట్టి ॰ జనుఁడును మాయా
[4]తీతుం డై నిక్కంబుగ, భూతలమున మోక్షమార్గ॰మును [5]బొడగాంచున్. 77

1 బుద్ధిమంతులు బుద్ధిమంతులకన్నను. 2 లేదు యజ్ఞములందున్. 3 యేకాంతు లావిప్రవరుల నెల్ల. 4 పేతులు నై. 5 బొడగందుర్.

వ. ఇట్లు సదాచారు లగుకుమారులకు లోకప్రదర్శనార్థం బాచారంబు లుపదేశించి మహాత్ముండును బరమసుహృత్తును నగుభగవంతుం డు ఋషభాపదేశంబునం గర్మత్యాగంబు సేసి (యుపశమశీలు రగు)మునులకు భక్తిజ్ఞానవైరాగ్యలక్షణంబులు గలపారమహంస్యధర్మం బుపదేశింపఁ గలవాఁ డగుచుఁ బుత్రశతంబునం దగ్రజుండును (బరమభాగవతుండును భగవజ్జనపరాయణుండును) నగుభరతుని (ధరణీపాలనంబునకుఁ) బట్టంబు గట్టి (తాను గృహమందె) దేహమాత్రావలంబనంబు సేసి దిగంబరుం డై యున్మత్తాకారుం డగుచుం (బ్రకీర్ణకేశుం డై)యగ్నుల నాత్మారోపణంబు సేసి బ్రహ్మావర్తదేశంబును బాసి జడాంధబధిరమూకపిశాచోన్మాదులుంబోలె నవధూతవేషంబు నొంది జనులకు మాఱు వలుకక మౌనవ్రతంబునం బుర గ్రామాకర జనప దారామ శిబిర వ్రజ ఘోష సార్థ గిరి వనాశ్రమాదులయందు వెంటఁ జనుదెంచు దుర్జనతర్జన తాడ నావమాన మేహన నిష్ఠీవన పాషాణ శకృ ద్రజః ప్రక్షేపణ పూతివాత దురుక్తులం బరిభూతుం డయ్యును గణనం బెట్టక వనమదేభంబు మక్షికాదికృతోపద్రవంబునుంబోలెఁ గైకొనక దేహాభిమానంబునం జిత్తచలనంబు నొందక యేకాకి యై చరియించుచుండ నతిసుకుమారంబు లగుకరచరణోరస్స్థలంబులు విపులంబు లగుబాహ్వంసకంఠవదనాద్యవయవవిన్యాసంబులుం గలిగి ప్రకృతిసుందరం బగుచు స్వతస్సిద్ధదరహాసరుచిరముఖారవిందం బై నవనళినదళంబులం బోలి శిశిరకనీనికలం జెలువొంది యరుణాయతంబు లగునయన(ంబులచే నొప్పి యన్యూనాధికంబు లగు) కపోలకర్ణకంఠనాసాగండ(ంబులచేఁ దేజరిల్లుచు) నిగూఢస్మితవదనవిభ్రమంబులం బ్రకాశించుతనదివ్యమంగళవిగ్రహంబుచేఁబరకాంతలచిత్తంబుల [1]కత్యంతమోహంబు గలుగఁ జేయుచు. 78

ఆ. ధూళిచేత మిగుల ధూసరితంబు లై, జడలు గట్టి కడుఁ బిశంగవర్ణ
ము నగుకేశపాశమును వెలిఁగించుచు, నితరు లెవరుఁ దన్ను నెఱుఁగకుండ.

క. అవధూతవేషమున ని, ట్లవనిఁ మలినంబు లై నవయవములతోఁ
దవిలి చరించుచు నుండును, భువి భూతాక్రాంతుఁ డయిన పురుషునిమాడ్కిన్.

ఆ. జనుల కిట్లు యోగసంచార మెల్ల వి, రుద్ధ మనుచు నాత్మ [3]బుద్ధిఁ జూచి
యజగరంబుమాడ్కి నవనిపై నుండె బీ, భత్సకర్మమునకుఁ బాలుపడుచు. 81

వ. ఇట్లు బీభత్సరూపంబున వసుంధరం బడి యుండి యన్నంబు భుజించుచు నీరు ద్రావుచు మూత్రపురీషంబులు విడుచుచు నవి శరీరంబున నంటం బొరలుచుండు మఱియుఁ దత్పురీషసౌగంధ్యయుక్తం బగువాయువు దశదిశల దశయోజనపర్యంతంబు పరిమళింపఁ జేయుచుండ గోమృగకాకచర్యలం జరియించుచు భగవదంశం బైన ఋషభుండు మహానందంబు ననుభవించుచుఁ దనయందు సర్వభూతాం

1 మన్మథశరపరంబులు. 2 ధూళిధూసరములతోఁ గుటిలంబు లై. 3 గోసి.

తర్యామి యగువాసుదేవునిం బ్రత్యక్షంబుగాఁ గనుంగొనుచు సిద్ధిం బొందిన
వైహాయసమనోజవపరకాయప్రవేశాంతర్ధానదూరగ్రహణశ్రవణాదియోగసిద్ధు
లు దమంత వచ్చినం గైకొనక యుండె నని పలికిన శుకయోగీంద్రునకుం బరీ
క్షిన్నరేంద్రుం డి ట్లనియె. 82

క. మునివర యోగజ్ఞానం,బునఁ జెఱుపం బడ్డకర్మములు గలపెద్దల్‌
గని యుండెడి యైశ్వర్యం,బును ఋషభుం డెఱిఁగి యేల పొందక యుండెన్‌.

వ. అనిన శుకుం డి ట్లనియె. 84

మ. ధరణీవల్లభ నీదువాక్యములు తథ్యం బింతయుం దప్ప దె
ట్లరయన్‌ వన్యమృగంబు పట్టువడి తా నావేళ నాలుబ్ధకున్‌
ధర వంచించినమాడ్కి నింద్రియములన్‌ దండించి చిత్తంబు ని
ర్భరకామాదుల కాస యిచ్చుఁ గడు సంరంభంబుతోఁ గ్రమ్మఱన్‌. 85

క. చిరకాలతపము నైనను, హరియింపఁగ నోపుఁ జిత్త మని పెద్దలు న
మ్మరు జారులకున్‌ జారిణి,కరణిని నడరించు మనసు కామాదులకున్‌. 86

క. కామక్రోధాదికముల్‌, భూమీశ్వర కర్మబంధములు మఱియును జే
తోమూలము లగుటను దా, రీమహిలో మనసు నమ్మ రెప్పుడుఁ బెద్దల్‌. 87

సీ. అది గాన యెన్నఁడు నైశ్వర్యములను జేపట్టఁ జూడఁడు లోకవిభవ్యు లైన
వారలచే నభివందనంబులు వొంది, వెలయంగ నవధూతవేషభాష
ణంబుల నెఱిఁగికొనఁగ వానిభగవత్స్వరూపంబు గలిగి యాత్మ[1]రూపమందుఁ
బరమయోగధ్యానపరులకు నెల్ల దేహత్యాగసమయంబు నంతలోనఁ

తే. జూపుచుండియు దేహంబుఁ బాపనిచ్చ,యించెనచ్చట దివ్యయోగీంద్రుఁ డాద్యుఁ
డతులదివ్యప్రకాశకుఁ డమరగురుఁడు,పరమపురుషుండు ఋషభుండు పార్థివేంద్ర.

వ. అంత (విముక్తలింగుండును భగవంతుండును నగుఋషభుండు మనంబునం దేహాభి
మానంబు విసర్జించి కులాలచక్రంబు గులాలునిచేత భ్రమియింపంబడి విస్పష్టం
బయ్యును భ్రమియించుగతిం బ్రాచీనసంస్కారవిశేషం బగునభిమానాభాసం
బున దేహచలనాదికంబుల నొప్పియుండియు యోగమాయావాసనచే యుక్తుం
డయ్యె మఱియు నాఋషభుం డొక్కదినంబునం గొంకణవంకపటంబు లను
దక్షిణకర్ణాటకదేశంబులకు యదృచ్ఛం జని కుటకాచలోపవనంబున నిజాస్య
కృతశిలాకబళుం డగుచు నున్మత్తునిచందంబున వికీర్ణకేశుండు దిగంబరుండు నై
సంచరింప వాయువేగవిధూతవేణుసంఘర్షణసంజాతం బగునుగ్రదావానలంబు
తద్వనంబు దహింప నందు దగ్ధుం డయ్యె నంత నతనికృత్యంబులు తద్దేశవాసు
లగుజనంబులు సెప్ప నర్హన్నామకుం డగుతద్రాష్ట్రాధిపతి విని నిజధర్మంబులం
బరిత్యజించి స్వదేశస్థులతోడం గూడి దా నాయాచారంబుల నంగీకరించి యధ

1 రూఢి నంతఁ.

ర్మబహుళం బగుకలియుగంబున భవితవ్యతచే విమోహితుం డై మనుజుల నస
మంజసం బగుపాషండమతాభినివేశులం జేసె) మఱియును గలియుగంబునం ద
ర్హాన్తముల మనుజాధములు దేవమాయామోహితులై శాస్త్రోక్తశౌచాచారం
బులు విడిచి (నిజేచ్ఛంజేసి) దేవతానిందలు సేయుచు నస్నానానాచమనాశౌచకే
శోల్లుంఛనాదికాపవిత్ర వ్రతంబులం జేయుచు [1]నధర్మబహుళం బగుకలియుగంబు
నం జెఱుపంబడ్డబుద్ధిధర్మంబులు గలిగి వేదబ్రాహ్మణయజ్ఞపురుషుల దూషించుచు
లోకంబులం[2]దమతమమతంబులంకుండామె సంతసిల్లుచు (నవేదమూలం బగుస్వే
చ్ఛంజేసి ప్రవర్తించి యంధపరంపరచే విశ్వాసంబుసేసి తమంతన) యంధతమ
సంబునం బడుచునుండుదు రీఋషభునియవతారంబు [3]రజోవ్యాప్తు లగుపురుషుల
కు మోక్షమార్గంబు నుపదేశించుటకు నయ్యె నదియునుంగాక[4] సప్తసముద్రపరి
వృతంబు లగునీభూద్వీపవర్షంబులందలిజనంబులు దివ్యావతారప్రతిపాదకంబు
శుద్ధంబు నగునెవ్వనికృత్యంబులు గీర్తింతురు మఱియు నెవ్వనియంశంబున నతి
కీర్తిమంతుం డగుప్రియవ్రతుండు గలిగె నెందు జగదాద్యుం డగుపురాణపురు
షుం డవతారంబు నొంది కర్మహేతుకంబు గానిమోక్షధర్మంబుం దెలిపె నెండి
యు నెవ్వండు యోగమాయాసిద్ధుల నసద్భూతంబు లగుటంజేసి నిరసించె నట్టి
ఋషభునితోడఁ దత్సిద్ధికృతప్రయత్ను లగునితరయోగీశ్వరులు మనోరథంబున
నైన నెట్లు సరియగుదు రిట్లు సకలవేదలోకదేవబ్రాహ్మణులకు గోవులకుం బరమ
గురుండు భగవంతుండు నగుఋషభునిచరిత్రం బెవ్వరు వినినను దుశ్చరితంబులు
దొలంగు మంగళంబులు సిద్ధించు మిక్కిలి శ్రద్ధతో నెవ్వండువిన్నను వినిపించినను
హరిభక్తి దృఢంబగు నట్టిహరిభక్తితాత్పర్యమునం(బెద్దలు భాగవతులగుటంజేసి
సంప్రాప్తసర్వపురుషార్థు లగుచు వివిధవృజినహేతుకం బగు)సంసారతాపంబును
బాసి [5]యవిరతంబుఁ దద్భక్తియోగామృతస్నానంబు సేసి పరమపురుషార్థం బ
యినమోక్షంబును జెందుదు రని సప్తద్వీపంబులవారు నేఁడునుం గొనియాడు
చుండుదురు. 89

ఆ. యాదవులకు మీకు నత్యంతకులగురు, వైనకృష్ణుఁ [6]డెచటనైనఁ గలఁడు
కొలుచువారికెల్ల సులభుఁ డై మోక్షంబు, నిచ్చుఁ జింత సేయ నేల మీకు. 90

---

1 నధర్మలక్షణంబులం గలిగి కలియుగ. 2 దంధపరంపరను దమతిమ. 3 (బ్రాహ్మణక్షత్రి)యు లగు మోక్ష. 4 నతనియంశంబున సప్తద్వీపములంగుఁ బ్రియవ్రతునియంశంబునకు పరిచెప్ప నలవి గా దేవంశంబున శ్రీహరి యవతరించి మహాయోగధర్మప్రకాశంబు సేసె నాఋషభునిచరితంబు మనోరథంబుననైనఁ బొందలే రతండు యోగమాయను నిరసించి మాయాకల్పితసకలసిద్ధుల నసత్యంబు గాఁ దలఁచె నిట్లు సర్వలోకపూజ్యులైనదేవబ్రాహ్మణులకు. 5 హరికథామృతపానంబున నిర్వృతు లై పరమపురుషార్థంబైనమోక్షంబు నపేక్షింప రని సప్తద్వీప:—ఇట 'మోక్షంబు నపేక్షింప' గనుటకు 'తయైవ నిర్వృత్యా పరయా హ్యపవర్గ మాత్యంతికం పరమపురుషార్థమపి నో ఏవాద్రియన్తే' అని మూలము. 6 డెక్కడైనఁ.

సీ. నిత్యానుభూత మా[1]నిజరూపలాభని,వృత్తమై తగుమహాతృష్ణ గలిగి
యతులితవిపులమాయారచితంబైన,లాభంబునకుఁ దగుకలంబు లేని
మతి గల్గి లోకుల నతివేడ్కఁగరుణించి, యభయదానం బిచ్చి యందఱికిల
[2]నవ్యయంబై దివ్యమై మహానంద మై, యత్యంతసేవ్య మై యతుల మైన
తే. తనదులోకంబు సూపంగఁ దగినయట్టి
మోక్షమార్గంబు నెఱిఁగించి ముక్తదేహుఁ
డగుచుఁ దాదాత్మ్య మొందెఁ బ్రత్యక్షవిష్ణు
వైనఋషభుండు జనులకు నద్భుతము గ. 91

భరతోపాఖ్యానము.

మ. భరతుం డంత ధరాతలంబుఁ గడఁకం బాలించుచున్ ధారుణీ
శ్వరచంద్రుం డగువిశ్వరూపునకు మున్ సంజాత యై యుండి ని
ర్భరకాంతిన్ విలసిల్లుపంచజని పేరం గల్గుకాంతామణిం
గర మర్థిన్ ధరఁ బెండ్లి యాడె శుభలగ్నంబందు భూవల్లభా. 92
వ. ఇట్లు (వివాహితుండై) యాపంచజనివలన నహంకారంబునం బంచతన్మాత్ర
లు జనించినతెఱంగున సుమతి రాష్ట్రభృత్సుదర్శ నాచరణ ధూమ్రకేతువు లను
నేవురు పుత్రులం బుట్టించె నట ము న్నజనాభం బనుపేరం బరఁగువర్షంబు
భరతుండు పాలించుకతంబున భారతవర్షంబు నాఁ బరఁగె నంత. 93
క. భరతుఁడు పూర్వజు లేలిన, కరణిని గర్మముల నెల్లఁ గైకొని ప్రజలన్
హరికృప నొందుచు నేలెను, ధరణీసురవరులు వొగడ ధరణీనాథా. 94
సీ. భగవంతుఁ డగుజగద్భరితు [3]నల్పంబులు, నధికంబులైనపెక్కధ్వరముల
దర్శపూర్ణిమలచేఁ దగను జాతుర్మాస్య, [4]ముల నగ్నిహోత్రములవలనఁ గడఁకఁ
బశుసోమములచేతఁ బలమాఱుఁ బూజించి, వేదోక్త మైనయావిమలకర్మ
ములఁగల్గుధర్మంబుఁబురుషోత్తమార్పణం,బుగఁ జేయుచును మఖంబులనుమంత్ర
తే. ములను బలికెడునాదైవములను శ్రీశు
నవయవంబులు గాఁ[5]గ భూధవుఁడు ప్రేమ
ననుదినంబును బాయక ఘనతఁ దలఁచి
యఖిలరాజ్యానుసంధానుఁ డగుచు నుండె. 95
క. ఈరీతిఁ గర్మసిద్ధుల, నారయ నత్యంతశుద్ధ మగుచిత్తముతో
నారాచపట్టి భరతుఁడు, ధారుణిఁ బాలించె నధికధర్మాన్వితుఁడై. 96
వ. మఱియు నాభరతుండు శ్రీవత్సకౌస్తుభవనమాలాలంకృతుండును సుదర్శనా
ద్యాయుధోపలక్షితుండును నిజభక్తజనహృదయారవిందనివాసుండును బరమ

1 నిజరూపుచేత నివృత్త. 2 నవ్యయంబును మహానందకరంబును, దివ్యంబు నత్యంతసేవ్యమైన.
3 నిగణాధికము లైన పెక్కుమఖములచేత. 4 అగ్నిహోత్రములచే నతిథిజనముఁ. 5 మనంబందు.

పురుషుండును నైన వాసుదేవునియందు నధికభక్తి ననుదినంబును జేయుచు నేఁబదిలక్షల వేలేండ్లు రాజ్యంబు సేసి [1]పితృపితామహాద్యాయాతం బగు నాధనంబును యథార్హంబు గాఁ బుత్రులకుఁ బంచి యిచ్చి బహువిధసంపదలు గలగృహంబును బాసి పులహాశ్రమంబున కరిగె నంత. 97

*సీ. ఏయాశ్రమంబున నిందిరాధీశ్వరుఁ, డచ్చటివారల నాదరించి
ప్రత్యక్షమున వచ్చి పాయ కెప్పుడు నుండు, నట్టిరమ్యం బైన యాశ్రమమున
నిలిచి సాలగ్రామములు గల[2]గండకీ,నది యెందు నెంతయుఁ గదిసి యుండు
నచ్చోట నేకాకి యగుచును భరతుండు, బహువిధనవపుష్పపల్లవముల

తే. నతులతులసీదళంబుల నంబువులను, గందమూలాదిఫలములఁ గంజములను
ఘనత నర్పించి నిచ్చలుఁ దనివి లేక, సేవసేయుచు నుండె నాశ్రీశుఁ జేరి. 98

వ. దానం జేసి విగతవిషయాభిలాషుండై శమదమాదిగుణంబులు గలిగి యథేచ్ఛం జేసి యెడతెగక పరమపురుషునిపరిచర్యాభక్తిభరంబున శిథిలీకృతహృదయగ్రంథి గలిగి సంతోషాతిశయంబునం బులకితాంగుండు నానందబాష్పనిరుద్ధావలోకనయనుండు నగుచు నిజస్వామి యైనహరి(చరణారవిందాను)ధ్యాన(పరిచిత)భక్తియోగంబునం బరమానందగంభీరహృదయం బను నమృతకాసారంబున నిమగ్నుండగుచుఁ దా నపుడు పూజించుపూజ నెఱుంగక యిట్లు భగవద్వ్రతంబు ధరియించి యేణాజినవాసస్త్రిషవణస్నానంబుల నార్ద్రకుటిలకపిశవర్ణజటకలాపంబులు గలిగి మార్తాండాంతర్గతుం డయినపరమేశ్వరుని హిరణ్మయపురుషునింగాఁ దలంచుచు నిట్లనియె. 99

సీ. కర్మఫలంబులఁ [3]గడఁక నిచ్చుచు మనో, వ్యాపారమున నిట్టి యఖిలలోక
ములఁ జేసి యాలోకములకు నంతర్యామి, యగుచుఁ బ్రవేశించి యంతమీఁద
నానందరూప మైనట్టి బ్రహ్మముఁ గోరు, చున్నజీవుఁ దనయం దున్నయోగ
శక్తిచేఁ దగ ననిశంబుఁ బాలనసేయు, చుండి యంతటను మార్తాండమధ్య

ఆ. వర్తి యగుచు నిట్లు [4]వఱలుచు జగముల,యందు నుండి ప్రకృతిఁ బొంద కంత
నతులదివ్యమూర్తి యైనయానందరూ, పమును శరణ మొందె భరతవిభుఁడు.

వ. అంత నాభరతుం డొక్కనాఁ [5]డామహానదిం గృతాభిషేకుం డయి ముహూర్తత్రయం బంతర్జలంబులందుఁ బ్రణవోచ్చారణంబు సేయుచుండుసమయంబున నిర్భరగర్భిణి యగునొక్క హరిణి జలార్థిని యై యొంటి జలాశయసమీపంబునకు వచ్చి జలపానంబు సేయునెడ నాసమీపంబున మృగపతి గర్జించి లోకభయంకరంబుగ నాదంబుసేయ నాహరిణి స్వభావంబున భీత యగుటం జేసి బెగ్గడిలి

---

1 సామ్రాజ్యంబు పుత్రులకుం. 2 చక్రతీ, ర్థంబుఁ జేయును బవిత్రంబుగాఁగ' వ్రా. ప్ర. 3 గడుసమర్పణ. 4 వాగ్రూపమున నరు, అందు నుండి. 5 డాచక్రతీర్థంబునం.

(హరివిలోకనవ్యాకులచిత్తయై) దిగ్గన నుఱికి గగనంబునకు [1]నెగిరి యుపగతతృష యగుచు నది నుల్లంఘించు నెడ నధికభయంబునం జేసి యాగర్భంబు యోనిద్వారంబున గళితంబై జలంబులం బడియె నాహరిణి(యుల్లంఘనాదిభయంబునం జేసి) తత్తీరంబున (నుండుగిరిదరిం బడి) శరీరంబుఁ బాసె నంత నాహరిణపోతంబు జలంబులం దేలుచున్న భరతుండు గను విచ్చి చూచి కరుణార్ద్రచిత్తుండై (మృతజనని యగునా)హరిణపోతంబును దనయాశ్రమంబునకుం గొంపోయి మిక్కిలి ప్రీతి సేసి యుపలాలనంబు సేయుచుండఁ బోషణపాలనప్రీణనలాలనానుధ్యానంబుల భరతునకు నాత్మనియమంబులైన యష్టాంగయోగంబులును [2]బరమపురుషపూజాపరిచర్యాదులు నొక్కొక్కటిగఁ గ్రమక్రమంబునం గొన్నిదినంబులకు సమస్తంబును నుత్సన్నం బయ్యె నంత. 101

క. ఘనతపము చలన మొందుట,యును భరతుం డెఱుఁగ కాత్మయోగంబునఁ జ
య్యనఁ బాసె హరిణపోతముఁ, దనమదిలోఁ బ్రీతిఁ జేసి తప్పక పలికెన్. 102

ఉ. అక్కట తల్లిఁ బాసి హరిణార్భక మాప్తులు లేమిఁ జేసి యే
దిక్కును లేక యున్న నిట దెచ్చితి నాయెడ నీమృగార్భకం
బెక్కుడుప్రేమ సేసి చరియించుచు నున్నది నాదుసన్నిధిన్
మక్కువ చేసి దీనిఁ గడుమన్ననలం దగఁ బ్రోతు నెంతయున్. 103

క. శరణని వచ్చినజంతువుఁ, గరుణం గను విచ్చి చూచి కాంచినఁ బుణ్యం
బరయఁగ నధికం బని ము, న్నెఱిఁగించిరి సన్మునీంద్రు లెల్లం బ్రేమన్. 104

వ. అని యిట్లు హరిణపోతంబుం దనయాశ్రమంబున [3]నత్యాసక్తిం జేసి యాసనశయనాటనస్నానసమిత్కుశకుసుమఫలపలాశమూలోదకాహరణదేవపూజాజపాదుల యెడం దనయొద్దన యునిచికొనుచు వృకసాలావృకాదిక్రూరమృగంబులవలని భయంబున వనంబుల వెనువెంటం దిరుగుచు (నధికప్రణయభరపరీతహృదయుం డగుచు నతిస్నేహంబునం జేసి కొంతసేపు స్కంధంబుల వహించుచు మఱి కొంతతడ వురంబున నుత్సంగంబున నుంచికొని లాలించుచు సంతసంబు నొందు మఱియు నాభరతుండు నిత్యనైమిత్తికాదిక్రియాకలాపంబు నిర్వర్తించు నెడ నంత నంత లేచి హరిణకుణకంబుఁ జూచుచుఁ గించిత్స్వస్థహృదయుం డై దాని నాశీఃపరంపరల నభినందించుచుఁ జుంబనాదులం బ్రీతిసేయుచు) నతిమోహంబునం బెంచు చుండు నెడ. 105

చ. [4]గురువులువాఱి బిట్టుఱికి కొమ్ములఁ జిమ్ముచు నంత నంత డ
గ్గఱుచును గాలు ద్రవ్వుచు నఖంబుల గీఱుచు గాసి సేయుచు
న్నొఱగుచు ధారుణీశ్వరునియూరువులన్ శయనించి యంతలో

---

1 'నెగసిపడిన గర్భంబు స్రవించి జలం. 2 జలనంబు నొందె నంత' వ్రా. ప్ర. 3 కుం గొని చని స్నానసమి. 4 ఇది యచ్చుప్రతుల లేదు.

నఱకడ మెక్కుచుం బొదలి యాడుచు నాహరిణంబు లీలతోన్. 106

తే. గరిమ నీగతి మెల్లన కెరలు వొడిచి, చెలఁగి యాడంగ భరతుండు చిత్తమందు
సంతసిల్లుచునుండె నాశ్రమముఁ బాసి, హరిణడింభక మంతలో నుటికి చనియె.

వ. భరతుం డంతం దన్మృగశాబకంబు గానంబడమికి (వ్యాకులితచిత్తుం డగుచు నష్టధనుండునుంబోలె నతిదీనుం డై కరుణతోడం గూడి తద్విరహవిహ్వలమతి యై దానిన తలంచుచు నతిశోకంబుతో) మనంబున దుఃఖించి యి ట్లనియె. 108

తే. హరిణపోతంబ నీకు వనాంతమందుఁ
క్రూరమృగబాధ లేకుండఁ గోరుచుండఁ
దలఁగి పోయితె యనుచుఁ జిత్తంబునందు
రాజవృషభుండు భరతుఁ డారాట మంది. 109

తే. తల్లి చచ్చినహరిణ్యపోతంబు వచ్చి, పుణ్యహీనుండ నగునన్నుఁ బొంది పాసె
నేమి సేయుదు నే నింక నెట్లు గందుఁ, జేరి యేరీతిఁ గాంచి రక్షించుకొందు.

క. కట్టా యీయాశ్రమమునఁ, బుట్టినతృణవల్లి మేసి పొదలినహరిణం
బి ట్టట్టుఁ దిరుగుచుండఁగఁ, బట్టి మృగేంద్రుండు గొట్టి బాధించె నొకో. 111

వ. ఇట్లు భరతుండు హరిణకుణకక్షేమంబు గోరుచు నెప్పుడు వచ్చి నన్ను సంతోషపఱచు నానాప్రకారంబు లైనతనగతులచేత నన్ను నెప్పు డానందంబు నొందించు ధ్యానసమాధి నున్నప్పుడు నన్నుఁ గొమ్ముల గోఁకుచు నుండునట్టివినోదంబు లెప్పుడు గనుఁగొందు దేవపూజాద్రవ్యంబులు ద్రొక్కి మూర్కొనిసం గోపించి చూచినం గుమారుండునుంబోలె దూరంబునకుం జని నిలిచి మరల నేఁ బిలిచిన వెనుక నిలిచి యుండు నిట్టిమెలఁకువస్వభావంబులు గలుగుట యెట్టు లీభూదేవి యెంతతపంబు చేసినదియో యాహరిణపాదస్పర్శంబులం బవిత్ర యైనభూమి స్వర్గాపవర్గకాము లైనమునులకు యజ్ఞార్హ యగు నట్టిహరిణపోతంబు నెట్లు గనుఁగొందు. నదియునుం గాక భగవంతుం డగుచంద్రుండు [1]మృగపతిభయంబున మృతజననియు స్వాశ్రమపరిభ్రష్టంబు నైనమృగశాబకంబును గొనిపోయి పెంచుచున్నవాఁడో మున్ను పుత్రవియోగతాపంబునం జంద్రకిరణంబులం బాపుదు నిపుడు హరిణపోతంబు దనశరీరస్పర్శం జేసి కళానిధికిరణంబులకన్న నధికం బగుచుం బుత్రవియోగతాపంబు నివర్తింపం జేసె ననుచుం బెక్కుభంగుల హరిణనిమిత్తంబు లైనమనోరథంబులచేతం బూర్వకర్మవశంబున యోగభ్రష్టుం డగుభరతుండు [2]భగవదారాధనంబువలన విభ్రంశితుం డగుచు నితరజాతిం బుట్టినహరిణపోతంబుమీఁదిమోహం బగ్గలం బగుచుండ నుండె నని పలికి శుకయోగీంద్రుండు మఱియు ని ట్లనియె. 112

సీ. జననాథ మున్ను మోక్షవిరోధ మని పాయఁ, గారానిపుత్రాదికంబు నెల్లఁ

---

1 'తనయాశ్రమంబునకుం గొని పోయి. 2 హరిసేవం బాసి యితరజాతిం.

బాసి తపస్వి యై ≀ భరతుండు హరిణశా,బకపోషణంబునఁ ≀ బాలనమున
నటలాలనప్రీణ≀నానుషంగంబుల,మూషికబిల మతి≀రోషమునను
సర్పంబు సొచ్చిన।చందంబునను యోగ,విఘ్నంబు మిక్కిలి ≀ విస్తరిల్లెఁ

ఆ. గాన యెంతవాని ≀ కైనను గాలంబు, గడవ రామి నట్లు ≀ గాక పోదు
పరమమునుల కైనఁ ≀ బాయవు కర్మంబు, లూరు లనంగ నెంత ≀ నరవరేణ్య.

వ. ఇట్లు భరతుండు మృగవియోగతాపంబు నొందు చుండునెడ నామృగశాబకంబు సనుదెంచిన సంతసిల్లు చుండె నంత నొక్కనాఁడు. 113

మ. భరతుం డల్లన యంత్యకాలము వెసం ≀ బ్రాపింపఁగా నప్పు డా
హరిణంబుం గడుభక్తిఁ [1]బుత్రుగతి న≀త్యాసక్తి వీక్షింప నా
హరిణంబుం దనయాత్మలో నిలిపి దే≀హం బంతటం బాసి తా
హరిణీగర్భమునన్ జనించి హరిణం ≀ బై యొప్పెఁ బూర్వస్మృతిన్. 114

వ. ఇట్లు భరతుండు హరిణీగర్భంబునం బుట్టియు భగవదారాధనసామర్థ్యంబునం దనమృగత్వకారణంబుఁ దెలిసి కడుం దాపంబు నొందుచు ని ట్లనియె. 115

ఉ. రాజులు ప్రస్తుతింప సుర≀రాజసమానుఁడ నై తనూజులన్
రాజులఁ జేసి తాపసులు ≀ రాజఋషీంద్రుఁ డటంచుఁ బల్కఁగాఁ
దేజము నొంది యాహరిణ≀దేహమునందలిప్రీతిఁ జేసి నా
యోజ [2]సెడంగ నేఁ జెడితి ≀ యోగిజనంబులలోన బేల నై. 116

వ. ఇట్లు శ్రీహరి[3]శ్రవణమననసంకీర్తనారాధనానుసరణాభియోగంబులం జేసియశూన్యసకలయామం బగుకాలంబు గలనాఁడు హరిణపోతస్మరణంబుకతంబున యోగవిఘ్నంబు ప్రాప్తం బయ్యె మోక్షదూరుండ నైతి నని (నిగూఢనిర్వేదుం డగుచుఁ) దల్లిం బాసి క్రమ్మఱ (నుపశమశీల)మునిగణసేవితం బయి భగవత్క్షేత్రం బైన సాల (తరునిబిడతమ) గ్రామపర్వతసమీపపులస్త్యపులహాశ్రమంబులకుం (గాలాంజనపర్వతంబువలనఁ) జనుదెంచి యందు మృగత్వావసానంబు గోరుచు (సంగంబు విడిచి యేకాకి యగుచు) శుష్కపర్ణతృణవీరుదాహారుండై (మృగత్వనిమిత్తం బగునానదీ)తీర్థంబునందు (నవసానంబుగోరుచుఁ దత్తీర్థోదకక్లిన్నం బగుచు నుండు)శరీరంబు విడిచె నని శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకు వినిపించి మఱియు ని ట్లనియె. 117

భరతుండు హరిణజన్మంబు విడిచి బ్రాహ్మణుం డై జనించుట.

సీ. హరిణదేహముఁ బాసి ≀ యంత నాంగీరసా,న్వయుఁడు పవిత్రుండు ≀ వంశకరుఁడు
శమదమఘనతపః≀స్వాధ్యాయనిరతుండు, గుణగరిష్ఠుఁడు నీతి≀కోవిదుండు
నైనబ్రాహ్మణునకు ≀ నాత్మజుం డై పుట్టి, సంగంబువలనను ≀ జకితుఁ డగుచుఁ

1 'బుత్రునిగతి న్లాలించి వీక్షించుచున్. 2. సె డుండితిన్ భరను' వ్రా. ప్ర. 3 'యారాధనానుస్మరణయోగంబులం జేసి యెల్ల కాలంబునుం గలనాఁడు.

కర్మబంధంబుల ఖండింపఁ జాలునీశ్వరుని నచ్యుతు నజు శ్రవణమనన [నీక
తే. ములను హరిచరణధ్యానములను విఘ్న, భయమునను జేసి మనమందుఁ బాయ
నిలిపి సంస్తుతిసేయుచు నిలిచియుండె, భరితయశుఁడైన భరతుండు పార్థివేంద్ర.

వ. ఇట్లాంగిరసుండు ప్రథమభార్యయందుఁ బుత్రనవకంబును గనిష్ఠభార్యయందు స్త్రీపురుషుల నిద్దఱను గలుగంజేసిన నందుఁ బురుషుండు పరమభాగవతుండును రాజర్షిప్రవరుండును నుత్సృష్టమృగశరీరుండును జరమశరీరంబునం బ్రాప్తవిప్రశరీరుండును నగుభరతుం డయ్యె నతం డాజన్మంబున నన్యజనసంగంబు జన్మపరంపరలకుఁ గారణం బని యత్యంతభయంబు నొంది కర్మబంధవిధ్వంసనశ్రవణస్మరణాదుల శ్రీహరియనుగ్రహంబునం బూర్వజన్మపరంపరల సంస్మరించుచుఁ దనస్వరూపంబు నున్మత్తజడాంధబధిరరూపంబుల లోకులకుం జూపుచుండె నంత.

మ. జనకుం [1]డాంగిరసుండు నాత్మజుని వాత్సల్యంబునం బెంచుచుం
దనరం [2]జౌలముఖాగ్రకర్మములచేతన్ సంస్కృతుం జేసి పా
యనిమోహంబున నిచ్చలుం గడఁక శౌచాచారముల్ సెప్పినన్
ఘనుఁ [3]డా భాగవతుం డసమ్మతిని దత్కార్యంబులం గైకొనెన్. 120

వ. ఇట్లు బ్రాహ్మణకుమారుండు గర్మంబులయందు నిచ్ఛ లేక యుండియును బితృనియోగనిర్బంధంబునం (బితృసన్నిధియందె యసమీచీనంబుగా వ్యాహృతిప్రణవశిరస్సహితం బగునట్లు) గాయత్రీమంత్రోపదేశంబు నొంది [4]చైత్రాదిచతుర్మాసంబుల సమవేతంబుగ వేదంబుల నధ్యయనంబు సేయుచుండె జనకుం డాత్మజుని శిష్టాచారంబుచే శిక్షింపవలయు ననులోకాచారంబు ననువర్తించి (మాత్మభూతుం డగునాత్మజునందు నభినివేశితచిత్తుం డగుచు శౌచాచమనాధ్యయనవ్రతనియమగుర్వనలశుశ్రూషణాదికంబు లనభియుక్తంబు లగునం బుత్రునిచే నొనరింపించుచు నప్రాప్తమనోరథుం డయ్యె నంత). 121

క. ఈరీతిని గొడుకున కాచారంబులు గఱపి చింత సద్గృహమున సం
సారి యగుచుండి విప్రుఁడు, భోరన దేహంబుఁ బాసి పోయెను మీఁదన్. 122

ఆ. తల్లి తండ్రితోడఁ దా నగ్నిఁ జొచ్చిన, నతనిమహిమ లెఱుఁగ కంతలోన
సవతితల్లికొడుకు లవివేకు లగుచును, శాస్త్రవిద్య లతనిఁ జదువ నీక. 123

వ. ఇట్లు బ్రాహ్మణకుమారుని సవతితల్లికొడుకులు వేదవిద్యలవలనం బాపి గృహకర్మంబుల నతని నియమించిన. 124

క. ధరణీసురోత్తముఁడు దా, నరుదుగఁ దమవారు సెప్పినవి యెల్లను నే
మఱ కందుఁ బ్రీతి సేయక, నిరతము గృహకర్మములు నెఱపుచు నుండెన్.

వ. ఇట్లు గృహకర్మప్రవర్తనుం డగుచు (నుండ మూఢు లగుద్విపాత్పశువులచే

1 'డాటను విప్రుఁ డాతనిని వాత్స. 2 గాఁ జవులాదికర్మములచేతం బ్రీతిఁ బుట్టించి. 3 డావి ప్రసుతుండు గైకొనియె సత్కార్యంబులన్ భూవరా' 4 యనుష్ఠాత యై యధ్యయ. బ్రా. ప్ర.

నున్మత్త జడ బధిర యని యాహూయమానుం డగునపుడు తదనురూపంబు లగుసంభాషణంబుల నొనర్చుచుఁ బరేచ్ఛాయదృచ్ఛలం జేసి విష్టివేతనయాచ్ఞాదులవలన నియుక్తకర్మంబులం బ్రవర్తించుచు.) 126

తే. అతులమృష్టాన్న మైన శుష్కాన్న మైన
నెద్ది వెట్టిన జిహ్వకు హితవు గాను
దలఁచి భక్షించుఁ గాకొండుఁ దలఁచి మిగులఁ
బ్రీతి సేయఁడు రుచులందుఁ బెంపుతోడ. 127

వ. మఱియు నావిప్రుం డుత్పత్తి నిత్యానందసుఖలాభంబు గలిగి దుఃఖసుఖంబుల యందు దేహాభిమానంబు సేయక శీతోష్ణవాతవర్షాతపంబులకు నోడి పైచీర గప్పక వృషభంబునుంబోలెఁ (బీనుండును గఠినాంగుండును నగుచు) స్థండిలశాయి యై [1]రజఃపటలంబునం గప్పంబడినదివ్యమాణిక్యంబునుంబోలె ననభివ్యక్తబ్రహ్మవర్చసుం డై మలినాంబరపరీతకటితటుండును నతిమలినయజ్ఞోపవీతుండు నగుటం జేసి యజ్ఞజనంబు లితండు బ్రాహ్మణాభాసుండు మందుండు నని పలుక సంచరించుచు(నుండం గర్మమూలంబునం బరులవలన నాహారంబు గొనునపుడు) దమవారును నియమించినవ్యవసాయకర్మంబునందు [2]క్షేత్రవిహితసమవిషమన్యూనాధికంబుల నెఱుంగక ప్రవర్తింపుచు నూకఁ దవుడు పెలికపిండి పొట్టు మాడు ద్రబ్బెడ యాదిగాఁ గలద్రవ్యంబులయందు నరుచి సేయక యమృతసమానంబుగా భక్షించుచుం జేనికావలి యుండునెడ నొక్కనాఁడు. 128

వృషలరాజభృత్యులు కాళికికి భరతుని గొంపోవుట.

క. పురిలోన వృషలపతి దా, నరుదుగ సంతానకాముఁ డై వేడుకతోఁ
బురుషుఁ డగుపశువుఁ గాళికిఁ, గఱుముక గొనిపోవఁ బశువు దలఁగిన భృత్యుల్.

ఆ. అరసి కాన లేక యారాత్రి వీరాసనమునఁ జేనికావు విమలబుద్ధి
నున్నవిప్రయోగి నొయ్యన పొడగాంచి, పశువు మంచి దనుచుఁ బట్టి రతని.

క. ఆరీతిని భూసురవరు, నారయ నాకాళికాగృహమునకు భృత్యుల్
బోరనఁ గొనిచని నప్పిరి, చారుతరాభ్యంజనాదిసంస్కారంబుల్. 131

వ. ఇట్లభ్యంజనాదికృత్యంబులు దీర్చి నూతనవసనంబు గట్ట నిచ్చి గంధపుష్పాభరణాక్షతాలంకృతునిం జేసి మృష్టాన్నంబులు భుజియింపం బెట్టి ధూపదీప(మాల్యలాజకిసలయాంకురఫలోపహారా)దులు సమర్పించి పంచమహావాద్యఘోషంబుల తోడ నాపురుషపశువుం గాళికాదేవిసమ్ముఖంబున నాసీనుం గావించి రావృషలపతి పురుషపశురక్తంబున భద్రకాళి సంతోషపెట్టం దలంచి కాళికామం

1 రజోనికరంబునఁ గప్పంబడినమాణిక్యంబుంబోలె బ్రహ్మవిద్య గలిగి సర్వజనంబు లితండు నష్టబ్రహ్మణ్యుం డని మందుం డని పలుక. 2. క్షేత్రసమవిషమపాతంబు లెఱుంగక.

త్రాభిమంత్రితంబు (నతికరాళంబు) నైనఖడ్గం బంది (నిజాభీష్టసిద్ధికి) హింసింపం
దలంచిన. 132

సీ. సర్వభూతములకు [1]సఖుఁడును బ్రహ్మభూ, తాత్ముఁడు నిర్వైరుఁ డయిన బ్రహ్మ
సుతుని తేజం బంతఁ జూడ దుస్సహ మైన, భయ మంది వడఁకుచు భద్రకాళి
క్రోధంబు ముమ్మడిగొనఁగ హుంకారంబు, సలుపుచు నట్టహాసంబు సేసి
పాపాత్ములును దౌష్ట్యపరులును రాజస, తామసకర్మసంధాను లగుచు
తే. విప్రవరు నట్లుహింసించు వృషలపతిని, భృత్యవర్గంబుఁదోఁదలల్ పృథ్విఁగూల్చి
యపుడు వృషలాధిపునిశిరమంది లీలఁ, బాడి యాడుచు నందంద క్రీడసలిపె.

క. ధరలోన నెవ్వ రేనియు, ధరణీసురవరుల కెగ్గుఁ దలఁచిర యేనిన్
నెరయంగఁ దార చెడుదురు, హరి ధరణీసురవరేణ్యులం దుండుటచేన్. 134

వ. మఱియును. 135

ఉ. అచ్చట విప్రసూనుఁడు భయం బొకయించుక లేక చంపఁగా
వచ్చినవారియందుఁ గరవాలమునందును గాలియందుఁ దా
నచ్యుతభావ ముంచి హృదయంబునఁ బద్మదళాక్షు నెంతయున్
మచ్చికతోడ నిల్పి యనుమానము నొందక యుండె నెంతయున్. 136

వ. మఱియు నావిప్రవరుండు చండికాగృహంబు వెలువడి క్రమ్మఱం జని కావలి
యుండునెడ. 137

సీ. అంతటఁ గొన్నిహాయనములు సన సింధు, భూపాలనము సేయుభూవరుండు
ధీరత నిక్షుమతీతీరమున నున్న, కపిలమహామునిఁ గాంచి తత్త్వ
విజ్ఞాన మెఱిఁగెడువేడ్కతోడుత శిబి, కారోహణము చేసి యరుగు చుండ
నాలోన నాశిబి[2]కావహులు లాచేసఁ, గా పున్నవిప్రునిఁ గాంచి తెచ్చి
తే. శిబిక మోపింత మీతనిచేత ననుచుఁ, బట్టి మూఁపునఁ బల్లకిఁ బెట్టి మోవు
మనుచు మోపించునంత ధరామరుండు, శిబిక మూఁపున నిడి యనుఁజింత లేక.

క. తనమనసుకోలఁది నప్పుడు, మునుకొని యట్లప్రయత్నమున నడవఁగ నా
జనపతి నిమ్నోన్నత మై, చనుట యెఱిఁగి శిబిక మోచుజనులకు ననియెన్.

ఆ. మీర లిప్పుడిచటఁ జేరి మిక్కిలి ప్రయత్నంబుతోడఁ దగిలి నడచు చుండ
విషమ మగుచు గమనవేగంబు నను బాధఁ, బెట్టుచున్న దనిన బెస్తలనిరి.

వ. దేవా యీవిషమగమనంబు మావలన నైనది గా [3]దితురీయవాహకుండు సుఖ
గమనంబు గా [4]నడవ నేరండు వీనితోడ మేము నడవ నేర మనిన రహూగణుం
డనునారా జు(పాసితవృద్ధజనుం డైనను బలాత్కారంబునం బుట్టినకోపంబునం)
గోపించి విమర్శ దప్పి నీఱు గప్పిననిప్పునుంబోలె నెఱుంగ రాని బ్రహ్మతేజంబు

---

1 'సముఁడునెచ్చెలియును, నా బ్రహ్మఋషిసుతుం డైనవిప్ర. 2 కారోహకులు చేనికాపున్న
3 దివింతవాఁడు. 4 నడవం డనిన నారాజు' వ్రా. ప్ర.

గలబ్రాహ్మణునికిం గంటకంబుగా నిష్ఠురవాక్యంబుల నిట్లనియె. 141

చ. అలసితి వెంతయుఁ ముసలి వాఁకట డస్సితి [1]వెన్ను మిక్కిలిం
బలుచన యున్న దీశిబికభారము దూరము మోసి తేగతిన్
నిలిచెద వంచు భూవరుఁడు నిష్ఠురముల్ దగఁ బల్క నాయెడం
బలుకక మోసె నాశిబిక బ్రాహ్మణవర్యుఁడు పార్థివేశ్వరా. 142

వ. అప్పు డవ్విప్రవరుండు దనకుం గడపటిశరీరం బయినకళేబరంబునందు నహంకారమమకారంబులం బొంద నీక మిథ్యాజ్ఞానరహితుం డై బ్రహ్మ[2]భూతుం డై మానవ్రతంబున నాశిబిక మోచు చున్నవిషమగమనంబుఁ జూచి యతికుపితుం డగుచు నాభూవరుండు వెండియు నిట్లనియె. 143

సీ. ఓరిమర్త్యుఁడ వినవోరిజీవన్మృత, నాయాజ్ఞఁ దప్పించి నడచె దీవు
నీవక్రమార్గంబు లిన్నియు విడిపించి, నడపింతు నిన్ను సన్మార్గమందు
నని రాజగర్వాంధుఁ డగుచు గుణత్రయం,బున వృద్ధిఁ బొందినభూవరుం డ
బద్ధప్రలాపముల్ వల్కుచుండినఁ జూచి, శమదమాదులచేఁ బ్రశస్తుఁ డగుచు

తే. జగతి బ్రహ్మస్వరూప మై సకలభూత,ములకు నత్యంతహితుఁ డైనభూసురుండు
యోగివర్తన దెలియ లేకున్నరాజు, నంత వీక్షించి యల్ల నిట్లనుచుఁ బలికె.

భరతుండు రహూగణునిమాటలకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట.

వ. నరేంద్రా నీవు సెప్పనది సత్యంబు భారం బీశరీరంబునకే కాని నాకుం గలుగ నేర దైనను స్థౌల్యకార్శ్యంబులు వ్యాధులు నాధులు క్షుత్తృష్ణలు నిచ్ఛావిరోధ భయంబులు జరామరణంబులు రోషనిద్రాజాగరణంబులు నహంకారమమకార మదశోషణాదులును దేహంబుతోడన జనియించుం గాని నాకుం గలుగ నేరవు జీవన్మృతుండ నేన కా(దాద్యంతంబులు గలుగుటం జేసి)యందఱయందును గలిగి యుండు స్వామిభృత్యసంబంధంబులు విధికృతంబు లగుచు వ్యవహారంబులం జేసి శరీరంబులకుం గలుగుం గాని జీవునికి లేకయుండు నదియునుం గాక రాజాభిమానంబున నీవు నన్నాజ్ఞాపించెద వేనిం బ్రమత్తుండ నైననీకుం బూర్వస్వభావం బెట్లుండె నట్లు గాక యేనేమి సేయుదు నెఱింగింపు మున్మత్త(మూకాంధ)జడులుం బోలె సహజస్వభావంబునం బొందిననాయందు నీశిక్ష యేమిలాభంబుఁ బొందింప నేర్చు నదియునుం గాక స్తబ్ధుండు మత్తుండు నైననాకు నీశిక్ష వ్యర్థంబగు నని పలికి యుపశమశీలుం డైనమునివరుండు పూర్వకర్మశేషంబునం గల్గు భారవాహకత్వంబుం దలంగం ద్రోయుటకు భారంబు వహించి శిబిక మోచుచుం జనునెడ నారాజవల్లభుండు దత్త్వజ్ఞానాపేక్షితుం డై చనియెడివాఁ డగుటం దనహృదయగ్రంథివిమోచకంబులును బహుయోగగ్రంథసమ్మతంబులును నగుబ్రాహ్మణవాక్యంబులు విని యాశిబిక దిగ్గన డిగ్గ నుఱికి యావిప్రునికి

1 ‘మేను. 2 స్వరూపము గలిగి. 3 నెఱింగించెద నున్మత్త’ వ్రా. ప్ర.

సాష్టాంగదండప్రణామంబు లాచరించి సర్వగర్వవర్జితుం డై ముకుళితహస్తుం డగుచు ని ట్లనియె. 145

సీ. ధరణీసురులలోనఁ దలఁప నెవ్వఁడవు నీ, వవధూతవేషివై యవనియందు
నేమిటికై చరియింపఁగ వచ్చితి, చట నొక్కఁడవు నొంటి సనుట నేఁడు
నను గృతార్థునిఁ జేయ ననుకూలుఁడగుచున్న, యట్టియా కపిలమహామునీంద్రుఁ
డవో నీమహత్త్వంబు దవిలి విచారింప, నెఱుఁగక చేసితిఁ గరుణఁ జూడు

తే. తప్పు సైరింపు నే యమదండమునకు, హరునిశూలంబునకును వజ్రాయుధమున
కనలచంద్రార్కధనదశస్త్రాస్త్రములకు, వెఱవ విప్రుని కే మది వెఱచినట్లు.

వ. మఱియు నిస్సంగుండ వయి జడుండునుంబోలె నిగూఢవిజ్ఞానంబు గలిగి చరియించుచు నున్నవాఁడవు నీవచనంబులు యోగశాస్త్రసమానంబులై వాఙ్మనసంబులకు నభేద్యంబు లయి యున్న వే (సవిష్ణుకళావతీర్ణుండు సాక్షాద్ధరియు నగు)కపిలమహామునివలన బ్రహ్మవిద్య దెలియం గోరి చను చున్నవాఁడ నీవు లోకనిరీక్షణార్థం బవ్యక్తలింగుండవై చరియించుచున్న కపిలమహామునీంద్రుండవు గాఁ బోలుదువు మందుం డైన గృహస్థుండు యోగీశ్వరచరిత్రంబు లెట్లు లెఱుంగ నేర్చుఁ గర్మవశంబున దృష్టంబైన శ్రాంతి వహించుచు (నడచుచు)నున్న యీయాశ్రమంబు నాకు(నుంబోలె)[1] నీకు నగు నని తోఁచుచున్న దది యె ట్లనిన ఘటంబు లేక జలంబు దేరాని తెఱంగున లేనివి గలుగనేరవు గావునం బ్రమాణమూలం బయినలోకవ్యవహారంబు సత్పథంబున సమ్మతం బై యుండుటం జేసి నీ వాదువాక్యంబులు నాకు సమ్మతంబు గానేర వని సింధుదేశాధీశ్వరుండు వినిపించిన నావిప్రుండు లోకవ్యవహారంబునకు నిత్యత్వం [2]బాధాధికం బగుం గాని నిత్యంబు గా నేర దని దృష్టాంతనిదర్శనంబు గా ని ట్లనియె. 147

సీ. పావకశిఖలచే భాండంబు దాఁ దప్త, మగుఁ దప్తఘటముచే నందు నున్న
జలము తపించు నా జలముచేఁ దండులం,బులు తప్త మొంది యప్పుడు విశిష్ట
మైనయన్నం బగు నా చందమునను దా, దేహేంద్రియంబులఁ దెలివితోడ
నాశ్రయించుక యున్న యట్టిజీవునకు దే,హాంబునఁ బ్రాణేంద్రియాదికమున

ఆ. జరుగు చుండు నిట్లు సంసారఘటశిఖ, రక్షకుండ వయిన రాజు దుష్ట
కర్మములకుఁ బాసి కంజాక్షపదసేవఁ, జేసె నేని భవముఁ జెంద కుండు. 148

ఆ. అనుచు ధారుణీసురోత్తముఁ డీరీతిఁ, బలుకుటయును రాజు పరిణమించి
వినయవాక్యములను వినుతించి క్రమ్మఱఁ, బుద్ధుఁ డైన సింధుభూవరుండు.

వ. మహాత్మా నేను రాజ ననియెడియభిమానమదాంధుండనై మహాత్ములం దిరస్కరించిననన్నుఁ గరుణింపుము నీ వార్తబంధుండవు నీకృపాదృష్టిం జేసి మహాత్ముల నవమానంబు సేసినదురితంబువలన విముక్తుండ నయ్యెద విశ్వసుహృత్తవైన

1 'నీయది యని తోఁచు. 2 బాధోపితం బగుం' వ్రా. ప్ర.

నీకుం గోపంబు గలుగ నేర దసమర్థు లయిన మాబోఁటివారలు మహాజనావమానంబున శీఘ్రంబ నశింతురు గావున నీవు కృపాదృష్టి వయి నన్ను మన్నింపు మనిన నావిప్రుం డిట్లనియె. 150

క. కడు వేడ్క నీ వవిద్వాంసుఁడ వై యుండియును మిగులఁ జోద్యము విద్వాం
సుఁడుఁ బోలెను బలికెద వి,ప్పుడు మే లన వచ్చుఁ గొంత పురుషులలోనన్.

ఆ. పరఁగఁ బెద్ద లీ ప్రపంచ మంతయుఁ దథ్య, మనరు నీవు తథ్య మనుచుఁ బలికి
తట్లు గాన నిన్ను నధికుండ వని పల్క, రాదు నాకుఁ జూడ రాజచంద్ర. 152

సీ. యజ్ఞాదికములందు నామ్నాయములయందుఁ, దఱుచుగాఁ దత్త్వవాదంబు లేదు
స్వప్నంబునందుల సౌఖ్య మాకారంబు, నందుల నిత్య మై యంత లేని
యట్టిచందమున వేదాంతవాక్యంబులు, తత్త్వంబు నెఱిఁగించి తలఁగుఁ గాని
నిత్యంబు లై యుండ నేరవు పురుషుని,చిత్తంబు గుణములఁ జెంది యెంత

తే. కాల ముండును మఱి యంత కాలమందు, నరయ విజ్ఞానకర్మేంద్రియములచేత
మరగి ధర్మంబులను నధర్మంబు లట్లు, దగిలి పుట్టించుచుండు నత్యంతమహిమ.

వ. మఱియు ధర్మాధర్మవాసనాయుక్తంబు విషయానురక్తంబు నైనచిత్తంబు గుణప్రవాహంబులచేత వికారంబు నొంది దేవతిర్యఙ్మనుష్యరూపంబు లయిన దేహంబులం బుట్టించుచుఁ గాలప్రాప్తంబు లైనసుఖదుఃఖతదుభయఫలంబుల ననుభవించుచు ననవరతంబు జీవునికిం బ్రత్యక్షం బగుచు స్థూలసూక్ష్మరూపంబుల నుండు స్వాంతంబు గుణరహితం బైన ముక్తికారణం బగు ఘృతవర్తులు గలదీపంబు సధూమశిఖలం బుట్టించు ఘృతవర్తులు నాశంబు నొందిన స్వరూపంబుఁ బొందు నీతెఱంగున మనంబు గుణకర్మానుబంధం బైన నీజన్మాదులం బుట్టించు గుణకర్మంబులం బాసె నేనిం బరతత్త్వంబు నొందు జ్ఞానేంద్రియంబు లేనును విషయంబులమీఁదఁ దోఁచు బుద్ధు లేనును నభిమానంబును నను నేకాదశవృత్తులం గూడినమనంబు జీవునికి నసంఖ్యంబు లయినజన్మంబులఁ బొందించు మనోవృత్తుల నతిక్రమించిన జీవుండు పరంజ్యోతి యైననారాయణస్వరూపంబుగా నెఱుంగుము స్థావరజంగమంబు లయినజీవులకుం బవనుండు ప్రాణం బై యున్నచందంబున నీశ్వరుండు సర్వభూతాంతర్యామి యగుచు జీవాత్మస్వరూపంబున నుండు జీవాత్ముండు జ్ఞానోదయంబునం జేసి మాయ నెంతకాలంబు గెలువ కుండు నంతకాలంబు ముక్తసంగుఁడు గాఁ డరిషడ్వర్గంబును జయించి పరతత్త్వంబు నెఱింగిన నీశ్వరుం డగుఁ జిత్తం బెంతకాలంబు విషయాసక్తం బగు నంతదడవు సంసారచక్రంబునందు సంచరించుం గావున మహావీరుండ వైనను దనకు శత్రు వైనమనంబు నప్రమత్తుం డయి యిచ్ఛావిహారంబున జరగ నీక పరమగురుం డైనశ్రీహరిచరణోపాసనాస్త్రంబునం జిత్తంబు గెలిచినం బరతత్త్వంబు నొందు నని విప్రుండు వలికిన నతనిమహిమకు వెఱఁ గంది బ్రాహ్మణు

నకు నమస్కారంబు సేయుచు భూవరుం డిట్లనియె. 154

ఉ. కారణవిగ్రహంబు నుతకాయము నీయవధూతవేషమున్
భూరిధరామరత్వమును బూర్వసమాగమ మాత్మభావమున్
జారువిహారము న్నుతులశాంతిగుణంబును గూఢవర్తనం
బారయఁ గల్గునీకు ననయంబును మ్రొక్కెదఁ బెక్కుభంగులన్. 155

మ. జ్వరితార్తుం డగురోగి కౌషధ మతీష్టం బైనచందంబునన్
[1]ధరలో నాతపతప్తదేహి కడుశీతం బైనతోయంబునున్
గరిమం గోరినరీతి నెంతయు నహంకారాహిదష్టుండ నై
పరఁగున్ నాకును నీవచోమృతము దప్పన్ మందు వే యున్నదే. 156

ఆ. విప్రవర్య నేను వేడ్కతో నాసంశ,యంబు లెల్ల నిన్ను నడిగి తెలియఁ
దలఁచి యున్నవాఁడఁ దప్పక యెఱింగింపు, ముచితవృత్తిఁ దత్త్వయోగ మెల్ల.

వ. (అని యడిగినయారాజునకు విప్రుం డిట్లనియె.) 158

తే. కాన వచ్చినఫలములు కర్మమూల, మగుటఁ జేసియు సంసారమందుఁ జిత్త
మెపుడు వర్తించుచుండఁగా నెఱుఁగ లేవు, తత్త్వయోగంబుమిగులనిత్యంబటంచు.

వ. [2]మఱియు నీవసుంధర నున్నచరణంబులకు నెక్కుడు జంఘ లామీఁద జానువు లాపాడవున నూరువు లందులకు నుపరిప్రదేశంబున మధ్యం బటమీఁద నుర మందులకు నెక్కువ కంఠం బటమీఁద స్కంధం బందుల దారు వాదారువున శిబిక శిబికయందు రాజ ననియెడియభిమానంబు గలిగి నీ వున్నవాఁడ విట్టిశోచ్యులయి కష్టదశం బొంది జనుల దయ లేక నిగ్రహించి నీవు ప్రజాపాలనంబు సేయుచున్నవాఁడ ననుగర్వంబున మావంటిమహాత్ములసభలలోనం బూజ్యుండవు గాక యున్నవాఁడ వీస్థావరజంగమంబులకు నివాసస్థానంబు వసుంధర యైనచందంబున సత్క్రియలచేత నెఱుఁగం [3]దగినజగత్కారణం బైనతత్త్వంబు నెఱింగించెదఁ బరమాణుసముదయం బీధరిత్రి యైనచందంబున [4]నవిద్యామనంబులచేతం గల్పితం బయినకృశస్థూలబృహదణుసదసజ్జీవాజీవద్రవ్యస్వభావాశయకాలనామబుద్ధిరూపం బైనమాయచే జగత్తు రెండవది యై కల్పింపంబడియె [5]బాహ్యాభ్యంతరంబులం గలిగి స్వప్రకాశంబై భగవచ్ఛబ్దవాచ్యంబును విశుద్ధంబును బరమార్థంబును జ్ఞానరూపంబును నైనబ్రహ్మం బొకటియ సత్యంబు జగత్తసత్యం

---

1 న్నరయ స్నాతపతప్తదేహి కడుశైత్యం బైనతోయంబునన్. 2 అని యాభ్యర్థించిన విప్రుం డిట్లనియె మఱియు. వ్రాఁతప్రతుల 158-వ వచనము లేదు. 158-వ పద్యము రహూగణుఁ జెప్పినది గాను నవ్వలి వచనము విప్రునిది గాను గానిపించుచున్నది. 3 వచ్చినవ్యవహారమూలంబు గలిగె నేని నెఱింగింపుము. 4 నవిద్యామయం బైన మనంబుచేతఁ. 5 బాహ్యాభ్యంతరపరిపూర్ణంబును శుద్ధజ్ఞానస్వరూపంబును బరమార్థంబు నేకంబును సత్యంబును బ్రహ్మరూపంబును భగవచ్ఛబ్దసంజ్ఞికంబు నైనశబ్దంబు వాసుదేవుం డని పెద్దలు పలుకుదు రని శూరసేనసింధుదేశాధీశుం డైనరాజున కెఱింగించి మఱియు.

బగు నని పలికి మఱియును. 160

సీ. ధరలోన బ్రహ్మంబుఁ దపమున దానంబు,లను గృహధర్మంబులను జలాగ్ని
సోమసూర్యులచేత శ్రుతులచే నైనను, బరమభాగవతులపాదసేవఁ
బొందినమాడ్కిని బొందంగ రా దని, పలుకుదు రార్యులుఁ బరమమునులు
ఘనతపోబాహ్యసౌఖ్యములకు విముఖులు, నయినట్టిపుణ్యులు హరిగుణాను
తే. మోదితాత్ములు నగుబుధపాదసేవ, ననుదినంబును జేసిన నంతమీఁద
మోక్షమార్గంబునకును బద్ధాత్మునందుఁ, బట్టు[1]వడియుండు నెప్పుడుఁ బరఁగ బుద్ధి.
వ. నరేంద్రా! నేను బూర్వంబున భరతుం డనురాజను సర్వసంగపరిత్యాగంబు సేసి భగవదారాధనంబు సేయుచు మృగంబుతోడిస్నేహంబుకతన మృగంబ నై పుట్టియు నందును హరిభక్తి దప్పకుండినకతంబున నిప్పుడు మనుష్యుండ నై మనుష్యసంసర్గంబును బాసి యేకాకి నై చరియించుచున్నవాఁడ నరుండు వృద్ధసంసేవం జేసి సంసారమోహంబును బాసి హరిధ్యానకథలచే లబ్ధజ్ఞానుం డై పుండరీకాక్షునిం బూజించుచుం బరలోకంబునం బొందు నని పలికి విప్రుండు మఱియు ని ట్లనియె. 162
సీ. ధరణీశ మాయచేతను దాఁటగా రాని, పథమునఁ బెట్టంగఁబడ్డజీవుఁ
డెలమిమై గుణకర్మములఁ జేయుచును లాభ, మాశించి తిరుగు బేహారిమాడ్కి
ఫల మపేక్షించుచుఁ బాయక జీవుండు, సంసారగహనసంచారి యగుచు
ననవరతము నుండు నామహావనమందుఁ, గామలోభాదితస్కరులు గూడి
తే. ధరణి విజితేంద్రియుఁడుగాని నరునిఁ బట్టి, ధర్మమనియెడియామహాధనము నెల్ల
నరసి కొనిపోవుచుండుదు రనుదినంబుఁ, గాన సంసారమందు నాకాంక్ష వలదు.
క. అరయఁగ సంసారాటవిఁ, దరలక యాపుత్రమిత్రదారాదు లనం
[2]బరఁగుచు నుండెడువృకములు, పరువడి నరబస్తములను భక్షించు వడిన్. 164
తరలము. మలసి సంసృతిఘోరకాననమందిరంబుల నెల్లచోఁ
జెలఁగి గుల్మలతాతృణాదులచేత గహ్వర మైనని
శ్చలనికుంజములందు దుర్జనసంజ్ఞలం గలమక్షికం
బులనిరోధము దన్ను సోఁకినఁ బొందు దుర్దశ నెప్పుడున్. 165
ఆ. మఱియు నీగృహస్థమార్గంబునం దెల్ల, విషయములను బొంది విశ్వ మెల్లఁ
గడఁకతోడ నిల్లు గంధర్వనగరంబుఁ, గాఁ దలంచి మిగులమోద మందు.
ఆ. మరగి కాననమునఁ గొఱవిదయ్యముఁ గాంచి, యగ్నిఁ గోరి వెంట నరుగుమాడ్కిఁ
గాంచనంబు గోరి కలవారియిండ్లపం, చలను దిరుగు నరుఁడు చలన మంది.
ఆ. బహుకుటుంబి యగుచు బహుధనాపేక్షచే, నెండమావులఁ గని యేఁగుమృగము

---

1 బుద్ధి నెప్పుడు భక్తి కలిగి. 2 బరఁగెడు-గోమాయువృకములు-మాయికవృకములు-పరువడి మానవునిఁ బట్టి భక్షించు.

కరణిఁ బేర్మిఁ జేసి గురువులు వాఱుచు, నొక్కచోట నిలువకుండు నెపుడు.

ఆ. మఱియు నొక్కచోట మత్తుఁడై పవనర, జోహతాత్ముఁ డగుచుఁ జూపు దప్పి
దిక్కెఱుంగ కొండుదిశ కేఁగుపురుషుని, కరణిఁ దిరుగు నరుఁడు నరవరేణ్య.

వ. మఱియు నొక్కచోట నులూకఝిల్లీస్వనంబులతోడ సమానంబు లయినశత్రు రాజతిరస్కారంబులకు దుఃఖపడుచు నొక్కచోట క్షుధార్దితుండై యపుణ్యఫల వృక్షంబుల నాశించుమాడ్కిఁ బాపకర్ములు ద్రవ్యహీనులు నగువారి నాశ్రయించుచు నొక్కయెడం బిపాసాతురుండై జలహీనం బయిననదికిఁ జనినరీతి నిహపరదూరుండైనపాషండుని సేవించుచు మఱియు నొక్కప్రదేశంబునం దగ్నిచేతం దప్తుం డయినవాఁడు దావాగ్నిం జేరి వ్యథ నొందురీతి నన్నార్థి యగుచు దాయాదులం జేరి దుఃఖించుచు మఱియు నొక్కచోటఁ బరబాధం జేసి మున్ను గొనక రాజ్యాభిలాషం బ్రాణసఖులైనపితృపుత్రభ్రాతృజ్యేష్ఠుల నైనను వధియించుచు మఱియు శూరులచేతం గొట్టువడి సర్వధనంబును బోనాడి చింతాపరవశుండై దుఃఖించుచు నున్నంత గంధర్వనగరప్రాయం బైనసంసారసుఖంబు ననుభవించి మోదించుచు మఱియు నగారోహణంబు సేయునరుండు గంటక పాషాణాదులవలనం బాధపీడితుం డగుచు దుఃఖించుచందంబున గృహాశ్రమోచితమహానుష్ఠానంబునకు నుపక్రమించి వ్యసనకంటకశర్కరాపీడితుండై దుఃఖించుచు నొక్కచోటఁ జఠరాగ్నిపీడితుండై కుటుంబంబుమీఁద నాగ్రహించుచు వనంబున నజగరదష్టుండై నిగీర్ణుండైనచందంబున రాత్రి గృహాటవియందు నిద్రాపరవశుండై యెఱుంగక వర్తించుచు మఱియును వనంబునఁ దృణచ్ఛన్నకూపపతితుం డగుచు సర్పదష్టుఁడైన తెఱంగున సంసారియై దుర్జనులచేత వ్యథితహృదయుం డగుచు నంధుండై యజ్ఞానాంధకూపంబునం బడుచు నొక్కయెడ జుంటితేనియకునై మక్షికాబాధ నత్యంతదుఃఖితుం డయినమాడ్కిని సంసారకాముండై పరదారద్రవ్యాభిలాషి యగుచు భూపాలకులచేత నైనను గృహపతిచేత నైనను దాడితుం డయి నరకంబునం బడుచు యౌవనంబున సంపాదించినద్రవ్యంబులు పరులచేతం బోనాడినవిధంబున శీతవాతాద్యనేక ప్రయాసలబ్ధం బైనధనంబు వోనాడి సంసారి యతిచింతాక్రాంతుండై యుండు మఱియును వనంబున లుబ్ధకులు సంసృష్టం బయినయల్పామిషంబునకు నన్యోన్య వైషమ్యంబునం గలహించినవిధంబున సంసృష్టవ్యవహారియై యల్పద్రవ్యంబులకుం బోరాడుచుండు నని భూపాలునకు విప్రుండు సంసారాటవి తెఱంగెఱింగించి వెండియు నిట్లనియె. 170

ఆ. అల్పధనుఁడు విశ్రమస్థానములఁ దృప్తిఁ, బొంద కొంగులధనముఁ బొందఁ గోరి
యరిగి వారివలన నవమానములఁ బొంది, యధికమైనదుఃఖ మనుభవించు.

ఆ. అంతఁ గొంద ఱల్ల నన్యోన్యవిత్తాది, వినిమయమునఁ గడుఁ బ్రవృద్ధ మైన

వైరములను బొంది పోరాట నొందుదు, రాత్మచింత లేక యనుదినంబు.

సీ. సంసారమార్గసంచారుఁ డై యధికప్రయాసంబునను గూర్చునర్థములను
విహరించుచును గొంద ఱిహలోకఫలములఁ, గోరుచు మోక్షంబుఁ గోర కంతఁ
జెడి పోవుచుందు రెప్పుడు గాని యందుకుఁ, గడపటియోగంబు గాన లేరు
మానవంతులు నసమానశౌర్యులు నగు, వారు మిక్కిలి యైన వైరబుద్ధి

తే. నాహవంబున మడియుదు రంతె కాని, మోక్షమార్గంబు గానరు మూఢవృత్తి
ననుచు సంసారగహనవిహార మెల్లఁ, దెలిసి క్రమ్మఱ ననియె ధాత్రీసురుండు.

వ. మఱియుం గాలచక్రనియంత్రితుం డై చక్రాయుధునిం గొల్వక కాకగృధ్రబక సమాను లైన పాషండులతోడిసఖ్యంబునం జేసి వారలచేత వంచితుం డై బ్రాహ్మణకులంబునం జేసి శ్రౌతస్మార్తకర్మానుష్ఠాన[1]పరుం డై విషయసుఖంబులందుఁ దగులము వడి కాలంబుతుద నెఱుంగక వృక్షంబులుం బోలె నైహికార్థంబులయందుఁ దృష్ణ గలిగి మైథుననిమిత్తంబు సుతదారాదులయందు స్నేహంబు సేయుచుఁ బథికుండు మాతంగంబులయందు భయంబున దీర్ఘనిమ్నకూపంబునం [2]బడిన తెఱంగున సంసారమృత్యుగజభయంబున గిరికందరప్రాయం బయిన యజ్ఞానతమంబునం బడుం గావున మాయచేత సంసారమార్గం బైన రాజభావంబు విడిచి సర్వభూతమైత్రి గలిగి జితేంద్రియుండ వై జ్ఞానాసిచే మార్గంబు కడపల గను మని పలికిన భూపాలుం డి ట్లనియె. 174

క. అక్కడ మానుష[3]జన్మము, పెక్కువ యై యుండు నెపుడు డభేదమతిం బెం
పెక్కిన యోగిసమాగమ, మక్కజముగఁ గలిగెనేని నఖిలాత్ములకున్. 175

క. ధరణీసురవర నీశ్రీ, చరణాంబుజయుగళరేణుసంస్పర్శము నా
దురితంబు లడఁచె నింతట, హరిభక్తియు నంతకంత కధికం బయ్యెన్. 176

వ. మఱియు విప్రవరులయందు యోగీశ్వరు లవధూతవేషంబునం జరియించుచుందురు గావున విప్రులు పిన్నపెద్ద లనక యందఱకు నమస్కారం బని స్తుతియించిన నా యోగీశ్వరుండును సింధుపతికిఁ గరుణాన్వితుం డగుచుఁ దత్త్వజ్ఞానం బుపదేశించి యా రాజుచేత వందితచరణుం డై పూర్ణార్ణవంబునుం బోలె సంపూర్ణకరుణారసపూరపూరితస్వాంతుం డై వసుంధరం జరియించు చుండె సింధుభూపతి

---

1 'పరత్వంబున భగవదారాధనంబు సేయుక విషయు. 2 బడుచుండి తత్కూపగతలతాగ్రహణంబున నాపద్విముక్తుం డైనచందంబున సంసారమయమృత్యుగజభయంబున గిరికందరప్రాయం బైనయజ్ఞానతమంబునం బడి కర్మవల్లు లవలంబించి పునర్భవంబునొందు సంసారప్రవర్తకుండు గావున మాయచేత-ఇట 'కర్మవల్లీ మవలంబ్య తత ఆపదః కథం చిన్నరకాద్విముక్తః పునరప్యేవం సంసారాధ్వని వర్తమానః' అనుమూలమునకుఁ దెనుఁగు గానిపించుచున్నది. అచ్చుప్రతులందు శోధకులు దీనిని గబళించిరి కాఁబోలు. 3 జన్మం, బెక్కువ యై యుండుఁ జాలహితమతితోఁ బెం' వ్రా. ప్ర.

యును సుజనసమాగమంబున లబ్ధతత్త్వజ్ఞానుం డయి దేహాత్మభ్రమం బాసె
నని పలికిన శుకయోగీంద్రునకుం బరీక్షిన్నరేంద్రుం డి ట్లనియె. 177

చ. అరయఁగ మక్షికంబు వినతాత్మజుఁ గూడఁగ లేనిరీతి యీ
భరతునిసచ్చరిత్రములు ప్రస్తుతి సేయఁగ నీవసుంధరన్
నరపతు లెల్ల నోపరు మనంబున నైనను నెంచ నింక నా
భరతునిపుణ్యవర్తనముఁ బ్రస్తుతి సేయఁగ నాకు శక్యమే. 178

వ. నరేంద్రా భరతుండు సుతదారరాజ్యాదులను బూర్వకాలంబునంద విడిచి భగ
వత్పరుం డగుచు యజ్ఞరూపంబును ధర్మస్వరూపంబును సాంఖ్యయోగంబును
బ్రకృతిపురుషస్వరూపంబును నైననారాయణునకు నమస్కారం బనుచు మృగ
రూపంబును బాసె నట్టిభరతునిచరిత్రం బెవ్వరు సెప్పిన నెవ్వరు వినిన నట్టి
వారలఁ బుండరీకాక్షుండు రక్షించు నాయురభివృద్ధి యగు ధనధాన్యసమృద్ధియు
నగు చుండ స్వర్గోపభోగంబులం బొందుదు రని. 179

మ. [1]నరదేవాసురయక్షరాక్షసమునీంద్రస్తుత్య దివ్యాంబరా
భరణాలంకృత భక్తవత్సల కృపాపారీణ వైకుంఠమం
దిర బృందావనభాసురప్రియ ధరిత్రీనాధ గోవింద శ్రీ
కర పుణ్యాకర వాసుదేవ త్రిజగత్కల్యాణ గోపాలకా. 180

క. పరమపదవాస దుష్కృత,హర కరుణాకర మహాత్మ హతదితిసుత భా
సురగోపికామనోహర, సరసిజదళనేత్ర భక్తజననుతగాత్రా. 181

మాలిని. సరసహృదయవాసా చారులక్ష్మీవిలాసా
భరితశుభచరిత్రా భాస్కరాబ్జారినేత్రా
నిరుపమఘనగాత్రా నిర్మలజ్ఞానపాత్రా
గురుతరభవదూరా గోపికాచిత్తచోరా. 182

గద్యము. ఇది సకలసుకవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్యప్రణీతం
బైన శ్రీమహాభాగవతపురాణంబునందుఁ బ్రియవ్రతునిసుజ్ఞానదీక్షయు బ్రహ్మ
దర్శనంబును నాగ్నీధ్రికులజన్మంబును నుత్తమతామసరైవతులజన్మంబును
బ్రియవ్రతుండు వనంబునకుం జనుటయు నాగ్నీధ్రుం డప్సరసం బరిగ్రహిం
చుటయు వర్షాధిపతులజన్మంబును నాగ్నీధ్రుండు వనంబునకుం జనుటయు నాభి
ప్రముఖులరాజ్యంబును నాభియజ్ఞంబును ఋషభునిజన్మంబును ఋషభునిరాజ్యా
భిషేకంబును భరతునిజన్మంబును ఋషభుండు దపంబునకుఁ జనుచు సుతులకు

---

1 ఈయాశ్వాసాంతగద్యపద్యములు పెక్కుప్రతులను గానిపింపవు. 179 వ గద్యమున 'బొం దుదు రని' యన్నపిదప 'సకలపురాణార్థవిజ్ఞాతుం డగుసూతుం డి ట్లనియె' నని యున్నది. కాన యీస్కంధ మేకాశ్వాసముగానే కొన్నిటఁ జూపట్టుచున్నది.

నతులజ్ఞానం బుపదేశించుటయు భరతునిపట్టాభిషేకంబును భరతుండు వనంబునకుఁ జనుటయు భరతుండు హరిణపోతంబునందలిప్రీతిం జేసి హరిణగర్భంబున జనియించుటయు మరల విప్రసుతుం డై జనియించుటయు విప్రుండు చండికాగృహంబున బ్రదికి వచ్చుటయు సింధుపతివిప్రసంవాదంబును ననుకథలు గల పంచమస్కంధంబునందుఁ బ్రథమాశ్వాసము. 183.

ఓం తత్స ద్బ్రహ్మార్పణ మస్తు.

శ్రీ ర స్తు

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీ మ దాం ధ్ర మ హా భా గ వ త ము

పం చ మ స్కం ధ ము

ద్వితీయాశ్వాసము.

శ్రీకాంతాహృదయప్రియ
లోకాలోకప్రచార లోకేశ్వర సు
శ్లోక భవభయనివారక
గోకులమందార నందగోపకుమారా. 1

వ. సకలపురాణార్థజ్ఞానవిఖ్యాతుం డగుసూతుం డి ట్లనియె. 2

క. మునులార బాదరాయణి, యనఘాత్మకుఁ డైనయుత్తరాత్మజునకు స
ద్వనయోక్తి భరతుచరితము, వినిపించుచు మఱియు నిట్లు వినిపించెఁ దగన్.

ఆ. పార్థివేంద్ర యిట్లు భరతాత్మజుం డైన, సుమతి ధర్మవర్తనమునఁ దిరుగ
నది యెఱింగి దుష్టు లైనపాషండులు, దమమతంబు మిగులఁ దలఁచి పొగడి.

క. ధరణీవల్లభ నిన్నును, నిరతంబును బుద్ధదేవు నిం గొలిచినయా
తెఱఁగునఁ గొలిచెద మని భూ,సురమతి బోధించి రపుడు సుమతిం బ్రీతిన్. 5

వ. ఇట్లు పాషండబోధితుం డైనసుమతికి ధ్రువసేనయందు దేవతాజిత్తనుపుత్త్రుండు జనించె వానికి దేవద్యుమ్నుం డనుసత్పుత్త్రుం డాసురియం దుదయించె నమ్మహాత్మునకు ధేనుమతియందుఁ బరమేష్ఠి జనియించె నాసత్యసంధునికి సువర్చలయందుఁ బ్రతీహుండు జనియించె నప్పరమపురుషుండు సకలజనులకు బ్రహ్మోపదేశంబు సేసి తాను శుద్ధాత్ముం డై హరినామస్మరణంబు సేయుచు [1]యజ్ఞకరణనిపుణు లగుప్రతిహర్తృప్రస్తోతోద్గాతృ లనుసత్పుత్త్రత్రయంబుం గాంచె నాప్రతిహర్తకు స్తుతియందు [2]వ్యోమభూమనామకపుత్త్రద్వయం బుత్పన్నం బయ్యె నందు

---

1 సువర్చలాదేవకుల్యావిరక్తులయందు యజ్ఞకర్తలయిన. 2 ప్రతిభూమునుం డనుతనయుండయ్యె నాస్థైర్యవంతునకు ఋషికుల్యయును దుద్గీతి పుత్రుం డయ్యె నాధర్మాత్మునకు దేవకుల్యయందుఁ బ్రస్తావుండనువాఁడు జనన మందె నాప్రస్తావునకు విరక్తయందు నతిపుణ్యుం డైనవిభుండు గలిగె నావిభునకు జరంతియందు హయశీర్షుఁ డనువాఁడు పుట్టె నాపుణ్యాత్మునకు నాకూతియందు నక్తుం డనువాఁ డవరకుమారుం డయ్యె నాకీర్తిమంతునకు ధృతి యనువాఁడు మహాధీరుం డై పుట్టె నాధృతికి గయుం డనురాజవృషభుండు పుట్టె నంత.

భూమునకు ఋషికుల్యయందు నుద్గీథుం డనుసుతుండు జనించె నతనికి దేవకుల్య యందుఁ బ్రస్తోత గలిగె నాప్రస్తోతకు వరరుత్సయందు విభుం డనుతనయుం డుద్భవించె నతకిని భారతియందుఁ బృథుషేణుం డుదయించె నతనికి నాకూతి యందు నక్తుండు గలిగె నానక్తునకు రాజర్షిశ్రేష్ఠుం డగుగయుం డనుమహాకీర్తి సంపన్నుం డుదయించె. 6

ఆ. అట్టిగయునివలన నఖిలజీవులఁ బ్రోవఁ, దలఁచి సాత్త్వికప్రధాన మయిన
యట్టిమేను దాల్చి యాత్మతత్త్వజ్ఞానుఁ, డగుచునుండె హరి నిజాంశమునను.

వ. (ఇట్టిమహనీయసుగుణాకరుం డగుగయునిగాథానువర్ణనంబు పురాణవిదు లగు మహాత్ములచే నీతెఱంగున నుతింపంబడుచున్నది సావధానమనస్కుండ వై యాల కింపు మని యి ట్లనియె.) 8

సీ. ధర్మమార్గంబున ధారుణీజనులను, క్షేమతోఁ బోషణప్రేషణోప
లాలనశాసనలక్షణాదులఁ బ్రీతిఁ, బోషించుచును యజ్ఞములను యజ్ఞ
పురుషు నీశ్వరుఁ జిత్తమున నిల్పి సేవించి, స్వాంతమం దున్నయీశ్వరునిఁ గాంచి
యఖిలజీవతతికి నానంద మొసఁగుచు, నిరభిమానత మెయి నేల యేలె

ఆ. సత్యమందు మిగులసత్వయందును, ధర్మమందు యజ్ఞకర్మమందు
గయుఁడు వసుధలోనఁ గంజాక్షుఁడే కాని, మానవుండు గాఁడు మానవేంద్ర.

వ. అట్టి(మహాపురుషగుణగణపరిపూర్ణుం డగు)గయునికి (దక్షకన్యక లగు) శ్రద్ధామైత్రీదయాదులు దమయంతన వచ్చి కోరిక లొసంగ నతనిప్రజలకు వసుంధర కామధేను వై పిదుక వేదంబులు సకలకామంబుల నిచ్చుచుండ సంగరంబున భంగంబు నొందినరాజు లప్పనంబు లొప్పనంబు సేయ విప్రులు ధర్మం బౌఱవ పాలు పంచి యిడ నిరంతరసోమపానంబును శ్రద్ధాభక్తియోగంబులుఁ గలిగి యొనర్చుయజ్ఞంబుల నింద్రాదిదేవతలు తృప్తు లై యజ్ఞఫలంబుల నొసంగ బ్రహ్మాదితృణగుల్మలతాపర్యంతంబు సకలలోకంబులవారిని దృప్తిం బొందించుచు శ్రీహరిం దృప్తిఁ బొందఁ జేయుచు గయుండు పెక్కుకాలంబు రాజ్యంబు సేసె నట్టిగయునికి జయంతియందుఁ జిత్రరథస్వాత్యవరోధను లనుముగ్గురు గొడుకులు పుట్టిరి నాచిత్రరథునికి నూర్ణయందు సామ్రాట్టును వానికి నుత్కళ యందు మరీచియు నామేటికి బిందుమతియందు బిందుమంతుండును నాబిందు మంతునకు సరఘయందు మధువును మధువునకు సుమనస యనుదానియందు వీరవ్రతుండును నావీరవ్రతునకు భోజయందు మన్యుప్రమన్యువు లనునిరువు రును నందు మన్యువునకు సత్యయందు భువనుండును నతనికి దోషయందుఁ ద్వష్టయు నాధర్మాత్మునకు విరోచనయందు విరజుం డనువాఁడును జనియించె నంత విషూచియందు. 10

క. ఆవిరజున కుదయించిరి, భూవినుత జితారిలోక । పుత్రశతంబుం
ఆవల నొకకన్యకయును, నావేళ సమస్తజనులు । హర్షం బందన్. 11

క. ఘనుఁడు ప్రియవ్రతువంశం, బునకుం దుద యై విరజుఁడు । భూపతి వంశం
బును దా నలంకరించెను, విను మింద్రావరజుఁ డయిన । విష్ణునిమాడ్కిన్. 12

క. అని పలికిన శుకయోగిం, గనుఁగొని యభిమన్యుసుతుఁడు । గడు మోదముతో
వనజదళాక్షునిమహిమలు, విని సంతస మంది యనియె । వేడుక మఱియున్. 13

వ. మునీంద్రా సూర్యరశ్మి యెందాఁకం బ్రవర్తిల్లు నక్షత్రయుక్తం బైనచంద్రకిరణంబు లెంతమేరఁ దిరుగు నంతదూరంబు ప్రియవ్రతునిరథనేమిఘట్టనలచేత సప్తద్వీపంబులును సప్తసముద్రంబులు నయ్యె నని పలికితివి నాద్వీపసముద్రంబుల పరిమాణంబులు సవిస్తరంబుగా నెఱింగింపుము గుణమయంబును స్థూలరూపంబును నయినశ్రీహరిశరీరం బగునీలోకంబునందు నిలిపినచిత్తం బగుణంబును సూక్ష్మంబును నాత్మజ్యోతియు బ్రహ్మంబును నైనవాసుదేవునియందు నిల్చుం గావున ద్వీపవర్షాదివిస్తారంబు వినిపింపు మనిన శుకయోగీంద్రుం డి ట్లనియె. 14

క. ధరణీవల్లభ విను శ్రీ, హరిమాయాగుణవిభూతు । లగుజలనిధులుం
బరఁగినదీవులు వర్షము, లరయంగాఁ గొలఁదివెట్ట । నలవియె జగతిన్. 15

ఆ. తెలిసినంత నేను । దెలిపెద సంక్షేప,మునను జిత్తగించి । వినుము దెలియ
ననుచుఁ జెప్పఁదొడఁగె । నభిమన్యుసుతునకు, [1]నింపుగాను శుకము । నీంద్రుఁ డిట్లు.

శుకయోగి యుపదేశరూపమునఁ జెప్పుభూగోళంబునిర్ణయము.

వ. నరేంద్రా జంబూద్వీపంబు భూపద్మంబునకు మధ్యప్రదేశంబున లక్షయోజనంబుల వెడల్పు నంతియ నిడుపునుం గలిగి కమలపత్త్రంబునుంబోలె వర్తులాకారం బయి (నవసహస్రయోజనపరిమితాయామంబు గల)నవవర్షంబులు నష్టమర్యాదాగిరులునుం గలిగి విభక్తం బయి యుండు నందు మధ్యవర్షం బిలావృతవర్షం బగు నందు మధ్యమప్రదేశంబున సువర్ణమయం బయి. 17

క. భూపద్మమునకు మేరువు, దీపించుచుఁ గర్ణికాకృ । తిని బెంపగుచుం
బ్రాపై [2]కులగిరిరాజు గఁ, జూపట్టును సురగణాళి । చోద్యం బందన్. 18

సీ. మఱియును నామేరు । గిరి లక్షయోజనో,న్నత మగు చుండి [3]యా । నడిమిదళము
విదిత మై పదియాఱు । వేలయోజనములు, నంతియ పాఁతు నై । యతిశయిల్లు
నామీఁద విస్తార । మరయ ముప్పదిరెండు, వేలయోజనముల । వెలసి యుండు
నాగిరి కుత్తరం । బందు నీలశ్వేత,శృంగపర్వతములు । నింగి ముట్టి

ఆ. యుండు రెండువేల । యోజనంబులదాఁకఁ, బఱపు గలిగి పూర్వ । పశ్చిమాయ
తంబు దక్షిణోత్త । రంబును విస్తార, మగుచు మిగులరమ్య । మై నరేంద్ర. 19

---

1 రమణతోడ బాదరాయణుండు. 2 యత్యున్నత మై. 3 యానడిమిఱుమ్ము.

వ. ఇట్లు పూర్వపశ్చిమంబులు లవణసాగరాంతంబులై యున్నసీమాపర్వతంబులయందు [1]నీలశ్వేతశృంగవత్పర్వతంబులు నిడివిని యథాక్రమంబుగ దశమాంశన్యూనప్రమాణయోజనంబులు గలవిగా నుండు వీనిమధ్యప్రదేశంబున రమ్యకహిరణ్మయకురువర్షంబు లనునామంబులు గలవర్షంబు లుండు వానివిస్తారంబులు నవసహస్రయోజనంబులు గలిగి లవణసముద్రాంతంబులై క్రమంబున నీలాదిపర్వతదీర్ఘపరిమాణంబుల నుండు నిలావృతవర్షంబునకు దక్షిణంబున నిషధహేమకూటహిమవత్పర్వతంబు లనుసీమాపర్వతంబులును బూర్వపశ్చిమంబులు నిడుపును దక్షిణోత్తరంబులు విశాలంబును నగుచు నానీలాదిపర్వతంబులతీరున నుండు నాగిరులమధ్యప్రదేశంబున హరివర్ష కింపురుషవర్ష భారతవర్షంబు లనునామంబులు గలవర్షంబు లుండు నాయిలావృతవర్షంబునకుఁ బశ్చిమంబున మాల్యవత్పర్వతంబును బూర్వభాగంబున గంధమాదనంబును సీమాపర్వతంబులు పూర్వపశ్చిమంబులు నిడుపును దక్షిణోత్తరంబులు విశాలంబులు నగుచు నీలపర్వతనిషధపర్వతంబులం గదిసి ద్విసహస్రయోజనంబులవిస్తారంబై యుండు మాల్యవత్పర్వతంబు పశ్చిమసముద్రాంతంబై కేతుమాలవర్షంబును గంధమాదనపర్వతంబునకుఁ బూర్వభాగంబున సముద్రాంతం బగుచు భద్రాశ్వవర్షంబును మేరువునకుం దూర్పున మందరపర్వతంబును దక్షిణంబున మేరుమందరపర్వతంబులును బడమటిపార్శ్వంబుల నుత్తరమునం గుముదపర్వతంబులు ననునామంబులు గలిగి యయుతయోజనోన్నతంబు లయి మేరునగం బనుమధ్యోన్నతమేధిస్తంభంబునకుం జతుర్ముఖంబుల హ్రస్వస్తంభములుంబోలె నుండు నాచతుస్స్తంభంబులయందును బర్వతశిఖరంబుల వెలుఁగొందు కేతువులునుంబోలెఁ జూతజంబూకదంబన్యగ్రోధంబు లనువృక్షరాజంబులు గ్రమంబున నొండొంటికి నేకాదశశతయోజనాయతంబును శతయోజనవిస్తారంబును గలిగి యుండు మఱియు నాపర్వతశిఖరంబులం గ్రమంబునం బయోమధ్విక్షురసమ్మృష్టజలంబులు గలిగి శతయోజనవిస్తారంబు లయినసరోవరంబులు దేజరిల్లు నందు సుస్నాతు లగువారలకు యోగైశ్వర్యంబులు స్వభావంబునం గలుగు మఱియు నందన చైత్రరథ వైభ్రాజిక సర్వతోభద్రంబు లనునామంబులు గలదేవోద్యానంబు లాపర్వతశిఖరంబుల వెలుఁగొందుచుండు నందు దేవతాగణంబులు దేవాంగనలం గూడి గంధర్వులగీతనృత్యంబులు గనుంగొనుచు విహరింతు రంత. 20

ఉ. మందరపర్వతంబుతుది మామిడిపం డ్లమృతోపమాన మై
మందరశైలశృంగసుసమానము లై గిరిమీఁద వ్రాల మా
కందఫలామృతంబు గలఁగంబడి జాఱి మహాప్రవాహ మై

[1] నీలపర్వతంబు పొడవులోఁతు తొంబదివేలయోజనంబులు శ్వేతపర్వతం బెనుబది వేలు శృంగపర్వతంబు డెబ్బదివేలు వీనిమధ్య.

యం ¹దరుణోదనామమున నద్భుత మై విలసిల్లు నెంతయున్. 21

చ. కడుమధురంబునన్ సురభిగంధముచే నరుణప్రకాశతన్
వడిగొని మందరాచలము వ్రంతలచెంతల జాఱి యంతలోఁ
దాడితోడి నాయిలావృతముఁ దోఁచుచు వింతగఁ బూర్వవాహి యై
యడరుతరంగసంతతుల నందఱి నచ్చటఁ జేయు ధన్యులన్. 22

ఆ. ఆనదీజలంబు లాడిన ²యచ్చటి, యంబికానుచరులయంగగంధ
మంది పవనుఁ డంత మనుజేశ పదియోజ,నములు సుట్టుఁ బరిమళముల నింపు.

ఆ. మేరుమందరములమీఁద జంబూఫలం,బులు మహాగజోపములుగ వ్రాలి
యవిసి యంతఁ దద్రసామృతం బల్లన, యమ్మహానగంబునందుఁ బొడమి. 24

క. అనుపమ మగుజంబూనది, యనుపేరను వెలసి లీల నరుగుచు నంతన్
ఘనత నిలావృతవర్షముఁ, బనుపడఁ దడుపుచును ధరణిఁ బ్రవహించుఁ దగన్.

ఉ. ఆనదినీటఁ దోఁగి పద ³నై యటు మృత్తనిలార్కసంగతిం
బూని కడున్ విపాకమునఁ బొందుచు శుద్ధసువర్ణజాతి జాం
బూనదనామ మొంది సురముఖ్యుల కెల్లను భూషణార్హ మై
మానుగ వన్నె మించి కడు మంచిది యై విలసిల్లు నెంతయున్. 26

వ. మఱియు సుపార్శ్వనగాగ్రంబు⁴నందుఁ బంచవ్యామపరీణాహబంధురంబు లగు నైదుమధుధారాప్రవాహంబులు పంచముఖంబుల వెడలి సుపార్శ్వనగశృంగంబులం బడి యిలావృతవర్షంబు పశ్చిమభాగంబుఁ దడుపుచుం బ్రవహించు నా తేనియ ననుభవించువారలముఖమారుతసుగంధంబు శతయోజనపర్యంతంబు పరిమళించు. 27

సీ. కుముదపర్వతశిఖాగ్రమున నుత్పన్న మై, కనుపట్టువటతరుస్కంధమునను
నుదయించునట్టిపయోదధిఘృతమధు,గుడవిశిష్టాన్నంబు లోడిక మైన
యంబరశయ్యాసనాభరణాదివ, స్తువులఁ గోరికలు దీర్చుచును గుముద
పర్వతాగ్రంబునఁ బడి యిలావృతవర్ష,మున జనులకు నెల్లభోగ్యములను

ఆ. వదల కొసఁగు వారివళిపలితంబులు, దలఁగు దుష్టగంధములును బాయు
మరణభయము ముదిమిపోరయ దెన్నఁడును శీ,తోష్ణబాధ సెందకుండు నధిప.

ఆ. దేవదానవులును దివ్యమునీంద్రగం,ధర్వులాది గాఁగఁ దగిలి యాశ్ర
యించి యుందు శాగిరీంద్రమూలమునందు, హర్ష మంది ఘనవిహారలీల. 29

వ. నరేంద్రా ⁵కురంగ కురర కుసుంభ వైకంకత త్రికూట శిశిర పతంగ రుచక నిషధ

---

1 'రు రసోదనామమున. 2 వారలు, సుఖులు చటులపుణ్యశుభము వృద్ధిఁ, బొంది దివ్యగంధ మందంద శతయోజ,నములఁ బరిమళించు రమణతోడ.' వ్రా. ప్ర. 3 నందినమేదిని యర్కదీప్త మై. 4 లౌఁ గదంబకోటరంబుల వెడలిన మధుప్రవాహంబు లేనును సుపార్శ్వ. ఇట 'మహాకదంబస్సుపార్శ్వనిరూఢ స్తస్య కోటరే వినిస్సృతాః పంచమధుధారాః' అని మూలము. 5 ఇట 'కురంగ కురర

శితివాస కపిల శంఖాదు లయినపర్వతంబులు మేరుపర్వతకర్ణికకుఁ గేసరంబు లై పరివేష్టించి యుండు నామహామేరునగంబునకుఁ బూర్వభాగంబున జఠరదేవకూటంబులును బశ్చిమంబునం బవనపారియాత్రంబులు ననుపర్వతంబులు నాలుగు నొండొంటికి దక్షిణోత్తరంబుల నష్టాదశసహస్రయోజనంబులనిడుపును బూర్వపశ్చిమంబులు ద్విసహస్రయోజనంబులవెడల్పు నగుచును దక్షిణంబునఁ గైలాసకరవీరంబులు నుత్తరంబునఁ ద్రిశృంగమకరంబు లనుపర్వతంబులు నాలుగును బూర్వపశ్చిమంబుల నష్టాదశసహస్రయోజనంబులనిడుపును దక్షిణోత్తరంబుల ద్విసహస్రయోజనంబులవెడల్పు నగుచును నగ్నిపురుషునకుం బ్రదక్షిణం బగు చున్నపరిస్తరణంబులచందంబున మేరువునకుం బ్రదక్షిణంబుగా నష్టనగంబులు నిలిచి యుండు మేరుశిఖరంబున దశసహస్రయోజనంబులనిడుపు నంతియ విస్తారంబు నగుచు సువర్ణమయం బైన బ్రహ్మపురంబు దేజరిల్లుచుండు నాపట్టణంబునకు నష్టదిక్కులయందును లోకపాలురపురంబు లుండు. 30

క. పరమేష్ఠిపట్టణంబున, హరి మున్ను త్రివిక్రమణము లందఁ సర్వే
శ్వరచరణాగ్రనఖాహతిఁ, బరువడి నూర్ధ్వాండ మంతఁ బగిలె నరేంద్రా. 31

వ. ఇట్లు చరణనఖస్పర్శంజేసి భేదింపంబడ్డయూర్ధ్వకటాహవివరంబువలన నంతఃప్రవేశంబు సేయుచున్నబాహ్యజలధార శ్రీహరిపాదస్పర్శంబు జేయుచుఁ జనుదెంచి సకలలోకజనంబులదురితంబులు వాపుచు భగవత్పాది యనుపేరం బరఁగి దీర్ఘకాలంబు స్వర్గంబున [1]విహరించుచు విష్ణుపదంబున నుత్తానపాదపుత్రుండును బరమభాగవతుండును నైనధ్రువుండు దనకులదేవత యైనశ్రీహరిపాదోదకప్రభావంబుఁ బ్రతిదినంబును భక్తి నిలిపి యోగంబున నిమీలితనేత్రుం డై యానందబాష్పంబులతో రోమాంచితగాత్రుం డై యత్యాదరంబున నేఁడును శిరంబున ధరియించుచున్నవాఁ డతనికి నధోభాగంబున నుండుమండలాధిపతు లైనసప్తర్షులును హరిపాదోదకప్రభావంబు నెఱిఁగి తాము పొందుతపస్సిద్ధి యాకాశగంగాజలంబులస్నాతు లగుటయే యని సర్వభూతాంతర్యామి యగునీశ్వరునియందు భక్తి సలిపి యితరపదార్థాపేక్ష సేయక మోక్షార్థి ముక్తిమార్గంబు బహుమానంబు సేయు తెఱంగున (బహుమానయుక్తంబు గాఁ) దమ జటాజూటంబులయందు నేఁడును ధరియించుచుందురు. 32

సీ. అంత నసంఖ్యంబు లై సదివ్యవిమాన, సంకులంబుల సువిశాల మైన
దేవమార్గంబున దిగి వచ్చి చంద్రమం, డలముఁ దోఁచుచు మేరునగశిఖాగ్ర

కుసుంభ వైకంకత త్రికూట శిశిర పతంగ రుచక నిషధ శితివాస కపిల శంఖ వైడూర్య... నారదాదయో మేరోః కర్ణికాయాః ఇవ కేసరాః' అని మూలము. దీనితెనుఁగచ్చుప్రతులందుఁ గానిపింపదు.

1. విహరింప నాకాశంబు విష్ణుపదం బనఁ బరఁగె నట్టివిష్ణుపదంబున.

మునను నా బ్రహ్మదేవుని పట్టణమునకు, వచ్చి యందులఁ జతుర్ద్వారములను
వరుసతో దీర్ఘప్రవాహంబు లగుచును, బ్రవహించి యమల ప్రభావములను

ఆ. నరుగు లవణసాగరాంతంబులు గ నాల్గు, మోములందు నాల్గు నామములను
దన్నుఁ గన్నవారిఁ దనవారిఁ దోఁగిన, వారి కెల్ల నమృతవారి యగుచు. 33

వ. [1]ఇట్లు సీత యను పేర వినుతి నొందిన యమ్మహానది ప్రవాహంబు బ్రహ్మసదనపూర్వద్వారంబున వెడలి కేసరావలయంబుఁ దడుపుచు గంధమాదనాద్రికిం జని భద్రాశ్వవర్షంబు బావనంబు సేయుచుఁ బూర్వలవణసాగరంబునం బ్రవేశించుఁ జక్షువను పేరం దేజరిల్లెడు దీర్ఘప్రవాహంబు పశ్చిమద్వారంబున వెడలి మాల్యవత్పర్వతంబు నుత్తరించి కేతుమాలవర్షంబుం బవిత్రంబు సేయుచుఁ బశ్చిమలవణార్ణవంబునం గలయు భద్ర యను పేర వెలుఁ గొందిన యతుల ప్రవాహంబుత్తరద్వారంబున వెడలి కుముద నీల శ్వేతాఖ్యపర్వతశిఖరంబులం గ్రమంబునఁ బ్రవహించుచు శృంగనగరంబునకుం జని మానసోత్తరంబు లగు నుత్తరకురుభూములఁ బవిత్రంబు సేయుచు నుత్తరలవణసాగరంబుఁ జేరు నలకనంద యనం (బ్రఖ్యాతి గాంచిన) యమ్మహానదీప్రవాహంబు బ్రహ్మసదనదక్షిణద్వారంబున వెడలి యత్యంతదుర్గమంబు లైన భూధరంబులఁ గడచి హేమకూట హిమకూట నగంబుల నుత్తరించి యతివేగంబునఁ గర్మక్షేత్రం బగు భారతవర్షంబుఁ బావనంబు సేయుచు దక్షిణలవణాంబుధిం గలయు నంత. 34

సీ. జగతిలో మేరు వాదిగఁ బర్వతములకుఁ, బుత్రిక లైనట్టి పుణ్యతీర్థ
ములు వేలసంఖ్యలు గలవు జంబూద్వీప, మందు భారతవర్ష మరయఁ గర్మ
భూమి దక్కిన వర్షములు దివంబుననుండి, భువికి వచ్చినవారు పుణ్యశేష
ములు భుజించుచు నుందురు భూస్వర్గ మనఁ దగు, నా వర్షముల నుండునట్టివార

ఆ. లయుతసంఖ్యవత్సరాయువు లయుతమా, తంగబలులు దేవతాసమాను
లతులవజ్రదేహు లధికప్రమోదితు, లప్రమత్తు లార్య లనఘు లధిప. 35

వ. మఱియు సురతసుఖానందంబున మోక్షంబు నైనం గైకొనక సకృత్ప్రసూతు లగుచు ననవరతంబును త్రేతాయుగకాలంబు గలిగి ప్రవర్తింతు రీయష్టవర్షంబులయందు దేవతాగణంబులు దమభృత్యవర్గంబు లత్యుపచారంబులు సేయుచుండ నెల్ల ఋతువులయందుం గిసలయకుసుమఫలభరితంబు లైన లతాదుల శోభితంబు లగు వనంబులు గల వర్షనిధిగిరిద్రోణులయందును జలకుక్కుటకారండవసారసవినోదంబులు గలిగి మత్తాళిఝుంకృతిమనోహరంబు లై నానావిధంబు లయిన కొలంకులయందును దేవాంగనల కామోద్రేకజంబు లయిన విలాసహాసలీలావలోకనంబులం దివియంబడిన మనోదృష్టులు గలిగి విచిత్రవినోదంబులం

1 'ఇట్లమ్మహానదీప్రవాహంబు గలన బ్రహ్మసదనంబు పూర్వద్వారంబున వెడలు సీతానది కేసరావలయంబు' వ్రా. ప్ర.

దగిలి యిచ్ఛావిహారంబులు సలుపుచుండుదురు. 36

క. ఈనవవర్షంబులయం, దానారాయణుఁడు వచ్చి యనవరతము లో
కానుగ్రహమునకై సు, జ్ఞానం బీఁ దలఁచి లీలఁ జరియించుఁ దగన్. 37

సీ. వసుధ నిలావృతవర్షాధిపతి యైన, పురహరుం డావర్షమున వనంబు
నందు నుండుటకు నాయంబికాశాపవ, శంబున నావనస్థలములందు
నెవ్వరు వచ్చిన నింతు లై యుందు రా, వనమందుఁ బార్వతి యనుదినంబు
నంగనాజనసహస్రార్బుదంబులతోడ, నసమలోచనుఁ గొల్చు నతులభక్తి

ఆ. నట్టిశివునిఁ గోరి యాయిలావృతవర్ష, మునఁ జరించుజనులు మోదమునను
గదిసి తత్ప్రకాశకము లైనమంత్రతం, త్రములఁ బూజ సేసి తలఁతు రెపుడు.

క. భద్రాశ్వవర్షమందుల, భద్రశ్రవుఁ డనెడిపేరఁ బరఁగుచుఁ దపసీ
యాద్రిసమధైర్యుఁ డగుచు స, ముద్రాంతం బైనజగతిఁ బాలుపు గ నేలున్.

క. ఆనరవరునకుఁ బ్రియతముఁ, డైనహయగ్రీవమూర్తి ననవరతంబుఁ
ధ్యానస్తోత్రజపాను, ష్ఠానాదులఁ బూజ సేసి సజ్జను లంతన్. 40

ఆ. తత్ప్రకాశకృత్ప్రధానమంత్రాభ్యాసం, సిద్ధిఁ జేసి ముక్తిఁ జెంది రప్పు
డట్టివర్షమందు నాహయగ్రీవునిఁ, దలఁచి కొలిచి మిగులధన్యు లగుచు. 41

సీ. హరివర్షపతి యైననరహరి ననిశంబు, నం దున్నజనులు మహాత్ము లయిన
దైత్యదానవకులోత్తములు ప్రహ్లాదాది, వృద్ధులఁ గూడి సంప్రీతితోడ
సుస్నాతు లై భక్తిఁ జూచుచు నుందురు, రమ్యదుకూలాంబరములు దాల్చి
తత్ప్రకాశకమంత్రతంత్రజపస్తోత్ర, పఠనసుధ్యానతపఃప్రధాన

తే. మైనసత్పూజలను జేసి యచలబుద్ధి, శ్రీనృసింహునిఁ జేరి పూజించి యతని
కరుణ నొందుచు నతులప్రకాశు లగుచు, భుక్తిముక్తులఁ గైకొంద్రు భూపవర్య.

వ. మఱియుఁ గేతుమాలవర్షంబునందు భగవంతుండు శ్రీదేవికి సంతోషంబు నొసం
గుటకు గామదేవరూపంబున [1]నుండు నమ్మహాపురుషునియస్త్రతేజఃప్రకాశం
బునఁ బ్రజాపతిదుహిత లగురాత్ర్యధిదేవతలగర్భంబులు సంవత్సరాంతంబున
నిర్జీవంబు లై స్రవించు నాకామదేవుండును దనగతివిలాసలీలావిలోకనసుందర
భ్రూమండలసుభగవదనారవిందకాంతులం జేసి శ్రీరమాదేవిని రమింపం జేయు
[2]భగవన్మాయారూపిణి యగుశ్రీదేవియుఁ బ్రజాపతిపుత్రికలును బుత్రులు నైన
రాత్రులం బగళ్లం గూడి కామదేవుని స్తోత్రపఠనపూజాధ్యానాదులం బూజించు
చుండు మఱియును. 43

---

1 'నుండుటయు నమ్మహాపురుషునిసుదర్శనప్రకాశతం జేసి ప్రజాపతిసుహితలును బుత్రులు నగు నహోరాత్రాద్యధిపతులగర్భంబులు. 2 భగవంతునిమాయారూపం బగు శ్రీదేవియుఁ బ్రజాపతిపుత్రికలం గూడి' వ్రా. ప్ర.

క. విమలమతిఁ జిత్తగింపుము, రమణీయం బైనవిమలరమ్యక మనువ
ర్షమునకు నధిదేవత దా, నమరం గా మత్స్యరూపుఁ డగుహరి దలఁపన్. 44

ఆ. అట్టివర్షమునకు నధిపతి యగుచున్న, మనువు పుత్త్రపౌత్త్రమంత్రివరులఁ
గూడి మత్స్యమైనకుంభినీధరుఁ జిత్త, మతులభక్తియుక్తి హత్తఁ గొలుచు.

ఆ. తత్ప్రకాశకృత్ప్రధానమంత్రస్తోత్ర, ములను ధర్మకర్మములను హోమ
ములను జనులు సేసి పుణ్యులై భుక్తిము, క్తులను బొందుచుందు రెలమితోడ.

క. వినుము హిరణ్మయవర్షం, బున శ్రీకూర్మావతారమును దాల్చినయా
వనజోదరుఁ డధిదేవత, యనఘుఁడు పితృపతి మహాత్ముఁ డర్యముఁడు నృపా.

క. ఆవర్షమందు నర్యముఁ, డావర్షజనంబు గూడి హరిఁ జిత్తములో
భావించి సంస్తవంబులు, [1]గావించుచు భుక్తిముక్తిఁ గాంతురు గడఁకన్. 48

క. ఉత్తరకురుభూములఁ దను, హత్తుకొని వరాహదేవుఁ డధిపతి యైనన్
సత్తుగ భూపతి యతనిం, జిత్తములో నిలిపి పూజ సేయుచు నుండున్. 49

క. ఆవర్షమందులను బ్రజ, లావిపులవరాహమూర్తి ననవరతంబున్
సేవించి కొలిచి సంస్తుతిఁ, గావించుచుఁ గాంతు రంతఁ గైవల్యంబున్. 50

క. అరయఁగ సీతాలక్ష్మణ, పరివృతుఁడై వచ్చి రామభద్రుఁడు గడిమిం
బరఁగు నధిదేవతగఁ గిం, పురుషమహావర్షమునకు భూపవరేణ్యా. 51

ఆ. అట్టిరామభద్రు నంజనీసుతుఁడు కిం, పురుషగణముఁ గూడి పూజ సేసి
తత్ప్రకాశకప్రధానమంత్రస్తోత్ర, పఠనములను దగ నుపాస్తి సేయు. 52

సీ. భారతవర్షాధిపతి యైనబదరికా, శ్రమమున నున్ననారాయణుండు
భూనాథ యామహాత్ముని నారదాదులు, భారతవర్షంబు ప్రజలఁ బ్రేమఁ
బాయక చేరి యుపాస్తి సేయుచు సాంఖ్య, యోగంబు నుపదేశ ముచితవృత్తి
నంది యందఱను గృతార్థులై యట్టినా, రాయణదేవు నారాధనంబు
ఆ. సేసి యాత్మఁ జాలఁ జింతించి తత్ప్రకా, శకము లయినమంత్రసంస్తవములఁ
బూజ సేసి ముక్తిఁ బొందుచు నుండుదు, రచలమైనభక్తి ననుదినంబు. 53

క. భారతవర్షమునందుల, సారాంశము లైనపుణ్యశైలంబులు గం
భీరప్రవాహములు గల, వారయ నెఱిఁగింతు వాని నవనీనాథా. 54

వ. మలయపర్వతంబును మంగళప్రస్థంబును మైనాకంబును త్రికూటంబును ఋషభపర్వతంబును గూటకంబును గోల్లంబును సహ్యపర్వతంబును వేదగిరియును ఋశ్యమూకపర్వతంబును శ్రీశైలంబును వేంకటాద్రియును మహేంద్రంబును వారిధరంబును వింధ్యపర్వతంబును శుక్తిమత్పర్వతంబును ఋక్షగిరియును బారి

---

1 ఇట 48-వ పద్యమున 'గావించుచు' మొదలుకొని 50-వ పద్యమున 'సంస్తుతి' అను వఱకుఁ గలపాఠ మచ్చుప్రతులం గానిపింపదు. ఇందులకు 'ఉత్తరేషు కురుషు భగవాన్ యజ్ఞపురుషః కృతవరాహరూపః...' అని మూల మున్నది.

యంత్రంబును ద్రోణపర్వతంబును జిత్రకూటంబును గోవర్ధనాద్రియును రైవత
కంబును గకుంభంబును నీలగిరియును గాకముఖంబును నింద్రకీలంబును రామ
గిరియును నాదిగాఁ గలపుణ్యపర్వతంబు లనేకంబులు గల వాపర్వతపుత్రిక
లైనచంద్రపటయుఁ దామ్రపర్ణియు నవటోదయుఁ గృతమాలయు వైహాయసి
యుఁ గావేరియు వేణియుఁ బయస్వినియుఁ బయోదయు శర్కరావర్త్తయుఁ దుం
గభద్రయుఁ గృష్ణవేణియు భీమరథియు గోదావరియు నిర్వింధ్యయుఁ బయోష్ణి
యుఁ దాపియు రేవానదియు శిలానదియు సురసయుఁ జర్మణ్వతియు వేదస్మృతి
యు ఋషికుల్యయుఁ ద్రిసమయుఁ గౌశికియు మందాకినియు యమునయు సర
స్వతియుఁ దృషద్వతియు గోమతియు సరయువును భోగవతియు సుషమయు శత
ద్రువును జంద్రభాగయు మరుద్వృధయు వితస్తయు నసిక్నియు విశ్వయు నను
నీమహానదులును సింధుశోణంబు లనునదంబులు నిట్టిమహాప్రవాహంబు లీభార
తవర్షంబునఁ గల వందు సుస్నాతు లైనమానవులు ముక్తిం జెందుదురు మఱి
యు నీభారతవర్షంబున జన్మించినపురుషులు [1]శుక్లలోహితకృష్ణవర్ణరూపంబులగు
త్రివిధకర్మంబులం జేసి క్రమంబుగ దేవమనుష్యనరకగతు లను(త్రివిధగతులం)
బొందుదురు వినుము [2]రాగద్వేషాదిశూన్యుండు నవాఙ్మనసగోచరుండు ననాధా
రుండు నగుశ్రీవాసుదేవమూర్త్తియందుఁ జిత్తంబు నిలిపి భక్తియోగంబున నా
రాధించెడుమహాత్ము లవిద్యాగ్రంథిగహనంబు గావించుటం జేసి పరమభాగవతో
త్తములు పొందెడునుత్తమగతిం జెందుదురు గావున భారతవర్షంబు మిగుల
నుత్తమం బని మహాపురుషు లిట్లు స్తుతించు చుందురు. 55

ఉ. భారతవర్షజంతువులభాగ్యము లే మని చెప్ప వచ్చు నీ
భారతవర్షమందు హరి పల్మఱుఁ బుట్టుచు జీవకోటికిన్
ధీరతతోడఁ దత్త్వ ముపదేశము సేయుచుఁ జెల్మి సేయుచు
న్నారయ బాంధవాకృతిఁ గృతార్థులఁ జేయుచు నుండు నెంతయున్. 56

క. తనజన్మ[3]కర్మములనుం, గొని యాడెడివారి కెల్లఁ గోరిన [4]వెల్లం
దనియఁగ నొసఁగుచు మోక్షం, బనయముఁ గృపసేయుఁ గృష్ణుఁ డవనీనాథా.

వ. ఇట్లు భారతవర్షంబునందులజనంబులకు నెద్దియు నసాధ్యంబు లేదు నారాయణ
స్మరణంబు సకలదురితంబుల నడంచుఁ దన్నామస్మరణరహితంబు లైనయజ్ఞతపో
దానాదులు దురితంబుల నడంపలేవు బ్రహ్మకల్పాంతంబు బ్రతికెడియితరస్థానం

---

1 సాత్త్వికరాజసతామసకర్మంబులంజేసి. 2 బ్రహ్మవిద్యానిరతు లైనపురుషులు సాయుజ్యంబు నొందుదురు సర్వభూతాంతర్యామియు బ్రహ్మస్వరూపము నైనవాసుదేవునియందుల నిరతిశయభక్తియోగంబున నవిద్యను గెలిచి విష్ణులోకంబుఁ జెందుదురు. కావున నాభారతవర్షం బుత్తమం బగు. 3 కర్మఫలమును. 4 వరముల్. 5 గాని హరిస్మరహితంబు లయినయజ్ఞ.

బునం [1]బునర్జన్మభయంబున భీతిల్లుచు నుండుటకన్న భారతవర్షంబునందు క్షణమాత్రంబు మనంబున సర్వసంగపరిత్యాగంబు సేసినపురుషశ్రేష్ఠునకు శ్రీమన్నారాయణపదప్రాప్తి యతిసులభంబుగ సంభవించుం గావున నట్టియుత్తమం బగునీభారతవర్షంబె కోరుచుండుదురు మఱియు నెక్కడ వైకుంఠునికథావాసన లేకుండు నేదేశంబున సత్పురుషులైనపరమభాగవతులు లేకుండుదు రేభూమిని యజ్ఞేశ్వరునిమహోత్సవంబులు లేక యుండు నది సురేంద్రలోకం బైన నుండం దగదు జ్ఞానానుష్ఠానద్రవ్యకలాపంబులచేత మనుష్యజాతిం బొంది తపంబున ముక్తిం బొంద కుండెనేని మృగంబులమాడ్కి నతండు దనకుం దానె బంధనంబు నొందు భారతవర్షంబునందుఁ బ్రజలచేత [2]శ్రద్ధాయుక్తంబుగా ననుష్ఠింపంబడినయజ్ఞంబులయందు వేల్పులంబడుహవిస్సులను బెక్కునామంబులం బుండరీకాక్షుం డంది తనమీఁదిభక్తి యధికంబుగాఁ జేయు నట్టిభారతవర్షంబునందలి ప్రజలమీఁదం గరుణించి సర్వేశ్వరుం డిహపరసౌఖ్యంబుల నొసంగుచుండు జంబూద్వీపంబున సగరాత్మజు లశ్వమేధాశ్వంబు నన్వేషింపం బూని భూఖననంబు సేయుటం జేసి స్వర్ణప్రస్థ చంద్రశుక్లావర్తన రమణక మందేహారుణ పాంచజన్య సింహళ లంకాద్వీపంబు లన నెనిమిదియుపద్వీపంబులు గలిగె. 58

సీ. లక్షయోజనముల లవణాబ్ధిపరివృత, మగుచు జంబూద్వీప మతిశయిల్లు
విను రెండులక్షల విస్తృతము గను ప్లక్షద్వీప [3]ముండు నా క్షూరసాగ
రముఁ జుట్టి యందుల రమ్యమై యొప్పెడు, వృక్షంబు ప్లక్షంబు విదితముగను
దనరు నాద్వీపంబు దరునామమహిమచే, మిగులఁ బ్లక్షం బన మించి రహిని
ఆ. నందు సంచరించు నట్టివారల కగ్ని, దేవుఁ [4]డమరు నాది దేవతయుఁ గ
నందులోన నాప్రియవ్రతపుత్త్రుండు, నిధ్మజిహ్వుఁ డగుమహీవరుండు. 59

వ. నరేంద్రా యాయిధ్మజిహ్వుం డాప్లక్షద్వీపంబు [5]నేడువర్షంబులుగ విభజించి యందు నావర్షనామధారులుగా నుండుతనపుత్త్రు లగు శివ యశస్య సుభద్ర శాంత క్షేమాభయామృతు లనియెడునేడుగురు నేడువర్షంబుల కధిపతులం గావించి తపంబునకుం జనియె నావర్షంబులయందు మణికూట వజ్రకూట నింద్రసేన జ్యోతి

---

1 వారలుజనులు పునర్జన్మభయంబున భీతిల్లుచుందురు. భారతవర్షంబునందు క్షణమాత్రంబేని మనంబునఁ గర్మరహితుం డైనవానికి మనోధైర్యంబున నామస్మరణ సేసిన ముక్తి లభించు నని భారతవర్షంబె కోరుచుందురు.

2 శ్రద్ధాయుక్తంబు లైనయజ్ఞంబులందు వేల్పులంబడుహవిస్సులను బెక్కురూపంబులను బుండరీకాక్షునకు సమర్పణంబు సేయుపురుషు నిహపరంబు లొసంగుచుఁ దనమీఁదిభక్తి. 3 ఇక్షుసాగరముఁ జుట్టి, యందుల రమ్యమై యమరు నేకాదశ,శతయోజనములయున్నతి వహించి, యాతరునామాంక మగుచు నవ్వారిది ప్లక్షద్వీప మనఁగఁ బ్రశస్త మయ్యె. 4 ఉతుల మైనదైవ మయ్యె. 5 నందుఁ దనపుత్త్రులనామంబులు గల శివ యశస్య.

ష్మ ధూమ్రవర్ణ హిరణ్యగ్రీవ మేఘమాల లనునామంబులు గలసప్తకులపర్వ
తంబులును నరుణయు నృమణయు నాంగిరసయు సావిత్రియు సుప్రభాతయు ఋ
తంభరయు సత్యంభరయు నన సప్తమహానదులును నానదులయందు సుస్నాతు
లగుచు గతపాపు లై నహంసపతంగోర్ధ్వాయనసత్యాంగు లనునామంబులు గల
చాతుర్వర్ణ్యంబును గలిగి యుండు నందుఁ బురుషులు సహస్రవత్సరజీవులును దే
వతాసములును దృష్టిమాత్రంబునం [1]గ్లమస్వేదాదిరహితం బగుసపత్యోత్పాద
నంబు గలవార లగుచు వేదత్రయాత్మకుండును [2]స్వర్గద్వారభూతుండును భగవ
త్స్వరూపియు నగుసూర్యుని వేదత్రయమ్మున సేవింపుదురు ప్లక్షద్వీపం బాది గా
మీఁదటిద్వీపపంచకంబునందలిపురుషులకు నాయురింద్రియపటుత్వంబులును దేజో
బలంబులు దోడనె జనియించు చుండు. 60

క. ప్లక్షద్వీపము [3]ద్విగుణిత, లక్షేక్షురసాబ్ధి సుట్టి రా విలసిల్లు
నిక్షురసోదద్విగుణం, బక్షయము గ శాల్మలీమహాద్వీప మిలన్. 61

వ. అందు [4]శాల్మలీవృక్షంబు ప్లక్షాయామం బై తేజరిల్లు నావృక్షరాజంబునకు
నధోభాగంబునం బతత్త్రిరాజుగా నుండుగరుత్మంతుండు నిలుకడగా వసించు నా
శాల్మలీవృక్షంబుపేర నాద్వీపంబు శాల్మలీద్వీపం బన విలసిల్లు నాద్వీపపతి యైన
(ప్రియవ్రతాత్మజుం డగు)యజ్ఞబాహువు దనపుత్రు లగుసురోచన సౌమనస్య
రమణక దేవబర్హ పారిబర్హాప్యాయ నాభిజ్ఞాతు లనియెడువారిపేర నేడువర్షం
బుల నేర్పఱిచి యావర్షంబులయం దేడ్వురఁ గుమారుల నభిషిక్తులం జేసె నావ
ర్షంబులయందు స్వరస శతశృంగ వామదేవ కుముద ముకుంద పుష్పవర్ష శత
శ్రుతు లనుపర్వతసప్తకంబును ననుమతియు సినీవాలియు సరస్వతియుఁ గుహూ
వును రజనియు నందయు రాకయు ననుసప్తమహానదులును గల వందు శ్రుత
ధర విద్యాధర వసుంధ రేధ్మధరసంజ్ఞ లగునావర్ష పురుషులు భగవత్స్వరూపుండు
వేదమయుండు నాత్మస్వరూపుండు నగుసోముని వేదమంత్రంబులచే నారాధింపు
దు రాద్వీపంబు లక్షచతుష్టయపరిమితయోజనవిస్తృతం బయినసురాసముద్రం
బుచే నావృతం బై తేజరిల్లు నందు. 62

సీ. భూనాథ యాసురాంభోధికిఁ జుట్టుగా, నుండుకుశద్వీప మువ్విమీఁదఁ
దోర మై తా ద్విచతుర్లక్షయోజనం, బులను విస్తార మై పొలుపు మిగుల
నందుఁ గుశస్తంభ మనిశంబు దేవతా, కల్పితం బై నట్టి కాంతిచేత

1 గర్భోత్పత్తు లగుచు. 2 స్వర్గద్వారంబు నై నసూర్యభగవానుల వేదత్రయమ్మున. 3 దా ద్విర
క్షే. 4 అట్టిశాల్మలీవృక్షం బేకాదశశతయోజనోన్నతంబున నుండు నాశాల్మలీవృక్షంబు పేర. 5 వేద
మయుం డై నసోముని వేదార్థంబులఁ గొలుచు శ్రుతధర... ధర్మ లను నామంబులు గలచాతుర్వర్ణ్యం
బు గలిగి యుండు రాద్వీపంబుఁ దిరిగి ద్విచతుర్లక్షయోజనవిస్తారం బై సురాసముద్రం బుండు.

దిక్కులు వెలిఁగించు ద్వీపంబునకుఁ దన, పేరను సత్కీర్తి పెంపు సేయు
తే. నట్టిదీవికి నధిపతి యగుప్రియవ్ర, త[1]తనయుండు హిరణ్యరేతసుఁ డనం ద
నరెడిభూపతి తనసుతనామములను, వర్షములు సేసె నత్యంతహర్షమునను.

వ. ఇట్లు [2]హిరణ్యరేతసుండు వసుదాన దృఢరుచి నాభి గుప్త సత్యవ్రత విప్ర వామదేవు లనునామంబులు గలపుత్త్రులనామంబుల సప్తవర్షంబులం గావించి యాకుమారుల నందు నిలిపి తాను దపంబునకుం జనియె నావర్షంబునందు బభ్రు చతుశ్శృంగ కపిల చిత్రకూట దేవానీ కోర్ధ్వరోమ ద్రవిణంబు లనునామంబులు గల సప్తగిరులును రసకుల్యయు మధుకుల్యయు శ్రుతవిందయు మిత్రవిందయు దేవగర్భయు ఘృతచ్యుతయు మంత్రమాలయు ననుసప్తమహానదులును గల వానదీజలంబులఁ గృతమజ్జను లగుచు భగవంతుం డగుయజ్ఞపురుషునిఁ [3]కుశలకోవిదాభియుక్త లనుకులంబులు గలవర్షపురుషు లారాధించు చుందురు.

సీ. ఆకుశద్వీపంబు నరికట్టుకొని యుండు, నెనిమిదిలక్షలఘనఘృతాబ్ధి
యాఘృతసాగరం బవ్వల షోడశ, లక్షయోజనముల లలిత మగుచు
నుండుఁ గ్రౌంచద్వీప ముర్వీశ యందు మ, ధ్యప్రదేశంబున నట్టిదీవి
పేరుగాఁ దనపేరి బెద్దగాఁ జేసిన, క్రౌంచాద్రి గల దానగంబు మున్ను
ఆ. షణ్ముఖుండు దివ్యశరమున ఘననితం, బంబు దూయ నేయఁ బాలవెల్లిఁ
గరిమఁ దడుపుచుండు వరుణుండు రక్షింప, నందు మిగులభయము నొందకుండె.

వ. నరేంద్రా యాక్రౌంచద్వీపపతి యగుఘృతపృష్ఠుండు దనకుమారుల నాపేళ్లంగల యామోద మధువహ మేఘపృష్ఠ సుధామ ఋషిజ్య లోహితార్ణ వనస్పతు లను వర్షంబుల కభిషిక్తులం జేసి పరమకల్యాణగుణయుక్తుం డయిన శ్రీహరిచరణారవిందంబుల సేవించుచుం దపంబునకుం జనియె నావర్షంబులయందు శుక్ల వర్ధమాన భోజ నోపబర్హణానంద నందన సర్వతోభద్రంబు లనుసప్తసీమాపర్వతంబులును నభయయు నమృతౌఘయు నార్యకయుఁ దీర్థవతియుఁ దృప్తిరూపయుఁ బవిత్రవతియు శుక్లయు ననుసప్తనదులును గల వందులఁ బవిత్రోదకంబు లనుభవించుచు గురు ఋషభ ద్రవిణక దేవక సంజ్ఞలు గలిగి వరుణదేవుని నుదకాంజలులం బూజించుచున్నచాతుర్వర్ణ్యములు గలిగి యుందురు. 66

సీ. జగతీశ వినుము క్రౌంచద్వీపమును జుట్టి, యుండు షోడశలక్షయోజనముల
విస్తార మై పాలవెల్లి యందునను శా, కద్వీప మతులప్రకాశ మొందు
దండిమై ముప్పదిరెండులక్షలయోజ, నములవిస్తార మై యమరి యుండు
నందులశాకవృక్షమామోద మాద్వీప, మును సుగంధంబునఁ బెనఁగఁ జేసి

---

1 'తాత్మజుండును బుణ్యుండు నగుహిరణ్యరోముఁ డనువాఁడు పుత్త్రులనామములను.
2 హిరణ్యరోముండు కుశద్వీపమునందు. 3 సేవించుకుశలకోవిదాభియుక్తకులకసంజ్ఞలు గలచాతుర్వర్ణ్యంబులు గలిగియుందురు' వ్రా. ప్ర.

తే. [1]యంతఁ దనపేర దీవి ప్రఖ్యాత మగుటఁ, జేసి యందుల మిగులఁ బ్రసిద్ధి కెక్కి-
నందు మేధాతిథియుఁ గర్తయగుచు నుండెఁ, దవిలి వేడుకఁ దనదునందనులఁ జూచి.

వ. మఱియు నా ప్రియవ్రతపుత్త్రుం డయిన మేధాతిథి దనపుత్త్రుల పేరం గలపురోజవ మనోజవ వేపమాన ధూమ్రానీక చిత్రరథ బహురూప విశ్వాచారంబు లనుసంజ్ఞలు గలసప్తవర్షంబులయందు వారలకుఁ బట్టంబు గట్టి శ్రీహరిపాదసేవ సేయుచుఁ దపోవనంబునకుం జనియె నా శాకద్వీపంబునందు నీశా నోరుశృంగ బలభద్ర శతకేసర సహస్రస్రోతో దేవపాల మహానసనామంబులు గలసీమాగిరులును ననఘాయుర్ద్భోభయస్పృష్ట్యపరాజిత పంచపదీ సహస్రస్రుతి నిజధృతు లనుసప్తనదులును గల వానదీజలంబు లుపయోగించి [2]యచ్చటివారలు ప్రాణాయామంబు సేసి విధ్వస్తరజస్తమోగుణు లయి పరమసమాధిని వాయురూపం బైన భగవంతుని సేవింతురు ఋతవ్రత సత్యవ్రత దానవ్రత సువ్రత నామంబులు గల చాతుర్వర్ణ్యం బందుఁ గలిగి యుండు. 68

సీ. అట్టి శాకద్వీప • మరికట్టి తత్ప్రమాణంబున దధిసముద్రంబు వెలుఁగు
నందుకుఁ బరివృతం • బై పుష్కరద్వీప, మిలఁ జెలువొప్పెలరుచు విశాల
[3]మమ్మహాద్వీపమం • దయుతకాంచనపత్త్ర, ములు గల్గి కమలగర్భునకు నాస
నం బగుపంకేరు • హం బుండు నాద్వీప, మధ్యంబునను నొక్కమానసోత్త

ఆ. రం బనంగఁ బర్వతం బుండుఁ దనకుఁ బూ, ర్వాపరముల నుండునట్టివర్ష
మునకు రెంటి కెల్లు • నిలిచినమర్యాద, నగ మనంగఁ జాలఁ బొగడ నెగడు. 69

వ. ఇట్లు దనకు లోపలివెలుపలివర్షంబులు రెంటికి మర్యాదాచలంబునుం బోలె నున్నమానసోత్తరపర్వతం బయుతయోజనవిస్తారంబును నంతియ యౌన్నత్యంబునుం గలిగియుండు నానగంబునకు నలుదిక్కులయందు నాలుగులోకపాలురపురంబు లుండు నామానసోత్తరపర్వతంబుతుద సూర్యరథచక్రంబు సంవత్సరాత్మకం బయి యహోరాత్రంబులయందు మేరుప్రదక్షిణంబు సేయు నందు నాపుష్కరద్వీపాధిపతి యగువీతిహోత్రుండు రమణక ధాతక నామంబులు గలపుత్త్రుల నిరువుర వర్షద్వయంబునం దభిషిక్తులం జేసి తాను బూర్వజు లేఁగిన తెఱంగున భగవత్కర్మశీలుం డగుచుఁ దపంబునకుం జనియె నంత. 70

క. మనుజేశ్వర యావర్షంబున నప్పుడు సంచరించుపురుషులు పద్మా
సనునిఁ దగఁ గర్మకారా, ధన సేయుదు రచలబుద్ధిఁ దాత్పర్యమునన్. 71

క. ధరణీవల్లభ విను పు, [4]ష్కరమనుద్వీపమున లేరు • చాతుర్వర్ణ్యల్

---

1 'యంతయు సొంపొందియుండుఁ బ్రఖ్యాత. 2 వాయురూపుఁ డైన భగవంతుని సేవించుచుం బ్రాణాయామంబు నంజేసి విధ్వస్తరజస్తమోగుణంబులం గలిగి ఋగ్వ్రత... చాతుర్వర్ణ్యలు గలిగియుందురు. 3 మమ్మహాదధియందు. 4 ష్కరదీవిం దలఁప లేరు • చాతు' వ్రా. ప్ర.

పరఁగఁగ [1]భేదము లేకే, సరసత సము లగుచు రందు ♦ సకలజనములున్. 72

వ. మఱియుఁ [2]బుష్కరద్వీపంబు చతుష్షష్టిలక్షయోజనవిస్తారం బైనశుద్ధోదకసము
ద్రముద్రితం బగుచుండు నవ్వల లోకాలోకపర్వతం బుండు శుద్ధోదకసము
ద్రలోకాలోకపర్వతంబులనడుమ రెండుకోట్లయోజనవిస్తారం బయిననిర్జనభూమి
దర్పణోదరసమానం బై (దేవతావాసయోగ్యంబుగా) నుండు(నాభూమిం జేరిన
పదార్థంబు మరలఁ బొంద నశక్యంబుగా నుండు) నటమీఁద లోకాలోకపర్వతం
బెనిమిదికోట్లయోజనంబులు సువర్ణభూమియు [3]సూర్యాదిధ్రువాంతంబు లగు
జ్యోతిర్గణంబులమధ్యంబున నుండుటం జేసి లోకాలోకపర్వతం బనం దగి యుం
డుఁ బంచాశత్కోటి(యోజనవిస్తృతం బగు)భూమండల(మాన)ంబునకుఁ [4]దురీ
యాంశప్రమాణంబు గలయాలోకాలోకపర్వతంబుమీఁద నఖిలజగద్గురు వగు
బ్రహ్మచేతఁ జతుర్దిశలయందే ఋషభపుష్కరచూడవామనాపరాజితసంజ్ఞలు
గలదిగ్గజంబులు నాలుగును లోకరక్షణార్థంబు నిర్మితం బై యుండు మఱియును.

సీ. తనదువిభూతు లై ♦ తనరిన యాదేవ, బృంద తేజశ్శౌర్య♦బృంహణార్థ
మై భగవంతుండు ♦ నాదిదేవుండును, నైనజగద్గురుం ♦ డచ్యుతుండు
నరి లేనిధర్మవి♦జ్ఞానవైరాగ్యాను, లయినవిభూతుల ♦ నలరి యున్న
యట్టివిష్వక్సేనుఁ ♦ డాది గాఁ గలుగుపా, ర్షదులతోఁ గూడి ♦ ప్రశస్త మైన

తే. నిజవరాయుధదోర్దండ♦నిత్యసత్త్వుఁ, డగుచు నాపర్వతంబుపై ♦ నఖిలలోక
రక్షణార్థంబు కల్పపర్యంత మైన, యోగమాయావిరచితుఁడై ♦ యొప్పుచుండు. 74

వ. ఇట్లు వివిధమంత్రగోపనార్థం బానగాగ్రంబున నున్నభగవంతుండు దక్క
లోకాలోకపర్వతంబునకు నవ్వల నొరులకు సంచరింప నశక్యం బయి యుండు
బ్రహ్మాండంబునకు సూర్యుండు మధ్యగతుం డై యుండు నాసూర్యునకు నుభయ
పక్షంబులయందు నిరువదేనుకోట్లయోజనపరిమాణంబున నండకటాహం బుండు
నట్టిసూర్యునిచేత నాకాశదిక్స్వర్గాపవర్గంబులును నరకంబులును నిర్ణయింపం
బడు దేవ తిర్యఙ్మనుష్య నాగ పక్షి తృణ గుల్మలతాదిసర్వజీవులకును సూర్యుం
డాత్మ యగుచు నుండు. 75

క. కర మనురాగంబుల నీ, ధరణీమండలముసంవి♦ధానం బెల్ల
[5]న్నెఱిఁగించితి నింతియ కా, [6]దెఱిఁగించెద సర్గమాన ♦ మెల్ల నరేంద్రా. 76

---

1 ‘నెక్కువతక్కువ, లెఱుఁగరు సము లగుచు నుందు♦రెల్లజనంబుల్. 2 మఱియు నందలి జనంబులు సంకల్పసిద్ధులు నయుతాయుష్కులు నిత్యసత్త్వులగుచు దేవతలతోడ సంభాషణంబులు సలుపుచుందు రట్టిపుష్కరద్వీపంబు. 3 కలిగియుండు సూర్యాదిగ్రహతేజోంధతమోమధ్యంబున నుండు టంజేసి లోకాలోక. 4 చతుర్థభాగం బై యుండు నాపర్వతంబుమీఁద నఖిలజగద్గురు వగుబ్రహ్మ చేత నిర్మితం బై ఋషభపుష్కర...లోకరక్షణార్థం బుండు మఱియును. 5 నరవర యెఱుఁగం జెప్పితి, మఱి వినిచెద వినుము దివ్య♦మానం బెల్లన్. 6 నెఱుఁగుము సర్గప్రమాణ మెల్ల.’ వ్రా. ప్ర.

భగణవిషయము.

ఆ. కమలజాండమధ్యగతుఁ డైనసూర్యుండు, భరిత మైనయాతపంబుచేత
మూఁడులోకములను ముంచి తపింపఁగఁ, జేసి కాంతి నొందఁ జేయుచుండు. 75

వ. అట్టిభాస్కరుం డుత్తరాయణ దక్షిణాయన విషువు లనునామంబులు గల మాంద్యతీవ్రసమానగతుల నారోహణావరోహణస్థానంబులయందు దీర్ఘహ్రస్వసమానంబులు గాఁ జేయుచుండు. 76

ఆ. మేషతులలయందు మిహిరుం డహోరాత్ర,మందుఁ దిరుగు సమవిహారములను
బరఁగఁగ వృషభాదిపంచ[1]మాసముల నొ,క్కొక్కగడియ రాత్రి దక్కినడచు.

ఆ. మించి వృశ్చికాదిపంచ[2]మాసముల నొ,క్కొక్కగడియ రాత్రి నిక్కి నడచు
దివములందు నెల్ల దిగజాఱు నొక్కొక్క, గడియ నెలకుఁ దత్ప్రకారమునను. 78

వ. మఱియు నివ్విధంబున దివసంబు లుత్తరాయణదక్షిణాయనంబుల వృద్ధిక్షయంబుల నొంద నొక్కయహోరాత్రంబున [3]నేకపంచాశదుత్తర నవకోటియోజనంబులపరిమాణంబు గలమానసోత్తరపర్వతంబున సూర్యరథంబు దిరుగుచుండు నామానసోత్తరపర్వతంబునందుఁ దూర్పున దేవధాని యనునింద్రపురంబును దక్షిణంబున సంయమని యనుయమనగరంబును బశ్చిమంబున నిమ్లోచని యనువరుణపట్టణంబును నుత్తరంబున విభావరి యనుసోమునిపుటభేదనంబును దేజరిల్లుచుండు నాపట్టణంబులయందు నుదయమధ్యాహ్నాస్తమయనిశీథంబు లనియెడు కాలభేదంబులను భూతప్రవృత్తినివృత్తినిమిత్తం బచ్చట జనులకుఁ బుట్టించుచుండు సూర్యుం డెప్పు డింద్రనగరంబుననుండి గమనించు నది యాదిగాఁ బదియేనుగడియలను రెండుకోట్లముప్పదియేడులక్షలడెబ్బదియైను వేలయోజనంబులు నడచు నివ్విధంబున నింద్రయమవరుణపురంబులమీఁదఁ జంద్రాదిగ్రహనక్షత్రంబులం గూడి సంచరించుచుఁ బండ్రెండంచులు నాఱు[4]గమ్ములును మూఁడు [5]దాలులుం గలిగి సంవత్సరాత్మకం బయి యేకచక్రం బయినసూర్యునిరథంబు ముహూర్తమాత్రంబున ముప్పదినాలుగులక్షలు నెనమన్నూఱుయోజనంబులు సంచరించు. 79

సీ. ఇనురథంబున కున్నయిరుసు సొక్కటియు మేరు, శిఖరంబునందును జేరియుండు
నొనరఁ జక్రము మానసోత్తరపర్వతం, బందులఁ దిరిగెడు నారథంబు
[6]నిరుసున నున్నరెం డిరుసులు దగులంగఁ, బవనపాశంబుల బద్ధ మగుచు
ధ్రువమండలంబునందెసల నంటి యుండఁగా, సంచరించుచు నుండు సంతతంబు

తే. నట్టియరదంబు ముప్పదియాఱులక్షు, లందు నంటినకాఁడియు నన్నియోజ
నములవిస్తారమైతురంగములకంధ, రములఁ[7]దగులుచు వెలుఁగొందు రమణతోడ.

---

1 రాసులకు. 2 రాసులకు. 3 తొంబదికోట్లయెనుబదియొక్కలక్షలయోజనంబుల. 4 నెమ్ములును.
5 నాభులుం. 6 'నిరుసునందున నున్నయిరుసులు. 7 దగిలుండు మిగులంగ రమణ' వ్రా. ప్ర.

వ. ఆరథంబునకు గాయత్త్రీచ్ఛందం బాదిగా సప్తచ్ఛందంబులు నశ్వంబులై సంచరించు భాస్కరునకు నగ్రభాగంబున నరుణుండు నియుక్తుండై రథంబు గడపుచుండు వెండియు నంగుష్ఠపర్వమాత్రశరీరంబులు గలయఱువదివేలవాలఖిల్యాఖ్యు లగుఋషివరులు సూర్యునిముందట సౌరసూక్తంబుల స్తుతియింప మఱియు ననేక మునులును గంధర్వకిన్నరకింపురుషనాగాప్సరఃపతంగాదులును నెలనెల వరుసక్రమంబున సేవింపం దొమ్మిదికోట్లునేఁబదియొకలక్షయోజనంబులపరిమాణంబు గల భూమండలంబునం (దొకక్షణంబున సూర్యుండు రెండువేలయేఁబదియోజనంబులు సంచరించుచు) నొకయహోరాత్రంబునందె యీభూమండలం బంతయు సంచరించు ననిన శుకయోగీంద్రునకుఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 81

క. మునివర మేరుధ్రువులకు, నొనరఁ బ్రదక్షిణము దిరుగు చుండెడు[1]నజుఁ డా
యినుఁ డభిముఖుఁడై రాసుల, కనుకూలత నేఁగు నంటి వది యెట్లొప్పున్.

క. అని పలికినభూవరునిం, గనుఁగొని శుకయోగి మిగులఁ గరుణాన్వితుఁడై
మనమున శ్రీహరిఁ దలఁచుచు, విను మని క్రమ్మఱఁగ నిట్లు వినిపించెఁ దగన్.

వ. నరేంద్రా [2]యతివేగంబునఁ దిరుగు చుండుకులాలచక్రంబునందుఁ జక్రభ్రమణంబునకు వేఱైనగతి నొంది బంతి సాగి తిరిగెడుపిపీలికాదులచందమున నక్షత్రరాసులతోడం గూడినకాలచక్రంబు ధ్రువమేరువులం బ్రదక్షిణంబు దిరుగునప్పు డాకాలచక్రంబువెంట సంచరించుసూర్యాదిగ్రహంబులకు నక్షత్రాంతరంబులయందును రాశ్యంతరంబులయందును నునికి [3]గలుగుటం జేసి సూర్యాదిగ్రహంబులకుఁ జక్రగతిస్వగతులవలన గతిద్వయంబు గలుగుచుండు మఱియు నాసూర్యుం డాదినారాయణమూర్తి యగుచు లోకంబులయోగక్షేమంబులకు వేదత్రయాత్మకం బై కర్మసిద్ధినిమిత్తం బై [4]దేవర్షిగణంబులచేత వేదాంతార్థంబుల ననవరతంబు వితర్క్యమాణం బగుచున్నతనస్వరూపంబును ద్వాదశవిధంబులుగ విభజించి వసంతాదిఋతువుల [5]నాయాకాలవిశేషంబులయందుఁ గలుగఁజేయుచుండు (నట్టిపరమపురుషునిమహిమ నీలోకంబున మహాత్ము లగుపురుషులు దమతమవర్ణాశ్రమాచారములచొప్పున వేదోక్తప్రకారంబుగా భక్త్యతిశయంబున నారాధించుచు క్షేమంబునొందుచుందు) రట్టియాదినారాయణమూర్తి జ్యోతిశ్చక్రాంతర్వర్తియై స్వకీయతేజఃపుంజదీపితాఖిలజ్యోతిర్గణంబులు గలవాఁడై ద్వా

1 నాసూర్యునకును రాసుల కెదుర, యినుచందముఁ దేటపడఁగ ♦ నెఱిఁగింపు తగన్. 2 కులాలచక్రంబుతోడఁ దిరుగుపిపీలికాదులకు భ్రమణవేగంబున స్థానాంతరంబునం దునికి దోఁపనిచందంబున నక్షత్రరాసులతోడం గూడిన. 3 దోఁచుం గాని రాసికి నెదురునడచుట లేదట్టిసూర్యుం డాదినారాయణ. 4 న తనస్వరూపంబు దేవర్షిగణంబులచేత ధ్యానంబు సేయుంబడ్డ దగుచుండుఁ దనస్వరూపంబును ద్వాదశవిధంబులఁ బుట్టించు వసం. 5 నాకాశగతుండై ద్వాదశమాసంబుల ద్వాదశరాసుల ననుభవించు చుండు.

దశరాసులయందు నొకసంవత్సరంబున సంచరించుచుండు నట్టియాదిపురుషుని గమనవిశేషకాలంబును లోకు లయనఋతుమాసపక్షతిథ్యాదులచే వ్యవహరించుచుందురు మఱియు నప్పరమపురుషుం డారాసులయందు షష్ఠాంశసంచారంబు నొందినసమయంబును ఋతు వని వ్యవహరింపుదు రారాసులయందు నర్ధాంశసంచారమ్మున రాశిషట్కభోగం బొందినతఱి యయనం బని చెప్పుదురు సమగ్రంబుగా రాసులయందు సంచార మొందినయెడల నట్టికాలంబును సంవత్సరం బని నిర్ణయింపుదు రిట్టిసమగ్రరాశిసంచారంబునందు శీఘ్రగతి మందగతి సమగతు లనియెడుత్రివిధగతివిశేషంబులవలన వేఱుపడెడునావత్సరంబును సంవత్సరంబు పరివత్సరం బిడావత్సరం బనువత్సరం బిద్వత్సరం బని పంచవిధంబులఁ జెప్పుదురు) చంద్రుండు నీకెఱంగున నాసూర్యమండలంబుమీఁద లక్షయోజనంబులనుండి సంవత్సరపక్షరాశినక్షత్ర[1]భుక్తులు గ్రహించుచు నగ్రచారియై శీఘ్రగతిం జరించునంత వృద్ధిక్షయరూపంబునం బితృగణంబులకుఁ బూర్వపక్షాపరపక్షంబులచేత నహోరాత్రంబులఁ గలుగఁజేయుచు సకలజీవప్రాణం బై యొక్కనక్షత్రంబు త్రింశన్ముహూర్తంబు లనుభవించుచు షోడశకళలు గలిగి మనోమయాన్నమయామృతమయదేహుం డై దేవపితృమనుష్యభూతపశుపక్షిసరీసృపవీరుత్ప్రభృతులకుఁ బ్రాణాప్యాయనశీలుం డగుటంజేసి సర్వసముం డనం బడు.

క. చంద్రునకు మీఁదై మూఁ, డంగంబున లక్షయోజనంబులఁ దారల్
గ్రందుకొని మేరుశైలం, బంది ప్రదక్షిణము దిరుగు [2]నభిజిద్భముతోన్. 85

సీ. అటమీఁదఁ దారల కన్నిటి కుపరియై, రెండులక్షల శుక్రుఁ డుండి భాస్క
రునిముందఱం బిఱుఁదను సామ్యమృదుశీఘ్ర, సంచారములను భాస్కరునిమాడ్కి
జరియించుచుండును జనులకు ననుకూలుఁ, డై వృష్టి నొసఁగుచు నంతనంతఁ
జతురత వృష్టివి[3]ష్కంభకగ్రహశాంతి, నొనరించువారల కొసఁగు శుభము
తే. లుండు నామీఁద బుధుఁడు దా రెండులక్ష, లనుజరించుచు రవిమండలంబుఁ బాసి
కానఁబడినను జనులకు క్షామడంబ, రాదిభయములఁ బుట్టించు నతులమహిమ.

సీ. ధరణీతనూజుఁ డంతటిమీఁద రెండుల, క్షలనుండి మూఁడుపక్షముల నొక్క
రాశి దాఁటుచునుండుఁ గ్రమమున ద్వాదశ, రాసులు భుజియించు రాజసమున
వక్రించి యైన నవక్రతి నైనను, దఱచుగాఁ బీడలు నరుల కొసఁగు
నంగారకునకును నటమీఁద రెండుల, క్షలయోజనంబుల ఘనత మించి
తే. యొక్కరాశినుండి యొక్కొక్కవత్సరం, బనుభవించుచుండు నమరగురుఁడు
వక్రమందు నైన వసుధామనుజులకును, శుభము నొసఁగు నెప్పుడు నభినవముగ.

---

2 ఋతువులు పుచ్చుకొనుచు నగ్ర...బితృదేవగణంబులకు భుక్తి నిచ్చుచు సకలజీవప్రాణుండై......పశుపక్షిసస్యవనలతాగుల్మాదులకు. 2 నభిజిత్సహితమ్. 3 ష్కంభగ్రహోపశాం. తొనరించుచును జను లుశనుఁ డనఁగ.

ఆ. సురగురునకు మీఁదై భాస్కరసుతుఁ [1]డిరులక్షలను జగములకుఁ బీడల్
జరపుచుఁ ద్రింశన్మాసము, లరుదుగ నొక్కొక్కరాశియందు వసించున్. 88
క. ప్రాకటముగ రవిసుతునకు, నేకాదశలక్షలను మహీసురులకు నీ
లోకులకు మేలు గోరుచుఁ, జోకగ మునిసప్తకంబు సొంపు వహించున్. 89
క. మునిసప్తకమున [2]కెగువం, దనరుచు నామీఁదఁ ద్రియుతదశలక్షలఁ బెం
పున శింశుమారచక్రం, బనఁగా నిన్నిటికి నుపరి యగుచుండు నృపా. 90
సీ. [3]ఆశింశుమారాఖ్యమగుచక్రమున భాగవతుఁడైనధ్రువుఁ డింద్రవరుణకశ్య
పప్రజాపతియమప్రముఖులతోఁ గూడి, బహుమానముగ విష్ణుపదముఁ జేరి
కణఁకనిచ్చలుఁ బ్రదక్షిణముగాఁ దిరుగుచుఁ, జెలఁగియుండును గల్పజీవియగుచు
ననఘుఁ డుత్తానపాదాత్మజుఁ డార్యుఁడు, నయినయాధ్రువునిమహత్త్వ మెల్లఁ
తే. దెలిసి వర్ణింప బ్రహ్మకు నలవి గాదు, నే నెఱింగినయంతయు నీకు మున్న
తెలియఁబలికితిఁ గ్రమ్మఱఁ దలఁచికొనుము, జితరిపువ్రాత శ్రీపరీక్షిన్నరేంద్ర.
వ. మఱియు నాధ్రువుండు కాలంబుచేత నిమిషమాత్రం బెడ లేక సంచరించుచు
జ్యోతిర్గ్రహనక్షత్రంబులకు నీశ్వరునిచేత (ధాన్యాక్రమణంబునఁ బశువులకై
యేర్పఱిచినమేధిస్తంభంబుతెఱంగున) మేటి గాఁ గల్పింపంబడి ప్రకాశించు
చుండు గగనంబునందు మేఘంబులును శ్యేనాదిపక్షులును వాయువశంబునం గ
ర్మసారథులై చరించుతెఱంగున జ్యోతిర్గణంబులును బ్రకృతిపురుషయోగగృ
హీతాశులై కర్మనిమిత్తగతి గలిగి వసుంధరం బడకుండురు. 92
క. పొందుగ జ్యోతిర్గణముల, నందఱ నాశింశుమారమండల ముండం
గొందఱు దఱచుగఁ జెప్పుచు, నుందురు నెఱుఁగంగ విను మహోన్నతచరితా.
క. తలక్రిందై వ్రేగ్రవ యై, సలలిత మగుశింశుమారచక్రమునందున్
నెలకొని పుచ్ఛాగ్రంబున, నిలిచి ధ్రువుం డుండు నెపుడు నిర్మలచరితా. 94
వ. మఱియు నాశింశుమారచక్రపుచ్ఛంబునఁ బ్రజాపతియు నగ్నీంద్రధర్ములును
బుచ్ఛమూలంబున ధాతృవిధాతలును గటిప్రదేశంబున ఋషిసప్తకంబును
దక్షిణావర్తకుండలీభూతభూతశరీరంబునకు నుదగయననక్షత్రంబులు దక్షిణ
పార్శ్వంబున దక్షిణాయననక్షత్రంబులును బృష్ఠంబున దేవమార్గంబును నాకాశ
గంగయు నుత్తరభాగంబునఁ బునర్వసుపుష్యంబులును దక్షిణభాగంబున నార్ద్రా
శ్లేషలును దక్షిణవామపాదంబుల నభిజిదుత్తరాషాఢలును దక్షిణవామనాసారం
ధ్రంబుల శ్రవణపూర్వాషాఢలును దక్షిణవామలోచనంబుల ధనిష్ఠామూలలును
దక్షిణవామకర్ణంబుల మఘాద్యష్టనక్షత్రంబులును వామపార్శ్వంబునదక్షిణాయ
నంబును దక్షిణపార్శ్వంబునఁ గృత్తికాదినక్షత్రత్రయంబును నుత్తరాయణంబు

1 డిరులక్షు నుండి జగతికిఁ బీడల్. 2 కెక్కువఁ, దనరుచు శ్రీవిష్ణుపదము దశలక్షల. 3 ఆ
శింశుమారాఖ్యమండలి శ్రీభా.

నువామదక్షిణస్కంధంబుల శతభిషగ్జ్యేష్ఠలును నుత్తరహనువున నగస్త్యుండును నపరహనువున యముండును (ముఖంబున నంగారకుండును గుహ్యంబున శనైశ్చరుండును మేఢ్రంబున బృహస్పతియును వక్షంబున నాదిత్యుండును నాభిని శుక్రుండును మనంబునఁ జంద్రుండును స్తనంబుల నాశ్వినులును బ్రాణాపానంబుల బుధుండును) గళంబున రాహువును సర్వాంగంబులఁ గేతుగ్రహంబును రోమంబులఁ దారలును నుండు [1]నది సర్వదేవతామయం బైనపుండరీకాక్షుని దివ్యదేహంబు ధ్రువునిం గా నెఱుంగుము. 95

సీ. ఇట్టిదివ్యశరీర మెవ్వాఁడు ప్రతిదినం, బందు సంధ్యాకాల [2]మతులభక్తి
మనమందు నిలిపి మౌనమునఁ బ్రయత్నంబున నియతుఁడై తత్త్వబుద్ధి
మానవ్రతంబునఁ బూని వీక్షించుచు, నీసంస్తవంబు దా నెంతొ ప్రేమ [గు
జపియించికడుఁ బ్రశస్తమును[3]మునీంద్రసే, వ్యమునుజ్యోతిస్స్వరూపమున వెలుఁ
ఆ. విపులశింశుమారవిగ్రహంబునకు వం, దనము వందనంబు లనుచు నిలిచి
సన్నుతించె నేని సకలార్థసిద్ధులఁ, బొందు మీఁద ముక్తిఁ జెందు నధిప. 96

క. ఇనమండలంబునకుఁ గ్రిం, దను దశసాహస్రయోజనంబుల స్వర్భా
నునిమండలంబు గ్రహమై, ఘనముగ నపసవ్యమార్గగతి నుండు నృపా. 97

క. అసురాధముఁ డగురాహువు, బిసరుహసంభవునివరము పెంపున నెంతో
పస యగునమరత్వంబున, నసమానం బైనగ్రహవిహారముఁ బొందెన్. 98

సీ. జననాథ రాహువుజన్మకర్మంబులు, వినిపింతు ముందఱ విస్తరించి
యయుతయోజనవిస్తృతార్కమండలము ద్వి, షట్సహస్రవిశాలచంద్రమండ
లముఁ బర్వకాలంబులను త్రయోదశసహ, స్రవిశాల మై [4]మీఁదరాహుగప్పు
నది సూచి యుపరాగమనుచును బలుకుదు, రెల్లవారును స్వధర్మేచ్ఛ లగుచు
ఆ. నంతలోన నినశశాంకమండలములఁ, గనుఁగొని భ్రోవఁ దలఁచి హరి సుదర్శ
నంబుఁ బుచ్చు ననుభయంబున నైదాఱు, గడియలకును రాహు[5]వడిఁకితొలఁగు.

క. నరవర యారాహువునకు, సరసత నాక్రింద సిద్ధచారణవిద్యా
ధరు లయుతయోజనంబులఁ, దిరముగ వసియించి లీలఁ [6]దిరుగుదు రచటన్.

క. పరికింప సిద్ధవిద్యా, ధరులకుఁ బదివేలు క్రిందఁ దరలక యక్షుల్
మఱియును భూతప్రేతులుఁ, జరియింతురు రాక్షసులు పిశాచులు గొలువన్.

ఆ. వారిక్రిందఁ దగిలి వాయువశంబున, మలయుచుండు మేఘమండలంబు
మేఘమండలంబు మీఁ దగుచుండు భూ, మండలంబు క్రింద నుండు నధిప.

వ. అట్టిభూమండలంబుక్రింద [7]యోజనాయుతాంతరంబున నండకటాహాయామం?

1 నిది....ధ్రువంబు గా నెఱుంగుము. 2 ఋతులభుక్తి. 3 జ్యోతిస్స్వరూపంబును నై ప్రశ స్తమైన, విపుల....విగ్రహంబునకును, నధికవందనంబు ♦ లాచరించి, సన్నుతించె నేని. 4 రాహుగ్రాగి కప్పు, నది....మనుచుఁ బల్కుదు రెల్ల, వారును సద్ధర్మ♦వర్తులగుచు. 5 విడిచి తలఁగు. 6 రుగుచునుందుర్. 7 లక్షయోజనంబులవిస్తారంబు గలిగి క్రమంబున.

కలిగి క్రమంబున నొండొంటికిం గ్రిందగుచు నతల వితల సుతల రసాతల తలాతల మహాతల పాతాళలోకంబు లుండు నట్టిబిలస్వర్గంబులయందు నుపరి స్వర్గంబున కధికం బైనకామోపభోగంబుల నైశ్వర్యానందంబులను సుసమృద్ధ వనోద్యాన క్రీడావిహారస్థానంబుల (ననుభవించుచు) దైత్యదానవకాద్రవే యాదిదేవయోనులు నిత్యప్రముదితానురక్తులగుచుఁ గళత్రాపత్యసుహృ[1]ద్బంధు దాసీదాసపరిజనులతోఁ జేరుకొని మణిగణఖచితంబు లగునతిరమణీయగృహం బులయందు నీశ్వరునివలనం జేటు లేనికాయంబులు గలిగి వివిధమాయావిశేష వినిర్మితనూతనకేళీసదనవిహరణమండపవిచిత్రోద్యానాదులయందుఁ గేళీవినోదం బులు సలుపుచుఁ జరియింతు రంత. 103

సీ. అట్టిపాతాళంబులందును మయకల్పితము లగుపుటభేదనములయందు
బహురత్ననిర్మితప్రాకారభవనగోపురసభాచైత్యచత్వరవిశేష
ములయందు [2]నాసురాదులమిథునములచే, శుకపికశారికానికరసంకు
లముల శోభిల్లుకృత్రిమభూములను గల,గృహములచే నలంకృతము లగుచుఁ

ఆ. కుసుమచయసుగంధికిసలయస్తబకసం,తతులచేత [3]ఫలవితతులచేత
నతులరుచిరనవలతాంగనాలింగిత,విటపములను గలుగువిభవములను. 104

వ. మఱియు మానసేంద్రియంబుల కానందకరంబు లైననానావిధజలవిహంగమ మిథునంబులు గలిగి నిర్మలజలపూరితంబు లై మత్స్యకులసంచారక్షుభితంబు లైన కుముదకువలయకహ్లారలోహితశతపత్త్రాదికంబులఁ (దేజరిల్లెడుసరోవరంబులు గలయుద్యానవనంబులయందుఁ) గృతనికేతను లై [4]స్వర్గభూముల నతిశయిం చినవివిధవిహారంబులు గలిగి యహోరాత్రాదికాలవిభాగభయంబులు లేక మ హాహిప్రవరు లయినశేషాదులశిరోమణిరోచులచే [5]నంధకారోపద్రవంబు లేక యెల్లప్పుడు దివసాయమానంబుగా నుండు నాలోకంబునందు నఖిలజనులు దివ్యౌషధిరసరసాయనంబుల ననవరతంబు నన్నపానంబులుగా సేవించుటం జేసి యచ్చటివారలకు నాధివ్యాధులును వలితపలితంబులును జరారోగంబులును శరీరవైవర్ణ్యంబులును స్వేదదౌర్గంధ్యంబులును గలుగక పరమకల్యాణమూర్తు లగుచు హరిచక్రభయంబుదక్క నన్యం బగుమృత్యుభయంబు నొందక యుందు రదియునుం గాక. 105

---

1 దనుచరులం గలిగి గృహపతు లై....గలిగి మాయావినోదు లగుచుఁ జరియిం. 2 నాగాసురులమిథునములచే. 3 ననవతంబు లైన,పాదపముల నొప్పు బహువనావళులచేఁ, బుణ్యనదులచేతఁ బొంపు మిగిలి. 4 యనేకవిహారంబులు గలిగి నిర్మలజలపూరితంబు లగుచు మధుకరనికరవివిధస్వనం రమణీయంబు లయినస్వర్గభూముల నతిశయించి యహోరాత్రాది. 5 సర్వలోధికం బైనతమం బుపంబడుచుండు నంగులపురుషులకు దివ్యౌషధంబులు రసాయనంబులుగా నాధివ్యాధులు.... హర్తు లగుచుందురు పాతాళపురవాసులకు హరిచక్రభయంబు దక్క నేవెంట నన్యభయంబు

తే. అట్టిపాతాళలోకంబులందు విష్ణు,చక్ర మెప్పు డేనియుఁ బ్రవేశంబు నొందు
నప్పు డెల్లను దైత్యకులాంగనలకు, గర్భసంపద లందంద కరఁగు చుండు. 106

చ. అతలమునందు నమ్మయునియాత్మజుఁ డైనబలాసురుండు స
మ్మతిఁ జరియించు షణ్ణవతిమాయలఁ గూడి వినోద మందుచుం
గుతలములందు నేఁడు నొకకొందఱు నచ్చటిమాయఁ జెంది సం
తతముఁ జరించు చుందురు దప్పక మోహనిబద్ధచిత్తులై. 107

వ. అట్టిబలునియావలింతలను స్వైరిణులు కామినులు పుంశ్చలు లనుస్త్రీగణంబులు జనియించి రాకామినీజనంబులు పాతాళంబుఁ బ్రవేశించిన[1]పురుషునికి హాటకరసం బనియెడుసిద్ధరసఘుటిక నిచ్చి రససిద్ధునిం గావించి యతనియందు స్వవిలాసావలోకనానురాగ స్మితసల్లాపోపగూహనాదుల నిచ్ఛావిహారంబులు సలుపుచుండ [2]నాపురుషుండు మదాంధుండై తానె సిద్ధుండ ననియును నాగాయుతబలుండ ననియును దలంచి నానావిధరతిక్రీడలఁ బరమానందంబు నొందు చుండు. 108

సీ. హాటకేశ్వరుఁ డైనయంబికాధీశుండు, వితలంబునందుల వేడ్క నిలిచి
తనదుపార్షదభూతతతులతో [3]బ్రహ్మస,ర్గోపబృంహణమున నొక్కచోటఁ
బార్వతీసంభోగపరుఁ డగు చుండఁగా, వారలవీర్యంబువలనఁ బుట్టి
[4]నట్టిది హాటకి యనియెడినది యని,లాగ్నులు భక్షించి యందు నుమియ

తే. నదియు హాటక మనుపేర నతిశయిల్లి, వన్నె మీఱుచు శుద్ధసువర్ణ మయ్యె
నాసువర్ణంబు నాలోకమందు నున్న,జనుల కెల్లను వినుతభూషణము లయ్యె.

సీ. ఆక్రింద సుతలంబునందు మహాపుణ్యుఁ, డగువిరోచనపుత్త్రుఁ డైనయట్టి
బలిచక్రవర్తి యాపాకశాసనునకు, ముద మొసంగఁగఁ గోరి యదితిగర్భ
మున వామనాకృతిఁ బుట్టి యంతటఁ ద్రివి,క్రమరూపమునను లోకత్రయంబు
నాక్రమించినదానవారాతిచేత ముం, దటన యాఁచబడినయింద్రత్వ మిట్లు

ఆ. గలుగువాఁడు పుణ్యకర్తసంధానుండు, [5]హరిపదాంబుజార్చనాభిలాషుఁ
డగుచు శ్రీరమేశు నారాధనము సేయు,చుండు నెపుడు నతిమహోత్సవమున.

వ. నరేంద్రా సకలభూతాంతర్యామియు దీర్ఘభూతుండును నయినవాసుదేవునియందుఁ జిత్తంబు గలిగి యిచ్చినభూదానంబునకు సాక్షాత్కరించిన మోక్షంబు ఫలం బగుం గాని పాతాళస్వర్గరాజ్యంబులు ఫలంబులు గా నేర వయిన నెవ్వారికిని మోక్షంబు సాక్షాత్కృతంబు గాకుండుటం జేసి లోకప్రదర్శనార్థంబు పా

1 పురుషులందు స్వవిలాసావలోకన. 2 నాపురుషులు తామే యీశ్వరు లనియు సిద్ధు లనియు నాగాయుతబలు లనియుఁ దలంచి గర్వించి మదాంధులై యుందురు. 3 భూతసర్గోపబృంహణముకై 4 హాటకి యనియెడు♦నది యనిలాగ్నులు, భక్షించి యెంతయుఁ ♦ బాఱనుమియ. 5 హరిపదార♦లాషుఁడగుచు, శ్రీరమేశుఁ బూజ♦సేయుచు నుండును, నొనర నెపుడు.

తాళస్వర్గరాజ్యంబుల నిచ్చె క్షుతపతనప్రస్ఖలనాదులందును వివశుం డైనయెడల
హరినామస్మరణంబు సేయుపురుషుండు గర్మబంధంబువలన విముక్తుం డగుచు
సుజ్ఞానంబునం బొందు నట్టివాసుదేవుం డాత్మజ్ఞానప్రమోషణంబు సేయు మా
యామయంబు లైనభోగైశ్వర్యంబుల నెల్ల నెట్లొసంగు నన వలవదు భగవం
తుండు యాచనసేసి సకలసంపదలఁ జేకొని శరీరమాత్రావశిష్టునిం జేసి వారుణ-
పాశంబులం గట్టి విడిచినప్పుడు బలీంద్రుం డిట్లనియె. 111

సీ. పరమేశ్వరునకు నెప్పటిపదార్థములందుఁ, దృష్ణ లేకుండుట దెలిసినాఁడ
నింద్రాదు లెల్ల సురేంద్రునిఁ బ్రార్థించి, యడిగిరి గాని శ్రీహరికిఁ గోరి
కలు లేవు మిక్కిలిగంభీర మగుమహా, కాలస్వభావంబు గలుగుచుండు
నరయంగ మన్వంతరాధిపత్యమును లో, కత్రయంబును నెంత గాన తలఁప

ఆ. మత్పితామహుండు మానవంతుండు ప్ర, హ్లాదవిభునిఁ జూచి హర్ష మంది
యొద్ది యైనఁ గోరు మిచ్చెద ననుటకు, నంతలోన నీశ్వరాజ్ఞఁ దెలిసి. 112

వ. ఇట్లు [1]కృతార్థుం డై పిత్ర్యం బయినరాజ్యంబు నొల్లక పరమేశ్వరదాస్యంబ కో
రె నఁట యాప్రహ్లాదచరిత్ర[2]కథనావసరమ్మున నీతం డికిని నీకును విశేషంబుగా
నేపురుషుండు భగవదనుగ్రహంబుఁ బొంద నోపు నని పుండరీకాక్షుం డానతిచ్చిన
వాక్యంబులు [3]వక్ష్యమాణగ్రంథంబున విస్తరించెద నాబలిచక్రవర్తిగృహద్వా
రంబున నఖిలలోకగురుం డయినశ్రీమన్నారాయణుండు గదాపాణియును నిజ
జనానుకంపితుండును శంఖచక్రాద్యాయుధధరుండును నగుచు నేఁడు నున్నవాఁ
డట్టిబలిద్వారంబున నున్నగరుడధ్వజుండు లోకంబుల గెలువ నిచ్ఛయించిన దశగ్రీ
వుం (డుల్లంఘితశాసనుం డై ప్రవేశంబు గావింపఁ) దనపాదాంగుష్ఠంబున యో
జనాయుతాయుతంబులం బాఱం జిమ్మె వినుము. 113

క. ఆసుతలమునకుఁ గ్రిం దై, భాసిల్లుఁ దలాతలంబు ప్రభు [4]వందు మయుం
డాసురపురనిర్మాతగ, వాసిగఁ బొగ డొంది యేలు వసుధాధీశా. 114

చ. పురహరుచే రమేశ్వరుఁడు భూతహితార్థముగాఁ బురత్రయం
బరుదుగ నీఱు సేసె శరణాగతు నామయుఁ గాంచి యెంతయుం
గరుణఁ దలాతలంబునకుఁ గర్తగ నిల్పిన నున్నవాఁడు శ్రీ
ధరునిసుదర్శనంబునకుఁ దప్పి విముక్తభయుండు గాఁ దగన్. 115

క. తలఁపఁగ నాక్రింద మహా, తలమునఁ గద్రూవధూటితనయులు సర్పం
బులు గలవు పెక్కుశిరములు, నలరంగాఁ గ్రోధవశగణావళి యనఁగన్. 116

వ. మఱియును గుహక తక్షక కాళియ సుషేణాదిప్రధాను లయినవార లతులశరీ

---

1 సర్వతోభయం బై సకలసంపదలు గలరాజ్యంబు. 2 ంబు ననుసరించి తమతండ్రి నాతని వదనుగ్రహంబు నెప్పుడు పొందనోపు నని. 3 ఉత్తరోత్తరంబుగా వినిపింతు, 4 వందులకు పురత్రయంబును, వాసిగ నిర్మించె మయుఁడు వసుధాధీశా.

రంబులు గలిగి యాదిపురుషునివాహనం బైనపతగరాజభయంబున [1]ననవరతం
బు నుద్వేజితు లగుచు స్వకళత్రాపత్యసుహృద్బాంధవసమేతు లయి యుండుదు
రా క్రింద రసాతలంబున దైత్యులు దానవులు నగునివాతకవచకాలకేయు లను
హిరణ్యపురనివాసు లగుదేవతాశత్రువులు మహాసాహసులును దేజోధికులును
నగుచు సకలలోకాధీశ్వరుం డైనశ్రీహరితేజంబునం బ్రతిహతు లై వల్మీకంబు
నందు నడంగి యున్నసర్పంబులచందంబున నింద్రదూత యగుసరమచేఁ జెప్పఁ
బడెడుమంత్రాత్మకవాక్యంబులకు భయంబు నొందు చుండుదురు. 117

క. ఇందుకులోద్భవ వినుమా, క్రిందటిపాతాళమునను గ్రీడించుచు నా
నందము నొందుచు నుండును, సందడిఁ బడి నాగకులము చతురతతోడన్. 118

వ. ఇట్లు వాసుకిప్రముఖు లైనశంఖ కుళిక మహాశంఖ శ్వేత ధనంజయ ధృతరాష్ట్ర
శంఖచూడ కంబ ళాశ్వతర దేవదత్తాదు లయినమహానాగపుంగవులు దీర్ఘమర్ష
ణంబున నైదు నేడు పది నూఱు వేయి శిరంబులు గలిగి ఫణామణికాంతులం
జేసి పాతాళతిమిరంబును బాపు చుండుదురు. 119

సీ. పాతాళలోకంబుపాఁతున శేషుండు, వెలయంగ ముప్పదివేలయోజ
నంబులవెడలుపునను దోఁకఁ జుట్టగాఁ, జుట్టుక యుండు విష్ణుని మహోగ్ర
మైనతాను శరీర మైనయనంతాఖ్య, సంకర్షణుం డుండు సంతతంబు
నట్టియనంతనామాభిధానునిమస్తకమున సిద్ధార్థంబుకరణి ధరణి

ఆ. [2]యంత నావిభుండు నఖిలలోకంబుల, సంహరింపఁ గోరి చండకోప
వశత సృజనఁ జేయు వరుస నేకాదశ,రుద్రమూర్తు లనెడురౌద్రమతుల. 120

ఆ. అట్టిరుద్రమూర్తు లతులత్రినేత్రులు, నఖిలశూలహస్తు లగుచు నుందు
రందు నున్నఫణికులాధిపుల్ శేషుని,పాదపంకజముల భక్తిఁ జేరి. 121

ఆ. నమ్రు లగుచు ననుదినంబును మౌళిర,త్నములచేతఁ గడుముదంబు నొంది
కోరికలు దలిర్ప నీరాజనంబుల, నిచ్చుచుందు రెపుడు మచ్చికలను. 122

వ. మఱియు నాసంకర్షణమూర్తిం జేరి నాగకన్యకలు కోరికలు గలవార లగుచు
నొప్పెడిశరీరవిలాసంబులం జేసి యగరుచందనకుంకుమపంకంబు లనులేపనంబులు
సేయుచు సంకర్షణమూర్తిదర్శనస్పర్శనాదుల నుద్బోధితమకరధ్వజావేశితచిత్తం
బులు గలిగి చిఱునవ్వు లొలయ నధికాభిలాషం జేసి [3]స్మితావలోకనంబుల సవ్రీ
డిత లై యవలోకించు చుండ ననంతగుణంబులు గలయనంతదేవుం డుపసంహా
రింపంబడినక్రోధంబు గలిగి లోకంబులకు క్షేమంబు గోరుచు సురాసురసిద్ధ
గంధర్వవిద్యాధరమునిగణంబు లనవరతంబు ధ్యానంబు సేయ సంతతసంతో

1 జకితు లై స్వకళత్రభృత్యసుహృత్కుటుంబసమేతు లై. 2 దేవియుండు బ్రహ్మదేవునిఁ జెందిన, నందుఁ బ్రీతియ మైన నాగవిభుని, వలన నుదయ మైనవార లేకాదశ, రుద్రమూర్తు. 3 మదముద్రితవిఘూర్ణితారుణకరుణావలోకననయనవదనారవిందంబులను సంప్రీతిఁ జేయు చుండ ననంతగుణంబులు.

పాతి[1]శయంబున మ్రాఁగన్ను వెట్టుచు సలలితగీతవాద్యంబుల నానందంబు
నొందుచుఁ దనపరిజనంబుల నతిస్నేహంబున నవలోకించుచు నవతులసీగంధ
పుష్పరసామోదితమధురవ్రాతమధురగీతంబులు గల వైజయంతీవనమాలికల
ధరియించుచు నీలాంబరధరుండును హలధరుండును నగుచు నితండు (మహేం
ద్రుండో) హరుండో యనుచు జనంబులు వలుకుచుండఁ గాంచనాంబరధరుండై
ముముక్షువులు ధ్యానంబులు సేయ [2]నధ్యాత్మవిద్యాయుక్తం బయినయానంద
హృదయగ్రంథిని భేదించునట్టిశేషుని స్వాయంభువుం డగునారదుండు తుంబురు
ప్రభృతు లగుఋషిశ్రేష్ఠులతోఁ జేరుకొని కమలాసనునిసభాస్థానంబునందు నిట్లు
స్తుతియించు చుండు. 123

సీ. ఓలిమై నెవ్వని లీలావినోదముల్, జన్మసంరక్షణ క్షయములకును
హేతువు లగు చుండు నెవ్వనిచూపుల, జనియించె సత్త్వరజస్తమంబు
లెవ్వనిరూపంబు లేక మై బహువిధం,బులను జగత్తులఁ బోఁచు చుండు
నెవ్వనినామంబు లెఱుఁగక తలఁచిన,యంతన దురితంబు లడఁగు చుండు
తే. నట్టిసంకర్షణాఖ్యుండు నవ్యయుండు, నైనశేషుని వినుతి సేయంగఁ దరమె
తలఁప నెప్పుడు వాఙ్మనంబులకు నింక, మూఁడులోకంబులందును భూతతతికి.
ఆ. మఱియుఁ బెక్కుగతుల మాబోఁటివారలఁ, బ్రోవఁదలఁచి శేషమూర్తి సాత్త్వి
కస్వభావ మొందెఁ గడఁకతో నట్టిశే,షునకు మ్రొక్కు చుందు ననుదినంబు.
వ. మఱియు నాశేషుని నెవ్వం డేని నాకస్థికంబుగ నయినను నార్తుం డగుచు నయి
నను స్మరించినమాత్రన యఖిలపాపంబులం బాసి సకలశ్రేయస్సులం బొందు నట్టి
శేషునినే ముముక్షువు [3]లాశ్రయించి ధ్యానం బొనర్చి భవబంధనిర్ముక్తు లగుదు
రతనిఫణంబులయందు భూగోళం బణుమాత్రం బగుచు నుండు నతనిమహా
మహిమలు గణుతింప సహస్రజిహ్వలు గలపురుషుండైన నోపం డని [4]పలుకుచుం
దు రాయనంతుండు పాతాళంబున నుండి సకలలోకహితార్థంబు భూమిని ధరి
యించు నని లోకతిర్యఙ్మనుష్యగతులను లోకస్థితియును శుకయోగీంద్రుండు
వినిపించి యింక నేమి విన వలతు వెఱింగింపు మనినం బరీక్షిన్నరేంద్రుండు
శుకయోగీంద్రున కిట్లనియె. 126

క. మునివర లోకచరిత్రం, బనుపమము మహావిచిత్ర మగునట్లుగ నా
కును వినిపించితి వంతయుఁ, బనుపడి నాచిత్తమందుఁ బాయక నిలిచెన్. 127
వ. అనిన శుకయోగీంద్రుం డిట్లనియె. 128
ఆ. జంతుజాలములకు శ్రద్ధలు త్రిగుణాత్మకములు గాన వారికర్మగతుల

---

1 శయవిలోకంబునఁ గ్రేఁగన్ను వెట్టుచు. 2 విద్యామయం బయిన హృదయగ్రంథిని భేదించు నట్టిశేషభగవంతుని బ్రహ్మదేవుండు తుంబురునారదాదులం గూడి బ్రహ్మలోకంబునందుండి యిట్లని స్తుతియించుచుండు. 3 లాశ్రయింతు రతనిఫణ. 4 యజుండు వలుకు నాయనంతుండు.

తారతమ్యములును దగిలి యున్నియు [1]వివిధంబు లగుచు సంతతంబు నుండు.

వ. నరేంద్రా ప్రతిషిద్ధలక్షణం బగు నధర్మం (బాచరించు నరుని శ్రద్ధ విపరీతంబుగాఁ బ్రవర్తిల్లు నట్టివానికిఁ గలిగెడి కర్మఫలంబును విపరీతంబుగానె యుండుం గావున ననాద్యవిద్యాకామప్రవర్తనలవలనఁ బెక్కుతెఱంగులఁ గలిగెడు కర్మగతుల సంగ్రహంబుగ) నెఱింగించెద ననిన (శుకునితోఁ బరీక్షి)న్నరేంద్రుం డి ట్లనియె.

ఆ. మునివరేణ్య నరకములు ముజ్జగంబుల,యందో యంతరాళమందో వెలినో
యదియుఁగాక [2]దేశమం దుండుభూవిశే,షములయందో తెలుపు సంతసమున.

వ. అనిన శుకయోగీంద్రుం డి ట్లనియె. 132

శుకయోగి పరీక్షిత్తునకుఁ దెలిపెడినరకలోకవర్ణనము.

క. ఎడ తెగక ముజ్జగంబుల, కడపల నయ్యామ్యదిశను గదలక [3]నిలుచుం
గడుఘోరములుగ నరకము, లడరంగా నంతరాళమందుల నధిపా. 133

వ. మఱియును దక్షిణంబున నగ్నిష్వాత్తాదిపితరులు దమతమగోత్రజులకు (మేలు గలుగుటకొఱకు సత్యంబు లగు)నాశీర్వాదంబుల నొసంగు చుండుదు రచ్చటి పితృపతి యగుశమనుండు దనలోకంబునకుం జనుదెంచుజంతువులకర్మంబులకుం దగినఫలంబుల నిచ్చి శిక్షించుచునుండు నందుఁ దామిస్రంబును నంధతామిస్రంబును రౌరవంబును మహారౌరవంబును గుంభీపాకంబును గాలసూత్రంబును నసిపత్త్రవనంబును సూకరముఖంబును నంధకూపంబును గ్రిమిభోజనంబును సందంశంబును దప్తోర్మియు వజ్రకంటకశాల్మలియు వైతరణియుఁ బూయోదంబును బ్రాణరోధంబును విశసనంబును లాలాభక్షంబును సారమేయాదనంబును నవీచిరయంబును రేతఃపానంబును ననునేకవింశతిమహానరకంబులును మఱియును క్షారకర్దమంబును రక్షోగణభోజనంబును శూలప్రోతంబును దందశూకంబును నవటనిరోధనంబును బర్యావర్తనంబును సూచీముఖంబును నన సప్తవిధనరకంబులతోడం గూడి యష్టావింశతినరకంబులు గల వని కొందఱు నొడువుదు రందు.

క. పరపుత్రకళత్రంబులఁ, బరికింపక యపహసించుపాపాత్ముఁడు దు
ష్కరపాశబద్ధుఁ డై యమ,పురుషులచే నధికబాధఁ బొందుచు నుండున్. 135

వ. మఱియు నివ్విధంబున బాధితుం డగుచుఁ దామిస్రనరకంబునం బడి యనశనాద్రిపాతనదండతాడనతర్జనాదిబాధలం జెంది కడుభయంబున మూర్ఛలం బొందు చుండు. 136

క. పరకాంత నెవ్వఁడేనియుఁ, [4]బురుషుం డుండంగ మోఱఁగి పొందిన యమకిం
కరు లతనిఁ బట్టి వడిఁ ద,త్తఱమునఁ బడవైతు రంధతామిస్రమునన్. 137

వ. నరేంద్రా యెవ్వఁడేనిం గుటుంబపోషణార్థంబు పరులకు ద్రోహంబు సేయు నాన

1 ద్రివిధంబు. 2 మఱియు నందులభూవిశేషములఁ దెలియఁ బలుకు. 3 నిలిచె,ప్పుడుఁ జాయ కుండునరకము. 4 బురుషుఁడు దగ మోహమునను బొందిన·· వడిగాఁ దఱుముచుఁ బడవైతు.

రుండు రౌరవనరకంబునం బడు నెవ్వం (డిహలోకంబునందు స్వేచ్ఛావిహారం
బున సంచరించుచుఁ బరోపద్రవపరాఙ్ముఖంబు లయి యుండు)పశుపక్షిమృగా
దుల బాధించు నాయామృగంబులు రురురూపంబులఁ దాల్చి [1]యట్టిపాపజనుల
నానావిధయాతనల బాధించుటం జేసి రౌరవమహారౌరవనరకంబు లనంబడు
నెవ్వం డేని [2]దేహపోషణార్థంబు మూషికాదుల బిలనిరోధంబుఁ జేసి వధించు
నానిష్కరుణుం డైనపురుషునిం గుంభీపాకనరకంబులయందుఁ గలతప్తతైలం
బులం జెక్కుబాధల నలయింతురు. 138

సీ. తల్లిదండ్రులకును ధరణీసురులకును, నహితంబు సేసినయట్టివాఁడు
కాలసూత్రం బనుకడుఁదీవ్రనరకంబు, నందును నందంద యయుతయోజ
[3]నాయతపాత్రాదులందుల సూర్యుఁడా,మీఁదఁ గ్రిందను వహ్ని మిగుల మండ
నత్యంతక్షుత్పిపాసాదులచేతను, బాధితుం డగు చుండుఁ బాయ కెపుడుఁ

ఆ. బరువు వెట్టుచున్నఁ బడి యున్న నిలిచినఁ, గదల కున్నఁ జాల నొదిఁగియున్న
బాధఁబొందుచుండుఁ [4]బశురోమములలెక్క, వరుస నపరిమేయవత్సరములు.

వ. మఱియు వేదమార్గంబు విడిచి పాషండమార్గంబు లాదరించుపురుషుని నసిపత్త్ర
వనంబునందు యమకింకరు[5]లు తఱట్ల నడుచుచుఁ బరిహసించుచుం దోలు నెడ
నాయసిపత్త్రంబు లిరుగెలంకుల శరీరంబు ద్రెంచుచుండ నడుగడుగునకు బిట్టు
మొఱవెట్టుచుండ బాధించుచుండుదురు. 140

క. దండింపఁ దగనివారల, దండించిన విప్రవరులతనువులు ముట్టన్
దండించిన దుర్మతుల, న్దండింతురు కాలసూత్రనరకములందున్. 141

ఆ. మఱియు నట్టిదుష్టమానవుఁ గింకరుల్, విఱిచి చెఱకుఁగోల విఱిచినట్లు
బాధపెట్టుచుండఁ బడి మూర్ఛ నెందుచు, మొఱలువెట్టుచుండ భూపవర్య.

వ. నరేంద్రా యెవ్వం డేని నీశ్వరకల్పితవృత్తి గలజంతువుల హింసించు [6]నట్టివాని
నంధకూపం బనునరకంబునం బడవైచిన నందు నతండు దొల్లి తాను జేసినభూత
ద్రోహంబున నచ్చట వివిధక్రూరపక్షిమృగపశుసర్పమశకమత్కుణమక్షికాదుల
చేత హింసం బొందుచు మహాంధకారంబునందు నిద్రానుభవసుఖలేశంబును
లేక కుశరీరంబునందులజీవుండునుంబోలె మృతప్రాయుం డై యుండునంత. 143

క. తనకలిమి నెవ్వఁడేనిం, దనబాంధవవరులఁ గూడి తగఁ గుడువక తా
నును వాయసంబు భక్షిం,చినమాడ్కిం దిన్నవాని శీఘ్రమె యచటన్. 144

క. క్రిమిభోజన మనియెడినర,కమునం బడి క్రిములె కూడుగాఁ గుడుచుచుఁ దాఁ
గ్రిమి యగుచు లక్షపరిమా,ణముఁ గలక్రిమికుండమందు నాటుక యుండున్.

---

1 యట్టివాని బాధించుట. 2 పశుమృగాదులఁ బ్రాణనిరోధంబు సేసి. 3 నాయసిపత్త్రాదు.
4 బహుపురోమము లెన్ని, వరుస నన్ని వేలవత్సరములు. 5 లదరంట నడుచుచు. 6 నెడ వానికిం దన
బుద్ధిబలంబునఁ బ్రతిహింస చింతించు.

వ. మఱియు నీభూలోకంబున నెవ్వఁ డేని నవిపన్నుం డై చౌర్యవృత్తిచే బ్రాహ్మ
ణాదులహిరణ్యరత్నాదిద్రవ్యంబు లపహరించినను బ్రాహ్మణుం డితరజాతివారల
హిరణ్యద్రవ్యంబపహరించినను నట్టిపురుషుని నగ్నివర్ణంబు లగు[2]నయఃపిండంబుల
నగ్నితప్తంబు లగుశూలంబుల నతనిశరీరంబునం దివియుచుండుదురు మఱియును
మదనాతురు లగుచు స్త్రీపురుషు లగమ్యాగమనంబు సేసి రేని నట్టివారిని యమ
లోకంబున [3]నతితీక్ష్ణకశాతాడితులం జేసి యగ్నిమయంబు లయినయుక్కుప్రతి
మల నాలింగనము సేయింతురు. 146

ఆ. [4]సర్వజంతుజాల। సంగమ మొందెడు, వానిఁ బట్టి కట్టి। వజ్రదంష్ట్ర
కములు గలుగునట్టి। ఘనతరశాల్మలీ, [5]తరువులందుఁ జేర్చి। దంతు రెపుడు. 147

ఆ. పార్థివేంద్ర నరుఁడు। పాషండదర్శనుఁ, డగుచు ధర్మమార్గ। మడఁచె నేని
వాఁడు నరకమందు। వైతరణీనది, నుడుగ కెపుడుఁ బొరలి। పడుచు నుండు. 148

వ. మఱియు నట్టివైతరణీనదియందు జలగ్రాహంబులు దిగిచి భక్షింపఁ బ్రాణంబులు
నిర్గమింపఁ దనపాపంబు లుచ్చరించుచు విణ్మూత్రపూయశోణితకేశనఖాస్థిమేదో
మాంసవసాదులం దప్తుం డగుచు నుండు విప్రుండు శూద్రకామినులం బొంది
శౌచాచారంబులం బాసి గతలజ్జుం డై పశువుంబోలెఁ జరియించె నేని నతండు
నరకంబునం బొంది యందుఁ బూయవిణ్మూత్రలాలాశ్లేష్మపూర్ణార్ణవమందు
(ద్రొబ్బం)బడి యతిబీభత్సిత(ంబు లగునా)ద్రవ్యంబుల భుజియించు చుండు.

క. శునకములఁ బెంచి యెవ్వం, డనయంబును వేఁట సలిపి। యాత్మార్థముగా
వనమృగములఁ జంపును నా, మనుజాధము నస్త్రములను। మర్దింతు రొగిన్. 150

ఆ. జృంభణమున నరుఁడు। దంభార్థ మై పశు, వులను జంపి జన్న। ములను జేయు
వానిఁ బట్టి యముని। వారలు గోయుచు,నుండు రెపుడు మిగుల। సందడిలుచు.

వ. కామమోహితుం డై యెవ్వం డేనిఁ దనభార్యచేతఁ గోశఃపానంబు సేయించు
నాపాపాత్ముని రేతోహ్రదంబునం ద్రోచి యారేతంబునె పానంబు సేయింపు
దురు రాజపుత్రులైనను జోరులైనను ధనికులగ్రామంబుపైఁ బడి యందు గృహ
దాహంబు సేయువారలను విషాదులవలన నన్యులఁ జంపెడువారలను వజ్ర
దంష్ట్రిలు గలవింశత్యుత్తరసప్తశతశునకంబు లెడ తెగక తిగిచి భక్షించుచుండు.

సీ. లంచంబుఁ గొని సాక్షి। వంచించి యనృతంబు, వలికెడుపాపాత్ముఁ। బట్టి కట్టి
యంత మానక వీచి। యనునరకమునందు, శతయోజనోన్నత। శైలశిఖర
మునఁ దలక్రిందుగా। నునిచి యధోముఖం,బుగఁ బడద్రొబ్బిన। బొబ్బలిడుచుఁ
గల్లోలములు లేని। కమలాకరముఁబోలె, జదర మై యున్నపా। షాణమందుఁ

---

1 స్నేహబలోద్బుద్ధుల ధరామరుల హిరణ్యాది. 2 నినుపతండసంబుల శరీరంబుఁ బొడియు చుందురు. 3 నతితీక్ష్ణంబు లై తప్తంబు లయినయుక్కుప్రతిమల. 4 పర్వకాలమందుఁ బడఁతులఁ బొందిన, వానిఁ బట్టి కట్టి వజ్రకంటకములు. 5 దారువులను జేర్చి తర్తు రెపుడు.

తే. బడినయంతన దేహంబు పగిలి పెక్కు, తునుకలై పాసి యది గూడి కొనుచునుండ
దండియాకులతను బొందు చుండుఁ గాని, చావు లేకుండు నాదుష్ట జంతువునకు.

ఆ. సోమయాజిభార్యఁ గామించి పొందిన, వానిఁ గపటమద్య పానసోమ
పాన మనుదినంబుఁ బానంబు సేయువి, ట్క్షత్త్రియులను బట్టి సంభ్రమమున.

ఆ. ఱొమ్ముఁ ద్రొక్కి మోము ఱిమ్మవట్టఁగ మోఁది, యనలముఖమునందు నగ్నివర్ణ
ముగను గాఁచి వక్త్రమున నిండఁగా నుక్కు, నీరు వోతు రేచి నిష్ఠురముగ.

వ. మఱియు నీచవర్ణుండు నిష్ఠ సలుపుచుఁ దపోదానవిద్యాచారంబులఁ బెద్దల కవ మానంబు సేయువాఁడు క్షారకర్దమం బనునరకంబునందు నధోముఖుం డగుచు బాధలం బొందు స్త్రీపురుషు లెవ్వరేని శరీరరక్షణార్థంబు పశువుల మానవుల బలి యిచ్చిరేని వారల నిరయంబునందు యమకింకరులు సురియలం దునిమి తద్రక్తంబు పానంబు సేయుచుం బాఁటాడు చుందురు గ్రామారణ్యంబులయం దు జంతువుల శూలప్రోతంబులం గావించి (హింసించుచు హర్షించు చున్న) వారలను శూలసూత్రం బనునరకంబునందు శూలప్రోతులం జేసిన క్షుత్పిపాసా పరవశు లగుచుండఁ గంకగృధ్రాదులు (దీక్ష్ణతుండాగ్రంబులం) దిగిచి భక్షిం చుచుండు మఱియు ధూర్తస్వభావంబున జంతుపీడనంబుఁ గావించెడుపాపా త్ముల దందశూకం బనునరకంబునందు నైవ నైదునేడుముఖంబులసర్పంబులు గఱచు చుండు. 156

ఆ. [1]ఎనయ వొడ్డిలోన నిండ్లలో నైనను, బశుపతంగహారిణ పంక్తి నెల్లఁ
బట్టి హింస సేయు పాపాత్ము విషవహ్ని, ధూమశిఖల ద్రొబ్బు రదుగు నృపాల. 157

క. తనయింటికి వచ్చినమను, జుని నతిథిం గ్రోధదృష్టిఁ జూచినవానిం
గనుఁగవల వజ్రదంష్ట్రలఁ, దనరినయాకంకగృధ్రతతి భక్షించున్. 158

మ. ధనవంతుం డగుమానవుండు గడఁకన్ ధర్మోపకారంబులన్
ఘనతం జేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం
బనునాదుర్గతిఁ బట్టి త్రోచి యిది గాపై యున్నభూతం బట
న్నును బాశంబులఁ బట్టి కట్టి వడితో నొప్పింతు రత్యుగ్రులై. 159

ఆ. నరవరేణ్య యిట్టినరకముల్ యమలోక, మందుఁ గలవు మఱి సహస్రసంఖ్య
లందు శమనదూత లనిశంబు బాధింతు, రవని ధర్మదూరు లయినసరుల. 160

ఆ. ధర్మవంతు లెల్లఁ దప్పక స్వర్గంబు, నందు భోగసమితిఁ బొందు చుండు
రెలమిఁ బుణ్యపాపములశేషములవల్లఁ, బుట్టుచుందు రవనిఁ బుణ్యచరిత. 161

వ. నరేంద్రా మోక్షమార్గంబు మున్నె వినిపించితి నిప్పుడు నీ కెఱిఁగించిన వెల్లను బ్రహ్మాండకోశంబునం జతుర్దశకోశంబులు గల వని పురాణంబులు వలుకుచుండు నట్టిబ్రహ్మాండంబు శ్రీమన్నారాయణునిస్థూలశరీరం బగుటం జేసి బ్రహ్మాండం బెవ్వ

1 దొడ్లలోన నైనఁ దొడి నిండ్లలో నైన.

రు వర్ణింతు రెవ్వరు విందురు వారలకు సకలశ్రేయస్సులుం గలుగు నీశ్వరస్థూల శరీరంబుఁ దెలిసినవారికి శ్రద్ధాభక్తులం జేసి స్థూలదేహంబు నెఱుంగవచ్చు భూద్వీపవర్షసరిదద్రినభస్సముద్రపాతాళదిఙ్నరకతారాగణలోకసంస్థితం బయినసకల జీవనికాయ్యంబై యద్భుతం బైన శ్రీహరిస్థూలశరీరప్రకారంబు వినిపించితి [1]నని.

చ. జలజభవాదిదేవమునిసన్నుత తీర్థపదాంబుజాత ని
ర్మలనవరత్ననూపురవిరాజిత కౌస్తుభభూషణాంగ యు
జ్జ్వలతులసీ[2]కురంగమదవాసనవాసితదివ్యదేహ [3]శ్రీ
నిలయశరీర కృష్ణ ధరణీధర భానుశశాంకలోచనా. 163

క. శ్రీతరుణీహృదయస్థిత, పాతకహర సర్వలోకపావన భువనా
తీతగుణాశ్రయ యతివి, ఖ్యాతసురార్చితపదాబ్జ కంసవిదారీ. 164

మత్తకోకిలము. దండితారిసమూహ భక్తనిధాన దానవిహార [4]మా
ర్తాండమండలమధ్యసంస్థిత తత్త్వరూప గదాసికో
దండశంఖసుదర్శనాంక సుధాకరార్కసునేత్ర [5]భూ
మండలోద్ధర ణార్తపోషణ మత్తదైత్యనివారణా. 165

గద్యము. ఇది శ్రీసకలసుకవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్యప్రణీతం బైన శ్రీమద్భాగవతమహాపురాణంబునందు భరతాత్మజుం డైనసుమతికి రాజ్యాభిషేకంబును పాషండదర్శనంబును సుమతిపుత్రజన్మవిస్తారంబును గయునిచరిత్రంబును గయునిసంస్తుతియు భూద్వీపవర్షసరిదద్రినభస్సముద్రపాతాళదిఙ్నరకతారాగణసంస్థితియు ననుకథలు గలపంచమస్కంధంబునందు ద్వితీయాశ్వాసము.

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

---

1 ‘సర్వంబును విష్ణుమయం బని తెలియుచు శ్రీహరిపాదారవిందంబులు నిరంతరంబును ధ్యానంబు సేయువారలు విష్ణుపదంబునం జెందంగలవారలు గావున నీవు పరమభాగవతుండవును నారాయణపరాయణుండవును గావున నీకు వినిపించితి నీపరమపావనం బైనకథాప్రపంచంబు వినునతండు విగతపాపుం డై వైకుంఠంబున వసియించు నని శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పె నని సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పె నిట్లు’ వ్రా. ప్ర. 2 మకరందమద. 3 ‘శ్రీనిలయ నిశాచరేంద్రఘననీరదమారుత రాఘవేశ్వరా’ అనియు, 4 ‘మార్తాండవంశసుధాబ్ధిపూరసుధామయూఖ సదాసి’ అనియు, 5 ‘భూమండలేశ నతార్తిపోషణ’ అనియు నీయాశ్వాసమునంత్యపద్యములను ఆదిపద్యముంబోలె రామాంకితముగాఁ జూపట్టెడి. మఱియు నీస్కంధపురెండాశ్వాసములగద్యములును నేకగద్యముగాఁ గానిపించుచున్నవి.

శ్రీ ర స్తు

శ్రీరామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

షష్ఠస్కంధము

[1]వత్సాంకితకౌస్తుభస్ఫురితలక్ష్మీచారువక్షస్స్థల
శ్రీవిభ్రాజితు నీలవర్ణు శుభరాజీవాక్షుఁ గంజాతభూ
దేవేంద్రాదిసమస్తదేవమకుటోద్దీప్తోరురత్నప్రభా
వ్యావిద్ధాంఘ్రిసరోజు నచ్యుతుఁ గృపావాసుం బ్రశంసించెదన్. 1

ఉ. నిండుమతిం దలంతుఁ గమనీయభుజంగమరాజమండలీ
మండనుఁ జంద్రఖండపరిమండితమస్తకుఁ దారమల్లికా
పాండురవర్ణుఁ జండతరభండను హేమగిరీంద్రచారుకో
దండు మహేశు గంధగజదానవభంజను భక్తరంజనున్. 2

ఉ. హంసతురంగముం బరమహంసము నంచితదేవతాకులో
త్తంసము నాగమాంతవిదితధ్రువపుణ్యరమావతంసముం
గంసజిఘాంసునంశమును గర్బురసూత్రసమావృతాంసముం
హింస నడంచు[2]బ్రహ్మము నహీనశుభంబులకై భజించెదన్. 3

ఉ. మోదకహస్తునిన్ సమదమూషకవాహను నేకదంతు లం
బోదరు నంబికాతనయు నూర్జితపుణ్యు గణేశు దేవతా
హ్లాదకరిష్ణు దంతిముఖు నంచితభక్తఫలప్రదాయకున్
మోదముతోడ హస్తములు మోడ్చి భజించెద నిష్టసిద్ధికిన్. 4

ఉ. కల్లతనంబు గాక పొడగట్టినపూర్వపురీతి నేఁడు నా
యుల్లమునందు నుండుము సమున్నతతేజముతోడ భక్తి రం
జిల్లినచూపు గూడ విధిఁ జెందినప్రోడ బుధాళిసేడ మా
తల్లి దయామతల్లి ప్రణతద్రుమకల్పకవల్లి భారతీ. 5

---

1 కొన్నిప్రతుల నీపద్యమునకు మాఱుగా 'క. భూతనయాహృదయస్థిత, పాతకహర సర్వలోకపావన భువనా, తీతగుణాశ్రయ యతివి,ఖ్యాత సురార్చితపదాబ్జ కరుణానిలయా' అని యున్నది.

2 'నబ్జభవు నెల్లశుభం' వ్రా. ప్ర.

క. విలసత్కంకణరవరవ,కలితం బగునభయవరదకరముల బెరయం
జెలరేఁగి భక్తులకు నల,కలుముల దయసేయుజలధికన్యకఁ దలఁతున్. 6

క. కాళికి బహుసన్నుతలోఁ,కాళికిఁ గమనీయవలయకరకీలితకం
కాళికిఁ దాపసమానస,కేళికి వందనము సేసి కీర్తింతు మదిన్. 7

వ. అని యిష్టదేవతాప్రార్థనంబు సేసి. 8

చ. పరమసమాధిధుర్యుఁ బటుపావనకర్తవిధేయు దేవతా
వరనరవంద్యు సద్విమలవాక్యు జనార్దనకీర్తనక్రియా
భరణసమర్థు వేదచయపారగు భవ్యుఁ ద్రికాలవేది భా
సురమతిఁ గొల్చు [illegible] బుధశోభితుఁ బుణ్యుఁ బరాశరాత్మజున్. 9

క. వ్యాసుని భగవత్పదసం,వాసుని నాగమపురాణవరవిష్ణుకథా
వాసుని నిర్మలకవితా,భ్యాసునిపదపద్మయుగము భావింతు మదిన్. 10

సీ. వరకవిశ్లోద్రేకి వాల్మీకిఁ గొనియాడి, భాగవతార్థవైభవముఁ బలుకు
శుకమంజులాలాపు శుకయోగిఁ బ్రార్థించి, బాణమయూరులప్రతిభ నొడివి
భాససౌమిల్లికభారవిమాఘుల, ఘనసుధామధురవాక్యములఁ దలఁచి
కాళిదాసుఁ గవీంద్రకల్పవృక్షముఁ గొల్చి, నన్నపాచార్యు వర్ణనలఁ బొగడి

తే. వెలయఁదిక్కనసోమయాజుల భజించి, యెఱ్ఱనామాత్యుభాస్కరునిచ్చఁగొల్చి
సుకవిసోముని నాచనసోము నెఱిఁగి, కవిమనోనాథు శ్రీనాథు ఘనత మెచ్చి.

ఉ. ఎమ్మెలు సెప్ప నేల జగ మెన్నఁగఁ బన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు సేసినవానిభక్తిలోఁ
నమ్మినవాని భాగవతనైష్ఠికుఁ డై తగువానిఁ బేర్మితోఁ
బమ్మెరపోతరాజుఁ గవిపట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్. 12

వ. అని సకలసుకవినికరంబులకు ముకుళితకరకమలుండ నై. 13

ఉ. ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు విభూతికారణం
బెయ్యది సన్మునీంద్రులకు నెల్లఁ గవిత్వసమాశ్రయంబు మ
న్నెయ్యది సర్వమంత్రముల నేలిన దెయ్యది మోక్షలక్ష్మికి రూ
పెయ్యది దానిఁ బల్కెద సుహృద్యము భాగవతాఖ్యమంత్రమున్. 14

వ. అని శ్రీమహాభాగవతపురాణంబునందు షష్ఠస్కంధం బాంధ్రభాష రచియిం
పం బూని యాకృతికిం బతిగా నద్దేవుండు గలం డని వితర్కించి నాకుం గవిత్వ
మహత్త్వంబు సంప్రాప్తం బగుకాలంబు దలంచి నారాయణుండె దైవం బని
యెఱింగి మనోరథంబు సఫలం బయ్యె నని యాకృతిఁ గృష్ణార్పణంబు చేసితి
నది యె ట్లనిన నేను విద్యాభ్యాసంబునం దగిలి కొండుక నై యుండ నొక్క
నాఁడు దివంబున. 15

చ. కలితవిశేషవస్త్రములు గట్టి హిమాంబుసుగంధచందనం

బలఁది వినూత్నభూషణము లారఁగఁ దాల్చి వినోదలీల నిం
పులమృదుశయ్య నిద్రఁ దగఁ బొందినచోఁ గనుపట్టెఁ బల్లఱుం
దలమునఁ గ్రమ్ముకొమ్మెఱుఁగుతండము రూపున నిల్చుపోలికన్. 16

సీ. ఉరవడిఁ బ్రాగ్వీధి నుదయించుమార్తాండ,కోటిబింబచ్ఛాయ గూడినట్లు
హరిహరబ్రహ్మలయాత్తలలో నుబ్బి, కరుణ యొక్కట మూర్తి బెరసినట్లు
ఖరకరకరతీవ్రగతిని గరంగుచు, హేమాద్రి[1] చెంతఁ బై లెగసినట్లు
ఫణిరాజఫణరాజిమణిగణవిస్ఫూర్తి. సుషిరంపువెలిఁ దలచూపినట్లు
తే. లుట్టిపడ్డట్లు కట్టెదుట నూఁదినట్లు, తేజ మెసఁగంగ నామ్నాల దివ్యవాణి
పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టిఁ, జూచి యిట్లనిపలికె మంజులముగాను.

ఉ. ఆటలుఁ బాటలుం జదువు లద్భుతముల్ విన నొప్పువాద్యముల్
సాటి దలంప రానిబలుసాములు మున్నగువిద్య లెల్ల నీ
కాటలుఁ బాట లయ్యె విను మన్నిటికిన్ మెఱుఁ గిడ్డభంగి నా
చాటునఁ జాటుకారపదసాధుకవిత్వముఁ జెప్పు మింపుగన్. 18

వ. అని యాన తిచ్చు జగన్మాతృకృపావలోకనసుశ్లోకుండ నై యే నొక్కశ్లోకంబు
నాక్షణంబ నుడివితి నది యెట్టి దనిన, 19

శ్లో. హంసాయ సత్త్వనిలయాయ [2]సదాశ్రయాయ
నారాయణాయ నిఖిలాయ నిరాశ్రయాయ
సత్సంగ్రహాయ సగుణాయ సదీశ్వరాయ
సంపూర్ణపుణ్యపతయే హరయే నమస్తే. 20

వ. ఈశ్లోకం బద్దేవి యంగీకరించె నంత మేలుకాంచి యానందభరితుండ నై నాఁట
నుండి చంద్రానుగత యగుచంద్రికయుంబోలె నారాయణాంకితం బయినకవిత్వ
తత్త్వజ్ఞానంబు గోచరం బయ్యె దానికి ఫలంబుగా గోపికావల్లభుని నుల్లం
బున నిడుకొని. 21

ఆ. పలుకఁ గలిగె మొదల భాగవతార్థంబు, భర్త కృష్ణుఁ డయ్యె భాగ్యమొదవె
నమృతరసముఁ గోర నలరుచింతామణి, పాత్ర సంభవించు భంగి నిపుడు. 22

ఆ. (భాగవతము దేటపఱుప నెవ్వఁడు సాలు, శుకుఁడుదక్క నరునిసఖుఁడుదక్క
బుద్ధిఁ గోఁచినంత బుధులచే విన్నంత, భక్తి నిగిడినంత పలుకువాఁడ.) 23

ఉ. పుట్టిననాఁటనుండియును బుట్టద యెట్టియు దట్టు నైనఁ జే
పట్టి నుతింపఁ జిత్తము శుభం బగు మద్వరవాక్యసీమకుం
బట్టము గట్టినాఁడ హరిఁ బాయక తత్కథనామృతంబు నే
నుట్టిపడంగఁ జెప్పెదను బుధోత్తము లానుఁడు శ్రోత్రపద్ధతిన్. 24

వ. అని. 25

1 భాగ పై లెగసి. 2 యనీశ్వరాయ.

సీ. శ్రీవత్సగోత్రుండు శివభక్తియుక్తుఁ డా,పస్తంబసూత్రుఁ డపారగుణుఁడు
నేర్పారిశాసనుం డెఱ్ఱనప్రెగ్గడ, పుత్రుండు వీరన పుణ్యమూర్తి
కాత్మజుం డగునాదయామాత్యునకుఁ బోల,మాంబకు నందను లమితయశులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి, సింగధీమణియు సంచితగుణాఢ్యు
తే. లుద్భవించిరి తేజంబు లూర్జితముగ, సారిది మూర్తిత్రయం బన శుభ్రకీర్తిఁ
బరఁగి రందులఁ గసువనప్రభువునకును,ముమ్మడమ్మనుసాధ్వి యిమ్ములను వెలసె.

ఉ. ఆడదు భర్తమాట కెదు రాడదు వచ్చినవారి వీడఁగా
నాడదు పెక్కుభాష లెడ నాడదు వాకిలి వెళ్లి కల్ల మా
టాడదు మిన్న కేని సుగుణావళి కిందిర గాక సాటి యే
చేడియ లేదు చూరికులశేఖరుకన్వయముమ్మడమ్మకున్. 27

క. ఆకసువయమంత్రికిఁ బు,ణ్యాకల్పశుభాంగి ముమ్మడమ్మ మమున్న
వ్యాకులచిత్తుల నిరుపుర, శ్రీకరగుణగణులఁ బుణ్యశీలురఁ గాంచెన్. 28

క. అంగజసమలావణ్యాశు, భాంగులు హరిదివ్యపదయుగాంబుజవిలస
ద్భృంగాయమానచిత్తులు, సింగయ తెలగయలు మంత్రిశేఖరు లనఁగన్. 29

క. అందగ్రజుండ శివపూ,జం దనరినవాఁడ విష్ణుచరితామృతని
ష్యందిపటువాగ్విలాసా,నందోచితమానసుండ నయకోవిదుఁడన్. 30

వ. కావునం గృష్ణపాదారవిందసందర్శనాదర్శతలాయమానచిత్తుండ నయి. 31

—షష్ఠ్యంతములు.—

క. శ్రీపతికి మత్పతికి నుత,గోపతికిఁ ద్రిలోకపతికి గురుజనబుధసం
తాపనివారణమతికిని, బ్రాపితసనకాదితతికి బహుతరధృతికిన్. 32

క. సూరికి గురుకలుషకుంజర,హరికి బలాభీలహరికి సంగస్థితగ
హ్వరికి నరహరికి రక్షిత,కరికిఁ గరాగ్రస్థగిరికిఁ ఘనతరకిరికిన్. 33

క. గుణికి సమాశ్రితచింతా,మణికి మహేంద్రాదిదివిజమండలచూడా
మణికిఁ బ్రకల్పితశయ్యా,ఫణికి నురోభాగకౌస్తుభప్రియమణికిన్. 34

క. కంసాసురసంహారున, కంసాంచితకర్ణకుండలాభరణునకున్
హింసాపరవరమస్తక,మాంసకరాళితగదాభిరామతహస్తునకున్. 35

క. వరయోగిమానసాంతః,కరణసుధాంభోధిభావకల్లోలలస
త్పరతత్త్వశేషశాయికిఁ, జిరదాయికి సకలభక్తచింతామణికిన్. 36

వ. సమర్పితంబుగా నాయొనర్పం బూనినషష్ఠస్కంధంబునకుఁ గథాప్రారంభక్రమం
బెట్టి దనిన హరిచరణస్మరణపరిణామవినోదు లయినశౌనకాదులకు నిఖిలపురాణేతి
హాసనిర్ణయవిఖ్యాతుం డైనసూతుం డి ట్లనియె. 37

క. శ్రీరమణీరమణకథా,పారాయణచిత్తుఁ డగుచుఁ బలికెఁ బరీక్షి
ద్భూరమణుఁ డాదరంబున, సూరిజనానందసాంద్రు శుకయోగీంద్రున్. 38

సీ. షడ్గుణైశ్వర్యశాశ్వతమూర్తి వయినట్టి, మునినాథ దయతోడ ముక్తిపదము
మున్నుగా నేమార్గమున వినిపించితి, వారయ నపవర్గభూరిమహిమఁ
గ్రమయోగసంభవబ్రహ్మంబుతోఁగూడ, ననువొంద నగు నని వినుతికెక్క
మఱియు సత్త్వరజస్తమఃప్రభావంబులఁ, గడిఁది యై యున్నట్టి కర్తచయము
తే. నప్పటప్పటి కడఁగనియట్టి ప్రకృతి, గలుగుపురుషునిభోగార్థఘటన దేహ
కారణారంభరూపమార్గంబు మొదలు, మాటిమాటికి నన్నియుఁ దేటపడఁగ.

వ. మఱియు ననేకపాపలక్షణంబు లగునానావిధనరకంబులును వాని కాద్యంతంబు
లును స్వాయంభువసంబంధి యగుమన్వంతరంబును బ్రియవ్రతోత్తానపాదుల
వంశంబును దచ్చరిత్రంబును ద్వీపవర్షసముద్రాదినద్యుద్యానవనస్పతులును
భూమండలసంస్థాపనంబును వానిపరిమాణంబును జ్యోతిశ్చక్రచలనప్రకారం
బును విభుం డయినపరమేశ్వరుం డెవ్విధంబున నిర్మించె నావిధం బంతయు
నెఱింగించినాఁడ నిప్పుడు. 40

ఆ. కడిఁదివేదనలకుఁ గారణం బై యుండు, గుఱుతు లేనినరకకూపరాశి
పాలు గాక నరుఁడు బ్రదికెడుమార్గంబు, పరమపుణ్య తెలియఁ బలుకవయ్య. 41

వ. అనినం బరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 42

క. కట్టా త్రికరణ [1]మెఱుఁగక, పుట్టినదురితముల నపుడ పొలియింపనియా
కట్టిఁడి దేహం బుడిగినఁ, గొట్టాడును బిట్టు నరకకూపంబులఁగోన్. 43

ఉ. కావునఁ గాలకింకరవికారము గానకమున్న మృత్యుదు
[2]ర్భావనఁ జిత్తముర్ వెడఁగుపాటును జెందకమున్న మేనిలో
జీవము వెల్లుచుండఁ దనచెల్వము దప్పకమున్న పన్నుగాఁ
బావనచిత్తుఁ డై యఘముఁ బాయుతెఱంగొనరింపఁగాఁ దగున్. 44

క. కాలం బెడ గని పాపము, మూలముఁ జెఱుపంగ వలయు మును [3]రోగములం
దేలినదోషము నెఱుఁగుచు, వాలాయము దాని నడఁచువైద్యునిభంగిన్. 45

సీ. అనవుడు నాతని కనియె భూకాంతుండు, కనుకలి వినుకలి గలిగినట్టి
పాపము దనకు నొప్పని దని కని చాలఁ, బరితప్తుఁ డయ్యుఁ గ్రమ్మఱనొనర్చు
మూఢాత్మునకు దోషమోచనం బెయ్యది, యారయ నెఱిఁగింపు మదియుఁగాక
కలుష మొక్కొకచోటఁ గావించు నొకచోటఁ, గావింపకుండుఁ దత్కర్మ మెఱిఁగి
ఆ. యిట్టిజనుఁడు పుణ్య మేరీతిఁ జేసిన, నది ఫలింప నేర దని తలంతు
సలిలమందు మేనిమలినంబు వోకుండ, గజము గ్రుంకువెట్టుగతియుఁబోలె.

వ. అనిన శుకుం డి ట్లనియె. 47

క. కర్మము గర్మముచేతను, నిర్మూలము గాదు తెలియ నేరక తానే

1 'మలచేఁ బుట్టిన. 2 ర్భావన చిత్తముర్ బెగడుపాటుగఁ జేయకమున్న. 3 దేహములం దేలినరోగము నెఱుఁగుచు' వ్రా. ప్ర.

కర్మము సేసినఁ దత్ప్రతి,కర్మం బొనరింప వలయుఁ గలుషవిదూరా. 48

క. హితవు గలకుడుపు మఱి రు,గ్వతతులఁ బొడమంగ నీని విధమున నతిస
ద్వ్రతుఁడై సవాఁడు [1]నిర్మల,మతిచే నఘరాశి నెల్ల మట్టము సేయున్. 49

చ. తపమున బ్రహ్మచర్యమున దానమునన్ శమసద్దమంబులన్
జపమున సత్యశౌచముల సన్నియమాదియమంబులం గృపా
నిపుణులు ధర్మవర్తనులు నిక్కము హృత్తనువాక్యజంపుపా
పపుగుది ద్రుంతు రగ్ని శతపర్వవనంబుల నేర్చుకైవడిన్. 50

వ. అదియునుం గాక. 51

ఉ. కొందఱు పుణ్యవర్తనులు గోపకుమారపదారవిందజా
నందమరందపానకలనారతషట్పదచిత్తు లౌచు గో
విందపరాయణుల్ విమలవేషులు దోష మడంతు రాత్మలం
జెందినభక్తిచేత రవి చేకొని మంచు నడంచుకైవడిన్. 52

క. హరిభక్తిచేతఁ గొందఱు, పరిమార్తురు మొదలు ముట్టఁ బాపంబుల ని
ష్ఠురతరకరములసూర్యుం, డుదయమునఁ బెనుమంచుఁ బించమడఁచినభంగిన్. 53

క. దంతిపురనాథ విను మొక,మంతన మెఱిఁగింతు శమదమంబులు నంహో
వంతు శుభవంతుఁ జేయవు, కంతునిగురుభక్తి ముక్తిఁ గలిగించుగతిన్. 54

సీ. హరికి నర్థముఁ బ్రాణ మర్పితంబుగఁ జేయు,వానికై వల్య మెవ్వానికి లేదు
వనజలోచనుభక్తవసుల సేవించిన, వానికై వల్య మెవ్వానికి లేదు
వైకుంఠనిర్మలవ్రతపరుం డైనట్టి, వానికై వల్య మెవ్వానికి లేదు
సరసిజోదరుకథాశ్రవణలోలుం డైన, వానికై వల్య మెవ్వానికి లేదు

తే. లేదు తపముల బ్రహ్మచర్యాదినియతి,శమదమాదుల సత్యశౌచముల దాన
ధర్మమఖముల సుస్థిరస్థాన మైన, వైష్ణవజ్ఞానజనితనిర్వాణపదము. 55

తే. అరయ నెన్నఁడుఁ జేటు లేనట్టిముక్తి,వర్త్మ మీలోకమందు నెవ్వారికిఁగలదు
సాధులును బుణ్యశీలురు సజ్జనులును, హరిపరాయణతత్పరు లయినఁ గాక.

క. అరుదుగ నరహరిభక్తిం, బొరయనిదురాపురుషుసుకృతపుంజంబులు వే
మఱుఁ బుణ్యుఁ జేయ నేరవు, సరవర మధుఘటముఁ బెక్కునదులుంబోలెన్.

చ. సతతముఁ గృష్ణపాదజలజంబులయందు మనంబు నిల్పుసు
వ్రతులుఁ దదీయశుద్ధగుణరాగులుఁ గాలునియుగ్రపాశసం
హతుల ధరించుతత్సుభటకోఘముల్గం గలలోనఁ గాన రే
గతులను దుష్టకర్మములు గైకొని వారలఁ జెంద నేర్చునే. 58

వ. కావున నీయర్థంబునకుం బురాతనం బగునొక్కయితిహాసంబు గల దది విష్ణు
దూతయమదూతసంవాదం బనంబడు దాని నెఱింగింతు నాకర్ణింపుము. 59

---

1 తాలిమి, కతమునఁ దత్త్వంబుకొఱకుఁ గల్పించుఁ జూపి.

అజామిళోపాఖ్యానము.

సీ. నరనాథ వినుము కన్యాకుబ్జపురమునఁ, గలఁడు బ్రాహ్మణుఁ డజామిళుఁ డనంగఁ
బాతకుం డతులనిర్భాగ్యుం డవజ్ఞుండు, నష్టసదాచారి కష్టరతుఁడు
జూదంబులందు దుర్వాదంబులందును, శౌర్యంబునందు మచ్ఛరము గలిగి
తొ త్రాత్మపత్నిగా మత్తుఁడై వరియించి, కొడుకులఁ బదుగురఁ బడసి చాల
ఆ. మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీర, బాలలాలనాదిలీలఁ దగిలి
పెద్దకాల మతఁడు పెంపార సుఖియించి, [1]ఫలిత మెల్ల వదలి పతితుఁ డయ్యె.
సీ. నిర్మలంబునఁ జాల నెఱయుచిత్తం బన, నల్లని వెండ్రుకల్ దెల్ల నయ్యెఁ
దగుమోహపాశబంధంబు జాఱినమాడ్కిఁ, బొదలినయంగముల్ వదలి వ్రేలె
నింద్రియంబులకోర్కు లీక నొల్ల ననుభంగి, నుడుగకతలచాలవడఁకఁజొచ్చెఁ
దమకంబుప్రాయంబుఁదగిలిపోయినమాడ్కి, లోచనంబులచూడ్కి సీచ మయ్యె
ఆ. వగరు వుట్టె నంత బెగలె దంతంబులు, నుక్కసయును దగ్గుఁ బిక్కటిల్లె
శిరసు నొవ్వఁ దొడఁగెఁ జెదరె మనం బంతఁ, గడిఁది యైనముప్పుకాలమందు.
ఆ. ఎనయ నతని కెనుబదెనిమిదివర్షంబు, లంత నరుగుటయును భ్రాంతుఁడగుచుఁ
గోరి పిన్నకొడుకు నారాయణాఖ్యుండు, బాలుఁ డగుట మిగుల భక్తిఁజేసి.
క. తనసతియుఁ దానుఁ గూరిమి, మనమునఁ బెనఁగొనఁగ నక్కుమారుని ననిశం
బును ముద్దుసేయు చుండెను, జనవర వాత్సల్య మాత్మ సందడిగొనఁగన్. 63
క. బాలుని [2]ముగ్ధవచోఋజు, ఫాలుని నిజజనకబంధుపరిణామకళా
శీలుని లోలతఁ గనుఁగొని, యాలరిబ్రాహ్మణుఁడు నందితాత్ముం డగుచున్. 64
క. అత్యంతపానభోజన, కృత్యంబులఁ బొత్తు [3]గలిగి క్రీడలఁ దత్సాం
గత్యంబు వదల కాగత, మృత్యువుఁ గన నేరఁ డయ్యె మిక్కిలిజడుఁడై. 65
తే. తెలియ కీరీతి నతఁడు వర్తించుచుండ, భయదమగుమృత్యుకాలంబు ప్రాప్తమైన
భూరివాత్సల్యవృత్తి నప్పుత్రుఁ [4]దలఁచి, యాత్మఁ బ్రలపించె నారాయణా యటంచు.
వ. అప్పుడు. 67
క. కింకరుల ధర్మరాజవ, శంకరుల దురంతపంకసమధికజననా
శంకరుల సకలలోకభ, యంకరులం గనియె నింద్రియాకులుఁ డగుచున్. 68
క. ఘాతుకుల దండదండిత, పాతకుల మహోగ్రకర్మభరనిష్కరుణా
జాతకులఁ బ్రేతనాయక, దూతకసంతతుల నతఁడు దూరమునందున్. 69
మ. కనియెన్ బ్రాహ్మణుఁ డంత్యకాలమున వీరన్ రోషనిష్ఠ్యూతులన్
ఘనపీనోష్ఠవికారవక్త్రవిలసద్గర్వోత్కటోపేతులన్
జనసంత్రాసకరోద్యతాయతసుపాశశ్రేణికాహేతులన్

---

1 'బలిత మెల్ల వదలి పలితుఁ డయ్యె. 2 నర్థవచోబుజు. 3 గలసి. 4 గూర్చి, యడరి పలవించు నారాయణాహ్వాయునిని' వ్రా. ప్ర.

హననవ్యాప్తివిభీతుల౯ మువ్వుర నార్తత్రాణేతల౯ దూతలన్. 70

వ. [1]ఇట్లతివికృతతుండగండాభోగవిభాగవిషమవివృత్తనేత్రులు నతిపుష్టనిష్ఠురతనుయష్టిసంవేష్టితమహోర్ధ్వరోములు నభ్యస్తసమస్తజీవాపహరణకరణప్రశస్తహస్తవిన్యస్తపాశధారులు నగుయమభటుల మువ్వురం గనుంగొని యజామిళుండు వికలేంద్రియుండును వికంపితప్రాణుండును వికృతలోచనుండును విహ్వలాత్మకుండును నై. 71

క. దూరమున నాడుచాలుఁడు, బోరనఁ దనచిత్త మేమఁ బొడగట్టిన నో
నారాయణ నారాయణ, నారాయణ యనుచు నాత్మనందను నొడివెన్. 72

చ. మరణపువేళ నద్దనుజమర్దనుసంస్మరణంబు సేయఁ ద
త్పరిసరవర్తు లార్తపరిపాలకునామము నాలకించి ని
ష్ఠురగతి నేఁగుదెంచి పొడసూపి యదల్చిరి కాలుదాసుల౯
ఖరతరభాషుల౯ వికటకల్పితవేషుల దీర్ఘరోషులన్. 73

క. దాసీభర్త నజామిళు, భూసురుఁ డత్తనువువలన బోరన వెలికిం
దీసినయమభటులను బోఁ, ద్రోసిరి శ్రీవరునికూర్మిదూతలు కడిమిన్. 74

విష్ణుదూతయమదూతలసంవాదము.

వ. ఇట్లు విష్ణుదూతలవలన నిర్ఘాతప్రయత్ను లై యమదూత లిట్లనిరి. 75

క. ఎవ్వరివారలు మాతోఁ, జివ్వకుఁ గత మేమి యిట్లు చిక్కినవానిం
ద్రొవ్వన విడిపించితి రిఁక, నవ్వలకో జమునిశాసనంబులు జగతిన్. 76

వ. అదియునుం గాక. 77

సీ. ఎవ్వరు మీ రయ్య యీభవ్యరూపముల్, కన్నుల కద్భుతక్రమ మొనర్చె
[2]దివిజులో భువిజులో దేవతాప్రవరులో, సిద్ధులో సాధ్యులో చెప్పరయ్య
దళితపాండురపద్మదళదీర్ఘనేత్రులు, వరపీతకౌశేయవాసు లరయ
గండమండలనటత్కుండలద్వయులును, బటుకిరీటప్రభాభాసితులును

తే. భూరిపుష్కరమాలికాచారువక్షు, లమితకోమలనవయౌవనాధికులును
బాహుకేయూరమణిగణభ్రాజమాన,ఘనచతుర్భుజు లభ్రసంకాశరుచులు. 78

క. ధనువులు నిషంగచయములుఁ, గనదంబుజశంఖచక్రఖడ్గగదాసా
ధనములు ధరియించినమీ,తనువులు లోకముల కద్భుతం బొనరించెన్. 79

క. శాంతంబు లయినమీతను, కాంతులు జగములను దిశలఁ గలిగినబహుళ
ధ్వాంతములఁ బాఱఁ దోలుచు, సంతస మొనరించె నిపుడు సర్వంకష మై.

వ. ఇట్లఖిలలోకానందకరకమ్రాకారులు నఖిలవిభ్రాజమానతేజోదుర్నిరీక్ష్యమాణులును నిఖిలధర్మపాలురును నగుమీరు ధర్మపాలపరిచారుల మమ్ము నడ్డపెట్టం గతం బేమి యనిన (వారు ధర్మరాజానుచరులు గా రనుతలంపున) మందస్మిత

---

1 ఇట్లతివికృతాకారులఁ గాలకింకరులం గనుంగొని. 2 దివ్యోపదివ్యులో.

కందళితముఖారవిందు లయి గోవిందునికందువమందిరంబు(కావలి)వారలు వారివాహగంభీరనిర్ఘోషపరిపోషణంబు లైనవిశేషభాషణంబుల నిట్లనిరి. 81

ఉ. మీరు పరేతనాయకుని మేలిమిదూత లటేనిఁ బల్కుఁడా
తోరపుఁబుణ్యలక్షణము దుష్కృతభావము దండకృత్యముం
బీరముతోడ నీతని కభీష్టనివాసముఁ బూని దండ్యు లె
వ్వారలొ సర్వభూతములొ ¹వా రొకకొందఱుపాపకర్ములో. 82

వ. అనిన యమభటు లి ట్లనిరి. 83

క. వేదప్రణిహితమే యను, మోదంబుగ ధర్మ మయ్యె మున్ను తదన్యం
బేది యగు నది యధర్మం, బాదియు హరిరూపు వేద మని వినుకతనన్. 84

సీ. ఎవ్వనిచేఁ దనరయిర వొందుత్రిగుణస్వభావ మైనట్టియీప్రాణిచయము
లనుగుణనామక్రియారూపములచేత, నేర్పడుగతిఁ దాన యెఱుఁగఁబడును
నర్యముం డనలంబు నాకాశమును బ్రభంజనుఁడు గోచయమును శశధరుండు
సంధ్యలు దినములు శర్వరీచయములుఁ, గాలంబు వసుమతీజాలములును

తే. దేహధారికి సాక్షు లై తెలుపుచుండు, దండనస్థానవిధము సద్ధర్మగతియుఁ
దగులుమీరీ క్రమానురోధనముసేసి, యఖిలకర్ములు దండార్హు లరయ నెపుడు.

తే. కోరికర్మంబునడపెడువారి కెల్లఁ, గలితశుభములు నశుభముల్ గలుగుచుండు
నరయఁగా దేహి గుణసంగి యైనయపుడె, పూనికర్మంబు సేయక మానరాదు.

క. ప్రకృతమునఁ దా నొనర్చిన, సుకృతము దుష్కృతము నెంత చూడఁగ నంతే
²వికృతి గని యనుభవించును, నకృతమతిం దత్ఫలంబు నతినిపుణుం డై. 87

వ. మఱియు వినుండు జన్మంబు శాంతఘోరమూఢగుణంబులచేత నైనను (సుఖదుఃఖగుణంబులచేత నైనను) ధార్మికాదిగుణంబులచేత నైనను సకలభూతంబులుఁ ద్వైవిధ్యంబు నేప్రకారంబునం బొందు నాప్రకారంబున జన్మాంతరంబునం బొందుచుండు దేవుం డైనయముండు సర్వజీవాంతర్యామి యై ధర్మాధర్మయుక్తం బైనపూర్వరూపంబుల ³విశేషరూపంబులచేతం జూచు చుండి వాని కనురూపంబులఁ జింతించు చుండు నవిద్యోపాధి జీవుండు తమోగుణయుక్తుం డై ప్రాచీనకర్మంబులచేత నేర్పడినవర్తమానదేహంబు నే నని తలంచుచుండి నష్టజన్మస్మృతి గలవాఁ డై పూర్వాపరంబు లెఱుంగం జాలకుండు మఱియుఁ గర్మేంద్రియంబులచేతఁ గర్మంబులం జేయుచుండి జ్ఞానేంద్రియంబులచేతఁ దమోవిషయంబు లైనశబ్దస్పర్శరూపరసగంధంబుల నెఱుంగు చుండి పదియాఱవది యైనమనంబుతోఁ గూడి పదియేడవవాఁ డగు చుండి షోడశోపాధ్యంతర్గతుం డై యొక్కరుం డైనజీవుండు సర్వేంద్రియవిషయప్రతిసంధానంబుకొఱకు జ్ఞానేంద్రియకర్మేంద్రియమనోవిషయంబులఁ బొందు చుండి షోడశకళలు గలిగి లింగశరీరం బనం బరఁగి

1 వారక కొందఱు. 2 వికృతగతి ననుభ. 3 మనస్సుచేతం జూచు చుండి.

గుణత్రయకార్యం బనునిమిత్తంబున హర్షశోకభయంబుల నిచ్చుచున్నసంసా
రంబు ధరియించుచుండు విజితషడ్వర్గుం డైనదేహి కర్మంబు లొల్లనిబుద్ధి నెఱిం
గియు వినియుఁ గర్మంబులు సేయుచుండి తనసంచారకర్మంబునం జుట్టుకొన్న
పసిరికాయపురువునుంబోలె నిర్గమోపాయం బెఱుంగక నాశంబు నొందుచుండు
వర్తమానవసంతాదికాలంబు భూతభావివసంతాదికాలయోగ్యం బైనపుష్ప
ఫలాదులు తత్కాలజ్ఞాపకంబు నెట్లు సేయు నట్లు భూతభావిజన్మంబులకు ధర్మా
ధర్మంబులు నిదర్శనంబులు సేయుచుండు నొక్కరుండు నొకక్షణంబును గర్మం
బు సేయ కుండువాఁడు లేఁడు పూర్వసంస్కారంబులం గలగుణంబులచేతఁ బు
రుషుం డవశుండు గావున బలిమిఁ గర్మంబు సేయింపం బడుచుండు నవ్యక్త
నిమిత్తంబు నొంది తదనురూపంబు లైనస్థూలసూక్ష్మశరీరంబులు మాతాపితృ
సదృశంబు లగుచుండు నిట్టివిపర్యయంబు పురుషునికిఁ బ్రకృతిసంగమంబునం
గలుగుచుండు నాప్రకృతి పురాణపురుషుం డైనయప్పరమేశ్వరుని సేవించినం
దలంగుచుండు. 88

సీ. కావున నితఁడు సత్కర్మవర్తనమున, భూదేవకులమునఁ బుట్టినాఁడు
దాంతుఁ డై శాంతుఁ డై ధర్మసంశీలుఁ డై, సకలవేదంబులఁ జదివినాఁడు
అనయంబు గురువుల నతిథులఁ బెద్దలఁ, జేరి శుశ్రూషలఁ జేసినాఁడు
సర్వభూతములకు సమబుద్ధి యై చాల, బహుమంత్రసిద్ధులఁ బడసినాఁడు
తే. సత్యభాషణనియమంబు జరపినాఁడు, నిత్యనైమిత్తికాదుల నెరపినాఁడు
దంభలోభాదిగుణములఁ దెరపినాఁడు, మంచిగుణములు దనయందు నమరపినాఁడు.
క. సతతాచారసమంచిత, మతి యై సుజ్ఞానమునకు మఱఁగెడుతఱి నా
యతఁ గని యాతని కంగజ, మతమై నవయౌవనాగమం బెడసొచ్చెన్. 90
సీ. కడకంట హావసగర్వంబు పొడగట్టె, మదిలోన నుద్రేకమదము పొట్టెఁ
గడు మేనఁ గామవికారంబు దలచూపె, ముఖమునఁ జిఱునవ్వు మొలకలెత్తె
నతిపుష్టి నిష్ఠురం బయ్యె దేహం బెల్లఁ, గచభారమున నెఱకప్పు మెఱసెఁ
గటిభారమున నూరుకాండముల్ నిగిమీఱె, బాహుశాఖలు దీర్ఘభంగిఁ దోఁచె
ఆ. నురము విపుల మయ్యె నుల్లసద్వరకాంతి, పూర మంగకమునఁ బొందుపడియె
భూరితేజుఁ డయిన భూసురాన్వయునకు, నభినవైకయౌవనాగమమున. 91
క. హృదయమునఁ బొడమియౌవన, మదము వెలిం బోవుభంగి మానితరుచిఁ ద
ద్వదనమున నూఁగుమీసలు, పొదలుచుఁ గప్పడరి చూడఁ బొంకం బయ్యెన్.
వ. మఱియును. 93
క. తమ్మివిరిమీఁద వ్రాలిన, తుమ్మెదపంక్తియునుబోలెఁ దోరపులీలం
గ్రమ్ముకొని విప్రతనయుని, నెమ్మొగమునఁ గానఁబడియె నెఱిమీసంబుల్. 94
వ. అంత ననంగబ్రహ్మతంత్రంబునకు వసంతుం డొనర్చునంకురార్పణారంభంబునుం

బోలె లలితకిసలయవిసరప్రసారభాసురబహుపాదపాదిపురోపవనపవనజవనప్రభావపరికంపితవిటపవిటపిజనహృదయప్రఫుల్లపల్లవభల్లంబును ననూనప్రసూననిర్భరగర్భావిర్భూతసురభిపరాగపటలపటఘటితనభోమండలంబును నమందనిష్యందమరందబిందుసందోహకందళితచిత్తమత్తమధుపసంకులఝుంకారముఖరిత సకలదిశావలయంబును నిరంతరధారాళరసభరితపరిపక్వఫలానుభవప్రభవసమ్మోదవాదశుకప్రముఖపతంగకోలాహలంబును నై మధుమాసంబు సర్వజనమనోహరంబును నై నిఖిలవనపాదపంబుల నలంకరించె నయ్యవసరంబున నజామిళుండు పితృనిర్దేశంబునం గుశసమిత్పుష్పఫలార్థంబు వనంబున కరిగి తిరిగి వచ్చుసమయంబున నొక్క లతాభవనంబున. 95

క. బద్ధానురాగయై స్మర, యుద్ధంబున కలరుబుద్ధి నొకకాముకళా
సిద్ధ యగువృషలితోఁ బ్రియ, వృద్ధిం దగఁ గూడి యున్నవిటు నొకఁ గాంచెన్.

క. భటునిన్ రతిశాస్త్రకళా, ర్భటునిన్ వరయౌవనానుభవమదవిభవో
ద్భటునిన్ సురతేచ్ఛాసం, ఘటునిన్ వికటాంబరోరుకటునిన్ విటునిన్. 97

శా. హాలాఘూర్ణితనేత్రతో మదనతంత్రారంభసంరంభతో
[1]ఖేలాపాలనయోగ్యభూవిభవతోఁ గీర్ణాలకాజాలతో
హేలాలింగనభంగివేషవతితో నిచ్ఛావతీ[2]మూర్తితోఁ
గేళిం దేలుచు నున్నవానిఁ గనెఁ గాంక్షాభిభూతరోమాంచుఁ డై. 98

క. [3]కలికి వరుమదనకదనపుఁ, బలుకులకలకలము బెడఁగుగ వడుమేఖలము
వ్వలరవళిఁ దగిలి [4]గతిగొనఁ, గలకంఠ రతంబు సలుపుఁ గమకముఁ గనియెన్.

క. [5]కవకవ నై పదనూపుర, రవరవ లాగుబ్బుకొన్న రతిపతిగతులం
జివచివ నై వీటుచెయ్యాల, రవళిన్ రతిసల్పురతులఁ గరవరవ గనియెన్. 100

చ. కురు లళికంబుపై నెగయఁ గ్రొమ్ముడి వీడఁగ గుబ్బదోయిపై
సరములు చౌకళింపఁ గటిసంగతి మేఖల తాళగింప స
త్కరవరకంకణావళులు గజ్జలఁ గా నసియాడ మోఁదు గా
మరువివోదముల్ సలిపె మానిని యౌవనగర్వ రేఖతోన్. 101

క. మవ్వపుసుకుమారాంగిని, జవ్వని నుపగూహనాదిసముచితరతులన్
నివ్వటిలుదానిఁ గని మది, నువ్విళ్లూరంగ మన్మథోద్దీపనుఁ డై. 102

తరలము. బహువిధద్రుక్పరిపాకమోహనిబద్ధుఁ డౌచు మనంబులో
సహజకర్మము వేదశాస్త్రము సాత్త్వికంబుఁ దలంచి త
న్నిహితచిత్తము పట్టి పట్టఁగ నేరఁ డయ్యె సదా మనో
గహనమందు మరుండు పావకుఁడై వడిం జరియింపఁ గాన్. 103

---

1 ఖేలాపాటవకోటరీవిభవతో. 2 మూర్ధ్నితో. 3 కలికివగమదన. 4 గరిగొన; రతిగొన.
5 కవకవలై...రవరవలై గుబ్బగొన్న.

శా. ఆలీలావతిగండపాళికలపై హాసప్రసాదంబుపై
నాలోలాలకపంక్తిపై నళికపై నాకర్ణదృగ్భాతిపై
హేలాపాదికుచద్వయోరుకటిపై నిచ్చల్ పిసాళింపఁగా
జాలిం బొందుచు నాత్మఁ గుందుచు మనోజాతానలోపేతుఁడై. 104

తే. మఱి కులాచారవర్తన [1]మాలుచేసి, పరఁగుపిత్రర్థములు దానిపాలు చేసి
సాధులక్షణగుణవృత్తిఁ జాలుచేసి, లోలలోచనవసఁ జెంది లోలుఁ డయ్యె.

క. శ్యామఁ గుసుమాస్త్రకేలన, కామఁ గులస్త్రీలలామఁ గమనీయగుణ
స్తోమ నిజభామ నొల్లక, [2]ధామమున నటించెఁ గ్రించుఁదన మొదఁ బొడమన్.

ఉ. బంధులఁ దిట్టి సజ్జనుల బాధలఁ బెట్టి యనాథకోటిఁ బెం
బంచెలు సుట్టి యీరములు వట్టి పథంబులు గొట్టి దిట్టయై
నిందల కోర్చి సాధులకు నిందితుఁడై గడించువిత్తమా
సుందరి కిచ్చి మచ్చికలు సొంపెదఁ గూర్చి వసించె దత్కృపన్. 107

సీ. సముచితశ్రుతిచర్చఁ జర్చింప నొల్లక, సతికుచద్వయచర్చఁ జర్చసేయుఁ
దర్కకర్కశపాఠతర్కంబు గాదని, కలికితోఁ బ్రణయతర్కంబు సేయు
స్మృతిపదవాక్యసంగతి గాక తత్సతి,పదవాక్యసంగతి పరఁగఁ జేయు
నాటకాలంకారనైపుణం బుడిగి త,న్నాటకాలంకారపాటిఁ దిరుగుఁ

తే. బరఁగఁ బరకాల మీఁదిఁకఁ బాపనియతి, రమణ దాసీకుటుంబభారము వహించి
యదికుటుంబినిగాఁగఁ బాత్రుఁడగుచు, నశుచియును దుష్టవర్తనుఁడై మెలంగె.

క. అట్లు గాన పాపకర్తనిఁ, గుటిలుని సుజనార్తిధూర్తుఁ గ్రూరుని నేమా
వటమునఁ గొని పోఁదగద మం,చాట దండమువలన నితఁడు ధన్యత నొందున్.

వ. ఇట్లు వలుకుచున్న యమదూతల వారించి నయకోవిదులైన భగవద్దూత లిట్లనిరి.

క. అప్పుడు [3]ధర్మవివేక,ప్రవరులవసఁ గానఁబడియెఁ బాపము పుణ్యో
ద్భవుల యనంద్యులనుండను. వివరం బొనరింపఁబడియె [4]విధ మెఱుఁగమిచేన్.

చ. సములును సాధులున్ విహితశాసనులున్ సుదయాళురున్ శుభో
త్తములును నైనయట్టితలిదండ్రులు బిడ్డల కెగ్గు సేయుచోఁ
గ్రమ మఱి వార లెవ్వరికిఁ గైకొని కుయ్యిడఁ జాలువారు సం
భ్రమమతి మీమనంబులఁ దిరంబుగఁ జర్చ యొనర్చి చూడుఁడా. 112

ఆ. ఎఱుక గలుగునాతఁ డేది యొనర్చిన, నది యొనర్తు రితరులైనవార
లతఁడు సత్య మిట్టిదనెనేని లోకంబుఁ, దత్ప్రవర్తనమునఁ దగిలియుండు.

ఆ. నెమ్మిఁ దొడలమీఁద నిద్రించుచెలికాని, నమ్మఁదగినవాఁడు నయము విడిచి
ద్రోహబుద్ధిఁ జంపఁ దొడరునే యెంతైనఁ, బ్రీతి లేక ధర్మదూతలార. 114

---

1 'మాటుసేసి' అ. ప్ర. 2 ధామంబు నడంచుక్రించు. 3 ధర్మవిలోకప్రవరులసభఁ గానఁ.
4 వృథ యాగుసేఁతన్.

ఆ. చిత్త మెల్ల నిచ్చి చెలితనంబున వచ్చి, నచ్చి కలయ మెచ్చి నమ్మువానిఁ
గరుణ గలుగువాఁడు కడుసౌమ్యుఁ డగువాఁడు, చింతసేయ కెల్లఁ జెఱుప నేర్చు.
వ. అదియునుం గాక. 116
ఉ. ఈతఁడు కోటిసంఖ్యలకు నెక్కుడు పుట్టువులందుఁ జెంది యా
యాతము లైనపాపనివహంబుల నన్నిటిఁ బాఱఁ దోలి ప్ర
[1]ఖ్యాతమతిన్ మహామరణకాలమునన్ హరిపుణ్యనామసం
భూతసుధామయాద్భుతవిభూతికరాక్షరసంగ్రహంబునన్. 117
సీ. బ్రహ్మహత్యానేకపాపాటవులకు గగ్గి, కీలలు హరినామకీర్తనములు
గురుతల్పకల్మషక్రూరసర్పములకుఁ, గేకులు హరినామకీర్తనములు
తపనీయచౌర్యాఘతమసంబునకు సూర్య, కిరణముల్ హరినామకీర్తనములు
మధుపానకిల్బిషమదనాగసమితికిఁ, గేసరుల్ హరినామకీర్తనములు
తే. మహితయోగోగ్రనిత్యసమాధివిధుల, నలరు బ్రహ్మాదిసురులకు నందరాని
భూరినిర్వాణసామ్రాజ్యభోగభాగ్య, ఫలదంబులు హరినామకీర్తనములు. 118
సీ. ముక్తికాంతైకాంతమోహనకృత్యముల్, గలిమై హరినామకీర్తనములు
సత్యలోకానందసౌభాగ్యయుక్తముల్, గలిమై హరినామకీర్తనములు
మహితనిర్వాణసామ్రాజ్యాభిషిక్తముల్, గలిమై హరినామకీర్తనములు
బహుకాలజనితతపఃఫలసారముల్, గలిమై హరినామకీర్తనములు
తే. పుణ్యమూలంబు లనపాయపోషకంబు, లభిమతార్థంబు లజ్ఞానహరణకరము
లాగమాంతోపలబ్ధంబు లమృతసేవ, లార్తశుభములు హరినామకీర్తనములు.
క. కామంబు పుణ్యమార్గ, స్థేమంబు మునీంద్రసాంద్రచేతస్సరసీ
ధామంబు విష్ణునిర్మల, నామంబుఁ దలంచువాఁడు నాఘుఁడు గాఁడే. 120
క. డెందంబు పుత్త్రువలనం, జెందిన దని తలఁప వలదు శ్రీపతిపేరే
చందములఁ బలుకఁ గలిగిన, నందకధరుఁ డందుఁ గలఁడు నాఘుం డగుచున్.
ఆ. బిడ్డపేరు వెట్టి పిలుచుట విశ్రామ, కేలి నైన మిగుల గేలి నయినఁ
బద్యగద్యగీతభావార్థములనైనఁ, గమలనయనుఁ దలఁపఁ గలుషహరము. 122
ఉ. కూలినచోటఁ గొట్టుపడి కుందినచోట మహాజ్వరాదులం
దేలినచోట సర్పముఖపీడల నందినచోట నార్తుఁ డై
తూలినచోట విష్ణు భవదూరునిఁ బేర్కొని లేని మీఁద న
క్కాలుని [2]యాతనావితతిఁ గానరు పూనరు దుఃఖభారముల్. 123
సీ. అతిపాపములకును బ్రయత్నపూర్వకముగఁ, దనుపాపముల కమితంబు గాఁగ
సన్మునివరులచే [3]సంపాద్య మై యుండు, నిర్మలం బగుపాపనిష్కృతములు
క్రమరూపమున నుపశమనంబు లగుఁ గాని, [4]తత్పాపచయములు దలఁప లేవు

1 ఖ్యాతమునన్. 2 యాతనంబులను. 3 సంపాద్య; సంప్రోక్త. 4 తత్క్షణంబునవవి తరుపలేవు.

సర్వకర్మంబుల • సంహార మొనరించి, చిత్తంబునకుఁ దత్త్వ•సిద్ధి నొసఁగు
ఆ. నొనర నీశుసేవ • యోగిమానససరో, వాసుసేవ హేమ•వాసుసేవ
వేదవేద్యుసేవ • వేదాంతవిభుసేవ, పరమపురుషుపాద•పద్మసేవ. 124

క. హరి నెఱుఁగనియాబాలుఁడు, [1]హరిభక్తులతోడఁ గూడి • హరి యనువాఁడున్
సరియై దోషము లడఁచును, గరువలితో నగ్ని దృణముఁ • గాల్చినభంగిన్. 125

ఉ. ఆరయ వీర్యవంత మగు•నౌషధ మెట్లు యదృచ్ఛఁ గొన్నఁ ద
చ్చారుగుణంబు రోగములఁ • జయ్యనఁ బాపెడుమాడ్కిఁ బుణ్యవి
స్తారుని నంబుజోదరునిఁ • బామరుఁ డజ్ఞుఁ డవజ్ఞఁ బల్కినన్
వారక తత్ప్రభావము ధ్రు•వంబుగ నాత్మగుణంబుఁ జూపదే. 126

క. ధృతి దప్పినతఱిని బురా, కృతమునఁ గా కెట్లు దోఁచుఁ • గేశవుఁడు మదిన్
మితి లేనిజగముఁ దాల్చిన, యతఁ డొక్కనిమనములోన • నడఁగెడువాఁడే. 127

మ. నిరతంబై నిరవద్యమై నిఖిలచి•న్నిర్మాణమై నిత్యమై
నిరహంకారగుణాఢ్యమై నియమమై • నిర్దోషమైనట్టిశ్రీ
హరినామస్మరణామృతం బితఁడు ప్ర•త్యక్షంబు సేవించెఁ దా
మరణాంతంబున నిట్టిసజ్జనునిధ•ర్మం బేల వ్యర్థం బగున్. 128

వ. అని యిట్లు శ్రీమద్భగవద్దూతలు భాగవతధర్మంబు నిర్ణయించి [2]బ్రాహ్మణుని నతి
ఘోరం బయిన యామ్యపాశబంధనిర్ముక్తునిం గావించి [3]యమభటులవలనియుదు
టు వాపి రంత నాయమదూత (లాభగవద్దూతలసంభాషణప్రభావంబునఁ దమ
మనంబుల శాంతి నొంది భగవత్తత్త్వజిజ్ఞాసు లయి) చేయునది లేక (నిరాకృతు
లై) యమలోకంబునకుం జని పితృపతికి సర్వంబును నెఱింగించి రంత. 129

క. అతఁడును బాశచ్యుతుఁడై, గతభయుఁడై ప్రకృతి నొంది • కడునుత్సవసం
గతిఁ జూచి మ్రొక్కె మదిలో, నతులితముద మొదవి పొదలి•హరిదాసులకున్.

ఆ. నిలిచి కేలుమొగిచి • పలుక నుద్యోగించి, చెలఁగు చున్నలోని•తలఁపు దెలిసి
చక్రధరునికూర్మి•సహచరు లరిగిర, దృశ్యు లగుచు దేవ•దేవు కడకు. 131

క. వేదత్రయసంపాద్యము, వాదంబు గుణాశ్రయంబు • మొగి భగవద్ధ
ర్మాదేశం బగుతద్భట, వాదంబు నజామిళుండు • వదలక వినుచున్. 132

క. శ్రీమన్నారాయణపద, తామరసధ్యానసలిల•ధౌతమహాఘ
స్తోముం డై సద్భక్తికి, ధామం బగుచుండెఁ దెలిసి • తత్క్షణమాత్రన్. 133

క. బరవసమున నరికట్టిన, దురితంబులఁ దలఁచి తలఁచి • [4]తుదిఁ దాపమునన్
హరి నీశు నాశ్రయించుచుఁ, బరితాపము నొంది పలికె • బ్రాహ్మణుఁ డంతన్.

సీ. వృషలియం దనురాగ•వృద్ధి బిడ్డలఁ గని, కులము గోదావరిఁ • గూలఁ ద్రోచి

---

1 హరిభక్తుఁడు భక్తితోడ హరి యన రెండున్. 2 యీయర్థంబున మీకు సంశయంబు గలదేని మీరాజా నడుగఁ బొం డని పలికి బ్రాహ్మ. 3 మృత్యువువలనియొడరు వాపి. 4 దురు పెల్లొదవన్.

రచ్చల కెక్కి పెక్కురజ్జుసేఁతల సరి, వారిలోపలఁ దలవంపు చేసి
కట్టిఁడిముదుక నై కర్మబంధంబుల, పుట్ట నై నిందలపోవ నగుచుఁ
దరుణులరోఁతలఁ ద్రవ్వి భోగించిన, కడిఁదినాజన్మంబు గాలి పోయెఁ

ఆ. జదువు చట్టువడియె శాస్త్రంబు మన్నయ్యె, బుద్ధి పురువుమేసెఁ బుణ్య మడఁగె
నీతి మట్టువడియె నిర్మలజ్ఞానంబు, [1]ముట్ట నుడిగె బోధ మూరిఁ బోయె.

క. చిక్కనిచక్కనిచన్నుల, మక్కువయిల్లాలి విడిచి మాయలు గలయా
వెక్కసపుమద్యపానపు, డొక్కపసం దగిలి దుర్విటుఁడ నై చెడితిన్. 136

ఉ. అక్కట ఘోరదుష్కృతమహానలకీలలు నన్ను ముట్టి పే
రుక్కడఁగింప కిట్లు ధృతి నుండఁగ నిచ్చె నహో దురాత్మునిన్
గ్రక్కునఁ దల్లిదండ్రుల నకల్మషచిత్తులఁ బెద్దలన్ మతే
దిక్కును లేనివారిఁ బలు[2]తిక్కులఁ బెట్టుచుఁ బాఱఁ దోలితిన్. 137

క. అకృతజ్ఞుఁడ నై విడిచితిఁ, బ్రకృతిం గలబంధువులను బాల్యమునను దు
ర్వికృతిఁ బడ కుండఁ బెంచిన, సుకృతుల మజ్జనకవరుల శోభనకరులన్. 138

వ. అప్పుడు. 139

ఆ. పెక్కుపాతకముల భృశదారుణం బైన, దొడ్డనరకమందుఁ బడ్డనన్ను
నాపదలకుఁ బాపి యరికట్టి రక్షించి, రిట్టిధర్మపురుషు లెందువారొ. 140

శా. చోద్యం బై కలవోలె నీక్షణమునం జూడంగఁ బ్రత్యక్ష మై
వేద్యం బయ్యెను నన్ను నీడ్చునమహావీరుల్ భృశోదగ్రులా
యుద్యోగంబులవారు పాశధరు లీయుత్సాహముల్ మాని సం
పాద్యానేకవికారరూపకుటిలప్రఖ్యాతు లెం దేఁగిరో. 141

ఉ. దారుణపాశబంధనవిధానములన్ నరకార్ణవంబులోఁ
గూరినవాని నన్నుఁ జెడ కుండ నొనర్చినపుణ్యమూర్తు లం
భోరుహనేత్రు లుజ్జ్వలనభోమణితేజులు లోచనోత్సవుల్
చారుదయాసమంచితవిచారులు నల్వురు నెందుఁ బోయిరో. 142

మ. నను రక్షించినపుణ్యవంతులు కనన్నాళీకపత్రాక్షు లం
జనసంకాశులు శంఖచక్రధరు లాజానూరుబాహుల్ స్మితా
నను లాలంబితకర్ణవేష్టనసువర్ణచ్ఛాయదివ్యాంబరుల్
ఘనకారుణ్యరసైకపూర్ణులు సమగ్రస్ఫూర్తి నెం దేఁగిరో. 143

వ. పాతకుండ నగునాకు నవ్విబుధోత్తమదర్శనంబు పురాకృతంబు లగుపుణ్య(విశే
ష)ంబులం గాని దొరక నేరదు తత్సందర్శనం బాత్మకు నతిసుప్రసన్నం బయి
యొప్పె నట్లు గాకుండెనేనిఁ గలుషవర్తనంబున వృషలీభర్త నై యుండి మృతిఁ

---

1 నుట్ట నుఱిఁగె. 2 దికులఁ.

బొందుచున్న నాదుజిహ్వకు శ్రీమన్నారాయణనామగ్రహణంబు సంభవింప నేరదు మఱియును. 144

ఆ. పాతకుండ జడుఁడ బ్రహ్మఘాతుకుఁడను, మానలోభమోహమత్సరుండ
నాకు నెట్లు దొరకు నారాయణునిదివ్య, నామవిమలకీర్తనంబు మదికి. 145

సీ. దారుణమోహాంధకారపూరితుఁడను, హరివిస్మయస్మరణార్హమతిని
పంచమహాతీవ్రపాతకోపేతుఁడ, హరివిస్మయస్మరణార్హమతిని
కౌటిల్యకితవవికారపారీణుండ, హరివిస్మయస్మరణార్హమతిని
యఖిలదుఃఖైకఘోరార్ణవమగ్నుండ, హరివిస్మయస్మరణార్హమతిని

తే. నిందలకు నెల్ల నెలవైన నిర్గుణుండ, మందభాగ్యుండ నే నేడ మధువిదారి
దివ్యగుణనామకీర్తనతేజ మేడఁ, బూర్వసుకృతంబు గాకెట్లు పొందఁగలుగు.

వ. అని వితర్కించి. 147

మ. యతచిత్తేంద్రియమారుతుండు నగుచున్ యత్నంబు బోనిచ్చె హరి
వ్రతసంపత్తికిఁ బుణ్యవృత్తికి జిదావాసోన్ముఖాసక్తికిన్
యుతనిర్వాణపదానురక్తికి సుఖోద్యోగక్రియాశక్తికిన్
ధృతిలబ్ధోత్తమముక్తికిన్ సకలధాత్రీధుర్యసద్భక్తికిన్. 148

క. విడిచితి భవబంధంబుల, [1]నడఁచితి మాయావిమోహమైనతమంబు
న్విడిచితి నరివర్గంబులఁ, గడచితి నాజన్మదుఃఖకర్ణార్ణవమున్. 149

క. మోహిద్రూపంబున నను, [2]నేషణముఖగహ్వరమున నెగమ్రింగి కడున్
ద్వేషమున గోతి సేసిన, దోషద యగునాత్మమాయఁ ద్రోలఁగఁ గంటిన్. 150

వ. అని యిట్లు వైష్ణవజ్ఞానదీపం బాత్మస్నేహంబునం దోఁచిన నాబ్రాహ్మణుండు.

మ. భగవద్ధర్మపరాయణోత్తములసంభాషైకమంత్రంబులన్
మిగులన్ జ్ఞానము పుట్ట మోహభవసమ్మిశ్రాత్మబంధంబులం
దెగ ఖండించి సబంధుమిత్రసుతపత్నీమోహవిభ్రాంతుఁడై
జగతీనాథు రమేశు కృష్ణుని దయైశ్వర్యంబులం గోరుచున్. 152

క. హరిభక్తులతో మాటలు, ధర నెన్నఁడుఁ జెడనిపుణ్యధనములమూటల్
వరముక్తికాంత తేటలు, నరిషడ్వర్గంబు చొరనియగు దగుకోటల్. 153

సీ. అనుచు నాబ్రాహ్మణుం డతితత్త్వవేది యై, భవబంధముల నెల్లఁ బాఱఁద్రోచి
మొనసి గంగాద్వారమున కేఁగి యచ్చటఁ, [3]బ్రబ్బిన దేవతాభవనమందు
నాసీనుఁడై యోగ మాశ్రయించి చెలంగు, దేహేంద్రియాదుల తెరువువలనఁ
దనుఁ బాపుకొని పరతత్త్వంబుతోఁ గూర్చి, మానుగా యోగసమాధిచేత

ఆ. గుణగణంబుఁ బాసి [4]కొమ రొప్పినభగవ, దనుభవాత్మయందు నాత్మఁ గలిపి

---

1 'జడిసితి మాయావిమోహసంతమసంబున్' వ్రా. ప్ర. 2 'నిషణ...మ్రింగుచు బద్వేషమున. 3 పంబినదేవాలయంబునందు 4 కొనుచును భగవంతుఁడైనయాత్మ' వ్రా. ప్ర.

రమణఁ దన్ను మొదల రక్షించినట్టియా, పురుషవరులఁ గాంచి పొసఁగ మ్రొక్కె.

వ. అట్లజామిళుండు యోగమార్గంబున దేహంబు విడిచి పుణ్యశరీరుం డై యగ్ర
భాగంబునం బ్రాగుపలబ్ధు లైన మహాపురుషకింకరులం గాంచి సమంచిత[1]రో
మాంచితచలచ్ఛటాపింజరితస్వేదబిందుసందోహమిషనిష్యందమహానందవల్లికామ
తల్లికాంకురసంకులపరిశోభితతనుండును హర్షనికర్షమాణమానసోద్యోగయోగ
ప్రభావోత్సాహవిస్మయమందస్మితకందళితముఖారవిందకందళితుండును [2]నిఖిల
జగజ్జేగీయమానాఖండశుభప్రదశుభాకారసందర్శనసమాసాదితకుతూహలమాన
సుండును నై ప్రణామంబు లాచరించుచు భాగీరథీతీరంబునఁ గళేబరంబు విడి
చెం గావునఁ దత్క్షణంబ హరిపార్శ్వవర్తు లైన దాసవరులస్వరూపంబుఁ దాల్చి యా
విష్ణుసేవకులతోడం గూడి (దివ్యమణిగణఖచితం బై) సువర్ణ(మయం బై నయస
మాన)విమానం బెక్కి సకలమహానందభోగభాగ్యానుభవాకుంఠితం బైన వైకుంఠ
నగరంబునకు శ్రీమన్నారాయణపదారవిందసేవాచరణపరిణామస్థితికిం జనియె
నిట్లు విప్లావితసర్వధర్ముం డైన దాసీపతి గర్హితకర్మంబులచేతఁ బతితుండును హత
వ్రతుండును నై నరకంబునం గూలుచుండి భగవన్నామగ్రహణంబున సద్యో
ముక్తుం డయ్యెఁ గావున. 155

క. కర్మంబు లెల్లఁ బాయును, మర్మము దెలుపంగ లేదు మధురిపుపేరే
పేర్మిఁ బఠించుటకంటెను, దుర్మదమునఁ జిత్త మెన్నిత్రోవలఁ జన్నన్. 156

ఉ. పాండవవంశపావన నృపాలక యీయితిహాస మెవ్వఁడే
నొండొకభక్తి లేక విను నొప్పుమెయిం బఠియించు నాతఁడు
ద్దండత ముక్తికామినికిఁ దానక మై దనుజారిలోకమం
దుండు మహావిభూతి యమదూతలచూడ్కి కగోచరాకృతిన్. 157

తే. అరయఁ బుత్రోపచారిత మైనవిష్ణు,నామ మవసానకాలంబునను భజించి
శార్ఙ్గినిలయంబుఁ జేరె నజామిళుండు, నిట్లు సద్భక్తిఁ బలికిన నేమి సెప్ప. 158

క. కోరినవారల కెల్లను, జేరువ కైవల్యపదము శ్రీవరుని మదిం
గోరనివారల కెల్లను, దూరము మోక్షాప్తి యన్నిత్రోవల నైనన్. 159

వ. అనినం బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె మునీంద్రా యాజ్ఞాభ్రష్టుం డై యమధర్మరా
జు శ్రీవిష్ణునిర్దేశకులచే విహతు లైనభటులచేత వర్ణింపంబడిననారాయణదేవుని
మహానుభావం బాకర్ణించి వారల కేమనియె మఱియు నెన్నఁడేని యమదం
డంబు విఫలం బై పోయిన తెఱంగు గల దేని వినవలయు నీసందేహంబుఁ బాప
(మహాత్మా) నీవు దక్కఁ దక్కినవారలు చాల రని తలంచుచున్నవాఁడఁ జిత్తం

---

1 'రోమాంచచ్ఛటాజనితస్వేదకణసందోహ. 2 దళితలోచనోత్సవకరాకారసందర్శనానందధారీయుండును నై ప్రణా' వ్రా. ప్ర.

బును బ్రసాదాయత్తంబుగా భవదీయవచనసుధాధారలం బ్రసాదింప వలయు
ననిన శుకుం డిట్లనియె. 160

క. శ్రీకృష్ణభటులచేత ని, రాకృతులై యామ్యభటులు యమునకు నాత్మ
స్వీకృతవిప్రకథాక్రమ, మీక్రియ మున్ తెలిపి రదియు నెఱిఁగింతుఁ దగన్.

తే. చేరి [1]త్రైవిధ్యమున మించు జీవతతికిఁ, గర్మఫలములఁ దెలిపెడు కారణంబు
లగుచు శిక్షించువార లీయవనిమీఁద, దేవ యెందఱు గలరయ్య తెలియవలయు.

క. దక్షిణశాధినాయక, శిక్ష దగం జేయువారు క్షితిఁ బెక్కండ్రే
నీక్షయమును నక్షయమును, సాక్షాత్తు[2]గ నెందు రెండు సంపన్న మగున్.

తే. దట్టమైనట్టికర్మబంధముల నెల్ల, నాజ్ఞవెట్టెడువారు పెక్కైనచోట
నకట శాస్తృత్వముపచారమయ్యెఁగాదె, శూరులైనట్టిమండలేశులకుఁబోలె.

ఉ. కావున నీవ యొక్కఁడవ కర్తవు మూఁడుజగంబులందు సం
భావితభూతకోటిఁ బరిపాకవశంబున శిక్ష సేయఁగా
నీవరశాసనం బఖిలనిర్ణయమై తనరారుచుండ నేఁ
డీవలఁ గ్రమ్మఱింప మఱి యెవ్వఁడు శక్తుఁడు ధర్మపాలనా. 165

క. చండకరతనయ యొకులకు, దండధరత్వంబు గలదు తగ జగమున ను
ద్దండధరవృత్తి నొత్తిలి, దండింతువు నిన్ను దండధరుఁ డని పొగడన్. 166

సీ. ఇట్టినీదండంబు యీమూఁడుజగములఁ, దగువమై నేఁడు వర్తిల్లుచుండ
మనుజలోకంబున మహితాద్భుతాకార, సిద్ధుల మిగులఁ బ్రసిద్ధులైన
వారు నల్వురు వేగ వచ్చి నిర్దేశంబు, భంగించి మమ్మంత చెంగఁ ద్రోలి
నీశాసనంబున నే మీడ్చికొని వచ్చు, క్రూరచిత్తునిఁ బుచ్చికొని యదల్చి

తే. పాశబంధంబు లీసునఁ బట్టి త్రెంచి, బలిమి మిగులంగ మమ్మును బాఱఁద్రోలి
యిచ్చఁ జనినారు వారు దా మెచటివార, లాదరమ్మున మాకు నేఁ డానతిమ్ము.

వ. అని రని మఱియు శుకుఁ డిట్లనియె నట్లు దూతలు పరితాపసమేతులై పలికిన
దండధరుండు పుండరీకాక్షునిచరణకమలంబులు దనమానసంబున సన్నిహితంబు
లుగఁ జేసికొని వందనం బాచరించి పరమభక్తిపరుండై వారల కిట్లనియె.

సీ. కలఁడు మదన్యుండు ఘనుఁ డొక్కఁ[3]డెడతెఁ డెంపు, వెలికిఁ గానఁగ రాక విశ్వమెల్ల
నతిలీలమై మహాద్భుతసమగ్రస్ఫూర్తి, నుండును గోక నూలున్నభంగి
దామెనఁ బశువులు దగిలి యుండెడుమాడ్కి, నామసంకీర్తనక్షేమగతుల
విహరించు నెవ్వఁడు విలసితమహ్నాజ, లెవ్వనిపదముల నివ్వటిల్లుఁ

ఆ. గనుట మనుట చనుట గల్గు నెవ్వనిలీల,లందు లోక మెవని యందుఁ బొందు
నెన్నఁబడుచుఁ బుడమి నెవ్వనినామముల్, గర్మబంధనముల పేర్మి నడఁచు.

తరలము. వినుఁడు నేను మహేంద్రుఁ డప్పతి వీతిహోత్రుఁడు రాక్షసుం

---

1 త్రైవిధ్య మొనరించు. 2 సాక్షాత్తు మ యెవ్వ రంగు. 3 డతనంగు.

డనిలుఁ డర్కుఁడు చంద్రుఁడుం గమ।లాసనుండు మరుద్గణం
బును మహేశుఁడు రుద్రవర్గము। భూరిసంయమిసిద్ధులున్
మొనసి కన్గొనఁ జాల రెవ్వని।మూర్తి విశ్రుతకీర్తిమై. 170

క. సత్త్వేతరగుణపాశవ,శత్త్వంబునఁ బొంద వీరు। జలజాక్షుసదై
కత్త్వంబు గాన నోపరు, సత్త్వప్రాధాన్యు లితర।జనములతరమే. 171

చ. అభవు నమేయు నవ్యయు న।నంతు ననారతుఁ బూని మేనిలో
నుభయము నై వెలుంగుపురు।షోత్తముఁ గానరు చిత్తకర్మవా
గ్విభవగరిష్ఠు లై వెదకి। పిటిఁడిప్రాణులు సర్వవస్తువుల్
శుభగతిఁ జూడ నేర్చి తనుఁ। జూడఁగ నేరనికంటిపోలికన్. 172

చ. పరముని భక్తలోకపరి।పాలనశీలుని దుష్టలోకసం
హారుని పతంగపుంగవవి।హారునికూరిమిదూత లామనో
హారులు సురేంద్రవందితులు। నాహరిరూపగుణస్వభావు లై
తిరుగుచు నుందు రెల్లెడల। దిక్కులఁ దేజము పిక్కటిల్లఁగన్. 173

ఉ. లెక్కకు [1]నెక్కు వై కసటు। లేనిమహాద్భుతతేజ మెల్లెడం
బిక్కటిలం జరింతు రతి।భీమబలాఢ్యులు విష్ణుదూత లా
చక్కనిధర్మశాంతు లతి।సాహసవంతులు దేజపూజితుల్
గ్రిక్కిటి సీజగంబునను। గేశవసేవకరక్షణార్థ మై. 174

క. నావలనను మీవలనను, దేవాసురగణమువలనఁ। ద్రిజగంబులలో
నేవగలఁ బొంద కుండఁగఁ, గావం గలవారు పుడమిఁ। గలవైష్ణవులన్. 175

క. భగవత్ప్రణిహితధర్మం, బగపడ దెవ్వారిమతికి। ననిమిషగరుడో
రగసిద్ధసాధ్యనరసుర,ఖగతాపసయక్షదివిజ।ఖచరుల కైనన్. 176

క. ఎన్నఁడుఁ దెలియఁగ నేరరు, పన్నగపతిశాయితత్త్వ।భావము మేనం
గన్నులవేల్పును డాపలఁ, జన్నమరినవేల్పు ముదుక।చదువులవేల్పున్. 177

సీ. వరమహాద్భుత మైన। వైష్ణవజ్ఞానంబుఁ, దిరముగా నెవ్వారు। దెలియఁ గలరు
దేవాదిదేవుండు। త్రిపురసంహారుఁడొండెఁ, గమలసంభవుఁడొండెఁ। గార్తికేయ
కపిలనారదులొండె। గంగాత్మజుండొండె, మనువొండె బలియొండె। జనకుఁడొండె
బ్రహ్లాదుఁడొండె నే।ర్పాటుగా శుకుఁడొండె, భాసురతరమతి। వ్యాసుఁడొండెఁ

తే. గాక యన్యులతరమె యీ।లోకమందు, నీసుబోధంబు సద్బోధ। మీపదార్థ
మీసదానందచిన్మయ। మీయగమ్య, మీవిశుద్ధంబు గుహ్యంబు। నీశుభంబు.

క. ఈపన్నిద్దఱు దక్కఁగ, నోపరు తక్కొరులు దెలియ। నుపనిషదుచిత
[2]శ్రీపతినామమహాద్భుత, దీపితభాగవతధర్మ।దివ్యక్రమమున్. 179

తే. ఏది జపియింప నమృతమై।యెసఁగుచుండు, నేది సద్ధర్మపథమని।[3]యెఱుఁగఁదగిన

1 మిక్కి లై. 2 శ్రీపరిణామమహా. 3 యెన్నఁబడును.

దదియె సద్భక్తియోగంబు నలవరించు, మూర్తిమంతంబు దా హరికీర్తనంబు.
తే. కంటిరే మీరు సుతులార కమలనేత్రు, భవ్య మగునామకీర్తనఫలము నేఁడు
దవిలి మృత్యువుపాశబంధములవలన, జాణతనమున నూడె నజామిళుండు. 181
ఉ. ఏటికి జాలిఁ బొంద నరు లీక్రియ గృష్ణునికీర్తనంబు పా
పాటవులన్ దహింపఁ గల దాటకు సందియ మేల యిప్పుడీ
తూఁటరి దోసకారి పెను దోషి యజామిళుఁ డంత మొందుచుం
బాటిగ విష్ణునామసుతుఁ బల్కుచుఁ గేవలముక్తిఁ గేఁగఁడే. 182
క. ఇంతయును దథ్య మని మది, నింతయుఁ దెలియంగ లేరు హీనాత్ములు దు
ర్దాంతతరఘటితమాయా, క్రాంతాత్యంతప్రకాశగౌరవజడులై. 183
మంగళమహాశ్రీవృత్తము.
[1]ఈవిధమునన్ విబుధు లేకతమ చిత్తముల నేకతము లేక హరి నీశున్
భావమున నిల్పి తగు భాగవతయోగపరిపాకమున నొందుదురు వారిం
దే వలదు దండనగతిం జనదు మాకు గుఱితింప నఘముల్ దలఁగు మీఁదన్.
శ్రీవరునిచక్రము విశేషగతిఁ గాచు సురసేవితులు ముక్తిఁ గనుఁబెద్దల్.
ఉ. ఎవ్వరు సిద్ధసాధ్యఖచరేశలసత్పరిగీతగాథలం
దెవ్వరు ముక్తిభోగతలహేమమనోహరచంద్రశాలలం
దెవ్వరు శంఖచక్రగురుహేతిగదారుచిరోగ్రపాణు లా
మవ్వపురూపవంతు లసమానులు వో ధరలోని వైష్ణవుల్. 185
సీ. శ్రుత్యంతవిశ్రాంతమత్యనుక్రమణీయ, భగవత్ప్రసంగతుల్ భాగవతులు
సనకాదిమునియోగిజనసదానందైక, పరమభాగ్యోదయుల్ భాగవతులు
కృష్ణపదధ్యానకేవలామృతపాన, పరిణామయుతులు శ్రీభాగవతులు
బహుపాతకానీకపరిభవప్రక్రియా, పరుషోగ్రమూర్తులు భాగవతులు
తే. భావతత్త్వార్థవేదులు భాగవతులు, బ్రహ్మవాదానువాదులు భాగవతులు
సిరులు దొలఁకంగ నెన్నఁడుఁ జేటులేని, పదవి నొప్పారువారు వో భాగవతులు.
క. అది గాన విష్ణుభక్తులఁ, గదియఁగఁ జన వలదు మీరు కరివరదులస
త్పదపద్మవినతివిముఖులఁ, దుది నంటఁగఁ గట్టి తెండు ధూర్తులు వారల్.
సీ. ఏకపక్షమున కైన నిందిరారమణుని, బలుకంగ లేనిదుర్భాషితులను
గలలోన నైన శ్రీకాంతునిసత్పాద, కమలముల్ నూడనికర్మదృశుల

---

1 ఇది 'ఈవిధమునన్ విబుధులేచి తమచిత్తముల నేకతము లేక పరమేశు హరి నీశున్, భావమున నిల్చి తగు భాగవతయోగపరిపక్వమున నొందుదురు పాలుపడి వారిం, దే వలదు దండనగతిం జనగు మాకు గణుతింప నఘముల్ దొలఁగుఁ దెల్ల మగు మీఁదన్, శ్రీవరునిచక్రము విశేషగతిఁ గాచు సురసేవితులముక్తిఁ గనుఁ జెందుదురు పెద్దల్' అని వ్రాఁతప్రతుల లయాగ్రాహిగా నున్నది.

నవ్వుచు నైనఁ గృష్ణప్రశంసకుఁ జెవిఁ, [1]దార్ప నేరనిదుష్కథాప్రవణుల
యాత్రోత్సవంబుల । నైన నీశునిగుడి, త్రోవఁ ద్రొక్కఁగ లేని। దుష్పదులను

ఆ. బరమభాగవతుల। పాదధూళిసమస్త, తీర్థసార మనుచుఁ । దెలియ లేని
వారి వారివారి । వారిఁ జేరినవారిఁ, దోలుతఁ గట్టి తెండు । దూతలార. 188

ఆ. ఎల్లపాపములకు । నిల్లైనయింటిలో, బద్ధతృష్ణు లగుచు । బుద్ధి దలఁగి
పరమహంసకులము । గుఱి దప్పి వర్తించు, ధూర్తజనులఁ దెండు । దూతలార.

ఆ. అరయఁ దనదుజిహ్వ । హరిపేరు నుడువదు, చిత్త మతనిపాద। చింతఁ జనదు
తలఁపఁ దమకు ముక్తి । తంగేటిజున్నొకో, సకలవిష్ణుభక్త। లకునుబోలె. 190

ఆ. పద్మనయనుమీఁది। భక్తియోగంబెల్ల, ముక్తియోగమనుచు । మొదల తెఱుంగు
వారి వారివారి । వారిఁ జేరినవారి, త్రోవఁ దలఁప వలదు । దూతలార. 191

వ. అని పలికె నని చెప్పి మఱియు శుకుం డిట్లనియె శ్రీకృష్ణనామకీర్తనంబు జగ
న్మంగళం బనియును [2](జగన్మోహనం బనియును) జగజ్జేగీయమానం బనియును
నిఖిలపాపైకనిష్కృతి యనియును నిఖిలదుఃఖనివారణం బనియును నిఖిలదారిద్ర్య
నిర్మూలనం బనియును నిఖిలమాయాగుణవిచ్ఛేదకం బనియును నుద్దామంబు లగు
హరిపేర్యంబుల నాకర్ణించువారలచిత్తంబు లతినిర్మలంబు లగుభంగిం దక్కిన
వ్రతాచరణంబులం గా వనియును శ్రీకృష్ణపదపద్మంబులు హృత్పద్మంబుల
నిలుపువార లన్యపాపకర్మంబు లగునవిద్యావ్యసనంబులం బొరయనేర రనియును
నిజస్వామి యైన(యమ)ధర్మరాజుచేతఁ గీర్తింపంబడినభగవన్మాహాత్మ్యంబు నాక
ర్ణించి విస్మితులై కాలకింకరులు నాఁటనుండియు వైష్ణవజనంబులం దేఱి చూడ
వెఱతురు నరేంద్రా పరమగుహ్యం బగునీయితిహాసంబును బూర్వకాలంబున
సకలవిజ్ఞానగోచరుం డైనకుంభసంభవుండు నఖిలదుఃఖవిలయంబును (సకలపుణ్య
నిలయంబును) నైనమలయంబునఁ బురాణపురుషుం డైనపురుషోత్తము నారాధ
నంబు సేయుచుండి నా కెఱింగించె నని చెప్పిన విని విస్మయానందహృదయుం
డై పరీక్షిజ్జనపాలుం డిట్లనియె. 192

క. స్వాయంభువమనువేళల, నోయయ్య సురాసురాండ। జోరగనర[3]వ
ర్గాయతసర్గము దెలిపితి, పాయక వినవలయుఁ దెలియఁ । బలుకం గదవే. 193

క. ఉత్తరకొడు కిట్లడిగిన, నుత్తరమును సమ్మునీంద్రుఁ । డుత్తమచేతో
వృత్తి ముద మంది పలికెను, దత్తఱపా టుడిగి వినుఁడు । తాపసవర్యుల్. 194

సీ. పూని ప్రచేతసు। పుత్త్రులు పదుగురు, ప్రాచీనబర్హిషు। ప్రాఖ్యఁ గలుగు
వారు మహాంభోధి। వలన వెల్వడి వచ్చి, తగ వృక్షవృత మైన। ధరణిఁ జూచి
మేదినీజములపై । మిక్కిలి కోపించి, మదిలోన దీపిత। మన్యు లగుచు

---

1 జోలివేఁడునిదుష్కథాభిరతుల. 2 'జగజ్జయం బనియు జగచ్ఛరణ్యం బనియు జగచ్ఛాశ్వ
తం బనియు నిఖిలపాపై. 3 సర్గాయతము గలిగె నంటివి.

వక్త్రంబులను మహావాయుసంయుత మైన, యనలంబుఁ గల్పించి యవనిజములఁ
తే. [1]బెల్లు వడఁ గాల్పఁ దొడఁగినఁ దల్లడిల్లి, వారికోపంబు వారించువాఁడపోలెఁ
బలికెఁ జందురుఁ డో మహాభాగులార, దీనమగు వృక్షములమీఁదఁ దెగుట దగునె.
తే. మొదల వరిష్ఠు లగుమీరు సదయహృదయు
లగు ప్రజాపతు లనుచు సర్వాత్ముఁ డనిమె
నట్టిమీరు ప్రజాసృష్టికై నవార
లీవనస్పతితతుల దహింపఁ దగునె, 196
సీ. ఆదికాలంబున నా ప్రజాపతి[2]పతి, యైన లోకేశ్వరుం డచ్యుతుండు
పద్మనేత్రుఁడు వన[3]స్పతుల నోషధిముఖ్య, జాతంబు మిషము నూర్జంబుఁ గోరి
కల్పించె నందు ముఖ్యం బైన యన్నంబు, నచరంబు, లైనట్టి యపద మెల్లఁ
బాదచారులకును బాల్వెట్టి యిరుగాల్గఁ, జేతులు గలిగిన జీవతతికి
తే. [4]పాణు లొగిలేనియా చతుష్పాత్తులెల్ల, నన్నముగఁ బూని కాపించె నదియుఁ గాక
నామహాభాగుఁ డచ్యుతుఁ డాదరమున, మీకు ననఘాఖ్యవిఖ్యాతి జోకపఱిచె.
క. నిజముగ దేవాధీశ్వరుఁ, డజుఁడు ప్రజాసర్గమునకు ననఘుల మిమ్ముం
సృజియించె నిట్టివారికిఁ, గుజదహనము సేయ నెట్లు గోరిక వొడమెన్. 198
చ. సతత మహాత్త్వసత్త్వగుణసత్పురుష స్మృతిఁ బొందరయ్య మీ
పితరులునుం బితామహులుఁ బెద్దలు నెన్నఁడుఁ బొందనట్టిదు
ష్కృతిమత మైనకోపమునఁ గిల్బిషభావము మానరయ్య సం
భృతకరుణావలోకమున భీతతరుప్రకరంబుఁ జూచుచున్. 199
ఉ. తప్పక [5]యర్భకావళికిఁ దల్లియుఁ దండ్రియు నేత్రపంక్తికిన్
ఱెప్పలు నాతికిం [6]బతియు ఱేఁడు ప్రజావళి కెల్ల నర్థికిం
బొప్పు గృహస్థు మూఢులకు నుత్తము లెన్న సమస్తబాంధవుల్
ముప్పునఁ గావ లేనికడు మూర్ఖులు గాచు నిజాలచుట్టముల్ 200
సీ. అఖిలభూతముల దేహాంతస్స్థమగు నాత్మ, యీశుఁ డచ్యుతుఁ డని యెఱుఁగవలయు
నెఱిఁగి సర్వంబైన యిందిరారమణు లో, చూపులఁ దనివిగాఁ జూడ వలయుఁ
జూచిన చిద్రూపశుద్ధాత్ము లగుమిమ్ము, నెనసిన వేడ్కతో నిచ్చ మెచ్చు
మెచ్చిన సర్వాత్ము మీ రెఱింగిన చోటఁ, గోపగుణంబులఁ బాప వలయుఁ
ఆ. బాపి దగ్ధశేషపాదపజాలంబు, దియ్య మెసఁగఁ బ్రదుక నియ్యవలయు
ననఘులార మీఁగ లస్మదీయప్రార్థ,నంబు పరఁగఁ జేకొనంగ వలయు. 201
క. ఇదె వృక్షసముద్భవ యగు, మదిరేక్షణ [7]నాప్సరసిఁ గుమారిక నిత్తుం
వదలక పత్నిఁగఁ జేకొని, ముద మందుఁడు పాదపములమోసము వాయన్.

1 'పొల్లు పెడ. 2 తండ్రియైన. 3 స్పతులనునోషధిజాతంబు. 4 బాహువులు లేనియాచతుష్పదులనెల్ల, 5 యెల్ల వారలకు. 6 బలి ♦ విరించి ప్రజాళికి భిక్షుకోటికిం. 7 నాప్సరసీకుమారిక' వ్రా ప్ర.

వ. అని యిట్లామంత్రణంబు సేసి మారిష యను కన్యకను వారల కిచ్చి చంద్రుం
డు సనియె నప్పుడు. 203

క. వారలు పర్యాయంబున, నీరేజముఖిన్ వరించి నెఱి రమియింపన్
ధీరుఁడు ప్రాచేతసుఁ డై, వారక దక్షుండు పుట్టె వనజజసముఁ డై. 204

క. ఎవ్వనిసంతానంబులు, నివ్వటిలెన్ వసుధ నెల్ల నెఱి నాదక్షుం
డివ్వలన జగము లన్నిటఁ, బ్రవ్వ జలము నిలిపినట్లు ప్రజఁ బుట్టించెన్. 205

ఉ. వారని వేడ్కతో దుహితృవత్సలదక్షుఁడు దక్షుఁ డాత్మలోఁ
గోరి సృజించెఁ గొన్నిటి నకుంఠితవీర్యముచేతఁ గొన్నిటిన్
బోరన ఖేచరంబులను భూచరముఖ్యవనేచరంబులన్
నీరచరవ్రజంబు రజనీచరజాలదివాచరంబులన్. 206

క. నరసురగరుడోరగకిం, న్నరదానవయక్షపక్షినగవృక్షములం
దర మిడి సృష్టి యొనర్చెను, దిరముగ దక్షప్రజాపతి వితతకీర్తిన్. 207

క. బహువిధముల బహుముఖముల, బహురూపము లైన ప్రజల బహులోకములన్
బహుళముగఁ జేసి మదిలో, బహుమానము నొందఁడయ్యెఁ బ్రఖ్యాతముగన్.

తే. [1]ఆప్రజాసర్గబృంహితం బయినజగము
దక్షుఁ డీక్షించి మదిలోనఁ దాప మొంది
మఱియు జననంబు నొందించుమతము గోసి
పరమపురుషుని నాశ్రయింపంగఁ దలఁచె. 209

వ. ఇట్లు దక్షప్రజాపతి ప్రజాసర్గంబు సాలక చింతించి మంతనంబున లక్ష్మీకాంతుని
సంతుష్టస్వాంతుం జేయువాఁ డై. 210

క. మోదం బై పరిదూషిత, ఖేదం బై శాబరీద్ధకిలికించితదృ
గ్ఛేదం బై బహుసౌఖ్య, పాదం బై యొప్పువింధ్యపాదంబునకున్. 211

వ. ఇట్లు వింధ్యపాదంబున కరిగి యం దఘమర్షణం బనుతీర్థంబు సర్వదురితహరం
బయి యొప్పుదాని ననుసవనంబు సేవించి యతిఘోరం బైనతపంబు సేయుచు
హరిం బ్రసన్నుం జేసి హంసగుహ్యం బను స్తవరాజంబున ని ట్లని స్తుతియించె.

దక్షుఁడు స్తుతియించినహంసగుహ్యం బను స్తవరాజము.

తే. పరమునకి వందనము సేతుఁ బరిభవించి
ము న్నవితథానుభూతికి మ్రొక్కికొందు
మెఱయు గుణములఁ [2]దేలునిమిత్తమాత్ర
బంధు వై నట్టివానికిఁ బ్రణతి సేతు. 213

ఆ. తవిలి గుణములచేతఁ దత్త్వబుద్ధులచేత, నిగిడి కాన రానినెలవువాని
మొదలఁ దాన కలిగి ముక్తిమానావధి, రూపుఁ జెందువానిఁ బ్రాపుఁ గందు. 214

1 అంత సర్గంబు బృంహిత మైనఁ జూచి, దక్షుఁ డెంతయు మదిలోన. 2 దెలుప నిమిత్త.

ఆ. ఎల్లతనువులందు నిరవొంది తనతోడఁ, బొందుసేసినట్టిపొందుకాని
పొందువొందలేఁడు పురుషుండు [1]గుణము నా,గుణిని బోలునట్టిగుణి భజింతు.

ఉ. పూని మనంబునుం దనువు భూతములున్ మఱి యింద్రియంబులుం
బ్రాణములున్ వివేకగతిఁ బాయక యన్యముఁ దమ్ము నెమ్మియుం
గానఁగనేర వాగుణనికాయములం బరికించునట్టి స
ర్వానుగతున్ సమస్తహితు నాదిమపూరుషు నాశ్రయించెదన్. 216

వ. మఱియు [2]ననేకవిధనామరూపనిరూప్యం బగుమనంబునకు దృష్టస్మృతులనాశం బువలనఁ గలిగెడు నుపరామం బగుసమాధియందుఁ గేవలజ్ఞానస్వరూపంబునఁ దోఁచునిర్మలప్రతీతిస్థానం బైనహంసస్వరూపికి నమస్కరింతుఁ దారువందు నతిగూఢం బైనవీతిహోత్రుని బుద్ధిచేతం బ్రకాశంబు నొందించుభంగి బుద్ధిమంతులు స్వాంతరంబున సన్నివేశుం డయినపరమపురుషుని [3]నాత్మశక్తిత్రయంబుచేతం దేజరిల్లఁ జేయును రట్టిదేవుండు సకలమాయావిచ్ఛేదకం బయిన నిర్వాణసుఖానుభవంబునం గూడి యుచ్చరింపం గొలంది గానిశక్తి గలవిశ్వరూపుండు నాకుం బ్రసన్నుం డగుం గాక వాగ్బుద్ధీంద్రియమానసంబులచేతం జెప్పను నిట్టి దని నిరూపింపను నలవి గాక యెవ్వనిగుణరూపంబులు వర్ణించు నెవ్వండు నిర్గుణుండు సర్వంబు నెవ్వనివలన నుత్పన్నం బగు నెవ్వనివలన స్థితిం బొందు నెవ్వనివలన లయం బగు నట్టిపరాపరంబులకుం బరమం బై యనన్యం బై (ప్రా)క్ప్రసిద్ధం బై యదియ బ్రహ్మం బై యాదికారణం బై యున్నతత్త్వంబు నాశ్రయింతు నెవ్వనిప్రభావంబు మాట లాడెడువారలకు వాదంబు సేయువారలకు వివాదస్థలంబు లగుచు నప్పటప్పటికి మోహంబు నొందించుచుండు నట్టి యనంతగుణంబులు గలమహాత్మునకు నతిభక్తిం బ్రణామంబు సేయుదు నస్తి నాస్తి యనువస్తుద్వయనిష్ఠలం గలిగి యొక్కటన యుండి విరుద్ధధర్మంబులుగఁ గనంబడుసుపాసనాశాస్త్రసాంఖ్యశాస్త్రంబులకు సముం బై వీక్షింపఁదగినపరమంబు నాకు ననుకూలం బగుం గాక యెవ్వఁడు జగదనుగ్రహంబుకొఱకు జన్మకర్మంబులచేత నామరూపంబు లెఱుంగంబడ కుండియు నామరూపంబులు గలిగి తేజరిల్లు నట్టియనంతుం డయినభగవంతుండు ప్రసన్నుం డగుం గాక యెవ్వండు జనులకుఁ బురాకృతజ్ఞానపదంబులచేత నంతర్గతుం డై మేదినిం గలుగుగంధాది గుణంబుల నాశ్రయించినవాయువుభంగి మెలంగుచుండు నాపరమేశ్వరుండు మదీయమనోరథంబు సఫలంబు సేయుం గాక యనుచు భక్తిపరవశుం డయి

---

1 'గుణకర్త, గుణముఁ బోలునట్టి. 2 నామరూపంబులు రూపవిధవంబునకు దృష్టిస్మృతిసంప్రమోషంబువలన నేప్రకారంబునఁ బొందరాక తమందులం గలసుజ్ఞానంబుచేత నేది యెఱుంగంబడుచుండు నట్టితేజోధామం బైనపరమహంసంబునకు నమస్కరింతు. 3 నాత్మశక్తు లైన నపద్రవ్యంబులచేత నశక్తిత్రయంబులచేతను దేజరిల్లు' వ్రా. ప్ర.

యుక్తివిశేషంబున స్తుతియించుచున్నదక్షునికి భక్తవత్సలుం డైన శ్రీవత్సలాంఛనుండు ప్రాదుర్భావంబు నొందె నప్పుడు. 217

సీ. భర్మాచలేంద్రప్రపాతద్వయంబునఁ, గలిగిననీలంపుఁ గను లనంగ
మొనసి తార్క్ష్యునియురమూఁపుపై నిడినట్టి, పదములకాంతులు పరిఢవింపఁ
జండదిఙ్మండలశుండాలకరముల, కైవడి నెనిమిదికరము లమరఁ
జక్రకోదండాసిశంఖనందకపాశ, చర్మగదాదుల సరవిఁ బూని
ఆ. నల్లమేను మెఱయ నగుమొగం బలరంగఁ, జల్లచూపు విబుధసమితిఁ బ్రోవ
బసిఁడికాసెఁ బూని బహుభూషణకిరీట, కుండలములకాంతి మెండుకొనఁగ.

సీ. కుండలమణిదీప్రగండస్థలంబులు, పూర్ణేందురాగంబుఁ బొనుఁగుపఱుప
దివ్యకిరీటాంతదీప్త లంబరరమా, సతికిఁ గౌసుంభవస్త్రంబు గాఁగ
వక్షస్స్థలంబుపై వనమాలమాలిక, శ్రీవత్సకౌస్తుభశ్రీల నొఱయ
నీలాద్రిఁ బెనఁగొని నిలిచినవిద్యుల్ల, తలభాతిఁ గనకాంగదములు మెఱయ
ఆ. నఖిలలోకమోహనాకారయుక్తుఁడై, నారదాదిమునులు నేరి పొగడఁ
గదిసి సురలు గొలువ గంధర్వకిన్నర, సిద్ధగానరవము చెవుల నలర. 219

క. సర్వేశుఁడు సర్వాత్ముఁడు, సర్వగతుం డచ్యుతుండు సర్వమయుం డై
సర్వంబుఁ జేరి కొలువఁగ, సర్వగుఁ డై దక్షునకుఁ బ్రసన్నుం డయ్యెన్. 220

వ. ఇట్లు ప్రసన్నుం డయినసర్వేశ్వరుని సర్వాంకషంబును మహైశ్వర్యధుర్యంబును నయి తేజరిల్లుదివ్యరూపంబుఁ గాంచి భయంబును హర్షంబును విస్మయంబును జిత్తంబున ముప్పిరిగొని చొప్పు దప్పింపఁ దెప్పిఱి కప్పరపాటునం బుడమిపై నిడుసాఁగిలం బడి దండప్రణామంబు లాచరించి కరకమలంబులు మొగిడ్చి సెలయేఱులతొట్టునఁ గొట్టువడి యుట్టుట్టుఁ బట్టుచాలక నిట్టవొడిచి మున్నీరు దన్ని నిలిచినపెన్నీరునుంబోలె సర్వాంగంబులుం దొంగలింపఁ జిత్తంబు నాత్మాయత్తంబు సేసి పిక్కటిల్లినసంతోషంబుచేత భగవంతుం బలుకను నత్యంతమంగళసందోహాపాదకంబు లైనతన్నామంబు లుగ్గడింపను నతినిర్మలాంబు లయినతదీయకర్మంబులు దడవను విబుధహర్షకరంబు లైనతత్స్వరూపంబులు వొగడను సాత్త్వికమనోరథంబు వాక్రువ్వను నోపక ప్రజాకాముం డై యూరకున్నప్రజాపతిం జూచి సర్వజీవదయాపరుండును సర్వసత్త్వహృదంతరస్థుండును సర్వజ్ఞుండునుం గావున నతనిభావంబు దెలిసి జగన్నాథుం డార్తపోషణంబు లైనభాషణంబుల ని ట్లనియె. 221

క. మెచ్చితిఁ బ్రాచేతస తప, మిచ్చట ఫలసిద్ధి యయ్యె ని ట్లతిభక్తిన్
హెచ్చగుమద్భవవిభవము, నచ్చుపడం బొంద నెవ్వఁ డర్హుఁడు జగతిన్. 222

ఆ. తపము సాలు నింకఁ దగ భూతతతికి వి, భూతు లొనరుఁ గాక పొందుపడఁగ
నిదియ సుమ్ము మాకు నిచ్చలోఁ గలకోర్కి, పొసఁగ నీదువలనఁ బొందుపడియె.

వ. వినుము బ్రహ్మయు భర్గుండును బ్రజాపతులును మనువులును నింద్రులును నిఖిల భూతంబులకు భూతిహేతువు లయినమదీయవిభవంబులు మఱియు నాకు (యమనియమాదిసహితసంధ్యావందనాదిరూపం బగు)తపంబు [1]హృదయంబు సాంగజపధ్యానరూపం బగువిద్య శరీరంబు ధ్యానాదివిషయపుంవ్యాపారంబు గా నుండుభావనాదిశబ్దవాచ్యం బగుక్రియ యాకృతి క్రతుజాతంబు లంగంబులు ధర్మం బాత్మ దేవతలు ప్రాణంబులు నిగమంబు మత్స్వరూపంబు (జగదుత్పత్తికి నాదియందు నే నొక్కండన తేజరిల్లుచుంటి) బహిరంతరంబుల (వే ఱొక్కటి) లేక (సుషుప్త్యవస్థయందు) సర్వంబు [2]లీనం బగుటం జేసి సంజ్ఞామాత్రుండును నవ్యక్తుండునుగా నుండుజీవునిభంగి నొక్కండన యుండుదు ననంతుండ నై యనంతగుణంబులు గలమాయాగుణంబువలన గుణవిగ్రహం బగుబ్రహ్మాండంబును నయోనిజుండు స్వయంభువు నగుబ్రహ్మయును నుదయించిరి మదీయవీర్యోపబృంహితుం డయి మహాదేవుం డగునాబ్రహ్మ యసమర్థుండునుం బోలె నకృతార్థమ్మన్యమానమనస్కుం డయి సృజింప నుద్యమించుతఱిం దపం బాచరింపు మని నాచేత బోధితుం డై ఘోరం బైనతపం బాచరించి తొలుత సృష్టికర్తృత్వంబు వహించినమిమ్ము సృజియించె నంతఁ బంచజనప్రజాపతితనూజ యగునసిక్ని యనుపేరిట వినుతి నొందియున్నయిక్కన్యకను నీ కిచ్చితి దీనిం బత్నింగాఁ గైకొని మిథునవ్యవాయధర్మంబు గలవాఁడ వై మిథునవ్యవాయధర్మంబు గలయీనాతియందుఁ బ్రజాసర్గంబు నతివిపులంబుగఁ గావింపం గలవాఁడవు మఱియు నీకుఁ బిదప నీక్రమంబున నిఖిలప్రజలును మన్మాయామోహితు లయి మిథునవ్యవాయధర్మంబునఁ బ్రజావృద్ధి నొందించి మదారాధనపరులై యుండఁ గలవా రని పలికి విశ్వభావనుం డైనహరి స్వప్నోపలబ్ధార్థంబునుంబోలె నంతర్ధానంబు నొందె నప్పుడు దక్షుండు విష్ణుమాయోపబృంహితుం డై (పాంచజని యగు)నసిక్నియందు హర్యశ్వసంజ్ఞల (వినుతిఁ జెంది యున్న)యయుతసంఖ్యాపరి

---

1. 'బ్రహ్మంబు శరీరంబు క్రియ యాకృతి. 2 'నేన యై యుండుదు నవ్యక్తంబు సంజ్ఞామాత్రంబు గలిగి యొక్కఁడ పాలక నిద్రించువానిభంగి విశ్వంబువలన నేమియును బహిరంతరంబులు లేక యుండుదు ననంతుండ నై యనంతగుణంబులు గల నాగుణంబువలన గుణవిగ్రహంబు పుట్టె నావిగ్రహంబువలన నాఢ్యుం డై స్వయంభు వై నయజుం డయ్యె మదీయవీర్యోపబృంహితుం డై మహాదేవుం డై సృష్టిసర్గకర్మంబులయం దశక్తుం డై యఖిలంబును శూన్యంగాఁ దలంచె దారుణం బైనతపంబువలన నాచేఁ బ్రేరితుం డై మతింబుగాఁ జేసి నవబ్రహ్మ లైనమిమ్ము నేవిధిఁ బ్రభు వై సృజించె నట్టిపంచజనప్రజాపతికిఁ దుహిత యైన యసిక్ని యనంబడునిక్కన్యకను నిచ్చితి దీనిం బత్నిగాఁ గైకొని మిథునవ్యవాయకర్మంబు గలిగి ప్రజాసర్గంబు గావింపుము మిథునవ్యవాయధర్మశీలుండు భూతసంఘంబును గలిగింప నిశ్చయించినవీవలన నుత్పన్నం బైనప్రజ లెల్లను మిథునీభూతయుంబు లై మదీయమాయచేతం బుట్టుచు మత్సేవాపరు లగుదురు గాక యని పలికి విశ్వభావనుం డైనహరి' బ్రా. ప్ర.

గణుతు లైనపుత్రులం దశసహస్రంబులఁ బుట్టించె నప్పు డాధర్మశీలు రైన దాక్షాయణులు పితృనిర్దేశంబునం బ్రజాసర్గంబుకొఱకుఁ దపంబు సేయువా రై పశ్చిమదిశకుం జని యచ్చట నారాయణసరస్సనం బరఁగుతీర్థరాజం బై సింధుసముద్రసంగమంబున నొప్పుచుండి సమస్తదేవమునిసిద్ధగణసేవితంబై దర్శనస్పర్శనాలోకనమాత్రంబున నిర్ధూతకల్మషులను నిశ్చలధర్మపరులను నిర్మలచిత్తులనుం జేయు చున్నయప్పుణ్యతీర్థంబున నవగాహనంబు సేసి నిర్మలాంతరంగు లై పరమహంసధర్మంబునందు నుత్పన్నమతు లై ప్రజాసర్గంబుకొఱకుఁ దండ్రియనుమతంబున నుగ్రతపంబు సేయుచుండ వారికడకు నారదుండు వచ్చి యిట్లనియె.

సీ. మీ రతిమూఢులు ✽ మీఁదటిగతి గాన, రెన్నంగఁ బసిబిడ్డ ✽ లన్నలార
పుడమి దా నిం తని ✽ కడఁ బరికింపక, ప్రజలఁ బుట్టింప నే ✽ ప్రతిభ గలదు
అ ట్లైన నొక్కమ ✽ హాత్ముఁడు పురుషుండు, బహురూపములు గల ✽ భామయొక తె
[1]పుంశ్చలి గర్తంబుఁ ✽ బురణింప నుభయప్ర, వాహంబు గలనది ✽ వఱలఁ గదల
ఆ. నంచ యొకటి యిరువదైదింటిమహిమలఁ, గలిగి యుండు తెరువు ✽ గాన రాక
వజ్రనిబిడ మగుచు ✽ వసుసఁ దనంతన, తిరుగుఁ [2]గాష్ఠబిలము ✽ దేటపడఁగ.
క. వినుఁ డంతుల ననురూపము, నను పొందఁగ నెఱుఁగ కాత్మ ✽ నాత్మ గుహాత్రిం
గొనసాగించెద మను మి, మ్మన నేమియు లేదు మూఢు ✽ లని తెలిసితగన్.
వ. అని నారదుండు బోధించిన హర్యశ్వులు సహజబుద్ధిచేత నారదవాక్యంబులఁ దమలో ని ట్లని వితర్కించిరి. 227
తే. సారిది క్షేత్రజ్ఞుఁ డన నతి ✽ సూక్ష్మబుద్ధి, సరయ నజ్ఞానబంధనం ✽ బగుచు లింగ
దేహ మన నెద్దిగల దది ✽ దెలియకున్నఁ, గలదె మోక్షంబుదుష్కర్మ ✽ గతులచేత.
తే. కలఁడుజగ దేకసన్నుత ✽ కారణుండు, స్వామిభగవంతుఁ డభవుండు ✽ స్వాశ్రయుండు
పరముఁ డాతనిఁ జూడక ✽ బ్రహ్మకైనఁ, గలుగునే ముక్తిపదము దు ✽ ష్కర్మగతుల.
ఆ. పురుషుఁ డెట్టు లేనిఁ ✽ బూని బిలస్వర్గ, గతుఁడుఁ బోలె వర్తి ✽ కంబు మాను
నట్టిబ్రహ్మ మెఱుఁగ ✽ నయ్యకు స్వర్గోభ, గ, కర్మగతుల నేమి ✽ గానఁబడును. 230
శా. తన్నిష్ఠాగతి లేనివానికి నస ✽ త్కర్మప్రచారంబుచే
ము న్నే మయ్యెడి నాత్మబుద్ధిగుణస ✽ మ్మోహంబునం దోఁచుచున్
వన్నెల్ వెట్టుక వింతబాగులతతిన్ ✽ వర్తించునాగణ్యసం
పన్నశ్రీయునుబోలె నెల్లగతులం ✽ బ్రఖ్యాత మై యుండఁగన్. 231
సీ. అను పొంద సృష్టి న ✽ వ్యయమునుగఁ జేయుచుఁ, బ్రచురప్రవాహసం ✽ పతిత మైన
నెఱయఁ గూలం బను ✽ నిర్గమస్థానంబు,నందు వేగము గల ✽ క్రందుమాయఁ
[3]గదలి యహంకార ✽ గతివశంబునఁ జాల, వివశుఁ డై బోధకు ✽ విపరి యైన
వానికి నీరీతి ✽ వలవంత కర్మప్ర, చారంబులను మీఁదఁ ✽ జక్క నైన

1. పుంశ్చలీభర్తయు...వఱలుగడల. 2. రాష్ట్రబిలము. 3 గడఁగి......విముఖుఁ డై నవానికి.

ఆ. జన్మమరణముఖ్యజాడ్యంబులం బాసి, నిఖిలసౌఖ్యపదవి నెఱసి కమ్రు
మార్గ మైనయట్టిమహనీయధామంబుఁ, జిత్త మార నెట్లు సేరఁ గలఁడు.

తే. దానిసంసర్గగుణములు దప్పి నడచు, కుచ్ఛితపుభార్యఁ జేకొన్నకుమతివోలెఁ
దివిరి సుఖదుఃఖములఁ గూడి తిరిగి జీవ, రూప మెఱుఁగనివారికిఁ బ్రాపుగలదె.

మత్తకోకిలము. పంచవింశతితత్త్వరాశి కపారదర్పణ మయ్యుఁ దాఁ
గొంచె మై పురుషుండు తత్త్వముఁ గోరి పట్టఁగ నేరకే
మంచుఁ గించుఁ దలంచు[1]వార మమార్గకర్మము సేయఁగా
మంచిలోకము వారి కేటికి మానుగా సమకూరెడిన్. 234

క. బంధానుమోక్షణక్రమ, సంధానైశ్వర్యధుర్యశాస్త్రసమగ్ర
గ్రంథంబు నూను చిత్త్రా, పాంథునకును గర్గతుల నగునే శుభముల్. 235

మత్తకోకిలము. చూడ నిజగ మంతయుఁ వెసఁ జుట్టి పట్టుక లీల నే
జోడు లేక రయంబునం [2]గుడిసుట్టునట్టిస్వతంత్రముం
గూడి యుండినకాలచక్రముఁ గోరి చూడనివారి కే
జాడఁ గల్గును గర్గసంగతిఁ జారుమోక్షపదం బిలన్. 236

ఆ. జన్మహేతు వైనజనకునిర్దేశంబు, తనకుఁ జేయ రాని దనుచుఁ దెలిసి
గుణమయప్రవృత్తి ఘోరాధ్వనిశ్శ్వాస, నిరతుఁ డగుచుఁ జేయ నేరఁ డతఁడు.

వ. అని తమలో విచారించి యూరకుండిరి లప్పుడు. 238

సీ. వినవయ్య భూపాల మునివరేణ్యునిమాట, లనువొందఁ దలపోసి వినయ మలర
వలగొని యతనికి వందనంబు లొనర్చి, తిరిగి యెన్నఁడు రానితెరువు వట్టి
చయ్యన నేగిరి [3]సహజసత్త్వబ్రహ్మ, మయ మైనపంకజనయనుపాద
పద్మమరందంబు పానంబు సేయుచు, మత్తిల్లి నిలిచినమానసాళి

ఆ. పరిణమింప విష్ణుఁ బాడుచుఁ దత్కీర్తి, సరణి మ్రోయుమహతి సంఘటించి
నారదుండు గుణవిశారదుం డెంచెనిఁ, జనియెఁ దన్ను జగము సన్నుతింప.

క. అప్పుడు దక్షుఁడు దనయులు, దప్పి మహాపథము గనుటఁ దగ నారదుఁడే
చెప్పినఁ గప్పినశోకము, ముప్పిరిగొని చిత్తవృత్తి మూరింబోవన్. 240

చ. అడలుచు నున్న వచ్చి కమలాసనుఁ డూఱడిలంగఁ బల్కఁ మున్
పడసినలీలఁ బుత్రుల నపారగుణాఢ్యులఁ గాంచు చున్న నా
[4]పడఁతుకయందుఁ బల్వురను బన్నుగఁ దా శబళాశ్వసంజ్ఞులన్
బెడఁ గగువారిఁ బుణ్యములఁ బేర్చినవారి సహస్రసంఖ్యులన్. 241

క. పుట్టించిన జనకునిమదిఁ, బుట్టినతలఁ పెఱిఁగి వారు పూనికఁ బ్రజలం
బుట్టించువ్రతముఁ గైకొని, గట్టిగఁ దప మాచరింపఁగాఁ జనిరి వెసన్. 242

1 'వాడు కదథ్యకర్మను' అ. ప్ర. 2 'సుడిసుట్టు'. 3 'సహజస్వరబ్రహ్మ, భాసితకాశేయ వాసుపాద. 4 'పడఁతుకవల్లఁ గ్రమ్మఱను బల్వురఁ దా శబళాశ్వసంజ్ఞులన్' వ్రా. ప్ర.

వ. ఇట్లు శబళాశ్వులు ప్రజాసర్గంబుకొఱకుఁ దండ్రి పంపునం దపంబు సేయువారై యేతీర్థంబు తీర్థరాజంబై సకలతీర్థఫలంబుల నాలోకనమాత్రంబున ననుగ్రహించుచు సకలపాపంబుల నిగ్రహించు నేతీర్థప్రభావంబున నగ్రజన్ములు ఫలసిద్ధిం బొందుదు రట్టి నారాయణసర స్సనుపుణ్యతీర్థంబునకుం జని తదుపస్పర్శమాత్రంబున నిర్ధూత[1]మలాశయు లై. 243

శా. బ్రహ్మేంద్రాదులు నంద నేరని పరబ్రహ్మంబుఁ జింతించుచున్
బ్రహ్మానందముఁ బొంది జిహ్వికలపై బ్రహ్మణ్యమంత్రంబులన్
బ్రహ్మలోకనవాంఛతో నిలుపుచున్ బ్రహ్మం బితం డంచు మున్
బ్రహ్మజ్ఞానగురున్ హరిం [2]దపమునం బాటించి రబ్బాలకుల్. 244

సీ. ఏకపాదాంగుష్ఠ మిలమీఁద సవరించి, నిశ్చలకాయు లై నిక్కి నిలిచి
కరములు గీలించి సరవి మీఁదికి నెత్తి, గుఱుతుగాఁ జెనుబయల్ గుట్టి పట్టి
నిడివిగాఁ గ్రూర మై నిగిడిన చూడ్కులఁ, గడుఁదీవ్రభానునిఁ బొడిచి పట్టి
వడిఁ గొంతకాలంబు వాయువు భక్షించి, యంతినుండియు నిరాహారు లగుచు

ఆ. సకలలోకములకు సంహారకరమును, బేర్చి దేవతలకు భీతికరముఁ
గాఁగ ఘోరతపముఁ గావింపఁ దొడఁగిరి, మహితచిత్తు లక్కుమారవరులు.

నారదుఁడు శబళాశ్వులకు నివృత్తిమార్గంబు నుపదేశించుట.

వ. ఇట్లతిభయంకరం బైన తపంబు సేయుచు నెడ తెగక భగవన్మంత్రంబులు నొడువుచుఁ బ్రజాసర్గకాము లై యున్న యచ్చిన్నిబాలురకడకు నారదుండు సనుదెంచి పూర్వవిధంబునం బలుకుచు ని ట్లనియె భ్రాతృవత్సలు లై యున్న మీరలు వేదాంతసారం బొలుకుచున్న నావచనంబు లాదరించి తోఁబుట్టువులు సనినమార్గంబునఁ జనుం డెవ్వఁడేని దనయగ్రజులు సన్నమార్గంబున దానును దప్పక వర్తించె నేని నట్టివానిని విశేషధర్మం బెఱింగినవాఁ డండ్రు సతతంబును బుణ్యబంధువు లైన దేవతలం గూడి సుఖం బుండుఁ డని పల్కి నారదుండు సనియె వారలును సర్వకర్మంబులయందు నిర్మోహితు లై పరమపదంబునకు నాస్పదంబు లయిన దేవర్షివాక్యంబుల నాశ్రయించి. 246

ఉ. అప్పుడు లజ్జతోడ శబళాశ్వులు పూర్వజు లేఁగినట్టియా
చొప్పున నెన్నఁడుం దిరిగి చూడని త్రోవ విశేషపద్ధతిం
దప్పక పోయి రయ్య గుణధాములు నేఁడును మళ్ల రేమి నేఁ
జెప్పెదఁ గాక రాక కడసేరిన రాత్రులఁ బోలి భూవరా. 247

క. దక్షున కాకాలంబున, లక్షిత మై యుండెఁ బెక్కులాగుల నుత్పా
తక్షోభంబులు వానికి, రూక్షవ్యథ నొంది యాపుత్రనాశంబున్. 248

---

1 కల్మషు లై. 2 దలఁపులం. 3 బొందుగా భానుని. 4 బంధుం డై దేవతలం గూడి సుఖం బుండు నని పల్కి.

క. నారదకృత మని యెఱిఁగి మహారోషముతోడ నేఁగి యాతనిఁ గని దుః
ఖారూఢచిత్తుఁ డై మది, నూఱడిలం దెరువు లేక యుగ్రుం డగుచున్. 249

ఆ. మోము జేవుఱింప ముడివడ బొమ్మలు, చూపువెంట మంట సుడి గొనంగఁ
బెదవు లదరఁ బండ్లు పెటపెటఁ గొఱుకుచు, దక్షుఁ డాగ్రహించి తపసిఁ బలికె.

చ. నెఱయఁగ సాధురూపమున నీ వతిబాలుర కాత్మజాలికిం
గఱకున భిక్షుమార్గ మగు కందువ సెప్పితి వేల ధూర్తవై
మఱుఁగక యుండ వచ్చునె కుమారుల [1]నీదురితంబు వొంద ని
న్నొఱలఁగఁ ద్రోతు నాదుసమగ్రమహాగ్రహశాపవహ్నులన్. 251

దక్షుండు నారదుని శపియించి ప్రజాసర్గం బొనరించుట.

వ. అది యెట్లం టేని దేవర్షిపితృఋణంబులు దీర్పక [2]మీమాంసితకర్మంబులు గల బాలురకు బుద్ధిఁ జెఱిచి వారలకు నుభయలోకంబుల శ్రేయోహాని నొనర్చితి పెట్టిపాపంబున భాగవతోత్తములలో లజ్జాహీనుండ వై యశోహానిఁ బొంది చరింతువు గాక సకలభూతంబులును గ్రహంబులును దారకంబులును నిన్నుం దఱిపట్టునఁ గలహంకారి వని తలంపుదురు గాక యతికుతూహలంబున నీచేత స్నేహపాశనికృంతనం బైనమిత్రభేదంబె కాని తదుపశమనంబు గా కుండెడు నింత నుండియుఁ బురుషుండు విషయతీక్ష్ణత్వంబు లనుభవింపక కాని తెలియకుండెడు జ్ఞానంబు తనంత నె కాని యొరులచే బోధింపంబడి తెలియరాకుండెడి నిరంతరంబును జరియించు నీకు నేలోకంబునను నునికిపట్టు లేకుండుం గాక యని నిర్దయుండై శాపం బిచ్చె నంత నారదుండు తత్క్రోధవాక్యంబుల కలుగక యట్ల కాక యని

---

1 నీదురితంబు నేఁడు నిన్నొఱలఁగఁ ద్రోతు. 2 ఇందులకు 'మీమాంసితకర్మణాం। విఘాతశ్శ్రేయసః పాపలోకయో రుభయోః కృతః॥ ఏవం త్వం నిరనుక్రోశో బాలానాం మతిభిద్ధరేః। పార్షదమధ్యే చరసి యశోహాని రపత్రపః॥ ననుభాగవతా నిత్యం భూతానుగ్రహకాతరాః। ఋతే త్వాం సౌహృదఘ్నం వై వైరంకర మవైరిణామ్॥ నేత్థం పుంసో విరాగస్స్యాత్త్వయా కేవలినా మృషా। మన్యసే యద్యుపశమం స్నేహపాశనికృంతనం॥ నానుభూయ నజానాతి పుమాన్ విషయతీక్ష్ణతాం। నిర్విద్యతే స్వయం తస్మాన్నతథాభిన్నధీః పరైః॥' అని మూలము. ఇందు 'ననుభాగవతా నిత్యం భూతానుగ్రహకాతరాః' అనుటకు 'నను...భూతానుగ్రహతారకాః' అని పాఠముగ్రహించి కవి తెనిఁగించి యుండునని తోఁచెడిని. ఇది యట్లుండె వచ్చుప్రతులందు కర్మవిచారంబు సేయనిబాలురమనంబులకు నైహికేచ్ఛలయందు వైరాగ్యంబు గలుగం జేసి నివృత్తిమార్గం బుపదేశించి వారలకు నుభయలోకములయందుఁ జెందఁగల శ్రేయోహాని నొనర్చితి పెట్టిపాతకంబున భాగవతోత్తములతో లజ్జాహీనుండ వై యశోహానిం బొంది చరింపుదు గాక నిరపరాధులై వైరంబులేని నాపుత్రులపట్ల ద్రోహకృత్యం బొనర్చిన నీవు దప్పఁ దక్కిన భాగవతోత్తములు సకలభూతానుగ్రహపరవశులు గావున నిరంతరంబును లోకసంచారి వైననీవు' అని యున్నది. ఈపాఠమున 'భూతానుగ్రహతారకాః' అనుదానిని సరిగాఁ దెనిఁగించుటయొకటి తప్ప మూలములోఁ దక్కిన 'మన్యసే యద్యుపశమమ్' ఇత్యాదిపాఠమునకుఁ దెనుఁగు గానిపింపదు. వ్రాఁతప్రతులం దిందులకుఁ దెనుఁగు గానిపించెడిని గాన యదియె గ్రంథమునఁ జేర్పఁబడియె.

సమ్మతించి చనియె నిట్టిశాంతభావం బెవ్వనివలనం గలుగు నతండు సర్వాతీతుం డయినసర్వేశ్వరుం డనంబడు మఱియు దక్షుండు దనమనోరథంబు విఫలం బగుటం జేసి యతిదుఃఖితమనస్కుం డై పొగులు చున్నం బితామహుండు సనుదెంచి మఱియుం బ్రజాసర్గోపాయం బెఱింగించిన నాప్రజాపతి ప్రియభామ యైనయసిక్ని యందుం బితృవత్సల లైనకూఁతుల నఱువదుండ్రం బుట్టించి వారిలో ధర్మునకుం బదువురను గశ్యపునకుం బదుముగ్గురను జంద్రునకు నిరువదేడ్వురను భూతునకు నాంగిరసునకుం గృశాశ్వునకు నిద్దఱేసిచొప్పున నార్వురను దార్క్ష్యుం డను నామాంతరంబుఁ దాల్చినకశ్యపునకు (మరలఁ గడమ) నలువురను సక్రమంబున నిచ్చె వారినామంబు లాకర్ణింపుము. 252

ఆ. ఎట్టిపుణ్యవతులొ యీచేడియలు సెప్ప, సవతు లేనియట్టిసవతు లయ్యుఁ
గడుపు వడసి రెట్టికడుపునఁ బుట్టిరో, కడిఁది త్రిజగ మెల్లఁ గడుపు గాఁగ. 253

వ. వార లెవ్వరనిన భానువు లంబయుఁ గకుప్పు జామియు విశ్వయు సాధ్యయు మరుత్వతియు వసువు ముహూర్తయు సంకల్పయు ననంబడుగురు ధర్మునకుం బత్ను లై కొడుకులం బడసిరి వార లెవ్వ రంటేని భానువునకు [1]వేదఋషభుండు పుట్టె నతనికి నింద్రసేనుం డుదయించె లంబకు విద్యోతుండు గలిగె నతనికి స్తనయిత్నువులను వారు పుట్టిరి కకుబ్దేవికి సంకటుండు పుట్టె సంకటునకుం గీటకుండు పుట్టెఁ గీటకునకు దుర్గాభిమానిను లయిన దేవతలు జన్మించిరి జామిదేవికి [2]దుర్గభూముల కధిష్ఠానదేవతలు జనియించిరి వారికి స్వర్గుండును నందియు జన్మించిరి విశ్వ యనుదానికి విశ్వేదేవగణంబు జనియించె వార లపుత్రకు లనం బరఁగిరి సాధ్య యనుదానికి సాధ్యగణంబులు పుట్టె వానికి నర్థసిద్ధి యనువాఁడు పుట్టె మరుత్వతి యనుదానికి మరుత్వంతుండు జయంతుం డనువార లుదయించి రందు జయంతుండు వాసుదేవాంశజుం డైనయుపేంద్రుం డనం బడె వినుమీ నొండ ముహూర్త యనుదానికి సకల భూతంబులకు నాయా కాలంబులం గలిగెడు నాయాఫలాఫలంబుల నిచ్చుమౌహూర్తికు లనియెడు దేవగణంబులు పుట్టిరి సంకల్ప యనుదానికి సంకల్పుం డుదయించె నాసంకల్పునకుం గాముండు జనియించె వసు వనుదానికి ద్రోణుండును బ్రాణుండును ధ్రువుండును నర్కుండును నగ్నియు దోషుండును వస్తువును విభావసువును నన నెనమండ్రు వసువు లుదయంబు నొంది రందు ద్రోణునకు నభిమతి యనుభార్యయందు హర్షశోకభయాదులు పుట్టిరి ప్రాణునకు భార్య యైన యూర్జస్వతియందు సహుండును నాయువును బురోజవుండును ననువారు గలిగిరి

---

1 వేదుండును ఋషభుండును నింద్రసేనుండు నను ముగ్గురు పుట్టిరి. ఇందులకు 'భానోస్తు వేద ఋషభ ఇంద్రసేన స్తతో నృప' అనుమూలమును 'భానోస్తు వేదో ఋషభ, ఇంద్రసేన స్తతో నృప' అని గ్రహించి కవి తెనిఁగించె నని తోఁచుచున్నది. 2 దుర్గంబులు పుట్టె.

ధ్రువునకు భార్య యగుధరణియందు [1]వివిధంబు లగుపురంబులు పుట్టె నర్కునికి భార్య యగువాసనయందుఁ దర్షాదు లుదయించి రగ్నికి భార్య యైనవసుధారయందు ద్రవిణకాదులు పుట్టిరి మఱియుఁ గృత్తికలకు స్కందుండు (గలిగె నా స్కందునకు) విశాఖాదు లుదయించిరి దోషునకు శర్వరి యనుభార్యయందు హరికళ శింశుమారుం డుదయించె వస్తువునకు నాంగిరసయందు విశ్వకర్మ యనుశిల్పాచార్యుం డుదయం బందె నావిశ్వకర్మకు నాకృతి యనుసతియందుఁ జాక్షుషుం డనుమనువు జనియించె నామనువువలన విశ్వేలు సాధ్యు లనువారలు పుట్టిరి విభావసునకు నుష యనుభార్యయందు వ్యుష్టియు రోచియు నాతపుండును జనించి రందు నాతపునికిఁ బంచయామం డనుదివసాభిమానదేవత జనియించె శంకరాంశజుం డయినభూతునకు సురూప యనుభార్యయందుఁ గోట్లసంఖ్య లైనరుద్రగణంబు లుదయించిరి మఱియు రైవతుండు నజుండు భవుండు భీముండు వాముండు నుగ్రుండును వృషాకపియు నజైకపాత్తు నహిర్బుధ్న్యుండు బహురూపుండు మహాంతుండు ననువారలును రుద్రపారిషదులును నతిభయంకరు లయినప్రేతులును వినాయకులును బుట్టి రంగిరసుం డనుప్రజాపతికి స్వధ యనుభార్యయందుఁ బితృగణంబులు పుట్టిరి సతి యనుభార్యకు నధర్వవేదాభిమానిదేవతలు పుట్టిరి కృశాశ్వునకు నర్చి యనుభార్యయందు ధూమ్రకేశుం డనుపుత్రుం డుదయించె వేదశిరునకు ధిషణ యనుభార్యయందు దేవలుండును వయునుండును మనువునుం బుట్టిరి తార్క్ష్యునకు వినత కద్రువ పతంగి యామిని యన నలువురు భార్యలందుఁ బతంగికిఁ బక్షులు పుట్టె యామినికి శలభంబులు పుట్టె వినతకు సాక్షాత్కరించిన యజ్ఞాధిపతికి వాహనం బయినగరుడుండును సూర్యునకు సారథి యైనయనూరుండును జనియించిరి కద్రువకుఁ బెక్కు తెఱంగు లగుభుజంగమంబులు పుట్టెఁ జంద్రునకుఁ గృత్తికాదినక్షత్రంబులు భార్య లైనను వారలయందుఁ జంద్రుండు రోహిణియందు మాత్రము మోహితుం డగుటం జేసి దక్షశాపంబున క్షయరోగగ్రస్తుండై సంతానంబు వడయ నేరఁ డయ్యె నంత దక్షప్రసాదంబు నక్షయపీడితంబు లగుషోడశకళల మరలం బొందె మఱియును. 254

సీ. కామితప్రదుఁ డైనకశ్యపుకౌఁగిట, ముచ్చట దీర్చిరి ముద్దరాండ్రు
రఖిలలోకములకు నవ్వ లై జగ మెల్లఁ, బూజింప నుండు రేపువ్వుఁబోండ్ల
బలియు రై పుత్రులు పౌత్రులు త్రిజగంబు, లేలంగఁ జూతు రేయిందుముఖులు
ముంగొంగుపసిఁడి యై మూల్గుపుణ్యంబుల, విఱ్ఱవీఁగుదు రెట్టి వింతరాండ్రు

తే. వారి కలగంపకడుపుల [2]నేరుపఱుప, నరిది బిడ్డలఁ బడసినవినుతసతుల
నామములు నన్వయంబులు నేమనంబు, పూనఁ జెప్పెద వినవయ్య మానవేంద్ర.

---

1 'ఇంగలకు 'ధరణీహ్యాసూతవివిధాః పురాః' అని మూలము 'పురాః=పురాణి' అనివ్యాఖ్యానము. దీనికి 'వివిధు లగుపురుషు లనువారు జనించిరి' అని అ. ప్ర. 2 'ఏరుపఱచు' అని యీకవిప్రయోగము.

తరలము. [1]అదితియున్ దితి గాష్ఠయున్ దనువయ్యరిష్టయుఁ దామ్రయు
న్నదనఁ గ్రోధవశాఖ్యయున్ సురసాఖ్యయున్ సురభిన్ మునిన్
మొదలుగాఁ దిమియు న్నిళాఖ్య సుముఖ్య యా సరమాదిగా
ముదిత లెన్నఁగఁ గన్నసంతతి ముజ్జగంబుల భూవరా. 256

సీ. చాలంగఁ దిమికిని జలచరంబులు పుట్టె, [2]శ్వాపదంబులు పుట్టె సరమయందు
సురభికి మహిషాదిసురభులు జనియించెఁ, దామ్రకు శ్యేనగృధ్రములు గలిగె
మునికి నప్సరసలమూఁకలు జనియించె, నిళ గనె భూరుహములను గ్రోధ
[3]వశ కుద్భవిల్లె దుర్వారసర్పంబులు, సరి యాతుధానులు సురస కరయ
తే. నుప్పతిల్లిరి గంధర్వలోకమొగి న,రిష్టకు సుతుల్ దనువునకుఁ ద్రిదశరిపులు
పదియు నెనమండ్రు నైనట్టి విదితబలులు, వారినామాన్వయంబులుఁ గోరి వినుము.

వ. ద్విమూర్ధుండును శంబరుండును నరిష్టుండును హయగ్రీవుండును విభావసుండును నయోముఖుండును శంకుశిరుండును స్వర్భానుండును గపిలుండును నరుణియుఁ బులోముండును వృషపర్వుండును నేకచక్రుండును ననుతాపకుండును ధూమ్రకేశుండును విరూపాక్షుండును దుర్జయుం డగువిప్రచిత్తియు ననువారలు వీరలలోన స్వర్భానునకు సుప్రభయనుకన్యక పుట్టె దాని నముచి వివాహంబయ్యె వృషపర్వునకు శర్మిష్ఠ యనుకూఁతురు పుట్టె దాని నహుషపుత్త్రుం డైనయయాతి పెండ్లి యయ్యె వైశ్వానరునకు నుపదానవి హయశిరస పులోమ కాలక యనునలువురుపుత్త్రిక లుదయించి రందు నుపదానవి హిరణ్యాక్షునకుం బత్నియయ్యె హయశిరసను గ్రతువు వివాహం బయ్యె పులోమకాలక లనునిరువురను గశ్యపప్రజాపతి చతుర్ముఖునివాక్యంబునఁ గైకొనియె నాయిరువురకును సమరకోవిదులయినదానవులు పౌలోమకాలకేయు లనం బుట్టిరి మఱియు నాయిరువురకు నఱువదివేలరాక్షసులు జన్మించిరి వారు యజ్ఞకర్మంబులకు విఘాతుకులై వర్తింప వారి నింద్రునకుం బ్రియంబుగా నీపితామహుం డగునర్జునుండు వధించె మఱియు విప్రచిత్తి సింహిక యనుదానియందు రాహుప్రముఖంబుగాఁ గలకేతుశతంబును బడసె వారలు గ్రహత్వంబుఁ గైకొనిరి మఱియుం బురాణపురుషుం డైన శ్రీమన్నారాయణుండు దనయంశంబునఁ బరమభాగ్యవతి యయినయదితిగర్భంబున నుదయించె నాయదితివంశంబును విదితంబుగా వినిపించెద సావధానుం

1 ఈతరలమునకు మాఱుగా ‘అదితియు దితియుఁ గాష్ఠయు నరిష్ఠయు సారసయు నిళయు మునియుఁ గ్రోధవశయుఁ దామ్రయు సురభియు సరమయు ననఁ బదుమువ్వురు గల రందు’ అని వచనమే వ్రాఁతప్రతులఁ గానిపించెడి. 2 ‘మఱి శ్వాపదములు సరమకును బ్రజలు’ అ.ప్ర. 3 ‘వశకు సర్పములు దుర్వారాసురులు సార,సకును గంధర్వులు నతి కరిష్ఠ, కలరుఁ గాష్ఠకుఁ బంచనఖాగు లుద్భవించెఁ ద్రిదశారివర్గ మావిర్భవించె, దనువు కఱువదియొక్కరు దారబలులు’ వ్రా.ప్ర. ఇందు ‘అఱువదియొక్కరు’ అనుటకు ‘సుతాదనో రేకషష్టిః’ అని మూలము.

డ వయి వినుము వివస్వంతుండును నర్యముండును బూషుండును ద్వష్టయు సవితయు భగుండును ధాతయు విధాతయు వరుణుండును మిత్రుండును శక్రుండును నురుక్రముండును ననుమనువులు జన్మించి రందు వివస్వంతునకు శ్రాద్ధదేవుం డనుమనువు సంజ్ఞాదేవియందు నుదయించె మఱియు యముండు యమియు నను నిరువురు మిథునంబుగా నుదయంబు నొందిరి వెండియు నాసంజ్ఞాదేవి బడబాస్వరూపంబు నొంది యశ్విదేవతలం గనియె ఛాయాదేవియందు శనైశ్చరుండును సావర్ణి యనుమనువును దపతి యనుకన్యయుం బుట్టి రాతపతిని సంవరుణుండు వరియించె నర్యమునకు మాతృక యనుపత్నియందు జర్షణు లుదయించిరి వారి మూలంబున మనుష్యజాతి యీలోకంబున స్థిరంబుగా నుండునట్లు బ్రహ్మదేవునిచేఁగల్పింపంబడెఁ బూషుండు భర్గునిఁజూచి దంతంబులు వివృతంబులుగా నగిన నతండు క్రోధించి దంతంబు లూడ నడచిన నాఁటనుండియు భగ్నదంతుం డయి యనపత్యుం డయి పిష్టాదులు భక్షించుచుండెఁ ద్వష్టకు దైత్యానుజ యైనరచన యనుకన్యకకు నధికబలాఢ్యుం డగువిశ్వరూపుండు పుట్టె నంత నాదేవతలు బృహస్పతి గోపించి తలంగి పోయినం దమకు నావిశ్వరూపుని నాచార్యునింగా వరియించి రని చెప్పిన విని శుకయోగీంద్రునకుం బరీక్షిన్నరేంద్రుం డి ట్లనియె.

సీ. అరయంగ యోగీంద్ర యద్భుతం బయ్యెడు, సురలపై నేటికి సురగురుండు
గోపించె నీతండు గురుభావమున దేవ, తల కేమియూపకఁ దలఁగఁ జేసె
నెఱిఁగింపు మనవుడు నింద్రుండు త్రిభువనై, శ్వర్యమదంబున సత్పథంబు
గానక వసురుద్రగణములు నాదిత్య, [1]మరుదశ్విదేవాదిమండలములు
తే. సిద్ధచారణగంధర్వజిహ్మగాది, నుసులు మునులును రంభాదిసుందరాంగు
లాడఁబాడంగవినుతిసేయంగఁగొలువ, మ్రొక్క భద్రాసనంబుననుక్కుమీఱి.

సీ. నిండుపున్నమనాఁడు గండరించినచంద్ర, మండలశ్రీతోడ మాఱు మలయు
భద్రవిద్యోతాతపత్రంబు గ్రాలంగ, మిన్నేటితరఁగల మేలుకొలుపఁ
గలితదివ్యాంగనాకరతలచాతుర్య, చామరశ్రేణులు జాడపడఁగఁ
జింతామణిస్ఫుటకాంతరత్నానేక, ఘటితసింహాసనాగ్రంబునందు
తే. నూరుపీఠంబుపై శచి యుండ నుండి, వరుస దిక్పాలకాదిదేవతలు గొలువ
సాటిసెప్పంగరానిరాజసముతోడ, నింద్రుఁ డొప్పారె వైభవసాంద్రుఁడగుచు.

వ. అప్పుడు. 261

క. గురుతరధర్మక్రియ నయ, గురుఁడు మహన్మంత్రవిషయగురుఁడు వచశ్శ్రీ
గురుఁడు సమస్తసురావలి, గురుఁడు గురుం డరుగుదెంచెఁ గొల్వునకు నృపా.

చ. అమితతపఃప్రభావుఁ గరుణాత్ముని గీష్పతిఁ జూచి రాజ్యదు
ర్దమమదరేఖ నింద్రుఁడు వృథా తనగద్దియ లేవ కుండె నె

1. మరుదశ్వినీఋషిమండలములు.

య్యమున నెదురేఁగనం జనక యాసన మీయక గౌరవోపచా
రములఁ బ్రసన్నుఁ జేయక తిరంబుగ దివ్యసభాంతరంబునన్. 263

క. అప్పుడు మహేంద్రుకన్నులఁ, గప్పినసురరాజ్యపదవికారంబునకుం
జప్పుడు సేయక గృహమున, కప్పుణ్యుఁడు దిరిగి పోయె నతిఖిన్నుండై. 264

చ. ఎఱుఁగమిఁ జేసినట్టిగురుహేళన మంత నెఱింగి యింద్రుఁ డ
చ్చెరువడి భీతి నొంది యతిచింతితుఁడై తలపోసి పల్కె న
ప్పరమపవిత్రు లోకనుతభవ్యచరిత్రు విశేషపాదపం
కరుహముఁ బూజ సేయక యకర్మముఁ జేసితి నప్రబుద్ధినై. 265

క. త్రిభువనవిభవమదంబున, సభలో మద్గురువునకుఁ బ్రసన్నునకు లస
త్ప్రభువునకు నెగ్గు సేసితి, శుభములు దొలఁగంగ నే నసురభావమునన్. 266

ఆ. [1]పారమేష్ఠ్య మయినపదవి నొందినభూపు, లెట్టివారి కైన లేవ వలదు
విబుధు లిట్లు సెప్పువిధ మెన్న వారలు, ధర్మవేత్త లనుచుఁ దలఁపఁబడరు.

ఆ. కుపథవర్తు లగుచుఁ గుత్సితదుర్వాచో, నిపుణు లయినవారు [2]నియతి విడిచి
తొలఁగ లేక తా రధోగతిఁ బడుదురు, తప్ప లేక రాతితెప్పభంగి. 268

ఉ. కావున లోకవందితుని కార్యవిచారునియింటి కేఁగి త
త్పావనపాదపద్మములపైఁ మకుటంబు ఘటిల్ల మ్రొక్కి త
త్సేవ యొనర్చి చిత్తము [3]వశించి ప్రసన్నునిఁ జేతు నంచు న
ద్దేవవిభుండు వోయె నతిదీప్రగతిన్ గురుధామసీమకున్. 269

సీ. ఈరీతిఁ దనయింటి కేతెంచుదేవతా, పతిరాక యాబృహస్పతి యెఱింగి
యధ్యాత్మమాయచే నడఁగి యదృశ్యుఁడై, పోయె నప్పుడు దేవపుంగవుండు
సకలంబుఁ బరికించి జాడఁ గానక గురుఁ, జింతించి తలపోసి చిన్నఁబోయెఁ
బోయినవిధ మెల్ల దాయలు రాక్షస, వీరులు వేగులవారివలనఁ

తే. దెలిసి మిక్కిలితమలోనఁ దెలివి నొంది, యందఱునుగూడి భార్గవునాశ్రయించి
తత్కృపాదృష్టిఁ దమశక్తి దట్టమైన, దేవతలమీఁదిదాడికిఁ దెఱువువెట్టి. 270

దానవులు దేవతలతో యుద్ధము సేసి దేవతల నోడించుట.

క. ఘోరాస్త్రులు సమస్తకిల్బిష, మూర్తులు వరధర్మకర్మ[4]ముంచితమార్గా
వర్తులు దుర్ణయనిర్మిత, కీర్తులు దానవులు సనిరి గీర్వాణులపై. 271

స్రగ్ధర. దండిం గోదండకాంతోద్ధతరథహయవేదండతండంబుతోడన్
దండెత్తెన్ మెండుగా నద్దనుజనికరముల్ [5]దైవవర్గంబుమీఁదం

---

1 'పారమేష్ఠ్య మైనపదవి నొందినవారు, లెస్స వారి కెదురు లేవ రనుచు, విబుధజనులవలన వినఁబడెనేని యూ, నరయ పరమధర్మ మంద్రు మొదల' వ్రా. ప్ర. 2 'నిఃశివి గలిసి' అ. ప్ర. 3 'వశించు' 'చేఱుసు' అని కవిప్రయోగములు. 4 'మోచిత' కు 'ముంచిత' అని కవి ప్రయోగించినాఁడు. 5 'దైవతాకోటిమీఁదన్' వ్రా. ప్ర.

జండ బ్రహ్మాండభేదో।చ్ఛ్రియజయరవముల్ । సర్వదిక్షోభగా ను
ద్దండప్రఖ్యాతలీలం । దలపడిరి సురల్ । దర్పులై వారితోడన్. 272

చ. మదమున దేవదానవులు । మచ్చరులై కడుఁ బిచ్చలించి సం
పదలకుఁ గోరి పోరునెడ । భార్గవమంత్రకళావిశేషులై
[1]యదరులు వాఁడియస్త్రముల । నార్చి మహాసురు లేర్చి దాసి పెం
గుములుగఁ గ్రువ్వ దేవతలు । కోల్తల కోర్వక పాఱి రయ్యెడన్. 273

ఆ. దనుజవీరు లేయు । దారుణదివ్యాస్త్ర,దళితదేహు లగుచుఁ । దలలు వీడ
నోడి పాఱి రద్భు । తోపేతబలులైన,త్రిదశవరులు బిట్టు । దిట్టినట్లు. 274

క. ఒకమొగము గాక దివిజులు, తికమక గొని వైరు లెల్ల । దీకొని తమ్ముం
[2]బకపక నగ నకనకలై, లుకలుకఁ బఱు వెత్తి రోడి । లోఁగొనుభీతిన్. 275

చ. దనుజులగర్వరేఖయును । దానవవీరులయంపజోకయుం
మనుజవిశేషభోజనుల । మచ్చరికంబు నిశాటకోటి యే
చినబలశౌర్యముం దమకు । సిగ్గును హాని మహాభయంబు ని
గ్గుణతను జేయునుమ్మలికఁ । గోల్తల కోర్వక పాఱి రార్తులై. 276

క. అమరులు విసృష్టదారుణ,సమరులు శరభిన్నదేహ । సంతాపగుణ
భ్రమరులు దైత్యకిరాతక,చమరులు కమలజునికడకుఁ । జనిరి భయార్తిన్. 277

ఉ. ధాతకు దేవతావిభవ । ధాతకుఁ బుణ్యజనానురాగసం
ధాతకు సర్వలోకహిత । దాతకు వైదికధర్మమార్గని
ర్ణేతకు నుల్లసద్విభవ । నేతకు సర్వజగజ్జయాంగజ
భ్రాతకుఁ బుణ్యయోగిజన । భావవిజేతకు మ్రొక్కి రయ్యెడన్. 278

క. ఆఖండలుండు మొదలుగ, లేఖానీకములు బ్రహ్మ । లేనగవున ని
త్యాఖండసత్కృపారస, శేఖరవాక్యముల వారి । సేదలు దేర్చెన్. 279

వ. ఇట్లు బ్రహ్మదేవుండు దేవేంద్రప్రముఖు లయినదేవతల కనుకంపాతిశయవిభ
వంబున నభయం బొసంగి యిట్లనియె. 280

ఉ. నెట్టన పాపకర్మమున । నేరమిఁ జేసితి రేమి సెప్ప మీ
పుట్టిననాఁటనుండియును । బుద్ధులు సెప్పి జగంబు లేలఁగాఁ
బట్టముఁ గట్టి పెంచినకృ । పానిధి బ్రహ్మకళావిధిజ్ఞుఁ జే
పట్టక గుట్టు జాఱి సిరి । పట్టునఁ దొట్టినపొట్టక్రొవ్వునన్. 281

వ. బ్రహ్మిష్ఠుం డైనబ్రాహ్మణు నాచార్యుం గైకొనక గురుద్రోహంబు సేసితిరి తద్దో
షం బిపుడు మీకుఁ జేసేత శత్రుకృతం బై యనుభవింపం జేసె నతిబలవంతు
లయినమిమ్ము [3]నతితీక్ష్ణు లయిన రాక్షసులు జయించుట దమయాచార్యుం డైనశు

---

1 'యెదురులు.... నేయు మహాసురు లేచి యేసి....కోర్వక వీఁగి రయ్యోడన్' అ. ప్ర. 2 బికపిక
లై నకనకలై' అ. ప్ర. 3 నతితీక్ష్ణబలు లయినరాక్షసులు.

క్రు నారాధించి తన్మంత్రప్రభావంబునఁ బునర్లబ్ధవీర్యులై యిప్పుడు మదీయంబయిననిలయంబు నాక్రమింపం గలవారు నైరి మదోద్రేకంబున నెదురులేక వర్తిల్లుచున్న రక్షోనాయకులకుం ద్రిదివంబుఁ గొనుట తృణప్రాయం బభేద్యమంత్రబలంబు గలభార్గవునకు వారు శిష్యు లగుటం జేసి విప్రగోవిందగవేశ్వరానుగ్రహంబు గలవారలకుఁ దక్కం దక్కినరాజుల కరిష్టం బగుం గావున మీ రిప్పుడు త్వష్ట యనుమనుపుత్త్రుం డగువిశ్వరూపుం డనుముని నిశ్చలతపోమహత్త్వసత్త్వస్వభావుం డతని నారాధించిన మీకు నభీష్టార్థంబుల నతండు సంఘటించు నెట్టిదుర్దశల నైన నడంచు నని చెప్పిన దిక్పాలకాదులు డెందంబులు డిందుపడి కమలగర్భుని వీడ్కొని విశ్వరూపుకడకుం జని యి ట్లనిరి. 282

తే. అన్న మే లగు నీకు ని న్నడుగఁ గోరి
వచ్చినారము భవదీయవనమునకును
దండ్రులకు నేఁడు సమయోచితంబు లైన
కోర్కు లొడఁగూడఁ జేసి చేకొమ్ము యశము. 283

క. సుతులకుఁ బితృశుశ్రూషణ, మతిపుణ్యము సేయు చుండు నాత్మజులు గుణో
న్నతి బ్రహ్మచారు లేనియు, మతిలో గురుసేవకన్న మఱియుం గలదే. 284

వ. అదియునుం గాక. 285

సీ. అరయ నాచార్యుండు పరతత్త్వరూపంబు, దండ్రి దలంపఁగ ధాతరూపు
రూపింప భ్రాత మరుత్పతిరూపంబు, దెలియంగఁ దల్లి భూదేవిరూపు
భగిని [1]కరుణరూపు భావంబు ధర్మస్వ, రూపంబు దా నర్థిరూపు మొదల
నభ్యాగతుఁడు మున్న యగ్నిదేవునిరూపు, సర్వభూతములు గేశవునిరూపు

ఆ. గాన తండ్రి వేగ కడు నార్తు లగుపితృ,జనుల మైనమ్ముఁ జల్లఁ జూచి
పరభయంబు వాపి నిరుపమం బగుతపో,మహిమచేత మెఱసి మనుపవయ్య.

వ. ఇట్టిబ్రహ్మిష్ఠుండ వైనని న్నాచార్యునింగా వరియించి భవదీయతేజోవిశేషంబుచేత వైరివీరులం బరిమార్చెద మాత్మీయార్థం బయినయవిష్ఠపాదాభివందనంబు నిందితంబు గా దని వేదవాక్యంబు గలదు గావున నీకు నమస్కరించు చున్న దేవవరులం గైకొని పౌరోహిత్యంబు సేయు మనినం బ్రహసితవదనుం డై య మ్మునీశ్వరుం డి ట్లనియె. 287

తే. బ్రహ్మతేజంబు వోమెడిప్రార్థనంబు, ధర్మగుణగర్హితం బని తా నెఱింగి
పొరిదినను బోఁటితపసియాసురలచేతఁ, బ్రకటమధురోక్తి నేటికిఁ బలుకఁబడియె.

వ. విశేషించియు. 289

క. గురుధనముఁ గూర్ప నేటికి, గురుశిఖం దగిలి మంత్రకోవిదు లైన స
ద్గురుధర్మనిరతు లేనియు, గురువులకును శిష్యవరులె కూర్చినధనముల్. 290

సీ. అరయ నకించను లైనట్టివారికిఁ, బంబినట్టిశిలోంఛనంబె ధనము

దానిచే నిర్వర్తితప్రియసాధుసత్క్రియ గలవార లై ప్రీతి నుందు
రది గాన సద్వర్తితాచార మైనయాచార్యత్వ మిపుడు మీశాసనమునఁ
గై కొంటి గురువుల కామంబు ప్రాణార్థవంచనములు లేక వడి నొనర్తు

ఆ. ననుచు విశ్వరూపుఁ డనియెడిముని ప్రతిజ్ఞోక్తిఁ బలికి వారి నూఱడించి
మహిత మైనతత్సమాధిచే గురుభావ, మమరఁ జేసె దేవసమితి కపుడు.

క. భార్గవవిద్యాగుప్తస్వర్గశ్రీ ద్విగుణదనుజసమధికసంప
ద్వర్గముల విష్ణుమాయానర్గళగతిఁ దెచ్చి యింద్రునకు నిచ్చె నృపా. 292

క. ఏవిద్యచేత రక్షితుఁ, డై వజ్రి దురంబులోన నసురులఁ ద్రుంచెన్
భావింప నట్టివిద్యను, శ్రీవరమాయామతంబుఁ జెప్పెను హరికిన్. 293

ఉ. నావుడుఁ బాండవాన్వయుఁడు నమ్మినభక్తి జగన్నివాసు రా
జీవదళాక్షుఁ గృష్ణుఁ దనచిత్తమునన్ భజియించి పల్కె నో
దేవగణార్చితాంఘ్రియుగ దివ్యమునీశ్వర విశ్వరూపుఁ డ
ప్పావన మైనవిద్య సురపాలున కేక్రియ నిచ్చెఁ జెప్పవే. 294

ఉ. ఎందును రక్షితుం డగుచు నింద్రుఁడు లీలయపోలె వైరిసే
నం దునుమాడి దేవతలు నమ్మి సుఖింపఁగ నిష్టసంపదం
జెంది సమస్తలోకములఁ జేకొని యేలె మునీంద్ర దాని నే
విందు సుఖంబుఁ గందు నిఁక వీనులు సంతస మందఁ బల్కవే. 295

శ్రీమన్నారాయణకవచప్రారంభము.

క. వరనారాయణకవచము, నరిభీకరవజ్రకవచ మాశ్రితసంప
త్పరిణామకర సువచము, పురుహూతున కెట్లు మాని బోధించెఁ దగన్. 296

వ. అనినం బరీక్షిజ్జనపాలునకు మునినాథుం డిట్లనియె. 297

సీ. వినవయ్య నరనాథ మునినాథుఁ డింద్రున, కనువొంద నారాయణాఖ్య మైన
కవచంబు విజయసంకల్పంబు నప్రమేయస్వరూపంబు మహాఫలంబు
మంత్రగోప్యము హరిమాయావిశేషంబు, సాంగతతోడ నెఱుంగఁ జేసె
దాని నే వినిపింతుఁ బూని తదేకాగ్రచిత్తంబుతోడుతఁ జిత్తగింపు

తే. మొనరధౌతాంఘ్రిపాణియై యుత్తరంబు, ముఖముగా నుత్తమాసనమున వసించి
కృతనిజాంగకరన్యాస మతిశయిల్ల, మహితనారాయణాఖ్యవర్మము నొనర్చె.

వ. ఇట్లు నారాయణకవచంబు ఘటియించి పాదంబులను జానువులను నూరువులను
నుదరంబునను హృదయంబునను నురంబునను ముఖంబునను శిరంబునను ని
ట్లష్టాంగంబులం బ్రణవపూర్వకం బైనయష్టాక్షరీమంత్రరాజంబు న్యాసంబు సేసి
(ద్వాదశాక్షరవిద్యలచేతం గరన్యాసంబు సేసి)మంత్రమూర్తియై[2]భగవచ్ఛబ్దవా

1 'భగవచ్ఛబ్దవాచ్యం బగుషట్ఛక్తిసంయుతుండగుచు విద్యామూర్తియైనపరమేశ్వరునందు భావించి, శ్రీనారాయణకవచాఖ్య' వ్రా. ప్ర.

చ్యంబైన (ప్రణవాదియకారాంత మగుమహామంత్రంబుచేత నంగుళ్యంగుష్ఠపర్వ
సంధులయం దుపన్యసించి మఱియు హృదయంబున నోంకారంబు వికారంబు
మూర్ధంబున షకారంబు భ్రూమధ్యంబునందు ణకారంబు శిఖయందు వేకారంబు
నేత్రంబులయందు నకారంబు సర్వసంధులయందు మఱియు నస్త్రము నుద్దేశించి
మకారంబు నుపన్యసించెనేని మంత్రమూర్తి యగు మఱియును నస్త్రాయఫ
ట్టనుమంత్రంబున దిగ్బంధనంబు సేసి పరమేశ్వరునిం దనభావంబున నిల్పి
విద్యామూర్తియుఁ దపోమూర్తియు నగు) షట్ఛక్తిసంయుతం బయిననారాయణ
కవచాఖ్య మైనమంత్రరాజంబు నిట్లని పఠియించె. 299

చ. గరుడునిమూఁపుపైఁ బదయుగంబు ఘటిల్లఁగ శంఖచక్రవ
ర్మరుచిరశార్ఙ్గఖడ్గశరరాజితపాశగదాదిసాధనో
త్కరనికరంబు లాత్తకరకంజములన్ ధరియించి భూతిసం
భరితమహాష్టబాహుఁడు కృపామతితో ననుఁ గాచుఁ గావుతన్. 300

ఆ. [1]ప్రకటమకరవరుణపాశంబులందుల, జలములందు నెందుఁ బొలియ కుండఁ
గాచుఁ గాక నన్ను ఘనుఁ డొక్కఁ డైనట్టి, మత్స్యమూర్తి విద్యమానకీర్తి.

క. వటుఁడు సమాశ్రితమాయా, నటుఁడు బలిప్రబలశోభనప్రతిఘటనో
ద్భటుఁడు త్రివిక్రమదేవుఁడు, [2]చటులస్థలమందు నన్ను సంరక్షించున్. 302

చ. అడవుల సంకటస్థలుల నాజిముఖంబుల నగ్నికీలలం
దెడరుల నెల్ల నాకు నుతి కెక్కఁగ దిక్కగుఁ గాక శ్రీనృసిం
హుఁడు [3]సురశత్రుయూథపవధోగ్రుఁడు విస్ఫురితాట్టహాసవ
క్త్రుఁడు ఘనదంష్ట్రపావకవిఘూతదిగంతరుఁ డప్రమేయుఁ డై. 303

చ. అరయఁగ నెల్లలోకములు నంకిలి నొంద మహార్ణవంబులో
[4]నొరగి నిమగ్న మైనధర నుద్ధతిఁ గొమ్మున నెత్తినట్టియా
కిరిపతి [5]యగ్నికల్పుఁ డురుఖేలుఁడు నూర్జితమేదినీమనో
హరుఁడు గృపావిధేయుఁడు సదాధ్వములన్ ననుఁ గాచుఁ గావుతన్. 304

క. రాముఁడు రాజకులైకవి, రాముఁడు భృగుసత్కులాభిరాముఁడు [6]సుగుణ
స్తోముఁడు నను రక్షించును, [7]శ్రీమహితోన్నతుఁడు నద్రిశిఖరములందున్. 305

సీ. తాటక మర్దించి తపసిజన్నముఁ గాచి, హరువిల్లు విఱిచి ధైర్యమున మెఱసి
ప్రబలు లైనట్టివిరాధకబంధోగ్ర, ఖరదూషణాదిరాక్షసులఁ దునిమి
వానరవిభు నేలి వాలిఁ గూలఁగ నేసి, జలరాశిగర్వంబుఁ జక్కఁజేసి
సేతువు బంధించి చేరి రావణకుంభ, కర్ణాదివీరులఁ గడిమిఁ ద్రుంచి

తే. యలవిభీషణు లంకకు నధిపుఁ జేసి

---

1 'వరుసజలధికూపతటవరుణపాశములందు. 2 'చటులస్థలివలన. 3 కనకాక్ష రాక్షసవధో. 4 నురుతరమగ్నమైనధర. 5 యజ్ఞకర్ముఁ డురుఖేలనుఁ డూర్జిత. 6 శాంతి. 7 శ్రీమహితోన్నతుల నద్రి' వ్రా. ప్ర.

భూమిసుతఁ గూడి సాకేతపురమునందు
రాజ్యసుఖములు గైకొన్న రామవిభుఁడు
వరుస నను బ్రోచుచుండుఁ బ్రవాసగతుల. 306

వ. మఱియు నఖిలప్రమాదంబు లైనయభిచారకర్మంబులవలన నారాయణుండును గర్వంబువలన నరుండును యోగభ్రంశంబువలన యోగనాథుం డయినదత్తాత్రేయుండును గర్మబంధంబులవలన గణేశుం డైనకపిలుండును గామదేవునివలన సనత్కుమారుండును మార్గంబుల (దేవహేళనంబు సేయుట)వలన శ్రీహయగ్రీవమూర్తియును దేవతానమస్కారతిరస్కారదేవపూజాచ్ఛిద్రంబులవలన నారదుండును నశేషనిరయంబులవలనఁ గూర్మంబును నపథ్యంబువలన భగవంతుం డైనధన్వంతరియును ద్వంద్వంబువలన నిర్జితాత్ముం డైనఋషభుండును జనాపవాదంబువలన నగ్నిదేవుండును [1]జననమరణాదులం గలుగఁజేయుకర్మంబులవలన బలభద్రుండును గాలంబువలన యముండును సర్పగణంబులవలన శేషుండును నప్రబోధంబువలన ద్వైపాయనుండును బాషండసమూహంబులవలన బుద్ధదేవుండును [2]శనైశ్చరునివలనఁ గల్కియు నైధర్మరక్షణపరుం డయినమహావతారుండు నన్ను రక్షించుం గాతఁ బ్రాహ్ణమధ్యాహ్నపరాహ్ణసాయంకాలంబులను బ్రదోషార్ధరాత్రాపరరాత్రప్రత్యూషానుసంధ్యాప్రభాతంబులను గదాద్యాయుధంబుల ధరియించి కేశవ నారాయణ గోవింద విష్ణు మధుసంహార త్రివిక్రమ వామన హృషీకేశ పద్మనాభ శ్రీవత్సధామ సర్వేశ్వరేశ జనార్దన విశ్వేశ్వర కాలమూర్తులను నామరూపంబులుగలదేవుండు నన్నురక్షించుంగాక ప్రళయకాలానలాతితీక్ష్ణసంభ్రమభ్రమణనిర్వక్రవిక్రమవశీకృతదనుజచక్రం బైనసుదర్శనపుణ్యనామ చక్రంబ మహావాయుప్రేరితుం డై హుతాశనుండు నీరసతృణాటవుల భస్మీభూతంబు సేయుభంగి భగవత్ప్రయుక్తంబ వై మద్వైరిసైన్యంబుల దగ్ధంబు గావింపుము జగత్సంహారకాలపటుఘటితచటులమహోత్పాతగర్జారవతర్జనదశదిశాభివర్జితఘనఘనాంతరనిష్ఠ్యూతనిష్ఠుర కోటిశతకోటిసంస్పర్శస్ఫురద్విస్ఫులింగనిర్గమానర్గళభుగభుగాయమానమూర్తివిస్ఫూర్తినారాయణకరకమలవర్తిగదాయుధోత్తమ మదీయవైరితండోపతండంబుల ఖండసంబునం జండగతిం జెండిగాఁ జండికాకూశ్మాండవైనాయకరక్షోభూతగ్రహంబులు చూర్ణంబులు గాఁ గొండొకవినోదంబు సలుపుము [3]దరేంద్రంబ వైనపాంచజన్యంబ సర్వలోకజిష్ణుం డైనశ్రీకృష్ణుని నిఖిలపుణ్యైకసదనవదననిష్ఠ్యూతనిశ్శ్వాసా[4]ధర వేణుపరిపూరితంబ వై యున్మత్తభూతప్రేతపిశాచవిప్రగ్రహాదిక్రూర[5]దుర్గ్రహంబులు విద్రావణంబులుగా నస్మత్పరవీరమండలంబులగుండియలతోఁ దదీయమానినీమర్భర

1 నంశకాకృతిం జేయుభూతంబులవలన బలభద్రుండును. 2 కలివలన. 3 దరేంద్రుండ. 4 ధర్వణపూరితం. 5 దృగ్గణంబులు.

గర్భంబులు గర్భస్థార్భకనిర్భేదంబులుగా నవియ బ్రహ్మాండభాండభీకరం బయిన భూరినాదంబున మోదింపు మతితీవ్రధారాదళితనిశాటకోటికఠోరకంఠకరాళరక్తధారాధౌతమలీమసవిసరంబ వైననందకమహాసిశేఖరంబ జగదీశప్రేరితంబవై మద్విద్వేషివిషమవ్యూహంబుల మెండుగడికండలుగఁ జెండి చెండాడుము నిష్కళంకనిరాతంకనిశ్శంకసాంద్ర చంద్రమండలపరిమండిత సర్వాంగరక్షణవిచక్షణధర్మనిరతంబ వయిన[1]చర్మంబ దుర్మదమద్వైరిలోకభీకరాలోకంబులను సమాకులనిబిడనీరంధ్రనిష్ఠురతమఃపటలపటుఘటనం(బులం) గుటిలపఱుపుము నిఖిలపాపగ్రహంబులవలనను సకలనరమృగసర్పక్రోడభూతాదులవలనను నగు భయంబులు భగవన్నామరూపయానదివ్యాస్త్రంబులవలనం బొంద కుండుఁగాక బృహద్రథంతరాదిసామంబులచేత స్తోత్రంబు సేయంబడు చున్నఖగేంద్రుండు (రక్షణదక్షుం డై) నన్ను రక్షించుఁ (గాక) శ్రీహరినామరూపవాహనదివ్యాయుధపారిషదోత్తమప్రముఖంబు లస్మదీయబుద్ధీంద్రియమనఃప్రాణంబుల సంరక్షించు భగవంతుం డయినశేషుండు సర్వోపద్రవంబుల నాశంబు సేయు జగదైక్యభావం బయినధ్యానంబు గలవానికి వికల్పరహితుం [2]డై భూషణాయుధలింగాఖ్య లగుశక్తులం దనమాయచేత ధరియించి [3]తేజరిల్లు చుండులక్ష్మీకాంతుండు వికల్పవిగ్రహంబులవలన నన్ను రక్షించుఁగాక లోకభయంకరాట్టహాసభాసురవదనగహ్వరుండగుచు సమస్తతేజోహరణధురీణతేజఃపుంజసంజాతదివ్యనృసింహావతారుం డగునప్పరమేశ్వరుండు సర్వదిగ్భాగంబులవలన సమస్తబహిరంతరంబులవలన నన్ను రక్షించు చుండుఁ(గాత) మని నారాయణాత్మకకవచప్రభావం బితిహాసరూపంబున [4]నింద్రుండు దెలిసికొని ధ్యానంబు సేసి తద్విద్యాధారణమహిమవలన నరాతుల నిర్జించెం గావున నెవ్వ రేని నిర్మలాత్ము లగువారలేతద్విద్యాధారణు లై యనుదినంబును బఠియించిన నతిఘోరరణంబుల నత్యుత్కటసంకటంబులను సర్వగ్రహనిగ్రహకర్మమారణకర్మాది[5]దుష్కర్మజన్యక్లేశంబులను వదలి యవ్యాకులమనస్కు లై విజయంబు నొందుదురు మఱియును సర్వరోగంబులకు నగమ్యశరీరు లై సుఖంబు నొందుదు రదియునుం గాక. 307

సీ. అతిభక్తిఁ గౌశికుం డనుబ్రాహ్మణుఁడు దొల్లి, యీవిద్యధరియించి యెలమి మించి
మరుభూమియందు నిర్మలచిత్తుఁ డై యోగ, ధారణంబున బిట్టు తనువు విడిచె
దానిపై నొకనాఁడు గంధర్వవరేణ్యుండు, చిత్రరథాఖ్యుఁ డజేయుఁ డొంటి
చదలఁ జనంగఁ దచ్ఛాయ తదస్థిపైఁ, గదిసిన నాతఁడు గళవళించి

ఆ. యువిదపిండుతోడ నవవిమానముతోడఁ, దనదువిద్యతోడ ధరణిఁ ద్రెళ్లి

---

1 'ధర్మంబ. 2 డయ్యు నప్పరమేశ్వరుండు భూషణాయుధచిహ్నిత మైనశక్తిం. 3 విశేషవిగ్రహంబు గలలక్ష్మీకాంతుండు నన్ను రక్షించు. 4 మునీంద్రుండు వ్యాఖ్యానంబుసేసి యింద్రున కుపదేశించిన నతండు తద్విద్యా. 5 దుష్కర్మంబులకు నతిభయంకరు లై విజయంబు. వ్రా. ప్ర.

తివిచి లేవలేక । తికమక గుడువంగ, వాలఖిల్యమౌని । వానిఁ జూచి. 308

క. నారాయణకవచసమా, ధారణపుణ్యాప్తి దీని । దగ్గఱ నీకుం
గూరెడిని విష్ణుభక్తుల, వారక చేరంగ నెట్టి । వారికిఁ దరమే. 309

ఇంద్రవజ్రము. సంధించి నీయంగక । సంఘ మెల్లన్. బంధించి తన్మంత్ర । బలంబు పేర్మి
స్నందంబు మాన్పింపఁ ద । దన్యమేదీ, సింధుప్రవాహోన్నతి ।[1] చేతఁ దీరున్. 310

వ. కావున నీ విప్పుడీపుణ్యాశల్యంబులు భక్తియుక్తుండ వై కొనిపోయి ప్రాఙ్ముఖంబునఁ బ్రవహించెడుసరస్వతీజలంబుల [2]నిక్షేపణంబుసేసి కృతస్నానుండ వై యాచమనంబు సేసిన నీసర్వాంగబంధనంబు లుడుగు ననిన నతం డట్లచేసి తనవిమానం బెక్కి నిజస్థానంబున కరిగెం గావున. 311

క. అనుదినము దీని నెవ్వరు, విని లేనిఁ బఠించి రేని । విస్మయ మొదవన్
ఘనభూతజాల మెల్లను, మునుకొని వారలను గాంచి । మ్రొక్కుచు నుండున్.

ఆ. విశ్వరూపువలన । నైశ్వర్యకర మైన, యట్టివిద్యఁ దాల్చి । యింద్రుఁ డపుడు
మూఁడులోకములకు । మూఁద లై నట్టిశ్రీ, ననుభవించి మించె । నధికమహిమ.

సీ. భూపాల యావిశ్వ । రూపున కరు దైన, తలలు మూఁ డను వొందఁ । గలిగియుండు
సారిది సురాపాన । సోమపానంబులు, [3]నన్నాద మనఁగను । నమరవరుల
తోఁ గూడి భుజియించి । తూఁకొని వారితో, యజ్ఞభాగంబు ప్రత్యక్ష మొంది
కై కొను చుండి దుష్కృష్టుఁ డై యాయజ్ఞ, భాగంబు రాక్షస । ప్రవరులకును

ఆ. దల్లిమీఁదఁ గలుగు । తాత్పర్యవశమున, దివిజవరుల మొఱఁగి । తెచ్చి యిచ్చు
నది యెఱింగి యింద్రుఁ । డతిభీతచిత్తుఁ డై, తనకుఁ గానియతని । తలలు ద్రుంచె.

క. భాసురుఁ డనక మహాత్మా, గ్రసరుఁ డన కతఁడు పూర్వ । కృతకర్మగతిన్
వేసరఁ డనక మహేంద్రుఁడు, భూసురుతల లపుడు రోష । మునఁ దెగ నడిచెన్.

వ. ఇట్లుయింద్రుండు క్రోధంబు సహింపం జాలక విశ్వరూపుతలలు ఖడ్గంబునం దెగ నడిచిన సోమపానంబు సేయుశిరంబు గపింజలం బయ్యె సురాపానంబు సేయుశిరంబు గలవింకం బయ్యె నన్నంబు భక్షించుశిరంబు తిత్తిరి యయ్యె నిట్లు త్రివిధపక్షిస్వరూపంబు దాల్చి బ్రహ్మహత్య యేతెంచి యింద్రునిఁ జుట్టుకొని తమ్ముఁ బరిగ్రహింపు మని నిర్బంధింప నప్పు డింద్రుం డతిభీతచిత్తుం డై త్రిలోకనాయకుం డైనన్ దానిం దప్పించుకొనం జాలక యంజలి యొగ్గి యమ్మహాదోషంబుఁ గైకొని తద్దోషం బొక్కసంవత్సరం బనుభవించి యంతం బాపుకొనువాఁ డై భూజలవృక్షస్త్రీలం బ్రార్థించి మద్దురితంబు చతుర్విధంబులం బుచ్చికొనుండనిన భూమి తనయందుఁ జేయంబడినఖాతంబు తనంతన పూఁడునట్టివరంబును జలంబు సర్వంబు దనయందుఁ బ్రక్షాళితం బైనం బావనం బగునట్టివరంబును వృక్షంబులు భేదింపంబడి పునఃప్రరోహంబు గలుగువరంబును స్త్రీ లెల్లపుడుం

1 జేర్పఁ దీరున్. 2 వైచి కృత. 3 నన్నంబు మొదలుగా.

దమకుఁ గామసుఖంబు గలుగునట్టివరంబును గోరిన నతం డట్ల కా నొసంగిన నత
నిదుష్కృతంబు ధరణి [1]యీరిణవిధంబునను నుదకంబు బుద్బుదఫేనరూపంబు
నను మహీరుహంబులు నిర్యాసభావంబునను నింతులు రజోవికారంబునను
నిట్లు చతుర్భాగంబులం బంచికొని రంత. 316

మ. హతపుత్రుం డగువిశ్వరూపజనకుం డా త్వష్ట దుఃఖాయతో
ద్ధతరోషానలదహ్యమానుఁ డగుచుం దా నింద్రుపై మారణ
క్రతుహోమం బొనరింప నందుఁ బొడమెం గల్పాంతకాలారవి
శ్రుతకీలానలనిష్ఠురేక్షణగుణక్షుభ్యత్త్రిలోకోగ్రుఁ డై. [చుఁ

సీ. యుగముద్రుంగెడునాఁడు జగములు వొలియించు, నంతకుమూర్తిపై నింతయగు
బఱపునుబొడవును బ్రతిదినంబును నొక్క, శరపాతమంగంబు విరివిఁగొనుచుఁ
గడుదగ్ధశైలసంకాశదేహమునందుఁ, గరము సంధ్యారాగకాంతి బెరయ
మునుగాఁకరాగిచేఁగనుమించుమించులఁ, గఱకుమీసలు కచాగ్రములు మెఱయఁ

తే. జండమధ్యాహ్నమార్తాండమండలోగ్ర, చటులనిష్ఠురలోచనాంచలవిఘాత
దశదిశాభాగుఁ డుజ్జ్వలతరకరాళ, భీకరసునిశితదంష్ట్రికుఁ వదనగుహుఁడు. 318

ఉ. నింగికి నేలకుం బొడవు నిట్టలమై శిఖలందుఁ బర్వను
త్తుంగతరాగ్నిజాలములఁ దొట్రిలుచుం గ్రహపంక్తి జాఱ ని
స్సంగకరాళశాతఘనసద్ఘృణిమండలచండశూల ము
ప్పొంగుచుఁ గేలలీలఁ గొని భూమి చలింపఁగ బోలి యాడుచున్. 319

సీ. వదలక విరివిగా వదనంబుఁ దెఱచుచు, నాకాశ మంతయు నప్పళించుఁ
గడనాల్క నిగిడించి గ్రహతారకంబుల, నయ మెల్ల దిగజాఱ నాకి విడుచు
నలవోకయునుబోలె నట్టహాసము సేసి, మెఱసి లోకము లెల్లఁ బ్రింగఁ జూచుఁ
దనగుదిగ్దంతిదంతములు సెక్కులు వాఱ, నుగ్రదంష్ట్రలు ద్రిప్పు నుక్కుమిగిలి

తే. త్వష్టబలితంపుఁదపమునఁ బుట్టినొంది, యఖిలలోకంబు లెల్లఁ దా నాక్రమించి
వృత్రనామాఖ్య దేవతాశత్రుఁ డగుచు, దానవానీకుఁ డఖిలదుర్దముఁడు మెఱసె.

మత్తకోకిలము. అట్టివృత్రునిమీఁద దేవత లల్కతోఁ బెనుమూఁకలై
చుట్టి ముట్టి మహాస్త్రవిద్యలు సూపి చేఁపున నేయ నా
గొట్టువీరుఁడు వార లేసిన క్రూరశస్త్రము లన్నియుం
జుట్టి పట్టుక మ్రింగి శూరత జోక నార్చె మహోగ్రుఁ డై. 321

క. భక్షితదివ్యాస్త్రుం డగు, రక్షోనాయకుని నమరరాజప్రముఖుల్
వీక్షింప వెఱచి పఱచిరి, రక్షకుఁ జింతించికొనుచు రయ మొప్పారన్. 322

వ. ఇట్లు సర్వసాధనంబుల(తోడ సాధుజనంబుల) వృత్రాసురుండు మ్రింగిన నచ్చెరు
వడి చేయునది లేక తత్తేజోవిశేషవిభవంబునకు భయంబు నొంది కందినడెం

---

1 'నెఱియ లూషరక్షేత్రంబులవిధంబున' అ. ప్ర.

దంబునం గుందుచుం బురందరప్రముఖు లార్తరక్షకుం డగుపుండరీకాక్షునకుం
గుయ్యిడువార లై. 323

లయగ్రాహి. వీఁడు కడుదుర్దముఁడు వాఁడిమన కైదువులు
పోఁడి చెడఁగా మెసవి యీఁడు గన కున్నాఁ
డేడ బ్రదు కింకఁ బెనుఁగీడు వొడమెన్ మనకుఁ
దోడుపడ నొక్కరుఁడు లేఁడు హరి దక్కన్
వేఁడుదము శ్రీధరునిఁ గూడుదము సద్భటులఁ
బాడుదము గీతములఁ జోడుపడ నంతన్
వీఁడు చెడుత్రోవ దయతోడ నెఱిఁగించు ఘనుఁ
డోడక సురాలయము పాడువడ దింకన్. 324

క. అని తలపోయుచుఁ దమలో, మునుకుచుఁ దికమకలు గొనుచు మురరిపుసభకున్
గునుకుచుఁ గునుకుచు నేఁగిరి, ఘనరాక్షసుఁ గన్నకన్నుఁగవ బెగ్గిలఁగన్. 325

వ. ఇట్లు భయార్తు లై యమర్త్యవ్రాతంబు సని చని ముందట నభంగభంగరంగ
దుత్తుంగడిండీరమండల సముద్గండాడంబరవిడంబిత నారాయణనిరంతరకీర్తిలతా
కుసుమగుచ్ఛస్వచ్ఛంబును ననవరతగోవిందచరణారవిందసేవాసమాకులకలిత
ఫలితమహాపుణ్యఫలాయమానసముద్దీపితావర్తవర్తితదక్షిణావర్తరుచిరశంఖమం
డల మండితంబును నతినిష్ఠురకఠినపాఠీనపృథురోమరాజీవశకులతిమితిమింగిల
కర్కటకమఠకచ్ఛపమకరనక్రవక్రగ్రహగ్రాహణఘుమఘుమాయమానదారుణ
గమనవిషమితవిషమతరంగఘట్టనఘట్టితసముద్ధూతశీకరనికరనిరంధ్రతారకితతా
రాపథంబును మహోచ్ఛ్రయశిలోచ్చయశిఖరాగ్రప్రవహితదుగ్ధనిర్ఝరసమ్మా
ర్జితపురాణపురుషవిశుద్ధశుద్ధాంతవిహారణధురీణనవసుధాధౌతధావళ్యధగద్ధగాయ
మానరమ్యహర్మ్యనిర్మాణకర్మంబును నతిపవిత్రగుణవిచిత్రనిజకళత్రప్రేమానంద
సందర్శితముకుందపరిస్ఫురదంతరంగకరుణారస పరిమిళితభావబంధురవిభ్రమ
వల్లీమతల్లికాంకురశోభితంబును బ్రసిద్ధసిద్ధరసాంబువాహసంగమసముత్థితగంభీర
ఘోషపరిపూరితసకలదిగంతరాళంబును సముద్రమేఖలాఖిలప్రదేశవిలసితనవీ
నదుకూలాయమానంబును హరిహరప్రముఖదేవతానిచయపరిలబ్ధామృతమహై
శ్వర్యదానధౌరేయమహానిధానంబును వైకుంఠపురపౌరవారమనోహరకామ్య
ఫలఫలితమందార పారిజాత సంతాన కల్పవృక్ష హరిచందన ఘనవనానుకూల
కూలంబును నై యొప్పుచుఁ గుబేరుభాండాగారంబునుంబోలెఁ బద్మమహాపద్మ
శంఖమకరకచ్ఛపముకుందకుందనీలవరసమగ్రం బై విష్ణుకరకమలంబునుంబోలె
సుదర్శనావర్తప్రగల్భం బై కైలాసమహీధరంబునుంబోలె నమృతకళాస్థాన
శేఖరపదార్పణం బై యింద్రవైభవంబునుంబోలెఁ గల్పవృక్షకామధేనుచిం
తామణిజనితవిశేషం బై సుగ్రీవసైన్యంబునుంబోలె నపరిమితనిబిడహరిసంచా

రం బై నారాయణోదరంబునుంబోలె నిఖిలభువనభారభరణసమర్థం బై శంకరు జటాజూటంబునుంబోలె గంగాతరంగిణీసమాశ్రయం బై బ్రహ్మలోకంబునుంబో లెఁ బరమహంసకులసేవ్యం బై పాతాళలోకంబునుంబోలె ననంతభోగిభోగయో గ్యం బై నందనవనంబునుంబోలె నైరావతమాధవీరంభాదిసంజననకారణం బై సౌదామినీనికరంబునుంబోలె నభ్రంకషం బై విష్ణునామకీర్తనంబునుంబోలె ని ర్మలస్వభావం బై క్రతుశతగతుండునుంబోలె హరిపదభాజనం బై యొప్పుచున్న దుగ్ధవారాశి డాసి శ్వేతద్వీపంబు దర్శించి యందు సకలదిక్పాలకాదిదేవతలు దేవదేవు నాశ్రయించి యిట్లని స్తుతియించి రంత. 326

సీ. పంచమహాభూతపరినిర్మితం బైన, ముజ్జగంబుల కెల్ల నొజ్జ యైన
బ్రహ్మయు నేమును బరఁగ [1]నందఱుఁ గూడి, యెవ్వనికై పూజ లిత్తు మెపుడు
నట్టిసర్వేశ్వరుం డాగమవినుతుండు, సర్వాత్మకుఁడు [2]మాకు శరణ మగును
అతిపూర్ణకాము నహంకారదూరుని, సముని శాంతునిఁ గృపాస్పదుని గురుని
తే. మాని యన్యుని సేవింపఁ బూనునట్టి, కపటశీలుని నతిపాపకర్మబుద్ధి
శునకవాలంబు వట్టుక ఘనతరాబ్ధిఁ, దరియఁజూచుటగాదె తాఁ దామసమున.

చ. ఉదకమయంబునన్ వసుధ నోడగఁ జేసి తనర్చుకొమ్మునన్
వదలక యంటఁ గట్టి మనువల్లభుఁ గాచినమత్స్యమూర్తి స
మ్మదమున మమ్ముఁ బ్రోచు ననుమానము మానఁగ వృత్రుచేతియా
పద దొలఁగించి నేఁడు సురపాలురపాలిటిభాగ్యదైవమై. 328

మత్తకోకిలము. రంతుసేయుచు వాతధూతకరాళభంగురభంగదు
ర్దాంతసంతతసాగరోదకతల్ప మొంది వసించుధా
తంతవానిని బొడ్డుఁదమ్మిన యాఁచి కాచిననేర్పరిం
తంతవాఁ డనరానియొంటరి యాదరించు మముం గృపన్. 329

తే. దేవతల మైనమే మిట్టిదేవదేవు, సర్వలోకశరణ్యుని శరణు చొచ్చి
బలితమైనట్టివీనియాపదలఁ బాసి, మీఱి శుభములఁ జేకొనువార మిపుడు.

వ. ఇట్లు స్తుతియించుచున్న దేవతలకు భక్తవత్సలుం డైన వైకుంఠుండు ప్రసన్నుం డయ్యె నప్పుడు. 331

సీ. తగుశంఖచక్రగదాధరుం డగువాని, శ్రీవత్సకౌస్తుభశ్రీలవానిఁ
గమనీయమాణిక్యఘనకిరీటమువాని, దివ్యవిభూషణదీప్తివాని
మండితకోటీరకుండలంబులవాని, సిరి యురస్స్థలమునఁ జెలఁగువానిఁ
దనుఁ బోలుసేవకతండంబు గలవాని, జిలుఁగైనపచ్చనివలువవానిఁ
ఆ. దెల్లదమ్మివిరులఁ దెగడుకన్నులవాని, నవసుధాద్రవంపునవ్వువానిఁ
గనియె వేల్పుపిండు కప్పరపాటుతోఁ, గన్నులందు నున్న కఱవు దీఱ. 332

1 తక్కినవారు. 2 మమ్ముఁ జాలఁ బ్రోచు.

సీ. తనసేవకులలోనఁ దడఁబడురూపంబు, శ్రీవత్సకౌస్తుభశ్రీలఁ దెలుప
వికచాబ్జములతోడ వీడ్వడుకన్నుల, కడలు దైవారెడుకరుణఁ దెలుప
నెల్లలోకములకు నిల్లైనభాగ్యంబుఁ, గాఁపురం బుండెడుకమల దెలుప
మూఁడుమూర్తులకును మొదలైనతేజంబు, తాతఁ బుట్టించినతమ్మి దెలుప
ఆ. బుద్ధిఁ బోల్పరానిపుణ్యంబుఁ దత్పాద, కమలజనిత మైనగంగ దెలుప
నప్రమేయుఁ డభవుఁ డవ్యక్తుఁ డవ్యయుఁ, డాదిపురుషుఁ డఖిల మోది యొప్పె.
వ. ఇట్లు జగన్మోహనాకారుం డయిననారాయణుని కృపావలోకనాహ్లాదచకితస్వభావచరితులై సాష్టాంగదండప్రణామంబు లాచరించి ఫాలభాగపరికీలితకరకమలులై యిట్లనిరి. 334
ఆ. దుర్గమంబు లయినస్వర్గాదిఫలములఁ, బుట్టఁ జేయఁ జాలునట్టిగుణము
గలిగి మెలఁగుచున్నఘనుఁడ వైనట్టినీ, కరయ మ్రొక్కువార మాదిపురుష.
సీ. దండంబు యోగీంద్రమండలనుతునకు, దండంబు శార్ఙ్గకోదండునకును
దండంబు మండితకుండలద్వయునకు, దండంబు నిష్ఠురభండనునకు
దండంబు మత్తవేదండరక్షకునకు, దండంబు రాక్షసఖండనునకు
దండంబు పూర్ణేందుమండలముఖునకు, దండంబు తేజఃప్రచండునకును
తే. దండ మద్భుతపుణ్యప్రధానునకును, దండ ముత్తమవైకుంఠధామునకును
దండ మాశ్రితరక్షణతత్పరునకు, దండ మురుభోగినాయకతల్పునకును. 336
ఉ. చిక్కిరి దేవతావరులు చిందఱవందఱ లైరి ఖేచరుల్
స్రుక్కిరి సాధ్యసంఘములు సోలిరి పన్నగు లాజిభూమిలో
మ్రక్కిరి దివ్యకోటి గడు మ్రగ్గిరి యక్షులు వృత్రుచేత నీ
చిక్కినవారి నైన దయ సేయుము నొవ్వక యుండ నోహరీ. 337
క. మొద లాటినరక్కసులకు, మొదలై మా కాపదలకు మూలం బగుచుం
దుద మొదలు లేనిరక్కసు. తుదిఁ జూపఁ గదయ్య తుదకుఁ దుది యైనహరీ.
తే. అకట దిక్కుల కెల్ల దిక్కైన మాకు, నొక్కదిక్కును లేదు కాలూఁద నైన
దిక్కు గావయ్య నేఁడు మాదిక్కుఁ జూచి, దిక్కు లేకున్నవారలదిక్కు నీవ.
క. నీదిక్కు గానివారికి, నేదిక్కును లేదు వెదక నిహపరములకున్
మోదింపఁ దలఁచువారికి, నీదిక్కే దిక్కు సుమ్ము నీరజనాభా. 340
తే. అరయ మా తేజములతోడ నాయుధములు
మ్రింగి భువనత్రయంబును మ్రింగుచున్న
భీకరాకారు వృత్రునిఁ బీఁచ మడఁచి
యెల్లభంగుల మాబన్న మీఁగు మభవ. 341
ఆ. పరమపురుష దుఃఖభంజన పరమేశ, భక్తవరద కృష్ణ భవవిదూర
జలరుహాక్ష నిన్ను శరణంబు వేఁడెద, మభయ మిచ్చి కావవయ్య మమ్ము.

వ. [1]నమస్తే భగవన్నారాయణ వాసుదేవ యాదిపురుష మహానుభావ పరమమంగళ పరమకల్యాణ దేవ పరమకారుణికు లయినపరమహంస లగుపరివ్రాజకులచేత నాచరితంబు లగుపరమసమాధిభేదంబులఁ బరిభావితపరిస్ఫుటం బయినపరమహంసధర్మంబుచేత నుద్ఘాటితం బగుతమఃకవాటద్వారంబున నపావృతం బయిన యాత్మలోకంబున నుపలబ్ధమాత్రుండ వై నిజసుఖానుభవుండ వై యున్ననీ వాత్మసమవేతంబు లై యుపేక్షింపంబడనియీశరీరంబులకు నుత్పత్తిస్థితిలయకారణుండ వై యుండుదువు గుణసర్గపతితుండ వై యపరిమితగుణగణంబును గల నీవు దేవదత్తునిమాడ్కిఁ బారతంత్ర్యంబున స్వకృతంబు లైనకుశలాకుశలఫలంబుల ననుభవింతువు షడ్గుణైశ్వర్యసంపన్నుండ వైననీ వాత్మారామస్వభావుఁడవయి యపరిమితగుణగణంబులు గలిగి యీశ్వరాహ్వయానవగాహ్యమాహాత్మ్యం బందు నర్వాచీనవికల్పవితర్కవిచారప్రమాణాభాసంబులగుతర్కశాస్త్రంబులఁ గర్కశంబు లయినప్రజ్ఞలు గలిగి దురవగ్రహవాదు లైనవిద్వాంసులవివాదావసరంబులయందు నుపరతంబు లగునస్తినాస్తీత్యాదివాక్యంబుల సమస్తమాయామయుండ వై నిజమాయచేతఁ గానంబడక యుక్తిగోచరుండ వై సమవిషమరూపంబులఁ బ్రవర్తింతువు దేవా రజ్జుఖండంబునందు సర్పభ్రాంతి గలుగునట్లుండు ద్రవ్యంబున ద్రవ్యాంతరభ్రాంతి గలుగుచుండు సర్వేశ్వర సర్వజగత్కారణరూపంబ వైననీవు సర్వభూతప్రత్యగాత్మ వగుటం జేసి సర్వగుణావభాసోపలక్షితుండవై కానంబడుచుందువు లోకేశ్వరా భవన్మహిమను మహామృతసముద్రవిప్రుడసకృత్పానమాత్రంబున సంతుష్టచిత్తు లై నిరంతరసుఖంబున విస్మారితదృష్టశ్రుతవిషయసుఖలేశాభాసు లైనపరమభాగవతులు భవచ్చరణకమలసేవా

1 ఇందులకు ‘మఱియును భగవన్నారాయణ....భేదంబులఁ బరిస్ఫుటం బయినపరమహంసధర్మంబుచేత ననువాదితం బగుపరమకవాటద్వారంబున నావృతం బయిన యాత్మలోకంబున...సమవేతంబు లై యుపేక్షింపంబడనిశరీరంబులకు....గుణసర్గభావితుండ వై ....బారతంత్ర్యంబున నబ్బినకుశలఫలంబులు ననుభవించి చింతింతువు షడ్గుణైశ్వర్యసంపన్నుండ వైననీ వాత్మారాముండ వయి యుందువు గుణసర్గభావితుండ వయి యపరిమితగుణగణంబు లర్వాచీనవితర్కవిచారప్రమాణభావంబు లగుతర్కశాస్త్రంబులఁ గర్కశంబు లైనప్రజ్ఞ గలిగి దురాగ్రహవాదు లైనవిద్వాంసుల వివాదావసరణంబులయందు....గోచరుండ వై సమస్తవిషమరూపంబులఁ బ్రవర్తింతువు. దేవా రజ్జువునందు సర్పభ్రాంతిగలుగునట్లు ద్రవ్యాంతరంబులచేత బ్రహ్మంబయిననీయందుఁ బ్రపంచభ్రాంతిగలిగెడి నని యిట్ల తిమనోహారచతురవచనంబులు’ అచ్చుప్రతి. ఈపాఠము ‘ఓం నమస్తే అస్తుభగవన్నారాయణాయ....’ అనుమూలమునకు అనుగుణము కామిచేతను వ్రాతప్రతులపాఠ మనుగుణ మగుటంబట్టియు, రెండవపాఠమే గ్రంథమునఁ గూర్పంబడియె మఱియు మూలమునందు ‘సఏవహి పున స్సర్వవస్తుషు వస్తుస్వరూప స్సర్వేశ్వర స్సకలజగత్కారణ...’ మొదలుకొని ‘గ్రస్తానియేనవః కృష్ణతేజాంస్యస్త్రాయథా నిచ’ అనువఱకుఁ గలగొప్పగ్రంథమునకు వ్రాతప్రతులందే తెనుఁగు గానిపించు చున్నది. కాని యచ్చుప్రతులఁ గానిపింపదు.

ధర్మంబు విడువరు త్రిభువనాత్మ భవనత్రివిక్రమ త్రిణయన త్రిలోక మనోహరానుభావ భవదీయవైభవవిభూతిభేదంబు లైనదనుజాదులకు ననుపక్రమసమయం బెఱింగి నిజమాయాబలంబున సురనరమృగజలచరాదిరూపంబులు ధరియించి తదీయావతారంబుల ననురూపం బైనవిధంబున శిక్షింతువు భక్తవత్సలా భవన్ముఖకమలనిర్గతమధురవచనామృతకళావిశేషంబుల నిజదాసుల మైన మాహృదయతాపం బడంగింపుము జగదుత్పత్తిస్థితిలయకారణప్రదానదివ్యమాయావినోదవర్తి వై సర్వజీవనికాయంబులకు బాహ్యాభ్యంతరంబులయందు బ్రహ్మప్రత్యగాత్మస్వరూపప్రధానరూపంబుల దేశకాలదేహావస్థానవిశేషంబులం దదుపాదానానుభవంబులు గలిగి సర్వప్రత్యయసాక్షివై సాక్షాత్పరబ్రహ్మస్వరూపుండవై యుండెడినీకు నేమని విన్నవించువారము జగదాశ్రయం బైన వివిధవృజినసంసారపరిశ్రమోపశమనం బైనభవదీయదివ్యచరణశతపలాశచ్ఛాయ నాశ్రయించెద మని పెక్కువిధంబుల వినుతించి యిట్లనిరి. 343

క. తేజంబు నాయువును వి, భ్రాజితదివ్యాయుధములుఁ బరువడి వృత్రుం
డాజిముఖంబున మ్రింగెను, మాజయ మిం కెందుఁ జెప్పుమా జగదీశా. 344

వ. అని యిట్లతిమనోహరంబు లైనవచనంబుల భక్తిపరవశు లయి వినుతిసేయుచున్న దేవతలం జూచి యప్పరమేశ్వరుం డమృతప్రాయంబు లగుగంభీరభాషణంబుల ని ట్లనియె. 345

క. మదుపస్థానం బగుమీ, సదమలసుజ్ఞానమునకు సంతోషమునం
బొదలె మదిఁ బ్రీతి నొందితి, వదలక నాభక్తి వోడమి వ్యర్థం బగునే. 346

వ. మఱియును బ్రీతుండ నైననాయందు భక్తులకుం బొందరానియర్థంబు లేదు విశేషించి నాయందు నేకాంతమతి యైనతత్త్వవిదుం డన్యంబులం గోరకుండు గుణంబులయందుఁ దత్త్వజ్ఞానగోచరుం డైనవాఁడు విషయనివృత్తచిత్తుం డై సంసారమార్గంబు నిచ్ఛింపండు కావున మీకు శుభం బయ్యెడు దధీచి యను ఋషిసత్తముండు గలం డతనిశరీరంబు [1]మద్విద్యాతిశయమహత్త్వంబునను దేజోవిశేషంబునను సారవంతం బై యున్నయ దతని నడిగి తచ్ఛరీరంబుఁ బుచ్చికొనుం డతండు పూర్వకాలంబున నశ్విదేవతలకు నశ్వశిరోనామం [2]బను బ్రహ్మస్వరూపం బగునిష్కళంకం బయినవిద్య యుపదేశించిన వారలు జీవన్ముక్తత్వంబు నొందిరి మఱియుఁ ద్వష్టృపుత్రుం డయినవిశ్వరూపునకు మదాత్మకం బయినయభేద్యకవచంబు నిచ్చెఁ గావున నతం డతివదాన్యుం డశ్విదేవతలచేత యాచింపం బడి దేహంబు వంచింపక మీ కిచ్చు నతనిశల్యంబులు విశ్వకర్మనిర్మితంబు లై శతధారలు గలయాయుధశ్రేష్ఠం బయి మత్తేజోపబృంహితం బయి వృత్రాసుర

1. మద్విద్యాతిశయంబునను సద్వ్రతాతిశయంబునను దేజోమహత్త్వంబునను సారం బై యున్నయది. 2 బను నిష్కళంకం బైనబ్రహ్మవిద్య.

శిరోహరణకారణం బయి యుండు దానం జేసి మీరు పునర్లబ్ధతేజోస్త్రాయుధసంపదలు గలిగి వెలింగెదరు విశేషించియు మద్భక్తవరు లయినవార లేలోకంబుల నెవ్వరికి నజయ్యులు గావున మీకు భద్రం బయ్యెడు మని యాదేశించి భూతభావనుం డైన భగవంతుండు వారల కదృశ్యుం డయ్యె నప్పుడు దేవతలు దధీచిమునికడకుం జని యశ్వులం బురస్కరించుకొని యిట్లనిరి. 347

ఆ. దేహి సుఖము గోరి దేహంబు ఘటియించు, దేహి విడువలేఁడు దేహమెపుడు
దేహి యస్థిదియ దేహంబుకొఱకు నై, దేహ మీఁ గదయ్య దేవతలకు. 348

ఉ. ఎక్కడ నెల్లలోకముల నెవ్వరుఁ గోరనికోర్కి నేఁడు మా
కెక్కలిపాటు నై తివిరి దేహము వేఁడఁగ వచ్చినార మే
మెక్కడఁ దీవ్రకర్మగతి యెక్కడ దైవకృతంబు గాక యీ
[1]నొక్కపుదాన మీవరుస నోయక వేఁడుదురే జగంబులన్. 349

క. నీచగతి యెల్లభంగుల, యాచన యని తెలిసి తగని దడుగుదు రేనిన్
యాచకవర్గములోపల, [2]నీచకు లనఁబడరె యెంత నేర్పరు లైనన్. 350

క. అడుగంగ రానివస్తువు, లడుగరు బతిమాలి యెట్టియర్థులు నిను నే
మడిగితిమి దేహ మెల్లను, గడు నడిగెడువారి కేడఁ గరుణ మహాత్మా. 351

ఉ. నావుడు నాదధీచియు మనంబున సంతస మంది నవ్వి సం
భావితవాక్యపద్ధతులఁ బల్కుచు ని ట్లనెఁ బేర్మితోడ నో
దేవతలార ప్రాణులకుఁ దెక్కలిమృత్యుభయంబు పూను టే
భావములం దలంపరు కృపామతి నెన్నఁడు మీమనంబులన్. 352

ఆ. ఎలమి బ్రదుక నిచ్ఛయించినవారికి, దేహ మెల్లభంగిఁ దీపు గాదె
యచ్యుతుండు వచ్చి యర్థించె నేనియుఁ, దన్ను నిచ్చునట్టిదాత గలఁడె. 353

వ. అదియునుం గాక. 354

సీ. అర్థంబు వేఁడెడునర్థులు గలరు గా, కంగంబు వేఁడెడియర్థి గలఁడె
తగుకోరికల నిచ్చుదానశీలుఁడు గాక, తనదేహ మీ నేర్చుదాత గలఁడె
యీ నేర్చువాఁడు దన్నిచ్చిన నోయక, చంపెడునట్టియాచకుఁడు గలఁడె
చంపియుఁ బోవక శల్యంబు లన్నియు, నేటి పంచుకపోవువారు గలరె

ఆ. రమణ లోక మెల్ల రక్షించువారికి, హింస సేయుబుద్ధి యెట్లు వొడమె
బ్రాఁతి యైనయట్టిప్రాణంబుపైఁ దీపు, తమకుఁ బోలె నెదిరిఁ దలఁప వలదె.

వ. అనిన దేవత లి ట్లనిరి. 356

తే. సర్వభూతదయాపరస్వాంతులకును, బుణ్యవర్తను లగుమిమ్ముబోఁటివారి
కమితసత్కీర్తికాముల కలఘుమతుల, కియ్యరానిపదార్థంబు లెవ్వి గలవు.

ఆ. అడుగరానిసొమ్ము నడుగ రా దని మానఁ, డడుగువానిమాట లడుగ నేల

1 చక్కనిదాన 'మా' నొకఁడు చాలునె. 2 నీచకయాచకము గాదె నిర్ణయమతికిన్.

భ్రాంతి నడుగుచోటఁ బ్రాణంబు లేనియు, నిచ్చువాఁడు దాఁపఁ డిచ్చుఁగాని.

వ. అని పరసంకటంబు దలంపక నిలింపులు (గార్యపరతఁ సవినయ) వాక్యపరంపరలఁ బ్రార్థించిన నతండు దరహసితభాసితవదనుం డై యఖిలలోకధర్మం బెఱింగియు నొక్కింతకాలంబు ప్రతివాక్యం బిచ్చితి దీని సహింపం దగుదురు మీయట్టివారలకుం బ్రియం బగునేని నెప్పుడైన విడువం దగినశరీరంబు విడుచుట యేమిదుర్లభం బధ్రువం బైనయీశరీరంబుచేతం గీర్తిసుకృతంబుల నెవ్వం డార్జింపకుండు నతండు పాషాణాదులకంటె నతికష్టుండు మీయట్టిపుణ్యశ్లోకులచేత నాశింపంబడినయీశరీరం బప్రమేయధర్మార్జితం బేదేహంబుచేత నేనియు సకలభూతంబులు శోకానుభవంబున శోకించు హర్షానుభవంబున హర్షించు నట్టి మహాకష్టదైన్యాకరం బైనయీశరీరంబు కాకశునకసృగాలాదులపాలు గాకుండ మే లయ్యె నని నిశ్చితాత్ముండయి దధీచి దత్త్వావలోకనంబుచేత నిరసితబంధనుం డై బుద్ధీంద్రియమానసంబులతోఁ గూడినక్షేత్రజ్ఞునిఁ బరబ్రహ్మస్వరూపం బైన భగవంతునందు నేకీభూతంబుసేసి యోగజ్ఞానంబున శరీరంబువిడిచె నప్పు డింద్రుం డతనిశల్యంబుల విశ్వకర్మనిర్మితం బై నిశితశతధారాసమావృతం బై వెలుంగు వజ్రాయుధంబుఁ గైకొని భగవత్తేజోపబృంహితుం డయి యైరావతారూఢుం డై సకలదేవోత్తమగరుడగంధర్వఖచరకిన్నరకింపురుషసిద్ధవిద్యాధరపరిసేవితుం డై సకలమునిజనంబులు వినుతింపఁ ద్రిలోకహర్షకారి యై (భగవదనుగ్రహాసంప్రాప్తమహోత్సాహవికసితవదనారవిందుం డై) వృత్రాసురుపై నడచె నప్పుడు.

ఉ. వృత్రుఁడు మానవాన్వయపవిత్రుఁడు లోకజిఘాంసకక్రియా
సూత్రుఁడు విగ్రహగ్రహణసుస్థిరవాక్యవివేకమానచా
రిత్రుఁడు దేవతోరగదరీకృతవక్త్రుఁడు రోషదూషితా
మిత్రుఁడు శత్రురాకఁ గని మిక్కిలి యైనయుగాంతరాకృతిన్. 360

క. మెండు గలదనుజనాయక, మండలములు గొల్వ నడచె మహితోద్ధతి వే
దండములనడుమఁ జనునడ, గొండయునుంబోలె నిబిడకోపోద్ధతుఁ డై. 361

క. కాలగళుఁ డడరి కడువడిఁ, గాలునిపైఁ గవయుమాడ్కి ఖరతరరవసం
[1]చాలితపూర్వదిగంతరుఁ, డై లీల మహేంద్రుమీఁద నతఁ డరిగె నృపా. 362

వ. ఇట్లు రుద్రగణంబులు మరుద్గణంబులు నాదిత్యగణంబులు నశ్విదేవతలుఁ బితృదేవతలు విశ్వేదేవులు వహ్ని యమ నైరృతి వరుణ వాయు కుబేరేశానాదులు సిద్ధసాధ్యకిన్నరకింపురుషగరుడగంధర్వఖేచరప్రముఖంబు లగునింద్రసైన్యంబులతోడ నముచియు శంబరుండును ననర్వుండును ద్విమూర్ధుండును వృషభుండును నంబరుండును హయగ్రీవుండును శంకుశిరుండును విప్రచిత్తియు నయోముఖుండును బులోముండును వృషపర్వుండును హేతియుఁ బ్రహేతియు నుత్కటుండు

---

1 చారితసర్వదిగం... నడరె నృపాలా.

ను ధూమ్రకేశుండును విరూపాక్షుండును గపిలుండును విభావసుండును నిల్వ
లుండును బల్వలుండును దందశూకుండును వృషధ్వజుండును గాలనాభుండును
మహానాభుండును భూతసంతాపనుండును వృకుండును సుమాలియు మాలియు
ము న్నగు దైతేయదానవయక్షరాక్షసా ద్యసంఖ్యంబు లగువృత్రాసురబలంబు
లంతంతం దలపడి సమరంబు సేసి రప్పుడు. 363

చ. అసురులకున్ సురావలికి నయ్యె మహారణ మప్డు డొండొరుల్
ముసల గదాసి కుంత శర ముద్గర తోమర భిందిపాల ప
ట్టిసపటుశూలచక్రముల శేవలు సూపి యదల్చి యార్చుచున్
మసలక కప్పి రస్త్రముల మార్కొని మంటలు మింట నంటఁగన్. 364

క. ఒండొరులఁ గడవ నేసిన, కాండము లాకాశపథముఁ గప్పి మహోల్కా
[1]దండంబు లోలసి నిష్ఠుర, భండనముఖ మొప్పెఁ జూడఁ బ్రళయోచిత మై.

చ. సురవరు లేయుబాణములు సూడ్కి కగోచర మై నభస్స్థలం
బఱిముఱిఁ గప్పి [2]రేసి దివసాంతముఁ జేసినలీల నాసురే
శ్వరబల[3]యూథవీరులును సాయకపంక్తులచేత వాని రూ
పఱ [4]శతధూళిఁ జేసి పఱ పైనతమం బొనరించి యార్చుచున్. 366

చ. సమరమదాంధు లై సురనిశాచరవీరులు సైనికాంఘ్రిసం
క్రమితమహీపరాగములు గ్రమ్మిన నుమ్మలికంపుఁజీఁకటుల్
దమకనుదోయి కడ్డముగఁ దార్కొనినం జల మూఁది పోరి రా
క్రమితనిజాంతరంగపరిఘట్టితరోషమహాగ్ని పెంపునన్. 367

క. అతిగళితరక్తధారా,క్షతములతోఁ గానఁబడిరి సైనికులు మహో
ద్ధతరోషవహ్నికీలలు, వితతం బై పిక్కటిల్లి వెడలెడిభంగిన్. 368

సీ. రవణించుశింజినీటంకారరవములు, భటసింహనాదంబుఁ బరిఢవింప
భీషణోత్తమహయహేషావిఘోషంబు, కరిబృంహితస్ఫూర్తిఁ గ్రందుకొలుప
సమర[5]నిశ్శంకాంకశంఖనినాదంబు, నేమిస్వనంబుల నిహ్నవింపఁ
దుములమై చెలఁగెడుదుందుభిధ్వానంబు, లట్టహాసంబుల నాక్రమింప
తే. ఘటితశస్త్రాస్త్రనిష్ఠురఘట్ట[6]నోత్థ, ఖరకరోగ్రోగ్రవిస్ఫులింగంబు లడరి
దివ్యకోటీరమణిఘృణి ధిక్కరింప, సమర మొనరించి రసురులు నమరవరులు.

వ. ఇట్లు ప్రళయసంరంభవిజృంభితసముత్తుంగరంగత్తరంగితభైరవారావనిష్ఠ్యూత
నిష్ఠురమహార్ణవంబునుంబోలె యుగాంతసంక్రాంతఝంఝాపవనపరికంపితదీర్ఘ
నిర్ఘాతనిబిడనిష్ఠురనీరదంబులుంబోలె నుభయసైన్యంబులుం గలసి సంకులసమ
రంబు సలుపుసమయంబున యుగాంతకృతాంతసకలప్రాణిసంహారకారణలీలయుం

---

1. దండములువోనినిష్ఠుర. 2. లేని. 3. యోధవీరులును. 4. శరఘాతితోడఁ బఱపైన. 5 నిస్సా
ణాంక. 6 నోగ్ర, ఖరకరకరోరు.

బోరె బదాతిరాహుత్తగజారోహకరథికమహారథికవీరు లొండొరులు చండగతిం గాండంబులు పఱపుచు గదలం జదుపుచుం గత్తులం గత్తళంబులం జినుఁగం బొడుచుచు నడిదంబుల నడుచుచుం గుంతంబులం గ్రుచ్చుచుం గుఠారంబుల వ్రచ్చుచు ముసలంబుల మోఁదుచు ముద్గరంబులం బాఁదుచుం జక్రంబులం ద్రుంచుచు సబళంబుల నొంచుచు సురియల మెఱుముచు శూలంబులం దుఱుముచు వాజుల కుఱికియు వాలంబుల నఱికియుఁ దోడలు తుండించియుఁ దొండంబులు ఖండించియు మెడ లెడయించియు మెదళ్లు గెడయించియు నడుములు ద్రుంచియు నాసికలు ద్రెంచియుఁ బదంబుల విఱిచియుఁ బార్శ్వంబులం జఱిచియు గజంబులం బఱిపియు గాత్రంబుల నుఱిపియుఁ గుంభంబులం బగిలించియుఁ గొమ్ములం జెకలించియు హస్తంబులం దుండించియు నంగంబులం జించియు రథంబుల నలియించియు రథికులం బొలియించియు సారథులం జంపియు సైంధవంబుల దంపియు శిరంబుల నొగిలించియు సీసకంబు లగిలించియు ఛత్త్రంబులను ఱుమాడియుఁ జామరంబులం దుఱుమాడియు సైన్యంబులం జదిసియు సాహసుల మెదిపియు (నడుములు ద్రుంచియు మఱియును) బరస్పరగుణవిచ్ఛేదనంబును నన్యోన్యకోదండఖండనపటుత్వంబును నుభయసైంధవధ్వజసారథిరథికరథవికలనంబును నొండొరుల పాదజానుజంఘాహస్తమస్తకనిర్దళనంబును రక్తమాంసమేదఃపంకసంకలితసమరాంగణంబును నై యతిఘోరభంగిం బెనంగి రప్పుడు. 370

చ. సమజయముం సమాపజయసామ్యపరిశ్రమముం సమానవి
క్రమము సమాస్త్రశస్త్రబలగర్వము నై కడుఘోరభంగి నా
నముచిహరాగ్రసైన్యగణబాహులతోడ నిశాచరేశ్వరో
త్తములు దురంబు సేసి రొగిఁ దానవాని వృత్రుబలంబుప్రాపునన్. 371

వ. అప్పుడు. 372

లయగ్రాహి.
మొత్తముగఁ బాఱు పెను నెత్తురుమహానదులఁ దత్తఱముతో నుఱికి కుత్తుకలు మోవం
జిత్తముల నుబ్బి వెస నెత్తుకొనుభూతముల నత్తుకొని శాకినులు జొత్తిలెడిమాంసం
బుత్తలముతో మెసఁగి నృత్తములు సేయుమదమత్తఘనడాకినులు నృత్తగతిఁ బ్రేవుల్
బిత్తరములందిగిచి మెత్తమెదడుల్గొనసి పుత్తగొనుచుండ భయవృత్తిఁ గల నొప్పెన్.

వ. ఇట్లు దేవదానవులు నర్మదాతీరంబునఁ గృతయుగంబునం దలపడి త్రేతాయుగంబు సొచ్చునంతకాలంబుఁ బోరు దారుణంబుగాఁ జేయుచుండ నంత వృత్రాసురుభుజబలంబుపెంపునఁ దెంపుసేసి కంపింపక నిలింపులపై రక్కసులగుంపులు సొంపుపెంపు చూపి మహావృక్షపాషాణగిరిశిఖరంబులు వర్షించిన. 374

మ. గిరిపాషాణమహీజముల్ గురియఁగా గీర్వాణు లన్నింటి ని

క్షురనారాచపరంపరల్ వఱపుచుం జూర్ణంబుఁ [1]గావింప ని
ర్భరలీలం దమచేయుసత్త్వములు దోర్భంగంబులై పోవఁగాఁ
దెరలన్ రాక్షసయోధవీరులు మదోద్రేకంబు సంఛిన్నమై. 375

క. ప్రచురముగ రాక్షసావళి, ఖచరులపై నేయునిబిడకాండావళి దు
ర్వచనుఁ డెడనాడుమాటలు, సుచరిత్రునియందుఁబోలెఁ జొర వయ్యె నృపా.

వ. అప్పుడు. 377

వనమయూరము.

అంత సుర లేయునిబిడాస్త్రములపాలై, పంతములు దక్కి హతపౌరుషముతో ని
శ్చింతగతి రక్కసులు సిగ్గుడిగి భూమిన్, గంతుకొని పాఱి రపకారపరులార్వన్.

క. కొండలఁ బోలెదురక్కసు, లొండొరులం గడవఁ బాఱి [2]రుక్కటి పటుకో
దండముఖసాధనంబులు, ఖండనమున వైచి దివిజపతులార్వంగన్. 379

వ. ఇట్లు సమరతలంబు వాసి తనప్రాపు దూసి తీసి పఱచు చుండు దండనాయకులం జూచి యకుటిలమతిం బకపక నగి వృత్రాసురుం డిట్లనియె. 380

ఉ. తుల్లకవృత్తి మీ కగునె శూరుల కిమ్మెయిఁ గీర్తిభోగముల్
కొల్లగఁ జేయుచావు మదిఁ గోరినవారల [3]కేను గల్గ నీ
తల్లడ మంది యీసమరధర్మము మాని తలంగఁ బాడియే
మల్లుఁడు దుర్దమప్రథనమత్తుఁడు వృత్రునిప్రాపెఱుంగరే. 381

క. చావు ధ్రువమైనప్రాణికిఁ, జావులు రెండరసికొనుఁడు సమరమునందున్
భావింప యోగమందును, జావంగా లేనిచెడుగుచావుం జావే. 382

వ. అని వాసుదేవతేజోవిశేషవిశేషితులై దవానలకీలలంబోలె వెలుంగుచు వెఱచి వెన్నిచ్చి పఱచునసురుల వెనుకొని తఱుముసురవీరులం జూచి హుంకరించి స్వర్గానుభవంబున నిచ్చ లేకుండెనేని మదవలోకనస్పర్శనమాత్రంబు ముందర నిలుతురు గాక యని [illegible]చి కల్పాంతానల్పఘనఘనాటోపంబునుంబోలెఁ గఠోరకంఠహుంకారభర్జనంబులన్ గర్జిల్లుచుఁ బ్రళయకాలపవనపరిభాసితమహాశిఖిశిఖావళులఁ దృణీకరించుకుటిలావలోకనంబుల నాలోకించుచుం గాలపరిపక్వలీలాలోలుం డయినశూలిపోలిక నాభీలమూర్తియై సకలజీవభారభరణదుర్భరభగ్నబ్రహ్మాండభాండమహాధ్వానంబుగా నాస్ఫోటించిన. 383

ఉ. కూడె జగంబు లన్నియును గ్రుంకిరి సూర్యసుధాంశు లద్రు లూ
టాడె నభస్స్థలం బగిలె నంబుధు లింకె నుడుగ్రహాళిప
ట్టూడె వడిన్ దిశల్ వగిలె నుర్వర క్రుంగె నజాండభాండ మ
ల్లాడె విధాత బెగ్గడిలె నార్చుచు వృత్రుఁడు బొబ్బ వెట్టినన్. 384

1 గావించి నిర్భర... సత్త్వములతో భంగంబులై ... దెరలెన్. 2 రుక్కటపటు. 3 కై నఁగల్గనే.

లయగ్రాహి.
కూలిరివియచ్చరులు । సోలిరిదిశాధిపులు । వ్రాలిరమరవ్రజము । దూలిరురగేంద్రుల్
[1]ప్రేలిరి మరుత్తులెద । జాలిగొని రాశ్వినులు । కాలుడిగిరుద్రులవ । లీలఁ బడి రాత్రిన్
వ్రేలిరి దినేశ్వరులు । కీ లెడలినట్లు సుర । జాలములు పెన్నిదుర । పాలగుచు ధారా
భీలగతితోడఁ దమ । కేలిధనువుల్ విడిచి । నేలఁ బడి మూర్ఛలను । దేలిరిమహోత్తా.

వ. ఇట్లు కఠోరకంఠనాదం బొనర్చిన నశనిపాతంబునం గూలుప్రాణిచయంబుభంగి నంగంబు లెఱుంగక రణరంగంబునం బడి బిట్టు మూర్ఛిల్లిన దివిజరాజసైన్యంబుల వృత్రాసురుండు సంగరరంగదుర్దముండై మహీవలయంబు పదాహతుల గజగజ వడంక నిశితశూలంబు గేల నంకించుచు మదించినభద్రమాతంగంబు కమలవనంబు చొచ్చి మట్టి మల్లాడువిధంబున నిమీలితాక్షుం డయి తనపదతలంబుల రూపంబులు మాయం జమురుచు వెక్కసంబుగఁ గ్రీడించువానిం గని వజ్రి వజ్ర(శతోపమ)నిష్ఠురగదాదండం బాభీలభంగిఁ బ్రళయకాలమార్తాండచండపరివేషఘోరంబుగాఁ ద్రిప్పి వైచిన. 386

మ. అది మింటం బెనుమంట లంటఁ బఱపై । యాభీలవేగంబునం
గదియన్ వచ్చిన లీల వామకరసం । క్రాంతంబు గావించి బె
ట్టిదుఁడై చేరి సురారి దానిఁ గొని కా । ఠిన్యోగ్రపాతంబులం
జదియన్ మోఁదె గజేంద్రమస్తకము ను । త్సాహైకసాహాయ్యుఁడై. 387

ఆ. అగ్రజంబు గులిశ । హతిఁ గూలుకులమహీ,ధ్రంబుఁబోలె రక్త । ధార లురుల
మస్తకంబు వగిలి । మద మఱి జిఱజిఱఁ, దిరిగి భీతితోడఁ । దెరలి పఱచె. 388

ఉత్సాహము. గజము దెరలి దాని కొఱలి । కంప మొంది పాఱఁగా
భజన నింద్రుఁ డంకుశమునఁ । బట్టి బిట్టు నిల్పుచుం
నిజసుధా[2]రసైకపాన । నిర్ణయార్ద్రకరమునన్
ఋజుత మీఱ నిమిరె నదియు । [3]రీతి మెఱసి క్రమ్మఱన్. 389

వ. ఇవ్విధంబున నైరావతంబును సేద దేర్చుచు నెదుర నిలుచున్నభిదురపాణిం గని తోఁబుట్టువుఁ జంపిన చంపుఁ దలంచి మోహశోకంబుల విపర్యాసంబుగా నవ్వుచు నాహవకామ్యార్థి యై వృత్రుం డిట్లనియె. 390

శా. నాకుం బెద్దన నీకు సద్గురువు దీ । నవ్రాతరక్షున్ శుభా
లోకుం జంపితి విట్లు పాపమతివై । లోభంబుతో నియ్యెడన్
లోకుల్ నవ్వఁగ మద్భుజాపటిమకున్ । లోనైతి వీశూలమం
దాకంపింపఁగ నిన్ను గ్రుచ్చి ఋణముక్తాత్ముండనై పేర్చెదన్. 391

---

1 'ప్రేలిరి దివాకరులు । కాలుడిగిరుద్రు లవ । లీలఁబడిరశ్వినులు । జాతిగొని రాత్రిన్. 2 రసార్ద్రహస్తనిభృత మైనకరమునన్ 3. రూఢిఁ దెలిసి క్రమ్మఱన్.

క. ఎట్టితులు వయినఁ గానీ, నెట్టన తన బ్రదుకుకొఱకు నీవలె గురువుం
జుట్టమును బుణ్యు బ్రాహ్మణుఁ, బట్టి వధింపంగఁ గలఁడె పశువుంబోలెన్. 392

చ. దయయును సత్యముం విడిచి ధర్మము మాని యశంబుఁ బాసి శ్రీ
జయములఁ బాఱఁ దోలి పురుషత్వము గానక లోకనిందితా
హ్వయుఁ డగువానిచావునకు నార్యులు గుందుదు రే సృగాలముల్
ప్రియమున నంటునే శవముఁ [1]బ్రేలక చేరునె కంకగృధ్రముల్. 393

క. నిక్క మగుపాపములచేఁ, జిక్కితివి నిశాతశూలశిఖరాగ్రమునన్
మ్రక్కించి నీదుమాంసము, గుక్కలు నక్కలును బెఱికికొని తినఁజేతున్. 394

ఉ. దీకొని నీకు నేఁ డిచట దిక్కని వచ్చినవారు గల్గి రే
నేకమతిం బిశాచముల కెల్లను దృప్తిగ మన్నిశాతశూ
లైకమహాగ్నికీలల ననేకవిధంబుల సోమయాజి నై
మేఁకలఁ జేసి వ్రేల్చెద నమేయమదోద్ధతి వ్రాలి యియ్యనిన్. 395

క. కాక ననుఁ గులిశధారల, దీకొన నిర్జింపఁ గలిగితేనియు భూతో
ద్రేకంబు సేసి శూరుల, ప్రాకటపదపద్మధూళి[2]భాగం బగుదున్. 396

వ. అని మఱియు వాసుదేవకృపాలబ్ధదుర్నిరీక్ష్యుం డైన వజ్రహస్తునిం గని యిట్లనియె.

సీ. సందియం బేటికి జంభారి వేవేగ, భిదురంబు వ్రేయు మాభీలభంగి
నతిలోభి నడిగినయర్థరాశియుఁబోలెఁ, గడపకు మిది వృథ గాదు సుమ్ము
మురమర్దనుని తేజమున నాదధీచి వి,ద్యాతిశయంబున నధిక మయిన
యది గాన హరిచే నియంత్రితోన్నతుఁడ వై, గెలువుము శత్రుని గీటడంచి

ఆ. యెందుఁ గలఁడు విష్ణుఁ డందు జయశ్రీలు, వొందుగాఁగ వచ్చిపొందుచుండుఁ
గాన భక్తవరదుఁ గమలాక్షు సర్వేశు, పదములందు మనముఁ బదిలపఱుతు.

వ. ఇపుడు వజ్రధారలం ద్రెంపంబడినవిషయభోగంబులు గలవాఁడ నయి శరీరంబు విడిచి భగవద్ధామంబు నొందెద నారాయణునిదాసుండ నైననాకు స్వర్గమర్త్యపాతాళంబులం గలసంపద్భోగంబులు [3]నిచ్ఛగింపంబడవు త్రైవర్గికాయాసరహితం బయినమహైశ్వర్యంబు ప్రసాదించుం గావున ననుపమేయం బయినభగవత్ప్రసాదం బన్యుల కగోచరం బద్దేవునిపాదైకమూలంబుగా నుండుదాసులకు దాసానుదాసుండ నగుచున్నవాఁడ నని యప్పరమేశ్వరు నుద్దేశించి. 399

చ. అరయఁగ భక్తపాలనము లైన[4]భవద్గుణజాల మాత్మసం
స్మరణము సేయ వాక్కు నిను సన్నుతి సేయ శరీర మెల్లఁ గిం
కరపరివృత్తి సేయ మదిఁ గాంక్ష యొనర్చెదఁ గాని యొల్ల నే
నరిది ధ్రువోన్నతస్థలము [5]నబ్జజపట్టణ మింద్రభోగమున్. 400

---

1. ప్రేలఁగ; వ్రేలఁగ 2. భరియింతుఁ దలన్. 3. నిచ్ఛయింపఁబడు 4, భవచ్చరితంబులాత్మ.
5. నబ్జజాపట్టమూ నింద్ర.

ఉ. ఆఁకలి గొన్నక్రేపులు రయంబున నీఁకలు రానిపక్షులున్
దీకొని తల్లికై మఱి విదేశగతుం డగుభర్త కంగజ
వ్యాకులచిత్త యైనజవరాలును దత్తఱ మందుభంగి నో
శ్రీకర పంకజాక్ష నినుఁ జేరఁగ నామది గోరెడుం గదే. 401

క. [1]నాకును సఖ్యము పుణ్యశ్లోకులతోఁ గాని తత్త్వశూన్యులు సంసా
[2]రైకవిమోహులతోడం, గాకుండ నొనర్పు మయ్య కంజదళాక్షా. 402

వ. అని పలుకుచు. 403

మహాస్రగ్ధర. హరిపై సర్వాత్ముపై నత్యగణితగుణుపై నంతరంగంబు పర్వన్
సరిమే నుప్పొంగఁ జావున్ జయమును సరిగా సంతసం బందుచున్ భీ
కరుఁడై కాలాగ్నివోలెం గనలుచుఁ గవిసెన్ గర్వదుర్వారుఁడై దు
ర్భరలీలన్ భూమి గంపింపఁగ దిశ లదువన్ భండనోద్దండవృత్తిన్. 404

క. దొరఁకొని ప్రళయోదకమున, హరిపైఁ గైటభుఁడు గవియుహంకారమునన్
సురనాథుమీఁద వృత్రాసురుఁడు మహోద్వృత్తి నడచె శూలాయుధుఁడై.

శా. కల్పాంతాగ్నియుఁబోలె నుల్క లెగయం గాఁ ద్రిప్పుచున్ దీన [3]నో
యల్పా చావు మటంచు శూలము రయం బారంగఁ బై వైచినం
బోల్పం గోటిరవిప్రకాశత దివిం బోవంగ వీక్షించి యా
[4]వేల్పుల్ వ్రాంగఁగ వజ్రధారఁ దునిమెన్ విన్నాణ మొప్పారఁగన్, 406

ఆ. శూల మప్పు డతఁడు స్రుక్కక ఖండించి, పూనితోన కదిసి భుజముఁ ద్రుంచె
నసుర గనలి యేకహస్తుఁడై పరిఘంబుఁ, గొని మహేంద్రుఁ గిట్టి హనువు లడిచె.

వ. ఇట్లు ప్రళయకాలభీషణపరివేషవేష్టంబుగా రోషంబునం బరిఘంబుఁ ద్రిప్పి కు
ప్పించి గజకుంభస్థలంబు భగ్నంబు సేసి యింద్రుహనుప్రదేశంబును నిష్ఠురాహతి
నొంచిన. 408

క. గజము మద ముడిగి తిరుగుచు, గుజగుజనై గీఁకవెట్టఁ గులిశము నేలన్
భజన చెడి విడిచె నింద్రుఁడు, గజిబిజితో బెగడె నసుర కడిమి జగంబుల్. 409

క. గరుడుఁడు పొదివినసర్పము, కరణిన్ వృత్రాసురేంద్రు కడిమికి లోనై
తిరుగుడు వడ్డహరిం గని, పురపుర నాహా యటంచుఁ బొగిలిరి దివిజుల్. 410

వ. అప్పుడు. 411

ఆ. గజముపాటు సూచి కడుదీనగతిఁ జూచి, పవి కరంబు జాఱి పడుటఁ జూచి
యుద్ధధర్మ మెఱిఁగి యున్నవృత్రునిఁ జూచి, సిగ్గుతోడ వజ్రి శిరము వాంచె.

వ. ఇట్లు యుద్ధరంగంబున శత్రుసన్నిధిం గరంబు జాఱి పడినవజ్రంబుఁ బుచ్చికొనక
నివ్వెఱపడి లజ్జించి యున్నపాకశాసనుం జూచి వృత్రుం డిట్లనియె. 413

క. దురమునఁ గైదువు వైచిన, శర ణన్నను వైరిజనులఁ జంపము మది ని

1. మాకీసఖ్యము. 2. రైకసమూహులతోడను. 3. నోరల్పా 4. వేల్పువ్రాంగుచు.

వ్రేఱఁ గంద నేల కులిశము, కర మరుదుగఁ బుచ్చికొనుము ✽ కాచితి నింద్రా!

సీ. వజ్రంబుఁ గైకొని ✽ వైరి నిర్జింపు మి, ట్లడలంగ వేళ గా ✽ దమరనాథ
యొనయ దేహాధీను ✽ లైన[1]మూర్తుల కెల్ల, నీశు లక్ష్మీశు స ✽ ర్వేశుఁ బాసి
కడతేఱ జయములు ✽ గల్గునె యెందైనఁ, దలపోసి చూడుమా ✽ తత్త్వబుద్ధి
[2]నీలోకపాలకు ✽ లెవ్వనివశగతి, వలఁ బడ్డపక్షుల✽వర్తనమునఁ

తే. జిక్కి చేష్టలు సేయుచుఁ ✽ [3]జింత గాంతు, రట్టిమృత్యుబలంబుల ✽ నాత్మజయము
తమది గాఁ గోరి యజ్ఞాన✽తంత్రు లగుచుఁ, గమలలోచనులీలావి✽కారములను.

తే. మెఱయ యంత్రమయం బైన ✽ మృగముభంగి, దారునిర్మిత మైనట్టి✽తరణిపోల్కి
శుక్ర మెఱుఁగుమ యీభూత✽జాలమెల్ల, ధవళపంకేరుహాక్షుతం✽త్రములుగాఁగ.

వ. మఱియు భూతంబులచేతను నింద్రియంబులచేతను నవశుం డైనపురుషుండు ప్రకృతిచేత వేఱుసేయంబడినయాత్మ పరమేశ్వరానుగ్రహంబు వాసి సుఖియించుచుండు నవిద్వాంసుం డైనవాఁ డనవరతంబుఁ దన్ను స్వతంత్రుంగాఁ దలంచుచుండు భూతంబులవలన భూతంబులు పుట్టుచుండు నాభూతంబులు భూతంబులచేత భక్షింపంబడుచుండుఁ బురుషున కాయువు శ్రీయును గీర్తియు నైశ్వర్యంబును మొదలయినవి యనుభవింప నెంతగాలంబు ప్రాప్తం బంతగాలంబు నివసించు నాప్రాప్తంబు దీఱినఁ బురుషుండు జాలిం బొందిన నవి యుండకపోవుచుండుంగావున (గుణంబును నవగుణంబునుఁ) గీర్త్యపకీర్తులును జయాపజయంబులును సుఖదుఃఖంబులును [5]జావుబ్రదుకులును సమంబు లయి కలుగుచుండు నజ్ఞాని యైనవానికి సత్త్వరజస్తమోగుణంబులు గలిగి యుండు నట్టివానికి గుణమయంబు లైనయింద్రియాదులె యాత్మ యని తోఁచుచుండుం గావున వాఁ డాగుణంబులచేత బద్ధుం డగు నాగుణంబులకు సాక్షిమాత్రం బగుశరీరంబు వే అని యెవ్వఁ డెఱుంగనోపు వాఁ డాగుణంబులచేత బద్ధుండు గాఁడు గావున గుణంబులును గుణియును భోక్తయును భోగ్యంబును జయంబును నపజయంబును హర్తయును హన్యంబును నుత్పత్తిస్థితిలయకర్త యై సర్వోత్కృష్టుం డైనయప్పరమేశ్వరుండె కాని యన్యంబు లే దిప్పు డొక్కహస్తంబు నాయుధం

1. 'ధూర్తుల కెల్ల 2. నీలోకచయ మెల్ల నెవ్వని 3. జింత సేతు, రమృతమర్త్యబలంబును నాత్మ.
6. భూతేంద్రియాంతఃకరణంబులును ప్రకృతి పురుషుం డైనభగవంతుని యనుగ్రహంబు లేమి స్వర్గాదులయందు సమర్థంబులు గావు ప్రకృతిచేత వశుం డైనపురుషుండు సుఖదుఃఖంబుల ననవరతం బనుభవించుచునుండి తన్ను స్వతంత్రుని గాఁ దలఁచుచుండుఁ గాని స్వతంత్రుండు గాఁడు స్వతంత్రుం డైన యీశ్వరుండు భూతంబులవలన భూతంబులఁ బుట్టించుచుండు నాభూతంబులు భూతంబుల భక్షించుచుండుఁ బురుషునకు' వ్రా. ప్ర. 5 'మృత్యుజీవితంబులును ననుద్వంద్వంబులకు సముండు గావలయు సత్త్వరజస్తమంబులు ప్రకృతిగుణంబు లాగుణంబులకు సాక్షిమాత్రం బైనయాత్మ నెవ్వఁ డెఱుంగనోపు వాఁ డాగుణంబులచేత' అని కొన్నిప్రతులు.

బునుం బోయినను భవత్ప్రాణాపహరణ(ంబునకు) సమర్థుండ నగుచున్న నన్నుం జూడు మని (వృత్రాసురుండు) మఱియు ని ట్లనియె. 417

తే. వాహనంబులు సారెలు వాఁడిశరము, లూర్జితాక్షము లసువులె యొడ్డనములు
గాఁగఁ బోరెడునీద్యూతకర్మమందు, నెఱుఁగ జయముఁ బరాజయ మెవ్వఁ డెఱుఁగు.

చ. అనవుడు వృత్రుమాటలకు నద్భుత మంది సురేంద్రుఁ డెంతయుం
దనమదిఁ గుత్సితం బుడిగి దైవముగా నతనిం దలంచి కై
కొనియెఁ గరంబునన్ దిగువఁ గూలినవజ్రము నప్పు డాత్తలోఁ
దనరె జగంబు లన్నియు ముదంబునఁ బొందిరి ఖేచరావళుల్. 419

క. రాహుగ్రహవక్త్రగుహా, గేహాంతము వాసి వచ్చి కిరణావళి స
ద్బాహుళ్య మొప్ప వెలిఁగెడు, నాహరిదశ్వుండుఁబోలె హరి యొప్పె నృపా.

వ. ఇట్లు కరకలితవజ్రాయుధు ఙ్డలమండితది ఙ్డలుం డయి జంభారి గంభీరవాక్యంబుల విస్మయమందస్మితముఖారవిందుం డయి వృత్రున కి ట్లనియె. 421

క. ఓదానవేంద్ర నీమతి, వేదాంతముఁబోలెఁ దత్త్వవిజ్ఞానకళా
మోదము ని వతిభక్తుఁడ, వాదిమపురుషునకుఁ బతికి నజ్ఞాతునకున్. 422

ఉ. లోకము లెల్ల నిండి తనలోనుగ సర్వముఁ జేసి ప్రాణులన్
చీకులఁ బెట్టి యెల్లెడలఁ దీపులు సూపెడివిష్ణుమాయ నేఁ
డేకమతిం దలంచి తిది గేల మహాసురరూపు మాని సు
శ్లోకుఁ బురాణపూరుషుని శోభనమూర్తి ధరింపు మింపునన్. 423

ఉ. ఏనియమంబు సల్పితివో యెట్టిమహాతప మాచరించితో
పూని రజోగుణాభిరతిఁ బొందిననీమతి శాంతదాంతస
జ్ఞానసమానసానుభవసమ్మత[1]మరాళుని లోకభావస
న్మాను నమేయు నాదనుజమర్దనుభక్తిఁ బొసంగ నెంతయున్. 424

క. నారాయణరూపామృత, పారావారమునఁ [2]దేలుభక్తుఁడు దా భూ
దారకరఖాతకోదక, పూరంబుల నేల తృప్తిఁ బొందు మహాత్మా. 425

వ. అని పలుకుసురేంద్రు నుపలక్షించి వృత్రాసురుం డాయోధనదుర్ధర్షణసంఘర్షమాణమానసుం డై వైరిం బురికొల్పుకొని వామహస్తంబున బరిఘంబుఁ ద్రిప్పుచు నుప్పరంబునకుం గుప్పించుచు బ్రహ్మాండకర్పరంబు నిష్ఠురభైరవారావంబునం బగిలించుచు సముత్తుంగమత్తమాతంగ(పుంగవ)ంబు [3]వృషభంబుపైఁ గవియుభంగి సురవృషభుపేరురం బుపలక్షించి భీషణాశనినిపాతవేగంబునం గొట్టిన నింద్రుండు కులిశధార నప్పరిఘంబుఁ దునిమి తోడన శేషఫణావిశేషభాసురం

1 'మరాళుఁ డగోపభావస, మ్మానుఁ డమేయుఁ డాదనుజ.' అ. ప్ర. 2 'నౌవరు పటుభక్తి యుతే, యూరిత్తఖాదకోదక.' 3 సింగంబుపై.

బయినబాహుదండంబు ఖండించె నప్పుడు వృత్రుండు భిన్నబాహుద్వయమూలుం డై రక్తధారావలిం దొఁగుచు వజ్రిచేతం బక్షహతం బై దివంబుననుండి జాఱు చున్నకులపర్వతంబునుంబోలెఁ జూపట్టి ప్రళయకాలసంహారనిటలచ్ఛటచ్ఛటార్భటకఠోరకీలాభీలాగ్నిసమానక్రూరకుటిలనిరీక్షణదుర్నిరీక్ష్యుం డయి భూమిం గ్రిందిదాడను నాకాశంబు మీఁదిదాడను హత్తించి నభోమండలంబునుంబోలెఁ దుది మొదలెఱుంగ రాక వికృతంబుగా వక్త్రంబు దెఱచి మందరమథనమథ్యమానవిషధరజనితవిషవిషమజిహ్వాభీలం బగునాలుక నభంబు నాకుచుఁ గాలసంహారకారణుం డయినకాలునిభుజాదండమండితం బగుకాలదండంబునుం బోనిదంష్ట్రలచేత జగత్త్రయంబును మ్రింగెడువాఁడునుంబోలె నతిమాత్రమహాకాయుం డయి పర్వతంబులం దలంగ మీటుచు నడగొండయుంబోలె నభోభాగభూభాగంబుల నాక్రమించి యప్పుడు. 426

ఉ. కాలమునాఁటిమృత్యువుముఖంబునఁబోలెను విస్ఫులింగముల్
గ్రాలఁగ దేవసంఘములు గంపము నొంద జగంబు లెల్ల నా
హాలులితారవం బెసఁగ నభ్రగజంబును నాయుధంబుతో
నాలుకఁ జుట్టిపట్టి సురనాథుని మ్రింగె మహాద్భుతాకృతిన్. 427

ఆ. లోక మెల్ల నపుడు చీకాకుపడెఁ దమం, బడరె నుడుగణంబు లవనిఁ బడియె
[1]సోనవాన గురిసె సూర్యచంద్రాగ్నుల,రశ్ము లడఁగె దిశలు రభస మయ్యె.

వ. అప్పుడు. 429

ఉ. కందఁడు భీతిఁ గుందఁడు ప్రకంపము నొందఁడు పెద్దనిద్దురం
జెందఁడు తత్తఱింపఁడు విశేషముఁ దప్పఁడు వైష్ణవీజయా
నందపరైకవిద్యను మనంబునఁ దాల్చుచు నుండెఁ గాని సం
క్రందనుఁ డానిశాచరునిగర్భములో హరిరక్షితాంగుఁ డై. 430

వ. ఇట్లు కవచరూపశ్రీనారాయణకృపా[2]పాలితుం డై యోగబలంబున బలభేది యతనియుదరంబు వజ్రాయుధంబున భేదించి యైరావణసహితుం డై వెడలి యతని కంధరంబు తెగ నడువ వజ్రంబుఁ బ్రయోగించిన నతినిష్ఠురవేగంబున వృత్రహరణార్థంబుగం దిరుగుచు సూర్యాదిగ్రహనక్షత్రంబులకు దక్షిణోత్తరగతిరూపం బయినసంవత్సరసంధియందు నహోరాత్రమధ్యంబున వృత్రుశిరంబు పర్వతశిఖరంబునుంబోలెఁ ద్రుంచి కూలం ద్రోచె నప్పుడు. 431

మ. మొరసెన్ దుందుభు లంబరంబునఁ గడున్ మోదించి గంధర్వులున్
సురలున్ సాధ్యులు సిద్ధులున్ మునివరుల్ సొంపార వృత్రఘ్ను భీ
కరతేజోవిభవప్రకాశకరవిఖ్యాతైకమంత్రంబులం

1 'రక్తవృష్టి గురిసె రవిచంద్రవహ్నుల, ప్రభలు మాసె దిశలు భస్మ మయ్యె' వ్రా. ప్ర.
2 దంశితుం డై.

దిర మొప్పం బఱియించుచుం గురిసి రెంతేఁ గ్రొత్తపూసోనలన్. 432

ఆ. ఏమి సెప్ప నప్పు డింద్రారితనువున, నొక్కదివ్యతేజ ముబ్బి వెడలి
లోక మెల్లఁ జూడ [1]లోకులు సూడ నీ,లోక మరసి విష్ణులోను సొచ్చె. 433

వ. ఇట్లు లోకభీకరుం డైన వృత్రాసురుండు గూలిన నఖిలలోకంబులుఁ [2]బరితాపంబు లుడిగి సుస్థితిం బొందె దేవర్షి పితృగణంబులు (దానవులతోడం) గూడి యింద్రునకుం జెప్పక తమతమస్థానంబునకుం జని రనిన విని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 434

ఆ. ఏమికారణమున నింద్రుతోఁ బలుకక, సురలు వోయి రట్టిసురగణంబు
లెందుచేత సుఖముఁ జెందిరి వజ్రికిఁ, జేటు గలుగు టెట్లు సెప్పవయ్య. 435

వ. అనిన శుకుం డిట్లనియె వృత్రపరాక్రమచకితు లయిననిఖిలదేవతలును మహర్షిగణంబులును మున్ను వృత్రవధార్థం బింద్రునిం బ్రార్థించిన నతండు బ్రహ్మహత్యకుం జాలక తొల్లి విశ్వరూపునిం జంపినపాపంబు స్త్రీలయందును భూమియందును జలంబులందును ద్రుమంబులందును విభజించి పెట్టితి నిపు డీహత్య యేమిటం బాపుకొనువాఁడ నా కశక్యం బనిన మహర్షు లశ్వమేధయజ్ఞంబు సేయించి యజ్ఞపురుషుం డయిన శ్రీనారాయణదేవుని సంతుష్టునిం జేసి యీహత్యం బాపం గలవారము స్వభావంబున బ్రాహ్మణపితృగోమాతృసజ్జనహంత లైనవార లేదేవునిం గీర్తించి శుద్ధాత్ము లగుదు రద్దేవుని నశ్వమేధమహామఖంబున శ్రద్ధాన్వితుండ వై మాచేత ననుష్ఠితుం డై సేవించిన నీకు ఖలుం డైనయిద్ధురాత్ముని హింసించినహత్య యేమి సేయం గల దని యొడంబఱిచిన నింద్రుండు వల్లె యని యవ్విధంబున మార్తునిం బరిమార్చి బ్రహ్మహత్యం బొంది యప్పాపంబు భరియింప నోపక దుర్దశం బొందె నప్పుడు. 436

సీ. పాపపుఁజండాలరూపంబు గలదాని, ముదిమిచే నొడ లెల్లఁ గదలుదాని
క్షయకుష్ఠరోగసంచయకృతం బగుదాని, నురురక్తపూరంబు దొరఁగుదాని
నరసినవెండ్రుకల్ బెరసినతలదాని, నటఁ బోకు పోకుండు మనెడుదానిఁ
గదురుకంపునఁ బేర్వు లదరఁ జేసెడుదానిఁ, దా నెందుఁ బాఱినఁ దఱుముదాని

ఆ. నాగుణంబు లెల్ల భోగింప కేరీతి, నరుగ నెంతవాఁడ వనెడుదాని
బిట్టు దిరిగి చూచి భీతిల్లి సిగ్గుతో, దేవనాయకుండు దెగచి పఱచె. 437

వ. ఇట్లతివికృతత్వంబుతో బ్రహ్మహత్య వెనుతగుల నింద్రుండు నభోభాగభూభాగదిగ్భాగంబు లెల్లం దిరిగి చొరం దెరువు లేక దీర్ఘనిర్ఘా[3]తాటోపనిశ్శ్వాసదూషితుం డై యీశాన్యభాగంబునకుం బఱచి యద్దెస సమేయపుణ్యగణ్యాం బయిన మానససరస్సునం బ్రవేశించి యం దొక్కకమలనాళంబు సొచ్చి యందుఁ దంతువులం గలసి రూపంబు లేక యలబ్ధభోగుం డై బ్రహ్మహత్యావిమోచనంబుఁ

1. లోకంబు సూడని, లోక మరిగి విష్ణు. 2. బరితోషంబు నొందె. 3. తోపమనిశ్వాస.

జింతించికొనుచు సహస్రవర్షంబు లుండె నాచండాలియు నది పరమేశ్వరదిగ్భాగం బగుటంజేసి యందుం జొర రాక కాచి యుండె నంతకాలంబుఁ ద్రిదివంబున నహుషుండు విద్యాబలతపోబలయోగబలంబులం బాలించుచుండి సంపదైశ్వర్యమదాంధుం డై యింద్రపత్నిం గోరి యింద్రుండు వచ్చునందాఁక నాకుం బత్నివి గ మ్మనిన నాశచీదేవి బృహస్పతిప్రేరితయై బ్రహ్మర్షివాహ్యశిబిక నెక్కి వచ్చి నన్ను భోగింపు మనిన నతం డట్లచేసి కుంభసంభవశాపహతుండై యజగరయోనియందుఁ బుట్టె నంత నింద్రుండు బ్రహ్మర్షిగణోపహూతుం డై త్రిదివంబునకు వచ్చె నంతగాలంబు నారాయణచరణారవిందధ్యానపరుం డై చింతించుచుఁ దద్దిశాధినాయకుం డైనశంకరుచేత రక్షితుం డై యుండుటంజేసి తద్దోషబలంబు దఱిఁగి సహస్రాక్షుం బీడింప లే దయ్యె నప్పు డింద్రుండు నిజైశ్వర్యంబునుం బొంది బ్రహ్మర్షిపరివృతుం డై మహాపురుషారాధనంబు సేసి హయమేధాధ్వరంబునకు దీక్షఁ గైకొని బ్రహ్మవాదులచేత యజింపఁబడుచున్నవాఁ డయి సర్వదేవతామయుం డైననారాయణుం బరితృప్తుం జేసి మంచు విరియించుమార్తాండునిచందంబునఁ బ్రాహ్మణవధరూపపాపంబు నాశంబు నొందించి సకలదివిజయక్షగంధర్వసిద్ధమునిజనసంస్తూయమానుం డయి త్రిభువనైశ్వర్యభోగభాగ్యంబులం గయికొనియె నప్పుడు. 438

చ. సతతమరీచిముఖ్యమునిసంఘముచేత యథోచితంబుగాఁ
గృతఘనవాజిమేధమునఁ [1]గేశవు నీశుఁ బురాణపూరుషున్
హితు జగదీశు యజ్ఞపతి [2]నిష్టఫలప్రదు నంతరంగసం
గతు భజియించి వజ్రి గతకల్మషుఁ డై నెగడెన్ మహీశ్వరా. 439

సీ. మఱియుఁ బుట్టింపంగ మనసు వెట్టినయట్టి, క్రూరకర్మాంభోధికుంభజుండు
అంగారములు సేయ నాహుతిఁ గన నోపు, బహుపాపకాననపావకుండు
కందక దిగ మ్రింగి కఱ్ఱున ద్రేఁపంగఁ, గల్మషగరళగంగాధరుండు
ఘనగుహాంతరములఁ గాలూన నియ్యని, కలుషదుస్తరతమోగ్రహవిధుండు

ఆ. సకలముక్తిలోకసామ్రాజ్యసమధిక, సహజభోగభాగ్యసంగ్రహైక
కారణాప్రమేయ, కంజాక్షుసర్వేశ, కేశవాదినామకీర్తనంబు. 440

సీ. అఖిలదుఃఖైకసంహారకారణమును, నఖిలార్థసంచయాహ్లాదకరము
విమలభక్త్యుద్రేకవిభవసందర్శనం, బనుపమభక్తవర్ణనరతంబు
విబుధధర్మానేకవిజయసంయుక్తంబు, గ్రస్తామరేంద్రమోక్షక్రమంబు
బ్రహ్మహత్యానేక[3]పాపాబ్ధితారణ, కారణసజ్జనకాంక్షితంబు

తే. నైనయీయితిహాసంబు నధికభక్తి, వినినఁ జదివిన [4]వారికి ననుదినంబు

1. 'గీర్తితుఁ డైనపురాణ. 2. నీశు రమేశు నిజాంతరంగ' వ్రా.ప్ర. 3. 'పాపనిస్తరణంబు, గమనీయసజ్జనకాంక్షితంబు. 4. వ్రాసిన... నాయురారోగ్యభాగ్యభోగాభివృద్ధి....గల్గునవఘు' అ.ప్ర.

నాయురారోగ్యకరము జయాభివృద్ధి, కర్మనాశము సుగతియుఁ గల్గుచుండు.

సీ. నావుడు యోగీంద్ర నా మనం బీవృత్రు, వివరంబు నీచేత విన్నమొదలు
కడు నద్భుతంబునఁ గళవళం బందెడుఁ, గొఱలు రజస్తమోగుణములందు
వర్తించునీపాపవర్తికి నేరీతి, మాధవపదభక్తి మది వసించె
సత్త్వస్వభావులై సమబుద్ధులై తపో, నియమప్రయత్నులై నిష్ఠచేత

తే. నిర్మలాత్మకులై నట్టిధర్మపరుల, కమరులకుఁ బుణ్యమునులకు నంబుజాక్షు
భూరికైవల్యసంప్రాప్తిమూల మైన, భక్తి వీనికిఁ బోలె నేర్పాటు గాదు. 442

సీ. [1]భూస్థలిఁ గల రేణువులకన్న దట్టమై, కడు నొప్పుజీవసంఘములు గలవు
ఆజీవములలోన నరయ ధర్మాయతి, మతి వసించినవారు మనుజజాతి
యామనుష్యులలోనఁ గామంబుఁ బెడఁబాసి, మోక్షేచ్ఛులగువారు మొదల నరిది
మోక్షమార్గం బాత్మమూలంబుగా నుండు, వారిలో ముక్తులు లేరు తఱచు

తే. ముక్తులైనట్టివారిలో యుక్తిఁ దలఁపఁ, జాలదుర్లభుఁ డమితప్రశాంతిపరుఁడు
పరమసుజ్ఞాననిరతుండు భద్రగుణుఁడు, రమణ శ్రీవాసుదేవపరాయణుండు.

తే. సకలలోకాపకారి దుస్సంగతుండు, వృత్రుఁ డేక్రియ సుజ్ఞానవేది యయ్యె
సమరమునఁ బౌరుషంబుచే నమరవిభుని, నెట్లు మెప్పించె దీనినా కెఱుఁగఁ జెపుమ.

చిత్రకేతూపాఖ్యానము.

వ. అని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రు నడిగె నని సూతుండు శౌనకాదిమునులకుం జెప్పి మఱియు ని ట్లనియె నట్లు గజపురవల్లభుండు సంప్రశ్నంబు సేసిన బాదరాయణి హరిస్మరణశ్రద్ధాపరుం డయి యిట్లనియెఁ దొల్లి కృష్ణద్వైపాయన నారద దేవల మహర్షులు నా కెఱింగించినయితిహాసంబు గలదు దాని నెఱింగించెద సావధానుండ వై యాకర్ణింపుము. 445

చ. అమితవిభూతిఁ జాల నమరాధిపుఁ బోలుచు శూరసేనదే
శములకు భర్త యై ప్రజలు సంతస మందఁగ సార్వభౌముఁ డై
క్షమ దన కెల్లకాలమును గామదుహంబు గఁ జిత్రకేతునా
మమునఁ బ్రసిద్ధి కెక్కె గుణమండనుఁ డంచితకీర్తికాముఁ డై. 446

సీ. మానితతారుణ్యమద[2]నతురంగులు, కందర్పవిజయైకఖడ్గలతలు
మదనసమ్మోహనమంత్రాధిదేవతల్, పంచశిలీముఖుబందెకత్తె
లసమాస్త్రుఁ దఖిలంబు నడకించుబొమ్మలు, నాత్మసంభవునికట్టాయితములు
పుండ్రేక్షుకోదండుభూరితేజంబులు, శంబరవిద్వేషిసాహసములు

తే. నాఁగఁ బొలుపారునేకకోటినలినముఖులు, దనకుఁ బత్నులుగాఁగ నత్యంతవిమల
కీర్తివైభవసన్మార్గవర్తి యగుచు, జగతిఁ బాలించు చుండె నాజనవిభుండు. 447

తే. కడిమి వేవేలుభార్యలు గలిగి యుండి, పరఁగ సంతతి యొకరందుఁ బడయలేక

---

1 'ఉర్వరఁ గలరేణువుల. 2 మదనాంగులు' వ్రా. ప్ర.

చిత్తమునఁ జాలఁ బాయనిచింత వొడమి, బడలఁ జొచ్చెను వేసవిమడువుఁ బోలె.

ఉ. రూపము సత్ప్రతాపము మరుత్పతిభోగము యౌవనంబు సం
దీపితచారువర్తనము దిగ్విజయంబును సత్యముం జగ
ద్వ్యాపితకీర్తియుం సతులు వైభవముఖ్యము లెల్ల మాన్పఁగా
నోపక యుండె నానృపతి నొందినసంతతి లేనిదుఃఖమున్. 449

వ. ఇట్లు సంతతి లేక యతిదుఃఖమానసుం డయిన యానరేంద్రునిమందిరంబున కంగిరసమహాముని వచ్చి యతనిచేత నతిథిసత్కారంబులు వడసి కుశలం బడిగి రాజ్యంబు భవదధీనంబ కదా పృథివ్యప్తేజోవాయ్వాకాశమహదహంకారంబు లనియెడియేడింటిచేత రక్షింపంబడుజీవుండునుంబోలె నమాత్యజనపదదుర్గద్రవిణసంచయదండమిత్రంబు లనెడిసప్తప్రకృతులచేత రక్షితుండ వై ప్రకృతిపురుషులయందు భారంబు వెట్టి రాజ్యసుఖంబు లనుభవింతువు గదా మఱియు దారప్రజామాత్యభృత్యమంత్రిపౌరజానపదభూపాలురు నీకు వశవర్తులు గదా సర్వంబునుం గలిగి సార్వభౌముండ వైన నీవదనంబున విన్నఁదనంబు గలిగి యున్నయది కతం బేమి యనిన నామునిప్రవరునకు నతం డిట్లనియె మీతపోబలంబున మీకు నెఱుంగరాక యున్నయదియుం గలదే యని తల వంచి యూరకున్న నతని యభిప్రాయం బెఱింగి యాభగవంతుం[1]డైన యంగిరసుండు దయాళుం డై పుత్రకామేష్టి వేల్చి యజ్ఞశేషం బతనియగ్రమహిషి యయినకృతద్యుతి కిచ్చి నీకుం బుత్రుండు గలిగెడి నతనివలన సుఖదుఃఖంబు లనుభవింపంగల వని చెప్పి యమ్మహాత్ముండు సనియె నాకృతద్యుతి యనుదేవి గర్భంబు ధరియించి నవమాసావసానంబునం గుమారునిం గనియె నాకాలంబున రాజును సమస్తభృత్యామాత్యజనంబులుఁ బరమానందంబుఁ బొంది రపుడు చిత్రకేతుండు కృతస్నానుం డై సకలభూషణభూషితుం డై సుతునకు జాతకర్మంబు నిర్వర్తించి బ్రాహ్మణులకు నపరిమితహిరణ్యరజతదానంబులు వస్త్రాభరణంబులును గ్రామంబులును గజంబులును వాహనంబులును ధేనువులును నాఱేసియర్బుదంబుల(ద్రవ్యంబును) దానంబు సేసి ప్రాణిసముదయంబునకుం బర్జన్యుండునుంబోలెఁ దక్కినవారలకు నిష్టకామంబులు వర్షించి పరమానందహృదయుం డై యుండెఁ గుమారుండును మాతృపితృబంధుజనంబులకు సంతోషంబు సేయుచు దినదినప్రవర్ధమానుం డై పెరుఁగు చుండె నంతం బుత్రమోహంబునం గృతద్యుతియందు బద్ధానురాగుం డై మహీధవుండు వర్తించుచుండం దక్కినభార్యలు సంతానసంతోషవికల లై యీమోహంబునకుం గారణంబు పుత్రుండ యని యీర్ష్యం జేసి దారుణచిత్త లై కుమారునకు విషంబుఁ బెట్టించిన సుఖనిద్రితుండునుంబోలె బాలుండు మృతిఁ బొందె నప్పుడు వేగుటయు దాది బోధింపం జని యాకుమారునివికృతాకారం

1. డైనబ్రహ్మపుత్రుండు.

బుఁ జూచి విస్మయశోకభయార్త యై పుడమిం బడి యాక్రందించె నప్పుడు.

తరలము. పుడమి నిట్టకనిల్వనం బడి పొక్కుచుం గడుదీన యై
యడఁకు వేమియు లేనివాక్కుల నావు రంచు విలాపమం
[1]దెడరు దోఁప భృశాతురోన్నతి నేడ్చినన్ విని భీతితోఁ
గడుపు బిట్టవియంగ భూపతికాంత గ్రక్కున నేఁగుచున్. 451

ఆ. బాలుఁ డొక్కరుండు పరిణామశీలుండు, వంశకర్త తపసివరమువలనఁ
బుట్టి మిన్న కట్లు వాలిసి యున్నట్టియా, కొడుకుఁ జూచి తల్లి యడలఁజొచ్చె.

ఉ. కుంకుమరాగరమ్యకుచకుంభములం గడుఁ గజ్జలంబుతోఁ
బంకిల మైనబాష్పములపాల్పడ మజ్జన మాచరించుచుం
గంకణపాణిపల్లవయుగంబున వక్షము మోఁదికొంచు నా
పంకరుహాక్షి యేడ్చెఁ బరిభావితపంచమసుస్వరంబునన్. 453

క. ఆయార్తరవమునకు భూ,నాయకుఁడు భయంబు నొంది నయ ముడిగి సుతున్
డాయఁగ వేగంబునఁ జని, పాయనిమోహంబుతోడ బాలునిమీఁదన్. 454

స్రగ్విణి. వ్రాలి యోపుత్ర నీవార్త దంభోళియై, కూలఁగా వ్రేయకీ కొద్దిననేటికిన్
జాలి నొందించె నాజాడ యిం కెట్టిదో, తూలుమీతల్లికిన్ దుఃఖ మెట్లాఱునో.

వ. అని తల మొల యెఱుంగక పలవించుచు భృత్యామాత్యబంధుజనంబులం గూడి యడలుచు నున్న యారాజుదుఃఖం బెఱింగి యంగిరసుండు నారదునితోడం గూడి చనుదెంచి మృతుం డైనపుత్రునిపదతలంబున మృతుండునుంబోలెఁ బడియున్న యారాజుం గనుంగొని యి ట్లనియె. 456

సీ. నీకు వీఁ డెవ్వఁడు నీ వెవ్వనికి శోక, సంతాప మందెదు సార్వభౌమ
పుత్రమిత్రాదులు పూర్వజన్మంబున, నెవ్వనివారలో యెఱుఁగఁ గలవె
మొదల నదీవేగమున నాడ కాడకు, సికతంబు గూడుచుఁ జెదరు చుండు
నారీతిఁ బ్రాణుల కతికాలగతిచేతఁ, బుట్టుట చచ్చుట పొసఁగు చుండుఁ

ఆ. గాన భూతములకుఁ గలుగు భూతంబులు, మమతతోడ విష్ణుమాయఁ జేసి
దీని కడల నేల ధృతిఁ దూలఁగా నేల, బుద్ధిఁ దలఁప వలదె భూతసృష్టి. 457

వ. మఱియు నేము నీవును దక్కినవారలును బ్రవర్తమానకాలంబునం గలిగినజన్మంబు నొంది మృత్యువువలన విరామంబు నొందం గలవార మై యిపుడ లేక పోవుదుము చావుపుట్టువులకు నిక్కువంబు లే దీశ్వరుండు దనమాయచేత భూతజాలంబులవలన భూతంబులం బుట్టించు వాని నాభూతంబులచేతన రక్షించు వాని నాభూతంబులచేతన హరించు స్వతంత్రంబు లేనితనసృష్టిచేత బాలుండునుం బోలె నపేక్ష లేక యుండు దేహి యైనపితృదేహంబుచేత దేహి యైనపుత్రదేహంబు మాతృదేహంబువలనం గలుగు చుండు నాప్రకారంబున బీజంబువలన

---

1 దెసఁదఁ దోఁప-దెడము లేక.

బీజంబు పుట్టుచుండ దేహికి నివి శాశ్వతంబై జరుగుచునుండుఁ బూర్వకాలంబున [1]సామాన్యవిశేషంబులు సన్మాత్రంబైన వస్తువులం దేవిధంబునం గల్పింపంబడియె నా ప్రకారంబున దేహంబునకు జీవునకు నన్యోన్యవిభాగంబు (పూర్వకాలంబున) నజ్ఞానకల్పితం బయ్యె [2]జన్మఫలంబులను జూచుచున్న వారికి దహనక్రియల నగ్ని పెక్కురూపంబులం గానంబడుభంగి నొక్కండైనజీవుండు పెక్కుభంగుల వెలుంగుచుండు నివి యన్నియు నాత్మజ్ఞానంబు సాలక దేహి దేహసంయోగంబు స్వప్నంబునందు భయావహం బైనప్రయోజనంబు నడపుచుండి మేల్కాంచి యాస్వప్నార్థం బైనప్రయోజనంబు తనది గాదని యెఱుంగుభంగి జీవుండే తానని జ్ఞానగోచరుం డైనవాఁ డెఱుంగుం గావున నన్నియును మనోమాత్రం బని తెలిసి మోహతమంబు వాసి భగవంతుం డైనవాసుదేవునియందుఁ జిత్తంబు వెట్టి నిర్మలాత్మకుండ వగు మని బోధించినఁ జిత్రకేతుండు లేచి వారల కిట్లనియె.

సీ. యతివేషములు పూని | యతిగూఢగతి నిందు, నేతెంచినట్టిమీ | రెవ్వరయ్య
కడఁగి [3]నన్ బోలిన | గ్రామ్యబుద్ధుల నెల్ల, బోధింప వచ్చిన | పుణ్యమతులొ
రమణఁ గుమార నా | రద [4]ఋషభాదులొ, దేవలాసితు లను | ధీరమతులొ
వ్యాస వసిష్ఠ [5]దు | ర్వాసో మృకండుజ, గౌతమ శుక రామ | కపిలమునులొ
తే. యాజ్ఞవల్క్యుండుఁ దరణియు | నారుణియును, జ్యవనరోమశు లాసురి | జాతుకర్ణ
దత్త మైత్రేయ వరభర | ద్వాజబోధ్య, పంచశిఖులొ పరాశర | ప్రభృతిమునులొ.
క. వీరలలో నెవ్వారు సుర,చారణగంధర్వసిద్ధ | సంఘంబులలో
వారలొ యీసుజ్ఞానము, కారణ మై యెవరియందుఁ | గలదు తలంపన్. 460
క. పొందుగ గ్రామ్యపశుత్వముఁ, బొంది మహాశోకతమత | బ్రుంగిననాకున్
ముందఱ దివ్యజ్ఞానముఁ, జెందించినవారి మిమ్ముఁ | జెప్పుడు తెలియన్. 461

వ. అనిన నంగిరసుం డిట్లనియె నేను బుత్రకాంక్షి వైననీకుఁ బుత్రుం బ్రసాదించినయంగిరసుండ నితండు బ్రహ్మపుత్రుం డయిననారదభగవంతుండు దుస్తరం బైనపుత్రశోకంబున మగ్నుండ వైననిను ననుగ్రహించి పరమజ్ఞానం బుపదేశింప వచ్చితిమి నీదుఃఖం బెఱింగి పుత్రు నిచ్చితిమేనిఁ బుత్రవంతు లైనవారితాపంబు నీచేత ననుభవింపంబడు నీప్రకారంబున లోకంబున సతులును గృహంబులును సంపదలును శబ్దాదు లయినవిషయంబులును రాజ్యవైభవంబును జంచలంబులు మఱియు రాజ్యంబును భూమియును బలంబును ధనంబును భృత్యామాత్యసుహృజ్జనంబులును మొదలైనవి శోకమోహభయపీడితులం జేయుచుండుఁ గాని సుఖంబుల నీ నేరవు గంధర్వనగరంబునుంబోలె స్వప్నలబ్ధమనోరథంబు

1 'జాతివ్యక్తివిభాగంబులఁ దన్మాత్రంబు లైన. 2 దారువికారంబు లైన దీర్ఘత్వవక్రత్వాదు లగ్నియందుఁ గానంబడుభంగి నసద్ధర్మంబు లయిననానాత్వంబును క్షయవృద్ధులును క్రియాఫలంబుం జూచుచున్నయాత్మయందుఁ గానంబడు. 3 నన్బోఁలైన. 4 శిరాంగిరసదేవలా. 5 దుర్వాసమార్కండేయ.

నుంబోలె నర్థంబును బాసి కానంబడుచు మనోభవంబు లయిన యర్థంబులం గూడి స్వార్థంబు లై కానంబడ నేరవు కర్మంబులచేత ధ్యానంబులు సేయుచుండు [1]మనంబులు నానాకర్మంబు లగుచు నుండు నీదేహి దేహంబు ద్రవ్యజ్ఞానక్రియాత్మకంబై దేహికి వివిధక్లేశసంతాపంబులం జేయుచుండుం గావున నీవు నిర్మలం బయి నమనంబుచేత నాత్మగతి [2]వెదకి ధ్రువం బయినపదవి నొందు మనియె నప్పుడు నారదుం డిట్లనియె నుపనిషద్గోప్యం బగు నేనిచ్చుమంత్రంబె వ్వండేని సప్తరాత్రంబులు పఠియించు నతండు సంకర్షణుం డై నభగవంతునిం జూచు నెవ్వనిపాదమూలంబు సర్వాశ్రయం బై యుండు నట్టిశ్రీమన్నారాయణునిపాదంబులు సేవించి యీమోహంబు వదలి యతిశీఘ్రంబున నుత్తమపదంబు నొందు మిప్పు డిక్కుమారునకు నీకును బ్రయోజనంబు గల దేనిం జూడు మని నారదుండు మృతబాలునికళేబరంబుఁ జూచి యోజీవుండ నీకు శుభం బయ్యెడు మిందుఁ బ్రవేశించి మీతల్లిదండ్రుల బంధుజనులం జూచి వీరలదుఃఖంబు లార్చి యీకళేబరంబునందుఁ బ్రవేశించి యాయుశ్శేషంబు ననుభవించి పిత్రధీనం బైనరాజ్యాసనంబునఁ గూర్చుండు మనిన నబ్బాలుం డి ట్లనియె. 462

తే. కర్మవశమున నెందు సుఖంబు లేక, దేవతిర్యఙ్నృయోనులఁ । దిరుగునాకు
వెలయ నేజన్మమందునో । వీరు తల్లి,దండ్రు లయినారు చెప్పవే । తాపసేంద్ర.

తే. బాంధవజ్ఞాతిసుతులును । బగతు రాత్మ,వరు లుదాసీనమధ్యస్థ । వర్గములును
సరవి[3]గనుచుందురొక్కొక్క । జన్మమునను, నెఱయఁ బ్రాణికినొకవావి । నిజముగలదె.

తే. రత్నములు హేమములు నను । రాగలీల
నమ్మకంబుల నీవల । నావల నగు
భంగి నరులందు జీవుండు । ప్రాప్తుఁ డగుచు
నెలమిఁ దిరుగుచు నుండుఁ దా । నెందుఁ జెడఁడు. 465

సీ. ఒక్కఁడై నిత్యుఁడై । యొక్కఁడుఁ గడలేక, సొరిది జన్మాదుల । శూన్యుఁ డగుచు
సర్వంబునం దుండి । సర్వంబుఁ దనయందు, నుండంగ సర్వాశ్ర । యుండు దనంగ
సూక్ష్మమై స్థూలమై । సూక్ష్మాధికములకు, సామ్యమై స్వప్రకా । శమున వెలిఁగి
యఖిలంబుఁ జూచుచు । నఖిలప్రభావుఁడై, యఖిలంబు దనయంద । యడఁచికొనుచు

తే. నాత్మమాయాగుణంబుల । నాత్మమయము
గాఁగ విశ్వంబుఁ దనసృష్టి । [4]ఘనతఁ జెందఁ
జేయు చుండును సర్వసం । జీవనుండు
రమణ విశ్వాత్ముఁ డయిననా । రాయణుండు. 466

క. సతు లెవ్వరు సుతు లెవ్వరు, పతు లెవ్వరు మిత్రశత్రు । బంధుప్రియసం

---

1 మనంబునకు-నానాకర్మంబులు గలుగుచుండు-నాకరంబులగుచుండు. 2 వెదకి ద్వైతభ్రాంతి విడిచి ధ్రువం బయిన. 3 నగుచుండు-దగుచుండు. 4 ఘటన నొంద.

గతు లెవ్వరు సర్వాత్మక, గతుఁడై గుణసాక్షి యైన ఘనుఁ డొక్కనికిన్. 467

చిత్రకేతుండు తపం బాచరించి భగవత్ప్రసాదంబు నొందుట.

వ. మఱియు సుఖదుఃఖంబులం బొందక సర్వోదాసీనుం డై పరమాత్మ యై యుండు నప్పరమేశ్వరరూపుండు నయిననాకును మీకు నెక్కడిసంబంధంబు మీకు దుఃఖంబునకుం బని లేదని పలికి యాజీవుండు వోయినం జిత్రకేతుండును బంధువులు నతివిస్మితచిత్తులై శోకంబులు విడిచి మోహంబులం బాసి యమునానదియందు నక్కుమారునకు నుత్తరకర్మంబులు [1]నిర్వర్తించిరి చిత్రకేతుండు గాఢపంకంబునం బడి వెడలిన యేనుంగునుంబోలె గృహాంధకూపంబునందుండి వెడలి కాళిందీనదికిం బోయి యందు విధిపూర్వంబుగఁ గృతస్నానుండై మౌనంబుతోడ నారదునకు నమస్కరించిన నతండు ప్రసన్నుండై భగవన్మంత్రంబు విధిపూర్వకంబుగా నతనికి నుపదేశించి యంగిరసుతోడం గూడి బ్రహ్మలోకంబునకుం జనియెఁ జిత్రకేతుండును నారదోపదేశమార్గంబున నిరాహారుండై సమాధినియతుండై నారాయణరూపం బయినయావిద్య నారాధించి సప్తరాత్రాంతంబున నప్రతిహతం బయినవిద్యాధరాధిపత్యంబును భాస్వద్రత్నదివ్యవిమానంబునుం బడసి నారాయణానుగ్రహంబునుం బొంది మనోగమనంబునం ద్రిజగంబులం జరియించుచుండఁ గొన్నిదినంబులకు నొక్కచోట. 468

సీ. తారహారపటీరధవళదేహమువాని, రమణీయనీలాంబరంబువాని
మణికిరీటస్ఫురన్మస్తకంబులవానిఁ, గంకణకేయూరకరమువానిఁ
గర్బురమయదీప్తకటిసూత్రములవానిఁ, దరళయజ్ఞోపవీతములవానిఁ
నతిసుప్రసన్నవక్త్రాంబుజంబులవానిఁ, దరుణవిస్తృతనేత్రములవాని

ఆ. సిద్ధమండలంబు సేవింపఁ బుణ్యప్రసిద్ధి వెలసినట్టియుద్ధచరితుఁ
బద్మలోచనునకుఁ బాదపీఠంబైన, ఘనునిఁ బన్నగేంద్రుఁ గాంచె నతఁడు.

ఆ. కన్నమాత్ర నతఁడు కల్మషంబులఁ బాసి, విమలచిత్తుఁ డగుచు విశదభక్తి
నిట్టరోమములకుఁ బట్టగు చానంద, బాష్పనేత్రుఁ డగుచుఁ బ్రణుతి సేసె.

క. సంతోషాశ్రులచేత న, నంతునిఁ బరిషిక్తుఁ జేసి యతఁడు ప్రమోదం
బెంతయు సరికట్టిన నొక, కొంతయుఁ బలుకంగ లేక కొండొకవడికిన్. 471

చ. మది నొకయింతమాత్రము సమంబుగఁ జేయుచు బాహ్యవర్తనం
గదిసినయింద్రియంబుల [2]నొకంతకుఁ దెచ్చి వచోవిలాసముల్
గుదురుగఁ ద్రోచి తత్త్వమునఁ గూర్చుచు [3]శాశ్వతవిగ్రహంబు నా
సదయుఁ బ్రశాంతు లోకగురు సన్నుతి సేయఁ దొడంగె నిమ్ములన్. 472

---

1 నిర్వర్తించి రాభూపాలుభార్యలు బాలహత్యాదోషంబు బ్రాహ్మణోత్తమనిరూపితవ్రతంబున నివర్తించి రంత. 2 వికారము మాన్చి. 3 సాత్వతవిగ్రహంబు.

క. అజితుఁడ వై భక్తులచే, విజితుఁడ [1]వైనాఁడ విపుడు వేడుక వారల్
విజితులు నీచేఁ గోర్కులు, భజియింపనివారు నిన్నుఁ బడయుదురె హరీ. 473

ఉ. నీవిభవంబు లీజగము నిండుట యుండుట నాశ మొందుటల్
నీవిమలాంశజాతములు నెమ్మి జగంబు సృజించువార లో
దేవ భవద్గుణాంబుధుల తీరముఁ గానక యాశ బుద్ధితో
వావిరిఁ జర్చ సేయుదురు వారికి వారలు దొడ్డవార లై. 474

క. పరమాణువు మొదలుగఁ గొని, పరమము తుది గాఁగ మధ్యపరికీర్తనచే
స్థిరుఁడవు త్రయీవిదుఁడ వై, సరి సత్త్వాద్యంతమధ్యసద్భావగతి వై. 475

తే. ఉర్వి మొదలైనయేడు నొండొంటికంటె, దశగుణాధిక మై యుండు దాని నండ
కోశమందురజాండంబుకోటులెవ్వ, నందు నణుమాత్రమగుననంతాఖ్యుఁడతఁడు.

వ. మఱియు నొక్కచోట విషయతృష్ణాపరు లైన నరపశువులు పరతత్త్వంబ వైన నిన్ను మాని యైశ్వర్యకాము లై తక్కిన దేవతల భజియింపుదురు వారిచ్చు సంపదలు రాజకులంబునుంబోలె వారలం గూడి నాశంబునం బొందుచుండు విషయకాము లేని నిన్ను సేవించి రేని వేఁచినవిత్తనంబునుంబోలె దేహాంతరోత్పత్తి నొందకుండుదురు నిర్గుణుండ వై (జ్ఞానవిజ్ఞానరూపంబు నొందియున్ననిన్ను గుణసమేతునింగా జ్ఞానులు భావింపుదురు) నీభజనం బేరూపున నయిన మోక్షంబు ప్రసాదించు జితమతి వైననీవు భాగవతధర్మం బేప్రకారంబున నిర్ణయించితి వా ప్రకారంబున సర్వోత్కృష్టుండ వయిననిన్ను సనత్కుమారాదులు మోక్షంబు కొఱకు సేవించుచున్నారీభాగవతధర్మంబునందు జ్ఞానహీనుం డొక్కండును లేఁడన్యకామ్యధర్మంబులందు విషమబుద్ధిచేత నేను నీవు నాకు నీకు నని [2]వచియించుచున్నవాఁ డధర్మనిరతుం డై క్షయించుచుండు స్థావరజంగమప్రాణిసమూహంబునందు సమం బైనభాగవతధర్మంబుల వర్తించుచున్నమనుజునికి భవద్దర్శనంబువలనఁ బాపంబు క్షయించుట యేమిచిత్రం బిపుడు భవత్పాదావలోకనంబున నిరస్తాశయమలుండ నైతి మూఢుండ నయిననాకుఁ బూర్వకాలంబున నారదుం డనుగ్రహించి భగవద్ధర్మంబు దయసేసె నది నేఁడు నాకు వరదుండ వైననీకతంబున దృష్టం బయ్యె ఖద్యోతంబులచేత సూర్యుండు గోచరుండు గాని మాడ్కి జగదాత్మకుండ వైననీమహత్త్వంబు మనుజులచేత నాచరింపంబడి ప్రసిద్ధం బైనది గా దుత్పత్తిస్థితిలయకారణుండ వై భగవంతుండ వైననీకు నమస్కరించెద నని మఱియును. 477

తే. అరయ బ్రహ్మము లెవ్వనిననునయించి, భక్తియుక్తుల భయమునఁ బ్రస్తుతింతు
రవని యెవ్వనితలమీఁద నావగింజఁ, బోలు నావేయుశిరములఁ బోఁగిఁ గొల్తు.

---

1 'వై యుంటివిపుడు వేడుకతోడన్, విజితాత్ము లగుచుఁ గోర్కులు, భజియింపనివారు నిన్నుఁ బడయుదురు హరీ. 2 రచియింపఁబడు మన్న.

క. ఈవిధమున వినుతింపఁగ, నావిద్యాధరులభర్త కనియె ననంతుం
డో విమలబుద్ధి నీదగు, ధీవిభవంబునకు మెచ్చితిం బ్రియ మారన్. 479

ఆ. అరయ నారదుండు నంగిరసుండును, దత్త్వ మొసఁగినారు దానికతన
నన్నుఁ జూడఁ గల్గె నాభక్తిమదిఁ గల్గె, నాపథంబు నీకు నమ్మఁ గలిగె. 480

సీ. పూని నారూపంబు భూతజాలంబులు, భూతభావనుఁడ నేఁ బొందువడఁగ
బ్రహ్మంబు మఱియు శబ్దబ్రహ్మమును శాశ్వతం బైనతనువులు దగిలె నాకు
నఖిలలోకములందు ననుగతం బై యుండు, లోకంబు నాయందు లోకఁజెందు
నుభయంబు నాయందు నభిగతం బై యుండు, నఖిలీనమగుదు నియ్యుభయమందు

తే. వెలయ నిద్రించువాఁడాత్మ విశ్వమెల్లఁ, జూచి మేల్కాంచి తా నొక్క చోటివానిఁ
గా వివేకించుమాడ్కి నీ [1]జీవితేశ, మాయ దిగనాడి పరమధర్మంబుఁ దెలియు.

ఆ. నిద్రపోవువేళ నిరతుఁడై దేహి దా, నెట్టిగుణముచేత నింద్రియములఁ
గడచినట్టిసుఖముఁ గను నట్టిబ్రహ్మంబుఁ, గడిమి మెఱయ నన్నుఁ గా నెఱుంగు.

ఆ. స్వప్నమందు నెట్లు సంచార మొనరించు, మేలుకాంచి [2]దృష్ట మోలి నెఱుఁగు
నుభయ మెఱుఁగునట్టియుత్తమజ్ఞానంబు, తత్త్వ మట్టిదై నతలఁపు నేను.

సీ. అరయంగ నెవ్వని కలవి గానట్టియా, నలలితమానుషజాతిఁ బుట్టి
యాత్మతత్త్వజ్ఞానహేతుఁడై నవానికిఁ, గలుగునె యెందు సుఖం బొకింత
వెలయఁ బ్రవృత్తినివృత్తిమార్గంబుల, సుఖములు దుఃఖంబు సొరిదిఁ దెలిసి
పనిచెడిసంకల్పఫలమూలమునఁ బాఱు, కడు సుఖదుఃఖమోక్షములకొఱకు

ఆ. దంపతిక్రియామతంబు వర్తింతురు, దాన మోక్ష మేల దక్కి యుండు
నఖిలదుఃఖహేతు వయినయాకర్మంబు, నెఱిఁగి నన్నుఁ దలఁపరిచ్చలోన.

వ. మఱియు విజ్ఞానాభిమాను లయినమనుష్యులకు నతిసూక్ష్మం బయినయాత్మగతి నిజస్థానత్రయలక్షణంబునఁ జతుర్థాంశంబు నెఱింగి యైహికాముష్మికవిషయంబులచేతను [3]వివేకబలంబులచేతను నియుక్తుం డై జ్ఞానవిజ్ఞానసంతృప్తుం డై నపురుషుండు నాకు భక్తుం డగు నీవిధంబులు గలవారలు యోగనైపుణబుద్ధి గలవారలు నై స్వార్థం బయినయాత్మచేతం బరమాత్మను దెలియుచుందురు నీవునిక్రమంబున మద్భక్తిశ్రద్ధాపరుండవై విజ్ఞానసంపన్నంబు లైనవాక్కులచేత నన్ను స్తోత్రంబు సేసి ముక్తుండవైతి వని యాశేషభగవంతుండు విద్యాధరపతి యైన చిత్రకేతుం బలికి యతని కదృశ్యుం డై పోయె నేదిక్కున సర్వాత్మకుం డై నయనంతుం డంతర్ధానంబు నొందె నాదిక్కునకు విద్యాధరభర్త నమస్కరించి గగనచరుం డై చని లక్షలసంఖ్య లైనదివ్యవర్షంబు లవ్యాహతబలేంద్రియుం డై పరమయోగిపురుషులును దివ్యమునీంద్రులును సిద్ధచారణగంధర్వులును వినుతి సేయం గులద్రోణాదిశైలంబులను రమ్యప్రదేశంబులను సంకల్పసిద్ధప్రదేశంబు

1 జీవదేశ. 2 దృష్ట మెల్ల. 3 నిర్ముక్తు లై జ్ఞానవిజ్ఞాన.

లను వినోదించుచు శ్రీనారాయణదత్తం బగుదివ్యవిమానంబునందుఁ జరియిం
చుచు నుండె. 484

శా. ఆడించున్ హరిదివ్యనాటకగుణవ్యాపారనృత్యంబులం
బాడించున్ జలజాతనేత్రబిరుదప్రఖ్యాతగీతంబులం
గూడించున్ సతతంబు జిహ్వలతుదిన్ గోవిందనామావళుల్
[1]క్రీడం గిన్నరయక్షకామినులచేఁ గృష్ణార్పితస్వాంతుఁడై. 485

సీ. వాసించు నాత్మఁ బో వైష్ణవజ్ఞానంబు, నాశించు భాగవతార్చనంబు
భూషించు నేప్రొద్దుఁ బుండరీకాక్షుని, భాషించు హరికథాపాళి మెఱసి
ఘోషించు హరినామగుణనికాయంబులు, పోషించుఁ బరతత్త్వబోధ మరసి
సేవించు శ్రీకృష్ణసేవకాసక్తంబు, సుఖమునఁ జేయు నీశునకు బలులు
తే. పాడుఁ బాడించు వైకుంఠభర్తనటన,రూపవర్తనగుణనామదీపితోరు
గీతజాతప్రబంధసంగీతవిధులఁ, గేశవప్రీతి గాఁ జిత్రకేతుఁ డపుడు. 486

చిత్రకేతుం డీశ్వరధిక్కారంబున గౌరిచే శాప మొందుట.

మ. హరిఁ గీర్తించుచు నల్లనల్ల మదిలో నబ్జాక్షు [2]సేవించుచుం
బరమానందము నొందుచున్ జగములం బ్రఖ్యాతి వర్తించుచున్
సురరాజోపమమూర్తి యక్షగణముల్ సొంపార విద్యాధరా
ప్సరసల్ గొల్వఁగఁ బాడఁగా సితగిరిప్రాంతంబున న్నేఁగుచున్. 487

శా. ఆవిద్యాధరభర్త గాంచె హరనీహారామృతాహాసమున్
శ్రీవిభ్రాజితమున్ నిరస్తగిరిజాసేవాగతాయాసమున్
దేవానీకవికాసమున్ శుభమహాదేవాంఘ్రిసంవాసమున్
భూవిఖ్యాతవిలాసముం ద్రిభువనీపూతంబుఁ గైలాసమున్. 488

క. ఆరజతభూధరంబున, నీరజభవామరాదినికరము గొల్వం
బేరోలగమున నుండిన,గౌరీయుతుఁ డయినహరునిఁ గనియె నరేంద్రా. 489

సీ. తననిజరూప [3]మింతయు నున్కి దెలియక, వాదంబు సేసెడువేదరవముఁ
గరుణావలోకనాకాంక్షితులై యున్న,బ్రహ్మాదిసనకసంప్రణుతిరవము
సారశివానందసల్లాపముల నొప్పు,ప్రమథగణాళియార్భటరవంబు
డమరుమృదంగాదిఘుమఘుమధ్వనితోడి,పటుభృంగినాట్యవిస్ఫారరవము
తే. మానుగాఁ జామరలు వీచుమాతృకాది, కామినీజనమహితకంకణరవంబు
మెండుఁ జెలఁగఁగఁ గన్నులపండువయ్యెఁ, గొండరాచూలిపెనిమిటినిండుకొల్వు.

వ. ఇట్లు బ్రహ్మాదిసురనికరసేవితుం డై యాఁపుపీఠంబున నున్నభవానిం గౌఁగిటం
జేర్చికొని యొడ్డోలగంబున నున్నపరమేశ్వరుం జూచి చిత్రకేతుండు పకపక
నగి యద్దేవి వినుచుండ ని ట్లనియె. 491

---

1 గ్రీడించున్ నరయక్ష. 2 నీక్షించుచుం. 3 మింతం తని.

సీ. కొమ రొప్పఁగా లోకǂగురుఁడును గడ లేని, ధర్మస్వరూపంబుఁ ǂ దాన యగుచు
జడలు ధరించియు ǂ సరిలేనితపమునఁ, బొడ వైనయాయోగిǂపుంగవులును
బ్రహ్మవాదులుఁ గొల్వ ǂ భాసిల్లుకొల్వులో, మిథునరూపంబున ǂ మెలఁతతోడఁ
బ్రాకృతుండునుబోలె ǂ బద్ధానురాగుఁ డై, లాలితుం డయ్యె నిǂర్లజ్జత నిట
ఆ. నకట ప్రకృతిపురుషుఁ ǂ [1]డైనఁ దానేకాంత,మందు సతులతోడǂ నలరుఁ గాని
యిట్లు ధర్మసభల ǂ నింతులతోఁ గూడి, పరిభవింపలేఁడు ǂ భ్రాంతి నొంది. 492
క. అన విని సర్వేశ్వరుఁ డా,తని నేమియు ననక నవ్వి ǂ తత్సభవారల్
గనుఁగొన నూరక యుండెను, మనుజేశ్వర యీశుధైర్యǂమహిమ మెట్టిదియో.
వ. ఇట్లు దనపూర్వకర్మశేషంబున నింద్రియజయుండ నని పుట్టినయహంకారంబున జగద్గురువుం బెక్కు ప్రల్లదంబు లాడుచున్న చిత్రకేతుం జూచి భవాని యిట్లనియె.
క. మముబోఁటిలజ్జ లుడిగిన,కుమతులకుం గర్త యగుచుఁ ǂ గోపింపంగా
నమితాజ్ఞానిపుణుం డగు,శమనుండా వీఁడు నేఁడు ǂ జగముల కెల్లన్. 495
క. భృగునారదకపిలాదులు, నిగమాంతజ్ఞులును యోగǂనిర్ణయనిపుణుల్
త్రిగుణాతీతు మహేశ్వరు, నగ రెన్నఁడు వారు ధర్మǂనయ మెఱుఁగ రొకో.
సీ. ఎవ్వనిపదపద్మ ǂ మింద్రాదివిబుధుల,చూడాగ్రపంక్తులǂనీడఁ గాంచు
నెవ్వనితత్త్వంబ ǂ దెనయంగ బ్రహ్మాది, యోగిమానసపంక్తి ǂ నోల లాడు
నెవ్వనిరూపంబు ǂ నేర్పాటు గానక, వేదంబు లందంద ǂ వాద మడుచు
నెవ్వనికారుణ్య ǂ మీలోకముల నెల్లఁ, దనిపి యెంతయు ధన్యǂతములఁ జేయు
తే. నట్టిసర్వేశుఁ బాపసంǂహారు ధీరు, శాశ్వతైశ్వర్యు నాత్మసంǂసారు నీశు
నెగ్గు వల్కినపాపాత్ముఁ ǂ డెల్లభంగి, దండనార్హుండు గా కెట్లు ǂ దలఁగఁగలఁడు.
తే. నిఖిలలోకాశ్రయంబు సంǂన్నిహితసుఖము, సకలభద్రైకమూలంబు ǂ సాధుసేవ్య
మైనకంజాక్షుపాదసǂద్వార్చనంబు, ననుచరింపంగ ఖలుఁడు వీఁ ǂ డర్హుఁ డగునె.
వ. కావున నోరిదురాత్మక యీపాపంబునం బాపస్వరూపం బైనరాక్షసయోనిం బుట్టు మని శపియించి యింతనుండి మహాత్ములకు నవజ్ఞ సేయ కుండు మని పలికినఁ జిత్రకేతుండు విమానంబు డిగ్గి వచ్చి యద్దేవికి దండప్రణామంబు లాచరించి కరకమలంబులు దోయిలించి యిట్లనియె నో జగన్మాతా భవచ్ఛాపవాక్యంబు లట్ల కైకొంటిఁ బ్రాచీనకర్మంబులం బ్రాప్తం బైనసంసారచక్రంబుచేత నజ్ఞానమోహితు లై తిరుగుచున్న జంతువులకు సుఖదుఃఖంబులు నైజంబు లై ప్రవర్తిల్లుచుండు నిందులకుఁ బరతంత్రు లైనవా రాత్మపరసుఖదుఃఖంబులకు నెవ్వారు కర్తలీగుణంబులనిమిత్త మై శాపానుగ్రహంబులును స్వర్గనరకంబులును సుఖదుఃఖంబులును సమంబులు భగవంతుం డొక్కండ తనమాయచేత జగంబు సృజియించుచుండు వారివారికి బంధాదిరాగంబులు గలుగంజేయుచుఁ దాను వానికిలోను

1 డైనను నేకాంత,సీమ సతులతోడఁ జెలఁగువాని.

గాక నిష్కళంకుండ వై యుండు నీవిధంబునం బుట్టుచున్న నరునకుం బత్నీబంధుశత్రుమిత్రోదాసీనత్వంబు లెక్కడివి వారివారికర్మవశంబునం బరమేశ్వరుండు గల్పించుచు సర్వంబునందు సర్వసముండ వై యుండునప్పరమేశ్వరునకు సుఖదుఃఖంబులచేత రాగంబు లేదు రాగానుబంధం బైనరోషంబును లేదతనిమాయాగుణవిసర్గంబు జంతువులకు సుఖదుఃఖంబులను బంధమోక్షంబులను గల్పించుచుండుం గావున నీకు నమస్కరించుచున్న నన్ను ననుగ్రహింపుము శాపభయశంకితుండం గాను జగన్మాత వైననిన్నుఁ బలికినరోషంబునకు శంకించుచున్నవాఁడ నని దండప్రణామంబు లాచరించి పార్వతీపరమేశ్వరులం బ్రసన్నులం జేసి తనవిమానం బెక్కి చనియె నప్పుడు పరమేశ్వరుండు బ్రహ్మాదిదేవర్షిదైత్యదానవప్రమథగణంబులు వినుచుండఁ బార్వతికి నిట్లనియె నీకు నిప్పుడు దృష్టం బయ్యెఁ గదా నారాయణదాసదాసానుచరులనిస్పృహభావంబు హరితుల్యార్థదర్శను లై నిస్పృహు లైనభాగవతులకు స్వర్గాపవర్గనరకభేదభావంబులు లేవు ప్రాణులకు దేహసంయోగంబువలన నారాయణలీలం జేసి యుండి ద్వంద్వాదిసుఖదుఃఖంబు లాత్మయందు నజ్ఞానంబున భేదంబు సేయంబడియె నిట్టివిపర్యయంబులు భగవంతుం డయినవాసుదేవునిభక్తి గలవారిం జెందవు మఱియును. 499

ఉ. నేనుఁ గుమారనారదులు నీరజగర్భుఁడు దేవసంఘముం
మానితయోగివర్యమునిమండలి మున్నగువార మెల్ల నా
దానవవిద్విడంశజనితంబుల మయ్యుఁ దదీయతత్త్వముం
గానఁగ నేర మీశు ఘనగర్వమునం దలపోసి చూచుచున్. 500

క. ఆతనికిం బ్రియుఁ డప్రియుఁ, డేతెఱువున లేఁడు నిఖిల మెల్లను దా నై
భూతముల కాత్మ యగుటయు, భూతప్రియుఁ డొక్కఁ డాదిపురుషుఁడు తన్వీ.

ఆ. అరయఁ జిత్రకేతుఁ డతిశాంతుఁ డతిలోక,సముఁడు విష్ణుభక్తిసంగతుండు
నితని నేమి సెప్ప నీశుండ నగునేను, నువిద యచ్యుతప్రియుండఁ జుమ్మి.

క. కావున భగవద్భక్తుల, భావమునకు విస్మయంబు పని లేదు మహా
ధీవిభవశాంతచిత్తులు, పావనపరతత్త్వనిపుణభవ్యులు వారల్. 503

వ. అనిన విని యద్రినందన విస్మయంబు మాని శాంతచిత్త యయ్యె నట్లు పరమభాగవతుం డయినచిత్రకేతుం డద్దేవికిం బ్రతిశాపం బియ్య సమర్థుం డయ్యును మరల శపింపక యతిశాంతరూపంబునఁ దచ్ఛాపంబు శిరంబున ధరియించె నిట్టిసాధులక్షణంబులు నారాయణపరాయణు లయినవారలకుం గాక తక్కొరులకుం గలుగ నేర్చునే యట్లు శాపహతుం డయినచిత్రకేతుండు త్వష్ట సేయుయజ్ఞంబున దక్షిణాగ్నియందు దానవయోనిం బుట్టి వృత్రాసురుం డన విఖ్యాతుం డయి భగవజ్జ్ఞానపరిణతుం డయ్యెం గావున. 504

సీ. నరనాథ యీవృత్రునకు రాక్షసాకృతి, గలిగినయీపూర్వ ◊ కారణంబు
చిరపుణ్యుఁ డయినట్టి ◊ చిత్రకేతుమహాను,భావంబు భక్తితోఁ ◊ బరఁగ విన్న
చదివినవారికి ◊ సకలదుష్కర్మముల్, శిథిలంబు లై కడుఁ ◊ జెదరి పోవు
సకలవైభవములు ◊ సమకూరుఁ దమయంతఁ, దొల్కాడుకోర్కులతోడఁగూడి
ఆ. నిర్మలాత్ము లగుచు ◊ నిత్యసత్యజ్ఞాన, నిరతు లగుచు విగత ◊ దురితు లగుచు
బంధుమిత్రపుత్ర ◊ పౌత్రాదులను గూడి, యనుభవించు చుందు ◊ రధికసుఖము.

—సవితృవంశప్రవచనాదికథ.—

సీ. వినవయ్య నరనాథ ◊ విశదంబుగాఁ ద్వష్టృ,వంశంబు సెప్పితి ◊ వానివెనుక
సవితృండు పృశ్నియు ◊ సావిత్రి వ్యాహృతి, యనుభార్యలందు నిం ◊ పారు వేడ్క
నగ్నిహోత్రంబుల ◊ నరయంగఁ బశుసోమ,పంచయజ్ఞంబులఁ ◊ బరఁగఁ గనియె
భగుఁడు సిద్ధిక యను ◊ భార్యకుమహిమాను,భవులవిభవులఁ దాఁ ◊ బడసె మువ్వురఁ
ఆ. దనయ నొకతెఁ గాంచెఁ ◊ దదనంతరమున నా, తరళనేత్ర [1]సద్వ్రత ◊ స్వధామ
పుణ్యశీల సుగుణ ◊ పూరితచారిత్ర, యఖిలలోకపూజ్య ◊ యాశిషాఖ్య. 506

వ. మఱియు ధాతకుఁ గల కుహూ సినీవాలీ రా కానుమతు లనియెడునలువురుభార్య
లలోఁ గుహూదేవి సాయ మనుసుతునిం గాంచె సినీవాలీ దర్శాఖ్యునిం బడసె
రాక ప్రాతరాఖ్యునిఁ గాంచె ననుమతి పూర్ణిమాఖ్యునిఁ గనె విధాత క్రియ యను
భార్యయందు నగ్నిపురీష్యాదులం గనియె వరుణునకుఁ జర్షణి యనుభార్యయందుఁ
బూర్వకాలంబున బ్రహ్మపుత్రుం డయినభృగువును వల్మీకంబునం జనియించిన
వాల్మీకియు నుదయించిరి మిత్రావరుణులకు నూర్వశియందు రేత ఉద్గమం బైన
దానిఁ గుంభంబునం బ్రవేశింపం జేయ నందు నగస్త్యుండును వసిష్ఠుండును జని
యించిరి ప్రత్యేకంబ మిత్రునకు రేవతియందు నుత్సర్గసంభవు లైనయరిష్టయుఁ
బిప్పలుండును ననువారలు జనియించిరి శక్రునకుఁ బౌలోమియందు జయంతఋ
షభవిదుషు లన ముగ్గురు పుట్టిరి వామనుం డయినయురుక్రమదేవునకుఁ గీర్తి య
నుభార్యయందు బృహచ్ఛ్లోకుండు పుట్టె నాబృహచ్ఛ్లోకునకు సౌభగాదులు పుట్టిరి
మఱియు మహానుభావుం డయినకశ్యపప్రజాపతికి నదితియందు శ్రీమన్నారా
యణుం డవతరించినప్రకారంబు వెనుక వివరించెద దితిసుతు లైనదైతేయుల
వంశంబు సెప్పెద నాదైతేయవంశంబునం దైనను బ్రహ్లాదబలులు పరమభాగవ
తు లై దైత్యదానవవందితు లై వెలసిరి దితికొడుకులు హిరణ్యకశిపుహిరణ్యాక్షు
లనఁ బ్రసిద్ధి నొంది రందు హిరణ్యకశిపునకు జంభాసురతనయ యైనదత్తకుఁ బ్ర
హ్లాదానుహ్లాదసంహ్లాదహ్లాదు లనునలుగురుకొడుకులును సింహిక యనుకన్యకయు
జన్మించి రాసింహికకు రాహువు జనియించె నారాహువుశిరం బమృతపానంబు సే
య హరి దనచక్రంబునం ద్రుంచె సంహ్లాదునకు గతి యనుభార్యయందుఁ బంచ

1 'సద్వ్రతైకధామఁ, బుణ్యశీల సాధ్విఁ బూతచారిత్రను, దనర శర్మిణి యనెడు) దాని నతఁడు' (వా. ప్ర.

జనుండు వుట్టె హ్లాదునకు దమని యనుభార్యయందు వాతాపిల్వలులు వుట్టిరి వా
రల నగస్త్యుండు భక్షించె ననుహ్లాదునకు సూర్మి యనుభార్యయందు బాష్కల
మహిషులు గలిగిరి ప్రహ్లాదునకు దేవి యనుభార్యయందు విరోచనుండు వుట్టె
నతనికి బలి జన్మించె నాబలికి నశన యనుభార్యయందు బాణుండు జ్యేష్ఠుండు
గా నూర్వురు గొడుకులు వుట్టి రాబలిప్రభావంబు వెనుక వివరించెద బాణాసు
రుండు పరమేశ్వరు నారాధించి ప్రమథగణంబులకు ముఖ్యుం డయ్యె మఱియు
నాదితిసంతానంబు లగుమరుత్తు లేకోనపంచాశత్సంఖ్య గలవార లందఱు ననప
త్యులై యింద్రుతోఁ గూడి దేవత్వంబు నొందిరనిన విని పరీక్షిన్నరేంద్రుండు
శుకయోగీంద్రున కి ట్లనియె. 507

ఆ. ఏమికారణమున నింద్రునికిని మరు, చ్చయము నాప్త మగుచు శాంతి నొంది
యరయఁ దత్సమానతమగుచు వర్తించెను, దీని వినఁగ వలయుఁ దెలుపవయ్య.

వ. అనిన శుకుం డి ట్లనియె. 509

సీ. నరనాథ విను తనసంతను లందఱు, నమరేంద్రుచే హతు లగుచు నుండఁ
గోపశోకంబులఁ గ్రుస్సుచుఁ దనలోన, మండుచు దితి చాల మఱుఁగఁదొడఁగె
భ్రాతృహంతకుఁ డతిపాతకుం డీయింద్రుఁ, జంపక నా కేల సొంపు గలుగు
వీని భస్మము సేయువానిఁ గా నొకసుతుఁ, బడసెద నని చాల భర్తఁ గోరి

ఆ. ప్రియముసేయఁ దొడఁగెఁ బెక్కుభావంబుల, భాషణముల నధికపోషణములఁ
భక్తియుక్తిచేతఁ బరిచర్యగతిచేత, నుతులచేత నతుల రతులచేత. 510

చ. కలికికటాక్షవీక్షణవికారములన్ హృదయానురాగసం
కలితవిశేషవాఙ్మధురగర్జనలన్ లలితాననేందుమం
డలపరిశోభితామృతవిడంబితసస్మితసుప్రసన్నతా
ఫలరుచిరప్రధానముల భామిని భర్తమనంబు లోఁగొనెన్. 511

తే. అఖిల మెఱిఁగినకశ్యపు నంతవాని, హితవు తల కెక్కురతులసంగతులచేత
నవశుఁ గావించె వ్రేల్మిడి నబ్జవదన, పతుల భ్రమియింప నేరని సతులుఁ గలరె.

క. ఏతలఁ పెఱుఁగక నిలిచిన, భూతంబులఁ జూచి ధాత పురుషులమనముల్
భీతి గొలుపంగ యువతి,వ్రాతంబు సృజించెఁ బతులు వారల కరుదే. 513

వ. ఇట్లు నిజసతిచేత నుపలాలితుండై కశ్యపప్రజాపతి యాసతికిం బరమప్రీతుండై
యి ట్లనియె నోతన్వీ నీకుఁ బ్రసన్నుండ నైతి వరంబు గోరు మిచ్చెద నాథుండు
ప్రసన్నుం డైన స్త్రీలకుం గోరిక సంభవించుట కేమి గొఱంత సతికిం బతియె
దైవంబు సర్వభూతంబులమానసంబులకు వాసుదేవుండె భర్త నామరూపకల్పితు
లైనసకలదేవతామూర్తులచేతను బురుషులచేతను భర్తృరూపధరుండయినభగ
వంతుండు సేవింపంబడుచుండు విశేషించి స్త్రీలచేతఁ బతిరూపంబున భజియింపం
బడుఁ గావునం బతివ్రతలైనసుందరులు శ్రేయస్కామలై యేకచిత్తంబున నాత్మే

శ్వరుం డయినయప్పరమేశ్వరుని భర్తృభావంబున సేవించుచుండుదు రేనును నీ
కీభావంబున వరదుండ నైతి దుశ్శీల లయినవనితలకుం బొందరాని వరంబు
నీ కిచ్చెద వేఁడు మనిన నాకశ్యపునకు దితి యి ట్లనియె. 514

ఆ. వరము గోర నాకు । వరదుండ వేనియు, నింద్రుఁ జంపునట్టి । యిద్ధబలుని
నమితతేజుఁ దనయు । నమరత్వసంప్రాప్తు, నెందుఁ జెడనివాని । నిమ్ము నాథ.

వ. అనవుడు. 516

క. ఉట్టిపడునట్టివర మీ, కట్టిఁడి న న్నిట్టు వేఁడెఁ । గటకట యనుచుం
మిట్టిపడి యతఁడు మదిలోఁ, బుట్టినతల్లడముతోడఁ । బొక్కుచు నాత్మన్. 517

చ. ప్రకృతిని గర్వపాశముల । బద్ధుఁడ నైతిఁ గదయ్య నేఁడు నే
వికటసతీస్వరూపమున । వేఁదుఱు గొల్పినమాయ నింద్రియా
ధికమతి నైనవాఁడు దన । తెంపునఁ జిత్తము వెచ్చపెట్టి పా
తకములఁ గూల కున్నె నను । దైవము నవ్వదె లోలితాత్మునిన్. 518

సీ. ఖండశర్కరతోడఁ । గలహించుపలుకులుఁ, బద్మవిలాస మేర్పఱచుమోముఁ
దుహినాంశుకళలతోఁ । దులఁదూఁగుచెయ్వులుఁ, జెమటఁ గ్రొన్నెత్తావి । సేయుమేను
నిలువెల్లఁ గరఁగించు । నేర్పులయింపులు, పువ్వుల కరుదైన । ప్రోది సేఁత
తమకంబు రెట్టించు । తరితీపుతలఁపులు, నెనసినమదిలోని । యిచ్చగింత

ఆ. గలిగి కలువ నున్న । కాలాహిపోలికిఁ, జెలఁగుచున్న సతుల । చిత్తవృత్తిఁ
దెలియ వశమె యెంత । ధృతి గలవారికి, నాక కాదు నిఖిల । లోకములకు. 519

ఆ. కోరి సతుల కెల్లఁ । గూర్చువా రెవ్వరు, పతుల నైన సుతుల । హితుల నైన
బలిమిఁ జేసి యైనఁ । బరహస్తమున నైన, హింస సేతు రాత్మ । హితముకొఱకు.

వ. అని చింతించి దీనికి నే మని ప్రతివాక్యం బిచ్చువాఁడ మద్వచనం బెందు నమో
ఘంబు త్రిలోకపరిపాలనశీలుం డయినభిదురపాణి వధార్హుండె యేను దీనికి
నైన నది యొకటి గల్పించెద నని దితిం జూచి యోతనుమధ్య నీకు నట్ల దేవ
బాంధవుం డయిన యింద్రహంత యగుపుత్త్రుండు గలిగెడు నొక్కసంవత్సరం బీ
వ్రతంబు నాచరింపుము దానిప్రకారం బెల్ల నేను జెప్పెద విను మెల్లజీవుల
వలన హింసాభావంబు లేక యతిధ్వనివాక్యంబు లుడిగి కోపంబు మాని య
నృతంబులు వలుకక నఖరోమచ్ఛేదనంబు సేయక యస్థికపాలాదు లయినయ
మంగళంబుల నంటక జలంబులు సొచ్చి కాని ఘటోదకకూపోదకంబుల స్నా
నంబు సేయక దుర్జనసంభాషణంబు వర్జించి కట్టినకోకను ముడిచినపువ్వులను
గ్రమ్మఱ ధరియింపక భోజనంబులయందు నుచ్ఛిష్టాన్నంబును జండికానివేదితా
న్నంబును (గోశునకమార్జారకంకక్రిమి)పిపీలికాదివిదూషితాన్నంబును సామి
షాన్నంబును వృషలాహృతాన్నంబును ననునీపంచవిధనిషిద్ధాన్నంబులు వర్జించి
దోయిట నీళ్లు ద్రావక సంధ్యాకాలంబుల ముక్తకేశి గాక మితభాషిణియై

యలంకారవిహీనగాక వెలుపలం దిరుగక పాదప్రక్షాళనంబు సేసికొని కాని శయ
నింపక యార్ద్రపాద యై పవ్వళింపక పశ్చిమశిరస్క యయ్యును నగ్నయయ్యును
సంధ్యాకాలంబుల నిద్రింపక నిత్యంబును ధౌతవస్త్రంబులు గట్టి శుచి యై సర్వ
మంగళసంయుక్త యై ప్రాతఃకాలంబునఁ దూర్పుమొగం బై లక్ష్మీనారాయణుల
నారాధించి యావాహనార్ఘ్యపాద్యోపస్పర్శనసుస్నానవాసఉపవీతభూషణపుష్ప
ధూపదీపోపహారాద్యుపచారంబులనర్చించిహవిశ్శేషంబుద్వాదశాహుతులవేల్చిం
చి దండప్రణామంబు లాచరించి భగవన్మంత్రంబును దశవారంబు లనుసంధించి
స్తోత్రంబు సేసి గంధపుష్పాక్షతంబుల ముత్తైదువలం బూజించి పతిని సేవించి పు
త్రుం గుక్షిగతుంగా భావించి యివ్విధంబున మార్గశీర్ష శుద్ధ ప్రతిపదారంభంబుగా
నొక్క సంవత్సరంబు సలిపి యాద్వాదశమాసాంత్యదివసంబున విధ్యుక్తంబుగా
నుద్యాపనంబు సేయ వలయు నీ వీపుంసవనం బనియెడి వ్రతంబు ద్వాదశమా
సపర్యంతం బేమఱక సల్పిన నీవు గోరినకుమారుండు గలిగెడు ననిన దితి యా
వ్రతంబుతోడనె గర్భంబు ధరియించి వ్రతంబు సలుపుచు నుండ నింద్రుండు
మాతృభిప్రాయం బెఱింగి యాయమ్మ నహరహంబును రహస్యంబున సేవించుచు
వ్రతంబునకుం దగినపుష్పఫలసమిత్కుశపత్త్రాంకురంబులు మొదలయినవస్తు
వితతిం ద్రికాలంబులం దెచ్చియిచ్చుచుఁ బుండరీకంబు హరిణికిం బొంచి యున్న
భంగిఁ దద్వ్రతభంగంబునకై కాచి శుశ్రూషసేయుచు నాయమ్మగర్భంబు ధరి
యించినతేజోవిశేషంబునకు దిగులుగుడుచుచుఁ గృశించుచునుండె నొక్కనాఁడు.

సీ. వామాక్షి యనుదినవ్రతధారణోన్నత, పరిచర్యవిధులచే బడలి యలసి
యొంటి సంధ్యావేళ నుచ్ఛిష్ట యై పద, ప్రక్షాళనాదులఁ బాసి మఱచి
తనకర్మమోహంబు దవిలి నిద్రింపంగ, నింద్రుండు సయ్యన నెడరు గాంచి
యోగమాయాబలోద్యుక్తుఁడై యాయింతి,యుదరంబుఁ జొరఁబడియుగ్రుఁడగుచు

తే. దివిరి దేదీప్యమాన మై తేజరిల్లు
నర్భకుని వజ్రధారల నడిచె నేడు
దునుకలు గ వాఁడు దునిసియుఁ దునుక దునుక
చెడక యొక్కొకబాలుఁ డై చెలఁగు చున్న. 522

క. వా రేడ్వ రగుచుఁ గుయ్యిడ, నో రేడ్వకుఁ డనుచుఁ ద్రుంచె నొక్కొక్కని నా
తూఁగుం జేడేసి దునుక, గా రయమున వారు సెడక ఖండితు లయ్యున్. 523

క. ఖండము లన్నియు నండఱుఁ, జండాంశుసమప్రకాశశాశ్వతు లగుచున్
మొండుకొని నిల్చి యని రా,ఖండలునకుఁ గరుణ పుట్టుగతి మతిఁ దోఁపన్. 524

వ. అందఱు ముకుళితకరకమలు లై నీకుం దోడంబుట్టువులము మమ్ము హింసింపం
బని లేదు నీకుం బారిషదులమై మరుద్గణముల మై నిన్ను సేవించెదము మమ్ము ర
క్షింపు మనిన నారాయణప్రసాదంబునం జెడనిమరుద్గణంబులపలుకులకుం గృపా

ఖుండై యింద్రుండు వారల సహోదరులం గాఁ గైకొని మఱి హింసింపకమానె నశ్వత్థామశరాగ్నివలన నారాయణరక్షితుండ వయిననీవునుంబోలెఁ గులిశధారలశకలంబు లయినకుమారుం డన్నిరూపంబు లై సంవత్సరంబునకు నొక్కింతకడమగా హరిం బూజించిన నుద్భవించినవారు గావున నింద్రుతోడం గూడ నేకోనపంచాశద్దేవత లయినమరుద్గణంబులు దితిగర్భంబు వెలువడి రంత దితి మేల్కాంచి యనల్పప్రకాశులై యింద్రుతోడంగూడి వెలుంగుచున్నకుమారులం జూచి సంతోషింపక యింద్రుం జూచి నీకు మృత్యురూపం బయినపుత్త్రుం గోరి దుస్తరం బయినవ్రతంబు సలిపితి సంకల్పించినపుత్త్రుం డొక్కరుం డీసప్తసప్తసంఖ్య గల కుమారు లగుట కేమికతంబు నీ వెఱింగినభంగిన తథ్యంబు వలుకు మనిన నింద్రుం డి ట్లనియెఁ దల్లి భవద్వ్రతంబుఁ జింతించి సమయవిచ్ఛేదనంబున గర్భంబుఁ జొచ్చి పాపచిత్తుండ నై వజ్రధారల గర్భంబు విదళనంబు సేసిన నాశకలంబులు సెడక మహాశ్చర్యంబు గా నివ్విధంబునం గుమారకు లైరి మహాపురుషపూజాసంసిద్ధి కార్యానుషంగి గా కుండునే భగవదారాధనంబు గోరికలఁ బాపి యెవ్వారు గావింతురు వా రిహపరంబుల సర్వార్థకుశలు లగుదు రమ్మహాపురుషవ్రతసముత్పన్నతేజంబు నడంప నెవ్వం డోపుఁ గావున దుర్మదంబున బాలిశస్వభావుండ నై దోషంబు సేసిననాదౌర్జన్యకర్మంబు సహింపఁ దల్లికన్న నెవ్వారు సమర్థులు పాపాత్ముండ నగునన్నుఁ గావుము నేను వీరలతోడివాఁడ నని నిష్కపటంబుగాఁ బ్రార్థించిన నద్దేవి యట్ల కాక యని శాంతచిత్త యయ్యె నింద్రుండును వారలం గూడి త్రిదివంబునకుం బోయి సోమపానహవిర్భాగంబులు వారలకుం బంచి పెట్టి కూడి సుఖం బుండె నని చెప్పి పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుండు వెండియు ని ట్లనియె. 525

క. హరి వరదుఁ డయినవ్రత మఁట, హరియంశజు లగుచు నెగడు౯నమరులజన్మ
స్ఫురణం బఁట పఠియించిన, నరయఁగ నురుదీర్ఘకర్మ౯హర మగు టరుదే. 526

వ. అని విష్ణుకథాశ్రవణకుతూహలాయమానమానసులైన శౌనకాదిమహామునులకు సూతుండు సెప్పె నని శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకుఁ జెప్పెననుటయు.

క. రాజీవరాజపూజ్య, శ్రీజిత గోపీకటాక్ష౯సేవాంతర వి
భ్రాజితమూర్తి మదోద్ధత, రాజకులోత్సాహ [1]రామ౯రాజాఖ్యనిధీ. 528

తరలము. మురవిదారణ ముఖ్యకారణ ౯ మూలతత్త్వవిచారణా
దురితతారణ దుఃఖవారణ ౯ దుర్మదాసురమారణా
గిరివిహారణ కీర్తిపూరణ ౯ కీర్తనీయమహారణా
ధరణిధారణ ధర్మతారణ ౯ తాపసస్తుతిపారణా. 529

---

1 గుణవిరామాఖ్యనిధీ; సుగుణరామాఖ్యహారీ.

తోటకము. కరుణాకర శ్రీకర కంబుకరా, శరణాగతసంగతజాడ్యహరా
పరిరక్షితశిక్షితభక్తమురా, కరిరాజశుభప్రదకాంతిధరా. 530

గద్యము. ఇది శ్రీసకలసుకవిజనమిత్ర శ్రీవత్సగోత్రపవిత్ర కసువయామాత్యపుత్ర బుధజనప్రసంగానుషంగ సింగయనామధేయప్రణీతం బైనశ్రీమహాభాగవత పురాణంబునందు నజామిళోపాఖ్యానంబును బ్రచేతసులం జంద్రుం డామంత్రణంబు సేయుటయు దక్షోత్పత్తియుఁ బ్రజాసర్గంబును దక్షుండు శ్రీహరింగూర్చి తపంబు సేయుటయు నతనికి నప్పరమేశ్వరుండు ప్రత్యక్షం బగుటయు హర్యశ్వశబళాశ్వులజన్మంబును వారలకు నారదుండు బోధించుటయు నారదువచనప్రకారంబున వారు మోక్షంబు నొందుటయుఁ దద్వృత్తాంతంబు నారదువలన విని దక్షుండు దుఃఖాక్రాంతుం డగుటయుఁ దదనంతరంబ బ్రహ్మవరంబున దక్షుండు శబళాశ్వసంజ్ఞుల సహస్రసంఖ్యాకు లగుపుత్రులం గాంచుటయును సృష్టినిర్మాణేచ్ఛానిమిత్తంబున దక్షుపంపున వార లగ్రజన్ములు సిద్ధిం బొందినతీర్థరాజం బైన నారాయణసరస్సునకుం జనుటయు వారికి నారదభగవంతుండు బ్రహ్మజ్ఞానంబు నుపదేశించుటయు వారు పూర్వజు లేఁగినప్రకారంబున మోక్షంబు నొందుటయుఁ దద్వృత్తాంతంబును దక్షుండు దివ్యజ్ఞానంబున నెఱింగి నారదోపదిష్టం బని తెలిసి నారదుని శపియించుటయు నారదుండు దక్షుశాపంబు ప్రతిగ్రహించుటయు దక్షునకు మరల బ్రహ్మవరంబున సృష్టివిస్తారంబుకొఱకుఁ గూఁతులఱువండ్రు జనియించుటయు నందుఁ గశ్యపునకు నిచ్చినపదుమువ్వురవలన సకలలోకంబులు నిండుటయు దేవాసుర నర తిర్యఙ్మృగ ఖగాదులజన్మంబులును దేవేంద్రతిరస్కారంబున బృహస్పతి యధ్యాత్మమాయచేతం గానరా కుండుటయుఁ దద్వృత్తాంతంబు రాక్షసులు విని శుక్రోపదిష్టు లై దేవతలపై నెత్తి వచ్చుటయు దేవాసురయుద్ధంబును నాచార్యతిరస్కారంబున దివిజరాజపలాయనంబును బలాయమాను లైనదేవతలు బ్రహ్మసన్నిధికిం జనుటయును బ్రహ్మవాక్యంబునఁ ద్వష్టృకుమారుం డయినవిశ్వరూపు నాచార్యునిం గా దేవతలు వరించుటయును విశ్వరూపుప్రసాదంబున నింద్రుండు నారాయణవర్మం బను మంత్రకవచంబు ధరియించి రాక్షసుల జయించుటయుఁ బరోక్షంబున రాక్షసులకు ననుకూలుం డయినవిశ్వరూపు నింద్రుండు వధించుటయు విశ్వరూపవధానంతరంబున నింద్రునకు బ్రహ్మహత్య సంప్రాప్తం బయిన నింద్రుండు స్త్రీభూజలద్రుమంబులయందుఁ బంచి పెట్టుటయు విశ్వరూపుండు హతుం డగుటకుఁ ద్వష్ట కోపించి యింద్రవధార్థంబు మారణహోమంబు సేయ వృత్రాసురుండు జనించుటయు వృత్రాసురయుద్ధంబునఁ బరాజితు లై యింద్రసహితు లయినదేవతలు శ్వేతద్వీపంబుననుం జనుటయు నందు శ్రీహరి ప్రసన్నుం డయి దధీచివలన భిదురంబు గైకొన నుపదేశించుటయు నింద్రుండు వజ్రాయుధంబున

వృత్రుని సంహరించుటయు నింద్రుండు బ్రహ్మహత్యాపీడితుం డయి మానస సరస్సు ప్రవేశించుటయును నహుషుండు శతాశ్వమేధంబులం జేసి యింద్రాధిపత్యంబు వడయుటయు నహుషుం డగస్త్యశాపంబున సురరాజ్యచ్యుతుం డై యజగరయోనిం బుట్టుటయు నింద్రాగమనంబును నశ్వమేధంబును నింద్రుండు మరలం ద్రిలోకాధిపత్యంబు వడయుటయును జిత్రకేతూపాఖ్యానంబును మరుద్గణంబులజన్మప్రకారంబును ననుకథలం గలషష్ఠస్కంధము.

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు.

శ్రీరస్తు

రామచన్ద్రాయ పరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రమహాభాగవతము

సప్తమస్కంధము.

శ్రీమద్విఖ్యాతిలతా
క్రామితరోదోంతరాళ కమనీయమహా
జీమూతతులితదేహ
శ్యామలరుచిజాల రామచంద్రనృపాలా. 1

వ. మహనీయగుణగరిష్ఠు లగునమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుం డగుసూతుం డిట్లనియె నట్లు ప్రాయోపవిష్టుం డయినపరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రు నవలోకించి. 2

సీ. సర్వభూతములకు సముఁడు నెచ్చెలి ప్రియుం, డైన వైకుంఠుఁ డనంతుఁ డాద్యుఁ
డింద్రునికొఱకు దైత్యేంద్రుల నేటికి, విషమునికైవడి వెదకి చంపె
నసురులఁ జంపంగ నమరులచేఁ దన, కయ్యెడిలాభ మిం తైనఁ గలదె
నిర్వాణనాథుండు నిర్గుణుం డగుతన, కసురులవలనిభయంబుఁ బగయుఁ

ఆ. గలుగనేర వట్టిఘనుఁడు దైత్యులఁ జంపి, సురలఁ గాచుచునికి చోద్య మనుచు
సంశయంబు నాకు జనియించె మునినాథ, ప్రజ్ఞ మెఱసి తెలియఁ బలుకవయ్య. 3

వ. అనిన శుకుం డిట్లనియె. 4

శా. నీసంప్రశ్నము వర్ణనీయము గదా నిక్కంబు రాజేంద్ర ల
క్ష్మీసంభావ్యునిసచ్చరిత్రము మహాచిత్రంబు చింతింపఁ ద
ద్దాసాఖ్యానము లొప్పు విష్ణుచరణధ్యానప్రధానంబులై
శ్రీసంధానములై మునీశ్వరవచోజేగీయమానంబులై. 5

క. చిత్రంబులు త్రైలోక్యప,విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన,చైత్రంబులు విష్ణుదేవుచారిత్రంబుల్. 6

వ. నరేంద్రా కృష్ణద్వైపాయనునకు నమస్కరించి హరికథనంబులు సెప్పెద వినుము వ్యక్తుండు గాక గుణంబులు లేక ప్రకృతిం జెందక భవంబుల నొందక పరమేశ్వరుండు దనమాయవలన నయినగుణంబుల నావేశించి బాధ్యబాధకత్వం

బుల నొందు నతండు గుణరహితుండు సత్త్వరజస్తమంబులు ప్రకృతిగుణంబు లాగుణంబులకు నొక్కొక్క కాలంబున హానివృద్ధులు గల వాయీశ్వరుండు సత్త్వంబున దేవఋషులను రజోగుణంబున నసురులను దమోగుణంబున యక్షరక్షోగణంబులను విభజించె సూర్యుండు పెక్కెడలం గానంబడియు నొక్కరుం డయిన తెఱంగునం దద్విభుండును సర్వగతుం డయ్యును భిన్నుండు గాఁడు తత్త్వవిదు లయిన పెద్దలు దమలోనం బరమాత్మస్వరూపంబున నున్న యీశ్వరు నివ్విధంబున నెఱుంగుదురు జీవాత్మకుఁ బరుం డైన సర్వమయుండు దనమాయచేత రజంబును విశ్వంబు సృజియింపం గోరి సత్త్వంబును గ్రీడింపం గోరి తమంబును నిద్రింపంగోరి యుత్పాదించి చరమైన కాలంబును సృజియించు నా కాలంబున సర్వదర్శనుం డయిన యీశ్వరుండును గాలాహ్వయుండును నైన హరి సత్త్వగుణం బయిన దేవానీకంబునకు వృద్ధియు రజస్తమోగుణు లయిన రాక్షసులకు హానియుం జేయుచుండు. 7

క. జననాయక యీ యర్థము, ఘనయశుఁ డగు ధర్మజునకుఁ గ్రతుకాలమునన్
మును నారదుండు సెప్పెను, వినిపించెద వినుము చెవులు విమలత నొందన్.

వ. మున్ను ధర్మరాజు సేయు రాజసూయయాగంబునఁ బాలుం డైన శిశుపాలుండు హరిని నిందించి నిశితనిర్వక్రచక్రధారాదళితమస్తకుం డయి తేజోరూపంబున వచ్చి హరిదేహంబు సొచ్చినం జూచి వెఱఁగుపడి ధర్మజుండు సభలో నున్న నారదునిం జూచి యిట్లనియె. 9

ఆ. ఎట్టివారి కైన నేకాంతులకు నైన, వచ్చి చొరఁగ రాని వాసుదేవు
తత్త్వమందుఁ జేరె ధరణీశుఁ డహితుఁడై, యెట్లు సొచ్చె మునివరేణ్య నేఁడు.

ఉ. వేనుఁడు మాధవున్ దెగడి విప్రులు దిట్టిన భగ్నుఁడై తమో
లీనుఁడు గాఁడె తొల్లి మదలిప్తుఁడు చైద్యుఁడు పిన్ననాఁటనుం
డేనియు మాధవున్ విన సహింపఁడు భక్తి వహింపఁ డట్టివాఁ
డే నిబిడప్రభావమున నీ పరమేశ్వరునందుఁ జొచ్చెనో. 11

మ. హరి సాధింతు హరిన్ గ్రసింతు హరిఁ బ్రాణాంతంబు నొందింతుఁ దా
హరికిన్ వైరి నటంచు వీఁడు పటురోషాయత్తుఁడై యెప్పుడుం
దిరుగుం బ్రువ్వదు నోరు ప్రేలి పడదున్ దేహంబు దాహంబుతో
నరకప్రాప్తియు నొందఁ డే క్రియ జగన్నాథుం బ్రవేశించెనో. 12

వ. అదియునుం గాక దంతవక్త్రుండును వీఁడును నిరంతరంబు గోవిందు నింద సేయుదురు నిఖిలజనులు సందర్శింప నేఁడు వీనికి విష్ణుసాయుజ్యంబు గలుగుట కేమి హేతువు వినిపింపుము పవనచలితదీపశిఖయునుంబోలె నా హృదయంబు సంచలించుచున్న దనిన ధర్మనందనునకు నారదుం డిట్లనియె దూషణభూషణతిరస్కారంబులు శరీరంబునకుం గాని పరమాత్మకు లేవు శరీరాభిమానంబునం జేసి

దండవాక్పారుష్యంబులు హింసయై తోఁచు తెఱంగున నేను నాయది యనియెడు వైషమ్యంబును భూతంబులకు శరీరంబునందు సంభవించు నభిమానంబు బంధంబు నిరభిమానుండై వధించినను వధంబు గాదు కర్తృత్వ మొల్లని వానికి హింసయు సిద్ధింపదు సర్వభూతాత్మకుండైన యీశ్వరునికి వైషమ్యంబు లేదు గావున. 13

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున, నైన బాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగుహరిఁ, జేరవచ్చు వేఱుసేయఁ డతఁడు.

క. వైరానుబంధనంబునఁ, జేరినచందమున విష్ణుఁ జిరతరభక్తిం
జేరఁగ రా దని తోఁచును, నారాయణభక్తియుక్తి నాచిత్తమునన్. 15

క. కీటకముఁ దెచ్చి భ్రమరము, పాటవమున బంభ్రమింప భ్రాంతంబై త
త్కీటకము భ్రమరరూపముఁ, బాటించి వహించుఁ గాదె భయయోగమునన్.

వ. ఇవ్విధంబున. 17

శా. కామోత్కంఠతఁ గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులుం
బ్రేమన్ మీరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైన ను
ద్దామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా. 18

శ్రీహరిద్వారపాలకులకు సనకాదులవలన శాపంబు గల్గుట.

వ. మఱియుం బెక్కండ్రు కామద్వేషభయస్నేహసేవాతిరేకంబులఁ జిత్తంబు హరిపరాయత్తంబుగాఁ జేసి తద్గతిం బొందిరి హరి నుద్దేశించి క్రోధాదులైన యేనింటిలోపల నొక్కటియైన వెన్నునికి లేనినిమిత్తంబున నతండు వ్యర్థుండయ్యె మీ తల్లిచెలియలికొడుకు లయినశిశుపాలదంతవక్త్రులు దొల్లి విష్ణుమందిరద్వారపాలకులు విప్రశాపంబునఁ బదభ్రష్టులై భూతలంబునన్ జన్మించి రనిన విని యుధిష్ఠిరుండు నారదున కిట్లనియె. 19

మ. అలుగం గారణ మేమి విప్రులకు మున్నావిప్రు లెవ్వారు ని
శ్చలు లేకాంతులు నిర్జితేంద్రియులు నిస్సంసారు లీశానువ
ర్తులు వైకుంఠపురీనివాసు లన విందుమ్ వారి కెబ్భంగి నీ
ఖలజన్మంబులు వచ్చె నారద వినం గౌతూహలం బయ్యెడిన్. 20

వ. అనిన నారదుం డిట్లనియె నొక్కనాఁడు బ్రహ్మమానసపుత్రులైన సనకసనందనాదులు దైవయోగంబున భువనత్రయంబునందును సంచరించుచు నైదాఱేండ్లప్రాయంపుబాలకులభావంబున దిగంబరు లయి హరిమందిరంబునకు వచ్చి చొచ్చునెడ మొగసాల నున్నపురుషు లిరువురు వారలం జూచి. 21

క. డింభకుల నవర్గళవి, స్రంభకుల రమాధినాథసల్లాపసుఖా

రంభకుల ముక్తమానస, దంభకులం జొరఁగనీక తఱిమి రథీశా. 22

క. వారించినతమకంబున, వారించుక నిలువ లేక వడిఁ దిట్టిరి దౌ
వారికుల నసురయోని న, వారితులై పుట్టుఁ డనుచు వసుధాధీశా. 23

వ. మఱియు నాపిన్నపెద్దలు వారలం జూచి మీర లీయెడ నుండ నర్హులు గారు నారాయణచరణమూలంబు విడిచి రజస్తమోగుణులై రాక్షసయోనిం బుట్టుం డని శపియించిన వారు నాశాపవశంబునఁ బదభ్రష్టులై కూలుచు మొఱలిడిన నమ్మహాత్ములు దయాళువులై క్రమ్మఱం గరుణించి మూఁడుజన్మంబులకు వైరంబున భగవత్సన్నిధానంబు గలిగెడు మని నిర్దేశించి చని రివ్విధంబున శాపహతులై హరిపార్శ్వచరులైనపురుషు లిరువురు హిరణ్యకశిపు హిరణ్యాక్షు లన దితికి జన్మించి రందుఁ గనిష్ఠుం డైనహిరణ్యాక్షుని హరి వరాహరూపంబున సంహరించె నగ్రజుం డయినహిరణ్యకశిపుండు నరసింహామూర్తి యయినశ్రీహరిచేత విదళితుం డయ్యె నతనికొడుకు ప్రహ్లాదుండు దండ్రిచేత హింసితుం డయ్యును నారాయణపరాయణుం డై శాశ్వతుం డయ్యె రెండవ భవంబునఁ గైకేశి యనురాక్షసికి రావణకుంభకర్ణులయి సంభవించిన విశ్వంభరుండు రఘుకులంబున రాఘవుం డయి యవతరించి వారల వధియించె నమ్మహాత్మునిపరాక్రమంబులు మార్కండేయఋషివలన నెఱింగెదవు తృతీయజన్మంబున మీతల్లిచెలియలికి శిశుపాలదంతవక్త్రు లన నుద్భవించి. 24

శా. వక్రం బింతయు లేక పాయనిమహావైరంబునన్ నిత్యజా
తక్రోధస్మరణంబులన్ విదళితోద్యత్పాపసంఘాతులై
చక్రచ్ఛిన్నశిరస్కులై మునివచశ్శాపావధిప్రాప్తులై
చక్రిం జెందిరి వారు పార్శ్వచరులై సారూప్యభావంబునన్. 25

వ. అనిన విని ధర్మనందనుం డిట్లనియె. 26

క. బాలున్ హరిపదచింతా, శీలున్ సుగుణాలవాలు శ్రీమన్మేధా
జాలున్ సంతోషింపక, యేలా శిక్షించె రాక్షసేంద్రుం డనఘా. 27

క. పరిభూతవ్యథనంబులు, నిరుపమసంసారజలధినిర్మథనంబుల్
నరకేసరికథనంబులు, పరిరక్షితదేవయక్షఫణిమిథునంబుల్. 28

వ. మునీంద్రా వినిపింపు మనిన నారదుం డిట్లనియెఁ గమలోదరుచేతం దన సహోదరుండు హతుం డయ్యె నని విని హిరణ్యకశిపుండు రోషశోకదందహ్యమానమానసుం డయి ఘూర్ణిల్లుచు నాభీలదావదహనజ్వాలాకరాళంబు లయినవిలోకనజాలంబుల గగనంబునం బొగ లెగయ నిరీక్షించుచుఁ దటిల్లతాంకురసంకాశధగద్ధగితదంతసందష్టదశనచ్ఛదుండును నదభ్రభయంకరభ్రుకుటితఫాలభాగుండును నిరంతరాశాంత దురంతవైరవేగుండును నై మహాప్రభాజాలజటాలం బగుశూలంబుఁ గేల నందుకొని సభామండపంబున నిలువంబడి

త్రిమస్తక త్రిలోచన శకుని శంబర శతబాహు నముచి హయగ్రీవ పులోమ విప్ర
చిత్తిప్రముఖులైన దైత్యదానవుల నాలోకించి యిట్లనియె. 29

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణన్యాయైకదక్షుండు బా
హాకుంఠీకృతదేవయక్షుఁడు హిరణ్యాక్షుండు వానిన్ మహా
సౌకర్యాంగము దాల్చి దానవవధూసౌకర్యముల్ నీఱు గా
వైకుంఠుండు వధించి పోయె నట యీవార్తాస్థితిన్ వింటిరే. 30

చ. వనముల నుండుఁ జొచ్చు మునివర్గములోపల ఘోణి గాఁడు సం
జనన మెఱుంగ రెవ్వరును జాడ యొకింతయు లేదు తన్ను డా
సిన మఱి డాయు [1]వెంటఁ బడి చిక్కక చిక్కఁడు వీని నొక్కకీ-
లున మన మెల్ల లోఁబడక లోఁబడఁ బట్టుకొనంగ వచ్చునే. 31

సీ. భుజశక్తి నాతోడఁ బోరాడ శంకించి, మున్నీట మునిఁగిన మునుఁగుఁ గాక
యలయించి పెనఁగునాయచలసంభ్రమమున, [2]కెఱఁగి వెన్నిచ్చినయిచ్చుఁ గాక
జగడంబు సైఁపక సౌకర్యకాంక్షియై, యిలక్రింద నీఁగిన నీఁగుఁ గాక
క్రోధించి యటు గాక కొంత పౌరుషమున, హరిభంగి నడరిన నడరుఁ గాక

ఆ. కఠినశూలధారఁ గంఠంబు విదళించి, వానిశోణితమున వాఁడి మెఱసి
మత్సహోదరునకు మహిఁ దర్పణము సేసి, మెఱసి వత్తు మీకు మేలు దెత్తు.

క. ఖండితమూలద్రుమముల, యొండినవిటపములభంగి నితఁడు వడిన నా
ఖండలముఖ్యులు వడుదురు, ఖండనమున నితఁడు దమకుఁ బ్రాణము లగుటన్.

సీ. పొండు దానవులార భూసురక్షేత్రసం,గత యైనభూమికి గములు గట్టి
మఖతపస్స్వాధ్యాయ మౌనవ్రతస్థుల, వెదకి ఖండింపుఁడు విష్ణుఁ డనఁగ
నన్యుఁ డొక్కఁడు లేఁడు యజ్ఞంబు వేదంబు,నతఁడె భూదేవక్రియాదిమూల
మతఁడె దేవర్షిపిత్రాదిలోకములకు, ధర్మాదులకు మహాధార మతఁడె

తే. యేస్థలంబుల గోభూసురేంద్ర వేద, వర్ణధర్మాశ్రమంబులు వరుస నుండు
నాస్థలంబుల కెల్ల మీ రరిగి చెఱిచి, దగ్ధములు సేసి రండు మీదర్ప మొప్ప.

వ. అని యిట్లు నిర్దేశించిన దివిజమర్దనునిర్దేశంబులు శిరంబుల ధరియించి రక్క
సులు పెక్కండ్రు భూతలంబునకుం జని. 35

సీ. గ్రామ పుర క్షేత్ర ఖర్వట ఖేట ఘో,షారామ నగ రాశ్రమాదికములు
గాలిచి కొలఁకులు గలఁచి ప్రాకారగో,పురసేతువులు ద్రవ్వి పుణ్యభూజ
చయములు ఖండించి సౌధ ప్రపా గేహ, పర్ణశాలాదులు పాడు చేసి
సాధుగోబ్రాహ్మణసంఘంబులకు హింస, గావించి వేదమార్గములు సెఱిచి

ఆ. కుతల మెల్ల నిట్లు కోలాహలంబుగా, దైత్యు లాచరింపఁ దల్లడించి
నష్టమూర్తు లగుచు నాకలోకము మాని,యడవులందుఁ జొచ్చి రమరవరులు.

---

1 వెంటఁబడఁ జిక్కఁడు (సుక్కఁడు. 2 కెడలి.

వ. అంత హిరణ్యకశిపుండు దుఃఖితుం డై మృతుం డయినసోదరునకు నుదకప్రదా నాదికార్యంబు లాచరించి యతనిబిడ్డల శకుని శంబర కాలనాభ మదోత్కచ ప్రముఖుల నూఱడించి వారలతల్లితోఁ గూడ హిరణ్యాక్షునిభార్యల నందఱ రావించి తమతల్లి యైనదితి నవలోకించి యిట్లనియె. 37

శా. నీరాగారనివిష్టపాంథులక్రియన్ నిక్కంబు సంసారసం
చారుల్ వత్తురు గూడి విత్తురు సదా సంగంబు లే దొక్కచోఁ
శూరుల్ వోయెడిత్రోవఁ బోయెను భవద్భ్రాతృండు దల్లీ మహా
శూరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్. 38

సీ. సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్ముఁ డవ్యయుం, డమలుండు సత్యుఁ డనంతుఁ డాఢ్యుఁ
డాత్మరూపంబున నశ్రాంతమును దన, మాయాప్రవర్తనమహిమవలన
గుణములఁ గల్పించి గుణసంగమంబున, లింగశరీరంబు లీలఁ దాల్చి
కంపితజలములోఁ గదలెడిక్రియఁ దోఁచు, పాదపంబులభంగి భ్రామ్యమాణ
ఆ. చక్షువుల ధరిత్రి చలిత యై కానంగఁ, బడినభంగి వికలభావరహితుఁ
డాత్మమయుఁడు గంపితాంతరంగంబునఁ, గదలినట్లు తోఁచుఁ గదలకుండు.

బాలవేషము దాల్చినయముండు చెప్పినసుయజ్ఞోపాఖ్యానము.

వ. అవ్వా యివ్విధంబున లక్షణవంతుండు గానియీశ్వరుండు లక్షితుం డై కర్తసం సరణంబున యోగవియోగంబుల నొందించు సంభవవినాశశోకవివేకావివేక చింతాస్మరణంబులు వివిధంబు లీయర్థంబునకుఁ బెద్దలు ప్రేతబంధుయమసంవా దం బనునితిహాసంబు నుదాహరింతురు వినుండు చెప్పెద నుశీనరదేశంబునందు సుయజ్ఞుం డనురాజు గలం డతండు శత్రువులచేత యుద్ధంబున నిహతుం డయి యున్నయెడ. 40

సీ. చిరిఁగినబహురత్నచిత్రవర్మముతోడ, రాలినభూషణరాజితోడ
భీకరబాణనిర్భిన్నవక్షముతోడఁ, దఱచు గాఱెడుశోణితంబుతోడఁ
గీర్ణ మై జాఱినకేశబంధముతోడ, రయరోషదష్టాధరంబుతోడ
నిమిషహీనం బైననేత్రయుగ్మముతోడ, భూరజోయుతముఖాంబుజముతోడఁ
ఆ. దునిసి పడినదీర్ఘదోర్దండములతోడ, జీవరహితుఁ డగునుశీనరేంద్రుఁ
జుట్టి బంధుజనులు సొరిది నుండఁగ భయాక్రాంత లగుచు నతనికాంత లెల్ల.

శా. స్రస్తాకంపితకేశబంధములతో సంఛిన్నహారాళితో
హస్తాబ్జంబులు సాఁచి మోఁదికొనుచున్ హా నాథ యంచున్ బహు
ప్రస్తావోక్తులతోడ నేడ్చిరి వగం బ్రాణేశుపాదంబుపై
నస్తోకస్తనకుంకుమారుణవికీర్ణాస్రంబు వర్షించుచున్. 42

మ. అనఘా నిన్ను నుశీనరప్రజల కర్థానందసంధాయిఁ గా

మును నిర్మించిన బ్రహ్మ నిర్దయత [1]నున్మూలించెనే వీరికిం
దనయశ్రేణికి మాకు దిక్కు గలదే ధాత్రీశ నీబోఁటికిం
జనునే పాసి చనంగ [2]భ్రాతృజనులన్ సన్మిత్రులం [3]బుత్రులన్. 43

మ. జనలోకేశ్వర నిన్నుఁ బాసిననిమేషంబుల్ మహాబ్దంబు లై
చను లోకాంతరగామి వై మరల కీచందంబునన్ నీవు పో
యిన మే మెట్లు చరింతు మొల్లము గదా యాలోకవృత్తంబు నేఁ
డనలజ్వాలలఁ జొచ్చి వచ్చెదము నీయంఘ్రిద్వయిం జూడఁగన్. 44

వ. అని యిట్లు రాజభార్య లా రాజశవంబు డగ్గఱి విలపింపం బ్రొద్దు గ్రుంకెడుసమయంబున వారలవిలాపంబులు విని బ్రాహ్మణబాలకుం డై యముండు సనుదెంచి ప్రేతబంధువులం జూచి యి ట్లనియె. 45

ఉ. మచ్చిక వీరి కెల్ల బహుమాత్రముఁ జోద్యము దేహి పుట్టుచుం
జచ్చుచు నుంటఁ జూచెదరు చావక మానెడువారిభంగి నీ
చచ్చినవాని కేడ్చెదరు చావున కొల్లక డాఁగ వచ్చునే
యెచ్చటఁ బుట్టె [4]నచ్చటికి నేఁగుట నైజము ప్రాణికోటికిన్. 46

క. జననీజనకులఁ బాసియు, ఘనవృకములబాధ పడక కడుఁబిన్నల మై
మనిమెద మెవ్వఁడు గర్భం,బున [5]మును పోషించె వాఁడె పోషకుఁ డడవిన్.

క. ఎవ్వఁడు సృజించుఁ బ్రాణుల, నెవ్వఁడు రక్షించుఁ ద్రుంచు నెవ్వఁ డనంతుం
డెవ్వఁడు విభుఁ డెవ్వఁడు వాఁ, డివ్విధమున [6]మనుచుఁ జెనుచు హేలారతుఁడై.

ఆ. ధనము వీథిఁ బడిన దైవవశంబున, నుండుఁ బోవు మూల నున్న నైన
నడవి రక్ష లేనియబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమునఁ జచ్చు. 49

క. కలుగును మఱి లేకుండును, గలభూతము లెల్లఁ గాలకర్మవశము లై
నిలువఁబడుఁ బ్రకృతిఁ దగ్గుణ,కలితుఁడు గాఁ డాత్మమయుఁ డగమ్యుఁడు దలఁపన్.

సీ. పాంచభౌతిక మైనభవనంబు దేహంబు, పురుషుండు దీనిలోఁ బూర్వకర్మ
వశమున నొకవేళ వర్తించు దీపించుఁ, దఱి యైన నొకవేళఁ దలఁగి పోవుఁ
జెడ నేని దేహంబు చెడుఁ గాని పురుషుండు, చెడఁ డాతనికి నింత సేటు లేదు
పురుషునికిని దేహపుంజంబునకు వేఱు, గాని యేకత్వంబు గానరాదు

ఆ. దారువుల వెలుంగుదహనుని కైవడిఁ, గాయములఁ జరించుగాలిభంగి
నాళలీన మైననభముచాడ్పున వేఱు, దలియవలయు దేహిదేహములకు. 51

వ. అని మఱియు ని ట్లనియె. 52

సీ. భూపాలకుఁడు నిద్రవోయెడి [7]నాఁ డేమి, విలపింప నేటికి వెఱ్ఱులార
యెవ్వఁడు భాషించు నెవ్వఁ డాకర్ణించు, నట్టివాఁ డెన్నఁడో యరిగినాఁడు

---

1 'నున్మూలింప నీవిటికిం. 2 బాలజనులన్ - నాత్మజనులన్. 3 భృత్యులన్. 4 నయ్యెడల నేఁగుట. 5 మముఁ బోషించు. 6 మనుపుఁ-చెనుపు-జమపు. 7 నో యేమి' వ్రా. ప్ర.

ప్రాణభూతుం డైనపవనుం డాకర్ణింప, భాషింప నేరఁడు ప్రాణిదేహ
ములకు వేత్తె తాన ముఖ్యుఁ డై యింద్రియ,వంతుఁడై జీవుండువలను మెఱయఁ
ఆ. ప్రాభవమున భూతపంచకేంద్రియమనో,లింగదేహములను లీలఁ గూడు
విడుచు నన్యుఁ డొకఁడు విభుఁడు దీనికి మీఱు. పొగులనేల వగలఁ బొరలనేల.

క. ఎందాఁక నాత్మ దేహము, నొందెడు నందాఁకఁ గర్మయోగము లట్లైఁ
జెందవు మాయాయోగ, స్పందితు లై రిత్త జాలిఁ బడ నేమిటికిన్. 54

మ. చెలులుం దల్లులు దండ్రు లాత్మజులు సంసేవ్యుల్ సతుల్ చారుని
ర్మలగేహంబు లటంచుఁ గూర్తురు మహామాయాగుణభ్రాంతు లై
కలలోఁ దోఁచినయోగముల్ నిజము లే కర్మానుబంధంబులం
గలుగుం గాని సంగము లేక మానుఁ బిదపం గర్మాంతకాలంబునన్. 55

వ. మఱియు మాయాగుణప్రపంచంబు నెఱింగినతత్త్వజ్ఞులు నిత్యానిత్యంబులం గూర్చి సుఖదుఃఖంబులం జెంద రజ్ఞులు గొందఱు యోగవియోగంబులకు సుఖదుఃఖంబుల నొందుదురు తొల్లి యొక్క మహాగహనంబున విహంగంబులకు నంతకభూతుం డైనయొఱుకు గలఁ డతం డొక్కనాఁడు ప్రభాతంబున లేచి వాటం బైనవేఁటతమకంబున. 56

క. వల లురులు జిగురుఁగండెలుఁ,జలిదియుఁ జిక్కంబు ధనువుశరములుఁగొనుచుం
బులుఁగులఁ బట్టెడువేడుక,యులుఁగులు వెడలంగఁ గదలి యడవికిఁ జనియెన్.

వ. ఇ ట్లడవికిం జని తత్ప్రదేశంబునందు. 58

క. కట్టలుకఁ దడుకుచాటునఁ, బిట్టల నురిగోలఁ దిగిచి బిఱుసున తెక్కల్
వట్టి విఱిచి చిక్కములోఁ, బెట్టుచు విహరించె లోకభీకరలీలన్. 59

వ. మఱియు నానావిధంబు లగుశకుంతంబుల నంతంబు నొందించుచు సకలపక్షిసంహార[1]సంరబ్ధుం డై నలుబ్ధుండు దనముందటఁ గాలచోదితం బై సంచరించుచున్నకులింగపక్షిమిథునంబు గనుంగొని యందుఁ గులింగి నురిం దిగిచి నొక్కచిక్కంబులో వైచినం జూచి దుఃఖించి కులింగపక్షి యి ట్లనియె. 60

చ. అడవుల మేఁత మేసి మన మన్యుల కెన్నఁడు నెగ్గు సేయ కి
క్కడ విహరింప నేఁ డకట కట్టెఁడి బ్రహ్మ కిరాతుచేతిలోఁ
బడు మని వ్రాసెనే నుదుటఁ బాపపుదైవముకంటె కింతయె
క్కుడుబరు వయ్యెనే బ్రదుకు గోమలి నీ మన నేర్తుఁ జెల్లరే. 61

క. ఒకమాటు మనల నదఱఁ, బ్రకటించి కిరాతువలలఁ బడఁ జేయక ని
న్నొకతెన్ వలఁ బడఁ జేసిన, [2]వికటీకృతదక్షు డైనవిధి నే మందున్. 62

ఉ. తెక్కలు రావు పిల్లలకు తేపటినుండియు మేఁత గానమిం
బొక్కెడుఁ గూఁటిలో నెగసి పోవఁగ నేరవు మున్ను తల్లి యీ

1 లబ్ధుం డై న. 2 వికటీకృతదక్షుఁ డై న.

దిక్కున నుండి వచ్చు నని త్రిప్పనిచూడ్కుల నిక్కి నిక్కి న
ల్దిక్కులుఁ జూచుచున్న పతిఁ దీనత నెట్లు భరింతు నక్కటా. 63

వ. అని యివ్విధంబున. 64

క. కుంఠితనాదముతోడను, గంఠము శోషింప వగచు ఖగమును హననో
త్కంఠుండై నకిరాతుఁడ,కుంఠితగతి నేసి నొక్కకోలం గూలన్. 65

క. కాలము వచ్చిన శబరుని,కోలను ధరఁ గూలె ఖగము ఘోషముతోడం
గాలము డాసిన నేలం, గూలక పోవశమె యెట్టిగుణవంతులకున్. 66

ఉ. కావున మీరు చచ్చుతఱిఁ గానరు చచ్చి ధరిత్రిఁ బడ్డధా
త్రీపతిదేహముం గదిసి దీనత నేడువ నేల పొందు చిం
తావతులార వత్సరశతంబుల కైన నిజేశుచక్కి కిం
బోవుట దుర్లభంబు మృతిఁ బొందినవారలు నేర వత్తురే. 67

వ. అని యిట్లు కపటబాలకుండై క్రీడించుచున్నయమునియుపలాలనాలాపంబులు
విని సుయజ్ఞునిబంధువులెల్ల వెఱఁగుపడి సర్వప్రపంచంబు నిత్యంబు గాదని తలంచి
శోకింపక సుయజ్ఞునికి సాంపరాయికకృత్యంబులు సేసి చని రంత నంతకుం డంత
ర్హితుం డయ్యె నని చెప్పి హిరణ్యకశిపుండు దనతల్లిని దమ్మునిభార్యలం జూచి
యిట్లనియె. 68

క. పరు లెవ్వరు దా మెవ్వరు, పరికింపఁగ నేక మగుట భావింపరు త
త్త్వరమజ్ఞానము లేమిని, బరులును దా మనుచుఁ దోఁచుఁ బ్రాణుల కెల్లన్. 69

వ. అని తెలియం బలికిన హిరణ్యకశిపునివచనంబులు విని దితి గోడండ్రునుం దా
నును శోకంబు మాని తత్త్వవిలోకనంబు గలిగి లోకాంతరగతుండైనకొడుకు
నకు వగవక చనియె నని చెప్పి నారదుండు ధర్మనందనున కిట్లనియె. 70

క. అజరామరభావంబును, ద్రిజగద్రాజ్యంబు నప్రతిద్వంద్వము నో
ర్వ్యజితాఖిలశాత్రవమును, గజరిపుబలమును హిరణ్యకశిపుఁడు గోరెన్. 71

వ. ఇట్లు గోరి మందరాచలద్రోణికిం జని యందుఁ గాలిపెనువ్రేల నేల నిలువంబడి
యూర్ధ్వబాహుండయి మిన్ను చూచుచు వాఁడిమయూఖంబులతోడిప్రళయ
కాలభానుండునుంబోలె దీర్ఘజటారుణప్రభాజాలంబులతోడ నెవ్వరికిం దేఱి
చూడ రాక పరమదారుణంబైన తపంబు సేయుచుండె నిర్జరులు నిజస్థానంబుల
నుండి రంత. 72

మ. అదరెం గుంభిని సాద్రియై కలఁగె నేడంభోనిధుల్ తారకల్
సెదరెన్ సగ్రహసంఘలై దిశలు విచ్ఛిన్నాంతలై మండెఁ బె
ల్లదరెన్ గుండెలు జంతుసంహతికి నుగ్రాచారదైత్యేంద్రమూ
ర్ధదిశోద్ధూతసధూమహేతిపటలోదంచత్తపోవహ్నిచేన్. 73

వ. ఇట్లు త్రైలోక్యసంతాపకరంబైన దైత్యరాజతపోవిజృంభణంబు సైరింపక నిలిం

పులు నాకంబు విడిచి బ్రహ్మలోకంబునకుం జని లోకేశ్వరుం డయిన బ్రహ్మకు
వినతు లయి యి ట్లని విన్నవించిరి. 74

క. దితికొడుకుతపమువేఁడిమి, నతితప్తుల మైతి మింక । నలజడి నమరా
వతి నుండ వెఱతు మెయ్యది, గతి మాకును దేవదేవ । కారుణ్యనిధీ. 75

శా. శంకాలేశము లేదు దేవ త్రిజగత్సంహారమున్ దేవతా
సంకోచంబును వేదశాస్త్రపదవీసంక్షేపమున్ [1]లేక దే
వంకన్ లేవ నటంచు దుస్సహతపోవ్యావృత్తి చిత్తంబులో
సంకల్పించె నిశాచరుండు ప్రతిసంస్కారంబు చింతింపవే. 76

శా. నీ వేరీతిఁ దపోబలంబున జగన్నిర్మాణముం జేసి యీ
[2]దేవాధీశులకంటె నెక్కుడుసిరిం । దీపించి తిబ్భంగిఁ దా
నీవిశ్వంబుఁ దపస్సమాధిమహిమన్ । హింసించి వే ఱొక్క వి
శ్వావిర్భావకరత్వశక్తి మదిలో । నర్థించినాఁ డీశ్వరా. 77

వ. అదియునుం గాక కాలాత్మకు లగుజీవాత్మల కనిత్యత్వంబు గలుగుటం జేసి తపో
యోగసమాధిబలంబునం దనకు నిత్యత్వంబు సంపాదింతు నని తలంచినాఁ డని
మఱియు ని ట్లనిరి. 78

మ. భవదీయం బగునున్నతోన్నతమహా । బ్రహ్మైకపీఠంబు సం
స్తవనీయం బగుభూతియున్ విజయమున్ । సౌఖ్యంబు సంతోషమున్
భువనశ్రేణికి నిచ్చు దైత్యునితపస్స్ఫూర్తిన్ నివారించి యో
భువనాధీశ్వర కావవే భువనముల్ । పూర్ణప్రసాదంబునన్. 79

బ్రహ్మదేవుండు హిరణ్యకశిపునకు వరంబు లిచ్చుట.

వ. అని దేవతలు విన్నవించిన స్వయంభూతుండును భగవంతుండును నైననలువమొ
గంబులప్రోడ భృగుదక్షాదులతోడ మందరపర్వతంబునకు వచ్చి యందు నియ
మయుక్తుండును బిపీలికావృతమేదోమాంసచర్మరక్తుండును వల్మీకతృణవేణు
పటలపరిచ్ఛన్నుండును మహాతపఃప్రభావసంపన్నుండును నై నీరంధ్రనిబిడనీరద
నికరనివిష్టనీరజబంధుండునుంబోలె నివసించి యున్ననిర్జరారాతిం జూచి వెఱఁ
గుపడి నగుచు ని ట్లనియె. 80

మత్తకోకిలము. ఓసురారికులేంద్ర నీక్రియ । నుగ్రమైనతపంబు మున్
చేసి చూపినవారు లే రికఁ । జేయువారును లేరు నే
నీసమాధికి మెచ్చితిన్ విను । నీయభీష్టము లిత్తు నా
యాస మేటికి లెమ్ము లెమ్ము మ । హాత్మ కోరుము కోరికల్. 81

శా. దంశవ్రాతములుం బిపీలికలు మే । దఃక్రవ్యరక్తంబులన్
సంకీర్ణంబులు సేసి పట్టి తినఁగా । శల్యావశిష్టుండ వై

---

1 గాక. 2 దేవానీకముకంటె.

వంశచ్ఛన్నతృణావళీయుతమహావల్మీకమం దింద్రియ
భ్రంశం బింతయు లేక నీవు నిలువం బ్రాణంబు [1]లె ట్లుండెనో. 82

ఉ. ఉత్సుకతన్ జలాన్నముల నొల్లక యీక్రియ నూఱుదివ్యసం
వత్సరముల్ శరీరమున వాయువులన్ నిలుపంగ వచ్చునే
యుత్సవ మయ్యెఁ జూచి మము నుగ్రతపంబున గెల్చి తీవు నే
వత్సలతన్ నినుం గదియ వచ్చితిఁ గోరిక లెల్ల నిచ్చెదన్. 83

వ. అని పలికి వనమక్షికాపిపీలికాభక్షితం బైన రక్షోవిభుని దేహంబుమీఁదం గమండలుజలంబులు ప్రోక్షించిన నద్దానవేంద్రుండు కమలాసనకరకమలకమనీయకనకమయదివ్యామోఘకమండలునిర్గతనిర్మలనీరధారాబిందుసందోహసంసిక్తసకలాంగుం డగుచు తపంబు సాలించి సాంద్రకీచకసంఘాతసంఛాదితవామలూరుమధ్యంబు వెలువడి మహాప్రభావబలసౌందర్యతారుణ్యసహితుండును వజ్రసంకాశదేహుండును దప్తసువర్ణవర్ణుండును నై నీరసేంధననికరనిర్గతవహ్నియునుంబోలె వెలుంగుచుం జనుదెంచి. 84

మ. దివిజానీకవిరోధి మ్రొక్కెఁ గని వాగ్దేవీమనోనేతకున్
సవిశేషోత్సవసంవిధాతకు సమస్తత్రాతకున్ సత్తపో
నివహాభీష్టవరప్రదాతకు జగన్నిర్మాతకున్ ధాతకున్
వివిధప్రాణిలలాటలేఖనమహావిద్యానుసంధాతకున్. 85

వ. ఇట్లు దైత్యేశ్వరుండు దివి నున్న హంసవాహనునకు ధరణీతలంబున దండప్రణామంబు లాచరించి సంతోషబాష్పసలిలసంవర్ధితపులకాంకురుం డై యంజలి సేసి కంజగర్భునిమీఁద దృష్టి యిడి గద్గదస్వరంబున ని ట్లని వినుతించె. 86

సీ. కల్పాంతమున నంధకారసంవృత మైన, జగము నెవ్వఁడు దనసంప్రకాశ
మున వెలిఁగించుచు మూఁడుభంగుల రజస్సత్త్వతమోగుణసహితుఁ డగుచుఁ
గల్పించు రక్షించుఁ గడపటఁ బ్రహరించు, నెవ్వఁ డాద్యుఁడు సర్వహేతువగుచు
శోభితుం డై స్వయంజ్యోతి యై యొక్కఁట, విలసిల్లు నెవ్వఁడు విభుత మెఱసి
ఆ. సమయ మగున మానసప్రాణబుద్ధీంద్రియములతోడ నెవ్వఁ డలఘుమహిమ
నడరు నట్టిసచ్చిదానందమయునకు, మహితభక్తి నే నమస్కరింతు. 87

వ. దేవా నీవు ముఖ్యప్రాణం బగుటం జేసి ప్రజాపతివి మనోబుద్ధిచిత్తేంద్రియంబులకు నధీశ్వరుండవు మహాభూతగణంబులకు నాధారభూతుండవు త్రయీతనువునం గ్రతువులు విస్తరింతువు సకలవిద్యలు నీతనువు సర్వార్థసాధకులకు సాధనీయుండ వాత్మనిష్ఠాగరిష్ఠులకు ధ్యేయం బగు నాత్మవు కాలమయుండ వై జనులకు నాయుర్నాశంబు సేయుదువు జ్ఞానవిజ్ఞానమూర్తి వాద్యంతరహితుండ వంతరాత్మవు మూఁడుమూర్తులకు మూలం బగుపరమాత్మవు జీవలో

1 లె ట్లోర్చెనో.

కంబునకు జీవాత్మవు సర్వంబును నీవ నీవు గానిది లేశంబును లేదు వ్యక్తుం
డవు గాక పరమాత్మవై పురాణపురుషుండవై యనంతుండవై నీవు ప్రాణేం
ద్రియమనోబుద్ధిగుణంబుల నంగీకరించి పరమేష్ఠిపదవిశేషంబున నిలిచి స్థూల
శరీరంబునం జేసి యింతయుం బ్రపంచింతువు భగవంతుండవై నీకు మ్రొక్కెద
నని మఱియు ని ట్లనియె. 88

క. కోరినవారలకోర్కులు, నేరుపుతో నిచ్చి మనుపనీ క్రియ నన్యుల్
నేరరు కరుణాకర నేఁ, గోరెద నీ విచ్చెదేనిఁ గోరిక లభవా. 89

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రభల భూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువు లేనిజీవనము లోకాధీశ యిప్పింపవే. 90

వ. అని మఱియు రణంబులందుఁ దన కెదురు లేనిశౌర్యంబును లోకపాలుర నతిక్ర
మించుమహిమయును భువనత్రయజయంబును హిరణ్యకశిపుండు గోరిన నతని
తపంబునకు సంతోషించి దుర్లభంబు లైనవరంబు లన్నియు నిచ్చి కరుణించి
విరించి యి ట్లనియె. 91

శా. అన్నా కశ్యపపుత్ర దుర్లభము లీయర్థంబు లెవ్వారికిన్
ము న్నెవ్వారలుఁ గోర రీవరములన్ మోదించితిన్ నీయెడన్
నన్నుం గోరిన వెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధిసం
పన్నత్వంబున నుండుమీ సుమతివై భద్రైకశీలుండవై. 92

వ. అని యి ట్లమోఘంబు లయినవరంబు లిచ్చి దితినందనుచేతం బూజితుండై
యరవిందసంభవుండు బృందారకసందోహవంద్యమానుం డగుచు నిజమందిరం
బునకుం జనియె నివ్విధమ్మున నిలింపారాతి వరపరంపరలు సంపాదించుకొని. 93

క. సోదరుఁ జంపినపగకై, యాదర మించుకయు లేక యసురేంద్రుఁడు గం
జోదరుపై వైరము దు, ర్వాదరతుం డగుచుఁ జేసె మనుజాధీశా. 94

సీ. ఒకనాఁడు గంధర్వయూథంబుఁ బరిమార్చు, దివిజుల నొకనాఁడు దెరలఁ దోలు
భుజగుల నొకనాఁడు భోగంబులకుఁ బాపు, గ్రహముల నొకనాఁడు గట్టివైచు
నొకనాఁడు యక్షుల నుగ్రతఁ దండించు, నొకనాఁడు విహగుల నొడిసిపట్టు
నొకనాఁడు సిద్ధుల నోడించి బంధించు, మనుజుల నొకనాఁడు మదమడంచుఁ

తే. గడిమి నొకనాఁడు కిన్నరఖచరసాధ్య, చారణప్రేతభూతపిశాచవన్య
సత్త్వవిద్యాధరాదుల సంహరించు, దితితనూజుండు దుస్సహతేజుఁ డగుచు.

క. అట్టళ్లతోడఁ గోటలఁ, గట్టులకం గూలఁ ద్రోచి క్రవ్యాదులతోఁ
జుట్టు విడిసి దిక్పాలుర, పట్టణములు గొనియె నతఁడు బలమున నధిపా. 96

క. కృశులై సంప్రాపితదు,ర్దశులై సర్వంకషోగ్రదైతేయాజ్ఞా

వశ లై నిశలును దివములు, దిశ లెల్లను గట్టువడియె ƒ దీనత ననఘా. 97

వ. మఱియు నద్దానవేంద్రుండు విద్రుమసోపానంబులును మరకతమణిమయప్రదేశంబులును వైదూర్యరత్నస్తంభసముదయంబులును జంద్రకాంతసన్నిభస్ఫటికసంఘటితకుడ్యంబులును బద్ధరాగపీఠకనకకవాటగేహళీవిటంకవాతాయనంబులును విలంబమానముక్తాఫలదామవితానశోభితధవళపర్యంకంబులును వివిధవిచిత్రవిమానంబులును నిరంతరసురభికుసుమఫలభరితపాదపమహోద్యానంబులును హేమారవిందసౌగంధికబంధురసరోవరంబులును రమణీయరత్నప్రాసాదవిశేషంబులును మనోహరపరిమళశీతలమందమారుతంబులును మృదుమధురనినదకీరకోకిలకులకోలాహలంబులును గలిగి విశ్వకర్మనిర్మితం బై త్రైలోక్యరాజ్యలక్ష్మీశోభితం బైన మహేంద్రభవనంబు సొచ్చి. 98

మ. దితిపుత్త్రుండు జగత్త్రయైకవిభుఁడై ƒ దేవేంద్రసింహాసన
స్థితుఁడై యుండ హరాచ్యుతాంబుజభవుల్ ƒ దప్పించి భీతిన్ సమా
గతు లై తక్కినయక్షకిన్నరమహో ƒ రగ్గంధర్వసిద్ధాదు లా
నతు లై కానుక లిచ్చి కొల్తు రతనిన్ ƒ నానాప్రకారంబులన్. 99

శా. ఏదిక్పాలురఁ జూచి నేఁ డలుగునో ƒ యేదేవు బంధించునో
యేదిగ్భాగముమీఁద దాడి చనునో ƒ యేప్రాణులం జంపునో
యీదైత్యేశ్వరుఁ డంచు నొండొరులు దా ƒ రింద్రాదు లాస్థానభూ
వేదిన్ మెల్లన నిక్కి చూతురు భయా ƒ విర్భూతరోమాంచు లై. 100

సీ. కోలాహలము మాని ƒ కొలువుండుఁడీ సురలార, తలఁగి దీవింపుఁడీ ƒ తపసులార
ఫణ లెత్తకుఁడు నిక్కి ƒ పన్నగేంద్రములార, ప్రణతులై సనుఁడీ దిక్ ƒ పాలురార
గానంబు సేయుఁడీ ƒ గంధర్వవరులార, సందడిఁ బడకుఁడీ ƒ సాధ్యులార
యాడుఁడీ నృత్యంబు ƒ లప్సరోజనులార, చేరిక మ్రొక్కుఁడీ ƒ సిద్ధులార

తే. శుద్ధకర్పూరవాసిత ƒ సురభిమధుర, భవ్యనూతనమైరేయ ƒ పానజనిత
సుఖవిలీనత నమరారి ƒ సొక్కినాఁడు, శాంతి లే దండ్రు నిచ్చలుఁ ƒ జారు లధిప.

శా. లీలోద్యానలతానివాసములలో ƒ లీలావతీయుక్తుఁ డై
హాలాపానవివర్ధమానమదలో ƒ లావృత్తతామ్రాక్షుఁ డై
కేళిం దేలఁగ నేఁడు తుంబురుఁడు సం ƒ గీతప్రసంగంబులన్
[1]వాలాయంబుఁ గరంగఁ జేయుదుము దే ƒ వద్వేషి నుర్వీశ్వరా. 102

క. యాగములు బుధులు ధరణీ, భాగములం జేయుచుండఁ ƒ బఱతెంచి హవి
ర్భాగములు దానకైకొనుఁ, జాగింపఁడు దైత్యుఁ డమర ƒ సంఘంబునకున్. 103

సీ. సకలమహాద్వీప ƒ సహితవిశ్వంభరా, స్థలి నిదున్నక పండు ƒ సస్యచయము
గామధేన్వాదుల ƒ కరణి నర్థులు గోరు, కోర్కులు గగనంబు ƒ గురియుచుండు

1 వాలాయించి.

వననిధు లేడును వాహినీసంఘాత, మును వీచులను రత్నములు వహించు
నుర్వీరుహంబులు నురులతాజాలంబు, నఖిలర్తుగుణముల నతిశయిల్లు
తే. నంబుసంపూరితద్రోణు లగుచు నొప్పెఁ, బర్వతంబులు సర్వదిక్పాలవివిధ
గుణము లెల్లను దానకై కొనుచు దైత్య,విభుఁడు త్రైలోక్యరాజ్యసంవృద్ధినుండ.

వ. ఇట్లు సకలదిక్కులు నిర్జించి లోకైకనాయకుండై తనయిచ్ఛాప్రకారంబున నింద్రియసుఖంబు లనుభవించుచుం దనియక శాస్త్రమార్గంబు నతిక్రమించి విరించివరజనితదుర్వారగర్వాతిరేకంబున సుపర్వారాతి యైశ్వర్యవంతుండై పెద్దకాలంబు రాజ్యంబు సేయు నెడ. 105

ఉ. ఎన్నఁడు మాకు దిక్కు గల దెన్నఁడు దైత్యునిబాధ మాను మే
మెన్నఁడు వృద్ధిఁ బొందఁ గల మెవ్వరు రక్షకు లంచు దేవతా
కిన్నరసిద్ధసాధ్యముని ఖేచరనాయకు లాశ్రయించి రా
పన్నగతల్పు భూరిభవబంధవిమోచనుఁ బద్మలోచనున్. 106

వ. ఇట్లు దానవేంద్రునియుగ్రదండంబునకు వెఱచి యనన్యశరణ్యులై రహస్యంబున నందఱుం గూడికొని. 107

ఉ. ఎక్కడ నున్నవాఁడు జగదీశ్వరుఁ డాత్మమయుండు మాధవుం
డెక్కడ కేఁగి శాంతులు మునీశులు భక్తులు రారు క్రమ్మఱం
దిక్కుల నెల్ల నెక్కుడుతుదిం జొర దిక్కగు నట్టిదిక్కుకై
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయరక్షకున్. 108

వ. అని మఱియు నాహారనిద్రలు మాని చిత్తంబులు పరాయత్తంబులు గానీక సమాహితబుద్ధులై భగవంతుండును మహాపురుషుండును మహాత్ముండును విశుద్ధజ్ఞానానంతమయుండు నైన హృషీకేశునకు నమస్కరించుచున్నయెడ మేఘరవసమానగంభీరనినదంబున దిశలు మ్రోయించుచు సాధులకు నభయంబు గావించుచు దృశ్యమానుండు గాక పరమేశ్వరుం డైన హరి యిట్లనియె. 109

మ. భయముం జెందకుఁ డయ్య నిర్జరవరుల్ భద్రంబు మీ కయ్యెడున్
జయముల్ లాభము భూతసంతతికి మత్సందర్శనప్రాప్తి న
వ్యయ మై చేకు నెఱుంగుఁడున్ దితిసుతవ్యాపారభావావిప
ర్యయముల్ గాలము గూడఁ జంపెదఁ జనుం డందాఁక మీత్రోవలన్. 110

ఆ. శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు, గోవులందు విప్రకోటియందు
ధర్మపదవియందుఁ దగిలి నాయందు వాఁ, డెన్నఁ డలుగు నాఁడె హింసనొందు.

క. కన్నకొడుకు శమదమసం,పన్నుఁడు నిర్వైరుఁ డనక ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా,పన్నత నొందించు నాఁడె పట్టి వధింతున్. 112

శా. వేధోదత్తవరప్రసాదగరిమన్ వీఁ డింతవాఁ డై మిమున్
బాధం బెట్టుచు నున్నవాఁ డని మదిన్ భావింతు భావించి నే



536. బ్రహ్మరుద్రేంద్రాదులు క్షీరాబ్ధికివచ్చి శ్రీ మహావిష్ణువును స్తోత్రము చేయుట.

సాధింపం దఱి గాదు గావునఁ గదుర్ సైరించితిర్ మీఁదటన్
సాధింతుర్ సురలార నేఁడు సనుఁడా శంకింప మీ కేటికిన్. 113

వ. అని యిట్లు దనుజమర్దనుండు నిర్దేశించిన నిలింపులు గుంపులు గొని మ్రొక్కి రక్కసుండు మ్రక్కుట నిక్కం బని తమతమదిక్కులకుం జనిరి హిరణ్యకశిపునకు విచిత్రచరిత్రులు నలువురు పుత్త్రు లుద్భవించి రందు. 114

ప్ర హ్లా ద చ రి త్ర ము.

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి, సమహితత్వంబున జరగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ, జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన, మాతృభావన సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను, దీనులఁ గావఁ జింతించువాఁడు

తే. సములయెడ సోదరస్థితి జరపువాఁడు, దైవతము లంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు, లలితమర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప.

వ. మఱియును. 116

సీ. ఆకారజన్మవిద్యార్థవరిష్ఠుఁ డై, గర్వసంస్తంభసంగతుఁడు గాఁడు
వివిధమహానేకవిషయసంపన్నుఁ డై, పంచేంద్రియములచేఁ బట్టువడఁడు
భవ్యవయోబలప్రాభవోపేతుఁ డై, కామరోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖభోగము లెన్ని గలిగిన, వ్యసనసంసక్తి నావంకఁ బోఁడు

ఆ. విశ్వమందుఁ గన్నవిన్నయర్థములందు, వస్తుదృష్టిఁ జేసి వాంఛ యుడఁడు
ధరణినాథ దైత్యతనయుండు హరిపర, తంత్రుఁ డై హతాన్యతంత్రుఁ డగుచు.

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబులై వచ్చి, యసురరాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున, నేఁడుఁ గలిగియుండు నిర్మలాత్మ.

మ. పగవారైన సురేంద్రులున్ సభలలోఁ బ్రహ్లాదసంకాశులన్
సుగుణోపేతుల నెందు నే మెఱుఁగ మంచున్ వృత్తబంధంబులం
బొగడం జొత్తురు సత్కవీంద్రులక్రియన్ భూనాథ మీబోఁటిస
ద్భగవద్భక్తులు దైత్యరాజతనయుం బాటించి కీర్తింపరే. 119

క. గుణనిధి యగుప్రహ్లాదుని, గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు, ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్. 120

వ. ఇట్లు సద్గుణగరిష్ఠుం డయినప్రహ్లాదుని భగవంతుం డయినవాసుదేవునియందు సహజసంవర్ధమాననిరంతరధ్యానరతుం డై. 121

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ జేరినయట్లైనఁ, జెలికాండ్రు నెవ్వారిఁ జేర మఱచు
నసురారి దనమ్రోల నాడినయట్లైన, నసురబాలురతోడ నాడ మఱచు

భక్తవత్సలుఁడు సంభాషించిన ట్లైనఁ, బరభాషలకు మాఱు పలుక మఱచు
సురవంద్యుఁ దన లోనఁ జూచిన య ట్లైనఁ, జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు

తే. హరిపదాంభోజయుగచింతనామృతమున, నంతరంగంబు నిండిన ట్లైన నతఁడు
నిత్యపరిపూర్ణుఁడగుచు నన్నియును మఱచి, జడత లేకయు నుండును జడుని భంగి.

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచుం భాషించుచుం హాసలీ
లా నిద్రాదులు సేయుచుం దిరుగుచుం లక్షించుచుం సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృ[1]తాస్వాదనం
ధానుం డై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వముం భూవరా. 123

సీ. వైకుంఠచింతావివర్జితచేష్టుఁ డై, యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁ డై, యుద్ధతుఁ డై పాడు నొక్కచోట
విష్ణుఁ [2]డింతియ కాని వేఱొండు లే దని, యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుఁ డను నిధానముఁ గంటి నే నని, యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ, బ్రణయహర్షజనితబాష్పసలిల
మిళితపులకుఁ డై నిమీలితనేత్రుఁ డై, యొక్కచోట నిలిచి యూరకుండు.

వ. ఇట్లు పూర్వజన్మపరమభాగవతసంసర్గసమాగతం బైన ముకుందచరణారవిందసేవాతిరేకంబున నఖర్వనిర్వాణభావంబు విస్తరించుచు నప్పటప్పటికి దుర్జనసంసర్గనిమిత్తంబునం దనచిత్తం బన్యాయత్తంబు గానీక నిజాయత్తంబు సేయుచు నప్రమత్తుండును సంసారనివృత్తుండును బుధజనవిధేయుండును మహాభాగధేయుండును సుగుణమణిగణగరిష్ఠుండును బరమభాగవతశ్రేష్ఠుండును గర్మబంధలతాలవిత్రుండును (బవిత్రుండును) నైన పుత్త్రునియందు విరోధించి సురవిరోధి యనుకంప లేక చంపం బంపె నని పలికిన నారదునకు ధర్మజుం డిట్లనియె. 125

శా. పుత్త్రుల్ నేర్చిన నేర కున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్త్రత్వంబున బుద్ధి సెప్పి దురితోన్మేషంబు వారింతు రే
శత్రుత్వంబుఁ దలంప రెట్టియెడ నా సౌజన్యరత్నాకరుం
బుత్త్రున్ లోకపవిత్రుఁ దండ్రి నెగులుం బొందింప నె ట్లోర్చెనో. 126

ఉ. బాలుఁ బ్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలుఁ గృపాళు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్తభవ్యనుతశీలు విఖండితమోహవల్లికా
జాలు న దేల తండ్రి వడిఁ జంపఁగఁ బంపె మునీంద్ర చెప్పవే. 127

వ. అనిన నారదుం డిట్లనియె. 128

1 తానూన-తధ్యాన-సం. 2 డింతయుఁగాని.

శా. లభ్యం ¹బైనసురాధిరాజపదమున్ లక్షింపఁ డశ్రాంతమున్
సభ్యత్వంబున నున్నవాఁడు బలుఁడై జాడ్యంబుతో వీఁడు వి
ద్యాభ్యాసంబునఁ గాని తీవ్రమతి గాఁ డంచున్ విచారించి దై
త్యేభ్యుం డొక్కదినంబునం బ్రియసుతున్ వీక్షించి సోత్కంఠుఁడై. 129

క. చదువనివాఁ డజ్ఞుం డగుఁ, జదివిన సదసద్వివేకచతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ, జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ.

వ. అని పలికి యసురలోకపురోహితుండును (భగవంతుండును) నయిన శుక్రాచార్యు కొడుకులఁ బ్రచండవితర్కులఁ జండామర్కుల రావించి సత్కరించి యిట్లనియె.

శా. అంధప్రక్రియ ²నున్నవాఁడు వలుకం డస్మత్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు మీరు గురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీబాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గావించి రక్షింపరే. 132

వ. అని పలికి వారలకుఁ బ్రహ్లాదు నప్పగించి తోడ్కొని పొం డనిన వారును దనుజరాజకుమారునిం గొనిపోయి యతనికి సవయస్కు లగుసహశ్రోతల నసురకుమారులం గొందఱం గూర్చి. 133

ఉ. అంచితభక్తితోడ దనుజాధిపగేహసమీపమునం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రము లాకుమారుఁ డా
లించి పఠించె నన్నియుఁ జలింపనివైష్ణవభక్తిపూర్ణుఁడై. 134

క. ఏపగిది వారు సెప్పిన, నాపగిదిం జదువుఁ గాని యట్టిట్టని యా
క్షేపింపఁడు దా నన్నియు, రూపించిన మిథ్య లని నిరూఢమనీషన్. 135

శా. అంతం గొన్నిదినంబు లేఁగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుం డై నిజనందనున్ గురువు లేరా జాడం బఠింపించిరో
భ్రాంతుం డేమి పఠించెనో పిలిచి సంభాషించి విద్యాపరి
శ్రాంతిం జూచెదఁ గాక నేఁ డని మహాసౌధాంతరాసీనుఁడై. 136

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మని చీరఁ బంచెఁ బ్ర
హ్లాదకుమారకున్ భవమహార్ణవతారకుఁ గామరోషలో
భాదివిరోధివర్గపరిహారకుఁ గేశవచింతనామృతా
స్వాద³కఠోరకుం గలుషజాలమహోగ్రవనీకుఠారకున్. 137

వ. ఇట్లు చారులచేత నాహూయమానుం డై ప్రహ్లాదుండు సనుదెంచిన. 138

శా. ఉత్సాహప్రభుమంత్రశక్తియుత మై యుద్యోగ మారూఢసం
విత్సంపన్నుఁడ నై తివే చదివితే వేదంబులున్ శాస్త్రముల్

1 బైనసురారిరాజ్యపదమున్. 2 నుండువాఁడు; నుండుఁగాని. 3 చకోరకుం.

వత్సా! రమ్మని చేరఁ జీరి కొడుకున్ వాత్సల్యసంపూర్ణుఁడై
యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్. 139

క. అనుదినసంతోషణములు, జనితశ్రమతాపదుఃఖసంశోషణముల్
తనయులసంభాషణములు, జనకులకుం గర్ణయుగళసద్భూషణముల్. 140

వ. అని మఱియుఁ బుత్రా! నీ వెయ్యది భద్రం బై యున్నది సెప్పు మనినఁ గన్న
తండ్రికిఁ బ్రియనందనుం డి ట్లనియె. 141

ఉ. ఎల్లశరీరధారులకు నిల్లనుచీఁకటినూతిలోపలం
ద్రెళ్లక మీఁదు మే మనుమతిభ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వముం దతనిదివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ. 142

వ. అని కుమారకుం డాడినప్రతిపక్షానురూపంబు లయినసల్లాపంబులు విని దాన
వేంద్రుండు నగుచు ని ట్లనియె. 143

క. ఎట్టాడిన నట్టాడుదు, [1]రిట్టి ట్టని పలుక నెఱుఁగ రితరులశిశువుల్
దట్టించి యెవ్వ రే మని, పట్టించిరొ బాలకునకుఁ బరపక్షంబుల్. 144

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడిఁ గదా నాతండ్రి యీబుద్ధి దా
నీకున్ లోపలఁ దోఁచెనో పరులు దుష్కీర్తుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ వలికిరో యీదానవశ్రేణికిన్
వైకుంఠుండు గృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్. 145

మ. సురలం గొలుటయో సురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులం
బరివేధించుటయో మునిప్రవరులన్ బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగపతులన్ నాశంబు నొందించుటో
హరి యంచున్ గిరి యంచు నేల చెడ మోహాంధుండ వై పుత్రకా. 146

వ. అనినఁ దండ్రిమాటలకుఁ బురోహితు నిరీక్షించి ప్రహ్లాదుం డి ట్లనియె మోహ
నిర్మూలనంబు సేసి యెవ్వనియందుఁ దప్పగు లయి యెఱుక గలపురుషులకుం
బరులు దా రనియెడుమాయాకృతం బయినయసద్గ్రాహంబు గానంబడ దట్టిపర
మేశ్వరునకు నమస్కరించెద. 147

శా. అజ్ఞుల్ గొందఱు నేము దా రనుచు మాయం జెంది సర్వాత్మకుం
[2]బ్రజ్ఞాలభ్యు దురన్వయక్రమములన్ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసాపథమందు మూఢులు గదా చింతింప బ్రహ్మాదివే
దజ్ఞుల్ తత్పరమాత్ము విష్ణు నితరుల్ దర్శింపఁగా నేర్తురే. 148

తే. ఇనుమయస్కాంతసన్నిధి నెట్లుభ్రాంత, మగు హృషీకేశుసన్నిధి నావిధమునఁ

---

1 రిట్టి ట్టని మాఱు పలుక నెఱుఁగరు-రిట్టి ట్టని పలుక నెఱుఁగ రెల్ల-శిశువు. 2 బ్రజ్ఞాలబ్ధ
దురన్వయక్రమములన్.

గరఁగుచున్నది దైవయోగమునఁ జేసి, బ్రాహ్మణోత్తమచిత్తంబు భ్రాంతమగుచు.

సీ. మందారమకరంద మాధుర్యమునఁ దేలు, మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు, రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు, కోయిల సేరునే కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక, మరుగునే సాంద్రనీహారములకు

తే. నంబుజోదరదివ్యపాదారవింద, చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు, వినుతగుణశీల మాటలు వేయు నేల.

వ. అనిన విని రోషించి రాజసేవకుం డైనపురోహితుండు ప్రహ్లాదుం జూచి తిరస్కరించి యిట్లనియె. 151

ఉ. పంచశరద్వయస్కుఁడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములు చెప్పినశాస్త్రములోనియర్థ మొ
క్కించుక యైనఁ జెప్ప వసురేంద్రునిముందట మాకు నోదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరివిభూషణ వంశదూషణా. 152

చ. తనయుఁడు గాఁడు శాత్రవుఁడు దానవభర్తకు వీఁడు దైత్యచం
దనవనమందుఁ గంటకయుతక్షితిజాతము భంగిఁ బుట్టినాఁ
డనవరతంబు రాక్షసకులాంతకుఁ బ్రస్తుతి సేయుచుండు దం
డనమునఁ గాని శిక్షలకు డాయఁడు వట్టుఁడు కొట్టుఁ డుగ్రతిన్. 153

క. ఈపాపనిఁ జదివింతుము, నీపాదము లాన యింక నిపుణతతోడం
గోపింతుము దండింతుము, కోపింపకు మయ్య దనుజకుంజర వింటే. 154

వ. అని మఱియు నారాచపాపనికి వివిధోపాయంబులం బురోహితుండు వెఱపుఁ జూపుచు రాజసన్నిధిం బాపి తోడ్కొని పోయి గేహాంతంబున. 155

క. భార్గవనందనుఁ డతనికి, మార్గము సెడ కుండఁ బెక్కుమాఱులు నిచ్చల్
వర్గత్రితయము సెప్ప న, నర్గళ మగుమతివిశేష మమర నరేంద్రా. 156

వ. మఱియు గురుండు శిష్యునకు సామదానభేదదండోపాయంబు లన్నియు నెఱింగించి నీతికోవిదుం డయ్యె నని నమ్మి నిశ్చయించి తల్లికి నెఱింగించి తల్లిచేత నలంకృతుం డయినకులదీపకు నవలోకించి. 157

ఉ. త్రిప్పకు మన్న మామతము దీర్ఘము లైనత్రివర్గపాఠముల్
దప్పకు మన్న నేఁడు మనదైత్యవరేణ్యునిమ్రోల నేము మున్
చెప్పిననీతిఁ గాని మఱి చెప్పకు మన్న [1]విరోధినీతులన్
విప్పకు మన్న దుష్ట మగువిష్ణుచరిత్రకథార్థజాలముల్. 158

వ. అని బుజ్జగించి దానవేశ్వరునిసన్నిధికిం దోడి తెచ్చిన. 159

సీ. అడుగడ్గునకు మాధవానుచింతనసుధా, మాధుర్యమున మేను మఱచువాని

1 'విరోధిశాస్త్రముల్' అ. ప్ర.

నంభోజగర్భాదు లభ్యసింపఁగ లేని, హరిభక్తి పుంభావ మైనవాని
మాతృగర్భము సొచ్చి మన్నది మొదలుగాఁ, జిత్తమచ్యుతుమీఁదఁ జేర్చువాని
నంకించి తనలోన నఖిలప్రపంచంబు, శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని
తే. వినయకారుణ్యబుద్ధివివేకలక్ష, ణాదిగుణముల కాటపట్టయినవాని [మనుచు.
శిష్యు బుధలోకసంభావ్యుఁ జేరి గురుఁడు, ముందటికి ద్రొబ్బి తండ్రికి మ్రొక్కు

క. శిక్షించితి మన్యము లగు, పక్షంబులు మాని నీతిపారగుఁ డయ్యెన్
రక్షోవంశాధీశ్వర, వీక్షింపుము నీకుమారు విద్యాబలమున్. 161

వ. అని పలికిన శుక్రకుమారకువచనంబు లాకర్ణించి దానవేంద్రుండు దనకు దండప్రణామంబు చేసి నిలుచున్నకొడుకును దీవించి బాహుదండంబు సాఁచి దిగ్గనన్ డగ్గఱం దిగిచి గాఢాలింగనంబు సేసి తనతొడలమీఁద నిడుకొని చుంచు దువ్వి చిబుకంబుఁ బుడికి చెక్కిలి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రేమాతిరేకసంజనితబాష్పసలిలబిందుసందోహంబుల నతనివదనారవిందంబు దడుపుచు మందమధురాలాపంబుల ని ట్లనియె. 162

శా. చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యే మేమి సం
[1]వేద్యాంశంబులు సెప్పిరో గురువు లే వెంటం [2]బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁ గోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి సెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా. 163

శా. నిన్నున్ మెచ్చరు నీతిపారమహిమన్ నీతోడి దైత్యార్భకుల్
గన్నా రన్నియుఁ జెప్ప నేర్తురు గదా గ్రంథార్థముల్ దక్షులై
యున్నా రెన్నఁడు నీవు నీతివిదుఁడౌ దంచున్ మహావాంఛతో
నున్నాఁడన్ ననుఁ గన్నతండ్రి భవదీయోత్కర్షముం జూపవే. 164

వ. అనినం (గన్న)తండ్రికిఁ (బ్రియనందనుం డయిన)ప్రహ్లాదుం డి ట్లనియె. 165

క. చదివించిరి నను గురువులు, చదివితి ధర్మార్థముఖరశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు, చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ. 166

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్ర మంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా. 167

శా. అంధేందూదయముల్ మహాబధిరశంఖారావముల్ మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసకవధూకాంక్షల్ కృతఘ్నావలీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గంధంబుల్ హరిభక్తివర్జితులరిక్తవ్యర్థసంసారముల్. 168

1 వేద్యార్థంబులు. 2 వితర్కించిరో.

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు, శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు, మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు, పురుషోత్తమునిమీఁది బుద్ధి బుద్ధి
తే. దేవదేవునిఁ జింతించు దినము దినము, చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు, తండ్రి హరిఁ జేరుమనియెడి తండ్రి తండ్రి.
సీ. కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే, పవనకుంభితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే, ఢమఢమధ్వనితోడి ఢక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే, తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే, తనుకుడ్యజాలరంధ్రములు గాక
ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే, తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే, పాదయుగముతోడి పశువు గాక. 170
సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే, చక్రిదాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ని లాఱునే, విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజలరాసు లింకునే, హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే, పద్మాక్షునుతిరవిప్రభలు లేక
తే. నిరుపమాపునరావృత్తినిష్కళంక, ముక్తినిధిఁ గాన వచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాంజనము లేక, తామరసగర్భునకు నైన దానవేంద్ర. 171
వ. అని యివ్విధంబున వెఱపు మఱపు నెఱుంగక యులుకు సెడి పలికెడి కొడుకు నుడువులు సెవులకు ములుకులక్రియ నాఁడ వినఁ బెదవు లదరం గదురుచు నదరిపడి గురుసుతునిం గనుంగొని విమతకథనంబులు గఱపినాఁడ వని దానవేంద్రుం డిట్లనియె. 172
చ. పటుతరనీతిశాస్త్రచయపారగుఁ జేసెద నంచు బాలు ని
వ్వలఁ గొనిపోయి వానికి నవర్ణ్యము లైనవిరోధిశాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృగుప్రవరుండ వటంచు నమ్మితిం
గటకట బ్రాహ్మణాకృతివి గాక యథార్థపుబ్రాహ్మణుండవే. 173
క. [1]ధర్మేతరవర్తనులును, దుర్మంత్రులు నైనజనుల దురితము లొందున్
మర్మములు గలఁచి కల్మష, కర్మల రోగములు వొందు గైవడి విప్రా. 174
వ. అనిన రాజునకుఁ బురోహితుం డిట్లనియె. 175
ఉ. తప్పులు లేవు మావలన దానవనాథ విరోధిశాస్త్రముల్
సెప్పము క్రూరులై పరులుఁ జెప్పరు మీచరణంబులాన సు

1 ధర్మేతరులు నధర్ములు.

మ్మెప్పుడు మీకుమారునకు నింతయు నైజమనీష యెవ్వరుం
జెప్పెడిపాటి గాదు ప్రతిచింతఁ దలంపుము నేర్పుకైవడిన్. 176

క. మిత్రులము పురోహితులము, పాత్రుల మే మదియుఁ గాక భార్గవులము నీ
పుత్రుని నిటువలెఁ జేయఁగ, శత్రులమే దైత్యజలధిచంద్రమ వింటే. 177

వ. అనిన గురునందనుం గోపింపక దైత్యవల్లభుండు గొడుకు నవలోకించి యిట్లనియె.

క. ఒజ్జలు సెప్పనియీమతి, మజ్జాతుఁడ వైననీకు మఱి యెవ్వరిచే
నుజ్జాత మయ్యె బాలక, తజ్జనులం జేరుకొనుము తగ నామ్రోలన్. 179

వ. అనినఁ దండ్రికిఁ బ్రహ్లాదుం డిట్లనియె. 180

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గానలకు నేఁగిన నైన హరిప్రబోధముల్. 181

ఉ. కాననివాని నూఁతగొని కాననివాఁడ విశిష్టవస్తువుల్
గాననిభంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించినవైష్ణవాంఘ్రిసం
స్థానరజోభిషిక్తు లగుసంహృతకర్ములు దానవేశ్వరా. 182

శా. శోధింపం బడె సర్వశాస్త్రములు రక్షోనాథ వేదోక్తికిన్
గాథల్ మాధవశేముషీతరణిసాంగత్యంబునం గాక దు
ర్మేధన్ దాఁటఁగ వచ్చునే సుతవధూమీనోగ్రవాంఛామద
క్రోధోల్లోలవిశాలసంసృతిమహాఘోరామితాంభోనిధిన్. 183

వ. అని పలికినకొడుకును ధిక్కరించి మక్కువ సేయక రక్కసులఱేఁడు దనతొడల
పై నుండనీక గొబ్బున దిగఁద్రొబ్బి నిబ్బరంబు లగుకోపతాపంబులు దీపింప
వేఁడిచూపుల మంట మంట లెగయ మంత్రులం జూచి యిట్లనియె. 184

శా. క్రోడం బై పినతండ్రిఁ జంపె నని తాఁ గ్రోధించి చిత్తంబులో
[1]వీడం జేయఁడు బంటుభంగి హరికిన్ విద్వేషికిన్ భక్తుఁడై
యోడం డక్కట ప్రాణవాయువులు వీఁ డొప్పించుచున్నాఁడు నా
తోడన్ వైరము వట్టె నిట్టిజనకద్రోహిన్ మహిం గంటిరే. 185

వ. అని రాక్షసవీరుల నీక్షించి యిట్లనియె. 186

హిరణ్యకశిపుండు ప్రహ్లాదుని వివిధోపాయంబుల హింసించుట.

శా. పంచాబ్దంబులవాఁడు తండ్రి నగునాపక్షంబు నిందించి య
త్కించిద్భీతియు లేక విష్ణు నహితుం గీర్తించుచున్నాఁడు వ
ద్దంచుం జెప్పిన మానఁ డంగమునఁ బుత్రాకారతన్ వ్యాధి జ

1 వ్రీడం. 2 గనుంగొంటిరే.

న్నించెఁ దీని వధించి రండు దనుజుల్ ! మీమీపటుత్వంబులన్. 187

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్ష సేయుక్రియ నీయజ్ఞుం గులద్రోహి దు
ష్టాంగుం గేశవపక్షపాతి నధముం ! జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదన్ గులము నిర్దోషంబు గావించెదన్. 188

క. హంతవ్యుఁడు రక్షింపను, మంతవ్యుఁడు గాఁడు యమునిమందిరమునకున్
గంతవ్యుఁడు వధమున కుప,రంతవ్యుం డనక చంపి ! రం డీపడుచున్. 189

వ. అని దానవేంద్రుం డానతిచ్చిన వాఁడికోఱలు గలరక్కసులు పెక్కండ్రు శూల
హస్తులై వక్త్రంబులు దెఱచికొని యుబ్బి బొబ్బ లిడుచు ధూమసహితదావ
దహనంబునుంబోలెఁ దామ్రసంకాశంబు లయిన కేశంబులు మెఱయ భేదన
వాదనచ్ఛేదనంబులు సేయుచు. 190

ఉ. బాలుఁడు రాచబిడ్డఁడు కృశాంగుఁడు సాధుఁడు లోకమాన్యసం
శీలుఁడు వీఁ డనఘ్యుఁ డని ! చిక్కక స్రుక్కక క్రూరచిత్తులై
శూలములం దదంగముల ! సుస్థిరులై ప్రహరించి రుగ్రవా
చాలత నందఱున్ దివిజశత్రుఁడు వల్దనఁ డయ్యె భూవరా. 191

చ. పలువురు దానవుల్ పొడువ ! బాలునిదేహము లేశమాత్రము
[1]న్నలియదు లోపలన్ రుధిర ! మబ్బదు కందదు శల్యసంఘముల్
నలియదు కృష్ణువైభవము ! నష్టము గాదు ముఖేందుకాంతియుం
బొలియదు నూతనశ్రమము ! పుట్టదు [2]పట్టదు దీనభావమున్. 192

ఉ. తన్ను నిశాచరుల్ పొడువ ! దైత్యకుమారుఁడు మాటిమాటి కో
పన్నగశాయి యోదనుజభంజన యోజగదీశ యోమహా
పన్నశరణ్య యోనిఖిల[3]పావన యంచు నుతించుఁ గాని తాఁ
గన్నుల నీరు దేఁడు భయకంపసమేతుఁడు గాఁడు భూవరా. 193

ఉ. పాఱఁడు లేచి దిక్కులకు ! బాహుబలు లొడ్డఁడు బంధురాజిలోఁ
దూఱఁడు ఘోరకృత్య మని ! దూఱఁడు తండ్రిని మిత్రవర్గముం
జీరఁడు మాతృసంఘము వసించుసువర్ణగృహంబులోనికిం
దాఱఁడు కావవే యనఁడు ! తాపము నొందఁడు కంటగింపఁడున్. 194

వ. ఇట్లు సర్వాత్మకంబై యిట్టిదట్టి దని నిర్దేశింప రానిపరబ్రహ్మంబు దాన యై
యున్న మహావిష్ణునియందుఁ జిత్తంబుఁ జేర్చి తన్మయుం డయి పరమానందంబునం
బొంది యున్నప్రహ్లాదునియందు రాక్షసేంద్రుండు దనకింకరులచేతం జేయించు
చున్నమారణకర్మంబులు పాపకర్మునియందుఁ బ్రయుక్తంబులైన సత్కారంబు
లుంబోలె విఫలంబు లగుటం జూచి. 195

1 న్నలియదు. 2 మోమున దీనభావమున్. 3 భావన.

ఉ. శూలములన్ నిశాచరులు స్రుక్కక దేహము నిగ్రహింపఁగా
బాలుఁడు నేలపైఁ బడఁడు పాఱఁడు చావఁడు తండ్రి నైన నా
పాలికి వచ్చి చక్రధరుపక్షము మానితి నంచుఁ బాదముల్
ఫాలము సోఁక మ్రొక్కఁ డనపాయత నొందుట కేమి హేతువో. 196

వ. అని శంకించుచు. 197

సీ. ఒకమాటు దిక్కుంభియూథంబుఁ దెప్పించి, కెరలి డింభకునిఁ ద్రొక్కింపఁబంపు
నొకమాటు విషభీకరోరగశ్రేణులఁ, గడువడి నర్భకుఁ గఱవఁ బంపు
నొకమాటు హేతిసంఘోగ్రానలములోన, విసరి కుమారుని వ్రేయఁ బంపు
నొకమాటు కూలంకషోల్లోలజలధిలో, మొత్తించి బాలకు ముంపఁ బంపు

ఆ. విషముఁ బెట్టఁ బంపు వికళింపఁగాఁ బంపు, దొడ్డకొండచఱులఁ ద్రోయఁబంపుఁ
బట్టి కట్టఁ బంపు బాధింపఁ గాఁ బంపు, బాలుఁ గినిసి దనుజపాలుఁ డధిప.

సీ. ఒకవేళ నభిచారహోమంబు సేయించు, నొకవేళ నెండల నుండఁ బంచు
నొకవేళ వానల నుపహతి నొందించు, నొకవేళ రంధ్రంబు లుక్కఁబట్టు
నొకవేళఁ దనమాయ నొదవించి బెగడించు, నొకవేళ మంచున నొంటి నిలుపు
నొకవేళఁ బెనుగాలి కున్ముఖుఁ గావించు, నొకవేళఁ బాతించు నుర్వియందు

తే. నీరు నన్నంబు నిడ నీక నిగ్రహించుఁ
గశల నడిపించు నువ్వించు గండశిలల
గదల వ్రేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ సమరారి క్రోధి యగుచు. 199

వ. మఱియు ననేకమారణోపాయంబులఁ బాపరహితుం డైనపాపనిరూపు మాప లేక యేకాంతంబున దురంతచింతాపరిశ్రాంతుం డయి రాక్షసేంద్రుండు దన మనంబున. 200

ఉ. ముంచితి వార్ధులన్ గదల మొత్తితి శైలతటంబులందుఁ ద్రొ
బ్బించితి శస్త్రరాజిఁ బొడిపించితి మీఁద నిభేంద్రపంక్తిఁ ద్రొ
ప్పించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితిఁ బెక్కుపాట్ల నలయించితిఁ జావఁడి దేమి చిత్రమో. 201

చ. ఎఱుఁగఁడు జీవనౌషధము లెవ్వరు భర్తలు లేరు బాధలం
దరలఁడు నైజతేజమునఁ దధ్యముఁ జాడ్యము లేదు మిక్కిలిన్
మెఱయుచు నున్నవాఁ డొకనిమేషము దైన్యము నొందఁ డింక నే
తెఱఁగునఁ ద్రుంతు వేసరితి దివ్యము వీనిప్రభావ మెట్టిదో. 202

వ. అదియునుం గాక తొల్లి శునశ్శేపుం డనుమునికుమారుఁడు దండ్రిచేత యాగపశుత్వంబునకు దత్తుం డయి తండ్రి తనకు నపకారి యని తలంపక బ్రదికిన చందంబున. 203

క. ఆగ్రహమున నేఁ జేసిన, నిగ్రహములు పరులతోడ నెఱి నొకనాఁడున్
విగ్రహము లనుచుఁ బలుకఁడ, నుగ్రహములుగా స్మరించు నొవ్వఁడు మదిలోన్.

వ. కావున వీఁడు మహాప్రభావసంపన్నుండు వీని కెందును భయంబు లేదు వీనితోడివిరోధంబునం దనకు మృత్యువు సిద్ధించు నని నిర్ణయించి చిన్నఁబోయి ఖిన్నుండై ప్రసన్నుండు గాక క్రిందు చూచుచు విషణ్ణుండై చింతనంబు సేయుచున్న రాజునకు మంతనంబునఁ జండామర్కు లి ట్లనిరి. 205

శా. శుభ్రఖ్యాతివి నీప్రతాపము మహాశ్చర్యంబు దైత్యేంద్ర రో
షభ్రూయుగ్మవిజృంభణంబున దిగీశవ్రాతముం బోరులన్
విభ్రాంతంబుగఁ జేసి గెలితి గదా విశ్వంబు వీఁ డెంత యీ
దభ్రోక్తుల్ గుణదోషహేతువులు చింతం బొంద నీ కేటికిన్. 206

శా. వక్రుం డైనజనుండు వృద్ధగురుసేవం జేసి మేధానయో
పక్రాంతిన్ విలసిల్లు మీఁదట వయఃపాకంబుతో బాలకున్
శక్రద్వేషణబద్ధుఁ జేయుము మదిన్ జాలింపు మీరోషమున్
శుక్రాచార్యులు వచ్చునంత కితఁడున్ సుశ్రీయుతుం డయ్యెడున్. 207

వ. అని గురుపుత్రులు పలికిన రాక్షసేశ్వరుండు గృహస్థులైనరాజులకు నుపదేశింపఁ దగినధర్మార్థకామంబులు ప్రహ్లాదునకు నుపదేశింపుం డని యనుజ్ఞ సేసిన వారు నతనికిఁ ద్రివర్గంబు నుపదేశించిన నతండు రాగద్వేషంబులచేత విషయాసక్తులైనవారలకు గ్రాహ్యంబులైనధర్మార్థకామంబులుఁ దనకు నగ్రాహ్యంబు లనియును వ్యవహారప్రసిద్ధికొఱకైనభేదంబు గాని యాత్మభేదంబు లే దనియును నవర్థంబులయం దర్థకల్పన సేయుట దిగ్భ్రమం బనియును నిశ్చయించి గురూపదిష్టశాస్త్రంబులు మంచి వని తలంపక గురువులు స్వగృహస్థకర్మానుష్ఠానంబులకుం బోయినసమయంబున. 208

క. ఆటలకుఁ జన్నరమ్మని, పాటించి నిశాటసుతులు భాషించిన నా
పాటకు నేంద్రకుమారుఁడు, పాటవమున వారిఁ [1]జేరి ప్రజ్ఞాన్వితుఁడై. 209

క. చెప్పఁ డొకచదువు మంచిది, చెప్పెడిఁ దగులములు సెవులు సిందఱగోనఁగాఁ
జెప్పెడు మనయొడ నొజ్జలు, సెప్పెద నొకచదువు వినుఁడు చిత్తము లలరన్.

వ. అని రాజకుమారుండు గావునఁ గరుణించి సంగడికాండ్రతోడ నగియెడిచందంబునఁ గ్రీడలాడుచు సమానవయస్కులైనదైత్యకుమారుల కెల్ల నేకాంతంబున ని ట్లనియె. 211

ఉ. బాలకులార రండు మనప్రాయపుబాలురు కొంద ఱుర్విపైఁ
గూలుట గంటిరే గురుఁడు క్రూరుఁ డనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁ [2]జేసెడి గ్రాహ్యము గాదు శాస్త్రముల్

---

1 జేరి. 2 జెప్పెడి.

మే లెఱిఁగించెదర | వినిన మీకు నిరంతరభద్ర మయ్యెడిన్. 212

వ. వినుండు సకలజన్మంబులందును ధర్మార్థాచరణకారణం బయినమానుషజన్మంబు
దుర్లభం బందుఁ బురుషత్వంబు దుర్గమం బదియు శతవర్షపరిమితం బైనజీవిత
కాలంబున నియతం బై యుండు నందు సగ మంధకారబంధురం బయి రాత్రి
రూపంబున నిద్రాదివ్యవహారంబుల నిరర్థకం బయి చనుఁ జిక్కినపంచాశ
ద్వత్సరంబులందును బాల్య కైశోర కౌమారాదివయోవిశేషంబుల వింశతిహా
యనంబులు గడచుఁ గడమముప్పదియబ్దంబులు నింద్రియంబులచేతఁ బట్టు
వడి దురవగాహంబు లయినకామక్రోధలోభమోహమదమత్సరంబు లనుపా
శంబులం గట్టువడి విడివడ సమర్థుండు గాక ప్రాణంబులకంటె మధురాయ
మాణ యైనతృష్ణకు లోనై భృత్యతస్కరవణిక్కర్మంబులఁ బ్రాణహాని యైన
నంగీకరించి పరార్థంబుల నర్థించుచు రహస్యసంభోగచాతుర్యసౌందర్యవిశేషం
బుల ధైర్యవల్లికాలవిత్రంబు లయినకళత్రంబులను మహనీయమంజులమధురా
లాపంబులు గలిగి వశు లయినశిశువులను శీలవయోరూపధన్య లగుకన్యలను
వినయవివేకవిద్యాలంకారు లయినకుమారులను గామితఫలప్రదాత లగుభ్రాత
లను మమత్వప్రేమదైన్యజనకు లయినజననీజనకులను సకలసౌజన్యసింధువు
లయినబంధువులను ధనకనకవస్తువాహనసుందరంబు లయినమందిరంబులను సుక
రంబు లైనపశుభృత్యనికరంబులను వంశపరంపరాయత్తంబు లయినవిత్తంబు
లను వర్జింప లేక సంసారంబు నిర్జించునుపాయంబుఁ గానక తంతువర్గంబున
నిర్గమద్వారశూన్యం బయినమందిరంబుఁ జేరి చుట్టువడి వెడలెడిపాటవంబుసాలక
తగులువడుకీటకంబుచందంబున గృహస్థుండు స్వయంకృతకర్మబద్ధుం డై శిశ్నో
దరాదిసుఖంబులఁ బ్రమత్తుం డయి నిజకుటుంబపోషణపారవశ్యంబున విరక్తి
మార్గంబుఁ దెలియనేరక స్వకీయపరకీయభిన్నభావంబున నంధకారంబునం బ్రవే
శించుం గావునఁ గౌమారసమయంబున మనీషాగరిష్ఠుం డై పరమభాగవతధర్మం
బు ననుష్ఠింప వలయు దుఃఖంబులు వాంఛితంబులు గాక చేకుఱుభంగి సుఖంబు
లును గాలానుసారంబు లై లబ్ధంబు లగుం గావున వృథాప్రయాసంబున నాయు
ర్వ్యయంబు సేయం జనదు హరిభజనంబున మోక్షంబు సిద్ధించు విష్ణుండు సర్వ
భూతంబులకు నాత్మేశ్వరుండు ప్రియుండు ముముక్షు వైనదేహికి దేహావసాన
పర్యంతంబు నారాయణచరణారవిందసేవనంబు గర్తవ్యంబు. 213

సీ. కంటిరే మనవారు | ఘనులు గృహస్థులై, విఫలులై కైకొన్న | వెఱ్ఱితనము
భద్రార్థు లై యుండి | పాయరు సంసార,పద్ధతి నూరక | పట్టువడిరి
కలయోనులం దెల్ల | గర్భాద్యవస్థలఁ, బురుషుండు దేహి యై | పుట్టుచుండుఁ
ద న్నెఱుంగఁడు కర్మ|తంత్రుఁ డై కడపట, ముట్టఁడు భవశత|ములకు నయిన

ఆ. దీన శుభము లేదు | దివ్యకీర్తియు లేదు, జగతిఁ బుట్టి పుట్టి | చచ్చి చచ్చి

పోరల నేల మనకుఁ బుట్టని చావని, త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి. 214

శా. హాలాపానవిజృంభమాణమదగర్వాతీతదేహోల్లస
ద్బాలాలోకనశృంఖలానిచయసంబద్ధాత్ముఁడై లేశమున్
వేలానిస్సరణంబు గానక మహావిద్వాంసుఁడుం గామినీ
హేలాకృష్టకురంగశాబక మగున్ హీనస్థితిన్ వింటిరే. 215

ఆ. విషయసక్తులైన విబుధాహితులతోడి, మనికి వలదు ముక్తిమార్గవాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుఁడు ముక్త, సంగజనులఁ గూడి శైశవమున.

వ. కావున విషయంబులఁ జిక్కువడినరక్కసులకు హరిభజనంబు శక్యంబు గాదు రమ్య మయ్యును బహుతరప్రయాసగమ్య మని తలంచితి రేనిఁ జెప్పెద సర్వభూతాత్మకుండై సర్వదిక్కాలసిద్ధుండై బ్రహ్మ కడపలగాఁ గలచరాచరస్థూలసూక్ష్మజీవసంఘంబులందును నభోవాయుకుంభినీసలిలతేజంబు లనియెడుమహాభూతంబులయందును భూతవికారంబు లయినఘటపటాదులయందును గుణసామ్యం బయినప్రధానమందును గుణవ్యతికరం బైనమహత్తత్త్వాదియందును రజస్సత్త్వతమోగుణంబులయందును భగవంతుం డవ్యయుం డీశ్వరుండు పరమాత్మ పరబ్రహ్మ మనియెడువాచకశబ్దంబులు గల్గి కేవలానుభవానందస్వరూపకుండు నవికల్పితుండు ననిర్దేశ్యుండు నయినపరమేశ్వరుండు త్రిగుణాత్మకం బైనతనదివ్యమాయచేత నంతర్హితైశ్వర్యుం డై వ్యాప్యవ్యాపకరూపంబులం జేసి దృశ్యుండును ద్రష్టయు భోగ్యుండును భోక్తయు నయి నిర్దేశింపం దగి వికల్పితుం డై యుండుం దత్కారణంబున నాసురభావంబు విడిచి సర్వభూతంబులందును దయాసుహృద్భావంబులు గర్తవ్యంబులు దయా(సుహృద్భావంబులు) గల్గిన నధోక్షజుండు సంతసించు ననంతుం డాద్యుండు హరి సంతసించిన నలభ్యం బెయ్యదియు లేదు జనార్దనచరణసరసీరుహయుగళస్మరణసుధారసపానపరవశుల మైతి మేని మనకు దైవవశంబున నకాంక్షితంబు లై సిద్ధించుధర్మార్థకామంబులుఁ గాంక్షితం బై సిద్ధించుమోక్షంబును నేల త్రివర్గంబును నాత్మవిద్యయుం దర్కదండనీతి జీవికాదు లన్నియుఁ ద్రైగుణ్యవిషయంబు లైనవేదంబులవలనం బ్రతిపాద్యంబులు నిస్త్రైగుణ్యలక్షణంబునం బరమపురుషుం డైనహరికి నాత్మసమర్పణంబు సేయుట మేలు పరమాత్మతత్త్వజ్ఞానోదయంబునం జేసి స్వపరభ్రాంతి సేయక పురుషుండు యోగావధూతత్వంబున నాత్మవికల్పభేదంబునం గలలోఁ గన్నవిశేషంబులభంగిం దథ్యం బనక మిథ్య యని తలంచు నని మఱియుఁ బ్రహ్లాదుం డిట్లనియె. 217

మ. నరుఁడుం దానును మైత్రితో మెలఁగుచున్ నారాయణుం డింతయున్
వరుసన్ నారదసంయమీశ్వరునకున్ వ్యాఖ్యానముం జేసె మున్
హరిభక్తాంఘ్రిపరాగశుద్ధతను లేకాంతుల్ మహాకించనుల్

పరతత్త్వజ్ఞులు గాని నేరరు మదిన్ భావింప [1]నిజ్ఞానమున్. 218

వ. తొల్లి నేను దివ్యదృష్టి గలనారదమహామునివలన సవిశేషం బయినయాజ్ఞానంబును బరమభాగవతధర్మంబును వింటి ననిన నెఱుంగుపడి దైత్యబాలకు లద్దనుజరాజకుమారున కి ట్లనిరి. 219

ఉ. మంటిమి గూడి భార్గవకుమారకులొద్ద ననేకశాస్త్రముల్
వింటిమి లేదు సద్గురుఁడు వేఱొకఁ డెన్నఁడు రాజశాల ము
క్కంటికి నైన రాదు సొరఁ గా వెలికిం జన రాదు నీకు ని
ష్కంటకవృత్తి నెవ్వఁడు ప్రగల్భుఁడు సెప్పె గుణాఢ్య చెప్పుమా. 220

క. సేవింతుము నిన్నెప్పుడు, భావింతుము రాజ వనుచు బహుమానములం
గావింతుము తెలియము నీ, కీవింతమతిప్రకాశ మే క్రియఁ గలిగెన్. 221

వ. అని యిట్లు దైత్యనందనులు దన్నడిగినఁ బరమభాగవతకులాలంకారుం డైన ప్రహ్లాదుండు నగి తనకుఁ బూర్వంబునందు వినంబడిననారదుమాటలు దలంచి యి ట్లనియె. 222

శా. అక్షీణోగ్రతపంబు మందరముపై నర్థించి మాతండ్రి శు
ద్ధక్షాంతిం జని యుండఁ జీమగమిచేతన్ భోగిచందంబునన్
భక్షింపంబడెఁ బూర్వపాపములచేఁ బాపాత్మకుం డంచు ముల్
రక్షస్సంఘముమీఁద నిర్జరులు సంరంభించి యుద్ధాఢ్యులై. 223

శా. ప్రస్థానోచితభేరిభాంకృతులతోఁ బ్రాకారియుం దారు శౌ
ర్యస్థైర్యంబుల నేఁగుదెంచినఁ దదీయాటోపవిభ్రాంతులై
స్వస్థేమల్ దిగ నాడి పుత్త్రధనయోషామిత్రసంపత్కళా
ప్రస్థానంబులు డించి పాఱి రసురుల్ ప్రాణావనోద్యుక్తులై. 224

మత్తకోకిలము. ప్రల్లదంబున వేల్పు లుద్ధతిఁ బాఱి రాజనివాసముం
గొల్లపెట్టి సమస్తవిత్తముఁ గ్రూరతం గొని పోవఁగా
నిల్లు సొచ్చి విశంకులై యమరేశ్వరుం డదలించి మా
తల్లిఁ దాఁ జెఱపట్టె సిగ్గునఁ దప్తయై విలపింపఁగాన్. 225

వ. ఇట్లు సురేంద్రుండు మాతల్లిం జెఱగొని పోవుచుండ నమ్ముగుద కురరి యను పులుఁగుక్రియ మొఱ లిడినఁ బెరువున దైవయోగంబున నారదుండు పొడగని యి ట్లనియె. 226

ఉ. స్వర్భువనాధినాథ సురసత్తమ వేల్పులలోన మిక్కిలిన్
నిర్భరపుణ్యమూర్తివి సునీతివి మానినిఁ బట్ట నేల యీ
గర్భిణి నాతురన్ విడువు కల్మషమానసురాలు గాదు నీ

1 నీతత్త్వమున్.

దుర్భరరోషముల్ నిలుపు దుర్జయుఁడై ననిలింపవైరిపై. 227

వ. అనిన వేల్పుఁదపసికి వేయిగన్నులు గలగుఱువ యిట్లనియె. 228

ఉ. అంతనిధానమైనదితిజాధిపువీర్యము దీనికుక్షి న
త్యంతసమృద్ధి నొందెడి మహాత్మక కావునఁ దత్ప్రసూతిప
ర్యంతము బద్ధఁ జేసి జనితార్భకు వజ్రముధారఁ ద్రుంచి ని
శ్చింతుఁడనై తుదిన్ విడుతు సిద్ధము దానవరాజవల్లభన్. 229

వ. అని పలికిన వేల్పుఱేనికిం దపసి యిట్లనియె. 230

శా. నిర్భీకుండు ప్రశస్తభాగవతుఁ డున్నిద్రుండు జన్మాంతరా
విర్భూతాచ్యుతపాదభక్తిమహిమావిష్టుండు దైత్యాంగనా
గర్భస్థుం డగుబాలకుండు బహుసంగ్రామాద్యుపాయంబులన్
దుర్భావంబునఁ బొంది చావఁడు భవద్దోర్దండవిభ్రాంతుఁడై. 231

వ. అని దేవముని నిర్దేశించిన నతనివచనంబులు మన్నించి తానును హరిభక్తుండు గావున దేవేంద్రుండు భక్తిబాంధవంబున మాయవ్వను విడిచి వలగొని సురలోకంబునకుం జనియె మునీంద్రుండును మజ్జననియందుఁ బుత్రికాభావంబు సేసి యూఱడించి నిజాశ్రమంబునకుం గొనిపోయి నీవు పతివ్రతవు నీయుదరంబునఁ బరమభాగవతుం డయినప్రాణి యున్నవాఁడు తపోమహత్త్వంబునం గృతార్థుం డై నీపెనిమిటి రాఁ గలం డందాఁక నీ విక్కడ నుండు మనిన సమ్మతించి.

శా. యోషారత్నము నాథుఁ డైనవతి విశోకోద్యోగ మాతల్లి ని
ర్వైషమ్యంబున నాథురాక మదిలో వాంఛించి నిర్దోష యై
యీషద్భీతియు లేక గర్భపరిరక్షేచ్ఛన్ విచారించి శు
శ్రూషల్ సేయుచు నుండె నారదునకున్ సువ్యక్తశీలంబునన్. 233

వ. ఇట్లు దనకుఁ బరిచర్య సేయుచున్న దైత్యరాజకుటుంబినికి నాశ్రితరక్షావిశారదుం డైననారదుండు నిజసామర్థ్యంబున నభయం బిచ్చి గర్భస్థుండ నైననన్ను నుద్దేశించి ధర్మతత్త్వంబును నిర్మలజ్ఞానంబును నుపదేశించిన నమ్ముద్దియ దద్దయుం బెద్దకాలంబునాఁటివినికి గావున నాఁడుది యగుటం జేసి పరిపాటి దప్పి సూటి లేక మఱచె నారదుండు నాయెడఁ గృప గలనిమిత్తంబున. 234

క. వెల్లిగొని నాఁటనుండియు, నుల్లసితం బైనదైవయోగంబున శో
భిల్లెడు మునిమత మంతయు, నుల్లంబున మఱపు వుట్ట దొకనాఁ డైనన్. 235

ఆ. వినుఁడు నాదుపలుకు విశ్వసించితి రేని, సతుల కయిన బాలజనుల కయినఁ
దెలియ వచ్చు మేలు దేహాద్యహంకార,దళననిపుణ మైనతపసిమతము. 236

వ. అని నారదోక్తప్రకారంబున బాలకులకుఁ బ్రహ్లాదుం డిట్లనియె నీశ్వరమూర్తి యైనకాలంబునం జేసి వృక్షంబు గలుగు చుండ ఫలంబునకు జన్మసంస్థానవర్ధనాపక్షీణత్వపరిపాకనాశంబులు ప్రాప్తంబు లయినతెఱంగున దేహంబులకుం గాని

షడ్భావవికారంబు లాత్మకు లేవాత్మ నిత్యుండు క్షయరహితుండు శుద్ధుండు క్షేత్రజ్ఞుండు గగనాదులకు నాశ్రయుండుఁ గ్రియాశూన్యుండు స్వప్రకాశుండు సృష్టిహేతువు వ్యాపకుండు నిస్సంగుండుఁ బరిపూర్ణుండు నొక్కఁడు నని వివేక సమర్థంబు లగు నాత్మలక్షణంబులు పండ్రెండు నెఱుంగుచు దేహాదులందు మోహజనకంబు లగు నహంకారమమకారంబులు విడిచి పసిండిగనులు గలనేల వున విభ్రాజమానకనకలేశంబు లైన పాషాణాదులందుఁ బుటంబు పెట్టి వహ్ని యోగంబునఁ గరంగ నూఁది హేమకారకుండు పాటవంబున హాటకంబుఁ బడయుభంగి నాత్మకృతకార్యకారణంబుల నెఱింగెడినేర్పరి దేహంబునం దాత్మ సిద్ధిఁగోరెడు నయిన యుపాయంబునం జేసి బ్రహ్మభావంబుఁ బడయు మూలప్రకృతి యు మహదహంకారంబులును బంచతన్మాత్రంబులు నివి యెనిమిదియుం బ్రకృ తు లనియును రజస్సత్త్వతమంబులు మూఁడును బ్రకృతిగుణంబు లనియును కర్మేంద్రియంబు లయిన వాక్పాణిపాదపాయూపస్థంబులును జ్ఞానేంద్రియంబు లైన శ్రవణనయనరసనాత్వగ్ఘ్రాణంబులును మనంబును మహీసలిలతేజోవాయు గగనంబులును నివి పదాఱును వికారంబు లనియును గపిలాదిపూర్వాచార్యుల చేతఁ జెప్పంబడియె సాక్షిత్వంబున నీయిరువదేడింటిని నాత్మ గూడి యుండుఁ జెక్కింటికూటువ దేహ మదియు జంగమస్థావరరూపంబుల రెండువిధంబు లయ్యె మూలప్రకృతి మొదలయినవర్గంబునకు వేఱై మణిగణంబులం గ్రుచ్చి యున్నసూత్రంబుచందంబున నాత్మ యిన్నింటియందును గ్రుచ్చి దీపించు నాత్మకు జన్మస్థితిలయంబులు గల వంచు మిథ్యాతత్పరులు గాక వివేకశుద్ధ మైన మనంబునం జేసి విచారించి దేహంబునం దాత్మ వెదక వలయు నాత్మకు నవస్థలు గలయట్లుండుఁ గాని యవస్థలు లేవు జాగరణస్వప్నసుషుప్తు లనువృత్తు లెవ్వని చేత నెఱుంగంబడు నతం డాత్మ యంద్రు కుసుమధర్మంబు లయినగంధంబుల చేత గంధాశ్రయుం డయినవాయువు నెఱింగెడుభంగిం ద్రిగుణాత్మకంబు లయి కర్మజన్యంబు లయినబుద్ధిభేదంబుల నాత్మ నెఱుంగం దగు నని చెప్పి. 237

సీ. సంసార మిది బుద్ధిసాధ్యము గుణకర్మ, గణబద్ధ మజ్ఞానకారణంబు
గలవంటి దింతియ కాని నిక్కము గాదు, సర్వార్థములు మనస్సంభవములు
స్వప్నజాగరములు సమములు గుణశూన్యుఁ, డగుపరమునికి గుణాశ్రయమున
భవవినాశంబులు వాటిల్లిన ట్లుండుఁ, బట్టి చూచిన లేవు బాలురార

తే. కడఁగి త్రిగుణాత్మకము లైన కర్మములకు, జనక మై వచ్చు నజ్ఞానసముదయమును
ఘనతరజ్ఞానవహ్నిచేఁ గాల్చి పుచ్చి, కర్మవిరహితు లై హరిఁ గనుట మేలు.

వ. అది గావున గురుశుశ్రూషయు సర్వలాభసమర్పణంబును సాధుజనసంగమంబు ను నీశ్వరప్రతిమాసమారాధనంబును హరికథాతత్పరత్వంబును వాసుదేవునియం

దలిప్రేమయు నారాయణగుణకర్మకథానామకీర్తనంబును వైకుంఠచరణకమల
ధ్యానంబును విశ్వంభరమూర్తివిలోకనపూజనంబును మొదలయినవిజ్ఞానవై
రాగ్యలాభసాధనంబు లైనభాగవతధర్మంబులపై రతి గలిగి సర్వభూతంబుల
యందు నీశ్వరుండు భగవంతుం డాత్మ గలం డని సన్మానంబు సేయుచుఁ గామ
క్రోధలోభమోహమదమత్సరంబులం గెలిచి యింద్రియవర్గంబును బంధించి
భక్తి సేయుచుండ నీశ్వరుం డయినవిష్ణుదేవునియందలిగతి సిద్ధించు. 239

సీ. దనుజారిలీలావతారంబులందలి, శౌర్యకర్మంబులు సద్గుణములు
వినిభక్తుఁ డగువాఁడు వేడ్కతోఁ బులకించి, కన్నులహర్షాశ్రుకణము లొలుక
గద్గదస్వరముతోఁ గమలాక్ష వైకుంఠ, వరద నారాయణ వాసుదేవ
యనుచు నెత్తిలిపాడు నాక్రోశించు, నగుఁ జింతనము సేయు నతియొనర్చు

తే. మరులుకొనియుండుఁ దనలోన మాటలాడు, వేల్పుసోఁకినపురుషునివృత్తిఁ దిరుగు
బంధములఁ బాసియజ్ఞానపటలిఁ గాల్చి, విష్ణుఁ బ్రాపించుఁ దుదిభక్తివివశుఁ డగుచు.

వ. కావున రాగాదియుక్తమనస్కుం డయినశరీరికి సంసారచక్రనివర్తకం బయిన హరిచింతనంబు బ్రహ్మానందనిర్వాణసుఖం బెట్టిదట్టి దని బుధులు దెలియుదురు హరిభజనంబు దుర్గమంబు గాదు హరి సకలప్రాణిహృదయంబులయందు నంతర్యామి యై యాకాశంబుభంగి నుండు విషయార్జనంబుల నయ్యెడిది లేదు నిమిషభంగురప్రాణు లయినమర్త్యులకు మమతాస్పదంబులును జంచలంబులును నైనపుత్రమిత్రకళత్ర పశుభృత్యబలబంధురాజ్యకోశమణిమందిరమంత్రిమాతంగమహీప్రముఖవిభవంబులు నిరర్థకంబులు యాగప్రముఖపుణ్యలబ్ధంబు లైనస్వర్గాదిలోకభోగంబులు పుణ్యానుభవక్షీణంబులు గాని నిత్యంబులు గావు నరుండు విద్వాంసుండ నని యభిమానించి కర్మంబు లాచరించి యమోఘంబు లయినవిపరీతఫలంబుల నొందుఁ గర్మంబులు గోరక చేయవలయుఁ గోరి చేసిన దుఃఖంబులు ప్రాప్తించుఁ బురుషుండు దేహంబుకొఱకు భోగంబుల నపేక్షించు దేహంబు నిత్యంబు గాదు తోడ రాదు మృతం బయినదేహమును శునకాదులు భక్షించు దేహి కర్మంబు లాచరించి కర్మబద్ధుం డయి క్రమంబునం గర్మానుకూలం బయినదేహంబుఁ దాల్చు నజ్ఞానంబునం జేసి పురుషుండు కర్మదేహంబుల విస్తరించు నజ్ఞానతంత్రంబులు ధర్మార్థకామంబులు జ్ఞానలభ్యంబు మోక్షంబు మోక్షప్రదాత యగుహరి సకలభూతంబులకు నాత్మేశ్వరుండు ప్రియుండు దన చేత నయినమహాభూతంబులతోడ జీవసంజ్ఞితుం డయి యుండు నిష్కాము లై హృదయగతుం డయినహరిని నిజభక్తిని భజింపవలయు. 241

క. దానవదైత్యభుజంగమ, మానవగంధర్వసురసమాజములో ల
క్ష్మీనాథుచరణకమల, ధ్యానంబున నెవ్వఁ డయిన ధన్యత నొందున్. 242

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ, జిక్కఁడు దానముల శౌచశీలతపములం

చిక్కఁడు యుక్తిని భక్తిని, జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ. 243

క. చాలదు భూదేవత్వము, సాలదు దేవత్వ మధికశాంతత్వంబుం
జాలదు హరి మెప్పింప వి,శాలోద్యములార భక్తి సాలినభంగిన్. 244

ఆ. దనుజభుజగయక్షదైత్యమృగాభీర,సుందరీవిహంగశూద్రశబరు
లైనఁ బాపజీవులైన ముక్తికిఁ బోరు, రఖిలజగము విష్ణుఁ డనుచుఁ దలఁచి.

క. గురువులు దమకును లోఁబడు, తెరువులు సెప్పెదరు విష్ణుదివ్యపదవికిం
దెరువులు సెప్పరు చీఁకటిఁ, బరువులు వెట్టంగ నేల బాలకులారా. 246

క. తెం డెల్లపుస్తకంబులు, నిం డాచార్యులకు మరల నేకతమునకున్
రండు విశేషము సెప్పెదఁ, బొం డొల్లనివారు కర్ణపుంజముపాలై. 247

క. ఆడుదము మనము హరి రతిఁ, బాడుదమే ప్రొద్దు విష్ణుభద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ, గూడుదము ముకుందభక్తకోటిన్ సూటిన్. 248

క. విత్తము సంసృతిపటలము, వృత్తము కామాదివైరివర్గంబుల నేఁ
డిత్తము చిత్తము హరికిని, జొత్తము నిర్వాణపదము శుభ మగు మనకున్.

వ. అని యిట్లు ప్రహ్లాదుండు రహస్యంబున నధ్యయనవేళల రాక్షసకుమారులకు నపవర్గమార్గం బెఱింగించిన వారును గురుశిక్షితంబు లైన చదువులు సాలించి నారాయణభక్తి చిత్తంబులం గీలించి యుండుటం జూచి వారలనేకాంతభావంబు దెలిసి వెఱచి వచ్చి శుక్రనందనుండు శుక్రవైరి కిట్లనియె. 250

శా. రక్షోబాలుర నెల్ల నీకొడుకు చేరం జీరి లోలోన నా
శిక్షామార్గము లెల్లఁ గల్ల లని యాక్షేపించి తా నందఱన్
మోక్షాయత్తులఁ జేసినాఁడు మనకున్ మోసంబు వాటిల్లె నీ
దక్షత్వంబునఁ జక్కఁ జేయ వలయున్ దైతేయవంశాగ్రణీ. 251

క. ఉల్లసితవిష్ణుకథనము, లెల్లప్పుడు మాకుఁ జెప్పెఁ డీగురుఁ డని న
న్నుల్లంఘించి కుమారకు, లొల్లరు చదువంగ దానవోత్తమ వింటే. 252

క. ఉడుగఁడు మధురిపుకథనము, విడివడి జడుపగిదిఁ దిరుగు వికసనమున నే
నొడివిననొడువులు నొడువఁడు, దుడుకనిఁ జదివింప మాకు దుర్లభ మధిపా.

క. చొక్కపురక్కసికులమున, వెక్కసపు జన్మించినాఁడు [2]విష్ణునియందున్
నిక్కపుమక్కువ విడువం, డెక్కడిసుతుఁ గంటి రాక్షసేశ్వర వెట్టిన్. 254

వ. అని యిట్లు గురుసుతుండు సెప్పినఁ గొడుకువలనివిరోధవ్యవహారంబులు గర్ణరంధ్రంబుల ఖడ్గప్రహారంబు లయి సోఁకిన బిట్టు మిట్టిపడి పాదాహతం బైన భుజంగంబుభంగిఁ బవనప్రేరితం బైన దవానలంబుచందంబున దండతాడితం బయిన కంఠీరవంబుకైవడి భీషణరోషరసావేశజాజ్వల్యమానచిత్తుండును బుత్ర[3]సంహారోద్యోగాయత్తుండును గంపమానగాత్రుండును నరుణీకృతనేత్రుండును నై

1 విష్ణుదివ్యపదమున తెరువులు సెప్పరు. 2 విష్ణునితోడన్. 3 మరణాయత్తుండు.

కొడుకును రప్పించి సమ్మానకృత్యంబులు దప్పించి నిర్దయుండై యశనిసంకాశ
భాషణంబుల నదల్చుచు. 255

శా. సూనున్ శాంతగుణప్రధాను నతిసంశుద్ధాంచితజ్ఞాను స
జ్జ్ఞానారణ్యకృశాను నంజలిపుటీసంభ్రాజమానున్ సదా
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాదనా
ధీనున్ ధిక్కరణంబు సేసి పలికెన్ దేవాహితుం డుగ్రతన్. 256

సీ. అస్మదీయం బగు నాదేశమునఁ గాని, మిక్కిలి రవి మింట మెఱయ వెఱచు
నన్నికాలములందు ననుకూలుఁడై కాని, విద్వేషియై గాలి వీవ వెఱచు
మత్ప్రతాపానలమందీకృతార్చియై, విచ్చలవిడి నగ్ని వెలుఁగ వెఱచు
నతిశాతమైన నాయాజ్ఞ నుల్లంఘించి, శమనుండు ప్రాణులఁ జంప వెఱచు

తే. నింద్రుఁ డాదిగ నామ్రోల నెత్త వెఱచు, నమరకిన్నరగంధర్వయక్షవిహగ
నాగవిద్యాధరావలి నాకు వెఱచు, నేల వెఱవవు పలువ నీ కేది దిక్కు.

శా. ప్రజ్ఞావంతులు లోకపాలకులు సంరంభద్విషు లయ్యున్ మదీ
యాజ్ఞాభంగము సేయ నోడుదురు రోషాపాంగదృష్టిన్ వివే
కజ్ఞానచ్యుతమై జగత్త్రితయముం గంపించు నీ విట్టిచో
నాజ్ఞోల్లంఘన మెట్లు సేసితివి సాహంకారతన్ దుర్మతీ. 258

శా. కంఠక్షోభము గాఁగ నొత్తిలి మహాగాఢంబుగా డింభ వై
కుంఠుం జెప్పెదు దుర్జయుం డనుచు వైకుంఠుండు వీరవ్రతో
త్కంఠాబంధురుఁ డేని నే నమరులన్ ఖండింప దండింపఁగాఁ
గుంఠీభూతుఁడు గాక రా వలదె మద్ఘోరాహవక్షోణికిన్. 259

శా. ఆచార్యోక్తము గాక బాలురకు మోహాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు నీఱు సేసితివి మూఢాత్మున్ గులద్రోహి నిన్
నీచుం జంపుట మేలు చంపి కులమున్ నిర్దోషముం జేసెదన్. 260

క. దిక్కులు గెలిచితి నన్నియు, దిక్కెవ్వఁడు రోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కులరాజులు వేఱొక, దిక్కుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. 261

క. బలవంతుఁడ నే జగముల, బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని, బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడవై. 262

వ. అనినఁ దండ్రికి మెల్లన వినయంబునఁ గొడుకిట్లనియె. 263

క. బలయుతులకు దుర్బలులకు, బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును, బల మెవ్వం డట్టివిభుఁడు బల మసురేంద్రా.

క. దిక్కులు గాలముతోనే, దిక్కున లేకుండుఁ గలుగుఁ దిక్కులమొదలై
దిక్కు గలలేనివారికి, [1]దిక్కెయ్యెడువాఁడు నాకు దిక్కు మహాత్మా. 265

సీ. కాలరూపంబులఁ గ్రమవిశేషంబుల, నలఘుగుణాశ్రయుం డయినవిభుఁడు
సత్త్వబలేంద్రియసహజప్రభావాత్ముఁ, డై వినోదంబున నఖిలజగము
గల్పించు రక్షించు ఖండించు నవ్యయుం, డన్నిరూపములందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁ జేయుము మార్గంబుఁ, దప్పి వర్తించుచిత్తంబుకంటె

తే. వైరు లెవ్వరు చిత్తంబు వైరి గాక, చిత్తమును నీకు వశముగాఁ జేయవయ్య
మదయుతాసురభావంబు మానవయ్య, యయ్య నీ మ్రోలమేలాడరయ్య జనులు.

ఉ. లోకము లన్నియుం గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తముం గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకరశత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా. 267

క. పాలింపుము శేముషి ను, న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిం
జాలింపుము సంసారముఁ, గీలింపుము హృదయమందుఁ గేశవభక్తిన్. 268

వ. అనినఁ బరమభాగవతశేఖరునకు నిశాచరశేఖరుం డిట్లనియె. 269

క. చంపినఁ జచ్చెద ననుచును, గంపింపక యోరిపడుచ కఠినోక్తుల నన్
గుంపించెదు చావునకుం, దెంపరివై వదరువాని తెఱఁగునఁ గుమతీ. 270

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండ నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు సంపూర్ణప్రభావుండ మ
ద్భ్రాతం జంపిన మున్నె నే వెదకితిం బల్మాఱు నారాయణుం
ఏతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెం దుండురా దుర్మతీ. 271

క. ఎక్కడఁ గలఁ డే క్రియ నే, చక్కటి వర్తించు నెట్టిజాడను వచ్చుం
జక్కడుతు నిన్ను విష్ణుని, దిక్కులు ప్రేలెదవు వానిభృత్యునిపగిదిన్. 272

వ. అనిన హరికింకరుండు శంకింపక హర్షపులకాంకురసంకలితవిగ్రహుం డై యాగ్రహంబు లేక హృదయంబున హరిం దలంచి నమస్కరించి బాలవర్తనంబున నర్తనంబు సేయుచు ని ట్లనియె. 273

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకం గా నేల యీ యా యెడన్. 274

క. ఇందుఁ గలఁ డందు లేఁ డని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన, నం దందే కలఁడు దానవాగ్రణి వింటే. 275

---

1 దిక్కెవ్వఁడది యదియు నాకు దిక్కు. 2 దనుసందేహము లేదు.

వ. అని యివ్విధంబున. 276

మ. హరి సర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁడై యెందును లేఁడు లేఁ డని సుతున్ దైత్యుండు దర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానాజంగమస్థావరో
త్కరగర్భంబుల నన్ని దేశముల నుద్దండప్రభావంబునన్. 277

వ. అయ్యవసరంబున దానవేంద్రుండు. 278

క. డింభక సర్వస్థలముల, నంభోరుహనేత్రుఁ డుండు ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ, స్తంభంబునఁ జూపఁ గలవె చక్రిన్ గిక్రిన్. 279

క. స్తంభమునఁ జూప వేనిం, గుంభిని శిరముం దుంచి కూల్పఁగ రక్షా
రంభమున వచ్చి హరి వి, స్రంభంబున నడ్డపడఁగ శక్తుం డగునే. 280

వ. అనిన భక్తవత్సలునిభటుం డిట్లనియె. 281

శా. అంభోజాసనుఁ డాది గాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండుప్రోడ విపుల స్తంభంబునం దుండఁడే
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్. 282

వ. అనిన విని కరాళించి గద్దన లేచి గద్దియ డిగ్గ నుఱికి (యొఱఁ బెట్టిన) ఖడ్గంబు (వెఱికి) కేలనమర్చి జళిపించుచు మహాభాగవతశిఖామణియైన ప్రహ్లాదుని ధిక్కరించుచు.

మ. వినరా డింభక మూఢచిత్త గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందుఁ గలఁడే యంచున్ మహాక్రోధియై
దనుజేంద్రుం డఱచేత వ్రేసెను మహోదగ్రప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్. 284

—శ్రీహరి నరసింహరూపంబున స్తంభంబునం దావిర్భవించుట.—

వ. ఇట్లు దానవేంద్రుండు పరిగృహ్యమాణవైరుండును వైరానుబంధజాజ్వల్యమాన రోషానలుండును రోషానలజంఘన్యమానవిజ్ఞానవినయుండును వినయగాంభీర్యధైర్యజేగీయమానహృదయుండును హృదయచాంచల్యమానతామసుండును దామసగుణచంక్రమ్యమాణస్థైర్యుండును నై విస్రంభంబున హుంకరించి బాలుని ధిక్కరించి హరి నిందుఁ జూపు మని కనత్కనకమణిమయకంకణక్రేంకారశబ్దపూర్వకంబుగా దిగ్దంతిదంతభేదనపాటవప్రశస్తం బగుహస్తంబున సభామండపస్తంభంబు వ్రేసిన వ్రేటుతోడన దశదిశలను మిడుంగుఱులు సెదరం జిటిలి పెటిలి పడి బంభజ్యమానంబగు నమ్మహాస్తంభంబువలనఁ బ్రళయవేళాసంభూతసప్తస్కంధబంధురసమీరణసంఘటిత ఘోరరజోఘుష్యమాణ మహావలాహకవర్గనిర్గతనిబిడనిష్ఠుర

దుస్సహనిర్ఘాతసంఘనిర్ఘోషనికాశంబు లైనఘటచ్ఛటస్ఫుటస్ఫుటధ్వనిప్రముఖభ
యంకరారావపుంజంబులు జంజన్యమానంబు లయి యెగసి యాకాశకుహరాం
తరాళంబు నిరవకాశంబు సేసి నిండినం బట్టు సాలక దోధూయమానహృద
యంబు లయి పరవశంబు లైనపితామహమహేంద్రవరుణవాయుశిఖిముఖర
చరాచరజంతుజాలంబులతోడ బ్రహ్మాండకటాహంబు వగిలి పరిస్ఫోటితంబు
గాఁ బ్రఫుల్లపద్మయుగళసంకాశ భాస్వర చక్ర చాప హల కులిశ జలచర రే
ఖాంకితచారుచరణతలుండును జరణచంక్రమణఘనవినమితవిశ్వవిశ్వంభరాభార
ధారేయ దిక్కుంభి కుంభీనస కుంభినీధర కూర్మకుల శేఖరుండును జలరాశిజాత
శుండాలశుండాదండమండిత (ప్రకాండప్రచండ) మహోరు స్తంభయుగళుండును
ఘణఘణాయమానమణి(కింకిణీగణముఖరిత) మేఖలావలయవలయిత పీతాంబర
శోభితకటిప్రదేశుండును నిర్జరనిమ్నగావర్తవర్తులకమలాకరగంభీరనాభివివరుం
డును (ముష్టిపరిమేయవినుత)తనుతరస్నిగ్ధమధ్యుండును గులాచలసానుభాగసదృ
శకర్కశవిశాలవక్షుండును దుర్జనదనుజభటధైర్యలతికాలవిత్రాయమాణరక్షో
రాజ వక్షోభాగవిశంకట క్షేత్రవిలేఖనచంగ లాంగలాయమాన ప్రతాపజ్వలన
జ్వాలాయమానశరణాగతనయనచకోరచంద్రరేఖాయమాణవజ్రాయుధప్రతిమా
న భాసమాననిశాత(ఖరతరముఖ)నఖరుండును శంఖచక్రగదాఖడ్గకుంతతోమ
రప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగ మహీధరశృంగసన్నిభ వీరసాగర
వేలాయమాన మాలికావిరాజమాన నిరర్గళానేకశతభుజార్గళుండును మంజు
మంజీరమణిపుంజరంజితమంజులహారకేయూరకంకణకిరీటమకరకుండలాదిభూషణ
భూషితుండును ద్రివళీయుతశిఖరిశిఖరాభపరిణద్ధబంధురకంధరుండును బ్రకంపన
కంపితపారిజాతపాదపపల్లవప్రతీకాశకోపావేశసంచలితాధరుండును శరత్కాల
మేఘజాలమధ్యధగద్ధగాయమానతటిల్లతాసమానదేదీప్యమాన దంష్ట్రాంకురుం
డును గల్పాంతకాలసకలభువనగ్రసనవిలసనవిజృంభమాణసప్తజిహ్వాజిహ్వాతు
లితతరలతరాయమాణవిభ్రాజమానజిహ్వుండును మేరుమందరమహాగుహాంత
రాళవిస్తారవిపులవక్త్రనాసికారంధ్రుండును నాసికారంధ్రనిస్సరన్నిబిడనిశ్వాస
నికరసంఘట్టనసంక్షోభితసంతప్యమానసప్తసాగరుండును బూర్వపర్వతవిద్యోత
మానఖద్యోతమండలసదృక్షసమంచితలోచనుండును లోచనాంచలసముత్కీ
ర్యమాణవిలోలకీలాభీలవిస్ఫులింగవితానరోరుధ్యమాన తారకాగ్రహమండలుం
డును శక్రచాపసురుచిరాదభ్రమహాభ్రూలతాబంధబంధురభయంకరవదనుండు
ను ఘనతరగండశైలతుల్యకమనీయగండభాగుండును సంధ్యారాగరక్తధారా
ధరమాలికాప్రతిమమహాభ్రంకషతంతన్యమానపటుతరసటాజాలుండును సటా
జాలసంచాలనసంజాతవాతడోలాయమానవైమానికవిమానుండును నిష్కంపిత
శంఖవర్ణమహోర్ధ్వకర్ణుండును మంథదండాయమానమందరవసుంధరాధరపరి

భ్రమణ వేగసముత్పద్యమాన వియన్మండలమండితసుధారాశికల్లోల శీకరాకార భాసుర కేసరుండును బర్వాఖర్వశిశిరకిరణమయూఖగౌరతనూరుహుండును నిజ గర్జానినదనిర్దళిత కుముద సుప్రతీక వామ నైరావణ సార్వభౌమ ప్రముఖదిగిభ రాజకర్ణకోటరుండును ధవళధరాధరదీర్ఘదురవలోకనీయదేహుండును దేహ ప్రభాపటలనిరస్యమానపరిపంథియాతుధాననికురుంబగర్వాంధకారుండును బ్రహ్లాదహిరణ్యకశిపురంజనభంజననిమిత్తాంతరంగబహిరంగజేగీయమానకరుణావీర రససంయుతుండును మహాప్రభావుండును నయిన శ్రీనృసింహదేవుం డావిర్భవించినం గనుంగొని. 285

క. నరమూర్తి [1]గాదు కేవల, హరిమూర్తియుఁ [2]గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది, హరిమాయారచిత మగు యథార్థము సూడన్.

ఉ. తెంపున బాలుఁ [3]డాడినను ధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతి యంచుఁ దలంతు నైన నా
సొంపును బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రువున్. 287

—నృసింహమూర్తి హిరణ్యకశిపుతోఁ బోరి వధించుట.—

వ. అని మత్తంబడినచిత్తంబున గద యెత్తికొని తత్తఱంబున నార్చుచు నకుంఠిత కంఠీరవంబు డగ్గఱుగంధసింధురంబుచందంబున నక్తంచరకుంజరుండు నరసింహదేవున కెదురు నడచి తదీయదివ్యతేజోజాలసన్నికర్షంబునం జేసి దవానలంబు డగ్గఱినఖద్యోతంబునుంబోలెఁ (గర్తవ్యాకర్తవ్యంబులు దెలియక) నిర్గతప్రభుండయి యుండె నప్పుడు. 288

మ. ప్రకటంబై ప్రళయావసానమున మున్ బ్రహ్మాండభాండావరో
ధకమై యున్నతమిస్రమున్ జగము నుత్పాదించుచోఁ ద్రావి సా
త్త్వికతేజోనిధి యైనవిష్ణు నెడ నుద్దీపించునే నష్టమై
వికలంబై చెడుఁ గాక తామసులప్రావీణ్యంబు రాజోత్తమా. 289

వ. అంత నద్దానవేంద్రుండు మహోద్దండం బగుగదాదండంబు గిరగిరం ద్రిప్పి నరమృగేంద్రుని వ్రేసిన నతండు దర్పంబున సర్పంబు గొడిసిపట్టుసర్పపరిపంథి నేర్పున దితిపట్టిం బట్టికొనిన మిట్టిపడి గట్టించి బెట్టుకట్టులుక నయ్యసురవరుండు దృఢబలంబున నిట్టట్టు జడిసి పట్టు దప్పించుకొని విడివడి దిటవు దప్పక కుప్పించి యుప్పరం బెగసి విహంగకులరాజచరణనిర్గళితభుజంగంబు తెఱంగునం దలంగ నుఱికి తనభుజాటోపంబున నరకంఠీరవుండు గుంఠితుం డయ్యెడి నని తలంచి కలంగక చెలంగుచుఁ దన్ను నిబిడనీరదనికరంబులమాటున నిలింపులు గుంపులు గొని డాఁగి మూఁగి క్రన్నన నాత్మీయజీవనశంకాకళంకితులై మంత

1 గాఁడు. 2 గాఁడు. 3 'డాడినసుధీరత' అ. ప్ర.

నంబులఁ జింతనంబులు సేయుచు నిరీక్షింప నక్షీణసమరదక్షతావిశేషం బుప
లక్షించి ఖడ్గవర్మంబులు ధరియించి భూనభోభాగంబుల వివిధవిచిత్రలంఘన
లాఘవంబులం బరిభ్రమణభేదంబులం గరాళవదనుం డయి యంతరాళంబునఁ
దిరుగునాళువపుడేగచందంబున సంచరించిన సహింపక. 290

సీ. పంచాననోద్ధూత । పావకజ్వాలలు, భూనభోంతర మెల్లఁ । బూరితముగ
దంష్ట్రాంకురాభీల । ధగధగాయితదీప్తి, నసురేంద్రునేత్రము । లంధములుగఁ
గంటకసన్నిభో । త్కటకేసరాహతి, నభ్రసంఘము భిన్న । మై చలింపఁ
బ్రళయాభ్రచంచలా । ప్రతిమభాస్వరము లై, ఖరనఖరోచులు । గ్రమ్ముదేర
తే. సటలు జళిపించి గర్జించి । సంభ్రమించి, దృష్టిసారించి బొమలు బం । ధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి । చేత నొడిసి, పట్టె నరసింహుఁ డాదితి । పట్టి నధిప.

క. సరకు గొనక లీలాగతి, నురగేంద్రుఁడు మూషికంబు । నొడిసినపగిదిన్
నరకేసరి దను నొడిసిన, సురవిమతుఁడు ప్రాణభీతి । సుడివడియె నృపా. 292

క. సురరాజవైరి లోఁబడెఁ, బరిభావితసాధుభక్త । పటలాంహునకున్
నరసింహునకు నుదంచ, త్ఖరతరజిహ్వున కుదగ్ర । ఘనరంహునకున్. 293

వ. అంత. 294

మ. విహగేంద్రుం డహి వ్రచ్చుకైవడి మహో । ద్వృత్తిన్ నృసింహుండు సా
గ్రహుఁ డై యూరువులందుఁ జేర్చి నఖసం । ఘాతంబులన్ వ్రచ్చె దు
స్సహు దంభోళికఠోరదేహు నచలో । త్సాహున్ మహాబాహు నిం
ద్రహుతాశాంతకభీకరున్ ఘనకరున్ । దైత్యాన్వయశ్రీకరున్. 295

శా. చించున్ హృత్కమలంబు శోణితము వ । ర్షించున్ ధరామండలిం
ద్రెంచుం గర్కశనాడికావళులు భే । దించున్ మహావక్షముం
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా । దుష్టాసురున్ వ్రచ్చి ద
ర్పించుం బ్రేవులు కంఠమాలికలు గ । ల్పించున్ నఖోద్భాసి యై. 296

సీ. వక్షఃకవాటంబు । వ్రక్కలు సేయుచోఁ, ఘనకుఠారంబుల । కరణి నొప్పు
గంభీరహృదయపం । కజము భేదించుచోఁ, గుద్దాలములభంగిఁ । గొమరు మిగులు
ధమనీవితానంబు । దవిలి ఖండించుచోఁ, బటులవిత్రంబుల । పగిది మెఱయు
జఠరవిశాలాంత్ర । జాలంబుఁ ద్రెంచుచోఁ, గ్రకచసంఘంబుల । గరిమఁ జూపు
తే. నంకగతుఁ డైనదైత్యుని । నాగ్రహమున, శస్త్రచయముల నొంపక । సంహరించి
యమరునరసింహునఖరంబు । లతివిచిత్ర, సమరముఖరంబు లై యుండె । జనవరేణ్య.

క. స్ఫురితవిబుధజనముఖములు, పరివిదళితదనుజనివహ । పతితనుముఖముల్.
గురురుచిజితశిఖిశిఖములు, నరహరిఖరనఖము లమరు । నతజనసఖముల్. 298

వ. ఇట్లు కేవలపురుషరూపంబును మృగరూపంబునుం గానినరసింహరూపంబున
రేయునుం బవలునుం గానిసంధ్యాసమయంబున నంతరంగంబును బహిరంగం

బునుం గానిసభాద్వారంబున గగనంబును భూమియునుం గానియూరుమధ్యంబునఁ బ్రాణసహితంబులును బ్రాణరహితంబులునుం గానినఖంబులం ద్రైలోక్య జనహృదయభల్లుం డయినదైత్యమల్లుని వధియించి మహాదహనకీలాభీలదర్శనుండును గరాళవదనుండును లేలిహానభీషణజిహ్వుండును శోణితపంకాంకితకేసరుండును నై ప్రేవులు కంఠమాలికలుగ ధరించి కుంభికుంభవిదళనంబు సేసి చనుదెంచుపంచాననంబునుంబోలె దనుజకుంజరహృదయకమలవిదళనంబు సేసి తదీయరక్తసిక్తంబులైననఖంబులు సంధ్యారాగరక్తచంద్రరేఖలచెలువు వహింప సహింపక లేచి తనకట్టెదుర నాయుధంబు లెత్తుకొని తత్తఱంబున రణంబునకు నురవణించురక్కసులం బెక్కుసహస్రంబులం జక్రాదికనిర్వక్రసాధనంబుల నొక్కనిఁ జిక్కకుండం జక్కడిచె నివ్విధంబున. 299

శా. రక్షోవీరుల నెల్లఁ ద్రుంచి రణసంరంభంబు సాలించి దృ
ష్టిక్షేపంబు భయంకరంబుగ సభాసింహాసనారూఢుఁడై
యక్షీణాగ్రహుఁడై నృసింహుఁడు కరాళాస్యంబుతో నొప్పెఁ దఱ
వీక్షింపం బలికింప నోడి యితరుల్ విభ్రాంతులై డాఁగఁగన్. 300

క. సురచారణవిద్యాధర, గరుడోరగయక్షసిద్ధగణములలో నొ
క్కరుఁడైన డాయ వెఱచును, నరహరి నయ్యవసరమున నరలోకేశా. 301

క. తర్షంబుల నరసింహుని, హర్షంబులఁ జూచి నిర్జరాంగనలు మహో
త్కర్షంబులఁ గుసుమంబుల, వర్షంబులు గురిసి రుత్సవంబుల నధిపా. 302

వ. మఱియు నయ్యవసరంబున మింట ననేకదేవతావిమానంబులును గంధర్వగానంబులును నప్సరోగణనర్తనసంవిధానంబులును దివ్యకాహళభేరీపటహమురజాదిధ్వానంబులును బ్రకాశమానంబు లయ్యె సునందకుముదాదు లయినహరిపార్శ్వచరులును విరించి మహేశ్వర మహేంద్రపురస్సరు లగుత్రిదశ కిన్నర కింపురుష పన్నగ సిద్ధ గరుడ గంధర్వ చారణ విద్యాధరాదులును బ్రజాపతులును నరకంఠీరవదర్శనోత్కంఠులయి చనుదెంచి. 303

బ్రహ్మాదిదేవతలు శ్రీనృసింహదేవుని వేఱువేఱ స్తుతించుట.

క. కరకమలయుగళకలిత,శిరులై దగ్గఱక భక్తిఁ జేసిరి బహుసం
సరణాబ్ధితరికి నఖరికి, నరభోజనహస్తిహరికి నరకేసరికిన్. 304

వ. ఆసమయంబున దేవత లందఱు వేఱువేఱ వినుతించి రందుఁ గమలాసనుం డిట్లనియె. 305

మ. ఘనలీలాగుణచాతురిన్ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయుదురంతశక్తికి ననంతజ్యోతికిం జిత్రవీ
ర్యునికిన్ నిత్యపవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా

త్మునికిన్ వందన మాచరించెదఁ గృపా॥ముఖ్యప్రసాదార్థి నై. 306

వ. రుద్రుం డి ట్లనియె. 307

చ. అమరవరేణ్య మీఁదట స॥హస్రయుగాంతమునాఁడు గాని కో
పమునకు వేళ గాదు సుర॥బాధకుఁ డైనతమస్వినీచరున్
సమరమునన్ వధించితివి ॥ చాలుఁ దదాత్మజుఁ డైనవీఁడు స
ద్విమలుఁడు నీకు భక్తుఁడు ప॥విత్రుఁడు గావుము భక్తవత్సలా. 308

వ. ఇంద్రుం డి ట్లనియె. 309

సీ. ప్రాణిసంఘములహృ॥త్పద్మమధ్యంబుల, నివసించి భాసిల్లు॥నీవ యెఱుఁగు
దింతకాలము దాన॥వేశ్వరుచే బాధ, పడి చిక్కి యున్నయా॥పన్నజనుల
రక్షించితివి మము ॥ రాక్షసుఁ జంపితి, క్రతుహవ్యములు మాకుఁ॥గలిగె మరల
మంటిమి నీసేవ ॥ మరగినవారలు, కైవల్యవిభవంబు ॥ కాంక్ష సేయ
ఆ. రితరసుఖము లెల్ల ॥ నిచ్చయింపఁగ నేల, యస్థిరంబు లివి య॥నంతభక్తిఁ
గొలువ నిమ్ము నిన్ను ॥ ఘోరదైత్యానీక,చిత్తభయదరంహ ॥ శ్రీనృసింహా.

వ. ఋషు లి ట్లనిరి. 311

మ. భవదీయాదరలీల లోకముల ను॥త్పాదించి రక్షింప నేఁ
డవి దైత్యేశునిచేత భేదితము లై ॥ హ్రస్వంబు లై యుండ నీ
యవినీతున్ నరసింహరూపమున సం॥హారంబు నొందించి వే
దవిధిం గ్రమ్మఱ నుద్ధరించితి గదా ॥ ధర్మానుసంధాయి వై. 312

వ. పితృదేవత లి ట్లనిరి. 313

శా. చండక్రోధముతోడ దైత్యుఁడు వడిన్ ॥ శ్రాద్ధంబులన్ మత్సుతుల్
పిండంబుల్ సతిలోదకంబులు గ న॥ర్పింపంగ మా కీక యు
ద్దండత్వంబునఁ దాన కైకొను మహో॥గ్రుండు వీఁ డిక్కడన్
ఖండింపంబడె నీనఖంబుల నుతుల్ ॥ గావింతు మాత్మేశ్వరా. 314

వ. సిద్ధు లి ట్లనిరి. 315

క. క్రుద్ధుం డై యణిమాదిక,సిద్ధులు గైకొనినదైత్యుఁ ॥ జీరితివి మహా
యోద్ధవు నీకృప మాకును, సిద్ధులు మరలంగఁ గలిగె ॥ శ్రీనరసింహా. 316

వ. విద్యాధరు లి ట్లనిరి. 317

క. దానవునిఁ జంపి యంత, ర్ధానాదికవిద్య లెల్ల ॥ దయతో మరలం
గా నిచ్చితివి విచిత్రము, నీనిరుపమవైభవంబు ॥ నిజము నృసింహా. 318

వ. భుజంగు లి ట్లనిరి. 319

క. రత్నములను మత్కాంతా,రత్నంబులఁ బుచ్చికొన్న ॥ రక్కసునురమున్
యత్నమున వ్రచ్చివైచితి, పత్నులు రత్నములుఁ గలిగె ॥ బ్రదికితి మీశా. 320

వ. మనువు లిట్లనిరి. 321

క. దుర్ణయుని దైత్యుఁ బొరిగొని, వర్ణాశ్రమధర్మ[1]సేతువర్గము మరలం
బూర్ణము సేసితి వే మని, వర్ణింతుము కొలిచి బ్రదుకువారము దేవా. 322

వ. ప్రజాపతు లిట్లనిరి. 323

మ. ప్రజలం జేయుటకై సృజించితి మముం బాటించి దైత్యాజ్ఞచేఁ
బ్రజలం జేయక యింతకాలము మహాభారంబుతో నుంటి మీ
కుజనుం వక్షముఁ జీరి చంపితివి సంకోచంబు లే కెల్లచోఁ
బ్రజలం జేయుచు నుండువారము జగద్భద్రాయమానోదయా. 324

వ. గంధర్వు లిట్లనిరి. 325

క. ఆడుదుము రేయుఁ బగలుం, బాడుదుము నిశాటునొద్ద బాధించు దయం
జూడఁడు నీచే జమునిం, గూడె మహాపాతకుఁడు కుశలము గలదే. 326

వ. చారణు లిట్లనిరి. 327

క. భువనజనహృదయభల్లుఁడు, దివిజేంద్రవిరోధి నేఁడు దెగె నీచేతన్
భవరోగనివర్తక మగు, భవదంఘ్రియుగంబుఁ జేరి బ్రదికెద మీశా. 328

వ. యక్షు లిట్లనిరి. 329

ఉ. భ్రంశము లేనినీభటుల భంగవిముక్తుల మమ్ము నెక్కి ని
స్సంశయవృత్తి దిక్కులఁ బ్రచారము సేయుచు నుండు వీఁడు ని
స్త్రింశముతోడ వీనిఁ గడతేర్చితి వాదయు మానె నోచతు
ర్వింశతితత్త్వశాసక త్రివిష్టపముఖ్యజగన్నివాసకా. 330

వ. కింపురుషు లిట్లనిరి. 331

క. పురుషోత్తమ నేరము కిం, పురుషుల మల్పులము నిన్ను భూషింపఁగ దు
ష్పురుషుం సకలసుజనహృ, త్పురుషుం జంపితివి జగము బ్రదికె నధీశా. 332

వ. వైతాళికు లిట్లనిరి. 333

క. త్రిభువనశత్రుఁడు వడియెను, సభలందును మఖములందు జగదీశ్వర ని
శుభగీతములు పఠించుచు, నభయుల మై సంచరింతు మార్తశరణ్యా. 334

వ. కిన్నరు లిట్లనిరి. 335

క. ధర్మము దలఁపఁడు లఘుతర, కర్మము సేయించు మమ్ముఁ గలుషాత్మకు దు
ష్కర్ముని జంపితి వున్నతి, శర్ముల మై నీకు భక్తి సలిపెదము హరీ. 336

వ. విష్ణుసేవకు లిట్లనిరి. 337

ఉ. సంచితవిప్రశాపమునఁ జండనిశాచరుఁ డైనవీని శి
క్షించుట కీడు గాదు కృప సేసితి వీశ్వర భక్తితోడ సే
వించుటకంటె వైరమున వేగమ చేరఁగ వచ్చు నిన్ను నీ

---

1 మెల్ల వలనుగ మరలం.

యంచితనారసింహతను ◊ వద్భుత మాపదఁ బాసి రందఱున్. 338

వ. ఇట్లు బ్రహ్మరుద్రేంద్రసిద్ధసాధ్యపురస్సరు లైన దేవముఖ్యు లందఱు నెడ గలిగి యనేకప్రకారంబుల వినుతించి రోషసంరంభవిజృంభమాణుం డయిననరసింహదేవునిడగ్గఱఁ జేర వెఱచి లక్ష్మీదేవిం బిలిచి యి ట్లనిరి. 339

క. హరికిం బట్టపుదేవివి, హరిసేవానిపుణమతివి ◊ హరిగతివి సదా
హరిరతివి నీవు సని నర,హరిరోషము డింపవమ్మ ◊ హరివరమధ్యా. 340

వ. అనిన నియ్యకొని మహోత్కంఠతోడ నాకలకంఠకంఠి నరకంఠీరవుసముప కంఠంబునకుం జని. 341

సీ. ప్రళయార్కబింబంబు ◊ పగిది నున్నది గాని, నెమ్మోము పూర్ణేందు ◊ నిభము గాదు
శిఖిశిఖాసంఘంబు ◊ చెలువు సూపెడుఁ గాని, చూడ్కి ప్రసాదభా◊సురము గాదు
వీరరౌద్రాద్భుతా◊వేశ మొప్పెడుఁ గాని, భూరికృపారస◊స్ఫూర్తి గాదు
భయదదంష్ట్రాంకుర◊ప్రభలు గప్పెడుఁ గాని, దరహసితాంబుజా◊తంబు గాదు
తే. కఠిననఖరనృసింహవి◊గ్రహము గాని, కామినీజనసులభవి◊గ్రహము గాదు
విన్నదియుఁ గాదు తొల్లి నే◊విష్ణువలనఁ, గన్నదియుఁ గాదు భీషణా◊కారమనుచు.

క. పలికెద నని గమకము గొనుఁ, బలికినఁ గడు నలుగు విభుఁడు ◊ ప్రతివచనములం
బలుకఁ డనినిలుచు శశిముఖి, బలువిడి హృదయమునఁ జనవు ◊ భయమును గదురన్.

వ. ఇట్లు నరహరిరూపంబు వారిజనివాసిని వీక్షించి శంకించి భ్రాంతుం డైన వెనుక డగ్గఱెద నని చింతించు చున్న వారిజసంభవుం డద్దేవునిరోషంబు నివారింప నితరుల కలవి గా దని ప్రహ్లాదుం జీరి యి ట్లనియె. 344

క. తండ్ర మగురోషమున మీ, తండ్రి నిమిత్తమునఁ జక్రి ◊ దారుణమూర్తిన్
వేండ్రము విడువఁడు మెల్లన, తండ్రి శీతలునిఁ జేసి ◊ దయసేయఁ గదే. 345

వ. అనిన నౌఁ గాక యని మహాభాగవతశేఖరుం డయినబాలకుండు గరకమలంబులు ముకుళించి మందగమనంబున నమందవినయవివేకంబుల నరసింహదేవునిసన్నిధికిం జని సాష్టాంగదండప్రణామంబు సేసిన భక్తపరాధీనుం డగునయ్యీశ్వరుం డాలోకించి కరుణాయత్తచిత్తుం డై. 346

ఉ. ప్రాభవ మొప్ప నుత్కటకృ◊పామతి యై కదియంగఁ జీరి సం
శోభితదృష్టిసంఘములఁ ◊ జూచుచు బాలునిమౌళియందు లో
కాభినుతుండు వెట్టె నసు◊రాంతకుఁ డుద్భటకాలసర్పభీ
తాభయదానశస్తము ని◊రర్గళమంగళహేతుహస్తమున్. 347

వ. ఇట్లు హరికరస్పర్శనంబున భయవిరహితుండును బ్రహ్మజ్ఞానసహితుండును బులకితదేహుండును సముత్పన్నసంతోషబాష్పసలిలధారాసమూహుండును బ్రేమాతిశయగద్గదభాషణుండును వినయవివేకభూషణుండును నేకాగ్రచిత్తుండును

భక్తిపరాయత్తుండును నయి యద్దేవునిచరణకమలంబులు దనహృదయంబున నిలిపికొని కరకమలంబులు ముకుళించి యిట్లని వినుతించె. 348

ప్రహ్లాదుఁడు నరసింహమూర్తిని స్తుతించుట.

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్యచి
త్తములన్ నిన్ను బహుప్రకారముల నిత్యంబున్ విచారించి పా
రము ముట్టన్ నుతి సేయ నోపరఁట నే రక్షస్తనూజుండ గ
ర్వమదోద్రిక్తుఁడ బాలుఁడన్ జడమతిన్ వర్ణింప శక్తుండనే. 349

మ. తపమున్ వంశముఁ దేజమున్ శ్రుతము సౌందర్యంబు నుద్యోగమున్
నిపుణత్వంబుఁ బ్రతాపపౌరుషములున్ నిష్ఠాబలప్రజ్ఞలున్
జపయోగంబులుఁ జాల వీశ్వర భవత్సంతుష్టికై దంతియూ
థపుఁజందంబున భక్తి సేయ వలయుం దాత్పర్యసంయుక్తుఁడై. 350

మ. అమలజ్ఞానత దానధర్మరతి సత్యక్షాంతినిర్మత్సర
త్వములన్ యజ్ఞతపోనసూయలఁ గడున్ దర్పించుధాత్రీసురో
త్తముకంటెన్ శ్వపచుండు ముఖ్యుఁడు మనోర్థప్రాణవాక్కర్మముల్
సమతన్ నిన్ను నమించె నేని నిజవంశశ్రీకరుం డౌఁ దుదిన్. 351

సీ. అజ్ఞుండు సేసినయపరాధములను జే, పట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁ డగుటఁ
జేపట్టు నొకచోట సిద్ధమీశ్వరునకు, నర్థంబు లేకున్న నతఁడు పూర్ణుఁ
డైన నర్థము లీశ్వరార్పణంబులు గాఁగఁ, జేయుట ధర్మంబు సేసె నేని
నద్దంబుఁ జూచిన నళికలలామంబు, ప్రతిబింబితం బగుపగిది మరల

తే. నర్థములు సోఁచుఁ గావున నధికబుద్ధి, భక్తి సేయంగవలయును భక్తిఁ గాని
మెచ్చఁడరంబులొసఁగెడుమేరలందుఁ, బరమకరుణుండు హరి భక్తబాంధవుండు.

క. కావున నల్పుఁడ సంస్తుతిఁ, గావించెద వెఱపు లేక కలనేరుపునన్
నీవర్ణనమున ముక్తికిఁ, బోవు నవిద్యను జయించి పురుషుఁ డనంతా. 353

సీ. సత్త్వాకరుఁడ వైన సర్వేశ నీయాజ్ఞ, శిరముల నిడుకొని చేయువారు
బ్రహ్మాదు లమరులు భయ మందుచున్నారు, నీభీషణాకృతి నేఁడు చూచి
రోషంబు మాను నీరుచిరవిగ్రహములు, కల్యాణకరములు గాని భీతి
కరములు గావు లోకములకు వృశ్చిక, పన్నగంబులభంగి భయముఁ జేయు

తే. నసుర మర్దించితివి సాధుహర్ష మయ్యె, నవతరించినపని దీఱె నలుక సాల
కలుషహారివి సంతోషకారి వనుచు, నిన్నుఁ దలఁతురు లోకులు నిర్మలాత్మ.

మ. ఖరదంష్ట్రాభ్రుకుటీసటానఖయు నుగ్రధ్వానయున్ రక్తకే
సరయున్ దీర్ఘవరాంత్రమాలికయు భాస్వన్నేత్రయు న్నైననీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణక్రూరదుర్వారదు
ర్భరసంసారదవాగ్నికిన్ వెఱతు నీపాదాశ్రయుం జేయవే. 355

వ. దేవా సకలయోనులందును సుఖవియోగదుఃఖసంయోగసంజనితం బైనశోకా
నలంబున దందహ్యమానుండ నై దుఃఖనివారకంబు గాని దేహాద్యభిమానంబున
మోహితుండ నై పరిభ్రమించుచున్న నేను నాకుం బ్రియుండవు సఖుండవుం బర
దేవతవు నైననీ వగుబ్రహ్మగీతంబు లయినలీలావతారకథావిశేషంబులం బఠి
యించుచు రాగాదినిర్ముక్తుండ నై దుఃఖపుంజంబులం దరియించి భవదీయచరణ
కమలస్మరణసేవానిపుణు లైనభక్తులం జేరి యుండెద బాలునిం దల్లిదండ్రులును
రోగిని వైద్యదత్తం బయినయౌషధంబును సముద్రంబున మునింగెడివాని నావ
యును దక్కొరులు రక్షింప నేరని తెఱంగున సంసారతాపసంతప్యమానుం డై
నీచేత నుపేక్షితుం డయినవాని నుద్ధరింప నీవుదక్క నన్యుండు సమర్థుండు గాఁడు
జగంబుల నెవ్వం డేమికృత్యంబు నెవ్వనిచేతం బ్రేరితుండై యేయింద్రియంబులం
జేసి యేమిటికొఱకు నెవ్వనికి సంబంధి యై యేస్థలంబున నేసమయంబునం
దేమిరూపంబున నేగుణంబున నపరం బయినజనకాదిభావంబున. నుత్పాదించి
పరం బయినబ్రహ్మాదిభావంబున రూపాంతరంబు నొందించు నట్టివివిధప్రకారంబు
లన్నియు నిత్యముక్తుండవు రక్షకుండవు నైననీవ నీయంశం బైనపురుషునికి నీ
యనుగ్రహంబునం గాలంబుచేతం బ్రేరిత యై కర్మమయంబును బలయుతంబును
బ్రధానలింగంబును నైనమనంబును నీమాయ సృజియించు నవిద్యార్పితవికారం
బును వేదోక్తకర్మప్రధానంబును సంసారచక్రాత్మకం బైనయీమనమును నిన్ను
సేవింపక నియమించి తరియింప నొక్కండును సమర్థుండు లేఁడు [1]విజ్ఞాననిర్జిత
బుద్ధిగుణుండవు నీవు నీవలన వశీకృతకార్యసాధనశక్తి యైనకాలంబు మాయ
తోడం గూడ షోడశవికారయుక్తం బయినసంసారచక్రంబుం జేయుచుండు
సంసారదావదహనతంతప్యమానుండ నగునన్ను రక్షింపుము. 356

సీ. జనులు దిక్పాలురసంపదాయుర్విభ,వములు గోరుదురు భవ్యంబు లనుచు
నవి యంత రోషహాసవిజృంభితం బైన, మాతండ్రి బొమముడిమహిమఁ జేసి
విహతంబు లగు నట్టివీరుండు నీచేత, నిమిషమాత్రంబున నేఁడు మడిసెఁ
గావున ధ్రువములు గావు బ్రహ్మాదుల, శ్రీవిభవంబులు జీవితములుఁ

తే. గాలరూపకుఁ డగునురుక్రమునిచేత, విదళితము లగు నిలువవు వేయు నేల
యితర మేనొల్ల నీమీఁది యెఱుక గొంత, గలిగియున్నది గొలుతుఁ గింకరుఁడనగుచు.

మత్తకోకిలము. ఎండమావులవంటిభద్రము లెల్ల సార్థము లంచు మ
ర్త్యుండు రోగనిధానదేహముతో విరక్తుఁడు గాక యు
ద్దండమన్మథవహ్ని నెప్పుడుఁ దప్తుఁ డై యొకనాఁడుఁ జే
రండు పారము దుష్టసౌఖ్యపరంపరాక్రమణంబునన్. 358

1 ఈవాక్యము మూలవిరుద్ధము. ‘విజ్ఞా...గుణుండవు వశీ...కాలంబ వగునీవు మాయతోడం గూడి...చక్రంబునఁ బరిభ్రమించుచున్ననన్ను రక్షింపుము’ అని మూలము.

ఉ. శ్రీమహిళామహేశసరసీరుహగర్భుల కైన నీమహో
ద్దామకరంబుచే నభయదానము సేయవు నేను బాలుఁడం
దామసవంశసంభవుఁడ దైత్యుఁడ నుగ్రరజోగుణుండ ని
స్సీమదయం గరాంబుజము శీర్షముఁ జేర్చుట చోద్య మీశ్వరా. 359

వ. మహాత్మా సుజను లయిన బ్రహ్మాదులందును దుర్జను లైన మాయందును సేవానురూపంబుగం బక్షపాతంబులు లేక కల్పవృక్షంబుచందంబున ఫలప్రదానంబు సేయుదువు కందర్పసమేతం బగుసంసారకూపంబునం గూలు చున్నమూఢజనులం గూడి కూలెడినేను భవదీయభృత్యుండ నగునారదునియనుగ్రహంబునం జేసి నీకృపకుఁ బాత్రుండ నైతి నన్ను రక్షించి మజ్జనకుని వధియించుట నాయందులఁ బక్షపాతంబు గాదు దుష్టదనుజసంహారంబును శిష్టభృత్యమునిజనరక్షాప్రకారంబును నీకు నైజగుణంబులు విశ్వంబు నీవ గుణాత్మకం బయిన విశ్వంబు సృజియించి యందుం బ్రవేశించి హేతుభూతగుణయుక్తుండ వై రక్షకసంహారకాదినానారూపంబుల నుండుదువు సదసత్కారణకార్యాత్మకం బయిన విశ్వంబునకుం బరమకారణంబు నీవ నీమాయచేత వీఁడు దా నని యెడిబుద్ధి వికల్పంబు దోఁచుఁ గాని నీకంటె నొం డెద్దియు లేదు బీజంబునందు వస్తుమాత్రభూతసౌక్ష్మ్యంబును వృక్షంబునందు నీలత్వాదివర్ణంబునుం గలుగు తెఱంగున విశ్వంబునకు నీయందు జన్మస్థితిప్రకాశనాశంబులుం గలుగు నీచేత నయిన విశ్వంబు నీయంద నిలుపుకొని యొల్లి ప్రళయకాలపారావారంబునఁ బన్నగేంద్రపర్యంకంబునఁ గ్రియారహితుండ వై నిజసుఖానుభవంబు సేయుచు నిద్రితుని భంగి యోగనిమీలితలోచనుండ వై మెలంగుచుఁ గొంతకాలంబునకు నిజకాలశక్తిచేతం బ్రేరితంబు లై ప్రకృతిధర్మంబు లయినసత్త్వాదిగుణంబుల నంగీకరించి సమాధి చాలించి విలసించు చున్ననీనాభియందు వటబీజంబువలన నుద్భవించు వటంబు తెఱంగున నొక్కకమలంబు సంభవించె నట్టికమలంబువలన నాల్గుమోములబ్రహ్మ జన్మించి దిశలు వీక్షించి కమలంబునకు నొం డయినరూపంబు లేకుండుటఁ జింతించి యుగాంతరాళంబుఁ బ్రవేశించి జలంబులందు నూఱు దివ్యవత్సరంబులు వెదకి తనజన్మంబునకు నుపాదానకారణం బైననిన్ను దర్శింప సమర్థుండు గాక మగిడి కమలంబుకడకుం జని విస్మయంబు నొంది చిరకాలంబు నిర్భరతపంబు సేసి పృథివియందు గంధంబు గనుచందంబునఁ దనయందు నానాసహస్రవదనశిరోనయననాసాకర్ణవక్త్రభుజకరచరణుండును బహువిధాభరణుండును మాయాకలితుండును మహాలక్షణలక్షితుండును నిజప్రకాశదూరీకృతతముండును బురుషోత్తముండును నయిననిన్ను దర్శించె నయ్యవసరంబున.

క. ఘోటకవదనుఁడ వై మధు, కైటభులం ద్రుంచి నిగమగణముల నెల్లం
బాటించి యజున కిచ్చిన, కూటస్థుఁడ వీశ్వరుఁడవు కోవిదవంద్యా. 361

వ. ఇవ్విధంబునఁ గృతత్రేతాద్వాపరంబు లనుమూఁడుయుగంబులందును దిర్యఙ్మానవమునిజలచరాకారంబుల నవతరించి లోకంబుల నుద్ధరించుచు ధరించుచు హరించుచు యుగానుకూలధర్మంబులం బ్రతిష్ఠించుచు నుండుదువు దేవా యవధరింపుము. 362

సీ. కామహర్షాదిసంఘటిత మై చిత్తంబు, భవదీయచింతనపదవి సొరదు
మధురాదిరసముల మరగి చొక్కుచు జిహ్వ, నీవర్ణనమునకు నిగుడ నీదు
సుందరీముఖములఁ జూడఁ గోరెడిచూడ్కి, తావకాకృతులపైఁ దగులువడదు
వివిధదుర్భాషలు వినఁ గోరువీనులు, వినవు యుష్మత్కథావిరచనములు
తే. ఘ్రాణ మురవడిఁ దిరుగు దుర్గంధములకుఁ
దనివు గొలుపదు వైష్ణవధర్మములకు
నడఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁ గలఁచునట్లు. 363

వ. ఇవ్విధంబున నింద్రియంబులచేతఁ జిక్కువడి స్వకీయపరకీయశరీరంబులందు మిత్రామిత్రభావంబులు సేయుచు జన్మమరణంబుల నొందుచు సంసారవైతరణీనిమగ్నం బయినలోకంబు నుద్ధరించుట లోకసంభవస్థితిలయకారణుండ వైన నీకుం గర్తవ్యంబు భవదీయసేవకుల మయినమాయందుఁ బ్రియభక్తు లయిన వారల నుద్ధరింపుము. 364

మ. భగవద్దివ్యగుణానువర్తనసుధాప్రాప్తైకచిత్తుండ నై
బెగడన్ సంసరణోగ్రవైతరణికిన్ భిన్నాత్ము లై తావకీ
యగుణస్తోత్రపరాఙ్ముఖత్వమున మాయాసౌఖ్యభావంబులన్
సుగతిం గాననిమూఢులం గని మదిన్ శోకింతు సర్వేశ్వరా. 365

వ. దేవా మునీంద్రులు నిజవిముక్తకాము లయి విజనస్థలంబులం దపంబు లాచరింతురు కామకత్వంబు నొల్లరు విశ్వంబున వీరికి నీకంటె నొండు శరణంబు లేదు గావున నిన్ను సేవించెదరు కొందఱు కాములు గరద్వయకండూతిచేతం దనియనిచందంబునఁ దుచ్ఛం (బయి పశుపక్షిక్రిమికీటసామాన్యం బయిన) మైథునాదిగృహమేధిసుఖంబులం దనియక కడపట నతిదుఃఖవంతు లగుదురు నీప్రసాదంబు గలుగువాఁడు నిష్కాముం డయి యుండు మౌనవ్రతజపతపశ్శ్రుతాధ్యయనంబులును నిజధర్మవ్యాఖ్యానవిజనస్థలనివాససమాధులును మోక్షహేతువు లగు నయిన నివి పదియు నింద్రియజయంబు లేనివారికి భోగార్థంబు లయి విక్రయించువారికి జీవనోపాయంబు లయియుండు డాంబికులకును వార్తాకరంబు లయినఫలంబులు గావు భక్తి లేక భవదీయజ్ఞానంబు లేదు రూపరహితుండ వైననీకు బీజాంకురంబులకై వడిఁ గారణకార్యంబు లయిన సదసద్రూపంబులు

రెండును బ్రకాశమానంబు లగు నారెంటియందును భక్తియోగంబున బుద్ధి
మంతులు మథనంబున దారువులందు వహ్నిం గనియెడు తెఱంగున నిన్నుఁ బొడ
గందురు పంచభూతతన్మాత్రంబులును బ్రాణంబులు నింద్రియంబులును మనోబు
ద్ధ్యహంకారచిత్తంబులును నీవ సగుణంబును నిర్గుణంబును నీవ గుణాభిమాను
లయి జన్మమరణంబుల నొందువిబుధు లాద్యంతంబులు గానక నిరుపాధికుండ
వైనని న్నెఱుంగరు తత్త్వజ్ఞు లయినవిద్వాంసులు వేదాధ్యయనాదివ్యాపారం
బులు మాని వేదాంతప్రతిపాద్యుండ వగునిన్ను సమాధివిశేషంబుల నెఱింగి సే
వింతు రది గావున. 366

సీ. నీగృహాంగణభూమి నిటలంబు మోవంగ, మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని
నీమంగళ స్తవనికరవర్ణంబులు, పలుమాఱు నాలుకఁ బలుకఁడేని
నీయధీనములుగా నిఖిలకృత్యంబులుఁ, బ్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై, చింతించి మక్కువఁ జిక్కఁడేని
తే. నిన్నుఁ జెవులార వినఁడేని నీకు సేవ, సేయ రాఁడేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగి యైనఁ దపోవ్రతయోగి యైన, వేది యైన మహాతత్త్వవేది యైన. 367

వ. కావున భవదీయదాస్యయోగంబు గృప సేయు మని ప్రణతుం డైనప్రహ్లాదుని
వర్ణనంబులకు మెచ్చి నిగ్రహుం డైనహరి రోషంబు విడిచి యి ట్లనియె. 368

శా. సంతోషించితి నీచరిత్రమునకున్ సద్భద్ర మౌఁ గాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండ నై యిచ్చెదం
జింతం బొందకు భక్తకాముఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా. 369

ఆ. సకలభావములను సాధులు విద్వాంసు, లఖిలభద్రవిభుఁడ నైన నన్నుఁ
గోర్కు లిమ్మటంచుఁ గోరుదు రిచ్చెదఁ, గోరు మెద్ది యైనఁ గుఱ్ఱ నీవు. 370

వ. అని పరమేశ్వరుండు ప్రహ్లాదునియందుఁ గలసకామత్వంబుఁ దెలియుకొఱకు
వంచించి యి ట్లానతిచ్చిన నతండు నిష్కాముం డైనయేకాంతి గావునఁ
గామంబు భక్తియోగంబునకు నంతరాయం బని తలంచి యి ట్లనియె [1]నుత్పత్తి
మొదలు కామాద్యనుభవాసక్తి గలనాకు వరంబు లిచ్చెదనని వంచింప నేల సం
సారబీజంబులును హృదయబంధనంబులు నయినకామంబులకు వెఱచి ముము
క్షుండ నై క్షేమంబుకొఱకు నేమంబున నిన్నుం జేరితిఁ గామంబులును నింద్రియం
బులును మనశ్శరీరధైర్యంబులును మనీషాప్రాణధర్మంబులును లజ్జాస్మరణ
లక్ష్మీసత్త్వతేజోవిశేషంబులును నశించు లోకంబులందు భృత్యు లర్థకాము
లయి రాజుల సేవింతురు రాజులుం బ్రయోజనంబు లర్థించి భృత్యులకు నర్థం
బు లొసంగుదు రవ్విధంబు గాదు నాకుం గామంబు లేదు నీకుం బ్రయోజ

1 'ఆజన్మకామాసక్తుండ నైననాకు' గ్రా. ప్ర.

నంబు లేదయినను దేవా వరదుండ వయ్యెద వేనిఁ గామంబులు వృద్ధిఁ బొందనివరంబు గృప సేయుము కామంబులు విడిచినపురుషుండు నీతోడ సమానవిభవుం డగు నరసింహ పరమాత్మ పురుషోత్తమ యని ప్రణవపూర్వకంబుగా నమస్కరించిన హరి యి ట్లనియె. 371

సీ. నీయట్టిసుజ్ఞాననిపుణు లేకాంతులు, గోర్కులు నాయందుఁ గోర నొల్ల
రట్లైనఁ బ్రహ్లాద యసురేంద్రభర్తవై, సాగి మన్వంతరసమయ మెల్ల
నిఖిలభోగంబులు నీవు భోగింపుము, కల్యాణబుద్ధి నాకథలు వినుము
సకలభూతములందు సంపూర్ణుఁ డగునన్ను, యజ్ఞేశు నీశ్వరు నాత్మ నిలిపి
ఆ. కర్మచయము లెల్లఁ ఖండించి పూజన, మాచరింపు మీశ్వరార్పణముగ
భోగముల నశించుఁ బుణ్యంబు వ్రతములఁ, బాపసంచయములు పాయు నిన్ను.

వ. మఱియు మీఁదటఁ గాలవేగంబునఁ గళేబరంబు విడిచి త్రైలోక్యవిరాజమానంబును దివిజరాజగేయమానంబును బరిపూరితదశదిశంబును నయినయశంబుతోడ ముక్తబంధుండవై నన్ను డగ్గఱెదవు వినుము. 373

ఆ. నరుఁడు ప్రియముతోడ నాయవతారంబు, నీయుదారగీతనికరములను
మానసించునేని మఱి సంభవింపఁడు, కర్మబంధచయముఁ గడచిపోవు. 374

వ. అనినఁ బ్రహ్లాదుం డి ట్లనియె. 375

సీ. దంష్ట్రివై తొల్లి సోదరుని హిరణ్యాక్షు, నీవు సంపుటఁజేసి నిగ్రహమున
మాతండ్రి రోషనిర్మగ్నుఁడై సర్వలో, కేశ్వరుఁ బరము నిన్నెఱుఁగ లేక
పరిపంథిపగిది నీభక్తుండ నగునాకు, నపకారములు సేసె నతఁడు నేఁడు
నీశాంతదృష్టిచే నిర్మలత్వము నొందెఁ, గావునఁ బాపసంఘంబువలనఁ
తే. బాసి శుద్ధాత్మకుఁడు గాఁగ భవ్యగాత్ర, వరము వేఁడెద నాకిమ్ము వనజనేత్ర
భక్తసంఘాతముఖపద్మపద్మమిత్ర, భక్తకల్మషవల్లికాపటలవిత్ర. 376

వ. అనిన భక్తునికి భక్తవత్సలుం డి ట్లనియె. 377

మ. నిజభక్తుండవు నాకు నిన్నుఁ గనుటన్ నీతండ్రి త్రిస్సప్తపూ
ర్వజులం గూడి పవిత్రుఁడై శుభగతిన్ వర్తించు విజ్ఞానదీ
పజితానేకభవాంధకారు లగుమద్భక్తుల్ వినోదించు దే
శజనుల్ దుర్జను లైన శుద్ధులు సుమీ సత్యంబు దైత్యోత్తమా. 378

సీ. ఘనసూక్ష్మభూతసంఘాతంబులోపల, నెల్లవాంఛలు మాని యెవ్వ రయిన
నీచందమున నన్ను నెఱయ సేవించిన, మద్భక్తు లగుదురు మత్పరులకు
గుఱి సేయ నీవ యోగ్యుఁడ వైతి విటమీఁద, వేదచోదిత మైనవిధముతోడఁ
జిత్తంబు నామీఁదఁ జేర్చి మీతండ్రికిఁ, బ్రేతకార్యములు సంప్రీతిఁ జేయు
తే. మతఁడు రణమున నేఁడు నాయంగమర్శ, నమున నిర్మలదేహుఁడై నవ్యమహిమ

నపగతాఖిలకల్మషుఁ డై తనర్చి, పుణ్యలోకంబులకు నేఁగుఁ బుణ్యచరిత.

వ. అని యిట్లు నరసింహదేవుం డాన తిచ్చిన హిరణ్యకశిపునకుం బ్రహ్లాదుండు పరలోకక్రియలు సేసి భూసురోత్తములచేత నభిషిక్తుం డయ్యె నయ్యెడం బ్రసాదసంపూర్ణముఖుం డైన శ్రీనృసింహదేవునిం జూచి దేవతాప్రముఖసహితుం డైన బ్రహ్మదేవుం డి ట్లనియె. 380

సీ. దేవదేవాఖిలదేవేశ భూతభావన యీఁడు నాచేత వరము వడసి
మత్సృష్టజనులచే మరణంబు నొందక, మత్తుఁ డై సకలధర్మములుఁ జెఱిచి
నేఁడు భాగ్యంబున నీచేత హతుఁ డయ్యెఁ, గల్యాణ మమరె లోకముల కెల్ల
బాలు నీతని మహాభాగవతశ్రేష్ఠు, బ్రదికించితివి మృత్యుభయముఁ బాపి
తే. వరము కృప సేసితివి మేలు వారిజాక్ష, నీనృసింహావతారంబు నిష్ఠతోడఁ
దగిలి చింతించువారలు దండధరుని, బాధ నొందరు మృత్యువుఁ బారిఁ బడరు. 382

వ. అనిన నరసింహదేవుం డి ట్లనియె.

క. మన్నించి దేవశత్రుల, కెన్నఁడు నిట్టువంటివరము లీకుము పాపో
త్పన్నులకు వరము లిచ్చుట, పన్నగముల కమృత మిడుట పంకజగర్భా. 383

వ. అని యిట్లానతిచ్చి బ్రహ్మాదిదేవతాసమూహంబుచేఁ బూజితుం డై భగవంతుం డైన శ్రీనృసింహదేవుం డదృశ్యుం డయ్యెఁ బ్రహ్లాదుండును శూలికిం బ్రణమిల్లి తమ్మిచూలికి వందనంబులు సేసి ప్రజాపతులకు మ్రొక్కి భగవత్కళ లైన దేవతలకు నమస్కరించినం జూచి బ్రహ్మదేవుండు శుక్రాదిమునీంద్రసహితుం డై దైత్యదానవరాజ్యంబునకుం బ్రహ్లాదునిం [1]బట్టంబు గట్టి యతనిచేతఁ బూజితుం డై దీవించె నంత నీశానాదినిఖిలదేవతలు వివిధంబు లగు నాశీర్వాదంబులచేత నాప్రహ్లాదునిఁ గృతార్థుం జేసి తమ్మిచూలిని ముందట నిడుకొని నిజస్థానంబులకుం జని రిట్లు విష్ణుదేవుండు నిజపార్శ్వచరు లయిన బ్రాహ్మణశాపంబునం జేసి ప్రథమజన్మంబున దితిపుత్రు లైన హిరణ్యాక్షహిరణ్యకశిపులను వరాహనారసింహరూపంబుల నవతరించి వధియించె ద్వితీయభవంబున రాక్షసజన్మంబు దాల్చిన రావణకుంభకర్ణులను శ్రీరామరూపంబున సంహరించెఁ దృతీయజన్మంబున శిశుపాలదంతవక్త్రు లను పేరులం బ్రసిద్ధి నొందినవారలను శ్రీకృష్ణరూపంబున ఖండించె నివ్విధంబున మూఁడుజన్మంబుల గాఢవైరానుబంధంబున నిరంతరసంభావితధ్యాను లై వారలు హరినిందాదిపాపవిముక్తు లై హరిం గదిసి రని చెప్పి నారదుం డి ట్లనియె. 384

ఉ. శ్రీరమణీయ మైననరసింహవిహారము నింద్రశత్రుసం
హారముఁ బుణ్యభాగవతుఁ డైననిశాచరనాథపుత్రుసం
చారము నెవ్వఁ డైన సవిచారత విన్నఁ బఠించిన న్శుభా

---

1 'బట్టంబు గట్టె నతనిచేతం బ్రతిపూజితు లై దీవించి బ్రహ్మాదులు నిజస్థానంబులకుం జనిరి' వ్రా. ప్ర.

కారముతోడ నేభయముఁ గల్గనిలోకముఁ జెందు భూవరా. 385

మ. జలజాతప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిం
బలుకన్ లేనిజనార్దనాహ్వయపరబ్రహ్మంబు నీయింటిలోఁ
జెలి యై మేనమఱంది యై సచివుఁ డై చిత్తప్రియుం డై మహా
ఫలసంధాయకుఁ డై చరించు టది నీభాగ్యంబు రాజోత్తమా. 386

త్రిపురాసురసంహారము

క. బహుమాయుఁ డై మయుఁడు చే, విహతం బగుహరునియశము విఖ్యాతజయా
వహముగ నీభగవంతుఁడు, మహితాత్ముఁడు మున్నెసర్చె మనుజవరేణ్యా.

వ. అనిన ధర్మనందనుం డి ట్లనియె. 388

క. ఏకర్మంబున విభుఁ డగు, శ్రీకంఠునియశము మయునిచే సుడివడియెన్
వైకుంఠుఁ డెవ్విధంబునఁ, గైకొని తత్కీర్తి చక్కఁగా నొనరించెన్. 389

వ. అనిన నారదుం డి ట్లనియె. 390

క. చక్రాయుధబలయుతు లగు, శక్రాదుల కోహటించి శ్రమమున నసురుల్
సాక్రోశంబున నరిగిరి, విక్రమములు మాని మయునివెనుకకు నధిపా. 391

వ. ఇట్లు రక్కసులు దనవెనుకఁ జొచ్చిన మాయానిలయుండును దుర్జయుండును నై నమయుండు దనవిద్యాబలంబున నయోరజతసువర్ణమయంబు లై యెవ్వరికిని లక్షింప రానిగమనాగమనంబులును వితర్కింప రానికర్కశపరిచ్ఛదంబులును గలిగినత్రిపురంబుల నిర్మించి యిచ్చిన నక్తంచరులందఱు నందుం బ్రవేశించి కామసంచారు లై పూర్వవైరంబుఁ దలంచి సనాయకానీకంబు లయిన లోకంబుల నస్తోకంబు లయిననిజబలాతిరేకంబున శోకంబు నొందించిన. 392

క. లోకాధినాథు లెల్లను, శోకాతురు లగుచు శరణుఁ జొచ్చిరి దుష్టా
నీకవిదళనాకుంఠున్, శ్రీకంఠున్ భువనభరణచింతోత్కంఠున్. 393

వ. ఇట్లు సకలలోకేశ్వరుం డగుమహేశ్వరుం జేరి లోకపాలకులు ప్రణతు లై పూజించి కరకమలంబులు ముకుళించి. 394

క. త్రిపురాలయు లగుదానవు, లపరాజితు లగుచు మాకు నశ్రాంతంబున్
వపురాదిపీడఁ జేసెద, రపరాధికులను వధింపు మగజాధీశా. 395

క. దీనులము గాక యుష్మద, ధీనుల మై యుండుమేము దేవాహితదో
ర్లీనుల మైనారము బల, హీనుల మగుమమ్ముఁ గావు మీశాన శివా. 396

వ. అనిన భక్తవత్సలుం డగుపరమేశ్వరుండు శరణాగతు లైనగీర్వాణుల వెఱవకుం డని దుర్వారబలంబున బాణాసనంబుఁ గేల నందికొని యొక్కదివ్యబాణంబు సంధించి త్రిపురంబులపయి నేసిన మార్తాండమండలంబున వెలువడు మయూఖజాలంబులచందంబునఁ దద్బాణంబువలన దేదీప్యమానంబు లై యనేక

బాణసహస్రంబు [1]లుప్పతిల్లి కకుప్పులు నిండి మండి తెప్పలుగాఁ గుప్పలు గొని త్రిపురంబులఁ గప్పె నప్పుడు తద్బాణపావకహేతిసందోహదందహ్యమాను లై గతాసు లైనత్రిపురనివాసులం దెచ్చి మహాయోగి యైనమయుండు సిద్ధరస కూపంబున వైచిన. 397

క. సిద్ధామృతరసమహిమను, శుద్ధమహావజ్రతుల్యశోభితతను లై
వృద్ధిం బొందిరి దానవు, లుద్ధతనిర్ఘాతపావకోపము లగుచున్. 398

క. కూపామృతరససిద్ధిని, దీపితు లై నిలిచి యున్న దేవాహితులన్
రూపించి చింత నొందఁడు, గోపధ్వజుఁ జూచి చక్రి కుహనాన్వితుఁ డై. 399

శా. ఉత్సాహంబున నొక్కపాఁడిమొద వై యూధంబు ఘూర్ణించుచున్
వత్సం బై తనవెంట బ్రహ్మ నడవన్ వైకుంఠుఁ డేతెంచి యు
ద్యత్సత్త్వంబునఁ గూపమధ్యరసముం ద్రావెన్ విలోకించుచుం
దత్సౌభాగ్యనిమగ్ను లై మఱచి రా దైత్యుల్ నివారింపఁగన్. 400

వ. ఇట్లు విష్ణుండు మోహనాకారంబున ధేను వయి వచ్చి త్రిపురమధ్యకూపామృతరసంబు ద్రావిన నెఱింగి శోకాకులచిత్తు లయినరసకూపపాలకులం జూచి మహాయోగి యైనమయుండు వెఱఁగుపడి దైవగతిం జింతించి శోకింపక యిట్లనియె.

ఆ. అమరు లైన దనుజు లైనను నరు లైన, నెంతనిపుణు లైన నెవ్వ రైన
దైవికార్థచయముఁ దప్పింపఁగా లేరు, వలదు దనుజులార వగవ మనకు.

వ. అని పలికె నంత విష్ణుండు నైజంబు లైనధర్మజ్ఞానవిద్యాతపోవిరక్తిసమృద్ధిక్రియాశక్తివిశేషంబుల శంభునికిఁ బ్రాధాన్యంబు సమర్పించి రథసారథికేతువర్మబాణాసనప్రముఖసంగ్రామసాధనంబులు సేసినం గైకొని. 403

మ. శరి యై కార్ముకి యై మహాకవచి యై సన్నాహి యై వాహి యై
సరథుం డై సనియంత యై సబలుఁ డై సత్కేతనచ్ఛత్రుఁ డై
పరమేశుం డొకబాణమున్ విడిచెఁ దద్బాణానలజ్వాలలం
బురముల్ గాలె ఘటచ్చటధ్వని నభోభూమధ్యముల్ నిండఁగన్. 404

వ. ఇట్లు హరుండు దురవగాహంబు లైనత్రిపురంబుల నభిజిన్ముహూర్తంబున భస్మంబు సేసి కూల్చిన నమరగరుడగంధర్వసిద్ధసాధ్యయక్షవల్లభులు వీక్షించి జయజయశబ్దంబులు సేయుచుఁ గుసుమవర్షంబులు వర్షించిరి ప్రజలు హర్షించిరి బ్రహ్మాదులు కీర్తించి రప్సరసలు నర్తించిరి దివ్యకాహళదుందుభిరవంబులును మునిజనోత్సవంబులును బ్రచురంబు లయ్యె నిట్లు విశ్వజనీనం బగు త్రిపురాసురసంహారంబున నఖిలలోకులును సంతసిల్లి యుండ నయ్యవసరంబున.

ఆ. తృణకణములభంగిఁ ద్రిపురంబులదహించి, పరముఁ డవ్యయుండు భద్రయశుఁడు
శివుఁడు పద్మజాదిజేగీయమానుఁ డై, నిజనివాసమునకు నెమ్మిఁ జనియె. 406

---

1 'లు సంభవించి భూనభోంతరాళంబులు నిండి' అ. ప్ర.

వ. ఇట్లు నిజమాయావిశేషంబున మర్త్యలోకంబున విడంబించుచున్న విష్ణునిపరాక్రమవిధానంబులు మునిజనవంద్యమానంబులై సకలలోకకల్యాణప్రదానంబులై యుండు ననిన విని నారదునకు ధర్మనందనుం డిట్లనియె. 407

నారదుండు ధర్మరాజునకు వర్ణాశ్రమధర్మంబులు దెలుపుట.

సీ. అనఘాత్మ సకలవర్ణాశ్రమాచారసమ్మతధర్మ మెయ్యది మానవులకు
నేధర్మమున నరుం డిద్ధవిజ్ఞానము, భక్తియుఁ బ్రాపించుఁ బద్మజునకు
సాక్షాత్సుతుండవు సర్వజ్ఞుఁడవు నీవు, నెఱుఁగరానిది ధర్మ మింత లేదు
నారాయణపరాయణస్వాంతు లనఘులు, శాంతులు సదయులు సాధువృత్తి

ఆ. మెఱయుచున్నఘనులు మీవంటివా రెద్ది, పరమధర్మ మనుచు భక్తిఁ దలఁతు
రట్టిధర్మరూప మఖిలంబు నెఱిఁగింపు, వినఁగ నిచ్చ గలదు విమలచరిత. 408

వ. అనిన నారదుండు ధర్మరాజుం జూచి దాక్షాయణియందు నిజాంశంబున నవతరించి భువనశోభనంబుకొఱకు బదరికాశ్రమంబునఁ దపోనిరతుం డగుచు నున్ననారాయణునివలన సనాతనధర్మంబు వింటి నది సెప్పెద సకలవర్ణంబులజనులకు సత్యంబును దయయును నుపవాసాదితపంబును శౌచంబును సైరణయు సదసద్వివేకంబును మనోనియమంబును బహిరింద్రియజయంబును హింస లేమియు బ్రహ్మచర్యంబును దానంబును యథోచితజపంబును సంతోషంబును మార్దవంబును సమదర్శనంబును మహాజనసేవయు గ్రామ్యంబు లయిన కోరికలు మానుటయు నిష్ఫలక్రియలు విడుచుటయు మితభాషిత్వంబును దేహంబు గానితన్ను వెదకికొనుటయు నన్నోదకంబులు ప్రాణులకుం బంచి యిచ్చుటయుఁ బ్రాణులందు దేవతాబుద్ధియు నాత్మబుద్ధిం జేయుటయు శ్రీనారాయణచరణస్మరణకీర్తనశ్రవణసేవార్చన నమస్కారదాస్యాత్మసమర్పణసఖ్యంబు లనియెడిత్రింశల్లక్షణంబులు గలుగ వలయు నందు సత్కులాచారుం డగు మంత్రవంతంబులైన గర్భాధానాదిసంస్కారంబు లవిచ్ఛిన్నంబులు గాఁ గలవాఁడు ద్విజుండు ద్విజునకు యజనయాజనాధ్యయనాధ్యాపనదానప్రతిగ్రహంబు లనుషట్కర్మంబులు విహితంబులు రాజునకుఁ బ్రతిగ్రహవ్యతిరిక్తంబు లయిన యజనాదికర్మంబు లయిదును బ్రజాపాలనంబును బ్రాహ్మణులు గానివారివలన దండశుల్కాదులు గొనుటయు విహితకర్మంబులు వైశ్యునికిఁ గృషివాణిజ్యగోరక్షణాదికర్మంబులును బ్రాహ్మణకులానుసరణంబును విహితంబులు శూద్రునకు ద్విజశుశ్రూష సేయ వలయు. 409

సీ. విను కర్షణాదికవృత్తికంటెను మేలు, యాచింప నొల్లనియట్టివృత్తి
ప్రాప్తంబుఁ గైకొని బ్రదుకుకంటెను లెస్స, యనుదినంబును ధాన్యమడిగికొనుట
యాయావరముకంటె నధికకళ్యాణంబు, పఱిగయెన్నులధాన్యభక్షణంబు

శిలవృత్తికంటెను శ్రేయ మాపణములఁ, బడ్డగింజలు దిని బ్రదుకఁ గనుట
ఆ. యెడరుచోట నృపతి కీనాల్గువృత్తులుఁ, దగుఁ బ్రతిగ్రహంబు దగదు తలఁప
నాపదవసరముల నధముఁ డెక్కువజాతి, వృత్తి నున్న దోషవిధము గాదు.

వ. వినుము శిలవృత్తియు నుంఛవృత్తియు ఋత మనియు నయాచితవృత్తి యమృ
త మనియు యాయావరవృత్తి మృతమనియుఁ గర్షకవృత్తి ప్రమృత మనియు
నెన్నుదు రట్టివృత్తు లెఱింగి జీవించుట మేలు వాణిజ్యంబు సత్యానృత మనియు
శ్వవృత్తి నీచసేవ యనియుఁ బలుకుదురు సర్వవేదమయుండు బ్రాహ్మణుండు
సర్వదేవమయుండు క్షత్త్రియుండు బ్రాహ్మణక్షత్త్రియులకు నీచసేవనంబు గర్త
వ్యంబు గాదు. 411

క. దమమును శౌచముఁ దపమును, శమమును మార్దవముఁ గృపయు సత్యజ్ఞాన
క్షమలును హరిభక్తియు హర్షము నిజలక్షణము లగ్రజాతికి నధిపా. 412

ఉ. శౌర్యము దానశీలముఁ బ్రసాదము నాత్మజయంబుఁ దేజమున్
ధైర్యము దేవభక్తియును ధర్మము నర్థముఁ గామమున్ బుధా
చార్యముకుందసేవలును సత్కృతియుం బరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబుఁ బృథివీవరశేఖర రాజచిహ్నముల్. 413

క. ధర్మార్థకామవాంఛయు, నిర్మలగురుదేవవిప్రనివహార్చనముల్
నిర్మదభావముఁ బ్రమదము, శర్మకరత్వమును వైశ్యజనలక్షణముల్. 414

ఉ. స్తేయము లేనివృత్తియు శుచిత్వము సన్నుతియున్ నిజేశులన్
మాయలు లేక డాయుటయు మంత్రము సెప్పక పంచయజ్ఞముల్
సేయుటయున్ ధరామరులసేవయు గోవులరక్షణంబు స
న్న్యాయము లేమియున్ మనుజనాథ యెఱుంగుము శూద్రధర్మముల్. 415

సీ. నిలయము వాటించి నిర్మలదేహయై, శృంగార మేప్రొద్దుఁ జేయవలయు
సత్యప్రియాలాపచతురయై ప్రాణేశు, చిత్తంబు ప్రేమ రంజింపవలయు
దాక్షిణ్యసంతోషధర్మమేధాదుల, దైవత మని ప్రియుఁ దలఁపవలయు
నాథుఁ డేపద్ధతి నడచు నాపద్ధతి, నడచి తద్బంధుల నడపవలయు
ఆ. మార్దవమునఁ బతికి మజ్జనభోజన, శయనపానరతులు జరపవలయు
విభుఁడు పతితుఁడైన వెలఁది పాతివ్రత్య, మహిమఁ బుణ్యుఁ జేసి మనుపవలయు.

క. తగుణి దనప్రాణవల్లభు, హరిభావముగా భజించి యతఁడును దానున్
సిరికైవడి వర్తించును, హరిలోకమునందు సంతతానందమునన్. 417

క. ఉపవాసంబులు వ్రతములుఁ, దపములు వేయేల భర్త దైవత మని ని
ష్కపటతఁ గొల్చినసాధ్వికి, నృపవర దుర్లభము లేదు నిఖిలజగములన్. 418

వ. మఱియు సంకరజాతు లయినరజక చర్మకారక నట బురుడక కైవర్తక మ్లేచ్ఛ
భిల్లు లగునంత్యజాతు లేద్వురకును జండాల పుల్కస మాతంగజాతులకును

నాయాకులాగతంబు లయినవృత్తులఁ జౌర్యహింసాదులు వర్జించి సంచరింప వలయు మానవులకుఁ బ్రతియుగంబున నైసర్గికంబు లైనధర్మంబులు రెండు లోకంబులందును సుఖకరంబు లని వేదవిదు లైనపెద్దలు సెప్పుదురు కాఱుకాఱున దున్నెడుక్షేత్రంబు లావు సెడు నందుఁ జల్లినబీజంబులు నిస్తేజంబు లై యుండి లెస్సగ నంకురింపవు నిరంతరఘృతధారావర్షంబున దహనునకు దాహకత్వంబు లేక శాంతిం జెందు నందు వేల్చినహవ్యంబులు ఫలింపవు తద్విధంబున ననవరతకామానుసంధానంబునఁ గామోన్ముఖం బైనచిత్తంబు కామంబులం దనిసి నిష్కామం బై విరక్తి నొందుం గావున సత్త్వస్వభావంబుతోడ నెప్పుడుఁ దప్పక నిజవంశాచారవిహితధర్మంబున వర్తించుచునుండు మెల్లన స్వాభావికకర్మపరత్వంబు విడిచి ముక్తి నొందు జాతిమాత్రంబునఁ బురుషునికి వర్ణంబు నిర్దేశింపం బని లేదు శమదమాదివర్ణలక్షణవ్యవహారంబులఁ గన వలయు నని మఱియు నారదుం డి ట్లనియె. 419

క. క్రమమున వర్ణంబులచిహ్నము లెల్లను జెప్పఁబడియె నాశ్రమములధ
ర్మము లెఱిఁగించెద నన్నియు, సమదాహితహృదయశూల సదమలశీలా. 420

వ. వినుము బ్రహ్మచారి మౌంజీకౌపీనయజ్ఞోపవీతకృష్ణాజినపలాశదండకమండలుధరుండును సంస్కారహీనశిరోరుహుండును దర్భహస్తుండును శీలప్రశస్తుండును మౌనియు నై త్రిసంధ్యంబును బ్రహ్మగాయత్రి జపియించుచు సాయంప్రాతరవసరంబుల నర్కపావకగురుదేవతోపాసనంబులు సేయుచు గురుమందిరంబునకుం జని దాసునిచందంబున భక్తివినయసౌమనస్యంబులు గలిగి వేదంబులు సదువుచు నధ్యయనోపక్రమావసానంబుల గురుచరణంబులకు నమస్కరించుచు రేపు మాపును విహితగృహంబుల భిక్షించి భైక్షంబు గురువునకు నివేదించి యనుజ్ఞ గొని మితభోజనంబు గావించుచు నర్హకాలంబుల నుపవసించుచు నంగనలందు నంగనాసక్తులందుం బ్రయోజనమాత్రభాషణంబు లొనర్చుచు గురుపరాంగనవలన నభ్యంగనకేశప్రసాధనశరీరమర్దన మజ్జనరహస్యయోగంబులు వర్జించుచు గృహంబున నుండక జితేంద్రియత్వంబున సత్యభాషణుం డయి సంచరింపవలయు. 421

ఆ పొలఁతి దావవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు, కరఁగకుండ రాదు కదిసె నేని
బ్రహ్మ యైనఁ గూఁతుఁ బట్టక మానఁడు, వడుగు కింతిపొత్తు వలదు వలదు.

వ. వినుము స్వరూపసాక్షాత్కారంబున దేహి బహిరింద్రియాదికం బయినయింతయు నాభాసమాత్రంబుగా నిశ్చయించి యెందాఁక జీవుండు స్వతంత్రుం డయిన యీశ్వరుండు గాకుండు నంతదడవు నంగన యిది పురుషుండ నే ననియెడిభేదబుద్ధి మానుట కర్తవ్యంబుగాదు బ్రహ్మచారియతిగృహస్థులం దెవ్వఁ డైనఁ జిత్తంబు

పరిపక్వంబు గాక యద్వైతానుసంధానంబు సేసిన మూఢుం డగుం గావున రహస్యంబునఁ బుత్రిక నైనం డాయ కుండ వలయు. 423

చ. శిరమున మేన సంస్కృతులు సేయక చందనభూషణాద్యలం
కరణము లెల్ల మాని ఋతుకాలములన్ నిజభార్యఁ బొందుచుం
దరుణులఁ జూడఁ బాఱక ధృతవ్రతుఁ డై మధుమాంసవర్జి యై
గురుతరవృత్తితో మెలఁగుఁ గోవిదుఁ డొక్క గృహస్థు భూవరా. 424

వ. మఱియు ద్విజుండు గృహస్థుం డై గురువులవలన నుపనిషదంగసహితం బైన వేదత్రయంబును బఠియించి నిజాధికారానుసారంబుగ నర్థవిచారంబు సేసి తన బలంబుకొలఁది గురువులకు నభీష్టంబు లొసంగి గృహంబున నొండె వనంబున నొండె నైష్ఠికత్వంబు నాశ్రయించియొండెఁ బ్రాణులతోడ జీవించుచు గురువునందు నగ్నియందు నాత్మయందు సర్వభూతంబులందు నచ్యుతదర్శనంబు సేయుచు నింద్రియవ్యసనాదిమగ్నుండు గాక యెఱుక గలిగి వర్తించుచు బ్రహ్మంబు నొందు.

క. వినుము వనప్రస్థునకున్, మునికథితము లైననియమములు గల వాఁడో
ప్పున వనగతుఁడై మెలఁగెడి, ఘనుఁడు మహర్లోకమునకు గమనించు నృపా.

వ. అటమీఁద గృహస్థాశ్రమంబు విడిచి వనంబునకుం జని దున్నక పండెడినీవారాదికంబు లగ్నిపక్వంబు సేసి యొండె నామంబులు సేసి యొండె నర్కపక్వంబు లైన ఫలాదు లొండె భక్షించుచు వన్యాహారంబుల నిత్యకృత్యంబు లయినచరుపురోడాశంబు లొనర్చుచుఁ బ్రతిదినంబును బూర్వసంచితంబులు పరిత్యజించి నూతనద్రవ్యంబులు సంగ్రహించుచు నగ్నికొఱకుఁ బర్ణశాల యైనఁ బర్వతకందరం బయిన నాశ్రయించుచు హిమ వాయు వహ్ని వర్షాతపంబులకు సహించుచు నఖశ్మశ్రుకేశతనూరుహంబులు ప్రసాధితంబులు సేయక జటిలుం డై వసియించుచు దండాజినకమండలువల్కలపరిచ్ఛదంబులు ధరియించి పండ్రెం డైన నెనిమి దైన నాలు గైన రెం డైన నొకవత్సరం బయినఁ దపఃప్రయాసంబున బుద్ధినాశంబు గా కుండ ముని యై చరించుచు దైవవశంబున జరారోగంబులచేతఁ జిక్కి నిజధర్మానుష్ఠానసమర్థుండు గానిసమయంబున నిరశనవ్రతుం డయి యగ్నుల నాత్మారోపణంబు సేసి సన్న్యసించి యాకాశంబునందు శరీరరంధ్రంబులును గాలియందు నిశ్శ్వాసంబును దేజంబులోపల నూష్మంబును జలంబుల రసంబును ధరణియందు శల్యమాంసప్రముఖంబులును వహ్నియందు వక్తవ్యంబుతోడ వాక్కును నింద్రునియందు శిల్పంబుతోడఁ గరంబులును విష్ణునియందు గతితోడఁ బదంబులును బ్రజాపతియందు రతితోడ నుపస్థంబును మృత్యువందు విసర్గంబుతోడఁ బాయువును దిక్కులందు శబ్దంబుతోడ శ్రోత్రంబును వాయువందు స్పర్శంబుతోడఁ ద్వక్కును సూర్యునియందు రూపంబుతోడఁ

జక్షువులును సలిలంబులందుఁ బ్రచేతస్సహిత యయినజిహ్వయు క్షితియందు గంధసహితం బయినఘ్రాణంబును జంద్రునియందు మనోరథంబులతోడ మనంబును గవి యైనబ్రహ్మయందు బోధంబుతోడ బుద్ధియు రుద్రునియం దహంకారంబుతోడ మమత్వంబును క్షేత్రజ్ఞునియందు సత్త్వంబుతోడఁ జిత్తంబును బరంబునందు గుణంబులతోడ వైకారికంబును డించి యటమీఁదఁ బృథివిని జలంబునందు జలంబును దేజంబునందుఁ దేజంబును వాయువునందు వాయువును గగనంబునందు గగనంబును నహంకారతత్త్వంబునందు నహంకారంబును మహత్తత్త్వంబునందు మహత్తత్త్వంబును బ్రకృతియందుఁ బ్రకృతిని నక్షరుం డైనపరమాత్మయందు లయంబు నొందించి చిన్మాత్రావశేషితుం డయినక్షేత్రజ్ఞుని నక్షరత్వంబున నెఱింగి ద్వయరహితుం డై దగ్ధకాష్ఠుం డైనవహ్నిచందంబునఁ బరమాత్మ యైననిర్వికారబ్రహ్మంబునందు లీనుండు గా వలయు. 427

క. అనఘ వనప్రస్థుం డై, చని తద్ధర్మంబు లిట్లు గలుపుచు మఱియున్
మనె నేని సన్న్యసింపం, జను నటమీఁదటను ముక్తిసంగత్వమునన్. 428

వ. ఇట్లు వానప్రస్థాశ్రమంబు జరిపి సన్న్యసించి దేహమాత్రావశిష్టుండును నిరపేక్షుండును భిక్షుండును నిరాశ్రయుండును నాత్మారాముండును సర్వభూతసఖుండును శాంతుండును సమచిత్తుండును నారాయణపరాయణుండును నై కౌపీనంబునకు నాచ్ఛాదకమాత్రం బైనవస్త్రంబు ధరియించి దండాదివ్యతిరిక్తంబులు విసర్జించి యాత్మపరంబులు గానిశాస్త్రంబులు వర్జించి గ్రహనక్షత్రాదివిద్యల నభ్యసింపక భేదవాదంబులైనతర్కంబులు దర్కింపక యెందును బక్షీకరింపక శిష్యులకు గ్రంథంబులు వంచించి యుపన్యసింపక బహువిద్యల జీవింపక మత్తాదివ్యాపారంబుల నుల్లసిల్లక పెక్కుదినంబు లొక్కయెడ వసియింపక యూరూర నొక్కొక్కరాత్రి నిలుచుచుఁ గార్యకారణవ్యతిరిక్తం బైనపరమాత్మయందు విశ్వంబు దర్శించుచు సదసన్మయం బైనవిశ్వంబునందుఁ బరబ్రహ్మం బయినయాత్మ నవలోకించుచు జాగరణస్వప్నసంధిసమయంబుల నాత్మనిరీక్షణంబు సేయుచు నాత్మకు బంధమోక్షణంబులు మాయామాత్రంబులు గాని వస్తుప్రకారంబున లే వనియును దేహంబునకు జీవితంబు ధ్రువంబుగా దనియును మృత్యువు ధ్రువం బనియు నెఱుంగుచు భూతదేహంబులసంభవనాశంబులకు మూలం బయినకాలంబుఁ బ్రతీక్షించుచు నివ్విధంబున జ్ఞానోత్పత్తిపర్యంతంబుఁ జరియించి యటమీఁద విజ్ఞానవిశేషంబు సంభవించినఁ బరమహంసుం డై దండాదిచిహ్నంబులు ధరియించి యొండె ధరియింపక యొండె బహిరంగవ్యక్తచిహ్నుండు గాక యంతరంగవ్యక్తం బైనయాత్మానుసంధానంబు గలిగి మనీషి యై బాహ్యానుసంధానాభావంబున మనుష్యులకుఁ దనవలన నున్మత్తబాలమూకుల తెఱంగుఁ జూపుచుండ వలయును. 429

ప్రహ్లాదాజగరసంవాదము.

క. మునివల్లభుఁ డజగరుఁ డను,సునయుండు హిరణ్యకశిపుసూనుండును ము
న్నొనరించినసంవాదము, విను మీయర్థంబునందు వెలయు నరేంద్రా. 430

వ. తొల్లి భగవత్ప్రియుం డయినప్రహ్లాదుండు కతిపయామాత్యసమేతుం డయి లౌకికతత్త్వంబు నెఱింగెడికొఱకు లోకంబుల సంచరించుచు నొక్కనాఁడు కావేరీతీరంబున సహ్యపర్వతతటంబున ధూళిధూసరితంబు లయినకరచరణాద్యవయవంబులతోడ గూఢం బైననిర్మలతేజంబుతోఁ గర్మాకారవర్ణాశ్రమాదుల నెవ్వరికి నెఱుంగఁ బడక నేల నిద్రించుచు నజగరవ్రతధరుం డైన మునిం గని డాయం జని విధివత్ప్రకారంబున నర్చించి మునిచరణంబులకు శిరంబు మోపి మ్రొక్కి యతనిచరిత్రంబు దెలియ నిచ్ఛయించి యి ట్లనియె. 431

సీ. భూమి నుద్యోగి వై భోగి వై యుండెడి, నరునికైవడి మునినాథ నీవు
ఘనశరీరము దాల్చి కదలవు చిత్రము,ద్యమయుక్తునకుఁ గాని ధనము లేదు
ధనవంతునకుఁ గాని తగుభోగములు లేవు, భోగికిఁ గాని సంపూర్ణ మైన
తనువు లే దుద్యోగధనభోగములు లేక, నేల నూరక పడి నిద్ర వోవు

ఆ. నీకు నెట్లు గలిగె నిరుపమదేహంబు, సముఁడ వాక్యుఁడవు విశారదుఁడవు
బుద్ధినిధివి జనులఁ బొగడవు దెగడవు, నిద్ర ప్రతిదినంబు నిలుపనేల. 432

వ. అని యిట్లు ప్రహ్లాదుం డడిగిన వికసితముఖుం డయి మునీంద్రుం డదీయమధురాలాపసుధారసప్రవాహంబులు గర్ణంబులఁ బరిపూర్ణంబు లైన నతని నవలోకించి యి ట్లనియె. 433

సీ. అంతరంగికదృష్టి నంతయు నెఱుఁగుదు, వార్యసమ్మతుఁడ వీ వసురవర్య
విశ్వజంతువులప్రవృత్తినివృత్తిల,క్షణములు నీ యెఱుంగనివి లేవు
భగవంతుఁ డగుహరి పాయక నీమనో,వీధి రాజిల్లుచు వెలుఁగుఁ గాన
క్రమమున బహుళాంధకారంబుఁ బరిమార్చుఁ, బరమసాత్త్వికుఁడవు భద్రబుద్ధి

ఆ. వైననీవు నన్ను నడిగెదు గావున, విన్నధర్మ మెల్ల విస్తరింతు
నిన్నుఁ జూడఁ గలిగె నీతోడిమాటల, నాత్మశుద్ధి గలిగె ననఘచరిత. 434

వ. వినుము ప్రవాహకారిణి యై విషయంబులచేతం బూరింప రానితృష్ణచేతం బడి కర్మంబులఁ బరిభ్రామ్యమాణుండ నై ననేను నానావిధయోనులందుఁ బ్రవేశించుచు వెడలుచు నెట్టకేలకు మనుష్యదేహంబు ధరియించి యందు ధర్మంబున స్వర్గద్వారంబును నధర్మంబున శునకసూకరాదితిర్యగ్జంతుయోనిద్వారంబుల నొంది క్రమ్మఱ మనుష్యుండ నై పుట్ట వలయు నని వివేకించి సుఖరక్షణదుఃఖమోక్షణంబులకొఱకు ధర్మంబు సేయుదంపతులవ్యవహారంబు గని సర్వక్రియానివృత్తి గలిగినజీవుండు స్వతంత్రుం డై ప్రకాశించు నని నిర్ణయించి భోగంబులు

మనోరథజాతమాత్రంబులు గాని శాశ్వతంబులు గా వని పరీక్షించి నివృత్తుం
డ నై యుద్యోగంబు లేక నిద్రించుచుఁ బ్రారబ్ధభోగంబుల ననుభవించుచు
నుండుదు నివ్విధంబునఁ దనను సుఖరూపం బైనపురుషార్థంబు దనయందుఁ
గలుగుట యెఱుంగక పురుషుండు శైవాలజాలనిరుద్ధంబు లైనశుద్ధజలంబుల
విడిచి యెండమావులు జలంబు లని పాఱెడుమూఢునివడువున సత్యంబు గాని
ద్వైతంబుఁ జొచ్చి ఘోరసంసారచక్రపరిభ్రాంతుం డై యుండు దైవతంత్రంబు
లైనదేహాదులచేత నాత్మకు సుఖంబును దుఃఖనాశంబునుం గోరుచు నిరీశుం డైన
వానిప్రారంభంబులు నిష్ఫలంబు లగు నదియునుం గాక మర్త్యునకు ధనంబు
ప్రాప్తం బయిన నది దుఃఖకరంబు గాని సుఖకరంబు గాదు లోభవంతు లయిన
ధనవంతులు నిద్రాహారంబులు లేక రాజ చోర యాచక శత్రుమిత్రాదిసర్వస్థలంబు
లందును శంకించుచు దానభోగంబులు మఱచి యుండుదురు ప్రాణార్థవంతు
లకు భయంబు నిత్యంబు శోకమోహభయక్రోధరాగశ్రమాదులు వాంఛా
మూలంబులు వాంఛ లేకుండ వలయును. 435

మ. సరఘుల్ గూర్చిన తేనె మానవులకుం బ్రాప్త మైనట్లు లో
భరతుల్ గూర్చినవిత్తముల్ పరులకుం బ్రాపించుఁ బ్రాప్తాశి నై
తిరుగం బోనిమహోరగంబు బ్రదుకున్ దీర్ఘాంగ మై యుండియుం
జిరకాలం బగువానివర్తనము నేఁ జింతించి సంశాంతి నై. 436

క. అజగరమును జుంటీఁగయు, నిజగురువులుగాఁ దలంచి నిశ్చింతుఁడ నై
విజనస్థలిఁ గర్తంబుల, గజిబిజి లేకున్నవాఁడ గౌరవవృత్తిన్. 437

సీ. అజినవల్కలదుకూలాంబరంబులు గట్టి, యైనఁ గట్టక యైన నలరుచుందు
నాందోళికారథహయనాగముల నెక్కి, యైన నెక్కక యైన నరుగుచుందుఁ
గర్పూరచందనకస్తూరికాలేప, మైన భూరజ మైన నలఁదికొందు
భర్మశయ్యల నైనఁ బర్ణశిలాతృణ, భస్మంబులం దైనఁ బండుచుందు

ఆ. మానయుక్త మైన మానహీనం బైనఁ, దీయ నైన మిగులఁ దిక్త మైన
గురుతు సగుణ మైన గుణవర్జితం బైన, నల్ప మైనఁ జాల నధిక మైన. 438

క. లే దని యెవ్వరి నడుగను, రా దని చింతింపఁ బరులు రప్పించినఁ జోఁ
గా దని యెద్దియు మానను, ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్.

క. నిందింపఁ బరుల నెన్నఁడు, వందింప ననేకపీడ వచ్చిన మది నా
క్రందింప విభవముల కా,నందింపఁ బ్రకామవర్తనంబున నధిపా. 440

వ. ఇట్లు గోరికలు లేక యొక్కసమయంబున దిగంబరుఁడనై పిశాచంబుచందంబున
నుండుచుఁ బెక్కుదినంబులం గోలెఁ జనుఁబావవర్తనంబుఁ గైకొని నిమీలితలో
చనత్వంబున నేకాంతభావంబున విష్ణునియందుఁ జేర్చి వికల్పంబు భేదగ్రాహకచి
త్తవృత్తులఁ జిత్తంబు సద్రూపవిభ్రమంబు గలమనంబునందు మనంబును నహం

కారంబునందు నహంకారంబును మాయయందు మాయను నాత్మానుభూతియం
దు లయంబు నొందించి సత్యంబు దర్శించుచు విరక్తి నొంది స్వానుభవంబున
నాత్మస్థితుండ నై యుండుదు నీవు భగవత్పరుండవు గావున రహస్యం బైనపరమ
హంసధర్మంబు (స్వానుభవగోచరం బైన తెఱంగున నీకు హృద్గోచరం బగునట్లు)
సెప్పితి ననిన విని. 441

క. ఘను నజగరమునివల్లభు, దనుజేంద్రుఁడు పూజసేసి తగ వీడ్కొని నె
మ్మనమున సంతోషించుచుఁ, జనియె నిజగేహమునకు శశికులతిలకా. 442

వ. అనిన యుధిష్ఠిరుం డిట్లనియె. 443

క. ననుబోఁటిజడగృహస్థుఁడు, మునివల్లభ యిట్టిపదవి మోదంబున నే
యనువునఁ జెందును వేగమ, వినిపింపుము నేఁడు నాకు విజ్ఞాననిధీ. 444

వ. అనిన నారదుం డిట్లనియె గృహస్థుం డగువాఁడు వాసుదేవార్పణంబుగా
గృహోచితక్రియ లనుసంధించుచు మహామునుల సేవించి వారలవలన నారా
యణదివ్యావతారకథాకర్ణనంబు సేయుచు నయ్యైవిహితకాలంబుల శాంత
జనులం గూడి మెలంగుచుఁ బుత్రమిత్రకళత్రాదిసంగంబులు గలవంటి వని
యెఱుంగుచు లోపల నాసక్తి లేక సక్తుండై వడి వెలుపలఁ బురుషకారంబు
లొనర్చుచుఁ దగులంబు లేక విత్తంబు లిచ్చి జనక సుత సోదర సఖ జ్ఞాతిజనుల
చిత్తంబులు సమ్ముదాయత్తంబులు గావించుచు ధనధాన్యనిధానదైవలబ్ధంబుల
వలన నభిమానంబు మాని యనుభవించుచు గృహక్షేత్రంబులఁ జొచ్చి యుదర
పూరణమాత్రంబు దొంగిలినవాని దండింపక భుజగమృగమూషికమర్కట
మక్షికాఖరోష్ట్రంబుల హింసింపక పుత్రులభంగి నీక్షించుచు దేశకాలదైవం
బులకొలందిని ధర్మార్థకామంబులఁ బ్రవర్తించుచు శునకపతితచండాలాదుల కైన
భోజ్యపదార్థంబులు దగినభంగి నిచ్చుచు నిజవృత్తిలబ్ధంబు లగునశనాదులచేత
దేవఋషిపితృభూతమానవుల సంతర్పించుచుఁ బంచమహాయజ్ఞావశేషంబుల
నంతర్యామిపురుషయజనంబును నాత్మజీవనోపాయంబును సమర్థించుచు నుండ
వలయు. 445

ఆ. జనకగురుల నైనఁ జంపు నర్థమునకై, ప్రాణ మైన విడుచు భార్యకొఱకు
వట్టిభార్యఁ బురుషుఁ డతిథిశుశ్రూష సేయించి గెలుచు నజితు నీశు నైన.

ఆ. పరముఁ డీశ్వరుండు బ్రాహ్మణముఖమున, నాహరించి తుష్టుఁ డయినభంగి
నగ్నిముఖమునందు హవ్యరాసులు గొని, యైనఁ దుష్టి నొందఁ డనఘచరిత.

వ. కావున గృహస్థుండు బ్రాహ్మణులందును దేవతలందును మర్త్యపశుప్రముఖ
జాతులందును నంతర్యామియు బ్రాహ్మణాననుండును నైనక్షేత్రజ్ఞునందు నయ్యై
కోరికలు సమర్పించి సంతర్పణంబు సేయ వలయు భాద్రపదంబునఁ గృష్ణ
పక్షంబునందును దక్షిణోత్తరాయణంబులందును రేయుంబగలు సమ మైనకా

లంబులందును వ్యతీపాతంబులందును దినక్షయంబులందును సూర్యచంద్ర
గ్రహణంబులందును శ్రవణద్వాదశియందును వైశాఖశుక్లతృతీయయందును
గార్తికశుక్లనవమియందును హేమంతశిశిరంబులలోన నాలు గష్టకలందును
మాఘశుక్లసప్తమియందును మాసనక్షత్రంబులతోడం గూడినపున్నమలందును
ద్వాదశితోడం గూడినయుత్తరాత్రయ శ్రవణానూరాధలందును నుత్తరాత్రయ
సహితంబు లయినయేకాదశులయందును జన్మనక్షత్రయుక్తదివసంబులందును
మఱియుఁ బ్రశస్తకాలంబులందును జననీజనకబంధుజనులకు శ్రాద్ధంబులును జప
హోమస్నానవ్రతంబులును దేవబ్రాహ్మణసమారాధనంబులును నాచరింపవల
యు భార్యకుఁ బుంసవనాదికంబును నపత్యంబునకు జాతకర్మాదికంబును దనకు
యజ్ఞదీక్షాదికంబును బ్రేతజనులకు దహనాదికంబును మృతదివసంబున సాంవ
త్సరికంబును జరప వలయు. 448

మ. వినుమే దేశములన్ దయాగుణతపోవిద్యాన్వితం బైనవి
ప్రనికాయంబు వసించు నేస్థలములన్ భాగీరథీముఖ్యవా
హిను లుండున్ హరిపూజ లెయ్యెడల భూయిష్ఠప్రకారంబులం
దనరున్ భూవర యట్టిచోటులఁ దగున్ ధర్మంబులం జేయఁగన్. 449

క. హరియందు జగము లుండును, హరిరూపము సాధుపాత్రమం దుండు శివం
కర మగుపాత్రము గలిగిన, నరయఁగ నది పుణ్యదేశ మనఘచరిత్రా. 450

వ. మఱియుఁ గురుక్షేత్రంబును గయాశీర్షంబును బ్రయాగంబును బులహాశ్ర
మంబును నైమిశంబును ఫాల్గునంబును సేతువును బ్రభాసంబును గుశస్థలి
యును వారణాసియు మధురాపురియును బంపాబిందుసరోవరంబులును నారా
యణాశ్రమంబును సీతారామాశ్రమంబును మహేంద్రమలయాదు లైన
కులాచలంబులును హరిప్రతిమార్చనప్రదేశంబులును (హరిసేవాపరు లైనపరమ
భాగవతులు వసించెడుపుణ్యక్షేత్రంబులును) శుభకాముం డైనవాఁడు సేవింప
వలయు. 451

ఆ. భూవరేంద్ర యిట్టిపుణ్యప్రదేశంబు,లందు నరుఁడు సేయునట్టిధర్మ
మల్ప మైన నది సహస్రగుణాధిక,ఫలము నిచ్చు హరికృపావశమున. 452

వ. వినుము చరాచరం బయినవిశ్వ మంతయు విష్ణుమయం బగుటం జేసి పాత్రనిర్ణ
యనిపుణు లైనవిద్వాంసులు నారాయణుండు ముఖ్యపాత్రం బని పలుకుదురు
దేవఋషులును బ్రహ్మపుత్త్రు లైనసనకాదులును నుండ భవదీయరాజసూయం
బున నగ్రపూజకు హరి సమ్మతుం డయ్యె ననేకజంతుసంఘాతసంకీర్ణం బైన
బ్రహ్మాండపాదపంబునకు నారాయణుండు మూలంబు దన్నిమిత్తంబు నారా
యణసంతర్పణంబు సకలజంతుసంతర్పణం బని యెఱుంగుము ఋషినరతిర్యగ
మరశరీరంబులు పురంబులు వానియందుఁ దారతమ్యంబులతోడ జీవరూపం

బున భగవంతుం డయినహరి వర్తించుటంజేసి పురుషుం డనఁ బ్రసిద్ధుం డయ్యె నందుఁ దిర్యగ్జాతులకంటె నధికత్వంబు పురుషునియందు విలసిల్లుటంజేసి పురుషుండు పాత్రంబు పురుషులలోన హరితను వైనవేదంబును ధరించుచు సంతోషవిద్యాతపోగరిష్ఠుం డైనబ్రాహ్మణుండు పాత్రంబు బ్రాహ్మణులలోన నాత్మజ్ఞానపరిపూర్ణుం డయినయోగి ముఖ్యపాత్రం బని పలుకుదురు పరస్పర పాత్రంబులకు సహింపనిమనుష్యులకుఁ బూజనార్థంబుగాఁ ద్రేతాయుగంబు నందు హరిప్రతిమలు గల్పింపంబడియెఁ గొందఱు ప్రతిమార్చనంబు సేయుదురు పాత్రపురుషద్వేషు లైనవారలకు నట్టిప్రతిమార్చనంబు ముఖ్యార్థప్రదంబు గాదు మందాధికారులకుఁ బ్రతిమార్చనంబు పురుషార్థప్రదం బగును. 453

ఆ. అఖిలలోకములకు నీ హరి దైవతము సూడ, హరికి దైవతము ధరాధినాథ
పదపరాగలేశపంక్తిచేఁ ద్రైలోక్య, పావనంబు సేయు బ్రాహ్మణుండు. 454

వ. అట్టిబ్రాహ్మణజనులందుఁ గర్మనిష్ఠులుఁ దపోనిష్ఠులు వేదశాస్త్రనిష్ఠులు జ్ఞానయోగనిష్ఠులు నై కొందఱు వర్తింతు రందు జ్ఞాననిష్ఠునికి ననంతఫలకామి యైన గృహస్థుండు పితృజనుల నుద్దేశించి కవ్యంబులును దేవతల నుద్దేశించి హవ్యంబులును బెట్టుట ముఖ్యంబు దైవకార్యంబునకు నిరువుర నైన నొకరి నైనఁ బితృకార్యంబునకు మువ్వుర నైన నొకరి నైన భోజనంబు సేయింప వలయు ధనవంతుని కైనను శ్రాద్ధవిస్తారంబు గర్తవ్యంబు గాదు దేశకాలప్రాప్తకందమూలఫలాదికం బయినహరినైవేద్యంబున విధిచోదితప్రకారంబుగా శ్రద్ధతోడఁ బాత్రంబునందుఁ బెట్టినయన్నంబు గామదం బయి యక్షయఫలకారి యగు ధర్మతత్త్వవేది యైనవాఁడు శ్రాద్ధంబులందు మాంసప్రదానంబు సేయక భక్షింపక చరింపవలయుఁ గందమూలాదిదానంబున నయ్యెడిఫలంబు పశుహింసనంబున సంభవింపదు ప్రాణిహింస సేయక వర్తించుటకంటె మిక్కిలి ధర్మంబు లేదు యజ్ఞవిదు లై నిష్కాము లయినప్రోడలు బాహ్యకర్మంబులు విడిచి యాత్మజ్ఞానదీపంబులందుఁ గర్మమయంబు లయినయజ్ఞంబుల నాచరింతురు.

క. పశువులఁ బొరిగొని మఖములు, విశదములుగఁ జేయుబుధుని వీక్షించి తమున్
విశసనము సేయునో యని, క్రశిమన్ బెగ డొందు భూతగణము నరేంద్రా.

వ. అది గావున ధర్మవేది యయినవాఁడు దైవప్రాప్తంబు లయినకందమూలాదికంబులచేత నిత్యనైమిత్తికక్రియలఁ జేయ వలయు నిజధర్మబాధకం బయిన ధర్మంబును బరధర్మప్రేరితం బయినధర్మంబును నాభాసధర్మంబును బాషండధర్మంబును గపటధర్మంబును ధర్మజ్ఞుం డయినవాఁడు మానవలయు నైసర్గిక ధర్మంబు దురితశాంతిసమర్థం బగు నిర్ధనుండు ధర్మార్థంబు యాత్ర సేయుచు నైన ధనంబు గోర వలవదు జీవనోపాయంబునకు నిట్టట్టుఁ దిరుగక కార్పణ్యంబు లేక జీవించుచు మహాసర్పంబుతెఱంగున సంతోషంబున నాత్మారాముండై యెద్ది

యుం గోరక ప్రదికెడిసుగుణునికిం గలసుఖంబు గామలోభంబుల దశదిశలం బరిధావనంబు సేయువానికి సిద్ధింపదు పాదరక్షలు గలవానికి శర్కరాకంటకాదుల వలన భయంబు లేక మెలంగ నలవడుభంగిం గామంబులవలన నివృత్తిగలవానికి నెల్లకాలంబును భద్రం బగునుపస్థమునకును జిహ్వాదైన్యంబునకును బురుషుండు గృహపాలకశునకంబుకై వడి సంచరించుచు సంతుష్టి లేక చెడు సంతోషి గాని విప్రునివిద్యాతపోవిభవయశంబులు నిరర్థకంబు లగు నింద్రియలోలత్వంబున విజ్ఞానంబు నశించు సకలభూలోకభోగంబులు భోగించియు దిగ్విజయంబు సేసియు బుభుక్షాపిపాసలవలనం గామపారంబును హింసవలనం గ్రోధపారంబును జేరుట దుర్లభంబు సంకల్పవర్జనంబునం గామంబును గామవర్జనంబునం గ్రోధంబును నర్థానర్థదర్శనంబున లోభంబును నద్వైతానుసంధానంబున భయంబును నాత్మానాత్మవివేకంబున శోకమోహంబులును సాత్త్వికసేవనంబున దంభంబును మౌనంబున యోగాంతరాయంబును శరీరవాంఛ లేమిని హింసయు హితాచరణంబున భూతజం బయినదుఃఖంబును సమాధిబలంబున దైవికవ్యథయుం బ్రాణాయామాదికంబున మన్మథవ్యథయు సాత్త్వికాహారంబుల నిద్రయు సత్త్వగుణంబున రజస్తమంబులును నుపశమంబున సత్త్వంబును గురుభజనకుశలుండై (శీలంబున) జయింపవలయు. 457

క. హరిమహిమ దనకుం జెప్పిన, గురువున్ నరుం డనుచుం దలంచి కుంఠితభక్తిం
దిరుగుపురుషుశ్రమ మెల్లను, గరిశౌచముక్రియ నిరర్థకం బగు నధిపా. 458

ఉ. ఈవనజాతనేత్రుం బరమేశు మహాత్ముం బ్రధానపూరుషున్
దేవవరేణ్యు సజ్జనవిధేయు ననంతుం బురాణయోగిసం
సేవితపాదపద్ముం దమచిత్తములన్ నరుం డంచు లోకు లి
చ్ఛావిధిం జూచు చుండుదురు సన్మతి లేక నరేంద్రచంద్రమా. 459

వ. వినుము షడింద్రియంబులలోన నొకటియందుం దత్పరులై యిచ్ఛాపూరణవిధానంబులం జరితార్థుల మైతి మనువారలు ధారణాభ్యాససమాధియోగంబుల సాధింప లేరు కృషిప్రముఖంబులు సంసారసాధనంబులు గాని మోక్షసాధనంబులు గావు కుటుంబసంగంబునం జిత్తవిక్షేపం బగుం జిత్తవిజయప్రయత్నంబున సన్న్యసించి సంగంబు వర్జించి మితం బయినభిక్షాన్నంబు భక్షించుచు శుద్ధవివిక్తసమప్రదేశంబున నొక్కరుండు నాసీనుం డై సుస్థిరత్వంబునం బ్రణవోచ్చారణంబు సేయుచు రేచకపూరకకుంభకంబులం బ్రాణాపానంబుల నిరోధించి కామహతం బయినచిత్తంబునం బరిభ్రమణంబు మాని కామవిసర్జనంబు సేసి మరలునంతకు నిజనాసాగ్రనిరీక్షణంబు సేయుచు నిర్వ్యథంబున యోగాభ్యాసంబు సేయువానిచిత్తంబు గాష్ఠరహితం బయినవహ్ని తెఱంగున శాంతిం జెందుం గామాదులచేత వేధింపంబడక ప్రశాంతసమస్తవృత్తం బయినచిత్తంబు

బ్రహ్మసుఖసమ్మర్శనంబున లీనం బై మఱియు నెఱయ నేరదు. 460

మ. ధరణీదేవుఁడు సన్న్యసించి యతి యై ధర్మార్థకామంబులం
బరివర్జించి పునర్విలంబమునఁ దత్ప్రారంభి యౌ నేని లో
భరతిం గ్రక్కినకూడు మంచి దనుచుం భక్షించి జీవించుదు
ర్నరుచందంబున హాస్యజీవనుఁ డగుం నానాప్రకారంబులన్. 461

క. మలమునఁ గ్రిమియును బడుక్రియ, నిలఁబడునోడ లాత్మగాదు హేయం బనుచుం
దలఁతురు తజ్జ్ఞులు వొగడుదు, రలసత నోడ లాత్మ యనుచు నజ్ఞు లిలేశా.

ఆ. వ్రతము మానఁ దగదు వడుగుఁగుఱ్ఱనికిని, గ్రియలు మానఁ దగదు గృహగతునికిఁ
దపసి కూర నుండఁ దగదు సన్న్యాసికిఁ, దరుణితోడిపొత్తు దగదు తగదు.

సీ. రథము మే నెల్ల సారథి బుద్ధి యింద్రియ, గణము గుఱ్ఱములు పగ్గములు మనము
ప్రాణాదిదశవిధపవనంబు లిరుసు ధ, ర్మాధర్మగతులు చక్రాంగకములు
బహుళతరం బైన బంధంబు చిత్తంబు, శబ్దాదికములు సంచారభూము
లభిమానసంయుతుం డయిన జీవుఁడు రథి, ఘనతర ప్రణవంబు కార్ముకంబు

తే. శుద్ధజీవుండు బాణంబు శుభదమైన, బ్రహ్మ మంచితలక్ష్యంబు పగతు రాగ
భయమద ద్వేష శోక లోభ ప్రమోహ, మానమత్సరముఖములు మానవేంద్ర.

వ. ఇట్లు మనుష్యశరీరరూపం బయిన రథంబు దనవశంబు సేసికొని మహాభాగవతచరణకమలసేవానిశితం బయిన విజ్ఞానఖడ్గంబు ధరియించి శ్రీమన్నారాయణకరుణావలోకనబలంబున రాగాదిశత్రునిర్మూలనంబు గావించి ప్రణవబాణాసనంబున శుద్ధజీవశరంబును సంధించి బ్రహ్మ మనియెడి గుఱియందుఁ బడ నేసి యహంకారరథికుండు రథికత్వంబు మాని నిజానందంబున నుండ వలయు నట్టివిశేషంబు సంభవింపనిసమయంబున బహిర్ముఖంబు లయిన యింద్రియఘోటకంబులు బుద్ధిసారథిసహితంబు లై స్వాభిమానరథికుని ప్రమత్తత్వంబు దెలిసి ప్రవృత్తిమార్గంబు నొందించి విషయశత్రుమధ్యంబునం గూల్చును. 465

ఆ. విషయశత్రు లెల్ల విక్రాంతితోడ సా, రథిసమేతుఁ డయిన రథికుఁ బట్టి
యుగ్రతిమిరమృత్యుయుత మగు సంసార, కూపమధ్యమందుఁ గూల్తు రధిప.

వ. వినుము వైదికకర్మంబు ప్రవృత్తంబును నివృత్తంబును నన రెండు దెఱంగు లయ్యె నందుఁ బ్రవృత్తంబునఁ బునరావర్తనంబును నివృత్తంబున మోక్షంబును సిద్ధించుఁ బ్రవృత్తకర్మంబులోన నిష్టాపూర్తంబు లన రెండుమార్గంబులు గల వందు హింసాద్రవ్యమయకామ్యరూపంబు లయిన దర్శపూర్ణమాస పశు సోమయాగ వైశ్వదేవ బలిహరణప్రముఖంబు లైన యాగాదికంబు లిష్టంబులు దేవతాలయ వన కూప తటాకప్రముఖంబులు పూర్తంబులు ప్రవృత్తకర్మంబున దేహంబు విడిచి దేహాంతరారంభంబు నొందు దేహి హృదయాగ్రంబు వెలుంగ వాని

తోడ నింద్రియంబులం గూడి భూతసూక్ష్మయుక్తుం డై ధూమదక్షిణాయన
కృష్ణపక్షరాత్రి దర్శంబులవలన సోమలోకంబుఁ జేరి భోగావసానంబున విలీన
దేహుం డై వృష్టిద్వారంబునఁ గ్రమంబున నోషధిలతాన్నశుక్లరూపంబులం
బ్రాపించి భూమియందు జన్మించు నిది పునర్భవరూపం బయినపితృమార్గంబు.
నివృత్తకర్మనిష్ఠుం డయినవాఁడు జ్ఞానదీప్తంబు లయినయింద్రియంబులందుఁ
గ్రియాయజ్ఞంబుల యజించి యింద్రియంబుల దర్శనాదిసంకల్పమూలం బయిన
మనంబునందు వికారయుక్తం బయినమనంబును వాక్కునందు విద్యావిలక్షణ
యయినవాక్కును వర్ణసముదాయంబునందు వర్ణసముదాయంబును నకారాది
సర్వత్రయాత్మకం బయినయోంకారంబునందు నోంకారంబును బిందువందు
బిందువును నాదంబునందు నాదంబును బ్రాణంబునందుఁ బ్రాణంబును బ్రహ్మ
మందు నిలుప వలయును దేవమార్గం బయినయుత్తరాయణ శుక్లపక్ష దివా
ప్రాహ్ణ పూర్ణిమా రాకలవలన సూర్యద్వారంబున బ్రహ్మలోకంబునందుఁ జేరి
భోగావసానంబున స్థూలోపాధి యైనవిశ్వుం డై స్థూలంబును సూక్ష్మంబునందు
లయించి సూక్ష్మోపాధి యైనతైజసుండై సూక్ష్మంబును గారణంబునందు లయించి
కారణోపాధి యైనప్రాజ్ఞుం డై కారణంబును సాక్షిస్వరూపంబునందు లయించి
తురీయుండై సూక్ష్మలయంబునందు శుద్ధాత్ముండై యివ్విధంబున ముక్తుం డగును.

ఆ. అమరనిర్మితంబు లై యొప్పుపితృదేవ,సరణు లెవ్వఁ డెఱుఁగు శాస్త్రదృష్టి
నట్టివాఁడు దేహి యై మోహమున నొందఁ, డతిశయించి బుద్ధి నవనినాథ.

వ. వినుము దేహాదులకుఁ గారణత్వంబున నాదియందును నవధిత్వంబున నంతమం
దును గలుగుచు బహిరంగంబున భోగ్యంబును నంతరంగంబున భోక్తయుఁ
బరంబు నపరంబును జ్ఞానంబును జ్ఞేయంబును వచనంబును వాచ్యమును నప్రకా
శమును బ్రకాశంబును నై నవస్తువునకు వేఱొండు లేదు ప్రతిబింబాదికంబు వస్తు
త్వంబునం జేసి వికల్పితంబై తలంపంబడుభంగి నైంద్రియకంబైనసర్వంబును నర్థ
త్వంబున వికల్పితం బయి తోఁచుం గాని పరమార్థంబు గాదు దేహాదికంబులు
మిథ్యాత్మకంబులు వానికి హేతువు లయినక్షితిప్రముఖంబులకును మిథ్యా
త్వం బగుట సిద్ధంబు పరమాత్మకు నవిద్యచేత నెంతదడవు వికల్పంబు దోఁచు
నంతదడవును భ్రమంబునుం దోఁచు నవిద్యానివృత్తి యైన సర్వంబును
మిథ్య యని శాస్త్రవిధినిషేధంబులు కలలోపల మేలు గన్నతెఱంగగు
భావాద్వైతక్రియాద్వైతద్రవ్యాద్వైతంబులు మూఁడు గల వందుఁ బటతంతు
న్యాయంబునఁ గార్యకారణంబులందు వస్త్వైకత్వాలోచనంబు సేసి విక
ల్పంబు లే దని భావించుట భావాద్వైతంబు మనోవాక్కాయకృతంబు
లైనసర్వకర్మంబులను ఫలభేదంబు సేయక పరబ్రహ్మార్పణంబు సేయుట
క్రియాద్వైతంబు పుత్రమిత్రకళత్రాదిసర్వప్రాణులకుం దనకును దేహంబునకుం

బంచభూతాత్మకత్వంబున భోక్త యొక్కం డనుపరమార్థత్వంబున నర్థకామం
బులయెడ నైక్యదృష్టిం జేయుట ద్రవ్యాద్వైతంబు నేర్పున నాత్మతత్త్వానుభవం
బున నద్వైతత్రయంబును విలోకించి వస్తుభేదబుద్ధియుఁ గర్మభేదబుద్ధియు స్వ
కీయపరకీయబుద్ధియు స్వప్నంబులుగాఁ దలంచి ముని యైనవాఁడు మాన వలయు.

క. వాదములు వేయు నేటికి, వేదోక్తవిధిం జరించు విబుధుఁడు గృహమం
దాదరమున నారాయణ, పాదంబులు గొలిచి ముక్తిపదమునఁ గేఁగున్. 470

శా. భూపాలోత్తమ మీరు భక్తిగరిమన్ సర్వార్థిన్ సరోజేక్షణ
శ్రీపాదాంబుజయుగ్మముల్ నియతులై సేవించి కాదే మహో
గ్రాపత్సంఘములోనఁ జిక్కక సమస్తాశాంతనిర్జేతలై
యేపారంగ మఖంబు సేసితివి దేవేంద్రప్రభావంబునన్. 471

నారదునిపూర్వజన్మవృత్తాంతము.

వ. వినుము పోయినమహాకల్పంబునందు గంధర్వులలోన నుపబర్హణుం డనుపేర గంధర్వుండ నైననేను సౌందర్యమాధుర్యగాంభీర్యాదిగుణంబుల సుందరులకుఁ బ్రియుండ నై క్రీడించుచు నొక్కనాఁడు విశ్వస్రష్టలైన బ్రహ్మలు దేవసత్త్రమనియెడియాగంబులోన నారాయణకథలు గానంబు సేయుకొఱకు నప్సరోజనులను గంధర్వులనుం జీరిన. 472

ఆ. క్రతువులోని కేఁగి గంధర్వగణముతోఁ, గలసి పోయి విష్ణుగాథ లచటఁ
గొన్ని పాడి సతులఁ గూడి మోహితుఁడ నై, తలఁగి చనితి నంత ధరణినాథ.

క. వారిజగంధులపొత్తున, వారిం గైకొనక తలఁగి వచ్చిన బుద్ధిన్
వా రెఱిఁగి శాప మిచ్చిరి, వారింపఁగ రానిరోషవశమున నధిపా. 474

ఆ. పంకజాక్షు నచటఁ బాడక కామినీ, గణముఁ గూడి చనినకల్మషమున
దగ్ధకాంతి వగుచు ధరణీతలంబున, శూద్రజాతిసతికి సుతుఁడ వగుము. 475

వ. అని యిట్లు విశ్వస్రష్టలు శపించిన నొక్కబ్రాహ్మణదాసికిం బుత్త్రుండ నై జన్మించి యందు బ్రహ్మవాదు లయినపెద్దలకు శుశ్రూష సేసినభాగ్యంబున నిమ్మహాకల్పంబునందు బ్రహ్మపుత్త్రుండ నై జన్మించితి. 476

ఆ. కౌశలమున మోక్షగతికి గృహస్థుఁ డే, ధర్మ మాచరించి తగిలి పోవు
నట్టిధర్మ మెల్ల నతివిశదంబు గాఁ, బలుకఁబడియె నీకు భవ్యచరిత. 477

మ. అఖిలాధారుఁ డజాదిదుర్లభుఁడు బ్రహ్మం బైనవిష్ణుండు నీ
మఖమం దర్చితుఁ డై నివాసగతుఁ డై మర్త్యాకృతిన్ సేవ్యుఁ డై
సఖి యై చారకుఁ డై మనోదయితుఁ డై సంబంధి యై మంత్రి యై
సుఖదుం డయ్యె భవన్మహామహిమ దాఁ జోద్యంబు ధాత్రీశ్వరా. 478

వ. అని యిట్లు నారదుండు సెప్పినవృత్తాంతం బంతయు విని ధర్మనందనుండు ప్రేమ విహ్వలుం డై వాసుదేవునిం బూజించె వాసుదేవధర్మనందనులచేతఁ బూ

జితుండై నారదమునియు దేవమార్గంబునం జనియె నని శుకయోగీంద్రుండు పాండవపౌత్రునకుం జెప్పె నని సూతుండు శౌనకాదులకుం జెప్పిన. 479

క. రాజీవసదృశలోచన, రాజీవభవాదిదేవరాజివినుత వి
భ్రాజితకీర్తిలతావృత, రాజీవభవాండభాండ రఘుకులతిలకా. 480

మాలిని. ధరణిదుహితృరంతా ధర్మమార్గానుగంతా
నిరుపమనయవంతా నిర్జరారాతిహంతా
గురుబుధసుఖకర్తా కుంభినీచక్రభర్తా
సురభయపరిహర్తా సూరిచేతోవిహర్తా. 481

గద్యము. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్యప్రణీతం బయిన శ్రీమహాభాగవతం బను మహాపురాణంబునందు ధర్మనందనునకు నారదుండు హిరణ్యాక్షహిరణ్యకశిపులపూర్వజన్మవృత్తాంతంబు చెప్పుటయు హిరణ్యకశిపుదితిసంవాదంబును సుయజ్ఞోపాఖ్యానంబును యమసల్లాపంబును బ్రహ్మవరలాభగర్వితుం డైనహిరణ్యకశిపుచరిత్రంబును బ్రహ్లాదవిద్యాభ్యాసకథయును బ్రహ్లాదహిరణ్యకశిపులసంవాదంబును బ్రహ్లాదువచనంబు ప్రతిష్ఠింప హరి నరసింహరూపంబున నావిర్భవించి హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదునకు నభయం బిచ్చి నిఖిలదేవతానివహప్రహ్లాదాదిస్తూయమానుం డై తిరోహితుం డగుటయుఁ ద్రిపురాసురవృత్తాంతంబును నీశ్వరుండు త్రిపురంబుల దహించుటయు వర్ణాశ్రమధర్మవివరణంబును బ్రహ్లాదాజగరసంవాదంబును స్వధర్మప్రవర్తకుం డగుగృహస్థుండు ముక్తుం డగుమార్గంబు నారదుండు ధర్మజునకుఁ దెలుపుటయు నారదునిపూర్వజన్మవృత్తాంతంబును ననుకథలం గలసప్తమస్కంధము. 482

ఓం తత్సద్బ్రహ్మార్పణ మస్తు.